ఈనాడు
అల్లూరి సీతారామరాజు
సోమవారం 17 నవంబరు 2025

## చాపరాయిని చుట్టేశారు

కార్తిక మాసం, వారాంతపు రోజుల్లో మన్యానికి పర్యాటకులు పోటెత్తుతున్నారు. డుంబ్రిగుడ మండల పరిధిలోని చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫాం పీసరీ ఆదివారం కిటకిటలాడాయి. ఉదయం మంచు అందాలను ఆస్వాదిస్తూ.. చాపరాయిని చుట్టేశారు. నీటిలో స్నానాలు చేస్తూ బండరాయిపై జర్రున జారుతూ సందడిగా గడిపారు. – న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

## భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. అభ్యుదయం పేరుతో పోలీసులు చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం కొత్తకోట, రావికమతం, వడ్డాది మీదుగా సాగింది. వడ్డాది నాలుగురోడ్ల కూడలిలో విద్యార్థులు, స్థానికులు, పోలీసులు స్వాగతం పలికారు. ర్యాలీలో డీఐజీ సైకిల్ తొక్కారు. గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు జెండా ఊపారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సీఐ కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు.

## మన్యంలో చలిపులి

మన్యం వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అరకులోయలో ఆదివారం 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. డుంబ్రిగుడ, జి.మాడుగులలో 8 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 8.1, హుకుంపేటలో 9.5, పెదబయలులో 10.7, చింతపల్లిలో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

# చేదెక్కిన కాఫీ

**ఆర్థిక ఇబ్బందుల్లో ఏపీఎఫ్‌డీసీ** | **కార్మికుల సమ్మెతో మరింత నష్టం**

చింతపల్లి, న్యూస్‌టుడే

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎఫ్‌డీసీ) అల్లూరి జిల్లాలో ఆరున్నర దశాబ్దాలుగా వాణిజ్యపరంగా కాఫీ సాగు చేస్తోంది. ఏటా ఆరు లక్షలకు పైగా పని దినాలు, ఆరు వేల మందికిపైగా ఉపాధి, రూ.20 కోట్ల వరకు ఆర్థిక లావాదేవీలతో నడిచే ఈ సంస్థ కొన్నేళ్లుగా ప్రతికూలతలను ఎదుర్కొంటోంది. లాభాలు రాకపోగా ఏటా రూ.5 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు నష్టాలను మూటగట్టుకుంటోంది. ఈ పరిస్థితుల్లో కాఫీ కార్మికుల సమ్మెతో మరింత నష్టం వాటిల్లనుంది.

➤ ఉమ్మడి విశాఖ రీజియన్ పరిధిలో ఏపీఎఫ్‌డీసీకి 4,010 హెక్టార్ల విస్తీర్ణంలో కాఫీ తోటలున్నాయి. సుమారు 2 లక్షల మేర మిరియాల మొక్కలు అంతరపంటగా సాగవుతున్నాయి. చింతపల్లి, ఆర్వీనగర్, పాడేరులో డివిజన్ కార్యాలయాలతో పాటు పల్పింగ్ కేంద్రాలు, డ్రయింగ్ యార్డులు, గోదాములు ఉన్నాయి. ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న నర్సీపట్నంలో ఈ సంస్థకు కాఫీ శుద్ధి కర్మాగారం ఉంది. రాజమహేంద్రవరం, నెల్లూరు ప్రాంతాల్లో జీడి మామిడి, వెదురు, యూకలిప్టస్ తోటలున్నాయి.

➤ ఏపీఎఫ్‌డీసీకి చెందిన కాఫీ తోటల్లో దిగుబడులు పడిపోతున్నాయి. 2022-23లో 200 మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా, 2023-24లో 140 మెట్రిక్ టన్నులే వచ్చింది. 2024-25లో 190 మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 170 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో గత ఏడాది మంచి ధర లభించింది. కేజీకి సగటున రూ.600 వరకు ధర వచ్చినా నష్టాలే మిగిలాయి.

➤ కాఫీ తోటల్లో పండ్ల సేకరణ ధర కేజీకి రూ.6.10 ఉండగా రూ.6.66కి పెంచారు. రోజువారీ రూ.320.99 నుంచి రూ.350.82 కి పెంచారు. తోటల పర్యవేక్షకు సిబ్బంది కొరత వేధిస్తోంది. సమ్మె ప్రభావంతో తోటల్లో పర్యవేక్షణ కొరవడి కాఫీ పండ్లు చోరీ పాలవుతున్నాయి. తోటల్లో విధులు నిర్వహించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బందిని నియమించాలని కాఫీ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారుల నుంచి లిఖితపూర్వక హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. నియామకాలు మా చేతుల్లో లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు చెబుతున్నారు.

## ఆంధ్రాకశ్మీర్‌లో కారవాన్ టూరిజం

ట్రయల్ రన్‌లో భాగంగా లంబసింగి చేరుకున్న కారవాన్

చింతపల్లి, న్యూస్‌టుడే: పర్యాటకాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాలో కారవాన్ టూరిజం, హోమ్‌స్టే వంటి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ నుంచి కారవాన్ వాహనం లంబసింగి చేరుకుంది. ఒక్కో కారవాన్ పేరిట వచ్చిన ఈ వాహనంలో మూడు కుటుంబాలు ఉండేలా సకల సదుపాయాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలమేరకు చింతపల్లి మండలంలోని లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో రెండు చోట్ల కారవాన్ టూరిజం ప్రాజెక్టుల అమలుకు సంబంధించి అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేశారు. దీనికిగాను రెవెన్యూ అధికారులు అవసరమైన స్థలాలను గుర్తించారు. ట్రయల్ రన్‌లో భాగంగా ఆదివారం వచ్చిన కారవాన్ వాహనాన్ని హరిత రిసార్టు మేనేజరు నాయుడు పరిశీలించారు. ఇక్కడ ఉన్న వనరులు, అవకాశాలు, ప్రదేశాలను నిర్వాహకులకు వివరించారు. ట్రయల్‌రన్ విజయవంతమైతే రానున్న రోజుల్లో కారవాన్ వాహనాలు లంబసింగి, తాజంగి వచ్చే అవకాశాలున్నాయని రిసార్టు మేనేజరునాయుడు తెలిపారు.

## మారని రాత
## తప్పని మోత

మన్యంలో డోలీమోతలు తప్పడంలేదు. అంజలిశనివారం పంచాయతీ తాటిబంద గ్రామానికి చెందిన గిరిజనుడు మర్రి కొండబాబు ఐదురోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లలేదు. ఈ విషయాన్ని 108 వాహన సిబ్బందికి తెలిపారు. సిబ్బంది రాజు, రహమాన్, గ్రామస్థులు రోగిని సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం డోలీ మోతతో తీసుకొచ్చి అక్కడి నుంచి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. – న్యూస్‌టుడే, చింతపల్లి గ్రామీణం

## అడిగేదెవరు.. అడ్డెవరు?

రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనుల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముంచంగిపుట్టు మండలం పోలీపుట్టు నుంచి సంగడ వరకు గతంలో రహదారి నిర్మించారు. ఈ పనుల్లో గుత్తేదారు అందినకాడికి వెనకేసుకున్నారు. మాకవరం సమీపంలో కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా. . ఒక వైపే నిర్మించారు. తారురోడ్డు వేయకుండా వదిలేశారు. కె.డాబుగుడ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి గుత్తేదారుపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు గ్రామీణం

## జాతీయ సదస్సులో అక్కమ్మ వాణి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జాతీయ స్పైసీ సెమినార్‌లో గిరి మహిళ ప్రసంగించి ఆకట్టుకున్నారు. ప్రపంచ స్పైసీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో రెండు రోజులపాటు ఈ సదస్సు జరిగింది. గూడెంకొత్తవీధి మండలం దేరాల గ్రామానికి చెందిన కంకిపాటి అక్కమ్మతోపాటు స్థానిక గిరిచైతన్య ఫార్మింగ్, మార్కెటింగ్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులు ఈ సదస్సుకు హాజరయ్యారు. 'వాయిస్ ఆఫ్ ఫార్మర్' అంశంపై అక్కమ్మ మాట్లాడారు. అల్లూరి జిల్లాలో పండే మిరియాలు, అల్లం, పసుపు వంటి పంటలను వివరించారు. ఇక్కడ సేంద్రియంగా పండించి ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేసే విధానాలను తెలిపారు. పర్యావరణ సమతుల్యత కాపాడుతూనే.. అధిక దిగుబడులు సాధించే సేంద్రియ విధానంపై మాట్లాడారు.

# స్ఫూర్తిశిఖరం బిర్సా ముండా

### పాడేరులో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఒడిశా సీఎం

ఈనాడు డిజిటల్, పాడేరు – న్యూస్‌టుడే, పాడేరు/పట్టణం, అరకులోయ: ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి పేర్కొన్నారు. పాడేరులో ఆదివారం వనవాసీ కళ్యాణాశ్రమం ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒడిశా సీఎంకు ఏపీ మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కలెక్టర్ దినేష్‌కుమార్ స్వాగతం పలికారు. చింతలవీధి కూడలిలో బిర్సాముండా విగ్రహాన్ని ఆవిష్కరించి, స్టాళ్లను సందర్శించారు.

ఒడిశా సీఎం మాఝిని సన్మానించిన భాజపా నాయకులు

▮ బిర్సా ముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పీవీటీజీల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ యోజనను ప్రారంభించిందని చెప్పారు. వచ్చే ఏడాది ప్రతి గ్రామంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

▮ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర, భాజపా జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు, బీజేవైఎం జిల్లా నాయకులు మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

▮ ఒడిశా సీఎం పర్యటన నేపథ్యంలో ఎస్పీ అమిత్ బర్దార్ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సీఎం పర్యటన ముగిసే వరకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పాడేరు పట్టణంలో దుకాణాలను మూసివేయించారు. రాకపోకలు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

▮ సీఎం సభా ప్రాంగణానికి గుట్కా, మత్తు పదార్థాలను పోలీసులు అనుమతించలేదు. మారుమూల గ్రామాల గిరిజనుల వద్ద ఉన్న చుట్టలు, ఖైనీలు, లైటర్లు, గుట్కాలు తదితర వస్తువులు పోలీసులు స్వాధీనం చేసుకుని బయట పడేశారు.

గిరిజన మహిళలతో థింసా నృత్యం చేస్తున్న సీఎం మాఝి, ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

స్వాగతం పలుకుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో శ్రీపూజ

# కిడ్నీ రోగులకు కష్టం

**యూనిట్‌ను విస్తరిస్తేనే సాంత్వన**

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

మారుతున్న జీవనశైలితో మధుమేహం, అధిక రక్తపోటుతో అనేకమంది బాధపడుతున్నారు, వీరిలో కొందరు కిడ్నీ సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. చాలామందికి డయాలసిస్ అవసరమవుతోంది. నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్‌లో 21 పడకలున్నాయి.

మూడు విడతల్లో రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు

★ అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఏడు పడకలు, కాకినాడ జిల్లా తుని ప్రాంతీయ ఆసుపత్రిలో 12 పడకలే ఉన్నాయి. దీంతో అక్కడి నుంచీ రోగులు నర్సీపట్నం వస్తున్నారు. పడకల సంఖ్య పెరగకపోవడంతో కొత్త వారికి అవకాశం ఉండటం లేదు. డయాలసిస్ జరిగేలా చూడాలని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. వారితో సిఫార్సులు చేయించుకుంటున్నారు. ఒక్కోసారి రాత్రి షిఫ్టుల్లోనూ సిబ్బంది పని చేస్తున్నారు.

★ నర్సీపట్నం ఆసుపత్రికి రెండు నెలల కిందట రావికమతం ప్రాంతం నుంచి కేసులు ఎక్కువగా వచ్చేవి. కొద్దిరోజుల కిందట గొలుగొండ మండలం నుంచి నాలుగు కేసులు వచ్చాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నుంచీ ఎక్కువగానే వస్తున్నారు. ఈ వ్యాధి విషయంలో సరైన అవగాహన లేకపోవడం ముప్పు పెరుగుతోంది. చాలామంది వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత డయాలసిస్ కేంద్రానికి వస్తున్నారు.

డయాలసిస్ వార్డులో రోగులు

★ 'ఒకసారి మూత్రపిండాల పనితీరు మందగిస్తే నయం చేయించుకోవడానికి వ్యయప్రయాసలు తప్పవు. తొలి దశలో గుర్తించి వైద్యం చేయించుకుంటే కిడ్నీలు పూర్తిగా దెబ్బతినకుండా కాపాడుకోవచ్చ'ని ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుధాశారద సూచిస్తున్నారు. పడకల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ భవనం విస్తరణకు అవకాశం లేకపోవడంతో ఉన్న వాటినే సమర్థంగా వినియోగిస్తున్నామన్నారు.

★ నెఫ్రోప్లస్ సౌజన్యంతో ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ నిర్వహిస్తున్నారు. ఈ యూనిట్‌లో పడకల సంఖ్య పెంచేందుకు అవసరమైన వసతిలేదు. రోగుల వెంట వచ్చేవారు బయట వరండాలో ఉండాల్సి వస్తోంది. మరుగుదొడ్డి సదుపాయం లేకపోవడంతో అత్యవసర విభాగం వరకు వెళ్లి రావాల్సి వస్తోంది. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా డయాలసిస్ యూనిట్ కోసం ప్రత్యేకంగా భవనం సమకూర్చి పడకల సంఖ్య పెంచాలని, ఇద్దరు వైద్యులను నియమించాల్సిన అవసరముంది. ప్రస్తుతం ఒక వైద్యుడు ప్రతి నెలా మొదటి, మూడో గురువారం విధుల్లో ఉంటున్నారు.

# ఉత్తరం రాయండి.. బహుమతి గెలుచుకోండి

**'ఢాయీ ఆఖర్' పేరిట.. తపాలా శాఖ పోటీలు**

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో ఉత్తరం కనుమరుగవుతోంది. విద్యార్థులు, పౌరుల్లో లేఖా రచన నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తపాలాశాఖ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఫిలాటెలీ (తపాలా బిళ్లల సేకరణ) ప్రమోషన్‌లో భాగంగా 'ఢాయీ ఆఖర్' పేరిట పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. 18 ఏళ్లలోపు, 18 ఏళ్లు పైబడిన విభాగాల్లో లేఖ రచన పోటీలు నిర్వహించి ఉత్తమ రచనలకు బహుమతులు అందించనుంది.

**అంశం**

ప్రచార కార్యకలాపాల్లో ఒకటిగా ఢాయి అఖర్ లెటర్ రైటింగ్ క్యాంపెయిన్ నిర్వహించాలని తపాలాశాఖ ప్రతిపాదించింది. దీని కోసం letter to my role model (నీ రోల్ మోడల్‌కు ఉత్తరం రాస్తే)/ అంశంపై ఆంగ్లం/హిందీ/తెలుగు భాషల్లో లేఖ రాయాలి.

**రెండు కేటగిరీల్లో..**

ఎన్వలప్ కేటగిరీలో ఎ4 పేపర్‌పై వెయ్యి పదాలు, ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డ్ కేటగిరీలో 500 పదాలు మించకుండా రాయాలి. ఏ వయసు వారైనా పోటీలో పాల్గొనొచ్చు. సొంతంగా రాయాలి.

▼ ఉత్తరంతోపాటు 2025 జనవరి నాటికి ఎంత వయసు అన్న డిక్లరేషన్ జత చేయాలి.

**దరఖాస్తు చివరి తేదీ**

లేఖలను డిసెంబరు 8వ తేదీలోగా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, కాకినాడ డివిజన్, కాకినాడ-533001 చిరునామాకు పంపాలి. ఐఎల్‌సీ/ఎన్వలప్‌పై 'ఎంట్రీ ఫర్ ఢాయీ ఆఖర్ 2025-26' రాసి స్పీడ్ పోస్టులో పంపాలి.

**సద్వినియోగం చేసుకోండి..:**

ఉత్తరం బాగా రాస్తే రూ.25 వేలు సొంతం చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అంది పుచ్చుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలి. ఉత్తరాలను రాసే అలవాటును ముందుకు తీసుకెళ్లడం అందరి బాధ్యత. వివరాలకు సమీప తపాలా కార్యాలయాన్ని సంప్రదించండి. – కృష్ణ. తపాలా సూపరింటెండెంట్. కాకినాడ తపాలా డివిజన్

బహుమతులిలా.. (రూ.వేలల్లో)

| బహుమతి | సర్కిల్ స్థాయిలో | జాతీయ స్థాయిలో |
|---|---|---|
| ప్రథమ | 25 | 50 |
| ద్వితీయ | 10 | 25 |
| తృతీయ | 5 | 10 |

## విద్యుదాఘాతంతో భర్త మృతి

**నాలుగు రోజుల కిందట అనారోగ్యంతో భార్య**

ఎటపాక, న్యూస్‌టుడే: నాలుగు రోజుల వ్యవధిలోనే దంపతులు మృతిచెందిన ఘటన ఎటపాక మండలం గుండాల కాలనీలో చోటుచేసుకుంది. భార్య అనారోగ్యంతో మరణించగా.. భర్త విద్యుదాఘాతంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఎస్సై శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గుండాలకాలనీ వాసి బాసిబోయిన వెంకటేశ్వర్లు (56) భార్య సుబ్బలక్ష్మి ఈ నెల 12న అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె దశదిన కర్మ కార్యక్రమం ఈ నెల 24 నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పనులు చేస్తున్న క్రమంలో ఇంటి ఆవరణలో వేలాడుతున్న ఫైబర్ నెట్ తీగలను పైకి కట్టాలని భావించారు. ఇంట్లో ఉన్న ఇనుప తీగను తెచ్చిన వెంకటేశ్వర్లు ఒక చివర చేతితో పట్టుకుని, మరో చివరను ఫైబరు నెట్ తీగపైకి విసిరాడు. ప్రమాదవశాత్తూ ఇనుప తీగ ఇంటి ఆవరణలో నుంచి వెళ్తున్న 33 కేవీ లైనుపై పడటంతో వెంకటేశ్వర్లు విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

# కేకు తిని బాలికలకు అస్వస్థత

**22 మంది ఆసుపత్రి పాలు**

బల్లపై పడుకున్న విద్యార్థిని

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఓ విద్యార్థిని పుట్టిన రోజు సందర్భంగా కేకు కోసి వేడుక చేసుకున్నారు. కేకు తిన్న వారిలో 22 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థినులు జె.అక్షయ, కె.పద్మ, కె.లలిత, అశ్విని, జె.హాసిని, కె.దివ్య, జె.హారిక, మహిప్రియ, కె.రాజేశ్వరి, టి.కీర్తిప్రసన్నను రాత్రికి రాత్రే డిప్యూటీ మేట్రిన్ జ్యోతి రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వీరిలో జె.హాసిని, టి.కీర్తిప్రసన్నను మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఆదివారం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

◗ ఆదివారం సాయంత్రం వి.లలిత, ఎం.బంగారమ్మ, డి.మహిమాధురి, వి.అమ్ములు, పూజ, కె.శైలు, ఎ.నాగేశ్వరి, వి.సునీత, జె.నాగమణి, టి.మరియ, కె.కృష్ణప్రియ, ఎం.మానస విరేచనాలు, జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. వైద్యాధికారిణి స్నేహలత చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రిలో పది పడకలే ఉండటంతో ఒక్కో దానిపై ఇద్దరు, ముగ్గురిని ఉంచారు. వసతిగృహంలో ఆహార పదార్థాలను ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ పరిశీలించారు. సర్పంచి సింహాచలం, తెదేపా నాయకులు చంద్రరావు, సత్యనారాయణ బాలికలను పరామర్శించారు.

ఒకే మంచంపై చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థినులు

# వంద పడకలతో సేవలు మెరుగు

**జీవో జారీలో జాప్యం**

కిక్కిరిసిన రోగులు

చింతూరు, న్యూస్‌టుడే

మన్యం వాసుల బాగోగులు ఎరిగిన కూటమి ప్రభుత్వం చింతూరు కేంద్రంగా మంజూరు చేసిన వంద పడకల ఆసుపత్రికి సంబంధించి జీవో జారీ చేస్తే ఈ ప్రాంత రోగులకు మేలు జరుగుతుంది. రెండు నెలల కిందట రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చింతూరు సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 54 మంది సిబ్బందిని కేటాయించనున్నట్లు ప్రకటించారు.

● రాష్ట్ర విభజనకు ముందు సివిల్ ఆసుపత్రిగా ఉండగా విభజనానంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినా ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం ఆసుపత్రిలో 12 మంది వైద్యులకు ఆరుగురే ఉన్నారు. గైనకాలజిస్టు పోస్టులో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్నారు. స్టాఫ్ నర్సులదీ ఇదే పరిస్థితి. అత్యవసర వైద్యానికి అటు భద్రాచలమో, ఇటు రంపచోడవరమో వెళ్లాల్సి వస్తోంది. రోజూ వంద నుంచి 150 వరకు ఓపీ అవుతోంది. ఈ ఆసుపత్రికి విలీన నాలుగు మండలాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచీ రోగులు వస్తుంటారు.

నాలుగు నెలల్లో ఇలా..

| నెల | ఓపీ | ఐపీ | ప్రసవాలు |
|---|---|---|---|
| జులై | 5292 | 1045 | 48 |
| ఆగస్టు | 5571 | 1128 | 78 |
| సెప్టెంబరు | 5772 | 1105 | 95 |
| అక్టోబరు | 4577 | 915 | 102 |

ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

(c) eenadu

# బొమ్మల పరిశ్రమపై కదలిక

## వేలాది మంది మహిళలకు ఉపాధి!

నక్కపల్లి, న్యూస్‌టుడే

పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

❖ పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

పరిశ్రమ ఏర్పాటుకు గుర్తించిన భూమి

❖ 'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం వద్ద శాఖల మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదితర ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతో పాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

❖ బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

## బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మిరియాల వీధి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సత్యవతిని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. బాధితురాలిని ఆదివారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. భర్త చనిపోయి ఉన్న ఆమెకు, ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోవడం చాలా విచారకరమన్నారు. త్వరలోనే గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇంటి మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఏపీ ఐడీసీ డైరెక్టర్ పెట్టిరాజు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ లక్ష్మణరావు, నియోజకవర్గ తెదేపా మహిళా అధ్యక్షురాలు సాధిక, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మాతృత్వ వరం... దత్తతతో మార్గం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

## 30 వరకు అవగాహన మాసోత్సవాలు

పిల్లల్లేని ఎంతో మందికి చిన్నారులను చట్టబద్ధంగా దత్తత ఇచ్చి మాతృత్వ వరాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. చాలామందికి దత్తత ప్రక్రియపై అవగాహన ఉండటం లేదు. మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించి కేసుల్లో ఇరుక్కోవడంతోపాటు జైలు పాలవుతున్నారు.

★ చిన్నారుల దత్తతపై అవగాహన కల్పించేలా ఈ నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలను జిల్లా బాలల సంరక్షణ, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మునగపాకకు చెందిన దంపతులకు పిల్లలు లేరు. దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసి హైదరాబాద్‌లోని శిశు గృహ నుంచి చిన్నారిని తీసుకొచ్చి పెంచుకుంటున్నారు. నర్సీపట్నానికి చెందిన దంపతులకు పిల్లలు లేకపోవడంతో నిజామాబాద్ నుంచి చిన్నారిని చట్టబద్ధంగా దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. రాంబిల్లిలో రక్తసంబంధీకులు బంధువుల కుమారుడిని ఓ జంట పెంచుకుంటున్నారు. వీరికి చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం తెలియలేదు. కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేశారు.

బాలల దత్తత కేంద్రంలో అధికారులు

★ రక్త సంబంధీకులు, సవతి తల్లిదండ్రులు, పోస్టర్ కేర్ పిల్లల దత్తత.. ఇలా మూడు రకాలుంటాయి. పోస్టర్ కేర్ దత్తతలో తల్లిదండ్రుల ఆదరణ లేక అనాథాశ్రమాల్లో ఉన్న ఆరేళ్ల వయసున్న వారిని రెండేళ్లపాటు తాత్కాలిక దత్తత ఇచ్చి అనంతరం పిల్లలు, తల్లిదండ్రుల అంగీకారం మేరకు శాశ్వత దత్తత ఇస్తారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకోవచ్చు.

★ నెలల వయసు నుంచి 18 ఏళ్ల లోపు వరకు దత్తత తీసుకోవచ్చు. దత్తత కోరుకునే తల్లిదండ్రులు మిషన్ వాత్సల్య వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన అనంతరం బాలల సంరక్షణ విభాగం అధికారులు సీనియారిటీ జాబితాకు బదిలీ చేస్తే నిబంధనల ప్రకారం కేటాయిస్తారు. 48 గంటల్లోగా బిడ్డను రిజర్వు చేసుకోవాలి. 30 రోజుల్లోగా రిజర్వు చేసుకున్న సంస్థ వద్ద చైల్డ్ మ్యాపింగ్‌కు హాజరుకావాలి. నిబంధనల ప్రకారం బిడ్డను దత్తత ఇస్తారు. అనంతరం న్యాయమూర్తి వద్ద హాజరై దత్తత ఉత్తర్వులు పొందాలి.

### అనకాపల్లిలో ప్రత్యేక కేంద్రం

★ జిల్లాగా ఏర్పడ్డాక అనకాపల్లిలో ప్రత్యేక దత్తత కేంద్రం ఏర్పాటైంది. ప్రస్తుతం ఇక్కడ ఒక చిన్నారి ఉన్నారు. చిన్నారులను అపహరించి అమ్మేసిన ఉదంతంపై విశాఖపట్నంలోని ఒక మహిళను పోలీసులు గుర్తించడంతో ఆమె ముగ్గురితో కలిసి 11 మంది పిల్లలను విక్రయించినట్లు గుర్తించారు. అనకాపల్లికి చెందిన నలుగురు చిన్నారులను దత్తత కేంద్రంలో ఉంచారు. వీరిలో ముగ్గురిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా మరో చిన్నారి ఇక్కడ ఉన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నాం. చట్ట వ్యతిరేకంగా చిన్నారులను దత్తత తీసుకుంటే ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారు. దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు 89789 17154, 85008 96656 నంబర్లలో సంప్రదించవచ్చు.

– ఎం.రమేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

## నేడు శూలాల మహోత్సవం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: దిబ్బపాలెం పంచాయతీ పరిధిలోని చౌడేశ్వరి సాంబ శివ ఆలయం శూలాల మహోత్సవానికి ముస్తాబైంది. ఏటా కార్తిక మాసం నాలుగో సోమవారం ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ముఖ్యలతో చేసిన శూలాలు ధరించడం మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం కొనసాగనుంది.

## క్వారీ పేరుతో విచ్చలవిడిగా బాంబ్ బ్లాస్టింగ్‌లు

రంపచోడవరం, న్యూస్‌టుడే: నరసాపురం గ్రామంలో మెటల్ క్వారీ పేరుతో విచ్చలవిడిగా బాంబ్ బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, దీనివల్ల గ్రామంలో ఇళ్లన్నీ బీటలు వారుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు. నరసాపురంలో ఆదివారం రిగిన బిర్సా ముండా జయంతి కార్యక్రమానికి వచ్చిన శ్రీనుకు క్వారీ వల్ల జరుగుతున్న ఇబ్బందులను గ్రామస్థులు వివరించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బాంబ్ బ్లాస్టింగ్‌లను చేస్తున్నారని దీనివల్ల ఇళ్లన్నీ బీటలువారి ధ్వంసమవడంతో పాటు పరిసరాల్లో గిరిజనుల పంట భూములు పాడవుతున్నాయన్నారు. దీనిపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నేతలు గంగరాజుదొర, అరుణకుమారి, జోగమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో బీటలు వారిన ఇల్లు

## యువోత్సాహం

సెలవు కావడంతో ఆదివారం పుస్తకాలు పక్కన పెట్టి యువత ఉత్సాహంతో సందడి చేశారు. ఆటపాటలతో కేరింతలు కొట్టారు. మయూరాల్లా నర్తించారు. కోయిలల్లా గీతాలాపన చేశారు. వీటన్నింటికీ శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల వేదికైంది. ఒక్కటి తగ్గింది రోజంతా సాంస్కృతిక ప్రదర్శనలతో ఉల్లాసంగా గడిపేందుకు 'సైన్స్' పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రిన్సిపల్ బాను మూర్తి పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

## పడమటమ్మకు పండగ సారె

కశింకోటలో పడమటమ్మ అమ్మవారి సారె ఊరేగింపు ఆదివారం కనులపండువలా సాగింది. ఉప్పునీటి వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహానికి 13 రోజులపాటు పూజలు కొనసాగాయి. అతివలంతా ఆదివారం వివిధ రకాల పిండివంటలు, పండ్లు, చీరెలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. – న్యూస్‌టుడే, కశింకోట

## బొజ్జన్న కొండకొస్తే నకనక!

### సదుపాయాల్లేక రోడ్డుపైనే భోజనాలు

జిల్లాలో పర్యాటక కేంద్రమైన బొజ్జన్న కొండ సందర్శనకు వచ్చే వారంతా సదుపాయాల్లేక ఇబ్బంది పడుతున్నారు. వన భోజనాలు చేసేందుకు తగు వసతి అక్కడ లేదు. భోజనాలు ఎక్కడ చేయాలో తెలియక దిక్కులు చూడాల్సి వస్తోంది. గతంలో కొండ ప్రాంతంలో భోజనాలు చేసేందుకు అనుమతించేవారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనల పేరుతో అనుమతించడంలేదు. ఇప్పటికీ అవే నిబంధనలు కొనసాగుతున్నాయి. ఇక్కడ విహారంతోపాటు విజ్ఞానమూ లభిస్తుందనే అభిప్రాయంతో పలు పాఠశాలలు విద్యార్థులను తీసుకువస్తుంటాయి. వనసమారాధనకు వచ్చే వారంతా రోడ్డుపైనే భోజనాలు చేయాల్సి వస్తోంది. పర్యాటక శాఖ భోజనశాల నిర్మించినా ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. కార్తిక మాసంలో ఇక్కడకు వచ్చే సందర్శకులతో కొండ పరిసరాలన్నీ కిటకిటలాడుతుంటాయి. స్థానికంగా సందర్శకులకు వసతులు కల్పించడంపై దృష్టిసారించాల్సిన అవసరముంది. – న్యూస్‌టుడే, అనకాపల్లి

# అధ్వానంగా మద్దిరాతిగూడెం-కుటకరాయి రోడ్డు

రంపచోడవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: దేవీపట్నం మండలం మద్దిరాతిగూడెం - కుటకరాయి రోడ్డు గోతులుపడి ఛిద్రంగా మారింది. పక్కారోడ్డు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు వేడుకొంటున్నా స్పందించడంలేదని గిరిజనులు కోసు అచ్చిబాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా కొట్టుకుపోయిందని, దీంతో అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే కష్టంగా మారిందన్నారు. ఈ రహదారిలో కిలోమీటరు వరకు ఘాట్‌రోడ్డు ఉందని దీంతో అంబులెన్సులు రాలేని పరిస్థితులు దాపురించాయని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికలలో ఓట్ల కోసం ప్రజాప్రతినిధులు వస్తున్నారే తప్ప గెలుపొందిన తర్వాత ముఖం చాటేస్తున్నారని అంటున్నారు. రంపచోడవరం ఐటీడీఏకు 14 కిలో మీటర్ల దూరంలోని మద్దిరాతిగూడెం, కుటకరాయి గ్రామాల పరిస్థితే ఈ విధంగా ఉంటే ఇక లోతట్టు గ్రామాలలో రోడ్ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఛిద్రమైన రహదారి

# వ్యాను బోల్తా: 11 మందికి గాయాలు

బోల్తాపడిన వ్యాను

శృంగవరపుకోట, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. విశాఖ నగరంలోని ఆరిలోవ కాలనీకి చెందిన పలు కుటుంబాల సభ్యులు, స్నేహితులు 16 మంది విజయనగరం జిల్లా గంట్యాడ మండలం ఎగువ కొండపర్తిలో ఉన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఓ వ్యానులో వెళ్లారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం 4 గంటల సమయంలో తిరిగి బయలుదేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం సమీపంలో జలపాతం చేరువకు చేరే సమయంలో వాహనం బ్రేక్ ఫెయిల్ అయ్యి, అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివప్రసన్న, స్నేహ, ఎల్లమ్మ, రాములమ్మ, శిరీషలకు ఓ మోస్తరు, మిగిలిన వారికి స్వల్పంగా మొత్తం 11 మందికి గాయాలవగా, ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో తలకు గాయమైన శివప్రసన్న, శిరీషలకు స్కానింగు తీసుకోవాలని వైద్యురాలు దివ్య తెలిపారు. వీరంతా వేరే వాహనంలో విశాఖ వెళ్లిపోయారు.

## పాపికొండలకు పోటెత్తారు

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండలు విహారయాత్రకు పర్యాటకుల రద్దీ కొనసాగుతోంది. గండిపోశమ్మ ఆలయం నుంచి ఆదివారం అయిదు బోట్లలో 280 మంది పర్యాటకులు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. పోశమ్మగండి చేరుకున్న పర్యాటకులు తొలుత అమ్మవారి దర్శనం అనంతరం విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం కావడంతో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించారు. డి.రావిలంక- దండంగి గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై వరద నీరు తగ్గుతోంది.

పర్యాటకుల వివరాలు నమోదుచేస్తున్న కంట్రోల్ రూం అధికారులు

## అసైన్డు భూముల్లో లేఅవుట్

రాంబిల్లి, న్యూస్‌టుడే: అసైన్డు భూముల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మూలజంపలో సర్వే నంబరు 130, 141లో ప్రభుత్వ భూమిని పదేళ్ల కిందట రైతులకు పంపిణీ చేశారు. దళారులు రంగప్రవేశం చేసి ఈ భూముల్లో రెండు ఎకరాల వరకు ప్లాట్లు వేసి దందా సాగిస్తున్నారు. సెంటు స్థలం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు పలుకుతోంది. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి అమ్మకాలు జరిగినట్లు తేలితే భూములను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

మూలజంపలో చదును చేసిన భూమి

# కార్మికుల వేతనాలు పెంచాలి

ర్యాలీలో సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పూనం సత్యనారాయణ సభావేదిక వద్ద ఆదివారం సీఐటీయూ జిల్లా రెండో మహాసభలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అంబేడ్కర్ కూడలి నుంచి దేవీగుడి కూడలి నుంచి సభావేదిక వరకు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లేబర్ కోర్టులు రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మహిళలు రాత్రి వేళల్లో పనిచేసేందుకు సైతం కార్మిక చట్టాలను రుపొందిస్తున్నారని దీనివల్ల ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. స్కీమ్ వర్కర్ల పేరుతో అతి తక్కువ వేతనాలను చెల్లిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ప్రజానాట్య మండలి సాంస్కృతిక కార్యక్రమాలు, కొమ్ము నృత్యాలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి సంతోష్, అంగన్‌వాడీ కార్యకర్తల జిల్లా కార్యదర్శి నిర్మల, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సిరమల్లిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లోనే ఆధార్ నవీకరణ

## నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ నవీకరణకు (అప్‌డేట్) ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 17 నుంచి పది రోజులపాటు కేంద్రాలు కొనసాగేలా ఆదేశాలిచ్చింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 1,967 ఉండగా, వీటి పరిధిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులున్నారు. ఒకసారి ఆధార్ వివరాలు నమోదు చేసుకున్నాక పదేళ్లకోసారి నవీకరించుకోవాలి. విద్యార్థులు 5 నుంచి 7 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల మధ్య అప్‌డేట్ చేయించుకోవాలి. తద్వారా బయోమెట్రిక్ పక్కాగా నమోదవుతుంది. విద్యార్థుల చిరునామా, జనన వివరాల్లో తేడాలుంటే సరిచేసుకునే అవకాశం ఉంటుంది. నవీకరణ చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాల లబ్ధి, ఇతర గుర్తింపుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

« గత నెలలో 8 రోజులపాటు నవీకరణ చేపట్టారు. సుమారు 2500 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. జిల్లాలో 44 వేల మందికి పైగా ఆధార్ నవీకరణ చేయించుకోవాల్సి ఉందని గుర్తించారు. వారందరికీ మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయ శాఖ ద్వారా సూచనలు చేసింది. ఈ నెల 17 నుంచి 26 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం 43,879 మందితో జాబితా పంపింది. జిల్లా వ్యాప్తంగా సచివాలయాన్నింటిలో కలిపి ప్రస్తుతం 55 ఆధార్ నమోదు కిట్లు ఉన్నాయి.

నక్కపల్లిలో విద్యార్థులకు ఆధార్ నవీకరణ చేస్తున్న ఉద్యోగులు

« ప్రస్తుతం అపార్ కార్యక్రమం జరుగుతోంది. ఇందుకు ఆధార్‌లో వివరాలు పక్కాగా ఉండాలి. ప్రస్తుతం సచివాలయాలతోపాటు కొన్ని ఎంపిక చేసిన మీ సేవా కేంద్రాల్లోనూ ఆధార్ సేవలు లభిస్తున్నాయి. విద్యార్థులు బడి వేళల్లో ఆధార్ నవీకరణకు ఆయా కేంద్రాలకు వెళ్లడం చదువుకు ఆటంకంగా మారుతోంది. ఈ సమస్య తలెత్తకుండా ప్రభుత్వమే పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

### వీలైనంత ఎక్కువ మందికి..



ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలల్లో సదుపాయాలున్న వాటిని ఎంచుకుని శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. పది రోజుల కార్యక్రమంలో వీలైనంత ఎక్కువ మంది నవీకరణ చేసుకునేలా చూస్తాం – మంజులావాణి, గ్రామ/వార్డు సచివాలయ జిల్లా అధికారిణి

## తీరం.. జనసంద్రం..!

సెలవు రోజైన ఆదివారం నాడు ఆర్కేబీచ్‌కు సందర్శకులు పోటెత్తారు. పలువురు ఇసుక తిన్నెలపై ఆటలు ఆడారు.. యువత, మహిళలు తీరంలోని రాళ్లపై సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. రాత్రి 7గంటలైనా రద్దీ తగ్గలేదు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పర్యాటకులు సముద్రం లోపలికి వెళ్లకుండా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో బీచ్‌గార్డ్స్‌ను మోహరించి ఎవరూ తీరంలో మునిగిపోకుండా చర్యలు తీసుకున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

## ఫ్రాన్స్, భారత్ ద్వైపాక్షిక ఎయిర్ విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: ఎనిమిదో ఎడిషన్‌గా ఫ్రాన్స్‌లోని మాంట్-డి-మార్సన్‌లో ఆదివారం భారత్-ఫ్రెంచ్ దేశాల నడుమ వాయుసేనకు చెందిన ద్వైపాక్షిక (గరుడ-2025) విన్యాసాలు ప్రారంభమయ్యాయి. భారత వాయుసేన టీమ్‌లు ఈనెల 10న అక్కడకు చేరుకున్నాయి. సుఖోయ్-30ఎంకేఎల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఐఎల్-78 ఎయిర్ టు ఎయిర్ రీఫ్యూయల్ ట్యాంకర్లతో ఫ్రెంచ్ ఎయిర్, స్పేస్ ఫోర్స్ (ఎఫ్ఏఎస్ఎఫ్)కు చెందిన విమానాలతో ఈనెల 17 వరకు ఎయిర్ విన్యాసాలు కొనసాగుతాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

వాయుసేన విన్యాసాల్లో భారత్, ఫ్రెంచ్ ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది

## మైదా పెట్టు.. చేపలు పట్టు

కాలం మారుతోంది.. సాంకేతికత విస్తరిస్తోంది. చేపల వేటలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు నదులు, చెరువులు, కాలువల్లో చేపల వేట చేయాలంటే గాలం, నైలాన్ తాడుకు చివర ముల్లు, దానికో ఎర తగిలించేవారు. ప్రస్తుతం వేట సాగించాలంటే వాడేసిన కూల్ డ్రింకు బాటిల్ ఉంటే సరిపోతుంది. దాన్ని సగానికి కోసి తాడు కడుతున్నారు. అందులో మైదా వేసి నీటిలో మునిగేటట్లు చేస్తున్నారు. మైదా తినేందుకు బాటిల్‌లోకి వచ్చిన చేపలు వెనక్కి వెళ్లేందుకు వీలుండటం లేదు. పాయకరావుపేట మండలం రాజవరం, పెంటకోట తదితర గ్రామాల్లో యువత ఈ తరహా వేటకు ప్రాధాన్యమిస్తున్నారు. యానాం పరిసర ప్రాంతాల్లో ఈ విధానంలో చేపల పట్టడాన్ని చూసిన వీరంతా కొత్తదనాన్ని అందిపుచ్చుకుని సంచి నిండుగా చేపలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

## చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 110 | 107 |
| లైవ్ | 137 | 127 |
| డ్రెస్డ్ | 199 | 224 |
| స్కిన్‌లెస్ | 226 | 234 |

JOBS

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. Contact Phone Numbers: 85209 80099,85208 74499.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హుకుంపేట, న్యూస్‌టుడే: కొట్నాపల్లి గ్రామ శివారులోని గెడ్డలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సీఐ సన్యాసినాయుడు ఆదివారం తెలిపారు. స్థానికులు గుర్తించి వీఆర్వో డి.ఈశ్వరమ్మకు సమాచారం అందించారు. వీఆర్వో సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు దాదాపు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, ఎరుపు, తలుపు రంగు షర్ట్ వేసుకుని ఉన్నట్లు తెలిపారు.

## పంచారామాలకు ఆరు బస్సులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నుంచి ఆదివారం సాయంత్రం పంచారామాలకు ఆరు ప్రత్యేక బస్సులు బయలుదేరాయని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. కార్తిక మాసంలో శైవక్షేత్రాలను సందర్శించుకునే భక్తుల కోసం ఆయా బస్సులు ఏర్పాటు చేయగా, మంచి స్పందన వచ్చిందని ఆర్ఎం తెలిపారు. శబరిమలకు ఇప్పటి వరకు ఐదు బస్సులు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయని, మరిన్ని బస్సులు కావాల్సిన భక్తులు ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని సూచించారు. పంచారామాల బస్సులకు ఆర్ఎం జెండా ఊపారు.

(c) eenadu

## మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గెమ్మెలి పంచాయతీ జి.కొత్తూరు రోడ్డు మరమ్మతులకు గురైంది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మరమ్మతులు చేయాలి. – సత్యనారాయణ, కులపాడు.

✓: మరమ్మతులకు ప్రతిపాదనలు పెట్టాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. – మాణిక్యం, పంచాయతీరాజ్ ఏఈ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి రహదారికి ఇరువైపులా కాలువలో మురుగు, ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త పేరుకుపోయాయి. దుర్గంధం, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. – రమణ, చింతపల్లి.

✓: పంచాయతీ కార్మికులు, సిబ్బందితో మాట్లాడి మురుగు, చెత్త తీయిస్తాం. – పుష్పలత, సర్పంచి, చింతపల్లి

# వైద్యారోగ్యశాఖ మంత్రికి వినతుల వెల్లువ

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలో పనిచేస్తున్న వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. విడతలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

★ తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని గిరిజన ప్రాంత వైద్యారోగ్య శాఖ తాత్కాలిక ఉద్యోగుల సంఘం నాయకుల లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతులు అందజేస్తున్న వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు

# రబీ సాగు.. మన్యంలో జాగు!

**నీటి వనరులున్నా ముందుకు రాని గిరిరైతులు**

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యంలో గిరి రైతులు రబీలో పంటల సాగుకు దూరంగా ఉంటున్నారు. కేవలం వర్షాధారంగా ఖరీఫ్‌లో మాత్రమే వరి, రాగులు వంటి పంటలు పండిస్తున్నారు. కొన్ని చోట్ల నీటి వనరులున్నప్పటికీ.. ఏడాది పొడవునా పంటలు పండించే అవకాశాలున్నా రైతులు వీటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా పంట పొలాలన్నీ ఖాళీగా ఉంటున్నాయి.

★ జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 2,62,667 ఎకరాల విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు. ఇందులో 1,49,517 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. మిగిలిన 1,19,150 ఎకరాల్లో ఇతర పంటలు పండిస్తున్నారు. రబీ సీజను సాధారణ విస్తీర్ణం కనీసం 3 వేల హెక్టార్లకు మించడం లేదు. ఈ పరిస్థితి గత కొన్నేళ్ల నుంచి కొనసాగుతోంది. రబీలో పంటల సాగు చేపట్టేలా రైతులను సన్నద్ధం చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

★ మారుతున్న కాలానికి అనుగుణంగా గిరిరైతులు వ్యవసాయంలో ఆధునిక విధానాలను అవలంబించాలని, భూములను ఖాళీగా ఉంచకుండా ఏడాది పొడవునా పంటలు పండించాలని ఒక వైపు శాస్త్రవేత్తలు చెబుతున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. ఫలితంగా మన్యంలో భూములన్నీ వృథాగా ఉండిపోతున్నాయి.

సాగుకు దూరంగా పంట పొలాలు

### వర్షాధారంగానే..

గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయం మైదాన ప్రాంతాలకు భిన్నంగా ఉంటుంది. ఇక్కడ 90 శాతం వర్షాధారంగానే సాగు జరుగుతుంది. నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో సైతం గిరిజన రైతులు ఏడాదికి రెండు పంటలను పండించేందుకు ముందుకు రావడం లేదు. పొలం పనుల్లో ఆధునిక యంత్ర పరికరాలకు దూరంగా ఉంటూ నేటికీ వ్యవసాయంలో పశువులపైనే ఆధారపడుతున్నారు. ఇక్కడ పొలాలన్నీ చిన్నచిన్న కమతాలుగా ఉండటం, కొండలు, గుట్టలు అధికంగా ఉండటంతో ట్రాక్టర్లతో వ్యవసాయం చేసే రైతులు అతికొద్ది మందే ఉంటున్నారు. పొలాలు దున్నేందుకు ఎక్కువ మంది రైతులు పశువులపైనే ఆధారపడుతున్నారు. రబీలో రైతులంతా వ్యవసాయం చేయకపోవడంతో పశువులను స్వేచ్ఛగా పొలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో నీటి సదుపాయం ఉన్నా మిగిలిన రైతులూ రబీలో పండించేందుకు ముందుకురావడం లేదు.

### అవగాహన కల్పిస్తున్నాం

గిరి రైతులు మొదట్నుంచి రబీలో పంటల సాగుపై ఆసక్తి కనబరచడం లేదు. నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రబీలో పంటల సాగు చేపట్టాలని రైతులను ప్రోత్సహిస్తున్నాం. అవసరమైన విత్తనాలు అందిస్తున్నాం. మాలీ రైతులు ఏడాది పొడవునా పంట పొలాలను ఖాళీగా ఉంచకుండా అన్ని రకాల పంటలు, కాయగూరలను పండిస్తున్నారు. నీటి వనరులున్న చోట సేంద్రియ విధానంలో ఏడాది పొడవునా వివిధరకాల పంటలు పండించేలా అన్నదాతలను చైతన్యపరుస్తున్నాం. – మధుసూదనరావు వ్యవసాయ అధికారి, చింతపల్లి

## దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, న్యూస్‌టుడే: మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధ తెలిపారు. ఇంటర్ పాసైన గిరిజన విద్యార్థినులు ఈనెల 17 నుంచి 20లోగా నేరుగా తమ కళాశాలను సంప్రదించాలన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథ్స్ గ్రూప్‌లు ఉన్నాయన్నారు. విద్యార్థినులకు కళాశాల ఆవరణలోనే వసతి గృహ సదుపాయం ఉందని పేర్కొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి సోమవారం నుంచి స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. బీకాం జనరల్, బీకాం సీఏ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఖాళీలున్నట్లు తెలిపారు.

## సొంత నిధులతో బోర్లు ఏర్పాటు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారి రాంబాబు సొంత నిధులతో ఆసుపత్రికి బోర్లు ఏర్పాటు చేశారు. దీని కోసం రూ.26 వేలు వెచ్చించి దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

## అ వీ ఇ వీ

### ఇల్లు మంజూరు చేయరూ..

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ప్రభుత్వం తనకు నూతన గృహం మంజూరు చేయాలని గెమ్మెలి పంచాయతీ ఎగువ కూటేలి గ్రామానికి చెందిన పాంగి బొంజులు కోరారు. గ్రామంలో 32 కుటుంబాలు ఉండగా.. అందరికీ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందన్నారు. తమకు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### సరిహద్దు సమస్యలు ప్రస్తావించకపోవడం దారుణం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీల సమస్యలను విస్మరించి.. ఉత్సవాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలం గడపడం దారుణమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ఓ ప్రకటనలో విమర్శించారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా పాడేరులో జరిగిన కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి ప్రసంగంలో కనీసం ఆదివాసీలు, ఇరు రాష్ట్రాల సరిహద్దు సమస్యలను ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కొటియా పంచాయతీ వంటి ప్రాంతాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక్కమాటా మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స, అరకులోయ మండల కార్యదర్శి రామారావు పేర్కొన్నారు.

### మురుగు తొలగించాలి

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెంలోని కస్తూర్బా విద్యాలయం ప్రహరీ దగ్గర్లో మురుగు ఎక్కువగా ఉందని, దానిని తొలగించాలని తెదేపా మండల మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జి.సత్యనారాయణ, తెదేపా ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి కె.రామ్మూర్తి కోరారు. కొయ్యూరు సర్పంచి బాలరాజు, తెదేపా నేతలు పుల్లయ్య, సన్యాసిరావులతో కలిసి ఆదివారం మురుగు నీటిని పరిశీలించారు. మురుగుతో దోమల ముప్పు ఉందని పేర్కొన్నారు.

### వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పార్టీ బలోపేతానికి కృషి చేస్తేనే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. అరమ పంచాయతీ నడిమిలవలస గ్రామంలో ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. రచ్చబండ కార్యక్రమం నిర్వహించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో గిరిజన ప్రాంత అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాణక్య, అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, మండల అధ్యక్షుడు పరశురాం, నాయకులు పాల్గొన్నారు.

నడిమివలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

### అనారోగ్యంతో శిశువు మృతి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జి.అద్దరవీధిలో అనారోగ్యంతో శిశువు మృతి చెందాడు. గ్రామానికి చెందిన అనిల్, దేవి దంపతుల ఆరు నెలల బాలుడి నోటిలో పొక్కులు వచ్చి ఇబ్బంది పడుతుండగా.. ఆదివారం ఉదయం ఆసుపత్రికి తరలించేలోపు చనిపోయాడు.

### ఐటీడీఏ ఎదుట ఆందోళన నేడు

రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజనుల సమస్యలపై అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపడుతున్నట్టు ఏఐకేఎంఎస్ బచ్చెల బొజ్జిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ పార్క్‌ను, రహదారులు, ఏకో సెన్సిటివ్‌జోన్ తదితర సమస్యలపై ఆందోళన చేయనున్నామన్నారు. ఈ ఆందోళనకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, మాధవరావు హాజరవుతున్నట్టు తెలిపారు. ఏజెన్సీలోని సర్పంచులతోపాటు ఆదివాసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ..

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: బడదనాంపల్లి పంచాయతీ చినరేలంగిపాడులో సోమవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీరామాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## పాడైన రహదారులపై నివేదిక

అనంతగిరి, న్యూస్‌టుడే: వేంగడ పంచాయతీ పరిధిలో మొంథా తుపాను కారణంగా పాడైన రహదారుల వివరాలు సేకరించి నివేదిక తయారుచేస్తున్నట్లు పంచాయతీరాజ్ జేఈ సాంబశివరావు తెలిపారు. బందవలస కల్వర్టు కొట్టుకుపోయింది, నిమ్మలపాడు నుంచి వేంగడ వెళ్లే ప్రధాన రహదారి సైతం పూర్తిగా పాడైందని సిబ్బంది గుర్తించారు. మారుమూల గ్రామాలకు వెళ్లే అనేక రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గిరిజన సంఘం మండల ధ్యక్షుడు కొండలరావు తెలిపారు. ఈ మేరకు అధికారులు వచ్చి పాడైన రహదారుల వివరాలను పరిశీలించారన్నారు.

తుపానుకు కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానికులు

## జల సవ్వడితో సెలయేరులా..

మన్యంలో ప్రకృతి అందాలకు కొదవే ఉండదు. జడ్డంగి మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో మడేరు వాగు ప్రవహిస్తోంది. ఎత్తైన రాళ్ల నుంచి జారుతూ పర్యావరణ ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఉరక జలపాతంగా పేరు గాంచిన ఈ ప్రాంతంలో కార్తిక మాసంలో అనేక మంది పర్యాటకులు వచ్చి స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటారు. – రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

# కనీస వసతులు కనక..

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు మారుతున్నా మన్యంలోని మారుమూల ప్రాంతాల్లో మౌలిక వసతులు సమకూరక గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి, విద్య, వైద్యం, పోషకాహారం వంటి కనీస సదుపాయాలు లేని గ్రామాలు ఇంకా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీలోని దొరగుడ గ్రామమే దీనికి ఉదాహరణ. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో కొండల మధ్య ఈ గ్రామం ఉంది. ఇక్కడకు వెళ్లాలంటే ఐదు కొండలు, మూడు గెడ్డలు దాటుకుని 15 కి.మీ.ల దూరం కాలినడకన ప్రయాణం చేయాలి. సుమారు వంద మంది గిరిజనులు ఇక్కడ జీవనం సాగిస్తున్నారు. తాగునీరు, రోడ్డు, పక్కా ఇళ్లు వంటి సదుపాయాలకు వీరు నోచుకోవడం లేదు.

### డోలీమోతే శరణ్యం

రోడ్డు సదుపాయం లేక అత్యవసర వైద్యం కోసం కాలినడకన, డోలీపై రోగులను మోసుకుంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండలెక్కి, వాగులు దాటి 25 కి.మీ.ల దూరం ప్రయాణించి లబ్బూరు పీహెచ్‌సీకి

కొండల మధ్య దొరగుడ

వెళ్లి వైద్యం పొందుతున్నారు. మూడేళ్ల క్రితం గ్రామంలో చిన్నారులకు ఆంత్రాక్స్ వ్యాధి ప్రబలి వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైద్య సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లేందుకు అష్టకష్టాలు పడ్డారు. లక్ష్మీపురం పంచాయతీ కేంద్రానికి 15 కి.మీ.ల దూరం కాలినడకన వెళ్లి బియ్యం, ఇతర నిత్యావసర సరకులు మోసుకొస్తున్నారు.

### బడికి భవనం లేదాయె!

ఈ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేశారు. అక్కడ 18 మంది చిన్నారులు చదువుతున్నారు. భవనం లేక షెడ్డులో బడిని నిర్వహిస్తున్నారు.

పాఠశాల భవనం నిర్మించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. సోలార్ ఆధారంగా విద్యుత్తు సదుపాయం అందిస్తున్నారు. రాత్రి పూట మాత్రమే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. పగటిపూట విద్యుత్తు సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రావిటీ పథకం ద్వారా నీటి సదుపాయం ఉన్నప్పటికీ.. కొండల నుంచి వచ్చే నీరు వినియోగించటంతో టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

### అధికారులకు ప్రతిపాదించాం

దొరగుడ గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని ప్రతిపాదించాం. ప్రస్తుతం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెటల్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. జలజీవన్ మిషన్‌కింద గ్రామంలో తాగునీరు అందిస్తున్నాం. లక్ష్మీపురం నుంచి ఉబ్బెంగుల వరకు జన్‌మన్ కింద రోడ్డు, కల్వర్టుల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నారు. – త్రినాథ్, సర్పంచి, లక్ష్మీపురం

# వారాంతం.. పర్యాటకుల కోలాహలం

చెరువులవెనంలో పర్యాటకులు

చింతపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం కళకళలాడాయి. ఆంధ్రాకశ్మీర్‌గా పేరొందిన లంబసింగి, తాజంగి, చెరువులవెనం, బోడకొండమ్మ ఆలయం, ఎర్రవరం జలపాతాలకు దూరప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతాలన్నీ సందడిగా మారాయి.

### మేఘాలకొండపై జనజాతర

పాడేరు, న్యూస్‌టుడే: వంజంగి మేఘాలకొండకు పర్యాటకులు భారీగా వచ్చారు. ఆదివారం ఒక్క రోజు రూ.81,260 ఆదాయం వచ్చినట్లు చెక్‌గేట్ నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రానికే పర్యాటకులు పాడేరు పట్టణానికి చేరుకున్నారు. పట్టణంలోని లాడ్జీల్లో ఉండి ఆదివారం తెల్లవారుజామున మేఘాల కొండ ప్రాంతానికి వెళ్లారు. ఘాటీలో ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

వంజంగి మేఘాలకొండపై..

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రాఊటీ అరకులోయకు సందర్శకులు పోటెత్తారు. మాడగడ కొండ వద్ద భానూదయాన్ని వీక్షించేందుకు పర్యాటకులు బారులుతీరారు. గిరిజన మ్యూజియం, ఉడెన్ బ్రిడ్జి, కాఫీ తోటలు, వ్యూపాయింట్ తదితరాలు సందర్శకులతో నిండిపోయాయి. అరకులోయ సోయగాలు ఆస్వాదించి.. కార్తిక వన భోజనాలు చేసేందుకు అధికశాతం మంది రావడంతో రద్దీ ఏర్పడింది.

మాడగడ కొండపై..

వైకుంఠగిరిలో భక్తులు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు కిటకిటలాడాయి. ఘాట్ రోడ్డు రద్దీగా మారింది. బొర్రాగుహలను ఆదివారం 4700 మంది పర్యాటకులు సందర్శించగా.. రూ.3.7 లక్షల ఆదాయం సమకూరిందని యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. కాశీపట్నం ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు బారులు తీరారు. స్వామి దర్శనం చేసుకున్న అనంతరం సమీపంలోని గోస్తనీనదిలో స్నానాలు చేశారు. వనసమారాధనలు ఏర్పాటు చేసుకున్నారు. ఎగువ కొండపర్తి గ్రామంలో అనంత వేంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు భారీగా వచ్చారు. దేవాలయం వెనుక తాటిపూడి జలాశయం అందాలు, మంచు మేఘాలు చూసి తన్మయత్వం పొందారు.

### జలపాతాల్లో జలకాలాడుతూ..

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పొల్లూరు ఎగువ, దిగువ జలపాతాలు, సీలేరు నదిలో పర్యాటకులు జలకాలాడుతూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఫోర్‌బే, పికప్, డొంకరాయి జలాశయాలు, జలవిద్యుత్కేంద్రాలను సందర్శించిన పర్యాటకులు స్వీయ

పొల్లూరు జలపాతంలో..

చిత్రాలు తీసుకున్నారు. కొంతమంది సీలేరు నదిలో పడవలపై విహరించి కేరింతలు కొట్టారు.

## చిన్నారులకు చింత

అరకులోయ మండలంలోని పద్మాపురం పంచాయతీ రణజిల్లెడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన మరుగుదొడ్డి పైకప్పు రేకులు పాడై.. ఎప్పుడు కింద పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్డికి తలుపులు సైతం లేవు. నీటి సౌకర్యం సంగతి ఇంక చెప్పనవసరమే లేదు. చిన్నారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఇబ్బందులను తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. – అరకులోయ, న్యూస్‌టుడే

## 28 నుంచి పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు విద్యావ్యవస్థకు అప్పగిస్తున్నాయని, దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు పల్లాల అశోక్ పేర్కొన్నారు. ఈ నెల 28, 29 తేదీలలో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడప్రతులను స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని దీనివల్ల గిరిజన, దళిత పేదలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పీడీఎస్‌యూ నేతలు రమణ, మావోరెడ్డి, శివారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

## గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి సునీత మాట్లాడుతూ.. గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలన్నారు. జూనియర్ కళాశాల అధ్యాపకులు కమల్‌నాథ్, దివాకర్ వీటిని పర్యవేక్షించారు. ఓఎస్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో వ్యాసరచన పోటీలో విద్యార్థులు

## ఊరొకటి.. పేరొకటి!

పూర్వం నుంచి ఇటీవల వరకు అది వై.ఎన్.పాకలు(ఎర్రినాయుడుపాకలు) కూడలి. జాతీయ రహదారి 516ఈ నిర్మాణం పూర్తయిన తర్వాత అక్కడ చీడికాడ పేరుతో బస్‌షెల్టర్ నిర్మించారు. దీంతో ఇతర ప్రాంతాలవారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రావణాపల్లి, పాత కృష్ణదేవిపేటకు మధ్యలో వై.ఎన్.పాకలు కూడలి ఉంది. పేరు మారడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని జాతీయ రహదారి నిర్మాణ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెదేపా మండల అధ్యక్షుడైన రావణాపల్లి పంచాయతీకి చెందిన కె.చంద్రరావు తెలిపారు. ఇది గూగుల్ మ్యాప్‌లో గొలుగొండ మండలం చీడికాడ రెవెన్యూ పరిధిలో ఉండటంతో ఆ పేరుతో బస్‌షెల్టర్ నిర్మించామని సంబంధిత అధికారులు చెప్పారన్నారు. – కొయ్యూరు, న్యూస్‌టుడే

## రాళ్లు తేలి... గుంతలు పడి

కూనవరం, న్యూస్‌టుడే: చినార్కూరు నుంచి పెదార్కూరు వరకు రహదారి అధ్వానంగా మారింది. టేకుల బోరు నుంచి చినార్కూరు వరకు తారు రోడ్డు ఉండగా అక్కడి నుంచి పెదార్కూరు వరకు గ్రావెల్ దారి ఉంది. ఇది దశాబ్దాల క్రితం వేసింది కావడంతో మొత్తం రాళ్లు తేలి నీటి గుంతలతో నిండిపోయింది. చినార్కూరు నుంచి పెదార్కూరు మధ్యలో ఉన్న మూడు కిలో మీటర్ల మొత్తం ఇదే పరిస్థితి ఉంది. వీటికి తోడు దారికి ఇరువైపులా పొదలు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కోంద్రాజుపేట, శబరికొత్తగూడెం, చినార్కూరు, బండారుగూడెం, పెదార్కూరు, రేపాక గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది బాటసారులు ఈ మార్గాన్ని వినియోస్తుంటారు. అధికారులు స్పందించి దారికి మరమ్మతులు చేయించాలని గ్రామీణులు కోరుతున్నారు.

## రూ.5 లక్షలతో కళామందిరం నిర్మాణం

పెదబయులు, న్యూస్‌టుడే: పెదబయలులోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మినీ కళామందిరం నిర్మాణానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర రూ. ఐదు లక్షలు మంజూరు చేశారని జడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు తెలిపారు. ఈ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మండల ఉపాధ్యక్షుడు కొర్రా రాజుబాబు, హరిహరపుత్ర అయ్యప్పపీఠం ప్రధాన గురుస్వామి నిక్కుల వెంకట సుబ్రహ్మణ్యం, ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ, నాయకులు సూరయ్య, పాంగి సింహాచలం, రూఢ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కళామందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు తదితరులు

### తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొమ్మంగి పంచాయతీ గెంజిగెడ్డ నుంచి మూలగరువు వరకు తారురోడ్డు నిర్మాణానికి ఆదివారం తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడు వంతల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చల్లంగి సురేష్‌బాబు శంకుస్థాపన చేశారు. పీఎం జన్‌మన్ నిధులతో ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రహదారి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే నేరాలు తగ్గుముఖం

చింతపల్లి, న్యూస్‌టుడే: చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే సమాజంలో నేరాలు తగ్గుముఖం పట్టేందుకు ఆస్కారం ఉంటుందని చింతపల్లి సీఐ వినోద్‌బాబు అన్నారు. సీఆర్ మీడియా అకాడమీ, ఏపీ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో చింతపల్లిలో పాత్రికేయులకు నిర్వహించిన రెండు రోజుల పునశ్చరణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ మాట్లాడుతూ.. పాత్రికేయులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతపల్లిలో మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఐజేయూ జనరల్ సెక్రటరీ సోమసుందర్, స్వామి, కిషోర్, సతీష్, వనరాజు, దయానంద్ తదితరులు మొక్కలు నాటారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

## భక్తిశ్రద్ధలతో బాబా పల్లకీ ఊరేగింపు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలోని గురుదత్త షిరిడీ సాయి ఆలయం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యాన గ్రామంలో ఆదివారం బాబా పల్లకీ సేవ నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. సోమవారం ఉదయం పాలాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉందన్నారు.

పల్లకీ ఊరేగింపు

### నూకాలమ్మకు ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో గ్రామ దేవత నూకాలమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్తికమాసం సందర్భంగా తాపీమేస్త్రిల ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. దాదాపు 4 వేల మందికి పైగా అన్నసమారాధన జరిగింది.

అలంకరణలో నూకాలమ్మ

(c) eenadu

# ఈనాడు అమరావతి
## గుంటూరు
సోమవారం నవంబరు 17, 2025

## జనసంద్రం

సూర్యలంక సముద్రతీరం సందర్శకులు, భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. స్థానిక అటవీ శాఖ తోటల్లో కార్తిక వన సమారాధనలు భారీఎత్తున నిర్వహించారు. భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి సైకత శివలింగాలకు పూజలు చేశారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా మెరైన్, బాపట్ల గ్రామీణ పోలీసులు డ్రోన్‌తో పటిష్ఠ నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు పడవల్లో తిరుగుతూ పహారా కాశారు. - న్యూస్‌టుడే, బాపట్ల

## కార్తికం.. వనభోజనం

మహంకాళి అమ్మవారి ఆలయ తోటల్లో సందడి

కార్తిక మాసం ఆఖరి ఆదివారం జిల్లాలోని పలుచోట్ల వన సమారాధనలు సందడిగా జరిగాయి. గ్రామాలకు సమీపంలో ఉన్న తోటలు చిన్నపిల్లలు, యువకులు, వృద్ధులు, మహిళలతో కిటకిటలాడాయి. కంఠంరాజుకొండూరు-చిలువూరు మధ్య ఉన్న సపోట తోటల్లో మంగళగిరి, గుంటూరు, ఒంగోలు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉత్సాహంగా గడిపారు. దుగ్గిరాల పాతలాకు వద్ద మూడు బృందాలు ఆటపాటలతో సందడి చేశాయి. - న్యూస్‌టుడే, దుగ్గిరాల

## ఆమెకు అన్నింటా అండగా..

### జిల్లాలో జెండర్ కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

పొన్నూరు, న్యూస్‌టుడే

సమాజంలో మహిళలు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. మానసిక వేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ప్రతి మండలంలో జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తొలుత తెనాలి, పొన్నూరు, తుళ్లూరు, ప్రత్తిపాడు మండలాలను ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కేంద్రానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసిందని వెలుగు అధికారులు తెలిపారు. రెండో విడతలో కాకుమాను, చేబ్రోలు, దుగ్గిరాల, ఫిరంగిపురం మండలాల్లో కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

మండలాలు: 18
మండల సమాఖ్యలు: 17
గ్రామసంఘాలు: 583
జిల్లాలోని పొదుపు సంఘాలు: 20,368
పొదుపు సంఘాల్లో సభ్యులు: 2,15,212

**ఫిర్యాదు చేస్తే స్పందిస్తారు..** ఈ విషయమై డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగు మండలాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆపదలో ఉన్న మహిళలు జెండర్ కేంద్రాలకు వెళ్లి ఫిర్యాదు చేస్తే వారికి అండగా ఉంటామని వెల్లడించారు.

**కార్యాచరణ ఇలా..:**
- ☛ మహిళలకు ఆర్థిక సాధికారతపై అవగాహన కల్పించడం.
- ☛ గృహ హింస, వేధింపులు వంటి సమస్యలను పరిష్కరించడం.
- ☛ బాల్య వివాహాల అడ్డుకోవడం.
- ☛ ఆపదలో ఉన్న మహిళలకు తాత్కాలిక వసతి కల్పించడం.
- ☛ బాధితుల్లో భరోసా నింపడం.
- ☛ యువతులు, మహిళలు సురక్షితంగా ప్రయాణించే అవకాశాలు బలోపేతం చేయడం.



## చార్మినార్ పోలిక.. చెక్కు చెదరక..

రాజులు కాలం చేసినా నాడు వారు నిర్మించిన కట్టడాలు నేటికీ చెక్కు చెదరలేదు. అటువంటి వాటిల్లో వినుకొండలోని జామియా మసీదు (పెద్ద మసీదు) ఒకటి. 1685-86లో కుతుబ్‌షాల కాలంలో వినుకొండ ప్రాంత దివాన్‌గా పనిచేసిన అబ్దీరజాఖాన్ ఈ మసీదును నిర్మించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతి పెద్దదిగా దీనికి గుర్తింపు ఉంది. హైదరాబాద్‌లోని చార్మినార్‌ను పోలినట్టు ముందు, వెనుక ఎత్తైన మినార్లు మసీదుకు ప్రత్యేక ఆకర్షణ. సున్నం, గచ్చురాయితో నిర్మించారు. చిన్నచిన్న మరమ్మతులు ఉన్నా మసీదు నిర్మాణం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. మసీదు నిర్వహణకు ముస్లిం రాజులు 150 ఎకరాలు భూమి ఇచ్చారు. అందులో కొంత భాగం ఆక్రమణలకు గురికాగా మిగిలిన దానికి కంచె వేసి రక్షణ కల్పిస్తున్నారు. మసీదులో నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు.
- న్యూస్‌టుడే, వినుకొండ

## ఆంధ్రా ప్యారిస్.. ప్రణాళికలు అదుర్స్..!

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తెనాలిలో మూడు కాలువల అభివృద్ధికి కసరత్తు

సంక్రాంతి కల్లా పడవల కాలువలో బోటు షికారు

తెనాలిలోని మూడు కాలువలు ఇవే.. (విహంగ వీక్షణం)

ముచ్చటగా మూడు కాలువలతో ఆంధ్రా ప్యారిస్‌గా చారిత్రక గుర్తింపు పొందింది తెనాలి పట్టణం. ఎటుచూసినా జలసవ్వళ్లు, ఆహ్లాదపరిచే పచ్చదనం.. ఈ పట్టణ ప్రత్యేకత. అలాంటి తెనాలిలో మూడు కాలువలు అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను విస్తృతంగా ఆకర్షించాలని చాలా కాలంగా అనుకుంటున్నా.. ఆ దిశగా పడిన అడుగులు అంతంత మాత్రమే. కూటమి ప్రభుత్వం కొలువుదీరినంతనే ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సంక్రాంతి కల్లా బోటు షికారు, రాబోయే రెండేళ్లలో మరికొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**చారిత్రక నేపథ్యమిది..** కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించిన తరవాత ఆంగ్లేయులు విజయవాడ నుంచి నిజాంపట్నం వరకు ఉన్న కాలువల లోతు పెంచి, కట్టలను బలోపేతం చేశారు. ఈ క్రమంలోనే తెనాలి నుంచి తూర్పు, నిజాంపట్నం(పడవల కాలువ), పడమర కాలువలు బాగుపడగా.. తద్వారా తెనాలి, వేమూరు, నిజాంపట్నం, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో సుమారు 90 వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందుతోంది. తెనాలి రక్షిత మంచినీటి పథకానికీ వీటి నుంచి నీరు తీసుకుంటారు. నిజాంపట్నం కాలువలో పడవల ద్వారా సరకు రవాణా జరిగేది. ఇంతటి కీలకమైన ఇవి ఏళ్లుగా మురుగు కూపాల్లా మారాయి. పట్టణంలో సుమారు 2 కిలోమీటర్ల మేర వెళ్లే ఇవి రెండేళ్ల క్రితం వరకు ఆక్రమణల కోరల్లో చిక్కాయి.

**గతంలో చొరవ ఇలా..** ఆక్రమణలు తొలగించాలని, కట్టలు అభివృద్ధి చేయాలని గతంలో పాలకులు సంకల్పించగా.. వివిధ సందర్భాల్లో ఆ దిశగా అడుగులు పడ్డాయి. నాదెండ్ల మనోహర్ తొలి అడుగు వేసి రెండు కాలువల మధ్య రోడ్ల విస్తరణ చేపట్టారు. అనంతరం ఆలపాటి రాజా దాన్ని కొనసాగించారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ పరిధిలో అర్ధ కిలోమీటరు మేర బండ్, మహనీయుల విగ్రహాలు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరినంతనే నాదెండ్ల మనోహర్ మరోసారి దృష్టి పెట్టారు. కాలువల్లో టన్నుల కొద్దీ వ్యర్థాలు తొలగించారు. మురుగునీరు కాలువల్లోకి రాకుండా కట్టడి చేయాలనీ పురపాలకసంఘాన్ని ఆదేశించారు.

**భవిష్యత్తు లక్ష్యాలివి..** రానున్న సంక్రాంతి కల్లా బోటు షికారు పట్టాలెక్కించాలనే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. బండ్‌ల సుందరీకరణ, ప్రజలు బోటు ఎక్కే దిగే ప్రాంతాల గుర్తింపు, స్టాల్స్ ఏర్పాటుకు ప్రణాళికలు వేస్తున్నారు. ఆకాశ నడక వంతెన కోసం పదిహేనేళ్ల క్రితమే నాదెండ్ల మనోహర్ సంకల్పించినా అడుగులు పడలేదు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు కసరత్తు చేస్తున్నారు. సాధ్యాసాధ్యాలు, అయ్యే ఖర్చు, క్షేత్రస్థాయి ఇబ్బందులను అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

## నిరంతర కళావాహిని

### అన్నమయ్య కళావేదికపై ఏడాది పొడవునా కార్యక్రమాలే

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

అన్నమయ్య కళావేదిక.. అదొక నిరంతర కళావాహిని. గుంటూరుతో పాటు ఇతర జిల్లాల కళాకారులకు ఈ పేరు పరిచయమే. గుంటూరు బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్మితమైంది. ఇక్కడి వెంకటేశ్వర స్వామి దేవాలయం ఎలా ఏడాది పొడవునా భక్తులకు దైవదర్శన భాగ్యం కలిగిస్తుందో.. అలాగే ఒక్క రోజూ కూడా ఆగకుండా సాంస్కృతిక, కళా సాహిత్య కార్యక్రమాలను ఈ వేదిక అందిస్తుంటుంది.

☛ ఇక్కడ ప్రదర్శన, ఇరత కార్యక్రమాల నిర్వహణకు మూడు నెలల ముందే వేదిక తేదీలను నమోదు చేసుకోవాలి. ఈ దైనందిన కార్యక్రమాలను మొక్కుబడిగా ఎవరో ఉద్యోగికి అప్పగించి ఊరుకోరిక్కడ. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య.. ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు ప్రదర్శింపజేయాలి, భక్తులకు అవి ఏమేరకు ఉపకరిస్తాయనే అంశాలు పర్యవేక్షిస్తుంటారు. సభ్యులు కూడా నిర్వహణకు కావాల్సిన అంశాలను చూస్తుంటారు.

**వర్షాలొచ్చినా ఆగకుండా..** అన్నమయ్య కళావేదికపై ప్రదర్శించే కార్యక్రమాల కోసం సాయంత్రం ఆరు గంటల కల్లా వంద నుంచి 200 మంది ప్రేక్షకులు వేచి చూస్తుంటారు. ప్రేక్షకులకు అనువైన కుర్చీలు తదితర సౌకర్యాలు సిద్ధంగా ఉంటాయి. ప్రదర్శనలిచ్చే వారికి వేదిక తదితరాలన్నీ ఉచితమే. ఇది ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం. వర్షాలొచ్చినా కార్యక్రమాలు ఆగకుండా తగిన ఏర్పాట్లు ఆలయ ప్రాంగణంలోనే ఉన్నాయి. పాలక మండలిలో ఉపాధ్యక్షురాలిగా సేవలందించిన గద్దె రామతులశమ్మ వేదిక నిర్మాణానికి సహకరించారు. ☛ ఇటీవల కొవిడ్ సమయంలో లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు మినహా 2000 సంవత్సరం నుంచి నేటి వరకు ప్రతి నిత్యం సంగీతమో, నృత్యమో, ఉపన్యాసమో, నాటకమో, కళారూపమో ప్రదర్శితమవుతుంది. కార్యక్రమాలు లేకపోతే ప్రవచనకర్తలతో ఆధ్యాత్మిక ప్రసంగాలు, కళాకారులతో కచేరీలు ఏర్పాటు చేస్తుంటారు. కవులు, కళాకారులు, రచయితలకు ఇదొక ఆత్మీయ వేదికగా.. తెలుగు కళ, భాషా సంస్కృతుల నిధిలా కొనసాగుతూనే ఉంది.

## పైసా లేదు.. బెయిల్‌కు సాయం చేయండి

- పోలీసులతో ప్రధాన నిందితుడు
- కస్టడీలో సరైన సమాధానాలివ్వని వైనం

ఈనాడు, అమరావతి

ఆదిత్య

'నా వద్ద రూపాయి లేదు. కనీసం బెయిల్ వేసుకునేందుకూ డబ్బుల్లేవు. అందుకే వేసుకోలేదు. మీరే డబ్బు ఎరేంజ్ చేయండి..' అని అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్య చెబుతున్న సమాధానం ఇది. భారీగా డిపాజిట్లు వసూలు చేసి, ఆనక చెల్లించకుండా బోర్డు తిప్పేసిన కేసులో ఆదిత్య (ఏ1)ను కస్టడీలో భాగంగా ప్రశ్నించిన పోలీసులకు వచ్చిన సమాధానాలు విని వారే నిర్ఘాంతపోయారు. ఈ కేసులో కీలక నిందితులైన ఆదిత్యతో పాటు అతని భార్య సుజాత (ఏ2), కీలక ఏజెంట్ బాలకృష్ణ (ఏ3)లను పోలీసులు కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. నిందితులను విచారించిన క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, సెంట్రల్ ఏసీపీ దామోదర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, తదితరలు నిందితులను ప్రశ్నించారు. ఆదివారం రెండో రోజు కస్టడీలో వీరిని పలు ప్రశ్నలు అడిగారు. దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. తమ వద్ద డబ్బుల్లేవని మాత్రమే ముగ్గురూ సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. సోమవారంతో కస్టడీ ముగుస్తుంది. మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపర్చిన తర్వాత కారాగారాలకు తరలించనున్నారు.

**వీడని లెక్కల గుట్టు..** వసూలు చేసిన డిపాజిట్లలో రూ.39.50 కోట్లకు అసలు లెక్కలు లేనట్లు దర్యాప్తులో తేలింది. ఈ సొమ్మును ఎక్కడికి తరలించాడన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని విదేశాలలో పెట్టుబడులకు వినియోగించినట్లు అనుమానిస్తున్నారు. ఈ అంశంపై ఎన్ని సార్లు ప్రశ్నించినా సరైన సమాధానాలు రాలేదు. తన వద్ద పైసా లేదని మాత్రమే పదే పదే చెప్పాడు. ఆదిత్యకు సంబంధించి మూడు ఖాతాలను పోలీసులు పరిశీలించగా వాటిలో డబ్బులు లేవని తెలిసింది. డిపాజిటర్లు, ఏజెంట్లకు న్యాయంగా ఇవ్వాల్సిందంతా ఇచ్చానని సమాధానమిచ్చాడు.

**తానే పెట్టుబడి పెట్టానని బాలకృష్ణ బుకాయింపు..** ఈ కేసులో బాలకృష్ణ, అతని సతీమణి ఇద్దరూ రూ.9కోట్లు అయాచితంగా లబ్ధి పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సొమ్ము గురించి బాలకృష్ణను ప్రశ్నించారు. తాను లబ్ధి పొందలేదని, ఆదిత్యకు రూ.6.50 కోట్ల మేర పెట్టుబడి పెట్టానని.. ఆ సొమ్మే తాను తీసుకున్నానని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. అంత సొమ్ము ఎలా సంపాదించారని పోలీసులు ప్రశ్నించగా తనకు రెండు కంపెనీలు ఉన్నాయని, వాటి ద్వారా ఆదాయం వచ్చిందని అన్నట్లు తెలిసింది.

## ఆన్‌లైన్‌లోనూ అర్జీలు సమర్పించొచ్చు

**కలెక్టరేట్(గుంటూరు):** ప్రజలు.. అర్జీలను ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండల కార్యాలయాల్లోనూ ప్రజల సమస్యలు స్వీకరిస్తారన్నారు. అర్జీల నమోదు, నమోదైన వాటి స్థితి, వాటికి సంబంధించిన సమాచారం 1100కు నేరుగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## వారాంతం.. కొండల్లో విహారం



కొండల్లో ముందుకు సాగుతూ..

మారుతీనగర్, న్యూస్‌టుడే

ఆరు రోజుల ఒత్తిడి..పరుగు..కాలుష్యం వాతావరణంలో గడిపిన వారు ఆదివారం వచ్చిందంటే ఉదయం 4 గంటలకు నిద్రలేస్తారు. తాగునీరు, అల్పాహారం, బూట్లు వీటన్నింటినీ బ్యాగ్‌లో వేసుకొని బయలుదేరతారు. నిర్వాహకులు తెలిపిన ప్రదేశానికి వెళ్తారు. అక్కడ నిర్వాహకులు కొండలను ఎలా ఎక్కాలో..జాగ్రత్తలు, మెలకువలను వివరిస్తారు. అనంతరం ప్రకృతి ప్రాముఖ్యతను తెలుసుకుంటూ కొండలను ఎక్కుతూ ఆహ్లాదకర వాతావరణంలో ముందుకు కదులుతారు. ఇదే ట్రెక్కింగ్. ట్రెక్కింగ్ ద్వారా శరీరానికి వ్యాయామమే కాకుండా ప్రకృతి మాధుర్యాన్ని ఆస్వాదించడం ద్వారా కొత్తశక్తితోపాటు నూతన ఉత్సాహాన్ని పొందుతారు. గుంటూరు నగరానికి చెందిన గుంటూరు ట్రెక్కింగ్ కింగ్స్ పేరుతో గత మూడేళ్ల నుంచి కొండవీడు, కొండపల్లి, కోటప్పకొండ, మూలపాడు తదితర ప్రాంతాల్లో ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు.

కొండవీడులోని చుక్కలకొండ బురుజు వద్ద బృందం

గుంటూరుతోపాటు తెనాలి, మంగళగిరి, చిలకలూరిపేట ప్రాంతాలకు చెందిన యువతులు, మహిళలు, పురుషులు, పిల్లలు వీటిలో పాల్గొని ఆనందం..అనుభూతి పొందుతున్నారు. ఈ ఆదివారం కొండవీడులోని చుక్కల కొండ బురుజును 60 మంది అధిరోహించారు. కొండను ఎక్కేటప్పుడు ఒకరికొకరు సహకరించుకోవడం, ప్రకృతి అందాలు, నెమళ్లు, వివిధ పక్షులను తమ సెల్‌ఫోన్లలో, కెమెరాల్లో బంధించుకొని భద్రపరచుకోవడమే కాకుండా మిత్రులు, బంధువులకు సామాజిక మాధ్యమాల్లో పంపారు. అంతేకుండా ఫిట్‌నెస్ ఛాలెంజస్‌లో భాగంగా పుష్‌ప్స్, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

## నీళ్ల కింద నిజమెంత?!

- జీఎంసీలో తాగునీటి ట్యాంకుల శుభ్రత ఒక గుత్తసంస్థకు అప్పగింత
- ఒక్కొక్కదానికి రూ.1.50 లక్షలు ఖర్చు చేశారంటున్న ప్రజాసంఘాలు

ఈనాడు, అమరావతి

బుచ్చయ్యతోట నీటి ట్యాంకు శుభ్రం చేస్తున్నారిలా..

నీళ్ల కింద నిజం దాగి ఉంది.. అధికారుల ఉన్నతాశయమా.. లేక అడ్డదారి దోపిడీనా అన్నది తేలాల్సి ఉంది. కేవలం శుభ్రతే తమ ప్రథమ కర్తవ్యమని జీఎంసీ వర్గాలు చెబుతుండగా..అధిక మొత్తంలో వ్యయం చేశారంటూ ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. మొత్తంగా గుంటూరు నగరపాలకసంస్థలో తాగునీటి ట్యాంకులు శుభ్రం వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది.

జీఎంసీలో 57 డివిజన్లు ఉండగా, 10 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. వీరికి నిత్యం 150 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండగా, 135 ఎంఎల్‌డీ వరకు సరఫరా చేస్తున్నారు. అయితే, ఈ నీటిని శుద్ధి చేసి, సరఫరా చేసే వ్యవస్థ పరంగా చాలా కాలంగా నిర్లక్ష్యం నెలకొంది. ప్రధానంగా తక్కెళ్లపాడు, సంగంజాగర్లమూడి నీటిశుద్ధి కేంద్రాల్లో ప్రక్రియ పక్కాగా సాగని దుస్థితి. ఇక, ఇక్కడి శుద్ధజలం నగరంలో ఇంటింటికీ చేరే క్రమంలో ప్రధాన పాత్ర పోషించే తాగునీటి ట్యాంకులు మరింత అధ్వాన స్థితిలో ఉన్నాయి. మొత్తం 46కు గాను 10కి పైగా పైకప్పులు పగిలిపోయి పక్షుల వ్యర్థాలు, దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. మిగిలిన ట్యాంకుల్లోనూ నిర్ణీత గడువులో శుభ్రం చేయకపోవడంతో పాచిపట్టి పురుగులతో దర్శనమివ్వడం పరిపాటైంది.

**అతిసారంతో అప్రమత్తం..** గత మూడు నెలలుగా గుంటూరులో ప్రజారోగ్యం సంక్షోభంలో పడడం తెలిసిందే. తురకపాలెంలో మెలియాయిడోసిస్ ఆనవాళ్లు, గుంటూరులో అతిసారం కేసుల నమోదుతో పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. రాష్ట్రప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు జీఎంసీ ఉన్నతాధికారులు నగరంలోని అన్ని తాగునీటి రిజర్వాయర్లను శుద్ధి చేసేందుకు సంకల్పించారు. అలా ఓ గుత్తసంస్థకు బాధ్యత అప్పగించారు. అయితే, ఇక్కడే అసలు కథ మొదలైంది. ఒక్కొక్క ట్యాంకుకు రూ.1.50 లక్షల చొప్పున మొత్తం 27 ట్యాంకులను శుభ్రం చేసి రూ.40 లక్షల బిల్లును జీఎంసీకి ప్రతిపాదించగా, ఇంకా మంజూరు చేయనట్లు విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. దీనిపై ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. ఇంత ఖర్చు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నాయి.

**ఆరునెలలు శుభ్రంగా..** అయితే, అధికారవర్గాలు మాత్రం ఒక్కసారి శుభ్రం చేస్తే ఆరునెలల పాటు ఇబ్బంది లేకుండా ఉండేలా గుత్త సంస్థను ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. సాధారణ రిజర్వాయర్లకు 6 లేయర్లతో, పైకప్పు పగిలిన చోట్ల 7 లేయర్లలో ప్రత్యేక పద్ధతుల్లో శుభ్రం చేస్తున్నట్లు వివరిస్తున్నారు. దీనిపై చివరకు ఏం జరుగుతుందన్న ఉత్కంఠ నెలకొంది..!!

## సాగర్ నీటిమట్టం 586.40 అడుగులు

**విజయపురి సౌత్, న్యూస్‌టుడే:** నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం రాత్రి 8 గంటలకు 586.40 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 14,274 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. సాగర్ కుడి కాలువకు 10,000, ఎడమ కాలువకు 3374, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## సైకిల్ యాత్ర... ఫిట్‌నెస్ మంత్ర

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే:** మంగళగిరిలో ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ జవాన్లు ఫిట్ ఇండియా పేరుతో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బెటాలియన్స్ ఐజీ రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమాండెంట్ నగేష్ బాబు పోలీసు జవాన్లతో కలిసి ఐజీ రాజకుమారి పాల్గొని సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. బెటాలియన్స్ కుటుంబ సభ్యుల్లో పిల్లలు సైతం పాల్గొన్నారు. బెటాలియన్ వద్ద నుంచి ఎన్నారై జంక్షన్ వరకు ప్రదర్శనగా వెళ్లిన వారు తిరిగి బెటాలియన్‌కు చేరుకున్నారు. ప్రతి ఒక్కరు శారీరక దారుఢ్యం కలిగి ఉండాలని ఐజీ సూచించారు.

సైక్లింగ్‌లో ఐజీ రాజకుమారి, కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు

## జాప్యం చేయొద్దు.. పరిష్కారం వదలొద్దు..!

### 'ఆదాయ పన్ను' శాశ్వత మినహాయింపుపై అడుగులు కరవు
### ఏఎన్‌యూలో ఇప్పటికే రెండు దఫాల్లో రూ.8 కోట్లు చెల్లింపు

ఈనాడు, అమరావతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఆదాయపు పన్నుశాఖ తాఖీదులు ఇవ్వడం. .ఇచ్చిన ప్రతిసారీ అధికారులు హడావుడి పడి ఆఘమేఘాలపై చెల్లింపులు చేయడం. .'మినహాయింపు' విషయంలో చొరవ చూపుతామని చెప్పి, మాటలకే పరిమితం కావడం పరిపాటైంది. ఈసారైనా శాశ్వత పరిష్కారం దిశగా అడుగేస్తే బాగుంటుందన్న వాదన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఏఎన్‌యూకు ఈ ఏడాది సెప్టెంబర్ 16వతేదీ ఆదాయపన్నుశాఖ నుంచి నోటీసులు అందాయి. 2015-16, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు గాను మొత్తం రూ.194.91 కోట్లు బకాయిలు ఉన్నాయని.. వెంటనే ఆ మొత్తాన్ని చెల్లించాలంటూ అందులో పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు చెల్లించని పక్షంలో విశ్వవిద్యాలయ ఖాతాలు స్తంభింపజేస్తామంటూ స్పష్టం చేశారు. ఆమేరకు ఏఎన్‌యూ ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత వర్గాలతో మాట్లాడగా.. చివరకు యుద్ధప్రాతిపదికన రూ.5 కోట్లు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని చెల్లించడానికి అవసరమైన అనుమతులు, ఆమోదం విషయంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం, అది విమర్శల పాలవడం తెలిసిందే. ఈసీ సమావేశం నిర్వహించకుండా కేవలం అత్యవసర నోట్ రూపొందించిన అధికారులు..పాలకమండలిలోని సభ్యుల ఇళ్ల వద్దకు ఒక అధికారిని పంపించి మరీ సంతకాలు పెట్టించారు. దసరా సెలవుల్లో ఉన్న వారినీ సంతకాల కోసం పట్టుబట్టి గండం గట్టెక్కారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం

### అప్పుడూ అంతే

2023లోనూ ఆదాయపన్ను చెల్లింపుల విషయంలో ఏఎన్‌యూ పరంగా సమస్య నెలకొంది. అప్పటి ఉన్నతాధికారులు రూ.40 కోట్లకు ఆమోదం కోరుతూ నాటి పాలకమండలి(ఈసీ)లో ప్రతిపాదించారు. అయితే, ఆ ఫైలును ఈసీ పక్కన పెట్టేసింది. అయినప్పటికీ, లెక్కచేయని నాటి ఉన్నతాధికారి రూ.3 కోట్లు చెల్లించడం తెలిసిందే. అది జరిగిన రెండేళ్ల తరవాత మళ్లీ అదే సమస్య పునరావృతమైంది. ఈ క్రమంలో మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ఐటీ నుంచి 'మినహాయింపు' కోరతామని ఇటీవల స్పష్టం చేశారు. అయితే, ఆ దిశగా ఇప్పటికీ అడుగులు పడలేదు. బదిలీలు, మార్పులు చేర్పులతో ఈ ప్రతిపాదన మూలకు చేరుతోంది. రాష్ట్రంలోని మిగిలిన విశ్వవిద్యాలయాలు ఈ విషయంలో ఏం చేస్తున్నాయో అధ్యయనం చేయడమూ మాటలకే పరిమితమైంది. అసలే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న ఏఎన్‌యూలో అధికారులు ఇప్పటికైనా ముందుచూపుతో అడుగేయాల్సిన అవసరం కనిపిస్తోంది.


## అమ్మకమునకు స్థలము

బాపట్ల జిల్లా, చిన్నగంజాం మండల రెవిన్యూ ఆఫీస్ సమీపంలో 1.27 (ఒక ఎకరం ఇరవై ఏడు సెంట్లు) గల స్థలం తూర్పు ముఖంగా 180 అడుగుల వెడల్పుతోనూ పాత జాతీయ రహదారికి ఆనుకుని ఒంగోలు - చీరాల రోడ్డు ప్రక్కన నాలుగు పక్కల ప్రహరి గోడతో మరియు 30 అడుగుల పక్కా రోడ్డుతో రెవెన్యూ వారిచే నాన్ అగ్రికల్చరల్ భూమిగా మార్పు చేయబడి ఉన్న స్థలము అమ్మకమునకు కలదు. విద్యా సంస్థలకు మరియు షోరూములకు కావలసిన వారు సంప్రదించగలరు.

98663 96135
98484 90931

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541


(c) eenadu

# జల వనరుల పెంపే లక్ష్యం

- చెరువుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు
- 2026-27 సంవత్సరంలో ఉపాధి పనులకు ప్రాధాన్యం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

అభివృద్ధి చేసిన వెంగళాయపాలెం చెరువు

గ్రామీణ గుంటూరు మండలం వెంగళాయపాలెం చెరువును వాటర్ షెడ్ పథకంలో రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేసి ప్రారంభించడంతో దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ జిల్లా యంత్రాంగం కృషిని అభినందించడంతో.. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని చెరువులను పునరుద్ధరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరంలో చెరువులను జీర్ణోద్ధరణ చేసేలా ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్ మండలాల అధికారులను ఆదేశించారు. దీనివల్ల చెరువుల్లో సంప్రదాయక నీటి వనరులు అభివృద్ధి చేయవచ్చని భావిస్తున్నారు. రైతులు వారి పంట పొలాల్లో నీటి కుంటలను తవ్వడం ద్వారా భూగర్భ జల వనరులను పెంచేలా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పిస్తారు. రానున్న 2026-27 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేసే పనులను గుర్తించే ప్రక్రియను అధికారులు రూపొందిస్తున్నారు. డిసెంబరు లోపు ఎంపీడీవోలు ప్రతిపాదనలు అందజేయాల్సి ఉంటుంది. జిల్లా అధికారుల సూచన మేరకు ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అటవీ శాఖ భాగస్వామ్యంతో..** ☛ ఉద్యాన పంటలు, మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని భూభాగంలో 33 శాతం మొక్కలు ఉండాలి. జిల్లాలో 7 శాతం మాత్రమే ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అటవీ శాఖ భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటనున్నారు. పంట కాలువల గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భూముల్లో నాటేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. మొక్కలను అటవీ శాఖ పంపిణీ చేయనుంది.

☛ జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత గ్రామీణ ప్రాంతాల పరిధి తగ్గిపోయింది. రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని మెజారిటీ గ్రామాలు సీఆర్‌డీఏలో కలపడం.. గుంటూరు నగరపాలక సంస్థలో 10 గ్రామాలు విలీనం కావడం, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీలు ఉండడంతో వాటిలో ఉపాధి పనులు చేసేందుకు వీల్లేని పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పనులు చేసేలా ప్రతిపాదనలు తయారుచేస్తున్నారు.

### మొక్కలు నాటడం ద్వారా.. పర్యావరణ పరిరక్షణ

వెంగళాయపాలెం చెరువును అభివృద్ధి చేయడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని మిగిలిన చెరువులను అభివృద్ధి చేస్తాం. వాటిని గుర్తించే పని చేపట్టాం. జిల్లాలో అటవీ భాగం తగ్గిపోవడంతో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. **- వి.శంకర్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్**

# 'విద్యా వ్యవస్థను కుంగదీస్తున్న సంస్కరణలు'

మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాదరావు

**గుంటూరు విద్య, న్యూస్‌టుడే:** విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు పాఠశాలలను బలోపేతం చేయాలి కానీ..బలహీన పరచరాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం, సంస్కరణలు పాఠశాల విద్యావ్యవస్థను కుంగదీస్తున్నాయని, 9 రకాల పాఠశాలల ఏర్పాటు విద్యార్థులకు మేలు చేయదన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి పాఠశాలలను బలోపేతం చేయాలని, తద్వారా పేదల బిడ్డలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు సయ్యద్ చాంద్‌బాష, మక్కెన శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలతో పలు పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తెలుగు మాధ్యమం పునరుద్ధరించాలన్నారు. బసవలింగారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. గత 17 నెలల నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇంతవరకు చెల్లించలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ ఛైర్మన్‌ను నియమించి మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈవీ రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

# దాత ఉదారత.. ఆలయాలకు చేయూత

## ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చే వడ్డీతో కార్యక్రమాలు

సాంబయ్య

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు రూ.80 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ మొత్తంపై వచ్చే వడ్డీని వాటికి వెచ్చించాలని సంకల్పించుకున్నారు మండలంలో చిలువూరుకు చెందిన దాత గద్దె సాంబయ్య. హిందూ ఆలయాల్లో, చర్చిలో వివిధ సందర్భాల్లో జరిగే కార్యక్రమాల కోసం బ్యాంకులో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేశారు. తనతో పాటు, కుమారుడు శివరామకృష్ణ, మనవడు మిధున్ చౌదరిల పేరిట సంయుక్తంగా ఈ మొత్తాన్ని ఉంచారు. రూ.20 లక్షలు చొప్పున మూడు ఆలయాలకు, ఒక చర్చికి కేటాయించారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ఆయా ఆలయాలు, చర్చిలో ప్రత్యేకంగా నిర్ణయించే కార్యక్రమాలు వెచ్చిస్తామని దాత సాంబయ్య తెలిపారు. చిలువూరు శివాలయానికి కేటాయించిన మొత్తంపై వచ్చే వడ్డీతో మహాశివరాత్రి నాడు జరిగే అన్నసంతర్పణ, ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. చర్చికి కేటాయించిన మొత్తంపై వచ్చే వడ్డీని క్రిస్మస్ పర్వదినాన కార్యక్రమాలకు వెచ్చిస్తారు. మహంకాళి అమ్మవారి ఆలయానికి ఇచ్చిన మొత్తంపై వచ్చే వడ్డీని ఏటా చిలువూరు నుంచి సారె తీసుకెళ్లేందుకు వినియోగిస్తారు.

# అభివృద్ధి పనుల తనిఖీ

**వినుకొండ:** గుంటూరు- నంద్యాల రైలు మార్గంలోని పలు స్టేషన్లలో అభివృద్ధి పనులను డీఆర్‌ఎం సుదేష్ణసేన్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ప్రత్యేక రైల్లో వచ్చిన ఆమె వినుకొండ స్టేషన్లో చేపట్టిన పనులు పరిశీలించారు. ముందున్న ఖాళీస్థలం అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. దివ్యాంగులకు అవసరమైన వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. తొలుత ప్రకాశం జిల్లా కంభం, తర్లుపాడు, గజ్జలకొండ, దొనకొండ, పొట్లపాడు, కురిచేడు, నుదురుపాడు స్టేషన్లను ఆమె పరిశీలించారని అధికారులు తెలిపారు. ఏడీఆర్‌ఎం సైమన్, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, అధికారులున్నారు.

# యాదవుల సంక్షేమానికి కృషి

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు, పక్కన మంత్రి పార్థసారథి తదితరులు

**తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలోని హ్యాపీ రిసార్ట్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశాన్ని బీసీవై అధినేత బోడే రామచంద్ర యాదవ్, మాజీ మంత్రి రఘువీరారెడ్డిలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ఐదెకరాల భూమి యాదవ భవన నిర్మాణానికి కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరామని, మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే స్థల పరిశీలన చేశారన్నారు. 'మనమంతా కృష్ణ భగవానుడి వారసులమనేది ముమ్మాటికీ నిజం. ఇందుకు ధర్మ మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని' పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని విద్యావంతుల్ని చేయాలని' కోరారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఐక్యతతో ముందుకు సాగితే అభివృద్ధికి బాటలు పడతాయని సూచించారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాజధానిలోని అన్ని బీసీ సామాజిక వర్గాలకు భూములు కేటాయించి ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఇవ్వాలని కోరారు. చీరాల ఎమ్మెల్యే ఆలూరి కొండయ్య, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహారావు యాదవ్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, యాదవ్ సంఘం నాయకులు తులిమిల్లి రామకృష్ణ యాదవ్, దానబోయిన సుందరరావు యాదవ్, ఆరుద్ర భూలక్ష్మి, ఎర్రాకుల తులసీరామ్ యాదవ్, తోటా పార్థసారథి, చిన్నితిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందించండి

వినతిపత్రం అందజేస్తున్న క్రీడాకారుడు హేమశివశంకర్

**మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:** మహారాష్ట్రలో వచ్చే నెల 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న ఐఆర్ఎస్ఎఫ్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని తాయి హేమశివ శంకర్ అనే క్రీడాకారుడు మంగళగిరి జనసేన కార్యాలయంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును కోరారు. మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన హేమశివశంకర్ 2024లో గోవాలో జరిగిన అంతర్జాతీయ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. స్పందించిన ఛైర్మన్ శ్రీనివాసరావు వెంటనే శాప్ ఛైర్మన్ రవినాయుడుతో ఫోన్‌లో మాట్లాడి క్రీడాకారునికి సహకరించాలని కోరారు.

# బ్రాహ్మణులు ఐక్యతతో సాగాలి

జూపూడి రంగరాజును సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘ నేతలు

**గోరంట్ల, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ న్యూ ఇన్నర్ రింగ్ రోడ్డులోని గాయత్రీ మాత ఆలయం వద్ద ఆదివారం బ్రాహ్మణుల కార్తిక సమారాధన జరిగింది. కార్యక్రమానికి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలితశాస్త్రి అధ్యక్షత వహించారు. వన సమారాధనలో భాగంగా హిందూ ఫార్మసీ కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, డాక్టర్ రఘు, వివిధ రంగాల్లోని 20 మంది ప్రముఖులను సన్మానించారు. తొలుత ఉదయం నుంచి దామోదర పూజ, రుద్రాభిషేకాలు, లలిత సహస్రనామ పారాయణం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్, మాచిరాజు మురళీకృష్ణ, గొల్లపూడి గిరిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిపథ్‌పై అవగాహన సదస్సు 18న

**కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే:** అగ్నిపథ్‌పై ఈ నెల 18న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో సదస్సు జరుగుతుందని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారులు అర్హత కలిగిన విద్యార్థులకు, ఆసక్తి ఉన్న యువతకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నిపథ్ నియామకాలకు సంబంధించిన వివరాలు తెలపనున్నట్లు 12వ ఎయిర్‌మెన్ సెలెక్షన్ కేంద్రం వింగ్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ షేక్ యాకుబ్ అలీ తెలిపారు. ఆసక్తి ఉన్న యువత సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చెరువులో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

**తాడికొండ, న్యూస్‌టుడే:** తాడికొండలోని అక్కదేవత చెరువు కట్టపై చేపట్టిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపారు. చెరువు భూమిలో గత కొద్ది రోజులుగా ఇరువర్గాలు వారు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు నోటీసులు ఇచ్చి హెచ్చరించినా పట్టించుకోలేదు. ఆ ప్రాంతంలో 145 సెక్షన్ కింద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఓ వర్గం వారు తొలగించి శనివారం నిర్మాణాలు చేపట్టారు. తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్, సీఐ వాసు, ఈవోపీఆర్డీ రమణలు వద్దని నచ్చజెప్పినా వారు వినిపించుకోకుండా అధికారుల విధులకు అడ్డుపడి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో తాడికొండలో ఆదివారం 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్, సీఐల ఆధ్వర్యంలో భారీ జేసీబీల సహాయంతో ఇరువర్గాలు నూతనంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా జేసీబీతో చెరువు భూమి చుట్టూ భారీ కాలువ తవ్వారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వాసు హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో ఈ తొలగింపు ప్రక్రియ పూర్తి కావడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

### విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

శనివారం అక్రమ నిర్మాణాలు చేస్తూ ఓ వర్గం వారు అధికారుల విధులను అటంకం కలిగించారు. 145 సెక్షన్ హెచ్చరిక బోర్డును తొలగించారు. సర్దిచెప్పేందుకు వచ్చిన పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులతో దురుసుగా మాట్లాడుతూ బెదిరింపులకు గురిచేశారు. దీంతో ఆ వర్గానికి చెందిన 15 మందిపై తాడికొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని సీఐ వాసు తెలిపారు.

# ఆదిత్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్

శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆదిత్యాలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం**

# బాలలకు నచ్చిందే బాల సాహిత్యం

సన్మానితులతో నిర్వాహకులు, అతిథులు

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** బాలలకు నచ్చిందీ.. వారు మెచ్చిందే బాల సాహిత్యమని సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సభలో ఆయన 'బాల సాహిత్యం ఎలా ఉండాలి' అనే అంశంపై ప్రసంగించారు. సాహితీవేత్త పూసపాటి కృష్ణసూర్యకుమార్ సభకు అధ్యక్షత వహించారు. రంగారావు మాట్లాడుతూ సందేశాలు, సామాజిక చైతన్య ప్రబోధ గీతాలు ప్రాథమిక దశలో బాలసాహిత్యం కిందకు రావన్నారు. ప్రాథమిక దశలో పిల్లలకు ఆనందాన్ని, వినోదాన్ని కలిగించే సాహిత్యమే బాల సాహిత్యమని వివరించారు. మాధ్యమిక దశ నుంచి మాత్రమే విద్యార్థులకు సందేశం, విలువలు తదితర విషయ ప్రధాన రచనలు అందించవచ్చన్నారు. పిల్లల భాష, భావాలు, ఆసక్తులు, ఆనందాలు ప్రతిఫలించే గేయాలు, కథలు ఉత్తమ బాల సాహిత్యం అవుతుందని, దానిని సృజించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంబరాజు రమణి నిర్వహణలో విద్యార్థులు పాటలు, పద్యాలు వినిపించారు. ఈ మాసం కవిగా మేడిశెట్టి సుభద్రాకృష్ణ పలు కవితలు వినిపించారు. కవులు అరటి తొక్క అనే అంశంపై ఆసక్తికర కవితలు వినిపించారు. ఆగస్టు నెల ఉత్తమ కవిగా ధనుంజయరెడ్డిని, సెప్టెంబరు ఉత్తమ కవిగా సుభద్రాకృష్ణను సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి.సేవకుమార్ సత్కరించారు. నిక్కచ్చి కవిత పోటీ విజేత చల్లా సత్యవతికి శాంతశ్రీ ట్రస్ట్ వారు నగదు బహుమతి అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ రికార్డులు సాధిస్తున్న పూసపాటి కృష్ణసూర్యకుమార్‌ను నిర్వాహకులు సత్కరించారు.

# అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు

## ఏడాదిలో 101 ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

స్వాధీనం చేసుకున్న రాగితీగలతో నిజామాబాద్ సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

**నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే:** ఏడాది కాలంగా తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి.. రాగి తీగలను చోరీచేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని పోలీస్ కమిషరేట్‌లో సీపీ సాయిచైతన్య ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం గన్నారం వద్ద ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన 8 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇదే జిల్లాలోని పలు మండలాల్లో 101 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిల్లోని విలువైన రాగి తీగలను చోరీచేసినట్లు అంగీకరించారు. ఈ ముఠాపై ఇప్పటికే 44 కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది. పట్టుబడిన వారిలో మహారాష్ట్ర అహ్మద్‌నగర్‌కు చెందిన సుధాకర్(45), యూపీకి చెందిన హర్‌బీర్ శర్మ(50), ఏపీలోని గుంటూరుకు చెందిన అలీఅహ్మద్(41), ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు(24), మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాపూర్‌కు చెందిన రవీందర్(42), కర్ణాటక రాష్ట్రం ఇండ్లూరుకు చెందిన లింగప్ప(24), సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన గాజుల శ్రీశైలం(60), హైదరాబాద్ ముషీరాబాద్ వాసి అయిన మహ్మద్ హైదర్(24) ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఇదే ముఠాకు చెందిన అనిల్, వలీ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 40 కిలోల రాగి తీగలు, రూ.5.50 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఏసీపీ, డిచ్‌పల్లి సీఐ వినోద్, ఎస్సైలు సందీప్, షరీఫ్‌బీ, మహేశ్, సిబ్బందిని సీపీ అభినందించారు.

# రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో విజేతలు వీరే..

(గ్రూపు-5, 4లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించిన క్రీడాకారులతో అతిథులు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే :** విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ (గ్రూపు- 5, గ్రూపు- 4 బాల, బాలికల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో (గ్రూపు-5 బాలికల విభాగంలో ఆర్.జస్విత (ఎన్టీఆర్), బాలుర విభాగంలో టి.జశ్వంత్ (గుంటూరు), గ్రూపు- 5 బాలికల విభాగంలో పి.జాహ్నవి (అనంతపురం), వేదాంత్ గౌతమ్ పాంచాల్ (విశాఖ) వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. కృష్ణా జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం ఉదయం వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘం ఛైర్మన్ డాక్టర్ రవికాంత్ కొంగర, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా సంఘం ఛైర్మన్ యలమంచిలి వెంకట సురేష్, అధ్యక్షుడు డీవీడీవీ భాస్కర్, కోశాధికారి పి.బాల మురళీకృష్ణ, స్విమ్మింగ్ పూల్ ఇన్‌ఛార్జి యు.అనిల్, రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘ కార్యదర్శి ఎ.మోహన వెంకటరామ్, కోశాధికారి ఐ.రమేష్, కృష్ణా జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఝాన్సీలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవానికి ఎ.మోహన వెంకటరామ్, పి.బాల మురళీకృష్ణ, వి.వినోద్, ఐ.రమేష్ అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు.

**వ్యక్తిగత విభాగాల్లో విజేతలు :** గ్రూపు- 5 బాలుర విభాగం 50 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో కె.అభిరామ్, కె.మోక్షిత్ కృష్ణ (శ్రీకాకుళం), కె.అనయ్ రాజు (విశాఖ), 50 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో టి.జశ్వంత్ (గుంటూరు), పి.యువ గణ చిట్టి (విశాఖ), కె.అభిరామ్ (శ్రీకాకుళం), 50 మీ. బటర్ ఫ్లైలో సీహెచ్ ఇషాన్, టి.జశ్వంత్ (గుంటూరు), ఎం.ధ్రువ (విశాఖ), 50 మీ. ఫ్రీ స్టైల్‌లో టి.జశ్వంత్ (గుంటూరు), సీహెచ్ ఇషాన్ (గుంటూరు), బి.కేతన్ మిహీర్ (విశాఖ) వరుసగా తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

# చాకుతో పొడిచి రూ.350 దోపిడీ

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే :** చాకుతో పొడిచి దోపిడీకి పాల్పడిన ఘటనపై ఆదివారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని ఖమ్మం పట్టణానికి చెందిన చినబాబు దివ్యాంగుడు. ఎంఏ, బీఈడీ చదువుకున్నాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. కోచింగ్ తీసుకోవడానికి వారం రోజుల కిందట గుంటూరులోని ఏఈఎల్‌సీ పాస్టర్‌ను కలిసి ఆర్థిక సహాయం కోరగా.. ఆయన ఈనెల 16వ తేదీ ఆదివారం రమ్మన్నారు. ఈక్రమంలో చినబాబు శనివారం ఖమ్మం నుంచి గుంటూరు వచ్చేసరికి రాత్రి 10-30 గంటలు కావడంతో చర్చి తాళాలు వేసి ఉన్నాయి. ఎక్కడికి వెళ్లాలో తెలియక అక్కడే ఉన్నాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ముగ్గురు యువకులు వచ్చి చాకుతో గాయపరిచి చంపుతామని బెదిరించి.. అతని వద్ద ఉన్న రూ. 350 దోపిడీ చేసి పరారయ్యారు. బాధితుడు నగరంపాలెం పోలీసుస్టేషన్‌కు వచ్చి తనను కత్తితో గాయపరిచే సమయంలో మాట్లాడిన తీరును బట్టి నిందితుల పేర్లు సతీష్, వెంకటకృష్ణారెడ్డి, హరీష్‌గా తెలిపి వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.


EENADU Classifieds

**BUSINESS SERVICES**

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**PEOPLE CARE**

**OLD AGE HOME**

**గాయిత్రి గ్రూపు,** VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233.

**REAL ESTATE**

**GENERAL**

**గుంటూరు-సత్తెనపల్లి హైవే,** కొత్త 4 లైన్ల ORR అనుకొని, నలంద కాలేజి ఎదురు, గేటెడ్ కమ్యూనిటీలో ఇళ్ళ ప్లాట్లు కలవు. 96447 77888, 7036722521.

**TO LET**

Commercial Space for Rent 2500 sft Opp: ASN college, Tenali. Cont no: 63026 41154.

3BHK Independent House with veranda for Rent in Guntur (Opp Green Lawn School, Ponnur Road) Contact: 94903 77220.

**COMMERCIAL**

**గుంటూరు, అరండల్‌పేట,** 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/ Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

**JOBS**

Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 year experience in tally. Cont: 91333 99257.

Wanted MBA Marketing/ Business Development/ Supply Chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257.

Wanted Shop Keepers Salary 10,000/- Shift: 8Hrs Etukuru Rd & Nalla Cheruvu Raithanna Milk Dairy, Guntur 82475 95344.

**గుంటూరులోని శానిటరీ షాపులో** కంప్యూటర్ బిల్స్‌చేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M) కావలెను. వ|| 30సం||లోపు, జీ||12K-15K. ✆ 9493656892.

**DSA ఏజెన్సీ** గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

**ప్రముఖ కలెక్షన్** ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: (15Kto20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

**ప్రముఖ స్టార్** హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు సౌత్ ఇండియన్ ఆల్‌రౌండర్ మాస్టర్స్, వంటమాస్టర్స్, తందూరి అసిస్టెంట్స్, కటర్స్, రెస్టారెంట్ కెప్టెన్స్, చైనీస్ & ఇండియన్ అసిస్టెంట్స్, పార్సిల్ కౌంటర్ సిబ్బంది కావలెను. అనుభవమును బట్టి మంచి జీతం ఇవ్వబడును. 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

**మహానాడు మీడియా,** గుంటూరు నందు పనిచేయుటకు 'వీడియో ఎడిటింగ్' లో అనుభవం ఉన్న వారు కావలెను. సంప్రదించండి. Ph: 73372 22004.

**గుంటూరు నారాకోడూరు** ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డు 8 గ. పది వేలు సె. సూపర్‌వైజర్స్ 8 గ. 13 వేలు, ప్రముఖ బట్టలషాపులో సెక్యూరిటీగా 12 గ. 12 వేలు వయస్సు 50 Y. లోపు, 10th. ✆: 85209 77729, 85209 77759.

**గుంటూరులోని ప్రముఖ** లిఫ్ట్ కంపెనీ నందు పనిచేయుటకు M(21) ఎంప్లాయిస్ కావలెను. ✆: 99083 10004.

**ప్రముఖ కన్‌స్ట్రక్షన్** కంపెనీలో మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. జీతం: 10,000 నుండి 15000+ ఇన్‌సెంటివ్స్. ✆: 83282 68208, 70138 73164.

**టెలీకాలింగ్ ఫ్రమ్** హోమ్, ఆఫీసు వర్క్ చేయుటకు M/F కావలెను. Age: 18 to 35, జీతం: 18K to 25K. ✆ 84640 16870, 86394 39870.

**FACULTY/ TEACHERS**

**అనంతపురం టౌన్** రఘుసైనిక్ స్కూల్ నందు High School English & Spoken English అనుభవం కల్గిన టీచర్స్‌కావలెను. ✆ 79810 45257.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541



91.9 FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297



ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589


(c) eenadu

తెనాలి
• తెనాలి • పొన్నూరు

## కార్యసిద్ధి వినాయకునికి పుష్పాభిషేకం

పొన్నూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పట్టణ పరిధి నిడుబ్రోలులోని కార్యసిద్ధి వినాయకునికి 130 కేజీల పూలతో పుష్పాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## ఉచిత వైద్య సేవలు

తెనాలిటౌన్: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా తెనాలి ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు కఠెవరంలో ఆదివారం ఇంటింటికి తిరిగి మధుమేహం, రక్త పోటు, హిమోగ్లోబిన్ స్థాయుల పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య సేవలు అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థులతో హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీడీ దైసిరాణి

పొన్నూరు: కాకినాడలో ఈ నెలాఖారులో జరిగే జిమ్నాస్టిక్స్ పోటీలకు దొప్పలపూడి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జ్యోతిర్మయి ఆదివారం తెలిపారు. అండర్-14 ఆర్టిస్టిక్ బాలికల విభాగంలో షేక్ బాజీ, అఫ్రోజా, డి. విజయలక్ష్మి, అండర్-17 ఆర్టిస్టిక్ బాలికల విభాగంలో సీహెచ్ షారోన్‌కుమారి, అండర్-17 రిథమిక్ బాలికల విభాగంలో ఎన్.డి. షాపియా, అండర్-19 రిథమిక్ బాలికల విభాగంలో ఐ.ప్రవళిక ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎం జ్యోతిర్మయి, పీడీ దైసిరాణి, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

## మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు

ఆలయ ప్రాంగణంలో రద్దీగా..

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం పురస్కరించుకొని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి మహిళా భక్తులు ఆలయంలో దీపారాధన పూజలు నిర్వహించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానికి వెళ్లే భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను ఈవో గోగినేని లీలాకుమార్ పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవా టిక్కెట్ల రూపంలో ఒక్క రోజులోనే రూ.8.5 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో చెప్పారు. వేల సంఖ్యలో వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు.

### స్వామివారి సేవలో న్యాయమూర్తులు

పెదకాకాని మల్లేశ్వరస్వామిని గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి జి.స్రవంతి, చిలకలూరిపేట కోర్టుకు చెందిన ఐ.స్వాతి దంపతులు ఆదివారం దర్శించుకున్నట్లు ఈవో గోగినేని లీలాకుమార్ చెప్పారు. ప్రదక్షిణల అనంతరం న్యాయమూర్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనాలు అందించినట్లు ఈవో తెలిపారు.

## రద్దీ మార్గాల్లో తొలగనున్న ప్రయాణ కష్టాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే:

తెనాలి-విజయవాడ ప్రధాన మార్గంలో గుంతల పూడ్చివేత పనులు

తెనాలి నుంచి ఇతర జిల్లాలకు అనుసంధానంగా ఉన్న రద్దీ మార్గాల్లో ప్రయాణాలకు ఇప్పటి వరకు ఉన్న ఇబ్బందులు ఇకపై తొలగనున్నాయి. కీలకమైన తెనాలి నుంచి విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే దారుల్లో ప్రస్తుతం మరమ్మతులు జరుగుతున్నాయి. విజయవాడ మార్గంలో తెనాలి పట్టణ శివారు నుంచి నందివెలుగు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర, గుంటూరు మార్గంలో అంగలకుదురు గ్రామ పరిధిలో గోతులు పూడ్చే పనులు కొద్ది రోజుల కిందట ప్రారంభమై తుది దశకు చేరాయి.

★ తెనాలి నుంచి మంగళగిరి మీదుగా విజయవాడ మార్గం, నారాకోడూరు మీదుగా గుంటూరు మార్గం రెండూ నిత్యం రద్దీగా ఉంటాయి. తెనాలి నుంచి నందివెలుగు రోడ్డు కొలకలూరు మీదుగా గుంటూరుకు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మార్గానికి, రెండో వైపు కొల్లిపర మండలానికి రాకపోకలకు కీలకం. అదే విధంగా తెనాలి నుంచి గుంటూరు రోడ్డు, నడుమ ఉన్న నారాకోడూరు మీదుగా పొన్నూరు, బాపట్ల ప్రాంతాలకు వెళ్లడానికి ప్రధాన దారి. ఈ నేపథ్యంలో రోజూ వేలాది వాహనాలు, లక్షలాది మంది ప్రజలు వచ్చిపోయే క్రమంలో.. రోడ్లు బాగా దెబ్బతిని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో సత్వరం మరమ్మతులు పూర్తి చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు చేపట్టారు. కాగా ఈ రెండు ప్రధాన మార్గాలను నాలుగు వరుసలుగా విస్తరిస్తామని మంత్రి ఇప్పటికే ప్రకటించారు. అందులో భాగంగా ప్రస్తుతం డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందుతోంది.

## వేడుకగా సత్యనారాయణస్వామి వ్రతం

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం తెనాలి వైకుంఠుని సన్నిధిలో సామూహిక రమా సహిత సత్యనారాయణ వ్రతం వైభవంగా నిర్వహించారు. 160 మంది దంపతులు ప్రత్యేక వ్రత పూజలు చేశారు. అర్చకులు వ్రత విశిష్టతను వివరించారు.

## కనులపండువగా పడిపూజ



కార్యక్రమంలో సినీ నటుడు సుమన్, మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సినీ నటుడు సుమన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాయిబాబు, బాలాజీ పర్యవేక్షించారు.

## భక్తిశ్రద్ధలతో కార్తికమాస పూజలు

వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పొన్నూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పట్టణ పరిధిలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మహిళలు దీపారాధన చేసి లింగానికి ప్రత్యేక పూజలు చేశారు.

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా సరస్వతీదేవి పూజ విశిష్టతను పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి వివరించారు. ఆయన ఆధ్వర్యంలో గాడివారి సెంటర్‌లో నిర్వహించిన సరస్వతీదేవి పూజలో పాల్గొన్నారు. కంకిపాటి రమేష్, అన్నపూర్ణ దంపతులు, సాలిగ్రామ మఠం ట్రస్టు సభ్యులు రమణయ్య పాల్గొన్నారు.

కొల్లిపర, న్యూస్‌టుడే: కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గ్రామంలోని జనార్దనస్వామి ఆలయంలో కార్తిక పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ కమిటీ పర్యవేక్షణలో సహపంక్తి భోజనాలు చేశారు.

పూజలందుకుంటున్న సరస్వతీ దేవి

కొల్లిపర: సత్యనారాయణస్వామికి పూజలు

## సంఘం బలోపేతానికి కృషి

నటరాజ విగ్రహానికి పూలమాలలు వేసిన రచయిత సాయిమాధవ్, కళాకారులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: సంఘం బలోపేతానికి కృషి చేయనున్నట్లు సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ పేర్కొన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశం, కార్తిక వనసమారాధన ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కళాకారులు నటరాజు విగ్రహానికి పూలమాలలు అలంకరించారు. కార్యదర్శి ఆదినారాయణ, కోశాధికారి ఎం. రామలింగేశ్వరరావు, సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, కార్యనిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు, కార్యక్రమ గౌరవాధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## సమాజ సేవలో పాలుపంచుకోవాలి

వ్రతంలో ఆర్యవైశ్య మండల నాయకులు

పొన్నూరు, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు సమాజ సేవలో పాలుపంచుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాపనపల్లి లక్ష్మీ ప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని ఓ కల్యాణ మండపంలో మండల ఆర్యవైశ్య వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత పూజ చేశారు. సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ ఛైర్మన్ గుంటూరు మోహన్ శ్రీనివాస గుప్తా, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తెనాలిటౌన్: బెదిరింపులు, దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అటువంటి ప్రవర్తన ఉంటే మార్చుకోవాలని సీఐ సాంబశివరావు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## 'వ్యాపారం మోసం కాకూడదు'

కొల్లిపర, న్యూస్‌టుడే: వ్యాపారం మోసంతో కూడుకున్నది కాకూడదని తూనికలు కొలతల శాఖ అధికారి శేషసాయి అన్నారు. ఆదివారం కొల్లిపర పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. మాంసం, కూరగాయల దుకాణాల్లో తూనికల యంత్రాలను పరిశీలించారు. మోసపూరిత కాటాలను వినియోగించిన ఏడుగురిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

తెనాలి టౌన్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని, వాహనాలు నడుపుతున్న ఇరువురు గాయపడిన ఘటన బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.




## వంతెన నిర్మాణం పూర్తి

పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీ హిందూ శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో సాగు నీటి కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నూతన వంతెన నిర్మాణ పనులకు రూ.3.25 లక్షలు నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరు చేసినా వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదని అక్టోబరు 7న 'మాటలకే సరి.. పనులేవి మరి.?' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పురపాలక సంఘ అధికారులు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- పొన్నూరు, న్యూస్‌టుడే

## కొత్త రేకు బిగించరూ..

మహాత్మాగాంధీ మున్సిపల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ పైకప్పునకు బిగించిన ప్లాస్టిక్ రేకు విరిగింది. వర్షాలు కురిసినప్పుడు నీరు సెల్లార్లో పడుతోంది. ఇది తీవ్ర అసౌకర్యంగా ఉందని కొత్త రేకు బిగించాలని ఉద్యోగులు, వ్యాపారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ చెంచుపేట ఉమేష్‌చంద్ర విగ్రహ కూడలిలో రోజూ ఉదయం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అత్యవసరంగా రాకపోకలు సాగించే వారికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. **- భాస్కర్, నరేంద్రకుమార్ - తెనాలి.** ✔ రద్దీ సమయంలో పర్యవేక్షణకు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. **- బి.జనార్దనరావు, డీఎస్పీ**

? తెనాలి పట్టణ ఐతానగర్ గోలిడొంక రోడ్డులో నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలం ఇటీవల కురిసిన వానలకు చెరువుగా మారింది. దోమలు, దుర్వాసన అధికమై ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు, ఐతానగర్.** ✔ క్షేత్ర పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్.**

స్పందనకు వందనం

❖ తెనాలి పట్టణ గంగానమ్మపేట పాత శివాలయం రోడ్డులో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నామని చోదకుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు స్పందించారు. ట్రాఫిక్ పర్యవేక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

❖ పాండురంగపేటలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

? పొన్నూరు పరిధిలోని ఇస్లాంపేట శివారులో వీధి దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేపట్టండి **- షేక్ రియాజ్, ఇస్లాంపేట.** ✔ పాడైపోయిన వీధి దీపాలను బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీరు**

? పొన్నూరు పరిధిలోని 7వ వార్డులో చెత్త పేరుకుంది. **-కె.ఏడుకొండలు, 7వ వార్డు** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

పట్టణ పరిధిలోని పాత పొన్నూరు మురుగు నీటి కాలువలో చెత్త పేరుకుందని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పేరుకున్న వ్యర్థాలను కార్మికులతో తొలగింపజేశారు.

**- న్యూస్‌టుడే, పొన్నూరు**

## ధ్యాన సత్సంగం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం కొలకలూరులో శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యాన సత్సంగం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సాధకులు హాజరయ్యారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

తెనాలి టౌన్: బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన పవన్‌తేజ (24) బీటెక్ నాలుగో ఏడాది చదువుతున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా తల్లి మందలించింది. అనంతరం తన గదిలోకి వెళ్లిన పవన్‌తేజ ఫ్యానుకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు

కొత్తపేట: శాఖా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న రచయిత మల్లేశ్వరరావు, కవి సుబ్రహ్మణ్య

తెనాలి (కొత్తపేట): గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. దివారం స్థానిక శాఖ, మహిళా బాలల గ్రంథాలయాల్లో వేర్వేరుగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. త్రీ టౌన్ సీఐ ఎస్ సాంబశివరావు, రచయిత అయినాల మల్లేశ్వరరావు, రంగస్థల పౌరాణిక నటులు, కవి పాతూరు సుబ్రహ్మణ్య, విశ్రాంత గ్రంథపాలకులు మొవ్వా సుబ్బారావు, స్వరలయ వేదిక అధ్యక్షుడు సాయి లక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. పెదకాకానిలోని గ్రంథాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

కొల్లిపర, న్యూస్‌టుడే: గ్రంథాలయోద్ధారకులను మననం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్నంగి శాఖా గ్రంథాలయాధికారి జి.జ్యోతి అన్నారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మున్నంగిలో..

నందివెలుగులో చిత్రలేఖన పోటీలు..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నందివెలుగు గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సంగంజాగర్లమూడి గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించి.. ప్రతి ఆదివారం గ్రంథాలయానికి రావాలని సూచించారు. బొల్లు మాధవి, సుబ్బారావు పర్యవేక్షించారు.

## సందడిగా వనసమారాధనలు

జేఎంజే కళాశాలలో.. ప్రసంగిస్తున్న మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ రాజకుమారి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా కమ్మ, కాపు, శాలివాహన, కొండవీటి సేవా సమితి, వాసవీ సేవా సమితి, విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో వేర్వేరుగా నిర్వహించిన వనసమారాధన కార్యక్రమాలు సందడిగా సాగాయి. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, మహిళా కమిషన్ మాజీ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, కిలారి రోశయ్య, మంత్రి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం, పారిశ్రామిక వేత్తలు కొత్త సుబ్రహ్మణ్యం, రామచంద్రబాబు, కనకదుర్గ ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు తోటకూర వెంకటరమణరావు, కౌన్సిలర్ సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వెంకట్రావు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: వడ్లమూడి తోటలో జరిగిన గౌడ సంఘం వనసమారాధనకు మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, బీసీ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: చెరుకూరి రమేష్‌బాబు, కొల్లిమర్ల పోతురాజు ఆధ్వర్యంలో బాలాజీరావుపేట, పినపాడులో వేర్వేరుగా భక్తులకు అన్నదానం చేశారు. త్రీటౌన్ సీఐ సాంబశివరావు భక్తులకు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ❖ యోగి వేమారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంగం జాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో రెడ్ల కార్తిక వనసమారాధన సందడిగా నిర్వహించారు.

ఏఎంసీ ఆవరణలో... మాట్లాడుతున్న మంత్రి మనోహర్ సతీమణి మనోహరం, వేదికపై అతిథులు

గౌడ సంఘం వనసమారాధనలో మంత్రి అనగాని సత్యప్రసాద్

## 25న రాజధానిలో నవ నాగుల ప్రతిష్ఠ

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఈ నెల 25న పంచమి సందర్భంగా మందడంలోని శ్రీషణ్ముఖ వారాహీ పీఠంలో నవ నాగుల ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా 24న వారాహి కోవెల, మధురై, తమిళనాడుకు చెందిన శంకరేశ్వరస్వామి ఆధ్వర్యంలో 11వ అగ్నిగుండ కావడి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు షణ్ముఖ వారాహీ పీఠం గురుస్వామి నండూరి రమేష్ తెలిపారు. మురుగన్ గురుస్వామి అగ్నిగుండ ప్రవేశం, కావడి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామికి 13,200 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేస్తారు. రాజధాని గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## బహిరంగ ప్రకటన

నా క్లయింటైన ఇండియన్ బ్యాంక్, మారీసుపేట బ్రాంచ్, తెనాలి రిప్రజంటెడ్ బై ఇట్స్ మేనేజర్ సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తెనాలి గంగానమ్మపేట కాపురస్తురాలు అమిరినేని రామారావు గారి భార్య అమిరినేని విజయలక్ష్మి గారు ది. 07-07-1977వ సం॥లో అక్కల మధుసూదనరావు గారి నుండి క్రయం పొంది తెనాలి ఎస్.ఆర్.ఓ.లో డాక్యుమెంట్ నెం: 1816/1977గా రిజిష్టర్ పొంది సర్వహక్కులతో అనుభవించుచున్నారు. తదుపరి అమిరినేని విజయలక్ష్మి గారు తన మొదటి కుమారుడైన అమిరినేని హేమకుమార్‌కు షెడ్యూల్ ఆస్థిలో ఫస్ట్ ఫ్లోర్లోని పడమరవైపు భాగం 63 గ॥లు స్థలం, డాబా పోర్షన్ని దఖలు పరచి డాక్యుమెంట్ నెం: 2732/2000 గా రిజిష్టర్ చేసియున్నారు. అదేరోజున చిన్న కుమారుడైన అమిరినేని లీలామోహన్‌రావుకు షెడ్యూల్ ఆస్థిలో ఫస్ట్ ఫ్లోర్ లోని తూర్పువైపు భాగం 63 గ॥లు స్థలం, డాబా పోర్షన్ని దఖలు పరచి డాక్యుమెంట్ నెం: 2733/2000 గా రిజిష్టర్ చేసియున్నారు. మిగతా ఆస్తిని అమిరినేని విజయలక్ష్మి గారి స్వాధీనములో ఉంచుకొనియున్నారు.

దరిమిలా 2024వ సం॥లో జులై నెలలో సదరు విజయలక్ష్మిగారు డాక్యుమెంట్ నెం: 1816/1977ను జిరాక్స్ నిమిత్తం తీసుకెళ్ళగా సదరు డాక్యుమెంట్ ఒరిజినల్ పోయినది. సదరు విషయం తెలుపుతూ విజయలక్ష్మి గారు తెనాలి రూరల్ పోలీసువారికి కంప్లయింట్ ఇవ్వగా, సదరు పోలీసువారు వెతకగా డాక్యుమెంట్ దొరకకపోవటం వలన పోలీసువారు సదరు విషయాన్ని ధృవీకరిస్తూ ది. 24-07-2024న ఒక సర్టిఫికెట్ ఇష్యూ చేసియున్నారు. తదుపరి ది. 22-10-2025న అమిరినేని విజయలక్ష్మి గారు తన ఇద్దరు కుమారులకు దఖలు పరచి రిజిష్టర్ చేసినటువంటి గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్స్: 2732/2000, 2733/2000 లను వాస్తురీత్యా సరిగాలేని కారణంగా ఉభయపార్టీలు వివాదం పడుతున్న కారణంగా వారి శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాల ప్రకారం ఉభయపార్టీలు అంగీకారంతో పై తెల్పిన రెండు గిఫ్ట్ డీడ్లు రద్దు డాక్యుమెంట్స్ : 5025/2025, 5026/2025 ద్వారా రద్దు చేసుకోవటం జరిగింది.

దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని తెనాలి గంగానమ్మపేట కాపురస్తులు కొండవీటి జయప్రసాద్ రావు గారి కుమారుడు కొండవీటి నాగ యశ్వంత్ కొనుగోలు చేయుటకు ఖరారుపడి అమిరినేని విజయలక్ష్మి గారి నుండి ది. 24-10-2025వ తేదిన విక్రయ అగ్రిమెంట్ వ్రాసుకోవటం జరిగింది. సదరు కొండవీటి నాగ యశ్వంత్ షెడ్యూల్ ఆస్థి కొనుగోలు నిమిత్తం నాక్లయింటైన తెనాలి మారీసుపేట ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గారిని సంప్రదించి లోన్ కొరకు దరఖాస్తు చేసుకొనియున్నారు. కావున దిగువ షెడ్యూల్ ఆస్థిపై ఎవ్వరికైన ఎటువంటి హక్కులుగాని, అప్పులు గాని, క్లయిమ్స్ గాని, చార్జెస్ గాని, అభ్యంతరాలు గాని ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోగా తెలుపగలరు. ఎటువంటి ఆక్షేపణలు రానియెడల సదరు ఆస్తి నిప్పేచి ఆస్థిగా బావించి నా క్లయింటు లోన్ మంజూరు చేసెదరు. తదుపరి వచ్చు పరిణామాలు నాక్లయింటు హక్కులను బద్ధపరచజాలవని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

**షెడ్యూల్** : గుంటూరు డి., తెనాలి సబ్ డి., యిలాకా తెనాలి మున్సిపల్ టౌన్ సర్వే దాఖలా 9వ వార్డు, 3వ బ్లాకు, టి.యస్.నెం. 95రు య. 0-04 ట్లులో చ.గ. 150 లున్నూ, టి.యస్.నెం. 98రు య. 0-11 ట్లులో చ.గ. 50 లున్నూ టి.యస్.నెం. 99రులో య. 0-05 ట్లులో చ.గ. 3.3.0 లున్నూ వెరశి మూడు నెంబర్లు భూమిపై ఏకఖండముగా ఉన్న మింజుమలె చ.గ. 203-33 లు స్థలము, అందలి ఆర్.సి.సి. గ్రౌండ్ ఫ్లోర్, ఆర్.సి.సి. ఫస్ట్ ఫ్లోర్ మేడ ఇంటికి హద్దులు
**తూర్పు** : అశోక్ కుమార్, మహేంద్రకుమార్, రంజిత్‌కుమార్ వగైరాల ఆస్తి హద్దు అ. 61-6 అం॥లు. **దక్షిణం** : పువ్వాడ మాధవరావు గారి ఆస్తి హద్దు అ. 33-6 అం॥లు. **పడమర** : తాడిబోయిన విజయలక్ష్మి వగైరాల ఆస్తి హద్దు అ. 60-6 అం॥లు. **ఉత్తరం** : గౌడపర్తివారి వీధి అనే మున్సిపల్ బజారు హద్దు అ. 26-6 అం॥లు.

ఈ హద్దుల మధ్య చ.గ. 203-33 లు లేక చ.మీ. 170-00 ర్లు స్థలము, ఇందలి చ.అ. 930 లలో గ్రౌండ్ ఫ్లోర్ ఆర్.సి.సి. డాబా, చ.అ. 252 లలో గ్రౌండ్ ఫ్లోర్ ఆర్.సి.సి. డాబా, చ.అ. 78 లలో ఆర్.సి.సి. లెట్రిన్ బాత్రూమ్ మరియు చ.అ. 930 లలో ఫస్ట్ ఫ్లోర్ ఆర్.సి.సి. మేడ, లెట్రిన్ బాత్రూమ్ .

తాడిబోయిన బుచ్చిరాజు, అడ్వకేట్, నాజరుపేట, తెనాలి. సెల్: 98481 24864

(c) eenadu

# మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

## 25న వారాహి పీఠంలో నవ నాగుల ప్రతిష్ఠ

**తుళ్లూరు, న్యూస్‌టుడే:** ఈ నెల 25న పంచమి సందర్భంగా మందడంలోని శ్రీషణ్ముఖ వారాహి పీఠంలో నవ నాగుల ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా 24న వారాహి కోవెల, మధురై, తమిళనాడుకు చెందిన శంకరేశ్వరస్వామి ఆధ్వర్యంలో 11వ అగ్నిగుండ కావడి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు షణ్ముఖ వారాహి పీఠం గురుస్వామి నందూరి రమేష్ తెలిపారు. మురుగన్ గురుస్వామి అగ్నిగుండ ప్రవేశం, కావడి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామికి 13,200 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేస్తారు. రాజధాని గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? మోరంపూడి నుంచి పెదపాలెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.2 కోట్లు కేటాయించినా కంకర వేశారే తప్ప.. ఇంతవరకు తారు వేయలేదు. **- జె.నాగయ్య, మోరంపూడి**

✔ గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. వారం రోజుల్లో తారు వేసేలా చూస్తాం. **- నరసింహారావు, ఏఈ**

## అన్నదాన ప్రభువే.. శరణమయ్యప్ప

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** దుగ్గిరాలలోని శ్రీమణికంఠ అయ్యప్ప ఆలయం స్వాములకు అండగా నిలుస్తోంది. మధ్యాహ్న భోజనానికి(భిక్ష) ఇబ్బంది లేకుండా దశాబ్దాలుగా అన్నప్రసాదం అందిస్తోంది. ఆలయ భక్తుల సేవా కమిటీ పర్యవేక్షణలో మండల రోజుల పాటు నిరంతర ప్రక్రియగా సాగుతోంది. దీక్ష తీసుకున్న ఎవరైనా వచ్చి భోజనం చేసే విధంగా కమిటీ సేవలు అందిస్తోంది. నిత్యం 200 మంది ఇక్కడ భిక్ష స్వీకరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 25 రోజులుగా అన్నప్రసాదం అందిస్తున్నారు. అటు ఆలయ అభివృద్ధికి దాతలు ఇచ్చిన విరాళాలతో సమకూరిన నిధులను వృథా చేయకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

భోజనాలకు సిద్ధమైన మాలధారులు

## అధ్వాన దారి.. నరకంలా మారి..

మండల పరిధిలో యలవర్తిపాడు మేజర్ పంట కాలువ గట్టు అధ్వానంగా మారింది. దారి పొడవునా గుంతలు పడ్డాయి. వర్షం కురిస్తే బురద మయంగా మారుతుంది. నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తక్షణమే సంబంధిత అధికారులు రోడ్డు బాగు చేయాలని కర్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**- మేడికొండూరు, న్యూస్‌టుడే**

## ఆకతాయిల ఆగడాలను అడ్డుకోరేం?

తుళ్లూరు, న్యూస్‌టుడే

**రా**జధాని గ్రామాల్లో టిడ్కో గృహాల వద్ద ఆకతాయిల ఆగడాలు హద్దుమీరుతున్నాయి. రాజధాని ప్రాంతంలో భూమి, నివాసం లేని పేదలకు తెదేపా ప్రభుత్వం తుళ్లూరు మండలం అనంతవరం, తుళ్లూరు, దొండపాడు, మందడం, ఐనవోలు గ్రామాల్లో టిడ్కో గృహ సముదాయాలు నిర్మించింది. అర్హులైన వారికి కుల మత భేదం లేకుండా కేటాయించింది. కొన్ని ఇళ్ల లబ్ధిదారులకు ఇప్పటికీ కేటాయించకుండా ఖాళీగా ఉన్నాయి. కొంతమంది ఆకతాయిలు వీటి తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించి మద్యం తాగి జూదం ఆడుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. కొన్ని గృహాల్లో అసలైన లబ్ధిదారులు నివాసం ఉండకుండా వాటిని ఇతర ప్రాంతాల వారికి అద్దెకు ఇస్తున్నారు. అద్దెకు తీసుకున్న గదుల్లో ఆకతాయిలు మద్యం, గంజాయి సేవిస్తూ ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సముదాయాల చుట్టూ రక్షణగోడ నిర్మించాలని, రాత్రివేళ గొడవలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల తుళ్లూరు సీఐ-2 ఎం.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన అక్కడకు వెళ్లి నివాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిడ్కో గృహాల వద్ద మద్యం సీసాలు తొలగించి శుభ్రం చేస్తున్నారిలా..

**ఇదీ పరిస్థితి**

- గతంలో టిడ్కో గృహాల్లో ఉంటూ మద్యం సేవిస్తూ బైక్‌లు చోరీ చేసిన నిందితులను మంగళగిరి పోలీసులు అరెస్టు చేశారు.
- అనంతవరం టిడ్కో గృహాల్లో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఖాళీ గృహాల తాళాలు పగలగొట్టి మద్యం తాగుతూ జూదం ఆడుతున్నారు.
- ఐనవోలు టిడ్కో గృహాల్లో కొన్ని నెలల క్రితం కొద్ది మొత్తంలో గంజాయి తీసుకొచ్చిన వ్యక్తులను తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు.
- తాగిన మద్యం సీసాలను గృహాల మధ్య వదిలేయడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. ఇటీవల పంచాయతీ అధికారులు అక్కడి నుంచి భారీగా ఖాళీ మద్యం సీసాలను ట్రాక్టర్‌లో తరలించారంటే పరిస్థితి ఏ విధంగా ఉందే అర్థం చేసుకోవచ్చు.

## కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

**మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:** కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పట్టణంలోని బాపనయ్యనగర్(28 వార్డు)కు చెందిన తెదేపా నాయకుడు విన్నకోట శ్రీనివాసరావును ఆ పార్టీ నాయకులు ఆదివారం సత్కరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని విన్నకోట తెలిపారు. పార్టీ నాయకులు తురకా వీరశేఖర్, కోలా శ్రీనివాసరావు, దొడ్డాకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భజన బృందానికి అభినందన

**మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శివభక్త బృందం ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. బృంద సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బి.కోటేశ్వరరావు, శివాలయ ఈవో ఎన్.గోపి, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ రమేష్‌బాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు వెంకటసుబ్బారావు, బి.వాసు, శ్యామ్‌సుందర్‌శాస్త్రి, నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూరిల్లు దగ్ధం

**పేరకలపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే:** పేరకలపూడి దళితవాడలో శనివారం రాత్రి 11 గంటలకు జరిగిన అగ్నిప్రమాదంలో ఎస్.లక్ష్మికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఆ సమయంలో లక్ష్మితో పాటు ఆమె కూతురు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విద్యుత్తు మీటరు వద్ద ఎలుక చేరడంతో నిప్పురవ్వలు పడి ప్రమాదం జరిగింది. ఇంట్లో వస్తువులు మొత్తం కాలిపోయాయి. సంఘటన జరిగిన సమయంలో అంతా నిద్రలో ఉన్నారు. కాలిన కారణంగా వేడి రావడంతో ఒక్క ఉదుటన లేచి వారంతా బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం తప్పింది.

## నేడు సామూహిక సత్య వ్రతం

**మంగళగిరి, న్యూస్‌టుడే:** మంగళగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి చెందిన లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 9 గంటలకు సామూహిక సత్యవ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోగంటి సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

**తుళ్లూరు, న్యూస్‌టుడే:** జనవరి 4న విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని రాజధాని పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. ఈ విషయమై ఆదివారం సాయంత్రం తుళ్లూరులో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాజధానిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజధాని ప్రాంతం సీఐటీయూ కన్వీనర్ ఎం.భాగ్యరాజు, గోపిరాజు, సుఖవేణి, వీర్లంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి: దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న వంశీధరదాస

దుగ్గిరాల చెన్నకేశవ ఆలయంలో..



వట్టిచెరుకూరులో..

## కమనీయం.. లక్ష దీపోత్సవం

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** తాడేపల్లి మండలం కొలనుకొండ గోకుల క్షేత్రంలో ఈ నెల 20 వరకు జరుగనున్న లక్ష దీపోత్సవాన్ని హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు వంశీధరదాస శనివారం రాత్రి దీపాన్ని వెలిగించి ప్రారంభించారు. ఆదివారం లక్ష దీపాలను వెలిగించి దీపోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. లోక కల్యాణం కోసం హరినామ జపయజ్ఞం నిర్వహించారు. శ్రీకృష్ణలీలలను నృత్యరూపకంలో ప్రదర్శించారు. రోజూ భక్తులతో లక్ష దీపాలను వెలిగించి ఉత్సవం నిర్వహిస్తామని గోకులక్షేత్ర ప్రతినిధి విలాసదాస తెలిపారు. రఘునందనదాస తదితరులు పాల్గొన్నారు.

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం (విష్ణాలయం)లో ఆదివారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఎక్కువ సంఖ్యలో మహిళలు దీపోత్సవంలో పాల్గొన్నారు.

నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో..

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి దీపారాధన చేశారు. వరగానిలో వరసిద్ధి వినాయక ఆలయం వద్ద 11 కిలోల కర్పూర హారతి ఇచ్చారు. అనంతరం వన సమారాధన నిర్వహించారు.

**వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే:** వట్టిచెరుకూరు, పల్లపాడు, అనంతవరప్పాడు, ముట్లూరు, గారపాడు, కొర్నెపాడు, వింజనంపాడు, కాట్రపాడు, కారంపూడిపాడు గ్రామాల్లో పూజలు నిర్వహించారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి భరోసా

**ముట్లూరు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే:** మండలంలోని ముట్లూరులో ఇటీవల ప్రమాదానికి గురై మృతి చెందిన తెదేపా కార్యకర్త షేక్ షంషానాబేగం కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా మంజూరు పత్రాన్ని మండల నాయకులు ఆదివారం అందించారు. సాయం మంజూరుకు కృషి చేసిన మంత్రి నారా లోకేశ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుకు స్థానిక తెదేపా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మర్రి సాంబశివరావు, జగన్‌మోహన్‌రావు, శేషగిరిరావు, రాంబాబు, నాగిసెట్టి నాగరాజు, వెంకయ్య, పాపారాయుడు, సాంబశివరావులు ఉన్నారు.

బీమా మంజూరు పత్రాన్ని అందిస్తున్న నాయకులు

## బస్‌స్టాండ్ కూడలిలో ఈ-టాయిలెట్

**మంగళగిరి, న్యూస్‌టుడే:** నియోజకవర్గం నుంచి వివిధ సమస్యలపై మంగళగిరి వచ్చే ప్రజలు గతంలో మరుగుదొడ్లు లేక నానా అవస్థలుపడ్డారు. మంత్రి నారా లోకేశ్ సొంత నిధులతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈ-టాయిలెట్ నిర్మాణం చేపట్టారు. ఫ్యాబ్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ-టాయిలెట్‌ను ఎక్కడికైనా తీసుకెళ్లే సౌలభ్యం ఉంది. ఇప్పటికే మంగళగిరి కామేశ్వరి ఆలయం వద్ద దీని ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి మంగళగిరి వచ్చే ప్రజల సౌకర్యార్థం వీటిని ఆధునికంగా ఏర్పాటు చేస్తున్నారు. ఉచితంగా వీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

## ఓఆర్ఆర్ నిర్మాణానికి వేగంగా అడుగులు

మండలంలో సుమారు 600 ఎకరాల భూమి గుర్తింపు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

గుంటూరు-పర్చూరు రోడ్డును క్రాస్ చేసే ప్రాంతంలో మార్కింగ్

**రా**జధాని అమరావతి చుట్టూ ఓఆర్ఆర్ (బాహ్య వలయ రహదారి) నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. చేబ్రోలు మండలం వేజండ్ల, నారాకోడూరు, గుండారం, గొడవర్రులను కలుపుతూ వట్టిచెరుకూరు మండలంలోకి ఈ రహదారి ప్రవేశిస్తుంది. అనంతవరప్పాడు, వింజనంపాడు, చమళ్లమూడి, కుర్నూతల, పుల్లడిగుంట, కొర్నెపాడు గ్రామాల పంట పొలాల మీదుగా గ్రామీణ గుంటూరు మండలంలోని పొత్తూరు వైపునకు ఈ రహదారి నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ఇప్పటికే మార్కింగ్ చేశారు. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినప్పటికీ.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా తీరుతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఓఆర్ఆర్ నిర్మాణానికి ప్రభుత్వానికి అవసరమైన పంట భూముల గుర్తింపులో అధికారులు ఉన్నారు.

★ వట్టిచెరుకూరు మండలంలోని ఆరు గ్రామాలలో ఓఆర్ఆర్ నిర్మాణానికి అవసరమైన సుమారు 600 ఎకరాల పంట భూములను రెవెన్యూ అధికారులు గుర్తించారు. వాటికి సంబంధించి సుమారు 550 మంది రైతులతో గ్రామాల వారీగా సంప్రదింపులు చేస్తున్నారు.

★ ఓఆర్ఆర్ వెళ్లే మార్గంలో వింజనంపాడు, పుల్లడిగుంట మధ్య గుంటూరు వాహిని 41.300 కిలోమీటరు వద్ద వంతెన నిర్మించే ప్రాంతాన్ని జాతీయ రహదారి సంస్థ అధికారులు కొద్దిరోజుల కిందట పరిశీలించారు. దీంతోపాటు బుడంపాడు సమీపంలో 31వ కిలోమీటరు వద్ద నారా కోడూరు ఓఆర్ఆర్ వద్దకు వెళ్లేందుకు లింక్ రోడ్డు, గుంటూరు వాహినికి అనుబంధంగా ఉన్న కాలువలపై కల్వర్టులు, చిన్న వంతెనలు నిర్మించనున్నారు. దీనిపై గుంటూరు వాహిని ఏఈలు జాన్‌బాబు, నాగప్రశాంతిలు మాట్లాడుతూ సాగునీటి పారుదలశాఖ పరిధిలోని అన్ని కాలువలను ఇప్పటికే ఓఆర్ఆర్ అధికారులు పరిశీలించారని చెప్పారు.

## సందడిగా వన సమారాధనలు

తాడేపల్లి: పూజలు చేస్తున్న బాలాజీగుప్తా

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** మంగళగిరి, తాడేపల్లి నగర పరిధిలోని పెదవడ్లపూడి తోటల్లో ఆదివారం పలు సామాజిక వర్గాలు వన సమారాధనలు నిర్వహించాయి. ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యాన సత్య వ్రతం చేశారు. సమాఖ్య ప్రతినిధి సంకా బాలాజీగుప్తా నేతృత్వంలో మహిళలు, బాలబాలికలు ఆటపాటల్లో పాల్గొన్నారు.

**మంగళగిరి, న్యూస్‌టుడే:** కాపు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద ఆ సంఘీయుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గాయకుడు గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. నంబర్‌వన్ న్యూస్ ఛానల్ సీఈవో మంచాల సాయిసుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





మంగళగిరి : మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

హాయ్‌ల్యాండ్‌లో కిట్స్ సిబ్బంది, కుటుంబ సభ్యులు

**వింజనంపాడు (వట్టిచెరుకూరు):** మండలంలోని వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు హాయ్‌ల్యాండ్‌లో వన సమారాధన నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి శేఖర్, ప్రిన్సిపల్ పి.బాబు, సంచాలకులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## భక్తితో మెట్ల పూజ

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** స్థానిక అయ్యప్ప ఆలయంలో బయట ఉన్న పెద్ద పడి మెట్ల పూజ ఆదివారం రాత్రి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో జరిగింది. అర్చకుడు రాజశర్మ ఈ క్రతువు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

**ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా కంచర్ల (గ్రామము), మంగళగిరి మండలం నాలుగవ డాక్యుమెంట్ నెం: 2544/2018, యస్.ఆర్.ఓ., మంగళగిరి, 1000 చ.గ.లు ఎగ్రిమెంట్ ఆస్తుల సంబంధించి గుంటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ఒ.యస్.నెం.108/2022, యడ్లపల్లి బ్రహ్మయ్య వగైరాలచే దాఖలు చేయబడి పెండింగ్‌లో ఉన్నది. ఎట్టి అన్యాక్రాంతములు బంధించజాలరని యిందుమూలముగా తెలియజేయడమైనది.

**కంచర్ల వసంతకుమార్, న్యాయవాది**
**9246483666**

## డాక్టర్ రాజ్‌కుమార్ సేవలు చిరస్మరణీయం

**తాడేపల్లి, న్యూస్‌టుడే:** వైద్య రంగానికి డాక్టర్ రాజ్‌కుమార్ అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. తాడేపల్లి పరిధి ఉండవల్లిలోని ఆక్వా డెవిల్స్ ఆవరణలో ఆదివారం ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. వ్యాపారవేత్త సోనోవిజన్ అధినేత మూర్తితో పాటు పలువురు రాజకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవిడ్ సమయంలో పేదలకు ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆక్వా డెవిల్స్ సభ్యులు బి.కోటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌బాబు, రాంబాబు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెదేపా నాయకులు ఆర్.శివరామకృష్ణయ్య, డి.నాగరాజుల ఆధ్వర్యంలో సుశ్రుత ఫౌండేషన్ ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి(హైదరాబాద్) వారి సహకారంతో ఉచిత వెరికోజ్ వీన్స్ వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు ప్రమోద 200 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 80 మందిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మండల తెదేపా అధ్యక్షుడు కె.రఘురామారావు, తెదేపా ఎన్ఆర్ఐ విభాగ లాస్ ఏంజిల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్, అప్న జడ్పీహెచ్ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అప్పారావు, ఆర్థిక కార్యదర్శి జవహర్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహిస్తున్న వైద్యురాలు ప్రమోద

## మినీ వ్యాన్ బోల్తా

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** పెదనందిపాడు-గుంటూరు మార్గంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మినీ వ్యాన్ కాలువలోకి వెళ్లి బోల్తా పడింది. గుంటూరు నుంచి పెదనందిపాడు వస్తున్న కారు. . కొమ్మూరు నుంచి గుణదల మేరీమాత ఆలయానికి వెళ్తున్న మినీ వ్యాన్‌ను వరగాని సమీపంలో ఢీకొంది. దీంతో వ్యాన్ కాలువలోకి బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న తొమ్మిది మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. దీనిని నడుపుతున్న శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి.

## ఉత్సాహంగా గ్రంథాలయ వేడుకలు

**దుగ్గిరాల, న్యూస్‌టుడే:** గ్రంథాలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రముఖుల సంస్మరణ సమావేశం జరిగింది. అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ, లలితానందప్రసాద్, రవీంద్రరావు, సాంబశివరావు, భూషయ్య తదితరులున్నారు.

దుగ్గిరాల: ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చిన్నారులు, గ్రామస్థులు

**మేడికొండూరు:** మేడికొండూరు శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం తదితరులను స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలదండ వేసి నివాళిలర్పించారు. అధికారి సుధారాణి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో విద్యార్థులు, సిబ్బంది ప్రదర్శన

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జి.మోహనరావు, నిర్వాహకుడు శివనాగేశ్వరరావు, వార్డు సభ్యుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'సాక్ష్యాన్ని సమాధి చేసేందుకు సతీష్ హత్య'

**కాకుమాను, న్యూస్‌టుడే:** పరకామణి చోరీ కేసులో సాక్ష్యాన్ని సమాధి చేసేందుకు ఫిర్యాదుదారు సతీష్ కుమార్‌ను హత్య చేశారని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం కాకుమానులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో రాజీ చేసుకున్నట్లు సీఐడీ విచారణలో సతీష్ కుమార్ చెప్పారని పేర్కొన్నారు. అధికారిగా ఉన్న సతీష్‌కుమార్‌నే హత్య చేయించి కేసు నుంచి బయట పడాలనే కొందరు చూస్తున్నారన్నారు.

**పెదనందిపాడు, న్యూస్‌టుడే:** సతీష్‌కుమార్ హత్యకు కారకులైన వారికి వెంటనే అరెస్టు చేయాలని శాలివాహన సంఘ నాయకులు, సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి వస్తోందన్నారు. శాలివాహన సంఘ నాయకులు ఎస్.సుబ్బారావు, శివయ్య, సామ్రాజ్యం, ధనలక్ష్మి, నాగయ్య, భూషణం తదితరులు పాల్గొన్నారు.





(c) eenadu

# గుంటూరు తూర్పు

## సీజేఐకి ఎస్పీ గౌరవ స్వాగతం

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి గౌరవ స్వాగతం పలికారు.

**ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి...** (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 28, వంగ 47, బెండ 45, పచ్చిమిర్చి 39, కాకర 54, క్యారెట్ 70, క్యాబేజీ 30, బీర 40, దొండ 56, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుళ్లు 64, దోస 27, పొట్ల 40, చామదుంప 25, మునగ 8, గోంగూర 12, తోటకూర 20, చుక్కకూర 20, కొత్తిమీర 30, బీట్‌రూట్ 44, కీర 29, క్యాప్సికం 65, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 65, సొర 32, అరటి 7 - **న్యూస్‌టుడే, పట్నంబజారు**

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

☛ చేనేతకాలనీ ప్రధాన రహదారి సైడుకాల్వల్లో పూడిక చేరి మురుగు నీరు పారుదల కాక దోమల వ్యాప్తి అధికంగా ఉందని స్థానికులు జానీ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో కాల్వల్లో పూడిక తొలగించారు.

☛ పాతగుంటూరు ఆంజనేయస్వామి గుడి ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు సతీష్‌కుమార్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తీయించి తరలించారు. -న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

## ప్రణాళిక అమలు చేయక.. ప్రత్యామ్నాయం పట్టక..

నగరవాసులకు తీవ్ర ట్రాఫిక్ ఇక్కట్లు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

గుంటూరు నగరపాలక సంస్థ(జీఎంసీ) పరిధిలో ఏడాదిన్నరగా అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి.. ఆదే సమయంలో ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా పెరిగాయి. వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో జీఎంసీ యంత్రాంగం విఫలమైంది. ఇదే సమయంలో పౌరస్పృహ కూడా కొరవడింది.

తూర్పు, పశ్చిమలను కలిపే ప్రధాన శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభమయ్యాయి. పనుల ప్రారంభానికి ఐదారు నెలలకు ముందే ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటు చేసి వాహనదారులు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు ప్రణాళికలు వేశారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా ఆర్వోబీ పనులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆమేరకు ప్రత్యామ్నాయ రహదారుల్లో మరమ్మతులు, ఆక్రమణలుంటే తొలగించి.. ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ అధికారులు చేసిన చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. దీంతో రద్దీ ప్రాంతాల్లో విపరీతంగా ట్రాఫిక్ పెరిగి సమస్యలు వస్తున్నాయి. రహదార్లను చిరువ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

శంకర్‌విలాస్ కూడలిలో ఇలా..

**ఈ ప్రాంతాల్లోనే అధికం..** శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు సాగుతున్న నేపథ్యంలోనే పశ్చిమంలో బృందావన్‌గార్డెన్స్, బ్రాడీపేట నాలుగో లైన్, పలకలూరురోడ్డు, తూర్పులో కొత్తపేట, సీతానగరం, నెహ్రూనగర్, బస్టాండ్‌రోడ్డు, పాతబస్టాండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రహదారుల పనులు జరుగుతుండడం ఇందుకు కారణం. మరికొన్ని చోట్ల రోడ్లను చిరువ్యాపారులు ఆక్రమించి తోపుడుబండ్లపై విక్రయాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**ఇలా చేస్తే సమస్యలకు పరిష్కారం..** లక్ష్మీపురం ప్రధానరోడ్డు, బ్రాడీపేటలో రహదారి విస్తరణ పనులు ఇప్పటికైనా వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి. కొత్తపేట, సీతానగరం వంటి చోట్ల ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ప్రజలు వ్యవహరించేలా అవగాహన కల్పించడంతోపాటు అపరాధరుసుం విధించైనా మార్పు తీసుకు రావాలి. పట్నంబజారు, పాతబస్టాండ్, కింగ్‌హోటల్, బస్టాండ్, పల్నాడు బస్టాండ్ వంటి ప్రాంతాల్లో తోపుడు బండ్ల వ్యాపారులను ఒక పక్కకు తరలించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలి. జీఎంసీ పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో రహదార్ల ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్ ఎన్.లక్ష్మీసుభద్ర తదితరులు

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని గుంటూరు చలమయ్య, సాధు సుబ్రహ్మణ్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్. లక్ష్మీ సుభద్ర అన్నారు. సంగడిగుంటలోని కళాశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రకృతి సౌందర్యాలు అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో ఎన్.సాయి కీర్తన, ద్వితీయ స్థానంలో ఎస్.తులసీచంద్రిక, తృతీయ స్థానంలో ఎస్.శివనందిని నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ లక్ష్మీసుభద్ర బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## బస్టాండులో ప్లాట్‌ఫాం అభివృద్ధి పనులు ప్రారంభం

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** గుంటూరు ఆర్టీసీ బస్టాండులో పాడైన రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. బస్టాండు రోడ్డు..బాగు చేస్తే మేలు శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. 31వ నెంబరు ప్లాట్‌ఫాం నుంచి 36వ నెంబరు ప్లాట్‌ఫారాల వరకు పగుళ్లిచ్చిన ఫ్లోర్‌కు మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు రూ.8లక్షలు నిధులు మంజూరు కాగా, ఆ మొత్తంతో పాడైన ఫ్లోర్ తొలగించి..దాని స్థానంలో పనులు చేపట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

### చెట్లకొమ్మల తొలగింపు

**పట్నంబజారు:** చౌత్రాసెంటర్ కొత్త మసీదు సెంటర్‌లో రోడ్డుపై పడేసిన చెట్ల కొమ్మలను ఆదివారం అధికారులు తొలగించారు. 'ఈనాడు'లో ప్రచురితమైన చెట్టు కొమ్మల్ని తొలగించరా కథనానికి అధికారులు స్పందించారు. ఈ ప్రాంతంలోని రోడ్ల పక్కన పడేసిన కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## పోలీసుల అదుపులో యువకులు

**పట్నంబజారు:** పొన్నూరురోడ్డులో డ్రగ్స్ తీసుకుంటున్న ఆరుగురు యువకుల్ని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరెంటు ఆఫీసు వెనుక భాగంలో కొందరు యువకులు డ్రగ్స్ తాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు పాతగుంటూరు పోలీసులు అక్కడికి చేరుకొని యువకులను అదుపులోకి తీసుకున్నారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** పేదలను ఆదుకొనేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాతులూరి ప్రకాశరావు అన్నారు. ఏటుకూరురోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం 200 మంది పేదలకు బియ్యం, నిత్యావసర సరకులతోపాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రత్తి వెంకట నారాయణ మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బచ్చు లక్ష్మీకోటిగణేష్, వైభవ్ నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, గజవల్లి శ్యాంసుందర్, మద్దు రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణ, వేదికపై వెంకటసుబ్బయ్య, రాధాకృష్ణమూర్తి, సత్యనారాయణ

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**నెహ్రూనగర్ :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రాంతీయ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు రూ.కోటి విరాళాన్ని వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడికి సిద్ధమవుతామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సంక్షేమబోర్డు పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు మేడా హనుమంతురావు, రావుల అంజిబాబు, సాంబయ్య, కరీముల్లా, మల్లికార్జునరావు, శ్రీను, రాజు, రామస్వామి, బాష, శివ పాల్గొన్నారు.

**పట్నంబజారు:** పాతగుంటూరు మెయిన్‌రోడ్డులోని శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26న 45వ కల్యాణ

## 26న కల్యాణ మహోత్సవాలు

మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు పొదర్తి శివన్నారాయణమూర్తి తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 26వ తేదీ ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అనంతరం శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 9 గంటలకు తలంబ్రాలు ఊరేగించి.. అనంతరం కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27వ తేదీ ఉదయం 8గంటలకు శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తామన్నారు.

## శంకర్‌విలాస్ ఆర్వోబీ పనుల పరిశీలన

**నగరపాలకసంస్థ(గుంటూరు) :** నగరంలో శంకర్‌విలాస్ వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)పై మళ్లీ వివాదం ఏర్పడింది. వంతెన నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదని, దుకాణాల ఎదుట మట్టి దిబ్బలు పోస్తున్నారని, వినియోగదారులు వచ్చి పోయేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపారం జరగడం లేదని రాష్ట్ర హైకోర్టులో టాక్స్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక వ్యాపారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు నిజనిర్ధారణ కోసం న్యాయవాదిని పరిశీలనకు వేశారు. కోర్టు కమిషనర్ హోదాలో ఆయన ఆదివారం నగరంలోని శంకర్‌విలాస్ ఆర్వోబీ వద్ద పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పరిశీలన జరుగుతున్న సమయంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అక్కడే ఉన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు కొంతమంది కావాలనే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వ్యాపారులు కోరిందే కాదు.. ఎక్కువ నష్ట పరిహారం ఇస్తున్నామని, అయినప్పటికీ పనులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆర్వోబీ పనుల్లో వస్తున్న అడ్డంకులను తొలగించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫాలోఅప్ చేస్తున్నారన్నారు. రైల్వే, మున్సిపల్ కార్పొరేషన్‌లు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వివరాలు తెలుసుకుంటున్న కోర్టు కమిషనర్

## విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు ఏవీకే సుజాత గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత చరిత్రలు వివరించారు. అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## గుంతలను అలాగే వదిలేశారు..!

ఆనందపేట శ్మశానవాటిక వెనుక రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల అధికారులు ఈ ప్రాంతంలో నీటి పైపుల ఏర్పాటు కోసం తవ్వకాలు చేశారు. రోజులు గడుస్తున్నా.. పైపులైన్ల ఏర్పాటు చేయలేదు. దీంతో నగరవాసులు ఇటుగా రాకపోకలు చేస్తూ..ప్రమాదవశాత్తు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - **న్యూస్‌టుడేపట్నంబజారు**

## ఆకతాయిల చేష్టలతో అవస్థలు

సీతానగర్ 1వ వీధిలోని ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దోమలు, క్రిమికీటకాలతో సమీపంలో నివాసాలు ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఆ స్థలంలో తాగుబోతులు, ఆకతాయిలు చేరి నానా ఆగడాలు చేస్తున్నారని వాపోతున్నారు. ప్లాస్టిక్, కరెంట్ తీగలు తగలపెట్టడంతో వాటి నుంచి వచ్చే పొగ, దుర్వాసన భరించలేకపోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై రాకపోకలు సాగించేవారు పొగతో అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు**

## విభాగినిలో పచ్చదనం ఆనవాళ్లేవీ..?

నగర ప్రధాన రహదారుల్లోని డివైడర్ల మధ్య పచ్చదనం లోపిస్తోంది. పొన్నూరురోడ్డు, కింగ్స్ హోటల్ సెంటర్, బస్టాండు సెంటర్లలోని డివైడర్లు మొక్కలు లేక కళావిహీనంగా మారాయి. కార్పొరేషన్ అధికారులు ఏటా మొక్కల పరిరక్షణకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా..ప్రయోజనం కనిపించడం లేదు. గత ఏడాది గణేష్‌మహల్‌రోడ్డు, పొన్నూరురోడ్డు తదితర ప్రాంతాల్లోని డివైడర్ల మధ్య అధికారులు మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో మచ్చుకైన మొక్కలు కనిపించడం లేదు. నగరాన్ని సుందరీకరిస్తామని చెబుతున్న అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. - **న్యూస్‌టుడే, పట్నంబజారు**

## నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** స్థానిక సమస్యలపై సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం కౌన్సిల్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు నేరుగా స్వీకరించనున్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

## దేశ సమైక్యతకు కృషి చేయాలి

**గుంటూరు నేరవార్తలు :** దేశవ్యాప్తంగా మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాలు నడుస్తున్న తరుణంలో దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆవాజ్ నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం సూచించారు. ఆదివారం గుంటూరులోని కార్యాలయంలో ఆవాజ్ జిల్లా మహాసభలు నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకులు ఎండీ అక్బర్ పతాకావిష్కరణ చేశారు. అతిథిగా హాజరైన బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, వారి విద్య, అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. దేశంలో ముస్లింల త్యాగాల గురించి చరిత్రాత్మక అంశాలను వివరించారు. దేశంలో కులం, మతం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా అందరూ కలిసికట్టుగా జీవించాల్సిన అవసరం ఉందన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి మాట్లాడుతూ ఆవాజ్ ఒక మత, ధార్మిక సంస్థ కాదని, అది లౌకికవాద ప్రాతిపదికన పనిచేసే సంస్థ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుభానీ, వివిధ సంఘాల నాయకులు నళినీకాంత్, నవీన్ ప్రకాష్, బాషా పాల్గొన్నారు.

## 104 సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించండి

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** 104 సిబ్బందికి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని 104 ఎంఎంయూ కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్షులు గోరంట్ల సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీహర్ష, నాగులు, సూర్యనారాయణ, కొండలరావు, విజయ్, హరికృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

కార్యక్రమంలో లక్ష్మణరావు, సురేష్‌కుమార్ తదితరులు

## 400 మందికి నేత్ర పరీక్షలు

**నెహ్రూనగర్, న్యూస్‌టుడే :** రైలుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నసీర్ అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో 400 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. పలువురికి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, తెదేపా నాయకులు చిట్టాబత్తిన చిట్టిబాబు, మస్తాన్‌రెడ్డి, సముద్రాలు, శ్రీనివాసరావు, మహేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, కార్పొరేటర్ పోతురాజు సమత చంద్రశేఖర్

## బీసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. పాతగుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐఐ సమిట్‌లో జరిగిన ఒప్పందాలతో లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయన్నారు. ప్రపంచ చిత్రపటంలో రాష్ట్ర ప్రతిష్ఠ శాశ్వతంగా నిలిచిపోయేలా విశాఖ కేంద్రంగా గూగుల్ కేంద్రం ఏర్పాటు జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్రంలో సెలూన్ షాపులు నడుపుతున్న నాయీబ్రాహ్మణులకు 150 నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందిస్తున్నారన్నారు. ఆదరణ పథకానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించి పేదలను ఆదుకొనేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచారన్నారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కందుకూరి వెంకట్ మాట్లాడుతూ దేవాలయాల పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులు ఒకరికి సభ్యుడిగా అవకాశం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. సమావేశంలో అద్దంకి రవి, కాంతి కిరణ్, పవన్‌కుమార్, చేబ్రోలు సుధీర్‌కుమార్, గుంటుపల్లి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రుద్రకోటి సదాశివం

## అందెల రవళులు.. ఆనందాల పరవళ్లు

**గుంటూరు సాంస్కృతికం:** బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీసాయిమంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా సాగుతున్న నృత్య పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కాజ సత్యవతీదేవి, నరసింహారావు స్మారక బాల కళావేదిక నిర్వహణలో 16వ చిల్డ్రన్స్ డ్యాన్స్ ఒలింపియాడ్ పేరున ఈ పోటీలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు విద్యార్థులు నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శన చేసిన కళాకారులను బాల కళారత్న పురస్కారాలతో సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, డాక్టర్ గాజుల రామకృష్ణ, కాజ వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కృషి చేయాలి

**గుంటూరు నగరం:** రాచరిక వ్యవస్థలను అంతమొందించి స్వేచ్ఛ, సమానత్వం లాంటి నినాదాలతో ముందుకొచ్చిన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు విద్యార్థులు కృషి చేయాలని విశ్రాంత ఆచార్యులు కొండవీటి చిన్నయ్య సూరి అన్నారు. ఏసీ కళాశాలలోని అసెంబ్లీ హాల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షల శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన విలువగల ఓటు హక్కు కల్పించడం ద్వారా నేడు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ కొనసాగుతుందన్నారు. ఐఆర్ఎస్ అధికారి మధుబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తార్కిక చింతనను పెంచుకుని జ్ఞాపకశక్తిని మెరుగుపర్చుకోవాలన్నారు. జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి సతీష్, ఆదినారాయణ, అరుణాచలం పాల్గొన్నారు.

### ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా కురగల్లు గ్రామము, మంగళగిరి మండలం తాలూకా **డాక్యుమెంట్ నెం: 2544/2018,** యస్.ఆర్.ఓ., మంగళగిరి, 1000 చ.గ.లు వగైరా ఆస్తులకు సంబంధించి గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో ఒ.యస్.నెం.108/2022, యడ్లపల్లి బ్రహ్మయ్య వగైరాలచే దాఖలు చేయబడి పెండింగ్‌లో ఉన్నది. ఎట్టి అన్యాక్రాంతములు బంధించజాలరని యిందుమూలముగా తెలియజేయడమైనది.

**కంచర్ల వసంతకుమార్, న్యాయవాది**
**9246483666**

## మహనీయుల జీవితాలు వెలుగులోకి తేవడం అభినందనీయం

**ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే:** శతాబ్దాల తెలుగు వైభవాన్ని దశదిశలా విస్తరించి, దాని సంస్కృతి ప్రాభవాన్ని తెలియజేసిన ఎందరో మహనీయుల జీవితాలను గ్రంథస్థం చేసిన నాగసూరి వేణుగోపాల్ జీవితం ధన్యమని విద్యావేత్త, రచయిత ఆచార్య వకులాభరణం రామకృష్ణ పేర్కొన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆర్యవైశ్య బాలుర వసతి గృహంలో 'దక్షిణాంధ్ర దారి దీపాలు' గ్రంథావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ప్రముఖ పాత్ర పోషించిన తెలుగు మహనీయుల గురించి సమగ్ర పరిశోధన జరగలేదని, దక్షిణాంధ్ర దారి దీపాలు గ్రంథం ద్వారా వేణుగోపాల్ ఆ లోటు తీర్చారన్నారు. చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ బొబ్బిలి రాజా, రామస్వామి రెడ్డియార్, రంగయ్యనాయుడు, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, ముత్తా వెంకట సుబ్బారావు, వావిళ్ల రామస్వామి దీక్షితులు వంటి పెద్దల విశేషాలు ఈ గ్రంథం ద్వారా తెలుస్తాయన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగు పెద్దల జీవిత విశేషాలను అక్షరీకరించి దక్షిణాంధ్ర దారి దీపాలు ద్వారా వెలుగులోకి తెచ్చానన్న సంతృప్తి మనసుకు ఆనందాన్నిస్తుందన్నారు. డాక్టర్ కామేపల్లి రత్నబాబు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, గద్దె మంగయ్య, గోటేటి లలిత శేఖర్, ప్రొఫెసర్ మురళీమోహన్, ప్రొఫెసర్ ఎస్.వి.కృష్ణారావు, వీవీఐటీ వర్సిటీ పబ్లికేషన్స్ డివిజన్ సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

గ్రంథావిష్కరణలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, రామకృష్ణ, శివనాగిరెడ్డి తదితరులు




(c) eenadu

# గుంటూరు పశ్చిమ

## షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు

**గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే:** ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగిన అటవీ శాఖ ఆలిండియా స్పోర్ట్స్ మీట్‌లో జిల్లాకు చెందిన సౌజన్య, కృష్ణప్రియ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు సాధించారు. ఓపెన్ డబుల్స్ విభాగంలో రజత పతకాలు సాధించి జిల్లా, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపజేశారు. పోటీల్లో సత్తా చాటిన సౌజన్య, కృష్ణప్రియలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయపాటి రంగారావు, కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు, బండారు రాము, సతీష్‌చంద్ర, రమేష్, వెంకటేశ్వరరావు, హరి అభినందనలు తెలిపారు.

సౌజన్య, కృష్ణప్రియ

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

**వ్యర్థాలు, చెత్త తొలగింపు:** సాంబశివపేట ప్రధాన వీధుల్లో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వీధుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు.

**కాలువల్లో పూడికతీత:** బ్రాడీపేట ప్రధాన వీధుల్లోని కాలువల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు. **-న్యూస్‌టుడే, నగరంపాలెం**

స్పందనకు వందనం

## బీసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్ర కోటి సదాశివం అన్నారు. పాత గుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## మానవత్వానికి ప్రతిబింబం అందెశ్రీ కవిత్వం

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** అందెశ్రీ కవిత్వం మానవత్వానికి ప్రతిబింబలాంటిదని పలువురు వక్తలు కొనియాడారు. భారతీయ విద్యాభవన్‌లోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో అందెశ్రీ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. పలు సాహితి, సాంస్కృతిక, సేవా రంగాల నిర్వాహకులు, ప్రతినిధులు సభలో పాల్గొన్నారు. గుంటూరు సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్సీ రాజు, గజల్ శ్రీనివాస్, సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రాము, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రజాగాయకుడు రమణ, రాష్ట్ర చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు, డాక్టర్ ఏఆర్ఎస్, ఎస్.రవికుమార్ తదితరులు అందెశ్రీ కవిత్వంలోని మానవీయ విలువలను, ఆయన ఆదర్శ జీవనశైలిని ప్రస్తుతించారు. తొలుత వక్తలు, నిర్వాహకులు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పీఆర్సీ రాజు తదితరులు

## స్పందించారు.. రోడ్డు వేశారు

బ్రాడీపేటలోని నాలుగో వీధిలో అసంపూర్తిగా ఉన్న తారు రోడ్డును నగరపాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు పూర్తి చేశారు. ఈనెల 12న 'ఈనాడు' అమరావతి సంచికలో 'అసంపూర్తి పనులు పూర్తి చేయించరూ' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీఎంసీ అధికారులు స్పందించారు. గుత్తేదారుతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. రాకపోకలు శనివారం పునరుద్ధరించారు. 'ఈనాడు' కథనంతో సమస్య పరిష్కారమైందని వాహనదారులతో పాటు స్థానికులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు)**

## విద్యార్థులకు పోటీలు

**పట్టాభిపురం, ఏటీ అగ్రహారం:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు ఎస్‌కే సుజాత గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత చరిత్రలు వివరించారు. అయ్యంకి వెంకటరమణయ్య, హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎన్జీవో కాలనీలోని పట్టాభిపురం శాఖ గ్రంథాలయంలో డిబేట్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారులు శకుంతల, పి.సత్యశిరీష పాల్గొన్నారు.

## ధర వరలు

**కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో):** టమాట 37, వంగ (సన్నాలు) 60, బెండ 40, పచ్చిమిర్చి 43, కాకర 58, బీర 50, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజి 28, క్యారెట్ 63, దొండ 60, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుళ్లు 63, దోస 30, సొర 38, పొట్ల 48, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 120, చామదుంప 25, మునగ 10, బీట్‌రూట్ 44, కీరదోసకాయ 34, బీన్స్ 65, క్యాప్సికమ్ 62, కొత్తిమీర 30, ఆకుకూరలు 20, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110. - **న్యూస్‌టుడే, పట్టాభిపురం**

## అక్కడే తాగడం.. అడిగితే జగడం

### భయాందోళనల్లో మహిళలు.. యువతులు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే**

నిర్వాహకుల్ని నిలదీస్తున్న మహిళలు

రోడ్డు పైకి వాహనాల పార్కింగ్

☛ రవాణా శాఖ రహదారిలో మద్యం షాపు వద్ద రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలపడంతో యువతి అక్కడ నుంచి తీసి పక్కన పెట్టుకోమన్నందుకు మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ సీసా పగులగొట్టి నానా బీభత్సం సృష్టించాడు. ఆ యువతి భయాందోళనలకు గురవ్వడంతో జ్వరమొచ్చింది.

☛ కృష్ణనగర్‌లో రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో కొందరు సకాలంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లలేకపోవడంతో రైలు వెళ్లిపోయింది. ఫలితంగా ప్రయాణం రద్దు చేసుకోవడమే కాకుండా ఓ యువకుడు ఇంటర్వ్యూకు హాజరవ్వలేకపోయాడు.

### ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత

మద్యం దుకాణాల నిర్వాహకులకు ఆదాయంపై ఉన్న ఆసక్తి ప్రజల బాగోగులపై ఏమాత్రం లేదు. మందుబాబులు చేసే రచ్చ గురించి అసలు పట్టించుకోవడం లేదు. వైన్ దుకాణాల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేసి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా.. మహిళలు, యువతుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. నగరంలోని పలు మద్యం దుకాణాల వద్ద రోజు రోజుకీ పరిస్థితి దిగజారిపోతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

### రోడ్లపైనే మద్యం సీసాలు ధ్వంసం..

☛ మద్యం షాపుల వద్ద మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పార్కింగ్ సౌకర్యం లేకపోయినా ఎక్సైజ్ అధికారులు ఎడాపెడా అనుమతులు ఇచ్చేశారు. రవాణా శాఖ రహదారి, కృష్ణనగర్ కుందుల రోడ్డు, స్వామి థియేటర్ వద్ద, తోళ్ల షాపు సెంటర్, గుజ్జనగుండ్ల, పలకలూరు రోడ్డులోని వైన్ షాపులు, బార్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతే కాకుండా రాత్రి సమయంలో రోడ్లపైనే మద్యం సీసాలు పగులగొట్టి రగడ చేస్తున్నారు.

☛ ఈ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బార్ల వద్దకు చేరుకునే ఆటోవాలాల దగ్గర నుంచి ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలు, కార్లలో వచ్చేవారు రోడ్ల పైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాగైతే వెళ్లేదెలాగని ఎవరైనా ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారు.

☛ రవాణా శాఖ ప్రధాన రహదారిలో హనుమాన్‌నగర్‌కు చెందిన మహిళలు ఆపిల్ వైన్స్ నిర్వాహకుల్ని ఆదివారం నిలదీశారు. అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడమే కాకుండా మద్యం సీసాలు పగులగొట్టి ఇబ్బందులకు గురి చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఇస్కాన్ దేవాలయం, పాఠశాల ఉన్నాయని, నాలుగు అపార్ట్‌మెంట్లలో వందలాది మంది నివసిస్తున్నారని, రాకపోకలు సాగించాలంటే పిల్లలు భయపడుతున్నారని నిర్వాహకులపై మండిపడ్డారు.

☛ కృష్ణనగర్ కుందుల రోడ్డులో ఎదురెదురుగా వైన్ షాపు, బార్ ఉన్నాయి. గుజ్జనగుండ్ల సెంటర్, పలకలూరు రోడ్డులోనూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కృష్ణనగర్ పదో లైనులోని వైన్ షాపు వద్ద ఇదే పరిస్థితి. వైన్ షాపులు, బార్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చూడాల్సిన ఆవశ్యకత ఉంది.

## 26న కల్యాణ మహోత్సవాలు

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** పాతగుంటూరు మెయిన్‌రోడ్డులోని శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26న 45వ కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు పాదర్తి శివన్నారాయణమూర్తి తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 26వ తేదీ ఉదయం 6 గంటలకు గణపతి పూజ, అనంతరం శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూలతో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 9 గంటలకు తలంబ్రాలు ఊరేగించి.. అనంతరం కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27వ తేదీ ఉదయం 8గంటలకు శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తామన్నారు.

## బస్టాండులో ప్లాట్‌ఫాం అభివృద్ధి పనులు ప్రారంభం

**పట్నంబజారు:** గుంటూరు ఆర్టీసీ బస్టాండులో పాడైన రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. బస్టాండు రోడ్లు.. బాగు చేస్తే మేలు శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. 31వ నెంబరు ప్లాట్‌ఫాం నుంచి 36వ నెంబరు ప్లాట్‌ఫారాల వరకు పగుళ్లిచ్చిన ఫ్లోర్‌కు మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు రూ.8లక్షలు నిధులు మంజూరు కాగా, ఆ మొత్తంతో పాడైన ఫ్లోర్ తొలగించి.. దాని స్థానంలో పనులు చేపట్టినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## అందెల రవళులు.. ఆనందాల పరవళ్లు

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై శ్రీసాయిమంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా సాగుతున్న నృత్య పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కాజ సత్య వదీదేవి, నదింపల్లి స్మారక బాల కళోత్సవ నిర్వహించారు. 16వ చిల్డ్రన్స్ డ్యాన్స్ ఒలింపియాడ్ పేరున ఈ పోటీలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు విద్యార్థులు నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శన చేసిన కళాకారులను బాల కళారత్న పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, డాక్టర్ గాజుల రామకృష్ణ, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు జమ్ము కుసుమాంజలి, దొంతిరెడ్డి లక్ష్మీ పిక్, సువ్వల విన్యస, సీహెచ్.వి.నివేదిత, వై.కందస్వామి, ఆర్.ఎన్.ఎల్.ఎస్.సాయి స్పందన, ఎ.నందయామినిలకు బాలకళారత్న పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన నాట్యాచార్యులు ఎన్.బాలు, డాక్టర్ హలీంఖాన్‌లను 'నటరాజ పాద స్వర్ణ మంజీర' పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాన్ని పి.నాగమహిత, నాగలక్ష్మి పర్యవేక్షించారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

## 6న ఐక్య క్రిస్మస్ వేడుకలు

**నగరంపాలెం, న్యూస్‌టుడే:** వచ్చే నెల 6న తలపెట్టిన ఐక్య క్రిస్మస్ వేడుకలను జిల్లాలోని ఆర్‌సీఎం, ప్రొటెస్టెంట్ సంఘాలతో పాటు అన్ని క్రైస్తవ సంఘాలు, విశ్వాసులు పాల్గొని జయప్రదం చేయాలని యునైటెడ్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, క్రిస్టియన్ ఫోరం చైర్మన్ ఎం. జోసఫ్ ఇమ్మానియేల్ పిలుపునిచ్చారు. ఆంధ్రక్రైస్తవ కళాశాలలో నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా ఐక్య క్రిస్మస్ వేడుకలను నిర్వహించేందుకు అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జోసఫ్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ 17 ఏళ్ల కిందట ఎంతో వైభవంగా జరిగిన ఐక్య క్రిస్మస్ వేడుకలు అనివార్య కారణాలతో నిలిచిపోయాయన్నారు. ఈ వేడుకలను పునఃప్రారంభించి వైభవంగా నిర్వహించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేడుకల్లో జీసస్ కాల్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ పాల్‌దినకర్ హాజరవుతారని, నగరంతో పాటు జిల్లాలోని క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. మోజెస్, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గురవయ్య, ఎమినెంట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ కొలగాని శాంసన్‌రాబర్ట్స్, గ్లోరియస్ ఫెలోషిప్ సభ్యుడు విల్సన్ యమ, కనపాల జోసఫ్, కర్ర హనోక్ బెంజిమెన్, ఈరి రాజశేఖర్, మేడిద బాబూరావు, అబ్రహం పాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ప్రతినిధుల సమావేశంలో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం చైర్మన్ జోసఫ్ ఇమ్మానియేల్

## మహనీయుల జీవితాలు వెలుగులోకి తేవడం అభినందనీయం

**ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే:** శతాబ్దాల తెలుగు వైభవాన్ని దశదిశలా విస్తరించి, దాని సంస్కృతి ప్రాభవాన్ని తెలియజేసిన ఎందరో మహనీయుల జీవితాలను గ్రంథస్థం చేసిన నాగసూరి వేణుగోపాల్ జీవితం ధన్యమని విద్యావేత్త, రచయిత ఆచార్య వకులాభరణం రామకృష్ణ పేర్కొన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆర్య వైశ్య బాలుర వసతి గృహంలో 'దక్షిణాంధ్ర దారి దీపాలు' గ్రంథావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ప్రముఖ పాత్ర పోషించిన తెలుగు మహనీయుల గురించి సమగ్ర పరిశోధన జరగలేదని, దక్షిణాంధ్ర దారి దీపాలు గ్రంథం ద్వారా వేణుగోపాల్ ఆ లోటు తీర్చారన్నారు. చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ బొబ్బిలి రాజా, రామస్వామి రెడ్డియార్, రంగయ్యనాయుడు, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, ముత్తా వెంకట సుబ్బారావు, వావిళ్ల రామస్వామి దీక్షితులు వంటి పెద్దల విశేషాలు ఈ గ్రంథం ద్వారా తెలుస్తాయన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగు పెద్దల జీవిత విశేషాలను అక్షరీకరించి దక్షిణాంధ్ర దారి దీపాలు ద్వారా వెలుగులోకి తెచ్చానన్న సంతృప్తి మనసుకు ఆనందాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కామేపల్లి రత్నబాబు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, గద్దె మంగయ్య, గోటేటి లలిత శేఖర్, ప్రొఫెసర్ మురళీమోహన్, ప్రొఫెసర్ ఎన్.వి.కృష్ణారావు, వీవీఐటీ వర్సిటీ పబ్లికేషన్స్ డివిజన్ సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ, పలువురు రచయితలు, చరిత్రకారులు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథావిష్కరణలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, రామకృష్ణ, శివనాగిరెడ్డి తదితరులు

## ప్రమాదకరంగా విద్యుత్తు బోర్డు

హిందూ కళాశాల కూడలిలోని మున్సిపల్ ట్రావెల్ బంగ్లా(అతిథి గృహం)లో విద్యుత్తు బోర్డు ప్రమాదకరంగా ఉండడంతో విడిది చేసేవారు హడలిపోతున్నారు. స్విచ్‌బోర్డులో సాంకేతిక లోపం తలెత్తడంతో ఊడదీసి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో 20 రోజుల నుంచి తీగలు ప్రమాదకరంగా బయటకు వేలాడుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే స్పందించి స్విచ్ బోర్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నగరంపాలెం**

## ప్రకృతితో మమేకం.. వెల్లివిరిసిన ఉత్సాహం..

**ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే:** ఆధ్యాత్మికత, ఆనందాల సమ్మేళనమైన కార్తికమాసం.. ప్రజల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపడంతో పాటు అనుబంధాలను పెంచుతోంది. ఈ కార్తిక మాసంలో చివరి ఆదివారం కావడంతో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోర్లవారిపాలెంలోని కోటి గార్డెన్స్‌లో వన మహోత్సవం జరిగింది. ఉసిరి చెట్టుకు మహిళల పూజతో కార్యక్రమం మొదలైంది. మహిళలకు క్యాట్ వాక్, లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యం కోసం పగలబడి నవ్వడం, బెలూన్లు ఊదడం, హౌసీ ఆట, నృత్యాలు వంటి పోటీలతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. అనంతరం ప్రకృతితో మమేకమై కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షుడు శ్రీనివాస్, డైరెక్టర్ ఉప్పాల సాంబశివరావు, కార్యదర్శి కొరిటెపాటి సతీష్, కోశాధికారి టీవీ సాయిరాం, ఆనందరావు, మిత్ర, శివాజీ, చావా లక్ష్మి, డాక్టర్ కల్పన, తదితర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థకు ఉదార వితరణ చేసిన వారిని సభ్యులు సత్కరించారు.

బెలూన్ల ఆటలో మహిళల సందడి..

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**నెహ్రూనగర్:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రాంతీయ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు రూ.కోటి విరాళాన్ని వెంటనే జమ చేయాలని, లేనిపక్షంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడికి సిద్ధమవుతామన్నారు.

## వైభవంగా పడిపూజ

**ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే:** మల్లారెడ్డినగర్‌లోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ఛైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురుస్వామి జె.రాము, అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం విశేష అలంకారాలు, అభిషేకార్చనలు నిర్వహించారు. అద్దంకి బృందం భజనలు, వేషధారణలు, మెట్ల పూజ, అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం చేశారు. అనంతరం అయ్యప్పలకు, దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెట్టు కృష్ణారెడ్డి మాట్లాడుతూ సోమవారం నుంచి రోజూ స్వాములకు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు అన్నదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ ఛైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న నిర్వాహకులు

## ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి

**గుంటూరు నగరం, న్యూస్‌టుడే:** రాచరిక వ్యవస్థలను అంతమొందించి స్వేచ్ఛ, సమానత్వం లాంటి నినాదాలతో ముందకొచ్చిన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు విద్యార్థులు కృషి చేయాలని విశ్రాంత ఆచార్యులు కొండవీటి చిన్నయ్య సూరి అన్నారు. ఏసీ కళాశాలలోని అసెంబ్లీ హాల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షల శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు.

## మధుమేహులు నేత్ర పరీక్షలు చేయించుకోవాల్సిందే

**పట్టాభిపురం, అరండల్‌పేట, న్యూస్‌టుడే:** మధుమేహ బాధితులు కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డాక్టర్ గణేశుని రాజేష్ పేర్కొన్నారు. సుదర్శిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆర్టీసీ కాలనీ, గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 145 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 35 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కొత్తపేటలోని సుదర్శిని కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ రాజేష్ చెప్పారు. మధుమేహ వ్యాధిగ్రస్థులు కంటిలో రెటినా ఆరోగ్యం గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చేతన, ప్రశాంతి, కాశీ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తూ..

**ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా కురగల్లు గ్రామము, మంగళగిరి మండలం తాలూకా **డాక్యుమెంట్ నెం: 2544/2018,** యస్.ఆర్.ఓ. మంగళగిరి, **1000 చ.గ.లు** వగైరా ఆస్తులకు సంబంధించి గుంటూరు 3వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో **ఒ.యస్.నెం.108/2022,** యడ్లపల్లి బ్రహ్మయ్య వగైరాలచే దాఖలు చేయబడి పెండింగ్‌లో ఉన్నది. ఎట్టి అన్యాక్రాంతములు బంధించజాలరని యిందుమూలముగా తెలియజేయడమైనది.

**కంచర్ల వసంతకుమార్, న్యాయవాది**
**9246483666**

## గుండె సమస్యలు తొలి దశలోనే గుర్తిస్తే మేలు

**అరండల్‌పేట, న్యూస్‌టుడే:** మధుమేహ బాధితుల్లో ఇతరుల కంటే ఎక్కువగా గుండె సమస్యలు వస్తాయని, తొలి దశలోనే గుండెజబ్బుల సమస్యలపై దృష్టి సారించాలని ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణుడు డాక్టర్ షేక్ మౌలాలి అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో ఎస్‌హెచ్‌వో ఆర్గనైజేషన్, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం గుండెజబ్బులపై శాస్త్రీయ అవగాహన సభ జరిగింది. డాక్టర్ మౌలాలి మాట్లాడుతూ మధుమేహులు రక్తంలో గ్లూకోజ్ శాతం నియంత్రణలో ఉంచుకుంటే చాలనుకోకూడదన్నారు. ఇది అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుందన్నారు. మధుమేహం అదుపులో ఉంచుకోవడంతో పాటు ఆహార నియమాలు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరన్నారు. సభకు ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ సేవకుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చల్లా చైతన్య, పి.నిర్మలారాణి, మేకల రామారావు, ఎన్ సాంబశివరావు, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ మౌలాలి

## శంకర్‌విలాస్ ఆర్వోబీ పనుల పరిశీలన

**నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే:** నగరంలో శంకర్‌విలాస్ వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)పై మళ్లీ వివాదం ఏర్పడింది. వంతెన నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదని, దుకాణాల ఎదుట మట్టిదిబ్బలు పోస్తున్నారని, వినియోగదారులు వచ్చిపోయేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపారం జరగడం లేదని రాష్ట్ర హైకోర్టులో టాక్స్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక వ్యాపారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు నిజనిర్ధారణ కోసం న్యాయవాదిని పరిశీలనకు వేశారు. కోర్టు కమిషనర్ హోదాలో ఆయన ఆదివారం నగరంలోని శంకర్‌విలాస్ ఆర్వోబీ వద్ద పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పరిశీలన జరుగుతున్న సమయంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అక్కడే ఉన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు కొంత మంది కావాలనే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వ్యాపారులు కోరిందే కాదు.. ఎక్కువ నష్ట పరిహారం ఇస్తున్నామని, అయినప్పటికీ పనులను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆర్వోబీ పనుల్లో వస్తున్న అడ్డంకులను తొలగించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫాలోఅప్ చేస్తున్నారన్నారు. రైల్వే, మున్సిపల్ కార్పొరేషన్లు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## రక్తనాళ సంబంధిత వ్యాధులపై అవగాహన అవసరం

**అరండల్‌పేట, న్యూస్‌టుడే:** దేశంలో వివిధ కారణాలతో రక్తనాళ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నప్పటికీ... వాటిపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ విజయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'రక్తనాళాలు-రక్తప్రసరణ-సమస్యలు-వ్యాధులు' అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నడుస్తున్నప్పుడు కాళ్లలో నిరంతరం నొప్పి, మధుమేహం ఉన్న వారికి త్వరగా గాయాలు మాననప్పుడు పాదాలు చల్లగా ఉండడం, రంగు మారడం, నిస్సత్తువుగా ఉండడం, చూపు తగ్గడం, ఇతర లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రుమటాలజిస్ట్ డాక్టర్ దీపిక, సంస్థ సభ్యులు రాజన్న మాస్టారు, చల్లా అంజిరెడ్డి, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ విజయకుమార్

## అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ కీలకం

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** అత్యవసర పరిస్థితుల్లో ఇచ్చే ప్రథమ చికిత్సపై అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఆదివారం కార్యశాల నిర్వహించి అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసి యోగిష్ చంద్ర, విశిష్ట అతిథిగా డాక్టర్ ఎస్వీ రమణ పాల్గొన్నారు. డాక్టర్ జి.శివశ్రీనివాసరెడ్డి.. కార్డియాక్ అరెస్టు సమయంలో సీపీఆర్ ప్రాముఖ్యత, సీపీఆర్ విధానాలు, ప్రాణరక్షణకు తక్షణ చర్యలు వంటి విషయాలను వివరించారు. ఫస్ట్ ఎయిడ్‌ను డాక్టర్ కె.శంకర్‌రెడ్డి నిర్వహించారు. కాలిన, కోసుకున్న, తెగిన గాయాలు, జంతువుల కాటు, విద్యుదాఘాతం లాంటి అత్యవసర సమయాల్లో రోగిని ఆసుపత్రికి తరలించే వరకు ఇవ్వాల్సిన తక్షణ సహాయం గురించి వివరించారు. గృహ వైద్యం గురించి ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సీతారామ కిశోర్ వివరించారు. ఆరోగ్య భారతి కార్యక్రమాల పరిచయాన్ని డాక్టర్ శ్రీనివాసరెడ్డి చేశారు. ధన్వంతరి జయంతి సందేశాన్ని డాక్టర్ కాకాని పృథ్విరాజు ఇచ్చారు. కార్యశాలలో శిక్షణ పొందిన అభ్యర్థులకు నిర్వాహకులు యోగ్యతాపత్రాలు అందజేశారు.

శిక్షణ పొందిన వారికి యోగ్యతాపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం నవంబరు 17, 2025


## ఒకటే శిల.. మలిచారిలా..

ఎన్టీఆర్ జిల్లా నందిగామ సాయి అయ్యప్ప దేవాలయానికి ప్రత్యేకత ఉంది. 2011లో దేవాలయాన్ని ప్రతిష్ఠించిన సమయంలో తెలంగాణలోని ఖమ్మం నుంచి భారీ గ్రానైట్ రాయిని తీసుకొచ్చారు. తమిళనాడుకు చెందిన శిల్పులు దేవాలయం వద్ద రాతిలో 18 మెట్లుగా మలిచారు. కార్తిక మాసంలో ఏటా అయ్యప్ప మాలధారులు రాత్రివేళ ఈ మెట్లపై పడిపూజ నిర్వహిస్తుంటారు. భారీ రాతిపై 18 మెట్లు చెక్కించి ప్రతిష్ఠ చేసిన దేవాలయం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఇదొక్కటేనని కమిటీ ఛైర్మన్ శాఖమూరు వంశీధర్ తెలిపారు.

**- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే:** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

## ఆలోచనలు విరియాలి.. ఆవిష్కరణలు మెరవాలి..!

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా వీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, కానూరులో ఈ నెల 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

**నిబంధనలు..**

★ 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ★ ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ★ ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ★ పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ★ మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ★ పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం ★ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: నవంబరు 17

సమయం: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

నమోదు కొరకు: 91549 91113

## గుండెల్లో అన్న.. ఇంటిపై చూడన్న..

హనుమాన్ జంక్షన్‌కు చెందిన బోయపాటి వరప్రసాద్ కుటుంబానికి తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ అంటే విపరీతమైన అభిమానం. ఎన్టీఆర్ నటించిన సినిమాలు, అవి ఏ సంవత్సరంలో విడుదలయ్యాయి, వాటి దర్శకులెవరు, సినిమా ఎన్ని రోజులు ఆడింది.. వంటి వివరాలను అనర్గళంగా చెప్పగలిగే వరప్రసాద్, ఇటీవలే తన ఇంటిని ఆధునీకీకరించారు. ఈ క్రమంలో భవనానికి రంగులు వేయించారు. తన తల్లిదండ్రుల చిత్రాలతో పాటు ఎన్టీఆర్, బసవతారకం దంపతుల చిత్రాలను ప్రముఖంగా కనిపించేలా ఇంటి ముందు భాగంలో ముద్రింపజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. అటుగా రాకపోకలు సాగించే వారంతా వాటిని ఆసక్తిగా చూస్తున్నారు.

భవనంపై ఎన్టీఆర్, బసవతారకం చిత్రాలు

**- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్**

## కళ విరిసేలా.. ఇల మురిసేలా..

స్వాతంత్ర్య సమరయోధులు, కవులు, రచయితలు, నృత్య కళాకారులు, ఆయా రంగాల్లో సేవలు అందించిన ప్రముఖుల చిత్రాలను విజయవాడలోని బెంజిసర్కిల్ పైవంతెనపై పెయింటింగ్స్‌గా వేయిస్తున్నారు. నగరవాసులతో పాటు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారిని ఈ చిత్రాలు ఆకర్షిస్తున్నాయి.

**- ఈనాడు, అమరావతి**

# మేమింతే.. మారమంతే

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తగ్గని మధ్యవర్తుల హవా
- ఏసీబీ తనిఖీలు జరిగితే మాకేంటి అన్న వైఖరి

గుడివాడ నైజాంపేటకు చెందిన ఓ స్థానిక నాయకుడు తన స్థలం పక్కనే ఉన్న ఇతరుల స్థలాన్ని ఆక్రమించారు. తప్పుడు ఇంటి పన్ను సృష్టించి మధ్యవర్తుల ద్వారా అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయించారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ అధికారులు ఆ రికార్డులను పరిశీలించాల్సి ఉన్నా ముడుపుల మత్తులో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి భారీగానే కమీషన్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై బాధితులు తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయగా గుడివాడ పోలీస్‌స్టేషన్‌లో కేస్ నమోదైంది.

మొవ్వ మండలానికి చెందిన ఓ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మధ్యవర్తుల ద్వారా గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించారు. దీనికి మధ్యవర్తులు రూ.లక్ష వరకు కమీషన్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. గన్నవరంలో పత్రాలు సవ్యంగా ఉన్నాయో లేవో పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోకుండా కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు వాపోతున్నారు.

**ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం**

ఏసీబీ తనిఖీలు చేసినా.. రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాలు ప్రక్షాళన చేస్తామని రెవెన్యూ మంత్రి హెచ్చరికలు చేసినా ఆ శాఖలో దళారుల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ తనిఖీలు చేసినా.. జిల్లాలోనూ ఏసీబీ పంజా విసిరినా అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. మేమింతే మారమంతే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి సిబ్బంది వ్యవహారాలు చక్కబెడుతున్నా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

కూటమి సర్కారు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నా లేఖరుల అవతారమెత్తిన మధ్యవర్తుల ప్రమేయం లేకుండా దస్త్రం కదలడం లేదు. నేరుగా వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం దాదాపు అసాధ్యమే. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి వెళ్లినా ఏదో కొర్రీ పెట్టి ఫైలు వెనక్కి తిప్పిస్తారు. విజయవాడ నగర పరిధిలోని ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నేరుగా వెళ్లిన గన్నవరానికి చెందిన ఓ వ్యక్తిని పది రోజులు తిప్పించారు. ఓపిక నశించి మధ్యవర్తులకు 1శాతం కమీషన్ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరంతా

**కమీషన్ల దందా**

కార్యాలయాల చుట్టూ స్థావరాలు ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారు. అధికారులతో కుమ్మక్కయి కమీషన్లు దండుకుంటున్నారు. మధ్యవర్తులు లేకుండా వెళ్తే కొన్ని కార్యాలయాల్లో అధికారులు సమాధానం కూడా చెప్పరు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రకారం నెలకు రూ.10కోట్ల నుంచి రూ.15కోట్ల వరకు కమీషన్ల రూపంలోనే చేతులు మారుతున్నాయని తెలుస్తోంది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులను వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# దొంగనోట్లకు దొరికిపోవద్దు

**కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే**

**కొండపల్లికి చెందిన** ఓ పొదుపు సంఘం ప్రతి నెలా బ్యాంకులో డబ్బు జమచేసేందుకు వాయిదాల నగదుతో బ్యాంకుకు వెళ్తే ఆ నోట్లలో నకిలీ 500 నోట్లు రెండు వచ్చాయి. బ్యాంకు సిబ్బంది వాటిని తిరస్కరించారు. సంఘ సభ్యుల్లో ఎవరు ఇచ్చారో వారికి అర్థం కాలేదు.

**ఇబ్రహీంపట్నం కూడలిలో** రద్దీగా ఉండే ఓ హోటల్‌లో యజమాని రాత్రికి కలెక్షన్ చూడగా నకిలీ 500 నోట్లు మూడు కనిపించాయి. కౌంటర్‌లో ఉన్న సిబ్బందిని అడగ్గా ఎవరూ మాట్లాడకపోవడంతో అతను నివ్వెరపోయాడు.

పాల బిల్లుల్లో సూపర్‌వైజర్‌కు ఒక రెండు నకిలీ 500 నోట్లు వచ్చాయి. నగదు అప్పగించే క్రమంలో వాటిని గుర్తించారు. అది ఎవరి నుంచి వచ్చిందో అర్థం కాలేదు. తానే భరించాల్సి వచ్చింది. ఇలా ప్రజలు నకిలీ నోట్లకు దొరికిపోతున్నారు.

**ఇలా గుర్తించండి: పవన్‌కుమార్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్, కొండపల్లి బ్రాంచ్**

దొంగనోట్లను గుర్తించేందుకు ఆర్‌బీఐ 16కు పైగా సూచనలు ఇచ్చింది. ★ ముఖ్యంగా నోటు పొడవు 63 మి.మీ, వెడల్పు 150 మిమీ ఉంటుంది. ★ దేవనాగరి భాషలో భారత్, ఇండియా అని అతి చిన్న అక్షరాలు ఉంటాయి. ★ సెక్యూరిటీ త్రెడ్‌పై బులుగు, పచ్చ వర్ణాలతో ఆర్‌బీఐ, భారత్ అని ఉంటుంది. ★ నోటు కుడివైపు భాగంలో గవర్నర్ సంతకం, నోటు కింది భాగం, పైభాగంలో వాటి నంబర్ ఉంటుంది. ★ కుడి భాగంలో బోటమ్ వద్ద 500 సింబల్‌ను కచ్చితంగా గమనించాలి. ★ అశోక పిల్లర్ ఎంబ్లమ్ ఎడమ భాగంలో గమనించాలి. ★ స్వచ్ఛ భారత్ లోగో, నినాదం ఉంటుంది. ★ నోటు కుడి ఎడమ భాగం తెల్లని ప్రాంతంలో, నోటు మధ్య భాగంలో మహాత్మాగాంధీ సింబల్‌ను కచ్చితంగా గమనించాలి. ఇవేవీ లేకుంటే కచ్చితంగా నకిలీ అని గుర్తించాలి.

అసలైన రూ.500 నోట్లు

**ఏం చేయాలంటే: సీఐ చంద్రశేఖర్**

ఎవరికైనా దొంగనోటు వస్తే స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఏటీఎంలో వచ్చినా సరే.. దాని ఆధారాలతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అనంతరం విచారణ జరుగుతుంది.

# ఫిర్యాదు చేయొచ్చు.. పరిహారం పొందొచ్చు..

**న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్**

☛ **మచిలీపట్నంకు చెందిన ఎం.వేణు** అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 35,999 విలువైన స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేశారు. తాను ఆర్డర్ చేసినది కాకుండా వేరే ఫోన్ పంపించడంతో తాను చెల్లించిన డబ్బులు ఇవ్వాలని కోరుతూ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన కమిషన్ ఆర్డర్ చేసిన ఫోను, లేదా చెల్లించిన నగదు ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశించింది.

★ పైన చెప్పిన ఫిర్యాదుదారు నష్టం జరిగిందని వదిలేయకుండా ఫిర్యాదు చేసి పరిహారం పొందారు. చాలా మంది వినియోగదారుల కమిషన్ గురించి తెలియక నష్టపోతున్నారు.

**ఉ**మ్మడి జిల్లాలో రెండు వినియోగదారుల కమిషన్ కార్యాలయాలు ఉన్నాయి. ఒకటి మచిలీపట్నంలో, మరొకటి విజయవాడలో ఉంది. ఇటీవల విజయవాడలో అదనంగా మరో బెంచ్ ఏర్పాటు చేశారు.

**సేవా లోపం ఉంటే:** కొనుగోలుకు సంబంధించిన పత్రాలతో తెల్లకాగితంపై రాసి కమిషన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు.

మచిలీపట్నం కార్యాలయ ఫోన్‌నెం: 08672-229862,08672-229832

విజయవాడ కార్యాలయ ఫోన్‌నెం: 0866-257361

**తీర్పు ఎప్పుడు వస్తుంది:** కమిషన్‌కు ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో తీర్పు వస్తుంది.

**ఫిర్యాదుకు చెల్లించాల్సిన ఫీజు**

| పరిమితి | రుసుము(రూ.) |
|---|---|
| రూ.5లక్షలలోపు | ఫీజు లేదు |
| 5-10 లక్షలు | 200 |
| 10-20 లక్షలు | 400 |
| 20-50 లక్షలు | 1000 |
| 50లక్షలు-కోటి | 2000 |
| 1-2 కోట్లు | 2,500 |
| 2-4 కోట్లు | 3,000 |
| 4-6 కోట్లు | 4,000 |
| 6-8కోట్లు | 5,000 |
| 8-10కోట్లు | 6,000 |
| 10కోట్లపైన | 7,500 |

**సంస్థ ఎక్కడున్నా..**

★ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ కొనుగోళ్లు అత్యధికంగా ఉంటున్నాయి. కంపెనీలు దేశంలో ఎక్కడో ఉంటాయి. కానీ సవరించిన చట్టం ప్రకారం వినియోగదారులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలోని వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వస్తువుల్లో నాణ్యత, వివిధ రకాల సేవల్లోని లోపాలు, తదితర సమస్యలపై కూడా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించొచ్చు.

**త్వరితగతిన విచారణ**

- సీహెచ్ కిషోర్‌కుమార్, కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు

వినియోగదారుల చట్టం ప్రకారం నష్టపోయిన దానికి పరిహారం పొందడం అనేది హక్కు. కేసుల విచారణ కూడా వేగవంతంగా పూర్తి చేసి తీర్పులు ఇవ్వడం జరుగుతుంది.

# నాణ్యత తీసికట్టు.. నిధులు కొల్లగొట్టు

- నాసిరకంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- గ్రామ నాయకులు, గుత్తేదారుల కుమ్మక్కు

"ఇదీ మోపిదేవి మండలం పెదప్రోలులోని సీసీ రహదారి. దీన్ని నిర్మించి ఆరు నెలలు కాకుండానే ఇలా నాలుగుచోట్ల అడ్డంగా బీటలు వారింది. రహదారి అంచులు కూడా జారిపోతున్నాయి. రహదారి నిర్మాణం సమయంలో ఎర్త్‌వర్క్ సవ్యంగా చేయకపోవడం, సిమెంట్ నాణ్యత లోపాల వల్లే ఇలా జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

"ఇదీ కంకిపాడులో తాజాగా నిర్మించిన డ్రెయిన్. దీని నిర్మాణంలో కనీస ప్రమాణాలు కనిపించడం లేదు. కాస్త ఒత్తిడి పడితే చాలు సిమెంట్ ఇసుకలా ఇలా రాలిపోతోంది. డ్రెయిన్ బలంగా ఉండేందుకు రహదారికి, డ్రెయిన్‌కు మధ్య చిప్స్ పోయకుండా డ్రెయిన్ నుంచి తీసిన సిల్ట్ మట్టినే పోశారు. వాహనాలు రోడ్డుదాటి పక్కకు వెళితే డ్రెయిన్లు ఒరిగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

**కృష్ణాలో పల్లె పండగ పనులిలా..**
- మంజూరైన పనులు: 2,100
- రహదారుల నిర్మాణం: 225 కి.మీ
- నిధుల కేటాయింపు: రూ.164 కోట్లు

**ఈనాడు, అమరావతి**

**ప**ల్లె పండగలో భాగంగా చేపడుతున్న సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంలో చాలాచోట్ల నాణ్యతకు నీళ్లొదులుతున్నారు. స్థానిక నాయకులు, గుత్తేదారులు కుమ్మక్కయి సర్కారు ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. బిల్లులు చేసుకుని చేతులు దులుపేసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో రహదారులు నిర్మించి ఏడాది కాకుండానే బీటలు వారుతున్నాయి. ఇక నాణ్యత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల పర్యవేక్షణ లోపం ఈ పరిణామాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**వెక్కిరిస్తున్న లోపాలు..** వైకాపా పాలనలో పల్లె ప్రగతికి పైసా విదల్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పల్లెపండగ పేరుతో రహదారులు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులు పట్టాలెక్కించింది. పనులు చేపట్టే విధానం, నాణ్యతా ప్రమాణాల విషయంలో మండల స్థాయి అధికారులందరికీ కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆశయం బాగున్నా క్షేత్ర స్థాయిలో పరిణామాలు భిన్నంగా ఉన్నాయి. స్థానిక నాయకులకు ముడుపుల ఎర చూపి కొందరు వైకాపా స్థానిక నాయకులు పనులు దక్కించుకున్నారు. మోపిదేవి మండలంలో వైకాపా చెందిన గుత్తేదారుడు చేసిన పనుల నాణ్యత దారుణంగా ఉంది. రహదారులు కంగిపోవడం, బీటలు పడడంతో మరికొన్ని నెలల్లోనే ఆ రహదారులు ఛిద్రమయ్యే పరిస్థితులున్నాయి. చాలా పంచాయతీల్లో సర్పంచులు, గుత్తేదారులు ఏకమై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై డ్వామా పీడీ శివప్రసాద్ మాట్లాడుతూ నాణ్యతా లోపాలున్న రహదారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పైసా లేదు.. బెయిల్‌కు సాయం చేయండి

- పోలీసులతో ప్రధాన నిందితుడు
- కస్టడీలో సరైన సమాధానాలివ్వని వైనం

**ఈనాడు, అమరావతి**

'**నా** వద్ద రూపాయి లేదు. బెయిల్ వేసుకునేందుకూ డబ్బుల్లేవు. అందుకే వేసుకోలేదు. మీరే డబ్బు ఎరేంజ్ చేయండి..' అని అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్య చెబుతున్న సమాధానం ఇది. భారీగా డిపాజిట్లు వసూలు చేసి, ఆనక చెల్లించకుండా బోర్డు తిప్పేసిన కేసులో ఆదిత్య (ఏ1)ను కస్టడీలో భాగంగా ప్రశ్నించిన పోలీసులకు వచ్చిన సమాధానాలు విని వారే నిర్ఘాంతపోయారు. ఈ కేసులో కీలక నిందితులైన ఆదిత్యతో పాటు అతని భార్య సుజాత (ఏ2), కీలక ఏజెంట్ బాలకృష్ణ (ఏ3)లను పోలీసులు కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. నిందితులను విచారించిన క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, సెంట్రల్ ఏసీపీ దామోదర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, తదితరులు నిందితులను ప్రశ్నించారు. ఆదివారం రెండో రోజు కస్టడీలో వీరిని పలు ప్రశ్నలు అడిగారు. దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. తమ వద్ద డబ్బుల్లేవని ముగ్గురూ సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. సోమవారంతో కస్టడీ ముగుస్తుంది. మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపర్చిన తర్వాత కారాగారాలకు తరలించనున్నారు.

ఆదిత్య

**వీడని లెక్కల గుట్టు..** వసూలు చేసిన డిపాజిట్లలో రూ. 39.50 కోట్లకు అసలు లెక్కలు లేనట్లు దర్యాప్తులో తేలింది. ఈ సొమ్మును ఎక్కడికి తరలించాడన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని విదేశాలలో పెట్టుబడులకు వినియోగించినట్లు అనుమానిస్తున్నారు. ఈ అంశంపై ఎన్ని సార్లు ప్రశ్నించినా సరైన సమాధానాలు రాలేదు. తన వద్ద పైసా లేదని మాత్రమే పదే పదే చెప్పాడు. ఆదిత్యకు సంబంధించి మూడు ఖాతాలను పోలీసులు పరిశీలించగా వాటిలో డబ్బులు లేవని తెలిసింది. డిపాజిటర్లు, ఏజెంట్లకు న్యాయంగా ఇవ్వాల్సిందంతా ఇచ్చానని సమాధానమిచ్చాడు.

**తానే పెట్టుబడి పెట్టానని బాలకృష్ణ బుకాయింపు..** ఈ కేసులో బాలకృష్ణ, అతని సతీమణి ఇద్దరూ రూ. 9కోట్లు అయాచితంగా లబ్ధి పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సొమ్ము గురించి బాలకృష్ణను ప్రశ్నించారు. తాను లబ్ధి పొందలేదని, ఆదిత్యకు రూ. 6.50 కోట్ల మేర పెట్టుబడి పెట్టానని.. ఆ సొమ్మే తాను తీసుకున్నానని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. అంత సొమ్ము ఎలా సంపాదించారని పోలీసులు ప్రశ్నించగా తనకు రెండు కంపెనీలు ఉన్నాయని, వాటి ద్వారా ఆదాయం వచ్చిందని అన్నట్లు తెలిసింది.

## సీజేఐకి ఆత్మీయ వీడ్కోలు

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు వీడ్కోలు పలుకుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పక్కన కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** గుంటూరు జిల్లా మంగళగిరి పర్యటన ముగించుకొని ప్రత్యేక విమానంలో దిల్లీ వెళ్లేందుకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు హైకోర్టు న్యాయమూర్తులు, అధికారులు ఆదివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు సీజేఐకి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## మోపిదేవికి పోటెత్తారు..

కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా వచ్చారు.

ఆలయం బయట, లోపల భక్తుల రద్దీ

– న్యూస్‌టుడే, మోపిదేవి

# రాములోరి భూమి.. రాసుకునోళ్లదంట..!

**ఈనాడు, అమరావతి**

**దే**వాదాయశాఖ భూములపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. దేవాదాయ, రెవెన్యూశాఖకు చెందిన కొందరు అధికారులే అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారు. తాజాగా విజయవాడ మల్లికార్జునపేటలో ఇంద్రకీలాద్రి కొండపైనే ఉన్న పట్టాభిరామస్వామి ఆలయానికి చెందిన రూ.కోట్ల విలువైన భూమిని అక్రమార్కులు కబ్జా చేశారు.

**అడంగల్‌లో పేర్లు మార్చేసి..**

గొల్లపూడి బైపాస్ రోడ్డు సమీపంలో ముస్తాబాద కాలువ వద్ద ఆర్.ఎస్.నంబరు. 528/3లో 'బెజవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపైనున్న పట్టాభి రామస్వామి ఆలయం' పేరుతోనే 1.96 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని పినిశెట్టి వెంకమ్మ 1946లో ఆలయానికి రాసిచ్చారు. ఆలయం పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.25కోట్లు. భూమిని కౌలుకు ఇచ్చాక కొందరు అక్రమార్కుల కన్ను ఈ పొలంపై పడింది. తర్వాత కౌలుకు తీసుకున్నవారితో కలిసి రెవెన్యూ సిబ్బంది సహకారంతో డి.శ్రీదేవి, కోటేశ్వరరావు, ఎన్.మల్లికార్జునరావు సహా ఎనిమిది మంది పేర్లపైకి అడంగల్‌లో మార్చేసుకున్నారు. ఒక్కొక్కరికీ 24 సెంట్ల చొప్పున పంచుకున్నారు.

**రూ.25 కోట్ల విలువైన ఆలయ మాన్యం కబ్జా**

పట్టాభిరామస్వామి ఆలయం

**సామాజిక కార్యకర్తల ఫిర్యాదుతో..**

పుష్కరాల సమయంలో 2016లో పట్టాభిరామస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆ తర్వాత ఈ ఆలయానికి చెందిన భూమి ఆక్రమణల చెరలో ఉన్న విషయం తెలిసి.. నాటి అధికారులు విగ్రహ ప్రతిష్ఠాపన చేయకుండా వదిలేశారు. దీనిపై కొందరు సామాజిక కార్యకర్తలు దృష్టిపెట్టి అధికారులకు ఫిర్యాదులు చేసి నివేదికలు అందజేశారు. దీంతో 2018లో దుర్గగుడి ఈవో స్పందించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ నిర్వహణ, దూపదీప నైవేద్యాల కోసం ఏటా రూ.లక్ష దుర్గగుడి నుంచి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు.

**దేవాదాయశాఖ 43(10) రిజిస్టర్‌లో నమోదు..**

ఈ భూమి పట్టాభిరామస్వామి ఆలయానికి చెందినదంటూ దేవాదాయశాఖకు చెందిన 43(10) రిజిస్టర్‌లోనూ నమోదు చేశారు. ఆ తర్వాత వచ్చిన అధికారులెవరూ దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఇప్పటికీ అక్రమార్కుల చెరలోనే ఉంది. రికార్డులు మార్చినందుకు అధికారులు ఇప్పటివరకు పోలీసు కేసు కూడా పెట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేశాం**

– సుబ్బారావు, పట్టాభిరామస్వామి ఆలయ ఈవో

ఆలయానికి చెందిన 1.96 ఎకరాల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలంటూ దరఖాస్తు చేశాం. ఈ వ్యవహారం ట్రిబ్యునల్‌లో ఉండడంతో తీర్పు వచ్చాకే ఇస్తామంటూ రెవెన్యూ అధికారులు చెప్పారు. ఆ భూమి ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అడ్డుకున్నాం.

(c) eenadu

# నల్ల ద్రాక్షలతో అభిషేకం

నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం పుష్కర్ ఘాట్‌లో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రామలింగేశ్వరుడ్ని 108 కేజీల నల్ల ద్రాక్షలతో అభిషేకించారు. సహస్ర దీపోత్సవం నిర్వహించారు. - నాగాయలంక, న్యూస్‌టుడే

భారీగా తరలివచ్చిన భక్తజనం

# ఇంటి పన్ను వసూళ్లలో అవకతవకలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

తోట్లవల్లూరు గ్రామ పంచాయతీలో రెండేళ్ల కాలంలో ఇంటి పన్ను వసూళ్లలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ సిబ్బందికి ఇంటి పన్ను చెల్లించినా, ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్ణ పంచాయతీ యాప్‌లో బిల్లు కట్టలేదని చూపిస్తోందని ఆదివారం పలువురు బాధితులు విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీలో 2023-24వ సంవత్సరంలో రూ. 15,02,500లకు గాను రూ. 11,42,000 వసూలు చేయగా రూ. 3,60,500 పెండింగ్ ఉంది. 2024-25లో రూ. 15,81,450లకు రూ. 10,00,560 వసూలు చేయగా రూ. 5,80,890 పెండింగ్. 2025-26వ సంవత్సరం వరకు తహసీల్దార్ కార్యాలయం పెండింగ్ బిల్లు రూ. 85,216. మండల పరిషత్తు కార్యాలయం రూ. 6,40,738, ఆ కార్యాలయం పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ బిల్లు రూ. 1,23,794గా ఉంది. గత ఐదేళ్ల కాలంలో ఇంటి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగాయని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి పన్ను, వాటర్ ట్యాక్స్ వసూలు చేసి కొంత జమ చేసి, మిగతాది జమ చేయలేదని అధికారులే చెబుతున్నారు. గ్రామస్థులు సక్రమంగా ఇంటి పన్నులు చెల్లించినా, స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఎందుకు కట్టలేదని చూపిస్తోందని గ్రామ పంచాయతీకి వెళ్లి నిలదీస్తున్నారు. కట్టిన బిల్లులు ఉన్నవారు పంచాయతీ యంత్రాంగానికి చూపిస్తున్నారు. లేనివారు లబోదిబోమంటున్నారు. అధికారులు మాత్రం.. మీరు డబ్బులు చెల్లించినప్పుడు బిల్లు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. దీంతో తోట్లవల్లూరు గ్రామంలో గందరగోళం నెలకొంది. అధికారుల పర్యవేక్షణలోపం వల్లే ఇదంతా జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అవకతవకలపై పై అధికారులు స్పందించి విచారణ చేసి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

★ 2024-25కి రూ. 4999 ఇంటి పన్ను చెల్లించాను. స్వర్ణ పంచాయతీ యాప్‌లో పెండింగ్ చూపిస్తోంది. కాయ కష్టం చేసుకుని ఇంటి పన్ను చెల్లిస్తే మళ్లీ కట్టమంటే ఎక్కడ తెచ్చి కట్టగలం?
- మండా శ్రీనివాస్

★ కట్టిన బిల్లులు తెస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. డబ్బులు చెల్లించి బిల్లు తీసుకోకపోతే మాకు సంబంధం లేదు.
-వెంకటేశ్వరమ్మ, ఈవోపీఆర్‌డీ, తోట్లవల్లూరు మండలం

# చేయి తడపనిదే.. పనులు జరగవిక్కడ..?

## అక్రమాలకు అడ్డాగా పలు తహసీల్దార్ కార్యాలయాలు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం
– న్యూస్‌టుడే, కూచిపూడి

జిల్లాలోని పలు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందని ద్రాక్షలా మారుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో అయితే భూముల దస్త్రాలు, పాస్ పుస్తకాలు, వారసత్వ హక్కులు, పన్నులు, మ్యూటేషన్, కుల, ఆదాయ, కుటుంబ ధ్రువపత్రాలు మొదలు.. ప్రతి చిన్నపనికీ ముడుపులు సమర్పించాల్సిందే. మరోవైపు మట్టి, ఇసుక, బుసక అక్రమంగా తోడేసుకునేందుకు గ్రామం నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు వాటాలు సమర్పించుకుంటున్నట్లు మాఫియాలోని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. కుటుంబ ఆస్తుల వివాదాలకు సంబంధించి ఎవరు ఎక్కువగా సమర్పించుకుంటే వారికే ఎక్కువ దక్కేలా కార్యాలయాల్లో పత్రాలు సృష్టిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా ఏళ్లుగా జిల్లాలోనే పాతుకుపోయిన పలువురు రెవెన్యూ అధికారులు అవినీతి తిమింగలాలుగా మారి రాజ్యమేలుతున్నారు.

పనిని బట్టి రేటు: మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో మామూళ్లు ఇవ్వనిదే ఏ పని చేయడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పనిని బట్టి రేటు నిర్ణయించి, అటెండర్ నుంచి అధికారుల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. ఇటీవల ఓ కుటుంబానికి సంబంధించి తల్లిదండ్రుల ఆస్తులను సోదరికి తెలియకుండా సోదరుడు పొందేందుకు అధికారులకు రూ. 60 వేలు ఇచ్చి అక్రమ మార్గంలో కుటుంబ ధ్రువపత్రం పొందినట్లు సమాచారం. ★ ఇదే కార్యాలయం పరిధిలోని ఓ గ్రామంలో వీఆర్‌ఏ పోస్టుకు రూ. 4లక్షలు తీసుకుని అర్హత లేకపోయినా నకిలీ పత్రాలు సృష్టించి కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. ★ ఇటీవల ఓ సామాజికవర్గ నేత రూ. 30 వేలు చెల్లించి సరైన పత్రాలు లేకపోయినా పొజిషన్ సర్టిఫికెట్ పొందినట్లు తెలిసింది. ★ ఈ కార్యాలయానికి చెందిన ఓ అధికారి వేరే చోట డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తూ చేతులు తడిపితే ఇక్కడి నుంచి పత్రాలు మంజూరు చేస్తున్నట్లు విమర్శలున్నాయి.

### నా సంతకం లేకుండా ధ్రువపత్రం ఇచ్చారు

నా ఆధార్ కార్డు ఉపయోగించి సంతకం లేకుండా.. వేరే మహిళతో కొన్ని దస్త్రాల్లో వేలిముద్ర వేయించుకొని నా సోదరుడికి కుటుంబ ధ్రువపత్రం మంజూరు చేశారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే ఇప్పుడా వచ్చేదని అమర్యాదగా మాట్లాడారు. అప్పటికే భూమిని నా సోదరుడు వారి కుమార్తెలకు రిజిస్ట్రేషన్ చేశారు. విచారించకుండానే ధ్రువపత్రం మంజూరు చేసినందుకు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.
-రాజులపాటి నాగమల్లేశ్వరి (కోసూరు)

### వివాదంలో ఉన్నట్లు నమోదు చేశాం

'ఫ్యామిలి సర్టిఫికెట్ విషయంలో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వారి ఫిర్యాదు మేరకు వివాదంలో ఉన్నట్లుగా నమోదు చేశాం'అని తహసీల్దార్ మస్తాన్ తెలిపారు.

# పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

## ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఈనాడు, అమరావతి : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మార్చారని తెదేపా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు చారిత్రాత్మకంగా నిలిచిందని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన ఎన్నో కంపెనీలు కూటమి ప్రభుత్వం తెచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీకి ఆకర్షితులై తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రంలో పెట్టుబడుల వికేంద్రీకరణ జరుగుతోంది. మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. సీఐఐ సదస్సులో మొత్తం 613 ఒప్పందాలు జరిగాయి. సుమారు రూ. 3,65,304 కోట్ల పెట్టుబడులు రానున్నాయి" అని వెనిగండ్ల రాము తెలిపారు.

# 19న దివిసీమ ఉప్పెన సంస్మరణ సభ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఈనెల 19వ తేదీన 1977 దివిసీమ ఉప్పెన 48 సంవత్సరాల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాడు శవాల దిబ్బగా మారిన దివిసీమ పునర్నిర్మాణానికి పరితపించిన నాటి మండలి వెంకట కృష్ణారావు కృషికి తోడుగా నిలిచిన మానవతా మూర్తులకు దివ్య వందనం సమర్పించటమే ఈ సభ ఉద్దేశం అన్నారు. 19వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీక్షేత్రంలో జరిగే సభకు ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్, దీనదయాళపురం నిర్మాణకర్త బండారు దత్తాత్రేయ, గౌరవ అతిథులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి, విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి శివకళానంద మహారాజ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జాతీయ ప్రకృతి వైపరీత్యాల నిపుణుల సంస్థ మాజీ సభ్యులు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ డి. విజయభాస్కర్ రచించిన 'మహాపురుషుడు మండలి' నాటకాన్ని గంగోత్రి సాయి దర్శకత్వంలో 40 మంది కళాకారులు ప్రదర్శిస్తారన్నారు. సమావేశంలో మండలి వెంకట్రామ్, మత్తి శ్రీనివాసరావు, పాలపర్తి శ్యామలానందప్రసాద్, రాయపూడి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ధాన్యపు రాశులతో సందడి

జాతీయ రహదారిపై రైతుల సందడి నెలకొంది. వరి పొలాలను హార్వెస్టర్ మిషన్‌తో నూర్పిడి చేస్తున్నారు. నూర్చిన పంటలో తేమశాతం అధికంగా ఉండటంతో జాతీయ రహదారిపై ఆరబెడుతున్నారు. మోపిదేవి వార్పు నుంచి బందరు కాలేజీ పేట వరకు దాదాపు 27 కిలోమీటర్ల మేర ఇలా ధాన్యపు రాశులు కనువిందు చేస్తున్నాయి. - మోపిదేవి, న్యూస్‌టుడే

# జానకిరామయ్య జీవితం ఆదర్శనీయం

క్షీర విప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయ డెయిరీ మాజీ ఛైర్మన్ మండవ జానకిరామయ్య జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. జానకి రామయ్య సంతాప సభ గన్నవరం పట్టణ శివారులోని ఎస్‌ఎంకె కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, వర్ల కుమారరాజా, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, తెదేపా నేతలు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మానం బ్రహ్మయ్య, కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ సీహెచ్ రాజేశ్వరరావు, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు తదితరులు పాల్గొని జానకిరామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. విజయ డెయిరీ, రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. 'క్షీరవిప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య' అనే పుస్తకాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయా డెయిరీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# అందుబాటు ధరల్లో గృహాలు

కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్

గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా హరివిల్లు సంస్థ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో గృహాలు, స్థలాలు అందిస్తూ సొంతింటి కలను సాకారం చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మండలం గండిగుంటలో హరివిల్లు గ్రీన్ విస్తారా ప్రాజెక్టులో భాగంగా 23 సెమీ-విల్లా ఆధారిత ఇండిపెండెంట్ గృహాలు, 4 అంతస్తుల క్లబ్ హౌస్‌కు ఆదివారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. హరివిల్లు ఛైర్మన్ [illegible] చౌదరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సొంతిల్లు ఉండాలని కోరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, హరివిల్లు సీఈవో జాస్తి ప్రసన్న, అడ్మిన్ మేనేజర్ పద్మజ, రిలేషన్ షిప్ మేనేజర్ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మోపిదేవి ఆలయం కిటకిట

## మధ్యలోనే ఆర్జిత సేవల నిలుపుదల

మోపిదేవి, న్యూస్‌టుడే: కార్తికమాస చివరి ఆదివారం, సెలవు రోజు అవటంతో మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ క్యూలైన్లు ఉదయం 10గంటలకు ఒక్కసారిగా వేలాది మందితో నిండిపోయాయి. జాతీయ రహదారిపై ఎండలో మండుతూ గంటలసేపు భక్తులు నిలబడ్డారు. దీంతో అప్పటివరకు నిర్వహించిన అన్నిరకాల ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేసి సాధారణ దర్శనం వైపు భక్తులను మళ్లించారు. పురవీధులు జనంతో నిండాయి. పలు మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రూ. 10,72,046 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఎస్.ఐ సత్యనారాయణ నేతృత్వంలో భక్తులను క్రమబద్ధీకరిస్తూ తోపులాట లేకుండా సిబ్బందికి సూచనలిచ్చారు.

# అమ్మ దర్శనం.. కనులారా వీక్షిద్దాం..

క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో ఘాట్ రోడ్డు, మెట్ల మార్గాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ నిండిపోయింది. దేవస్థానం ఈవో శీనానాయక్ ఘాట్ రోడ్డులో వచ్చే వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. భక్తులు తమ వాహనాలను కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి రథం సెంటరు వరకు నిలిపి నడిచి లిఫ్టు మార్గానికి వచ్చారు. అమ్మవారికి నివేదన సమయంలో దర్శనం కొంత సేపు నిలిపి వేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. లిఫ్టు మార్గం సైతం కిక్కిరిసింది.

# గుడివాడ మట్టిలో ఏదో మహత్యం ఉంది: కామినేని

## ఆనందోత్సాహాల మధ్య కమ్మ మహాజన సంఘ కార్తిక వనసమారాధన

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మట్టిలో ఏదో తెలియని మహత్తర శక్తి ఉందని, అందుకే ఈ గడ్డపై నుంచి చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్, ఏఎన్ఆర్, రామోజీరావు లాంటి ఎందరో మహానుభావులు జన్మించారని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో కమ్మ మహాజన సంఘ కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల క్రితమే గుడివాడ ఎంతో సంపన్నంగా ఉండేదన్నారు. సమాజంలోని అన్ని వర్గాలతోనూ సత్సంబంధాలు కలిగి ఉంటేనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈక్రమంలోనే కమ్మ సామాజిక వర్గం సేవలో ముందుకు సాగాలన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ 'సొంత లాభం కొంత మానుకుని సాటి వారికి సాయపడవోయ్' అన్న పెద్దల మాటను పాటిస్తూ సమాజంలో ఇతర వర్గాలకు అండగా ఉండే సామాజిక వర్గం కమ్మ సామాజిక వర్గం అన్నారు. ప్రతీ ఏటా వీరు పేద విద్యార్థుల సంక్షేమం కోసం లక్షలాది రూపాయలను సాయం చేస్తున్నారని అన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరం కలిసి శ్రమిస్తేనే గుడివాడ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, తెదేపా నేతలు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, లింగం ప్రసాద్, చేకూరు జగన్ మోహన్‌రావు, పట్టణ ప్రముఖులు పాలడుగు వెంకట్రావు, వీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి వెంకటేశ్వర కోదండ రామయ్య, గౌతమ్ పాఠశాల ఛైర్మన్ కొసరాజు అవినాష్, కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ మన్నెం భవానీ శంకర్, ఉపాధ్యక్షుడు పిన్నమనేని సాంబశివరావు, కార్యదర్శి కంభంపాటి రవి, గౌరవాధ్యక్షుడు వల్లూరిపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోశాధికారి రావి శ్రీనివాస్ చౌదరి, విద్యా కమిటీ ఛైర్మన్ గవిర్నేని బాబూ శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు.

# డిసెంబరులో అమరావతి బాలోత్సవం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : అమరావతి బాలోత్సవం (8వ పిల్లల పండగ) డిసెంబరు 9, 10, 11 తేదీల్లో సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. ఆదివారం బాలోత్సవ భవన్‌లో కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే 'థీమ్'తో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తరగతి గదుల్లో ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాల్లో వారి ప్రతిభ, శక్తి సామర్థ్యాలు ప్రదర్శించే వేదికగా బాలోత్సవం జరుగుతుందన్నారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అకడమిక్, కల్చరల్ అంశాల్లో 60 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 200 పాఠశాలల నుంచి సుమారు 1500మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సేవలు అందించేందుకు సుమారు 200 మంది వాలంటీర్లను నియమించినట్లు చెప్పారు.

# భాజపా నేత అరెస్టును నిరసిస్తూ ఆందోళన

పోలీసులను ప్రశ్నిస్తున్న భాజపా నేతలు

పెడన, న్యూస్‌టుడే: భాజపాకు అనుబంధంగా ఉన్న హిందూ బంధువుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావును పెడన పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. పెడన గ్రామ దేవత పైడమ్మ తల్లి ఉత్సవాల్లో వివిధ హక్కులకు వేలం పాటల నిర్వహణ, దిల్లీ బాంబు పేలుడు ఘటనకు సంబంధించి ఆయన సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్‌పై కొన్ని సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు పెడనలోని ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలోని ఆయన నివాసం నుంచి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న భాజాపా నేతలు, ఐక్యవేదిక ప్రతినిధులు పోలీసుస్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. అరెస్టుపై రూరల్ సీఐ నాగేంద్ర ప్రసాద్, పెడన ఎస్సై గంట్ల సత్యనారాయణలను ప్రశ్నించారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో కోటేశ్వరరావును బయటకు విడిచిపెట్టారు. అనంతరం తరలివచ్చిన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరాం, మాజీ అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, పంతం గజేంద్ర, పుప్పాల రాము, అయోధ్య రాము తదితరులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తుండగా పోలీసు అధికారులకు వారికి వాదోపవాదాలు జరిగాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న దశలో మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా పెడనకు రాగా భాజపా శ్రేణులతో ఆయన జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని, చట్ట పరంగా ముందుకు వెళతామని స్పష్టంచేశారు.

# ప్రధానోపాధ్యాయుల సమస్యలపై చర్చ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించాలని.. దీనికి మంత్రి నారా లోకేశ్‌ను ఆహ్వానించాలని తీర్మానించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులో ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మించిన పాఠశాల క్లస్టర్లను బలోపేతం చేయడం, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టును గ్రేడ్-1 పోస్టుగా పెంచాలని కోరారు.


91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297


## బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

## నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

# ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఈత పోటీలు

గ్రూపు-5, 4లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించిన క్రీడాకారులతో అతిథులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ (గ్రూపు- 5, గ్రూపు- 4 బాల, బాలికల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో (గ్రూపు-5 బాలికల విభాగంలో ఆర్. జస్విత (ఎన్టీఆర్), బాలుర విభాగంలో టి. జశ్వంత్ (గుంటూరు), (గ్రూపు- 5 బాలికల విభాగంలో పి. జాహ్నవి (అనంతపురం), వేదాంత్ గౌతమ్ పాంచాల్ (విశాఖ) వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. కృష్ణా జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎ. శ్రీధర్ ప్రారంభించారు. రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘం ఛైర్మన్ రవికాంత్ కొంగర, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో కె. కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా సంఘం ఛైర్మన్ యలమంచిలి వెంకట సురేష్, అధ్యక్షుడు డీవీడీవీ భాస్కర్, కోశాధికారి పి. బాల మురళీకృష్ణ, స్విమ్మింగ్ పూల్ ఇన్‌ఛార్జి యు. అనిల్, రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘ కార్యదర్శి ఎ. మోహన వెంకట రామ్, కోశాధికారి ఐ. రమేష్, కృష్ణా జిల్లా డీఎస్‌డీవో ఎస్. ఝాన్సీలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం ఎ. మోహన వెంకటరామ్, పి. బాలమురళీకృష్ణ, వి. వినోద్, ఐ. రమేష్ హాజరై బహుమతులు అందజేశారు.


EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్, సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, ✆ 93969 99669.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూప్, VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

REAL ESTATE

PLOT FOR SALE

కేసరపల్లి - మేధా IT పార్క్ సమీపంలో 2100 చ॥గ॥ లేఅవుట్ స్థలం అమ్మకం. 60 అ॥ రోడ్, IT కంపెనీలు, కమర్షియల్‌కు, ఆఫీస్‌లకు అనుకూలమైనది. ✆ 70366 62888 ✆ 89780 66103

TO LET

COMMERCIAL

HYD హైవే 1-3/18-49 1stఫ్లోర్ తుమ్మలవారి వీధి విద్యాధరపురములో 4200 S.Ft గల 4 పోర్షన్స్ బ్యాంకులకు కమర్షియల్స్‌కు అద్దెకు ✆ 99514 98811

గవర్నర్‌పేట గోపాలరెడ్డిరోడ్ 27-11-18, G/Fలో 2500 S.Ft ఆఫీసులకు, బ్యాంకులకు, గోడౌన్స్‌కు, స్టాక్ పాయింట్స్‌కు అద్దెకు కలవు ✆ 99514 98811.

JOBS

Wanted Female Telecallers qualification any degree age limit: 25 to 45 years. Salary 10,000/- to 12000/- Working Location Master Minds College, Vijayawada. Contact Cell: 89781 80832.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

విజయవాడలోని అడ్వకేటు ఆఫీసులో పనిచేయడానికి టైపింగ్ వర్క్ తెలిసిన యువతులు (F) కావలెను. జీతం: 10 వేలు. ✆ : 63004 04861.

KOTAK నూతన బ్యాంక్ నందు పనిచేయుటకు Rtd,VRS,టీచర్స్ మరియు గృహిణులు కావలెను Q: SSC To P.G Age: 35& Above. ✆ 94935 75370

డ్రైవర్ కావలెను మరియు ఇంటిపని చేయుటకు లేడీ కావలెను ఒకే ఫ్యామిలీకి చెందినవారు విజయవాడవారికి ప్రాధాన్యత వసతి కల్పించబడును ✆ 98495 89459

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

## 19 నుంచి సేవా కార్యక్రమాలు

**మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే:** సత్యసాయిబాబా శతవర్ష జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి మచిలీపట్నం కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఈడేపల్లి సత్యసాయి మందిరంలో కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలతో పాటు నారాయణసేవ, నిత్యావసర సరకులు, దుస్తులు, దుప్పట్ల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు అనుమకొండ వెంకటేశ్వరరావు, వై.సాయిబాబు, ఎస్‌జీటీ సుందరి, పి.వరప్రసాద్, సాయి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ధర వరలు

టమాట 41, వంగ 58, బెండ 40, పచ్చిమిర్చి 44, కాకర 46, క్యాబేజీ 28, క్యారెట్ 70, దొండ 60, బంగాళదుంప 31, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 58, దోస 30, సొర 25, అరటికాయి 7,6, చిక్కుళ్లు 95, బీర 40, చామదుంప 28, మునగ 10/08, కంద 44, బీట్‌రూట్ 46, కీరదోస 38, బీన్స్ 68, క్యాప్సికం 66, అలసందలు 60, చిలకడదుంప 44, కొత్తిమీర 32/16, పుదీనా 20/5 **సోమవారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరల వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు.**

## సినిమాలు

**రేవతి:** కాంత **మినీ రేవతి:** సంతాన ప్రాప్తిరస్తు, **సిరికృష్ణ:** సిమంతం, **సిరివెంకట్:** దిగర్ల్‌ఫ్రెండ్. **- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే**

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

★ నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారి పక్కన వృక్షాలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉంది. ఈ విషయాన్ని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి శుభ్రం చేయించారు. ★ నగరంలోని రాజుగారి సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ప్రధాన డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉంది. దీనిపై పలువురు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. కమిషనర్ బాపిరాజు స్పందించి సమస్య పరిష్కరించారు. ★ నగరంలోని బుట్టాయిపేట ఎల్‌ఐసీ శిక్షణ కేంద్రం ఎదుట రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. ఈ సమస్యను ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి చెత్త తొలగించారు. ★ నగరంలోని బస్టాండ్ కూడలి నుంచి జిల్లా కోర్టు సెంటర్‌కు వెళ్లే దారిలో చెత్త తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. ★ నగరంలోని సుకర్లాబాద అంతర్గత డ్రెయిన్‌లో పూడిక తొలగించకపోవడంతో మురుగు పారడం లేదని ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి.. పూడిక తీయించారు. **- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే**

? పుల్లపాడు ఆర్‌అండ్‌బీ రహదారి మలుపు వద్ద కోతకు గురైంది. రాత్రి సమయాల్లో ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు** ✔ పరిశీలించి పరిష్కరిస్తాం. **-కిశోర్ ఆర్‌అండ్‌బీ జేఈ.** – న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

స్పందనకు వందనం

## అలంకారమేనా.. అక్కరకొచ్చేనా?

**మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే**

**పా**ఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, తాగునీటి అవసరాలను బట్టి గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కానీ వాటిలో చాలా వరకు ప్రారంభ సమయం నుంచే పడకేశాయి. నగరంలోని రుస్తుంబాద, రైలుపేట, గిలకలదిండి, లేడియాంప్తిల్ పాఠశాలలు, మండల పరిధిలోని చిన్నాపురం, అరిశేపల్లి, సుల్తానగరం, తుమ్మలపాలెం, నెలకుర్రు తదితర గ్రామాల్లో, పెడన నియోజకవర్గంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పథకాలు ఏళ్ల తరబడి అలంకార ప్రాయంగా మారడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెడన జడ్పీ ఉన్నత పాఠశాల ప్లాంట్‌కు ఉపాధ్యాయులు ఒకట్రెండు సార్లు మరమ్మతులు చేయించినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో తాగునీటికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

### గుత్తేదారుకు బాధ్యత అప్పగించినా..

ఆర్వో ప్లాంట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించే బాధ్యతను ఓ గుత్తేదారు సంస్థకు అప్పగించారు. కానీ వారు వచ్చి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఫోన్‌చేసినా స్పందించ లేదంటున్నారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో పెట్టుకొని కొన్ని చోట్ల ఉపాధ్యాయులే సొంత డబ్బులతో మరమ్మతులు చేయిస్తూ వచ్చారు. అయితే తరచుగా మరమ్మతులకు గురవుతుండటంతో ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి వస్తోందని, చేసేదిలేక అలా వదిలేశారు. చాలా ప్లాంట్లు ఆయా ప్రాంతాల్లోని బోర్లకు అనుసంధానించడంతో ఫిల్టర్లు తరచూ పాడైపోవడం, నీరు లీకవడం, స్కానర్లు పనిచేయకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చేసేది లేక స్థానిక రక్షిత నీటి పథకాల ద్వారా సరఫరా అయ్యే నీటిని విద్యార్థులకు అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల ఆర్వో ప్లాంట్ల సమస్యలపై అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. త్వరితగతిన వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైలుపేట పాఠశాలలో ఆర్వో ప్లాంట్ గదికి తాళాలు

## ఆలయాల్లో కార్తిక పూజలు

**మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే:** కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మచిలీపట్నం మండలంలోని శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌ఎన్ గొల్లపాలెంలోని ఉమా సమేత సోమేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకరుద్ర అభిషేకం, అర్చనలు చేశారు. మంగినపూడిలో నగరేశ్వరస్వామికి, పోతేపల్లిలో విజయ కనకదుర్గ మల్లేశ్వరస్వామికి, తపసిపూడిలో పార్వతీసమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు.

మంగినపూడిలో ప్రత్యేక అలంకరణలో నగరేశ్వరస్వామి

ఎస్‌ఎన్‌గొల్లపాలెంలో ఉమాసమేత సోమేశ్వరస్వామి

**మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే:** నగరంలోని పలు దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం, బిల్వార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గాంధీ బొమ్మ శివాలయంతో పాటు అయ్యప్పస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ఈడేపల్లి జోడుగుళ్ల ఆలయంలో హోమం నిర్వహించారు. బచ్చుపేట మల్లేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించారు.

బచ్చుపేట మల్లేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన

రామలింగేశ్వరునికి బిల్వార్చన

## ప్రభుత్వ మంచిని చెప్పండి.. దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

**మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించడంతో పాటు వైకాపా నాయకుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. తెదేపా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. తొలుత స్థానిక బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. పార్టీలో కష్టించి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందనడానికి తానే ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైకాపా నాయకులు మళ్లీ తగుదనమ్మా అంటూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, పదే పదే అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసింది తెదేపా అని అన్నారు. పదవులు పొందిన వారంతా బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనీల్‌కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాగిత వెంకటేశ్వరరావు, కాటం మధుసూదనరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు అన్నం సుధారాణి, నగర అధ్యక్షురాలు వేమూరి శ్రీదేవి, మండల అధ్యక్షురాలు నారగాని వాణితో పాటు వివిధ కమిటీల సభ్యులతో మంత్రి రవీంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో హసీమ్‌బేగ్, నారాయణప్రసాదు, గోపీచంద్, బాబాప్రసాదు, సత్యనారాయణ, మహంతిరాజా, ఫణికుమార్ పాల్గొన్నారు

వివిధ కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి రవీంద్ర

## సాహిత్యంపై క్విజ్ పోటీలు

**మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే:** ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యంలో సాహిత్య క్విజ్ పోటీలు నిర్వహించారు. రచయితలు గుడిపూడి రాధికారాణి, కలిదిండి రాంబాబు, కారుమూరి రాజేంద్రప్రసాదు, మేడిశెట్టి యోగేశ్వరరావులు పాల్గొని ప్రస్తుత సామాజిక పరిస్థితులు-మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పద్యాలు, కవితలను పూరించారు. క్విజ్ మాస్టర్‌గా అంబటిపూడి సుబ్రహ్మణ్యం, స్కోరర్‌గా వీఎస్వీ సురేష్‌బాబు వ్యవహరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ఆంధ్ర సారస్వత సమితి ప్రతినిధి అప్పినేడి పోతురాజు తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్య కేంద్రాలకు నిధుల మంజూరు

**పెడన (గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలంలో ఉరివి, కొంకేపూడి, కమలాపురం, చెన్నూరు గ్రామాల ఆరోగ్య ఉపకేంద్రాలకు 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరైనట్లు పీఆర్ ఏఈ వై.ధర్మయ్య పేర్కొన్నారు. ఒక్కో కేంద్రానికి రూ.38 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

## విద్య ప్రాధాన్యాన్ని గుర్తించాలి

**మంగినపూడి(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే:** సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాలను విద్య మాత్రమే ఉన్నత స్థితికి తీసుకెళ్లగలదని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్(శిక్షణ విభాగం) మోకా సత్తిబాబు అన్నారు. మంగినపూడి గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సత్తిబాబు మాట్లాడుతూ.. విద్యలో రాణించడం ద్వారానే రిజర్వేషన్లు అందిపుచ్చుకోగలరన్నారు. అట్టడుగు వర్గాల వారు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ గాయకుడు రెంజర్ల రాజేష్ మాట్లాడుతూ ఎస్సీలు ఉన్నత స్థానాలకు ఎదగాలంటే విద్యే ఆయుధమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘ నాయకులు మత్తే నాగరాజు, వంపుగడవల చౌదరి, బాలాజీ పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మోకా సత్తిబాబు

## త్రుటిలో తప్పిన ప్రమాదం

**కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే :** కీసర టోల్‌ప్లాజా వద్ద మచిలీపట్నానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు శనివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సాయి దాసరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి మచిలీపట్నం నుంచి హైదరాబాద్ బయల్దేరింది. కంచికచర్ల మండలం కీసర సమీపంలోని స్వర్ణ టోల్ ప్లాజా వద్ద బస్సు ఎయిర్ పైపు ఊడి నిలిచింది. అదే సమయంలో బస్సు కింద నుంచి స్వల్పంగా పొగ రాగా అప్రమత్తమైన డ్రైవర్ బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులను దించి ఇతర బస్సుల్లో పంపారు. బస్సు బ్రేక్ డౌన్ అవడంతో నిలిచిందని స్థానికులు తెలిపారు.

నిలిచిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

## కవన విజయం.. సామాజిక రూపం

కార్యక్రమంలో పాల్గొన్న చింతలపాటి, గుత్తికొండ తదితరులు

**మచిలీపట్నం (గొడుగుపేట):** అంతర్జాతీయ తెలుగు సాహితీ వేదిక వాఙ్మయి అధ్యక్షుడు చింతలపాటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం కవన విజయం-సామాజిక రూపం అనే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జి.సుబ్బారావుతో పాటు పలువురు రచయితలు, తెలుగు ఉపాధ్యాయుడు రాంబాబు తదితరులు సామాజిక అంశాలపై కవితలు, పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. గ్రంథాలయ సిబ్బంది, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

## వ్యర్థాల మేట.. మురుగుతో తంటా!

**న**గరంలోని వివిధ డ్రెయిన్లలో ఎగువ నుంచి వస్తున్న వ్యర్థాలు కల్వర్టుల వద్ద మేటవేసుకుపోతున్నాయి. వాటిని సకాలంలో తొలగించకపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. రైతు బజారు కూడలి సమీపంలో రహదారి పక్కన డ్రెయిన్లలో వ్యర్థాలు భారీగా నిలిచిపోయాయి. నెలల తరబడి వాటిని తొలగించకపోవడంపై ఆ ప్రాంత వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే మురుగుపారే దారిలేక రోడ్డుపైకి చేరుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **– మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే**

## గీత కార్మికుడికి ఆర్థిక సాయం

**బుద్దాలపాలెం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే:** అనారోగ్య కారణంగా మండలంలోని బుద్దాలపాలెం పంచాయతీ గొల్లగూడేనికి చెందిన కాగిత సుబ్బారావు అనే గీత కార్మికుడి కాలు తొలగించారు. ఈ నేపథ్యంలో అతడికి గౌడ సంఘం నాయకులు రూ.21వేలు, గీత బంధు ట్రస్టు ద్వారా రూ.10వేల చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుక్కల సత్యనారాయణ, సింహాద్రి రాంబాబు, పడమట రామమోహనరావు, కొనకళ్ల భాను, కట్టా దుర్గారావు, పామర్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు సాయం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**గూడూరు, న్యూస్‌టుడే:** మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంస్థ పెడన అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో అడపాల శివన్నారాయణ ఆర్థిక సహకారంతో ఆదివారం మండల పరిధిలోని కప్పలదొడ్డిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవ్, ఆనందరావు, సాయిబాబు, నాగేశ్వరరావు, విఘ్నేశ్వరరావు, విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు'

**కొమాళ్లపూడి, మునిపెడ, చెరుకుమిల్లి(కృత్తివెన్ను), న్యూస్‌టుడే:** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని వైకాపా పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రాము అన్నారు. ఆదివారం కృత్తివెన్ను మండలంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కొమాళ్లపూడి, మునిపెడ, చెరుకుమిల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి, మండల వైకాపా కన్వీనర్ భూపతిరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## మెకానిక్‌ల సంక్షేమానికి కృషి

**మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే:** మెకానిక్‌ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బందరు టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ కార్తిక వనసమారాధన.. నగరంలోని అన్నం వీరరాఘవయ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు కొల్లా సుబ్బారావు.. సంఘ భవన నిర్మాణంతో పాటు వివిధ సమస్యలను వివరించగా.. మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తామని గోపీచంద్ తెలిపారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, కూటమి నాయకులు కొట్టే వెంకట్రావు, మాదివాడ రాము తదితరులు ప్రసంగించారు. అసోసియేషన్ నాయకులు దాసరి శివనాగేంద్ర, రాసంశెట్టి సాంబశివరావు, మెకానిక్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆటోమొబైల్ దుకాణ నిర్వాహకులు, సీనియర్ మెకానిక్‌ల దంపతులను సత్కరించారు.

సత్యనారాయణ, దావూద్ దంపతులను సత్కరిస్తున్న అతిథులు, అసోసియేషన్ నాయకులు

## ఐక్యతకు ప్రతీకలు.. వనసమారాధనలు

**పెడన, న్యూస్‌టుడే:** కార్తిక వన సమారాధనలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. స్థానిక జ్ఞాన కోటయ్య హైస్కూలు 1989-90 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. అంతా కలిసి ఉత్సాహంగా గడిపారు. నాగరాజ్, హేమలత బళ్ల గంగయ్య, చందు, రామకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమారాధనలో 1989-90 బ్యాచ్ విద్యార్థులు

### భవన నిర్మాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో..

**పెడన, న్యూస్‌టుడే:** భవన నిర్మాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వర్తకులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. పూజలు చేశారు. వర్తకుల్లో ఐక్యతను పెంచేందుకు ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వర్తకుడు వీణం శ్రీనివాస్ చెప్పారు.

పూజలు చేస్తున్న వర్తకులు

## సత్యసాయి శత జయంతి వేడుకలు

**పెడన, న్యూస్‌టుడే:** సత్యసాయి శత జయంతి వేడుకలు ఆదివారం పెడనలో వేడుకగా నిర్వహించారు. స్థానిక అగస్తేశ్వర స్వామి ఆలయంలో శివుడికి వంద మంది బాలలతో రుద్ర పారాయణం చేయించారు. ముందుగా వేదపండితులు రూపుదిద్దిన శివలింగాన్ని పుర వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. సత్యసాయి జయంతి సందర్భంగా అక్టోబరు 20న నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విజేతలైన బాలబాలికలకు బహుమతులు ఎంఈవో వైవీ హరినాథ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి పట్టణ శాఖ అధ్యక్షుడు ముత్యాలరావు, అంకెం మురళీకృష్ణ, భానుమతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

## నిర్మాణం పూర్తిచేస్తేనే సమస్యలకు పరిష్కారం

**బంటుమిల్లి, న్యూస్‌టుడే:** మండల కేంద్రం బంటుమిల్లిలో నిర్మాణ దశలో నిలిచిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పూర్తిచేస్తే అధికారులు, సిబ్బంది, ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిన కార్యాలయం నుంచే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీల నుంచి రెవెన్యూ సేవలు పొందేందుకు ప్రజలు కార్యాలయానికి వచ్చి వెళుతుంటారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో సమావేశాలకు మండలంలోని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలోనే హాజరవుతుంటారు. ఇంతటి అవసరం ఉన్నప్పటికీ నిర్మాణ దశలో ఉన్న నూతన భవనం పూర్తి కావడం లేదు. 2018-2019లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. శ్లాబ్ వరకు పూర్తయింది. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం స్పందించి నిర్మాణం పూర్తి చేసి భవనం అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

వ్యక్తిత్వ వికాస నిపుణుడు చక్రవర్తిని సత్కరిస్తున్న ఉప గ్రంథాలయ అధికారి వెంకటరమణ తదితరులు

మల్లవోలు గ్రంథాలయంలో అంబేడ్కర్, అయ్యంకి వెంకటరమణయ్యల చిత్రపటాలకు నివాళులర్పిస్తూ..

**మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే:** గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు విడియాల చక్రవర్తి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చరవాణుల వినియోగాన్ని తగ్గించి, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. వివిధ దశల్లో ఎదురయ్యే సమస్యలు.. వాటిని అధిగమించే మార్గాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపగ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ పర్యవేక్షించారు. విడియాల చక్రవర్తిని గ్రంథాలయ ఉద్యోగులు సత్కరించారు. నగరంలోని చింతగుంటపాలెం, హౌసింగ్‌బోర్డుకాలనీ, చిలకలపూడి తదితర గ్రంథాలయాల్లో కార్యక్రమాలు జరిగాయి. గూడూరు మండలంలోని గూడూరు, మల్లవోలు గ్రంథాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించగా ఆయా గ్రామాల ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువకుల రక్తదానం

**భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే:** రక్తదానం ప్రాణదానంతో సమానమని మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్ అన్నారు. మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. అరుదైన బ్లడ్ గ్రూప్‌ల రక్తం లభ్యత కష్టతరమవుతున్న పరిస్థితుల్లో.. అందుబాటులోకి తెచ్చేందుకు శిబిరం ఏర్పాట్లు చేసినట్లు వేణుకుమార్ చెప్పారు. గరాలదిబ్బ గ్రామానికి చెందిన బొడ్డు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 11 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్కే వరప్రసాద్, ఉపాధ్యక్షుడు రిలాక్స్ ప్రసాద్, సుధీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరుముడి ప్రియనే.. శరణం అయ్యప్ప

కొండకు బయలు దేరిన దీక్షధారులు

**లక్ష్మీపురం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే:** లక్ష్మీపురంలోని అయ్యప్పమాల ధరించిన భక్తులు ఇరుముళ్లు కట్టుకుని ఆదివారం కొండకు బయలుదేరి వెళ్లారు. 41 రోజుల పాటు దీక్షచేసి అయ్యప్పస్వాములంతా సంతోషంగా కొండకు వెళ్లారు.

## భక్తుల సూర్యనమస్కారాలు

**చినగొల్లపాలెం(కృత్తివెన్ను):** మండలంలోని చినగొల్లపాలెం బీచ్‌లో భక్తులు ఆదివారం సందడి చేశారు. భక్తులంతా ఉదయం స్నానాలు ఆచరించి, సూర్యనమస్కారాలు ఆచరించారు. బీచ్ ఆవరణలో సందడి నెలకొంది.

చినగొల్లపాలెం బీచ్‌లో..

## ప్రమాదకరంగా బైపాస్ రోడ్డు

మండల కేంద్రం బంటుమిల్లిలో సచివాలయం నుంచి నాగేశ్వరరావుపేటకు వెళ్లే బైపాస్ రోడ్డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ప్రమాదకరంగా మారింది. ప్రారంభం దశలో మరమ్మతులు చేయించకపోవడంతో ప్రస్తుతం అస్తవ్యస్తంగా తయారైంది. అటుగా నిత్యం వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, బంటుమిల్లి**

(c) eenadu

# పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

## 18న సహస్ర దీపాలంకరణ

**హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే:** కార్తిక మాసం సందర్భంగా పెరికీడు ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నారు. 10,116 దీపాలు ఏర్పాటు చేసి భక్తులచే వెలిగిస్తారు. ఉదయం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, సాయంత్రం 6.30 గంటల నుంచి దీపాలంకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## బిర్సా ముండా జీవిత చరిత్ర తెలుగు అనువాద పుస్తకావిష్కరణ

**పటమట, న్యూస్‌టుడే :** స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జీవిత చరిత్ర తెలుగు అనువాద పుస్తకం ఆవిష్కరించటం ఆనందంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని తెలుగులో ముద్రించిన బిర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా సేవలు చిరస్మరణీయుడని, బ్రిటీష్ వారిపై ఆయన చేసిన పోరాటాలు గిరిజనుల్లో చైతన్యం నింపి ఆదివాసులకు ఆరాధ్య దైవంగా మారారని చెప్పారు. జన జాతీయ గౌరవ దివస్ వల్ల బిర్సా ముండా లాంటి ఎంతో మంది గిరిజన వీరుల గాథలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. అనంతరం మాదిగాని గురునాథం బిర్సా ముండా చిత్రపటాన్ని ఎంపీకి బహూకరించారు. నాయకులు వి.నరసింహా చౌదరి, సొంగా సంజయ్ పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

◆ కానూరు సనత్‌నగర్ డీఎస్పీ రోడ్డులో గత కొన్ని రోజులుగా మురుగు నిలిచి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన శానిటరీ అధికారి సుధాకర్.. సిబ్బందిని తీసుకవెళ్లి పూడిక తీత పనులు చేయించి సమస్య పరిష్కరించారు. ◆ పోరంకి నారాయణపురం కాలనీలో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన కమిషనర్ షేక్ నజీర్ సిబ్బందిని పంపి చెత్త తరలించేలా చేసి సమస్య పరిష్కరించారు. ◆ పోరంకి సీతాపురంకాలనీలో కొన్నిరోజులుగా చెత్తకుప్పలు తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సుధాకర్ స్పందించి సమస్య పరిష్కరించారు. ◆ యనమలకుదురు మండపం సెంటర్లో కొన్ని రోజులుగా చెత్తతీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కమిషనర్ షేక్ నజీర్ స్పందించి.. సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ◆ పోరంకి నిడమానూరు రోడ్డులో కొన్ని రోజులుగా చెత్త కుప్పలు తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ నజీర్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు.

**- కానూరు, పోరంకి, యనమలకుదురు, న్యూస్‌టుడే**

◆ ఉయ్యూరులోని గరికపర్రు రోడ్డులో జర్నలిస్టు కాలనీలో ఓ విద్యుత్తు స్తంభానికి తీగ మొక్కలు అల్లుకుని వీధి దీపం వెలగలేదు. దీనిపై 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా ఆ ప్రాంతవాసులు ఫిర్యాదు చేశారు. ఉయ్యూరు పురపాలిక ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది వీధి దీపాన్ని పునరుద్ధరించారు. **- ఉయ్యూరు, న్యూస్‌టుడే**

## దోమల నివారణకు ఫాగింగ్

'దోమల బెడదతో అవస్థలు' పేరుతో 'ఈనాడు'లో శనివారం వచ్చిన కథనానికి తాడిగడప పురపాలిక కమిషనర్ షేక్ నజీర్ స్పందించారు. ఫాగింగ్ ఆటోలను శివాలయం సెంటర్‌కు పంపించి ఫాగింగ్ చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. **-న్యూస్‌టుడే, కానూరు**

## ఉత్సాహంగా కేక్ మిక్సింగ్

**తా**డిగడప వందడుగుల రోడ్డులోని బ్రాట్‌కేఫ్‌లో కేక్ మిక్సింగ్ కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు.

**- న్యూస్‌టుడే, కానూరు**

## దారంతా గుంతలు.. ప్రజలకు తిప్పలు

### ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

ఉయ్యూరు, న్యూస్‌టుడే

**ప్ర**భుత్వ శాఖల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. రోడ్లు దారుణంగా తయారై ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఉయ్యూరు పట్టణంలో విజయవాడ-మచిలీపట్నం ప్రధాన రహదారి దాదాపు రెండున్నరేళ్లుగా అత్యంత అధ్వానంగా తయారైంది. రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోయి ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయింది. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఈ రహదారి వైపు ఆ శాఖ కన్నెత్తి చూడని పరిస్థితి.

★ ఉయ్యూరు బస్టాండ్ నుంచి పమిడిముక్కల మండలం మంటాడ శివాలయం వరకు దాదాపు కిలోమీటరుకు పైగా రహదారి వందలాది గుంతలతో ప్రయాణానికి వీలు లేని విధంగా ఉంది. గత్యంతరం లేక ఆ పరిస్థితిలో ప్రజలు ఆ రహదారి నిత్యం ప్రయాణించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇటీవల ఈ మార్గంలో నడుస్తున్న ఓ యువకుడిని బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

★ పామర్రు, పమిడిముక్కల మండలాలకు వెళ్లాల్సిన ప్రజలు ఈ రహదారి వెంటే వెళ్తున్నారు. వర్షం వస్తే రాకపోకలు సాగించే వారు భయాందోళనతో ప్రయాణించాలి. లోతు తెలియని గుంతల్లో వాననీరు నిలిచి ఉంటుందని వాహన చోదకులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

కేసీపీ పరిశ్రమ వద్ద దారుణంగా..

★ గత రెండు నెలల కాలంలో ఈ రహదారిలో వాహనాలు అదుపు తప్పిన ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, మరో ఎనిమిది మంది స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ రహదారిలో పది అడుగుల దూరంలో ఒక గుంత ఉందని వాహనచోదకులు వాపోతున్నారు.

★ రోడ్లు, భవనాల శాఖకు ఈ రహదారికి ప్యాచ్ వర్కు కోసం రూ.70 లక్షలకు ప్రతిపాదనలు ఆయా అధికారులు పంపినా ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదు. ప్రయాణికుల ఇబ్బందులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కంటి వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

ర్యాలీలో సీఐ వెంకటరమణ, విద్యార్థులు

**తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే :** కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెనమలూరు సీఐ జె.వెంకటరమణ తెలిపారు. ఆదివారం తాడిగడప ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేతృత్వంలో మయోపియా అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగ పడతాయని చెప్పారు. ఆస్పత్రి వైద్యురాలు గంగూలీ మాట్లాడుతూ.. పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవాలు చేపట్టామన్నారు. ప్రతి సంవత్సరం నవంబరు 10 నుంచి 16 వరకు ఈ సంరక్షణ వారోత్సవాల నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

**విజయవాడ వైద్యం:** వైద్యులకు 2016 పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా.పంజాల శ్రీనివాస్ కోరారు. ఆదివారం సిద్ధార్థ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఆ సంఘ ప్రతినిధుల సభ నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఉన్న వైద్యుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు అనిల్, బాబ్జీ శ్యామ్‌కుమార్, భానుకుమార్, మారుతీదేవి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

క్రతువు నిర్వహిస్తున్న రుత్వికులు

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** హనుమాన్ జంక్షన్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త కుటుంబం తరఫున కాకాని అరుణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే:** కార్తిక మాసాన్ని పురస్కరించుకుని వీరవల్లి సాయిబాబా మందిర సమీపంలో సహస్ర దీపార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకుడు శివకుమార్‌శర్మ, రావి ఈశ్వర్, కోడెబోయిన బాబీ, తవ్వా ఆదిలక్ష్మి, లంక పద్మశ్రీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సహస్ర దీపార్చన

### ఈపీడీసీఎల్ సీఎండీ పూజలు

**హనుమాన్ జంక్షన్:** ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆదివారం హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ డీఈఈ బొజ్జగాని శ్రీనివాసరావు, ఏఈ రత్నకుమార్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

వణుకూరులో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

స్వామి సన్నిధిలో పుల్లారెడ్డి దంపతులు

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కానూరులో రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, పక్కన తెదేపా నాయకులు

**కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే :** తాడిగడప పురపాలికలోని నాలుగు సర్కిళ్లలో గత 15 నెలల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే బోడేప్రసాద్ తెలిపారు. ఆదివారం తాడిగడపలో రూ.1.12 కోట్లతో, కానూరులో రూ.1.32 కోట్లతో నిర్మించిన సూపర్ వీల్ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పురపాలికను రాష్ట్రంలోనే నంబరు-1 తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రాధాన్య క్రమంలో అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ నజీర్, నాయకులు అనుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్ర, వెలగపూడి శంకరబాబు, రవికిరణ్, గణేష్, రాంకుమార్, చంటి, అంగిరేకుల మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆక్యు పంక్చర్ అవార్డుల ప్రదానోత్సవం

డాక్టర్ విశ్వకు వైద్య రత్న అవార్డు అందిస్తున్న సత్యనారాయణ, రాజారావు తదితరులు

**కానూరు, న్యూస్‌టుడే :** వరల్డ్ ఆక్యు పంక్చర్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ ఓం వైద్యాన్ మాకాల సర్వీసెస్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వైద్య రంగంలో కృషి చేసిన 42 మందికి సేవ, వైద్య రత్నాల అవార్డులు ప్రదానం చేశారు. ఆదివారం కానూరులోని కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవంబరు 1 నుంచి 15 వరకు ఆక్యు పంక్చర్ ప్రచార జాతర నిర్వహించి, ప్రజలలో అవగాహన కల్పించామన్నారు. ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ రాజారావు మాట్లాడుతూ.. భారతీయ ప్రాచీన వైద్యులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎం.శివకుమార్, ఉదయ్‌కుమార్, అశ్రుఉన్నీసా, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభించారు.. వదిలేశారు..!

గొడవర్రులో రైతు భరోసా (సేవా) కేంద్ర భవనం

గొడవర్రులో రూ.21లక్షల అంచనాతో విశాలమైన ప్రభుత్వ స్థలంలో 60శాతం మేర పూర్తయిన రైతు భరోసా (సేవా)కేంద్ర భవనం గత మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం ఈ సేవలను సచివాలయం (విజన్ యూనిట్), పంచాయతీ కార్యాలయం నుంచి అందిస్తున్నారు. మిగత పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. మద్దూరులో ప్రభుత్వ స్థలంలో రూ.19 లక్షల అంచనాతో 75శాతం పూర్తయిన అమూల్ పాల కేంద్రం నాలుగేళ్లుగా పాడుబడి ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో కంకిపాడు మండలానికి 12 కేంద్రాలు కేటాయించారు. వీటిలో పునాదిపాడులో నిర్మించిన భవనాన్ని రెండేళ్ల కిందట ప్రారంభించినా.. అదీ నిరుపయోగంగా ఉంది. అమూల్ సంస్థ ఇంత వరకు పాలసేకరణ చేపట్టలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు భవనాలను అవసరం ఉన్న ప్రభుత్వ శాఖల సేవలకు వినియోగించుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. **- కంకిపాడు, న్యూస్‌టుడే**

## మార్గం మూసేస్తే ఎలా?

**కం**కిపాడు బస్టాండ్‌కు తూర్పు వైపు మార్గం ప్రయాణికులు ఉపయోగించుకోలేని విధంగా తయారైంది. గొడవర్రు రహదారి, ప్రాంగణం మధ్య డ్రెయిన్ పైభాగంలో అమర్చిన సిమెంట్ ఫలకాలు ధ్వంసమయ్యాయి. వృద్ధులు, పిల్లలు, మహిళలు, దివ్యాంగులు ఈ మార్గాన్ని వినియోగించుకోవడంలో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. దీనికి తోడు అడ్డుగా వాహనాలు పెట్టడంతో దక్షిణం, ఉత్తరం వైపు మార్గాల ద్వారా చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ క్రమంలో లోపలికి వచ్చి వెళ్లే బస్‌లను తప్పించుకునే యత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాంగణంలో ఇటీవల జరిగిన దుర్ఘటనలో వృద్ధుడు మరణించారు. తూర్పు వైపు మార్గాన్ని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, కంకిపాడు**

## పిచ్చి మొక్కలు తొలగించరూ..!

**ఉ**య్యూరు-కాటూరు ప్రధాన రహదారిలో గండిగుంట పరిధిలో పలుచోట్ల పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు నెలకొన్నాయి. వాటిలో నుంచి పాములు రహదారి పైకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉయ్యూరుగ్రామీణం**

## అలంకార ప్రాయం.. ఫ్లెక్సీల మయం

**హనుమాన్ జంక్షన్:** హనుమాన్ జంక్షన్‌లో రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఇప్పటికీ అందుబాటులోకి రాకపోగా, స్తంభాలు ఒక్కొక్కటిగా నేలకూలి, దీపాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. దీంతో రాత్రి సమయంలో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు సెంట్రల్ లైటింగ్ స్తంభాలు రాజకీయ పార్టీలు, నాయకుల ఫ్లెక్సీలు కట్టేందుకు ఉపయోగపడుతున్నాయి.

మానికొండలో మహిళలు

పోరంకిలో..

కిశోర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రతినిధులు

## ఉత్సాహంగా.. వనసమారాధన

**పోరంకి, కంకిపాడు, పెనమలూరు, గన్నవరం గ్రామీణం, ఉయ్యూరు, న్యూస్‌టుడే :** కార్తిక వనసమారాధన కార్యక్రమాల ద్వారా ఐకమత్యం పెరుగుతుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. పద్మశాలీ సేవా సంఘం నేతృత్వంలో ఆదివారం పోరంకి ప్రభునగర్‌లోని పార్కులో నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ★ కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కంకిపాడులో ★ పెనమలూరు మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పోరంకిలో నిర్వహించిన వన సమారాధనకు ఎమ్మెల్యే బోడేప్రసాద్ హాజరయ్యారు. ★ ఉయ్యూరు మార్కెట్ సమీపంలోని కౌండన్య ప్రాంగణంలో గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో.. ★ కంకిపాడు సమీప మానికొండలో పలువురు ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు. ★ గన్నవరం నియోజకవర్గ బ్రాహ్మణ పరిషత్తు కార్తిక వనసమారాధన పరిషత్తు అధ్యక్షుడు కేవీఆర్ కిశోర్ అధ్యక్షతన దావాజీగూడెం ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వన, గోపూజ, సామూహిక సత్య నారాయణ వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు, యువత ఆటపాటలతో సందడి చేశారు.

ఉయ్యూరులో మహిళల పూజలు

పెనమలూరులో సత్యనారాయణ స్వామి వ్రతం

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ఉయ్యూరు: మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు కేశవరావు

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు వేములపల్లి కేశవరావు పేర్కొన్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వారోత్సవ కార్యక్రమంలో ఆయన అతిథిగా హాజరయ్యారు. చిత్రకారులు దావులూరి చిదంబరం, విద్యార్థి వికాస వాహిని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎ.శ్రావణి పాల్గొన్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి రమణి పర్యవేక్షించారు.

**కంకిపాడు/తెన్నేరు, న్యూస్‌టుడే :** గ్రంథాలయ జాతీయ వారోత్సవాల్లో భాగంగా తెన్నేరు, కంకిపాడు శాఖ గ్రంథాలయాల్లో ఆదివారం బాలలకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సంపాదకుడు జేమ్స్ ఆగస్ట్ హిక్కీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకులు సునీత, రామకృష్ణ, ఉపాధ్యాయులు డి.అప్పారావు, కె.రాంబాబు, శేషుబాబు పాల్గొన్నారు.

తెన్నేరు: చిత్రలేఖనం పోటీల్లో బాలలు

### విద్యార్థులకు పోటీలు

**హనుమాన్ జంక్షన్,న్యూస్‌టుడే :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాపులపాడు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న విద్యార్థులకు, పాఠకులకు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలతో పాటు, ప్రముఖ వ్యక్తుల జీవిత విశేషాలను వివరించారు. వీరవల్లిలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారులు రహీమ్, స్వర్ణలతాదేవి పర్యవేక్షించారు.

కానుమోలులో అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి అర్పిస్తూ..

## జూదరుల అరెస్టు

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో కొత్తపల్లిలో నిర్వహిస్తున్న ఓ జూద శిబిరంపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఆదివారం మధ్యాహ్నం దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకొని, రూ.870 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.సురేష్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## క్యాపిటల్ ఆస్పత్రిలో అరుదైన గుండె చికిత్స



రవళి

**పోరంకి, న్యూస్‌టుడే :** పోరంకిలోని క్యాపిటల్ ఆస్పత్రిలో మచిలీపట్టణానికి చెందిన 29 ఏళ్ల రవళికి అరుదైన గుండె శస్త్రచికిత్స చేశామని కార్డియో సర్జన్ డాక్టర్ హేమసాయి కడియాల తెలిపారు. ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రవళికి క్రమంగా శ్వాస అందకపోవడంతో బాధ పడుతున్నారు. ఈ సమస్యతో ఆస్పత్రికి వచ్చి తమను సంప్రదించడంతో ఆమెను పరీక్షించగా పుట్టుకతో వచ్చే గుండె సమస్యకు శస్త్ర చికిత్స చేయాలని గుర్తించామన్నారు. కృత్రిమ కర్ణిక కమ్యూనికేషన్ సృష్టించి దాని ద్వారా పీఏపీవీసీ రీరౌటింగ్ ప్రక్రియకు సంభావ్య విండో ద్వారా పల్మనరీ సిరలను ఎడమ కర్ణికకు మళ్లించామన్నారు. సర్జరీ అనంతరం 20 రోజుల చికిత్స అందించడంతో ఆమె పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు వల్లభనేని ఎస్ఆర్ భూపాల్, శ్రీధర్, రామకృష్ణ, సురేష్, ఎండీ మన్నే హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మడిచర్ల మొర ఆలకించేదెవరూ..?

**హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే:** ఏళ్ల తరబడిగా నీటి జాడలేని కాలువలు ఓ వైపు, నానాటికీ అడుగంటుతున్న భూగర్భ మట్టం మరోవైపు.. వెరసి బాపులపాడు మండలంలో కీలక మెట్ట ప్రాంతంగా గుర్తింపు పొందిన మడిచర్ల రైతాంగానికి అశనిపాతంగా మారింది. కొన్నేళ్లుగా ఇక్కడ తీవ్ర దుర్భిక్షం వెంటాడుతోంది. ఈ ఏడాది సాగర్ జలాలు పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు చేరినా, మడిచర్లకు మాత్రం అందలేదు.

★ సాగు, తాగు అవసరాల కోసం కటకటలాడే గ్రామాలుగా బాపులపాడు మండలంలోని కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల గ్రామాలు గుర్తింపు పొందాయి. మూడు గ్రామాల్లోనూ భారీగా చెరువులున్నా, వర్షాధారం తప్ప మరో మార్గం లేకపోవడం, వేంపాడు మేజరు ద్వారా సాగర్ జలాలు వచ్చే అవకాశమున్నా మూడో జోన్‌కు చిట్టచివరిన ఉండటంతో నీరు రాని పరిస్థితి నెలకొంది. కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాలకు ఈ ఏడాది పూర్తి స్థాయిలో నీరొచ్చినా, మడిచర్లకు మాత్రం ఆ భాగ్యం దక్కలేదు. 2016లో మాత్రం కొంత వరకు ప్రధాన చెరువులను నింపుకొనే అవకాశం లభించింది. ఈ ఏడాది తెలంగాణలో వరదల కారణంగా మూడో జోన్‌కు మునుపెన్నడూ లేని విధంగా నీరు విడుదల చేశారు. కానీ మడిచర్లకు వచ్చే ఎల్-27 కాలువ ఆనవాళ్లు లేని విధంగా ఆక్రమణలకు గురవడంతో కనీసం చెరువులను సైతం నింపుకొనే అవకాశం కూడా లేకుండా పోయింది. కూరగాయలు సహా అనేక ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు.

కాలువలో అడ్డంగా ఏర్పాటు చేసిన నియంత్రిక

## భాజపా బలోపేతానికి కృషి

**కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలో భాజపా బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషుకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కంకిపాడులో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుళ్లపూడి శ్రీనివాసరావు, డి.రోహిణికుమార్, పి.కృష్ణమోహన్, కరుణకుమార్, శివనాగేంద్రబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

# గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

విద్యార్థులకు రక్త (గ్రూపు) నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు రక్త (గ్రూపు) నిర్ధారణ పరీక్షలు

గుడివాడ, న్యూస్‌టుడే: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విభాగం, ఇండియన్ రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు రక్త (గ్రూపు) నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.రవీంద్ర బాబు, ఎన్‌ఎస్ఎస్ అధికారి సతీష్‌చంద్ర, సమన్వయకర్త జి.జీవన్ పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందనకు వందనం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామంలో వాటర్ పైపులైనుకు లీకు పడడంతో స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.నరేష్ స్పందించి వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేయించారు. ❖ బి.సి.కాలనీలో వీధిలైట్లు పోవడంతో బాగు చేయించారు. ❖ పంచాయతీ ఎదురుగా పూడిపోయిన డ్రైనేజీలో పూడిక తీయించారు. ❖ పెదపారుపూడి మండలం చినపారుపూడి గ్రామంలో పాతపంచాయతీ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోవడంతో స్పందించిన కార్యదర్శి దయామణి సిబ్బందితో చెత్తను తొలగించారు.

# రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతూ..

చల్లపల్లి, న్యూస్‌టుడే

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చల్లపల్లి మండలం మంగళాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకొంటున్నారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్‌లలో రాణిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో 2024-25లో రజత, కాంస్య పతకాలు, 2023-24లో రజత పతకం, 2022-23లో రజతం, కాంస్య పతకాలను సాధించారు.

❖ 2025-26లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు 8, 9, 10 తరగతుల విద్యార్థులు 13 మంది ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగంలో పి.సుబ్రహ్మణ్యం, కె.శశికళ, పి.ధార్మిళ, ఎ.సంజన, ఎం.వర్ష పాల్గొననున్నారు. ❖ ఈనెల 20, 21, 22 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సీనియర్ సాఫ్ట్ బాల్ విభాగంలో బి.యువనాథ్, పి.నీలిమ ఎంపికయ్యారు. జూనియర్ విభాగంలో వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో జరిగే పోటీలకు జి.సాయికృష్ణ, డి.శ్రీనివాస్ ఎంపికయ్యారు.

❖ సీనియర్ బేస్‌బాల్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు పి.రమేష్, ఎం.గీతిక, జూనియర్ విభాగంలో బి.ఆదిలక్ష్మి బాల, పి.మౌనిక ఎంపికయ్యారు.

## భక్తిశ్రద్ధలతో దీక్షలు కొనసాగించాలి

ఉత్సవాల ఆహ్వాన పత్రికను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ, న్యూస్‌టుడే: అన్ని రకాల దీక్షలు తీసుకున్న వారు భక్తి శ్రద్ధలతో సక్రమంగా పూర్తి చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రారంభం కానున్న మండల, మకర జ్యోతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, తెదేపా నేతలు యక్కలి మణిదీప్, కొండలమ్మ దేవస్థానం ఛైర్మన్ ఈడే మోహన్, శ్రీవిఘ్నేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ శాయన రాజేష్, అన్నదాన కమిటీ సభ్యుడు తాళ్లూరి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి కృషి

పాతఎడ్లంక (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో జగన్ రాక్షస పాలనను తరిమి కొట్టడానికి పవన్ కల్యాణ్ కూటమిని ఏర్పాటు చేశారని, ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నేతృత్వంలో పాత ఎడ్లంక మామిడితోటలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధన సభలో ఆయన మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గ్రామాల్లో పలు సీసీ రహదారులు నిర్మించుకున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల దివిసీమ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు కె.శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, నాయకులు రాయిపూడి వేణుగోపాలరావు, మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శివరావు, బండే రాఘవ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్, మండలి వెంకట కృష్ణారావు విగ్రహాలకు నివాళులు అర్పించారు.

ఎన్టీఆర్, మండలి వెంకట కృష్ణారావు విగ్రహాలకు దండలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

## భక్తుల అవస్థలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం ఆదివారం కిటకిటలాడింది. క్యూలైన్లు నిండిపోవటంతో తరలివస్తున్న భక్తులను జాతీయ రహదారిపైనే నిలిపి, మరో క్యూలైన్ యుద్ధప్రాతిపదికన పోలీసులు ఏర్పాటు చేశారు. దాదాపు గంటసేపు ఎండలో నిలబడ్డారు. దీనిపై భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తరచూ ట్రాఫిక్ నిలిచిపోవటంతో వాహనాల హారన్లతో తలలు పట్టుకున్నారు. ఆర్జిత సేవలను నిలిపివేశారని, నిగ్రహం పాటించాలని భక్తులను అధికారులు కోరారు. ❖ **ఆకస్మికంగా ఆర్టీసీ రాకపోకల మార్పు:** ఉదయం 10గంటల వరకు ఆర్టీసీ బస్సులను దేవాలయం వరకు నడిపారు. భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగటంతో 216 జాతీయ రహదారిలో ఓ స్కూలు సమీపంలో బస్సుల్ని నిలిపేశారు. అక్కడి నుంచి కిలోమీటరు పైగా దూరం ఉండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగించారు.

# నిబద్ధతకు నిలువెత్తు రూపం రామోజీరావు

రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న దృశ్యం

పెదపారుపూడిలో..

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పద్మవిభూషణ్, మీడియా దిగ్గజం చెరుకూరి రామోజీరావు నిజాయతీ, నిబద్ధతకు నిలువెత్తు రూపమని తెదేపా నియోజకవర్గ పరిశీలకుడు కె.శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం రామోజీరావు జయంతి, జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు మెర్ల రాంబాబు, మండలి రామమోహన్‌రావు, బండే రాఘవ, మంటపాల రాజామోహన్‌రావు, వర్ధూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**పెదపారుపూడి అభివృద్ధి ప్రదాత..**

పెదపారుపూడి, న్యూస్‌టుడే: అక్షరయోధుడు చెరుకూరి రామోజీరావు జయంతిని ఆయన స్వగ్రామమైన పెదపారుపూడిలో గ్రామస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచి గారపాటి బాబూరావు, శ్రీలక్ష్మి దంపతులు రామోజీరావు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామోజీరావు తన స్వగ్రామమైన పెదపారుపూడి గ్రామాన్ని దత్తత తీసుకుని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారన్నారు. హైస్కూల్ భవనం, సి.సి.రోడ్లు, ఇంటింటికీ మరుగుదొడ్లి, నూతన అంగన్‌వాడీ భవనాలు, ప్రాథమిక పాఠశాలలు, జల ఎన్జో అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు.

## వైభవంగా కవి సమ్మేళనం

సత్కారం పొందిన కవులు, తదితరులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు మూడో రోజు ఏర్పాటుచేసిన కవి సమ్మేళనంలో సింహాద్రి పద్మ మాట్లాడుతూ ఏ భాషలోని సాహిత్యం అయినా సమాజాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. సమాజ పురోగతికి ఉపయోగపడేదే నిజమైన సాహిత్యం అన్నారు. బంగారు బాల్యం అన్న అంశంపై జి.సూర్యనారాయణ, తదితరులు ప్రసంగించారు. గాయకుడు కె.చంద్రశేఖర్ పాట పాడారు. అనంతరం గ్రంథాలయాధికారి ఎ.ప్రభ కవులను సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

## ప్రజారోగ్యమే చంద్రబాబు లక్ష్యం

బాధిత కుటుంబాలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం పెదమద్దాలి శివారు కొత్త పెదమద్దాలిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పళ్లెం కమలమ్మకి రూ.51,098, చెరుకుమిల్లి ఆంజనేయులుకు రూ.15వేలు, చిట్టూరి వివేక్‌కి రూ.75,610 చెక్కులను అందించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

కృష్ణాపురం(పమిడిముక్కల): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.50వేలు చెక్కును కృష్ణాపురానికి చెందిన ముచ్చు ఫణికుమార్‌కు పామర్రు ఎమ్మెల్యే కుమారరాజా అందజేశారు.

కొక్కిలిగడ్డ రహదారి ఇదీతీరు

## గోతుల దారుల్లో ఇక్కట్లు

మండలంలోని వెంకటపురం జడ్పీ రహదారి మొత్తం గోతులు పడింది. వాహనాలు గుంతలలో పడి పైకి ఎక్కలేక అవస్థలు పడుతున్నాయి. కొక్కిలిగడ్డ రహదారి 90శాతం దెబ్బతింది. రాత్రి సమయాల్లో గోతులలో పడి ఇటీవల పది మందికి వరకు గాయాల పాలయ్యారు. – మోపిదేవి, న్యూస్‌టుడే

## భాజపా బలోపేతానికి కృషి

కంకిపాడు (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలో భాజపా బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషుకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కంకిపాడులో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుళ్లపూడి శ్రీనివాసరావు, డి.రోహిణికుమార్, పి.కృష్ణమోహన్, కరుణ కుమార్, శివనాగేంద్రబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు

పమిడిముక్కల(తాడంకి), న్యూస్‌టుడే: తాడంకి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. రాజులపాటి భాస్కరరావు(ఉయ్యూరు) రూ.1,00,116, యార్లగడ్డ శ్రీ వెంకట నాగమురళి (పెదసనగలు) రూ.25,000, షేక్ బాజీ (పెదపారుపూడి) రూ.10,116 విరాళాలు అందజేశారు. కమిటీ సభ్యులు మారగాని సుబ్బారావు, జంపాన రమబాబు, పులి గంగాధర్‌రావు, సువర్ణగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీపత్రి పూజ

తోట్లవల్లూరు, న్యూసటుడే: శ్రీ చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. ఈవో హరి దుర్గా నాగేశ్వరరావు, ఆలయ ఛైర్మన్ శరత్ చంద్ర శివప్రసాద్ పర్యవేక్షణ చేశారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

## 'ఏఎన్నార్' విద్యార్థుల అపూర్వ కలయిక

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 1981-84లో బీకాం చదివిన విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఆనందభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కంటిపూడి సుబ్బారావును ఘనంగా సత్కరించారు. 40 మంది పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు కృషి చేసిన నాయకులు పి.ఆదినారాయణ, ఎన్.వి.ఆదినారాయణ, మల్లికార్జునరావు, జయరాజు, రాధాకృష్ణ, వెంకటరాజు, రామ్మోహన్, వెంకటేశ్వరరావులను అభినందించారు.

# శిథిలావస్థలో వేణుగోపాలస్వామి ఆలయం

పెచ్చులూడి పడుతున్న వైనం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే

శిథిలావస్థకు చేరిన ఆలయం

పామర్రు మండలం జమీగొల్వేపల్లిలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. దాదాపు 250 ఏళ్ల క్రితం నూజివీడు జమీందార్ల పరిపాలన సమయంలో బీడు భూములను వినియోగంలోకి తెచ్చే క్రమంలో ఓ గ్రామంలోని ఉత్తర దిక్కున పొలిమేరలో పాటిమన్ను దిబ్బలను తవ్వుతుండగా స్వామి, అమ్మవార్ల ప్రతిమలు బయట పడ్డాయి. విషయాన్ని జమీందార్లకు తెలియపర్చగా వారు దాదాపు 20 ఎకరాల భూమిని, ఊరి సత్రంలో ఉన్న మరో రెండు ఎకరాల భూమిని స్వామికి ఇచ్చారు. దీంతో గ్రామానికి చెందిన కాట్రగడ్డ గంగన్న నేతృత్వంలో కొందరు చందాలు పోగుచేసి ఆలయాన్ని నిర్మింపజేశారు. ప్రస్తుతం ఆలయం జీర్ణ స్థితికి చేరుకోగా జీర్ణోద్ధరణకు సంబంధిత శాఖాధికారులు రూ.97లక్షలకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపగా 30శాతం మ్యాచింగ్ గ్రాంటుగా గ్రామస్థులు మూడు నెలల క్రితం రూ.32లక్షలు దేవాదాయ శాఖకు చెల్లించారు. ప్రభుత్వ నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రస్తుతం గర్భగుడిలో పైకప్పు పెచ్చులూడి పడుతుండగా అర్చకులు సైతం లోపలికి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ పునఃనిర్మాణానికి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గర్భగుడిలో పెచ్చులూడిన పైకప్పు

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో వల్లభనేని వేణుగోపాలరావు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వీరంకి నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులచే యోగాసనాలు వేయించారు.

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చిత్రలేఖనం పోటీలను ఆదివారం నిర్వహించారు. చల్లపల్లి గురుకుల పాఠశాల, ఎస్.ఆర్.ఎస్.పి.హైస్కూల్ విదార్థులు ప్రథమ, ద్వితీయ, స్థానాలు సాధించారు. గ్రంథాలయ అధికారి కె.గణేష్‌కుమార్, బి.పాండురంగారావు, ఉపాధ్యాయురాలు పద్మజ పాల్గొన్నారు.

**కంప్యూటర్ వినియోగంపై విద్యార్థులకు శిక్షణ**

ఘంటసాల, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఘంటసాల గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్‌ను ఆదివారం ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి ఎం.శరత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కొడాలిలో చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.

వ్యాసరచన పోటీలలో పాల్గొన్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

గీసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లిలో..

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు

హోమియో వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శుక్లాల వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మోహనరావు నేత్ర పరీక్షలు నిర్వహించి 39 మందికి ఐఓఎల్ ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. అమరావతి కంటి ఆసుపత్రిలో 17, 18వ తేదీల్లో ఆపరేషన్‌లు చేస్తారని చెప్పారు. ఉచిత హోమియో వైద్యశిబిరంలో డాక్టర్ మణికంఠ 67మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వాసవీక్లబ్ నేతలు గోళ్ల వెంకటరత్నం, దింటకుర్తి జ్యోతి, మలిశెట్టి చెంచురాములు, నంబూరు కుసుమ, వరదా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ(సత్యనారాయణపురం): గుడివాడ పట్టణం కోత్తిబొమ్మ సెంటర్ ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో చిన్నఅవుటపల్లి సిద్ధార్థ మెడికల్ కాలేజీ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.అజిత్, డాక్టర్ గీతిక మౌని, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు యలమంచిలి నాగేశ్వరరావు, గుళ్ళపల్లి కిరణ్‌బాబు పాల్గొన్నారు.

## లయన్స్ సేవాభవన్‌లో మధుమేహానికి..

స్థానికుల్ని పరీక్షిస్తున్న వైద్యురాలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్యశిబిరం నిర్వహించారు. గుడివాడ వైద్యురాలు జి.రజని, వైద్యసిబ్బంది పాల్గొని 120 మంది రోగులకు పరీక్షలు చేసి దాతలు నర్రా గంగాధరరావు, వల్లభనేని రామకృష్ణ, కొస రాజు బాపయ్యాచౌదరిల వితరణతో ఉచితంగా మందులు అందించారు. లయన్స్ ప్రతినిధులు మూల్పూరి సుధాకర్, చాపరాల రాజా, కుంచపర్తి మురళి, తార, చిట్టిబాబు, సింగ్, స్వాతి తదితరులు పర్యవేక్షించారు.

కూచిపూడి: మొవ్వ మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పెదపూడి - కూచిపూడి వర్తక సంఘ కల్యాణ మండపంలో సమత శంకర్ నేత్ర చికిత్సాలయం వారిచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ ఛైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. డాక్టర్ శరణ్య, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## క్రీడా ప్రాంగణం అభివృద్ధి

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డలో క్రీడాప్రాంగణం అభివృద్ధికి, ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. పులిగడ్డ ఇరిగేషన్ అతిథిగృహం ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనసమారాధనలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, సనకా ఛూటే, వెంకట్రామ్, పర్చూరి రాఘవేంద్రరావు, కొండవీటి మురళి, వడ్లమూడి శశికుమార్, ఆర్టీసీ డీఎం కె.హనుమంతరావు పాల్గొన్నారు.

## వెండి కిరీటం అందజేత

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానాన్ని ఆదివారం 5 వేల మంది భక్తులు దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు. గుడివాడ కాకర్ల వీధికి చెందిన ఎన్ఎల్వీ నరసింహారావు వెండి కిరీటాన్ని ఆలయానికి అందజేశారు.

## భార్యపై భర్త దాడి

గుడివాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నరేష్ అనే వ్యక్తి తన భార్య నందినిపై దాడి చేసిన సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్.ఐ పి.గౌతమ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**వాహనం అపహరణపై..**

గుడివాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మరో మోటార్ సైకిల్ అపహరణకు గురైంది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని నాగవరప్పాడుకు చెందిన షేక్ మాబ్ జానీ ఆసుపత్రికి వచ్చాడు. ఈక్రమంలో అతని వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని పోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు నాగసాయి శ్రీనివాస్

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. స్థానిక బొగ్గవరపు జాలయ్య సుబ్బరత్తమ్మ కల్యాణ మంటపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షుడిగా ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్, కార్యదర్శిగా వర్తిమిల్లి ప్రసాద్, కోశాధికారిగా దివ్వెల వెంకటనాగసాంబశివరావు, గౌరవ అధ్యక్షుడిగా మండా కమలాకరనాథ్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

## సీనియర్ తెదేపా నేత సీతారాంబాబు ఆకస్మిక మృతి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : తోట్లవల్లూరు గ్రామానికి చెందిన సీనియర్ తెదేపా నాయకుడు వీరంకి సీతారాంబాబు(48) ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందారు. తెదేపాలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసిన ఆయన బీసీ విభాగంలో బాధ్యతలు నిర్వహించారు. మండలంలోని పలువురు తెదేపా నాయకులు సంతాపం తెలియజేశారు.

అవనిగడ్డలో వనసమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణులు

సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో చిన్నారులు

నడకుదురులో.. పూర్వ విద్యార్థులు

కె.కొత్తపాలెం కృష్ణా కరకట్టపై..

భావనారుషి పూజలలో పద్మశాలీయ సంఘ నాయకులు, సభ్యులు

# వనభోజనాలతో మామిడి తోటలు కళకళ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక నాలుగో వార్డు కృష్ణ కరకట్ట దిగువన పోతరాజు వెంకట రమణ మామిడి తోటలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు కింద సత్యనారాయణస్వామి వ్రతం చేసి, వనభోజనాలు నిర్వహించారు. దానికి సమీపంలోని మానేపల్లి రుషీకేశవరావు మామిడి తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. స్థానిక శివాలయంలో శివునికి అభిషేకాలు నిర్వహించిన భక్తబృందం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : కాపు సంఘీయుల ఆధ్వర్యంలో గుడివాడ పట్టణం ధనియాలపేట వాసవి రైస్ మిల్ ప్రాంగణంలో కార్తిక వనభోజనాలు ఆదివారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుంకర గాంధీ, బూరగడ్డ శ్రీకాంత్, మండలి హనుమంతరావు, శాయిన రాజేష్, పాలేటి చంటి, తోట శివాజీ తదితర కాపు సంఘీయులు పాల్గొన్నారు.

చల్లపల్లి: చల్లపల్లి మండలం నడకుదురు శ్రీపృధ్వీశ్వరస్వామి క్షేత్రం ఉసిరివనంలో వనసమారాధనలు సందడిగా ఆదివారం సాగాయి. చల్లపల్లి ఎస్.ఆర్.వై.ఎస్.పి. కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వనసమారాధన జరిగింది. విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు మాస్టార్‌ను పూలదండలు, శాలువాలతో సత్కరించారు.

కె.కొత్తపాలెం(మోపిదేవి): కె.కొత్తపాలెం కృష్ణా కరకట్టపై ఉన్న శ్రీసువర్చలా సమేత అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ సారథ్యంలో అన్నసంతర్పణ జరిపారు. మోపిదేవి శ్రీదుర్గాపార్వతి సమేత సకలేశ్వరస్వామికి 11 మంది రుత్వికులచే లక్షబిల్వార్చన చేశారు. పెదకళ్లేపల్లి శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వర స్వామికి విక్కుర్తి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: శ్రీభావనారుషి కూచిపూడి, పెదపూడి పద్మశాలీయ సంఘం 30వ వనసమారాధనను వైభవంగా నిర్వహించుకున్నారు. సంఘ అధ్యక్షులు కొండవీటి అమరబాలేశ్వరరావు, సభ్యులు పర్యవేక్షించారు. చెరకు శ్రీనివాసరావు, తుమ్మా ఈశ్వరరావు, వెంకటలక్ష్మయ్య, చెరకు గోపీ, కాటూరి శ్రీనివాసరావు, సుబ్బారావు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వేకనూరు(అవనిగడ్డగ్రామీణం), న్యూస్‌టుడే: వేకనూరులోని సూర్యదేవాలయంలో సూర్యదేవుడి కల్యాణం నయనానందకరంగా సాగింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపారు. కార్తిక వనభోజనాలు చేశారు.

(c) eenadu

## ఒకటే శిల.. మలిచారిలా..

ఎన్టీఆర్ జిల్లా నందిగామ సాయి అయ్యప్ప దేవాలయానికి ప్రత్యేకత ఉంది. 2011లో దేవాలయాన్ని ప్రతిష్ఠించిన సమయంలో తెలంగాణలోని ఖమ్మం నుంచి భారీ గ్రానైట్ రాయిని తీసుకొచ్చారు. తమిళనాడుకు చెందిన శిల్పులు దేవాలయం వద్ద రాతినే 18 మెట్లుగా మలిచారు. కార్తిక మాసంలో ఏటా అయ్యప్ప మాలధారులు రాత్రివేళ ఈ మెట్లపై పడిపూజ నిర్వహిస్తుంటారు. భారీ రాతిపై 18 మెట్లు చెక్కించి ప్రతిష్ఠ చేసిన దేవాలయం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఇదొక్కటేనని కమిటీ ఛైర్మన్ శాఖమూరు వంశీధర్ తెలిపారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

పాయకాపురం : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు ఇవ్వొచ్చని సూచించారు.


## ఆలోచనలు విరియాలి... ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. **ఇందులో భాగంగా పీవీపీ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల, కానూరులో ఈ నెల 24వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.**

**నిబంధనలు..**

☆ 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ☆ ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ☆ ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ☆ పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ☆ మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ☆ పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం ☆ **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : నవంబరు 17**

**నమోదు కొరకు: 91549 91113**

**సమయం: ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..**


## గుండెల్లో అన్న.. ఇంటిపై చూడన్న..

హనుమాన్ జంక్షన్‌కు చెందిన బోయపాటి వరప్రసాద్ కుటుంబానికి తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ అంటే విపరీతమైన అభిమానం. ఎన్టీఆర్ నటించిన సినిమాలు, అవి ఏ సంవత్సరంలో విడుదలయ్యాయి, వాటి దర్శకులెవరు, సినిమా ఎన్ని రోజులు ఆడింది.. వంటి వివరాలను అనర్గళంగా చెప్పగలిగే వరప్రసాద్, జీవితే తన ఇంటిని ఆధునికీకరించారు. ఈ క్రమంలో భవనానికి రంగులు వేయించారు. తన తల్లిదండ్రుల చిత్రాలతో పాటు ఎన్టీఆర్, బసవతారకం దంపతుల చిత్రాలను ప్రముఖంగా కనిపించేలా ఇంటి ముందు భాగంలో ముద్రింపజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. అటుగా రాకపోకలు సాగించే వారంతా వాటిని ఆసక్తిగా చూస్తున్నారు.

భవనంపై ఎన్టీఆర్, బసవతారకం చిత్రాలు

- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

## కళ విరిసేలా.. ఇల మురిసేలా..

స్వాతంత్ర్య సమరయోధులు, కవులు, రచయితలు, నృత్య కళాకారులు, ఆయా రంగాల్లో సేవలు అందించిన ప్రముఖుల చిత్రాలను విజయవాడలోని బెంజిసర్కిల్ ఫ్లైఓవర్‌పై పెయింటింగ్‌గా వేయిస్తున్నారు. నగరవాసులతో పాటు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారిని ఈ చిత్రాలు ఆకర్షిస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి

# రాములోరి భూమి.. రాసుకున్నోళ్లదంట..!

ఈనాడు, అమరావతి

దేవాదాయశాఖ భూములపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. దేవాదాయ, రెవెన్యూశాఖలకు చెందిన కొందరు అధికారులే ఆక్రమణదారులకు అండదండలు అందిస్తున్నారు. తాజాగా విజయవాడ మల్లికార్జునపేటలో ఇంద్రకీలాద్రి కొండపైన ఉన్న పట్టాభిరామస్వామి ఆలయానికి చెందిన రూ.కోట్ల విలువైన భూమిని ఆక్రమణదారులు కబ్జా చేశారు.

### అడంగల్‌లో పేర్లు మార్చేసి..

గొల్లపూడి బైపాస్ రోడ్డు సమీపంలో మస్తాబాద్ కాలువ వద్ద ఆర్.ఎస్.నంబరు. 528/3లో 'బెజవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపైనున్న పట్టాభి రామస్వామి ఆలయం' పేరుతో 1.96 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని పినిశెట్టి వెంకమ్మ 1946లో ఆలయానికి రాసిచ్చారు. ఆలయం పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.25కోట్లు. భూమిని కౌలుకు ఇచ్చాక కొందరు ఆక్రమణదారుల కన్ను ఈ పొలంపై పడింది. తర్వాత కౌలుకు తీసుకున్నవారితో కలిసి రెవెన్యూ సిబ్బంది సహకారంతో డి.శ్రీదేవి, కోటేశ్వరరావు, ఎన్.మల్లికార్జునరావు సహా ఎనిమిది మంది పేర్లపైకి అడంగల్‌లో మార్చేసుకున్నారు. ఒక్కొక్కరికి 24 సెంట్ల చొప్పున పంచుకున్నారు.

**రూ.25 కోట్ల విలువైన ఆలయ మాన్యం కబ్జా**

పట్టాభిరామస్వామి ఆలయం

### సామాజిక కార్యకర్తల ఫిర్యాదుతో..

పుష్కరాల సమయంలో 2016లో పట్టాభిరామస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆ తర్వాత ఈ ఆలయానికి చెందిన భూమి ఆక్రమణల చెరలో ఉన్న విషయం తెలిసి.. నాటి అధికారులు విగ్రహ ప్రతిష్ఠాపన చేయకుండా వదిలేశారు. దీనిపై కొందరు సామాజిక కార్యకర్తలు దృష్టిపెట్టి అధికారులకు ఫిర్యాదులు చేసి నివేదికలు అందజేశారు. దీంతో 2018లో దుర్గగుడి ఈవో స్పందించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ నిర్వహణ, ధూపదీప నైవేద్యాల కోసం ఏటా రూ.లక్ష దుర్గగుడి నుంచి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు.

### దేవాదాయశాఖ 43(10) రిజిస్టర్‌లో నమోదు..

ఈ భూమి పట్టాభిరామస్వామి ఆలయానికి చెందినదంటూ దేవాదాయశాఖకు చెందిన 43(10) రిజిస్టర్‌లోనూ నమోదు చేశారు. ఆ తర్వాత వచ్చిన అధికారులెవరూ దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఇప్పటికీ ఆక్రమణదారుల చెరలోనే ఉంది. రికార్డులు ఉన్నా అధికారులు ఇప్పటివరకు పోలీసు కేసు కూడా పెట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేశాం

- సుబ్బారావు, పట్టాభిరామస్వామి ఆలయ ఈవో

ఆలయానికి చెందిన 1.96 ఎకరాల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలంటూ దరఖాస్తు చేశాం. ఈ వ్యవహారం ట్రిబ్యునల్‌లో ఉండడంతో తీర్పు వచ్చాక ఇస్తామంటూ రెవెన్యూ అధికారులు చెప్పారు. ఆ భూమి ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అడ్డుకున్నాం.

# దొంగనోట్లకు దొరికిపోవద్దు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

కొండపల్లికి చెందిన ఓ పొదుపు సంఘం ప్రతి నెలా బ్యాంకులో డబ్బు జమచేసేందుకు వాయిదాల నగదుతో బ్యాంకుకు వెళ్తే ఆ నోట్లలో నకిలీ 500 నోట్లు రెండు వచ్చాయి. బ్యాంకు సిబ్బంది వాటిని తిరస్కరించారు. సంఘ సభ్యుల్లో ఎవరు ఇచ్చారో వారికి అర్థం కాలేదు.

ఇబ్రహీంపట్నం కూడలిలో రద్దీగా ఉండే ఓ హోటల్‌లో యజమాని రాత్రికి కలెక్షన్ చూడగా నకిలీ 500 నోట్లు మూడు కనిపించాయి. కౌంటర్‌లో ఉన్న సిబ్బందిని అడగ్గా ఎవరూ మాట్లాడకపోవడంతో అతను నివ్వెరపోయాడు.

పాల బిల్లుల్లో సూపర్‌వైజర్‌కు ఒక రెండు నకిలీ 500 నోట్లు వచ్చాయి. నగదు అప్పగించే క్రమంలో వాటిని గుర్తించారు. అది ఎవరి నుంచి వచ్చిందో అర్థం కాలేదు. తానే భరించాల్సి వచ్చింది. ఇలా ప్రజలు నకిలీ నోట్లకు దొరికిపోతున్నారు.

**ఇలా గుర్తించండి: పవన్‌కుమార్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్, కొండపల్లి బ్రాంచ్**

దొంగనోట్లను గుర్తించేందుకు ఆర్‌బీఐ 16కు పైగా సూచనలు ఇచ్చింది. ★ ముఖ్యంగా నోటు పొడవు 63 మి.మీ, వెడల్పు 150 మిమీ ఉంటుంది. ★ దేవనాగరి భాషలో భారత్, ఇండియా అని అతి చిన్న అక్షరాలు ఉంటాయి. ★ సెక్యూరిటీ త్రెడ్‌పై బులుగు, పచ్చ వర్ణాలతో ఆర్‌బీఐ, భారత్ అని ఉంటుంది. ★ నోటు కుడివైపు భాగంలో గవర్నర్ సంతకం, నోటు కింది భాగం, పైభాగంలో వాటి నంబర్ ఉంటుంది. ★ కుడి భాగంలో బోటమ్ వద్ద 500 సింబల్‌ను కచ్చితంగా గమనించాలి. ★ అశోక పిల్లర్ ఎంబ్లమ్ ఎడమ భాగంలో గమనించాలి. ★ స్వచ్ఛ భారత్ లోగో, నినాదం ఉంటుంది. ★ నోటు కుడి ఎడమ భాగం తెల్లని ప్రాంతంలో, నోటు మధ్య భాగంలో మహాత్మాగాంధీ సింబల్‌ను కచ్చితంగా గమనించాలి. ఇవేవీ లేకుంటే కచ్చితంగా నకిలీ అని గుర్తించాలి.

అసలైన రూ.500 నోట్లు

**ఏం చేయాలంటే: సీఐ చంద్రశేఖర్**

ఎవరికైనా దొంగనోటు వస్తే స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఏటీఎంలో వచ్చినా సరే.. దాని ఆధారాలతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అనంతరం విచారణ జరుగుతుంది.

# ఫిర్యాదు చేయొచ్చు.. పరిహారం పొందొచ్చు..

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

☛ మచిలీపట్నంకు చెందిన ఎం.వేణు అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.35,999 విలువైన స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేశారు. తాను ఆర్డర్ చేసినది కాకుండా వేరే ఫోన్ పంపించడంతో తాను చెల్లించిన డబ్బులు ఇవ్వాలని కోరుతూ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన కమిషన్ ఆర్డర్ చేసిన ఫోను, లేదా చెల్లించిన నగదు ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశించింది.

★ పైన చెప్పిన ఫిర్యాదుదారు నష్టం జరిగిందని వదిలేయకుండా ఫిర్యాదు చేసి పరిహారం పొందారు. చాలా మంది వినియోగదారుల కమిషన్ గురించి తెలియక నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు వినియోగదారుల కమిషన్ కార్యాలయాలు ఉన్నాయి. ఒకటి మచిలీపట్నంలో, మరొకటి విజయవాడలో ఉంది. ఇటీవల విజయవాడలో అదనంగా మరో బెంచ్ ఏర్పాటు చేశారు.

**సేవా లోపం ఉంటే:** కొనుగోలుకు సంబంధించిన పత్రాలతో తెల్లకాగితంపై రాసి కమిషన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు.

మచిలీపట్నం కార్యాలయ ఫోన్‌నెం: 08672-229862,08672-229832

విజయవాడ కార్యాలయ ఫోన్‌నెం: 0866-257361

**తీర్పు ఎప్పుడు వస్తుంది:** కమిషన్‌కు ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో తీర్పు వస్తుంది.

**ఫిర్యాదుకు చెల్లించాల్సిన ఫీజు**

| పరిమితి | రుసుము(రూ.) |
|---|---|
| రూ.5లక్షలలోపు | ఫీజు లేదు |
| 5-10 లక్షలు | 200 |
| 10-20 లక్షలు | 400 |
| 20-50 లక్షలు | 1000 |
| 50లక్షలు-కోటి | 2000 |
| 1-2 కోట్లు | 2,500 |
| 2-4 కోట్లు | 3,000 |
| 4-6 కోట్లు | 4,000 |
| 6-8కోట్లు | 5,000 |
| 8-10కోట్లు | 6,000 |
| 10కోట్లపైన | 7,500 |

### సంస్థ ఎక్కడున్నా..

★ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ కొనుగోళ్లు అత్యధికంగా ఉంటున్నాయి. కంపెనీలు దేశంలో ఎక్కడో ఉంటాయి. కానీ సవరించిన చట్టం ప్రకారం వినియోగదారులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలోని వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వస్తువుల్లో నాణ్యత, వివిధ రకాల సేవల్లోని లోపాలు, తదితర సమస్యలపై కూడా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించొచ్చు.

### త్వరితగతిన విచారణ

- సీహెచ్ కిషోర్‌కుమార్, కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు

వినియోగదారుల చట్టం ప్రకారం నష్టపోయిన దానికి పరిహారం పొందడం అనేది హక్కు. కేసుల విచారణ కూడా వేగవంతంగా పూర్తి చేసి తీర్పులు ఇవ్వడం జరుగుతుంది.

# మోసాలకు ముకుతాడు..!

**'సైబర్ సురక్ష'కు నేడు శ్రీకారం**

☛ డిజిటల్ అరెస్టు లేనే లేదు. పోలీసులు వాట్సాప్ కాల్, వీడియో కాల్ చేసి అరెస్టు చేస్తామని భయపెట్టరు. ఎవరైనా అలా చేశారంటే వారు మోసగాళ్లే.

☛ లాటరీ వచ్చింది... లింక్ క్లిక్ చేసి వివరాలు నింపితే.. డబ్బులు పంపిస్తామంటే నమ్మవద్దు. ఎవరూ ఉచితంగా లాటరీలు ఇవ్వరని తెలుసుకోండి. ☛ బ్యాంకు ఖాతా తెరిచి ఆ వివరాలన్నీ ఇస్తే డబ్బులు ఇస్తామని మభ్యపెడితే ప్రలోభానికి గురికావద్దు. బ్యాంకు ఖాతాను అద్దెకు ఇస్తే.. మీరు కేసుల్లో ఇరుక్కుంటారు.

☛ అర్జెంట్‌గా మా స్నేహితుడు నాకు డబ్బులు పంపాలి. నా ఖాతా బ్లాక్ అయింది. మీ ఖాతాలో వేస్తారు.. విత్‌డ్రా చేసి ఇస్తారా... అని ఎవరైనా అడిగితే ఒప్పుకోవద్దు. వాళ్లు సైబర్ నేరగాళ్లు కావొచ్చు.

.. ఇవి. ఇటీవల కాలంలో సైబర్ నేరాల తీరుతెన్నులు..

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

రోజుకో కొత్త తరహా మోసంతో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. దీనిపై అప్రమత్తం చేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఏదో ఒక రూపంలో ప్రజలను భయపెడుతున్నారు. మభ్యపెట్టి డబ్బులు గుంజేస్తున్నారు. ఈ తరహా నేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించేందుకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'సైబర్ సురక్ష' పేరుతో యుద్ధం ప్రకటించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయం వేదికగా సోమవారం సాయంత్రం 'సైబర్ సురక్ష' పేరుతో సరికొత్త కార్యక్రమం ప్రారంభించనున్నారు.

**నేరుగా ప్రజల వద్దకే వెళ్లి..**

'సైబర్ సురక్ష' అంటే.. ప్రజల వద్దకే వెళ్లి సైబర్ మోసాలపై అవగాహన కలిగించడం. సైబర్ నిపుణులు ప్రజలతో మమేకం అవుతారు. రకరకాల మోసాల గురించి వివరిస్తారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఏం చేయాలో చెబుతారు. దీని కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించారు. వారికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తర్ఫీదు ఇవ్వనున్నారు.

**మలి విడతల్లో మరింత మందికి...**

తొలి కార్యక్రమం బ్యాంకుల్లో నిర్వహించిన తర్వాత ఆ సిబ్బందితోనే మరికొన్ని వినూత్న కార్యక్రమాలు కొనసాగిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి, ఉద్యోగులకు అవగాహన కలిగిస్తారు. అక్కడికి వచ్చే ప్రజలకు తెలియజేస్తారు. తర్వాత ఇళ్ల వద్దకే వెళతారు. రైల్వేస్టేషన్లు, బస్టేషన్లలో ప్రయాణికుల వద్దకు వెళతారు. ఇలా అంచెలంచెలుగా ప్రజలందరికీ సైబర్ మోసాలు తెలియజేసి, వాటి బారిన పడకుండా చేయాలన్నదే ప్రధాన లక్ష్యంగా సైబర్ సురక్షను రూపొందించారు. సైబర్ నేరంతో ఒక్కరు కూడా మోసానికి గురికాకూడదన్నదే **పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు** లక్ష్యమని, ఆ దిశగా 'సైబర్ సురక్ష'ను ప్రజల వద్దకు తీసుకువెళతామని అధికారులు వెల్లడించారు.

**227×3 మందితో తొలి కార్యక్రమం**

తొలి కార్యక్రమం మంగళవారం బ్యాంకుల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 227 బ్యాంకు శాఖలున్నాయి. ఒక్కో శాఖకు ఒక కానిస్టేబుల్, ఒక ఎన్‌సీసీ క్యాడెట్‌ను పంపుతారు. వీరికి ఆయా శాఖలోని ఒక ఉద్యోగిని కేటాయిస్తారు. వారు ఆ రోజంతా బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులతో మాట్లాడతారు. సైబర్ మోసాలు జరిగే తీరును వివరిస్తారు.

# పైసా లేదు.. బెయిల్‌కు సాయం చేయండి

ఈనాడు, అమరావతి

◆ పోలీసులతో ప్రధాన నిందితుడు

◆ కస్టడీలో సరైన సమాధానాలివ్వని వైనం

'నా వద్ద రూపాయి లేదు. కనీసం బెయిల్ వేసుకునేందుకూ డబ్బుల్లేవు. అందుకే వేసుకోలేదు. మీరే డబ్బు ఎరేంజ్ చేయండి..' అని అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్య చెబుతున్న సమాధానం ఇది. భారీగా డిపాజిట్లు వసూలు చేసి, ఆనక చెల్లించకుండా బోర్డు తిప్పేసిన కేసులో ఆదిత్య (ఏ1)ను కస్టడీలో భాగంగా ప్రశ్నించిన పోలీసులకు వచ్చిన సమాధానాలు విని వారే నిర్ఘాంతపోయారు. ఈ కేసులో కీలక నిందితులైన ఆదిత్యతో పాటు అతని భార్య సుజాత (ఏ2), కీలక ఏజెంట్ బాలకృష్ణ (ఏ3)లను పోలీసులు కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. నిందితులను విచారించిన క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, సెంట్రల్ ఏసీపీ దామోదర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, తదితరలు నిందితులను ప్రశ్నించారు. ఆదివారం రెండో రోజు కస్టడీలో వీరిని పలు ప్రశ్నలు అడిగారు. దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. తమ వద్ద డబ్బుల్లేవని మాత్రమే ముగ్గురూ సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. సోమవారంతో కస్టడీ ముగుస్తుంది. మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపర్చిన తర్వాత కారాగారాలకు తరలించనున్నారు.

ఆదిత్య

**వీడని లెక్కల గుట్టు..** వసూలు చేసిన డిపాజిట్లలో రూ.39.50 కోట్లకు అసలు లెక్కలు లేనట్లు దర్యాప్తులో తేలింది. ఈ సొమ్మును ఎక్కడికి తరలించాడన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని విదేశాలలో పెట్టుబడులకు వినియోగించినట్లు అనుమానిస్తున్నారు. ఈ అంశంపై ఎన్ని సార్లు ప్రశ్నించినా సరైన సమాధానాలు రాలేదు. తన వద్ద పైసా లేదని మాత్రమే పదే పదే చెప్పాడు. ఆదిత్యకు సంబంధించి మూడు ఖాతాలను పోలీసులు పరిశీలించగా వాటిలో డబ్బులు లేవని తెలిసింది. డిపాజిటర్లు, ఏజెంట్లకు న్యాయంగా ఇవ్వాల్సిందంతా ఇచ్చానని సమాధానమిచ్చాడు.

**తానే పెట్టుబడి పెట్టానని బాలకృష్ణ బుకాయింపు..** ఈ కేసులో బాలకృష్ణ, అతని సతీమణి ఇద్దరూ రూ.9కోట్లు అయాచితంగా లబ్ధి పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సొమ్ము గురించి బాలకృష్ణను ప్రశ్నించారు. తాను లబ్ధి పొందలేదని, ఆదిత్యకు రూ.6.50 కోట్ల మేర పెట్టుబడి పెట్టానని.. ఆ సొమ్మే తాను తీసుకున్నానని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. అంత సొమ్ము ఎలా సంపాదించారని పోలీసులు ప్రశ్నించగా తనకు రెండు కంపెనీలు ఉన్నాయని, వాటి ద్వారా ఆదాయం వచ్చిందని అన్నట్లు తెలిసింది.

## తరలించి.. అనారోగ్యాన్ని తరిమేసి..

స్పందనకు వందనం

'అడ్డంగా పారేసి.... ఆరోగ్యానికి పాతరేసి' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన చిత్రకథనానికి అధికారులు స్పందించారు. కొత్త ప్రభుత్వ ఆస్పత్రి సూపర్ స్పెషాలిటీ విభాగం వెనుక పేరుకుపోయిన బయో మెడికల్ వ్యర్థాల మూటలను నగరపాలక సంస్థ చెత్త తరలింపు వాహనంలో తరలించారు. ఈ ప్రాంతాన్నంతా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. డస్ట్ బిన్స్ నిండిన వెంటనే చెత్త తరలించేలా అక్కడ సిబ్బందికి సూచనలు చేశారు. - ఈనాడు, అమరావతి

## ద్వీపంలో కార్తిక సందడి

న్యూస్‌టుడే, భవానీపురం

కార్తికమాసం పురస్కరించుకుని భవానీద్వీపంలో సందడి వాతావరణం నెలకొంది. పున్నమిఘాట్ వద్ద నుంచి సందర్శకులు బోటులో ద్వీపానికి చేరుకున్నారు. కార్తికమాసం చివరి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. చెట్ల మధ్య ఆటలాడుతూ సంతోషంగా గడిపారు. పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మహిళల ఉత్సాహం..

స్పీడ్ బోట్లలో పర్యాటకుల కేరింతలు

# మేమింతే.. మారమంతే

➚ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తగ్గని మధ్యవర్తుల హవా

➚ ఏసీబీ తనిఖీలు జరిగితే మాకేంటి అన్న వైఖరి

☛ విజయవాడ పరిధిలోని పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాష్ట్రంలోనే అత్యంత ఆదాయం వచ్చే కార్యాలయాల్లో ఒకటి. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేసుకునేవారి కంటే దళారులే ఎక్కువ మంది ఉంటారు. రిజిస్ట్రేషన్ కోసం ఎవరొచ్చినా అధికారుల కంటే ముందు వారినే కలవాలి. వారే బేరం తెగ్గొడతారు. అన్నీ మేమే చూసుకుంటాం ఆస్తి విలువలో 1శాతం కమీషన్ ఇవ్వాలని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు జరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

☛ ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ తనిఖీలు జరిగాయి. లెక్కల్లో చూపని రూ.70వేలకు పైగా సొమ్ము, ఇద్దరు అనధికారిక సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. ఇంత జరిగినా అక్కడి సిబ్బంది, అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. మరుసటి రోజు నుంచే మధ్యవర్తుల దందా షరామామూలైంది. వారి ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

ఈనాడు, అమరావతి

ఏసీబీ తనిఖీలు చేసినా.. రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాలను ప్రక్షాళన చేస్తామని రెవెన్యూ మంత్రి హెచ్చరికలు చేసినా ఆ శాఖలో దళారుల దందాకు అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ తనిఖీలు చేసినా.. జిల్లాలోనూ ఏసీబీ పంజా విసిరినా అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. మేమింతే మారమంతే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అనధికారిక సిబ్బంది వ్యవహారాలు చక్కబెడుతున్నా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదు.



**కమీషన్ల దందా**

కూటమి సర్కారు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నా లేఖరుల అవతారమెత్తిన మధ్యవర్తుల ప్రమేయం లేకుండా దస్త్రం కదలడం లేదు. నేరుగా వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం దాదాపు అసాధ్యమే. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి వెళ్లినా ఏదో కొర్రీ పెట్టి కాళ్లరిగేలా తిప్పిస్తారు. విజయవాడ నగర పరిధిలోని ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నేరుగా వెళ్లిన గన్నవరానికి చెందిన ఓ వ్యక్తిని పది రోజులు తిప్పించారు. ఓపిక నశించి మధ్యవర్తులకు 1శాతం కమీషన్ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరంతా కార్యాలయాల చుట్టూ స్థావరాలు ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారు. అధికారులతో కుమ్మక్కయి కమీషన్లు దండుకుంటున్నారు. మధ్యవర్తులు లేకుండా వెళితే కొన్ని కార్యాలయాల్లో అధికారులు సమాధానం కూడా చెప్పరు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రకారం నెలకు రూ.10కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు కమీషన్ల రూపంలోనే చేతులు మారుతున్నాయని తెలుస్తోంది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులను వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

(c) eenadu

# త్వరపడండి.. ధర పొందండి

## దళారుల కట్టడికి సీఎం, కపాస్ కిసాన్ యాప్‌లు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

భారత పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఉత్పత్తిదారులు దూదిని విక్రయించేందుకు తాజాగా సీఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించారు. తద్వారా సీసీఐ కేంద్రాల్లో నిజమైన రైతులకు అన్యాయం జరగకుండా, దళారులు, వ్యాపారుల హవా లేకుండా నియంత్రించడమే లక్ష్యంగా యాప్‌లు అమలు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు సీసీఐ కేంద్రాలను తమ అడ్డాలుగా మార్చుకుని రైతులను మోసం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పత్తి పంట సాగు చేసిన రైతులు దిగుబడియైన దూదిని సీసీఐ మద్దతు ధరకు కేంద్రాల్లో నేరుగా అమ్ముకోవాలని తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**ఇలా చేయాలి..** జిల్లాలో పత్తి పండించిన రైతులందరూ కపాస్ కిసాన్ యాప్‌ను చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ★ అధికారుల వద్ద ఈ-పంట నమోదు సమయంలో ఇచ్చిన చరవాణి నంబరు ఆధారంగా ఓటీపీతో లాగిన్ అవ్వాలి. ★ ఆ తర్వాత రైతు పేరు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్ పుస్తకం నంబరు, పత్తి సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలు నమోదు చేయాలి. ★ ఏ కేంద్రంలో ఎప్పుడు విక్రయిస్తారో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. కపాస్ కిసాన్ యాప్‌లో వివరాల నమోదుపై పత్తి రైతులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు తెలిపారు.

**ఆర్‌ఎస్కేలకు అయినా వెళ్లొచ్చు..**

కనీస మద్దతు ధరకు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు సీఎం యాప్‌లో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. యాప్‌లో రైతు పంపిన వివరాలు పరిశీలించి సీసీఐ బయ్యర్ ఆమోదం తెలుపుతారు. ఆ వెంటనే కేంద్రానికి రైతులు పత్తి తీసుకువస్తే బయ్యర్ పాసింగ్ చేస్తారు. సాంకేతికతపై అవగాహన ఉన్న రైతులు తమ చరవాణిలో సీఎం యాప్‌లో నమోదు చేయొచ్చు. లేదంటే సమీప రైతు సేవా కేంద్రం , మార్కెట్ యార్డులకు వెళ్తే అక్కడి సిబ్బంది సహాయం చేస్తారు.

పెనుగొలను: రైతు ఇంట్లో పత్తి

**ధరలివే..** జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కనీస మద్దతు ధర క్వింటాకు: పొడవు పింజ: రూ.8,110, మధ్యస్థ పింజ: రూ.7,710. తిరువూరు, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో ఇప్పటికే సీసీఐ కేంద్రాలు తెరిచారు. తేమ 8 నుంచి 12శాతం మధ్య ఉంటేనే కేంద్రాల్లో పాసింగ్ జరుగుతుంది. పొడవు పింజ దూదికి క్వింటాల్ లభించే ధర తేమ 8% రూ.8110, 9% రూ.8028, 10% రూ.7947, 11% రూ.7866, 12% రూ.7785 లభిస్తుంది.

# సీజేఐకి ఆత్మీయ వీడ్కోలు

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు వీడ్కోలు పలుకుతున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పక్కన కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ తదితరులు

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** గుంటూరు జిల్లా మంగళగిరి పర్యటన ముగించుకొని ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లేందుకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు హైకోర్టు న్యాయమూర్తులు, అధికారులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు సీజేఐకి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

# 19న దివిసీమ ఉప్పెన సంస్మరణ సభ

**అవనిగడ్డ, న్యూస్‌టుడే:** ఈనెల 19వ తేదీన 1977 దివిసీమ ఉప్పెన 48 సంవత్సరాల సంస్మరణ సభ గాంధీక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దివిసీమ పునర్నిర్మాణానికి పరితపించిన మండలి వెంకట కృష్ణారావు కృషికి తోడుగా నిలిచిన మానవతా మూర్తులకు దివ్య వందనం సమర్పించడమే ఈ సభ ఉద్దేశం అన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు తదితరులు హాజరవుతారని చెప్పారు.

# శ్రమజీవి రామోజీరావు



మాట్లాడుతున్న దేవినేని ఉమా

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** అతి సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి అసామాన్యుడిగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. రామోజీరావు జయంతిని పురస్కరించుకుని గొల్లపూడిలోని కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగడం, ధైర్యంగా ఎదుర్కోవడం ఆయనకు తెలిసిన విద్య అని తెలిపారు. ఏ రంగంలో అడుగు పెట్టినా అత్యున్నత స్థాయికి చేరే వరకు పట్టు విడవకపోవడం సహజగుణమన్నారు. భారత మీడియా రంగంలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# జానకిరామయ్య జీవితం ఆదర్శనీయం

క్షీర విప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** విజయా డెయిరీ మాజీ ఛైర్మన్ మండవ జానకిరామయ్య జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. జానకి రామయ్య సంతాప సభ గన్నవరం పట్టణ శివారులోని ఎస్ఎం కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, వర్ల కుమారరాజా, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, తెదేపా నేతలు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మానం బ్రహ్మయ్య, కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ సీహెచ్ రాజేశ్వరరావు, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొని జానకిరామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. విజయా డెయిరీ, రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. 'క్షీరవిప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య' అనే పుస్తకాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయా డెయిరీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# 'ఇక ప్రజల మధ్యనే నా జీవితం'

**విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే :** ఇక నుంచి ప్రజల మధ్యనే ఉంటానని, రాధారంగ మిత్రమండలి, పెద్దల సూచనల మేరకు రాజకీయాల్లోకి రావాలా లేదా అనేది నిర్ణయించుకుంటానని వంగవీటి మోహనరంగా కుమార్తె ఆశా కిరణ్ స్పష్టం చేశారు. ఆదివారం రాఘవయ్య పార్కు కూడలిలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి ఆమె మీడియాతో మాట్లాడారు. పాలిటిక్స్‌లో జరిగే కాపు వనభోజనాల్లో రాధా రంగా మిత్రమండలి సభ్యులను కలుస్తానని తెలిపారు. రంగా అభిమానులంతా మీరు రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నారని విలేకరులు ఆశా కిరణ్‌ను అడగ్గా.. రాధా రంగా మిత్రమండలి ఏ నిర్ణయిస్తే ఆ బాటలో నడుస్తానని తెలిపారు. రాధా తెదేపాలో ఉన్నారని.. మీరు భాజపా, జనసేన లేదా వైకాపాలో చేరతారా? అనే దానిపై చర్చ నడుస్తోందని ప్రశ్నించగా.. రాజకీయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. భవిష్యత్తులో మా ఇద్దరి బాటలు వేరైనా.. గమ్యం ఒకటేనని, రంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. 25 సంవత్సరాల తర్వాత రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నారని ప్రశ్నించగా.. ఇప్పటి వరకు కుటుంబ బాధ్యతలు ఉన్నాయని, ఇక నుంచి ప్రజల మధ్యనే ఉంటానని స్పష్టం చేశారు.

రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆశా కిరణ్

# పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

**ఈనాడు, అమరావతి :** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మార్చారని తెదేపా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన ఎన్నో కంపెనీలు కూటమి ప్రభుత్వం తెచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీకి ఆకర్షితులై తిరిగి రాష్ట్రానికి వచ్చాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో పెట్టుబడుల వికేంద్రీకరణ జరుగుతోంది. మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. సీఐఐ సదస్సులో మొత్తం 613 ఒప్పందాలు జరిగాయి. సుమారు రూ.3,65,304 కోట్ల పెట్టుబడులు రానున్నాయి' అని వెనిగండ్ల రాము తెలిపారు.

# డిసెంబరులో అమరావతి బాలోత్సవం

**రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే :** అమరావతి బాలోత్సవం (8వ పిల్లల పండగ) డిసెంబరు 9, 10, 11 తేదీల్లో సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. ఆదివారం బాలోత్సవ భవన్‌లో కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే 'థీమ్'తో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. తరగతి గదుల్లో ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాల్లో వారి ప్రతిభ, శక్తి సామర్థ్యాల ప్రదర్శనకు వేదికగా బాలోత్సవం జరుగుతుందని అన్నారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అకడమిక్, కల్చరల్ అంశాల్లో 60 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 200 పాఠశాలల నుంచి సుమారు 1500మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సేవలు అందించేందుకు సుమారు 200 మంది వాలంటీర్లను నియమించినట్లు చెప్పారు. బాలోత్సవ బాధ్యులు ఎస్.విద్యాసాగర్, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వై.సుబ్బారావు, కె.వెంకట్, యు.వి.రామరాజు, ఎస్.లెనిన్‌బాబు, టి.క్రాంతి, జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల చేస్తున్న కొండలరావు, విద్యాసాగర్, సాంబశివరావు, వల్లభరావు

# కబడ్డీలో అవకతవకలు అరికట్టేందుకు శాప్ సిద్ధం

**విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే :** కబడ్డీ క్రీడలో అవకతవకలను అరికట్టేందుకు శాప్ కఠిన చర్యలు తీసుకుంటుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది కబడ్డీ క్రీడాకారులు వారి పుట్టిన తేదీలు మార్చి.. జాతీయ కబడ్డీ పోటీల్లో పతకాలు సాధించి క్రీడా కోటా కింద ఉపాధి పొందారని కొన్ని ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. అలాంటి వారి ఆధార్ కార్డు పరిశీలించి.. జీఎస్‌డబ్ల్యూఎస్ నుంచి, పాఠశాల విద్యాశాఖ నుంచి సమాచారం సేకరించాలని నిర్ణయించారు. ఈ విషయమై విచారణ చేసేందుకు శాప్ త్రిసభ్య కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా సంబంధిత క్రీడాకారులపై, వారికి సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది కబడ్డీ క్రీడాకారులు, క్రీడా అధికారుల ప్రమేయం ఉన్నట్లు తేలిందన్నారు. వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సంగీతం భావితరాలకు మార్గదర్శకం

**విద్యాధరపురం, న్యూస్‌టుడే:** సంగీతం భావితరాలకు మార్గదర్శకం కావాలని డీసీపీ సరిత పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆకాశవాణి 67వ సంగీత సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నతనంలో పత్రికలు, టీవీ ఛానల్స్ లేని రోజుల్లో ఆకాశవాణిలో వచ్చే వార్తలతోపాటు సంగీత, సాహిత్య కార్యక్రమాలు జనాదరణ పొందాయని చెప్పారు. నేటికి ఆకాశవాణి ప్రియులు ఉన్నారన్నారు. సంగీత సుధామణి విదుషి కొల్లూరు వందన, విద్వాన్ మోదుమూడి సుధాకర్, అన్నవరపు రామస్వామి తదితరులు సంగీతాభివృద్ధికి కృషి చేశారన్నారు. దేశ సంస్కృతి, ఔన్నత్యాన్ని కాపాడే వారిని ప్రోత్సహించి సమాజానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కల్చరల్ అకాడమి ఛైర్మన్ తేజస్విని, డీడీ కార్యాలయ అధిపతి సోమేశ్వరరావు, కార్యక్రమ విభాగాధిపతి సుధాకర్ మోహన్, అనుసంధాన కర్త మాణిక్యరావు, వయలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, న్యాయవాది హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సంగీత సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డీసీపీ సరిత

# కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** ఏపీ కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గవర్నర్‌పేటలోని సహకార భవన్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.ఎస్.ఎన్.బుచ్చయ్యచౌదరి, కార్యదర్శిగా జి.సందీప్, కోశాధికారిగా పి.భాగ్యలక్ష్మి, అసోసియేట్ అధ్యక్షుడిగా యు.రమేష్, ఉపాధ్యక్షుడిగా టి.శివయ్య, సంయుక్త కార్యదర్శులుగా వై.అరుణకుమారి, ఎ.జ్యోతిర్మయి, కేడర్ కార్యదర్శిగా యు.శ్రావణ్‌బాబు, కె.వంశీప్రియలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గుంటూరు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీస్ సహాయ రిజిస్ట్రార్ టి.వీరాంజనేయులు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులు మూడు సంవత్సరాల పాటు పని చేస్తారు.

బుచ్చయ్యచౌదరి, కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న నాయకులు

# అమ్మ దర్శనం.. కనులారా వీక్షిద్దాం..

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో ఘాట్ రోడ్డు, మెట్ల మార్గాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ నిండిపోయింది. దేవస్థానం ఈవో శీనానాయక్ ఘాట్ రోడ్డులో వచ్చే వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. భక్తులు తమ వాహనాలను కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి రథం సెంటరు వరకు నిలిపి నడిచి లిఫ్టు మార్గానికి వచ్చారు. అమ్మవారికి నివేదన సమయంలో దర్శనం కొంత సేపు నిలిపి వేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. లిఫ్టు మార్గం సైతం కిక్కిరిసింది. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సుగమం చేసేందుకు వీఐపీ సిఫార్సులను నిలిపి వేసినట్లు ఈవో తెలిపారు.

క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం

# ప్రధానోపాధ్యాయుల సమస్యలపై చర్చ

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించాలని.. దీనికి మంత్రి నారా లోకేశ్‌ను ఆహ్వానించాలని తీర్మానించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులో ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మించిన పాఠశాల క్లస్టర్లను బలోపేతం చేయడం, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టును గ్రేడ్-1 పోస్ట్‌గా పెంచాలని కోరారు. 10వ తరగతి నామినల్ రోల్స్ తయారీ, మన బడి మన భవిష్యత్ సమస్యల పరిష్కారం, ప్లస్ 2 పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నివారించడం, కాంప్లెక్స్ నిర్వహణలోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల విద్యాశాఖాధికారి-1 పోస్టుల్లో నియమించిన స్కూల్ అసిస్టెంట్లను తక్షణమే వెనక్కి పిలిపించి, కామన్ సీనియారిటీ ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. అర్హులైన ప్రధానోపాధ్యాయులను ఉప విద్యాశాఖాధికారులుగా, డైట్ సీనియర్ అధ్యాపకులుగా నియమించాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చెవ్వూరి రవి, ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మోపిదేవి ఆలయం కిటకిట

**మోపిదేవి, న్యూస్‌టుడే:** కార్తికమాస చివరి ఆదివారం, సెలవు రోజు అవటంతో మోపిదేవిసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ క్యూలైన్లు వేలాది మందితో నిండిపోయాయి. జాతీయ రహదారిపై ఎండలో మండుతూ గంటల సేపు భక్తులు నిలబడ్డారు. అన్నిరకాల ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేసి సాధారణ దర్శనం వైపు భక్తులను మళ్లించారు.

# జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేష:షవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జస్టిస్ హరనాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

# సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యం

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** సామాన్య భక్తుల దర్శనానికే మొదటి ప్రాధాన్యమని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఇంజనీరింగ్, పౌరసంబంధాల అధికారులతో కలిసి ఆలయంలో క్యూలైన్‌లను పరిశీలించారు. ఘాట్ రోడ్డు లిఫ్టు మార్గాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వీఐపీ సిఫార్సులు, రూ.500 టికెట్ల దర్శనాలు నియంత్రించారు. భక్తుల వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, పాలు, ఉచిత ప్రసాద పంపిణీకి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు గంగాధర్, శ్రీనివాసరావు, రత్నారెడ్డి పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఈత పోటీలు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే :** విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ (గ్రూపు- 5, గ్రూపు- 4 బాల, బాలికల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో గ్రూపు-5 బాలికల విభాగంలో ఆర్.జస్విత (ఎన్టీఆర్), బాలుర విభాగంలో టి.జశ్వంత్ (గుంటూరు), గ్రూపు- 5 బాలికల విభాగంలో పి.జాహ్నవి (అనంతపురం), వేదాంత్ గౌతమ్ పాంచాల్ (విశాఖ) వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. కృష్ణా జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ ప్రారంభించారు. రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘం ఛైర్మన్ రవికాంత్ కొంగర, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా సంఘం ఛైర్మన్ యలమంచిలి వెంకట సురేష్, అధ్యక్షుడు డీవీడీవీ భాస్కర్, కోశాధికారి పి.బాలమురళీకృష్ణ, స్విమ్మింగ్ పూల్ ఇన్‌ఛార్జి యు.అనిల్, రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘ కార్యదర్శి ఎ.మోహన వెంకటరామ్, కోశాధికారి ఐ.రమేష్, కృష్ణా జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఝాన్సీలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం ఎ.మోహన వెంకటరామ్, పి.బాలమురళీకృష్ణ, వి.వినోద్, ఐ.రమేష్ హాజరై బహుమతులు అందజేశారు.

గ్రూపు-5, 4లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించిన క్రీడాకారులతో అతిథులు

# గొల్లపల్లి లక్ష్మీ స్మారక పురస్కారాల ప్రదానం

**గవర్నర్‌పేట :** డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, గౌతమ బుద్ధులాంటి వారిని ఆదర్శంగా తీసుకుని రచనలు చేసిన గొల్లపల్లి లక్ష్మి.. సాహిత్యానికే వన్నె తెచ్చారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి గొల్లపల్లి లక్ష్మీ స్మారక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. గుర్రం జాషువా తన సాహితీ పటిమతోనే చీత్కారాలు పొందిన చోట సత్కారాలు పొందారని కొనియాడారు. సాహిత్యం మనిషికి గుర్తింపు తెస్తుందని.. గొల్లపల్లి లక్ష్మి ఆ కోవకే చెందుతారని పేర్కొన్నారు. సాహిత్యరంగంలో వజ్రాల ఇందిర, సామాజిక సేవలో బుడమూరి శ్వేత, న్యాయ సేవా రంగంలో రాధాకుమారికి, రాజకీయ రంగంలో జయసుధకు, స్వచ్ఛంద సేవా రంగంలో రాణికి గొల్లపల్లి లక్ష్మీ స్మారక పురస్కారాలు అందించారు. పేరూరి మురళీకుమార్ అధ్యక్షత వహించారు. స్వరూప రాణి, రవికుమార్, గొల్లపల్లి అంబేడ్కర్, రత్నాజీ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

**బ్రాయిలర్ ధరలు** (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

# చోరీ కేసులో నిందితుడి అరెస్టు

## రూ.4.65 లక్షల నగదు... బంగారు గొలుసు స్వాధీనం

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** చోరీ కేసులో నిందితుడితో పాటు అతని నుంచి రూ.4.65 లక్షల నగదు, నల్లపూసల బంగారు గొలుసును రెండో పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రెండో పట్టణ సీఐ నాగభూషణం తన కార్యాలయంలో వివరిస్తూ... ఈనెల 8న పేరాల ముట్టే వారి ప్రాంతానికి చెందిన గుండా సాంబశివరావు వేకువ జామున మార్కెట్ సెంటరులో ఉన్న తన హోల్‌సేల్ పండ్ల వ్యాపార దుకాణానికి వెళ్లారు. ఆ తరువాత భార్య ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. ఉదయం ఏడు గంటల సమయంలో పనిమనిషి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి, యజమానికి సమాచారం ఇవ్వడంతో సాంబశివరావు వచ్చారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి, అందులోని రూ.6 లక్షల నగదుతో పాటు 16 గ్రాముల నల్లపూసల గొలుసు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీ మహ్మద్ మొయిన్ ఆదేశాల మేరకు సీఐతో పాటు ఎస్సైలు వెంకటేశ్వర్లు, నాగశ్రీను, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు అచ్చయ్య, తన్నీరు శ్రీను, ప్రసాద్, బాలచంద్ర, శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, శేఖర్, బాలాజీలతో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా విజయవాడ కొత్తపేట నెహ్రూబొమ్మ వీధికి చెందిన గుదే హరీష్ కుమార్‌ను సొత్తుతో స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న గ్యాస్ గోదాం వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ చెప్పారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికదరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్. స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్, సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి. ✆ 93969 99669.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూప్స్, VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

REAL ESTATE

PLOT FOR SALE

కేసరపల్లి - మేధా IT పార్క్ సమీపంలో 2100 చ॥గ॥ లేఅవుట్ స్థలం అమ్మకం. 60 అ॥ రోడ్, IT కంపెనీలు, కమర్షియల్‌కు, ఆఫీస్‌లకు అనుకూలమైనది. ✆ 70366 62888 ✆ 89780 66103

TO LET

COMMERCIAL

HYD హైవే 1-3/18-49 1stఫ్లోర్ తుళ్ళురువారి వీధి విద్యాధరపురములో 4200 S.Ft గల 4 పోర్షన్స్ బ్యాంకులకు కమర్షియల్స్‌కు అద్దెకు ✆ 99514 98811

గవర్నర్‌పేట గోపాలరెడ్డిరోడ్ 27-11-18, G/Fలో 2500 S.Ft ఆఫీసులకు, బ్యాంకులకు, గోడౌన్స్‌కు, స్టాక్ పాయింట్స్‌కు అద్దెకు కలవు ✆ 99514 98811.

JOBS

Wanted Female Telecallers qualification any degree age limit: 25 to 45 years. Salary 10,000/- to 12000/- Working Location Master Minds College, Vijayawada. Contact Cell: 89781 80832.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

విజయవాడలోని అడ్వకేటు ఆఫీసులో పనిచేయడానికి టైపింగ్ వర్క్ తెలిసిన యువతులు (F) కావలెను. జీతం: 10 వేలు. ✆ : 63004 04861.

KOTAK నూతన బ్యాంక్ నందు పనిచేయుటకు Rtd,VRS,టీచర్స్ మరియు గృహిణులు కావలెను Q: SSC To P.G Age: 35& Above. ✆ 94935 75370

డ్రైవర్ కావలెను మరియు ఇంటిపని చేయుటకు లేడీ కావలెను ఒకే ఫ్యామిలీకి చెందినవారు విజయవాడవారికి ప్రాధాన్యత వసతి కల్పించబడును ✆ 98495 89459

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# తిరువూరు
• తిరువూరు • మైలవరం

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? నరసాపురం - చిన్నంపేట రోడ్డు అంచుల వద్ద చెత్తవేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డ్‌లా మారింది. దీంతో అటుగా వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. **-వాహనదారులు**
✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం **- జి స్వాతి, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, విస్సన్నపేట.
? కొండపల్లి ఆరు పంపుల కూడలిలో పందులు విపరీతంగా ఉంటున్నాయి. వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అనేక మార్లు పురపాలిక అధికారులకు విన్నవించినా స్పందన లేదు. గతంలో పందుల పెంపకందారులకు స్థలాలు కేటాయించినా వారు తిరిగి ఊళ్లలోనే పందులను పెంచుతున్నారు. అధికారులు స్పందించకపోవడంహేయం. **- రాజేశ్వరరావు, కొండపల్లి**
✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షకుడు**
? కొండపల్లి అడవుల్లోని జలపాతాలతో పాటు పవిత్ర సంగమం వద్ద కొందరు యువత విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. మరి కొందరు మద్యం సేవిస్తున్నారు. సామాన్య ప్రజలు ఆయా ప్రాంతాల్లోకి రావాలంటే ఇబ్బందిగా ఉంది. **- ఖాజా, రైతుపేట విజయవాడ**
✔ జలపాతాల వద్దకు వెళ్లే వారిని ప్రతి ఒక్కరినీ పరిశీలించి, హెచ్చరించి పంపుతున్నాం. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- సీఐ చంద్రశేఖర్**
– న్యూస్‌టుడే, కొండపల్లి, ఇబ్రహీంపట్నం
? గుంటుపల్లి రమేష్ నగర్‌లో సీసీరోడ్లకు లింకు రోడ్లు వేయలేదు, కాలనీలో కాలువలు లేక మురుగు నిలిచి దోమల బెడద ఎక్కువైంది. **- రాజేంద్రప్రసాద్, స్థానికుడు**
✔ ఉపాధిహామీ పథకంలో లింకు రోడ్ల నిర్మాణంతోపాటు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. **- మురళీప్రసాద్, గ్రామ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, గ్రామీణం
? గడ్డమణుగు ఎస్సీ కాలనీలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయింది. **- పి.ఆనంద్‌కుమార్, గ్రామస్థుడు**
✔ సమస్య తెలిసింది. సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. **- కె.గంగాధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు వందనం

★ స్థానిక బీసీ బాలికల వసతిగృహం సమీపంలో కాలువలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 16వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా కార్యదర్శి బసవలింగేశ్వరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పులివాగు గోడకు రంధ్రం వేసి నీరు దిగువకు పారేందుకు చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

## రేపు కోటి దీపోత్సవం

**మైలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని వెల్వడంలో గల ప్రసిద్ధ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18న సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది.

## 18న కంటి వైద్య శిబిరం

**గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే:** మండలంలోని గోసవీడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ తెలిపారు. చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేస్తారని చెప్పారు.

**తిరువూరు టౌన్ న్యూస్‌టుడే:** పట్టణంలోని జైభావి సెంటర్ సాయిబాబా గుడి కల్యాణ మండపంలో సోమవారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఆరోగ్యశ్రీ, లేదా ఆధార్‌కార్డులు తీసుకొస్తే ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు.

## 104 మందికి పరీక్షలు

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** అభ్యుదయ యువశక్తిసంఘం ఆధ్వర్యంలో వెలగలగూడెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 104 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరాన్ని తెదేపా నాయకుడు రామినేని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కంటి వైద్యురాలు పి.లక్ష్మీకుమారి వైద్యసేవలు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన 16 మందిని విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు.

## ఆలయంలో చోరీ

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** అన్నేరావుపేట గ్రామంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సుమారు 80 వేల విలువైన వెండి ఆభరణాలు, బంగారపు మంగళసూత్రాలను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి చోరీ చేసినట్లు ఎస్సై బి.శ్రీను తెలిపారు. దేవాలయం కమిటీ కార్యదర్శి శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నేడు

**మైలవరం, న్యూస్‌టుడే:** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## తెదేపా మండల సమావేశం

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** తెదేపా మండల పార్టీ కార్యకర్తల సమావేశం సోమవారం సాయంత్రం 4 గంటలకు కొత్తరెడ్డిగూడెంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు జూనెపాటి వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ హాజరవుతారని చెప్పారు.

# ఏం జరుగుతుందో.. గొంతెండుతోంది..

**ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే:** రక్షిత తాగునీటి పథకంలోకి బూడిద నీరు చేరడం, నియోజకవర్గ వ్యాప్తంగా కుళాయిల ద్వారా వెళ్లే కృష్ణా జలాల సరఫరా నిలిచిపోవడం కొంత కాలంగా ఇదే తంతు.. ఎన్టీటీపీఎస్ ఏర్పాటై 40 ఏళ్లు దాటింది కదా.. ఇప్పుడే ఎందుకు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి బూడిద నీరు చేరుతోందన్న సందేహం నియోజకవర్గ ప్రజల మెదళ్లను తొలిచేస్తుంది. కొందరి స్వార్థంతోనే ఇలా జరుగుతుందని వాటర్ వర్క్స్, ఎన్టీటీపీఎస్ సిబ్బంది పేర్కొంటున్నారు. పాపం ఎవరిదైనా ప్రజలకు బూడిద నీటి కష్టాలు మాత్రం తప్పడం లేదు.

**దారి మళ్లిస్తున్నారా..?** ఎన్టీటీపీఎస్ నుంచి బూడిద చెరువుకు వెళ్లాల్సిన బూడిద పైపులైన్లు కొంత కాలంగా లీకులవుతున్నాయి (పగలకొడుతున్నారు). తద్వారా వచ్చే బూడిద నీరు ప్లాంటు అండర్‌గ్రౌండ్ కాలువ ద్వారా దిగువకు వస్తాయి. దీంతో పాటు ఎన్టీటీపీఎస్ ఐదో దశ కోసం నిర్మిస్తున్న క్వార్టర్స్ వద్ద ఉన్న కాలువ, ఇబ్రహీంపట్నం ఎస్‌బీఐ వద్ద కాలువ ద్వారా దిగువకు ఈ బూడిద నీరు ప్రవహించి సెక్యూరిటీ కాలనీలోకి వెళ్తుంది. ఆ క్రమంలోనే బూడిద నీరు రక్షిత పథకంలోకి చేరుతుంది. అయితే ఈ పరిణామం దానంతట అదే జరిగింది కాదని.. దారి మళ్లించడంతోనే ఇలా బూడిద బయటకు వస్తుందన్నది బహిరంగ రహస్యం. ఆ విధంగా వచ్చిన

రక్షిత పథకంలోకి వస్తున్న బూడిద నీరు

**ప్రతిసారి రక్షిత తాగునీటి పథకం లోకి బూడిద నీరు చేరి అవస్థలు**

బూడిదను తరలించేందుకు వేసే పనుల ప్రక్రియలో భాగంగానే సొమ్ములు పోగేసుకోవడం జరుగుతుందన్న ఆరోపణలు లేకపోలేదు. ఇవన్నీ ఆరోపణలే అని ఎన్టీటీపీఎస్ అధికారులు కొట్టిపారేయడం పరిపాటిగా మారింది.

**ఎంత శుద్ధి చేసినా**

తాగునీటిలో బూడిద సమస్య వచ్చిన సందర్భంలో ఆలమ్‌ఫ్యూజన్, పురపాలిక సిబ్బంది బూడిద నీటిని శుభ్రం చేసి రెండు రోజుల తరువాత సాధారణ నీటిని విడుదల చేసినా వాటిల్లోనూ బూడిద ఆనవాళ్లు స్పష్టంగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ నీటిని పేద వారు అనేక మంది తాగునీటి ఉపయోగించుకొంటూ ఊపిరితిత్తుల, కిడ్నీల వ్యాధులతో సతమతమవుతున్నారు. ఈ సమస్య నుంచి బయట పడవేసేవారే లేరా అని స్థానికులు వాపోతున్నారు.

## కృషీవలుడు రామోజీరావు

పెనుగొలనులో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించిన గ్రామస్థులు, చిన్నారులు

**పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే:** ఈనాడు గ్రూపు వ్యవస్థాపకులు రామోజీరావు జయంతిని ఆదివారం మండలంలోని పెనుగొలనులో ఘనంగా నిర్వహించారు. ఆయన స్థాపించిన సంస్థల ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని కొనియాడారు. ఆయన చిత్రపటానికి గ్రామస్థులు, విద్యార్థులు, శిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు నివాళులర్పించారు.

## భక్తిశ్రద్ధలతో పుష్పయాగం

ప్రత్యేకాలంకారంలో సాయిబాబా

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ అభయ సాయి మందిరంలో ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. తెల్లవారుజామున కాగడ హారతితో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో భాగంగా క్షీరాభిషేకం చేశారు. ఇబ్రహీంపట్నం, ఏ, సీ, సెక్యూరిటీ కాలనీల పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది. సాయంత్రం సంధ్యా హారతి అనంతరం మహిళలు లలిత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**చందనోత్సవం:** భీమరాజుగుట్టపై దాసాంజనేయ ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రసాద్ స్వామి చందనాలంకారం చేశారు. అనంతరం ఆలయ కమిటీ కార్తిక మాస అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించింది.

## ఆలయంలో పూజా కార్యక్రమాలు

పూజల్లో కంపెనీల యజమానులు, స్థానికులు

**కొండపల్లి, న్యూస్‌టుడే:** కొండపల్లి పారిశ్రామికవాడలోని వినాయక ఆలయ వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. 17 ఏళ్లు నిండిన సందర్భంగా మహా సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సోమవారం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

## చంద్రమౌళీశ్వరా.. మము కాపాడుమా..

**గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే:** కార్తిక బహుళ ద్వాదశి సందర్భంగా ఆదివారం తిరువూరు పట్టణంలో చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శివలింగానికి అభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గంపలగూడెం మండలం కొత్తపల్లి కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగాన్ని ఆదివారం అర్చకులు పి.కోటేశ్వరరావు శోభాయమానంగా అలంకరించారు.

## ఎక్కడి నుంచి వచ్చాయో..?

**న**త్తలతో పంటలు నాశనమైపోతున్నాయని మండలంలోని గడ్డమణుగు లోయ గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత మేర పంట నష్టపోయామని.. ఇప్పుడు నత్తల దాడితో వంగ, మిరప, పత్తి పొలాల్లో తీవ్రనష్టం జరుగుతోందని వాపోతున్నారు. కూలీలతో పెట్టి నత్తలను ఏరివేయడానికి మరింత వ్యయం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కాయలు, ఆకులను తింటూ దిగుబడి రాకుండా చేస్తున్నాయంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

చెట్ల ఆకులను తినేస్తున్న నత్త

## రైతన్నా.. కాల్చొద్దన్నా..

**ఖ**రీఫ్ వరికోతల అనంతరం పంట పొలాల్లో ఉన్న వరి దుబ్బులను, గడ్డిని కాల్చేయడంతో మంటలు, పొగతో అటుగా ప్రయాణించే వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. విస్సన్నపేట - నరసాపురం రోడ్డు, నరసాపురం - చాత్రాయి, బూరుగుగూడెం, తెల్లదేవరపల్లి, పుట్రేల రోడ్డు పంట పొలాల్లో వ్యర్థాలను ఇటీవల తగలబెట్టడంతో దారి కనిపించక వాహనదారులు అవస్థలు పడ్డారు. వరికోతల అనంతరం దుక్కిలో కలియదున్నితే భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇలా చేయవద్దని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

నరసాపురం -చాత్రాయి - బూరుగుగూడెం రహదారిలో ఇలా

## దారిపొడవునా గుంతలే..

**గొ**ల్లపూడి నుంచి జక్కంపూడికి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దారి పొడవునా అనేక చోట్ల గోతులు పడడంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు ఆ మార్గంలోనే వెళ్తుండడంతో గోతులు మరింత పెద్దగా తయారయ్యాయి. నిత్యం అనేక మంది ఆ మార్గంలో వెళ్తుంటారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

## ఎగబడుతున్నాయ్.. కరిచేస్తున్నాయ్

**తి**రువూరు పట్టణంలో అనేక ప్రాంతల్లో శునకాల సంచారం పెరిగి ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గుంపులుగా తిరుగుతూ.. పిల్లలు, వృద్ధులపై దాడికి తెగబడుతున్నాయి. అవి కరవడంతో ఆసుపత్రుల పాలయ్యామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

# ఉత్సాహంగా వనసమారాధనలు

**తిరువూరు, గంపలగూడెం, గొల్లపూడి, జి.కొండూరు, న్యూస్‌టుడే:** సమాజాభివృద్ధికి కులమతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలు తోడ్పడాలని ఎంపీ కేశినేని చిన్ని కోరారు. కార్తికమాసం సందర్భంగా తిరువూరులో ఆర్యవైశ్య సంఘీయులు, కాకతీయ కమ్మసేవా సమితి, కాపు సామాజిక వర్గీయులు, శాలివాహన(కుమ్మరి) సామాజిక వర్గీయులు, భవననిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా వనసమారాధన నిర్వహించగా ఆయా వేడుకల్లో ఎంపీ పాల్గొని ప్రసంగించారు. ❍ కొత్తూరుతాడేపల్లి, జక్కంపూడి గ్రామాల్లో నగరాల యువజన సంఘం, నాగవంశం సంఘం సభ్యులు నిర్వహించిన వనసమారాధనలకు ఎంపీ పాల్గొన్నారు. ❍ జి.కొండూరు మండలం కుంటముక్కల అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన యాదవ వనసమారాధనకు ఎంపీ హాజరవగా కొండపల్లి పురపాలక ఛైర్మన్ చిట్టిబాబు, మైలవరం బీసీ సెల్ అధ్యక్షుడు నరసింహారావు తదితరులు ఆయన్ను సత్కరించారు.

**మైలవరం, న్యూస్‌టుడే:** స్థానిక వివేకానంద గార్డెన్స్‌లో రెడ్డి సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘంలోని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ బ్రాహ్మణ సేవాసమాజం ఆధ్వర్యంలో తోటలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక వ్రతాలు చేశారు. బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే కోమటి భాస్కరరావు, ఆమె భార్య కమలమ్మ జ్ఞాపకార్థం తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్ రూ.5 లక్షల విరాళం ప్రకటించినట్లు సంఘం నాయకులు తెలిపారు. లింగాయత్‌లు, ఇతర పలు కుల సంఘాల ఆధ్వర్యంలోనూ కార్యక్రమాలు జరిగాయి.

మైలవరంలో లింగాయత్‌ల వనభోజనాల్లో కుర్చీలాట



కుంటముక్కలలో ఎంపీ చిన్నికి జ్ఞాపిక అందజేసిన యాదవ సోదరులు

తిరువూరులో ఆర్యవైశ్య సంఘీయుల ఆధ్వర్యంలో..

# త్యాగాల ఫలితమే గ్రంథాలయాలు

మైలవరం : మాట్లాడుతున్న సాంబశివరావు

జి.కొండూరు: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

**మైలవరం జి.కొండూరు, కొండపల్లి, గంపలగూడెం, తిరువూరు టౌన్, న్యూస్‌టుడే:** ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల ఏర్పాటుకు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి సుబ్రహ్మణ్యం, అయ్యంకి వెంకట రమణయ్య వంటి ఎందరో ప్రముఖులు త్యాగాలు చేశారని ఏపీ లైబ్రరీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సాంబశివరావు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మైలవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ❍ నేటి సమాజంలో యువత పాత్ర ఎంతో కీలకమని జవివే జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు అన్నారు. కొండపల్లి శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి పిల్లలకు పలు సూచనలు చేశారు. తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు పోటీలు పెట్టారు.

కొండపల్లి: వ్యాసరచన పోటీల్లో చిన్నారులు

తిరువూరు: చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## ఘనంగా సత్యసాయిబాబా పల్లకిసేవ

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. సత్యసాయిబాబా పాదుకలను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. వృద్ధులు, వికలాంగులకు నూతన వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, సమితి కన్వీనర్ ఎన్.వి.ఎల్.నరసింహారావు, టీజేఆర్ గుప్తా, కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ వర్క్స్ పరిశీలన

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** పురపాలికకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 పథక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్లు ఇబ్రహీంపట్నం వాటర్‌వర్క్స్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబుతో పలు అంశాలను చర్చించారు. రా వాటర్‌ను ఫెర్రీ నుంచి తీసుకొంటే అధిక వ్యయం అవుతుందని ఇంజినీర్ల బృందం అభిప్రాయపడింది. అందుకు ఛైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పంప్‌హౌస్ నుంచే రా వాటర్‌ను తీసుకొంటే బూడిద వచ్చే ప్రమాదం ఉన్నందున నేరుగా ఫెర్రీ నుంచే తీసుకొంటే ఉత్తమమని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీర్లు ప్రభాకర్, శ్రీనివాస్‌లు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఇంజినీర్లు

## అసోసియేటెడ్ అధ్యక్షుడి ఎన్నిక

**మైలవరం, న్యూస్‌టుడే:** జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా స్థానిక న్యాయస్థానంలో సూపరింటెండెంట్ బాణావతు రంగానాయక్ ఎన్నికైనట్లు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నిర్వహించిన ఎన్నికలో ఆయన గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఆయనను బార్ అసోసియేషన్ న్యాయవాదులు అభినందించారు.

రంగానాయక్

## త్రుటిలో తప్పిన ప్రమాదం

**కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే:** కీసర టోల్‌ప్లాజా వద్ద మచిలీపట్నానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు శనివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సాయి దాసరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి మచిలీపట్నం నుంచి హైదరాబాద్ బయల్దేరింది. కంచికచర్ల మండలం కీసర సమీపంలోని స్వర్ణ టోల్ ప్లాజా వద్ద బస్సు ఎయిర్ పైపు ఊడి నిలిచింది. అదే సమయంలో బస్సు కింద నుంచి స్వల్పంగా పొగ రాగా అప్రమత్తమైన డ్రైవర్ బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులను దించి ఇతర బస్సుల్లో పంపారు. బస్సు బ్రేక్ డౌన్ అవడంతో నిలిచిందని స్థానికులు తెలిపారు.

నిలిచిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

## ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌కు సన్మానం

**భవానీపురం, న్యూస్‌టుడే:** ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన యేదుపాటి వెంకట రమణిని ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీని వెంకట రమణి, ఆమె భర్త మాజీ కార్పొరేటర్ రామయ్య, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దంపతులను ఎంపీ సన్మానించారు. తెదేపా నాయకులు వేదవ్యాస్, నరసింహ చౌదరి, సంజయ్‌వర్మ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సీఆర్పీ మృతి

**కుమ్మరికుంట్ల(ఎ.కొండూరు), న్యూస్‌టుడే:** మండలం విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీగా పని చేస్తున్న గుగులోతు నాగపండు(38) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. గత 15ఏళ్లుగా అతను విద్యాశాఖలో సీఆర్పీగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం గుండెనొప్పి రావడంతో విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంఈవో కేశవరావు, ఉపాధ్యాయులు, సమగ్రశిక్ష ఉద్యోగులు నాగపండు మృతదేహానికి నివాళులర్పించారు.

జి.నాగపండు (పాత చిత్రం)

## డీసీఎం ఢీకొని ఒకరికి గాయాలు

**పెనుబల్లి, న్యూస్‌టుడే:** పెనుబల్లి మండలం సీతారాంపురం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఆదివారం ఓ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఏపీలోని తిరువూరుకి చెందిన శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తన కుమారుడితో కలిసి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

**PASSPORT MISSING**
Boyalla Dhanush, S/o. Boyalla Narasimha Rao UD / LD 331.A' Colony, Ibrahimpatnam, NTR Dist A.P. I Have Lost My Original Passport No: **Y5046510.** while Travelling Ibrahimpatnam To Guntupalli House Shifting.. 01-11-2025. Anybody Found Please Inform.
✆ 81215 07677

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

# నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

## ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ రామాలయంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం సీతారాముల ఉత్సవమూర్తులకు వేదపండితులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పవిత్రాల సమర్పణ, ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేశారు. మహా శాంతి హోమం నిర్వహించారు. దేవాలయ ఈవో నారా వెంకట రత్నమాచార్యులు, ధన్వంతరి బృందం యజ్ఞం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకు గాజుల అలంకరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : పెనుగంచిప్రోలు గోపయ్య సమేత తిరుపతమ్మను గాజులతో అలంకరించారు. కార్తిక మాసం నాలుగో ఆదివారం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన కావేరి రెస్టారెంట్ యజమాని మలకల లక్ష్మీప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు లక్ష గాజులను విరాళంగా అందించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ స్థానిక పదో వార్డులో హీరో షోరూమ్ పక్కనున్న అపార్ట్‌మెంట్‌లోకి కుళాయి నీరు మురుగుగా వస్తోంది. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయటంతో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతోంది. ✦ స్థానిక రామన్నపేట రోడ్డులో వీధిదీపాలు సక్రమంగా వెలగక రాత్రుళ్లు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. వీధి దీపాలు రాగానే వేయిస్తామని చెప్పారు. ✦ స్థానిక రామన్నపేట రోడ్డులో పైపులైన్ పగిలి తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగింది. విషయాన్ని మున్సిపల్ ఏఈ పణి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరించారు. ✦ స్థానిక మూడో వార్డు మసీదు వద్ద వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందిపడ్డారు. విషయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, నందిగామ

## మొక్కజొన్నలు కొనేవారేరీ?

### మద్దతు ధర అందక రైతుకు నష్టం

నందిగామ, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : అతివృష్టి పరిస్థితుల్లో ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నలు కొనే దిక్కు లేక రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతుండటంతో అమ్మలేక ఆందోళన చెందుతున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక మద్దతు ధర అందట్లేదు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో పదివేల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు. ఇటీవల మొంథా తుపాను వల్ల చేతికి వచ్చిన పంట దెబ్బతింది. అధిక వర్షాల వల్ల ఎకరాకు 20 నుంచి 30 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 15 నుంచి 20 బస్తాల లోపే వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,380 మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ప్రారంభించ లేదు. దీనివల్ల మద్దతు ధర అందట్లేదు. ఫలితంగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.1800కే అడుగుతున్నారు. ఈ ధరకు ఇవ్వలేక రైతులు ఇళ్లల్లోనే నిల్వ చేస్తున్నారు. నందిగామ, కంచికచర్ల మండలాల్లో ఆల్కహాల్ తయారీ పరిశ్రమలు ఉండటం వల్ల ముడి సరకుగా మొక్కజొన్నలు కొన్నారు. దళారులు ఇప్పుడు తక్కువ ధరకే అడుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గొల్లమూడి వద్ద ఆరబోసిన మొక్కజొన్నలు

**ప్రభుత్వం కొనాలి**

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు మద్దతు ధరకు కొనుగోలు చేయించాలి. లేకపోతే అన్ని విధాలా నష్టపోతాం. ప్రైవేట్ వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. -కొండవనేని శ్రీనివాసరావు, రైతు

**దిగుబడులు తగ్గాయి**

మూడు ఎకరాల్లో మొక్కజొన్న వేశా. అధిక వర్షాల వల్ల దిగుబడులు తగ్గాయి. మద్దతు ధర ప్రకటించటం మినహా రైతులకు ఇవ్వట్లేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. -సామినేని సత్యనారాయణ, రైతు, గొల్లమూడి

## కాలువలు ఇలా.. మురుగు పారేదెలా?

పెద్దాపురం (వీరులపాడు), న్యూస్‌టుడే : పక్కా కాలువలు లేక, ఉన్న కచ్చా కాలువలు నిర్వహణ చేయక మండల పరిధిలోని పెద్దాపురం గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. పెద్దాపురంలో కంచికచర్ల-మధిర ప్రధాన రహదారికి అనుసంధానమయ్యే జయంతి రోడ్డులోని మురుగు కాలువలో పిచ్చి చెట్లు పెరిగి.. చెత్త, చెదారం పేరుకుని.. మురుగు పారడం లేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరదనీటితో కాలువల్లోని మురుగు రోడ్డుపైకి వస్తుండటంతో దుర్వాసన వస్తోంది. జయంతి రోడ్డుకు ఇరువైపులా శాశ్వత ప్రాతిపదికన మురుగు కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జయంతి రోడ్డు కాలువలో పిచ్చిచెట్లు

## జాతీయ రహదారిపై ఇసుక తొలగింపు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై పాత కంచల క్రాస్ రోడ్డు వద్ద పేరుకున్న ఇసుకను యంత్రంతో ఆదివారం తొలగించారు. 16న 'ఈనాడు'లో 'జారి పడుతున్నా జాలి చూపరా' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి కీసర టోల్‌ప్లాజా సెక్యూరిటీ మేనేజరు ఉమా మహేశ్వరరావు స్పందించారు. యంత్రంతో ఇసుక తొలగింపజేశారు.

ఈనాడు కథనాలకు స్పందన

## నేటి నుంచి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు

నందిగామ, న్యూస్‌టుడే : నందిగామ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందని యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. 'తెమ్మంటారు.. తెస్తే.. గుంటూరు పొమ్మంటారు' శీర్షికతో ఈనెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్, సీసీఐ అధికారులు స్పందించారు. ఈ మేరకు యార్డులో పత్తి కొనేలా చర్యలు తీసుకున్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు నేరుగా యార్డుకు తీసుకు రావాలని కార్యదర్శి చెప్పారు. సీసీఐ బయ్యరు పత్తి పరిశీలించి మద్దతు ధర క్వింటాకు రూ.8160 ఇస్తారని తెలిపారు.

### బైపాస్‌పై వెలుగులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల వద్ద జాతీయ రహదారి బైపాస్‌పై వీధి దీపాలు వెలగక చీకటి ఉండటంతో ఈ నెల 7న 'ఈనాడు'లో 'అంధకారంలో జాతీయ రహదారి బైపాస్' శీర్షికన ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారి అధికారులు స్పందించారు. బైపాస్‌పై పని చేయని వీధి దీపాలకు మరమ్మతులు చేశారు. దీంతో రహదారిపై వెలుగులు సంతరించుకున్నాయి.

## కనుల పండువగా కోటి దీపోత్సవం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ రామన్నపేట రోడ్డులోని కురగంటివారి కండ్రిక దాసాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి కోటి దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. దాసాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. జై శ్రీరామ్, ఓం నమఃశివాయ నామస్మరణలు మార్మోగాయి. సీఐ వైవీఎల్ నాయుడు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ ఛైర్మన్ మేడా రామారావు, తెదేపా నాయకులు ఉమ్మనేని విక్రం, వైఎస్ బాబు పాల్గొన్నారు.

★ నందిగామ కృష్ణ బలిజనగర్ పుట్ట నాగేంద్రస్వామి దేవాలయం వద్ద ఆదివారం శివలింగానికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. గుంటూరు జిల్లాకు చెందిన శివదీక్షాధారులు, నాగసాధువులు అభిషేకం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కె.కండ్రికలో కోటి దీపోత్సవం

★ **నేడు లక్ష బిల్వార్చన :** అడవి రావులపాడు అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో 17న కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నామని తితిదే వేద పండితుడు దుర్భాకుల సాంబమూర్తి అవధాని ఆదివారం తెలిపారు. రుద్రహోమం, జ్యోతిర్లింగార్చన, శాంతి కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

## పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు సూచనలిస్తున్న డీసీపీ లక్ష్మీనారాయణ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం సందర్శించిన విజయవాడ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ జగ్గయ్యపేట, చిల్లకల్లు పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ప్రత్యేక సూచనలిచ్చారు. నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులుగా నమోదై ఉన్న వారి ప్రతి కదలికపై నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలకు గురి కావాల్సి వస్తుందని సూచించారు. నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, హింసాత్మక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూలిందా.. ప్రమాదమే

నందిగామ, న్యూస్‌టుడే: మండలంలోని మునగచర్లలో మంచినీటి ట్యాంకు ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉండటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి పెనుగంచిప్రోలు మండలంలోని కొల్లికుళ్ల వద్ద మునేరు నుంచి సీపీడబ్ల్యూ పథకం నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ట్యాంక్ పెచ్చులూడింది. ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. ట్యాంక్ నుంచి నీరు లీకవుతోంది. పైకి ఎక్కేందుకు ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు తుప్పుపట్టాయి. ఇది రహదారి పక్కనే ఉండటం వల్ల కూలితే ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది. జల్‌జీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో మరో ట్యాంక్ నిర్మించినా .. వినియోగంలోకి రాలేదు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ట్యాంకు

## అలసత్వం.. ప్రాణాలతో చెలగాటం

గండేపల్లి నుంచి బోడవాడ- జమ్మవరం వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారింది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వరద కారణంగా రహదారి పలు చోట్ల కోతకు గురైంది. అలా కోతతో ఏర్పడిన ఒక భారీ గుంతను పూడ్చేందుకు గుంతలో భారీ బండరాళ్లు వేశారు. వీటిని గమనించకపోతే జరిగే ప్రమాదాలు ఎక్కువ అని వాహనదారులు వాపోతున్నారు. ఇలా వాహనదారుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే రహదారిని పునర్నిర్మించాలని కోరుతున్నారు.

- గండేపల్లి (కంచికచర్ల), న్యూస్‌టుడే

రహదారి గుంతకు అడ్డుగా పెట్టిన బండరాళ్లు

## నాణ్యత నగుబాటు

మండల పరిధి పెద్దాపురంలో నూతనంగా నిర్మించిన బీటీ రహదారి మూడు నెలలు కూడా గడవక ముందే మెతక వచ్చి గుంతలు పడుతోంది. పెద్దాపురం నుంచి తెలంగాణ సరిహద్దు వరకు కిలోమీటరు మేర రూ.73 లక్షలతో దీన్ని ఆగస్టులో నిర్మించారు. రోడ్డు వేసిన కొద్ది రోజులకే గుంతలు పడ్డాయి. ఆగస్టు 30న జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని చెప్పారు. అయినా గుంతలు పడటంతో గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 100 మీటర్ల పరిధిలో ఇప్పటికి 8 చోట్ల రోడ్డు దెబ్బతినగా గుత్తేదారు మరమ్మతులు చేసి మిన్నకున్నాడు. రహదారి నాణ్యతగా నిర్మించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రజలు అంటున్నారు.

మరమ్మతులు చేసిన పెద్దాపురం రహదారి

## సందడిగా కార్తిక వన సమారాధనలు

మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యేలు వసంత, సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే : నందిగామ చిరుమామిళ్ల శేషాద్రి నాయుడు ప్రాంగణంలో ఆదివారం నందిగామ నియోజకవర్గం కమ్మ సంఘం కార్తిక వన సమారాధన వైభవంగా నిర్వహించారు. దివంగత ఎన్టీఆర్, శేషాద్రి నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి.. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు తొండపు దశరథ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే బోడ్డులూరి రామారావు తదితరులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వరంగల్‌కు చెందిన వాసిరెడ్డి హిమాన్సు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కమ్మ సంఘం ఆధ్వర్యంలో రూ.13.50 లక్షల ఉపకార వేతనాలను కమ్మ పేద విద్యార్థులు 135 మందికి అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే వసంత రూ.5 లక్షలు అందజేశారు. కమ్మ సంఘం నుంచి మరో రూ.5 లక్షలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ అమ్మినేని రామకృష్ణ, గుంటూరు కమ్మ సంఘం అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు, దాతలు మల్లాది వాసు, సోలా వెంకటేశ్వరరావు, యార్డు ఛైర్మన్ కోగంటి బాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమ్మ సంఘం ప్రతినిధులు వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, పాలేటి సతీష్, వాసిరెడ్డి ప్రసాదు, పెంట్యాల వీరభద్రరావు, వాసుదేవరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి

నందిగామ గ్రామీణం : పల్లగిరి శివారు భద్రయ్య, సంగమేశ్వరరావు మామిడితోటలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం 105వ కార్తిక వన సమారాధన సంప్రదాయంగా నిర్వహించారు. ఆర్యవైశ్య బాల భక్త సమాజం ఆధ్వర్యంలో దంపతులు సామూహికంగా రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల భక్త సమాజం కుంచం లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ సేవాసమితి అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము తదితరులు పాల్గొన్నారు.

◆ మండలంలోని పాతకంచల మునేటి తీరాన మామిడిలో కాపు సంఘం కార్తిక వన సమారాధన సంప్రదాయంగా నిర్వహించారు.

నందిగామ గ్రామీణం : మునేటి తీరాన పల్లగిరి మామిడితోటల్లో ఆదివారం చందర్లపాడు మండలం తుర్లపాడు తెదేపా ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య హాజరయ్యారు. సంఘీయులు పాల్గొన్నారు.

### ఘన చరిత్రను నిలబెట్టుకుందాం

జగ్గయ్యపేట : కమ్మ సామాజిక వర్గానికి ఉన్న ఘన చరిత్రను భావితరాలకు అందించేలా అందరం కృషి చేద్దామని పలువురు ప్రముఖులు సూచించారు. ఆదివారం తిరుమలగిరి రోడ్డులోని తోటలో నిర్వహించిన కాకతీయ కమ్మ సేవా సంఘం వారి వన సమారాధనలో కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, తెదేపా పొలిట్‌ బ్యూరో సభ్యుడు తొండపు దశరథ జనార్దన్, వైకాపా బాధ్యుడు తన్నీరు నాగేశ్వరరావు, కేసీపీ ఉపాధ్యక్షుడు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు.

### రాజ్యాధికారం సాధనకు కృషి

జగ్గయ్యపేట : రాష్ట్రంలోని కాపు సామాజిక వర్గం పార్టీలకు అతీతంగా రాజ్యాధికారమే ధ్యేయంగా సంఘటితంగా కృషి చేద్దామని పలువురు నాయకులు సూచించారు. ఆదివారం ఆటోనగర్ సమీపంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సంఘం వన సమారాధనలో కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ శాసనమండలి సభ్యుడు పరచూరి అశోక్, రాధారంగ మిత్రమండలి అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

చందర్లపాడు తెదేపా నాయకులతో ప్రభుత్వ విప్ సౌమ్య

### సమాజంలో మంచి మార్పుల కోసమే..

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట బలుసుపాడు రోడ్డులో ఆర్యవైశ్య వన సమారాధనలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. మంచి మార్పుల కోసం సమష్టిగా సమీక్షించుకునే వేదికలే వన సమారాధనలు అని ప్రముఖ తాత్వికుడు గెంటేల వెంకటరమణ సూచించారు. ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీరాంసుబ్బారావు, మాజీ వైస్ ఛైర్మన్ నూకల కుమార రాజా, శ్రీరాంచిబాబు, సాయిప్రసాద్, నూలక బాలకృష్ణ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలం దేచుపాలెంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘ వన సమారాధన సంప్రదాయరీతిలో సాగింది. సామాజిక వర్గ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

జగ్గయ్యపేట : నెట్టెంను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆర్యవైశ్య సంఘ వేడుకలో వెంకటరమణ దంపతులు, ఎమ్మెల్యే తాతయ్య

కాపు సేవా సంఘం వన సమారాధనలో సుబ్బారాయుడు, ఉదయభాను, ప్రభాకర్, నరేంద్ర తదితరులు

## త్రుటిలో తప్పిన ప్రమాదం

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే : కీసర టోల్‌ప్లాజా వద్ద మచిలీపట్నానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు శనివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సాయి దాసరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి మచిలీపట్నం నుంచి హైదరాబాద్ బయల్దేరింది. కంచికచర్ల మండలం కీసర సమీపంలోని స్వర్ణ టోల్ ప్లాజా వద్ద బస్సు ఎయిర్ పైపు ఊడి నిలిచింది. అదే సమయంలో బస్సు కింద నుంచి స్వల్పంగా పొగ రాగా అప్రమత్తమైన డ్రైవర్ బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులను దించి ఇతర బస్సుల్లో పంపారు. బస్సు బ్రేక్ డౌన్ అవడంతో నిలిచిందని స్థానికులు తెలిపారు.

నిలిచిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

## భవానీ శంకరునికి తామరపూలతో అర్చన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగానికి ఆదివారం రుద్రాభిషేకం నిర్వహించారు. తామరపూలతో అర్చన చేసి అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేకం చేశారు. శివనామస్మరణ మార్మోగింది.

★ నందిగామ వాసవీ మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 20న కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు 458 మంది దంపతులతో సామూహిక కోటి దీపోత్సవం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు.

పల్లగిరిపై వాయులింగానికి అలంకరణ

## గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

విజేతలతో ప్రతినిధులు

అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నందిగామ, న్యూస్‌టుడే : అఖిల భారత గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని నందిగామ గ్రంథాలయంలో ఆదివారం సీనియర్ విద్యార్థుల విభాగంలో అంతరిక్ష యానంలో భారత్ సాధించిన విజయాలు అంశంపై, జూనియర్ విభాగంలో వాతావరణ కాలుష్యం నివారణ చర్యలు అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా రూపేష్ యాదవ్, మురళీకృష్ణ, బ్రహ్మయ్య వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి ఎ.రామచంద్రుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె.రాజగోపాల్ పాల్గొన్నారు.

కంచికచర్ల : గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో మూడో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి.అమరేశ్వరి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలరించిన కవి సమ్మేళనం

జగ్గయ్యపేట: పట్టణంలోని గ్రేడ్- 1 గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ వడ్డెపల్లి శ్రీనివాసరావు, షేక్ అబ్బాస్ ఆలి తదితర సాహితీవేత్తల ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమంలో సరికొండ నరసింహరాజు, బత్తుల బ్రహ్మయ్య, అద్దంకి సుధాకర్, పర్సా శ్రీనివాసరావు, పి.రమణారావు, కొండు నాగేశ్వరరావు తమ కవితలను వినిపించారు. గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కవిత వినిపిస్తున్న సాహితీవేత్త

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పాలేటి ఒడ్డున ఉన్న రుద్రభూమి శివాలయంలో ఆదివారం లక్ష బిల్వార్చనలో భాగంగా రాజ రాజేశ్వరస్వామికి విశేషాలంకరణలతో పూజలు చేశారు. స్వామి కల్యాణోత్సవం నిర్వహించిన ప్రతినిధులు అనంతరం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు.

◆ పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న స్వయంభూ నాగలక్ష్మి అమ్మవారి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారికి లక్ష గాజులతో విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ క్రతువులను పండితులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా చదరంగం టోర్నమెంట్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో మానసిక సామర్థ్యాన్ని పెంచే చదరంగ క్రీడను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ముల్లంగి గుడ్ లైఫ్ ఫౌండేషన్ ఛైర్మన్ ముల్లంగి నర్సిరెడ్డి అన్నారు. స్థానిక విశ్వకర్మ చెస్ అకాడమీ వారు బాలుర హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు పారేపల్లి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల్లో క్రీడాస్ఫూర్తిని, ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను క్రీడలు పెంచుతాయని చెప్పారు. పీవీ నాగేశ్వరరావు ప్రపంచవ్యాప్తంగా చెస్‌కి ఉన్న ప్రాధాన్యం వివరించారు. టోర్నమెంట్ విజేతలతో పాటు వయసుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు, పతకాలు అందించారు. శాప్ కోచ్ కె.గోపి, చెస్ కోచ్ యడ్ల మహేష్, అన్నపూర్ణ ఆగ్రో ప్రతినిధి నరసింహారావు, వాసవి సమితి ప్రతినిధి కాకరపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల విజేతలతో అకాడమీ ప్రతినిధులు

### ప్రకటన

నా క్లయింట్ విజయవాడ మాచవరం కాపురస్తురాలు శ్రీ కొప్పోలు నరేంద్ర గారి భార్య శ్రీమతి పద్మావతి గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. శ్రీ వల్లపుదాసు నాగభూషణం గారి కుమారుడు శ్రీ శ్రీను గారికి దిగువ షెడ్యూల్ దాఖలా ముప్పాళ్ల గ్రామ పంచాయతీ నందున య॥ 0.95ట్లు వారి పిత్రార్జితపు మరియు పూర్వార్జితపు ఆస్తులను వారి కుటుంబ సభ్యులతో పంచుకొని ఒక రిజిస్టర్డ్ పార్టిషన్ దస్తావేజు నెం.4928/2019 క్రింద సంక్రమించినదని తదుపరి సదరు దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని వారి నుండి కొనుగోలు చేయుటకు నా క్లయింట్ ఖరారుపడి త్వరలో క్రమమైన సక్రమమైన రిజిస్టర్డ్ క్రయ దస్తావేజు ద్వారా స్వాధీనము పొందబోవుచున్నారు. కావున సదరు షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపైన ఎవరికైనను ఎటువంటి హక్కులు గాని, క్లయిములు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల నాకు 7 దినములలోగా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తెలియపరచగలరు. లేనిచో సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తి నిర్వివాదమైనదని భావించి నా క్లయింట్ కొనుగోలు చేయుదురు. తదుపరి వచ్చు క్లయిములు గాని, అభ్యంతరములు గాని చట్ట ప్రకారం చెల్లవు మరియు నా క్లయింట్‌ను బైండ్ చేయజాలవు.

**షెడ్యూల్:** కృష్ణా జిల్లా నందిగామ సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ పంచాయతీ తాలూకు ఆర్.ఎస్.నెం.387 దాఖలా య॥ 0.95ట్లుకు హద్దులు. **తూర్పు:** నల్లాని శ్రీను వగైరాల భూమి, **దక్షిణం :** వల్లపుదాసు సుబ్బారావు భూమి, **పడమర :** వల్లపుదాసు రాంబాబు భూమి, **ఉత్తరం:** బాణావతు ధను వగైరాల భూమి.

ఇట్లు **పాదర్తి పూర్ణచంద్రరావు,** అడ్వకేట్
F.F-1, LRK టవర్స్, రామాలయం వీధి, కృష్ణలంక
విజయవాడ - 13. Ph: 98482 30004.

(c) eenadu

# విజయవాడ తూర్పు

తులసిదళాలు సిద్ధం చేస్తున్న భక్తులు

## వైభవంగా పూజా కార్యక్రమాలు

**లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే :** కార్తిక మాసం సందర్భంగా ఆదివారం లబ్బీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసిదళాలతో వైభవంగా పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక శోభ సంతరించకుంది.

## దీపోత్సవంతో కృష్ణానదికి సరికొత్త శోభ

**కృష్ణలంక, న్యూస్‌టుడే :** దీపోత్సవంతో కృష్ణానది సరికొత్త శోభ సంతరించుకున్నట్లుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి లక్ష్మి అన్నారు. కార్తిక మాసం పురస్కరించుకుని శ్రీశారద సనశ్చంద్ర పురోహిత కార్యాలయ నిర్వాహకుడు దేవరకొండ సతీష్ శర్మ ఆధ్వర్యంలో కృష్ణలంక పాత పోస్టాఫీసు చివర ఉన్న కృష్ణా పుష్కరఘాట్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్తిక దశ సహస్ర దీపోత్సవంలో ఆమె పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించి సామూహిక పూజలో పాల్గొన్నారు. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన తిలకించి అభినందించారు. స్థానిక మహిళలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న జానకి లక్ష్మి

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

అయ్యప్ప స్వామి మండపం.. పూజలో భక్తులు

**పటమట:** స్థానిక అయ్యప్పనగర్‌లో గురు స్వామి బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం పడి పూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి, కుమారస్వామి, మెట్ల పూజలు చేశారు. అయ్యప్ప స్వామి పూజ అనంతరం విగ్రహానికి పంచామృత అభిషేకం, కుంకుమ, చందన, పసుపు, భస్మాభిషేకాలు చేశారు. మహా మంగళహారతితో పూజ ముగించారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన గీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది.

## వైభవం.. మల్లన్న సహస్ర లింగార్చన

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం వైభవంగా మల్లన్న సహస్ర లింగార్చన నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర దీపాలంకృత స్టాండ్ వద్ద దీపార్చన, ఆదిదంపతులకు ఊంజల్ సేవను భక్తులు సమక్షంలో అర్చకులు చేశారు. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు మల్లేశ్వరాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ భక్తుల రద్దీ నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు.

క్రతువు నిర్వహిస్తున్న రుత్వికులు, పక్కన ఈవో శీనానాయక్

మహిషాసురమర్దినిగా భ్రమరాంబ

## ఆక్రమిస్తుంటే చోద్యం చూస్తారా?

**మూడో** డివిజన్ కరెన్సీనగర్ ప్రధాన రహదారి ఆక్రమణకు గురైంది. ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులు 5 అడుగుల మేర రోడ్డును ఆక్రమించి మొక్కలు పెట్టుకునేందుకు ఏర్పాటు చేయగా, కొత్తగా మరో నాలుగు అడుగులు రోడ్డును ఆక్రమించి సీసీ చప్టాలు వేస్తున్నారు. దీంతో పాటుగా ఇతర వాహనాలు పెట్టకుండా ఇనుప చువ్వలతో బారికేడ్లు పెడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీనిపై స్థానికులు కొంతమంది ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో చర్యలు తీసుకోవాలని కోరారు. **-కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

రోడ్డు మార్జిన్‌లో సీసీ చప్టాలు

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

**మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎక్కువ సేపు చదివి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, కొద్దిసేపు క్రీడలు ఆడితే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని శ్రీశ్రీనివాస గ్రావిటీ విద్యాసంస్థల ఛైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. మొగల్రాజపురం సిద్ధార్థ పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో శ్రీశ్రీనివాస గ్రావిటీ వార్షిక క్రీడా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి. ఫణిరాజ్‌కుమార్, డైరెక్టర్ పరుచూరి నీలిమ, అకడమిక్ డైరెక్టర్లు ఎం. వి. సత్యనారాయణరెడ్డి, టి. సురేశ్‌బాబు, కె. సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, టెన్నిస్, వాలీబాల్, టెన్నికోట్, క్రికెట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఛైర్మన్ బహుమతులు అందజేశారు.

బహుమతులు సాధించిన విద్యార్థినులతో ఛైర్మన్ శ్రీనివాసరావు

## బిర్సా జీవిత చరిత్ర తెలుగు అనువాద పుస్తకావిష్కరణ

**పటమట, న్యూస్‌టుడే :** స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జీవిత చరిత్ర తెలుగు అనువాద పుస్తకం ఆవిష్కరించటం ఆనందంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని తెలుగులో ముద్రించిన బిర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా సేవలు చిరస్మరణీయుడని, బ్రిటీష్ వారిపై ఆయన చేసిన పోరాటాలు గిరిజనుల్లో చైతన్యం నింపి ఆదివాసులకు ఆరాధ్య దైవంగా మారారని చెప్పారు. జన జాతీయ గౌరవ దివస్ వల్ల బిర్సా ముండా లాంటి ఎంతో మంది గిరిజన వీరుల గాథలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రకు ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. అనంతరం మాదిగాని గురునాథం బిర్సా ముండా చిత్రపటాన్ని ఎంపీకి బహూకరించారు. నాయకులు వి. నరసింహ చౌదరి, సొంగా సంజయ్, కరీముల్లా పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్, నాయకులు గురునాథం తదితరులు

## దుర్గగుడికి పలువురు విరాళం

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు దాతలు విరాళం అందజేశారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్ రూ. 1,00,116, శ్రీకాకుళానికి చెందిన ఎం. ప్రభాకర్ రూ. లక్ష, తెలంగాణ సూర్యాపేటకు చెందిన రవికుమార్ రూ. 1,00,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ జగదీష్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతలు ఎం.ప్రభాకర్, భగవత్ ప్రసాద్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

దాత రవికుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## బాధితులకు చేయూత

**సూర్యారావుపేట:** విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), సీపీఎం నాయకులు రూ. 10 లక్షల నష్టపరిహారం, మట్టి ఖర్చుల కింద రూ. 50 వేలు ఇప్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కటికెల ఏసు (22) ఈ నెల 15న స్వరాజ్య మైదానంలోని భవనంపై ఫ్లోరింగ్ పని చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బాధితులకు నాయకులు అండగా నిలబడి.. గుత్తేదారు సంస్థతో మాట్లాడారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ అంగీకరించడంతో ఆదివారం ఏసు తల్లిదండ్రులకు నగదు అందజేశారు.

## నేటి నుంచి మండల పూజలు

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పాతబస్తీ శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అయ్యప్ప స్వామి ఉపాలయంలో సోమవారం నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు మండల పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకుడు మురళీధరన్ నంబూద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శబరిమలలో నిర్వహించే విధంగా మండల పూజలను ఇక్కడి ఉపాలయంలో కూడా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మంగళవారం భజన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

## అన్నదాన ప్రభువే... శరణమయ్యప్ప..

### శ్రీధర్మ శాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో 11 ఏళ్లుగా మాలధారులకు అన్నవితరణ

**పటమట, న్యూస్‌టుడే**

**మా**లధారణ చేసిన అయ్యప్ప భక్తులు నియమ, నిష్ఠలతో దీక్ష చేస్తారు. ఉల్లి, వెల్లుల్లి, మసాలా లేకుండా, ఉప్పు, కారం లేకుండా తింటారు. ఎక్కడపడితే అక్కడ సద్ది (మధ్యాహ్న భోజనం) చేయరు. వ్యక్తిగత పనులకు దూర ప్రాంతాల నుంచి మాలధారులు నగరానికి వస్తుంటారు. దీక్ష నియమాల దృష్ట్యా వారు పడుతున్న ఇబ్బందులు గమనించిన విజయవాడకు చెందిన కంఠమనేని వేణుగోపాల్ మాలధారులకు సద్ది ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. తొలుత 100 మంది స్వాములు మాలధారణ ముగిసేవరకు సద్ది వడ్డించేలా ఏర్పాటు చేశారు. మరుసటి సంవత్సరం 2015లో కొంతమంది శ్రీధర్మ శాస్త్ర సేవాసమితి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా అన్నవితరణ చేస్తున్నారు. రోజుకు సుమారు ఆరు నుంచి ఏడు వేల మంది ఇక్కడ సద్ది చేస్తున్నారు.

**75 రోజుల పాటు.. :** సేవాసమితి తరఫున ఏటా మాలధారులకు కార్తిక మాసం మొదటి రోజు నుంచి మకర జ్యోతి వరకు సుమారు 75 రోజులు అన్న వితరణ చేస్తుంటారు. ఇందుకు పటమట హైస్కూల్ రోడ్డులోని రైతు బజారు ఎదుట ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా మండపాలు నిర్మించి పీఠాలు ఏర్పాటు చేశారు. ఒకేసారి 1000 మంది స్వాములు కూర్చుని సద్ది చేసేలా ఏర్పాటు చేశారు. నిత్యం 10 రకాల వంటకాలతో ఎంతమంది వచ్చినా ఇబ్బంది లేకుండా కమిటీ వారు శ్రద్ధ తీసుకుంటున్నారు. సుమారు 100 మంది సభ్యులు స్వచ్ఛందంగా వంటలు చేయడం, శుభ్రం చేయడం, కూరగాయలు తరగడం, ఆహారం వడ్డించడం చేస్తున్నారు.

పీఠంలో సద్ది చేస్తున్న స్వాములు

### పూజా విధానం గురించి అవగాహన

**ఈ** సమితి అన్నదాన వితరణ ఒక్కటే కాకుండా ఇక్కడ పీఠం పెట్టి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. మొదటిసారి మాల వేసుకున్న స్వాములకు మాల విధానం గురించి వివరిస్తూ శబరిమల వెళ్లేందుకు అవగాహన కల్పిస్తుంటారు. హిందూ ధర్మ పరిరక్షణపై యూట్యూబ్ ఛానల్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

### ఇబ్బంది పడకూడదనే ..

11 ఏళ్ల నుంచి మాలధారులకు అన్నదానం చేయడం దేవుని కృపగా భావిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బంది పడకూడదని శ్రీధర్మ శాస్త్ర సేవా సమితి తరఫున కార్యక్రమాన్ని చేపట్టాం. ఏటా సుమారు 75 రోజులు అన్నవితరణ చేస్తాం. ప్రతి రోజు రూ. లక్షన్నర వరకు ఖర్చు అవుతుంది.

**-కంఠమనేని వేణుగోపాల్ (గురుస్వామి) శ్రీధర్మ శాస్త్ర సేవాసమితి వ్యవస్థాపకుడు**

## కార్పొరేషన్లో నేడు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

**విజయవాడ నగరపాలక సంస్థ :** నగరవాసుల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగు కాలువలు, వీధి దీపాలు, రహదారులు, ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు వంటి సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు.

## పుట్టపర్తి సత్య సాయిబాబా పల్లకిసేవ

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి పురస్కరించుకుని ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో పల్లకిసేవ నిర్వహించారు. సత్యసాయిబాబా పాదుకలను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు నూతన వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, సమితి కన్వీనర్ ఎన్. వి. ఎల్. నరసింహారావు, టీజీఆర్ గుప్తా, కోనేటి రామకృష్ణ పాల్గొన్నారు.

## కార్తిక మాస హోమాలు

ఆలయంలో అమ్మవారి అలంకరణ

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే :** బెంజి సర్కిల్ సమీపంలోని శ్రీ విద్యా దత్త సాయి పీఠంలో కార్తిక మాస హోమాలు నిర్వహించారు. పీఠంలో కొలువైన అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శివుడికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసినట్లు యడవల్లి మురళీకృష్ణ శర్మ తెలిపారు.

## తవ్వారు.. వదిలేశారు

**పటమట, న్యూస్‌టుడే:** అయ్యప్పనగర్ వీర సావర్కార్ రోడ్డులో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ కోసం నాలుగు నెలల క్రితం రోడ్డు తవ్వారు. అప్పటి నుంచి ఆ గుంత పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీఎంసీ అధికారులు స్పందించి గుంత పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

## వ్యర్థాల కుప్పలు... తొలగించక అవస్థలు

పేరుకున్న వ్యర్థాలు

**బెంజి సర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే :** బెంజి సర్కిల్ రెండో పై వంతెన పక్కన ఉన్న సర్వీస్ రహదారి పక్కన చెత్త, వ్యర్థాల గుట్టలు పేరుకున్నాయి. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. మరోవైపు పాత వాహనాలు ఇక్కడ పెట్టారు. కొన్ని రోజుల నుంచి ఇవి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వీటిని వెంటనే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

**విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే :** వైద్యులకు 2016 పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా. పంజాల శ్రీనివాస్ కోరారు. ఆదివారం సిద్ధార్థ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఆ సంఘ ప్రతినిధుల సభ నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఉన్న వైద్యుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు అనిల్, బాబ్జి శ్యామ్‌కుమార్, భానుకుమార్, మారుతీదేవి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

## శునకం.. వీధిలో కొస్తే భయం

**19వ** డివిజన్ లబ్బీపేట బృందావన్ కాలనీ ఎలెక్ట్రానిక్స్ రోడ్డులో వీధి కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంట పడుతున్నాయి. దీంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. స్థానికులు చిన్న పిల్లలను బయటకు పంపలేక పోతున్నారు. కొన్నింటికి చర్మవ్యాధులు సోకాయి. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**-కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

## పంట కాలువను పట్టించుకోరా?

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

**పం**ట కాలువ డ్రెయిన్‌పై అధికారులు చిన్నచూపు చేస్తున్నారు. దీనిలో పూడిక కూడా తీయడం లేదు. ముందస్తుగా మహానాడు రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాక దీనిపై దృష్టి పెడతామని అంటున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని శివారు కాలనీల మీదుగా వెళ్లే డ్రెయిన్ వ్యర్థాలతో నిండి దుర్గంధం.. దుర్వాసన తాండవిస్తోంది. విషజ్వరాలు ముదురుతున్న సమయంలో పూడికతీతలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీనిపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

✦ పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కరెన్సీనగర్ బల్లెంవారి వీధి వరకు పంట కాలువ డ్రెయిన్ విస్తరించింది. మొదట్లో మూడు అడుగులు ఉన్న ఇది బాయన బాబూజీ రహదారికి చేరేసరికి 20 అడుగులకు విస్తరించింది. గురునానక్ రోడ్డు దాటాక సీటీవో కాలనీ, భారతీనగర్ మీదుగా మహానాడు రోడ్డు వచ్చే సరికి వర్షపునీరు మళ్లించే డ్రెయిన్‌గా మారింది. అక్కడి నుంచి నాగార్జుననగర్, శ్రీరామచంద్రనగర్, కరెన్సీనగర్ బాయన బాబూజీ రహదారి మీదుగా ఓపెన్‌గా ఉండటంతో వ్యర్థాలు వేస్తున్నారు. కొంత మంది స్థల యజమానులు మురుగునీటిని డ్రెయిన్‌లోకి వదిలేయడంతో దుర్వాసన వస్తోంది. బాయన బాబూజీ రహదారిపై రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటుగా మొక్కుబడి పూడిక తీయక ఎక్కడి వ్యర్థాలు అక్కడే నిలిచి దోమల ఆవాసాలు మారుతున్నారు. ప్రస్తుతం వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పంట కాలువ డ్రెయిన్ పూడిక తీయాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

విస్తరించాల్సిన పంట కాలువ డ్రెయిన్

## అమ్మవారి ఆలయ నిర్వహణ పత్రాలు అందజేత

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** చిట్టినగర్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మరో ఐదేళ్ల పాటు నిర్వహించుకునేందుకు దేవాదాయ శాఖ ఇచ్చిన అనుమతి పత్రాన్ని పార్లమెంటు సభ్యుడు శివనాథ్ అందజేసినట్లు ఆ దేవస్థానం కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం పాముల కాలువ వద్ద నగర వనంలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో ఈ పత్రాన్ని అందుకున్నట్లు వివరించారు. ఎంపీ చొరవ తీసుకుని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో చర్చించి ప్రభుత్వ ఆదేశాల మేరకు తమకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరాల సామాజిక వర్గం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు, కె. నరసింహారావు, తమ్మిన సూర్యకుమారి, బాయన బాబ్జి కృతజ్ఞతలు తెలిపారు.

## అందరికీ అందుబాటు ధరల్లో గృహాలు

**గండిగుంట(ఉయ్యూరు(గ్రామీణం), న్యూస్‌టుడే :** కొన్నేళ్లుగా హరివిల్లు సంస్థ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో గృహాలు, స్థలాలు అందిస్తూ సొంతింటి కలను సాకారం చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మండలం గండిగుంటలో హరివిల్లు గ్రీన్ విస్తారా ప్రాజెక్టులో భాగంగా 23 సెమీ-విల్లా ఆధారిత ఇండిపెండెంట్ గృహాలు, 4 అంతస్తుల క్లబ్ హౌస్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. గండిగుంట వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి ప్రాజెక్టులు రావడం ఊతం ఇస్తాయని పేర్కొన్నారు. హరివిల్లు ఛైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సొంతిల్లు ఉండాలని కోరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, హరివిల్లు సీఈవో జాస్తి ప్రసన్న, అడ్మిన్ మేనేజర్ పద్మజ, రిలేషన్ షిప్ మేనేజర్ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బోడే ప్రసాద్

## సాధన నిలిపింది.. విజయపథాన

♦ ఈత పోటీల్లో చిన్నారుల దూకుడు

♦ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో వ్యక్తిగత ఛాంపియన్లు

**న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు**

**లక్ష్య** సాధనకు చిన్నతనం నుంచే ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ఈ చిన్నారులు. రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘం తొలిసారిగా గ్రూపు- 5 (అండర్-8), గ్రూపు-4 (అండర్-10) కేటగిరీల్లో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించాలనే దిశగా అడుగులు వేసింది. ఆదివారం గాంధీనగర్‌లోని సర్ విజ్జి వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో కృష్ణా జిల్లా ఆక్వాటిక్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రూపు- 4, 5 కేటగిరీల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహించింది. పోటీల్లో రెండు గ్రూపుల్లోనూ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించిన చిన్నారులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

### పసిడి పతకం సాధించడమే ధ్యేయంగా..

పటమటకు చెందిన రామిరెడ్డి రామారావు, శివనాగసుష్మ దంపతుల ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె **జస్విత**. జాతీయ స్థాయిలో పసిడి పతకం సాధించడమే లక్ష్యంగా కండ్రికలోని ఎలైట్ స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ ఎం. తులసీ చైతన్య పర్యవేక్షణలో సాధన చేస్తోంది. తండ్రి ప్రోత్సాహంతో ఏడాదిన్నర క్రితం శిక్షణలో ప్రవేశించింది. రోజూ రెండు గంటల సాధన చేస్తోంది. తొలిసారి జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రూపు-5 (అండర్- 8) కేటగిరీలో తలపడి 50 మీటర్ల ఫ్రీ స్టైల్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్‌ల్లో మూడు పసిడి పతకాలు సాధించి.. వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది.

### ఒలింపిక్ పతకమే లక్ష్యం

మంగళగిరికి చెందిన తుమ్మా రామకృష్ణ, జ్యోతి దంపతుల ఏకైక కుమారుడు **జశ్వంత్.** ఒలింపిక్ పతకం సాధించే దిశగా కృషి చేస్తున్నాడు. మేనమామ ప్రోత్సాహంతో నాలుగేళ్ల క్రితం కృష్ణానది కరకట్ట వద్ద స్విమ్మింగ్ కోచ్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో కృష్ణానదిలో ఈతలో ఓనమాలు దిద్దాడు. రెండేళ్ల తర్వాత మంగళగిరిలోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేసేందుకు ప్రవేశించాడు. రోజూ మూడు గంటల పాటు సాధన చేస్తున్నాడు. నూతక్కిలోని విజ్ఞాన విహార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రస్తుతం మూడో తరగతి చదువుతున్నాడు. తొలిసారిగా రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రూపు-5 (అండర్-8) కేటగిరీలో తలపడి 50 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్‌లో రెండు పసిడి పతకాలు, బటర్ ఫ్లైలో రజత పతకంతో పాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సాధించాడు.

### టీవీలో పోటీలు చూసి..

అనంతపురానికి చెందిన పెనకలపాటి సురేష్, అనూరాధ దంపతుల ఏకైక కుమార్తె **జాహ్నవి.** వచ్చే నెలలో దిల్లీలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ అండర్- 14 స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తోంది. టీవీలో స్విమ్మింగ్ పోటీలు చూస్తూ.. ఆసక్తి పెంచుకుంది. దీంతో తల్లిదండ్రులను ఒప్పించి అనంతపురంలోని ఒక ప్రైవేటు స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ రాకేష్ పర్యవేక్షణలో మూడేళ్ల క్రితం శిక్షణలో ప్రవేశించింది. ప్రస్తుతం ఇన్ఫినిటీ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతూ రోజూ నాలుగు గంటలు సాధన చేస్తోంది. తొలిసారిగా గ్రూపు-4 (అండర్-10) కేటగిరీలో తలపడి 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో రెండు పసిడి పతకాలు, 100 మీటర్ల బటర్ ఫ్లైలో రజతం, 100 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకంతో పాటు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

### 17 నెలల వయసు నుంచే

విశాఖకు చెందిన గౌతమ్ భోలనాథ్ పాంచాల్, జగదీశ్వరి గౌతమ్ పాంచాల్ దంపతుల ఏకైక కుమారుడు **వేదాంత్ గౌతమ్ పాంచాల్** ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించాలనే దిశగా సాధన చేస్తున్నాడు. తండ్రి వ్యాపారి కాగా.. తల్లి గృహిణి. తండ్రి రోజూ స్విమ్మింగ్ చేసేవారు. చిన్నతనంలో వేదాంత్ కూడా తండ్రి వెంట పూల్‌కు వెళ్లేవాడు. ఆసక్తితో 17 నెలల వయసు నుంచే స్విమ్మింగ్ సాధన చేయడం ప్రారంభించాడు. జిల్లా స్థాయిలో పతకాలు సాధించి.. మెరుగైన శిక్షణకు హైదరాబాద్‌లోని జియోన్ స్విమ్మింగ్ అకాడమీలో ప్రవేశించాడు. ఓవైపు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతూ మరో వైపు రోజూ ఆరు గంటలు సాధన చేస్తున్నాడు. తొలిసారిగా గ్రూపు-4లో తలపడి 100 మీటర్ల ఫ్రీ స్టైల్, 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో రెండు పసిడి, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రజత పతకంతో పాటు వ్యక్తి ఛాంపియన్‌షిప్ సాధించాడు.

## రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపా

**విజయవాడ వన్‌టౌన్:** రాష్ట్ర అభివృద్ధిని వైకాపా నాయకులు, ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి ధనేకుల వెంకట హరికృష్ణ ఆరోపించారు. ఆదివారం పాతరాజరాజేశ్వరీపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉంటే వైకాపా నాయకులు అల్లర్లు సృష్టిస్తున్నారని చెప్పారు. ఇది సరికాదని పేర్కొన్నారు.

(c) eenadu

# విజయవాడ పశ్చిమ

## దీపోత్సవంతో కృష్ణానదికి సరికొత్త శోభ

**కృష్ణలంక, న్యూస్‌టుడే :** దీపోత్సవంతో కృష్ణానది సరికొత్త శోభ సంతరించుకున్నట్లుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి లక్ష్మి అన్నారు. కార్తిక మాసం పురస్కరించుకుని శ్రీశారద సనశ్చంద్ర పురోహిత కార్యాలయ నిర్వాహకుడు దేవరకొండ సతీష్ శర్మ ఆధ్వర్యంలో కృష్ణలంక పాత పోస్టాఫీసు చివర ఉన్న కృష్ణా పుష్కరఘాట్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్తిక దశ సహస్ర దీపోత్సవంలో ఆమె పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించి సామూహిక పూజలో పాల్గొన్నారు. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన తిలకించి అభినందించారు.

## నేటి నుంచి అయ్యప్ప పడిపూజ

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పాత బస్తీ శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అయ్యప్ప స్వామి ఉపాలయంలో సోమవారం నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు మండల పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకుడు మురళీధరన్ నంబూద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శబరిమలలో నిర్వహించే విధంగా మండల పూజలను ఇక్కడి ఉపాలయంలో కూడా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మంగళవారం భజన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

☛ పాతశివాలయం వీధిలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు సిబ్బందితో కుక్కలను పట్టారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? భవానీపురం శివాలయం వీధి సమీపంలో మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. **- జ్యోతి, స్థానికురాలు.**

✔ పూడిక తీయిస్తాం. **- బ్రహ్మయ్య, స్థానిక శానిటరీ అధికారి**

? భవానీపురం రైతుబజార్ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉంది. **- రాజేశ్వరి, స్థానికురాలు.**

✔ పరిశీలిస్తాం. **- సోమశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్**

? పూర్ణానందంపేట ఆర్‌సీఎం చర్చి వద్ద మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. **- రమేష్‌బాబు, స్థానికుడు.**

✔ పూడిక తీయిస్తాం. **- ఆదినారాయణ, స్థానిక శానిటరీ అధికారి.**

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

## ఒరిగిపోతున్నా పట్టదా..?

చిట్టినగర్, న్యూస్‌టుడే

**కొం**డ, దిగువ ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ విద్యుత్తు విభాగం అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని 48వ డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 48వ డివిజన్‌లోని బ్రహ్మం గారి మఠం, పోతిన పాపాయ్య వీధి ప్రాంతాల్లో 48/155/81, 48/155/58, 48/155/86, 48/152/86, 48/152/42 స్తంభాలతో పాటుగా కొన్ని పడిపోయే స్థితిలో, మరి కొన్ని అడుగు భాగం తుప్పుపట్టి ఉన్నాయి. తీగలు కూడా వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయని ఆయా ప్రాంతవాసులు చెబుతున్నారు. మరో ప్రాంతంలో స్తంభం పక్కకు ఒరిగిపోగా కర్రలతో నిలబెట్టారు.

☛ చాలా ప్రాంతాల్లో స్తంభాలు తొలగించి కొత్తవి వేయాలని, కొన్నింటికి అడుగు భాగంలో వెల్డింగ్ వంటి మరమ్మతులు చేయాలని కోరినప్పటికీ విద్యుత్తు విభాగం అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు, కలెక్టర్ లక్ష్మీశకు ఈనెల 3న వినతిపత్రాలు ఇచ్చినట్లు వివరించారు. అయినా అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు.

☛ సంబంధిత విద్యుత్తు విభాగం అధికారులు స్పందించి ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్న విద్యుత్తు స్తంభాలకు తక్షణమే మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

☛ విద్యుత్తు స్తంభాల మరమ్మతుల విషయమై చిట్టినగర్ విద్యుత్తు విభాగం ఏఈ షేక్ జానీబాషాను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. మరమ్మతులకు సంబంధించి సామగ్రి వచ్చింది. రెండు, మూడు రోజుల్లో పనులు చేపడతాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు.

## ఖాళీ స్థలాలు.. సమస్యలకు నిలయాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

**గ**ట్టువెనక ప్రాంతంలో ఖాళీస్థలాలు పారిశుద్ధ్య సమస్యలకు నిలయాలుగా మారాయి. పిచ్చిమొక్కలు పెరిగి పెద్ద పెద్ద చెట్లుగా తయారవుతున్న పట్టించుకునే వారు కరవయ్యారు. వర్షాలు కురిసినప్పుడు ఖాళీ స్థలాల్లోకి వాన నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు విపరీతంగా దోమలు పెరిగిపోతున్నాయి. స్థానికులకు పగలు రాత్రి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

లేబరుకాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు

☛ పలు ప్రాంతాల్లో విష సర్పాలు, తేళ్లు, విష కీటకాలు చేరుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ లేబరుకాలనీలో ఆవాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలం స్థానికులకు పరీక్షగా మారింది. చుట్టుపక్కల ప్రజలు శానిటరీ ఇన్‌స్పెక్టరుకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన కరవైంది.

☛ పార్థసారథి వీధిలోని ఖాళీ స్థలంలో చుట్టుపక్కల ఉన్న వారు కూడా చెత్తను తీసుకొచ్చి పడేయడంతో పరిస్థితి దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ డ్రెయిన్ కూడా సరిగా లేకపోవడంతో చెత్త మొత్తం కాలువల్లో నిలిచిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

☛ ఈ సమస్యలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజును సంప్రదించగా.. స్థల యజమానులను గుర్తించి వారికి నోటీసులు ఇస్తామని తెలిపారు. పిచ్చి మొక్కలను తొలగించి మెరక చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో స్థల యజమానులు స్థానికంగా లేనప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

## అమ్మవారి ఆలయ నిర్వహణ పత్రాలు అందజేత

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** చిట్టినగర్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మరో ఐదేళ్ల పాటు నిర్వహించుకునేందుకు దేవాదాయ శాఖ ఇచ్చిన అనుమతి పత్రాన్ని పార్లమెంటు సభ్యులు శివనాథ్ అందజేసినట్లు ఆ దేవస్థానం కమిటీ కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం పాముల కాలువ వద్ద నగర వనంలో నిర్వహించిన వనసమారాధన కార్యక్రమంలో ఈ పత్రాన్ని అందుకున్నట్లు వివరించారు. ఎంపీ చొరవ తీసుకుని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించి ప్రభుత్వ ఆదేశాల మేరకు తమకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరాల సామాజిక వర్గం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, కె.నరసింహరావు, తమ్మిన సూర్యకుమారి, బాయన బాబ్జి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ కమిటీ సభ్యులకు పత్రం అందిస్తున్న ఎంపీ శివనాథ్

## ప్రతి వారం పేదలకు ఉచిత వైద్యం

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** సేవే లక్ష్యంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ప్రతి వారం వైద్య శిబిరం నిర్వహించి ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని సూర్య సత్య ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రనాజగిరి సోమేశ్వరరావు తెలిపారు. 46వ డివిజన్‌లోని తమ్మిన కృష్ణవీధిలోని ట్రస్టు కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళను పరీక్షిస్తున్న వైద్యుడు

## దుర్గగుడికి పలువురు విరాళం

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు దాతలు విరాళం అందజేశారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్ రూ.1,00,116, శ్రీకాకుళానికి చెందిన ఎం.ప్రభాకర్ రూ.లక్ష, తెలంగాణ సూర్యాపేటకు చెందిన రవికుమార్ రూ.1,00,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ జగదీష్ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాతలు ఎం.ప్రభాకర్, భగవత్ ప్రసాద్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

దాత రవికుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

## సమన్వయంతో పని చేయాలి

**భవానీపురం, న్యూస్‌టుడే:** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సుజనాచౌదరి పేర్కొన్నారు. నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పశ్చిమంలో ప్రధాన సమస్యలైన రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ కె.సత్యవతి, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఈఈ జె.శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాసనసభ్యుడు సుజనాచౌదరి

## వైభవం.. మల్లన్న సహస్ర లింగార్చన

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం వైభవంగా మల్లన్న సహస్ర లింగార్చన నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర దీపాలంకృత స్టాండ్ వద్ద దీపార్చన, ఆదిదంపతులకు ఊంజల్ సేవను భక్తుల సమక్షంలో అర్చకులు చేశారు. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు మల్లేశ్వరాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ భక్తుల రద్దీ నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు.

**పాత శివాలయంలో..** వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజ చేశారు. విజయేశ్వరాలయం, వసంత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో భక్తులు శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో నటరాజన్ షణ్ముఖం, మల్లికార్జున స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ సుదర్శనరావు పాల్గొన్నారు.

క్రతువు నిర్వహిస్తున్న రుత్విక్కులు, పక్కన ఈవో శీనానాయక్

మహిషాసురమర్దినిగా భ్రమరాంబ

## వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

**విజయవాడ వైద్యం:** వైద్యులకు 2016 పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా.పంజాల శ్రీనివాస్ కోరారు. ఆదివారం సిద్ధార్థ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఆ సంఘ ప్రతినిధుల సభ నిర్వహించారు. దీర్ఘకాలికంగా ఉన్న వైద్యుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు అనిల్, బాబ్జీ శ్యామ్‌కుమార్, భానుకుమార్, మారుతీదేవి, ఆశా పాల్గొన్నారు.

## బిర్సా ముండా జీవిత చరిత్ర తెలుగు అనువాద పుస్తకావిష్కరణ

**పటమట, న్యూస్‌టుడే :** స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జీవిత చరిత్ర తెలుగు అనువాద పుస్తకం ఆవిష్కరించటం ఆనందంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని తెలుగులో ముద్రించిన బిర్సా ముండా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా సేవలు చిరస్మరణీయుడని, బ్రిటీష్ వారిపై ఆయన చేసిన పోరాటాలు గిరిజనుల్లో చైతన్యం నింపి ఆదివాసులకు ఆరాధ్య దైవంగా మారారని చెప్పారు. జన జాతీయ గౌరవ దివస్ వల్ల బిర్సా ముండా లాంటి ఎంతో మంది గిరిజన వీరుల గాథలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రాచుర్యంలో లేని గిరిజన చరిత్రకు ప్రాధాన్యం లభించిందని పేర్కొన్నారు. అనంతరం మాదిగాని గురునాథం బిర్సా ముండా చిత్రపటాన్ని ఎంపీకి బహూకరించారు. నాయకులు వి.నరసింహ చౌదరి, సొంగా సంజయ్, కరీముల్లా పాల్గొన్నారు.

## బస్టాండ్ పరిసరాల్లో దుర్గంధం

**పం**డిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో పరిసరాలు అధ్వానంగా తయారై తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. డిస్పాచ్ బ్లాక్ ఎదురుగా గత కొన్ని రోజుల నుంచి వ్యర్థాలు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ మార్గంలో మట్టి నిండిపోయింది. దీనికి తోడు దానిపై వేసిన నాపరాళ్లు విరిగి అందులోనే పడిపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో దుర్వాసన వస్తుంది. బస్సుల కోసం వేచి ఉండలేక పోతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విజయవాడ బస్ స్టేషన్**

గుట్టగా వ్యర్థాలు

నాపరాళ్లు పగిలిపోయి..

## దారంతా కంకర.. అధికారులు చూడరా..!

**రో**డ్డు మధ్యలో కంకర గుట్ట వల్ల చోదకులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. లంబాడీపేట, అడ్డరోడ్డు దేవత్ రాములు వీధిలో ర్యాంపు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ పనుల నిమిత్తం కంకర చిప్స్ రోడ్డుపై పడేశారు. దీంతో చోదకులతో పాటుగా కొండ ప్రాంతానికి ఎక్కేవారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రుళ్లు మరింత అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర గుట్టను పక్కకు తొలగించాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

## వీధి దీపాలు వెలగక అవస్థలు..

**కొం**డ ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు వెలగక చీకట్లో నానా ఇబ్బందులు పడుతున్నారు. భీమనవారిపేట నాగమ్మ సత్రం ఎదుట వీధి కొండ ప్రాంతంలో 46/145/33, 26/145/36 విద్యుత్తు స్తంభాలకు కొన్ని రోజులుగా దీపాలు వెలగడం లేదు. సంబంధిత నగరపాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

## మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

**విజయవాడ సిటీ, న్యూస్‌టుడే :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎక్కువ సేపు చదివి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, కొద్దిసేపు క్రీడలు ఆడితే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని శ్రీనివాస గ్రాడిట్ విద్యాసంస్థల ఛైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. మొగల్రాజపురం సిద్ధార్థ పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో శ్రీనివాస గ్రాడిట్ వార్షిక క్రీడా దినోత్సవం ఆదివారం నిర్వహించారు.

## ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌కు సన్మానం

**భవానీపురం, న్యూస్‌టుడే:** ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన యేదుపాటి వెంకట రమణిని ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం వెంకట రమణి, ఆమె భర్త మాజీ కార్పొరేటర్ రామయ్య, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దంపతులను ఎంపీ సన్మానించారు. తెదేపా నాయకులు వేదవ్యాస్, నరసింహ చౌదరి, సంజయ్‌వర్మ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వెంకట రమణి దంపతులను సన్మానిస్తున్న ఎంపీ శివనాథ్

### రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపా

**విజయవాడ వన్‌టౌన్:** రాష్ట్ర అభివృద్ధిని వైకాపా నాయకులు, ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి ధనేకుల వెంకట హరికృష్ణ ఆరోపించారు. ఆదివారం పాతరాజరాజేశ్వరీపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉంటే వైకాపా నాయకులు అల్లర్లు సృష్టిస్తున్నారని చెప్పారు.

### బాధితులకు చేయూత

**సూర్యారావుపేట:** విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), సీపీఎం నాయకులు రూ.10 లక్షల నష్టపరిహారం, మట్టి ఖర్చుల కింద రూ.50 వేలు ఇప్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కటికెల ఏసు (22) ఈ నెల 15న స్వరాజ్య మైదానంలోని భవనంపై ఫ్లోరింగ్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన విషయం తెలిసిందే. బాధితులకు నాయకులు అండగా నిలబడి.. గుత్తేదారు సంస్థతో మాట్లాడారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ అంగీకరించడంతో ఆదివారం ఏసు తల్లిదండ్రులకు నగదు అందజేశారు.

## ఓటర్ల జాబితా ముమ్మర సవరణ ప్రక్రియ నిలిపివేయాలి

**విజయవాడ, రామవరప్పాడు, పార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ రెండో దశలో కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్‌ను చేర్చలేదని, అయినా అమలుకు సన్నాహాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. రాజకీయ పార్టీలతో పాటు తెదేపా కూడా ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకించిందని గుర్తుచేశారు. భాజపా మినహా అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్న దీనిపై.. ఈసీ అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచేందుకు కేంద్రం ఎస్‌ఐఆర్‌ను కుట్రపూరితంగా ఒక సాధనంగా ఉపయోగించుకుంటోందని, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ఎన్నికల సంఘం మోదీ కనుసన్నల్లో పని చేస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మోదీ, అమిత్‌షాల సంఘంగా మారిందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు. వేదికపై శైలజానాథ్, శ్రీనివాస్ తదితరులు

## పుట్టపర్తి సత్యసాయిబాబా పల్లకిసేవ

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కొత్తూరుతాడేపల్లిలో పల్లకి సేవ నిర్వహించారు. సత్యసాయిబాబా పాదుకలను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. వృద్ధులు, వికలాంగులకు నూతన వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, సమితి కన్వీనర్ ఎన్.వి.ఎల్.నరసింహారావు, టీజేఆర్ గుప్తా, కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కార్పొరేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** నగరవాసుల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. నగరవాసులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, మురుగు కాలువలు, వీధి దీపాలు, రహదారులు, ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు వంటి సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తేవాలని తెలిపారు.

## సినిమాలు

★ **సంతాన ప్రాప్తిరస్తు:** జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల) లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **కాంత:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్ ★ **జిగిరిస్:** స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు) ★ **దిగ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు) ★ **కాంత, ది గర్ల్ ఫ్రెండ్, మాస్ జాతర, కె-ర్యాంప్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **సీతా ప్రణయం కృష్ణతో:** పవర్ వన్ మాల్(కానూరు) ★ **గోపి గాళ్ల గోవా ట్రిప్:** అప్సర(గవర్నర్‌పేట). ★ **ఆటకథరా శివ, లవ్ ఓటీపీ, గోపి గాళ్ల గోవా ట్రిప్, సీతా ప్రణయం కృష్ణతో, మాఊరి వెంకన్న:** పీవీఆర్ మాల్(బందరురోడ్డు) ★ **ది గర్ల్ ఫ్రెండ్:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్ – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

## నిందితుల అరెస్టు

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడిన కేసుల్లో ఇద్దరిని కొత్తపేట నేరవిభాగం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్ఆర్ కాలనీలో, మైపుల రోడ్డులో తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన కేసులో విజయవాడ గ్రామీణ ప్రాంతం జక్కంపూడికి చెందిన షేక్ నిరీక్షణ అలియాస్ నిచ్చెన(19), మహంతిపురం, గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన తోకల రాజేష్(19) అనే ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చరవాణి, రూ.20 వేల నగదు రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80080 01732

## అన్నదాన ప్రభువే.. శరణమయ్యప్ప

### శ్రీధర్మ శాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో 11 ఏళ్ల నుంచి మాలధారులకు అన్నవితరణ

పటమట, న్యూస్‌టుడే

**మా**లధారణ చేసిన అయ్యప్ప భక్తులు నియమ, నిష్టలతో దీక్ష చేస్తారు. ఉల్లి, వెల్లుల్లి, మసాలా లేకుండా, ఉప్పు, కారం లేకుండా తింటారు. ఎక్కడపడితే అక్కడ సద్ది (మధ్యాహ్న భోజనం) చేయరు. వ్యక్తిగత పనులకు దూర ప్రాంతాల నుంచి మాలధారులు నగరానికి వస్తుంటారు. దీక్ష నియమాల దృష్ట్యా వారు పడుతున్న ఇబ్బందులు గమనించిన విజయవాడకు చెందిన కంఠమనేని వేణుగోపాల్ మాలధారులకు సద్ది ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. తొలుత 100 మంది స్వాములు మాలధారణ ముగిసేవరకు సద్ది వడ్డించేలా ఏర్పాటు చేశారు. మరుసటి సంవత్సరం 2015లో కొంతమంది శ్రీధర్మ శాస్త్ర సేవా సమితి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా అన్నవితరణ చేస్తున్నారు. రోజుకు సుమారు ఆరు నుంచి ఏడు వేల మంది ఇక్కడ సద్ది చేస్తున్నారు.

**75 రోజుల పాటు.. :** సేవాసమితి తరపున ఏటా మాలధారులకు కార్తిక మాసం మొదటి రోజు నుంచి మకర జ్యోతి వరకు సుమారు 75 రోజులు అన్న వితరణ చేస్తుంటారు. ఇందుకు పటమట హైస్కూల్ రోడ్డులోని రైతు బజారు ఎదుట ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా మండపాలు నిర్మించి పీఠాలు ఏర్పాటు చేశారు. ఒకేసారి 1000 మంది స్వాములు కూర్చుని సద్ది చేసేలా ఏర్పాటు చేశారు. నిత్యం 10 రకాల వంటకాలతో ఎంతమంది వచ్చినా ఇబ్బంది లేకుండా కమిటీ వారు శ్రద్ధ తీసుకుంటున్నారు. సుమారు 100 మంది సభ్యులు స్వచ్ఛందంగా వంటలు చేయడం, శుభ్రం చేయడం, కూరగాయలు తరగడం, ఆహారం వడ్డించడం చేస్తున్నారు.

పీఠంలో సద్ది చేస్తున్న స్వాములు

### పూజా విధానం గురించి అవగాహన

**ఈ** సమితి అన్నదాన వితరణ ఒక్కటే కాకుండా ఇక్కడ పీఠం పెట్టి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. మొదటిసారి మాల వేసుకున్న స్వాములకు మాల విధానం గురించి వివరిస్తూ శబరిమల వెళ్లేందుకు అవగాహన కల్పిస్తుంటారు. హిందూ ధర్మ పరిరక్షణపై యూట్యూబ్ ఛానల్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

### ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో..

11 ఏళ్ల నుంచి మాలధారులకు అన్నదానం చేయడం దేవుని కృపగా భావిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బంది పడకూడదని శ్రీధర్మ శాస్త్ర సేవా సమితి తరపున కార్యక్రమాన్ని చేపట్టాం. ఏటా సుమారు 75 రోజులు అన్నవితరణ చేస్తాం. ప్రతి రోజు రూ.లక్షన్నర వరకు ఖర్చు అవుతుంది.



**-కంఠమనేని వేణుగోపాల్ (గురుస్వామి) శ్రీధర్మ శాస్త్ర సేవా సమితి వ్యవస్థాపకుడు**

# విజయవాడ మధ్య

## వన సమారాధనలతో సమైక్య భావం

అజిత్‌సింగ్‌నగర్: కార్తిక వన సమారాధనలు సమాజ సమైక్యతకు, మానవ సంబంధాలు పెంపొందించడానికి దోహదపడతాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆదివారం విజయవాడ నాగవంశ సంఘం ఆధ్వర్యంలో కొత్తూరు తాడేపల్లి తోటలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, నాగవంశ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావులు హాజరయ్యారు. ఎంపీ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శివనాథ్ మాట్లాడుతూ.. ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే సంప్రదాయాలు, విలువలు నేర్పించాలని సూచించారు. ప్రకృతి గొప్పతనం, పరిరక్షణపై అవగాహన కల్పించాలని చెప్పారు. నాగవంశీయుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ఎరుబోతు రామారావు, సాలూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ జె.ఈశ్వరరావు, రాష్ట్ర నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లు అప్పలనాయుడు, ఎం.ఆదిబాబు, నాగవంశ సాధికారత సభ్యులు మద్దెల వైకుంఠరావులతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గజమాలతో ఎంపీ శివనాథ్‌ని సత్కరిస్తున్న రమణారావు తదితరులు

## ఉల్లాసంగా... ఉత్సాహంగా...

మధురానగర్: పార్టీలకు అతీతంగా కాపులంతా ఐకమత్యంగా ఉండి అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. 28, 31 డివిజన్ల 4వ కార్తిక వన సమారాధన ఆదివారం నున్న మామిడితోటల్లో నిర్వహించారు. తెదేపా, జనసేన కాపు నాయకులు నవనీతం సాంబశివరావు, బొలిశెట్టి వంశీకృష్ణ, ఆకుల కిరణ్‌కుమార్ తదితరులు విచ్చేశారు. కార్తిక వన సమారాధనలు కుటుంబ ఐక్యత, ఇతరులతో పరిచయాలు పెంచుతాయని చెప్పారు. పిల్లలు, మహిళలకు రకరకాల పోటీలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. మహిళలకు క్యాట్‌వాక్ పోటీలు పెట్టారు. విజేతలకు బహుమతులు అందించారు. ఏపుగంటి సాయికృష్ణ, అపర్ణ దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సుంకర సాంబశివరావు, కలిగినీడి రామారావు, సత్యనారాయణ, ద్వారకానాథ్, చంటి పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఆహార పదార్థాలు వడ్డిస్తున్న బాలస్వామి, సాంబశివరావు

## పోలీసు చేతికి తాళం

### ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటికి భద్రత

★ నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి దంపతులు తీర్థ యాత్రలకు వెళ్లారు. పది రోజుల తర్వాత తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి ఇల్లు మొత్తం ఊడ్చేశారు. లక్షల రూపాయల బంగారం, వెండి చోరీకి గురైంది. పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

★ సత్యనారాయణపురానికి చెందిన వరలక్ష్మి చెన్నైలోని బంధువుల పెళ్లికి వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా ప్రయాణ తేదీ, చిరునామా ఇతర వివరాలు నమోదు చేశారు. వెంటనే పోలీసులు ఆమెను సంప్రదించారు. వారం పాటు ఆమె ఇంటిపై 24 గంటలూ నిఘా పెట్టారు. ఎలాంటి దొంగతనం చోటు చేసుకోలేదు.

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే

ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా ఊరు వెళుతున్నారా..? ఇంట్లో ఉన్న బంగారం, వెండితో పాటు ఇతర విలువైన వస్తువులను ఏం చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారా. . ఇక అలాంటి ఆందోళన వద్దు. దీని కోసమే పోలీసులు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని సహాయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ.. దొంగలను పట్టేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇళ్లలో చోరీలు పెరుగుతున్నాయి. ఊరువెళ్లి వచ్చేలోపే ఇంట్లో మొత్తం సొత్తు దొంగలపాలవుతోంది. ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే.. సొత్తు అపహరణకు గురికాకుండా ఉంటుంది. దానికి చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే. లేదా ఫోన్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడమే. దీనిపై పోలీసులు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నా.. ఇంకా అవగాహన రావడం లేదు. ఎల్‌హెచ్‌ఎంఎస్ అంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం. దొంగతనాలు నివారించేందుకు సీపీ రాజశేఖరబాబు పర్యవేక్షణలో నడుస్తున్న భద్రతా వ్యవస్థ. ఇందులో భాగంగా ఇంటి యజమానులు తీర్థయాత్రలు, శుభకార్యాలు, విహారయాత్రలకు వెళ్లేటప్పుడు.. స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే.. వారు మీ ఇంటి వద్ద, లోపల రహస్య కెమెరాలు ఏర్పాటు చేస్తారు. సెన్సార్ వ్యవస్థతో ఇవి పని చేస్తాయి. ఇంటి పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే.. వెంటనే కమాండ్ కంట్రోల్‌కి సమాచారం వెళ్తుంది. దొంగ ఇంట్లోకి ప్రవేశించినప్పుడు లేదా పరిసరాల్లో తిరిగినప్పుడు కెమెరాలో రికార్డు అవుతుంది. ఇది ఇంటి యజమానితో పాటు కమాండ్ కంట్రోల్‌కి చేరుతుంది. వెంటనే అప్రమత్తమై.. ఆయా ప్రాంత పోలీసు సిబ్బందికి సమాచారం అందిస్తారు. వారు వెంటనే ఇంటికి చేరుకొని దొంగలను పట్టుకుంటారు. దొంగతనాలు, దోపిడీల నివారణకు ప్రత్యేకంగా ఈ వ్యవస్థను పోలీసులు అందుబాటులోకి తెచ్చారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

### ప్రజలు సమాచారం ఇస్తే చాలు

సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలు ఊరు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వొచ్చు. అలాగే 100కి ఫోన్ చేసి చెప్పవచ్చు. లేదా కొత్తగా అందుబాటులోకి వచ్చిన యాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చు. సమాచారం వచ్చిన వెంటనే పోలీసులు ఇంటికి వెళ్లి, రహస్య కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇదంతా పూర్తిగా ఉచితం. ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదు. ప్రజలంతా వినియోగించుకోవాలి. దీనిద్వారా దొంగతనాలను నివారించవచ్చు. - స్రవంతిరాయ్, నార్త్ ఏసీపీ

## కోటి దీపాల మహోత్సవం నేడు

పాయకాపురం, న్యూస్‌టుడే : శ్రీవాసవీ క్లబ్ విజయవాడ పాయకాపురం ఆధ్వర్యంలో సోమవారం (నేడు) సాయంత్రం కార్తిక మాసం పురస్కరించుకుని కోటి దీపాల మహోత్సవం, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం, కండ్రిక వాటర్ ట్యాంక్ దగ్గర ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## గుణదలలో విద్యుత్తు మరమ్మతులు

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల 220 కె.వి. నున్న-గుణదల లైనుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చనున్నారు. ఈ క్రమంలో గుణదల 220 కె.వి. ఉపకేంద్రం పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ.కిషోర్‌బాబు తెలిపారు. ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఒక వేళ ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే మాత్రమే విద్యుత్తు అంతరాయం కలుగుతుందని.. వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

### మారుతీనగర్ ఫీడర్ పరిధిలో..

చుట్టుగుంట: సీతారాంపురం సబ్ స్టేషన్ 11 కేవీ మారుతీనగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్తు లైన్ల మరమ్మతులు, నిర్వహణకుగాను ఈ నెల 17వ తేదీ ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. మారుతీనగర్ కాలువ గట్టు, చుట్టుగుంట కాలువ గట్టు, సిమెంట్ రోడ్డు, కాకాని నగర్, బీఎస్ఎన్ఎల్ భవన్, కాకర్లవారి వీధి, వీరయ్య వీధి, మాగంటివారి వీధి, మసీదు వీధి, గద్దె పూర్ణచంద్రరావు వీధి, ప్రకాశరావు వీధి, అనుమోలు శేషగిరిరావు వీధి, గోగినేనివారి వీధి, మిల్క్ బూత్ వీధి, పటేల్ రోడ్డు, ఎస్సారార్ కళాశాల వెనుక, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## 'సంతాన ప్రాప్తిరస్తు'కు మంచి స్పందన

గాంధీనగర్, న్యూస్‌టుడే : నగరంలో 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్ర బృందం సందడి చేసింది. విజయయాత్రలో భాగంగా ఆదివారం రాత్రి గాంధీనగర్‌లోని జయరామ్ థియేటర్‌ను సందర్శించింది. ప్రేక్షకుల మధ్య తమ విజయానందాన్ని పంచుకున్నారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ.. విడుదలైన అన్ని కేంద్రాల్లో ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. పూర్తి కామెడీతో తీసిన ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ చాందిని చౌదరి మాట్లాడుతూ.. ఇది ఒక డీసెంట్ కామెడీ డ్రామా అని, కుటుంబ సమేతంగా చూడవచ్చన్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం రావడం ఆనందంగా ఉందని చెప్పారు. చిత్ర యూనిట్ సభ్యులు, థియేటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

హీరో, హీరోయిన్లు విక్రాంత్, చాందిని

## ఇసుక గుట్టలు తొలగింపు

స్పందనకు వందనం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ 3వ లైనులో ఇసుక, కంకరను రోడ్డుపై పోసి జోరుగా విక్రయిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఈ నెల 13వ తేదీన 'వీధిలోనే విక్రయాలు?' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. టౌన్ ప్లానింగ్ సిబ్బంది స్పందించారు. ఇసుక, కంకర తొలగించేలా చర్యలు తీసుకున్నారు. రహదారిపై ప్రయాణాలు సజావుగా సాగుతున్నాయి.

## నటరాజుకు నృత్య నీరాజనం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : అమరావతి శాస్త్రీయ నాట్యాచార్యుల సంఘం అధ్యక్షులు లేఖ్య భరణి, సంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో పవిత్ర కార్తిక మాసం సందర్భంగా 'నటరాజుకు నృత్య నీరాజనం (శివోహం)' నిర్వహించారు. ఆదివారం సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నటించిన నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమూరి హజార త్రయ్య గుప్తా మాట్లాడుతూ.. నటరాజు ప్రీతి పాత్రమైన నృత్యాంశాలతో శివునికి నీరాజనం అందించడం అభినందనీయమన్నారు. 200 మంది విద్యార్థుల నృత్య రూపకం కనుల పండుగగా ఉందని గోష్ఠి నారాయణరావు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ఈవో బి.గంగాధరరావు, ఛైర్మన్ వెంకట మురళీధర్, ప్రధాన అర్చకులు కందుకూరి సుబ్రహ్మణ్యకుమార్ శర్మ, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ జాయింట్ సెక్రటరీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ నిర్వాహకులు తదితరులు

యువతుల కళాభినయం

## భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

గాంధీనగర్, న్యూస్‌టుడే : శత సహస్ర దీపార్చన సేవా మండలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శిశు విద్యామందిర్ ప్రాంగణంలో సామూహిక శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 17 సంవత్సరాలుగా లక్ష దీపార్చన, వ్రతాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగలింగం శివాజీ తెలిపారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ.. ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు స్వామి వారి కృపకు పాత్రులవుతారని చెప్పారు. శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. హిందువులంతా ఐక్యంగా ఉంటూ ఆలయాలను కాపాడుకోవాలని కోరారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో యాజులూరి లోకనాథ శర్మ, శంకర నారాయణ, మణెమ్మ, విజయలక్ష్మి, చల్లా లక్ష్మీనారాయణ, డాక్టర్ కందా శ్రీధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూజా క్రతువులో భక్తులు

## 'మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అన్ని విధాల వెనుకబడి ఉన్న మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జీపీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జి.పైడిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్టీ జాబితాలో ఉన్నారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు మత్స్యకారులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంఘీయులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పి.ఈశ్వరప్రసాద్, చిన్ని, చిట్టిబాబు, కన్నా, మామిడయ్య, వినోద్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఓటర్ల జాబితా ముమ్మర సవరణ ప్రక్రియ నిలిపివేయాలి'

విజయవాడ, రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ రెండో దశలో కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్‌ను చేర్చలేదని, అయినా అమలుకు సన్నాహాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో పాటు తెదేపా కూడా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించిందని గుర్తుచేశారు. భాజపా మినహా అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్న దీనిపై.. ఈసీ అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగపరంగా రాజకీయ పార్టీలు చట్టబద్ధమైనవని, పార్టీలు లేకుండా ఎన్నికల వ్యవస్థ నడవదన్నారు. అలాంటి పార్టీలనే ఈసీ గుర్తించకుండా నిరాకరించిందని, ఇలా అయితే భవిష్యత్తులో రాజకీయ పార్టీలను రద్దు చేసినా అడిగే వారు ఉండరన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు కేంద్రం ఎస్ఐఆర్‌ను కుట్రపూరితంగా ఒక సాధనంగా ఉపయోగించుకుంటోందని, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ఎన్నికల సంఘం మోదీ కనుసన్నల్లో పని చేస్తుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. మాజీ మంత్రి, వైకాపా నాయకుడు ఎస్.శైలజానాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ విషయంలో అత్యుత్సాహం చూపిస్తోందని విమర్శించారు. ఆరెస్సెస్ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో భాగమే ఈ ఎస్ఐఆర్ అని విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మోదీ, అమిత్‌షాల సంఘంగా మారిందని, దీన్నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన జగదీశ్, నారాయణమూర్తి, జడ శ్రావణ్‌కుమార్, డి.రమాదేవి, సి.హెచ్.బాబూరావు, తులసీదాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు. వేదికపై శైలజానాథ్, శ్రీనివాస్ తదితరులు

## ఆసక్తిగా చిత్రలేఖన పోటీలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో దాదాపు 200 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో క్రాఫ్ట్స్ తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. వ్యర్థాల నుంచి ఉపయోగకర వస్తువులను తయారు చేసే విధానాన్ని ఉపాధ్యాయురాలు స్వాతి పూర్ణిమ వివరించారు. మధ్యాహ్నం సినీ సంగీత విభావరి నిర్వహించారు. పిల్లలు సినిమా పాటలు ఆలపించారు. చాణక్య అనే విద్యార్థి ప్రదర్శించిన కాటికాపరి ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పర్యవేక్షించారు.

వేసిన చిత్రాలతో విద్యార్థులు

కాటికాపరిగా చాణక్య ఏకపాత్రాభినయం

## అందరికీ అందుబాటు ధరల్లో గృహాలు

గండిగుంట (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : కొన్నేళ్లుగా హరివిల్లు సంస్థ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో గృహాలు, స్థలాలు అందిస్తూ సొంతింటి కలను సాకారం చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మండలం గండిగుంటలో హరివిల్లు గ్రీన్ విస్తారా ప్రాజెక్టులో భాగంగా 23 సెమీ-విల్లా ఆధారిత ఇండిపెండెంట్ గృహాలు, 4 అంతస్తుల క్లబ్ హౌస్‌కు ఆదివారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. గండిగుంట వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి ప్రాజెక్టులు రావడం మరింత ఊతం ఇస్తాయని పేర్కొన్నారు. హరివిల్లు ఛైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సొంతిల్లు ఉండాలని కోరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, హరివిల్లు సీఈవో జాస్తి ప్రసన్న, అడ్మిన్ మేనేజర్ పద్మజ, రిలేషన్ షిప్ మేనేజర్ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్

## పూర్తిచేస్తేనే ప్రయోజనం

పాయకాపురం ప్రధాన కూడలి నుంచి రెడ్డిగారి కొట్టుకు వెళ్లే ప్రధాన రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం మరమ్మతులు నిర్వహించింది. సిమెంట్ కంకర వేసి పనులు చేపట్టారు. సుమారు తొమ్మిది నెలలు కావొస్తున్నా నిర్మాణం పూర్తి చేయలేదు. మట్టి కంకర వల్ల రాకపోకల సమయంలో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పాయకాపురం

## పోలీసుల అదుపులో నిందితుడు

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : వైకాపా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి కారును దహనం చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగర సీపీ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందం అతడిని అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి ప్రోద్బలంతో కారును దహనం చేశాడు.. గౌతమ్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం కోసం వచ్చాడా? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే వివరాలు రాబడుతున్నారు. త్వరలోనే మీడియా ముందు పెట్టి అరెస్టు చూపే అవకాశం ఉంది.

## విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గవర్నర్‌పేటలోని కేవీఎల్‌రావు భవన్‌లో విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. సుమారు 500 మంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తమ పిల్లల వివాహ బయోడేటాను తల్లిదండ్రులు వివరించారు. ధనాలకోట శ్రీనివాసరావు, అట్లూరి రవీంద్రాచారి, జవ్వాది కూర్మాచారి, ధర్మవరపు చంద్రమౌళి, వజ్రాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి పాత్ర కీలకం

వారోత్సవాల్లో పాల్గొన్న పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి వెంకట రమణయ్య, రంగనాథన్ తదితరులు కీలక పాత్ర పోషించారని చిత్తరంజన్ గ్రంథాలయ అధికారి ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరక్షరాస్యతను నిర్మూలించడంలో గ్రంథాలయాలు దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఐ.రామ్మోహనరావు, ప్రణీత, మానస, ఉదయ్‌కిరణ్, పాఠకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

పాయకాపురం, న్యూస్‌టుడే : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పాయకాపురంలో హెల్తీ విజయవాడ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది ప్రజలు సేవలు పొందారు. షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం తదితరాలకు వైద్యులు సేవలు అందించారు. జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో మెలగండి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గురుప్రకాశ్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నేరాలకు పాల్పడకుండా మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు సూచించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం నగరంలోని పోలీస్‌స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. చెడు వ్యసనాలను దూరం చేసుకుని.. మంచిగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్‌నిఘా ఉందని.. గొడవలు, నేరాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

## వైభవంగా మల్లన్న సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం వైభవంగా మల్లన్న సహస్ర లింగార్చన నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర దీపాలంకృత స్టాండ్ వద్ద దీపార్చన, ఆదిదంపతులకు ఊంజల్ సేవను భక్తుల సమక్షంలో అర్చకులు చేశారు. దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు మల్లేశ్వరాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి'

పాయకాపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ కోరారు. ఆదివారం సుందరయ్యనగర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పది వైద్య కళాశాలలను ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్వహిస్తామని నిర్ణయించడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని తెలిపారు. కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, నగర ఉపాధ్యక్షురాలు లిఖిత, నాయకులు వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల నిరసన

## ట్రస్టు సేవలు అభినందనీయం

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే : వయోవృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడంతో పాటు ఉచిత వైద్యం అందించడం అభినందనీయమని డాక్టర్ ఎ.నీరజ అన్నారు. ఆదివారం దుర్గాపురంలోని విజయ నర్సింగ్ కళాశాలలో వయోవృద్ధుల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు ఉమామహేశ్వరరావు, బి.ఫణికుమార్, కేఎన్‌వీఎస్ శర్మ, సతీష్‌కుమార్, తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్, డాక్టర్ ఆదిత్య, శ్రేయ, భువనగిరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు అందిస్తున్న నిర్వాహకులు

## బాధితులకు చేయూత

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), సీపీఎం నాయకులు రూ.10 లక్షల నష్టపరిహారం, మట్టి ఖర్చుల కింద రూ.50వేలు ఇప్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కటికెల ఏసు (22) ఈ నెల 15వ తేదీన స్వరాజ్య మైదానంలోని భవనం శ్లాబ్‌పై ఫ్లోరింగ్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన విషయం తెలిసిందే. బాధితులకు నాయకులు అండగా నిలబడి.. గుత్తేదారు సంస్థతో మాట్లాడారు. నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ అంగీకరించి పరిహారం అందజేసింది. ఈ మొత్తాన్ని ఆదివారం ఏసు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ఎం.బాబూరావు, బి.గోవింద్, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏసు కుటుంబ సభ్యులకు పరిహారం ఇస్తున్న గుత్తేదారు సంస్థ ప్రతినిధులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

## భవన క్రమబద్ధీకరణకు.. బీపీఎస్

ముకోసం

అనకాపల్లి, న్యూస్‌టుడే

భవనాల క్రమబద్ధీకరణ పథకం (బీపీఎస్) అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. అనుమతి లేకుండా, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూలదోస్తున్నారు. ఇటువంటి వారంతా నిర్ణీత రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకునేందుకు మార్గం సుగమమైంది. ప్లాన్ లేకపోవడంతో చాలా మందికి బ్యాంకు రుణాలు మంజూరు కావడం లేదు. ప్రణాళికా విభాగం సిబ్బంది వస్తారేమోనని భయపడాల్సి వచ్చేది. ప్రభుత్వం కల్పించిన బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎవరికీ భయపడాల్సిన అవసరం ఉండదు.

**ఎవరు అర్హులు** 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్య నిర్మాణాలు చేపట్టిన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది ఆగస్టు 31 తర్వాత నిర్మించిన వారు, ప్రభుత్వ, దేవస్థానం, నది, వాగు, చెరువు భూముల్లో నిర్మాణాలు చేపట్టిన వారు అనర్హులు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రహదారి, ఖాళీ స్థలాలు, ఉద్యానాలకు ఉపయోగించే స్థలంలో నిర్మాణాలు చేపడితే ఈ పథకం వర్తించదు.

**దరఖాస్తు ఇలా..** రిజిస్టర్డ్ సేల్ డీడ్ కాపీ, ఈసీ, మార్కెట్ విలువ పత్రం, ప్లాన్, భవనం ఫొటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్లాట్ సైజు, అతిక్రమణ ఎంత, భూమి ధర ఆధారంగా రుసుం ఉంటుంది. దరఖాస్తు చేసే సమయంలో రూ.10 వేలు ముందుగా చెల్లించాలి. పాత భవనం అంటే 1997 డిసెంబరు 31లోపు నిర్మించిన వాటికి 25 శాతం రాయితీ ఉంటుంది.

**నాలుగు నెలలే సమయం** బీపీఎస్ పథకం నాలుగు నెలలు అములులో ఉంటుంది. అనకాపల్లి పట్టణ పరిధిలో 500 వరకు దరఖాస్తులు రావచ్చని అంచనా. గడువు ముగిసిన తర్వాత అనధికార నిర్మాణాలు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన వాటిని తొలగిస్తాం.– **వరప్రసాద్, టీపీవో, అనకాపల్లి**

## మైదా పెట్టు.. చేపలు పట్టు

కాలం మారుతోంది.. సాంకేతికత విస్తరిస్తోంది. చేపల వేటలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు నదులు, చెరువులు, కాలువల్లో చేపల వేట చేయాలంటే గాలం, నైలాన్ తాడుకు చివర ముల్లు, దానికో ఎర తగిలించేవారు. ప్రస్తుతం వేట సాగించాలంటే వాడేసిన కూల్ డ్రింకు బాటిల్ ఉంటే సరిపోతుంది. దాన్ని సగానికి కోసి తాడు కడుతున్నారు. అందులో మైదా వేసి నీటిలో మునిగేటట్లు చేస్తున్నారు. మైదా తినేందుకు బాటిల్‌లోకి వచ్చిన చేపలు వెనక్కి వెళ్లేందుకు వీలుండటం లేదు. పాయకరావుపేట మండలం రాజవరం, పెంటకోట తదితర గ్రామాల్లో యువత ఈ తరహా వేటకు ప్రాధాన్యమిస్తున్నారు. యానాం పరిసర ప్రాంతాల్లో ఈ విధానంలో చేపల పట్టడాన్ని చూసిన వీరంతా కొత్తదనాన్ని అందిపుచ్చుకుని సంచి నిండుగా చేపలు పడుతున్నారు. – **న్యూస్‌టుడే, పాయకరావుపేట**

## యువోత్సాహం

సెలవు కావడంతో ఆదివారం పుస్తకాలు పక్కన పెట్టి యువోత్సాహంతో సందడి చేశారు. ఆటపాటలతో కేరింతలు కొట్టారు. మయూరాలై నర్తించారు. కోయిలలై గీతాలాపన చేశారు. వీటన్నింటికీ శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల వేదికైంది. ఒత్తిడి తగ్గించి రోజంతా సాంస్కృతిక ప్రదర్శనలతో ఉల్లాసంగా గడిపేందుకు స్ప్లాష్ పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రిన్సిపల్ భానుమూర్తి పేర్కొన్నారు.

– **న్యూస్‌టుడే, పాయకరావుపేట**

## పడమటమ్మకు పండగ సారె

కశింకోటలో పడమటమ్మ అమ్మవారి సారె ఊరేగింపు ఆదివారం కనులపండువలా సాగింది. ఉప్పునీటి వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహానికి 13 రోజులపాటు పూజలు కొనసాగాయి. అతివలంతా ఆదివారం వివిధ రకాల పిండివంటలు, పండ్లు, చీరెలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. – **న్యూస్‌టుడే, కశింకోట**

## బొజ్జన్న కొండకొస్తే నకనక!

సదుపాయాల్లేక రోడ్డుపైనే భోజనాలు

జిల్లాలో పర్యాటక కేంద్రమైన బొజ్జన్న కొండ సందర్శనకు వచ్చే వారికి సదుపాయాల్లేక ఇబ్బంది పడుతున్నారు. వన భోజనాలు చేసేందుకు వచ్చే వారికి అవస్థలు తప్పడం లేదు. భోజనాలు ఎక్కడ చేయాలో తెలియక దిక్కులు చూడాల్సి వస్తోంది. గతంలో కొండ ప్రాంతంలో భోజనాలు చేసేందుకు అనువుగా ఉండేవి. గత ప్రభుత్వ హయాంలో నిబంధనల పేరుతో వాటిని తొలగించారు. ఇప్పటికీ అవే నిబంధనలు కొనసాగుతున్నాయి. ఇక్కడ విహారంతోపాటు విజ్ఞానాన్ని ఆర్జించవచ్చనే అభిప్రాయంతో పలు పాఠశాలల విద్యార్థులను తీసుకువస్తుంటారు. వనసమారాధనకు వచ్చే వారంతా రోడ్డుపైనే భోజనాలు చేయాల్సి వస్తోంది. పర్యాటక శాఖ భోజనశాల నిర్మించినా ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కార్తిక మాసంలో ఇక్కడకు వచ్చే సందర్శకులతో కొండ పరిసరాలన్నీ కిటకిటలాడుతుంటాయి. స్థానికులు సందర్శకుల వసతులు కల్పించడంపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

– **న్యూస్‌టుడే, అనకాపల్లి**

## కిడ్నీ రోగులకు కష్టం

### యూనిట్‌ను విస్తరిస్తేనే సాంత్వన

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

మారుతున్న జీవనశైలితో మధుమేహం, అధిక రక్తపోటుతో అనేకమంది బాధపడుతున్నారు, వీరిలో కొందరు కిడ్నీ సంబంధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. చాలామందికి డయాలసిస్ అవసరమవుతోంది. నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్‌లో 21 పడకలున్నాయి.

మూడు విడతల్లో రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు

★ నర్సీపట్నం ఆసుపత్రికి రెండు నెలల కిందట రావికమతం ప్రాంతం నుంచి కేసులు ఎక్కువగా వచ్చేవి. కొద్దిరోజుల కిందట గొలుగొండ మండలం నుంచి నాలుగు కేసులు వచ్చాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నుంచీ ఎక్కువగానే వస్తున్నారు. ఈ వ్యాధి విషయంలో సరైన అవగాహన లేకపోవడం ముప్పు పెరుగుతోంది. చాలామంది వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత డయాలసిస్ కేంద్రానికి వస్తున్నారు.

డయాలసిస్ వార్డులో రోగులు

★ 'ఒకసారి మూత్రపిండాల పనితీరు మందగిస్తే నయం చేయించుకోవడానికి వ్యయప్రయాసలు తప్పవు. తొలి దశలో గుర్తించి వైద్యం చేయించుకుంటే కిడ్నీలు పూర్తిగా దెబ్బతినకుండా కాపాడుకోవచ్చ'ని ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుధాశారద సూచిస్తున్నారు. పడకల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ భవనం విస్తరణకు అవకాశం లేకపోవడంతో ఉన్న వాటినే సమర్థంగా వినియోగిస్తున్నామన్నారు.

★ అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఏడు పడకలు, కాకినాడ జిల్లా తుని ప్రాంతీయ ఆసుపత్రిలో 12 పడకలే ఉన్నాయి. దీంతో అక్కడి నుంచీ రోగులు నర్సీపట్నం వస్తున్నారు. పడకల సంఖ్య పెరగకపోవడంతో కొత్త వారికి అవకాశం ఉండటం లేదు. డయాలసిస్ జరిగేలా చూడాలని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. వారితో సిఫార్సులు చేయించుకుంటున్నారు. ఒక్కోసారి రాత్రి షిఫ్టుల్లోనూ సిబ్బంది పని చేస్తున్నారు.

★ నెఫ్రోప్లస్ సౌజన్యంతో ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ నిర్వహిస్తున్నారు. ఈ యూనిట్‌లో పడకల సంఖ్య పెంచేందుకు అవసరమైన వసతిలేదు. రోగుల వెంట వచ్చేవారు బయట వరండాలో ఉండాల్సి వస్తోంది. మరుగుదొడ్డి సదుపాయం లేకపోవడంతో అత్యవసర విభాగం వరకు వెళ్లి రావాల్సి వస్తోంది. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా డయాలసిస్ యూనిట్ కోసం ప్రత్యేకంగా భవనం సమకూర్చి పడకల సంఖ్య పెంచాలని, ఇద్దరు వైద్యులను నియమించాల్సిన అవసరముంది. ప్రస్తుతం ఒక వైద్యుడు ప్రతి నెలా మొదటి, మూడో గురువారం విధుల్లో ఉంటున్నారు.

## మాతృత్వ వరం.. దత్తతతో మార్గం

### అనకాపల్లిలో ప్రత్యేక కేంద్రం

### 30 వరకు అవగాహన మాసోత్సవాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

పిల్లల్లేని ఎంతో మందికి చిన్నారులను చట్టబద్ధంగా దత్తత ఇచ్చి మాతృత్వ వరాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. చాలామందికి దత్తత ప్రక్రియపై అవగాహన ఉండటం లేదు. మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించి కేసుల్లో ఇరుక్కోవడంతోపాటు జైలు పాలవుతున్నారు.

★ చిన్నారుల దత్తతపై అవగాహన కల్పించేలా ఈ నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలను జిల్లా బాలల సంరక్షణ, మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మునగపాకకు చెందిన దంపతులకు పిల్లలు లేరు. దత్తత తీసుకునేందుకు దరఖాస్తు చేసి హైదరాబాద్‌లోని శిశు గృహ నుంచి చిన్నారిని తీసుకొచ్చి పెంచుకుంటున్నారు. నర్సీపట్నానికి చెందిన దంపతులకు పిల్లలు లేకపోవడంతో నిజామాబాద్ నుంచి చిన్నారిని చట్టబద్ధంగా దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. రాంబిల్లిలో రక్తసంబంధీకులు బంధువుల కుమారుడిని ఓ జంట పెంచుకుంటున్నారు. వీరికి చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం తెలియలేదు. కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేశారు.

★ రక్త సంబంధీకులు, సవతి తల్లిదండ్రులు, ఫోస్టర్ కేర్ పిల్లల దత్తత.. ఇలా మూడు రకాలుంటాయి. ఫోస్టర్ కేర్ దత్తతలో తల్లిదండ్రుల ఆదరణ లేక అనాథాశ్రమాల్లో ఉన్న ఆరేళ్ల వయసున్న వారిని రెండేళ్లపాటు తాత్కాలిక దత్తత ఇచ్చి అనంతరం పిల్లలు, తల్లిదండ్రుల అంగీకారం మేరకు శాశ్వత దత్తత ఇస్తారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను దత్తత తీసుకోవచ్చు.

★ నెలల వయసు నుంచి 18 ఏళ్ల లోపు వరకు దత్తత తీసుకోవచ్చు. దత్తత కోరుకునే తల్లిదండ్రులు మిషన్ వాత్సల్య వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన అనంతరం బాలల సంరక్షణ విభాగం అధికారులు సీనియారిటీ జాబితాకు బదిలీ చేస్తే నిబంధనల ప్రకారం కేటాయిస్తారు. 48 గంటల్లోగా బిడ్డను రిజర్వు చేసుకోవాలి. 30 రోజుల్లోగా రిజర్వు చేసుకున్న సంస్థ వద్ద చైల్డ్ మ్యాపింగ్‌కు హాజరుకావాలి. నిబంధనల ప్రకారం బిడ్డను దత్తత ఇస్తారు. అనంతరం న్యాయమూర్తి వద్ద హాజరై దత్తత ఉత్తర్వులు పొందాలి.

బాలల దత్తత కేంద్రంలో అధికారులు

★ జిల్లాగా ఏర్పడ్డాక అనకాపల్లిలో ప్రత్యేక దత్తత కేంద్రం ఏర్పాటైంది. ప్రస్తుతం ఇక్కడ ఒక చిన్నారి ఉన్నారు. చిన్నారులను అపహరించి అమ్మేసిన ఉదంతంపై విశాఖపట్నంలోని ఒక మహిళను పోలీసులు గుర్తించడంతో ఆమె ముగ్గురితో కలిసి 11 మంది పిల్లలను విక్రయించినట్లు గుర్తించారు. అనకాపల్లికి చెందిన నలుగురు చిన్నారులను దత్తత కేంద్రంలో ఉంచారు. వీరిలో ముగ్గురిని వారి తల్లిదండ్రులకు అప్పగించగా మరో చిన్నారి ఇక్కడ ఉన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నాం. చట్ట వ్యతిరేకంగా చిన్నారులకు దత్తత తీసుకుంటే ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారు. దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు 89789 17154, 85008 96656 నంబర్లలో సంప్రదించవచ్చు.

– **ఎం.రమేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి**

## అసైన్డు భూముల్లో లేఅవుట్

మూలజంపలో చదును చేసిన భూమి

**రాంబిల్లి, న్యూస్‌టుడే:** అసైన్డు భూముల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాంబిల్లి మండలం మూలజంపలో సర్వే నంబరు 130, 141లో ప్రభుత్వ భూమిని పదేళ్ల కిందట రైతులకు పంపిణీ చేశారు. దళారులు రంగప్రవేశం చేసి ఈ భూముల్లో రెండు ఎకరాల వరకు ప్లాట్లు వేసి దందా సాగిస్తున్నారు. సెంటు స్థలం రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు పలుకుతోంది. డీఫారం భూములు అమ్మకాలు, కొనుగోలు చేయకూడదు. అలా చేస్తే పట్టాలను రద్దుచేసి అధికారులు స్వాధీనం చేసుకోవాలి. రెవెన్యూ అధికారులకు తెలిసే ఇదంతా జరుగుతోంది. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి అమ్మకాలు జరిగినట్లు తెలితే భూములను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

## చదువుతూనే ఉద్యోగ నైపుణ్యాలు..!

### విద్యార్థులను తీర్చిదిద్దుతున్న 'సీమెన్స్' కేంద్రం

### నాలుగు ల్యాబ్‌లలో 120 మందికి శిక్షణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సీమెన్స్ ఎక్స్‌లెన్స్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి కేంద్రం) విద్యార్థుల కల్పతరువుగా మారింది. ఇందులో 14 ల్యాబ్‌లు ఉండగా ప్రస్తుతం నాలుగు ల్యాబ్‌లలో సుమారు 120మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందాక శిక్షణ అవసరం లేకుండా నేరుగా విధులు నిర్వహించేలా ఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ నేర్పించే అంశాల గురించి సీమెన్స్ మేనేజర్ శివశంకర్ వివరించారు..

▲ **ఆటోమేషన్ ల్యాబ్:** ఇక్కడ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్, మెకానికల్, మెకట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు తర్ఫీదు ఇస్తారు. ఆటోమొబైల్ తదితర కంపెనీల్లో ఆటోమేషన్ ఇంజినీర్, పీఎల్‌సీ ప్రోగ్రామర్, రోబోటిక్స్ ఇంజినీర్, మెయింటెనెన్స్ ఇంజినీర్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

▲ **రోబోటిక్స్ ల్యాబ్ :** రోబోట్ల రూపకల్పన, ప్రోగ్రామింగ్, నియంత్రణ ఇక్కడ నేర్పిస్తారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రోబోటిక్ కంపెనీలు, రీసెర్చ్ సెంటర్లు, అంకుర సంస్థలు, ఇస్రో, డీఆర్‌డీవో వంటిచోట్ల ఉద్యోగాలు లభిస్తాయి.

▲ **ప్రొడక్ట్ డిజైన్ వ్యాలిడేషన్ ల్యాబ్ :** మెకానికల్, ప్రొడక్షన్, మెకట్రానిక్స్, డిజైన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఆటోమొబైల్ పరిశ్రమలు, ఏరోస్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, మెషిన్ డిజైన్ పరిశ్రమలు, ప్రైవేట్ ఆర్ అండ్ డీ కేంద్రాలు, కన్సల్టెన్సీ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

▲ **సీఎన్‌సీ ప్రోగ్రామింగ్ ల్యాబ్:** కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ల్యాబ్ (సీఎన్‌సీ)లో మెకానికల్, మెరైన్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఆటో మొబైల్ కంపెనీలు, ఏరోస్పేస్ ఇండస్ట్రీస్, ప్రైవేట్ మిషినింగ్ వర్క్‌షాప్ వంటి చోట్ల ఉద్యోగాలు లభిస్తాయి.

■ **ఆ నైపుణ్యాలు పెంచుకున్నా..:** నేను ఎన్ఎక్స్ సీఏడీ డిజైన్ అంశం నేర్చుకుంటున్నా. స్కెచింగ్, మోడలింగ్, అసెంబ్లీ వంటి టూల్స్‌పై అవగాహన వచ్చింది. ప్రయోగాత్మకంగా బోధన చేస్తున్నారు. డిజైన్ చేయడం ఎలాగో తెలిసింది. ప్రొడక్ట్ డిజైన్, సీఏడీ రంగంలో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు సంపాదించా.

– **సుస్మిత, మెకానికల్ ఇంజినీరింగ్**

## బొమ్మల పరిశ్రమపై కదలిక

### వేలాది మంది మహిళలకు ఉపాధి!

నక్కపల్లి, న్యూస్‌టుడే

పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

❖ పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

పరిశ్రమ ఏర్పాటుకు గుర్తించిన భూమి

❖ 'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం ఆదేశాలతో మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదిరత ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతోపాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

❖ బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## పాఠశాలల్లోనే ఆధార్ నవీకరణ

### నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ నవీకరణకు (అప్‌డేట్) ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 17 నుంచి పది రోజులపాటు కేంద్రాలు కొనసాగేలా ఆదేశాలిచ్చింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 1,967 ఉండగా, వీటి పరిధిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులున్నారు. ఒకసారి ఆధార్ వివరాలు నమోదు చేసుకున్నాక పదేళ్లకోసారి నవీకరించుకోవాలి. విద్యార్థులు 5 నుంచి 7 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల మధ్య అప్‌డేట్ చేయించుకోవాలి. తద్వారా బయోమెట్రిక్ పక్కాగా నమోదవుతుంది. విద్యార్థుల చిరునామా, జనన వివరాల్లో తేడాలుంటే సరిచేసుకునే అవకాశం ఉంటుంది. నవీకరణ చేయించుకోకుంటే ప్రభుత్వ పథకాల లబ్ధి, ఇతర గుర్తింపుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

« గత నెలలో 8 రోజులపాటు నవీకరణ చేపట్టారు. సుమారు 2500 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. జిల్లాలో 44 వేల మందికి పైగా ఆధార్ నవీకరణ చేయించుకోవాల్సి ఉందని గుర్తించారు. వారందరికీ మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయ శాఖ ద్వారా సూచనలు చేసింది. ఈ నెల 17 నుంచి 26 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం 43,879 మందితో జాబితా పంపింది. జిల్లా వ్యాప్తంగా సచివాలయాన్నింటిలో కలిపి ప్రస్తుతం 55 ఆధార్ నమోదు కిట్లు ఉన్నాయి.

నక్కపల్లిలో విద్యార్థులకు ఆధార్ నవీకరణ చేస్తున్న ఉద్యోగులు

« ప్రస్తుతం అపార్ కార్యక్రమం జరుగుతోంది. ఇందుకు ఆధార్‌లో వివరాలు పక్కాగా ఉండాలి. ప్రస్తుతం సచివాలయాలతోపాటు కొన్ని ఎంపిక చేసిన మీ సేవా కేంద్రాల్లోనూ ఆధార్ సేవలు లభిస్తున్నాయి. విద్యార్థులు బడి వేళల్లో ఆధార్ నవీకరణకు ఆయా కేంద్రాలకు వెళ్లడం చదువుకు ఆటంకంగా మారుతోంది. ఈ సమస్య తలెత్తకుండా ప్రభుత్వమే పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

**వీలైనంత ఎక్కువ మందికి..**

ప్రభుత్వ ఆదేశాలతో పాఠశాలల్లో సదుపాయాలున్న వాటిని ఎంచుకుని శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. పది రోజుల కార్యక్రమంలో వీలైనంత ఎక్కువ మంది నవీకరణ చేసుకునేలా చూస్తాం – **మంజులావాణి, గ్రామ/వార్డు సచివాలయ జిల్లా అధికారిణి**

## నేడు శూలాల మహోత్సవం

**కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే:** చినరాజుపేటలోని చౌడేశ్వరి సాంబశివ ఆలయం శూలాల మహోత్సవానికి ముస్తాబైంది. ఏటా కార్తిక మాసం నాలుగో సోమవారం ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి చువ్వలతో చేసిన శూలాలు ధరించడం మొక్కులు చెల్లిస్తారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం కొనసాగుతుంది.

## భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

**బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే:** గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. అభ్యుదయం పేరుతో పోలీసులు చేపట్టిన సైకిల్‌యాత్ర ఆదివారం కొత్తకోట, రావికమతం, వడ్డాది మీదుగా సాగింది. వడ్డాది నాలుగురోడ్ల కూడలిలో విద్యార్థులు, స్థానికులు, పోలీసులు స్వాగతం పలికారు. ర్యాలీలో డీఐజీ సైకిల్ తొక్కారు. గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు జెండా ఊపారు. సీఐ కోటీశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు.

ర్యాలీలో సైకిల్ తొక్కుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, పక్కన తాతయ్యబాబు

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించి పనితీరుపై సమీక్షించారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మత్తు పదార్థాలను వినియోగించే వారిని గుర్తించి కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సీఐ కోటీశ్వరరావు, ఎస్సైలు శ్రీనివాసరావు, రఘువర్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

THE EENADU WAY CLASSIFIEDS

ఈనాడు క్లాసిఫైడ్స్ · పదవీ విరమణ శుభాకాంక్షలు · జన్మదిన శుభాకాంక్షలు · జయంతి, వర్ధంతి · లీగల్ ప్రకటనలు · అంత్యక్రియలు,

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

# 'నాడీ'.. వేడి..!

## నేడు జాతీయ మూర్ఛవ్యాధి నివారణ దినం

వన్‌టౌన్, న్యూస్‌టుడే

'మూర్ఛ'.. ఇది మెదడులో విద్యుత్ చర్యలు అసాధారణ స్థాయిలో పెరగడం వల్ల తలెత్తే నాడీ సంబంధిత రుగ్మత. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొవిడ్ తర్వాత మూర్ఛ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. సోమవారం జాతీయ మూర్ఛవ్యాధి నివారణ దినం సందర్భంగా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య నిపుణుల సూచనలివి.

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పలువురు బాధితులు చికిత్స కోసం విశాఖలోని కేజీహెచ్‌కు వస్తుంటారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన వైద్యసదుపాయాలు కేజీహెచ్‌లో ఉన్నాయి. ■ కొవిడ్ తర్వాత న్యూరాలజికల్ బాధితుల్లో ఎక్కువ మంది మూర్ఛ వ్యాధి బారిన పడుతున్నారు. పక్షవాతం వచ్చిన వారిలోనూ మూర్ఛ లక్షణాలు కనిపిస్తున్నాయి. దీంతో కేజీహెచ్‌తో పాటు, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరే బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది.






**లక్షణాలు ఇలా...**

▲ ఈ వ్యాధితో బాధపడేవారు తరచూ స్పృహ, స్పర్శజ్ఞానం కోల్పోతుంటారు. బాధితుల మానసిక స్థితిలోనూ కొన్ని మార్పులు వస్తుంటాయి.
▲ మెదడులో నాడీ వ్యవస్థ ఓ క్రమపద్ధతిలో పని చేయదు. ఈ సమస్య ఒక్కసారితో ఆగిపోకుండా, తరచూ వస్తుంటుంది. ▲ అధికశాతం మందిలో ఒకే రకమైన లక్షణాలు కనిపిస్తుంటాయి.

**ఏం చేయాలి..?**

▲ మూర్ఛ వచ్చిన వ్యక్తిని వెంటనే నేలపై ఎడమవైపునకు పడుకోబెట్టాలి.
▲ చుట్టూ జనం గుమిగూడకుండా, గాలి వెలుతురు ప్రసరించేలా చూడాలి.
▲ బాధితులు సులభంగా శ్వాస తీసుకునేలా చర్యలు చేపట్టాలి. వారికి కళ్లద్దాలు ఉంటే వెంటనే తొలగించాలి.

**ఏం చేయకూడదు..!**

▲ బాధితుల కాళ్లు, చేతులు కట్టేయడం, సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిసిసిటేషన్) వంటివి చేయరాదు.
▲ నోటిలో, చేతిలో ఎలాంటి వస్తువులు పెట్టకూడదు. ▲ మూర్ఛ వచ్చిన వ్యక్తి పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకు నీరు, ఆహారం పెట్టకూడదు.

**మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం..**

మూర్ఛ (ఫిట్స్)కు కేజీహెచ్‌లో మెరుగైన చికిత్స అందిస్తున్నాం. బాధితులకు సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఈఈజీ పరీక్షలు చేసి, వ్యాధిని నిర్ధారిస్తున్నాం. ఆ తర్వాత వైద్యసేవలతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ మూర్ఛ వ్యాధి నియంత్రణపై అవగాహన పెంచుకోవాలి. బాధితులు క్రమం తప్పకుండా రెండేళ్ల పాటు మందులు వాడితే వ్యాధి నయమవుతుంది. – డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

# గమ్య నగరం.. పెట్టుబడుల స్వర్గధామం!

- భాగస్వామ్య సదస్సుతో ప్రపంచ ఖ్యాతి
- విశాఖకు వరుస కట్టిన విదేశీ కంపెనీలు
- రాబోయే రోజుల్లో 5లక్షల ఉద్యోగాలు

ఈనాడు, విశాఖపట్నం

విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షించింది. రాష్ట్రానికి అంచనాలకు మించి పెట్టుబడులు రాగా అందులో విశాఖకు సింహభాగం వచ్చాయి. ప్రధానంగా ఐటీ, ఆతిథ్య, పర్యాటక రంగంతో పాటు ఆహార శుద్ధి రంగంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు వరుస కట్టారు. ఫలితంగా ఈ సమ్మిట్‌కు ముందు.. తర్వాత అన్న తరహాలో విశాఖ నగరం ఎదగనుందని నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్రానికి వస్తున్న మొత్తం పరిశ్రమల్లో 30 నుంచి 40 శాతం వరకు విశాఖ కేంద్రంగా ఏర్పాటు కానున్నాయి. వీటిల్లో దిగ్గజ సంస్థలతో పాటు స్థానికులవీ ఉన్నాయి.

**సాఫ్ట్‌వేర్, ఇతర కంపెనీలు..**

● సెయిల్స్ సాఫ్ట్‌వేర్ ● ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ● టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ● ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ● రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్టు ● రెన్యూ ఎనర్జీ సంస్థ

ఒప్పందాలు జరిగిన రంగాలు: 12
జిల్లాకు వచ్చే పెట్టుబడుల అంచనా : రూ. 4 లక్షల కోట్లు
లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: 5 లక్షలు

**ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు**

- రూ.1.33 లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల గూగుల్..
- రూ.1.10 లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల రిలయన్స్..
- రూ.1.10లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల బ్రూక్‌ఫీల్డ్..
- రూ.15వేల కోట్లతో టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్.

**✦ పర్యాటక రంగంలో రూ.10వేల కోట్లు..:** ఆతిథ్య, పర్యాటక రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు జిల్లాలో విభిన్న ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యంగా థీమ్‌పార్కులు, జల విన్యాసాలు, హోటళ్లు, రిసార్టులు, వైద్య పర్యాటకం, వెల్‌నెస్ సెంటర్లు, డెస్టినేషన్ వెడ్డింగ్, హోంస్టే, సాహస క్రీడల రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపారు. ఈ రంగంలో సుమారు రూ.10వేల కోట్ల ప్రాజెక్టులు ఒక్క విశాఖ కేంద్రంగానే ఏర్పాటు కానున్నాయి.

**ఏఐ సాంకేతికతపై పని చేస్తాం..** ఐటీ హిల్స్‌పై సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఏఐ సాంకేతికతపై పనిచేసేలా కంపెనీని విస్తరిస్తున్నాం. ఇటీవల మంత్రి నారా లోకేశ్ భూమి పూజ చేశారు. సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తాం. సీఐఐ భాగస్వామ్య సదస్సుతో స్థానిక ఐటీ కంపెనీలకు మంచి గుర్తింపు లభించింది. – ఎస్.కిరణ్, సీఈవో, సెయిల్స్ సాఫ్ట్‌వేర్

**త్వరలో మరిన్ని కంపెనీల రాక..** సీఐఐ భాగస్వామ్య(సమ్మిట్) సదస్సుతో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. ఐటీ, పర్యాటకరంగాల్లో అధిక శాతం పెట్టుబడులు వచ్చాయి. ఈ రంగాల్లో ప్రస్తుతానికి జిల్లాలో 1.5 లక్షల నుంచి 2 లక్షల మందికి ఉపాధి లభించొచ్చు. త్వరలోనే మరికొన్ని కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. తద్వారా జిల్లాలో మొత్తం ఐదు లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. – హరేంధిర ప్రసాద్, కలెక్టర్, విశాఖ

# స్ఫూర్తిశిఖరం బిర్సా ముండా

## పాడేరులో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఒడిశా సీఎం

ఈనాడు డిజిటల్, పాడేరు – న్యూస్‌టుడే, పాడేరు/పట్టణం, అరకులోయ: ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి పేర్కొన్నారు. పాడేరులో ఆదివారం వనవాసీ కళ్యాణాశ్రమం ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒడిశా సీఎంకు ఏపీ మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వాగతం పలికారు. చింతలవీధి కూడలిలో బిర్సాముండా విగ్రహాన్ని ఆవిష్కరించి స్తూపాన్ని సందర్శించారు.

▮ బిర్సా ముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పీవీటీజీల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ యోజనను ప్రారంభించిందని చెప్పారు. వచ్చే ఏడాది ప్రతి గ్రామంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

▮ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర, భాజపా జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు, బీజేవైఎం జిల్లా నాయకులు మత్స్యకొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

▮ ఒడిశా సీఎం పర్యటన నేపథ్యంలో ఎస్పీ అమిత్ బర్దార్ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సీఎం పర్యటన ముగిసే వరకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పాడేరు పట్టణంలో దుకాణాలను మూసివేయించారు. రాకపోకలు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

▮ సీఎం సభా ప్రాంగణానికి గుట్కా, మత్తు పదార్థాలను పోలీసులు అనుమతించలేదు. మారుమూల గ్రామాల గిరిజనుల వద్ద ఉన్న చుట్టలు, ఖైనీలు, లైటర్లు, గుట్కాలు తదితర వస్తువులు పోలీసులు స్వాధీనం చేసుకుని బయట పడేశారు.

గిరిజన మహిళలతో థింసా నృత్యం చేస్తున్న సీఎం మాఝి, ఏపీ మంత్రి సంధ్యారాణి

స్వాగతం పలుకుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో శ్రీపూజ

ఒడిశా సీఎం మాఝిని సన్మానించిన భాజపా నాయకులు

# రామోజీరావుకు ఘన నివాళి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, దివంగత రామోజీ రావు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం కె.కోటపాడులోని అయ్యన్న విద్యాసంస్థల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి విద్యాసంస్థల అధినేత ఖాసీం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్రికా పఠనంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపల్ సుమతి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఖాసీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

# రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో స్వర్ణం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి సేవా సంస్థలు 'డ్యూటీ ఈజ్ గాడ్' అంశంపై మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీప్రకాష్ విద్యానికేతన్ పదో తరగతి విద్యార్థిని లేఖ్య ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించింది. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కె.అప్పలనాయుడు, సత్యమూర్తి తదితరులు ఆమెను అభినందించారు. పుట్టపర్తిలో ఈ నెల 23న జరగనున్న సత్యసాయి శత జయంతి వేడుకల్లో బంగారు పతకం అందజేస్తారని భజనమండలి పేట కన్వీనరు రమేష్‌బాబు, యాజ్ఞవల్క్యశర్మ చెప్పారు.

బొబ్బర లేఖ్య

# శ్రీశైలం, పంచారామాలకు ప్రత్యేక బస్సులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి బస్ స్టేషన్ నుంచి ఆదివారం రాత్రి రెండు ఆర్టీసీ బస్సులు బయలు దేరాయి. ఒక బస్సు శ్రీశైలం, మరో బస్సు పంచారామ యాత్రలకు వెళ్తున్నట్లు డిపో మేనేజర్ హనుమత్రీ, సహాయ మేనేజర్ గౌరి తెలిపారు. అనకాపల్లి నుంచి ఈ నెల 26న శబరిమలకు ప్రత్యేక బస్సులు బయల్దేరుతున్నాయని చెప్పారు. ఒక బస్సు ఇప్పటికే బుకింగ్ పూర్తి అయ్యిందన్నారు. ప్రయాణికుల ఆదరణకు అనుగుణంగా మరిన్ని బస్సులను నడపడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అనకాపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

శ్రీశైలం బస్సు ముందు సిబ్బంది

# పోలీసుల అదుపులో బంగ్లాదేశ్ బాలిక

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌కు చెందిన ఓ బాలిక అనకాపల్లి పోలీసుల అదుపులో ఉంది. కాకినాడకు చెందిన వ్యక్తి చాలా కాలంగా ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్నారు. రెండు నెలల కిందట ఉత్తరప్రదేశ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ శరణార్థులతో పరిచయడం ఏర్పడింది. వీరిలో 15 ఏళ్ల బాలిక ఉంది. ఈమెకు వివాహ సంబంధాలు చూడడానికి ఆయన ఆ బాలికను కాకినాడ తీసుకొచ్చారు. ఆమెకు సంబంధాలు నచ్చకపోవడంతో తన తల్లిదండ్రుల వద్దకు తిరిగి తీసుకెళ్లాలని కోరింది. ఈ మేరకు శనివారం రాత్రి కాకినాడ నుంచి రైలులో బాలికను తీసుకొస్తుండగా అనకాపల్లి పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

# ఐఐఎంలో విద్యార్థులకు పట్టాల అందజేత

ఆనందపురం, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డేటా సైన్స్ ప్రోగ్రామ్‌లో అభ్యాసకులకు శనివారం సాయంత్రం పీజీ సర్టిఫికేట్స్ అందజేశారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మనం చేపట్టే పనికి ఎటువంటి ఆటంకాలు వచ్చినా విజయం సాధించేందుకు ప్రణాళికా రచనతో పూర్తి చేసే సామర్థ్య నైపుణ్యాలు ప్రదర్శించాలన్నారు. 11 నెలల ఈ పీజీ కోర్సులో వివిధ రంగాలకు చెందిన 31 మంది వ్యక్తులు అభ్యసించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టర్లు శివశంకర్ సింగ్ పటేల్, అనుపమ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సు పూర్తి చేసి పట్టాలు అందుకున్న అభ్యాసకులు

# యువ వైద్యులు ఉచిత సేవలు అందించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: యువ వైద్యులు నెలలో రెండు రోజులైనా ఉచిత వైద్యసేవలు అందించాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తెలిపారు. పట్టణంలోని గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో ఏడాదిపాటు కార్పొరేట్ వైద్యులతో గతంలో సేవలు అందించిన సంగతి గుర్తుచేశారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భువనేశ్వరరావు కుమారులు డాక్టర్ నవ్యతేజ, డాక్టర్ హర్షచైతన్య ఆధ్వర్యంలో 14 మంది వైద్యులు పలువురికి పరీక్షలు చేశారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

# విశాఖ ఉక్కును నిలబెట్టేందుకు రూ. 14 వేల కోట్ల ఆర్థికసాయం

## సీఎం వ్యాఖ్యల్ని కొందరు వక్రీకరిస్తున్నారు

### తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇప్పటికే రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాయని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సీఎం చంద్రబాబు కృషితో కేంద్రం భారీ ఆర్థిక సాయాన్ని అందించిందని, దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థకూ ఈ స్థాయిలో సహకారం లభించిన దాఖలాలు లేవన్నారు. సీఐఐ సదస్సులో విశాఖ ఉక్కు కర్మాగారం గురించి సీఎం చంద్రబాబు చెప్పిన మాటలను.. వైకాపా నాయకులతో కలిసి కొందరు వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. 'చంద్రబాబు కృషితోనే ఉక్కు కర్మాగారం లాభాల బాటలో నడుస్తోంది. అపోహలు సృష్టించే ప్రయత్నాలను కార్మికులు, ప్లాంటు సిబ్బంది తిప్పికొట్టాలి' అని శ్రీనివాసరావు కోరారు. నేడు విశాఖ ఉక్కు కర్మాగారం నడుస్తోందంటే అందుకు కూటమి ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు. 'చంద్రబాబు 2000 సంవత్సరంలో రూ.1,350 కోట్లు తీసుకొచ్చి అప్పట్లో పరిశ్రమను నిలబెట్టారు. ప్లాంటు విషయంలో కార్మికులు, యాజమాన్యం, ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో.. ప్రతిపక్షానికీ అంతే ఉంది. కార్మికుల్ని భయాందోళనలకు గురిచేసే తప్పుడు ప్రచారాల్ని మానుకోవాలి' అని హితవు పలికారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

**లోకేష్ గోల్డ్** లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

**శ్రీవల్లి గోల్డ్** లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

**క్లాత్, గుడ్డ** సంచులు హోల్‌సేల్‌గా చాలా తక్కువ ధరకే అమ్మబడును. మార్కెటింగ్ చేసుకునేవారికి చాలా మంచిలాభాలు కలుగును. (ప్లాస్టిక్ నివారణ వలన) 8121760605.

FINANCIAL SERVICES

**ఆంధ్రప్రదేశ్‌లో Govt.** ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ ✆ 73862 01191.

**స్థిరాస్తులపై విశాఖ** జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్. ✆ 9396 999 669.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

**MVP కాలనీలో** 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. Contact Phone: 8686997700.

LAND FOR SALE

GENERAL

**విజయనగరం జిల్లాలో** భూమి అమ్మకము కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్: 9948486127, 9948096199.

PLOT FOR SALE

ATCHYUTAPURAM

DTCP Approved Plot (1120 Sq.Yds) Cheemalapalli, Atchutapuram, Vizag. Contact Phone Number : ✆ 9923879631.

GENERAL

**సంక్రాంతి ఆఫర్!!** మేము ఇచ్చే ధరలకు ఎవ్వరూ ఇవ్వలేరు (ఉడా ప్లాట్లు) పూసపాటిరేగ, సవరవిల్లి, రెడ్డిపల్లి, R. తాళ్ళవలసలో తక్కువ ధరకే! ✆ 9246643836.

**6 లక్షలకు** GVMCపరిధి 107 చ॥గ॥ స్టీల్‌ప్లాంట్‌కి 4 కి॥మీ॥లో న్యూలేఅవుట్ ప్రారంభంలో 15 బిట్లు ఆఫర్‌గా EMI సదుపాయం కలదు. Contact Ph: 7386414017

TO LET

KURMANNAPALEM

To-Let: 3 BHK, Beside Annapurna Theatre, Kurmannapalem & 4 BHK, Greencity Heights @Vpl Greencity, Vadlapudi. Ph: 9848771300.

COMMERCIAL

MVP COLONY

Commercial Space for Rent 4800 Sft. 3 Floors Building with Central Lift for Showrooms, Shops near Vijaya Hospital MVP Main Road. Contact Phone: 9908507169.

JOBS

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth M/F, Part/ Full Excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

JOB OPPORTUNITY
for Retd. Officials Best Opportunity
★ PROPERTY ADVISING CHIEF MANAGERS
for Vizag and Vizianagaram
Prefer State, Central Teachers-Banking Govt/ Private Factories any Job Exp., any Degree- Housewives-full/ Part time
Age: 34+years
Monthly Package : 85,000/- Including Incentives (T&C Apply)
Interviews on : 17th, 18th, 19th Nov25
Con: Dr.SANJEEVA RAO
SEETHAMMADHARA-VSP
Ph: 9989245662

**ప్రముఖ కార్పొరేట్** సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైవ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. Contact Ph: 9701719746.

**అయోధ్య కోఆపరేటివ్** సొసైటీ బ్యాంకులో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం: 20,000 to 25,000 + ఇన్సెంటివ్, నో టార్గెట్స్, 2 వీలర్ మస్ట్. ✆ 70932 67891.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. Contact Phone: 85209 80099,85208 74499.

**కావలెను:** VICKS & Tide Company నందు పనిచేయుటకు గోడౌన్ సూపర్‌వైజర్స్. లొకేషన్: వైజాగ్ పీలానగర్. Age: 18to 45 Yrs. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. Contact Phone: 77996 12340, 90521 23444.

MARKETING/ SALES

**2 సంవత్సరాల** అనుభవం ఉన్న సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. బైక్ ఉండవలెను. జీతం: 20,000/-. Contact Phone Numbers: 9603616759, 7416582567.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# రెండు టన్నుల బియ్యం అందజేత

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లికి చెందిన అయ్యప్ప, శివ భక్తులు అన్నదానం నిమిత్తం భారీ ఎత్తున ఆదివారం ఉచితంగా బియ్యం అందజేశారు. గ్రామానికి చెందిన వీసం నానాజీ పీఠం పరిధిలో వివిధ దీక్షా పరులు పూజలు చేస్తున్నారు. వీరంతా కలిసి అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టుకు వీటిని విరాళంగా ఇచ్చారు. దీనిలో భాగంగా గురుస్వామి చంటికి పంపించారు. పంబలో ఉచిత అన్నదానం నిమిత్తం వీటిని వినియోగించనున్నట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో వీసం రామకృష్ణ, నున్న గణేష్, వీసం శ్రీను, గొడుగుల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

విరాళంగా ఇస్తున్న బియ్యం

# ఘనంగా ముగిసిన నరెడ్కో ప్రాపర్టీ ఫెస్ట్

లక్కీ డిప్ విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విజయకుమార్ తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నరెడ్కో మూడు రోజుల ప్రాపర్టీ ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ పీలా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గూగుల్ వంటి సంస్థలు వస్తున్నందున అందుకు తగిన రీతిలో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టి నగరాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా లక్కీ డిప్ నిర్వహించి, విజేతలు శివ, శ్రీనివాసరావులకు జ్ఞాపికలు అందజేశారు. ఎం.వీరేంద్రకుమార్, కె.వరప్రసాద్ ద్విచక్రవాహనాలను డ్రాలో గెలుచుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు జి.చక్రధర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వాసుల కోసం స్థిరాస్తి రంగంలో మరింత నమ్మకంతో ముందుకు సాగుతామన్నారు. ఆఖరి రోజు కావడంతో ఫెస్ట్‌లోని 65 స్టాల్స్ సందర్శకులతో కిక్కిరిశాయి. నరెడ్కో ఉత్తరాంధ్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉత్తరాంధ్ర సలహాకమిటీ ఛైర్మన్ సి.హెచ్.వి.పట్టాభిరాం, విశాఖ అధ్యక్షుడు రాజశేఖర్, నరెడ్కో ప్రతినిధులు పాపారావు, వెంకన్నచౌదరి, సుబ్బారావు, మిధున్, ధర్మారావు, అపోలో సీఈఓ కృష్ణప్రసాద్, సీఆర్‌డీఏ అదనపు సంచాలకుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్ వద్ద సందర్శకుల కోలాహలం

# మన్యంలో చలిపులి

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యం వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అరకులోయలో ఆదివారం 7.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. డుంబ్రిగుడ, జి.మాడుగులలో 8 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 8.1, హుకుంపేటలో 9.5, పెదబయలులో 10.7, చింతపల్లిలో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం కూడలిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దోసూరు పంచాయతీకి చెందిన **రాజాన అప్పలనాయుడు** (50) మృతిచెందాడు. హరిపాలెంలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అచ్యుతాపురంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అప్పలనాయుడు సంఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య రాముతల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటరావు తెలిపారు.

### కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని చోడవరం బస్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. విజయరామరాజుపేటకు చెందిన ఎం.రమణ (50), ఇతని భార్య ఈశ్వరమ్మ రహదారిపై నడిచివెళ్తుండగా ఈనెల 9న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణను కేజీహెచ్‌కు తరలించారు. ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ వెంకట రమణ తెలిపారు.

# మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు 85 శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.3 మిలియన్ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన రోడ్డు ప్రమాద బాధితుల స్మృతి దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినపుడే ప్రమాదాలను అరికట్టగలమని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డీటీసీ ఆర్.సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణం మానవ తప్పిదాలతో పాటు రోడ్డు నిర్మాణ లోపాలు, వాహనం స్థితిగతులు ప్రభావితం చేస్తాయన్నారు. డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ క్షతగాత్రులను సరైన సమయంలో ఆసుపత్రికి తీసుకొస్తే వారిని రక్షించుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి శశికళ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువతి బలవన్మరణం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మెట్టపాలేనికి చెందిన యువతి **కూండ్రపు దుర్గాదేవి** (28) ఆదివారం మధ్యాహ్నం చున్నీతో ఫ్యానుకి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పట్టణ సీఐ గోవిందరావు కథనం ప్రకారం దుర్గాదేవి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నారు. ఏడాదిన్నరగా సత్యసాయి మందిరం సమీపంలోని ఓ ఇంటి మేడపైన గదిలో అద్దెకు ఉంటున్నారు. గది తలుపు తెరవకపోవడం గమనించిన ఇంటి యజమాని వంకల ప్రసాద్ కిటికీలో నుంచి చూసి ఆమెకు ఉరివేసుకున్నట్టు గుర్తించి తల్లి మంగకు సమాచారం ఇచ్చారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వివరించారు. ఫిర్యాదులో తల్లి అనుమానాలేవీ వ్యక్తం చేయలేదని సీఐ వివరించారు. దుర్గాదేవి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, ఫోన్ కాల్‌డేటా విశ్లేషించాల్సివుందని వివరించారు. దుర్గాదేవి తండ్రి గతంలోనే మరణించాడని, చెల్లికి వివాహమైందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

**చికెన్ ధరలు** (కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 110 | 107 |
| లైవ్ | 137 | 127 |
| డ్రెస్డ్ | 199 | 224 |
| స్కిన్‌లెస్ | 226 | 234 |

(c) eenadu

సోమలింగపాలెంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

## గౌరమ్మకు సారె

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సోమలింగపాలెంలో శనివారం రాత్రి గౌరీ పరమేశ్వరులు సారె ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మహిళలు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యల్లపు గోపి, నాయకులు కర్రి ఝాన్సీ, స్వామి పాల్గొన్నారు.


# అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట


## తీరానికి పర్యాటకుల తాకిడి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రేవుపోలవరం తీరం పర్యాటకులతో కళకళలాడింది. కార్తిక మాసం ఆఖరి ఆదివారం కావడంతో జిల్లా నలమూలల నుంచి పర్యాటకులు తీరానికి తరలివచ్చారు. తీరం పరిసరాల్లోని కొబ్బరి తోటల్లో వన భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. ఎస్సై విభీషణరావు, మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

# విలువైన స్థలం.. వినియోగానికి దూరం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

శిథిలావస్థలో పోలీస్ నివాస భవనాలు

అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్ వెనక భాగంలోని సువిశాల స్థలం నిరుపయోగంగా మారింది. దీన్ని వినియోగంలోకి తెచ్చేలా పోలీస్ అధికారులు దృష్టి సారించడం లేదు. గతంలో పనిచేసిన ఎస్పీలు ఈ ప్రాంతాన్ని పరిశీలించి వినియోగంలోకి తెస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ఎస్పీ ఇటువైపైనా చూడలేదు. ఎస్పీ కార్యాలయాన్ని శంకరం వద్ద అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం ఏర్పడినప్పటి నుంచి పట్టణానికి దూరంగా ఉన్న గ్రామంలో ఎస్పీ కార్యాలయం ఉంది. ఇక్కడికి వెళ్లడానికి ఫిర్యాదుదారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పోలీస్‌శాఖకు పట్టణ నడిబొడ్డున సువిశాల స్థలం ఉంది. ఇక్కడ జిల్లా కార్యాలయాన్ని నిర్మించవచ్చు. ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అనకాపల్లిలో పోలీస్ నివాస భవనాలను 1989లో నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నింటిని తొలగించారు. మరికొన్నింటిని వదిలేయడంతో ఇవి ఎప్పుడు కూలిపోతాయనే భయంతో సిబ్బంది ఖాళీ చేశారు. అప్పటి నుంచి ఇవి నిరుపయోగంగానే ఉన్నాయి. 2016లో తెదేపా హయాంలో అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఆధునిక భవనానికి శ్రీకారం చుట్టారు. దీనికి వెనక ఉన్న స్థలాన్ని కూటమి ప్రభుత్వ హయాంలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఉషూలో మెరిసి.. జాతీయస్థాయికి ఎదిగి

ఉషూ క్రీడా సాధన పట్ల అనకాపల్లి యువత ఆసక్తి చూపుతోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ క్రీడలో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కిరెడ్డిపాలెం తారకరామకాలనీలో సాధన చేస్తున్న పలువురు అండర్- 19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరు వచ్చే నెలలో మణిపూర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

ఉషూ సాధనలో విద్యార్థులు

### ఆర్మీలో చేరుతా!

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నది కోరిక. నాన్న కూలీ పని చేసి వచ్చే సంపాదనతో చదివిస్తున్నారు. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలన్నది నా కోరిక. ఉషూలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. –ఎ.వరప్రసాద్, ఇంటర్ విద్యార్థి

### రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం

నేవీలో ఉద్యోగం చేయాలనేది లక్ష్యం. క్రీడాకోటాలో ఉద్యోగం పొందాలనే ధ్యేయంతో సాధన చేస్తున్నాను. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాను. ఈ పోటీల్లో సత్తా చాటేలా సాధన చేస్తున్నా. – ఎన్.తులసీరామ్, ఇంటర్

ఉషూ క్రీడలను నేర్చుకోవడం పట్ల యువత ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉన్న ఈ క్రీడతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలకు ఉషూ సాధన పట్ల యువత సాధన చేస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. – దువ్వాడ హరీష్, కోచ్

### మూడేళ్లుగా సాధన

ఉషూలో మూడేళ్లుగా సాధన చేస్తున్నాను. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో అనకాపల్లి జిల్లా తరఫున ఆడి బంగారు పతకం సాధించాను. జాతీయస్థాయి పోటీలో సత్తా చాటేలా సాధన చేస్తున్నాను. పోలీస్ ఉద్యోగంలో చేరాలనే లక్ష్యంతో చదువుతో పాటు క్రీడల్లో సాధన చేస్తున్నాను. – ఈ.లక్షిత్, విద్యార్థి

## వంటా వార్పుతో నిరసన

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళన ఆదివారంతో 64వ రోజుకు చేరుకుంది. వీరంతా శిబిరం వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు.

**మహారాజశ్రీ యలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

**E.P.No.30/2020 O.S.No.92/2017**

Between:

జంప జోగారావు ... DHR

And

బొండా లక్ష్మి మరియొకరు ...JDRs

**వేలం ప్రకటన**

యిందలి DHRకి JDRs వద్ద నుండి రావలసిన ఈ అమలు బాకీ దర్మిలా వడ్డీ ఈ అమలు ఖర్చులు వగైరాలు వసూలు నిమిత్తం యిందలి JDRsకి సంపూర్ణ హక్కు, అనుభవం, స్వాధీనం గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి (భూమి)ని తేది. 04-12-2025న పై కోర్టువారు బహిరంగ వేలం వేయుటకు నిశ్చయించినారు. సదరు బహిరంగ వేలంలో పాడుకోదలచిన వారు పై కోర్టులో తేది. 04-12-2025న ఉదయం గం. 10.30 ని॥ లగాయితు సాయంత్రం గం. 5.00లలోపు హాజరు అయి వేలంలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పాడుకోగలరు.

**ఆస్తి వివరం**

అనకాపల్లి జిల్లా (లోగడ విశాఖపట్నం జిల్లా), నక్కపల్లి సబ్-రిజిస్ట్రార్, S.రాయవరం మండలం, కొరుప్రోలు గ్రామం కొరుప్రోలు రెవెన్యూ పరిధి, జిరాయితీ పల్లం భూమి పాత సర్వే నెం. 269/3, ప్రస్తుత సర్వే నెం. 270/3, విస్తీర్ణం ఎ.0.64 సెంట్లుకి హద్దులు. తూర్పు: పంట కాలువ; దక్షిణం: పంట కాలువ; పడమర: (శ్మశానం) Burail Ground; ఉత్తరం: DHR తా॥ భూమి మరియు బోడపాటి రాముడు భూమి.

NB: Subject to Reg. Mortgage
DHR Value Rs.2,00,000/-
Field Officer Value Rs.3,00,000/-
Market Value Rs.14,72,000/-

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

యలమంచిలి, **దొడ్డ నాగేశ్వరరావు**
తేది:16-11-2025. DHR తరపు అడ్వకేట్

## వసతి గృహానికి మెరుగులు

అనకాపల్లి పట్టణం: అనకాపల్లిలో బీసీ బాలుర వసతిగృహంలో కార్పొరేట్ సామాజిక సేవా నిధులతో చేపడుతున్న పనులతో విద్యార్థుల సమస్య తీరనుంది. ఇక్కడ చదువుతున్న 164 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కలెక్టర్ విజయకృష్ణన్ సూచన మేరకు సమర్ధన్ ట్రస్ట్ నుంచి రూ. 27 లక్షలు అందించారు. ఈ నిధులతో వసతిగృహంలో పనులు జరుగుతున్నాయి. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వార్డెన్ ఎస్.సత్యనారాయణ తెలిపారు.

బీసీ బాలుర వసతిగృహ భవన స్లాబ్ నిర్మాణ పనులు

## బురదలో నడిచేదెలా..

గ్రామాల్లో వీధి రోడ్లు కొత్తరూపునకు నోచుకోవడం లేదు. మట్టిరోడ్లపై రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నంలో వీధి రోడ్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదు. పెంటకోట వెళ్లే దారిలో ఉన్న రోడ్డు బురదతో నిండిపోయింది. దీంతో ఇళ్లకు చేరేందుకు వీలుండటం లేదని వాపోతున్నారు. బురద కారణంగా వాహనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న తాగునీటి కుళాయి నుంచి నిత్యం నీరు వృధాగా పోతోంది. ఈ నీరంతా వీధి రోడ్డులోకి చేరుతోంది. రాకపోకలకు వీలు కలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పాయకరావుపేట, న్యూస్‌టుడే

## రాళ్లు తేలిన రహదారి

గ్రామీణ ప్రాంతాలకు రహదారి సదుపాయాలంటూ వైకాపా ప్రభుత్వ హయాంలో హడావుడి చేశారు. కొత్తూరు బంగారుమెట్ట రోడ్డు నుంచి మూలపేట రహదారి పనులకు 2023 మే 4న శంకుస్థాపన చేశారు. రూ.1.29 కోట్ల వ్యయంతో పనులు చేపడతామని ప్రకటించినా చివరికి కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినా నేటి వరకు పురోగతి కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని ఈ రహదారి నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

## డివైడర్‌పై కానరాని పచ్చదనం

తుమ్మపాల వద్ద..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గుండాల కూడలి నుంచి తుమ్మపాల వరకు రహదారి నిర్మాణంతో పాటు డివైడర్ నిర్మించారు. ఇందులో మొక్కల పెంపకాన్ని విస్మరించారు. ఇక్కడ పచ్చదనం నింపేలా చొరవ తీసుకుంటే ఆహ్లాదంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో సాగునీటికి ఇక్కట్లు

ప్లాస్టిక్ వ్యర్థాలు అన్నదాతలకు శాపంలా మారుతున్నాయి. నదులు, కాలువల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేస్తుండటంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. పట్టణంలోని తాండవ నది నుంచి పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. భూమి, మురా ఆనకట్టల నుంచి కాలువల ద్వారా నీరు చేరుతోంది. మంగవరం, గుంటపల్లి, అరట్లకోట, పెదరామభద్రపురం, నక్కపల్లి మండలాల్లోని ఒడ్డిమెట్ట, దేవవరం, గొడిచెర్ల, ఉద్దండపురం తదితర గ్రామాల్లో తాండవ నీటితో పంటలు పండిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ కాలువల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, వాడి పారేసిన కొబ్బరిబొండాలు వేస్తున్నారు. నీటి ఉద్ధృతికి ఇవన్నీ భూముల్లోకి చేరుతున్నాయి. దీనివల్ల సకాలంలో నీరు అందడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నదీ జలాల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

**మహారాజశ్రీ యలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**

E.P.No.61/2023 O.S.No.79/2018

Between:

జంప జోగారావు ... DHR

And

బొండా శ్రీనివాసరావు మరియొకరు ...JDRs

**వేలం ప్రకటన**

యిందలి DHRకి JDRs వద్ద నుండి రావలసిన ఈ అమలు బాకీ దర్మిలా వడ్డీ ఈ అమలు ఖర్చులు వగైరాలు వసూలు నిమిత్తం యిందలి JDRsకి సంపూర్ణ హక్కు, అనుభవం, స్వాధీనం గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి (భూమి)ని బహిరంగ వేలం వేయుటకు పై కోర్టు వారు నిశ్చయించినారు. సదరు వేలం తేది. 03-12-2025న ఉదయం గం. 10.30 ని॥ లగాయితు సాయంత్రం గం. 5.00లలోపు హాజరు అయి వేలంలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పాడుకోగలరు.

**ఆస్తి వివరం**

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి సబ్-రిజిస్ట్రార్, S.రాయవరం మండలం, కొరుప్రోలు గ్రామం, కొరుప్రోలు రెవెన్యూ పరిధి, జిరాయితీ పల్లం భూమి పాత సర్వే నెం. 269/3, ప్రస్తుత సర్వే నెం. 270/3, విస్తీర్ణం ఎ.0.64 సెంట్లు లో 0.258 సెంట్లకు హద్దులు: తూర్పు: పంట కాలువ, దక్షిణం: పంట కాలువ, పడమర: శ్మశానం (Burial Ground), ఉత్తరం: DHR యొక్క భూమి.

NB: Subject to Reg. Mortgage
DHR Value Rs.10,00,000/-
Field Officer Value Rs.25,00,000/-
Market Value Rs.14,72,000/-

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

యలమంచిలి, **దొడ్డ నాగేశ్వరరావు**
తేది. 16-11-2025. DHR తరపు అడ్వకేట్

## ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రామాపురం సత్యసాయి మందిరంలో విజన్ ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. నేత్ర వైద్య నిపుణుడు ఎస్.భానుకుమార్ సుమారు వంద మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. బీవీ మహేశ్వర్, ఎస్. మాధవి, వీవీ రమణ, సాయిరాం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం

అనకాపల్లి పట్టణం: బజ్జీలవానిపాలెంలో వివాహిత అదృశ్యమైంది. భర్త నుంచి వేరుగా ఉంటున్న వివాహిత బజ్జీలవానిపాలెంలో పుట్టింటికి వచ్చింది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి కనిపించడం లేదని ఆమె తల్లి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై రవికుమార్ తెలిపారు.

## జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల వితరణ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చోడిపల్లి జంగాలకాలనీకి చెందిన టి.ప్రసాద్‌కు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం రూ.15 వేల చెక్కును గౌరవ అధ్యక్షులు పుర్రే రవిచంద్రయాదవ్, అధ్యక్షులు ఎరిపల్లి ముత్యాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదాడ చిన్న, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. పూడిమడకలో ఆదివారం 'నేను నా యువత' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్నారు. విద్యలో రాణించాలన్నారు. నాయకులు మేరుగు బాపునాయుడు, ప్రవీణ్‌కుమార్, ఎరిపల్లి కాసులు, మేరుగు కాసుబాబు, వెంకటరావు పాల్గొన్నారు. తమ సమస్యలు ఎమ్మెల్యే వినలేదని కొందరు నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

# వైభవంగా ముసిలితల్లి జాతర

మునగపాక, న్యూస్‌టుడే: అరబుపాలెంలో ముసిలితల్లి అమ్మవారి పండగ ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి సిరిమానును గ్రామవీధుల్లో ఊరేగించారు. మహిళల కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దొడ్డిబుజ్జి, ఆలయ కమిటీ చైర్మన్ కొయిలాడ గంగాధర్, కార్యదర్శి శరగడం లక్ష్మణరావు పాల్గొన్నారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అంబలం పూజ ఘనంగా నిర్వహించారు.

అనకాపల్లి గ్రామీణం: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. క్షేత్ర ట్రస్టీ ఆంజనేయ రాజు భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట త్రిపురాంతకస్వామి దేవాలయ ఆవరణలో త్రినాథస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు.

### భక్తిశ్రద్ధలతో దామోదరుడికి దీపహారతి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేటలో దామోదరుడికి దీప హారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని దరిబట్లనగర్‌లో కార్తిక మాసం పర్వదినాన భాగంగా పూజలు చేశారు. దీపదానం, హరినామ సంకీర్తన, భజనలు చేపట్టారు. హైమా నేతాజీ, ఎండీ పి.వి.ఎస్.ఆర్. ప్రసాద్, పీఅర్‌ఓ మండలశాఖ అధ్యక్షుడు ఆడారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### వీరబ్రహ్మేంద్ర స్వామివారి కల్యాణోత్సవం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరంలో గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. రాత్రి స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

సిరిమానును ఊరేగిస్తున్న భక్తులు

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

మునగపాకలో..

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనకాపల్లి, న్యూస్‌టుడే: మునగపాకలో 1977-78లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బొజ్జన్న కొండ వద్ద ఆదివారం కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 40 మంది హాజరయ్యారు. ముందుగా చనిపోయిన మిత్రులకు సంతాపం తెలుపుతూ కొంత సేపు మౌనం పాటించారు. తర్వాత స్నేహితులంతా కలిసి ఉన్నత పాఠశాలలో వారి అనుభవాలను తెలిపారు. జీవితంలో సాధించిన విజయాలను వివరించారు. ఆనాటి గురువుల బోధనలు, నేర్పిన క్రమశిక్షణ గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమం పీవీ రమణ, బీశెట్టి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

# వేడుకగా వనసమారాధనలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అడ్డురోడ్డులో ప్రగడ వారి కార్తిక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి జిల్లాలోని కుటుంబ సభ్యులు అందరిని కలవడం సంతోషంగా ఉందన్నారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు ప్రగడ నాగేశ్వరరావు, ఇతర పెద్దలను సన్మానించారు. ప్రగడ కన్నబాబు, ప్రగడ కృష్ణబాబు ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ వనసమారాధనలో ప్రగడ చక్రి, చక్రరావు, తులసీరావు, ట్రస్టు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేటలో యాదవ సంక్షేమ సంఘం వన సమారాధన ఉత్సాహంగా సాగింది. దీనికి అతిథిగా హాజరైన తుని తెదేపా నాయకుడు యనమల రాజేష్ మాట్లాడుతూ ఐకమత్యంగా అందరూ ముందుకు సాగాలన్నారు. యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కె. గురవయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దేవర సత్యనారాయణ, జి.నూకరాజు, ఎన్.రమణబాబు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో ఆడారి కుటుంబీకుల సంఘం ఆత్మీయ సమావేశం జగ్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధ దంపతులను సత్కరించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

ప్రగడ నాగేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

# విద్యార్థులకు క్విజ్ పోటీలు

కోటవురట్లలో గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థినులు

కశింకోట: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా తాళ్లపాలెంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్, చదరంగం పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వి.కె.హరినాథ్, కె.వి.నూకరత్నం, సుకురమ్మ, ఎస్.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం,రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: అచ్యుతాపురంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. దిమిలి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గవర్ల అనకాపల్లిలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. మ్యాజిక్‌షో ఏర్పాటు చేశారు.

కోటవురట్ల, నక్కపల్లి: కోటవురట్లలో విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. చినదొడ్డిగల్లు, నక్కపల్లి గ్రంథాలయాల్లో పద్యపఠనం పోటీలు నిర్వహించారు.

## జూదం ఆడుతున్న ఆరుగురి అరెస్టు

నక్కపల్లి: దేవవరం సమీపంలో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సన్నిబాబు ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో సిబ్బందితో కలిసి దాడిచేయగా, ఆరుగురు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ. 5650 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

## ఏటికొప్పాకలో అన్నదానం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఏటికొప్పాకలో బండిమాంబ అమ్మవారి జాతర పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ దేవీ ప్రసాద్, మాజీ సర్పంచి కాండ్రకోట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



బారులుదీరిన భక్తులు

**పబ్లిక్ నోటీసు**

మా క్లయింట్లు అనకాపల్లి జిల్లా, అనకాపల్లి గ్రామం, మళ్ళ వీధి కాపురస్తులు అయిన సరిసా రామారావు గారి కుమారుడు సరిసా నూకరాజు మరియు మళ్ళ పెద వెంకటరమణ గారి కుమారుడు మళ్ళ మహేశ్వరరావు @ మళ్ళ సీతా మహేశ్వరరావు గార్లు నాకు ఇచ్చిన బోగట్టా పైని యీ పబ్లిక్ నోటీసును ఇవ్వడమైనది.

మా క్లయింట్లు అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో యీ దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తి పై **O.S.16/2020** గల దావాను శ్రీమతి వాడపల్లి పద్మావతి వగైరాలు పై **specific performance of contract of sale** దావాను దాఖలు చేసి ఉన్నారు. ప్రస్తుతం దావా నడుచు చున్నది. కాగా పైన ఉదహరించిన శ్రీమతి వాడపల్లి పద్మావతి, **W/o** వాడపల్లి సత్యనారాయణ రాజు వగైరాలు దావా విషయం మధ్యాపెట్టి క్రింద ఆస్తిని ఇతరులకు మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని **A.S.282/2005** లోని రాజీపడిన తే. **30-04-2025** ది.న ఇచ్చిన తీర్పు ఆధారముగా అమ్మజూపుతున్నట్లు మా క్లయింట్లుకు తెలిసినది. అట్లు చేయుటకు వారికి హక్కు లేదు. కాబట్టి ఎవ్వరును పై వ్యక్తులు అనగా దావాలో ప్రతివాదులు అయిన శ్రీమతి వాడపల్లి పద్మావతి వగైరాలుతో ఎటువంటి లావాదేవీలు షెడ్యూల్ ఆస్తి నిమిత్తమై చేయరాదని, చేసినను చెల్లనేరవని, అంతియే గాక మా క్లయింట్లు గైకొనే చర్యలకు బాధ్యులు అగుదురు అని యీ నోటీసు ద్వారా యావన్మందికి తెలియపరచడమైనది.

**SCHEDULE PROPERTY**

Visakhapatnam District- Anakapalli Sub-registry Anakapalle Mandal- Tummapala Village- undivided and unspecified 1/3rd share i.e. Ac.3-47 2/3 cents/ 1-407 Hectors of land in an extent of Ac.10-43 cents/ 4-220 Hectors land consisting as single plot in under mentioned survey numbers as follows:

| S.No. | Extent Ac.-cents / Hecotrs |
|---|---|
| 348/13 | 1-89 / 0.765 |
| 352 | 2-68 / 1.084 |
| 353 | 5-86 / 2.371 |

**Total extent:** Ac.10-43 cents/4-220 Hectors and bounded by: **East:** Land of Rachakonda Sarma; **South:** Land of Maturu Venkayya etc.; **West:** Land of Boddapati Killadi and Boddapati Sannibabu; **North:** Road

**లంక జగన్నాధం, లంక పార్వతీశ్వర్,** అడ్వకేట్లు
D.No.3-5-7/B, నరసింగరావు పేట,
అనకాపల్లి-531001.
అనకాపల్లి
తే15-11-2025ది Cell Nos.: 9346490755 & 9885161002

# అభివృద్ధికి దూరంగా శివారు ప్రాంతాలు

ఆగ్రహారంలో శిథిలమైన మంచినీటి ట్యాంకు

ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని శివారు గ్రామాలు, కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కరవై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రహదారులు, కాలువలు, కుళాయిలు లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పురపాలిక సంఘంగా ఏర్పడిన తరువాత తమ సమస్యలు పరిష్కరించేవారు కరవయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొక్కిరాపల్లి శివారు రెల్లికాలనీ, వెంకటాపురం, చినగొల్లలపాలెం, న్యూ స్టేట్‌బ్యాంకు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేవు. ఆగ్రహారంలో 25 ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. కుళాయిలకు మూతలు లేక తాగునీరు వృథాగా పోతుంది. రెల్లి కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో కనీస అవసరాలకు పట్టణానికి రావాలంటే నానా అవస్థలు పడుతున్నారు. కాలువలు లేక ఇళ్ల మధ్యనే మురుగు నిలిచి పోతోంది. న్యూ స్టేట్ బ్యాంకు కాలనీలో దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎలమంచిలి గ్రామీణం

## మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి: ?: గవరపాలెం సత్తమ్మ తల్లి ఆలయానికి వెళ్లే రహదారి గోతులు పడింది. – కాండ్రేగుల రామకృష్ణ, అనకాపల్లి, ✓: గోతులు బాగు చేయిస్తాం. – ఎస్.శేఖర్, ఈఈ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: విజయరామరాజుపేట వద్ద కల్వర్టు మరమ్మతులకు గురైంది. – రాధాకృష్ణ, అనకాపల్లి, ✓: వెంటనే మరమ్మతులు చేపడతాం. – గోపాలకృష్ణ, జీవీఎంసీ డీఈ

అచ్యుతాపురం: ?: ఖాజీపాలెంలో కాలువలు లేక మురుగంతా రోడ్డుమీదే ఉంటుంది. – చిరంజీవి, ఖాజీపాలెం, ✓: కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. –పీలా నర్సింగరావు, సర్పంచి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని నర్సీపట్నం రోడ్డు కూడలిలో శాంతినగర్ వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలి. ఎండలోనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. – సూరిబాబు, స్థానికుడు, ✓: షెడ్ల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాల్తేరు నుంచి ఈదటం వెళ్లే రోడ్డులో జంగిల్ క్లియరెన్సు చేపట్టాలి. ముళ్లకంచెలు పెరిగిపోయాయి. వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. – ఖాదర్, ఉపాధ్యాయుడు, ✓: పిచ్చిమొక్కలు తొలగిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీఓ

## క్యాన్సర్‌పై అవగాహన అవసరం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని విశ్రాంత రసాయనశాస్త్ర అధ్యాపకులు కొయిలాడ రామ్మోహనరావు తెలిపారు. పట్టణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 'క్యాన్సర్-నివారణోపాయాలు' అను అంశంపై సభ్యులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం తగ్గుతుందన్నారు. వైద్యులు విష్ణుమూర్తి, వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు, కార్యదర్శి యల్లపు శివ, కోశాధికారి కేవీవీ సత్యనారాయణ, వంకాయల ఈశ్వరరావు, జగదీష్ పాల్గొన్నారు.

## వాహనాల రాకపోకలకు వ్యతిరేకంగా నిరసన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దిబ్బపాలెం సెజ్‌కాలనీ మీదుగా వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని కాలనీవాసులు మండిపడ్డారు. అరకొర ఉన్న రోడ్లు అధ్వానంగా మారాయని ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. వాహనాలను కాలనీ మీదుగా నిషేధించాలన్నారు. ఈకార్యక్రమంలో లాలం సంజీవి, లాలం బుల్లిదొర, రమేష్, శ్రీను, శివ పాల్గొన్నారు.


23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

మా అభ్యున్నతికి సహకరిస్తున్న సహచర డాక్టర్లకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంత ప్రజలకు హృదయపూర్వక 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

SMC SUN MEDICAL CENTRE

సన్ మెడికల్ సెంటర్

శ్రీరామ కాంప్లెక్స్, RTC కాంప్లెక్స్ ఇన్‌గేట్ ఎదురుగా, అనకాపల్లి

Ph: 08924225399


(c) eenadu

# నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

### తెరపై ఈనాడు

**నర్సీపట్నం:** శ్రీకన్య **ఆడి1:** గోపికల గోవా ట్రిప్, అట్టా కాదరా శివ, సీతా ప్రయాణం కృష్ణతో, లవ్ ఓటీపీ, మా ఊరి వెంకన్న **ఆడి 2:** ది గర్ల ఫ్రెండ్, సంతాన ప్రాప్తిరస్తు **ఆడి 3:** కాంత, **ఆడి 4:** శివ, రోలుగుంట సూరి, జిగిరిస్ **బంగార్రాజు:** ప్రీ వెడ్డింగ్‌షో **రాజు:** జింగిరి **చోడవరం:** శ్రీసాయిలక్ష్మి: కాంత **సాయిలక్ష్మి:** శివ, **పూర్ణ:** జటాధర

### చీడికాడలో ఉద్యోగ మేళా 23న

**చీడికాడ, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత హాజరుకావొచ్చన్నారు. పదికిపైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 79811 02224 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### పెరుగుతున్న చలి

మైదాన ప్రాంతంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. చీడికాడ మండలంలో ఆదివారం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు ఉంది. చలిమంటలతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.
– చీడికాడ, న్యూస్‌టుడే

### నేటి నుంచి ఆధార్ క్యాంపులు

**మాకవరపాలెం, న్యూస్‌టుడే:** మండలంలో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ఛాయసుధా ఆదివారం తెలిపారు. శెట్టిపాలెం పాఠశాలలో 17, 18 తేదీల్లో, జి.కోడూరులో 19, 20, మాకవరపాలెం 22, గిడుతూరు 24, 25, బూరుగుపాలెం 26 తేదీలలో ఆధార్ అప్‌డేట్, నూతన ఆధార్ కార్డుల జారీకి సంబంధించి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఆనందపురంలో కంటి వైద్య శిబిరం

**కె.కోటపాడు, న్యూస్‌టుడే:** ఉచిత కంటి వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి అప్పాజీ పేర్కొన్నారు. ఆనందపురంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గొంప వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ఛైర్మన్ సింగంపల్లి అర్జున, తెదేపా నాయకుడు బోజంకి సూర్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు శిబిరంలో సేవలందించారు. వర్తక సంఘ అధ్యక్షుడు చిట్టిబాబు, అయ్యప్ప, రొంగలి ముత్యాల నాయుడు, వంటాకు మహేశ్ పాల్గొన్నారు.

కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

## ఇక నందనవనమే!

✦ రింక్, పార్కు అభివృద్ధికి రూ.35 లక్షలు
✦ పట్టణవాసులు సేద తీరేలా అభివృద్ధి

ఈ స్కేటింగ్ రింక్‌నే ఆధునికీకరించనున్నారు

**నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణ వాసులు కాసేపు సేద తీరాలంటే చక్కని పార్కులు ఉండాలి. పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు, పెద్దలు ఆహ్లాదంగా గడిపేందుకు తగిన పచ్చదనం, నడకమార్గం తదితర వసతులు ఉండాలి. నర్సీపట్నం మున్సిపాలిటీలో ఈ తరహా వసతులు తక్కువే. ప్రాంతీయ ఆసుపత్రి ఎదురుగా నందనవనం పార్కు ఉన్నప్పటికి వాటిలో సదుపాయాలు కొరవడ్డాయి. పాతికేళ్ల క్రితం నిర్మించిన ఈ నందనవనం పార్కు ఎప్పటికప్పుడు తగినంత నిర్వహణలేక కళావిహీనంగా మారింది. ఈ పార్కులో 2018లో రూ.53 లక్షలతో స్కేటింగ్ రింక్ నిర్మించారు. గతంలో ఈ రింక్‌లో రాష్ట్ర స్కేటింగ్ పోటీలు సైతం నిర్వహించారు. ఈ రింక్ చుట్టూ కొన్ని స్టీల్ రెయిలింగ్ చువ్వలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించుకు పోయారు. పిల్లలు ఆడుకునే జారుడుబల్లలు, ఉయ్యాలలు మరమ్మతుకు గురయ్యాయి. బాక్సింగ్ హాల్ నిర్మాణానికి 2024లో రూ. 60లక్షలు కేటాయించినా పది శాతం కూడా పనులు పూర్తి చేయలేదు. ఈ పార్కు సమస్య శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి వెళ్లడంతో ఆయన సూచన మేరకు ఇప్పుడు రూ.35 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసేందుకు మున్సిపల్ అధికారులు సమాయత్తమవుతున్నారు. ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో చాలామంది రాత్రుళ్లు లోపలకు దూకి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీన్ని నివారించేందుకు ఈ ప్రహరీని ఎత్తు చేయనున్నారు. ప్రహరీ పొడవునా వేకువ నడక కోసం మార్గం (వాకింగ్ ట్రాక్) నిర్మిస్తారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్యాలరీ తొలగించి బాక్సింగ్‌హాల్ కోసం గోతులు తవ్వి, పునాదికోసం ఇనుప చువ్వలు వరకు అమర్చి పనులు ఆపేశారు. ఈ ప్రదేశంలో ఆధునాతనంగా ఇప్పుడు గ్యాలరీ నిర్మించాలని నిర్ణయించారు. స్కేటింగ్ రింక్‌ను మెరుగులు దిద్దడంతో పాటు పిల్లల ఆట పరికరాలు, పెద్దల వ్యాయామ పరికరాలు మరమ్మతు చేయించనున్నారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు. టెండరు ఖరారు గానే పనులు చేపడతామని వివరించారు.

## స్మార్ట్ కార్డులు .. సాంకేతిక చిక్కులు

పంపిణీ కానివి పది వేలు

స్మార్ట్ కార్డులు

**నర్సీపట్నం, న్యూస్‌టుడే:** స్మార్ట్ రేషన్ కార్డులు అధికారులను పరుగులు తీయిస్తున్నాయి. గత ప్రభుత్వం తప్పిదాలతో ఇప్పుడు ఇవి కొన్ని పంపిణీకి నోచుకోలేదు. వీటికి తక్షణం కారణాలు తెలుసుని నివేదికలు ఇవ్వాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులు నిర్ణయిస్తుండడంతో పౌరసరఫరా అధికారులంతా ఇప్పుడు ఈ పనుల్లోనే తలమునకలవుతున్నారు. గతంలో గృహాల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా లేకపోవడం, మృతులను తొలగించపోవడం, చేర్పులు, మార్పులు అవసరం కావడంతో జిల్లాలో పది వేలు కార్డులు పంపిణీ కాకుండా మిగిలిపోయాయి.

▼ తొలుత ఇవి ఎక్కడ ఇస్తారో తెలియక కొంత మంది... తమ కార్డు ఏ డీలరు వద్ద ఉందో గుర్తించలేక మరి కొందరు... ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యలు కొద్ది రోజులు తరువాత పరిష్కారమయ్యాయి. ఇప్పుడు గతంలోని మ్యాపింగ్‌లో పొరపాట్లుకు తోడు వలసలు అలాగే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాకపోవడం, అత్తారింటికి వెళ్లిన వారి పేర్లు కొనసాగడం తదితర కారణాలతో పది వేలమందికి వీటిని అందజేయలేని పరిస్థితి కొనసాగుతోంది.

▼ స్మార్ట్ కార్డులు మిగిలిపోవడంతో చౌక దుకాణాల్లో సరకుల పంపిణీ గందరగోళంగా మారింది. జిల్లాలో 1069 దుకాణాల ద్వారా ప్రతీ నెల 5,35,492 మందికి రేషన్ అందజేస్తున్నారు. వీరందరిలో 94 శాతం మందికి స్మార్ట్ కార్డులు పక్కాగా అందజేశారు. పది వేల మందికి ఇంకా ఇవాల్సి ఉంది. నర్సీపట్నం ప్రాంతంలోని మూడు మండలాల్లోని సుమారు 40 వేల కార్డుల్లో 2 వేల మందికి అందలేదు. సంబంధిత కార్డుదారులకు వీటి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

▼ ఉన్నతాధికారులు ఆదేశాలతో పౌర సరఫరాల డీటీలంతా ఇప్పుడు డీలర్లను రప్పించి మిగిలిపోయిన కార్డుల పరిస్థితిని ఆన్‌లైన్లో పరిశీలిస్తున్నారు. కొన్ని రోజులుగా అధికారులు, చౌక దుకాణదారులు వీటికి కారణాలు అన్వేషించే పనిలో నిమగ్నమయ్యారు. డీలర్లు కొందరు రేషన్ కార్డుదారుల జాబితాలు పట్టుకొని ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. వలస వెళ్లిన వారి సమాచారం తెలుసుకుంటున్నారు. పక్కా కారణాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తే పోర్టల్‌లో అవసరమైన మార్పులు, చేర్పులకు వీలుగా ప్రభుత్వం చర్యలు తీసుకొని అందరికి కార్డులు అందేలా చూస్తుందని నర్సీపట్నం పౌరసరఫరాల డీటీ చందన రేఖ తెలిపారు.

### విద్యార్థులకు వితరణ

పరుపులు అందజేస్తున్న వివిధ సంఘాల సభ్యులు

**మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని బీసీ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు మాడుగుల సేవాభారతి, ఆరోహన్ ట్రైబల్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరుపులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు అందించారు. వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### ఆమ్‌ఆద్మీ నాయకుల దీక్ష విరమణ

**చోడవరం, న్యూస్‌టుడే:** చోడవరం ప్రాంత రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు చేపట్టిన దీక్షలు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు హామీతో ఆదివారం సాయంత్రం దీక్ష విరమించారు. బి-ఎన్ రహదారితో పాటు ఇతర రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే రహదారుల అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో నిరవధిక దీక్షలు విరమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొణతాల హరినాథ్‌బాబు తెలిపారు. రహదారులను అభివృద్ధి చేయాలంటూ గత 21 రోజులుగా చోడవరం తహసీల్దారు కార్యాలయం ముందు దీక్షలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త వేగి మహాలక్ష్మినాయుడు, చిన్న, గూనూరు పెద బాబు, పెద అచ్చిబాబు, గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి కేంద్రం.. దయనీయం

జిల్లాలో ఏకైక చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఇది. తాండవ జలాశయం నిర్మాణం తరువాత 1980లో ఉమ్మడి విశాఖ జిల్లాలో తొలిసారిగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఇక్కడ చేప పిల్లల ఉత్పత్తి, పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికి 40 ఏళ్లుగా జిల్లాలోని పలువురు మత్స్యకారులకు ఇక్కడి నుంచి వివిధ రకాల చేప పిల్లలను ఉత్పత్తి చేస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ కేంద్రం అభివృద్ధిపై ఉన్నతాధికారుల దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తాజాగా ఉత్పత్తి కేంద్రం ఆవరణలోని భవనం కార్యాలయ భవనాలు శిథిలమయ్యాయి. కార్యాలయం అధికారులు ఇందులోనే ప్రవేశించ లేనంత దయనీయంగా భవనాలున్నాయి. వీటి మరమ్మతులు లేదా కొత్త నిర్మాణం కోసం ప్రతిపాదనలు ఇచ్చామని మత్స్యశాఖ క్షేత్రాధికారి నాగమణి తెలిపారు. -న్యూస్‌టుడే, నాతవరం

తునివలస-దండిసురవరం రోడ్డుపై కోతులు

### వానరాలతో వెతలు

**చీడికాడ, న్యూస్‌టుడే:** చీడికాడ మండలంలోని తునివలస- దండిసురవరం ప్రధాన రోడ్డులో కోతుల బెడద ఎక్కువగా ఉంది. వాహనచోదకులు, పాదచారులపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో రాకపోకలకు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. పంటలను పాడు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతులను పట్టి.. అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని రైతులు కోరుతున్నారు.

### కలుషిత నీటితో రోగాలు

**మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే:** చినగొర్రిగెడ్డ గ్రామంలో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయాలని గిరిజన మహిళలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం బిందెలు నెత్తిన పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. క్వారీ ప్రభావిత ప్రాంతంలో ఊటగెడ్డలు ఎండిపోతున్నాయని, బోర్ల నుంచి కలుషిత నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవితాగి అనేక రోగాల బారిన పడుతున్నామని చెప్పారు. మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

### క్షతగాత్రులకు సాయం అందిస్తే రివార్డు

**నాతవరం, న్యూస్‌టుడే:** రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సహకారం అందించే వారికి ప్రభుత్వం రివార్డులు అందించనుందని గ్రామీణ సీఐ రేవతమ్మ పేర్కొన్నారు. చెర్లోపాలెంలో ఆదివారం జాతీయ రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ విషయమై కోర్టు కేసులు, ఇతర ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు సీఐ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ సాయం కోసం ప్రతి ఒక్కరూ స్పందించాలని పేర్కొన్నారు. ఎస్సై తారకేశ్వరరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రామీణ సీఐ రేవతమ్మ

**దేవరాపల్లి:** ఆటోలతోపాటు వివిధ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. పలు వాహనాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

## పిల్లలను బాగా చదివించాలి: అయ్యన్న

ఆర్యవైశ్యుల వన సమారాధనలో ప్రసంగిస్తున్న సభాపతి అయ్యన్న

**నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే:** పిల్లలను బాగా చదివించాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. గౌరీశంకర దేవాలయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చెట్టుపల్లి నిర్వహించిన కార్తిక వన సమారాధనకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చదువుని మించిన ఆస్తి లేదన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులంతా అయ్యన్నను సత్కరించారు. బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో వాసవీ కల్యాణ మండప సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్యవైశ్య కార్తిక వన సమారాధానకు హాజరైన అయ్యన్న ప్రసంగిస్తూ సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద అసంపూర్తిగా ఉండిపోయిన కల్యాణమండపాన్ని పూర్తి చేసేందుకు రూ. 75 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. సంఘ నాయకులంతా పాల్గొన్నారు.

### కలిసి ఉంటే సత్ఫలితాలు..

**చోడవరం, న్యూస్‌టుడే:** ఆత్మీయ కలయిక పేరిట బ్రాహ్మణులంతా ఏకమవుతూ ముందుకు సాగితే సత్ఫలితాలు అందుతాయని సంఘ పెద్దలు పేర్కొన్నారు. ఆదివారం చోడవరం పట్టణానికి చెందిన గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన జరిగింది. సేవాట్రస్టు అధ్యక్షుడు పుట్రేవు శ్యామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కందర్ప కృష్ణమూర్తి, న్యాయవాది కందర్ప రమేష్, మల్లంపల్లి తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

## గంజాయితో సమాజానికి చేటు

**రావికమతం, న్యూస్‌టుడే:** సమాజానికి అత్యంత హానికరంగా మారిన డ్రగ్స్, గంజాయిని పూర్తిగా నియంత్రించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీస్ శాఖ చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర ఆదివారం కొత్తకోట చేరింది. ఎమ్మెల్యేతోపాటు తహసీల్దారు అంబేడ్కర్, సీఐ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి స్వాగతం పలికారు. సభలో యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ పనిచేయాలన్నారు. సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ ముగ్గురు యువకులను అనకాపల్లిలోని రిహాబిటేషన్ సెంటర్‌కు పంపి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా కౌన్సెలింగ్ ఇప్పించినట్లు గుర్తు చేశారు. ఆ యువకులు, వారి తల్లిదండ్రులతో వేదికపై మాట్లాడించారు. అనంతరం సైకిల్ యాత్ర కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, మేడివాడ, గర్నికం, రావికమతం మీదుగా బుచ్చెయ్యపేట మండలంలోకి ప్రవేశించింది. కొత్తకోట, రోలుగుంట, బుచ్చెయ్యపేట ఎస్సైలు శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీనివాసరావు, నాయకులు కొండనాయుడు, నీలవేణి పాల్గొన్నారు.

కొత్తకోటలో యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే రాజు, అధికారులు, పోలీసులు

కండువా వేస్తున్న భాజపా మండల శాఖ అధ్యక్షురాలు సత్యవేణి, చిత్రంలో శ్రీరామ్మూర్తి, పరమేశ్వరావు

### భాజపాలో చేరికలు

**దేవరాపల్లి, న్యూస్‌టుడే:** ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూసేలా.. మన దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్రమోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు నడ్డా ఆధ్వర్యంలో శ్రేణులు కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామ్మూర్తి పేర్కొన్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండలశాఖ అధ్యక్షురాలు అవుగడ్డ సత్యవేణి, జిల్లా ఉపాధ్యక్షులు దొగ్గ ఈశ్వర ప్రసాదు సమక్షంలో ఎం.అలమండలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదివారం భాజపాలో చేరారు. కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల విజయానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు.

అర్ధనగ్నంగా గిరిజనుల డోలీ యాత్ర

### రహదారి నిర్మించరూ..

**రోలుగుంట, న్యూస్‌టుడే:** రహదారి ఏర్పాటు చేయాలంటూ పెదగరువు ఆదివాసీ గిరిజనులు ఆదివారం అర్ధనగ్న డోలి యాత్ర నిర్వహించారు. ఆర్ల పంచాయతీ నుంచి పిత్రగెడ్డ వరకు ఉపాధి హామీ పథకంలో రూ. 4.1 లక్షలతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని పల్లె పండగలో ఈ పనులు ప్రారంభించారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు తెలిపారు. పిక్కరాయి వేసి చదును చేశారని, కల్వర్టుల నిర్మించక తుపాను కారణంగా రహదారి కొట్టుకుపోయిందని తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనం కూడా గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆదివాసీలను కాపాడాలని కోరారు. నాయకులు కొర్రా సుబ్బారావు, కొండబాబు, కామేష్, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయ నిధి అందజేత

**చోడవరం, న్యూస్‌టుడే:** సీఎం సహాయ నిధి బాధిత కుటుంబాలకు ఆర్థిక అండగా ఉంటుందని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. మండలంలోని 11 మందికి రూ. 14 లక్షల చెక్కులను ఆదివారం ఆయన తన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి గౌరీశంకర్, గూనూరు మూలునాయుడు, ఎర్రంశెట్టి చిన్న, పెదబాబు, బర్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

పోస్టుమార్టం విభాగం వైపు నిర్మించిన డ్రైయినేజీ

### ఆసుపత్రి సమస్యలకు మోక్షం

**నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే:** నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో వివిధ సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. దాదాపు రూ.27 లక్షల ఖర్చుతో ఆపరేషన్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ ఆక్సిజన్ పనులు కొలిక్కి వచ్చాయి. ఆక్సిజన్ సిలండర్ల కోసం పరుగులు పెట్టే పని లేకుండా నేరుగా పడకల వద్దకే కనెక్షన్లు ఇచ్చారు. వర్షపునీరు బయటకు వెళిపోయేలా డ్రైయినేజీలను నిర్మించారు. ఆసుపత్రి భవనాలకు రంగులేసే పనులు చేపట్టారు.

## ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం

**చీడికాడ, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆలయాల్లో ఆదివారం కార్తిక మాస సందడి కనిపించింది. పలుచోటల్ల వన సమారాధనలు జరిగాయి. అర్జునగిరి, చీడిపల్లి, వాకపల్లి, తిమిరాం కూడలిలో వెలిసిన ఇందేశమ్మ అమ్మవారి గుడి వద్ద కార్తిక అన్న సమారాధనలు జరిగాయి. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. దండిసురవరంలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది.

గొండుపాలెంలో అయ్యప్ప భక్తుల పూజలు

### గోడప్రతుల ఆవిష్కరణ

**బుచ్చెయ్యపేట:** వడ్డాది కొత్తూరు వీధిలో శ్రీపద్మనాభ సీతారామాలయాన్ని నూతనంగా నిర్మించారు. మూడురోజుల పాటు ప్రతిష్ఠ ఉత్సవాలను భారీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాల గోడ ప్రతులను ఆదివారం హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ తాతయ్యబాబు, నాయకులు రాంబాబు, నారాయణమూర్తి, సన్యాసిరావు, సూరినాగేశ్వరరావు, గోవిందరావు తదితరులు ఆవిష్కరించారు

### వైభవంగా అయ్యప్పస్వామి సన్నిధాన పూజ

**కె.కోటపాడు:** గొండుపాలెం అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్ప సన్నిధానపూజ గురుస్వామి బండారు వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. భారీగా మాలధారులు తరలివచ్చారు.

### ఆలయానికి రూ.లక్ష విరాళం

**మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే:** మాడుగుల మోదమాంబ అమ్మవారికి గాజువాకలో నివాసముంటున్న జక్కుల నాగేశ్వరరావు జ్ఞాపకార్థం అతని సతీమణి నాగమణి, ఇతర కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళంగా అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజుకు ఈ మొత్తాన్ని అందించారు. దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

చౌడువాడలో విద్యార్థుల పుస్తక పఠనం

## నీతి కథలతో మంచి ప్రవర్తన

**కె.కోటపాడు, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యార్థులకు చిన్నవయస్సు నుంచే నీతి కథలు బోధిస్తే మంచి ప్రవర్తన అలవడుతుందని చౌడువాడ గ్రంథ పాలకురాలు పద్మావతి పేర్కొన్నారు. వారోత్సవాల్లో ఆదివారం విద్యార్థులకు సందర్భంగా నీతి కథలు బోధించారు. కుర్చీలాట ఆడించారు. మాడుగుల మండలం కేజేపురం, మాడుగుల గ్రంథాలయాల్లో విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎడ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం,** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీజీనాథ్ ఈ ప్రదర్శన ప్రారంభించారు. సాయంత్రం విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. గొలుగొండ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి వరలక్ష్మి ఆధ్వర్యంలో గంథ్రాలయోద్యమ పితామహుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. మాకవరపాలెం గ్రంథాలయంలో ఉద్యమ నేతల చిత్రపటాలకు పెద్దలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు కుర్చీ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి చంద్రకళ, ప్రధానోధ్యాయుడు ఎంఎస్ఎన్ మూర్తి, పాల్గొన్నారు.

**రావికమతం, రోలుగుంట, న్యూస్‌టుడే:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొత్తకోటలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈవో-2 బ్రహ్మాజీ ఈ పోటీలను పరిశీలించారు. రోలుగుంటలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

నర్సీపట్నంలో పుస్తక ప్రదర్శన

మాడుగులలో విద్యార్థుల కుర్చీలాట

### రైతుల పరపతి పెంచుతాం

**దేవరాపల్లి:** సహకార సంఘాల ద్వారా అన్నదాతల పరపతిని మరింత పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని దేవరాపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ పూడి సత్యారావు పేర్కొన్నారు. దేవరాపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయ ఆవరణలో ఆదివారం జాతీయ సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సహకార రంగానికి చెందిన జెండాను ఆవిష్కరించారు. గీతాన్ని ఆలపించారు. ప్రతిజ్ఞ చేశారు. సంఘ సీఈఓ కనకారావు మాట్లాడుతూ. . తమ సంఘం ద్వారా అందిస్తున్న పథకాలను వివరించారు. భవిష్యత్తులో రైతులు, ప్రజలకు ప్రయోజనం కలిగే మరిన్ని పథకాలు వస్తాయన్నారు. సంఘ పాలకవర్గ సభ్యులు గొంతిన నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు

**దేవరాపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని పెద నందిపల్లిలోని సత్యసాయి వాటర్ ప్లాంటు ఆవరణలో సత్యసాయి శత జయంతి వేడుకలు పండగ వాతావారణంలో జరిగాయి. హైదరాబాదుకు చెందిన సత్యసాయి సేవా సమితి సహకారంతో రావాడ శశిభూషణరావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం నగర సంకీర్తన, బాలల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పుట్టపర్తి నుంచి వచ్చిన గంగాధర శాస్త్రి ఆధ్మాత్మిక ప్రసంగం భక్తుల హృదయాలను హత్తుకుంది. పిల్లల వేషధారణలు ప్రత్యేక అలంకరణగా నిలిచాయి. వాలాబుకు చెందిన గిరిజనులకు దుప్పట్లు, గొడుగులు అందజేశారు. సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ జరిగింది. జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్‌ఛార్జి రవిశంకర్, మహిళా సమన్వయకర్త రాధ, ఇట్లా వెంకటపతి, ఆదిరెడ్డి చిన కన్నబాబురమామణి, మూర్తి మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

**నర్సీపట్నం/ అర్బన్, న్యూస్‌టుడే:** సత్యసాయి శత వర్ష జయంతి వేడుకల్లో భాగంగా భగవాన్ సత్యసాయి భక్తులు ఆదివారం ఉదయం పట్టణంలో సాయి చిత్రపటంతో పల్లకీ సేవను వైభవంగా చేపట్టారు. సాయంత్రం స్థానిక సత్యసాయి మందిరంలో వెలిచేటి ఉమా శంకర్ రచించిన 'సత్యసాయి పద మంజరి' పుస్తకాన్ని అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కరుణాకర్, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపల్లిలో వేషధారణలో బాలలు

(c) eenadu

# పెందుర్తి

సూచనలిస్తున్న ఎస్సై స్వామినాయుడు

## రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉందని ఎస్సై స్వామినాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం తప్పనిసరిగా స్టేషన్‌కు హాజరుకావాలని ఆదేశించారు.

## నేటి నుంచి స్వామిత్వ సభలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈనెల 17వ తేదీన వంగలి, 18న నారపాడు, బోదివలస సచివాలయాల్లో, 19న ఉదయం బంగారమ్మపాలెం సచివాలయంలో, మధ్యాహ్నం అసకపల్లి శివారు ఎరుకునాయుడుపాలెం రామాలయంలో సభలు జరుగుతాయని తెలిపారు.

## వారం రోజులుగా తాగునీరు వృథా

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో చేపట్టిన తవ్వకాల కారణంగా జీవీఎంసీ 97వ వార్డు పరిధి కిశోర్ లే అవుట్ దరి వ్యవసాయ కళాశాలకు వెళ్లే రహదారిలో మంచి నీటి పైపులైను పగిలిపోయింది. దీనికి సమీపంలోనే యూజీడీ పైపులైను ధ్వంసమైంది. మరమ్మతు చేయాలని పనులు చేస్తున్న సిబ్బందిని కోరినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు. వారం రోజులుగా నీరు వృథాగా పోవడంతో పాటు మురుగు నీరు కలిసే ప్రమాదం ఉందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న పాఠకులు

## పుస్తక పఠనంతో మేధో వికాసం

పెందుర్తి, న్యూస్‌టుడే: పుస్తకాలు చదవడంతో మేధో వికాసం పెరుగుతుందని గ్రంథాలయ అధికారిణి బి.చంద్రకళ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పెందుర్తి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జరిగింది. గ్రంథాలయోద్యమ నేతల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త మూర్తి, అభివృద్ధి కమిటీ కార్యదర్శి రామకృష్ణ, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కవి సమ్మేళనం

పరవాడ(సబ్బవరం), సబ్బవరం, న్యూస్‌టుడే: పరవాడ శాఖా గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు కవులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కె.రామారావు, నారాయణరావు వారి కవితలను వినిపించారు. ★సబ్బవరం శాఖా గ్రంథాలయంలో బి.నర్సింహమూర్తి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయ అధికారిణి వి.షిరీష ఆధ్వర్యంలో విజేతగా నిలిచిన టి.తిరువతిస్వామిని ఘనంగా సత్కరించారు.

## సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో పాల్గొన్న పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు అయితి సింహాచలంనాయుడు, తదితరులు

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు అయితి సింహాచలంనాయుడు పిలుపునిచ్చారు. అఖిల భారత సహకార సంఘం 72వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ బి.నగేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని పీఏసీఎస్ ద్వారా అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ చిరికి అవతారం, కార్యదర్శి శంకర్రావు, కొండబాబు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం వచ్చేంతవరకు పోరాటం

సమావేశమైన పార్లుపాలెం, చింతలగ్రహారం రైతులు

పార్లుపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తమ వద్ద నుంచి తీసుకున్న భూములకు తగిన నష్టపరిహారం వచ్చేంతవరకు పోరాటం చేస్తామని పార్లుపాలెం, చింతలగ్రహారం గ్రామాల రైతులు ఆదివారం పార్లుపాలెంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. నష్టపరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించేలా అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్లుపాలెం ఉప సర్పంచి గల్లా వెంకటరమణ, చింతలగ్రహారం మాజీ సర్పంచి పలమరశెట్టి వెంకటరమణ, లక్ష్మీపురం మాజీ సర్పంచి ఆళ్ల తాతారావు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మీ, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పసలమ్మ పండగ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెంలో పసలమ్మ పండగ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్థులంతా డప్పులు, బాణసంచా నడుమ పసలమ్మ అమ్మవారి పుట్టవద్దకు వెళ్లి పూజలు చేశారు. ఇలా చేయడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉండి పశుసంపద వృద్ధి చెందుతుందని భక్తుల విశ్వాసం. ● మల్లునాయుడుపాలెంలో సర్పంచి బోని దేముడమ్మ ఆధ్వర్యంలో పసలమ్మ అమ్మవారి పూజలు జరిగాయి.

## వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.వి.సతీశ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు **అబ్దుల్ హుసేన్** (44) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటారు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో అతని బావమరిది షేక్ మౌలాలీ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలు హెచ్‌సీ డీవీకే స్వామికి అప్పగించారు.









సొంతగడ్డపై ప్రత్యర్థులను స్పిన్‌తో వణికించి, పరుగుల వరదపారించిన టీమ్‌ఇండియానేనా ఇది? భారత్‌కు ఏమైంది? న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనా.. అది ఓ పీడకలలా మరిచిపోదామనుకున్నారు అభిమానులంతా! కానీ మళ్లీ ఓ షాక్.

కివీస్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబాటు తాత్కాలికం కాదని, మన బ్యాటర్లకు అదో బలహీనతగా మారిందని తేటతెల్లమైపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో సఫారీలకు టీమ్‌ఇండియా తలవంచింది. బ్యాటర్లు స్పిన్‌కు దాసోహమన్న వేళ.. తొలి టెస్టులో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. అవమానకర ఓటమిని చవిచూసింది.

# మన స్పిన్ ఉచ్చులో మనమే..

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్‌ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

కోల్‌కతా

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్‌ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

**ఏదో అనుకుంటే...:** ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంత గడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు.

**తడబడ్డారిలా..:** లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్‌ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు.. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా భారత్‌ను హార్మన్ మళ్లీ దెబ్బ తీశాడు. అంతే.. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) ప్రయత్నం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. కుల్‌దీప్ (1), సిరాజ్ (0) వెంటవెంటనే ఔటైపోయారు. గిల్ గాయంతో బ్యాటింగ్‌కు రాకపోవడంతో తొమ్మిదో వికెట్‌కే ఇన్నింగ్స్ ముగిసింది.

హార్మర్ 4/21

**బవుమా.. అమూల్యమైన 55:** అస్థిర బౌన్స్ ఉన్న పిచ్‌పై కెప్టెన్ బవుమా నిలబడి అమూల్యమైన 55 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా (ఓవర్‌నైట్ 93/7).. అనుకున్న దానికన్నా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బవుమా 29తో, బోష్ 1తో ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. బోష్ (25; 37 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్ ఝళిపించడంతో సఫారీ జట్టుకు విలువైన పరుగులు వచ్చాయి. చివరికి బోష్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో 44 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత బవుమా అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. హార్మర్, మహరాజ్‌ను సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: **159**
భారత్ తొలి ఇన్నింగ్స్: **189**
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికిల్టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా నాటౌట్ 55; టోని జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యెన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ (బి) బుమ్రా 25; హార్మర్ (బి) సిరాజ్ 7; కేశవ్ మహరాజ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 11
**మొత్తం:** (54 ఓవర్లలో ఆలౌట్) **153**;
**వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; అక్షర్ 14-0-36-1; కుల్‌దీప్ 8-1-30-2; జడేజా 20-3-50-4; సిరాజ్ 2-0-2-0-2
భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్‌క్రమ్ 31; ధ్రువ్ జురెల్ (సి) బోష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్‌దీప్ ఎల్బీ (బి) హార్మర్ 1; బుమ్రా నాటౌట్ 0; సిరాజ్ (సి) మార్‌క్రమ్ (బి) మహరాజ్ 0; గిల్ ఆబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 1
**మొత్తం:** (35 ఓవర్లలో ఆలౌట్) **93**;
**వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2; హార్మర్ 14-4-21-4; కేశవ్ 9-1-37-2; బోష్ 2-0-14-0; మార్‌క్రమ్ 3-0-5-1

## ఛాంపియన్

డెఫ్లింపిక్స్

# శ్రీకాంత్ పసిడి మెరుపులు

మొర్తజాకు రజతం

మొర్తజా, శ్రీకాంత్

**దిల్లీ:** హైదరాబాద్ కుర్రాడు ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. డెఫ్లింపిక్స్‌తో అతడు స్వర్ణంతో మెరిశాడు. పోటీల తొలి రోజు, ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ధనుష్ ఫైనల్లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలుచుకున్నాడు. అతడు 252.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ మహ్మద్ మొర్తజా వానియా 250.1 పాయింట్లతో రజతం గెలుచుకున్నాడు. అతడు రెండో స్థానంలో నిలిచాడు. మహిళల ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిత్ సంధు రజతం, కోమల్ మిలింద్ కాంస్యం సాధించారు. ఫైనల్లో మహిత్ 250.5 పాయింట్లతో రెండో స్థానం సాధించగా.. కోమల్ 228.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 2022 డెఫ్లింపిక్స్‌లో ధనుష్.. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించాడు. డెఫిలింపిక్స్‌లో స్వర్ణం గెలిచినందుకు శ్రీకాంత్‌కు రూ.1.2 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

హరికృష్ణ

# హరికృష్ణ ఔట్

**పంజిమ్:** ఫిడే ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ కథ ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో అతడు టైబ్రేక్‌లో మార్టినెజ్ అల్కాంటరా (మెక్సికో) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ డ్రా కావడంతో ఈ ఆటగాళ్లు ఆదివారం టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్‌లో తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాతి గేమ్‌లో మార్టినెజ్ విజయం సాధించాడు. నాలుగో గేమ్ డ్రా కావడంతో హరికి ఓటమి తప్పలేదు. భారత్ నుంచి ఒక్క అర్జున్ మాత్రమే ఈ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు.

# 4 పతకాలు ఖాయం

## ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

**గ్రేటర్ నోయిడా:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. బొలోత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రీతి అంతే తేడాతో నిగినా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గగా.. కలెట్‌స్కీ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించడంతో సెమీస్ చేరింది.

# ఝార్ఖండ్ 259/6

**జెంషెడ్‌పూర్:** ఆంధ్రతో రంజీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఝార్ఖండ్ తొలి రోజు ఆట చివరికి మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 259 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్ (115; 209 బంతుల్లో 16×4) సెంచరీ సాధించడం.. కెప్టెన్ విరాట్ సింగ్ (41), ఆదిత్య సింగ్ (29) రాణించడంతో ఒక దశలో 213/3తో బలమైన స్థితిలో నిలిచిన ఝార్ఖండ్.. తర్వాత 31 పరుగుల తేడాతో 3 వికెట్లు చేజార్చుకుంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

పతకాలతో మహిళల డబుల్స్ విజేతలు

# తెలంగాణకు 2 స్వర్ణాలు, రజతం

ముగిసిన జాతీయ పికిల్‌బాల్

**ఈనాడు, బెంగళూరు, బెంగళూరు క్రీడలు, న్యూస్‌టుడే:** జాతీయ పికిల్‌బాల్ పోటీల్లో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరు వేదికగా జరిగిన ఈ టోర్నీకి ప్రియా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ రజతంతో తెలంగాణ.. గుజరాత్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచింది. 21 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో మహారాష్ట్ర మొత్తం 8 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక నాలుగు పతకాలతో రెండో స్థానం సాధించింది. పోటీల సందర్భంగా సబల మిల్లెట్స్ ఉత్పత్తుల పట్ల క్రీడాకారులతో పాటు సందర్శకులు, విద్యార్థులు అమితాసక్తిని ప్రదర్శించారు.

# పాక్ చేతిలో భారత్ ఓటమి

**దోహా:** యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించిన భారత్-ఎ.. తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ చేతిలో 8 వికెట్ల తేడాతో కంగుతింది. మొదట అజీజ్ (3/24), సదాఖత్ (2/12), మసూద్ (2/31)ల ధాటికి భారత్-ఎ 19 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (45; 28 బంతుల్లో 5×4, 3×6), నమన్ ధీర్ (35) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. సదాఖత్ (79 నాటౌట్; 47 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

# ఘనంగా సన్నిధానం పూజ

**కోటనరవ(వేపగుంట), న్యూస్‌టుడే :** అయ్యప్ప సన్నిధానం పూజను కోటనరవలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌరీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షాదారులు హాజరయ్యారు. శబరిమల సంప్రదాయ విధానంలో అర్చకులు ప్రసాద్‌దేవర పూజలు చేశారు. తూర్పుగోదావరికి చెందిన కొండలస్వామి భజన బృందం అయ్యప్ప పాటలతో అలరించింది. అనంతరం స్వాములకు అల్పాహారం వితరణ చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొల్లలపాలెంలో పూజల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

**సబ్బవరం, న్యూస్‌టుడే:** సబ్బవరం మండలం గొల్లలపాలెంలో అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప పీఠం స్వాములు నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్వాములు హాజరయ్యారు.

## లింగాల మల్లికార్జునుడికి అన్నాభిషేకం

**పెందుర్తి, న్యూస్‌టుడే:** జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లో కొలువైన స్వయంభూలింగాల మల్లికార్జున స్వామికి ఆదివారం అన్నాభిషేకం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు పరమేశ్వరుడిని వేదమంత్రాల నడుమ అన్నంతో అభిషేకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

## సీఎస్ఆర్ నిధులతో దోబీఖానా నిర్మాణం

**పరవాడ (పెందుర్తి), న్యూస్‌టుడే:** పరవాడ పెద్ద చెరువుకు దిగువున దోబీఖానా నిర్మాణం ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.8లక్షలతో చేపడుతున్నట్లు సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెదేపా సాంస్కృతిక విభాగం జిల్లా అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పెద్ద చెరువు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధికార ప్రతినిధి బండారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం

**వేపగుంట, న్యూస్‌టుడే:** వేపగుంట పరిధి పవన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రామ్మోహనరావు ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు శనివారం దాడి చేశారు. అదనపు కమిషనర్ హెచ్.వి.మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు దాడి చేసి 40 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను, నిందితుడిని పెందుర్తి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దీనిపై వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

కేంద్రం వద్ద మేనేజర్ శేషు, తదితరులు

**పరవాడ (పెందుర్తి), న్యూస్‌టుడే:** పరవాడ మండలం హస్తినాపురంలో హెరిటేజ్ డెయిరీకి చెందిన నూతన పాల సేకరణ కేంద్రాన్ని ఆ సంస్థ మేనేజర్ కూండ్రపు శేషు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సంస్థ కృషి చేస్తుందన్నారు.






★ ఇంటింటా దీపం వెలిగిస్తే వీధికంతా వెలుగే..

★ బుద్ధిజీవుల్ని ప్రేమించండి.. కానీ మూర్ఖులను ద్వేషించకండి

విరాజిల్లుతున్న చిత్రావతి పరిసరాలు

● వేడుకల్లో భాగంగా ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఆదివారం కలెక్టరేట్లో ఆయన మాట్లాడుతూ 19న ప్రధాని మోదీ, 22న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, 19న ముఖ్యమంత్రి చంద్రబాబు, 18న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రానున్నట్లు తెలిపారు.

## విద్యుత్తు కాంతుల్లో ఆధ్యాత్మిక కేంద్రం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** సత్యసాయి శత జయంతి వేడుకలు తిలకించడానికి భక్తజనం పుట్టపర్తికి తరలివస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంలోకి ప్రవేశించగానే భక్తిభావం ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్తు కాంతుల్లో పుట్టపర్తి పరిసర ప్రాంతాలు విరాజిల్లుతున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. ఆయా ప్రాంతాల్లో పర్యవేక్షణకు వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను నియమించారు.

● తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు 'సాయి 100' యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

# రైల్వే నిఘా మసకబారుతోంది!

➠ సీసీ కెమెరాల పనితీరులో లోపాలు ➠ సతీష్‌కుమార్ హత్యతో బయటపడిన డొల్లతనం

గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని సీసీ కెమెరా

**గుంతకల్లు:** గుంతకల్లు డివిజన్‌లోని రైల్వే స్టేషన్లలో భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మసకబారాయి. వాటిల్లో నిక్షిప్తమయ్యే దృశ్యాలు స్పష్టంగా కనిపించడం లేదు. డివిజన్‌లో 158 రైల్వేస్టేషన్లు ఉన్నాయి. పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరు సరిగా లేదు. దీంతో వివిధ నేరాల్లో ప్రమేయం ఉన్న వారు రైల్వే మార్గంలో వెళ్తున్నా గుర్తించలేని పరిస్థితి తలెత్తుతోంది. కొత్తవి ఏర్పాటు చేయాలని తరచూ ప్రభుత్వ, రైల్వే పోలీసు అధికారులు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

### తక్కువ సామర్థ్యంతో..

స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తక్కువ సామర్థ్యంతో పని చేసేవి కావడంతో గతంలో సివిల్, రైల్వే పోలీసులు దొంగలను గుర్తించలేక పోయిన ఘటనలు ఉన్నాయి. వివిధ కారణాలతో ఇళ్లలో నుంచి తప్పిపోయి స్టేషన్ల పరిసరాలు, రైళ్లలో ఎక్కి వెళ్లే వారిని కనుక్కోవడానికి సైతం కెమెరాలు పెద్దగా ఉపయోగపడటం లేదు.

### సీఐ హత్య కేసులో కీలకమైనా..

ఇటీవల సంచలనం రేకెత్తించిన గుంతకల్లు రైల్వే రిజర్వ్‌డ్ సీఐ సతీష్‌కుమార్ హత్య కేసుకు సంబంధించి సీసీ కెమెరాలు కీలకంగా మారినా దృశ్యాల్లో స్పష్టత లేదని పోలీసులు చెబుతున్నారు. రైల్వే స్టేషన్‌లోకి వెళ్లిన తరువాత ఆయన రైలు ఎక్కే దృశ్యాలు కనిపించలేదు. ఫలితంగా పోలీసు అధికారులు దర్యాప్తునకు అవసరమైన సీసీ ఫుటేజీలను పూర్తి స్థాయిలో సేకరించలేకపోయారు.

### కొత్తవి ప్రారంభించని తీరు

గుంతకల్లు జంక్షన్‌లో పాత సీసీ కెమెరాలకు తోడుగా శక్తివంతమైన కెమెరాలను ఎస్అండ్‌టీ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. వీటిని ఇంకా ప్రారంభించక పోవడం గమనార్హం. అవి అందుబాటులోకి తెచ్చి ఉంటే సతీష్‌కుమార్ హత్య కేసులో ఫుటేజీలు కీలకంగా మారే అవకాశాలుండేవని సర్వత్రా చర్చ జరుగుతోంది.

### నెలాఖరులోపు అందుబాటులోకి తెస్తాం

**- చంద్రశేఖర్, సీనియర్ డీఎస్సీఈ**

పాత కెమెరాల స్థానంలో అత్యాధునికమైనవి ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగా గుంతకల్లు జంక్షన్‌లో 99 వరకు ఏర్పాటు చేశాం. నెలాఖరుకల్లా వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. రైల్వే డివిజన్‌లోని 111 స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

## నాణ్యత చూస్తే... నవ్వి పోదురు

**కూ**డేరులో జాతీయ రహదారి నుంచి జోడు లింగాల సంగమేశ్వ ఆలయం వరకు ఏడాదిన్నర కిందట సుమారు రూ.20 లక్షలతో సిమెంటు దారిని నిర్మించారు. అది ప్రస్తుతం ఎక్కడికక్కడ దెబ్బతింటోంది. కొన్నిచోట్ల కంకర తేలి, గుంతలు పడింది. ఆ దారి మీద రాకపోకలు సాగించే ప్రజలు, భక్తులు రెండేళ్లు కూడా గడవక ముందే నాణ్యత దెబ్బతిందా? అని ఆశ్చర్యపోతున్నారు. ఆ దారి మరింత శిథిలం కాకముందే పంచాయతీరాజ్ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కూడేరు (ఉరవకొండ)**

# నెట్టికంటయ్యకు ప్రగతి కళ

### శరవేగంగా పనులు

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రగతి పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త ఈవో చొరవతో భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి దాతలు రూ.కోట్లలో విరాళాలు ఇవ్వడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఆయా పనులతో స్వామివారి ఆలయ ప్రాంగణం కళకళలాడుతోంది.

నూతన శోభతో స్వామి ఆలయ ప్రాంగణం

### పట్టాలపై మరికొన్ని..

దక్షిణ రాజగోపురం ముందర భక్తుల కార్పొరేషన్ సీసీ ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. తూర్పున ఒక వైపు లడ్డూ తయారీ, ప్రసాదాల కౌంటర్ల గదుల నిర్మాణాలు పిల్లర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోకి వాహనాలు రాకుండా దేవస్థానం ముఖ్య ప్రవేశ పనులు సాగుతున్నాయి. బయటే వాహనాల పార్కింగ్‌కు ప్రణాళిక రూపొందించారు. ఆలయానికి సమీపంలోని పార్కులో ఈవో కార్యాలయం, పరిపాలన విభాగం గదుల నిర్మాణాలు చేపట్టనున్నారు.

### తాజాగా పూర్తయినవి..

ఆలయ పశ్చిమాన, ఉత్తరం వైపు సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఆలయ దక్షిణ రాజగోపురం ఎదురుగా సీసీరోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రాజ గోపురానికి పందిరి గుల వేశారు. ఆలయ పరిసరాల్లో వివిధ జాతుల మొక్కలు నాటించారు. రెండు వారాల కిందట రాజగోపురానికి 18 కలశాలు ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు.

### గుట్టపై భక్తుల వసతి గదుల నిర్మాణం

**- వెంకటేశ్వరుడు, ఏఈవో, కసాపురం ఆలయం**

దాతల సహకారంతో గుట్టపై 91 వసతి గదుల నిర్మాణాలను చేపడుతున్నాం. పనులకు తొందరలో పరిపాలన విభాగం నుంచి అనుమతులు రానున్నాయి. త్వరలోనే విమాన గోపురం, గర్భాలయం, ముఖ మండపం పనులు మొదలవుతాయి.

చెన్నప్పకు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, తదితరులు

## నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

**రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం అనంతపురంలో ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు పర్యవేక్షణలో రాష్ట్ర సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, రమణ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. తొమ్మిది పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా తోటచెన్నప్ప, సహాధ్యక్షుడిగా పి.వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీహరి, బి.నాగరాజు, కార్యదర్శిగా ఎం.పెద్దిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా డి.రాదమ్మ, డి.వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా బి.పక్కీరప్ప, కోశాధికారిగా ఎస్.జాఫర్‌వలి, సభ్యులుగా సాయికుమార్, రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని, వీరంతా మూడేళ్లపాటు సంఘంలో కొనసాగుతారని ఎన్నికల అధికారులు సుబ్రమణ్యం, రమణ తెలియజేశారు.

## కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ నేడు

**జిల్లా సచివాలయం:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ఈనెల 17న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఎప్పటిలాగే కలెక్టర్ కార్యాలయ రెవెన్యూ భవన్‌లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఏ సమస్య అయినా సరే అర్జీ ఇవ్వడానికి రావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే తగిన రసీదు వెంట తీసుకుని రావాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే మీ సమస్య పరిష్కారం ఏమైందన్న విషయాన్ని కూడా నిర్దేశిత వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఈ అర్జీల స్వీకరణలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

# కాలువ గట్టులో మట్టి దందా

### హెచ్చెల్సీకి పొంచి ఉన్న ప్రమాదం

**న్యూస్‌టుడే, బొమ్మనహాళ్**

హెచ్చెల్సీ కాలువ పక్కన మట్టి తవ్వకాలు

**ఆం**ధ్ర సరిహద్దు బొమ్మనహాళ్ సమీపంలో హెచ్చెల్సీ గట్టు పక్కన భారీ ఎత్తున మట్టి తవ్వకాలు కొనసాగుతుండటంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా గట్టుపక్కనుండే కాకుండా తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఆదివారం అధికారులు సెలవుల్లో ఉంటారని దళారులు మరింతగా రెచ్చిపోయి మట్టిని పెద్దమొత్తంలో తవ్వి కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం ఎవరికి వారు తమ పరధిలోకి రాదని మిన్నకుండిపోతున్నారు. ఈ ప్రాంతం తమ పరిధిలో లేదని కర్ణాటక అధికారులు.. మా పరిధిలోకి రాదని స్థానిక అధికారులు.. ఇలా ఒకరిపై మరొకరు పేర్కొంటున్నారు. కనీసం తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలించకపోవడం గమనార్హం.

### గిరాకీ ఉండటంతో..

మట్టికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల కన్ను హెచ్చెల్సీపై పడింది. గట్టు సమీపంలో మట్టి తీయగా ఏర్పడిన పెద్ద గుంతల్లో నీటి ఊట చేరుతుండటం ప్రమాదానికి సంకేతమని రైతులు వాపోతున్నారు. దీనివల్ల కాలువ గట్టు బలహీనపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లలో మట్టి కళ్లముందే తరలిపోతున్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

### అధికారులు ఏమంటున్నారంటే..

హెచ్చెల్సీ కాలువ పక్కన మట్టి తవ్వకం సమాచారం తెలియడంతో ఆదివారం రాత్రి వెళ్లి పరిశీలించి.. నీటిపారుదల అధికారులకు సమాచారం ఇచ్చామని తహసీల్దార్ మునివేలు, ఎస్సై నబిరసూల్ పేర్కొన్నారు. హెచ్చెల్సీ ఏఈఈ అల్తాఫ్ మాట్లాడుతూ కాలువ గట్టు తుంగభద్ర బోర్డు పరిధిలోకి వస్తుందని.. సోమవారం పరిశీలించి.. బోర్డు దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## వంక, ఏరు, చెరువు అన్నీ కాలుష్య ఊబిలోకి!

**పా**రే నీరు నురగలు కక్కుతోంది అంటే అందులో రసాయన వ్యర్థాలు ఎక్కువగా ఉన్నట్లే.. అనంతపురంలో వంకల్లో, వాగుల్లో ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయనేందుకు ఈ చిత్రమే నిదర్శనం. నడిమివంకకు అటు ఇటు ఉంటున్న నివాసాల్లో కొందరు చిన్న, కుటీర పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. రోజువారీ వ్యర్థాలు, ప్లాసిక్ ఆనవాళ్లు ఎక్కువైపోతున్నాయి. అవన్నీ వంకల్లో కలవడంతో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ఇది ముందు ముందు మరింత పెద్ద సమస్య కానుంది. నడిమి వంకలో పారే మురుగు తడికలేరులోకి అట్నుంచి శింగనమల చెరువులో కలుస్తుంది. ఇది ఇలానే కొనసాగితే అనంతపురం జిల్లాలోనే విస్తీర్ణంలో పెద్దదైన శింగనమల చెరువు కాలుష్య కాసారంగా మారే ప్రమాదం ఉంది. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**- న్యూస్‌టుడే, ఆర్కేనగర్ (అనంతపురం)**

అనంతపురంలో ప్రారంభానికి సిద్ధం చేసిన కామన్ సర్వీసు సెంటరు

## 580 కామన్ సర్వీస్ సెంటర్లతో..
# అతివలకు ఆర్థిక దన్ను

➠ ఉమ్మడి అనంతలో ప్రయోగాత్మకం ➠ నెలకు రూ.30 వేల వరకు పొందే వీలు

**అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** మహిళలను లక్ష్యాధికారులు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు డిజి-లక్ష్మి కామన్ డిజిటల్ సేవల ద్వారా ఆర్థిక భరోసా కల్పించనుంది. డిజిటల్ రంగంలో సేవల ద్వారా ఉపాధికి దన్నుగా నిలవనుంది. అర్హులైన, విద్యావంతులైన మహిళలను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా నగర, పట్టణాల్లో గుర్తించి వారే సేవా కేంద్రాలను నిర్వహించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలికల్లో 580 కేంద్రాల్లో కామన్ సర్వీసు సెంటర్లుగా ఏర్పాటు చేయనున్నారు.

### ఇబ్బందులు తొలగిపోయేలా...

అనంతపురం నగరంలో ముందుగా ఒక కేంద్రాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించబోతున్నారు. అశోక్‌నగర్‌లో హరిహర దేవాలయం వెనుక వైపున సచివాలయం 39 ముందు భాగాన ఏర్పాటు చేయబోతున్నారు. ప్రభుత్వం అందించిన డిజి-లక్ష్మి ఆన్‌లైన్ సేవలకు సంబంధించి ప్రత్యేకంగా తయారు చేసి పంపిన కామన్ సర్వీసు సెంటరు సిద్ధం చేశారు. గతంలో ధ్రువపత్రాలు, ఇతర ఆన్‌లైన్ సేవలకు మీ సేవా కేంద్రాల ద్వారా జాప్యం అయ్యేది. ప్రభుత్వం ఆధీనంలోనే కామన్ సర్వీసు సెంటర్లు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని నిర్ణయించారు.

| ప్రాంతం | సర్వీసు కేంద్రాలు |
|---|---|
| అనంతపురం | 122 |
| గుత్తి | 27 |
| గుంతకల్లు | 70 |
| కళ్యాణదుర్గం | 36 |
| రాయదుర్గం | 42 |
| తాడిపత్రి | 41 |
| మొత్తం | 338 |

### ముంగిట్లోనే సేవలు..

★ కామన్ సర్వీసు సెంటర్లలో 250 సేవలు అందివ్వనున్నారు. సేవలు అందించినందుకు రుసుం చెల్లిస్తుండటంతో ఆర్థికంగా నెలకు కనీసం రూ.30 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది.

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వం నుంచి పౌరులకు సేవలు, బీ2బి సర్వీసెస్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, రుణాలు, బీమా, పెట్టుబడులు, చెల్లింపులు తదితరాలు, వ్యవసాయం, ఆరోగ్య సేవలు, చట్టపర సేవలు, పట్టణ ఇ-స్టోర్, పర్యటనలు, ప్రయాణం, ఇ-మొబిలిటీ, నైపుణ్యాభివృద్ధి, విద్య, ఇతర సర్వీసులు కామన్ సెంటర్ల ద్వారా అందజేస్తారు.

## వంతెన పూర్తి.. అవస్థలకు స్వస్తి

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** మండలంలోని గంగిరెడ్డిపల్లి- కొడవండ్లపల్లి మధ్య వంతెన నిర్మాణం పూర్తికావడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. 2021లో తుపాను కారణంగా మద్దిలేరువాగు ఉద్ధృతికి వంతెన ధ్వంసం కావడంతో నాలుగేళ్లుగా ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. దీనిపై 'ఈనాడు'లో 'వంతెన వెతలు తీరేదెన్నడో', 'అడుగడుగునా నిర్లక్ష్యం..గతితప్పిన లక్ష్యం', 'వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఆగిన వంతెన నిర్మాణం', శీర్షికలతో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.2.97 కోట్లతో వంతెన నిర్మించింది. రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# కనకదాస జీవితం ఆదర్శనీయం

**హిందూపురం, న్యూస్‌టుడే:** కురుబ సామాజిక వర్గానికి దైవంగా నిలిచిన కనకదాస జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి అన్నారు. ఆదివారం హిందూపురంలో కనకదాస జయంతి వేడుకల్లో భాగంగా వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బీసీలను అక్కున చేర్చుకొన్న ఘనత తెదేపాకు దక్కుతుందన్నారు. ప్రస్తుతం కురుబ సామాజిక వర్గానికి చెందిన వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారం అని మంత్రి సవిత అన్నారు. కాపరులకు, గొర్రెలకు బీమా సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ర్యాలీలో తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యదర్శి బాలాజీ, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.



జయంతి వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, చిత్రంలో మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి తదితరులు

### ప్రపంచం గుర్తించేలా పురం అభివృద్ధి చేస్తా ..

ప్రపంచం గుర్తించేలా హిందూపురాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. రూ.92.50 కోట్లతో పట్టణంలో చేపట్టే మౌలిక సదుపాయాల పనుల పైలాన్‌ను బాలాజీ కూడలిలో ఆయన ఆవిష్కరించారు. హిందూపురం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారని, నియోజకవర్గానికి త్వరలో పరిశ్రమలు వస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

Received Best Innovation and Creativity School Award in Andhra Pradesh from the Honorable Governor, his Excellency S. Abdul Nazeer garu.

MONTESSORI ELITE E.M SCHOOL
(Affiliated to CBSE, New Delhi.)
Gollapalli (V), Rapthadu (M), Anantapur (Dt)-515672
Contact : 8340038384
MONTESSORI ELITE JUNIOR COLLEGE
Empowering Young Minds For Tomorrow
Jesus Nagar, Ananthapuramu.



ప్రకటన

సమాచారం ఇవ్వకుండా జరిగిన అనధికార తవ్వక పనుల కారణంగా మా థింక్ గ్యాస్ 125mm MDPE పైప్‌లైన్ దెబ్బతింది. అయితే మా త్వరిత స్పందన వల్ల థింక్ గ్యాస్ ఎమర్జెన్సీ టీమ్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గ్యాస్ లీకేజిని నియంత్రించి దెబ్బతిన్న పైప్‌లైన్‌ను సురక్షితంగా పునరుద్ధరించారు.

దెబ్బతిన్న చోట పైప్‌లైన్ ఇండికేషన్ టైప్-1 మార్కర్లు మరియు 0.5 మీటర్ల లోతులో వార్నింగ్ మ్యాట్ సముచితంగా అమర్చబడి ఉన్నాయి. అయినప్పటికీ తవ్వకం చేసిన థర్డ్‌పార్టీ ఈ భద్రతా సూచనలను పట్టించుకోకుండా తవ్వకాన్ని కొనసాగించడం వల్ల ఈ ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది.

థింక్ గ్యాస్ ఎమర్జెన్సీ టీమ్ త్వరితగతిన స్పందించి, గ్యాస్‌లీకును నియంత్రించి, దెబ్బతిన్న పైప్ సెక్షన్‌ను తప్పి మరమ్మతులు చేసి పైప్‌లైన్‌ను పునరుద్ధరించి, గ్యాస్ సరఫరాను అత్యంత వేగంగా తిరిగి ప్రారంభించింది.

థింక్ గ్యాస్ ఎల్లప్పుడూ భద్రతకు ప్రాధాన్యత ఇస్తుంది. తవ్వక పనులు ప్రారంభించే ముందు "డయల్ బిఫోర్ యూ డిగ్" విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని మేము తరచూ సూచిస్తున్నాము. ఏదైనా తవ్వక పనులు ప్రారంభించే ముందు తప్పనిసరిగా మా ఎమర్జెన్సీ టోల్-ఫ్రీ నంబర్ 1800-2022-999ను సంప్రదించాలని కోరుకుంటున్నాము.

ఈ విధంగా భద్రతా చర్యలు పాటించకుండా జరిపే తవ్వకాలు తీవ్రమైన ప్రమాదాలకు దారితీసి ఆస్తి నష్టం, గాయాలు లేదా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.

ఈ విధమైన నిర్లక్ష్యపూరిత చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలతో పాటు శిక్షార్హ మైనవి.

- Think Gas యాజమాన్యం, అనంతపురం
- Advertisement



సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

## పంపనూరుకు పోటెత్తిన భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరుడు

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. యాగ మండపంలో హోమాలను చేయించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. రాష్ట్రంలో జరిగిన పలు ఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులను దర్శనానికి పంపారు. క్యూలైన్లు ఎక్కువగా ఉండటంతో భక్తులకు దర్శనం సులువుగా అయినప్పటికి 2 గంటలకు పైగా సమయం పట్టింది. ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంతాలతో పాటు ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. భక్తుల రద్దీ కారణంగా 108 ప్రదక్షిణలు, పాలాభిషేకాలు, అర్చనలు, పల్లకీసేవలను నిలిపివేశారు. వచ్చే మంగళవారం ఈ పూజాసేవలు భక్తులకు అందుబాటులో ఉండవని ఈవో బాబు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు రాహుకాలంలో హోమాలను నిర్వహిస్తామన్నారు.

# కృష్ణదేవరాయా.. సెర్చ్‌కే పరిమితమా?

◆ నియామకం కాని మూడో కమిటీ ◆ ఇన్‌ఛార్జి పాలనలోనే వర్సిటీ

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 16 నెలలుగా ఇన్‌ఛార్జి ఉపకులపతి పాలన కొనసాగుతోంది. కొత్త వీసీ నియామకానికి సెర్చ్ కమిటీది కీలకపాత్ర. రెండుసార్లు కమిటీలు ఎంపికయ్యాయి. ఉపకులపతి నియామకం మాత్రం జరగలేదు. వివిధ కారణాలతో రెండు సార్లు సెర్చ్ కమిటీలు రద్దు అయ్యాయి. మూడోసారి నియమిస్తేనే ప్రక్రియ కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జి వీసీలు నియమితులయ్యారు. అదే క్రమంలో గతేడాది జులై 18న ఎస్కేయూ ఎంబీఏ విభాగానికి చెందిన ఆచార్య అనిత ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆరు నెలల్లోనే ఇతర వర్సిటీలకు రెగ్యులర్ ఉపకులపతులు నియామకం జరగగా.. కేవలం రెండు విద్యాలయాలకు భర్తీ చేయలేదు. అందులో ఎస్కే ఒకటి కావడం గమనార్హం.

● మొదటి సారి 2024లో సెర్చ్ కమిటీ నియమించారు. అప్పట్లో పలువురు ఉపకులపతి పదవికి దరఖాస్తు చేశారు. వాటిని పరిశీలించిన తరువాత నియామక ప్రక్రియ ఆగిపోయింది.

● రెండోసారి జులై, 3న కొత్త సెర్చ్ కమిటీ నియమించారు. ఇందులో రాయ్‌పూర్ ఐఐఎంకి చెందిన రామకుమార్ కాకాని, గీతం విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య శివప్రసాద్, లక్నో వర్సిటీ వీసీ అలోక్ కుమార్‌రాయ్ ఉన్నారు. అందులో ఓ సభ్యుడు కమిటీ నుంచి తప్పుకున్నారు. దీంతో మూడోసారి కమిటీ నియమించాల్సిన అవసరం ఏర్పడింది. సాధారణంగా కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఒక సభ్యుడిని వర్సిటీ పాలకమండలి ఎంపిక చేస్తుంది. మరో సభ్యుడిని ప్రభుత్వం, మూడో సభ్యుడిని యూజీసీ నియమిస్తుంది. వారి దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు అభ్యర్థులను ఉపకులపతి పదవికి సిఫారసు చేస్తారు. వారి పేర్లను ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుంది. గవర్నర్ ఆమోదంతో ఒకరు ఉపకులపతిగా నియమితులవుతారు.

### ఆశావహుల పోటీ

ఎస్కేయూ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు మొత్తం 11 మంది పదవిని ఆశిస్తున్నారు. వీరే కాకుండా ఇతర వర్సిటీ ఆచార్యులు కూడా పదవి కోసం దరఖాస్తు చేసుకొన్నట్లు సమాచారం. వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు తమ వర్గానికే వీసీని నియమించాలని కోరుతున్నారు.

● అకడమిక్ అంశాలు, పరిశోధనలు, ప్రగతి పనులు.. వంటివి రెగ్యులర్ వీసీ నియామకంతో ముడిపడి ఉన్నాయి. పాలనలో కొత్త విధానాలు అమలులోకి వస్తాయి.

## ప్రధాని పర్యటనకు పకడ్బందీ భద్రత

అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో డీఐజీ షిమోషి

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు ఈనెల 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో సమన్వయంతో భద్రత నిర్వహించాలని పోలీస్ అధికారులకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. పుట్టపర్తికి ఈనెల 19న ప్రధాని, 22, 23న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వస్తుండటంతో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన 17 జిల్లాల పోలీస్ అధికారులతో ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రముఖులు వచ్చే విమానాశ్రయం నుంచి కాన్వాయ్ వెళ్లే రోడ్డుమార్గం, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్‌లను, సాయికుల్వంత్ మందిరం, హిల్‌వ్యూ స్టేడియం రూట్‌మ్యాప్‌ను అధికారులకు చూపిస్తూ భద్రతా ఏర్పాట్లను వివరించారు.

● ఏమైనా సమస్యలుంటే కమాండ్ కంట్రోల్ రూంల ద్వారా తెలుసుకోవాలన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా 340 సీసీ కెమెరాలు, ఏఎన్‌పీఆర్ కెమెరాలతోపాటు నైట్‌డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరినీ డీఎఫ్‌ఎండీ ద్వారా తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల నుండి వచ్చిన ఐపీఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.


## SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్: డి.నెం. 4-56, ప్లాట్ నెం. 59, 2వ అంతస్తు, విద్యుత్ నగర్, అనంతపూర్.

### లాంఛనాత్మక స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సీఎల్‌టీ బెంచ్-II చెన్నై, తేది: 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ ద్వారా) శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3తో చదువుకోవల్సిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు డిమాండ్ నోటీసులలో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన రుణ గ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు. వాటి వివరాలు దిగువ పట్టికలో పేర్కొనబడినవి.

ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనారు, కావున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవల్సిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 11 నవంబర్ 2025న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకోవడమైనది.

| ఋణగ్రహీత & హామీదారు యొక్క పేరు మరియు చిరునామా | డిమాండ్ నోటీసు ప్రకారం బకాయియున్న మొత్తం : |
|---|---|
| 1) తలారి రవికుమార్, తండ్రి : టి. సూర్యనారాయణ, వయస్సు : 33 సం॥లు, నివాస చిరునామా : డి.నెం. 7-165, గుజ్జల శారదాదేవి నగర్, బుక్కరాయసముద్రం, అనంతపూర్ జిల్లా – 515001. 2) తలారి రమణమ్మ, భర్త: తలారి ఆదినారాయణ, వయస్సు : 45 సం॥లు, నివాస చిరునామా : డి.నెం. 7-165, గుజ్జల శారదాదేవి నగర్, బుక్కరాయసముద్రం, అనంతపూర్ జిల్లా – 515001. 3) డి. సురేష్, తండ్రి : డి. వందరప్ప, వయస్సు : 32 సం॥లు, నివాస చిరునామా : డి.నెం. 1-82, ఎస్.సి. కాలనీ, మీనాహళ్లి, కనేకల్, అనంతపూర్ జిల్లా – 515871. | రుణ ఖాతా నెం. ANAN2TF2303110005 ద్వారా రూ. 37,51,855/- (అక్షరాలా ముప్పై ఏడు లక్షల యాభై ఒక్క వేయి ఎనిమిది వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే) చెల్లించాలి. లోన్ అమౌంట్ : రూ. 25,00,000/-. డిమాండ్ నోటీసు తేది : 25-06-2025. |

ఆస్తి వివరములు : అనంతపురం రిజిస్ట్రేషన్ జిల్లా, అనంతపురం సబ్ డిస్ట్రిక్ట్, ఉప్పరపల్లి గ్రామ పంచాయితీ, ఉప్పరపల్లి గ్రామ ఫీల్డ్స్, సర్వే నెంబర్ 106/3సి వద్ద ప్లాట్ నెంబర్లు 10, 11, 12 మరియు 13కి చెందిన పికి, ఎకరా 1.14 సెంట్లు, పికి, ఎకరా 0.57 సెంట్లు, పికి ఎకరా 0.11.86 సెంట్లు లేదా 0.048 హెక్టార్లు విస్తీర్ణంలోని ఆస్తి. హద్దులు : తూర్పు : మిగిలిన భూమి, పడమర : 20 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం. 9, దక్షిణం : మిగిలిన భూమి. పైన తెలిపిన సరిహద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు ఉత్తరం వైపున 43.6 చ॥అ॥లు లేదా 13.29 చ॥మీటర్లు, దక్షిణం వైపుకి 30.10 చ॥అ॥లు లేదా 9.18 చ॥మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణంకు తూర్పు వైపున 123.81 చ॥అ॥లు లేదా 37.76 చ॥మీటర్లు, పడమర వైపుకి 132.6 చ॥అ॥లు లేదా 40.44 చ॥మీటర్లు మొత్తం కొలతలు 571.1 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ ప్లాట్స్ దానికి చెందిన అన్ని ఈజ్‌మెంటరీ హక్కులు మరియు స్థలములోని సౌలభ్య హక్కులతో సహా.

ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమంతటికి ఇందుమూలంగా హెచ్చరిక చేయునది ఏమనగా ఎస్.ఎఫ్.ఎల్. యొక్క అధీకృత అధికారి పైన తెలిపిన స్థిరాస్తి చట్టబద్ధ సూచనాత్మక స్వాధీన చేపట్టినందున, ఈ నోటీసు అందిన తర్వాత ఎస్.ఎఫ్.ఎల్. యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరేవిధంగానైనా లావాదేవీ జరపడం ద్వారా బదిలీ చేయడం / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : అనంతపురం
తేది : 11-11-2025

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


## బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పోటీలకు ఎంపికైన బేస్‌బాల్ జట్టు

**అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే:** పాఠశాల క్రీడల అండర్-17 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. ఆర్డీటీ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుహాసిని, సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి గాయత్రి, మాజీ కార్యదర్శి వెంకటేష్, పీడీలు ప్రభాకర్, గోపాలరెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, పక్కీరయ్య, రమేష్, శివ, రాజశేఖర్‌రెడ్డి, సంజీవరాయుడు తదితరుల సమక్షంలో జట్లను ఎంపిక చేశారు.

**ఎంపికైన జట్ల వివరాలు ఇలా...**

**సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు:** బాలు, భరత్‌సింగ్ నాయక్, ప్రణీత్, సాయి రాజ్, ఖాసీం, కుల్‌శేఖర్, దినేష్‌నాయక్, మునీంద్ర, గణేష్, తరుణ్ కుమార్, వేదవ్యాస్, శరత్ కుమార్, వశీంద్రనాథ్ రెడ్డి, అజయ్, జె.యాదవ్, దీక్షిత్ రెడ్డి, రాజేష్.

**బాలికల జట్టు:** చందన, అంజలి, మైనావతి, పల్లవి, సుకన్య, రాధిక, నందిని, హేమలత, లక్ష్మీదేవి, శ్రావణి, అమని, లలితప్రియ, జననీ, హారిక, పూజితాంజలి, లలిత.

**బేస్‌బాల్ బాలుర జట్టు:** స్టీఫెన్, నౌషాద్, జగన్‌మోహన్ రెడ్డి, శాంత్‌సాయి, లోహిత్ కుమార్, శివానంద, సందీప్, సంతోష్, రాహుల్, ప్రవీణ్, హుస్సేన్ వలి, రాజశేఖర్, శివసాయి, రామచేంద్ర, సంతోష్, ధరణి.

**బాలికల జట్టు:** పూర్ణిమ, వెన్నెల, కరీనా, సింధు, లిఖిత, చైతన్య, అక్షయ, తేజశ్రీ, అంజలి, తబస్సుం, రిషిత, నస్రీన్, ప్రత్యూష, జానూ, జ్యోత్స్న.

## ఎన్టీఆర్.. దైవాంశ సంభూతుడు : ఎమ్మెల్యే బాలకృష్ణ

బాలకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే సింధూర, తదితరులు

**సోమందేపల్లి, పెనుకొండ:** ఎన్టీఆర్ మనిషి కాదు.. కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దైవాంశ సంభూతుడని ఆయన తనయుడు, ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సోమందేపల్లిలో నెలకొల్పిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు తండ్రి మాత్రమే కాదు.. గురువు, దైవంతో సమానమని చెప్పారు. రాజకీయాల్లో అడుగుపెట్టిన 9నెలల్లోనే అధికారం చేపట్టి.. పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడంతో నిలిచారన్నారు. ఎమ్మెల్యేగా మూడుమార్లు గెలిపించి, చరిత్ర సృష్టించిన హిందూపురం ప్రజలకు రుణపడి ఉంటానని, నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తుండటంతో ప్రజలు ఆదరిస్తున్నారని ఆయన చెప్పారు. ఒక్క ఛాన్స్ అని వైకాపాకు అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని, మళ్లీ తెదేపాకు ప్రజలు పట్టం కట్టి అండగా నిలిచారని, రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. బాలయ్యతోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు ఎమ్‌ఎస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, స్థానిక నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు తదితరులను మంత్రి సవిత ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలను అందజేశారు.

## పర్యాటక ప్రదేశంగా కుందుర్పమ్మ కొండ

**కుందుర్పి:** కుందుర్పి గ్రామదేవత కుందుర్పమ్మ కొండను పర్యాటక ప్రదేశంగా మార్చేందుకు చర్యలు తీసుకున్నట్లు ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల పురావస్తు శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆ శాఖ ఏఈ పీడీ సత్యనారాయణ, ఇతర అధికారులతో కలిసి కుందుర్పమ్మ కొండను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతపురం అధికారులు, గ్రామస్థులతో కలిసి కుందుర్పమ్మ కొండ ఎక్కుతూ.. నూతన మెట్లమార్గం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు.

## సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ప్రశాంతం

**అనంత గ్రామీణం:** జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఆదివారం ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో 9 పదవులకు ఎన్నికలు జరిగాయి. ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా.. ఆరు మంది బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికయ్యారు. జిల్లా సహకార శాఖ అధ్యక్షుడిగా బి.మల్లరాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.స్రుజన్, ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్, కార్యదర్శిగా ఎస్.కుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.రమేష్‌బాబు, ఆర్.రమణ మాధవి, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు, క్యాడర్ కార్యదర్శులుగా ఎం.నరసింహమూర్తి, ఎం.లతీఫ్‌లు ఎన్నికయ్యారు.

## పారిశ్రామిక హబ్‌గా అనంతపురం

◆ చంద్రబాబు, లోకేశ్ అహర్నిశలు కృషి ◆ తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆదినారాయణ, నాగరాజు, నారాయణస్వామి

**రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** అనంతపురం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు అందుకు ముఖ్య ఉదాహరణ అని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరం రాంనగర్‌లోని జిల్లా తెదేపా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గంజినాగరాజు, రాష్ట్ర కురుబ సాధికార సమితి సభ్యుడు నారాయణస్వామిలతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెన్యూపవర్, జైట్ ప్యూచర్, ఏసీఎంఈ ఉత్పత్తి, సెరెంటికా వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. పెట్టుబడులతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వైకాపా ప్రభుత్వ దుర్మార్గాలతో కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలి పోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, సీఎంపై ఉన్న నమ్మకంతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారన్నారు. పరిశ్రమల రావడంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు.


EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

REAL ESTATE

PLOT FOR SALE

**ఉరవకొండ నందు** అనంతపురం - బళ్లారి హైవే ప్రక్కన కస్తూరిబా స్కూల్ ముందర DTCP అప్రూవల్ 40x55 సైజ్ గల 15 ప్లాట్లు అమ్మబడును. Cont: 9440006008.

JOBS

**కావలెను:** M.G.B Mobiles (మహీంద్రా కార్ షోరూమ్) నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసినవారు కావలెను. ఆటోమొబైల్ సేల్స్ నందు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకొనవచ్చును. సంప్ర: 8333929186.

**అనంతపురంలో కీర్తి** సోలార్ నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్ర॥ Cell: 84668 87348.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

: వివరాలకు :
8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును



## SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032
బ్రాంచి ఆఫీస్: డి.నెం. 20/342, టీవియస్ షోరూమ్ పైన, 1వ అంతస్తు, బళ్ళారి రోడ్డు, గుంతకల్.

### లాంఛనాత్మక స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, ఎన్‌సీఎల్‌టీ బెంచ్-II చెన్నై, తేది: 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ ద్వారా) శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. [illegible] ... సంతకందారు 12 నవంబర్ 2025న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకోవడమైనది.

| ఋణగ్రహీత & హామీదారు యొక్క పేరు మరియు చిరునామా | డిమాండ్ నోటీసు ప్రకారం బకాయియున్న మొత్తం : |
|---|---|
| 1) షేక్ బాషా, తండ్రి : ఎస్. ఖాసిం, వయస్సు: 38 సం॥లు ... [illegible] ... అనంతపూర్ జిల్లా – 515401. 2) షేక్ ... [illegible] ... – 515401. 3) ... [illegible] ... – 515401. | రుణ ఖాతా నెం. GNTKLTF2403290002 ద్వారా రూ. 42,79,928/- ... [illegible] ... లోన్ అమౌంట్ : రూ. 30,00,000/-. డిమాండ్ నోటీసు తేది : 25-06-2025. |

ఆస్తి వివరములు : [illegible]

ప్రదేశం : గుంతకల్లు
తేది : 12-11-2025

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


## ఆలయ సమాచారం

**కదిరి, న్యూస్‌టుడే:** శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(సోమవారం) ఉదయం పది గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణం నిర్వహిస్తారు. స్వామి దర్శనం ఉదయం 6 గంటలకు ఉంటుంది. 7 గంటల నుంచి 9 మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 9 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది.

## సంతల ఆదాయం రూ.3.43 లక్షలు

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే :** అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం 3,43,550 ఆదాయం వచ్చింది. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ. 2,07,350 ఆదాయం రాగా, ఆదివారం జరిగిన పశువుల సంతలో రూ. 1,36,200 ఆదాయం వచ్చిందని, వచ్చిన ఆదాయ సొమ్మును సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు.

## సాఫీగా సాగేలా..

హైదరాబాద్ బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారిలో పుట్టపర్తికి వెళ్లాలంటే మామిళ్లపల్లి నుంచి ధర్మవరం మీదుగా పుట్టపర్తి వెళ్లాలి. మామిళ్లపల్లి నుంచి ధర్మవరం రోడ్డులో చాలాచోట్ల పెద్ద గుంతలున్నాయి. సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు వాహనదారులకు పూర్తిగా అసౌకర్యంగా ఉంటోంది. అందువల్ల గోతులు పడిన చోట పూర్తిగా పొక్లెయిన్‌తో తవ్వి కొత్తగా రోడ్డు వేసున్నారు. – ఈనాడు అనంతపురం

## 19, 20, 21 తేదీల్లో దివ్యాంగుల పింఛన్ పునఃపరిశీలన వాయిదా

**అనంత సంక్షేమం, న్యూస్‌టుడే:** సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా ఈనెల 19, 20, 21 తేదీల్లో దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలన వాయిదా వేసినట్లు పీడీ శైలజ తెలిపారు. ఆయా తేదీల్లో సదరం క్యాంపులకు హాజరు కావాలని నోటీసులు పొందిన వారు హాజరుకావాల్సిన అవసరం లేదని తదుపరి తేదీలను నోటీసుల ద్వారా అందజేస్తారన్నారు. ఈ నెల 23న సత్యసాయి శతజయంతి వేడుకలకు వచ్చే వీఐపీలు, భక్తులకు వైద్య సేవలు అందివ్వడానికి ప్రత్యేక వైద్యులు అందరూ సేవలు అందివ్వడానికి పుట్టపర్తికి వెళ్లనున్నారన్నారు. అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం ప్రాంతాల్లో జరిగే వైకల్య పునఃపరిశీలన వాయిదా వేశారు.

## విమర్శిస్తే దాడులు చేస్తారా? : వైకాపా

పెనుకొండలో రోడ్డుపై బైఠాయించిన వైకాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, పార్టీ శ్రేణులు

**హిందూపురం పట్టణం, పెనుకొండ, అనంతనగరపాలక:** ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, విమర్శిస్తే దాడులు చేస్తామంటే ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఏ పాటిదో అర్థం అవుతుందని అనంతపురం జిల్లా వైకాపా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ధ్వజమెత్తారు. వైకాపా కార్యాలయంపై తెదేపా నాయకుల దాడులను నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు ఆదివారం హిందూపురానికి రావడానికి ప్రయత్నించారు. అయితే పట్టణ శివార్లలో పోలీసులు ప్రత్యేక పికెట్లను ఏర్పాటు చేసి అడ్డుకొన్నారు. అనంత వెంకట్రామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తదితరులను డీఎస్పీ మహేశ్ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని కొట్నూరు ఇందిరమ్మ కాలనీ వద్ద నిలిపివేశారు. వారు పోలీసులతో వాదనకు దిగారు. అక్కడే నిరసనకు దిగారు. వైకాపా శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీతో పాటు ఇతరులను పట్టణానికి రాకుండా పెనుకొండ వద్ద పోలీసులు అడ్డుకొన్నారు. హిందూపురం నాయకులు మాత్రం పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దీపికా ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. బాలకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

అనంత వెంకట్రామిరెడ్డిని వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

## సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

**అనంత సంక్షేమం, న్యూస్‌టుడే:** వెనుకబడిన తరగతుల వారికి సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఖుష్బూ కొఠారి తెలిపారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. పూర్తి వివరాలకు 95502 50770 నంబరును సంప్రదించాలని సూచించారు.

## హంద్రీనీవా కాలువలో వైద్యుడి గల్లంతు

కార్తిక్ కుమార్ రెడ్డి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఈత కోసం నీటిలో దిగి వైద్యుడు గల్లంతయిన ఘటన మండలంలోని పంపనూరు హంద్రీనీవా కాలువలో ఆదివారం చోటు చేసుకుంది. బెళుగుప్ప మండలం ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న కార్తిక్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కార్తిక మాసం సందర్భంగా వనభోజనాలకు పంపనూరు నగరవనంలోకి వచ్చాడు. ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకొని నగరవనంలో మధ్యాహ్నం భోజనాలు చేశాడు. అనంతరం మధ్యాహ్నం 2గంటల సమయంలో పంపనూరు సమీపంలోని హంద్రీనీవా కాలువలోకి కుటుంబ సభ్యునితో కలసి వెళ్లి సరదాగా ఈతకు దిగాడు. కాలువ మధ్యలో ప్రవాహం ఎక్కువగా ఉన్నా అలానే ముందుకు వెళ్లసాగాడు. గమనించిన కుటుంబ సభ్యుడు వెంటనే నీటిలో నుంచి బయటకి వచ్చి కార్తిక్‌ని బయటకు రావాలని అరిచాడు. అప్పటికే కార్తిక్ కుమార్ రెడ్డి నీటిలో కొట్టుకుపోయాడు. కార్తిక్ కుమార్ రెడ్డి స్వగ్రామం బెళుగుప్ప మండలం దుద్దేకుంట కాగా అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తుంది. ఇతని కోసం ఆత్మకూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించారు.

భర్త గొంతు కోసిన ఘటనలో...

## చికిత్స పొందుతూ భార్య మృతి

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి గ్రామంలో ఐదు రోజుల కిందట అనుమానంతో క్షణికావేశంలో భార్య రత్నమ్మ గొంతు కోసిన భర్త ఎర్రిస్వామికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించగా.. ఆమె అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఆ ఉపాధ్యాయ సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని నిబంధనలు పెట్టారని, డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులతో టెట్ రాయించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రమణయ్య, రామప్ప, ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, సంజీవ్‌కుమార్, రాముడు పాల్గొన్నారు.

సమావేశంలో యూటీఎఫ్ నాయకులు

# రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

## పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

**రాయదుర్గం, ఉరవకొండ, న్యూస్‌టుడే:** పుస్తక పఠనంతో ఉత్తమ వ్యక్తిత్వ వికాసం అలవడుతుందని రాయదుర్గం గ్రంథాలయాధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానికంగా ఉద్యమకారులకు నివాళి అర్పించి మాట్లాడారు.

★ గ్రంథాలయాల ద్వారానే సామాజిక జ్ఞాన సముపార్జన సాధ్యమవుతుందని ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గ్రంథపాలకుడు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తలారి గోపాల్, పాలాక్షి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవుల అభ్యున్నతికి కృషి

వీరశైవ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌తో స్థానిక నాయకులు

**కణేకల్లు, న్యూస్‌టుడే:** వీర శైవులను ఓబీసీ జాబితాలో చేర్చేలా కృషి చేయాలని వీరశైవ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్నకు నాయకులు విన్నవించారు. ఆదివారం దుర్గా ఆలయంలో ఛండీహోమ కార్యక్రమానికి వచ్చిన ఆమెను అఖిల భారత వీరశైవ సంఘం సభ్యుడు మరియప్ప దంపతులు ఘనంగా సత్కరించారు. ఆ సంఘం నాయకులు మృత్యుంజయ, శరబనగౌడ, పెండేకల్లు నాగరాజు పాల్గొన్నారు.

## పూర్వ వైభవం తీసుకురావాలి

పనులు ప్రారంభించిన కమిటీ ఛైర్మన్ వీరాంజనేయులు, గ్రామస్థులు

**కంబదూరు, న్యూస్‌టుడే:** తిమ్మాపురం ఉన్నత పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని పాఠశాల కమిటీ ఛైర్మన్ వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన సొంత ఖర్చుతో ఆవరణలో శుభ్రత పనులు చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. గ్రామస్థులు, పూర్వ విద్యార్థులతో మమేకమై పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ పైడిపాటి హనుమకుమారి, మాజీ ఎంపీటీసీ సువర్ణమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు మారెప్ప, రామదాసప్ప, హనుమంతరాయుడు, తిప్పేస్వామి, రమేష్, నాగరాజు, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

## గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం

**న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

సాధారణ వ్యక్తులను అసాధారణ వ్యక్తులుగా మార్చే.. విద్యార్థుల్లో లక్ష్యం కలిగేలా చేసి విజయ తీరాలకు చేర్చే ఆలయమే గ్రంథాలయం. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచేందుకు ఇవి ఎంతో దోహదపడుతున్నాయి. పాఠ్య పుస్తకాలతోపాటు పత్రికల పఠనంతో వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్యం, సృజనాత్మక ఆలోచనలు, విజ్ఞాన వికాసం కలుగుతోంది. గ్రంథాలయ వారోత్సవాల్లో విషయ పరిజ్ఞానంతోపాటు గొప్పవారి జీవిత చరిత్రలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేస్తున్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథపాలకులు శ్రీనివాసులు తెలిపారు.

పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

### ఆంగ్లంపై పట్టుకు శ్రమిస్తున్నాం

నిత్యం గ్రంథాలయానికి వచ్చి దినపత్రికలతోపాటు పుస్తకాలు చదువుతున్నాం. ఆంగ్లభాష నేర్చుకోవడంపై ఆసక్తి చూపిస్తున్నాం. తెలియని విషయాలు తెలుసుకొంటున్నాం. ఎంతో విజ్ఞానాన్ని పొందుతున్నాం. **- రేవంత్, యాసిన్, విద్యార్థులు**

### పుస్తకాలు చదవడం నేర్చుకొంటున్నాం

పాఠశాలలో నేర్పే పాఠాలతోనాటె పత్రికలు, పుస్తకాలు చదువుతున్నాం. కథలు, పాటలు, ఆటలతో బోధన చేస్తుండటంతో ఉపయోగకరంగా ఉంటోంది. పత్రికలంటే ఏమిటో, వాటిలోని విజ్ఞానం గురించి అడిగి తెలుసుకుని అర్థం చేసుకుంటున్నాం. అమ్మానాన్నలు గ్రంథాలయానికి వెళ్లాలని చెబుతూ ప్రోత్సహిస్తున్నారు. **- యశశ్వని, అమల, విద్యార్థినులు**

## మేమున్నాం.. మీకు తోడుగా

**రాయదుర్గం పట్టణం: 9666888046**
**కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661**
**ఉరవకొండ: 8008573071**

**సమస్య:** రాయదుర్గం పట్టణం 4వ వార్డులో నారాయణ ప్రైవేటు పాఠశాలకు వెళ్లే మార్గంలో నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలను రోగాలకు గురవుతున్నారు. **- ఈశ్వరరెడ్డి, వడ్డేకాలనీ**

**సమాధానం:** కాలవలో పూడిక తొలగించి మురుగు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటాం. **- రవీంద్రయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

**సమస్య:** పట్టణంలో రాజీవ్‌గాంధీ కాలనీకి వెళ్లే మార్గంలో వాల్వ్ నుంచి నీరు లీకవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- హనుమేష్, రాజీవ్‌గాంధీ కాలనీ, రాయదుర్గం**

**సమాధానం:** పైపుల మరమ్మతుల సమయంలో వాల్వ్ పనులు చేయిస్తాం. **- నరసింహులు, ఏఈ**

**సమస్య:** రాయదుర్గం పట్టణంలోని ప్రధాన లక్ష్మీబజారులో వీధి దీపాలు వెలగడం లేదు. వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలి. **- మాబు, హనుమంతప్ప, లక్ష్మీబజారు**

**సమాధానం:** త్వరలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- నరసింహులు, ఏఈ**

**- న్యూస్‌టుడే, రాయదుర్గం**

**సమస్య:** కంబదూరు మండలంలోని పాళ్లూరు గ్రామ వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. వెంటనే సంబంధిత అధికారి స్పందించి శుభ్రం చేయించాలి. **- గ్రామస్థులు**

**సమాధానం:** పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. **-సురేష్, కార్యదర్శి, పాళ్లూరు**

**సమస్య:** గుద్దెళ్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సంబంధిత అధికారులు కనీసం రెండు, మూడు రోజులకు ఒకసారి తారందించేలా చూడాలి. **- స్థానికులు**

**సమాధానం:** నీటి తీవ్రతను పరిశీలించి పరిష్కరిస్తాం. **- మహేష్, కార్యదర్శి**

**- న్యూస్‌టుడే, కంబదూరు**

## ప్రారంభోత్సవం కాకముందే.. ధ్వంసం

**న్యూస్‌టుడే, బెళుగుప్ప, ఉరవకొండ**

పది కాలాలపాటు మన్నికగా ఉండేలా నిర్మించాల్సిన రోడ్డు పనులు ఇష్టారాజ్యంగా చేయడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం కాకముందే దారి దెబ్బతింటున్న వైనం బెళుగుప్ప మండలంలోని శ్రీరంగాపురంలో చోటుచేసుకుంది. కణేకల్లు మండలం కళకుర్తి నుంచి బెళుగుప్ప మండలం బూదవర్తి, శ్రీరంగాపురం గ్రామాల మీదుగా గుండ్లపల్లి ప్రధాన దారి వరకు సుమారు 9 కిలో మీటర్ల దారి నిర్మాణ పనులకు రూ.4.02 కోట్లు కేటాయించారు. గుత్తేదారు పనులు నాసిరకంగా చేయడంతో పలుచోట్ల ధ్వంసమైంది.

దెబ్బతిన్న రోడ్డు

### నాణ్యతపై పట్టింపులేమి?

రహదారి పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు నాసిరకం పనులు చేసిన గుత్తేదారుతో చేతులు కలుపుతున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు అధ్వానంగా చేసినా జిల్లా ఉన్నతాధికారులు ఒక్కసారి కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవని స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

### వెంటనే పరిశీలిస్తాం

కళకుర్తి నుంచి శ్రీరంగాపురం మీదుగా గుండ్లపల్లి ప్రధాన రోడ్డుకు అనుసంధానం చేసేందుకు చేపట్టిన పనులను పరిశీలిస్తాం. నాసిరకంగా చేసినట్లయితే ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటాం. **- రామాంజినేయులు, జేఈ, పీఆర్**

## బెంచీల వితరణ

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే:** చదివిన కళాశాలకే సేవచేసే భాగ్యం లభించడం గర్వకారణమని తెదేపా పట్టణ అధ్యక్షుడు బండి చిన్న పేర్కొన్నారు. పాఠశాల మైదానం, జూనియర్ కళాశాలలో ఆదివారం 1980-83లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు 16 సిమెంటు బెంచీలు ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ నాగరాజు, వైస్‌ఛైర్మన్ శివానంద, కోశాధికారి శేషుప్రభు, సభ్యులు రామదాసు, మురడిప్ప, సత్యనారాయణ, సాయి ప్రసాద్, రామచంద్ర, హెచ్‌ఎం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంటకాలం ముగిసే సమయంలో.. భూసార పరీక్షలా?

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** సాధారణంగా భూసార పరీక్షలకు మట్టి నమూనాలను ఖరీఫ్‌కు నెల ముందు అంటే వేసవిలో సేకరించడం చూస్తుంటాం.! అలా చేయడం ద్వారా వాటి ఫలితాలు పంటల సాగుకు ఉపకరిస్తుంది. కాని ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లో ఖరీఫ్ కాదు కదా రబీ కాలం గడిచిపోయినా ఆ ప్రక్రియను చేపడుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఉరవకొండ మండలంలో 946, వజ్రకరూరు మండలంలో 557, విడపనకల్లు మండలంలో 1002, గుంతకల్లు మండలంలో 835 నమూనాల సేకరించాలని అధికారులు ఆదేశించారు. ఖరీఫ్ లేదుకదా.. కనీసం రబీ ఆరంభం నాటికైనా ఆ ప్రయత్నం చేయలేదు. ప్రధానంగా ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో ఐదారు రోజులుగా మట్టి నమూనాల సేకరణ హడావుడిగా చేస్తుండటం గమనార్హం.

ఉరవకొండ కార్యాలయంలో మట్టి సంచులు

### ఎందుకీ నిర్లక్ష్యం!

భూసార పరీక్షలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. వాటి ద్వారా రైతులను చైతన్యం చేసి ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. పైగా భూసార పరీక్షల్లో వచ్చే ఫలితాలకు అనుగుణంగా పంటలను సాగు చేయించాలన్నది మరో ఆలోచన. ప్రభుత్వం వాటికి అంత ప్రాధాన్యం ఇస్తున్నపుడు సకాలంలో మట్టి నమూనాలను సేకరించి, వాటి ఫలితాలను రైతులకు అందించడంలో వ్యవసాయ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి.

### ఖాళీగా ఉన్న పొలాల్లోనే పరీక్షలు

ఇది ఏడాదంతా చేయాల్సిన కార్యక్రమం. వారం పది రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేస్తాం. ఖాళీగా ఉన్న పొలాల నుంచి మాత్రమే మట్టి నమూనాలు సేకరిస్తున్నాం. **- సత్యనారాయణ, ఏడీ**

## చిన్నపాటి పనే.. పట్టింపు శూన్యం

కళ్యాణదుర్గం ఎంపీడీవో కార్యాలయం గోడలు నిత్యం నీటితో తడుస్తూ పాచిపట్టాయి. ఆవరణలోని బోరు నుంచి నీరు సింటెక్స్ ట్యాంకుకు నేరుగా వెళ్తున్నాయి. ఇదే బోరు నుంచి పలు కాలనీల్లోని ఇళ్లకూ నీరు చేరుతాయి. మోటార్ ఆన్ చేసినప్పుడల్లా సింటెక్స్ నిండి నీరు వృథాగా పోతుంది. ఇది చిన్నపాటి సమస్యే అయినా.. అధికారులు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఎంపీడీవో ధనుంజయనాథ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

## ప్రహరీ లేక.. విద్యార్థుల పాట్లు

ఉరవకొండ మండలం నెరమెట్ల ప్రాథమిక పాఠశాల వెనుకవైపు ప్రహరీ లేకపోవడంతో గ్రామానికి చెందిన కొందరు అక్కడ చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా జూదం ఆడుతున్నారు. తరగతుల గదుల ఎదుట వరండాలో ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల వెనకాల పరిస్థితులు అస్తవ్యస్తంగా మారడంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీని నిర్మించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

## తవ్వారు... మరమ్మతులు మరిచారు

ఉరవకొండ మండలం చిన్న ముష్టూరులో జాతీయ రహదారి మూడు రోడ్ల కూడలిలో నాలుగు నెలల కిందట పైపులైన్ ఏర్పాటుకు దారిని తవ్వి తరువాత మరమ్మతులు మరిచారు. దీంతో అక్కడ రాకపోకలకు కష్టంగా మారింది. వాహనదారులు పొరబాటు పడితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. దీనిని జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై జాతీయ రహదారి ఏఈఈ కుళ్లాయిరెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించి, అక్కడి రహదారికి మరమ్మతులు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

## దారి కుంగినా.. పట్టదా?

కణేకల్లు మండలం బెణికల్లు సమీపంలో వంక వద్ద సాగునీరు తరలించే పైపులు విరిగి, రోడ్డు కుంగి నాలుగు రోజులైనా పట్టించుకునే వారే లేరని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోజులుగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాల బస్సుల రాకపోకలు నిలిచిపోయి. దీంతో పాఠశాల, కళాశాలలకు, బళ్లారికి రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ర.భ డీఈ రవిశంకరరెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ సోమవారం సాయంత్రంలోగా సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. **- న్యూస్‌టుడే, కణేకల్లు**

## మురుగు అంచున నీటి పైపులైన్

కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు వచ్చే ప్రధాన తాగునీటి పైపులైన్ పట్టణ శివారు అనంతపురం రహదారి పక్కన మురుగు నీటి అంచున ఉంది. మురుగు నిల్వ అధికమైనపుడు ఆ పైపులైన్ మునిగిపోతుంది. ఎక్కువ రోజులు ఆ నీటిలో ఉంటే పైపులైన్‌లో లీకేజీలు ఏర్పడి మురుగు స్వచ్ఛనీటిలో కలిసే ప్రమాదం ఉంది. పట్టణంలో వేల మందికి తాగునీటిని అందించే ఆ పైపులైన్ నిర్వహణపై అధికారులు శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

పూజలు నిర్వహిస్తున్న పండితులు

## వేడుకగా వీరభద్రుని కల్యాణం

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండలోని పేట వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం వేడుకగా సాగింది. గంగ జలాన్ని, స్వామి ఇత్తడి విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ గుడి బండయ్య రూ.70 వేలు వెండి కవచాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ కేశన్న పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో ఆదివారం ఓ ప్రముఖ కంటి వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. పలువురు పరీక్షలు చేయించుకోగా, కొందరికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్రిష్టప్ప తెలిపారు.

## మూలకు చేరినా.. పట్టించుకోరా?

వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో స్వచ్ఛభారత్ రిక్షాలు సచివాలయం ప్రహరీ లోపల ఓ మూలకు తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి.! గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత పనులు చేపట్టడానికి ప్రభుత్వం రిక్షాలు పంపిణీ చేసింది. చిన్నపాటి మరమ్మతులు రావడంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది వీటిని ఇలా వదిలేశారు. మరోవైపు చెత్త సేకరణకు రిక్షాలు వినియోగించకపోవడంతో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పేరుకుపోతోంది. వెంటనే అధికారులు వీటిని వినియోగంలోకి తెచ్చి స్వచ్ఛతకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వజ్రకరూరు**

## వేతన బకాయిల చెల్లింపు హర్షణీయం

**రాంనగర్ (అనంతపురం):** ఇమాంలు, మౌజంల గౌరవ వేతన బకాయిలను ఒకేసారి నేరుగా ఖాతాల్లో జమ చేయడంపట్ల తెదేపా నాయకులు ఉమర్ ముక్తార్ హర్షం వ్యక్తం చేశారు. అనంతపురంలో నిర్వహించిన సమావేశంలో ఉమర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమ కోసం రూ.90 కోట్లు నిధులు విడుదల చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. మసీదుల్లో ఇమాంలు, మౌజంల గౌరవ వేతనం పెంపుతో పాటు బకాయిలన్నీ ఏకకాలంలో విడుదల చేయడంపట్ల మైనారిటీలంటే ప్రభుత్వానికి ఉన్న గౌరవం తేటతెల్లమైందన్నారు.

## అబ్కారీ పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** అనంతపురం జిల్లాలోని అబ్కారీ పోలీసులకు ఆ శాఖ హెడ్‌కానిస్టేబుల్ అండ్ కానిస్టేబుల్ అసోషియేషన్, కేసీ రామన్న మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో రుద్రంపేట రోడ్డులోని ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

## పుర కార్మికులకు ఆర్థిక భరోసా

● బ్యాంకు ద్వారా జీతాల చెల్లింపునకు ఒప్పందం

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** పురపాలక సంఘంలో పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న కార్మికులకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించనుంది. ఆప్కాస్ పరిధిలోని వారికి ప్రయోజనం చేకూర్చే కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. యాక్సిస్ బ్యాంకుతో రాష్ట్ర ప్రభుత్వం- పురపాలకశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో జీత, భత్యాల నిమిత్తం 124 మంది కార్మికులు బ్యాంకులో ఖాతాలు తీసుకుంటున్నారు. పొరుగు సేవల కార్మికులు సహజ మరణానికి గురైతే పరపాలిక రూ.2 లక్షలు, బ్యాంకు మరో రెండు లక్షలు చెల్లిస్తుంది. వారి సంతానం చదువుతుంటే ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున ఇస్తారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షలు, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.కోటి పరిహారం వస్తుంది. రూ.4 లక్షల వరకు కార్మికులకు రుణ సదుపాయం పొందవచ్చు. కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో రాయదుర్గంలో ఏటీఎం కేంద్రం, ఆరు నెలల్లో ప్రత్యేక శాఖ ప్రారంభానికి చర్యలు తీసుకోనున్నట్లు సిబ్బంది హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## వైభవంగా భక్తకనకదాస జయంతి

**బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్:** ఉంతకల్లు, నేమకల్లు గ్రామాల్లో ఆదివారం భక్త కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కనకదాసు చిత్రపటంను ట్రాక్టర్లో ఉంచి వీధుల్లో ఊరేగించారు. ● కణేకల్లులో కురుబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస జయంతి వేడుకలు నిర్వహించారు. కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు ఆలూరు చిక్కణ్ణ, తిప్పేస్వామి, ఆదినారాయణ, తిమ్మరాజు, గోవర్ధన, చిక్కన్న, నరసింహులు, ఆంజనేయులు, మంజు, లింగమూర్తి, అఖిల్, నితీష్, మహేష్, ప్రకాష్, నందీష్ పాల్గొన్నారు. ● డి.హీరేహాళ్ మండలం మురడి, హొసగుడ్డం గ్రామాల్లో శ్రీభక్త కనకదాస జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాయదుర్గం తాలుకా కురుబ సంఘం మాజీ అధ్యక్షుడు కె.హనుమంతు, ఇతర నాయకులతో కలిసి మురడిలో కనకదాస విగ్రహానికి పూలమాల వేసి నివాళి అలర్పించారు. మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నాగిరెడ్డిపల్లి హనుమంతు, నాయకులు సోమశేఖర్, బట్టి తిప్పేస్వామి, పరమేష్, కనకదాసు స్వామి, తిప్పేస్వామి, లోకేష్, శివ పాల్గొన్నారు.

ఉంతకల్లులో కలశాలతో వస్తున్న కురుబలు

## ఘనంగా సహకార వారోత్సవాలు

**శెట్టూరు, న్యూస్‌టుడే:** శెట్టూరులో అఖిల భారత సహకార సంఘం వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జెండాను అధ్యక్షుడు రంగప్ప చౌదరి, డైరెక్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సీఈవో చంద్రశేఖర్, డైరెక్టర్లు వెంకటేశులు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

## తెదేపా బలోపేతానికి కృషి

**గుమ్మఘట్ట, న్యూస్‌టుడే:** వచ్చే స్థానిక ఎన్నికల్లో వందశాతం గెలిచేలా శ్రేణులు కృషి చేయాలని తెదేపా మండల కన్వీనర్ కాలవ సన్నన్న పేర్కొన్నారు. ఆదివారం కలుగోడులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కలుగోడు సొసైటీ అధ్యక్షుడు తిమ్మప్ప, వెంకటాంపల్లి తిమ్మారెడ్డి, చెన్నప్ప పాల్గొన్నారు.

## అయ్యప్పలకు అన్నదానం షురూ

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభమైంది. పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వామి గోవర్ధన్, రాము పాల్గొన్నారు.

### అ వీ.. ఇ వీ.. అ న్నీ..

## రోడ్డు ప్రమాదంలో యువకుడి గాయాలు

**కళ్యాణదుర్గం గ్రామీణం:** పట్టణ సమీపంలోని అనంతపురం మార్గంలో ఒంటిమిద్ది గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో రవీంద్ర(25)కు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## బస్సు కండక్టర్‌పై ఫిర్యాదు

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** చిన్న ముష్టూరు నుంచి ఉరవకొండ వెళ్లడానికి శనివారం సాయంత్రం బస్సు ఎక్కిన ఓ మహిళతో స్థానిక డిపోనకు చెందిన కండక్టర్ దురుసుగా ప్రవర్తించినట్లు ఆమె ఆదివారం డిపోలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 'ఉద్దరగా బస్సు ఎక్కడమే కాకుండా.. ఎక్కడ పడితే అక్కడ ఆపమంటావా?' అంటూ కండక్టర్ దురుసుగా మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ పథకం తీసుకొస్తే దానిని అపహాస్యం చేస్తున్నారని ఆమె వాపోయారు.

## చెత్తాచెదారం ముసుగులో మట్టి తరలింపు

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** పట్టణ సమీపంలోని హనుమంతప్ప కుంటకు చెందిన ఎర్రమట్టి చెత్తాచెదారం ముసుగులో పట్టణంలో కొత్తగా వేస్తున్న ఓ లేఅవుట్‌లోకి తరలినట్లు సమాచారం. ట్రాక్టర్లలో చెత్తతోపాటు మట్టిని తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల కొందరు తహసీల్దార్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ నాగరాజును 'న్యూస్‌టుడే' ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన స్పందించలేదు.

## సమకాలీన అంశాలపై అవగాహన తప్పనిసరి

**అనంత సంక్షేమం:** పిల్లలు సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో సీనియర్ విభాగంలో 8,9,10 తరగతుల్లోని విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాలు ప్రాముఖ్యం, 6,7 తరగతుల్లోని విద్యార్థులకు స్వచ్ఛ భారత్-స్వర్ణ ఆంధ్ర, వక్తృత్వంలో సీనియర్లకు విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం, జూనియర్ విద్యార్థులకు ఆపరేషన్ సిందూర్ గురించి పోటీలు పెట్టారు.

## కుందుర్పిలో తాగునీటి కటకట

**కుందుర్పి, న్యూస్‌టుడే:** కుందుర్పిలోని పలు వీధుల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనడంతో నెలరోజులుగా తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దయ్యాలదిబ్బలో 39 సంవత్సరాల కిందట నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 20 సంవత్సరాల కిందట ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ గ్రామంలోని మూడు బోర్లు వేయించి తద్వారా వచ్చే నీటిని పంప్‌హౌస్‌లో నిల్వచేసి అక్కడి నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మొదట చిన్నకొండలో నిర్మించిన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు, అక్కడి నుంచి ఇళ్లకు సరఫరా చేసేవారు. తాగునీటి సరఫరా పథకాన్ని కొన్నాళ్ల కిందట ఆర్డీటీ సంస్థ పంచాయతీకి అప్పగించడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శ్రీసత్యసాయి తాగునీటి పథకం పలు వీధులకు తాగునీటిని సరఫరా చేసేవారు. గతేడాది శెట్టూరు మండలం చిన్నంపల్లి గేటువద్ద పైపులైను మరమ్మతునకు గురైంది. ఈ మార్గంలోని పొలం యజమాని మరమ్మతుల నిమిత్తం అనుమతించకపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రజల నీటి ఇక్కట్లు రెట్టింపయ్యాయి. కళశాయిగుట్ట, దర్గానగర్, మెయిన్ బజార్, కురుబవీధి, బోయవీధి, విద్యుత్‌నగర్, జమ్మిచెట్టు వీది నుంచి దుబ్బప్పనగర్ తదితర కాలనీల ప్రజలు తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఏడాదిగా నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం

తాగునీటి సమస్య ఉన్నతాధికారులకు నివేదించించాం. అప్పటిలోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో అన్ని కాలనీలకు తాగునీటిని సరఫరా చేస్తాం. ప్రజలు సహకరించాలి. **- లక్ష్మీశంకర్, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ, కుందుర్పి**

# గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

## వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజలందుకున్న పోలేరమ్మదేవత

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లులో పాత బస్టాండు దగ్గర ఉన్న పోలేరమ్మ ఆలయ రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేస్త్రీ దొడ్డప్ప, కమిటీ సభ్యులు శివ, తిమ్మప్ప, ఎర్రిస్వామి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## నెట్టికంటయ్య ఆలయాభివృద్ధికి విరాళం

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే :** నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి కసాపురం గ్రామానికి చెందిన చాకలి చిన్నలింగప్ప కుమారుడు పవన్‌కుమార్ రూ.1,00,116 చెక్కును ఈవో విజయరాజుకు అందజేశారు. దాత, కుటుంబ సభ్యులతో వచ్చి చెక్కును అందించారని ఆలయ సిబ్బంది పేర్కొన్నారు.

ఈవోకు చెక్కును అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

## గుట్టపై నివాసాలు... గుక్కెడు నీటికి కష్టాలు

### పట్టించుకోవాలని ప్రజల విన్నపం

కొత్తపేట లేఅవుట్‌లోని కాలనీ

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తి శివారులోని కొత్తపేట లేఅవుట్‌లోని కాలనీకి తాగునీటి పథకం ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్లు మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాలనీలో పక్కాగృహాలను కూడా లబ్ధిదారులు అతికష్టం మీద నిర్మించుకున్నారు. గుట్టపై ఇంటి స్థలాలు ఇవ్వడంతో ప్రజలు ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసుకుని ఇళ్లను నిర్మించుకున్నారు. ఒక్కో లబ్ధిదారుడు ఇంటి నిర్మాణానికి రూ.25 వేలు వరకు నీటి ట్యాంకర్లకే వెచ్చించారు.

● గుత్తి, కొత్తపేట గ్రామాలకు చెందిన పేదలు కాలనీలో నివాసం ఉంటున్నారు. తాగునీటి సౌకర్యం ఏమాత్రం లేదు. తాగునీటి కోసం అనేక పాట్లు పడుతున్నారు. పట్టణంలోకి వచ్చి నీటిని కొంటున్నారు. ఇతర అవసరాలకు ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ట్యాంకర్‌కు రూ.400-500 చెల్లిస్తున్నారు. నీటి కష్టాలు అన్నీ ఇన్నికావని ప్రజలు వాపోతున్నారు.

### రూ.కోటితో ప్రతిపాదనలు

కొత్తపేట లేఅవుట్‌లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు రూ.కోటితో ప్రతిపాదించారు. కాలనీలో బోర్లు వేసినా నీరు పడటం లేదు. కాలనీ మొత్తం గుట్టే. ఈకారణంగా అధికారులు బోర్లు వేయించలేకపోతున్నారు. జాతీయ రహదారిని ఆరు వరుసలతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పామిడి పెన్నా నుంచి గుత్తికి తాగునీటిని అందిస్తున్న వైటీచెరువు పథకం నుంచి కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు, అంచనాలు వేశారు. ఆరు వరుసల రోడ్డు ఏర్పాటు అయితే వైటీచెరువు పథకం పైపులైన్‌ను పూర్తిగా తొలగించాల్సి వస్తోంది. ఎన్‌హెచ్ అధికారులే తిరిగి పైపులైన్ ఏర్పాటుకు నిధులు వెచ్చించనున్నారు. ఆ నిధులతోనే కొత్తపేట లేఅవుట్‌లోని కాలనీకి నీటి పథకాన్ని ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు విస్తరణ జరగడంలేదు. దీంతో తాగునీటి పథకం ఏర్పాటులో ఆలస్యం జరుగుతోంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 'న్యూస్‌టుడే' తో మాట్లాడుతూ కాలనీకి తాగునీటి పథకం ఏర్పాటుకు నిధులు రాలేదన్నారు. నిధులు విడుదలైతే పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## ముగిసిన రైల్వే అంతర్ విభాగాల క్రీడాపోటీలు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లు రైల్వే డివిజన్ అంతర్ విభాగాల క్రీడా పోటీలు సిబ్బంది మధ్య సఖ్యత, సమన్వయాన్ని పెంపొందిస్తాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. ఆరు రోజుల పాటు రైల్వే క్రీడామైదానంలో కొనసాగిన అంతర్ విభాగాల క్రీడా పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో వారు ప్రసంగించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా 1130 మంది రైల్వే ఉద్యోగులు, మహిళలు పోటీల్లో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. జనవరిలో తాము సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తామని, దీనికి ఉద్యోగులు సమాయత్తం కావాలన్నారు. పోటీలను డివిజన్ క్రీడాధికారి, సీనియర్ డీవోఎం శ్రావణ్‌కుమార్ సమర్థవంతంగా నిర్వహించారని, దీనికి గాను నిర్వాహకులకు రూ.50 వేలు బహుమతిగా ఇస్తున్నామని ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ఆపరేటింగ్ విభాగం దక్కించుకుంది. క్రికెట్‌లో ఇంజినీరింగ్ విభాగం ప్రథమ స్థానం, ఆపరేటింగ్ విభాగం ద్వితీయ స్థానం పొంది ట్రోఫీలను అందుకున్నాయి. ఫుట్‌బాల్‌లో ఆపరేటింగ్ ప్రథమ, సీఅండ్‌డబ్ల్యూ ద్వితీయ, కబడ్డీలో ఆపరేటింగ్ ప్రథమ, ఆర్పీఎఫ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో రైల్వే మహిళా సంక్షేమసంస్థ అధ్యక్షురాలు మమతగుప్తా, సీనియర్ డీఎంఈ (డీజిల్) మంగాచార్యులు, సీనియర్ డీఎస్టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీవోఎం శ్రావణ్‌కుమార్, సెక్యూరిటీ కమిషనర్ ఆకాశ్‌కుమార్ జైస్వాల్, ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆర్.ఎన్. శ్రీనివాసులు, రంజీ క్రీడాకారుడు గులాంఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన ఆపరేటింగ్ జట్టు

## మేమున్నాం.. మీకు తోడుగా

**గుంతకల్లు పట్టణం:** 80085 73072
**తాడిపత్రి:** 79950 67001
**శింగనమల:** 8008612342

**సమస్య:** గుంతకల్లులోని సత్యనారాయణ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రహదారిలో గుంతలతో ప్రజలు అవస్థ పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.
**- నాగరాజు, సత్యనారాయణపేట**

**సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- హారికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక సంఘం**

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

## భక్త కనకదాస జీవితం అందరికీ ఆదర్శం

కనకదాస విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జయరాం

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** ప్రజల్లో భక్తిభావాన్ని కలగజేయడానికి, సమాజంలో అన్ని కులాల సఖ్యతను కోరుతూ కనకదాస భక్తి గీతాలను పాడారని ఎమ్మెల్యే జయరాం అన్నారు. గుంతకల్లు పట్టణ కురబసంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కనకదాసు జయంతితో పాటు కార్తిక వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. వీరప్రతాలయం కూడలిలోని కనకదాస విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. బాలికల నృత్యాలు అలరించాయి. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కురబసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్, సంఘం నాయకులు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మణికంఠ, తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, నాయకులు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, హనుమంతు, అంజి, మల్లయ్య, లక్ష్మీనారాయణ, ఫజులు, ఖాజా పాల్గొన్నారు.

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తిలో ఆదివారం కురుబ సామాజిక వర్గం వారు తమ ఆరాధ్యదైవమైన కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. గుత్తి, గుత్తిఆర్.ఎస్.లతోపాటు గ్రామాల నుంచి కురుబలు తరలివచ్చి అనంతపురంరోడ్డులోని విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కనకదాసను ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు కుళ్లాయి, కుమార్, భీమలింగ కోరారు. ప్రభుత్వం వివాహ, శుభ కార్యాలను జరుపుకొనేందుకు సామాజిక భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

## పశుసంవర్ధకశాఖ భవనంలో అగ్ని ప్రమాదం

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లు మార్కెట్‌యార్డులోని పశువైద్యశాల ఆవరణలో ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రంలో ఆదివారం ఉదయం విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ పేలి అగ్ని ప్రమాదం జరిగింది. బెంచీలు, పెట్టెలు, వస్తువులు కాలిపోయాయి. ఉదయం 6గంటల ప్రాంతంలో కేంద్రంలో రిఫ్రిజిరేటర్ వెనుక భాగంగా తీగలు కాలడంతో అది పేలి మంటలు వ్యాపించాయి. సిబ్బంది గమనించి అగ్నిమాపక కార్యాలయ అధికారులకు సమాచారమిచ్చారు. వారొచ్చి మంటలను అదుపులోకి తెచ్చారని ఏడీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ప్రమాదంలో కారణంగా రూ.6 నుంచి రూ.8 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు.

భవనంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

## చిన్నారికి భానుచందర్ అభినందనలు

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రికి చెందిన యశస్వి భారతి వంద ట్యూబ్‌లైట్లను తలపై పగలకొట్టించుకొని సాహసం చేసిన తీరును సినీహీరో భానుచందర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం ఆయన సామాజిక మాధ్యమాల్లో చిన్నారిని ప్రశంసిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. ఇది అంతటా వైరల్‌గా మారింది. చిన్న వయస్సులోనే 100 ట్యూబ్‌లైట్లు పగలకొట్టుకోవాలంటే ఎంతో ధైర్యం ఉండాలన్నారు. తానూ కరాటే, త్రైక్వాండో బ్లాక్ బెల్టు సాధించానని గుర్తు చేశారు.

## మద్యం సీసాలు స్వాధీనం

**యాడికి, న్యూస్‌టుడే :** అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని ఆదివారం యాడికి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని బోగాలకట్ట గ్రామంలో అధిక ధరలతో అక్రమంగా మద్యం అమ్ముతున్న వాల్మీకి గంగరాజు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 27 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు.

## కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

**పెద్దపప్పూరు:** మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో శనివారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు పుల్లయ్య తెలిపిన వివరాల మేరకు.. 18 గొర్రెలను మేతకు తీసుకెళ్లి శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని షెడ్డులో ఉంచారు. శనివారం అర్ధరాత్రి వీధి కుక్కలు షెడ్డులోకి దూరి గొర్రెలపై దాడి చేయడంతో అవి మృతి చెందాయి. సుమారు రూ. 2 లక్షలు నష్టం వచ్చిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

## అశ్వర్థ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**పెద్దపప్పూరు, న్యూస్‌టుడే :** మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో కార్తిక మాసం చివరి ఆదివారం భక్తులు పోటెత్తారు. అశ్వర్థనారాయణస్వామి, చక్రభీమలింగేశ్వర స్వామికి అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. అశ్వర్థ ఆలయ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం భక్తులకు అవసరమైన వసతులు కల్పించారు.

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో సత్యసాయి భజనలు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** పుట్టపర్తి సత్య సాయి బాబ శత జయంతిని పురస్కరించుకుని గుంతకల్లులోని ప్రభాత్‌నగర్‌లోని బాబా మందిరంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వంద కలశాలను ఏర్పాటు చేసి వంద సార్లు భజన చేశారు. వేద పండితుడు వేణుగోపాల స్వామి వేదమంత్రాలు పఠించారు. ఆలయంలో సత్యసాయిబాబాతో పాటు శిర్డీ సాయిబాబా విగ్రహాలకు పూజలు చేశారు. ఈకార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కార్యదర్శి శంకరనారాయణ గుప్తా, సమితి సభ్యులు పాల్గొన్నారు.

భజన చేస్తున్న భక్తులు

## రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే :** గుంతకల్లుకు చెందిన **దేవానంద నరసింహ** హైదరాబాదులో ఆదివారం జరిగిన రోలర్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. హైదరాబాదులో యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆల్ ఇండియా ఓపెన్ టోర్నీ నిర్వహించింది. మాంటిస్సోరి స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి స్కేటింగ్‌లో ప్రతిభ చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్కూల్ కరస్పాండెంట్ నాగార్జున, తల్లిదండ్రులు శ్రీనివాసులు, త్రివేణి హర్షం వ్యక్తం చేశారు.

## గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడికి కార్తిక కాంతులు

**గార్లదిన్నె గ్రామీణం:** మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం చివరి ఆదివారం సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఇతరత్రా పూజలు చేసి స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు.

## రైల్వే క్వార్టర్స్‌లో చోరీ

**గుంతకల్లు పట్టణం :** గుంతకల్లులో రైల్వే ఆసుపత్రి దగ్గర రైల్వే ఉద్యోగి లింగన్న ఇంటిలో శనివారం పట్టపగులే చోరీ జరిగింది. దుండగుడు 2 కిలోల వెండి, కొంత నగదు చోరీ చోరీ చేశాడు.. స్థానికులు వివరాల మేరకు... లింగన్న శనివారం ఉదయం క్వార్టర్స్‌కు తాళం వేసుకుని విధులకు వెళ్లాడు. తిరిగి పని మీదా ఇంటికి రాగా అప్పటికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించాడు. సీఐ మనోహర్‌ను వివరణ కోరగా చోరీ జరిగిన విషయం వాస్తవమేనని, వెండి మాత్రమే పోయిందన్నారు.

## సహకార బ్యాంకు నూతన శాఖ ప్రారంభం

**పామిడి, న్యూస్‌టుడే :** పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో పి.కొత్తపల్లి సహకార బ్యాంకు కార్యాలయాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, గుంతకల్లు సింగిల్ విండో ఛైర్మన్ తలారి మస్తానప్ప ఆదివారం ప్రారంభించారు. పామిడికి విచ్చేసిన ఎమ్మెల్యేకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముస్లిం సోదరులు నిర్వహించిన గ్యార్మీ పండగ వేడుకలో పాల్గొన్నారు.

## బుగ్గరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర ఆలయంలో కార్తిక మాస పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు.

## ఘనంగా సొసైటీ వారోత్సవాలు

**నార్పల, న్యూస్‌టుడే :** అఖిల భారత సహకార సొసైటీ వారోత్సవాలను ఆదివారం నార్పల సొసైటీలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఉమామహేశ్వరనాయుడు జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు, పంట రుణాల మంజూరుపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు రామకృష్ణ, కుళ్లాయిరెడ్డి, సీఈవో తారకరెడ్డి, బాబయ్య, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

సొసైటీలో జెండా ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు ఉమామహేశ్వరనాయుడు

## కానరాని స్వచ్ఛత!

ప్రభుత్వం స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గుత్తిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కార్యాలయాల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అపరిశుభ్రతతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. ఎంఈవో కార్యాలయంలోకి తరచూ పాములు వెళుతున్నాయి. ఉద్యోగులు, అధికారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎంపీడీవో, ఉద్యాన, రెవెన్యూ, పంచాయతీరాజ్ , గృహ నిర్మాణశాఖ, విద్యుత్తు కార్యాలయాల ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గుత్తి**

## శిథిలావస్థలో పురపాలిక భవనాలు

గుత్తిఆర్.ఎస్.లో పురపాలిక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2011కు ముందు చెట్నేపల్లి మేజర్ పంచాయతీగా ఈభవనాల్లోనే పాలన సాగించారు. చెట్నేపల్లి, గుత్తి ఆర్.ఎస్, సూరశింగనపల్లిలను కలుపుతూ ప్రభుత్వం గుత్తిపురపాలికను చేసింది. అప్పటి నుంచి భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు మూలకు చేరడంతో అవి శిథిలమవుతున్నాయి. గుత్తిఆర్.ఎస్.లో సభలు, సమావేశాలను నిర్వహించేందుకు భవనాలు లేక అవస్థలు పడుతున్నారు. శిథిలభవనాలను వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, గుత్తి**

## తిక్కయ్యస్వామి వీధిలో దుర్గంధం

**నార్పల, న్యూస్‌టుడే :** నార్పల మేజర్ పంచాయతీలోని తిక్కయ్యస్వామి వీధిలో మురుగు ఏరులై పారుతోంది. కాలనీలో ప్రస్తుతం 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ కాలువలు లేకపోవడం, ఉన్న వాటిల్లో పూడిక చేరడంతో ఇళ్లల్లోని మురుగు రోడ్లపైకి చేరుతోంది. రోజుల తరబడి నిల్వ ఉంటోంది. వర్షాలు వస్తే పరిస్థితి దారుణంగా ఉంటోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

## పొంచి ఉన్న ప్రమాదం

**పామిడి, న్యూస్‌టుడే :** పామిడిలోని పలు వీధుల్లో, ప్రధాన రహదారుల్లో విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలు తెగిపడుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. నిత్యం ప్రజల రాకపోకలతో సందడిగా ఉండే ప్రధాన రహదారుల్లో తీగలు తెగిపడి నెలలు గడుస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సంబంధిత కేబుల్ యాజమానులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రజలు వాటిని పట్టుకుంటున్నారని,విద్యుత్తు ప్రసారం జరిగితే ప్రమాదం తప్పదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## మహారాజశ్రీ గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

**E.P.No. 71/2019 in O.S.No. 71/2018**

**Between:**
T.Siva Prasad Reddy ...**Decree Holder**
AND
1.S.Ali Hasan Javed
2. S.Md.Shabaaz ...**Judgement Debtors**

**వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడము ఏమనగా, పైన తెలిపిన అమలు ఆర్జీలో డిక్రీహోల్డర్ తన బాకీ మొత్తము రూ.3.17,146/-లు రాబట్టుకొనుటకు గాను మొదటి జడ్జిమెంట్ డెటార్‌కు సంబంధించిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని పైన తెలిపిన రోజున కోర్టు నందు తేది 05-12-2025న ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం వేయబడును. కావున వేలంలో పాల్గొనదలచిన వారు పైన తెలిపిన రోజున కోర్టు నందు హాజరై వేలంలో పాల్గొనగలరని యావన్మందికి తెలియజేయడమైనది.

**షెడ్యూల్**

అనంతపురము రి.డి, గుంతకల్లు సబ్.రి.డి, చేరిన గుంతకల్లు మండలం, గుంతకల్లు గ్రామ పొలంలోని ఖాళీ స్థలం.

**బాబు** సర్వే నెంబర్

సర్కార్ పుంజి 443 ఎ/1ఎ పైకి గుంతకల్లు మున్సిపల్ భాగ్యనగర్ రెసిడెన్షియల్ ఏరియా, పాతవార్డు 3, కొత్తవార్డు 5, ప్రస్తుత వార్డు 7, ఎల్.పి.నెం.17/73, ప్లాట్ నెం.170 (పార్టు), డోర్ నెం.35కు దగ్గరలోని ఖాళీ స్థలం.

**హద్దులు :**
**తూర్పు :** 40 అడుగుల రోడ్డు నెంబరు 5,
**పడమర :** ప్లాట్ నెం. 169 లోని గౌస్ మోదిన్ ఇల్లు,
**ఉత్తరం :** ప్లాట్ నెం. 161లో రఫిక్ ఇల్లు,
**దక్షిణం :** ఇదే సర్వే నెంబరులో మిఠాయి ఇబ్రహీంకు అమ్మిన ఖాళీ స్థలం.

**కొలతలు :**
**తూర్పు - పడమర :** 44 అడుగులు లేక 13.41 మీటర్లు,
**ఉత్తరం - దక్షిణం :** 24 అడుగులు లేక 7.31 మీటర్లు
**మొత్తము :** 117.33 చదరపు గజాలు

**వేలం తేది : 05-12-2025**
**డిక్రీ హోల్డర్ వాల్యూ : రూ॥ 3,00,000/-**
**అమీనా వాల్యూ : రూ॥ 20,00,000/-**

**By Order of the Court**

**P.VENKATA NAIDU, Advocate, Guntakal. Cell No. 7780432231**

## విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు

**గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే:** గార్లదిన్నె గ్రంథాలయలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించినట్లు గ్రంథాలయాధికారిణి శిరీష తెలిపారు.

పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారిణి శిరీష

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రిలోని చుక్కలూరు క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గుమ్మఘట్ట మండలం దేవరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మానాయక్, హేమావతిబాయి దంపతుల కుమారుడు వరప్రసాద్ నాయక్(28) పెయింటింగ్ పని చేసుకుంటూ ఉండేవాడు. చుక్కలూరు క్రాస్‌లో పని ముగించుకొని శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా వెనుకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

## చదరంగం.. ప్రతిభతో వీరవిహారం

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లు పట్టణానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర, అంతర్జాతీయ చదరంగం పోటీల్లో రాణించి పతకాలను కైవసం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు పిల్లల్లో ఉండే క్రీడా ప్రతిభను గుర్తించి ఇష్టమైన ఆటలపై ప్రోత్సహిస్తున్నారు. దీనికి కోచ్‌ల సహకారంతో రాపిడ్, బ్లిట్జ్ చదరంగం పోటీల్లో దూసుకెళ్లి అందరిచేత ఔర అనిపించుకుంటున్నారు. పతకాలు సాధిస్తున్నారు.

### బరిలో దిగితే దూకుడే

పట్టణంలోని మండిబజారులో ఉంటున్న వంకదారు వీరేంద్ర, సౌమ్య దంపతుల కుమారుడు సాయి శౌరీస్ చదరంగంలో రాణిస్తున్నాడు. రోటరీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు, కోచ్ అనిల్ ప్రోత్సాహంతో బెంగళూరు, బెల్గాం, దర్వాడ్, హైదరాబాదు, విజయవాడ, కర్నూలు పట్టణాల్లో జరిగిన చెస్ టోర్నీలో పతకాలు సాధించాడు. గత నెల అక్టోబరు, కర్నూలులో అంతర్జాతీయ టోర్నీలో రాపిడ్‌లో 1440 రేటింగ్, బ్లిట్జ్‌లో 1651 రేటింగ్ సాధించాడు. ఈనెల నవంబరు, 7,8,9 తేదీల్లో పార్వతీపురం మాన్యం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంత జట్టు తరపున పాల్గొని ప్రతిభ చాటాడు.

### ఆటలో విజయపతాక

గుంతకల్లు పట్టణానికి చెందిన రామకృష్ణారెడ్డి సచివాలయ ఉద్యోగి. ఇతని కుమారుడు భూమిరెడ్డి పునీత్‌రెడ్డి ఏడో తరగతి చదువుతున్నాడు. కోచ్ అనిల్ వద్ద శిక్షణ పొంది అంతర్జాతీయ, రాష్ట్ర పోటీల్లో రాణించారు. ఈ ఏడాది జనవరిలో కర్ణాటకలో హుబ్బళ్లీలో జరిగిన జాతీయ స్థాయి రాపిడ్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచాడు. ఫిబ్రవరిలో సిరిగుప్పలో జరిగిన జాతీయ స్థాయి అండర్-16 విభాగంలో మెరుగైన పాయింట్లు సాధించాడు. గత నెల అక్టోబరులో బళ్లారిలో చెస్ టోర్నీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల నవంబరు 7,8,9 తేదీల్లో పార్వతీపురం మాన్యం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంత జట్టు తరపున పాల్గొని విజయపతాక ఎగరవేశాడు.

(c) eenadu

అనంతపురం
●అనంతపురం ●రాప్తాడు

## కాయగూరల ధరలు..

**అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** (అనంతపురం నగరం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 25, రెండోరకం 20, ఉల్లిగడ్డలు 25, రెండోరకం 15, బంగాళాదుంపలు 40, మిరపకాయలు 25, బెండకాయలు 25, వంకాయలు 25, ముల్లంగి 35, బీట్‌రూట్ 40, బీరకాయలు 40, కాకరకాయలు 40, చౌళేకాయలు 40, క్యాప్సికం 40, చిక్కుడుకాయలు40, క్యారెట్ 60, బీన్స్ 70, క్యాబేజీ 35, అల్లం 70.

## తెరపై ఈనాడు

**కమలానగర్:** గంగ : **సంతాన ప్రాప్తిరస్తు,** గౌరి : **కాంత,** గాయత్రి : **మాస్ జాతర,** గౌతమి : **కె ర్యాంప్,** త్రివేణి : **శివ,** తరంగిణి : **నువ్వొస్తానంటే నేనొద్దంటానా, లవ్ ఓటీపీ,** తేజశ్విని **: గోపి గాళ్ళ గోవా ట్రిప్, జిగ్రిస్,** ఎస్వీ సినిమా : **గతవైభవ,** నీలిమ : **మిరాయ్,** శాంతి : **ది గర్ల్‌ఫ్రెండ్,** సుధా : **సీమంతం.**

## వేతన బకాయిల చెల్లింపు హర్షణీయం

**రాంనగర్(అనంతపురం):** ఇమాంలు, మౌజన్ల గౌరవ వేతన బకాయిలను ఒకేసారి నేరుగా ఖాతాల్లో జమ చేయడంపై తెదేపా నాయకులు ఉమర్ ముక్తార్ హర్షం వ్యక్తం చేశారు. అనంతపురంలో నిర్వహించిన సమావేశంలో ఉమర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమ కోసం రూ.90 కోట్ల నిధులు విడుదల చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. మసీదుల్లో ఇమాంలు, మౌజన్ల గౌరవ వేతనం పెంపుతోపాటు బకాయిలన్నీ ఏకకాలంలో విడుదల చేయడం చూస్తే మైనారిటీలంటే ప్రభుత్వానికి ఉన్న గౌరవం తేటతెల్లమైందన్నారు. పారదర్శక పాలన, అన్ని వర్గాలను ఆర్థికంగా ఆదుకున్న ఏకైక ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లోకి తీసుకెళ్తామని, గ్రామస్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

**అశోక్‌నగర్ : 9440247485**
**తపోవనం: 8008573010**
**రుద్రంపేట: 8008550310**

**సమస్య:** అశోక్‌నగర్ నుంచి ఓటీఆర్ఐకి వెళ్లే దారిలో ప్రహరీ వద్ద అపరిశుభ్రతతో దుర్వాసన వస్తోంది. **- శ్రీనివాస్**
**సమాధానం:** వెంటనే శుభ్రం చేయిస్తాం.
**సమస్య:** కమలానగర్ సాయి డిగ్రీ కళాశాల వద్ద మురుగు సక్రమంగా తీయడం లేదు **- మహేష్**
**సమాధానం:** సిబ్బందిని పంపి వెంటనే శుభ్రం చేయిస్తాం.
**సమస్య :** నందమూరి నగర్‌లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. శుభ్రం చేయించగలరు **- వెంకటేశ్**
**సమాధానం:** వెంటనే చర్యలు తీసుకుంటాం.
**- పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి నరసింహ సమాధానాలు ఇచ్చారు**
– న్యూస్‌టుడే, అశోక్‌నగర్, కమలానగర్

# ఉద్యానాలున్నా ఉపయుక్తమేదీ

**అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** ఉద్యానాలు ఉన్నా ఏమాత్రం ఉపయుక్తంగా ఉండటం లేదు. ఆహ్లాదం దూరమై బోసిపోయి కన్పిస్తున్నాయి. కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు నిలయంగా మారాయి. అనంతపురం నగరంలోని పలు ఉద్యానాలను గురువారం 'న్యూస్‌టుడే' ప్రత్యేక పరిశీలన చేయగా లోపాలు తేటతెల్లం అయ్యాయి.

### పేరు గొప్ప.. మరి నిర్వహణ?

నెర్రెలిచ్చిన గోడ.. పని చేయని ఫౌంటెన్

అనంతపురం నగరంలోనే పెద్దది. అన్నింటి కంటే బాగుంది అని చెప్పుకొనే హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్ పార్కులో అనేక సమస్యలు నెలకొన్నాయి. పరిసర ప్రాంతాలనుంచి రోజుకు 600 నుంచి 700 మంది వరకు వస్తారు. సెలవు రోజుల్లో అయితే ఆ సంఖ్య వెయ్యికి చేరుకుంటుంది. నడక దారి సక్రమంగా లేదు. ఎంతో విశాలంగా ఉండే ఈ ప్రాంగణం మధ్యలో ప్రైవేటు వ్యక్తి పెట్టుకున్న ఆట వస్తువులకే ఎక్కువ ప్రదేశం పోయింది. పని చేయని ఆట వస్తువులు కూడా అక్కడే ఉంచారు. వాటర్ ఫౌంటెన్ పని చేయడం లేదు. చుట్టూ గోడ నెర్రెలు చీలి నీరు వదిలినా నిలబడవు. చిన్నారులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, పరికరాలు కొన్ని విరిగాయి.

విరిగిపోయిన ప్లాస్టిక్ ఆట వస్తువులు

సంగమేష్‌నగర్‌లో ఉన్న శ్రీశిర్డీసాయి ఉద్యానవనంలో గోడలు పెచ్చులూడి పోయి చెత్తాచెదారం, మట్టి కుప్పలతో అపరిశుభ్రంగా ఉంది. జారుడు బండ రేకు విరిగిపోయింది. జారితే పదునైన రేకు చిన్న పిల్లలకు శరీర భాగాలు తెగే విధంగా ఉంది. ఆట వస్తువులు విరిగాయి. ఆదర్శ నగర్‌లోని బుద్ధవిహార్ ఉద్యానవనంలోనూ ఆట వస్తువులు విరిగాయి. మరికొన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. బోరు ఉన్నా కొళాయి లేదు.

సంగమేష్‌నగర్‌లో ప్రమాదకరంగా

● అరవింద్‌నగర్‌లో మూడు ఉద్యానాలు ఉన్నాయి. నాయక్‌నగర్ వద్ద ఉన్న ఉద్యానంలో ఆరు బయలు వ్యాయామశాల పరికరాలు విరిగిపోయాయి. మరో రెండు ఉద్యానాల్లో చిన్నారులు ఆడుకోలేని విధంగా ఆట వస్తువులు పాడైపోయాయి.
● రాంనగర్‌లోని సిద్ధార్థ ఉద్యానంలో గతంలో పనులు చేపట్టినా ఇంకా చేయాల్సి ఉంది. వర్షం వస్తే నీరంతా నిలబడుతోంది.

అరవింద్‌నగర్‌లో నిరుపయోగంగా

## నగరంలో మండల దీక్షలు ప్రారంభం

**అనంత సాంస్కృతికం:** నగరంలోని పలు అయ్యప్ప దేవాలయాల్లో ఆదివారం మండల దీక్షలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. సూర్యభగవానుడు వృశ్చిక రాశిలోకి ప్రవేశించే రోజు శబరిమలలో ఆలయ తలుపులు తెరచి మండల దీక్షలను ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక మొదటి రోడ్డు శివాలయం, హెచ్చెల్సీ కాలనీ, కెనాల్ సమీపాన ఇందిరానగర్ వీరాంజనేయస్వామి ఆలయం, రాంనగర్ 80 ఫీట్ రోడ్డు, బుక్కరాయ సముద్రం క్రాస్ తదితర ప్రాంతాల్లోని అయ్యప్ప ఆలయాల్లో దీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి చోట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందిరానగర్ అయ్యప్ప ఆలయంలో గురుస్వామి శ్రీధర్ ఆధ్వర్యంలో అయ్యప్ప విగ్రహానికి ప్రాకారోత్సవం జరిపి పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, అలంకరణ, పడిపూజ చేశారు. అధిక సంఖ్యలో హాజరైన మాలధారులు అయ్యప్ప భజనలు చేసిన అనంతరం భిక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఇందిరానగర్‌లో 18 మెట్లపై కొలువుదీరిన మణికంఠుడు

ఆశ్రమంలో భక్తి గీతాలను పాడుతున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో సత్యసాయి గీతాలాపన

**అనంత సాంస్కృతికం:** సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు పురస్కరించుకుని స్థానిక హెచ్ఎల్సీ కాలనీలోని కొల్హాపూర్ ఆలయం సద్గురు వలి స్వామి ఆశ్రమంలో ఆదివారం బాబా భజన, భక్తిగీతాలాపన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సద్గురు వలిస్వామి భక్తమండలి వారి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించారు. ఆశ్రమంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తి గీతాలాపన చేశారు. అక్కల్కోట్ మహరాజ్ సేవా సమాజం కార్యదర్శి సుందరం విజయకుమార్ పర్యవేక్షణలో ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, వివిధ భజన సంఘాల నుంచి 200 మంది వరకు భక్తులు పాల్గొని వంద భక్తి గీతాలు ఆలపించారు.

## ఆబ్కారీ పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** అనంతపురం జిల్లాలోని ఆబ్కారీ పోలీసులకు ఆ శాఖ హెడ్‌కానిస్టేబుల్ అండ్ కానిస్టేబుల్ అసోసియేషన్, కేసీ రామన్న మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో రుద్రంపేట రోడ్డులోని ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు రక్తపరీక్షలు, గుండెకు సంబంధించిన , బీపీ, మధుమేహం, తదితర పరీక్షలు చేశారు. 150 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరానికి ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జయనాథ్‌రెడ్డిలు హాజరై ప్రారంభించారు. నిత్యం విధుల్లో తలమునకలైనప్పటికీ ఆరోగ్యం గురించి అశ్రద్ధ వహించకూడదన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని ఉద్యోగులకు సూచించారు. యూనియన్ అధ్యక్షుడు బోయ మోహన్, జనరల్ సెక్రెటరీ బచ్చు రాజగోపాల్, వైస్ ప్రెసిడెంటు కిరణ్, నాయకులు రమేశ్‌రెడ్డి సునీత పాల్గొన్నారు.

## సందడిగా వనభోజన మహోత్సవం

కార్పొరేషన్ ఛైర్మన్ స్వప్నను సన్మానిస్తున్న నిర్వాహకులు

**అనంత సాంస్కృతికం:** జంగమ కులస్థుల కార్తిక వనభోజన మహోత్సవం ఆదివారం కోలాహలంగా జరిగింది. బుక్కరాయసముద్రం-దేవరకొండ రోడ్డులోని తి.తి.దే. కల్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ గవి మఠం సంస్థానం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, కళిహోళ మఠం చెన్నవీర శివాచార్యస్వామి, ఏపి రాష్ట్ర జంగమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ చంద్రశేఖర్, ఏపి లింగాయత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న హాజరయ్యారు. దీపారాధన చేసిన అనంతరం పీఠాధిపతులు అనుగ్రహ భాషణం చేశారు. జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి.. జంగమ, వీరశైవుల అభివృద్ధికి, ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలు, ఐక్యత, భవిష్యత్తులో చేయబోవు పనులను తెలిపారు. పది, ఇంటర్‌లలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

## 1,121 శంఖాల తీర్థంతో అభిషేకం

సహస్ర శంఖాభిషేకం చేస్తున్న స్వామీజీ

**అనంత సాంస్కృతికం:** బెంగళూరు రోడ్డు శివకోటి శ్రీపీఠంలో జరుగుతున్న మహారుద్ర-సహస్ర కుంభాభిషేకం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సహస్ర శంఖారాధన, శివకామేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. 1121 శంఖాల్లో కాశీ నుంచి తెచ్చిన గంగాజలంతో ఆలయ వ్యవస్థాపకుడు సద్గురు అప్పాస్వామి సహస్ర శంఖాభిషేకం నిర్వహించారు. శ్రీమహాగణపతి, లలితాయాగాలు, లలితా సహస్ర నామపారాయణం, శత సువాసినీ పూజలు, మంగళ నీరాజనాలు జరిపారు. మూలమూర్తులకు సైతం రుద్రాభిషేకం చేశారు. సద్గురు అప్పాస్వామి, ట్రస్టు కార్యదర్శి అమర నాథ్ శర్మ, ప్రధాన అర్చకుడు హరికృష్ణ, నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఋగ్వేద సలక్షణ ఘనపాఠి ఇంద్రగంటి సత్యకిషోర్‌శాస్త్రి శివతత్వ ప్రవచనం ఆకట్టుకుంది.

**నేటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు:** బహుళ త్రయోదశి సోమవారం ఉదయం ప్రాతః పూజ, మహా గౌరీ శత రుద్ర యాగాలు, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

### ఆత్రుత.. అడ్డదారి!

రుద్రంపేట పంచాయతీ పరిధి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి-44 పై అడ్డదారిలో ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తున్నారు. రెండు అడుగులు దూరం వెళ్లలేక అడ్డదారిలో అవతలి వైపు దాటుకోవచ్చన్న ఆత్రుతతో వాహనాలను అకస్మాత్తుగా మళ్లిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

### ఇరుక్కుంటే ఎటూ పోలేం..

పాతూరు తిలక్‌రోడ్డు వన్‌వే మార్గం. జంగాలపల్లి మసీదు ప్రారంభం నుంచి మార్కెట్ వరకు రోడ్డు ఇరుకుగా ఉంటుంది. ఇరువైపులా వ్యాపార సముదాయాలుంటాయి. వినియోగదారులు, వారి వాహనాలతో కిక్కిరిసి ఉంటుంది. మార్కెట్ వైపు, గుత్తి రోడ్డు నుంచి వచ్చే వాహనాలు పోస్టాఫీసు వద్ద మలుపు తిరిగి వచ్చే వాహనాలు రావడానికి మాత్రమే మార్గం ఉంటుంది. శ్రీకంఠం కూడలి వైపు నుంచి వచ్చే ద్విచక్రవాహనాలు వెళ్లడానికి రోడ్డు ఇరుకుగానే ఉంటుంది. జంగాలపల్లి మసీదు వద్ద ట్రాఫిక్ పోలీసు లేనిది చూసి ఆటోలు, సుమోలు, కార్లు అపసవ్య దిశలో వెళుతూ ఇరుక్కుపోతున్నారు. **- న్యూస్‌టుడే, అనంత నగరపాలక**

### అల్లేస్తా.. స్తంభాన్ని మింగేస్తా..

రాప్తాడు మండలం గొల్లపల్లి వద్ద లక్ష్మీనరసింహ స్వామి గుడికి ఎదురుగా రోడ్డుకు ఇవతలి వైపు పొలాల్లో కరెంట్ స్తంభానికి కింద నుంచి పైవరకు పిచ్చి మొక్కలు, పొదలు ఆక్రమించి స్తంభం కనబడని పరిస్థితిలో ఉంది. నిప్పురవ్వలు రాలినపుడు ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉంది. **- ఈనాడు అనంతపురం**

### నగరవనం.. అంతా జనం

కార్తిక మాసం సందర్భంగా వనభోజనాలు చేసేందుకు జిల్లా కేంద్రం నుంచి పెద్దఎత్తున సందర్శకులు పంపనూరు నగరవనానికి హాజరయ్యారు. ఉదయం నుంచి కుటుంబ సభ్యులతో కలసి పార్కులో సరదాగా గడుపుతూ ఆడుకున్నారు. కార్తిక మాసం సందర్భంగా సందర్శకులు ఎక్కువగా హాజరవుతున్నందున అటవీశాఖ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నడూ లేనంత ఎక్కువ సంఖ్యలో సందర్శకులు పంపనూరు నగరవనానికి హాజరయినట్లు అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, ఆత్మకూరు**

## సొసైటీ ద్వారా రైతులకు బహుళ సేవలు అందిస్తాం

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:** సొసైటీ ద్వారా రైతులకు కేవలం రుణాలు ఇవ్వడమే కాదు. బహుళ సేవలు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు రాచానపల్లి సొసైటీ ఛైర్మన్ పాముదాయి రఘు పేర్కొన్నారు. సొసైటీ ద్వారా పరపతేతర వ్యాపారాలు చేసి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం సొసైటీ కార్యాలయంలో జాతీయ సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో డైరెక్టర్లు ఎం.శ్రీనివాసులు, బి.నారాయణప్ప, సహకార శాఖ మానిటరింగ్ అధికారిణి ఎం.నాగమణి, సహకార విద్యాధికారి ఎంబీ మురళీమోహన్, సొసైటీ సీఈఓ ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఛైర్మన్ రఘు మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యాపారాలు చేసి ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారు. సంఘం అభివృద్ధి సాధించాలంటే రైతులు, సహకార సంఘం పాలకవర్గ సభ్యులు ప్రోత్సాహం అందించాలని కోరారు.

## సమకాలీన అంశాలపై అవగాహన తప్పనిసరి

**అనంత సంక్షేమం, న్యూస్‌టుడే:** విద్యార్థులు సమకాలీన అంశాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ తరగతుల్లోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో సీనియర్ విభాగంలో 8,9,10 తరగతుల్లోని విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయాలు ప్రాముఖ్యం, 6,7 తరగతుల్లోని విద్యార్థులకు స్వచ్ఛ భారత్-స్వర్ణ ఆంధ్ర, వక్తృత్వంలో సీనియర్లకు విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం, జూనియర్ విద్యార్థులకు ఆపరేషన్ సింధూర్ గురించి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 20న ముగింపు సమావేశంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న పాల్గొన్నారు.

### అవీ.. ఇవీ.. అన్నీ..

### కాంగ్రెస్ మైనార్టీ విభాగం కమిటీ ఎంపిక

**ఉమానగర్:** కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ విభాగంలో పలువురు నాయకులను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా అధ్యక్షుడు శర్మాస్‌వలి ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగింది. జాకీర్ హుసేన్‌ను రాష్ట్ర అధికార ప్రతినిధి, రాయలసీమ ఇన్‌ఛార్జిగా నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కుణుతూరు షఫి, జమీల్‌బాషా, ఉరవకొండకు చెందిన మహబూబ్‌బాషా, తాడిపత్రికి చెందిన మోదిన్‌బాషాను నియమించారు. నాయకులు వాసు, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

### నిత్యావసరాల అందజేత

**కమలానగర్:** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలమురళి ఆధ్వర్యంలో పేద కుటుంబానికి చెందిన మహిళ యమునకు సీమంతం చేశారు. యమున సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు గమనించి ఆదివారం పుట్టినిల్లు ఆశ్రమంలో సీమంతంతోపాటు రెండు నెలలకు సరిపడా రూ.10 వేల నిత్యావసర సరకులు అందించారు.

### రాయలసీమకు అన్యాయం

**కమలానగర్:** ఎన్ని ప్రభుత్వాలు మారినా ఏళ్లుగా రాయలసీమకు అన్యాయం జరుగుతోందని, దీనిపై పోరాడాలని శ్రీబాగ్ ఒడంబడిక సాధన సమితి నాయకులు హరికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రాజధాని, నీళ్లు నిధుల కోసం ఉద్యమిద్దాం రండి అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమకు నిధులు, నీళ్లు ఇవ్వటంతో ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. రాయలసీమ కోసం త్వరలో ఉద్యమాలు చేపడుతామన్నారు.

### హత్యకు బాధ్యులైన వారిని శిక్షించాలి

**అనంతపురం విద్య:** సీఐ సతీష్‌కుమార్ హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కుమ్మర, శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబుళపతి మాట్లాడుతూ. . గుంతకల్లు రైల్వే సీఐగా పనిచేస్తున్న సతీష్‌కుమార్‌ను హత్య చేయడం దారుణమన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. లక్ష్మన్న, శ్రీనివాసులు, నాగేంద్ర, శంకరయ్య పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ప్రియరాగాలు సినీ సంగీత కచేరి

సామూహిక ఆలాపన చేస్తున్న గాయకులు

**అనంత సాంస్కృతికం:** నగరంలోని త్యాగరాయ సంగీత సభలో ఆదివారం సందడిగా జరిగిన 'ప్రియ రాగాలు' సీజన్-9 స్టార్ సింగర్స్ మీట్ కార్యక్రమంలో 32మంది గాయనీగాయకులు పాల్గొన్నారు. అనంతపురం శ్రీచిన్న గోవింద మూవీ మేకర్స్, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు ఎన్ వెంకటకృష్ణ, తిరుపతి శ్రీవంశీ కళాక్షేత్రం అధ్యక్షుడు జిఎల్ కుమార్‌సంయుక్త నిర్వహణలో జరిగిన ఈకార్యక్రమం ఆదివారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకు పాత, కొత్త చిత్రాల పాటలు పాడి శ్రోతలను ఆకట్టుకున్నారు. అనంతరం సాయంత్రం జరిగిన సమావేశంలో పీటీసీ వైస్ ప్రిన్సిపల్ ఆర్ వాసుదేవన్, అనంత ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు, ప్రముఖ సినీగాయని శ్రీప్రియ పాల్గొన్నారు. నాగరాజును ఘనంగా సన్మానించిన అనంతరం ఘంటసాల సంగీత విభావరి జరిగింది. ప్రతిభ కల గాయనీ గాయకులను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు

## గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడికి కార్తిక కాంతులు

**గార్లదిన్నె గ్రామీణం:** మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకు పూజలు జరిపి స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

మార్కెట్ యార్డులో చీనీ కాయల కుప్పలు

షెడ్డు పైకప్పు తుప్పుపట్టిన రేకులు

## కవరింగ్ షెడ్డు.. పైకప్పు తుప్పు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని నిత్యం చీనీ సంత కోసం కవరింగ్ షెడ్డు నిర్మించారు. పదేళ్ల క్రితమే యార్డులో రూ.2 కోట్లతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించారు. నిత్యం షెడ్డు కింద చీనీ సంత సాగుతోంది. సీజన్‌లో 1000-1500 టన్నులు చీనీకాయలు సంతకు తీసుకొస్తారు. షెడ్డు పైకప్పు రేకులన్నీ తుప్పు పట్టి ఎర్రగా మారిపోయాయి. రేకుల కింద భాగంలోకి నీరు చేరడంతో రేకులు తప్పుపట్టి దెబ్బతిని ప్రమాదకరంగా ఉందని వ్యాపారులు వాపోయారు. ప్రమాదం జరగకుండా ముందస్తుగా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, రాంనగర్**

## ఇనుప కడ్డీలు.. దొంగలపాలు

ఊళ్లు నిర్మిస్తున్నామని ఊదర గొట్టిన గత వైకాపా ప్రభుత్వం అమాయకపు ప్రజలను నట్టేట ముంచింది. అనంతపురం గ్రామీణం మండలం పరిధి ఆలమూరు పంచాయతీ పరిధి లేఅవుట్ కాలనీలో రూ.కోట్లు రూపాయలు ఖర్చు చేసి అన్ని వసతులతో ఇళ్ల నిర్మించి ఇస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోయారు. ఆలమూరు లేఅవుట్‌లో ఆరువేలకు పైగా ఇళ్ల నిర్మించేందుకు పనులు ప్రారంభించి ఆసంపూర్తిగా పనులు వదిలేశారు. ● నిర్మాణం పూర్తి చేసుకొన్న ఇళ్లలో అరకొరగా నివాసం ఉంటున్న ప్రజలు అక్కడ నెలకొన్న మౌలిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. సొంత డబ్బులతో వీధి దీపాలు ఏర్పాటు చేసుకొంటున్నామని చెబుతున్నారు. రూ.లక్షలు రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఇనుప కడ్డీలు, ఇనుప బైండింగ్ వైర్ భద్రపరచకపోవడంతో తుప్పు పట్టి వినియోగానికి పనికి రాకుండా పోయాయని, ఇనుప కడ్డీలను రాత్రి పూట దొంగలు ఎత్తుకెళ్లి అమ్ముకొంటున్నారని స్థానికులు తెలిపారు. హౌసింగ్ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు. - **న్యూస్‌టుడే, రుద్రంపేట**

దొంగలు ఎత్తుకుపోగా మిగిలిన ఇనుపచువ్వలు

గడ్డిలో కలసి పోయిన బైండింగ్ వైర్

## జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సత్కారం

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి కిట్ అందజేస్తున్న సంఘం సభ్యులు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** గుజరాత్‌లో జరగనున్న అండర్-11 బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కార్తిక్‌ను జిల్లా బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ బాలుడికి కిట్‌బ్యాగ్ వితరణ చేశారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఆ బాలుడిని, తండ్రి భీమాను శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో డిసెంబరు 8 నుంచి వడోదరలో జాతీయ పోటీల్లో రాష్ట్రం తరపున ఈ బాలుడు ప్రాతినిధ్యం వహిస్తాడు. బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ప్రధాన కార్యదర్శి జయకుమార్, సభ్యులు షెక్షావలి, నరేష్‌లు హాజరై బాలుడిని అభినందించారు.

## అశ్వర్థ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**పెద్దపప్పూరు:** మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో కార్తిక మాసం చివరి ఆదివారం భక్తులు పోటెత్తారు. అశ్వర్థనారాయణస్వామి, చక్రబీమలింగేశ్వరస్వామికి అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు

(c) eenadu

# నాన్న దారి.. ఐఎఫ్ఎస్‌లో విజయభేరి

‘మా నాన్న అటవీశాఖలో రేంజర్.. ఆయన విధులకు వెళ్లేటప్పుడు తోడుగా వెళ్లేవాడిని.. అక్కడి వాతావరణం.. పరిస్థితులను చూసి అడవిపై మక్కువ పెంచుకున్నా. అటవీ అధికారిగా ప్రకృతిని ప్రేమించడంతో పాటు ఎలా రక్షించవచ్చో ఆయనను చూసి నేర్చుకున్నా. బాటలోనే ఐఎఫ్ఎస్ అధికారి కావాలన్న కోరిక నాలో బలంగా నాటుకు పోయింది. అదే లక్ష్యంతో చదివాను.. అనుకున్నది సాధించాను’ అని అటవీశాఖ జిల్లా అధికారి (డీఎఫ్‌వో) జగన్నాథ్‌సింగ్ చెప్పారు. జిల్లాధికారిగా ఎదగడం వెనుక దాగున్న కష్టాలు, కుటుంబ సభ్యుల సహకారం తదితర విషయాలను ‘న్యూస్‌టుడే’తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. - న్యూస్‌టుడే, రాజంపేట

● మాది కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా. ఇంటర్మీడియట్ వరకు అక్కడే చదువుకున్నా. అగ్రికల్చర్ బీఎస్సీ అనంతరం ఎమ్మెస్సీ ఎంటమాలజీలో మొదటి ర్యాంకు సాధించి తమిళనాడులో పూర్తి చేశా. ఎమ్మెస్సీ చదువుతున్న సమయంలోనే సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించా. తొలి సారి అప్పుడే పరీక్షకు హాజరయ్యాను.

## నేను వసతి గృహ విద్యార్థినే

మాది మధ్య తరగతి కుటుంబం.. చదువంతా కష్టాలతోనే సాగింది. ఎక్కువగా అవ్వా, తాతల వద్దే పెరిగాను. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదివాను. తండ్రి ఎఫ్ఆర్‌వో కావడంతో ఆయన తిరిగిన ప్రాంతాలను మరిచిపోలేదు. అందుకే అటవీశాఖలో ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నా. చదువంతా పూర్తయ్యాక ఢిల్లీలో రెండున్నరేళ్లు ఉన్నా.

## రోజుకు 13 గంటల సాధన



సివిల్స్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించడానికి కష్టపడ్డాను. రోజుకి 12 నుంచి 13 గంటల పాటు చదివాను. ఇదే సమయంలో ఆర్థిక అవసరాలకు ఓ కోచింగ్ కేంద్రంలో పార్ట్‌టైం శిక్షకుడిగా ఉద్యోగం చేశాను. ఉదయం పిల్లలకు చదువు చెప్పడం, ఆ తర్వాత పరీక్షకు సన్నద్ధం అవడం చేశాను.

## ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ

సివిల్స్‌కు ప్రత్యేక శిక్షణ పొందాలని ఢిల్లీకి వెళ్లాను. రెండోసారి రాసినప్పుడు ఇంటర్వ్యూ వరకు వెళ్లినా విఫలమయ్యా. అయినా నిరుత్సాహ పడకుండా మూడోసారి ప్రయత్నించి జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు, కర్ణాటక రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. 2013లో ఐఎఫ్ఎస్ శిక్షణ డెహ్రాడూన్‌లో పొందాను. శిక్షణ అనంతరం కర్ణాటకకు ఒకే సీటు రావడం.. అది బయటవాళ్లకు కేటాయించడంతో స్థానికుడిని అయిన నేను ఆంధ్రప్రదేశ్‌ని ఎంపికచేసుకున్నా. 2015లో నంద్యాల జిల్లాలో ఎనిమిది నెలల పాటు శిక్షణ తీసుకున్నా.

## చిత్తూరు జిల్లాలో అడుగులు

చిత్తూరు జిల్లా డీఎఫ్‌వోగా 2016లో తొలి అడుగు వేసి నాలుగేళ్లు పనిచేశాను. అనంతరం అనంతపురం డీఎఫ్‌వోగా రెండేళ్లు పనిచేశాను. తరువాత ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెళ్లి నెల్లూరు జిల్లా ప్రాంతీయ అధికారిగా చేశా, అక్కడి నుంచి అనంతపురం డీఎఫ్‌వోగా ఏడాది పాటు చేసిన అనంతరం ఏడాది క్రితం రాజంపేటకు డీఎఫ్‌వోగా వచ్చాను.

## ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం

చదువుకుంటున్న సమయంలో అండర్‌-19 క్రికెట్ క్రీడాకారుడిని. రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ ఆడాను. ఖోఖో, పరుగు పందెం, చదరంగం వంటి క్రీడల్లో రాణించాను. ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. ప్రస్తుతం ఆంగ్లం, తెలుగు, తమిళం, మలయాళం, ఉర్దూ, హిందీ, కన్నడంలో మాట్లాడతాను. భార్య హన్నా, పిల్లలు తన్వీర్, హితార్థ్ ఉన్నారు. ఐఎఫ్ఎస్ శిక్షణ పొందుతున్న 85 మందికి లీడర్‌గా ఉన్నా. ఇటు చదువులో అటు క్రీడల్లో నాయకత్వ లక్షణాలను అలవరచుకున్నా.

## 500 మంది స్మగ్లర్లను పట్టుకున్నా

‘అటవీ అధికారిగా విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 500 మంది స్మగ్లర్లను పట్టుకున్నా. అనంతపురంలో పనిచేస్తున్న సమయంలో 40 ఏళ్లుగా ఆక్రమణలో ఉన్న వెయ్యి ఎకరాల ఆక్రమిత భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నాం. అన్నమయ్య జిల్లాలో కూడా 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 40 ఫారెస్ట్ బ్లాక్స్ పరిధిలో ఉన్న దాదాపు 20 వేల ఎకరాల అటవీ భూమిని కేవలం రెండు నెలల వ్యవధిలో స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలో 36 శాతమున్న అటవీ ప్రాంతాన్ని 50 శాతానికి పెంచాలనే లక్ష్యం పెట్టుకున్నా. ఆ వైపుగా అడుగులు వేస్తున్నా’ అని వివరించారు.

# డీకేడీ

ఉప్పరపల్లెలో నిర్మించిన భారీ భవనం

డీకేటీ భూమిలో అక్రమ నిర్మాణాలు

రూ.కోట్ల స్థలం అప్పనంగా కొట్టేశారు!

**సిద్దవటం, న్యూస్‌టుడే :** కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన విలువైన డీకేటీ స్థలంపై అక్రమంగా నిర్మించిన భవన నిర్మాణాలు వివాదాస్పదంగా మారాయి. సుమారు రూ.2 కోట్ల విలువైన డీకేటీ స్థలాలపై వ్యాపారాలకు సంబంధించిన భారీ భవన నిర్మాణ పనులు చేపట్టడం వివాదానికి దారితీసింది. ఇంటి నిర్మాణాల ముసుగులో వ్యాపార దుకాణ భవనాలు నిర్మిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల కళ్లుగప్పుతూ నిర్వాహకులు రహస్యంగా పనులు కొనసాగిస్తూ నిబంధనలను కాలరాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణ పనులు కొన్నేళ్లగా సాగుతూ ఆగుతుండడం చర్చనీయాంశంగా మారింది.

## ఆ స్థలంలోనే వ్యాపార భవన నిర్మాణాలు

● సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వే సంఖ్య 936/ఏ లోని ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్ల కిందట స్థానిక మహిళ పేరు మీద మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరైంది. దీన్ని అడ్డు పెట్టుకుని స్థానిక వ్యాపారి ఒకరు ఇదే సర్వే సంఖ్యలో మరికొందరు బినామీ పేర్ల మీద అనుబంధ పత్రాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

● ఈ పత్రాలను అడ్డుపెట్టుకుని 2021లో మొత్తం పది సెంట్లలో వ్యాపార దుకాణం కోసం భారీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులపై అప్పట్లో స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని తేలడంతో పనులను నిలిపేశారు.

## తొలగించేలా చర్యలు

డీకేటీలో చేపట్టిన భారీ భవన నిర్మాణాలను పరిశీలించాం. ఇంటి నిర్మాణం కోసం అనుబంధ పత్రం పొంది మరికొందరి పేర్లతో వ్యాపారం కోసం భారీ భవనాలు నిర్మించడం చట్టరీత్యా నేరం. ఇటీవల భవనానికి ఏర్పాటు చేసిన షట్టర్లను తొలగించాం. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు కొనసాగిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. - **తిరుమలబాబు, తహసీల్దారు, సిద్దవటం**

● ఇదే తరహాలో పక్కనే మరో పది సెంట్ల స్థలంలో కూడా వ్యాపార దుకాణం కోసం భారీ భవన నిర్మాణ పనులు జరగ్గా వాటిని కూడా నిలిపేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ పనులు రహస్యంగా చేపట్టడం, నిలిపేయడం వంటివి కొనసాగుతూ వచ్చాయి.

● ఇటీవల మళ్లీ నిర్వాహకులు ఆ భారీ భవనానికి రహస్యంగా షట్టర్‌లు ఏర్పాటు చేసి పనులు చేపట్టినట్లు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వచ్చి వాటిని తొలగించారు. అధికారులు లేనప్పుడు పనులు చేయడం, వచ్చినపుడు పనులు నిలిపేయడం వంటివి నిర్వాహకులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● ఇలా భవనాన్ని అక్రమంగా అంచెలంచెలుగా నిర్మిస్తున్నారన్నారు. పాత దుకాణమేనని అందరినీ మభ్యపెట్టేలా రెండు రోజుల కిందట వ్యాపార సామగ్రిని కొత్త భవనంలోకి చేర్చే పనులు చేశారని సమాచారం. ప్రభుత్వ నిబంధనలను ఉల్లఘిస్తూ నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సివిల్ సర్వీసు అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**రాయచోటి, న్యూస్‌టుడే:** సివిల్ సర్వీసు పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నాగేశ్వరరాజు ప్రకటనలో తెలిపారు. పరీక్షకు సన్నద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబరు 5న అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులు కుల, ఆదాయ, పది, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజు చిత్రాలతో రాయచోటిలోని మైనార్టీ జీబీఎ భవనంలోని కార్యాలయంలో అందజేయాలన్నారు. అభ్యర్థులకు డిసెంబరు 10న విజయవాడ గొల్లపూడిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు.

## వరి కాదు సతత హరిత సిరి



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏపుగా పెరిగిన వరి అనుకుంటున్నారా.. మీరు తప్పులో కాలేసినట్లే. వర్షాకాలం వచ్చిందంటే చాలు తొలకరి జల్లులతో సతత హరిత సిరితో కళకళలాడుతూ పులకించిపోతుంది ఇక్కడి లంకమల అభయారణ్యం. ఇటీవల వర్షాలు ఏకధాటిగా కురవడంతో అటవీ ప్రాంతంలో ఎండిన చెట్లు చిగురించి పచ్చదనం పరుచుకుంది. ప్రకృతి సోయగాలతో చూసే కళ్లకు ఆహ్లాదాన్నిస్తోంది. సిద్దవటం రేంజ్ అడవుల్లో పలు రకాల వన్యప్రాణులకు నిలయంగా ఉన్నాయి. వేసవిలో వన్యప్రాణులకు గడ్డి కొరత రాకుండా 2021లో సిద్దవటం అటవీ అధికారులు రోలబోడు బీటు అటవీ ప్రాంతంలో గడ్డి పునరుత్పత్తి ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. గడ్డి గింజలు చల్లి పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టారు. తద్వారా పచ్చని గడ్డి పెరగడంతో వన్యప్రాణులకు ఆహార నిలయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి పునరుత్పత్తి ప్రాంతం పచ్చదనంతో మెరుస్తూ మంత్రముగ్ధులను చేస్తోంది. - **న్యూస్‌టుడే, సిద్దవటం**

# కిలకిలారావాలు.. విదేశీ అందాలు

దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే ఈ పక్షి దక్షిణ భారతంలోని కొన్ని సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకుని జీవిస్తాయి. జనావాసాలకు దూరంగా ఉంటుంది.

దీని పేరు **రామదాసు.** దక్షిణ భారత దేశంలో సంచరిస్తుంది. చలికాలంలో సోమశిలకు చేరుకుని వేసవి ప్రారంభమైన తర్వాత తిరిగి వెళ్తుంది.

సోమశిల చెంతకు విదేశీ వలస పక్షుల రాక మొదలైంది.. సురక్షిత ప్రదేశం కావడం, తగినంత ఆహారం లభించడంతో భారీగా వలస వస్తున్నాయి. వెనుక జలాల్లో అందాల అతిథులు కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. విహంగాలు అబ్బురపరిచే విన్యాసాలు నేత్రానందాన్ని పంచుతున్నాయి. ఏటా నవంబరు మొదటి వారం నుంచి ఇక్కడి వస్తాయి. జన సంచారం చాలా తక్కువగా ఉండడం, కాలుష్య రహితం కావడంతో సువిశాలమైన వెనుక జలాల్లో గూడు కట్టి, గుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయి. ఒంటిమిట్ట మండలంలో పాతమాధవరం, కొండమాచుపల్లె, బోయనపల్లి, కలికిరి, గుండ్లమాడ, మదిలేగడ్డతోపాటు మరికొన్ని గ్రామాల్లో ఉంటున్నాయి. పక్షి ప్రేమికుడు, విశ్రాంత అటవీ క్షేత్రాధికారి మొహమ్మద్ హయాత్ వీటి వివరాలను ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

● **ఎక్కడెక్కడ :** పెన్నానది, సగిలేరు, బాహుదా సంగమ ప్రాంతాల్లోనూ విహరిస్తున్నాయి.

● **ఏపే రకాలంటే..:** పెయింటెడ్ స్టార్క్స్, పెలికాన్స్, సైబీరియా తెల్ల, ఎర్రకాళ్ల, నీటి కొంగలతో పాటు మరెన్నో రకాలు ఇక్కడ ఉంటున్నాయి. - **న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

సోమశిలకు చైనా, కంబోడియా, థాయిలాండ్, మయన్మార్ దేశాల నుంచి వస్తుంది. చేప పిల్లలు, పురుగులు, నత్తలు, పీతలే ఆహారం.

ఉత్తర భారతదేశంలోని హరియాణ, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఇక్కడికి చేరుకుంటుంది. ఒక్కో పక్షి 2 నుంచి 4 గుడ్లు పెడుతుంది. పెన్నా పరివాహక ప్రాంతాన్ని ఆవాసంగా చేసుకుంది.

## 19న జిల్లాకు సీఎం రాక!

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాకు రానున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 19న అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంలో భాగంగా 20వ విడతను అమలు చేయనున్నారు. అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ నిధులు కూడా ఈ ఏడాది రెండో విడత జమ చేస్తారని సమాచారం. కార్యక్రమాన్ని జిల్లా నుంచి సీఎం ప్రారంభించే వీలుందని క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా పాలనాధికారి సూచించడంతో వ్యవసాయ, ఉద్యానశాఖల జిల్లా అధికారులు చంద్రానాయక్, సతీష్, ప్రకృతి వ్యవసాయ విభాగాధికారి ప్రవీణ్ కుమార్, తదితరులు ఆదివారం పెండ్లిమర్రి మండలంలోని చెన్నం రాజుపల్లె, చిన్నదాసరిపల్లె, యాదవాపురం గ్రామాలను పరిశీలించారు.

## నేడు డయల్ యువర్ సీఎండీ

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ సమయంలో 89777 16661 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేయవచ్చన్నారు. వాట్సప్ నంబరు 91333 31912కు సమస్య చిత్రాలు పంపితే పరిష్కరిస్తామన్నారు.

# భక్తి పరవశం

పవిత్ర కార్తీక మాసాన అయ్యప్ప స్వాములు భక్తి శ్రద్ధలతో నిర్వహించే అంబుళం పూజలకు జిల్లా వేదికైంది. ఆదివారం రాజంపేట, రాయచోటి, సుండుపల్లె ప్రాంతాల్లో భారీ ఎత్తున గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. రాజంపేట-తిరుపతి ప్రధాన రహదారి సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పడి పూజను వేడుకగా నిర్వహించారు. సుండుపల్లిలోని విరూపాక్ష, చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. - **న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ, సుండుపల్లె, రాయచోటి**

# మల్లె.. పరిమళం

పరిమళం.. తాజాదనం.. మృదుత్వం.. ఒక దాన్ని మించి మరొకటి పోటీ పడే వాల్మీకిపురం సన్న మొగ్గలు (సన్నజాజులు) మూడు రాష్ట్రాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాయి. మల్లెల్లో ఎన్నో రకాలున్నా వాల్మీకిపురంలో సాగవుతున్న సన్న మొగ్గలంటే ప్రత్యేకత. మిగిలిన రకాలను తోసిరాజని మగువల మనస్సును దోచుకుంటున్నాయి. ముఖ్యంగా మార్చిలో సన్నమల్లెలు సీజన్ ప్రారంభమై ప్రతి ఏటా నవంబరులో ముగుస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నజాజులు కిలో రూ.1000 వరకు ధర పలుకుతున్నాయి. వాల్మీకిపురం పరిసరాల్లో దాదాపు వంద ఎకరాల్లో మల్లెతోటలుండగా ఎకరాకు 3,500 కిలోల చొప్పున ఏటా 400 టన్నులకు పైగా పూల దిగుబడి వస్తోంది. సగటున కిలో ధర రూ.300 నుంచి గరిష్ఠంగా కిలో రూ.1000 దాకా పలుకుతోంది. ఈ నెలాఖరుతో మల్లెల సీజన్ ముగియనుంది.

- **న్యూస్‌టుడే, వాల్మీకిపురం**



మల్లె పూలను విడిపిస్తున్న కూలీలు

# పల్లెకు పాలాభిషేకం

**రామసముద్రం, న్యూస్‌టుడే:** రామసముద్రం మండలంలోని తిరుమలరెడ్డిపల్లె గ్రామం పూర్తిగా పాడిపైనే ఆధారపడింది. ప్రతి ఇంటా పాడి ఆవులే కనిపిస్తాయి. గ్రామంలో 200 కుటుంబాలుంటే రోజువారీగా సుమారుగా 2 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. అమూల్, దొడ్ల, శ్రీజ, సంఘం వంటి డెయిరీలు పోటాపోటీగా ఇక్కడ పాలసేకరణ చేస్తున్నాయి. సరాసరి లీటరు పాల ధర రూ.38 అయినా రోజూ పాలతోనే రూ.70 వేల వరకు గ్రామస్థులు ఆదాయం పొందుతున్నారు. నెలకు రూ.21 లక్షలు పాల రాబడి. పాడి ఆదాయంతో పిల్లల చదువులు, పొదుపు, ఇళ్ల నిర్మాణం వంటి వాటికి ఖర్చు పెడుతూ ముందుకు వెళ్తున్నారు. పొదుపు సంఘాల్లో నగదును పోగు చేసుకుంటూ ఆర్థికంగా మహిళలు నిలదొక్కుకుంటున్నారు. ఇప్పటికే గ్రామంలో అత్యున్నత ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శోభారాజ్‌లతో పాటూ పలువురు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. గ్రామంలో ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంత వాతావరణానికి నిలయంగా నిలుస్తోంది.



# అన్నమయ్య.. నీకెంత కష్టమయ్యా!

పామర జన భాషకు సాహిత్య గౌరవం కల్పించిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. వైవిధ్యభరితమైన సంకీర్తనలతో పాటకు పట్టాభిషేకం చేశారాయన. ఆయన పుట్టి, పెరిగి, తిరిగిన చోట మనోళ్లు ఆలనాపాలనా మరిచారు. తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. చూసినోళ్లు అయ్యో అన్నమయ్యా.. నీకెంత కష్టమొచ్చిందయ్యా అంటూ వాపోతున్నారు. రాజంపేట మండలం బాదనగడ్డ శివారు చెయ్యేరు నది ఒడ్డున అన్నమయ్య జలాశయ ద్వారం పక్కనే సంకీర్తనాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పచ్చదనం కోసం మొక్కలు నాటారు. వైకాపా పాలనలో 2021 నవంబరు 19న వరదలు పోటెత్తి మట్టి కట్ట పూర్తిగా కొట్టుకుపోయింది. సంకీర్తనాచార్యుల నందనవనం ముళ్లపొదలు, కంపచెట్ల నడుమ నేడు కళాహీనంగా దర్శనమిస్తోంది.

- **ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, రాజంపేట గ్రామీణ**

# సొమ్ము సిల్లకు... ఆధారాలిస్తే ఖాతాలకు!

లావాదేవీల్లేని అకౌంట్లు లక్షల్లో
రూ. 73.97 కోట్లు ఉన్నట్లు గుర్తింపు

మన దగ్గర డబ్బు ఉంటే ఎక్కడ దాచుకుంటాం.. బ్యాంకులోనే కదా! అలా దాచుకున్న నగదు భద్రంగా ఉంటుందని మన నమ్మకం.. అయితే అలా నమ్మకంగా సొమ్ము దాచుకున్న వారు తమ ఖాతాలను నిర్వహించకుండా వదిలేస్తే.. ఇటీవల ఆర్‌బీఐ అలా నిర్వహణ లేకుండా వదిలేసిన ఖాతాలను గుర్తించాలని బ్యాంకులను ఆదేశించింది. విస్తుపోయే నిజాలు అందులో వెలుగు చూశాయి. లక్షల్లో ఖాతాలు, రూ.కోట్లలో నగదు నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సరైన ఆధారాలు చూపితే ఆ సొమ్ము ఖాతాదారులకు అందజేసే అవకాశాలున్నాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఆ వివరాలు మీకోసం. - **న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు**

● గత పదేళ్లుగా లావాదేవీలను నిర్వహించని బ్యాంకు ఖాతాలు జిల్లాలో 3,58,714 ఉన్నాయి ఇందులో రూ.73.97 కోట్ల నిధులు అన్‌క్లెయిమ్‌గా గుర్తించారు. ఈ మొత్తం ఆయా బ్యాంకుల ప్రధాన శాఖల నుంచి ఆర్‌బీఐకి వెళ్లింది. లావాదేవీలు నిర్వహించని ఖాతాల్లో వ్యక్తిగత, ప్రభుత్వ, వివిధ సంస్థల ఖాతాలు ఉన్నాయి.

● ఈ మొత్తాన్ని సంబంధిత వ్యక్తులు తిరిగి పొందేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గొప్ప అవకాశం కల్పించింది. దీని కోసం ‘మీ డబ్బు-మీ హక్కు’ పేరుతో డిసెంబరు 31వ తేదీ వరకు పలు రకాలుగా బ్యాంకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**జిల్లాలో అన్‌క్లెయిమ్ ఖాతాలు, నగదు నిల్వల వివరాలివి**

| ఖాతా రకం | లావాదేవీలు నిర్వహించని ఖాతాలు | నగదు నిల్వలు (రూ.కోట్లలో) |
|---|---|---|
| వ్యక్తిగత ఖాతాలు | 3,39,990 | 53.22 |
| వివిధ సంస్థల పేరిట | 15,067 | 17.84 |
| ప్రభుత్వ శాఖల వారీగా | 3,657 | 2.91 |
| మొత్తం | 3,58,714 | రూ.73.97 కోట్లు |

## తిరిగి పొందడం ఎలా!

బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వ ఉంటే ఎందుకు తీసుకోరు అనే సందేహం మీకు రావొచ్చు. అయితే వివిధ కారణాల వల్ల ఇలా కోట్లాది రూపాయలు అన్‌క్లెయిమ్‌గా నిలిచిపోతోంది. ఆర్‌బీఐ వారు ఇలాంటి వారికి మరో అవకాశం కల్పించారు. తగిన ఆధారాలు తీసుకువచ్చి బ్యాంకుల్లో సమర్పిస్తే వారి ఖాతాలను తిరిగి పునరుద్ధరించనున్నారు.

● ఆధార్‌కార్డు, పాన్‌కార్డుతో పాటు పాస్‌పోర్టు ఫొటో తీసుకుని బ్యాంకుకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. అప్పుడే మన ఖాతాను పునరుద్ధరిస్తారు. తిరిగి ఆర్‌బీఐతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఆ డబ్బును సదరు ఖాతాల్లోకి జమ అయ్యేలా చూస్తారు.

● ఒకవేళ ఖాతాదారుడు చనిపోతే వారసులు వచ్చి డెత్ సర్టిఫికెట్‌తో పాటు.. కుటుంబ సభ్యుల అంగీకార పత్రాన్ని బ్యాంకు అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. అవే కాకుండా బ్యాంకు వారు కోరిన మరికొన్ని డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. చనిపోయిన వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి కూడా కుటుంబ సభ్యులు ఆ మొత్తాన్ని తీసుకోవచ్చు.




(c) eenadu

# లేఖ రాయండి.. బహుమతి గెలవండి

● తపాలాశాఖ ఆధ్వర్యంలో పోటీలు




గతంలో ఒక ప్రాంతంలో నివసించే వారు మరో ప్రదేశంలోని వారికి ఏదైనా సమాచారం అందించాలంటే ఉత్తరాలే మార్గం. ఉత్తరాలతో కుటుంబ సంబంధాలు బాగుండేవి. సాంకేతికత, డిజిటలైజేషన్ కారణంగా లేఖలు కనుమరుగవుతున్నాయి. చేతిరాతనే మరచిపోతున్నారు. దీంతో గత సంస్కృతి కొత్త తరానికి తెలిసేలా.. దుర్వినీతి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ తపాలాశాఖ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో లేఖల పోటీలు నాలుగేళ్లుగా నిర్వహిస్తోంది. విజేతలకు నగదు బహుమతులు అందిస్తోంది. ఈ ఏడాది 'నా రోల్ మోడల్‌కు ఉత్తరం రాస్తే' (లెటర్ టు మై రోల్ మోడల్) అనే థీమ్‌ను ప్రకటించింది.

● **నగదు బహుమతులు:** జాతీయ స్థాయి పోటీలో ఉత్తమ లేఖలకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ.10 వేలు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.25 వేలు, ద్వితీయ రూ.10,000, తృతీయ స్థానం దక్కించుకున్న వారికి రూ.5 వేల నగదు అందించనున్నారు.

● **రెండు విభాగాల్లో నిబంధనలు ఇలా:** రోల్ మోడల్ అనుకుంటున్న వ్యక్తులపై తెలుగు, ఆంగ్లం, హిందీలో ఉత్తరాలు రాసే అవకాశం ఉంది. ఎన్వలప్ విభాగంలో ఏ4 పేపర్‌పై 1000 పదాలు, ఇన్‌లాండ్ లెటర్ విభాగంలో 500 పదాలు మించకుండా రాయాలి. ● ఏ వయసు వారైనా పోటీల్లో పాల్గొని రాయొచ్చు. ఉంటుంది. ఈ రంతో పాటు 2025 జనవరి నాటికి వయసు 18 ఏళ్లు పైబడిన వారు, నిర్దారణ ప్రతిని జత చేయాలి. దరఖాస్తులు డిసెంబరు 8వ తేదీ లోపు జిల్లా తపాలా కార్యాలయానికి అందించాలని వాల్మీకిపురం తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

- న్యూస్‌టుడే, కలకడ, చిన్నమండెం

# ఘనంగా కార్తిక వన భోజన మహోత్సవం

మదనపల్లె అర్బన్: అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు

**మదనపల్లె అర్బన్, పీలేరు, కలికిరి, బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** కార్తికమాసం ఆదివారం సందర్భంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. మదనపల్లె అమ్మచెరువు మిట్టలోని మృత్యుంజయేశ్వరాలయ ఆవరణలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చేనేత రంగంలోని పద్మశాలీయులకు జీఎస్టీలో రాయితీ కల్పించాలని కోరారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు గుత్తికొండ త్యాగరాజు గుత్తి శ్రీరాములు, వెంకటసుబ్బయ్య, మురళీ, బి.శంకర నారాయణ, రెడ్డెప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు: వనభోజన కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు

**కలికిరి:** జంగముల సంక్షేమ సంఘం కోసం కృషి చేస్తానని రాష్ట్ర జంగమ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవ చంద్రశేఖర్ అన్నారు. అనంతపురంలో జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్తిక వనభోజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**పీలేరు:** పీలేరులోని కొత్తపేట వద్ద బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు రమేష్, రామచంద్ర, లక్ష్మీకర్, వెంకటరమణ, మనోహర్, జగన్మోహన్, మధు, నాగేంద్రప్రసాద్, కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బి.కొత్తకోట:** పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగితే అభివృద్ధి సాధ్యమవుతుందని పద్మశాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు వద్ద సమావేశం నిర్వహించారు. బి.కొత్తకోట సింగిల్‌విండో అధ్యక్షుడు దేరంగుల నారాయణను సన్మానించారు. నాయకులు లక్ష్మీప్రసాద్, బీసీ రమణ, శ్రీనివాసులు, ఆనంద్, రవి, పద్మనాభం, హరి, రమణ, వెంకటరమణ పాల్గొన్నారు.

# తెలుగువారి ఖ్యాతి చాటిన మహోన్నత వ్యక్తి రామోజీరావు

రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కొండయ్య తదితరులు

**ప్రొద్దుటూరు విద్య, ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే:** తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి 'ఈనాడు' గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు దివంగత చెరుకూరి రామోజీరావు అని ఎస్వీ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి కొనియాడారు. ఆదివారం ప్రొద్దుటూరు శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో రామోజీరావు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలో బోయనపల్లి వద్ద రామోజీ రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తాళ్లపాక గ్రామస్థులు పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 'ఈటీవీ- ఈనాడు' సంస్థలు స్థాపించి తెలుగు రాష్ట్రాలతో పాటు, ప్రపంచ నలుమూలల్లోని తెలుగు వారికి వార్తలను అందించిన కలం యోధుడన్నారు.

రామోజీరావు చిత్ర పటం వద్ద తాళ్లపాక గ్రామస్థులు

# లండన్‌లో నేత్ర పర్వంగా నర్మదేశ్వర స్వామి కల్యాణం

లండన్‌లో కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

**బద్వేలు, బ్రహ్మంగారి మఠం, న్యూస్‌టుడే:** కార్తిక మాసాన్ని పురస్కరించుకుని లండన్ దేశంలో ఆదివారం మీనాక్షీ సమేత నర్మదేశ్వర స్వామి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లెకు చెందిన గోవిందస్వామి మఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకను అక్కడి తెలుగువారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీనివాస శాస్త్రి లండన్ నుంచి 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ సంఘ సంస్కర్త గోవిందస్వామి చరిత్రను, ఆయన గొప్పదనాన్ని స్వదేశంలోనే కాకుండా లండన్‌లో కూడా తెలుగు వారికి తెలియజేసే అవకాశం తనకు లభించిందన్నారు.

# ఉపాధికి వెళ్తే బంధించి.. హింసిస్తున్నారు

## రూ.30 లక్షలు చెల్లిస్తే వదిలేస్తామని బెదిరింపులు

తమ కుమారుడి ఫొటోతో తల్లిదండ్రులు నాగరాజు, మంజుల

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** ఉపాధి కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన తన కుమారుడిని బంధించి చిత్ర హింసలకు గురి చేస్తున్నారని తల్లిదండ్రులు నాగరాజు, మంజుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడిని స్వగ్రామానికి వచ్చేలా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను ఆదివారం వారు కోరారు. వివరాలు.. పెద్దతిప్పసముద్రం అంబేడ్కర్ కాలనీకి చెందిన నాగరాజు తంబళ్లపల్లె మండలంలో వీఆర్వోగా పనిచేస్తూ ములకలచెరువులో నివాసం ఉంటున్నారు. ఈయన కుమారుడు నాగేష్ బాబు ఇంటర్ వరకు చదువుకున్నారు. పెద్దమండ్యానికి చెందిన సాజాన్ తాను పనిచేస్తున్న పరిశ్రమలో ఉద్యోగం ఉందని నాగేష్‌బాబును ఈ ఏడాది ఏప్రిల్ 30న దక్షిణాఫ్రికా తీసుకెళ్లారు. అక్కడ దొంగతనం జరిగితే అది వీరే చేయించారని యజమాని ఓ గదిలో బంధించి చిత్ర హింసలకు గురి చేస్తున్నారు. రూ.30 లక్షలు చెల్లిస్తేనే తమ కుమారుడిని వదిలిపెడతామని లేకపోతే చంపేస్తామని యాజమాని ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు నాగేష్ బాబు తండ్రి నాగరాజు పేర్కొన్నారు. ఈ విషయాన్ని దక్షిణాఫ్రికాలోని ఇండియన్ ఎంబసీకి ఫోన్ ద్వారా సమాచారం అందించామని తల్లిదండ్రులు తెలిపారు. పెద్దమండ్యం మండలానికి చెందిన మరో ఇద్దరు యువకులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

# కిడ్నీ రాకెట్ కేసులో నిందితులకు 14 రోజుల రిమాండ్

## మదనపల్లె సబ్‌జైలుకు తరలింపు

**మదనపల్లె (గ్రామీణ), న్యూస్‌టుడే:** కిడ్నీ రాకెట్ కేసులో ఆరుమంది నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు, మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ మేనేజరు బాలరంగడు, కదిరి ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ కేంద్రం మేనేజర్ మెహరాజ్, విశాఖపట్నానికి చెందిన పిల్లి పద్మ, సత్య, సూరిబాబులను శనివారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఆదివారం మధ్యాహ్నం వైద్యపరీక్షల కోసం మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. అనంతరం మదనపల్లె న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు మదనపల్లె సబ్‌జైలుకు నిందితులను తరలించినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

వైద్యపరీక్షల నిమిత్తం నిందితులను ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొస్తున్న పోలీసులు

● **పరారీలో ఉన్న వారి కోసం గాలింపు:** కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి మరో ప్రధాన నిందితుడైన బెంగళూరుకు చెందిన వైద్యుడు, ఇందులో ప్రమేయమున్న ఏడు మంది కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరి కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి బెంగళూరు, గోవా, తెలంగాణ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు.

# ఐక్యతతోనే మాలల హక్కుల సాధన

మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమాల సుదర్శన్

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** మాలలు ఐక్యతతో ఉద్యమించి రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమాల సుదర్శన్ అన్నారు. ఆదివారం మదనపల్లెలో మాలమహానాడు రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత వర్గాలపై అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు, దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఎస్సీ వర్గీకరణ రద్దుచేసి మాలల జనాభా ప్రకారం 20 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు ఎన్.రెడ్డెప్ప, చింతా మోహన్, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, రాష్ట్ర నాయకులు వెన్నకేశవులు, స్వర్ణ వెంకయ్య, చంద్రయ్య, సంజీవి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు

పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కె.బుడుగుంటపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్- 19 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఆదివారం ఆయా జట్ల మధ్య హోరాహోరీ పోటీలు నిర్వహించగా బాలుర విభాగంలో నెల్లూరు, అనంతపురం, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు, కడప, తూర్పుగోదావరి జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, నెల్లూరు, విశాఖపట్నం, కడప, శ్రీకాకుళం, అనంతపురం జట్లు విజయం సాధించినట్లు అండర్ - 19 ఎస్‌జీఎఫ్ కడప జిల్లా అధ్యక్షుడు టీఎన్‌వీ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు చెప్పారు. సోమవారంతో ఈ పోటీలు ముగుస్తాయని వివరించారు.

# ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

**రాయచోటి, న్యూస్‌టుడే:** సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పెండింగ్ ప్రమోషన్లను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం ఆయన రాయచోటిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ భర్తీ చేయడానికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెంటనే ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. నోబెల్ టీచర్స్ అసోసియేషన్‌ను మండల స్థాయిలోనూ బలోపేతం చేస్తుందని గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేష్ తెలిపారు. అనంతరం రాయచోటి మండల ఎన్‌టీఏ అధ్యక్షుడుగా గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా అమర్నాథ్, గౌరవాధ్యక్షుడుగా పాలగిరి పకీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# మద్యం మత్తులో బలవన్మరణం

షేక్ షాహులు

**రాజంపేట, న్యూస్‌టుడే:** భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. ఉస్మాన్‌నగర్‌కు చెందిన షేక్ షాహులు(34) నిత్యం మద్యం తాగి భార్యతో గొడవ పడేవారు. ఈ క్రమంలో శనివారం భార్యతో గొడవపడగా ఆమె తిరుపతిలోని పుట్టింటికి వెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మద్యం మత్తులో ఉరి వేసుకున్నారు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.

# ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

యాస్మిన్‌కు నచ్చజెప్పుతున్న కానిస్టేబుల్

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఓ మహిళ పోలీసు కార్యాలయం ఎదుటే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... శెట్టిగుంటకు చెందిన సయ్యద్ యాస్మిన్ 2023లో అదే గ్రామానికి చెందిన అఫ్సర్‌ను వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లకు ఆయన కువైట్ వెళ్లారు. ఇటీవల తిరిగి వచ్చిన ఆయన రాజంపేటకు చెందిన మరో మహిళను వివాహం చేసుకోవడంతో ఆమె తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు ఆమె భర్తపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తుండటంతో మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే యాస్మిన్‌ను ఆపారు. ఈ విషయంపై ఎస్సై లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... ఆమె ఫిర్యాదును స్వీకరించామని, కొన్ని కేసులను కోర్టు అనుమతి మేరకు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ లోపు ఆమె తొందరపడి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారని చెప్పారు.

# జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

హాసినిని అభినందిస్తున్న హెచ్‌ఎం రమేష్‌కుమార్‌రెడ్డి, పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయినులు

**కలికిరి, న్యూస్‌టుడే:** అథ్లెటిక్స్ వంద మీటర్ల పరుగు పందెంలో కలికిరి ఇందిరమ్మకాలనీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హాసిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కుమార్‌రెడ్డి, పీడీ రెడ్డిమోహన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఇందులో వంద మీటర్ల పరుగు పందెం విభాగంలో విద్యార్థిని ప్రతిభ చాటింది. ఈ నెల 28న ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో హాసిని పాల్గొంటుందన్నారు. హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు సుజిత్, హసీనా, కుమారి, అశోక్, సురేఖ విద్యార్థినిని అభినందించారు.

# కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**రాయచోటి, న్యూస్‌టుడే:** రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోని కార్యాలయాల్లో కూడా ప్రజలు అర్జీలు సమర్పించవచ్చన్నారు. వాటిని కూడా కూడా పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణిస్తారన్నారు. గతంలో ఇచ్చిన అర్జీల స్థితిని తెలుసుకొనేందుకు 1100 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని అర్జీదారులు మాత్రమే జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు తీసుకురావాలన్నారు.

# బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప రిమ్స్ ఠాణా పరిధిలో 14 ఏళ్ల బాలుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కడప బహుజననగర్‌కు చెందిన నందకుమార్ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గత నెల 23న అతని తండ్రి కృష్ణ పాఠశాల బస్సు ఎక్కించగా అతను పాఠశాలకు వెళ్లలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ముమ్మరంగా గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించగా అదృశ్యం కేసు నమోదు చేశారు.

# ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీ

**రాయచోటి, న్యూస్‌టుడే:** కర్నూల్, అనంతపురం రేంజిల పరిధిలో పని చేస్తున్న 15 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూల్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీచేశారు. అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలో పని చేస్తున్న వీరిని బదిలీ చేశారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి.

| పేరు | పని చేస్తున్న స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| ఎ.సత్యనారాయణ | మదనపల్లెరూరల్ | వీఆర్ రేంజి ఆఫీస్ అనంతపురం |
| ఎం.రవినాయక్ | శ్రీసిటీ, తిరుపతి | మదనపల్లె రూరల్ |
| సి.చంద్రశేఖర్ | చిత్తూరు డీసీఆర్బీ | రైల్వేకోడూరు అర్బన్ |
| కె.హేమసుంధర్‌రావు | రైల్వేకోడూరు అర్బన్ | పోరుమామిళ్ల సర్కిల్ |
| డి.శ్రీనివాసులు | పోరుమామిళ్ల సర్కిల్ | రైల్వేకోడూరు సర్కిల్ |
| టి.వెంకటేశ్వర్లు | రైల్వేకోడూరు సర్కిల్ | ఎస్‌బి-3 అన్నమయ్య |
| ఏ.పి.మస్తాన్ | గుంతకల్ టుటౌన్ | రాజంపేట రూరల్ |
| డి.వి.రమణ | రాజంపేట రూరల్ | వీఆర్ రేంజి ఆఫీసు అనంతపురం |
| టి.బాబు | ఒంటిమిట్ట | ఏహెచ్‌టీయు అన్నమయ్య |
| పి.నరసింహరాజు | వీఆర్ చిత్తూరు | ఒంటిమిట్ట సర్కిల్ |
| కె.రామచంద్ర | ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్ | కలికిరి అర్బన్ |
| పి.చంద్రశేఖర్ | సోషియల్ మీడియా వైఎస్ఆర్ కడప | సైబర్ క్రైం ఆర్‌ఎస్ఏఎస్‌టీఎఫ్ అన్నమయ్య |
| ఎ.సురేష్‌రెడ్డి | ఆర్ఎస్‌టీఎఫ్ అన్నమయ్య | కడప ట్రాఫిక్ పీఎస్ |
| డి.కె.జావిద్ | కడప ట్రాఫిక్ | సోషియల్‌మీడియా సైబర్‌క్రైం కడప |
| ఎ.మోహన్‌కుమార్ | వీఆర్ అన్నమయ్య | ఆర్ఎస్‌టీఎఫ్ అన్నమయ్య |

# ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి: మంత్రి

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**రాయచోటి, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై సంబంధిత అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న విదేశీ నాణేల ప్రదర్శన

**మారుతీనగర్, న్యూస్‌టుడే:** 50 దేశాల కరెన్సీకి సంబంధించిన నాణేలను విశ్రాంత గ్రంథాలయ అధికారి రంగనాథ్ సేకరించారు. ఈ సందర్భంగా కొండాయపల్లెలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం వాటితో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయాచార్యులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

# 30న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ లీగ్ పోటీలు

**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు అనిబిసెంట్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 30న ఖేలో ఇండియా అస్మిత లీగ్ జిల్లా స్థాయి అండర్- 14, 16 జిల్లా స్థాయి బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలుంటాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.అహమర్ బాషా తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా శిక్షణ కేంద్రాలు, జాతీయ అథ్లెటిక్ శిక్షణ శిబిరాలకు ఎంపిక చేస్తారని, ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 99496 86586, 80198 80995 నంబర్లను సంప్రదించాలన్నారు.

# నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

**పీలేరు, న్యూస్‌టుడే:** ఈ నెల 17 నుంచి 26 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయం విభాగం ఆదేశాలు జారీచేసింది. పిల్లల బయోమెట్రిక్ నవీకరణ (ఎంబీయూ) చేసేందుకు గత నెలలో ఏర్పాటు చేసిన శిబిరాలను కొనసాగించాలని సూచించింది. జిల్లాలో 49,357 మందికి గాను 4367 మంది నవీకరణ చేసుకున్నారు. మిగిలిన 44,990 మంది నవీకరణ చేసుకోవాల్సి ఉంది. ● జిల్లాలోని ప్రతి మండలంలో నాలుగు కేంద్రాలను పాఠశాలలు, సచివాలయాల్లో పిల్లలకు సౌకర్యంగా ఏర్పాటు చేశారు. ఆధార్ నవీకరణ విషయంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపాలని అధికారులు చెబుతున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కడప ఖ్యాతిని నిలబెట్టారు!

## రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 17 పతకాలు కైవసం

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కడప క్రీడాకారులు

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** విజయనగరం కొండవెలగడ ప్రాంతంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కడప వెయిట్ లిఫ్టర్లు పతకాల పంట పండించారు. మొత్తం 17 పతకాలు సాధించారు. అందులో 5 బంగారు, 5 రజతం, 7 కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి నారాయణరావు తెలిపారు. ఈ పోటీల్లో రవిశంకర్ 'స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ది ఏపీ' టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఈయన 141 కేజీల స్నాచ్, 185 కేజీల క్లీన్ అండ్ జర్క్ విభాగంలో రాణించడంతో ఇతనికి బెస్ట్ టైటిల్ అవార్డు సైతం సొంతమైంది. సబ్ జూనియర్ బాలుర వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కడప జట్టు రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. భానుతేజ బెస్ట్ లిఫ్టర్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు శిక్షకుడు శివశంకర్ రెడ్డిని, పతకాలు సాధించిన క్రీడాకారులను వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ నారాయణరావు అభినందించారు.

సబ్ జూనియర్ విభాగంలో ఏపీ టీం ఛాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న కడప వెయిట్ లిఫ్టర్లు

**సత్తా చాటిన క్రీడాకారుల వివరాలు..:** ● **బాలుర సబ్ జూనియర్ విభాగం:** పృధ్వీ, భానుతేజ, కిరణ్‌కుమార్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్ (బంగారు పతకాలు) చైతన్య, వాజిద్‌బాషా (రజతం) మాబు హర్షద్, అశోక్‌లు (కాంస్యం) ● **బాలుర జూనియర్ విభాగం:** పృధ్వీ 60 కేజీల విభాగంలో (రజతం) చైతన్య 71 కేజీల విభాగంలో (కాంస్యం) ● **సీనియర్ విభాగం:** రవి శంకర్ (బంగారం) శివరామ కృష్ణయాదవ్ (రజతం), సూర్య నరసింహ వ్యాస (కాంస్యం) ● **బాలికల సబ్ జూనియర్ విభాగం:** సిరి చందన (రజతం), వెలంగిణి వేద, లెనిన్ ప్రియ (కాంస్యం) బాలికల జూనియర్ విభాగంలో సిరిచందన (కాంస్యం) పతకాన్ని సాధించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

REAL ESTATE

LEASE/ RENT

2.75 ACRES Comm Land Suitable for School or College or Warehouse, off NH205, 15 Mits from Tirupati. ✆ 94452 53860.

TO LET

COMMERCIAL

కడప పాలెంపాపయ్యవీధిలో మద్రాసు రోడ్డు నుండి 4వ బిల్డింగ్ కార్ పార్కింగ్, 24 గం||లు నీటి సౌకర్యం కల్గిన G+1+2 ఫ్లోర్స్ (ఒక్కో ఫ్లోర్ 2100 Sqft) గల బిల్డింగ్, హాస్పిటల్స్, బ్యాంక్స్, ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్స్& కమర్షియల్ అవసరాలకు బాడుగకు ఇవ్వబడును.9133232320

కడప మారుతీనగర్ (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell : 77029 36190.

JOBS

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ప్రేవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

APSRTC బస్టాండ్ కడప CCTVలో పనిచేయుటకు ఎలక్ట్రీషియన్ & టెక్నీషియన్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత.సం|| 75692 45777, 6300831277

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి వట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మదనపల్లె
• మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

## కలకడలో గ్రంథాలయ వారోత్సవాలు

ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

**కలకడ, న్యూస్‌టుడే:** గ్రంథాలయ వారోత్సవాలను కలకడ లైబ్రరీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, రంగనాథన్, హరిసర్వోత్తమరావు చిత్ర పటాలకు విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అమరనాథ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య లోపం.. నీరు కలుషితం

మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి మధ్య బడబళ్లమంకపల్లె ఉన్న సీసీ రహదారికి ఇరువైపులా కోళ్ల వ్యర్థాలు, చెత్త పడేయడంతో నీరు కలుషితమవుతున్నాయి. ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే తిరుమలకు కాలినడకన వెళ్లే పాదచారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

## అయ్యప్ప భక్తులకు అన్నదానం

**మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో రెండు నెలల పాటు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సేవకులు మల్లిగారి సుదర్శ్ నాయుడు అన్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ సేవకులు ఆదివారం ప్రారంభించారు. ఆలయ ఆవరణలో జరిగే అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులే కాక, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్ట్ రాజు, హేమంత్, శివమూర్తి, బండి అమరనాథ్, ఆనందనాయుడు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**వాల్మీకిపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలో మదనపల్లె తిరుపతి పాత జాతీయ రహదారి సమీపంలో శబరిమల అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గురుస్వామి టమాట రామచంద్ర, ఆలయ కమిటీ సభ్యులు బలరాం, శీనా, శేఖర్ స్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తిక దీపోత్సవం నేడు

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఈ నెల 17న లక్ష కార్తిక దీపోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## అసంపూర్తి భవనాలు.. చిన్నారులకు అవస్థలు

● అంగన్‌వాడీ కేంద్రాల్లో దుస్థితి

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** అసంపూర్తిగా భవన నిర్మాణాలతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర సౌకర్యాలతో పాటు, కొన్ని భవనాల్లో మౌలిక సదుపాయాలేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు.

● జిల్లాలో స్త్రీ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2,275 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 51,842 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్లున్న పిల్లలు 44,211 మంది ఉన్నారు. సొంత భవనాలు 1,030 ఉండగా 450 అద్దెవి, 795 అద్దెలేని భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

పుంగనూరువాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులూడుతున్న పైకప్పు

● జిల్లాలోని చాలా సొంత భవనాలు పాతవి కావడంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. మదనపల్లె మండలం తట్టివారిపల్లె, బసినికొండ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పైకప్పు నుంచి వర్షాల సమయంలో నీరు ఉరుస్తోంది. పుంగనూరు వాండ్లపల్లె సొంత భవనం పెచ్చులూడి ఫ్యాను కూడా కూలిపోయే పరిస్థితి ఉంది. బసినికొండ, కొత్తిండ్లు సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పరిస్థితి ఇలాగే ఉంది. కనీసం మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోలేదు. పిల్లలపై పెచ్చులూడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొన్నిచోట్ల తాగునీటి పైపు కనెక్షన్లు కూడా లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే బాలలు తాగు నీటి బాటిళ్లు తీసుకురావాల్సి ఉంది. 2024-25 సంవత్సరంలో 420 మరుగుదొడ్లు మంజూరు కాగా అసంపూర్తిగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

గంగన్నగారిపల్లెలో నిర్మాణ దశలోనే అంగన్‌వాడీ కేంద్రం

### ప్రభుత్వానికి నివేదిస్తాం

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. కేంద్రాల మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

**- హేమావతి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ**

## ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

**మదనపల్లె పట్టణం:** ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన ఇంటి వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తాగునీరు, రేషన్‌కార్డు మంజూరు, ఇంటిస్థలం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

## రాయితీపై ఉలవల మంజూరు

**రామసముద్రం:** రాయితీపై ఉలవ విత్తనాల కోసం రైతు సేవాకేంద్రాల్లో అన్నదాతలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో జాఫర్ సూచించారు. రామసముద్రం మండలానికి 300 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించినట్లు తెలిపారు. 80 శాతం రాయితీపై పంపిణీ చేస్తామన్నారు. 10 కిలోల బస్తా విత్తనాలకు రైతు రూ.112.50 చెల్లించాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో శివపార్వతుల ఊరేగింపు

**పీలేరు, పీలేరు గ్రామీణ:** గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శివరామపురంలో గార్గేయనది తీరంలో వెలసిన మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఆదివారం బ్రాహ్మణ కార్తిక వన మహోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్రశర్మ, నరసింహమూర్తి, జీవీఎస్ ఆర్య ప్రసాద్, శ్రీధర్ స్వామి, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో మల్లికార్జున స్వామి

శివరామపురంలో ఊరేగింపు

### ఘనంగా కొడ్డెవర బొట్టు పంపిణీ

**తంబళ్లపల్లె, ములకలచెరువు:** ఎద్దులవారిపల్లి పంచాయతీ దిగువగొల్లపల్లిలో ఆదివారం మహిళలు కొడ్డెవర బొట్టు కార్యక్రమాన్ని చేపట్టారు. దేవర పెద్ద జయరాంరెడ్డి, పద్మావతి దంపతులు మద్దమ్మ దేవతకు పూజలు నిర్వహించారు.

## సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రభుత్వ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లెలో అసోసియేషన్ డివిజన్ ఎన్నికల అధికారి రెడ్డెప్ప, మండల సర్వేయరు సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో సంఘం డివిజన్ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వై.సురేశ్‌కుమార్, కె.రవిచంద్ర, ఉపాధ్యక్షులుగా ఎ.ముబారక్, సంయుక్త కార్యదర్శిగా బి.ఉమామహేశ్వర్ నాయక్, కోశాధికారిగా పి.సురేశ్‌కుమార్, సభ్యులుగా బి.వి.సుబ్రహ్మణ్యం, ఎస్.హసీన్‌బాషా, ఎస్.మహమ్మద్‌రఫీ, పి.నాగరాజ, పి.రెడ్డెప్ప, డి.పుష్పచంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై జిల్లా, రాష్ట్ర కమిటీలతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నూతనంగా ఎన్నికైన డివిజన్ సర్వేయర్ల సంక్షేమ సంఘం సభ్యులు

## తప్పుడు ప్రచారాలు చేస్తే సహించం

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం, పక్కన నాయకులు

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వంపై, మదనపల్లెలో మంత్రుల పర్యటనపై వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ జంగాల శివరాం, అజీస్‌ముల్లా ధ్వజమెత్తారు. రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. ఇటీవల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి వచ్చిన మంత్రులు జిల్లా ప్రకటన చేయలేదని వైకాపా ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ విమర్శలు చేయడం తగదన్నారు. పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం నిర్వహిస్తుంది, దీనిపై తప్పుడు ప్రచారం వైకాపా మానుకోవాలన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వైద్యకళాశాలల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో భాజపా సీనియర్ నాయకులు అజంతుల్లాఖాన్, మార్కెట్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘాట్‌రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డును కప్పేసిన చెట్ల కొమ్మలు

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డును ఇరువైపులా చెట్లకొమ్మలు కమ్మేస్తున్నాయి. కాండ్లమడుగు నుంచి కొండపై వరకు 10 కిలోమీటర్ల ఈ రహదారి దట్టమైన అటవీ ప్రాంతం ద్వారా సాగుతుంది. ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు పెరిగిపోయి ఘాట్‌రోడ్డుపైకి చొచ్చుకొని వస్తుండటంతో మలుపుల్లో ఘాట్‌రోడ్డు మూసుకుపోతోంది. డ్రైవర్లకు ఎదురుగా వస్తున్న వాహనాలు సక్రమంగా కనిపించకపోవడంతో డ్రైవర్లు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇటీవల ఘాట్‌రోడ్డులో ఓ వృక్షం కూలిపోయి కొన్ని గంటల పాటు ట్రాఫిక్ ఏర్పడింది. ఈ విషయమై అటవీ, రహదారులశాఖ అధికారులు జోక్యం చేసుకుని చెట్ల కొమ్మలను తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు. ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న వృక్షాలను గుర్తించి తొలగించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## భవిత కేంద్రంలో విద్యుత్తు పునరుద్ధరణ

**కలికిరి:** కలికిరి భవిత కేంద్రంలో విద్యుత్తు సరఫరా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గత సెప్టెంబరు 22న 'అంధకారంలో విద్యార్థుల భవిత' అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ అధికారులు భవిత కేంద్రానికి విద్యుత్తు సౌకర్యాన్ని పునరుద్ధరించారు.

## డిమాండ్ల సాధనకు పోరాటం

మహాసభకు బయలుదేరుతున్న నాయకులు

**వాల్మీకిపురం, న్యూస్‌టుడే:** మాలల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా భవిష్యత్తులో తమ పోరాటం కొనసాగుతుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు వెంటస్వామి అన్నారు. మదనపల్లెలో జరిగిన రాష్ట్ర మాల మహాసభకు ఆదివారం వాల్మీకిపురం నుంచి వాహనాల్లో మాలలు బయలుదేరారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఐక్యత చాటారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, నాయకులు సుధాకర్, దాము, రమేష్, భూషణ్, కమలాకర్, రాజు, బీవీ.రమణ, రమణ, గురుప్రసాద్, అశోక్, రమేష్, రెడ్డి ప్రసాద్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో చోదకులు సమాజ సేవకులు

**పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పీలేరుకు చెందిన బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోదేషావలి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆటో చోదకులు సమాజ సేవకులని కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ పురం రామ్మూర్తి అన్నారు.

## కత్తితో పొడిచిన నిందితుడి అరెస్టు

**రామసముద్రం, న్యూస్‌టుడే:** కత్తితో దాడి చేసి గాయపరిచిన నిందితుడు హరికుమార్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెలో రెండు రోజుల క్రితం బాధితుడు అశోక్‌కుమార్‌పై పెద్దనాన్న కుమారుడు హరికుమార్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేశారు.

## బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

**ములకలచెరువు, న్యూస్‌టుడే:** తంబళ్లపల్లె మండలానికి చెందిన విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిగువపాళ్యం పంచాయతీ చింతలరేవుపల్లికి చెందిన దామోదర్ కుమారుడు రాజు ములకలచెరువు మండలం వేపూరికోటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడిని విచారించారు. విద్యార్థి పాఠశాలకు రాలేదని చెప్పడంతో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తంబళ్లపల్లె మండలంలో ఆదివారం జరిగింది. అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు... మండలంలోని కోటకుంటకు చెందిన భానుప్రియ కుటుంబ సమస్యలతో ఆదివారం ఇంట్లోనే విష ద్రావణం తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

## కిడ్నీ రాకెట్‌పై సమగ్ర విచారణకు డిమాండ్

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** కిడ్నీ రాకెట్‌పై జిల్లా జడ్జితో సమగ్ర విచారణ చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు హరిశర్మలు డిమాండ్ చేశారు. ఆదివారం గ్లోబల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఎదుట వీరు మాట్లాడారు. కిడ్నీ రాకెట్ ముఠా పెద్దలను కాపాడే విధంగా ప్రభుత్వ వైఖరి ఉందని ఆరోపించారు. ఆరు మందిని అరెస్టుచేసి గ్లోబల్ ఆసుపత్రిని ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించారు. ఇక్కడ కనీసం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయలేదన్నారు. కేసును నీరుగార్చే యత్నాలు సాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.

## ఎన్‌సీసీ అధికారికి కెప్టెన్ హోదా

నవీన్‌కుమార్

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** మిట్స్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ విభాగంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న ఎన్.నవీన్‌కుమార్ కెప్టెన్ హోదా పొందినట్లు వీసీ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మహారాష్ట్రలో నిర్వహించిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో ఉద్యోగోన్నతి పొందారని తెలిపారు. నవీన్‌కుమార్‌ను ఛాన్సలర్ డాక్టర్ విజయభాస్కరచౌదరి, ప్రోఛాన్సలర్ ఎన్.ద్వారకనాథనాయుడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాదెళ్ల కీర్తి అభినందించారు.

## నీటిశుద్ధి యంత్రం నిరుపయోగం

**కలికిరి-కలకడ** ప్రధాన మార్గం పసలవాండ్లపల్లె క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రం నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రం రూ.5 లక్షల నిధులతో రెండేళ్ల కిందట నిర్మించారు. నీటి సౌకర్యం కల్పించక పోవడంతో నీటి సరఫరాకు నోచుకోలేదు. ఈ విషయమై ఎంపీడీవో భానుమూర్తిరావు మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి శుద్ధి కేంద్రం వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

## నూతన కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే:** మదనపల్లె నాన్‌గెజిటెడ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రైల్వే కోడూరు తాలూకా అధ్యక్షుడు పి.ఓబులేశు, డి.రవీంద్ర వర్మ, జె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సి.రెడ్డిశేఖర్, ఉపాధ్యక్షులుగా ఆది వెంకటేశ్వర్లు, బి.ఎస్.శశిశేఖర్, ఎం.వెంకటరమణ, ఎన్.విజయకుమార్‌రెడ్డి, పి.నాగజ్యోతి, కార్యదర్శిగా ఎం.శివప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.హరికుమార్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వి.సోమశేఖరయ్య, రెడ్డెప్ప, హెచ్.హేమవతిరెడ్డి, వి.శివకిషోర్, కె.కుమారి, కోశాధికారిగా ఎస్.సైపుల్లా, ఎ.రవినాయక్, కె.మహేశ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

పెద్దమండ్యం: ఎంపికైన అసోసియేషన్ సభ్యులు

**పెద్దమండ్యం, న్యూస్‌టుడే:** మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా బద్రి హేమంత్‌కుమార్, అధ్యక్షుడిగా సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎన్.సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా బి.భాస్కర్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.బాలాజినాయక్, ఆర్థిక కార్యదర్శిగా పి.మదన్ ఎంపికయ్యారు. రాయచోటిలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది.

**గుర్రంకొండ:** మండల నోబుల్ టీచర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆ శాఖ రాష్ట్రాధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు చెప్పారు. మండలశాఖ అధ్యక్షుడిగా త్రినాథరావు, ప్రధాన కార్యదర్శిగా జనార్దననాయుడు, ఆర్థిక కార్యదర్శిగా రాము, ఉపాధ్యక్షుడి శ్రీకాంత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

### ఆపస్ మండల కార్యవర్గం ఎన్నిక

**పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) కంభంవారిపల్లె మండల అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పీలేరులో జరిగిన సమావేశంలో సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన నియామకం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా హరినాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని నియమించి, నివేదిక ఇచ్చేలోపు మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ఆపస్ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ నోబుల్ టీచర్స్ మండల కార్యవర్గం ఇదే

## డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనం

**ములకలచెరువు:** డ్రైవర్ల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్‌సీఈఎంఎం యూనియన్ నాయకుడు హబీబ్ అన్నారు. ములకలచెరువు మార్కెట్ యార్డులో ఆదివారం ములకలచెరువు మండలంలోని డ్రైవర్ల అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, నాగరాజు, హరి, శంకర, రమేష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బయన్న, అంజనప్ప పాల్గొన్నారు.

## స్వచ్ఛత పనులు

**కలికిరి:** కలికిరి క్రాస్ రోడ్డులోని మదనపల్లె మార్గంలో మురుగు ప్రవహించి పారిశుద్ధ్యం లోపించడంతో పాదచారులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయమై శనివారం ఈవో అశోక్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లడంతో.. స్పందించిన ఆయన ఆదివారం మురుగు రహదారిపై ప్రవహించకుండా చర్యలు చేపట్టారు. స్థానికులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION), MADANAPALLE
O.E.P. No. 92 of 2018
O.S. No. 2457 of 2016
Sri C. Shiva Reddy ...D.Hr
//Vs//
Dadam Ramana Reddy ...J.Dr
NOTICE
To:
Dadam Ramana Reddy, S/o Krishna Reddy, No.47, Lakkana Compound, Opp. J.S.S. School, Konana Kunte, Bangalore-62, Native of Mundreganipalle, Balireddigaripalle Post, Thamballapalle Mandal.
The D.Hr has filed above E.P. for attachment and sale of E.P. schedule property and it is posted to 25.11.2025 for your appearance at 10-30 a.m. before the above court. you can appear in person or through advocate before the court above time failing which the matter will be decided in your absence.
Sd/- Sri Y.V.Sesha Reddy, Sri M.V.Ramanappa, Sri L.Amaranath, Sri D.Narendra, Kum. Y.Deepa
Advocates for D.Hr., Madanapalle.

## పశువైద్యం.. సేవలందక దైన్యం

● మదనపల్లె డివిజన్‌లో వైద్యులు, వసతుల కొరత

**మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** మదనపల్లె డివిజన్‌లోని పశువుల ఆసుపత్రుల్లో వైద్యుల కొరతతో సకాలంలో పశువులకు వైద్య సేవలందడం లేదు. డివిజన్‌లో 12 మండలాల్లో 23 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ఎనిమిది ఆసుపత్రుల్లో కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. వీరు పక్క మండలాల్లోని ఆసుపత్రులకు బాధ్యులుగా కొనసాగుతున్నారు. బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాల్లోని ఆసుపత్రుల్లో వైద్యుల కొరతతో పశువులకు వైద్య సేవలందడం లేదు.

### గణాంకాల్లోనే ప్రథమం

రాష్ట్రంలో పశు సంవర్ధకశాఖలో వివిధ సేవల్లో మదనపల్లె డివిజన్ ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. అయితే సకాలంలో పశువులకు వైద్యమందడం లేదు. డివిజన్‌లో 1.48 లక్షల పశువులు, 5 లక్షల గొర్రెలు, 45 లక్షల కోళ్లు, 83 వేల మేకలున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో వైద్యుల కొరతతో సిబ్బందే సేవలందించాల్సిన పరిస్థితి నెలకొంది.

● మదనపల్లె డివిజన్‌లోని సుమారు 30 పశు వైద్యశాలల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. మందులు, వైద్యుల కొరతతో పశువులకు వైద్య సేవలందించడంలో జాప్యం జరుగుతోంది.

### ఉన్నతాధికారులకు తెలియజేశాం

పశు సంవర్ధకశాఖలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ఇందులో భాగంగా వైద్యులతో పాటు సిబ్బంది కొరత తీర్చాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశాం.

**- శ్రీనివాసులు నాయుడు, ఉప సంచాలకులు, మదనపల్లె**

## శవాగారం వద్ద బాధితుల నిరసన

● డీఎస్పీ హామీతో మృతదేహానికి అంత్యక్రియలు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

**కలికిరి గ్రామీణ:** అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన యువకుడు వినీత్ కేసుకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఆర్ఐలో నిందితుల వివరాలు సక్రమంగా లేవంటూ మృతుని తల్లిదండ్రులు, బంధువులు ఆదివారం శవాగారం వద్ద నిరసనకు దిగారు. శనివారం కేసు నమోదులో జాప్యం చేయడంతో పాటు నిందితుల వివరాలు తప్పుల తడకగా నమోదు చేసిన పోలీసుల తీరుపై తమకు అనుమానంగా ఉందని మృతదేహాన్ని తీసుకెళ్లమన్నారు. సమాచారం తెలుసుకున్న రాయచోటి డీఎస్పీ కృష్ణ మోహన్, పీలేరు సీఐ యుగంధర్‌లు కలికిరి ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకుని బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని నచ్చజెప్పడంతో మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లారు. అనంతరం సీఐ సత్యాపురం వద్ద జరిగిన సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీంతో కలసి పరిశీలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

# రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

## జగన్ పాలనలో పారిశ్రామిక విధ్వంసం

మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

**రాజంపేట, న్యూస్‌టుడే:** గత వైకాపా పాలనలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారిశ్రామిక రంగాన్ని విధ్వంసం చేశారని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత వైకాపా పాలనలో రాష్ట్రంలోని పరిశ్రమలు పారిపోగా నేడు కూటమి పాలనలో వరుస కడుతున్నాయన్నారు. పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టడానికి రాజంపేట అనువైన ప్రాంతమని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## అందరూ భక్తి భావాన్ని అలవరుచుకోవాలి

**రాయచోటి, న్యూస్‌టుడే:** అందరూ భక్తి భావాన్ని అలవరుచుకోవాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన అంబలం పూజలో ఆయన సతీ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి అభిషేక పూజ చేశారు. అయ్యప్ప భక్తులు 40 రోజుల పాటు కఠోర దీక్ష చేసి స్వామి వారికి మొక్కులు తీర్చుకోవడం ఎంతో పవిత్రమైన రోజులని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పూజలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతి

**రాయచోటి, న్యూస్‌టుడే:** పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేసి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, ఎస్.జాబీర్‌లు తెలిపారు. రాయచోటిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2016లో అప్పటి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు అమలు కావడం లేదన్నారు. జిల్లా పరిషత్తు మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్‌నాయుడు, శివారెడ్డి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్

## ఇలాగుంటే.. దోమలు పుట్టవా.. కుట్టవా!

● మురుగు కుంటలుగా ఖాళీ స్థలాలు

● జ్వరాలతో జనం ఆసుపత్రుల పాలు

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** పట్టణాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమల తాకిడి పెరిగింది. వర్షాల రాకతో కాలనీల్లో మురుగు కాలువలు పొంగి ఇళ్ల మధ్యలోకి ఆ నీరంతా చేరి దోమల ఫ్యాక్టరీలుగా మారాయి. దీంతో సమీప నివాసాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం అయితే చాలు వీధుల్లో, ఇళ్లల్లోకి చొరబడి కసిదీరా కుడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

★ కొన్ని రోజులుగా రాయచోటి, రాజంపేట, మదనపల్లె పట్టణాల్లో విష జ్వరాలు పెరగడంతో ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ నయం కాక తిరుపతి, నెల్లూరు, కడప, చెన్నై వంటి నగరాల్లో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి వైద్యం పొందుతున్నారు.

★ రాజంపేటలోని 12, 16, 21 వార్డుల్లో సత్యం మిల్లు వద్ద ప్రధాన రహదారి సమీపంలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. రహదారి కంటే చాలా తగ్గులో ఉండడంతో వర్షం నీరు చేరి చిన్నపాటి కుంటల్లా మారాయి. మురుగు నీటిలో చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమీప నివాస ప్రాంతాల ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

★ రాయచోటిలో మాండవ్య నదీ తీరం అంతా కాలుష్య కాసారంగా మారింది. కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. ఇక్కడ ప్రముఖ విద్యా సంస్థలున్న ప్రాంతాల్లో నిర్వహణ అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు పట్టపగలే దోమల కాటుకు గురవుతున్నారు.

★ మదనపల్లె పట్టణంలో బాహుదా నదితో పాటు ఊరి మధ్యలో ఉన్న చెరువే దోమలకు ఆవాసంగా మారింది. ఇక్కడ సాయంత్రం పొద్దుగూకిందంటే చాలు తెల్లవారు దోమలతో ఇక్కట్లు తప్పడం లేదు. ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో దోమల దెబ్బకు ప్రయాణికులు ముప్పుతిప్పలు పడుతున్నారు.★ వానలు పడితే ఇక్కడ రహదారులు చెరువులుగా మారుతున్నాయి. వాన వెలిసినా ఈ నీరు ఇంకి పోవడానికి నెలలు పడుతోంది. దీంతో సరస్వతీపురం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం వసతి సముదాయాల్లో నివాసం ఉన్న వారు ముప్పుతిప్పలు పడుతున్నారు.★ ఇక్కడ గత 20 ఏళ్లగా ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామ పంచాయతీలో నివాసం ఉన్నా బాగుండేదని వాపోతున్నారు. ఈ వార్డులో కాలువలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్నవారు లేరని, ప్రజా ప్రతినిధులు కూడా దయ చూపడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజంపేట పట్టణం నూనెవారిపల్లి వద్ద చేరిన మురుగు నీరు

## కళల ప్రోత్సాహానికి కృషి

**సిద్దవటం, న్యూస్‌టుడే:** కళలు, కళాకారులను ప్రోత్సహించడానికి తమ వంతు కృషి చేస్తామని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. సిద్దవటంలోని ఆకులవీధిలో శనివారం రాత్రి అతికారి కృష్ణ ఆధ్వర్యంలో కోలాటం గజపూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన కళాకారులు ప్రదర్శించిన కోలాటాన్ని తిలకించారు. ఆకులవీధి, జంగాలపల్లె మహిళా కళాకారులకు, స్థానిక మహిళలకు ఆయన కుటుంబసభ్యులు ఉచితంగా పట్టు చీరలు పంపిణీ చేశారు. అనంతరం కళాకారుల బృందం ఆయన్ను ఘనంగా సత్కరించింది.

కళాకారులతో కలిసి మాట్లాడుతున్న సమన్వయకర్త అతికారి కృష్ణ

## జూదరుల అరెస్టు

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** రాజంపేట మండలం కొమ్మివారిపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.16 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## మురుగు ఇలా... అడుగు పడేదెలా!

పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. మదనపల్లె రోడ్డు మార్గంలోని మురుగు కాలువలు పొంగి ప్రధాన రహదారిపై మురుగు నిలుస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానికులు పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి రహదారిపై మురుగు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

## గుంతలమయం.. ప్రమాదాలకు నిలయం

సుండుపల్లి - చీనేపల్లి(పీలేరు) ప్రధాన రహదారిలో తొగటపల్లి సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై మరమ్మతుల పనులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సుండుపల్లి

## రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

గాలివీడు మండలంలోని గోపనపల్లె కస్బా, నక్కలవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూరలేదు. రెండు కేంద్రాలకు నిధుల మంజూరు చేయడంతో నిర్మాణ పనులు 70 శాతం చేపట్టి మధ్యలోనే వదిలివేశారు. తెదేపా పాలనలో కస్బాలో శరవేగంగా సిమెంటు ఇటుకలతో భవనం నిర్మాణం చేపట్టి మధ్యలోనే పనులు నిలిపివేశారు. నక్కల వాండ్లపల్లెలో వైకాపా పాలనలో పిల్లల కోసం భవన పనులు ప్రారంభించారు. ఇక్కడ కూడ స్లాబ్ వరకు పనులు ముగించారు. పర్యవేక్షణ లేకపోవడంతో అసంపూర్తి పనులతో దర్శన మిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గాలివీడు

గోపనపల్లె కస్బాలో నిర్మాణం అసంపూర్తి

## స్తంభం.. కూలితే ప్రమాదం

రైల్వేకోడూరు ప్రధాన రహదారి నుంచి లక్ష్మీనగర్‌కు వెళ్లే దారిలో వర్షాలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఇక్కడ ఉన్న విద్యుత్తు స్తంభం కింద ఉండాల్సిన సిమెంటు మొత్తం కూడా కొట్టుకుపోయింది. ఏమాత్రం గట్టిగా గాలులు వీచినా, పెద్దగా వర్షం కురిసినా స్తంభం పడిపోయే అవకాశాలున్నాయని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదం జరగకమునుపే స్తంభానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పెండ్యాల విజయ్‌కుమార్


ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఆర్యవైశ్యులు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** ఆర్యవైశ్య సంఘం రైల్వేకోడూరు నూతన అధ్యక్షుడిగా పెండ్యాల విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. 130 సంవత్సరాలలో మొట్ట మొదటిసారిగా ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించారు. గతేడాది వరకు ఏకగ్రీవ విధానంలో జరిగిన అధ్యక్ష ఎన్నిక ఈ ఏడాది ప్రత్యక్ష ఎన్నికలకు దారితీసింది. విజయ్‌కుమార్ - కామిశెట్టి సత్యనారాయణ అనే ఇరువురి మధ్య తీవ్రమైన పోటీ తలెత్తింది. పట్టణ పరిధిలో మొత్తం 277 మంది ఓటర్లు ఉండగా అందులో 271 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో విజయ్‌కుమార్ 191 ఓట్లు సాధించి గెలుపొందారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు వివరించారు.

## రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవండి

రక్తదానం చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

**సుండుపల్లి, న్యూస్‌టుడే:** రక్తదానం ప్రాణ దానంతో సమానమని మానవత సంస్థ జిల్లా కోశాధికారి జె.హరికుమార్, మండల శాఖ కన్వీనరు ఆర్.కృష్ణమరాజు అన్నారు. సుండుపల్లిలో ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వారు మాట్లాడారు. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉండి ఆరోగ్యంగా ఉన్న వారు నాలుగు నుంచి ఆరు నెలల విరామంతో రక్తం ఇస్తే వారు కూడా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అనంతరం పలువురు మానవతా సంస్థ సభ్యులు రక్తదానం చేశారు.

## ఐకమత్యంతో హక్కుల సాధనకు కృషి

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** బలిజలు ఐకమత్యంగా ఉండి తమ హక్కులను, సంక్షేమాన్ని సాధించుకోవాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం బలిజ కార్తిక వనభోజన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, నార్జాల దాశరధి, సభాపతి, యానాదయ్య తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా భాజపా అధ్యక్షుడు సాయిలోకేష్, తెదేపా నాయకులు ఎద్దుల సుబ్బరాయుడు, బాలిశెట్టి హరిప్రసాద్, విశ్రాంత పోలీస్ అధికారి మునిరామయ్య తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐకమత్యంగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని, వర్గవిబేధాలు పక్కనబెట్టి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అందరం కలసి పని చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్

## సమావేశాలతో సంఘాభివృద్ధి

డ్వాక్రా సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఖాదర్‌వలీ

**వీరబల్లి, న్యూస్‌టుడే:** సమావేశాలతో సంఘాలు బలోపేతం అవుతాయని ఏపీఎం ఖాదర్‌వలీ అన్నారు. ఆదివారం ఓదివీడు గ్రామసమాఖ్య-2 కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకోవడంతో సభ్యుల్లో అవగాహన పెరిగి ఆర్థిక లావాదేవీలు బాగుంటాయన్నారు. సంఘం లావాదేవీలన్ని సభ్యులందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ క్రిష్ణయ్య, సమాఖ్య అధ్యక్షులు దాక్షాయని, వీవోఏ మహేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

**రామాపురం, న్యూస్‌టుడే:** వ్యాసరచన పోటీలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని గ్రంథాలయం అధికారి సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాతూ.. నేడు విద్యార్థులంతా సామాజికమాధ్యంపై ఎక్కువ ఆసక్తి చేపుతున్నారన్నారు. దానివల్ల లాభం కన్న నష్టం ఉక్కువ పుస్తకాలు పఠం అలవాటుగా అలవర్చుకుంటే దాని వలన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చు అన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులు




## ఆలయాల్లో కార్తిక శోభ

పూజలందుకుంటున్న అమ్మవారు

ప్రత్యేక అలంకరణలో శివయ్య

**లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చెల్లు సురేంద్ర, గంగన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. **చిట్వేలి:** చిట్వేలి మండల పరిధిలోని నక్కలపల్లెలో వెలసిన భవానిశంకరాలయంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని అన్నంతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఉపాధ్యాయుల ఎంపిక

**గాలివీడు, న్యూస్‌టుడే:** రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపుతామని గాలివీడు మండలానికి చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయులు పి.సురేష్, రామేశ్వరం, రమణయ్య తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాయచోటిలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగిన జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటడంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటామన్నారు.

ఎంపికైన ఉపాధ్యాయులు

## ఉద్యమకారులను స్మరించుకుందాం

**పుల్లంపేట, న్యూస్‌టుడే:** గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని విశ్రాంత గ్రంథాలయ అధికారి సుబ్బరాజు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకొనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయంలో చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి శ్రీనివాసులు, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

## పార్టీ బలోపేతానికి కృషి

**రాయచోటి గ్రామీణ,న్యూస్‌టుడే:** అన్నమయ్య జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ సమీరుద్దీన్ ఎన్నికైనట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్యాలయంలో సమీరుద్దీన్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## ఏళ్లుగా.. మౌలిక వసతులు కరవు

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** రాజంపేట మండలం తాళ్లపాక- హేమాద్రివారిపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డును పరిశీలిస్తే 2020లో వచ్చిన నివర్ తుపాన్ గుర్తుకొస్తుంది. గతంతో తుపాన్ చేసిన గాయాన్ని నేటికి ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్నారు. వచ్చిన అకాల వరదలతో గ్రామంలోని వందల ఎకరాలు మామిడి చెట్లు కొట్టుకుపోయాయి. వ్యవసాయ భూముల్లో చేరిన ఇసుకను మాత్రం అమ్ముకున్న నాటి ప్రభుత్వం రైతుల భూములను మాత్రం గాలికి వదిలేసింది. లక్షల రూపాయలు ఖర్చు చేసి తిరిగి వ్యవసాయ భూములుగా మార్చుకున్నారు. అయితే ప్రభుత్వం గ్రామస్థులకు చేయాల్సిన మౌలిక వసతుల కల్పనను నీరుగార్చింది.

❖ తాళ్లపాక హేమాద్రివారిపల్లి గ్రామంలో 100 కుటుంబాల వరకు ప్రజలు నివాసం ఉన్నారు. రాజంపేట మండలంలో భారీ వరదలు వస్తే ఇక్కడి ప్రజలను వరద సహాయ కేంద్రాలకు తరలిస్తారు. వరదలు తగ్గిన వెంటనే వారిని గాలికి వదిలేయడం ఇక్కడ పరిపాటిగా మారుతోంది. గ్రామానికి కనీసం రోడ్డు కూడా ఏర్పాటు చేయలేదు. వరదల్లో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. వ్యవసాయ భూముల్లో మట్టితో ఏర్పాటు చేసిన రోడ్డు, చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణానికి నోచుకోని వంతెన

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

## జనసంద్రం

సూర్యలంక సముద్రతీరం సందర్శకులు, భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. స్థానిక అటవీ శాఖ తోటల్లో కార్తిక వన సమారాధనలు భారీఎత్తున నిర్వహించారు. భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి సైకత శివలింగాలకు పూజలు చేశారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా మైరైన్, బాపట్ల గ్రామీణ పోలీసులు డ్రోన్లతో పటిష్ఠ నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు పడవల్లో తిరుగుతూ పహారా కాశారు.

**- న్యూస్‌టుడే, బాపట్ల**

## సాగర్ నీటిమట్టం 586.40 అడుగులు

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం రాత్రి 8 గంటలకు 586.40 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 14,274 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. సాగర్ కుడి కాలువకు 10,000, ఎడమ కాలువకు 3374, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

# పర్యాటకం.. బ్రాండ్ బాపట్ల

### పెట్టుబడులకు అవకాశాల గని

న్యూస్‌టుడే, బాపట్ల

పేరలి కాలువ

జిల్లా విశిష్టతలు.. విశేషాలు తెలియజేసేలా బ్రాండ్ బాపట్ల పేరుతో అధికారులు పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా, జిల్లా పర్యటన కొత్త అనుభూతులు పంచేలా చీరాల చేనేత చీరల తయారీ, వేటపాలెం జీడిపప్పు ప్రాసెసింగ్ విధానాన్ని చూపించనున్నారు. విశాఖ పట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో జిల్లాలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు.

పర్యాటక రంగంలో 16 శాతానికి పైగా వృద్ధిరేటు లక్ష్యంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు బీచ్‌ల సందర్శనకు వచ్చి 24 గంటలు గడిపి వెంటనే వెళ్లకుండా మూడురోజులు ఉండి విశేషాలు తిలకించేలా, స్థానిక చేనేత, మత్స్య, జీడిపప్పు ఉత్పత్తుల కొనుగోలు ద్వారా మార్కెటింగ్ కల్పించి చేనేత కార్మికులు, మత్స్యకారులు, రైతుల ఆదాయం పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

జీడిమామిడి చెట్లు

**తోటల సందర్శన..** వేటపాలెం, బాపట, కర్లపాలెం, చినగంజాం మండలాల తీర ప్రాంతంలో జీడిమామిడి తోటలున్నాయి. జీడిమామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతుల సహకారంతో తోటల సందర్శన ప్రాజెక్టు చేపడుతున్నారు. నర్సరీ మొక్కలు, తోటలు, జీడిపప్పు ప్రాసెసింగ్ ప్లాంట్ల సందర్శన ద్వారా పంట సాగుపై అవగాహన కల్పిస్తారు. జీడిపప్పు ఉత్పత్తులతో విక్రయశాలలు ఏర్పాటు చేయనున్నారు. సూర్యలంక, వాడరేవు సముద్ర తీరంలో ఉండే వివిధ రకాల చేపలు.. పడవల్లో సముద్రంలోకి మత్స్యకారులు వెళ్లి చేపల వేట సాగించే తీరును చూపించనున్నారు. పర్యాటకులను సముద్రంలోకి వేట పడవల్లో విహారానికి తీసుకెళ్తారు.

**పేరలి కాలువలో నీటిలో తేలియాడే మార్కెట్‌ను ప్రారంభించనున్నారు.** ఒడ్డున జెట్టీలు నిర్మిస్తారు. కాలువ మధ్యలో వెదురు బొంగులపై నీటితో తేలుతూ ఉండే మార్కెట్లో చేపలు, రొయ్యలు, పీతలు, ఉద్యాన పంట ఉత్పత్తులు విక్రయించనున్నారు. పర్యాటకులు పడవల్లో వెళ్లి ఉత్పత్తులను సందర్శించి కొనుగోలు చేసేలా ప్రోత్సహించనున్నారు. తద్వారా రైతులు, మత్స్యకార మహిళలకు ఉపాధి, ఆదాయం లభించేలా ప్రణాళికలు రూపొందించారు.

**హౌస్ బోటింగ్ ప్రాజెక్టు**

ఆదర్శనగర్ వద్ద పేరలి కాలువ నుంచి నల్లమడ వాగు, ఉప్పుటేరు, తూర్పు తుంగభద్ర కాలువల మీదుగా నిజాంపట్నం హార్బర్ వరకు కేరళ అలెప్పీ తరహాలో హౌస్ బోటింగ్ ప్రాజెక్టు త్వరలో ప్రారంభించనున్నారు. పర్యాటక శాఖ ద్వారా ఆయా రంగాల్లోని చేనేత కార్మికులు, మత్స్యకారులు, జీడిమామిడి రైతులు, స్థానిక యువతకు ప్రతిపాదిత ప్రాజెక్టులు, అవుట్‌లెట్ల ఏర్పాటు, నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నారు.

# సదరం పత్రాల్లో తప్పులు

### ఆందోళనలో దివ్యాంగులు

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

వేటపాలెనికి చెందిన ఇర పని వెంకటేశ్వర్లు దివ్యాంగుడు. ఇతను తీసుకున్న సదరం పత్రంలోని సంతకంలో లైట్ మార్పు ఉండాలి. కానీ కన్ఫర్మ్ మార్పు ఉంది. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

చీరాలకు చెందిన అనిల్‌కి ఆయితే ఫొటో లేదు. సంతకాలు లేకుండా సదరం పత్రాన్ని ఇచ్చారు. ఇలా అనేక మందికి ఇటువంటి తప్పులు దొర్లడంతో ఇబ్బందులు పడుతున్నారు.



జిల్లాలో సుమారు 26 వేల మంది వరకు దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరిలో దాదాపు 18 వేల మందికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంత వరకు బాగానే ఉంది. వచ్చిన చిక్కల్లా పరీక్షలు చేయించుకున్న వారు సచివాలయాల ద్వారా సర్టిఫికెట్లు తీసుకుంటే వాటిల్లో ఫొటోలు లేకుండా, సంతకాలు లేకుండా రావడం చూసి వారి నోట మాట కరువైంది. శారీరక దివ్యాంగులకు ఉచితంగా త్రిచక్ర వాహనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి దరఖాస్తు చేయడానికి ఈ నెల 25 చివరి తేదీ. తప్పులతో ఉన్న పత్రాలతో ఎలా దరఖాస్తు చేయాలని వీరు తలలు పట్టుకుంటున్నారు. కొందరు వాటితోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే ఎర్రర్ అని వస్తోందని వాపోతున్నారు. సమస్యపై నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా తాడేపల్లిలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేపీఎస్ చక్రవర్తి బాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. సచివాలయాలలోని సిబ్బంది వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని, దీనిపై తక్షణమే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

## నూతన దంపతులకు ఆశీర్వచనం

**బాపట్ల, న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కుమారుడు రాకేష్ వర్మ వివాహ రిసెప్షన్ పట్టణ శివారు ముత్తాయపాలెం పరిధిలోని ఓ ప్రైవేటు రిసార్టులో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరై నూతన దంపతులు రాకేష్ వర్మ, రూపా నాగదేవిలను ఆశీర్వదించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## పచ్చ పీతల రుచే వేరయా!

జిల్లాలోని కర్లపాలెం, నిజాంపట్నం, రేపల్లె తీర ప్రాంతాల్లో లభించే సముద్ర పీతలకు విదేశీ మార్కెట్లలో మంచి గిరాకీ ఉంది. వీటి రుచే వేరని ఆహార ప్రియులు చెబుతున్నారు. పచ్చ పీతలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పెద్ద పీత బరువు 750 గ్రాముల నుంచి కిలోకు పైనే ఉంటుంది. తీరంలో ప్రత్యేకంగా పీతల వేట సాగిస్తున్నారు. జిల్లా నుంచి చైనా, తైవాన్, థాయ్‌లాండ్, వియత్నాం, చైనా, కాంబోడియా, సింగపూర్, యూఏఈ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. స్థానిక మార్కెట్లో కిలో పెద్ద పీతల ధర రూ.800 ఉంటుంది. విదేశాలకు పంపించే పచ్చ పీతల కిలో ధర రూ.1800 పలుకుతుంది. చెరువుల్లోనూ పీతల సాగు చేపడుతున్నారు. సొరదారు తమిళనాడు, పుదుచ్చేరి నుంచి పిల్లలను తెచ్చున్నారు. ప్రస్తుతం 200 ఎకరాల్లో సాగు జరుగుతోంది. బాపట్ల మండలం ఆదర్శనగర్లో మత్స్యకార మహిళలు మసాలాడే పీతల కూర, ఫ్రై వండి పర్యాటకులకు వడ్డిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ నుంచి వస్తున్న పర్యాటకులు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి పీతల కూర తిని రుచిని ఆస్వాదిస్తున్నారు.

## తగ్గేదేలే..

అంతర్ జిల్లాల అండర్-19 కబడ్డీ పోటీలు రెండో రోజు ఆదివారం లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సాగాయి. వివిధ జిల్లాల బాల, బాలికల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహించారు.

గ్యాలరీల నుంచి ప్రేక్షకులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు పోటీలను తిలకించారు. పోటీల రాష్ట్ర పరిశీలకురాలు అజిరాబేగం, స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, పోటీల కో-ఆర్డినేటర్ చిరంజీవి, జోన్ కార్యదర్శి వీరాంజనేయులు, అధ్యక్షుడు బాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, వినుకొండ**

## ఈ-నారీ.. ఆర్థికాభివృద్ధికి దారి

### యువతకు జీవనోపాధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు వ్యవస్థల్లో మార్పులు చేపట్టింది. మహిళా స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించింది. అందుకు పలు పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ-నారీ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఇది గ్రామాల్లోని యువతులకు జీవనోపాధి కల్పనకు దోహదపడుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో వెలుగు సిబ్బంది సంఘాల సభ్యురాళ్లతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ-నారీల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఎంపికైన మహిళలకు బ్యాంకింగ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం వంటివి చేపట్టాల్సి ఉంటుంది.

న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

గ్రామాల్లో వెలుగు గ్రూపులను ఇప్పటి వరకు సీఏలు పర్యవేక్షించేవారు. ఇకపై ఈ-నారీగా ఒకరిని ఎంపిక చేసి వీరికి బాధ్యతలు అప్పగిస్తారు. పది సంఘాలకు ఒక మహిళను ఎంపిక చేసి, వారికి గౌరవ వేతనం ఇవ్వనున్నారు. ఎంపికైన మహిళ తమ పరిధిలోని పది సంఘాల బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. సభ్యురాళ్లు పొదుపు చేసేలా, రుణాలు సకాలంలో చెల్లించడం, సంఘాల రికార్డులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేస్తారు. ఈ-నారీగా ఎంపిక కావాలంటే కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

**వివరాలు ఇలా..**

| | |
|---|---|
| జిల్లాలో మండలాలు | 25 |
| మండల సమాఖ్యలు | 25 |
| గ్రామ సంఘాలు | 1039 |
| మహిళా సంఘాలు | 30,538 |
| సభ్యులు | 3,05,682 మంది |
| ఈ–నారీ లక్ష్యం | 3,053 మంది |

**సంఘాల సమర్థ నిర్వహణకే..** 'వెలుగు సంఘాలను సమర్థంగా నిర్వహించడానికే ఈ-నారీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి దోహదపడుతుంది' అని పీవీపాలెం ఏపీఎం చిన్నయ్య తెలిపారు.

## యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చివేత

కారంచేడు, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో పోటెత్తిన వరదనీటితో కొమ్మమూరు కాలువకు పడిన గండ్ల పూడ్చివేత పనులను జలవనరుల శాఖ యుద్ధప్రాతిపదికన చేపట్టింది. బాపట్ల మండలం నరసాయపాలెం నుంచి చినగంజాం మండలం తిమ్మసముద్రం వరకు కాలువకు పడిన 67 గండ్ల పూడ్చివేతకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు రూ.3.54 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, పనులు చేపట్టారు. తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా గండ్లు పడిన ప్రాంతాల్ని గుర్తించి, పొక్లెయిన్లతో కాలువల గట్ల వద్ద మట్టితో నింపుతున్నారు. జలవనరుల శాఖ డీఈ ప్రసాదరావు, ఏఈలు గురుప్రసాద్, శ్రీధర్, నీలిమ, శ్రీనివాసరావులు పనులను పర్యవేక్షిస్తున్నారు. శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. కుంకలమర్రు దగ్గర పర్చూరు సర్‌ప్లస్ నుంచి సాగునీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

పొక్లెయిన్‌తో పూడ్చుతున్న గండి

## మోటుపల్లి- కుంట
## జాతీయ రహదారికి ప్రతిపాదనలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణానికి కృషి చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడులో ఆదివారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా మోటుపల్లి నుంచి ప్రకాశం జిల్లా కుంట వరకు జాతీయ రహదారి నిర్మించాలని కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. తీర ప్రాంతం నుంచి రవాణా సౌకర్యం మెరుగుపడితే ఆయా ప్రాంతాల రైతులకు, వ్యాపారులకు సౌలభ్యంగా ఉండటంతో పాటు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీలుంటుందన్నారు.


## అమ్మకమునకు స్థలము

బాపట్ల జిల్లా, చిన్నగంజాం మండల రెవిన్యూ ఆఫీస్ సమీపంలో 1.27 (ఒక ఎకరం ఇరవై ఏడు సెంట్లు) గల స్థలం తూర్పు ముఖంగా 180 అడుగుల వెడల్పుతోనూ పాత జాతీయ రహదారికి అనుకుని ఒంగోలు - చీరాల రోడ్డు ప్రక్కన నాలుగు పక్కల ప్రహరి గోడతో మరియు 30 అడుగుల పక్కా రోడ్డుతో రెవెన్యూ వారిచే నాన్ అగ్రికల్చరల్ భూమిగా మార్పు చేయబడి ఉన్న స్థలము అమ్మకమునకు కలదు. విద్యా సంస్థలకు మరియు షోరూములకు కావలసిన వారు సంప్రదించగలరు.

98663 96135
98484 90931


## గ్రామాల అభివృద్ధే లక్ష్యం: మంత్రి

తూర్పు కొప్పెరపాడులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న గొట్టిపాటి

జె.పంగులూరు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం జె.పంగులూరు, బల్లికురవ మండలాల్లో మంత్రి పర్యటించారు. జె.పంగులూరు మండలం తూర్పు కొప్పెరపాడులో సీఎస్ఆర్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన బీసీ సామాజిక భవనం, రూ.2 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన గోకుల షెడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.6.90 కోట్లతో నియోజకవర్గంలో 20 సామాజిక భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా గ్రామంలో భవనం ప్రారంభించామన్నారు. అలవలపాడు, తక్కెళ్లపాడు, కొప్పెరపాడు, చందలూరు గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు రూ.4.50 కోట్లతో తూర్పు కొప్పెరపాడులో ఉప కేంద్రం నిర్మించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

## ఆశ్రమం.. ఆకలి తీర్చుతోంది

**ఎనిమిదేళ్లలో లక్షల మందికి అన్నదానం**

అదో అక్షయ పాత్ర.. ఆకలితో అక్కడికి వెళ్లిన వారికి అన్నం లేదు అన్న మాట వినపడదు. ముఖం చూడరు.. కులం అడగరు.. మతం పట్టించుకోరు. అర్ధరాత్రి వెళ్లినా ఇంట్లో మాదిరిగానే అన్ని పదార్థాలు వడ్డిస్తారు. ఇలా వారం, నెల కాదు.. ఎనిమిదేళ్లుగా అన్నదానం ఒక యజ్ఞంలా చేస్తున్నారు. కరోనా కాలంలోనూ పొయ్యి వెలిగించని రోజు లేదు. రోజుకు సగటున 500 మంది చొప్పున ఇప్పటివరకు 14 లక్షల మందికి పైగా భోజనం చేశారు. అదే వినుకొండ ఏనుగుపాలెం రోడ్‌లోని కాశినాయన ఆశ్రమం.

**అన్నార్తుల సేవలో..** పట్టణానికి చెందిన కాంతారావు.. కాశినాయనపై ఉన్న భక్తితో విలువైన ఎకరమున్నర భూమిని 2017 ఏప్రిల్‌లో ఆశ్రమానికి ఉచితంగా అప్పగించారు. పప్పులు, ఉప్పు, బియ్యం, కూరగాయలు.. ఇలా అన్ని రకాల వంట సరకులు ఇస్తున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా వంట నుంచి వడ్డించడం వరకు ఉచితంగా సేవలందిస్తున్నారు. మూడు పూటలా ఆకలితో వచ్చినవారి ఆకలి తీరుస్తున్నారు. అర్ధరాత్రి వచ్చే వారి కోసం ఆహారం పాత్రల్లో ఉంచి వెళ్తారు. ఆశ్రమానికి వచ్చిన వారిని అతిథులుగా చూడాలన్న రామచంద్ర నాయన మాట గుర్తుకు వస్తుంటుందని.. అందుకే ఆహారం విషయంలో రాజీ పడబోమని ఆశ్రమ ప్రధాన సేవకులు సురేష్ తెలిపారు.

**- న్యూస్‌టుడే, వినుకొండ**

## హెచ్‌టీ సర్వీసులకు ప్రత్యేక యాప్

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

హెచ్‌టీ సర్వీసుల వినియోగదారులు ఇప్పటివరకు తమ విద్యుత్తు బిల్లులు చెక్కుల రూపంలో, బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా చెల్లించేవారు. దీని వల్ల సమయం చాలా వృథా అయ్యేది. ఇక నుంచి ఈ పరిస్థితి లేకుండా ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారుడు తమ స్మార్ట్ ఫోన్లో ప్లేస్టోర్ నుంచి ఏపీ ఎస్పీడీసీఎల్ హెచ్‌టీ కన్స్యూమర్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దానికి ఫోన్ నంబరు ఎంటర్ చేయాలి. ఆ తరువాత నాలుగు అంకెల ఓటీపీ నిర్ధారణ నిమిత్తం వస్తుంది. దాన్ని ఎంటర్ చేశాక సర్వీసు నంబరు వివరాలందిస్తే సరిపోతుంది. ఆ తరువాత బిల్లును చెల్లించవచ్చు.

✦ ఇందులో లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి.

✦ విద్యుత్తు వినియోగానికి సంబంధించిన యూనిట్ల వివరాలు, ఏ నెలలో ఎంత వినియోగించారో వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది.

✦ సరఫరా లోపాలు, బిల్లుల సమస్యలను నేరుగా తెలియజేస్తే అధికారులు స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతారు.

## వారాంతం.. కొండల్లో విహారం

ఆరు రోజుల ఒత్తిడి.. ఉరుకులుపరుగులు నడుమ జీవనం గడిపిన గడిపిన వారు ఆదివారం వచ్చిందంటే చాలు.. ఉదయం 4 గంటలకు నిద్రలేస్తారు. తాగునీరు, అల్పాహారం, బూట్లు బ్యాగులో వేసుకొని బయలుదేరతారు. నిర్వాహకులు తెలిపిన ప్రదేశానికి వెళ్తారు. అక్కడ వారు కొండలను ఎలా ఎక్కాలో.. జాగ్రత్తలు, మెలకువలు వివరిస్తారు. అనంతరం ప్రకృతి ప్రాముఖ్యాన్ని తెలుసుకుంటూ కొండలు ఎక్కుతూ ముందుకు కదులుతారు. ట్రెక్కింగ్ ద్వారా శరీరానికి వ్యాయామమే కాకుండా ప్రకృతి మాధుర్యాన్ని ఆస్వాదించడం ద్వారా కొత్త శక్తితో పాటు నూతన ఉత్సాహాన్ని పొందుతున్నారు. గుంటూరు ట్రెక్కింగ్ కింగ్స్ పేరిట గత మూడేళ్ల నుంచి కొండవీడు, కొండపల్లి, కోటప్పకొండ, మూలపాడు తదితర ప్రాంతాల్లో ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. గుంటూరుతో పాటు తెనాలి, మంగళగిరి, చిలకలూరిపేట ప్రాంతాల యువతీయువతులు, మహిళలు, పురుషులు, పిల్లలు పాల్గొని ఆనందం.. అనుభూతి పొందుతున్నారు. ఈ ఆదివారం కొండవీడులోని చుక్కలకొండ బురుజును 60 మంది అధిరోహించారు. ప్రకృతి అందాలు, నెమళ్లు, వివిధ పక్షులను తమ సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధించి మిత్రులు, బంధువులకు సామాజిక మాధ్యమాల్లో పంపించారు. **- న్యూస్‌టుడే, గుంటూరు**

బురుజు వద్ద జీటీకే బృందం


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541



(c) eenadu

## బాపట్ల పర్యటనలో గవర్నర్

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

**బాపట్ల, న్యూస్‌టుడే:** గవర్నర్ అబ్దుల్ నజీర్ ఒకరోజు పర్యటనకు బాపట్ల వచ్చారు. మండల పరిధిలోని కొత్త ఓడరేవు వద్ద ఓ ప్రైవేటు రిసార్ట్‌కు వచ్చిన గవర్నర్‌కు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, జేసీ భావన, ఆర్డీవో గ్లోరియా ఘన స్వాగతం పలికి మొక్కలు అందజేశారు. పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో బీచ్ టూరిజానికి ప్రోత్సాహం, పర్యాటకాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు చేపడుతున్న చర్యలను గవర్నర్‌కు కలెక్టర్ వివరించారు. ఆయన పర్యటన సందర్భంగా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## విద్యార్థులు.. మీ చెంతకే ఆధార్ సేవలు

### నేటి నుంచి క్యాంపులు ప్రారంభం

ఆధార్ సేవలు

**అమృతలూరు, న్యూస్‌టుడే:** విద్యార్థిగా గుర్తింపు సంఖ్య (అపార్) పొందడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, ఉపకార వేతనాలు, పథకాలు అందుకునేందుకు ఆధార్ అవసరం. ఈ ఆధార్ కార్డు నవీకరించుకోవాల్సిన వారిలో విద్యార్థులు ఉన్నారు. అలాంటి వారి కోసం ప్రతి మండలంలో కొన్ని పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈనెల 17 నుంచి 26 వరకు ఆధార్ శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టింది.

**వదిలేస్తే రద్దు:** ఆధార్ కార్డులను ఏళ్ల తరబడి నవీకరించుకోకపోతే ఇన్‌యాక్టివ్ లోకి వెళతాయి. రద్దు అయ్యే అవకాశం కూడా ఉంది. ఒకసారి రద్దు అయితే అప్‌డేట్ చేసినా ప్రయోజనం ఉండదు. మళ్లీ కొత్తకార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా కార్డులు రద్దు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

**ప్రజలకు అవగాహన:** గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు ఆధార్ నవీకరించుకోవడంలో అవగాహన కల్పిస్తారని ఎంపీడీవో శేషమాంబ తెలిపారు. ముఖ్యంగా 5-15 ఏళ్ల విద్యార్థుల కోసం ప్రస్తుతం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

❖ అపార్ పెండింగ్ ఉన్న విద్యార్థులు అందరూ తమ ఆధార్‌ను నవీకరించుకోవాల్సి ఉంది. ఏర్పాటు చేసిన మూడు శిబిరాల్లో ఆధార్ లేని పిల్లలు, పేరు సరిదిద్దుకోవడం, పుట్టిన తేదీలో తప్పుల సవరణ వంటివి చేసుకోవచ్చు. ఇలాంటి వారు తగిన ధ్రువపత్రాలతో శిబిరాలకు వెళ్లి సవరణ చేయించుకోవచ్చు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు ఖాతాల్లో వేయండి

**బాపట్ల టౌన్, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు, పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్ ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వ నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో సర్పంచుల గౌరవ వేతనం పెంచుతామని చెప్పారన్నారు. బడ్జెట్లో నిధులు కూడా పెంచి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మాట ఇచ్చినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

## తరతరాలకు మార్గదర్శి రామోజీరావు

రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఈటీఎంటీ ఛైర్మన్ శ్రీనివాసరావు, కాకతీయ సేవా సమాఖ్య అధ్యక్షుడు రమేష్‌బాబు, తదితరులు

**బాపట్ల, న్యూస్‌టుడే:** సామాన్య కుటుంబంలో జన్మించిన చెరుకూరి రామోజీరావు స్వయంకృషి, పట్టుదలతో మీడియా సామ్రాజ్యాన్ని నిర్మించి వేల మందికి ఉపాధి కల్పించటం ద్వారా భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా నిలిచారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు జయంతిని రైస్‌మిల్లర్ల సంఘం సమావేశ హాలులో ఆదివారం నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు, ఈటీవీల ద్వారా తెలుగు భాషా వికాసానికి విశిష్ట కృషి చేశారన్నారు. సమాజ హితమే ధ్యేయంగా మీడియాను నడిపించారన్నారు. కాకతీయ సేవా సమాఖ్య అధ్యక్షుడు ఆచంట రమేష్‌బాబు మాట్లాడుతూ రామోజీరావు మీడియా, సినిమా, వ్యాపార రంగాల్లో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనగంటి గాంధీ మాట్లాడుతూ రామోజీరావు పాటించిన క్రమశిక్షణ, విలువలు అందరికీ ఆదర్శనీయమన్నారు. బాపట్లలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. నేతలు ఆచంట విజయ్, ఆచంట అమరేష్, గుత్తికొండ రాజేష్, ఇనగంటి శ్రీకాంత్, పువ్వాడ దుర్గాప్రసాద్, తదితరులున్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులు

**కర్లపాలెం, న్యూస్‌టుడే:** కర్లపాలెం శివాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఐనాల పాలెం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగేశ్వరరావు(కరిశపాలెం), అధ్యక్షుడిగా మురిపిన నాగబాబు (కర్లపాలెం), డిగా శ్రీనివాసాచార్యులు (బొల్లాపల్లి), యువజన సంఘ అధ్యక్షుడిగా కదలి ప్రధాన కార్యదర్శిగా సన్నమూరి శ్రీనివాసరావు (కర్లపాలెం), ఉపాధ్యక్షుడిగా లక్ష్మణాచారి (చీరాల), మహిళా అధ్యక్షురాలిగా కొలకలూరి భారతీదేవి పూసపాటి సాంబశివరావు (బాజీ (అద్దంకి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో రద్దీ

పాత బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు వేచి ఉన్న ప్రయాణికులు

**బాపట్ల, బాపట్ల టౌన్, న్యూస్‌టుడే:** కార్తికమాసం పురస్కరించుకుని ఆదివారం బీచ్‌ల సందర్శనకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. బాపట్ల పాత బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. బస్సుల్లో నిలబడటానికి ఖాళీ కూడా లేదు. తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూశారు.

## పెన్‌కాక్ సిలాట్‌లో కానిస్టేబుల్ ప్రతిభ

### జాతీయ పోలీసు క్రీడల్లో విజేతగా నిలిచిన నరేంద్ర

**న్యూస్‌టుడే, బాపట్ల**

కుస్తీ.. తైక్వాండో క్రీడల గురించి అందరికీ తెలుసు. ఈ రెండు క్రీడల సమ్మేళనమైన పెన్‌కాక్ సిలాట్ ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతోంది. ఇండోనేషియాలో ఈ క్రీడ ప్రారంభమై మన దేశానికి విస్తరించింది. తూర్పు ఆసియా దేశాల్లో బాగా ప్రాచుర్యం పొందింది. శ్రీనగర్‌లో ఇటీవల నిర్వహించిన పదో జాతీయ పోలీసు క్రీడల్లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ నరేంద్ర విజేతగా నిలిచి పసిడి పతకం సాధించి ఏపీ ప్రతిష్ఠ ఇనుమడింపజేశారు.

జాతీయ క్రీడల్లో తుదిపోరులో ప్రత్యర్థితో తలపడుతున్న కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర

#### విజయప్రస్థానం సాగిందిలా..

పసిడి పతకంతో నరేంద్ర

✧ రేపల్లె సమీపంలో ఉయ్యూరివారిపాలేనికి చెందిన వీరంకి నరేంద్ర 2007లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. తైక్వాండో క్రీడాకారుడైన అతడు జాతీయ పోటీల్లో పలు మార్లు పసిడి, రజత, కాంస్య పతకాలు గెలిచారు. కానిస్టేబుల్‌గా పని చేస్తూనే దేహ దారుఢ్యాన్ని కాపాడుకోవటం కోసం తైక్వాండో సాధన చేశారు. పెన్‌కాక్ సిలాట్ గురించి తెలుసుకుని ఒంగోలులో కోచ్ మనోజ్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నారు. బాపట్లలో ఐదేళ్లు కానిస్టేబుల్‌గా పని చేసిన ఆయన ప్రస్తుతం కర్లపాలెం పీఎస్‌లో సేవలు అందిస్తున్నారు.

✧ తొలిసారిగా 2018లో అఖిల భారత పోలీసు క్రీడల్లో పాల్గొని కాంస్య పతకం సాధించారు. గతేడాది నిర్వహించిన జాతీయ పోలీసు క్రీడల్లో కాంస్యం గెలిచారు. అనంతరం కఠోర సాధనతో ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. ఈ ఏడాది మేలో లక్నోలో నిర్వహించిన జాతీయ పెన్‌కాక్ సిలాట్ క్రీడల్లో రజత పతకం గెలుచుకున్నారు. శ్రీనగర్‌లో ఇటీవల జరిగిన పదో జాతీయ పోలీసు క్రీడల్లో భాగంగా ఫైనల్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఐటీబీపీ కానిస్టేబుల్ బలరామ్‌ను ఓడించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు.

నరేంద్రకు పోలీసు శాఖ రూ.మూడు లక్షల నగదు, మూడు ఇంక్రిమెంట్లు ప్రకటించింది. అతడి ప్రతిభను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ మెచ్చి అభినందించారు. ఆసియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో పాల్గొని రాణించి దేశానికి పతకం గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం బహూకరణ

పాలకమండలి ఛైర్మన్‌కు కిరీటం అందిస్తున్న దాత కుటుంబీకులు

**శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యూటీ (కట్టుబడివారిపాలెం) గ్రామానికి చెందిన దాత డేరంగుల వెంకటేశ్వర్లు-అంజమ్మ దంపతులు, కుమారుడు రామాంజనేయులు, చిరంజీవి, మనువడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో వెండి కిరీటాన్ని స్వామి వారికి బహూకరించారు. 1.480 కిలోల బరువు గల ఈ కిరీటం ఖరీదు రూ.2.80 లక్షలుగా ఉంది. కిరీటంతో పాటు రసీదును పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకర్‌కు అందించారు. గతంలో గుడి ఎదుట దుకాణ సముదాయంలో రెండు గదుల నిర్మాణంతో పాటు జనరేటరు అందజేసినట్లు దాత వెల్లడించారు. ఆమేరకు దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, అర్చకులు వేదాశీర్వచనం అందించారు. మొక్కులో భాగంగా కిరీటం తయారు చేయించినట్లు దాత వెల్లడించారు. పాలకమండలి సభ్యులు బత్తుల చంద్రశేఖర్, ప్రధానాచర్చకులు కోట లక్ష్మీనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెలు, బిస్కట్ల విక్రయాలే జీవనోపాధి

రొట్టెలు తయారీలో మహబూబ్‌సుభాని

**కొమెరపూడి(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే:** సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో రొట్టెలు, బిస్కట్ల తయారీదారులు సుమారు 100 మందికి జీవనోపాధి కల్పిస్తున్నారు. జనాభాలో 25శాతం ఉన్న ఒక సామాజిక వర్గానికి చెందిన నాలుగు కుటుంబాలు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న కుటీర పరిశ్రమల్లో వాటిని తయారు చేస్తున్నారు. వారి వద్ద సరుకును 70 మంది స్థానికులు టోకుగా కొనుగోలు చేస్తున్నారు. వారితోపాటు సిరంగిపాలెం, కొర్రపాడు, కనపర్తి తదితర గ్రామాలకు చెందిన మరో 30 మంది చిరు వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. వారంతా ఒంగోలు, తెనాలి, గుంటూరు, తాటికొండ, మాచర్ల, పిడుగురాళ్ల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లి విక్రయించి ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయ కూలి పనులు లేని రోజుల్లో సరుకు కొనుగోలు చేసి 150 మంది గ్రామస్థులు వేరే ప్రాంతాల్లో అమ్ముతూ కుటుంబాలు పోషించుకుంటున్నారు. పనులు లేని రోజుల్లో ఈ వ్యాపారమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

## గొడవ పడి.. పరస్పర ఫిర్యాదులు

**వేటపాలెం, న్యూస్‌టుడే:** అప్పు అడిగినందుకు జరిగిన దాడిలో ఒకరిపై మరొకరు దాడి చేసుకుని ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... రైల్వేస్టేషన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో ఉన్న బజ్జీల దుకాణంలో చేనేతపురి కాలనీకి చెందిన చౌదయ్య పనిచేస్తుంటాడు. శనివారం రాత్రి ఆ పక్కనే తాగునీరు, గ్లాసులు విక్రయించే శ్యాంసన్ వద్దకు వెళ్లి తరువాత డబ్బులు ఇస్తానని గ్లాసులు, నీరు అడిగాడు. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో శ్యాంసన్ అతనిపై దాడిచేయడంతో గాయమైంది. అలాగే ఇంటికి వెళ్లడంతో గమనించిన చౌదయ్య కుమారుడు తేజ ఏం జరిగిందని అడగ్గా విషయం చెప్పాడు. దీంతో తండ్రిని తీసుకుని దుకాణం వద్దకు వచ్చాడు. ఈ సమయంలో తేజ, శ్యాంసన్‌లు మళ్లీ గొడవపడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలు కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

## భక్తులతో కిటకిటలాడిన అమ్మ సన్నిధి

అమ్మవారి పల్లకీ సేవలో భక్తులు

**దుర్గి:** పల్నాట ప్రసిద్ధి చెందిన శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధి ఆదివారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శనివారం రాత్రినుంచే అమ్మవారి సన్నిధికి తరలి వచ్చారు. అమ్మవారి కైంకర్యాలైన బిందె తీర్థం, అభిషేకాలు, నక్షత్రహారతి, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు తిలకించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఈవో, ఏసీ ఆదిశేషనాయుడు సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

## యువత లక్ష్యం వైపు నడవాలి

మాట్లాడుతున్న కనకరత్న, చిత్రంలో ఎంఈవో నవీన్‌కుమార్ తదితరులు

**ఆరుంబాక (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే:** యువత లక్ష్య సాధన వైపు ప్రయాణించాలని మహారాష్ట్ర మాజీ డీజీపీ కనకరత్నం అన్నారు. వేము సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ రజతోత్సవం సందర్భంగా ఆరుంబాక వద్ద ఐఆర్ఈఎఫ్ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కనకరత్నం మాట్లాడుతూ ప్రపంచ దేశాలు నేడు అనేక సమస్యలతో అతలాకుతలం అవుతుంటే మన దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఇందుకు నిపుణులైన యువత తమ ప్రతిభను దేశం కోసం వెచ్చిస్తుండటమే అన్నారు. యువత డ్రగ్స్, బెట్టింగ్‌లు, ఇతర అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎంఈవో నవీన్‌కుమార్, కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కోదండరామ్, నిర్వాహకుడు వేము వందనం, నంది అవార్డు గ్రహీత కె.సత్యనారాయణ, సభ్యులు కాటూరి నాగేశ్వరరావు, మరదాప కోటేశ్వరరావు, పగడం వీరాస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కడసారి చూపునకు నిరీక్షణ


రాజ్యలక్ష్మి (పాత చిత్రం)

**కారంచేడు, న్యూస్‌టుడే:** ఆ బిడ్డ కడసారి చూపు కోసం ఆ తల్లిదండ్రులకు ఎదురు చూపులు తప్పడం లేదు. సరిగ్గా పది రోజుల క్రితం తల్లిదండ్రులతో చరవాణిలో మాట్లాడిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి ఈనెల 7న అనారోగ్యంతో మృతిచెందిన సంగతి విదితమే. ఎన్నో ఆశలతో ఎల్లలు దాటి కుటుంబానికి అండగా నిలుద్దామని ఆశించిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రామకృష్ణ, నాగమణిల కుమార్తె రాజ్యలక్ష్మి(23) అమెరికాలోని టెక్సాస్‌లో విద్యనభ్యసించి కొలువు కోసం ఎదురుచూస్తుండగా... ఆశలు ఆవిరయ్యేలా బిడ్డ లేదని తెలిసి ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. ఈ క్రమంలో గోఫండ్ సంస్థ ద్వారా అమెరికాలోని రాజ్యలక్ష్మి స్నేహితులు, దూరపు బంధువులు నిధులు సేకరించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. యువతి భౌతికకాయానికి అమెరికాలో శవపరీక్షలు నిర్వహించారని, నివేదిక వచ్చిన వెంటనే తానా సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిసింది. బుధవారం నాటికి రాజ్యలక్ష్మి భౌతికకాయం గ్రామానికి చేరుకుంటుందని ప్రజలు తెలుపుతున్నారు.


EENADU eClassifieds

BUSINESS SERVICES

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

PEOPLE CARE

OLD AGE HOME

**గాయిత్రి గ్రూపు,** VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233.

REAL ESTATE

GENERAL

**గుంటూరు-సత్తెనపల్లి హైవే,** కొత్త 4 లైన్ల ORR అనుకొని, నలంద కాలేజి ఎదురు, గేటెడ్ కమ్యూనిటీలో ఇళ్ళ ప్లాట్లు కలవు. 96447 77888, 7036722521.

TO LET

Commercial Space for Rent 2500 sft Opp: ASN college, Tenali. Cont no: 63026 41154.

3BHK Independent House with veranda for Rent in Guntur (Opp Green Lawn School, Ponnur Road) Contact: 94903 77220.

COMMERCIAL

**గుంటూరు, అరండల్‌పేట,** 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/ Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

JOBS

**Wanted Accounts** Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 year experience in tally. Cont: 91333 99257.

**Wanted MBA** Marketing/ Business Development/ Supply Chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257.

**Wanted Shop** Keepers Salary 10,000/- Shift: 8Hrs Etukuru Rd & Nalla Cheruvu Raithanna Milk Dairy, Guntur 82475 95344.

**గుంటూరులోని శానిటరీ షాపులో** కంప్యూటర్ బిల్స్‌వేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M) కావలెను. వ|| 30సం||లోపు, జీ||12k-15k. ✆ 9493656892.

**DSA ఏజెన్సీ** గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

**ప్రముఖ కలెక్షన్** ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: (15Kto20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నావారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

**ప్రముఖ స్టార్** హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు సౌత్ ఇండియన్ ఆల్‌రౌండర్ మాస్టర్స్, వంటమాస్టర్స్, తండూరి అసిస్టెంట్స్, కటర్స్, రెస్టారెంట్ కెప్టెన్స్, చైనీస్ & ఇండియన్ అసిస్టెంట్స్, పార్సిల్ కౌంటర్ సిబ్బంది కావలెను. అనుభవమును బట్టి మంచి జీతం ఇవ్వబడును. 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్దులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**మహానాడు మీడియా,** గుంటూరు నందు పనిచేయుటకు 'వీడియో ఎడిటింగ్' లో అనుభవం ఉన్న వారు కావలెను. సంప్రదించండి. Ph: 73372 22004.

**గుంటూరు నారాకోడూరు** ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డు 8 గ. పది వేలు సె. సూపర్‌వైజర్స్ 8 గ. 13 వేలు, ప్రముఖ బట్టలషాపులో సెక్యూరిటీగా 12 గ. 12 వేలు వయస్సు 50 Y. లోపు, 10th. ✆: 85209 77729, 85209 77759.

**గుంటూరులోని ప్రముఖ** లిఫ్ట్ కంపెనీ నందు పనిచేయుటకు M(21) ఎంప్లాయిస్ కావలెను. ✆: 99083 10004.

**ప్రముఖ కన్‌స్ట్రక్షన్** కంపెనీలో మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. జీతం: 10,000 నుండి 15000+ ఇన్‌సెంటివ్స్. ✆: 83282 68208, 70138 73164.

**టెలీకాలింగ్ ఫ్రమ్** హోమ్, ఆఫీసు వర్క్ చేయుటకు M/F కావలెను. Age: 18 to 35, జీతం: 18K to 25K. ✆ 84640 16870, 86394 39870.

FACULTY/ TEACHERS

**అనంతపురం టౌన్** రమసైనిక్ స్కూల్ నందు High School English & Spoken English అనుభవం కల్గిన టీచర్స్‌కావలెను. ✆ 79810 45257.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541


## చోరీ కేసులో నిందితుడి అరెస్టు

### రూ.4.65 లక్షల నగదు... నల్లపూసల బంగారు గొలుసు స్వాధీనం

నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ నాగభూషణం, ఎస్సైలు, సిబ్బంది

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** చోరీ కేసులో నిందితుడితో పాటు అతని నుంచి రూ.4.65 లక్షల నగదు, నల్లపూసల బంగారు గొలుసును రెండో పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రెండో పట్టణ సీఐ నాగభూషణం తన కార్యాలయంలో వివరిస్తూ... ఈనెల 8న పేరాల ముట్టే వారి ప్రాంతానికి చెందిన గుండా సాంబశివరావు వేకువ జామున మార్కెట్ సెంటరులో ఉన్న తన హోల్‌సేల్ పండ్ల వ్యాపార దుకాణానికి వెళ్లారు. ఆ తరువాత భార్య ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. ఉదయం ఏడు గంటల సమయంలో పనిమనిషి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి, యజమానికి సమాచారం ఇవ్వడంతో సాంబశివరావు వచ్చారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి, అందులోని రూ.6 లక్షల నగదుతో పాటు 16 గ్రాముల నల్లపూసల గొలుసు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీ మహ్మద్ మొయిన్ ఆదేశాల మేరకు సీఐతో పాటు ఎస్సైలు వెంకటేశ్వర్లు, నాగశ్రీను, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు అచ్చయ్య, తన్నీరు శ్రీను, ప్రసాద్, బాలచంద్ర, శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, శేఖర్, బాలాజీలతో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా విజయవాడ కొత్తపేట నెహ్రూబొమ్మ వీధికి చెందిన గుదే హరీష్ కుమార్‌ను సొత్తుతో స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న గ్యాస్ గోదాం వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ చెప్పారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1 కి రూ.లలో)

**వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

**కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాసరావు

**వేములపల్లి, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా వేటపాలెం మండలం అనుమల్లిపేట గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాసరావు(34) హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ సమీప చందానగర్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తనకు కుమార్తె జన్మించగా తనను చూసేందుకు ఈ నెల 13న తన సొంత ఊరైన అనుమల్లిపేట వెళ్లాడు. ఆదివారం తిరిగి తన ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వస్తుండగా ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఒక్కసారిగా వేగాన్ని తగ్గించాడు. దీంతో ముందు ద్విచక్రవాహనాన్ని తాకి కింద పడిపోగా పక్కనే వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా శ్రీనివాసరావు ఛాతిపై నుంచి వెళ్లింది. గమనించిన పోలీసులు, స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా శ్రీనివాసరావు అప్పటికే మృతి చెందాడు. దీంతో వెంటనే మృతదేహాన్ని ఆటోలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కాగా మృతుడికి భార్య భువన, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 30న మృతుడి సోదరుని వివాహం ఉండటంతో శ్రీనివాసరావు కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

## 'పాఠశాల విద్యా వ్యవస్థను కుంగదీస్తున్న సంస్కరణలు'

**గుంటూరు విద్య, న్యూస్‌టుడే:** విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు పాఠశాలలను బలోపేతం చేయాలి కానీ..బలహీన పరచరాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం, సంస్కరణలు పాఠశాల విద్యావ్యవస్థను కుంగదీస్తున్నాయని, 9 రకాల పాఠశాలల ఏర్పాటు విద్యార్థులకు మేలు చేయదన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పాఠశాలలను బలోపేతం చేయాలని, తద్వారా పేదల బిడ్డలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు సయ్యద్ చాంద్‌బాషా, మక్కెన శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలతో పలు పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ లేదన్నారు.


91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

# బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు


## భవనం పూర్తికాక అవస్థలు

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** రేపల్లె మండలం కారుమూరులో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. నాలుగేళ్ల కిందట రూ.13 లక్షలతో గుత్తేదారులు పనులు చేపట్టి పైకప్పు వేయించారు. సకాలంలో బిల్లులు మంజూరుకాక పోవడంతో తర్వాత పనులు నిలిపేశారు. కూటమి పాలనలో భవనాన్ని పూర్తి చేయిస్తారని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

## సత్యనారాయణ వ్రత పూజలు

**నగరం, బాపట్ల :** ఉల్లిపాలెంలోని శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహికంగా సత్యనారాయణ వ్రత పూజలు చేశారు. బాపట్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహికంగా వ్రతాలు నిర్వహించారు.

వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? టీఎంరావు ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి మార్గంలో వీధిలైట్లు వెలగడం లేదు. **-యాసిన్, భట్టిప్రోలు**

✔ పంచాయతీ సిబ్బందితో మాట్లాడి ఆ ప్రాంతంలో వీధి లైట్లకు మరమ్మతులు చేయిస్తాం. **–నాయక్, భట్టిప్రోలు – భట్టిప్రోలు, న్యూస్‌టుడే**

? మండలంలోని అల్లూరు రక్షిత మంచినీటి పథకం చెరువుకు వెళ్లే రహదారిపై వ్యర్థాలు వేయటంతో దుర్వాసన వస్తోంది. -నరసింహమూర్తి, అల్లూరు

✔ పరిశీలించి వెంటనే తొలగిస్తాం. **-పద్మావతి, పంచాయతీ కార్యదర్శి, అల్లూరు – పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే**

? విష్ణు ఆలయం వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. **- సూర్యదేవర రాంబాబు, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి వీధి దీపాల సమస్య పరిష్కరిస్తాం. **- శంకరరావు, పంచాయతీ కార్యదర్శి, కొల్లూరు**

– కొల్లూరు, న్యూస్‌టుడే:

### చెత్త తొలగింపు

స్పందనకు వందనం

**చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే:** మండల కేంద్రం చెరుకుపల్లి కస్తూవారి పేట చివర రోడ్డు పక్కన చెత్తను అధికారులు తరలించారు. దీనిపై ఈనెల 16న ఈనాడులో 'మేమున్నాం..మీకుతోడుగా' శీర్షికన ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు స్పందించారు. సిబ్బందితో చెత్తను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు.

# అథ్లెటిక్స్‌లో అదరగొడుతున్నారు!

న్యూస్‌టుడే, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం)

సాధన చేస్తే అనుకున్నది సాధించవచ్చు. పట్టుదలతో లక్ష్యం చేరవచ్చు. గ్రామీణ విద్యార్థులు క్రీడలపై పట్టు సాధిస్తున్నారు. ఆరో తరగతిలో చేరిన నాటినుంచి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. మండలంలోని ఖాజీపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్, ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో సత్తాచాటుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పీడీ కరీముల్లా శిక్షణ మెలకువలతో మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు.

సాధన చేస్తున్న విద్యార్థినులు

### క్రీడలంటే మక్కువతో..

ఖాజీపాలెం పంచాయతీ పరిధి కప్పలవారిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మేశ్వరి పదో తరగతి చదువుతుంది. విద్యార్థినికి క్రీడలపై ఆసక్తి ఉండటంతో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. చదువులోనూ రాణిస్తోంది. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్‌లో 400 మీటర్లు, 400 మీటర్లు రిలే, 3కె పరుగు పందెం, ఖో-ఖోలో ప్రతిభ చూపి పతకాలు సాధించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లోనూ సత్తాచాటింది. వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పరుగు పందెంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది.

### నిత్యసాధనతో..

ఖాజీపాలెం గ్రామానికి చెందిన వాసంతి ఎనిమిదో తరగతి చదువుతోంది. అథ్లెటిక్స్‌లో నిత్య సాధనతో సత్తా చాటుతోంది. బాలికల అండర్-17 విభాగం అథ్లెటిక్స్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. నిరుడు శ్రీకాకుళంలో జరిగిన 1500, 3000 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఖో-ఖోలో మండల, జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటింది. సీనియర్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యమని చెబుతోంది.

### జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని..

మండేవారిపాలెం గ్రామానికి చెందిన మౌర్యుడు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బాలుడు చిన్నప్పటి నుంచి వాలీబాల్, పరుగు పందెంలో మెలకువలు నేర్చుకున్నాడు. పీడీ కరీముల్లా సూచనలతో బాలుర అండర్-14 విభాగం వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. అండర్-14 విభాగంలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. డిసెంబరులో సూర్యలంకలో జరిగే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. భవిష్యత్తులో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలన్నదే లక్ష్యమని చెబుతున్నాడు.

## విద్యార్థులు పోటీతత్వంతో ఉండాలి

**బాపట్లటౌన్, న్యూస్‌టుడే:** విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని దొప్పలపూడి మల్లికార్జునరావు విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు రామ్మోహన్‌రావు అన్నారు. వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 14న విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, భాస్కరరావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

## బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

**చందోలు(పిట్టలవానిపాలెం):** చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారికి కార్తిక మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించగా అభయ ప్రదాయినిగా దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని శ్రీబండ్లమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

బండ్లమ్మ

**పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే:** మండలంలోని అల్లూరు గ్రామ దేవత శ్రీఅల్లూరమ్మ అమ్మవారికి కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో 'మహాశక్తిదేవత'గా భక్తులకు దర్శనమిచ్చారు.

## అమృతేశ్వరునికి బిల్వార్చన

**అమృతలూరు:** శ్రీఅమృతేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం లక్ష మారేడు దళాలతో పూజలు చేపట్టారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు

**చెరుకుపల్లి గ్రామీణ:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం చెరుకుపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కె.అరుణ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకతతో ప్రతిభను మెరుగు పరుచుకునే వీలుందన్నారు.

## సీఎం సహాయనిధి మంజూరు పత్రాల అందజేత

పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

**చుండూరు, న్యూస్‌టుడే:** చుండూరు మండలం వేటపాలేనికి చెందిన ప్రొద్దుటూరు ఏసుపాదం, మండూరుకు చెందిన పగడాల స్పొగిల్, పెదగాదెలవర్రుకు చెందిన మొగలి పార్వతి, వలివేరుకు చెందిన ఆరమళ్ల అరుణకుమారి అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వారికి నిధులు మంజూరయ్యాయి. మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఆనందబాబు తన నివాసంలో ఆదివారం బాధిత కుటుంబాలకు అందజేశారు.

## గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

**ఇంటూరు, కూచిపూడి, (అమృతలూరు), న్యూస్‌టుడే:** ఇంటూరు, అమృతలూరు, కూచిపూడిలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయ బాధ్యులు సుధీర్, శ్రీదేవి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# సందడిగా ఆటల పోటీలు

**నగరం,:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మంత్రిపాలెం గ్రంథాలయం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. పరుగు పందెంతో పాటు ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల రవీంద్ర, కిషోర్ బాబు, గ్రంథాలయ అధికారి బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

**కొల్లూరు:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శాఖా గ్రంథాలయంలో ఆదివారం వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి రాంబాబు తెలిపారు. పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పరుగు పందెంలో పాల్గొన్న బాలురు

ముగ్గులు తీర్చిదిద్దుతున్న మహిళలు

### విజేతలకు బహుమతులు అందజేత

**బాపట్లటౌన్, న్యూస్‌టుడే:** బాపట్ల శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆదివారం పరుగు, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి గ్రంథాలయ అధికారి శివాజి గణేశన్ బహుమతులు అందజేశారు.

కొల్లూరు: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

### మహిళలకు ముగ్గులు పోటీలు

**భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని మాటూరు రామారావు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ శాఖ అధికారి సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

## నిబంధనల అమలులో అధికారులు విఫలం

**రేపల్లె అర్బన్:** నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఎస్ఎఫ్ఐ నేతలు విమర్శించారు. రేపల్లెలో ఆదివారం పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహించగా ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించి మూయించారు. ర్యాంకుల సాధన కోసం విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. పండగలు, ఆదివారం తేడాలేకుండా స్టడీ అవర్స్ పేరుతో రాత్రి 8.30 గంటల వరకు ఉంచడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రేపల్లె ఏరియా కార్యదర్శి సూర్యప్రకాష్, నవీన్, ప్రశాంత్, సంజయ్, సుమంత్, శరత్ పాల్గొన్నారు.

## ఒక భవనంలో మూడు రకాల సేవలు

సిబ్బంది విధులు నిర్వహిస్తున్న భవనం

గోడలు బీటలు బారి..

పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం పాత పంచాయతీ కార్యాలయ భవనంలో రైతు సేవా కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, చౌక ధరల దుకాణం నిర్వహిస్తున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయం నిర్వహించే ఈ భవనం శిథిలావస్థకు చేరటంతో ఖాళీ చేశారు. ఈ మూడు శాఖల కార్యాలయాలకు భవనాలు లేకపోవడంతో పాత భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆయా శాఖలకు భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. **- ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే**

## మురుగుతో అవస్థలు

పట్టణంలోని ఇందిరానగర్, రాజీవ్‌నగర్ కాలనీల్లో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. సమీపంలో గృహాలు ఉండటంతో రాత్రి దోమల సమస్య ఉన్నట్లు స్థానికులు తెలిపారు. రాజీవ్‌నగర్‌లో పందుల బెడద కూడా ఉందని వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- బాపట్లటౌన్, న్యూస్‌టుడే**

## ప్రమాదంలో ప్రజారోగ్యం

పురపాలక సంఘంలో జంతు మాంసం విక్రయంలో వ్యాపారులు నిబంధనలు పాటించటం లేదు. జంతువధశాలకు గొర్రెలు, మేకలు తెచ్చి పశువైద్యుడు పరీక్షించి అవి ఆరోగ్యంగా ఉన్నాయని ధ్రువీకరించిన తర్వాత వాటిని అక్కడే కోసి దుకాణాలకు తరలించి మాంసం విక్రయించాలి. జమ్ములపాలెం రోడ్డులోని జంతు వధశాల భవనం శిథిలావస్థకు చేరి అపరిశుభ్రంగా ఉంది. మాంసం విక్రేతలు జంతువులను ఇక్కడికి తీసుకురావటం లేదు. పశువైద్యుడు పరీక్షించకుండానే ఆరు బయట గొర్రెలు, మేకలు కోసి రోడ్డు పక్కన విక్రయశాలల్లో విక్రయిస్తున్నారు. వ్యాధులు సోకిన వాటిని సైతం కోసి మాంసం విక్రయిస్తుండటంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. **- బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే**

అపరిశుభ్రంగా ఉన్న జంతు వధశాల

శిథిలావస్థకు చేరిన భవనం

## సాయి మందిరంలో చోరీ

**నగరం:** మంత్రిపాలెం సాయిబాబా మందిరంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పురోహితుడు శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రధాన తలుపులకు తాళాలు వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం దేవాలయానికి వచ్చిన ఆయనకు తలుపులు తెరిసి ఉండటంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.


### దావా సమను

మహారాజశ్రీ రేపల్లె సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

OS 13/2023

వరికూటి శారద ...వాది

ఎదిరి

ఘంటా అనసూయ వగైరా ... ప్రతివాదులు

**టు:** సోబిల పూజ, తండ్రి: లేటు శ్రీనివాసరావు, భర్త: సాయికృష్ణ, 13వ వార్డు, రేపల్లె, రేపల్లె మండలం, బాపట్ల జిల్లా

పై నెంబర్ దావాను వాది ప్రామిసరి నోటు బాకీ వసూలు వగైరా పరిహారముల నిమిత్తము దాఖలు చేయగా మీకు దావా సమను నిమిత్తము ది. 03-12-2025వ తేదీన వాయిదా అయివున్నది. పై తేదీన ఉదయం 10-30 ని॥లకు మీరు గాని మీ తరపున వకీలు ద్వారా గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరయి ఆక్షేపణలు తెలియ చేయవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము

వాయిదా: 03-12-2025

ఇట్లు, అల్లంశెట్టి శ్రీనివాసరావు, వల్లు శ్రీనివాసరావు, కూనపరెడ్డి సాంబశివరావు

వాది తరుపు న్యాయవాదులు, రేపల్లె.


## స్వచ్ఛ చల్లపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి

**బాపట్ల:** స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పల్లె, పట్టణాన్ని వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దాలని స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమ నిర్మాత, ప్రముఖ వైద్యులు డి.రామకృష్ణప్రసాద్, పద్మావతి దంపతులు అన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సూర్యలంకలో నిర్వహించిన కార్తిక వనసమారాధనకు ఆదివారం వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. స్థానికుల్లో స్ఫూర్తిని నింపి స్వచ్ఛ చల్లపల్లి సాధించిన తీరు వివరించారు. బాపట్లలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న మల్లికార్జున బృందానకాలనీ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు రూ.10 వేల విరాళం అందజేశారు. యోగా సాధన చేశారు. సంస్థ ఛైర్మన్ శరత్‌బోస్, అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యక్షులు శాంతారామ్, రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు హరిబాబు కోశాధికారి కేశవులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లి కృషిని వివరిస్తున్న వైద్యులు రామకృష్ణప్రసాద్

## విద్యతోనే ప్రగతి

**బాపట్ల, న్యూస్‌టుడే:** విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం అన్నారు. సూర్యలంక అటవీ తోటల్లో కాపు సామాజిక వర్గీయుల ఆదివారం వనసమారాధన నిర్వహించారు. పేదలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌తో కలిసి రూ.23 లక్షల ఉపకార వేతనాలు, నగదు పురస్కారాలు అందజేశారు. సతీష్ మాట్లాడుతూ పేద కాపుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆటల పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు గోళ్ల సుబ్రహ్మణ్యం, నేతలు నరాలశెట్టి ప్రకాష్, మెండు చక్రపాణి, భాస్కరరావు, తదితరులున్నారు.

విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సతీష్, విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీకాంతం

## గౌడ సంఘీయుల వనసమారాధన

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** పేదలకు చేయూత అందించి ఆర్థికంగా స్థిరపడేలా కృషి చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం ఉయ్యూరువారిపాలెం సాంబశివ సన్‌సిటీ బ్రోచర్‌లో ఆదివారం నిర్వహించిన గౌడ సంఘీయుల కార్తిక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. కార్తిక సమారాధనలు ఐక్యతకు తోడ్పతాయన్నారు. తొలుత సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, కేసన శంకరరావు. గుర్రం మురహరిరావు, విచారపు వీరయ్య, మేకా సుబ్బారావు, మాన్యం నాగమణి, తదితరులున్నారు.

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

అలరించిన నృత్యప్రదర్శన

కొల్లూరులో సామూహిక భోజనాలు

## అందరూ కలిసి.. ఆత్మీయత చాటి..

**భట్టిప్రోలు, కొల్లూరు, న్యూస్‌టుడే:** అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధన ఆదివారం టీఎంరావు ఉన్నత పాఠశాలలో సందడిగా జరిగింది. వివిధ గ్రామాల్లో ఉన్న పద్మశాలీయులు కలుసుకుని ఆత్మీయత చాటారు. బాలగణేష్‌బాబు దంపతుల ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతం జరిగింది. సమారాధనలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, తెదేపా నాయకులు డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, మోటూరు పుణ్యశ్రీనివాసరావు, వాకా శేషు, వేములపల్లి జగన్నాథం, వేములపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆనందబాబును సంఘ సభ్యులు సత్కరించారు. చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. సంఘ ప్రతినిలులు మల్లికార్జునరావు, పిచ్చయ్య శాస్త్రి, మురుగుడు సత్యనారాయణ, తిరువీధుల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. కొల్లూరు మండలం దోనేపూడి శివారు కోటిపల్లిలోని శ్రీ సత్యజ్ఞానప్రసూనాంబ సమేత సోమశేఖర స్వామి దేవస్థానంలో వనసమారాధన ఆదివారం ఘనంగా జరిగింది.

### కనుల పండువగా సహస్ర దీపార్చన

**బాపట్లటౌన్, న్యూస్‌టుడే:** కార్తికమాసం పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం వైభవంగా సహస్ర దీపార్చన నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి విశేష పూజలు చేశారు. దేవస్థానం పాలకవర్గ సభ్యులు సోమయ్య, శ్రీనివాసరావు, మోహన్, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో స్వామి

### వైభవంగా పుష్పయాగం

**మోపర్రు, (అమృతలూరు), న్యూస్‌టుడే:** మోపర్రు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పలు రకాల పుష్పాలు, తులసి దళంతో అలంకరించారు. రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించారు.

ఉత్సవ విగ్రహాలు

(c) eenadu

# చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా కోటి దీపోత్సవం

**చీరాల, న్యూస్‌టుడే:** జిల్లా ఆర్యవైశ్య సంఘం, చీరాల మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌ఆర్‌ పీఎం పాఠశాల మైదానంలో కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి సందేశమిచ్చారు. భక్తులకు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? పెదగంజాం పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో పోలు ఇంటి వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రులు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి. - **బొప్పవరపు పేతురు, అంబేడ్కర్‌నగర్, పెదగంజాం**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి, రెండు రోజుల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తాం. - **కె.కృపారావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, పెదగంజాం** -న్యూస్‌టుడే, చినగంజాం

? మార్టూరులోని నేతాజీ నగర్ కాలనీలో మురుగునీటి పారుదల నిలిచి దుర్వాసన వస్తోంది. - రామయ్య, మార్టూరు

✔ వెంటనే మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో, మార్టూరు**

? మార్టూరు- బల్లికురవ మార్గంలోని శాకోయ నగర్, బహుళ అంతస్తుల భవనం ప్రాంతంలో మురుగు కాల్వల్లో పూడిక తీయడం లేదు. - **బాబు** ✔ పూడిక తీసి, నీటిపారుదలకు చొరవ చూపుతాం. - **శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో, మార్టూరు**

? మండలంలోని జొన్నతాళిలో మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలి. మా ఇంటి వద్ద నీరు ఆగిపోయి స్థానికులకు ఇబ్బందులు కలుగుతోంది. - **పవన్, జొన్నతాళి**

✔ మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటాం.

- **శ్రీనివాసరావు, ఎంపీడీవో** -న్యూస్‌టుడే, మార్టూరు

## మల్లేశ్వర స్వామికి అన్నాభిషేకం

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** కార్తిక మాసం బహుళ చిల్కు ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం నల్లగాంధీ బొమ్మ వద్ద ఉన్న గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామికి 58 కిలోల అన్నంతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

## నిలిచిన వంతెన పనులు.. పూర్తిచేసేలా చర్యలు

**వేటపాలెం, న్యూస్‌టుడే:** నిలిచిన వంతెన నిర్మాణ పనులు తిరిగి పూర్తి చేయడానికి ఐదు నెలల క్రితం రూ.2 కోట్లతో ఉన్నతాధికారులకు డ్రైనేజీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైతే దశాబ్దాలుగా అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్య తీరనుంది. వేటపాలెం మండలంలోని ఆనుమల్లిపేట సమీపంలో ఉన్న రొంపేరు కాలువ అవతల వైపు వాద, సంఘాలకు చెందిన సుమారు 1500 ఎకరాలకు చెందిన పొలాలకు వెళ్లేందుకు 2010లో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టినా నేటికి పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది.

### 800 మంది రైతులకు ఇబ్బందులు

వ్యవసాయ సీజన్‌లో పనులు చేసే సమయంలో వర్షాలు కురుస్తుంటే పొలాలకు వెళ్లాలంటే దాదాపు 800 మంది రైతులు కాలువలో దిగివెళ్లాలి. యూరియా, పురుగు మందులు, పంట పండిన తరువాత ఆ ఉత్పత్తులు ఇంటికి చేర్చుకోవడానికి ఇదే దగ్గర మార్గం. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంటే మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. అంత దూరం వెళ్లలేక ప్రమాదమని తెలిసినా అలాగే అన్నదాతలు వెళుతుంటారు. గతంలో ఇక్కడ అనేక ప్రమాదాలు జరిగాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు రైతులు వినతి పత్రాలు అందజేశారు. ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి అధికారులు ముందుకొచ్చారు. రూ.2 కోట్లతో పనులు మొదలెట్టారు. ఆరు నెలల్లో పిల్లర్లు నిర్మించి, పడమర వైపు నుంచి రెండు పిల్లర్ల వరకు శ్లాబు వేసిన తరువాత పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

సగం వరకు నిర్మించిన వంతెన

## కిక్కిరిసిన వాడరేవు తీరం

**చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే:** చీరాల మండలంలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు మూడు జోన్లుగా గుర్తించి, అక్కడే స్నానాలు ఆచరించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రామాపురం బీచ్‌లో మాత్రం పూర్తి స్థాయిలో బందోబస్తు లేకపోవడంతో కొందరు భక్తులు స్నానాలు చేశారు.

✦ కార్తిక సోమవారం కోసం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 15 మంది గజ ఈతగాళ్లను వాడరేవులోనే విధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

## నేడు అద్దంకిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### హాజరు కానున్న ఇద్దరు మంత్రులు

**అద్దంకి, న్యూస్‌టుడే:** అద్దంకి పురపాలక సంఘంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రారంభోత్సవం, శంకుస్థాపన జరగనున్నాయి. ద్వారకా నగర్ వద్ద రూ.4.06 కోట్లతో నిర్మించిన 33/11 విద్యుత్తు ఉపకేంద్రం, బీపీఎస్ ఎల్‌ఆర్‌ఎస్ గ్రాంటు రూ.3 కోట్లతో చేపట్టిన 31 అభివృద్ధి పనులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.24 లక్షల సీఎస్‌ఆర్ గ్రాంటుతో నిర్మించిన భోజనశాల, పసుమర్తిపాలెంలో రూ.15 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభోత్సవం, 238 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తారని కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. మినీ బైపాస్ నిర్మాణంలో భాగంగా ఎన్నెస్పీ కాలువ కట్టకు ఇరువైపులా నివసిస్తున్న వారిలో 65 మందికి శింగరకొండపాలెం సమీపంలో మౌలిక సదుపాయాలతో కూడిన చోట ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర విద్యుత్తు, పురపాలక శాఖ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, పొంగూరు నారాయణ హాజరు కానున్నారు.

ద్వారకానగర్ విద్యుత్తు ఉపకేంద్రం

**పైలాన్ ఆవిష్కరణ..** పురపాలక సంఘం పరిధిలో మొత్తం రూ.4.25 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల పైలాన్‌ను మంత్రులు ఆవిష్కరించనున్నారు. ఒడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) నిధులు రూ.1.25 కోట్లు, ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రూ.3 కోట్లు కలిపి ఒకటిగా బోడెంపూడివారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు.

## పథకాలు ప్రజల చెంతకు చేర్చండి

**ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పార్టీ శ్రేణులను కోరారు. ఏల్చూరు అతిథి గృహంలో ఆదివారం మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో గ్రామాల వారీగా స్థానిక సమస్యలపై చర్చించారు. ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, నాయకులు సన్నెబోయిన గురుయాదవ్, వాసురెడ్డి, చింతా రామారావు, అట్లా పెదవెంకటరెడ్డి, దూపాటి ఏసోబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## సాగునీరు అందేలా చర్యలు

**బల్లికురవ న్యూస్‌టుడే:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం సాగు నీరు అందేలా పర్యవేక్షిస్తామని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముక్తేశ్వరం కాలువలో చిల్లచెట్లు ఎక్కువగా పెరగడంతో పొలాలకు నీరు సక్రమంగా అందడంలేదని ఇటీవల సమస్యపై మంత్రికి రైతులు ఫిర్యాదు చేయగా తక్షణం స్పందించారు. పూడిక, చిల్లచెట్లు తొలగింపు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో రామాంజనేయపురం వద్ద కాలువను ఆదివారం మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ముక్తేశ్వరం కాలువను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి

### కొండ మీదకు దీపాలు ఏర్పాటు చేయరూ..

**జె.పంగులూరు, న్యూస్‌టుడే:** మండలంలోని తూర్పు కొప్పెరపాడు, రామకూరులో ఆదివారం పర్యటించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ రామకూరులోని ఓ దుకాణం వద్ద టీ తాగుతూ గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రామకూరు కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామి గుడికి వెళ్లే భక్తులకు వీధి దీపాలు లేక ఇబ్బందిగా ఉంటుందని, వాటిని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా తక్షణం స్పందించిన మంత్రి, వాటిని ఏర్పాటు చేయాలని ఈఈ మస్తాన్‌రావును ఆదేశించారు. ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో కె.స్వరూపరాణి, నేతలు మానం సుబ్బారావు, పెడవల్లి అశోక్, కుక్కపల్లి ఏడుకొండలు, రావూరి రమేష్, చింతల సహదేవుడు, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎనికపాటి శ్రీనివాసరావు, పునాటి రామాంజనేయులు, గొల్లపూడి ఆంజనేయులు, స్టాలిన్, అధికారులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో ఇటీవల మరణించి, ప్రమాదాల్లో గాయపడ్డ బాధితుల కుటుంబ సభ్యులను మంత్రి గొట్టిపాటి పరామర్శించారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**మేదరమెట్ల, న్యూస్‌టుడే:** కొరిశపాడు మండలంలో తెదేపా బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తెదేపా కమిటీ ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..మండలంలోని అన్ని గ్రామాల్లోని నాయకులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు సింబోతు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మోపర్తి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి హెస్కేలు, నాయకులు చెన్నుపాటి హరిబాబు, భవానీప్రసాద్‌రెడ్డి, కరిచేటి రాంబాబు, ఎన్.కోటేశ్వరరావు, కొట్టే రవీంద్ర, మందా నాగేశ్వరరావు, ఆమోసు, చింతం సుబ్బారావు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ల నిర్మాణ పనులు

## తీరనున్న తాగునీటి కష్టాలు

**తిమ్మరాజుపాలెం (పర్చూరు), న్యూస్‌టుడే:** తిమ్మరాజుపాలెం వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలు తీరనున్నాయి. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో రూ.70.40 లక్షలతో రెండు పెద్ద ఫిల్టర్‌బెడ్లను నిర్మిస్తున్నారు. గతంలో మంచినీటి చెరువులో వ్యర్థాలు చేరి తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన జలజీవన్ మిషన్ కింద రూ.70.40 లక్షల నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టారు. వీటితో పనులు చేపట్టి గ్రామంలోని ప్రతి వీధికి పైపులైన్లు నిర్మించి, ఇంటింటికి కుళాయి ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న మంచినీటి కష్టాలు తీరనున్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. ✦ కారంచేడు మండలం పోతినవారిపాలెం నుంచి స్వర్ణ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు సమస్యను ఎమ్మెల్యే ఏలూరికి వివరించగా వెంటనే పనులు చేపట్టాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో రెండ్రోజులుగా రహదారి నిర్మాణ పనులు జరుగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వాలిన స్తంభం.. నిలిచిన విద్యుత్తు

**మండ**లంలోని అలవలపాడు చెరువు కట్ట సమీపంలో విద్యుత్తు స్తంభం వాలిపోయింది. దీంతో ఉత్తరం పొలం వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఈ లైనులో 30 వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. మూడు నెలలుగా విద్యుత్తు లేకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పైరుకు మందు పిచికారీ చేయడానికి నీరు లేక గ్రామంలో నుంచి ట్రాక్టర్లపై తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. రబీ మొక్కజొన్న పంట సాగు ప్రారంభం కావడంతో నీటితడులు అందించాల్సి ఉంటుందని, విద్యుత్తు లేక ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం అధికారులు స్పందించి వాలిన స్తంభాన్ని పునరుద్ధరించి, విద్యుత్తు అందించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. **- న్యూస్‌టుడే, జె.పంగులూరు**

## పైపులైను సరిచేయరూ!

**మండ**లంలోని పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన భారీ ఇనుప పైపు లైను ప్రమాదానికి కారణంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. పర్చూరు-గుంటూరు రహదారి పెట్రోలు బంకు సమీపంలో లోలెవల్ చప్టా వద్ద రోడ్డుకు ఒక వైపుగా భారీ పైపు లైను ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో వరదనీటి ఉద్ధృతికి రోడ్డుకు ఒకవైపు ఉండే ఇది కాస్తా జరిగి, చప్టాపై రోడ్డు మీదకు చేరింది. ఈ చప్టాపై ఒకవైపు రహదారికి ఒక పక్కన గుంతలు ఉండటంతో వాహనదారులు ఈపైపు లైను పక్కనే ప్రయాణిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో విద్యుత్తు దీపాలు లేక ప్రమాదవశాత్తూ దీన్ని ఢీకొట్టి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్రను వివరణ కోరగా ఈ పైపులైనును పూర్తిగా మార్చేందుకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, త్వరలో దీని స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, పర్చూరు**

## పాలెం రహదారులపై మురుగు ప్రవాహం

**ఇం**కొల్లు శివారు హనుమోజిపాలెంలో రహదారుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. శివారు గ్రామం కావడంతో రహదారుల పారిశుద్ధ్య కార్యక్రమాలు సకాలంలో జరగడంలేదు. సీసీ రహదారులు నిర్మించినప్పటికి కాలువల నిర్మాణం లేక గృహాల్లో మురుగు రోడ్లపైకి చేరుతోంది. గ్రామంలో నాలుగు, ఎస్సీ కాలనీలో మూడు రహదారులపై మురుగు ప్రవహిస్తోంది. రోజులు తరబడి నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సీసీ రోడ్లకు రెండు వైపులా కాలువలు నిర్మించి, మురుగు దిగువకు వెళ్లేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డికి గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. **- న్యూస్‌టుడే, హనుమోజిపాలెం (ఇంకొల్లు)**

# బాలికలు.. విజేతలు

చీరాల, న్యూస్‌టుడే

**ప్ర**భుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులు వివిధ రంగాల్లో రాణిస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు. విద్యతో పాటు ఆటలు, ఇతర రంగాల్లోనూ సత్తాచాటుతున్నారు. ప్రతి కూలతల మధ్య అధ్యాపకుల సహకారంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

### రాజ్యాంగంపై మక్కువ

**ఎం**పీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న **కె.గౌరీశ్రీప్రియ** రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో సత్తాచాటింది. మండల స్థాయిలో ప్రతిభచూపి తరువాత జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. రాజ్యాంగంపై తనకు ఎనలేని మక్కువని, దీంతో దానిపై పట్టుసాధించానని అధ్యాపకులు ఎంతో ప్రోత్సహించారని చెబుతోంది బాలిక. భవిష్యత్తులో అధికారిగా ఉద్యోగం సాధించాలనేది తన లక్ష్యమని చెప్పింది.

### వాలీబాల్‌లో జాతీయ జట్టుకు ఆడాలని..

**బై**పీసీ రెండో సంవత్సరం చదువుతున్న **ఎం.నిస్సీ** వాలీబాల్‌లో సత్తాచాటుతోంది. కళాశాలలో జరిగే పోటీలతో పాటు జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయిలో పాల్గొంది. ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి, ప్రతిభ చూపింది. తనకు వాలీబాల్ అంటే మక్కువని, ఇండియా జట్టుకు ఆడాలనేది తన కోరికని వెల్లడించింది.

### అధ్యాపకుల ప్రోత్సాహంతో..

**బై**పీసీ మొదటి సంవత్సరం చదువుతున్న **సీహెచ్ సానికా ఏంజల్** ఎక్కడ వ్యాసరచన పోటీలు జరిగిన మొదటిస్థానం కైవసం చేసుకోవాల్సిందే. ఇటీవల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించింది. అధ్యాపకుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించింది. బాగా చదువుకొని మంచి ఉద్యోగం సాధించాలనేది తన లక్ష్యమని చెబుతుంది.

వ్రతాల్లో భక్తులు

## ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**కారంచేడు, న్యూస్‌టుడే:** స్థానిక శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండప ఆవరణలో ఏర్పాటుచేశారు. వందలాది మంది దంపతులు పాల్గొనగా వేదపండితులు శాస్త్రోక్తంగా వారితో వ్రతాలు చేయించారు. మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గ్రంథాలయాలు బలోపేతం చేయాలి

**అద్దంకి, న్యూస్‌టుడే:** గ్రంథాలయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని చీరాల ఉపవిద్యాధికారి డి.గంగాధర్ అన్నారు. బంగ్లా రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహులు ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యల గురించి విద్యార్థులకు వివరించారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, గ్రంథపాలకురాలు సీహెచ్‌వీ.ఎల్.వసుంధరాదేవి, గాడేపల్లి దివాకర్ దత్తు, సుగుణారావు పాల్గొన్నారు.

చినగంజాం: గ్రంథాలయాల ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు, విద్యార్థులు

**చినగంజాం, న్యూస్‌టుడే:** గ్రంథాయల ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్‌ల చిత్ర పటాలకు గ్రంథపాలకుడు మోహనలక్ష్మీ నరసింహాచార్యులు, పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే:** చీరాల మండలం దేవాంగపురి గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. టీటీడీ ఏఈ కర్ణ చంద్రశేఖర్, చీరాల గ్రంథాలయ అధికారి ప్రసాద్ మాట్లాడారు. ఒంగోలు రైస్ గాంధీ ఇంజినీరింగ్ కళాశాల గ్రంథపాలకుడు శివాజీ, జిల్లా దేవాంగ సంక్షేమ సంఘ ప్రతినిధులు బండ్ల బాబు, బూసం శ్రీనివాసరావు, బొడ్డు లలితా మోహన్, బీడీసీ గ్రంథపాలకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అవసరం

**చీరాల, న్యూస్‌టుడే:** విద్యార్థి దశలోనే నైతిక క్రమశిక్షణ అలవాటు చేయాలని అపుడే మెరుగైన సమాజం తయారవుతుందని మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఛైర్మన్ హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పుస్తకాలు పంపిణీ చేశారు. కె.శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంచాక్షరి మహామంత్ర ఏకాహం

**చినగంజాం, న్యూస్‌టుడే:** సోపిరాల శివాలయంలో పంచాక్షరి మహామంత్రం ఏకాహంను శివస్వాములు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఓం నమఃశివాయ అంటూ ఏకాహం నిర్వహించారు. అనంతరం పొంగలి ప్రసాదాన్ని తయారుచేసి భక్తులు పంచారు. సుమారు 50 మంది దీక్షాపరులు పాల్గొన్నారు.

## సత్యసాయి పల్లకీ ఊరేగింపు

**అద్దంకి, న్యూస్‌టుడే:** పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయం నుంచి బాబా చిత్రపటంతో కూడిన పల్లకీని ఊరేగించారు. నాగసూరి రమేష్‌బాబు, రాంబాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఉత్సవమూర్తులకు నగరోత్సవం

**అద్దంకి, న్యూస్‌టుడే:** అఖిల భారత హిందూ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద రాత్రికి పడి భజనను పురస్కరించుకొని ఉదయం ఇది చేపట్టారు. గుండ్లకమ్మ నదీజలాలతో అభిషేకం అనంతరం తిరిగి గుడికి చేరింది.

## నేడు కారంచేడులో కోటి దీపోత్సవం

**కారంచేడు, న్యూస్‌టుడే:** గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్దనున్న శ్రీ వైష్ణవి దుర్గా దేవాలయంలో సోమవారం కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 'వశీకరణం' ఎంపిక

**అద్దంకి, న్యూస్‌టుడే:** అద్దంకి పుట్టంరాజు కళాక్షేత్రంలో జనవరిలో ప్రదానం చేసే 'ధీరజ్ కోట్ల కథా పురస్కారం-2025'కు ఎం.బి.ఎస్.ప్రసాద్ రచించిన 'వశీకరణం' ఎంపికైంది. ఆమేరకు వివరాలను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వెల్లడించారు. పురస్కార ప్రదాతగా నల్లపురెడ్డి రవిశేఖరరెడ్డి వ్యవహరిస్తున్నారు. మొత్తం 105 పుస్తకాలు రాగా అందులో 12 మందివి ఎంపిక చేశారు. ప్రథమస్థానంలో వశీకరణం(రూ.10 వేల నగదు బహుమతి) ఎంపికైంది.

## ఆగని రైతు కష్టం.. మళ్లీ సాగుకు సిద్ధం

**మొంథా** తుపానుకు పంట పొలాలు మునిగి వరి పైరు కొన్ని రోజులకు పైగా నీటిలో ఉండి దెబ్బతింది. ఇంకా నాట్లు వేయాల్సిన మడుల్లోని నారు పాడై పోయింది. ఈ క్రమంలో అన్నదాతలు ముందున్న పంట కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయాధికారుల సూచనలతో మళ్లీ పంటను వేసేందుకు సిద్ధమయ్యారు. పది రోజుల క్రితం నారు మడి వేశారు. కష్టనష్టాలు ఎదురైనా తనతో పాటు సమాజానికి తిండి గింజలు అందించడానికి సాగుకు సిద్ధమైన రైతన్నా.. నీ కష్టం ఆగదని పలువురు అభినందిస్తున్నారు. **- న్యూస్‌టుడే, చినగంజాం**

నారుమడి, పక్కనే కుళ్లిన వరి పైరు

## మూతలు లేక..ప్రమాదాల బారినపడి

**నామ్** రహదారి వెంబడి ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లే ప్రజలకు సైడు కాలువలపై మూతలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి మురుగు కాలువల్లోకి జారిపడి గాయాల పాలవుతున్నారు. నామ్ రహదారి విస్తరణలో భాగంగా రామ్‌నగర్ నుంచి ఎన్టీఆర్ నగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించారు. దానికి అనుగుణంగా సైడు కాలువలు ఏర్పాటు చేశారు. కాలువలపై వేసిన సిమెంటు మూతలు కొన్నిచోట్ల విరిగి కాలువలోకి పడ్డాయి. తిరిగి వాటిని పైకి లేపే వారు లేక అలాగే ఉండిపోతున్నాయి. ఇలాంటి ప్రదేశాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అటు పురపాలక అధికారులు గానీ, ఇటు నామ్ ఎక్స్‌ప్రెస్ గుత్తేదారు గాని చొరవ తీసుకుని మూతలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, ఎన్టీఆర్‌నగర్ (అద్దంకి)**

ఎన్టీఆర్ నగర్ పాఠశాలకు వెళ్లే దారిలో ఇలా...

## శునకాల బెడదతో ప్రజల బెంబేలు

**మండ**లంలోని జాగర్లమూడివారిపాలెం ఎస్సీ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. కుక్కలు గుంపులుగా ఉండి దాడులకు తెగపడుతున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, ఇంటి నుంచి బయటకు రావాలన్నా భయపడుతున్నారని వాపోతున్నారు. తక్షణం అధికారులు స్పందించి శునకాల నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జె.పంగులూరు**

జాగర్లమూడివారి పాలెంలో కుక్కల గుంపు

(c) eenadu

# చరవాణి ఆగమనం చూపు మందగమనం

## చిన్నారుల్లో మయోపియా సమస్య

చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సక్రమంగా చదవడం లేదని తండ్రి మందలించేవారు. విషయం ఆరా తీస్తే బోర్డుపై అక్షరాలు సరిగా కనిపించడం లేదని చెప్పడంతో నేత్ర వైద్యుడిని సంప్రదించారు. ఆ విద్యార్థికి మయోపియా ఉన్నట్లు తేల్చారు.



తిరుపతి(వైద్యవిభాగం), పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అందులో 15 శాతం మంది పలు సమస్యలు ఎదుర్కొన్నట్లు నిర్ధారణైంది. మయోపియా కారణంగా పిల్లల్లో కంటి చూపు మందగిస్తున్నట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బోర్డుపై అక్షరాలు కనిపించకపోవడానికి 80 శాతం మయోపియా. మరో 20 శాతం హైపర్ మెట్రోపియా కారణమని అంటున్నారు.

నిత్యం 50 నుంచి 70 మంది కళ్ల మసక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

### అంటే ఏంటీ..?

సాధారణంగా నేత్రాలకు వెయ్యి లక్స్ కంటే ఎక్కువ కాంతి అవసరం. అప్పుడే కళ్లు తేజోవంతంగా పనిచేస్తాయి. అంతకంటే తక్కువ కాంతిలో చదవడం, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోతే మయోపియాకు దారి తీస్తుంది. కొందరి పిల్లల్లో పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుంది. కొందరికి యుక్త వయసులో వస్తుంది. ఈ సమస్యతో దూరంగా ఉన్న వస్తువులను చూడలేరు. అతి దగ్గర నుంచి తక్కువ కాంతిలో టీవీ, ఫోన్, ట్యాబ్ గంటల తరబడి చూస్తే దీని బారినపడతారు. కొవిడ్ సమయంలో ఎక్కువగా పిల్లలు కంటి సమస్యలకు గురైనట్లు గుర్తించారు.

### ఏం చేయాలి

ఏటా పిల్లలకు నేత్ర పరీక్షలు చేయించాలి. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ పాలు పంచుకోవాలి. సహజ సూర్య కాంతి వల్ల మానవ నేత్రం మయోపియాకు గురికాకుండా రక్షిస్తుంది. చరవాణి చూడటం ఆపేయాలి. ఒకరు మయోపియాకు గురైతే వారితో పుట్టిన వారికి పరీక్షలు చేయించాలి. వెంటనే అద్దాలు వాడితే సమస్య తీవ్రత పెరగదు.

**చిత్తూరు జిల్లాలో వివరాలు ఇలా..**

| సంవత్సరం | పరీక్షలు | అద్దాలు |
|---|---|---|
| 2024 | 76,629 | 3,500 |
| 2025 | 51,047 | 2,910 |

(ఇప్పటివరకు)

### 20 - 20 - 20 తెలుసా..!

పిల్లలు డిజిటల్ పరికరాలు ఉపయోగించే సమయం తగ్గించాలి. మూడేళ్ల కన్నా తక్కువ వయస్సు ఉన్న వారి చేతికి డిజిటల్ పరికరాలు ఇవ్వకూడదు. కంటికి దగ్గరగా పెట్టి చదవడం.. రాయడం చేయరాదు. ప్రతి 20 నిమిషాలు కంప్యూటర్ చూసిన తర్వాత 20 సెకన్లు చూపు మరల్చాలి. 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువును చూడాలి. ఇది కంటి కండరాలను సడలిస్తుంది.

### జాగ్రత్తలు తీసుకోవాలి: డాక్టర్ పీఎస్ చలపతిరెడ్డి, కంటి వైద్య విభాగాధిపతి, ఎస్వీ వైద్య కళాశాల



పిల్లల్లో మయోపియా సంకేతాలను గుర్తించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బ్లాక్ బోర్డుకు దగ్గరగా వెళ్లి చదువుతున్నారా.. ఇంట్లో దూరపు వస్తువులు చూడలేకపోతున్నారా.. తదితర లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స అందించాలి. ఆహారంలో ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, మాంసం, గుడ్లు, పాలు అన్నీ ఉండేలా చూసుకోవాలి.

## తిరుమల బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో..

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంటే కనులపండగే.. లక్షలాది మంది భక్తులు వచ్చి మాడవీధుల్లో విహరించే స్వామిని చూస్తూ తన్మయత్వం చెందుతారు. ఇంత అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు పూర్వ కాలంలో తిరుమలలో నిర్వహించే వారు కాదని తెలుసా.. గతంలో తిరుమల గిరులు దట్టమైన అరణ్యంతో నిండి ఉండటంతో క్రూరమృగాలు ఎక్కువగా సంచరించేవి. దీనికి తోడు అక్కడ వసతులు లేకపోవడంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను తిరుచానూరులోనే జరిపించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ముందుగా శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణం చేసి.. ఆ తరువాత వాహన సేవలను తిరుచానూరులో చేసేవారు. తరువాత కాలంలో భగవద్రామానుజాచార్యులు సూచనతో నాటి నుంచి తిరుమల క్షేత్రంలోనే నిర్వహిస్తున్నారు.

## అద్దంలా.. అందంగా..

చంద్రగిరి మండలం కొటాల వెంకట్రాయుని చెరువు ఇటీవల వర్షాలకు నిండుకుండలా మారింది. పైభాగాన ఉన్న ఎత్తైన కొండలు చెరువు నీటిలో ప్రతిబింబాలుగా కనువిందు చేస్తున్నాయి.
– న్యూస్‌టుడే, చంద్రగిరి

## ఆరే.. తీరే.. కులే..

పలమనేరు, న్యూస్‌టుడే: ఆరే.. తీరే.. కులే.. సరక్.. దలై.. ఏంటీ మాటలు అనుకుంటున్నారా.. ఇది ఏనుగుల భాష. వాటిని నియంత్రించడానికి మావటీలు వాడే పదాలు. సాధారణంగా అవేం తింటాయి.. ఎలా ఉంటాయి.. అనేది అందరికీ తెలిసిందే. మరీ ఈ ఏనుగుల భాష కూడా తెలుసుకుందామా..!

ఈ పదాలనే మావటీలు ఏనుగులకు అలవాటు చేస్తారు. వాటిని నియంత్రించడానికి చిన్నచిన్న పదాలు ఉపయోగిస్తారు. పలమనేరు మండలం ముసలిమడుగు కుంకీ శిబిరంలో ఉన్న 6 ఏనుగులు కూడా ఇదే భాషకు అలవాటు పడిపోయాయి.

**మావటీలు ఉపయోగించే కమాండ్లు**

- **దలై:** తొండం పైకి ఎత్తు
- **జుక్:** ముందు కాళ్లు మడచి వంగటం
- **కులే:** వెనక్కి వంగటం (వెనుక కాళ్లు వంచి)
- **సరక్:** వెనక్కి నడవటం
- **ఆరే:** ఇటు రా
- **బైట్:** కూర్చో
- **తీరే:** పడుకో

### పేరుతో పిలిస్తే చాలు..

కుంకీ శిబిరంలో ఉన్న ఏనుగుల పేర్లు జయంత్, రంజన్, అభిమన్యు, కృష్ణ, దేవ, వినయ్. పేరు పెట్టి పిలిస్తే ఆ ఒక్కటి మాత్రమే స్పందిస్తుంది. అంటే వాటికి తమ పేర్లు కూడా తెలుసు.

### త్వరలో సందర్శనకు అనుమతి

కుంకీ శిబిరంలోని ఏనుగులు, వాటి విన్యాసాలను చూడటానికి ప్రజలకు త్వరలోనే అనుమతి ఇవ్వనున్నట్లు అటవీశాఖ అధికారి నారాయణ తెలిపారు. శిబిరంలోకి టిక్కెట్టు ధర నిర్ణయించగానే అనుమతిస్తాం. సందర్శకుల కోసం టీకొట్టు, దుకాణాల ఏర్పాటు ఆలోచనలో ఉన్నట్లు వివరించారు.

## అమెరికాలో అందెల రవళి.. ..సింగపూర్‌లో సరిగమలు

**మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో విదేశాల్లో సంగీతం, నృత్య కోర్సులు**

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు సాధిస్తోంది. వర్సిటీలో ఉన్న ఇంటర్నేషనల్ రిలేషన్స్ కార్యాలయం (ఐఆర్) ఆధ్వర్యంలో అమెరికా, సింగపూర్‌లో సంగీతం తరగతులు నిర్వహిస్తోంది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా)తో అవగాహన ఒప్పందం చేసుకుని వర్సిటీ సంగీతం, నృత్య కళల విభాగం ఆధ్వర్యంలో తరగతులు నిర్వహిస్తూ, ఎన్ఆర్ఐలకు, విదేశీయులకు భారతీయ కళలను పరిచయం చేస్తోంది.
– న్యూస్‌టుడే, తిరుపతి (మహిళా వర్సిటీ)

### 2016లో ఏర్పాటు

వర్సిటీ సంగీత విభాగం ఆధ్వర్యంలో ఈ కోర్సులను అమెరికాలో 2016లో ప్రారంభించగా.. సింగపూర్‌లో 2021 నుంచి మొదలుపెట్టారు. అమెరికాలో తానా కళాశాల, డల్లాస్‌లో సుస్వర అకాడమీ ఆఫ్ మ్యూజిక్, రాగ వాహిని మ్యూజిక్ అకాడమీ, సింగపూర్‌లో విద్యా సంగీతం అకాడమీల ద్వారా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నారు.

### డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు..

4 సంవత్సరాల డిప్లొమాలో మ్యూజిక్ (వోకల్), డ్యాన్స్ (భరతనాట్యం, కూచిపూడి), ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సుల్లో వాగ్గేయకారామృతం, వర్ణం, అన్నమయ్య సంకీర్తనం కోర్సులున్నాయి. ఏడాది పూర్తి చేస్తే డిప్లొమా ఇన్ ఇంట్రడక్టరీ సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు పూర్తి చేస్తే డిప్లొమా సర్టిఫికెట్, 3, 4 ఏళ్ల కోర్సు పూర్తి చేస్తే అడ్వాన్స్‌డ్ డిప్లొమా సర్టిఫికెట్లను మహిళా వర్సిటీ అందిస్తోంది.

### 3 వేలకుపైగా విద్యార్థులు

ఇప్పటి వరకు అమెరికా, సింగపూర్‌లోని అకాడమీలలో దాదాపు 3వేలకుపైగా ఎన్నారై విద్యార్థులు సంగీతం, నృత్యంలో శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడాది 500 మంది వరకు కోర్సులను అభ్యసిస్తున్నారు. వారానికి 4 గంటలు థియరీ, 8 గంటల ప్రాక్టికల్ ట్రైనింగ్‌తో వర్సిటీ రూపొందించిన సిలబస్‌కు అక్కడి తెలుగు కమ్యూనిటీ నుంచి మంచి స్పందన లభిస్తోంది.

నృత్యంలో శిక్షణ తీసుకుంటున్న ఎన్నారై విద్యార్థినులు

### విదేశీయులూ ఆసక్తి..

భారతీయ కళలను, తెలుగు నృత్య, సంగీత కళలను ప్రపంచమంతటా విస్తరించడానికి శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ కృషి చేస్తోంది. తెలుగు కుటుంబాలతోపాటు విదేశీ విద్యార్థులు కూడా ఆసక్తి చూపుతున్నారు. చాలామంది భారతీయ సంగీతం, నృత్యం పట్ల ఆకర్షితులై శిక్షణ తీసుకుంటున్నారు. – **ఆచార్య పి. విజయలక్ష్మి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్, మహిళా వర్సిటీ**

**సంప్రదించాల్సిన నంబర్లు**
- అమెరికా: (972)501-04111, (214)649-8278
- మహిళా వర్సిటీ: 98498 40015

## అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమం కనులపండువగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ముందు జరిగే అంకురార్పణ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారు, సర్వసైన్యాధిపతి విష్వక్సేనుడిని ఊరేగింపుగా ఆలయ సమీపంలోని ఉద్యానవనానికి తీసుకెళ్లి పుట్ట వద్ద కొలువుదీర్చారు. పుట్టమట్టి సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. యాగశాలలో పుట్టమట్టిలో నవధాన్యాలు నింపి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం జరగనుంది. రాత్రి 7 గంటల 9 గంటల మధ్య అమ్మవారికి చిన్నశేష వాహనసేవ జరగనుంది.

పుట్టమట్టి సేకరిస్తున్న అర్చకులు

అలంకరణలో విష్వక్సేనుడు

## తోతాపురి.. బకాయిలెప్పుడో మరి..?

- పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన 50 మంది రైతులు కార్వేటినగరం, పుత్తూరు, నారాయణవనం మండలాల్లోని మామిడి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి కాయలు తోలారు. కార్వేటినగరంలోని ఏబీసీ గుజ్జు పరిశ్రమ రైతులకు టన్నుకు రూ.5 వేలు ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన పరిశ్రమలు ఇప్పటివరకు రూపాయి ఇవ్వకపోగా అసలు ఎప్పుడిస్తామనేది చెప్పడం లేదు. ఈ గ్రామ రైతులకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు బకాయిలు రావాలి.
- వెదురుకుప్పం మండలానికి చెందిన రైతులు జీడీ నెల్లూరులోని గుజ్జు పరిశ్రమకు కాయలు తరలించారు. ఆ కర్మాగార యాజమాన్యం విడతల వారీగా బిల్లులు చెల్లిస్తోంది. ఈ పరిశ్రమ ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా చేసి బకాయిలు ఇవ్వాలని కోరినా స్పందించలేదు.

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తోతాపురి టన్నుకు రూ.4 వేలు అందజేస్తే.. గుజ్జు పరిశ్రమలు చెల్లించాల్సిన రూ.8 వేలు నేటికీ జమ చేయలేదు. కొన్ని పరిశ్రమలు టన్నుకు రూ.5 వేల కంటే ఎక్కువ ఇవ్వలేమని చెప్పినా ఆ మొత్తాన్ని ఎప్పుడిస్తాయో పేర్కొనడం లేదు. మరికొన్ని బకాయిల ఊసే ఎత్తడం లేదు.. రైతు సంఘాల ప్రతినిధులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా యంత్రాంగానికి చీమకుట్టినట్లయినా లేదు.

- ఉమ్మడి జిల్లాలో విస్తీర్ణం: 1.12 లక్షల హెక్టార్లు
- తోతాపురి సాగు: 55 వేల హెక్టార్లు
- ఈ ఏడాది దిగుబడి: 5.5 లక్షల టన్నులు
- పరిశ్రమలు కొనుగోలు చేసినది: 5.5 లక్షల టన్నులు
- బకాయిలు రావాల్సినది: 2.5 లక్షల టన్నులు
- బకాయిల మొత్తం: రూ. వంద కోట్లు
(టన్నుకు కనీసం రూ.4 వేల చొప్పున చెల్లిస్తే)

### పరిశ్రమలకే లాభాలు

ఉమ్మడి జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు రెండు విధాలా లాభపడ్డా.. అన్నదాతలకు బకాయిలు మాత్రం చెల్లించడం లేదు. తోతాపురి కాయలను ప్రభుత్వ ధరకు కొనకపోవడం, నాలుగు నెలలుగా బిల్లులు ఇవ్వకుండా వడ్డీ పరంగా యాజమాన్యాలు లాభపడుతున్నాయి. రైతులు మాత్రం రెండు విధాలా నష్టపోయారు. పరిశ్రమల యజమానులు తమవద్ద తయారైన గుజ్జు ఎగుమతి కాలేదని, రైతుల బకాయిలకు బ్యాంకుల్లో రుణం తీసుకుని చెల్లించాలని యోచిస్తున్నట్లు చెప్పి తప్పించుకుంటున్నారు.

### ఏదీ నాటి చొరవ

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సీజన్ మొదలు నుంచి బకాయిల జమ వరకు కలెక్టర్లు చొరవ తీసుకుని సమన్వయ సమావేశాలు నిర్వహించి నగదు జమయ్యేలా చేసేవారు. నేడు ఆ పరిస్థితే లేదు. మొక్కుబడి సమావేశాలు మినహా రైతుల కన్నీరు తుడిచిన దాఖలాల్లేవు.

ఆంజనేయస్వామి ప్రతిష్ఠించిన శ్రీపాండురంగేశ్వర స్వామి శివలింగం

రాముడు చేసిన రామలింగేశ్వరస్వామి సైకత శిల్పం

## పంట్రంగం.. మరో రామేశ్వరం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకే ఆలయంలో రెండు శివ లింగాలను చూశారా.. అయితే మీరు వాకాడుకు 40 కిలోమీటర్ల దూరంలో తీరం వెంబడి వెలసిన శ్రీకామాక్షిదేవి సమేత శ్రీపాండురంగేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి పురాతన ఆలయానికి వెళ్లాల్సిందే. ఇక్కడ రెండు శివలింగాలు దర్శనమిస్తాయి. ఇలా ఒకే ఆలయంలో రెండు శివలింగాలు పూజలందుకోవడం తమిళనాడులోని రామేశ్వరం ఆలయం తర్వాత రెండవది పంట్రంగం ఆలయం అని పండితులు చెబుతున్నారు. ఆలయం చోళరాజుల కాలం నాటిది. రాముడు తీరం వెంబడి వెళ్తున్న సమయంలో ఆలయాన్ని సందర్శించి తనతో పాటు వచ్చిన ఆంజనేయుడిని శివలింగాన్ని తీసుకురమ్మన్నారు. ఆంజనేయుడు రావడం ఆలస్యం కావడంతో రాముడు సైకత లింగాన్ని చేసి ప్రతిష్ఠించాడని, తర్వాత ఆంజనేయుడు తెచ్చిన లింగాన్ని కూడా అదే ఆలయంలో పక్కనే ప్రతిష్ఠించారని శాసనాలు చెబుతున్నాయి. ఆలయం చుట్టు పక్కల 101 కోనేర్లు, 101 శివలింగాలు ఉన్నాయని చెబుతుండగా, నేటికీ కొన్ని కన్పిస్తుంటాయి. కార్తిక మాసం.. మహాశివరాత్రి పర్వదినాల్లో ఆలయంలో విశేష పూజలను నిర్వహిస్తుంటారు.

## అక్రమాలు పట్టేస్తుంది.. అక్రమార్కులను పట్టిస్తుంది!

**యుక్తధారతో ఉపాధి హామీలో లెక్క ఇక పక్కా**

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల కొలతల్లో తేడా చూపి చేసిన పనులనే మళ్లీ చేసినట్లు బిల్లులు పెట్టేందుకు వీల్లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుక్తధార జియో స్పేషియల్ ప్లానింగ్ పోర్టల్ ద్వారా సర్వే చేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బందికి దీనిపై శిక్షణనిచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల ప్రణాళికను ఇందుకు అనుగుణంగానే సిద్ధం చేస్తున్నారు. సాంకేతిక సిబ్బందికి శిక్షణ పూర్తయింది.

**ముందు కొలతలేసి.. ఆపై పనులు..:** ప్రతి పనిని ప్రత్యేక యాప్‌తో సర్వే చేసి, 50 మీటర్లకు ఒక ఫొటో తీసి, పొడవు, వెడల్పు, లోతు కొలతలను ఆటోమేటిక్ గూగుల్ ఎర్త్ మ్యాప్‌లతో గుర్తిస్తారు. వాటిని కంప్యూటర్‌లో నమోదు చేసి నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేస్తారు. ముందుగా గుర్తించిన ప్రదేశంలో నిర్ణీత కొలతల మేరకే పనులు చేయాలి. అంతకు మించి చేసినా, చేసినట్లు చూపినా బిల్లులు మంజూరు కావు. ఏ రోజుకా రోజు చేసిన పనుల కొలతలను అప్‌లోడ్ చేయాలి.

ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

- చిత్తూరు జిల్లాలో మొత్తం వైకాపా పాలనలో గత ఐదేళ్లలో రూ.3,85,93,652 అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో తేలగా, అందులో రూ.2,53,66,774 రికవరీ చేశారు. ఇంకా రూ.1,32,26,878 రికవరీ చేయాల్సి ఉంది.

### వెలుగు చూసిన అక్రమాల్లో కొన్ని..

శాంతిపురం మండలం చెంగుబళ్ల పంచాయతీ క్షేత్ర సహాయకుడు అక్రమాలకు పాల్పడినట్లు 16వ విడత సామాజిక తనిఖీలో తేలడంతో అతన్ని సస్పెండ్ చేశారు. జీడీనెల్లూరు మండలంలో 17 విడతల సామాజిక తనిఖీల్లో రూ.8.52 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించి, రూ.6.12 లక్షలు రికవరీ చేశారు. కుప్పం మండలంలో రూ.11.29 లక్షలు అక్రమాలు గుర్తించి రూ.7.59 లక్షలు రికవరీ చేశారు. గంగవరం మండలంలో రూ.18.67 లక్షలు పక్కదారి పట్టగా రూ.15.07 లక్షలు రికవరీ చేశారు. నగరి మండలంలో అత్యధికంగా రూ.34.99 లక్షలు అక్రమాలు జరిగినట్లు గుర్తించి రూ.25.05 లక్షలు రికవరీ చేశారు.

### ఒకసారి చేస్తే మరోసారి చూపడం కష్టం

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుక్తధార టూల్‌తో పని ప్రదేశంలో ముందుగానే కొలతలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఏ రోజుకారోజు చేసిన పనిని కొలతలు తీస్తారు. ఒకసారి చేసిన పనిని మరోసారి చేసినట్లు చూపే అవకాశం ఉండదు. – రవికుమార్, డ్వామా పీడీ

## నేడు డయల్ యువర్ సీఎండీ

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. డిస్కం పరిధిలోని వినియోగదారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చరవాణి నంబరు 89777 16661కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలుపవచ్చన్నారు.


**104FM Tirupati**
104 Mee FM
**ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు**
**సోమవారం నుంచి శుక్రవారం**

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వానేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499


## నేడు చిత్తూరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, క్రైం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా చిత్తూరులోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఏఆర్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు వినతులు స్వీకరిస్తామని ఎస్పీ తుషార్‌డూడి పేర్కొన్నారు.

## అండగా ఉంటాం.. అడ్డంగా కట్టేయ్!

**బీపీఎస్ మార్గదర్శకాలు రాక మునుపే నిర్మాణాలు**

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు నిర్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)కు మార్గదర్శకాలు వెలువడక మునుపే ప్రజాప్రతినిధుల అనుచరుల పైరవీలు, అధికారుల సహకారంతో పట్టణాల్లో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. బీపీఎస్ అమలుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనుంది.

నగరంలో భవనాలు

2025 ఆగస్టు 31కి మునుపు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుంది. సెప్టెంబరు 19న బీపీఎస్‌కు మంత్రివర్గ ఆమోదం లభించాక పట్టణాల్లో అదనపు అంతస్తుల నిర్మాణం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 300పైగా భవనాలు అనుమతులకు విరుద్ధంగా, అసలు అనుమతులే లేకుండా నిర్మించినట్లు సమాచారం. పట్టణాల శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది.

### ఫోన్ చేయిస్తూ.. నిర్మిస్తూ..

చిత్తూరు నగరపాలక సంస్థ కావడంతో.. ఇక్కడ భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు రూ. లక్షల్లో ఉండటంతో యజమానులు రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రభుత్వానికి ఫీజులు ఎగ్గొట్టి యథేచ్ఛగా అదనపు అంతస్తుల్ని నిర్మిస్తున్నారు.

### కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం

బీపీఎస్ పథకానికి విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తుల్ని నియంత్రించడానికి చర్యలు చేపడతాం. ఇదే అంశంపై వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. – **శుభప్రద, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ–2, చిత్తూరు**

### నగరంలో ఎక్కడెక్కడంటే..

నగరంలో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా, రీడ్స్‌పేటలో, లక్ష్మీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న కొన్ని భవనాల్లో అదనపు అంతస్తులకు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. మురకంబట్టులో రెండు భవనాలు, మిట్టూరులో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతుల్లేవని సమాచారం. ఉడిపి హోటల్ సమీపంలోని ఓ భవనంలో ఓ అంతస్తును అక్రమంగా నిర్మిస్తున్నారు.

- కాసులు అందితే చాలు.. ఎలాంటి నిర్మాణాలైనా చేసుకోండంటూ నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు ఇన్‌ఛార్జి భవన ఇన్‌స్పెక్టర్లు భవన యజమానులకు సూచిస్తున్నట్లు సమాచారం.
- పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు హైరోడ్డు, గాంధీరోడ్డు విస్తరణ పనుల్లో తలమునకలై ఉండగా.. కింది స్థాయి సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు.


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290



(c) eenadu

# ఆలయ దర్శిని

## కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాత సేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు

**నిజరూప దర్శనం:** ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
**సాయంత్రం:** 4.30- 5.00
**సర్వదర్శనం:** ఉ. 6-7,8-8.30, 9.30 -10.30 గంటల వరకు
మ. 12.00, సా. 4.30, రా. 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం



## శ్రీవారి ఆలయంలో

**నిత్యోత్సవాలు** తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45 గంటలకు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12 గంటలకు కల్యాణోత్సవం, 2 గంటలకు డోలోత్సవం, 3 గంటలకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 గంటలకు సహస్ర దీపాలంకారసేవ.

**సర్వదర్శనం:** తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

**వారోత్సవాలు:** ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

## ముక్కంటి ఆలయంలో

**ఉదయం:** 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ
6.30: ప్రథమ కాలాభిషేకం
7.30: ద్వితీయ కాలాభిషేకం
11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు
11.30: నిత్య కల్యాణం
**సాయంత్రం:** 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి :** 7.00: నీరాజన మంత్రపుష్పం
9.00: ఏకాంతసేవ
**సర్వదర్శనం:** ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

**రాహు, కేతు పూజలు:** ఉదయం 6 నుంచి సాయంత్రం 5. వరకు.
**అభిషేకాలు:** మృత్యుంజయ శివలింగానికి (సోమ వారం), కాలభైరవునికి (మంగళ), శ్రీమేధాదక్షిణా మూర్తికి (గురు), శనిభగవానునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనోన్మణికి ఊంజల్‌సేవ (శుక్ర వారం).

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

# ఆరోగ్య పరిరక్షణ.. సూక్ష్మజీవులపై పరిశోధన

మహిళా వర్సిటీ మైక్రోబయాలజీ పరిశోధకుల కృషి

ప్రయోగాలు చేస్తున్న పరిశోధకులు

**తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే:** ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో అంతుచిక్కని వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఈ వ్యాధులకు కారణమైన సూక్ష్మజీవుల స్వభావం, వాటి ప్రవర్తన, వ్యాధుల పుట్టుకపై విలువైన సమాచారాన్ని అందించడంలో మైక్రోబయాలజీ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సూక్ష్మజీవుల విశేషాలను తెలుసుకునేందుకు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగంలోని పరిశోధకులు నూతన పరిశోధనలు చేస్తున్నారు. ఆరోగ్య రంగంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారం చూపే దిశగా ప్రయోగాత్మక పరిశోధనలు సాగిస్తున్నారు పీహెచ్‌డీ విద్యార్థినులు.

### సముద్రపు జీవుల వ్యర్థాలను కుళ్లబెట్టి..

రొయ్యలు, ఎండ్రకాయల పొట్టు, వాటి వ్యర్థాలు భూమిలో కుళ్లబెట్టేందుకు బ్యాక్టీరియా ఉపయోగపడుతుంది. ఆ బ్యాక్టీరియా ఒక ఎంజైమ్‌ను విడుదల చేస్తుంది. ఆ ఎంజైమ్‌లో ఉండే కైటోఆల్గోస్కరైడ్‌లపై నేను పరిశోధనలు చేస్తున్నా. ఆచార్య చండీ మారుతీకుమారి మార్గదర్శకత్వంలో ఈ పరిశోధనలు జరుగుతున్నాయి. కైటోఆల్గోస్కరైడ్ వైద్య, ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయ రంగాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఆరోగ్య సంరక్షణలో కొత్త చికిత్సా విధానాలను అభివృద్ధి చేయొచ్చు. సముద్రపు జీవుల వ్యర్థాలను కుళ్లబెట్టే బ్యాక్టీరియా నుంచి తీసుకున్న ఎంజైమ్‌లో ఉండే కైటోజాన్‌ను కొటోఆల్గోస్కరైడ్‌లుగా మార్చితే కైటోజనీస్ అనే ఒక ఎంజైమ్ వచ్చింది. దీనికి నానో సింథసిస్‌ను యాడ్ చేసి పలు క్యాన్సర్ రుగ్మతలను ఎదుర్కోవడానికి, కాలిన గాయాలు, పండ్లను తక్కువ రోజుల్లో నయం చేసే అంశాలపై పరిశోధనలు చేస్తున్నా.

- కె.సబీహాతబసుమ్, పీహెచ్‌డీ విద్యార్థిని

### ఉప్పుశాతం అధికంగా ఉన్న మట్టిపై..

ఉప్పు మడుగులు ఉన్న మట్టిలో ఉప్పుశాతం ఎక్కువగా ఉంటుంది. ఉప్పుశాతం అధికంగా ఉన్న మట్టిలో హ్యాలోఫిలిక్ అనే సూక్ష్మజీవులుంటాయి. ఇవి పలు రకాల పిగ్మెంట్లను విడుదల చేస్తాయి. ఈ పిగ్మెంట్లపై నేను పరిశోధనలు చేస్తున్నా. వాటి వల్ల చాలా ఉపయోగాలున్నాయని తెలుసుకున్నా. క్యాన్సర్‌కు మందుల తయారీలో ఉపయోగించవచ్చు. ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు తగ్గించవచ్చు. చర్మ సంరక్షణకు వాడే వివిధ రకాల స్కిన్ కేర్ కాస్మొటిక్స్‌లో వీటిని ఉపయోగించవచ్చు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కూడా ఈ పిగ్మెంట్లు ఉపయోగపడతాయి.

- పి.సుచరిత, పీహెచ్‌డీ విద్యార్థిని

# ఆలస్యం.. ఆగ్రహం

● క్యూలైన్లలో భక్తుల కేకలు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చిన భక్తులు తీవ్ర అసంతృప్తితో క్యూలైన్లలో కేకలు వేస్తూ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వారాంతం అంటే ఊహించని విధంగా రద్దీ నెలకొంటోంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి 35 వేల మందికి పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. 5,044 రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు జరిగాయి. రాత్రి ఆలయం మూత వేసే వరకు రద్దీ కొనసాగింది.

శీఘ్ర దర్శనం క్యూలైన్ వద్ద బారులు తీరిన భక్తులు

### క్యూలైన్లతో ఇబ్బందులు

స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో క్యూలైన్లు పలు చోట్ల దుస్థితికి చేరాయి. ఎక్కువ మంది వస్తే క్యూలైన్లు ఊడిపోయే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగకముందే వీటిని పరిశీలించి బాగు చేసే దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

**నిరీక్షణతో ఆవేదన:** సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆలయంలో ఆర్జిత అభిషేక సేవలు, దీపారాధనలతో పాటు లక్ష, బిల్వ, కుంకుమార్చనల సందర్భంగా క్యూలైన్లు నిలుపుదల చేయాల్సి వచ్చింది. వీఐపీల రాక నేపథ్యంలో క్యూలైన్లు నిలిపేశారు. అప్పటికే గంటల తరబడి క్యూలైన్లలో ఉన్న భక్తులను నిలుపుదల చేయడం, ఇతర మార్గాల్లో సిఫార్సు దర్శనాలను అనుమతించడం పట్ల భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దర్శనాలకు వదలిపెట్టాలంటూ క్యూలైన్లలో కేకలు వేశారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. రద్దీ నేపథ్యంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుంటే రానున్న రోజుల్లో మరిన్ని కష్టాలు తప్పవు మరి.

## యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు

● నెలకు రూ.8 కోట్లు మిగులు

**చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే:** విద్యుత్తు బిల్లులో యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీ తగ్గిస్తూ విద్యుత్తు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరులో వినియోగించిన విద్యుత్తుకు సంబంధించి ఈ ఛార్జీలు అమలు కానున్నాయి. గత వైకాపా ప్రభుత్వ పాలనలో 'ట్రూఅప్ ఛార్జీ'ల పేరిట బిల్లుల భారం మోపగా ప్రస్తుత కూటమి పాలనలో 'ట్రూడౌన్' పేరిట ఛార్జీలు తగ్గిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నవంబరు నెల బిల్లులోనే తగ్గించిన ఛార్జీలు అమలు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి సుమారు 17లక్షల మంది వినియోగదారులు ఉన్నారు. వీరు నెలకు 194.67 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగిస్తారు. 13 పైసలు తగ్గింపు లెక్కన నెలకు రూ.8 కోట్లు వినియోగదారులకు భారం తగ్గనుంది.

## 23న పతకాల ప్రదానం

**చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే:** సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల విజేతల వివరాలను సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదనం ప్రకటించారు. పాఠశాల, ఇంటర్, డిగ్రీ కేటగిరీల్లో తెలుగు/ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 18 మంది విద్యార్థులకు ఈ నెల 23న సత్యసాయి జయంతి రోజున పతకాలు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి

**పుత్తూరు, న్యూస్‌టుడే:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరులో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న కడపలో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నామని, ఆ సదస్సు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీరాములు, నాయకులు చంద్రబాబు, రవి, మహేష్, శరవణబాబు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఎన్జీవో సంఘం తాలూకా అధ్యక్షుడిగా భానుప్రకాష్

**చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే:** ఏపీ ఎన్జీవో సంఘం చిత్తూరు తాలూకా అధ్యక్షుడుగా భానుప్రకాష్(వైద్య, ఆరోగ్య శాఖ) ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి విక్రమ్ ఆదివారం తెలిపారు. కార్యదర్శిగా ప్రసాద్‌బాబు (వ్యవసాయ శాఖ), కోశాధికారిగా సుభాన్‌బాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా గురునాథం, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌రాజ్, సుబ్రహ్మణ్యం, మురగేష్, పవన్‌కుమార్, సరిత ఎన్నికయ్యారన్నారు.

## 25న ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశం

**చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘ జిల్లా ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న జరిగే నిరసనల్లో ఏఐటీయూసీ నాయకులు, అనుబంధ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## వరసిద్ధుని దర్శనానికి ఐదు గంటలు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి అయ్యప్ప, సాధారణ భక్తులు ఆలయానికి ఆదివారం పోటెత్తారు. ఉదయం నుంచి క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది. సినీ నటుడు సాయిదుర్గతేజ్ ఆదివారం దర్శించుకున్నారు.

# రాధేయ కవితా సంపుటి ఆవిష్కరణ

రాధేయను సన్మానిస్తున్న రచయితలు

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని కళామందిరంలో కవి, విమర్శకులు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ కవితా సంపుటి పావుకోళ్లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆదివారం రచయిత పలమనేరు బాలాజీ పుస్తకావిష్కరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కవిత్వం కవుల జీవన తాత్వికతను ప్రతిబింబిస్తుందని అన్నారు. మగ్గం బతుకు కవితా సంపుటితో అని ప్రాంతాల పాఠకులను తన రచనలతో రాధేయ ఆకట్టుకున్నారని అన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ కి ఈ సందర్భంగా నివాళి అర్పించారు. అనంతరం రాధేయను రచయితలు సన్మానించారు. రచయితలు డాక్టర్ పెల్లకూరిసునిల్, పల్లిపట్టు నాగరాజు, కుమారస్వామిరెడ్డి, గండికోట వారిజ, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు పాల్గొన్నారు.

# సీఐఐ సదస్సు సూపర్‌హిట్

విలేకరుల సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** విశాఖ వేదికగా నిర్వహించిన సీఐఐ సదస్సు విజయవంతమైందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సి.ఆర్.రాజన్ పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు రూ.13 లక్షల కోట్లతో ఒప్పందాలు చేసుకున్నాయని, వాటి ద్వారా 16 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ● తితిదే పరకామణి కేసులో ఫిర్యాదు చేసిన మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ ప్రభుత్వ అధికారుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నారన్న భూమన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామనీ ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, కోదండయాదవ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

# దేశవాళీ ఆవులు కనుమరుగవుతున్నాయి

● పరిరక్షించాల్సిన బాధ్యత నేటి తరానిదే
● 13వ పంచగవ్య ముగింపు సదస్సులో విశ్వప్రసన్న తీర్థస్వామి

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రముఖులు

**ఈనాడు డిజిటల్, తిరుపతి:** 'ప్రాచీన కాలంలో ప్రతి దేవస్థానంలో పంచగవ్యను ప్రసాదంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇందుకు కారణం దేశీ ఆవులు కనుమరుగవడమే' అని ఉడిపి పేజావర అధోక్ష మఠం జగద్గురు విశ్వప్రసన్న తీర్థ స్వామి తెలిపారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న 13వ పంచగవ్య జాతీయ వైద్య సమ్మేళనం ముగింపు సదస్సు ఆదివారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచగవ్యను ఔషధంగా కాకుండా ఆహారంగా తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని.. ఇదే అధర్వణ వేదంలోనూ ఉందని పేర్కొన్నారు. గోమాత పరిరక్షణకు ఉడిపిలోని తమ మఠం కృషి చేస్తుందని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం గవ్య సిద్ధ వైద్యులు ఆచార్య జీవన్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. దేశీ ఆవులు ఉన్న ఇల్లు వైద్యాలయంగా, దేవాలయంగా శోభిల్లుతుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఒంగోలు గిత్త, ఆవులను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని సూచించారు. పుంగనూరు ఆవుల సంరక్షణ సైతం ఆశాజనకంగా లేదని వాపోయారు. సదస్సు చివరి రోజు 150 మంది ప్రముఖులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు తరలివచ్చారు. గోమాత స్పర్శ, 16వ గవ్య, విద్యుత్ శరీర సమతౌల్యం అనే అంశాలపై చర్చించారు. పంచగవ్య విద్యాపీఠం నుంచి కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. పంచగవ్య విద్యాపీఠం ఉప-గురుకులపతి డా.కమల్ తాయోరి, పంజాబ్ శ్రీమద్ భగవత్ కథ వాచక్ శ్రీధరాచార్య మహరాజ్, ఆచార్య మదన్‌సింగ్ కుశ్వాహ, ఆచార్య రణవీర్ కేఆర్ సింగ్, ఆమోద్ కేల్కర్, పంచగవ్య గురుకులం సభ్యులు భవనేశ్ దేవర, శ్రీకృష్ణన్ పటేల్, పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్వప్రసన్న తీర్థస్వామి

**సర్వదర్శనానికి 12 గంటలు.. తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే:** శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం శ్రీవారిని 73,852 మంది దర్శించుకున్నారు. రూ.3.16 కోట్ల హుండీ కానుకలు లభించాయి. **16 వేల టోకెన్ల జారీ:** తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 16 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో 2 వేల టోకెన్లు జారీ చేశారు.

# పుస్తకం.. మహోన్నతం

● పఠనం దినచర్యగా చేసుకుంటాం ● ప్రదర్శనలో యువత సందడి

న్యూస్‌టుడే, చిత్తూరు(సంతపేట)

పుస్తకం మనిషిని జ్ఞానం వైపు నడిపిస్తుంది.. చరిత్రకు ఆధారం.. నూతన విజ్ఞానాన్ని తెలుసుకునేందుకు నాంది పుస్తకమే.. జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సీఆర్‌రెడ్డి కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శన సాహితీ ప్రియుల్ని ఎంతో ఆకట్టుకుంటోంది.. యువత ఈ పుస్తక ప్రదర్శనను ఆసాంతం తిలకించారు. . ఈ ప్రదర్శనలో దేశ చరిత్ర-సంస్కృతి, సాంకేతిక, జీవితగాధల పుస్తకాలు చూసి అబ్బురపడ్డారు.. పుస్తక పఠనాన్ని ఇకపై వ్యాపకంగా మలచుకుంటామని చెబుతున్నారు.

### ఆరు లక్షలకు పైగా పుస్తకాలు..

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో ఆరు లక్షలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. పురాణేతిహాసాలు, రాజులు-పరిపాలన, స్వాతంత్ర్యోద్యమం, ఆర్థిక వ్యవస్థ, ఖగోళ విశేషాలు, నూతన ఆవిష్కరణలు, పోటీ పరీక్షలు, ఇలా వివిధ పుస్తకాలు లభ్యమవుతున్నాయి. రూ.50తో గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్న వారికి పరామర్శ విభాగంలో పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తారు. నిర్ణీత రోజుల్లో పుస్తకాలను సంబంధిత గ్రంథాలయాలకు తిరిగి ఇచ్చేయాలి. జిల్లా వ్యాప్తంగా లక్ష మందికిపైగా పాఠకులు పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్లి చదువుకుంటున్నారు.

పుస్తక ప్రదర్శన వీక్షిస్తున్న యువత

### గ్రంథాలయాల్ని సందర్శిస్తాం..

ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలు ఆకట్టుకున్నాయి. చదువుతో పాటు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఇవి దోహదం చేస్తాయి. ఇకపై గ్రంథాలయాలు తరచుగా సందర్శించి, అవసరమైన పుస్తకాలు తీసుకుంటాం. -జేమ్స్

### ఆసక్తిని రేకెత్తించాయి..

ప్రదర్శనలో ఉన్న పుస్తకాలను పరిశీలించగా దేశ స్వాతంత్ర్యోద్యమంపై చదివిన విషయాలు ఎంతో ఆసక్తి రేకెత్తించాయి. పూర్తి స్థాయి అధ్యయనం కోసం పుస్తకాన్ని తీసుకెళుతున్నా. -బృందశ్రీ

### మొదటిసారి వచ్చా..

పుస్తక ప్రదర్శన వీక్షించే ఇదే మొదటిసారి. చాలా కొత్త అంశాల గురించి తెలుసుకున్నా. శాస్త్ర సాంకేతిక రంగ పుస్తకాలు ఆకర్షించాయి. పూర్తి పరిజ్ఞానం సాధించేందుకు చక్కటి పుస్తకాలను చదువుతా. -ఇందుప్రియ

## జిల్లా పశుగణన సహాయకుల సంఘం నూతన కార్యవర్గం

**చిత్తూరు(వ్యవసాయం):** జిల్లా పశుగణన సహాయకుల(లైవ్‌స్టాక్ అసిస్టెంట్ల) సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక పశుసంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గం సమావేశం జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా వి.ప్రవీణ్, అసోసియేట్ అధ్యక్షుడిగా వి.గంగాధర్, ఉపాధ్యక్షులుగా ఎల్.హరికృష్ణ, కె.ఎస్.కిరణ్, వి.రాధికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జె.విక్రమ్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.మల్లికార్జున, టి.కోదండపాణి, కోశాధికారిగా కె.గిరిధర్‌రావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ సేవానాయక్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు లోకనాథం, నరసింహులు, ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు, ఎన్నికల అధికారిగా రాష్ట్ర నాయకుడు ప్రసాద్‌రావు వ్యవహరించారు.

## నగదు డిమాండ్ దారుణం

**చిత్తూరు గ్రామీణ:** జిల్లాలో కొందరు సీడీపీవోలు అంగన్‌వాడీ కార్యకర్తలను. . నగదు డిమాండ్ చేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘ(సీఐటీయూ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**CHITTOOR MUNICIPAL CORPORATION**

Roc.No:1099/2024/TO Dated :15-11-2025

**E-Procurement Tender Notice**

Tenders are invited from eligibile contractors for **19 works** under SBM and General Funds from from **Rs.2.80 Lakhs to 13.20 Lakhs** through e-procurement by under signed.

| Sl.No | Bid down loading starting date and time | Last date & time for receipt of Bids |
|---|---|---|
| 1 - 10 | 17-11-2025 @ 4.00 PM | 24-11-2025 @ 4.00 PM |
| 11 - 19 | 18-11-2025 @ 4.00 PM | 25-11-2025 @ 4.00 PM |

Further details contact at **9849907886** during the office hours on all working days.

Sd/- P.Narasimha Prasad, Commissioner, Chittoor Municipal Corporation

# సుత్తితో కొట్టి.. ఇంట్లో పూడ్చిపెట్టి

● డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు కడతేర్చిన అన్న

పోలీసుల అదుపులో నిందితులు ప్రభాకర్, జగదీష్

మృతుడు శ్రీనాథ్ (పాత చిత్రం)

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** వరుసకు తమ్ముడి వద్ద అవసరానికి డబ్బులు తీసుకొని, తిరిగి అడిగినందుకు కడతేర్చిన ఘటన కుప్పం పురపాలిక పరిధిలోని జగనన్న కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇంట్లో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు కుప్పం ఎన్టీఆర్ కాలనీకి చెందిన శ్రీనాథ్(37) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 27 నుంచి కనిపించడం లేదంటూ అతని భార్య నీలా బెంగళూరు అతిబెలే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడిగా శ్రీనాథ్ పెద్దనాన్న కుమారుడైన రామకుప్పం మండలం ముద్దనపల్లికి చెందిన ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు చిత్తూరుకు చెందిన జగదీష్‌ను విచారించారు. కుప్పం పురపాలిక పరిధిలోని డీకే పల్లెలోని జగనన్న కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్దకు చేరుకొని, తవ్విచూడగా మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం రెవెన్యూ అధికారుల సమక్షంలో కాలనీ ఇంటిలో తవ్వి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. నిందితులైన ప్రభాకర్, జగదీష్‌లను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### పథకం ప్రకారమే..

శ్రీనాథ్ నుంచి ప్రభాకర్ రూ.40 లక్షల వరకు డబ్బులు తీసుకొని, ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని నమ్మబలికాడు. అనారోగ్యంతో ఉన్న తన కుమార్తె హైరా(3)కు వైద్యం చేయించేందుకు డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ ప్రభాకర్‌పై శ్రీనాథ్ ఒత్తిడి తెచ్చారు. డబ్బులు రావాల్సి ఉందని కుప్పానికి వస్తే ఇస్తానంటూ గత నెలలో శ్రీనాథ్‌ను పిలిచారు. కుప్పం జగనన్న కాలనీలో ప్రభాకర్ కొనుగోలు చేసి, నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్దకు తీసుకొచ్చారు. డబ్బులు తిరిగి రాకపోవడంతో గత నెల 16, 18వ తేదీల్లో శ్రీనాథ్ కుప్పం వచ్చాడు. ఆ సమయంలో వెంట మొబైల్ తీసుకురావద్దంటూ ప్రభాకర్ చెప్పడంతో రెండుసార్లు అతను చెప్పినట్లే చేశాడు. 27న ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వచ్చిన శ్రీనాథ్‌కు మిఠాయిలో మత్తు మందు ఇచ్చి, జగనన్న కాలనీ ఇంటిలో స్పృహ కోల్పోయినప్పుడు తలపై సుత్తితో మోది హతమార్చారు. పథకం ప్రకారం ముందుగానే ఇంటిలో తీసిన గుంతలో పూడ్చి పెట్టారు.

### పట్టించిన లొకేషన్

గత నెల కుప్పం వచ్చిన శ్రీనాథ్ అతని భార్య నీలాకు ఫోన్‌తో తన లొకేషన్ మొదటిసారి పంపాడు. డబ్బుల కోసం వెళ్తున్నాడన్న విషయం తెలిసిన ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా విచారణ సులభమైంది.

### గతంలోనూ ఓ మహిళ హత్య కేసులో..

2013 ప్రాంతంలో నూలుకుంట వద్ద ఓ మహిళను హతమార్చిన కేసులో ప్రభాకర్ ఏ2 ఉండి, మూడేళ్ల కిందట విడుదలయ్యాడు. హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న జగదీష్‌తో ప్రభాకర్‌కు పరిచయమైంది. జగదీష్ సాయంతో శ్రీనాథ్‌ను హతమార్చి, రక్తపు మరకలు కనిపించకుండా సిమెంటు చల్లారు. మృతి చెందిన శ్రీనాథ్‌ను ఇంటిలోనే పాతిపెట్టారు.

# ఈత సరదాకు ఇద్దరు బలి

మల్లెమడుగు వద్ద ఘటన

**రేణిగుంట, న్యూస్‌టుడే:** ఈత సరదా ఆ కుటుంబాల్లో చీకటిని నింపింది... సరదా కాస్త విషాదంగా మారింది... ఇద్దరు మృతి చెందడం బాధాకరమైంది... మల్లెమడుగు రిజర్వాయర్లో ఈతకు దిగిన ఇద్దరు మృతి చెందారు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో తిరుపతి తాతయ్యగుంటకు చెందిన శేఖర్, శివ(35) నరేష్(36) ముగ్గురు మల్లెమడుగు రిజర్వాయర్‌కు చేరుకున్నారు. వీరిలో మొదట శివ ఈతకు నీటిలో దిగి లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. గమనించిన అతని బావ నరేష్.. శివను రక్షించేందుకు రిజర్వాయర్‌లోకి దూకాడు. అయితే అతని వల్ల కాక అదే ప్రదేశంలో మునిగిపోయాడు. ఇది గమనించిన శేఖర్ గ్రామస్థులకు, పోలీసులకు తెలియజేయడంతో వెంటనే పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్థుల సాయంతో ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు. రేణిగుంట పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

EENADU e Classifieds

MARRIAGE SERVICES

**ప్రముఖ వివాహ** సంస్థ నందు బలిజ/ కమ్మ/ రెడ్డి/ BC సామాజిక వర్గానికి చెందిన వధూవరులకు పెళ్లి సంబంధాలు చూడబడును. ✆ 98666 98833.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

**తిరుపతికి 12km** దూరం నార్త్, ఈస్ట్ కార్నర్ TUDA ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ అం|| తక్కువ ధరకే అమ్మబడును. ✆ 77991 81448, 94943 92069.

LEASE/ RENT

GENERAL

**2.75 ACRES** Comm Land Suitable for School or College or Warehouse, off NH205, 15 Mits from Tirupati. ✆ 94452 53860.

JOBS

**తిరుపతిలోని ప్రముఖ** కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**గాయత్రి హాస్పిటల్‌లోని** ఇంట్లో పనిచేయుటకు పనిమనిషి కావలెను. D.No.484&485, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యువెలరీ ప్రక్కన, తిరుపతి. 0877-2253714, 2228082,78422 89558.

**శ్రీచరిత్ హాస్పిటల్స్‌లో** పని చేయుటకు రిసెప్షనిస్ట్ (Male) కావలెను. రెడ్డి&రెడ్డి కాలనీ, ఆశాలత హాస్పిటల్ ఎదురుస్ట్రీట్, ICICI బ్యాంక్‌లైన్, తిరుపతి. ✆0877-2222177, 80083 75568.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

# చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

**మేమున్నాం.. మీకు తోడుగా..**

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

**న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు:** సమస్య: స్థానిక శివాలయం ఎదురు రోడ్డులో వీధిదీపం పాడవడంతో రాత్రివేళ భక్తులు విషపురుగుల బారినపడే ప్రమాదముంది. **-లక్ష్మి, స్థానికురాలు.**

సమాధానం: కొత్త దీపం ఏర్పాటు చేయిస్తాం. **- శివయ్య, పంచాయతీ కార్యదర్శి, జీడీనెల్లూరు**

**న్యూస్‌టుడే, పాలసముద్రం:** సమస్య: గంగమాంబపురం పంచాయతీ ఆదిఆంధ్రవాడ గ్రామ వీధుల్లో నీరు నిలవడంతో వృద్ధులు, చిన్నారులు బురదలో పడిపోతున్నారు. **- కుమార్, గ్రామస్థుడు**

సమాధానం: సిమెంట్ రహదారి నిర్మించడానికి ప్రతిపాదన పంపాం. వీధిలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. **-సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

**న్యూస్‌టుడే, పాలసముద్రం:** సమస్య: తిరుమలరాజుపురం పంచాయతీ కాలనీ గ్రామ బీసీ కాలనీలోని ప్రధాన వీధులు గులక రాళ్లు తేలి గుంతలమయంగా మారాయి. **-వేలు, గ్రామస్థుడు**

సమాధానం: ఇప్పటికే సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతానికి గ్రావెల్ తోలి సరిచేయిస్తాం. **-సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

**న్యూస్‌టుడే, చిత్తూరు నగరం:** సమస్య: మసీదు మిట్టలో.. వీధి శునకాల బెడద ఎక్కువగా ఉంది. **- కాలనీవాసులు**

సమాధానం: వీధి శునకాలను బంధించి ఏబీసీ టీకా వేయిస్తాం. **- లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

**న్యూస్‌టుడే, తవణంపల్లె:** సమస్య: పుణ్యసముద్రం గ్రామంలో కొన్ని వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. వీటికి ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలి. **-స్థానికులు**

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తాం. **- శివప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

**న్యూస్‌టుడే, పుత్తూరు:** సమస్య: రాచపాలెంలో చెత్త కుప్పలు నిత్యం తరలించక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **-ధనశేఖర్, రాచపాళెం**

సమాధానం: నిత్యం చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **-మోహన్‌కృష్ణ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

**న్యూస్‌టుడే, పూతలపట్టు:** సమస్య: పి.కొత్తకోటలో మురుగునీటి కాలువలు నిర్మించాలి. **-స్థానికులు**

సమాధానం: కాలువల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం. **- జరీనాతాజ్, పంచాయతీ కార్యదర్శి**

## యశోదమ్మకు నివాళి

**పెనుమూరు:** మెరవకండ్రిగకు చెందిన యశోదమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. ఆమె చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి సమీప బంధువు. ఆయన ఆదివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుమారుడు గోవర్ధన్, కుటుంబీకులను పరామర్శించారు. హరిబాబునాయుడు పాల్గొన్నారు.

## నేటి నుంచి సత్యసాయి జయంతి ఉత్సవాలు

**చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే:** సత్యసాయి జయంతి ఉత్సవాలను నగరంలో సోమవారం నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ తెలిపారు. 17న సత్యసాయి వ్రతకల్పం, 18న రుద్రాభిషేకం, 19న ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం, 20న సత్సంగం, 21న బాల వికాస్ సాంస్కృతిక కార్యక్రమాలు, 22న గిరింపేటలోని మందిరం అలంకరణ, 23న జయంతి రోజున సేవా కార్యక్రమాలు జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** స్థానిక ప్రాథమిక పాఠశాలలో గ్రీన్ సంస్థ అధ్యక్షులు శేషాద్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగులు తరలివచ్చారు. శిబిరాన్ని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్, సింగిల్ విండో డైరెక్టర్ హేమచంద్ర నాయుడు ప్రారంభించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

# అడుగేయాలంటే.. అష్టకష్టాలే

- అస్తవ్యస్తంగా రాకపోకలు
- దృష్టిసారించని యంత్రాంగం
- పట్టణవాసిని వీడని ట్రాఫిక్ ఇబ్బందులు

**న్యూస్‌టుడే, పుత్తూరు, నగరి, చిత్తూరు(నేరవి భాగం)**

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయి.. దీంతో పట్టణ జనాభాతో పాటు వాహనాలూ పెరుగుతున్నాయి.. అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు పెరుగుతున్నాయి. ఈ కారణంగా ప్రజల తాకిడి పెరుగుతోంది.. నిత్యం పట్టణాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.. వాహనాల రాకపోకల నియంత్రణకు అవసరమైన సిబ్బంది లేక సతమతమవుతున్నారు.. ఫలితంగా నిత్యం అవస్థలే.. పుత్తూరు, నగరి పట్టణాలతో పాటు చిత్తూరు నగరంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ వీడని సమస్యలా మారింది.. ఎప్పటికప్పుడు అధికారులు మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు తప్ప శాశ్వత చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.. ఫలితంగా సగటు పట్టణ, నగరవాసి కష్టాలు అన్నీఇన్నీకావు. ముఖ్యంగా విద్యార్థుల తిప్పలు చెప్పనలవికావు.


కార్వేటినగరం రోడ్డు కూడలిలో కష్టాలు

● పుత్తూరు పట్టణ పరిధిలో పలు విద్యా సంస్థలు ఉన్నాయి. వీటికితోడు నిత్యం మరో 15 వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం స్థానిక కార్వేటినగరం రోడ్డు కూడలి, ఆర్డీఎం రైల్వేగేటు, ఎంబీ రోడ్డు, ఎం.ఎన్.ఎం పెట్రోల్ బంకు తదితర ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. 1991లో అప్పటి కలెక్టర్ జనార్ధన నాయుడు పుత్తూరులో రోడ్ల విస్తరణ చేపట్టారు. ఆపై ఇక వాటి ఊసే లేదు. జనాభా, పెరిగిన వాహనాలకు అనుగుణంగా రోడ్లు విస్తరించక పోవడంతో పట్టణవాసులు విపరీతమైన కష్టాలు ఎదుర్కొంటున్నారు.

**పురపాలిక: పుత్తూరు**
**జనాభా: 70 వేలు**
**వార్డులు: 27**
**నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు: 15 వేల మంది**

● చిత్తూరు నగర జనాభా 2.2 లక్షలు. నగరంలో ప్రత్యేకంగా ట్రాఫిక్ స్టేషన్ ఉన్నా సిబ్బంది కొరత వేధిస్తోంది, భారీ వాహనాలు నగరంలోకి పగటివేళ దర్జాగా వచ్చేస్తున్నాయి. గ్రానైట్ లారీలు, ఇసుక టిప్పర్లు భారీగా పగటివేళ నగరంలో తిరుగుతున్నాయి. ఎంఎస్‌ఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ఎంజీఆర్ స్ట్రీట్, చర్చి వీధి, శేషాపీరాన్ వీధుల్లో.. రద్దీ సమయంలో అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ కష్టాలు, ఉత్తుత్తిగా వన్ సైడ్ పార్కింగ్ చేస్తుంటారు. రాకపోకల విషయంలో ట్రాఫిక్ సిబ్బంది కఠినంగా ఉన్నా పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తేవడంతో వారు చేసేదేమీలేక మిన్నకుంటున్నారు. ఫలితంగా ఈ సమస్య నేటికీ పరిష్కారం కాక నగరవాసికి తిప్పలు తప్పడం లేదు.

చిత్తూరులో ఇలా అస్తవ్యస్తంగా..

**నగరపాలిక: చిత్తూరు**
**జనాభా: 2.2 లక్షలు, డివిజన్లు: 50**
**నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు: 10 వేల మంది**

● నగరి పట్టణ జనాభా 65వేలు. ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఇక్కడ లేదు. సిబ్బంది మాత్రం ఉన్నారు. పట్టణంలోని టవర్‌క్లాక్, ఓంశక్తి ఆలయం, మున్సిపల్ బస్టాండ్, ఏకాంబరకుప్పం, నాగలాపురం రోడ్డుల్లో నిత్యం ట్రాఫిక్ కష్టాలే. తిరుపతి నుంచి వెళ్లే అన్ని ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు టవర్ క్లాక్ సమీపంలో ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటాయి. ఈ నేపథ్యంలో తరచూ తిప్పలు తప్పడం లేదు. కళ్లెదుటే అడ్డదిడ్డంగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా.. వీటిని క్రమబద్ధీకరించే నాథుడే కరవయ్యాడు.

**పురపాలిక: నగరి**
**జనాభా: 74 వేలు**
**వార్డులు: 29**
**నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు: 3 వేల మంది**

పుత్తూరు.. శాఖా గ్రంథాలయంలో ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

## గ్రంథ పఠనంతో విద్యార్థులకు ఉజ్వల భవిత

**పుత్తూరు, న్యూస్‌టుడే:** గ్రంథ పఠనంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక శాఖా గ్రంథాలయాధికారిణి మీనాకుమారి పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నాటి ఉద్యమంలో పాల్గొన్న అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, రంగనాథం చిత్రపటాలకు నివాళులర్పించారు. మీనాకుమారి మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

## గడ్డికోత యంత్రం వితరణ

**కాణిపాకం, న్యూస్‌టుడే:** వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ గోశాలకు ఏలూరు వేగివాడ వాస్తవ్యులు మాధవి రూ.50 వేలు విలువ జేసే గడ్డికోత యంత్రాన్ని వితరణగా ఆలయ ఈవో పెంచల కిషోర్‌కు ఆదివారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవో ధనుంజయ పాల్గొన్నారు.

యంత్రాన్ని పరిశీలిస్తున్న ఈవో పెంచల కిషోర్

### దిమ్మె.. గూడైంది

బంగారుపాళ్యం మండలం మొగిలి పరిసర ప్రాంతాల్లో ఆరు వరుసల రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణం కోసం కొండ గుట్టలు, చెట్లు తొలగించారు. నిన్నటివరకు గ్రామీణులు తమ ఆవులను ఇళ్ల పరిసరాల్లోని చెట్ల కింద కట్టేసేవారు. ప్రస్తుతం అవి తొలగిపోయాయి. దీంతో మొగిలి శివారులో కొందరు తమ ఆవులను రోడ్డుకు వినియోగించే సిమెంట్ దిమ్మెలను షెడ్లుగా వినియోగించుకుని వాటిని అక్కడ ఉంచుతున్నారు. **- ఈనాడు, చిత్తూరు**

### ఈ వృథా ఆగదు.. దాహార్తి తీరదు

కృష్ణజిమ్మాపురం పంచాయతీ కొండం గ్రామంలోని తాగునీటి ట్యాంకు పక్కనున్న పైపులైను నుంచి నిత్యం నీరు వృథా అవడంతో సగం ట్యాంకు కూడా నిండట్లేదు. ఫలితంగా ట్యాంకు నుంచి ఇందిరానగర్, ఆదిఆంధ్రవాడ, కొండం గ్రామాల్లోని సగం ఇళ్లకే తాగునీరు అందుతోందని ఆయా ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

### చెట్ల ప్రతిబింబం.. నీటి సోయగం

చిత్తూరు నగర శివారులోని కాజూరు సమీప నీవానది నీటితో కళకళలాడుతోంది. నదిలో చెక్‌డ్యాం ఏర్పాటు చేయటంతో నిలిచిన నీటిలో గట్టుపై ఉన్న చెట్ల ప్రతిబింబం నీటిలో కనువిందు చేస్తోంది.. మరోవైపు చెక్‌డ్యాం నిండి ప్రవహిస్తున్న నీరు జలపాతాన్ని తలపిస్తూ అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులను ఇట్టే ఆకట్టుకుంటోంది. **- ఈనాడు, చిత్తూరు**

### అదుపు తప్పితే అంతే..

చిత్తూరు-తిరుత్తణి మార్గంలో అనంతాపురం పంచాయతీ గ్రావిటా ఫ్యాక్టరీ సమీప చిన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం తమిళనాడు-ఆంధ్ర సరిహద్దు కావడంతో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఇటీవలి వర్షాలకు వంతెన దెబ్బతిని దానికి ఇరువైపులా ఉండే గోడ మరమ్మతులకు గురైంది. ఈ గోడ కనిపించక పొరపాటున అదుపుతప్పితే పక్కకు పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దీనికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ**

### ఆరోగ్య ఉపకేంద్రం.. అలంకార ప్రాయం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో 189.కొత్తపల్లె పంచాయతీ వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కిలారిపల్లె క్రాస్ వద్ద ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణాన్ని చేపట్టారు. ప్రారంభంలో పనులు చురుగ్గా జరిగినా ఆపై అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల అధికారులు.. గుత్తేదారును ఒత్తిడి చేయడంతో 90 శాతం పూర్తిచేశాడు. భవనం చుట్టూ శుభ్రం చేసి రంగులేసి ప్రారంభిస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే వీలుంది. **-న్యూస్‌టుడే, గుడిపాల**

## ‘ఊసరవెల్లి రాజకీయాలను సహించను’

నూతన అధ్యక్షులతో ప్రమాణం చేయిస్తున్న థామస్

**పెనుమూరు, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో ఎవరైనా ఊసరవెల్లి రాజకీయాలకు పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్యే థామస్ హెచ్చరించారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో నియోజకవర్గంలోని తెదేపా ఆరు మండలాలకు నియమితులైన నూతన అధ్యక్షులతో ఆదివారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కమిటీల ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని, ఆయా మండలాల కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకున్నాకే ఈ నియామకం జరిగిందన్నారు. కొందరు ఈ విషయంలో నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఎంఎస్ఎంఈ బోర్డు డైరెక్టర్ చినబాబు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అధిష్ఠానం సూచన బేఖాతరు**

తెదేపా అధినాయకత్వం ఇచ్చిన సూచనను.. ఎమ్మెల్యే థామస్ పట్టించుకోనట్లు తెలిసింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల తెదేపా అధ్యక్షుల ప్రమాణ స్వీకారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగింది. పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల పార్టీ అధ్యక్షుల ఎంపికపై కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని తెలుసుకున్న అధిష్ఠానం ఈ రెండు మండలాల అధ్యక్షుల ప్రమాణ స్వీకారాన్ని నిలిపేయాలని సూచించింది. ఈ విషయమై చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్ ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల అధ్యక్షుల నియామకాన్ని నిలిపేయాలని సూచించామన్నారు. అలాకాక ముందుకు సాగితే అధిష్ఠానానికి నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు.

నూతన కమిటీ సభ్యులు

## మామిడి రైతుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**తవణంపల్లె, న్యూస్‌టుడే:** మండల మామిడి రైతుల సంఘం నూతన కమిటీని ఆదివారం అరగొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మునిరత్నంనాయుడు, కన్వీనర్‌గా మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమల యాజమాన్యం ఇప్పటి వరకు కిలోకు రూ.8 చెల్లించక పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం చొరవ చూపి మామిడి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులకు గుజ్జు పరిశ్రమలు నగదు చెల్లించకుంటే డిసెంబరులో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు హేమలత, రైతులు పాల్గొన్నారు.

## చెరువుల లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయండి

**పుత్తూరు, న్యూస్‌టుడే:** చెరువుల లీకేజీలు అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి బాగు చేయించాలని జలవనరుల శాఖ అధికారులను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశించారు. తిరుపతిలోని తన నివాసంలో ఆదివారం ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈఈ శ్రీనివాసులుతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుపానుతో పుత్తూరు, వడమాలపేటలో చెరువులు జలకళ సంతరించుకున్నాయన్నారు. తాజాగా మరో రెండ్రోజులు వర్షాలు కురవనున్నాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో సప్లై ఛానళ్ల మరమ్మతులు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గూళూరు చెరువు పూర్తిగా నిండితే గ్రామం ముంపునకు గురవుతోందని, ఇందుకు పరిష్కార మార్గం చూపాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విద్యార్థికి దుప్పట్లు అందజేస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

## వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**నింద్ర, న్యూస్‌టుడే:** స్థానిక బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లను సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సహకారంతో ఈ వసతిగృహానికి నూతన భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ప్రభుత్వం పేద కుటుంబాల విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవకుండా వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డెన్ ఏలుమలై, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, ఏఎంసీ కమిటీ డైరెక్టర్ పెరుమాళ్‌రెడ్డి, తెదేపా నాయకులు పరదేశి, శరవణ, ఎబిరాజ్, జనార్ధన్ నాయుడు, కోదండరెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పూతలపట్టు, న్యూస్‌టుడే:** తవణంపల్లె మండలం పల్లెచెరువుకు చెందిన గిరి(42) పూతలపట్టు మండలంలోని మద్దలయ్యగారిపల్లెలో వివాహం చేసుకుని అక్కడే నివసిస్తున్నాడు. ఆదివారం రంగంపేట క్రాస్‌లోని మద్యం దుకాణం సమీపంలో నడిచి వెళ్తుండగా జేసీబీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వ్యక్తికి గాయాలు.. కార్వేటినగరం, న్యూస్‌టుడే:** పాదిరికుప్పానికి చెందిన శరత్‌బాబు తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంలో కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద బంధువుల వివాహానికి వెళ్లడానికి వేచిఉన్నాడు. చిత్తూరు నుంచి పుత్తూరు వెళ్తున్న ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొనడంతో శరత్‌కుమార్‌కు గాయాలయ్యాయని, అతడిని తిరుపతి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

### ఆదివారమైతే ఇంతేనండోయ్..!

ప్రధాన వాణిజ్య కేంద్రం, ప్రముఖ కూడలి పచ్చికాపల్లంలో ఆదివారమొస్తే వాహనదారులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో రహదారులు కిక్కిరిసిపోతాయి. ప్రతి ఆదివారం వారపు సంత జరుగుతుండటంతో ఈ రద్దీ నెలకొంటోంది. ఈ రహదారిపై వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ సమయంలో అత్యవసర వాహనమొచ్చినా ఆగాల్సిందేనని అంటున్నారు. వాహనాల రద్దీకి తోడు రహదారులపైకి చొచ్చుకువస్తున్న దుకాణాలు సైతం కారణమవుతున్నాయని, అధికారులు స్పందించి పచ్చికాపల్లంలో రద్దీ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వెదురుకుప్పం**

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్

## జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం

**కార్వేటినగరం, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నా యుగంధర్ అన్నారు. స్థానిక ధర్మరాజుల ఆలయం ఆవరణలో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతనాకి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యకర్తలకు సలహాలు సూచనలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## రుణం... ప్రగతికి మార్గం

● ఆదాయార్జనతో మహిళల రాణింపు

**పుత్తూరు, న్యూస్‌టుడే:** పుత్తూరు మున్సిపాలిటీలో స్వయం సహాయక సంఘాలు వెయ్యి వరకు ఉన్నాయి.. 13వేల మంది సభ్యులుగా చేరి నెలనెలా పొదుపు చేసుకుంటున్నారు.. తద్వారా రూ.150 కోట్లు లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు మహిళలు బ్యాంకుల్లో రుణాలు పొంది చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ నెలనెలా కొంత ఆదాయం ఆర్జించి తమ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారు.

**చిరు దుకాణంతో..**

బీకాం వరకు చదివి ఉపాధి లేకుండా ఇంటి వద్దే ఉన్నా. మెప్మా సిబ్బంది సహకారంతో శ్రీగోవిందమ్మ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరా. కొద్దికొద్దిగా నగదు బ్యాంకులో పొదుపు చేసి. తద్వారా రుణాలు పొందా. ప్రభుత్వం ఆసరా నిధులు రూ.16,640 అందజేసింది. రుణం, ఆసరా నిధులతో చిరు దుకాణం ఏర్పాటు చేసుకున్నా. ప్రతి నెలా అన్ని ఖర్చులు పోను రూ.15 వేలు సంపాదిస్తున్నా. కుటుంబ ఆర్థిక సమస్యలు పరిష్కారమయ్యాయి. **-సుజని**

**బేకరీ ఏర్పాటు చేసుకుని..**

బేకరీ వ్యాపారంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నా. పెట్టుబడి లేకుండా బయట అప్పులు చేసి వ్యాపారం చేసే వాళ్లం. దీంతో పెట్టుబడి, వడ్డీ పోను ఖర్చులకు ఇబ్బందిగా ఉండేది. షణ్ముగ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. రూ.80 వేలు బ్యాంకు రుణం తీసుకుని బేకరీ ఏర్పాటు చేసుకున్నా. తద్వారా నెలకు రూ.20 వేలు ఆదాయం వస్తోంది. కుటుంబ అవసరాలకు ఇబ్బంది లేకుండా సాగిపోతోంది. **- సుమలత**

**చిరు వ్యాపారంతో..**

వెన్నెల స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. ఈ సంఘంలో చేరక ముందు మగ్గం పనికి వెళ్లేవాళ్లం. దీంతో పూట గడవడం కష్టమైంది. 2009లో సంఘంలో చేరి కొంత మొత్తం పొదుపు చేసుకుని రూ.10వేలు బ్యాంకు లింకేజీ, సంఘంలో కొంత మొత్తం అప్పు తీసుకుని చిరు వ్యాపారం ప్రారంభించా. ప్రస్తుతం ఖర్చులు పోను రూ.10 వేలు ఆదాయం వస్తోంది. ఆర్థిక సమస్యలు తీరాయి. **- సుమతి**

## మా ఇష్టం.. వేటాడతాం

- యథేచ్ఛగా వన్యప్రాణుల వేట
- పట్టించుకోని అటవీశాఖ

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల్లో వన్యప్రాణుల వేట జోరుగా కొనసాగుతోంది. నాటుబాంబులు, నాటు తుపాకులు, విద్యుత్తు తీగలు అమర్చి అడవి పందులు, దుప్పులు, అడవికోళ్లు, నెమళ్లు, కుందేళ్లను హతమారుస్తున్నారు.. వాటి మాంసానికి విపరీతమైన గిరాకీ ఉండటంతో ఈ వేట దర్జాగా సాగుతోంది.. గుట్టుచప్పుడు కాకుండా దాన్ని విక్రయించి వేటగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు.. వీటిని అడ్డుకోవాల్సిన అటవీశాఖ నిద్రావస్థలో ఉండటం గమనార్హం.

బండ్లదొడ్డి, కొదలమడుగు, టేకుమంద, వెలుతురుసేను, సీజీఎఫ్‌కాలనీ తదితర గ్రామాల్లో ఈ వేట నిరాటంకంగా సాగుతోంది. వన్యప్రాణుల మాంసం కిలో రూ.300 మేర బహిరంగంగానే కొందరు కొనుగోలు చేస్తున్నారు. కళ్లెదుటే చంపేస్తున్నా వన్యప్రాణులను పరిరక్షించాల్సిన అటవీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే బహిరంగ విమర్శలు ఉన్నాయి. మరోవైపున వాటిని వేటాడేందుకు వెళ్లి పొరపాటున కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

● ఈ నెల మూడో తేదీన బండ్లదొడ్డి అటవీ ప్రాంత సరిహద్దు మామిడి తోటలో వన్యప్రాణులను హతమార్చేందుకు అమర్చిన విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరు వేటగాళ్లు విగతజీవులయ్యారు.

● ఈ నెల నాలుగో తేదీన బండ్లదొడ్డికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి నాటుతుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● కొద్ది నెలలు క్రితం వన్యప్రాణులను హతమార్చేందు అమర్చిన నాటుబాంబును తొక్కి వెలుతురుసేనుకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు.

బండ్లదొడ్డికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసి నాటుతుపాకీ స్వాధీనం చేసుకున్న పోలీసులు (పాత చిత్రం)

ఇలాంటి ఘటనలు ఇటీవల మండల పరిధిలో పెరిగాయి. ఫలితంగా ఆయా కుటుంబాలకు తీరని శోకం మిగులుతోంది. వేటగాళ్లను నిరోధించి అడవి జంతువులను కాపాడాల్సి ఉంది.

**వేటగాళ్లపై నిఘా ఉంచాం..**

వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం. నాటు తుపాకులు కలిగిఉన్నవారిపై నిఘా ఉంచాం. వీటి వేటను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. **- శ్రీనివాసులు, సీఐ, బంగారుపాళ్యం**

(c) eenadu

# పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

## తారసపడితే పుస్తకమిస్తారు.. చదవమంటారు


పుస్తకం ఇస్తున్న రచయిత పలమనేరు బాలాజీ

**పలమనేరు, న్యూస్‌టుడే:** ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ తాను రచించిన పుస్తకాలను ఒక సంచిలో పెట్టుకొని స్నేహితులు ఎవరు తారసపడినా వాటిని ఇచ్చి చదవమంటున్నారు. రచయితలు ఇలా తాము రాసిన పుస్తకాలను ఇతరులతో చదివించే ఈ విధానాన్ని విదేశాల్లో బుక్ స్వాగింగ్ అంటారు. ఇప్పుడు ఈ విధానాన్ని రచయిత బాలాజీ ఎంచుకొని తన రచనలతో పాటు ఇతర రచయితలు పుస్తకాలను స్నేహితులకు ఉచితంగా అందించి చదవమని చెబుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో ధాత్రీ పూజలు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో ధాత్రీ పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరిదేవి, నెల్లిచెట్టు, తులసి చెట్లకు పూజలు చేశారు. అనంతరం ఆటల పోటీలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, బాలాజీ గుప్త, భానుప్రకాష్, రంగనాయకులు శెట్టి పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి దేవి

## పెట్టుబడుల దిశ మార్చేలా సీఐఐ సదస్సు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కుటుంబం

**పలమనేరు, న్యూస్‌టుడే:** రాష్ట్రాన్ని పెట్టుబడుల దిశగా మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సదస్సు నిలిచిందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. విశాఖలో రెండు రోజులపాటు చేపట్టిన సమ్మిట్ విజయవంతం కావడంపై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సదస్సు ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడటం మాత్రమే కాదని మన రాష్ట్రంపై గ్లోబల్ దృష్టిని మళ్లించిందన్నారు. రాయలసీమ కేంద్రంగా ఏరోస్పేస్ రంగాల్లో రూ. 1200 కోట్లతో రేమాన్ సంస్థ పెట్టుబడులు పెట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. **తిరుమల, తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీవారిని ఆదివారం ఉదయం బ్రేక్‌లో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

## ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పీఎస్ మునిరత్నం తదితరులు

**శాంతిపురం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ కార్యక్రమాల్లో తెదేపా శ్రేణులు భాగస్వాములు కావాల్సిందిగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం రాళ్లబూదుగూరు, సి.బండపల్లె, 64- పెద్దూరు, కడపల్లె, కర్లగట్ట, చిన్నారిదొడ్డి, పంచాయతీల్లో జరిగిన పార్టీ సమన్వయ కమిటీల సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. కుప్పంలో అభివృద్ధి, సంక్షేమం అమలుకు సీఎం చంద్రబాబు కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయ్‌కుమార్, మంజునాథ్, రెస్కో, ఏఎంసీ డైరెక్టర్లు బసవరాజు, అనసూయ, చలపతి, మణి, జీసీ గోవిందరాజులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మిక.. రక్షణ లేక

✦ చేతితో వ్యర్థాలు తీస్తున్నా పట్టని యంత్రాంగం

**పలమనేరు, న్యూస్‌టుడే:** పురపాలికలో పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కొరవడింది. నిత్యం వారు ఎక్కడ పడితే అక్కడ చెత్తను తీయాల్సి ఉండగా కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. గాజు సీసాలు, వైద్యులు వాడేసిన సూదులు, వ్యర్థాలను చేతితోనే పట్టుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం రెండేళ్లకోసారి చేతి తొడుగులు, నూనె, సమవస్త్రాలు అందజేస్తుంది. గుత్తేదారుడు సరఫరా చేస్తున్నవి నాసిరకంగా ఉండటంతో చేతి తొడుగులు ఆరు నెలల్లోనే పాడైపోతున్నాయి. ఇక గమ్‌బూట్లు మున్సిపల్ కార్యాలయంలో రెండు, మూడు జతలు ఉన్నా వర్షాకాలంలో మాత్రమే ఉపయోగిస్తున్నారు.

**వివరాలిలా..**

| | |
|---|---|
| మొత్తం కార్మికులు | 156 |
| శాశ్వత కార్మికులు | 10 |
| ఇందులో శానిటేషన్ | 105 |
| నీటి సరఫరాకు | 35 |
| కార్యాలయంలో | 16 |

### ఎక్కడ పడితే అక్కడ పారబోత

పట్టణంలో వైద్యులు వాడేసిన మందులు, సూదులను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. గతంలో ఇలా ఆసుపత్రుల్లోని వైద్య వ్యర్థాలను సేకరించడానికి క్లీన్‌హెల్త్ బయోమెడికల్ వేస్టు మేనేజ్‌మెంటు సంస్థ సేకరించి అనువైన ప్రదేశంలో వాటిని పడేసేది. ఇందుకోసం గతంలో ఒక వాహనం కూడా వచ్చేది. ఇప్పుడు ఆ వాహనం రాకపోవడంతో వైద్యులు తమ ఆసుపత్రుల వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. పరిశుభ్రత చర్యల్లో భాగంగా మున్సిపల్ కార్మికులు వాటిని ఎలాంటి రక్షణ గ్లౌజులు లేకుండా చేతితో తీస్తూ ప్రమాదం కొని తెచ్చుకుంటున్నారు. ఇటీవల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే వ్యర్థాలను ప్రహరీ లోపల పడేస్తే రోగులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించి సిబ్బందితో తీయించారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చేతికి గ్లౌజులు లేకుండా చెత్త తీస్తున్న కార్మికుడు

### ప్రభుత్వ పరంగా అందని భరోసా

పలమనేరు పట్టణం సముద్రమట్టానికి 1000 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ శీతాకాలంలో మంచు ఎక్కువగా కురవడంతో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో కార్మికులు పనిచేయడానికి అనువైన దుస్తులు సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరైనా దాతలు ఇస్తే తప్పా ప్రభుత్వ పరంగా కార్మికులకు ఎలాంటి భరోసా అందడం లేదు.

### దాతల సహకారంతో అందజేస్తాం

కార్మికులకు చేతి గ్లౌజులు ఇస్తున్నాం. కొందరు అవి పట్టు దొరకదని వాడటం లేదు. ఇక స్వెటర్లు ఎవరైనా దాతల నుంచి సేకరించి అందజేస్తాం.

**- ఎన్వీ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు**

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

**శాంతిపురం, న్యూస్‌టుడే:** సమస్య: కుప్పం- పలమనేరు జాతీయ రహదారిలో బడుగుమాకులపల్లె కూడలి వద్ద స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.– శివకుమార్, స్థానికుడు

**సమాధానం:** వాహనదారులు వేగ నియంత్రణ పాటించే విధంగా చర్యలు తీసుకొని ప్రమాదాలను అరికడతాం. – నరేష్, ఎస్సై

**పలమనేరు, న్యూస్‌టుడే:** సమస్య: పట్టణంలోని సారియ అంగడి వీధిలో కాలువలు మురుగుతో పేరుకుపోయాయి. – గణేష్, పలమనేరు

**సమాధానం:** సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

### పారిశుద్ధ్య చర్యలు

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని అయ్యాకణ్ణు వీధిలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. దీనిపై మేమున్నాం మీకు తోడుగాలో ఆదివారం ప్రచురించిన సమస్యకు అధికారులు స్పందించారు.

స్పందనకు వందనం

## ఉచిత నేత్ర శస్త్రచికిత్సలకు 44 మంది ఎంపిక

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఉచిత నేత్ర చికిత్సలకు 44 మంది ఎంపికైనట్లు సాయిమాతా సేవా ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 200 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 44 మందిని ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలకు వైద్యులు ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. వైద్య సిబ్బంది శివ ప్రకాష్, వీరభద్రప్ప ఉన్నారు.

మ్యూజికల్ చైర్ ఆటలో పాల్గొన్న మహిళలు

## కోలాహలంగా కార్తిక వనభోజనాలు

**పలమనేరు, న్యూస్‌టుడే:** గంగవరం మండలం మామడుగు గజారామం వద్ద కార్తిక వనభోజనం కార్యక్రమాన్ని కోలాహలంగా చేపట్టారు. పలమనేరు, పరిరక్షణ సమితి, ఏపీ ఎన్జీవో సంఘం సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పట్టణంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సభ్యులు, మహిళలు, పిల్లలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలను ఒకచోట చేర్చడమే ధ్యేయంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పీపీఎస్ అధ్యక్షులు నరసింహులు చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

## మాలమహానాడు సభకు తరలిన నాయకులు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ విధానం, మాలలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా ఆదివారం మదనపల్లెలో నిర్వహించిన మాలమహానాడు రాష్ట్ర మహాసభకు పుంగనూరు నుంచి నాయకులు తరలి వెళ్లారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాసులు, గంగా, భాస్కర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

## పింఛను ఇచ్చి ఆదుకోండయ్యా

హోటల్‌లో పనిచేస్తున్న వల్లెమ్మ

**పలమనేరు, న్యూస్‌టుడే:** గంగవరం మండలం గండ్రాజుపల్లె గ్రామానికి చెందిన టి.వల్లెమ్మ ఒంటరి జీవనం సాగిస్తోంది. ఈమె భర్త వెంకటరమణ గతేడాది మృతి చెందారు. చేతికందిన కుమారుడు ఈ ఏడాది మార్చిలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. దీంతో అప్పటి నుంచి ఆమె జీవనం కష్టంగా సాగుతోంది. ఒంటరి జీవనం సాగిస్తున్న ఆమె పింఛను కోసం ప్రభుత్వ కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరిగిన ఫలితం లేకపోయింది.

## రైతన్నకు నూర్పిడి పోటు

✦ ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులు

వరి పంటను కోస్తున్న యంత్రం

**పుంగనూరు, న్యూస్‌టుడే:** జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడిలో రైతన్నలు తీరిక లేకుండా గడుపుతున్నారు. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్తు కోతల నుంచి గట్టెక్కినా నూర్పిడిలో రైతన్నల బాధలు వర్ణనాతీతం. ఈ ఏడాది 6 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. రైతన్నకు నూర్పిడి ఖర్చులు వెంటాడుతున్నాయి. పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో వరిసాగు చెరువులు, కుంటల కింద, బోరు బావుల కింద సాగులో ఉంది. బోరు బావుల కింద సాగు చేసే రైతన్నలకు మరింత ఖర్చులు పెరుగుతున్నాయి. మోటారు, పంపు, నియంత్రికలు మరమ్మతుకు గురైతే వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది.

### ఎకరాకు రూ.10 వేలు

కూలీల ధరలు పెరగడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో వరి పంట ఎకరా నూర్పిడికి రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతన్నలు వాపోతున్నారు. గతంలో గ్రామాల్లో సంప్రదాయ పద్ధతుల్లో వరి నూర్పిడి జరిగేది. ప్రస్తుతం యంత్రాల వినియోగంతో మరింత భారమవుతోంది.

పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ల బాడుగలు, కూలీల మొత్తాలు విపరీతంగా పెరిగిపోయాయి. గతేడాది మడి దున్నడానికి ట్రాక్టర్‌కు గంటకు రూ.1200ల లోపే ఉండేది ప్రస్తుతం రూ.1,300లు, నాట్లు సమయంలో కూలీలు పురుషులకు రూ.600లు, స్త్రీలకు రూ.500- రూ.450ల వరకు కూలీ చెల్లించే వారు. ప్రస్తుతం అందరికీ దినసరి కూలీ మొత్తం రూ. 600లు ఇవ్వాలని రైతులు వాపోతున్నారు. ఎకరా వరి పొలం సాగుకు రూ.20 నుంచి రూ.25 వేలు వరకు ఖర్చవుతోంది. నూర్పిడికే సాధారణ పొలంలో రూ. 10 వేలు, తేమ ఎక్కువగా ఉన్న పొలాల్లో రూ.16 వేలు అవుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండిస్తే కోతదశకు వచ్చే సరికి నిలకడలేని వర్షాలు, పెనుగాలులతో నేలకొరుగుతాయని యంత్రాల ద్వారా కోతలకు శ్రీకారం చుడుతున్నారు. డబ్బు ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తున్నా సకాలంలో పంట నూర్పిడి అవుతుందనే ఆశ రైతుల్లో ఉంది.

### గ్రాసం మిగులుతోంది

వరి సాగులో వచ్చే ఖర్చులు, ధాన్యం విక్రయించగా వచ్చిన సొమ్ముకు సరిపోతోంది. కేవలం గ్రాసం మిగులుతోందని వదల్లేక వరి సాగు చేస్తున్నాం. ఆ గ్రాసం కూడా వరుణ దేవుడి కరుణపై ఆధారపడి ఉంది. **చెంగప్ప, వరి రైతు, పుంగనూరు**

## అనాథకు అంత్యక్రియలు

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో అనాథ శవానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అంత్యక్రియలు చేపట్టారు. ఇటీవల పెద్దపంజాణి మండలంలో రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి శవపరీక్ష గదిలో ఉంచగా సంబంధీకులు ఎవరూ రాలేదు. ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మృతదేహానికి దహన సంస్కారాలు చేశారు. శివ, షణ్ముఖ తేజ, నరేంద్ర పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**బంగారుపాళ్యం:** స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో రోగులు తరలి వచ్చారు. గ్రేడ్స్ సంస్థ అధ్యక్షులు శేషాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్, సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్ర నాయుడు ప్రారంభించారు. మహిళలు, పిల్లలకు మధుమేహం, ఎముకల సంబంధిత వ్యాధులకు సంబంధించి 120 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

## సీపీఆర్‌పై శిక్షణ

సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న డా.శ్రీనివాస్

**పుంగనూరు, న్యూస్‌టుడే:** సీపీఆర్ పద్ధతి ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని స్విమ్స్ ప్రొఫెసర్ డా.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, వ్యసనాలతో, ఆరోగ్య పరీక్షలు సక్రమంగా చేసుకోక గుండె నొప్పితో మృతి చెందేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. డా.విజయకుమారి, డా.శరణ్‌కుమార్, గణేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

## పఠన సంస్కృతిని పెంపొందించుకోవాలి

**పుంగనూరు, న్యూస్‌టుడే:** సామాజిక పరిజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక అంశాల్లో అవగాహన కోసం ప్రతి విద్యార్థి పఠన సంస్కృతిని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి తులసీనాయక్ కోరారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

## బురద గుంత.. దోమలతో తంట

మండలంలోని కాటిపేరి గ్రామం మధ్యలో ఉన్న బురద గుంతలో ఇటీవల వర్షాలకు నీరు చేరింది. ఈ నీరు ప్రస్తుతం రంగు మారి దోమలకు నిలయంగా మారింది. రాత్రి సమయాల్లో దోమల బెడద అధికం కావడంతో గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

## ఎక్కిళ్లు వస్తున్నాయి.. మరమ్మతు చేయండి

మండలంలోని మొరుంపల్లె ప్రాథమిక పాఠశాలలో 31 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మతుకు గురైంది. దీంతో విద్యార్థులు నిత్యం ఇంటి నుంచి నీటి సీసాలు తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో సీసాలో నీరు అయిపోతే ఇక అంతే సంగతులు. దీంతో విద్యార్థులు ఎక్కిళ్లు ఆపుకుంటున్నారు. క్యాన్ల ద్వారా తాగునీటిని తెప్పిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శంకర్ తెలిపారు. సమస్యను ఎంఈవో నటరాజరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

**.- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

## రాళ్లదారి.. గుండెలు చేజారి

సదుం- చెరకువారిపల్లె మార్గం గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కోతకు గురై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చోదకులు ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే హడలెత్తిపోతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, సదుం**

## నేటి నుంచి సత్యసాయి జయంతి ఉత్సవాలు

**చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే:** సత్యసాయి జయంతి ఉత్సవాలను నగరంలో సోమవారం నుంచి 23 వరకు నిర్వహించనున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ తెలిపారు. 17న సత్యసాయి వ్రతకల్పం, 18న రుద్రాభిషేకం, 19న ప్రభుత్వ ఆసుపత్రిలో సేవా కార్యక్రమం, 20న సత్సంగం, 21న బాల వికాస్ సాంస్కృతిక కార్యక్రమాలు, 22న గిరింపేటలోని మందిరం అలంకరణ, 23న జయంతి రోజున సేవా కార్యక్రమాలు జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం

**శాంతిపురం:** విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగిన ప్రతి ఒక్కరూ ఉజ్వల భవిష్యత్తును సాకారం చేసుకోగలరని కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రేస్ మారియా ఛారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్సై నరేష్, వైద్యురాలు ప్రవల్లిక రెడ్డి, ట్రస్టు నిర్వాహకులు ఆరోగ్యరాజ్, జేసుమేరీ పాల్గొన్నారు.

## బస్సులు రాని బస్టాండు..
## అక్కరకు రాని మరుగుదొడ్లు

❍ ఆవరణలో కానరాని పరిశుభ్రత

నిర్మానుష్యంగా బస్సు ప్రాంగణం

**రామకుప్పం, న్యూస్‌టుడే:** స్త్రీశక్తి పథకంతో రాష్ట్రంలోని ఆర్టీసీ బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదు. బస్టాండ్లలో ప్రధానంగా మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంపై నేటికీ దృష్టి సారించడం లేదు. రామకుప్పం ఆర్టీసీ బస్టాండుకు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు రాకపోవడంతో మరుగుదొడ్లు దుస్థితికి చేరాయి.

### ప్రయాణికుల అవస్థలు

గత వైకాపా ప్రభుత్వంలో రామకుప్పానికి పూర్తిగా బస్సు సర్వీసులను తొలగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేసింది. అయినా బస్టాండుకు బస్సులు రాకపోవడంతో ఆవరణమంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. బస్టాండు ఆవరణలో ప్రతి సోమవారం వారపు సంత ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతున్నా మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదు. ప్రస్తుతం బస్టాండు ప్రధాన దారిలో ఇరువైపులా తోపుడు బండ్లు, చికెన్ దుకాణాల ఏర్పాటు ద్వారా కొంత ఆదాయం వస్తోంది. గతంలో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండు ప్రస్తుతం బస్సులు రాక, వారపు సంతలకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మహిళా ప్రయాణికులు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రానికి పలు సొంత పనులు, కార్యాలయాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేక పట్టణవాసులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించి, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాడుకలో లేని మరుగుదొడ్లు

### దూర ప్రాంతాల వారికి ఇబ్బంది

దూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు బస్టాండులో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

**-నారాయణమ్మ, ప్రయాణికురాలు**

### అధికారులు చర్యలు తీసుకోవాలి

బస్టాండును వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. అధికారులు చర్యలు తీసుకొని అభివృద్ధి చేయాలి. **- ఆదిల్‌బాషా, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు**

క్రైం కార్నర్

## సిరప్ అనుకొని విషద్రావకం తాగిన మహిళ

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కడుపునొప్పితో బాధపడుతూ సిరప్ అనుకొని విషద్రావకం తాగి మహిళ అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని సింగిరిగుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సింగిరిగుంట గ్రామానికి చెందిన మణి భార్య మహాలక్ష్మి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆదివారం కడుపునొప్పి తీవ్రం కావడంతో సీసాలో ఉన్న విషద్రావకం తాగారు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనం

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని వనమలదిన్నె పంచాయతీ ఓబిరెడ్డిపల్లె సమీపంలోని మలుపులో చోటు చేసుకుంది. పుంగనూరు నుంచి ఇంటికి వెళ్తున్న మేస్త్రీ మోహన్ (24) అతని స్నేహితుడు బాలాజీలు గ్రామ సమీపంలోని మలుపులో ద్విచక్ర వాహనం విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

## ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** చెన్నై-ముంబయి జాతీయ రహదారిపై గూడూరుపల్లె సమీపంలోని మలుపులో ఆదివారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. డ్రైవర్ల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశులు తెలిపారు.

## రెండు వాహనాలు ఢీ

**కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:** కుప్పం చెరువు కట్ట సమీపంలోని కూడలి వద్ద రెండు వాహనాలు ఆదివారం సాయంత్రం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికుల కథనం మేరకు పీఈఎస్ ఆసుపత్రి నుంచి కుప్పం వైపు వస్తున్న థార్ కారును గుడుపల్లె నుంచి బైపాస్ మార్గంలో వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో థార్ కారు బోల్తాపడింది. ప్రమాదానికి గురైన రెండు వాహనాలను కుప్పం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

## పిల్లలపై శునకాల గుంపు దాడి

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలోని మొరంపల్లె గ్రామంలో ఆదివారం పిల్లలు ఆడుకుంటుండగా శునకాల గుంపు వారిపై దాడి చేశాయి. ఘటనలో మోక్షిత్ (11) గాయపడ్డాడు. కుటుంబసభ్యులు బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

## వృద్ధ దంపతులపై ఒంటరి ఏనుగు..

**కల్లూరు, న్యూస్‌టుడే:** పాతపేట గ్రామం ప్రధాన రహదారి వద్ద ఒంటరి ఏనుగు ఆదివారం బీభత్సం సృష్టించింది. వృద్ధ దంపతులపై దాడి చేసిన సంఘటన ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు పాతపేట గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం (60), భార్య రెడ్డెమ్మ (60) ఇద్దరు తిరుపతికి వెళ్లేందుకు ప్రధాన రహదారి వద్దకు నడుచుకుంటూ వచ్చారు. మామిడి తోటల్లో నుంచి ఒంటరి ఏనుగు దూసుకొచ్చి వీరిపై దాడి చేసింది. దాడిలో సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలు కాగా, రెడ్డెమ్మకు పక్కటెముకల్లో గాయమైంది. గ్రామస్థులు వృద్ధులను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు.

## దాడి ఘటనపై కేసు

**సోమల, న్యూస్‌టుడే:** వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివశంకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు నెల్లిమందకు చెందిన మునేంద్రపై 14న రాత్రి కందూరులో వల్లిగట్ల పంచాయతీ తుంగలడ్డు గ్రామానికి చెందిన కోటగుండ్ల చరణ్, అతని స్నేహితుడు సోములు దాడిచేసి గాయపరిచారు. గాయపడిన మునేంద్ర తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి అక్క రమణమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు చరణ్, సోములపై కేసు నమోదు చేశామన్నారు.

## పశువును కాపాడబోయి.. యువకుడు ఆసుపత్రిపాలు

**గుడుపల్లె, న్యూస్‌టుడే:** గుడుపల్లె-కుప్పం ప్రధాన మార్గం ఆంజనేయస్వామి గుడి మలుపు వద్ద రోడ్డుపైకి పశువు రావడంతో కాపాడబోయి ద్విచక్రవాహన చోదకుడు పండుస్వామి అనే యువకుడు కిందపడి తీవ్రగాయాల పాలైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కుప్పం మండలం వెండుగాంపల్లెకు చెందిన పండుస్వామి గుడుపల్లె నుంచి కుప్పం వైపు వెళ్తుండగా పక్కనే గడ్డి మేస్తున్న పశువు రోడ్డుపైకి రావడంతో వాహన వేగాన్ని నియంత్రించే క్రమంలో కిందపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది చికిత్స నిమిత్తం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు.

(c) eenadu

ఆటపాటలు.. అదిరేటి స్టెప్పులు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలో పలు వారి సంక్షేమ సంఘం కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కుటుంబసభ్యులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో సందడి చేశారు. నూతనంగా పదవులు స్వీకరించిన వారిని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సభ్యులను పూలమాలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## శ్రీవారి క్షేత్రం.. ఆధ్యాత్మిక వైభవం



దేవేరులతో స్వామివారు

భక్తులకు హారతి చూపుతున్న అర్చకస్వామి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. కార్తిక ఆదివారం సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీనృసింహ హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్‌ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## వండిందే మెనూ..!

ఆకుకూర, అరటి పండు కనిపించని వైనం

భోజనం వడ్డింపు

అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన మెనూ సక్రమంగా అమలుకావడం లేదు. మెనూ ప్రకారం అన్నం, ఆకుకూర, కూర, సాంబారు, ఉడకపెట్టిన గుడ్డు, పెరుగు, అరటి పండు పెట్టాల్సి ఉంది. ఆదివారం మధ్యాహ్నం సుమారు 50 మందికి అందించిన భోజనంలో ఆకుకూర, అరటిపండు కనిపించ లేదు. పెరుగు నీళ్ల మాదిరి ఉంది. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకరరావును వివరణ కోరగా.. ఇప్పటి వరకు తమకు ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

## గట్టుపై గుట్టుగా ఆక్రమణలు

### అధ్వానంగా వైనతేయ ఏటిగట్టు

న్యూస్‌టుడే, మామిడికుదురు

పి.గన్నవరం మండలం నాగుల్లంక నుంచి మామిడికుదురు మండలం గోగన్నమఠం వరకు విస్తరించిన వైనతేయ నది ఏటిగట్టు అధ్వానంగా మారింది. విస్తరణ చివరి దశ పనులు 2014 జులైలో నిలిచిపోగా.. ఇప్పటి వరకు కదలిక లేదు. 1986 నాటి వరద నీటి మట్టానికి అనుగుణంగా రెండు మీటర్ల అదనంగా ఎత్తు పెంచేందుకు చేపట్టిన పనులు పూర్తికాలేదు. దీంతో తీర గ్రామాల ప్రజలు కలవరపడుతున్నారు. ఈ ఏడాది వి.గన్నవరంలో నాగుల్లంక- పాశర్లపూడి మధ్య గట్టు బలోపేతానికి రూ.96 లక్షలు మంజూరైనా ఇప్పటికీ పనులకు నోచుకోలేదు.

పాశర్లపూడిలో నిర్మించిన షెడ్డు

అడుగులో అస్తవ్యస్తంగా..

ఏటిగట్టు పొడవు: 25 కి.మీ.

ఆక్రమ నిర్మాణాలు
ఇళ్లు 60 | పాకలు 20

కుంగిన ప్రాంతాలు
- పెదపట్నంలోని రక్షావరం
- పాశర్లపూడిలోని శ్రీరామపేట
- పాశర్లపూడిలంకలోని సర్పాలరేవు

**అడుగడుగునా తూట్లే..**

పాశర్లపూడి- గోగన్నమఠం మధ్య పలుచోట్ల గట్టుకు ఆక్రమణల కారణంగా తూట్లు పడుతున్నాయి. గట్టు మట్టిని తొలిచేసి కొందరు సిమెంటు స్తంభాలు వేసి పక్కా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై రాకపోకలకు వీలు లేకుండా కొందరు ఆక్రమించారు. ఆక్వా రైతులు చెరువులను గట్టుకు సమాంతరంగా విస్తరింపజేయడంతో పాటు మధ్యలో గొట్టాలు అమర్చి అనధికారిక ఏటవాలు బాటలు వేశారు. వాహనాల రాకపోకల కారణంగా కొన్నిచోట్ల గట్టు ఉపరితలం అస్తవ్యస్తంగా మారింది.

**విస్తరణ పనులు పూర్తి చేస్తాం..**

వైనతేయ నది ఏటిగట్టు విస్తరణ నిధులు మంజూరు కావడంతో త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తాం. ఆక్రమణలపై పరిశీలన చేసి వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. రాకపోకలకు ఉన్న అడ్డంకులను తొలగిస్తాం. బలహీన ప్రదేశాలను గుర్తించిన చోట గట్టును స్థాయిలో పటిష్టం చేస్తాం.
-టీవీఎస్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈఈ, రాజోలు

## ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడ, కాళేశ్వరం, రామప్ప, వెయ్యిస్తంభాల గుడి, పాలకుర్తి, సమ్మక్క, సారక్క ఆలయాల సందర్శనకు గోకవరం డిపో నుంచి ఈ నెల 18న ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ మార్గరెట్ సుచరిత తెలిపారు. బస్సు 21న తిరిగి గోకవరం చేరుకుంటుందన్నారు. టికెట్ రూ.2 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు. కార్తిక సోమవారం సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు అయినవిల్లి, మురమళ్ల, కుందలేశ్వరం, అప్పనపల్లి, అంతర్వేది ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అక్కడ ఏం చేశామంటే..!

- నగరంలో పర్యటించిన కుంభమేళా నిర్వహణ బృందం
- పుష్కరాల ఏర్పాట్లపై దిశా నిర్దేశం

పరిశీలన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 2027 పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. యాత్రికుల రద్దీ నియంత్రణపై కసరత్తు ప్రారంభించింది. తాజాగా జరిగిన ప్రయాగరాజ్ కుంభమేళాలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో దానిపై దృష్టి సారించారు. అక్కడ ప్రభుత్వం రద్దీ నియంత్రణ, నిర్వహణ సంబంధించి ప్రణాళికలు రూపొందించే ప్రత్యేక ప్రైవేటు కన్సల్టెన్సీలను ఆహ్వానించింది. అక్కడ పని చేసిన ఏజెన్సీ బృందాన్ని ఇటీవల నగరానికి రప్పించారు. ప్రధానంగా రద్దీ నియంత్రణ ఎలా, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసే క్రమంలో వారి సలహాలు స్వీకరించారు. బృందం సభ్యులు రెండు రోజుల పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టర్, ఎస్పీ, కమిషనర్లతో సమావేశమయ్యారు. పుష్కరాలకు సంబంధించి గోదావరి ఘాట్ల విస్తరణ, రద్దీని ఎదుర్కోవడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

**కుంభమేళాలో ఇలా**

- ఏఐ టెక్నాలజీ వినియోగించారు. 2 వేల వరకు ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- కుంభమేళాలో 27 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేశారు.
- 256 ఘాట్లు తీర్చిదిద్దారు.
- 800 వరకు పుష్కర నగరాలు నిర్మించారు. 1.16 లక్షల మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

**గోదావరి పుష్కరాలకు సూచనలు**

- 60 వరకు ఏఐ కెమెరాలు ఘాట్ల వద్ద ఏర్పాటు చేయాలి.
- తిరుపతి నగరం తరహాలో రాజమహేంద్రవరంలో రెండు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏఐకి అనుసంధానం చేయాల్సి ఉంది.
- గోదావరి పుష్కరాలకు సుమారు 6 కోట్ల నుంచి 8 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రాథమిక అంచనా.
- 14 పుష్కర నగరాలు ఏర్పాటు చేయాలి.
- 1000 తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలి.
- ప్రస్తుతం అందుబాటులో 17 ఘాట్లు ఉన్నాయి. వీటిని విస్తరించాల్సిన అవసరం ఉంది.

**అవాంతరాలు అధిగమిస్తేనే**

✦ గోదావరి ఘాట్లను ఆనుకొని దిగువన శాశ్వత నిర్మాణాలు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో ముందుగానే వాహనాలను నగరంలోకి అనుమతించకూడదు. రైళ్లు, బస్సులు, ఇతర సొంత వాహనాల్లో వచ్చే యాత్రికులు పుష్కర నగరాల వరకూ మాత్రమే వాహనాలను అనుమతించాల్సి ఉంది.
✦ గోదావరి తీరం ఆనుకొని 30, 40 అడుగుల రోడ్డు మాత్రమే ఉన్నాయి. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం 60, 80 అడుగులుగా విస్తరించాల్సి ఉంది.
✦ గోదావరి ఘాట్లను అనుసంధానం చేయాలని గత పుష్కరాలకే ప్రతిపాదించారు. ఇప్పటి వరకూ ఆ పనులు చేపట్టలేదు.
✦ అటు కొవ్వూరు, ఇటు కాతేరు మీదుగా రాజానగరం పరిధిలో ఘాట్‌లను పొడిగించే ప్రతిపాదనలు పూర్తి చేయాలి.

పేరవరం వద్ద కోతకు గురవుతున్న లంక భూములు

## కళ్లెదుటే కరిగిపోతోంది..!

వరద ఉద్ధృతికి పంటలతోపాటు విలువైన లంక భూములు భారీగా కోతకు గురయ్యాయి. ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం మండలాల్లో కోత ఎక్కువగా ఉంటుంది. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కొన్నేళ్లుగా 1300 ఎకరాల భూమి నదిలో కలిసిపోయింది. ఈ ఏడాదే వంద ఎకరాల వరకు కనుమరుగైనట్లు అంచనా. గ్రోయిన్లు నిర్మించకపోతే ఇంకా నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. రివిట్‌మెంట్, గ్రోయిన్లు లేనిచోట లంక భూమి భారీగా విరిగిపోతుంది. ఆత్రేయపురం మండలం పేరవరం, పులిదిండి, వసంతవాడ, ర్యాలి, బొబ్బర్లంక ప్రాంతాల్లో ఈ ఏడాది 30 ఎకరాల వరకు గోదావరిలో కలిసిపోయింది. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమస్యను హెడ్ వర్క్స్ ఏఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా పలుచోట్ల రివింట్‌మెంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. –న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కైకాలపేటలో బైపాస్‌ను అనుసంధానించాల్సిన ప్రాంతం

## బైపాస్.. చివరిలో జాప్యం

216 జాతీయ రహదారికి 21 కిలోమీటర్ల మేర రాజోలు మండలం శివకోటి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వరకు చేపట్టిన బైపాస్ రోడ్డును కైకాలపేటలో అనుసంధానం చేసే చోట చివరి దశ పనుల్లో జాప్యం నెలకొంది. ఇక్కడి మలుపులో ఆక్రమణలను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇది పూర్తయితే అన్నిరకాల భారీ వాహనాలు సజావుగా రాకపోకలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. రెవెన్యూ, జాతీయ రహదారి ఇంజినీరింగ్ అధికారులు దృష్టి పెట్టి ఆక్రమణలను సత్వరమే తొలగించడంతో పాటు రహదారి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి వచ్చేలా చూడాల్సి ఉంది. మరోవైపు నగరంలో నిర్మితమైన రెండు వంతెనలకు ఇరువైపులా కాలిబాటలకు రెయిలింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 10 మీటర్ల వెడల్పుతో వేసిన రహదారికి మలుపులు ఉన్నచోట్ల ఇరువైపులా రక్షణ కమ్మీలను ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల రాకపోకలకు మార్కింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. విషయాన్ని ఎన్.హెచ్. ఏఈఈ వెంకటరమణ దృష్టికి ఆదివారం తీసుకువెళ్లగా ఆక్రమణలను తొలగించిన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

## పేద విద్యార్థులకు విద్యాలక్ష్మి

పెద్దాపురం : చదువులో చురుకుగా రాణిస్తున్న పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడని 'పీఎం విద్యాలక్ష్మి' పథకాన్ని కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎలాంటి హామీలు, పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణం సదుపాయం కల్పించడమే ఈ పథకం ఉద్దేశం.

**దరఖాస్తు ఇలా..:** డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విద్యాలక్ష్మి.కమ్.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలు నమోదు చేయాలి. ప్రస్తుతం చదవాలనుకుంటున్న కోర్సులకు చెందిన ప్రవేశ పత్రం, ఆదాయ ధ్రువపత్రాలు జత చేయాలి.

**అర్హులు వీరే..:** ● ఇంజినీరింగ్, వైద్యవృత్తి విద్యాకోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. ● కుటుంబ వార్షికాదాయం రూ.4 లక్షలలోపు ఉండాలి.

**మూడు విడతల్లో..:** రుణం మంజూరుకాకపోతే కారణాలు చెబుతూ 15 రోజుల్లో ఈమెయిల్‌కు సందేశం వస్తుంది. అర్హులుగా ప్రకటిస్తే మూడు విడతల్లో రుణం మంజూరు చేస్తారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669


## మీనం.. ఉపాధి మార్గం

### మహిళా సంఘాల ద్వారా కొర్రమీను పెంపకానికి చర్యలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన డ్వాక్రా మహిళలు కొర్రమీను చేపల పెంపకం ద్వారా ఆదాయాన్ని అందిపుచ్చుకునే విధంగా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు. తక్కువ ఖర్చుతో ఏడాదికి రూ.3 లక్షల వరకు నికర ఆదాయం వచ్చేలా ప్రణాళికలు వేస్తున్నారు. దీని కోసం బ్యాంకులు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సర్క్యులేటరీ విధానంలో మంచినీటిలో వీటిని పెంచనున్నారు. ఒక పెద్ద చెరువు, సింథటిక్, ఫైబర్ వంటి సామగ్రితో చిన్న చెరువు ఏర్పాటుకు పది సెంట్ల స్థలం అవసరం.

కాట్రేనికోనలో చేపపిల్లలను పరిశీలన

**పెంపకం ఇలా..**

10 నుంచి 20 గ్రాముల పిల్లలను ముందుగా చిన్నపాటి చెరువులో నాలుగు నెలలు పెంచుతారు. అనంతరం పెద్దచెరువులో వేసి మరో నాలుగు నెలలు పెంచుతారు. ఈ సమయానికి ఒక్కో చేప 900 గ్రాముల నుంచి కిలో బరువు పెరుగుతుంది.

అవసరమైన స్థలం: 10 సెంట్లు
పెద్ద చెరువు: 7.5 సెంట్లు
చిన్న చెరువు: 2.50 సెంట్లు
ఒక్కో యూనిట్‌కు ఖర్చు: రూ.4.40 లక్షలు
లక్ష్యం: 100 యూనిట్లు
ఇప్పటి వరకు గుర్తింపు: 15

పిల్లలకు రూ.15వేలు, మేత ఖర్చుకు రూ.1,12,000 కలిపి రూ.1,27,000 పెట్టుబడి అవుతుంది. సుమారు 935 కిలోల చేపలు ఉత్పత్తి అవుతాయి. కిలో రూ.280 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తే రూ.2,49,536 వస్తుంది. పెట్టుబడి పోనూ రూ.1,22,536 నికర ఆదాయం వస్తుంది. ఏడాదిలో మూడు పంటలు తీయవచ్చు.

**అవగాహన కల్పిస్తున్నాం**

స్వయం సహాయ సంఘాల్లోని మహిళలు కొర్రమీను చేపల పెంపకం ద్వారా ఆదాయం పొందవచ్చని అవగాహన కల్పిస్తున్నాం. మార్చి నెలాఖరుకు జిల్లాలో వంద యూనిట్లు ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్‌లోని ఉదయ్ ఆక్వా సంస్థ లబ్ధిదారులకు సలహాలు, సూచనలు అందిస్తుంది. తయారైన ఉత్పత్తులను ఆ సంస్థ కొనుగోలు చేస్తుంది. లబ్ధిదారులు స్వయంగానూ విక్రయించుకోవచ్చు.
- టి.జయచంద్రగాంధీ, ప్రాజెక్టు డైరెక్టర్, డి.ఆర్.డి.ఎ. అంబేడ్కర్ కోనసీమజిల్లా

## మొక్కుబడిగా మార్చేశారు..!

### తల్లిదండ్రుల కమిటీల సమావేశాలపై కొరవడిన ఆసక్తి

న్యూస్‌టుడే, అల్లవరం

● అల్లవరం మండలం పరిధిలో ఓ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రతినెలా నిర్వహించాల్సిన తల్లిదండ్రుల కమిటీ సమావేశం నాలుగు నెలలకోసారి మాత్రమే నిర్వహిస్తున్నారు.

● అమలాపురం పురపాలిక పరిధిలోని ఓ ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది నిర్వహించిన మెగా పేటీఎం తప్ప, మరో సమావేశం నిర్వహించ లేదు.

● రాజోలు పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలో నెలవారీగా నిర్వహించాల్సిన సమావేశం గురించి కమిటీ సభ్యులకు తెలియని పరిస్థితి

అల్లవరంలో ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన పీటీఎం సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

**కోనసీమ జిల్లాలో వివరాలు ఇలా..**

| పాఠశాల | సంఖ్య | బాలురు | బాలికలు |
|---|---|---|---|
| ప్రాథమిక | 1266 | 12,915 | 14,355 |
| ప్రాథమికోన్నత | 45 | 1221 | 1338 |
| ఉన్నత | 252 | 28,659 | 31,212 |
| కళాశాలలు | 13 | 1102 | 959 |

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందేలా, సౌకర్యాల కల్పనకు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వం తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది పాఠశాలలు తెరిచిన సమయంలో మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆ స్ఫూర్తిని కొనసాగించాలని నిర్ణయించారు. ఇది చాలాచోట్ల ఒక్క రోజు ముచ్చటగానే మారింది. విద్యార్థులు ప్రవర్తన ఎలా ఉంది. ఎలా చదువుతున్నారు. తోటి విద్యార్థులతో ఎలా మెలుగుతున్నారనే విషయాలను ఉపాధ్యాయులు ఈ కమిటీ సమావేశాల్లో తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంది. దీనికి అనుగుణంగా పిల్లలకు సరిదిద్దాల్సి ఉంది.

**ఒకరిద్దరు మాత్రమే హాజరు..**

పాఠశాలల్లో నిర్వహించే సమావేశాలకు కేవలం కమిటీ ఛైర్మన్, ఒకరిద్దరు సభ్యులు మాత్రమే హాజరవుతున్నారు. కొన్నిచోట్ల మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహిస్తున్నట్లే తెలియడం లేదు. ప్రతినెలా సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా రెండు మూడు నెలలకోసారి మమ అనిపిస్తున్నారు. కొన్నిచోట్ల సమావేశాలకు కేవలం కమిటీ ఛైర్మన్, ఒకరిద్దరు సభ్యులు మాత్రమే హాజరవుతున్నారు.

**క్రమం తప్పకుండా నిర్వహించాలి**

పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించాలి. కొన్ని పాఠశాలల్లో కమిటీ సభ్యులు సమావేశాలకు హాజరు కావడం లేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతి నెలా నిర్వహించి, విద్యార్థుల ప్రగతి నివేదికలు అందించేలా చర్యలు తీసుకుంటాం.
-సలీం బాషా, డీఈవో

## వెతికితే దొరకునా.. ఆహ్లాదం!

నిత్యం వేల సంఖ్యలో పర్యాటకుల తాకిడి ఉండే కాకినాడలోని ఎన్టీఆర్ బీచ్‌లో పరిస్థితులు నిర్వహణ లోపాలను ఎత్తి చూపుతున్నాయి. వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. సందర్శకులకోసం వేసిన సిమెంటు బల్లలు ఇసుకలో కూరుకుపోయినా పట్టించుకునేవారే కరవయ్యారు. సేదదీరేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో మత్స్యకారులు ఒడ్డుపై నిలిపిన తెప్పలపై కూర్చుంటున్నారు. సముద్రపు నీటిలో దిగే వారికి హెచ్చరికగా ఏర్పాటు చేసిన బోర్డులు ఎక్కడికక్కడ పడిపోయాయి. పర్యాటకశాఖ అధికారులు పరిస్థితులను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనాఉంది. – ఈనాడు, కాకినాడ

## రైలు ప్రయాణం.. వైద్యం సులభం

● భీమవరానికి చెందిన దంపతులు పిల్లలతో రైలులో శ్రీకాకుళం వెళుతున్నారు. తణుకు దాటగానే బాబు ఆడుకుంటూ కింద పడి చేతికి గాయమైంది. 139 నంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వగా రాజమహేంద్రవరం స్టేషన్‌కు వచ్చేసరికి రైల్వే వైద్యులు అప్రమత్తమై సేవలందించారు.

139
టోల్‌ఫ్రీ నంబరును సంప్రదిస్తే సేవలు

మీ కోసం

రైలు ప్రయాణం చేస్తున్న సమయంలో అస్వస్థతకు గురైతే కుటుంబ సభ్యులు లేదా తోటి ప్రయాణికుల సహకారంతో ఆ బోగీ నుంచే ప్రాథమిక వైద్యం పొందొచ్చు. చరవాణిలో 139 టోల్ ఫ్రీ నంబరుకు ఫోను చేసి సమాచారం ఇస్తే వైద్య సాయం తక్షణం పొందవచ్చు. ☛ టికెట్ కలెక్టర్, ఆర్పీఎస్ రైల్వే సిబ్బందికి తెలియజేసినా వెంటనే రైల్వే ఆసుపత్రి సిబ్బంది స్పందిస్తారు. ☛ ముందు కిట్టు పట్టుకొచ్చి వైద్య సేవలందించి అవసరమైన మందులు అందిస్తారు. -న్యూస్‌టుడే, కొవ్వూరు

## కారాగారం.. సాగు బంగారం..!

కేంద్ర కారాగారం ప్రాంగణంలోని ఎనిమిది ఎకరాల్లో వివిధ కూరగాయలు, ఆకుకూరలను సేంద్రియ విధానంలో ఖైదీలతో సాగు చేయిస్తున్నారు. వీటి వల్ల నెలకు సుమారు రూ.1.20 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. దాదాపు రూ.లక్ష విలువైన ఉత్పత్తులను విక్రయిస్తూ, రూ.20 వేల విలువైన కూరగాయలు, ఆకుకూరలను ఖైదీల ఆహార పదార్థాలకు వినియోగిస్తున్నారు. పంటల సాగు, విక్రయాల బాధ్యత సుమారు 20 మంది ఖైదీలకు అప్పగించారు.



సాగుబడిలో ఖైదీలు

జైలులో పండించిన వంకాయలు

**80 పశువులతో డెయిరీ..**

జైలులో 80 పశువులతో డెయిరీ నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 200 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుండగా, వాటిని ఖైదీలకు ఇస్తూ, అదనంగా అవసరమైన మేర బయట కొనుగోలు చేస్తున్నారు. డెయిరీ నిర్వహణ బాధ్యత ఆరుగురి ఖైదీలకు అప్పగించారు. పశువుల గడ్డిని సుమారు ఆరెకరాల్లో సాగు చేస్తూ, దాణా బయట కొనుగోలు చేస్తున్నామని జైలు పర్యవేక్షణాధికారి రాహుల్ తెలిపారు.
-ఈనాడు, రాజమహేంద్రవరం


(c) eenadu

## పచ్చని కలుపు.. పారుదలకు ముప్పు

వాడబోది, వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌లలో కలుపు విపరీతంగా పెరిగింది. మామిడికుదురు మండలంలోని 410 హెక్టార్ల వరి చేలకు ఆధారమైన ఈ డ్రెయిన్‌లో పిస్టియా పువ్వు విపరీతంగా పెరిగిపోవడంతో సముద్రపు పోటు సమయంలో చేలల్లోకి చేరి పంటను నిర్వీర్యం చేస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయినేజీ శాఖ ఏఈఈ ఆనంద్‌కిరణ్ దృష్టికి తీసుకువెళ్లగా కలుపు నివారణకు రసాయన మందుల పిచికారీ చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

## అమ్మ ప్రేమకు వెలుగుల వందనం

ర్యాలికి చెందిన ఇంద్రజాలికుడు శ్యామ్ జాదూగర్ తన అమ్మ నాగవీరమణి స్మారకంగా ఇంటి వద్ద మందిరం నిర్మించారు. కార్తికమాసం సందర్భంగా ఆదివారం వేకువజామున మందిరం వద్ద సహస్ర జ్యోతులతో అమ్మ అక్షర రూపంలో ప్రమిదలను వెలిగించి ప్రేమను చాటుకున్నారు. శ్యామ్ మాట్లాడుతూ చిన్నతనంలో ర్యాలి గ్రామానికి వచ్చామని, తల్లిదండ్రులు పెంపకం వల్ల ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సమాజానికి తనవంతు సహకారం అందించగలుగుతున్నానన్నారు. - న్యూస్‌టుడే, ర్యాలి (ఆత్రేయపురం)

## ఆపద్బాంధవి.. కొన ఊపిరి

ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఆగమేఘాలపై వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే 108 అంబులెన్స్ వాహనం.. ఆదివారం ఉదయం మొరాయించింది. రావులపాలెంలో ఊబలంక-బొబ్బర్లంక రహదారిపై పంచాయతీ కార్యాలయం వద్ద ఉండే 108 అంబులెన్స్ ఇంజిన్ స్టార్ట్ కాకపోవడంతో నెట్టుతున్న దృశ్యం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. కొన్ని రోజులుగా వాహనంలో బ్యాటరీ పాడైపోవడంతో ఈ పరిస్థితి వచ్చినట్లు తెలిసింది. ఎందరో ప్రాణాలను కాపాడే 108 వాహనం మరమ్మతులకు గురైన వెంటనే సరిచేయిస్తేనే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. - న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

## భీమేశ్వరాలయంలో కార్తికం కిటకిట

కార్తిక మాసంలో చివరి ఆదివారం కావడంతో పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. రామచంద్రపురం వైపు నుంచి వచ్చే వాహనాలను సాక్షివారి వీధి నుంచి, రామచంద్రపురం వైపు వెళ్లే వాహనాలను పీహెచ్‌సీ వైపు నుంచి మళ్లించారు. ఉదయం నుంచి ఆలయంలో క్యూలైన్లు రద్దీగానే ఉన్నాయి. బోస్ కూడలిలో అన్నాయిపేటకు చెందిన ఆకేటి సురేష్ మిత్రబృందం, కట్టా శ్రీనివాసబాబు మిత్రబృందం ఆధ్వర్యంలో అల్పాహారంగా ప్రసాదం అందించారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

## గత ప్రభుత్వంలో అక్రమ కేసులు

- కార్తిక వనసమారాధనలో మంత్రి సుభాష్

మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో శెట్టిబలిజలపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెడితే, ఆ పార్టీ నాయకులు పట్టించుకోకుండా విహార యాత్రలకు వెళ్లారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. అమలాపురంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గతంలో కొంతమంది కులం పేరిట పదవులు పొంది దోచుకున్నారన్నారు. తోటి శెట్టిబలిజ నాయకులే తనను రాజకీయంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని శెట్టిబలిజలను గతంలో ఓసీలో కలిపారని, బీసీల్లో చేర్చేందుకు పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్(ఎస్ఏఎఫ్) ద్వారా సామాజిక వర్గంలోని పేదలకు సహకారం అందిస్తామన్నారు. ఆస్తులు విక్రయించైనా ఎస్ఏఎఫ్‌కు సహాయం చేస్తానన్నారు. ఎమ్మెల్యే, మంత్రి పదవులు శెట్టిబలిజల వల్లనే వచ్చాయన్నారు. 90 శాతం కాపులు తనకు ఓటు వేశారని, ఆ కులానికి చేదోడుగా ఉంటానన్నారు. తనకు రాజకీయ జీవితం ప్రసాదించిన తెలుగుదేశం పార్టీలోనే జీవితాంతం ఉంటానని, లోకేష్ బృందంలో కొనసాగుతానని మంత్రి అన్నారు.

## అదిగదిగో ద్వారపూడి.. ఇదిగిదిగో భక్తి ఇరుముడి

ద్వారపూడి, న్యూస్‌టుడే: హరిహరసుతనే.. శరణమయ్యప్ప.. ఆపద్బాంధవనే.. శరణమయ్యప్ప.. అంటూ మాలధారుల శరణుఘోషతో ద్వారపూడిలోని అయ్యప్ప దేవాలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దేశంలోనే శబరిమల క్షేత్రం ఎంతో ప్రసిద్ధి. మాలధారులంతా ఇరుముడులు సమర్పించేందుకు వెళ్తుంటారు. అక్కడకు వెళ్లలేని వారంతా మండపేట మండలంలోని ద్వారపూడి ఆలయానికి వస్తారు.

**రోజూ 10వేల మంది..:** అయ్యప్ప దీక్షలు కార్తికమాసంలో ప్రారంభమై మకరసంక్రాంతి వరకు కొనసాగుతాయి. ఈ మండల కాలంలో 41 రోజుల దీక్ష చేస్తారు. దీక్ష పూర్తి చేసి కేరళ వెళ్లలేని వారు ఇక్కడ వచ్చి ఇరుముడులు సమర్పిస్తారు. ఆంధ్రా, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి రోజూ 600 నుంచి 2వేల వరకు ఇరుముడులు సమర్పించేందుకు వస్తారు. దర్శనం కోసం 6వేల నుంచి 10వేల వరకు వస్తారు. దాదాపు 3వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారని ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి తెలిపారు.

ఆలయంలో స్వాముల సందడి

**ఆంధ్రా శబరిమల..**

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. అందుకే ఆంధ్రా శబరిమలగా పేరొందింది. ఏకశిలతో వెలసిన పవిత్రమైన 18 మెట్లు ఈ ఆలయం ప్రత్యేకత. ద్వారపూడికి చెందిన వ్యాపారి ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి ఒక కమిటీ ఏర్పాటు చేసి విరాళాలతో 1983లో నిర్మాణానికి భూమిపూజ చేశారు. 1989లో కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అప్పటినుంచి నిత్యం అర్చన, ప్రత్యేక పూజలు, నెయ్యి అభిషేకం, ఇరుముడి సమర్పణ జరుగుతున్నాయి. రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 8 వరకు దర్శనానికి అనుమతిస్తారు. నిత్యం మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు.

అయ్యప్పస్వామి మూలవిరాట్టు

**ప్రాంగణంలో ఆకట్టుకునేలా ఉపాలయాలు**

ఈ ప్రాంగణంలో దేశంలోనే రెండో అతిపెద్ద యోగ విగ్రహాన్ని చూడగానే తన్మయత్వం కలుగుతుంది. ప్రవేశంలో సుబ్రహ్మణ్య, ఆంజనేయస్వామి భారీ విగ్రహాలు ఎంతో ఆకట్టుకుంటాయి. 108 శైవ ఉపాలయాలు ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో సాయిబాబా మందిరం, శివాలయం, దుర్గాదేవి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, అష్టాదశ శ్రీఉమాలింగేశ్వరస్వామి, భూగర్భ ద్వాదశ జ్యోతిర్లింగ, పాపవిమోచన దేవాలయాలు ఉన్నాయి. దశావతరాలతో కూడిన వేంకటేశ్వరస్వామి, జగన్మాత అంకాళమ్మ, శనీశ్వరాలయం, నవగ్రహ, శ్రీలక్ష్మీకుబేర ఆలయాలనూ చూడొచ్చు. యజ్ఞయాగాదులు నిర్వహించడానికి యాగశాల ఉంది.

## ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

- తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టుకు ద్వితీయ స్థానం

చింతలపూడి, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థులను చదువులో ముందు నిలపడమే కాకుండా, ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని క్రైస్ట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అండర్-19 నెట్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నియోజకవర్గంలో నిర్వహించడం ఈ ప్రాంతంలోని క్రీడాకారులకు ఉత్సాహం నింపుతుందన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ జిల్లా జట్లుగా తలపడ్డారు. బాలుర విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా.. తూర్పుగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా, పశ్చిమగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

రాజోలులో మాట్లాడుతున్న ఆచంట రాంబాబు

రాజోలు, న్యూస్‌టుడే: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్ర కళాకారుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచంట రాంబాబు విజ్ఞప్తి చేశారు. రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల కళాకారుల సంక్షేమ సంఘ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధ కళాకారులకు అందిస్తున్న రూ.4 వేల పింఛనును రూ.6 వేలకు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మహ్మద్ బాబ్జి, ముగ్గుళ్ల వెంకటేశ్వరరావు, కడలి కృష్ణారావు, ఆచంట కృష్ణ, వట్టూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలాజీస్వామి ఆలయ ధర్మకర్తగా లక్ష్మీనారాయణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా మొల్లేటి లక్ష్మీనారాయణ(చక్రి) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీ ఎం.సత్యనారాయణరాజు ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆయన తన తల్లిదండ్రులైన ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు అభినందనలు తెలిపారు.

## కుమ్మరశాలివాహనులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే గిడ్డి

శిల్పి రాజ్‌కుమార్ వుడయార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కుమ్మరశాలివాహనులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరంలోని సంఘ భవనం వద్ద ఆదివారం సంఘీయులు కార్తిక వనసమారాధన నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంఘీయుల రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర సంక్షేమ సంఘ కార్యదర్శి ఆదిశేషయ్య మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రగతి సాధించాలన్నారు. ప్రముఖులను సత్కరించారు. మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, మానేపల్లి అయ్యాజీవేమా, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాస్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి భారతి, దొడ్డిపట్ల శ్రీనివాస్, దాలిపర్తి భీమేశ్వరరావు, త్రిమూర్తులు, నారాయణమూర్తి, పెద్దిరాజు, శ్రీనివాసవుడయార్ సినీ గేయ రచయిత బొమ్మన వెంకటరమణ పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి సరఫరా పాపానికి మూల్యం తప్పదు

భక్తుల బృందానికి స్వాగతం పలుకుతున్న ఉత్సవసమితి సభ్యులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నిషేధిత సంస్థతో కుమ్మక్కై కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరాకు కారణమైన వైకాపా చేసిన దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని వీరయ్యస్వామి పేర్కొన్నారు. కాట్రేనికోన మండలం పల్లం నుంచి అన్నవరం వరకు వీరయ్యస్వామి సుమారు వెయ్యి మంది హిందూ భక్తులతో సనాతన ధర్మ పరిరక్షణకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం నగర గణేశ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, మాజీ అధ్యక్షుడు దువ్వూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు కాకినాడలోని భానుగుడి సెంటర్ వద్ద వారికి స్వాగతం పలికి పిఠాపురం వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్యస్వామి మాట్లాడుతూ తిరుమల కేంద్రంగా గతంలో జరిగిన పాపాలు అనేకం నేడు వెలుగులోకి వస్తున్నాయన్నారు.

## గోదావరి జిల్లాలా మజాకా..

- సంక్రాంతికి అప్పుడే నిండిపోయిన రైళ్ల రిజర్వేషన్లు

న్యూస్‌టుడే, తుని: భాగ్యనగరం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చే రైళ్లకు సంక్రాంతి సందడి వచ్చేసింది. పెద్ద పండగ వచ్చేందుకు ఇంకా రెండు నెలలు ఉండగా రైల్వేశాఖకు మాత్రం అప్పుడే రావడం విశేషం. రెండు నెలల ముందుగానే రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. అందులో హైదరాబాద్, విజయవాడ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరికి వచ్చే రైళ్లకు రిజర్వేషన్లు నిండిపోగా, ఇక్కడి నుంచి అటువైపు వెళ్లే వాటికి మాత్రం రిజర్వేషన్లు లభ్యం అవుతున్నాయి.

తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

**హైదరాబాద్ నుంచి ఎక్కువగా**

సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలే గుర్తుకొస్తాయి. ఇక్కడి వారు ఉద్యోగ, వ్యాపారాల దృష్ట్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమ వారితో కలిసి పండగ చేసుకునేందుకు వారంతా వస్తారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి పెద్దఎత్తున వస్తారు. జనవరి 13 నుంచి పండగ సందడి మొదలవుతుంది. ఈ క్రమంలో జనవరి 12, 13వ తేదీల్లోనే తమ ప్రాంతాల్లో ఉండేలా రిజర్వేషన్లు చేయించుకున్నారు. జనవరి 15 వరకు రోజూ, వారపు ప్రత్యేక రైళ్లు అన్ని నిండిపోయాయి. విశాఖ, గోదావరి, కాచిగూడ, గరీబ్‌రథ్, ఫలక్‌నామా, కోణార్క్, ఈస్ట్‌కోస్ట్, గౌతమి తదితర రైళ్లల్లో రిజర్వేషన్లు వెయిటింగ్ లిస్టుకు చేరాయి. ముందు తేదీలకు మాత్రం దొరుకుతున్నాయి.

**80వేల మంది ప్రయాణికులు..**

ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, తుని, సామర్లకోట, కాకినాడ ప్రధాన స్టేషన్లు. వీటితో పాటు చిన్న స్టేషన్లు కలిపి రోజుకు సుమారు 100కు పైగా రైళ్లల్లో దాదాపు 80వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ప్రత్యేక రైళ్లు, జనరల్ బోగీలు కలిపి సంక్రాంతి సమయంలో ఈ సంఖ్య లక్ష దాటే అవకాశం ఉంది. పండగ రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు కూడా ప్రారంభం అవుతాయన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అమలాపురం గ్రామీణం: అమలాపురం మండలం బండారులంకలోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యేసురత్నం (65) అమలాపురం నుంచి అంబాజీపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.శేఖర్‌బాబు తెలిపారు.

## శస్త్రచికిత్స చేసిన కాసేపటికే మహిళ మృత్యువాత

మసీదుసెంటర్: శస్త్రచికిత్స చేసిన కొద్దిసేపటికే మహిళ మృతిచెందిన ఘటన కాకినాడ జీజీహెచ్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పిఠాపురం రథాలపేటకు చెందిన వివాహిత(20)కు పొత్తికడుపులో వాపు రావడంతో ఈనెల 10న జీజీహెచ్‌లో చేర్చారు. పరీక్షల అనంతరం ఆమెకు హెర్నియా ఉందని నిర్ధారించి శస్త్రచికిత్స చేశారు. సాయంత్రం 6 గంటల సమయంలో మృతిచెందింది. ఆమె కుటుంబసభ్యులు వైద్యులను నిలదీశారు. పోలీసులు సర్దిచెప్పడంతో వారు మృతదేహాన్ని తీసుకెళ్లారు.

### ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 22,000 |
| పాతకాయ: గండేరా | 29,000 |
| గటగట | 27,000 |
| కొత్తకాయ: గండేరా | 28,000 |
| గటగట | 26,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 20,000-21,000 |
| కొత్త (పచ్చి) కాయ | 19,000-20,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 111-00 |
| రిటైల్ లైవ్ | 138-00 |
| డ్రెస్డ్ | 200-00 |
| స్కిన్‌లెస్ | 228-00 |

## తల్లికి ధైర్యం.. బిడ్డకు ఆరోగ్యం

గర్భిణులకు సామూహిక సీమంతం

కొత్తపేట, న్యూస్‌టుడే: పేద గర్భిణులకు మేలు చేసేలా ప్రధాన మంత్రి మాతృవందన యోజనతో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో అర్హులను వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఏఎన్ఎంలు గుర్తించేవారు. ఆ శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించేవారు. ఈ క్రమంలో వివిధ కారణాలతో పలువురు పథకానికి దూరమయ్యేవారు. ఈ సమస్యకు పరిష్కారంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ సంక్షేమ శాఖకు బదిలీ చేశారు. ఆ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్నారు.

**రెండు విడతల్లో రూ.11 వేలు..**

సరైన ఆర్థిక పరిస్థితి లేని కుటుంబాల్లో శిశువులకు పోషకాహారం అందించాలని కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించింది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా అమలు కాలేదు. పక్కాగా నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ మొదటి కాన్పుకు రూ.5 వేలు ఇస్తుంది. రెండో విడత కాన్పులో ఆడపిల్ల పుట్టిన వారికి రూ.6 వేలు

**దరఖాస్తు చేసుకోవాలి ఇలా..**

ఈ దరఖాస్తుకు ప్రతి అంగన్వాడీ కార్యకర్తలు లాగిన్ ఇవ్వడం జరిగింది. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, ఫొటో, ఆరోగ్య కార్డు వివరాలతో అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలి. గర్భిణి మూడో నెలలో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలలో రెండుసార్లు వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత రూ.3 వేలు ఇస్తారు. బిడ్డ పుట్టిన 14 వారాలు లోగా టీకాలు వేయించిన తర్వాత మిగిలిన రూ.2వేలు జమ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.1,000 ప్రసవం కాగానే ఇస్తారు.

- 'మొదటి ప్రసవంలో అమ్మాయి లేదా అబ్బాయి ఎవరైనా పథకం వర్తిస్తుందని, రెండోకాన్పులో అమ్మాయి అయితేనే ఆర్థికసాయం అందుతుంది' అని మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కె.నాగమణి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు.

జిల్లాలో.. : గర్భిణులు - 6,704 బాలింతలు - 6,986 అంగన్‌వాడీ కేంద్రాలు - 1,726

## భక్తులకు తప్పిన ప్రమాదం

పడిన స్లాబు పెచ్చులు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలోని కేశవస్వామి, విశ్వేశ్వరస్వామి ఆలయ మండపం శిథిలావస్థకు చేరింది. 50 ఏళ్ల కిందట నిర్మించిన భవనం స్లాబు పెచ్చులూడుతోంది. ఆదివారం మధ్యాహ్నం పెచ్చులు ఊడటంతో సమీపంలోని భక్తులు భయాందోళన వ్యక్తం చేశారు. ఆలయ అధికారుల తీరుపై మండిపడ్డారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయ పర్యవేక్షణ ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వనభోజనాల్లో వివాదం

- పరస్పరం కేసులు నమోదు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం తాళ్లపొలం వద్ద ఆదివారం జరిగిన శెట్టిబలిజ వనసమారాధన కార్యక్రమంలో జరిగిన గలాటాకు సంబంధించి రెండు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై ద్రాక్షారామ పోలీసులు కేసులు నమోదు చేశారు. తాళ్లపొలం వద్ద వనసమారాధన కార్యక్రమం జరుగుతుండగా నర్సిపూడికి చెందిన పిల్లి మణికంఠ, పిల్లి సునీత, పిల్లి వీరవెంకట సత్యనారాయణ, పిల్లి రామలక్ష్మి, పిల్లి నాగమణి, పిల్లి శ్రీనివాసు, పండు రమేష్ మరికొంత మంది వచ్చి భోజనాల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాల్లో ఇసుక, ఉప్పు చల్లి కార్యక్రమాన్ని ఆటంకపరిచి అల్లరి సృష్టించారని సమారాధన నిర్వాహకుడు కట్టా సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే ఘటనకు సంబంధించి నర్సిపూడి గ్రామానికి చెందిన పిల్లి వెంకట రామలక్ష్మి మరో ఫిర్యాదు ఇచ్చారు. తన సోదరుడు కట్టా గోవిందుతో వారసత్వ ఆస్తులకు సంబంధించి పాత గొడవలు ఉన్నాయని, వాటిపై సంఘీయులను కలిసి న్యాయం కోరేందుకు తాళ్లపొలంలో జరుగుతున్న వనభోజనాల కార్యక్రమం వద్దకు వెళ్లేసరికి అక్కడ ఉన్న మేడిశెట్టి ఇజ్రాయేలు, కట్టా ప్రియదుర్గ వెంకటేష్, కట్టా సూర్యనారాయణ, మేడిశెట్టి శ్రీను తదితరులు తమపై దాడిచేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు వర్గాలవారు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

FLAT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

3 BHK Flat అమ్మకం. రాజమండ్రి, మోరంపూడి జంక్షన్ వద్ద, హైవే ప్రక్కన 3 BHK Flat అమ్మకమునకు కలదు. Contact Cell: 98480 56558.

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

KAKINADA RURAL

560 Sq.Yds Plot for Sale in Chollangi, Besides Yanam KKD Road; Contact Cell: 93917 11101.

EENADU for Advertisement Contact: 8008597607

EENADU Classifieds

JOBS

WANTED COMPUTER Operator female (MS Office, MS Excel) with speed Typing in English at Amalapuram. Salary upto 18K. ✆ 96184 66665.

Data Entry Operator (M/F) with Good knowledge in MS Excel. 1 yr Exp. Location: Rajahmundry. Email: giri.fomra@gmail.com ✆ 93902 07565, 99482 05000.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం॥లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం: 20,000 to 25,000 + ఇన్సెంటివ్, నో టార్గెట్స్, 2 వీలర్ మస్ట్. ✆ 73826 65577.

రాజమండ్రి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ శిక్షణ & ఉద్యోగావకాశాలు, ✆ 96661 20044.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్ మేన్ కావలెను. సంప్రదించవలసిన టైం: 9 am to 6 pm. Contact Cell: 95507 32122.

రాజమండ్రిలోని శ్రీ గిరిధారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందు పనిచేయుటకు CC Roadsలో అనుభవం కలిగినవారు కావలెను. Contact Cell: 80991 91919.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జిలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Contact Cell: 96423 75791.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-25 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

(c) eenadu

# రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

## సర్వీసు రహదారి పనులు ప్రారంభం

**ఆలమూరు:** జాతీయ రహదారిపై మడికి నుంచి చొప్పెల్ల వరకు మంజూరైన సర్వీసు రహదారి పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర సర్వీస్ రహదారి నిర్మించనున్నారు. ప్రమాదాల నివారించే విధంగా సర్వీసు రోడ్డు కోసం ఆయా గ్రామాల ప్రజలు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్నారు. ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీ నిర్మాణ పనులను గుత్తేదారు చేపట్టారు.

## పాఠశాలకు వితరణ

**సఖినేటిపల్లి:** సఖినేటిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యాకమిటీ ఛైర్మన్ కొండా కిశోర్‌బాబు రూ.25 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కోలా వీరాస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భాజపాను మరింత బలోపేతం చేయాలి: వేమా

**అంబాజీపేట, న్యూస్‌టుడే:** భారతీయ జనతా పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, ఆ పార్టీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. అంబాజీపేటలోని అప్పన గణపతిరావు ఇంటి వద్ద మండల భాజపా కన్వీనర్ కముజు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ చీకురుమిల్లి శ్రీనివాస్, జాతీయ అధికారిక భాష హిందీ సలహా కమిటీ సభ్యుడు షంశు సాధిక్, సూర్యలక్ష్మి, దిగుమర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884
ఉ॥ 10 - మ॥ 1

### వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

**రావులపాలెం పట్టణం:** రావులపాలెం మండలం ఊబలంకలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రాజు దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

**రావులపాలెం గ్రామీణం:** పొడగట్లపల్లి శివారు ముద్రావుపేటలో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో ప్రజలు రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకుని వెళ్లగా మరమ్మతులు చేయించారు.

## యాంత్రీకరణతో సాగుతున్నారు..

– న్యూస్‌టుడే, మలికిపురం

సాగులో పెట్టుబడి వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన ప్రస్తుత తరుణంలో యాంత్రీకరణపై అన్నదాతలు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తోంది. సార్వా కోతలు ప్రారంభమైన నేపథ్యంలో వరికోత యంత్రాలతో పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు మండలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమయ్యాయి.

రాజోలు నియోజకవర్గంలో సుమారు 7 వేల మంది రైతులు ఈ సార్వాలో 4,500 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఒక ఎకరం వరి పంటను కోసి పనలు కట్టి గట్టుకు చేర్చి మాసూళ్లు చేయడానికి 20 మంది మహిళా, 10 మంది పురుష కూలీల అవసరం ఉంటుంది. ఒక రోజు సమయం పడుతుంది. ఇందుకు గాను సుమారు రూ.20 వేల పైబడి ఖర్చు అవుతుంది. ఇదికాక కుప్ప నూర్చడానికి ట్రాక్టరుకు, అల్పాహారం, టీ తదితరాలకు ఇంకో రూ.2,500 వెరసి మొత్తం రూ.23 వేల వరకు అవుతుంది.

### తక్కువ ఖర్చుతో..

అదే యంత్రంతో ఎకరం వరి పంటకోసి ధాన్యాన్ని గట్టుకు చేర్చడానికి కేవలం రెండు గంటల సమయం పడుతుంది. సుమారు రూ.6 వేల వరకు ఖర్చు అవుతుందని లక్కవరం గ్రామానికి చెందిన చెల్లుబోయిన శ్రీనివాస్ తదితర రైతులు చెబుతున్నారు.

మట్టపర్రు-శివకోటి సరిహద్దు పొలాల్లో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతు

### ప్రభుత్వ ప్రోత్సాహం

ఒక్కో వరికోత యంత్రానికి ప్రభుత్వం రూ.10 లక్షల వరకు రాయితీ సౌకర్యాన్ని అందించినట్లు మలికిపురం ఏవో సీహెచ్ రమ్యప్రియాంక చెప్పారు. మలికిపురం మండలంలో నాలుగు, రాజోలు మండలంలో మూడు యంత్రాలు ఉన్నట్లు తెలిపారు.

### పరిస్థితిని బట్టి..

ఎకరం వరిచేను కోసి యంత్రంలోనే మాసూళ్లు అయి ధాన్యాన్ని గట్టుకు చేరవేయడానికి 75 నుంచి 90 నిమిషాల సమయం పడుతుందని మేడిచర్లపాలెం గ్రామానికి చెందిన వరికోత యంత్రాల నిర్వాహకుడు గుబ్బల సూర్యనారాయణ చెబుతున్నారు. చేను పరిస్థితిని బట్టి గంటకు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తామన్నారు. ప్రభుత్వ రాయితీ పథకంలో రెండు, సొంతంగా ఒకటి మొత్తం మూడు యంత్రాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఖరీఫ్ సీజనులో 35, రబీ సీజనులో 45 రోజుల పాటు గిరాకీ ఉంటుందన్నారు.

## ఆ 2 కిలోమీటర్లు.. ప్రమాదకరం

**రాజోలు, న్యూస్‌టుడే:** రాజోలు కాటన్ పార్క్ నుంచి పొదలాడ వరకు 2 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. నెల రోజుల క్రితం ఓ వ్యక్తి మృతిచెందాడు. పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ నెల 11న యువతీ యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వేగనియంత్రణపై అవగాహన కల్పించినా ఫలితం ఉండటం లేదు. దీంతో చోదకులు హడలిపోతున్నారు. ఈ విషయాన్ని రాజోలు ఎస్సై రాజేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

## ర్యాలి ఆలయానికి విరాళాలు

**ర్యాలి (ఆత్రేయపురం):** ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన దండు వేంకట సత్యనారాయణరాజు, పద్మ దంపతులు, దండు రాజగోపాలరాజు, వందన దంపతులు రూ. 50,232, ఏలూరుకు చెందిన ఎం. తిరుమలాదేవి, రమేష్ రూ.15 వేలు, నరసాపురానికి చెందిన రుచిత రూ.6,516, రావులపాలేనికి చెందిన పెన్మెత్స సిరిసందన రూ.5,116 విరాళం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటాలు అందజేసి దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో బీవీ రమణమూర్తి అభినందించారు.

రైతులకు పశుదాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**సఖినేటిపల్లి, న్యూస్‌టుడే:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సఖినేటిపల్లి మండలం వీవీమెరకలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సహకార సంఘ జెండాను ఎగురవేసి ప్రతిజ్ఞ చేశారు. గోడపత్రికలను ఆవిష్కరించారు. సహకార సంఘాలను బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను చెల్లించి డిపాజిట్లు పెంచుకోవాలని సూచించారు. ఎరువులు, దాణాను పంపిణీ చేశారు. కూటమి శ్రేణులు, అధికారులు, ఆయా సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## అంతర్వేదిలో శాంతి కల్యాణం

**అంతర్వేది, న్యూస్‌టుడే:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం శాంతికల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను బేడ మండపంలో కొలువుదీర్చారు. అలంకారోత్సవం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం శాంతికల్యాణం జరిపించారు. అనేక మంది భక్తులు దర్శించుకున్నారు.

పుస్తకావిష్కరణలో సంఘ నాయకులు

## 'చిరుదివ్వెలు వెలిగిద్దామా' పుస్తకావిష్కరణ

**ఆలమూరు, న్యూస్‌టుడే:** దేశభక్తి, మానవ సంబంధాలపై ప్రేమ, జీవన నైపుణ్యాల మెరుగుదల ద్వారా ధార్మిక జీవనం సాధ్యపడుతుందని కవి, అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ అన్నారు. ఆదివారం మండల వైఖానస సంఘం ఆధ్వర్యంలో జనార్దనస్వామి ఆలయంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. విఖనస, జనార్దనస్వామి వార్లకు పూజలు నిర్వహించారు. కృష్ణశ్రీ రచించిన చిరుదివ్వెలు వెలిగిద్దామా పుస్తకాన్ని ఆలయ ఛైర్మన్ భైరిశెట్టి రాంబాబు ఆవిష్కరించారు. సంఘ నాయకులు సత్తి పండు, కృష్ణ, మోదుకూరు శ్రీను, చిన్న భగవాన్, సింగు బాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వనసమారాధనలతో సామాజిక ఐక్యత

**కొత్తపేట, పి.గన్నవరం, న్యూస్‌టుడే:** కార్తిక వనసమారాధనలు ఆధ్యాత్మిక, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం కొత్తపేట బండారు బులిసత్యం కాపు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, కాపు సామాజికులు ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. సంఘ అభివృద్ధికి అందరూ కలిసి నడవాలని ఎమ్మెల్యే సూచించారు. ఉపసర్పంచి విళ్ల మారుతి, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బండారు రాజేష్, పాలూరి సత్యానందం, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ✦ లంకలగన్నవరం డొక్కావారితోటలో యాదవుల వనసమారాధన జరిగింది. గత విద్యాసంవత్సరంలో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పి.గన్నవరం నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవసంఘ అధ్యక్షుడు నాగళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ✦ పి.గన్నవరం గ్రామానికి చెందిన కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లంకలగన్నవరంలోని డొక్కావారితోటలో ఏర్పాటు చేసిన వనసమారాధనలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణదళం కమాండెంట్ కొండా నర్సింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు పాల్గొని అఖండ శంఖారావాన్ని పూరించారు.

కొత్తపేట: ఉసిరిచెట్టు వద్ద పూజల్లో ఎమ్మెల్యే సత్యానందరావు

లంకలగన్నవరంలో శంఖం పూరిస్తున్న ఎస్.పి.ఎఫ్. కమాండెంట్ కొండా నర్సింహారావు దంపతులు

లంకలగన్నవరంలో విద్యార్థిని సత్కరిస్తున్న యాదవ సంఘ ప్రతినిధులు

## బౌద్ధ ధర్మంపై ప్రచారం

**కొత్తపేట, న్యూస్‌టుడే:** ప్రజలు బౌద్ధం పాటిస్తే పరిపూర్ణులు అవుతారని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్ల శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కమ్మిరెడ్డిపాలెం, వానపల్లిలో ప్రచారం నిర్వహించారు. వానపల్లి సర్పంచి పల్లి భీమారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మన దేశాన్ని బౌద్ధ దేశంగా మార్చాలని అంబేడ్కర్ ఆకాంక్షించేవారన్నారు. చింతపల్లి శివకుమార్, గిడ్ల సురేష్, వై.సురేష్, పిట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన సంఘ సభ్యులు, సర్పంచి భీమారావు

## రోడ్డును అభివృద్ధి చేయరూ..

ర్యాలి వంతెన నుంచి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ కూడలి వరకు ఉన్న ర.భ.శాఖ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పాడైంది. ఇరుగ్గా ఉండటంతో వాహనాలు తప్పించేటప్పుడు చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని డీఈ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపామన్నారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

## చెత్త ఇలా.. మురుగు పారేదెలా..?

ఆత్రేయపురం అగ్రహారం నుంచి పెదపేట మీదుగా కోటేరు పుంత వరకు ఉన్న కచ్చా డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయింది. మురుగు నిలిచిపోయి దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌ను సంప్రదించగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

## డ్రెయినేజీ మధ్యలో విద్యుత్తు స్తంభం

మాచవరం పంచాయతీ పరిధి కొర్లపాటివారిపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న డ్రెయినేజీ మధ్యలో విద్యుత్తు స్తంభం అడ్డుగా ఉంది. దీన్ని తొలగించిన తరువాతే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ, విద్యుత్తు శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, అంబాజీపేట

## వీధులా.. డంపింగ్‌యార్డులా..

రాజోలులో దాదాపు అన్ని వీధుల్లోనూ వ్యర్థాలు పేరుకుపోయాయి. గత నాలుగు రోజుల నుంచి పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పందులు, దోమలకు నిలయంగా మారాయి. ఇక్కడ డంపింగ్‌యార్డ్ నెలకొల్పాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు శాపంగా మారింది. ఇకనైనా డంపింగ్‌యార్డ్ ఏర్పాటు విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

## పేరుకే పంటకాలువ

మొండికోడు పంటకాలువ కలుషితమవుతోంది. గృహాలు, దుకాణాలకు సంబంధించిన మురుగును ఇందులోకి వదిలేస్తున్నారు. చెత్తాచెదారం, డ్రెయినేజీ వ్యర్థాలను సైతం కలిపేస్తున్నారు. నీరు ప్రవహించకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండిపోయి దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈ రమేశ్‌బాబును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**అంబాజీపేట:** కోనసీమ సుమన్‌గౌడ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సినీనటుడు సుమన్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించినట్లు అభిమాన సంఘ జిల్లా అధ్యక్షుడు అత్తిలి గిరిబాబు గౌడ్ వెల్లడించారు. ఏలూరులో సినీ నిర్మాత, పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ అతిథిగృహంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అత్తిలి వెంకటప్రసాద్‌గౌడ్, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుమన్

ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

## ఏపీఎన్‌జీవో కార్యవర్గం ఎన్నిక

**రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే:** కొత్తపేట తాలూకా యూనిట్ ఏపీఎన్‌జీవో అధ్యక్షుడిగా ఏపుగంటి సురేష్ ఎన్నికయ్యారు. ఆదివారం రావులపాలెం మండల పరిషత్తు కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా అడహక్ కమిటీ ఛైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, ముమ్మిడివరం అధ్యక్షుడు సీహెచ్.దొర, కార్యదర్శి బండారు రాజేష్, జిల్లా కమిటీ కో ఛైర్మన్ ఏసుబాబు, మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం విశిష్టతను తెలుసుకోవాలి

**మలికిపురం:** రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేశ్, ఉపాధ్యక్షుడు ఎ.రవి అన్నారు. స్థానిక పులె-అంబేడ్కర్ సామాజిక భవనంలో మహ్మద్ అమీద్ అధ్యక్షతన 'రాజ్యాంగ పరిరక్షణ' అంశంపై ఆదివారం జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. యువత రాజ్యాంగం విలువలు, విశిష్టతల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ నెల 26న అమలాపురంలో జరిగే రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వేదిక జిల్లా నాయకుడు ముత్యాల శ్రీనివాస్, దీపాటి ప్రసాద్, గెద్దం ఫిలిప్‌రాజు, తోటే ప్రతాప్, విప్పర్తి సాయిబాబా, నల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజేశ్

## బాలుడిని కొట్టిన ఇద్దరిపై కేసు

**రాజోలు, న్యూస్‌టుడే:** తన మనుమడు ఎనిమిదో తరగతి చదువుతున్న ఇరుసుమండ డేవిడ్ 12న కడలి కూడలిలో ఓ దుకాణానికి వెళ్లి కూల్ డ్రింక్ ఇమ్మని అడగగా యజమానులు దుర్భాషలాడి కొట్టారని వాసంశెట్టివారిపాలేనికి చెందిన నామవరపు చినసత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కామాని గోవింద్, కామాని శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపారు.

## వీరవల్లిపాలెం మాజీ సర్పంచి మృతి

**అయినవిల్లి:** వీరవల్లిపాలెం మాజీ సర్పంచి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్రగడ వీరేశ్వరరావు(82)(బాబ్జి) ఆదివారం మృతిచెందారు. ఈయన గతంలో వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడిగా పనిచేశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## ఆరోగ్యప్రదాత.. ఆదివైద్యుడు

నేడు ధన్వంతరీ జయంతి

న్యూస్‌టుడే, ఆలమూరు

ఆదివైద్యుడు శ్రీధన్వంతరి. దేవదానవుల క్షీరసాగర మథన ఫలితంగా అమృత కలశం చేతపట్టుకుని నారాయణుడే ధన్వంతరీ రూపంలో అవతరించాడని పురాణ కథనం. ఆరోగ్యప్రదాతగా కొలిచే ధన్వంతరి ఆలయం రెండు తెలుగు రాష్ట్రాల్లో డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో మాత్రమే ఉంది. సువిశాల ప్రాంగణంలో, శిల్పకళా శోభితమై, నయన మనోహరంగా దర్శనమిచ్చే ఈ ఆలయంలో ప్రధాన దైవం శ్రీధన్వంతరి, ఉపాలయాలుగా కాశీ విశ్వేశ్వరుడు, వేంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్నారు.

గర్భాలయంలో స్వామివారు

### ఎనిమిది దశాబ్దాల క్రితం..

స్వాతంత్ర్యానికి పూర్వమే 1942లో చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం వ్యవస్థాపకుడు ద్విభాష్యం వెంకటేశ్వర్లు ఈ ఆలయాన్ని నిర్మించారు. పూజాదికాలకు 18 ఎకరాల భూమిని శాశ్వత ప్రాతిపదికన కేటాయించారు. వారి వంశీకులైన ద్విభాష్యం వెంకటశ్రీరామమూర్తి ఆలయాన్ని కొత్త సొబగులతో తీర్చిదిద్దారు. ఏకశిలపై మలిచిన ధన్వంతరస్వామి విగ్రహాన్ని కాశీ క్షేత్రం నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. మండపంలో శిల్పాలు కొలువుదీరి చూపరులను మధురానుభూతికి లోనుచేస్తాయి. కార్తిక బహుళ త్రయోదశినాడు ఆలయంలో ధన్వంతరీ వ్రతం ఆచరిస్తారు. వ్రతకథను విన్న తరువాత గోధుమనూక, ఆవుపాలు, నెయ్యి, పంచదార, ద్రాక్ష, కుంకుమ పువ్వు, పచ్చకర్పూరం, లవంగ, జాపత్రి, దాల్చిన చెక్క తదితర సుగంధద్రవ్యాల చూర్ణం కలిపి చేసిన మహాప్రసాదాన్ని స్వామికి నివేదిస్తారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. రావులపాలెం-కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చింతలూరు చేరుకోవడానికి రోడ్డు రవాణా సదుపాయాలు ఉన్నాయి.

## ప్రారంభించారు.. వదిలేశారు

– న్యూస్‌టుడే, అంబాజీపేట

గత ప్రభుత్వ పాలనలో నాడు-నేడు పథకంలో చేపట్టిన పాఠశాలల భవనాలు, ప్రహరీల నిర్మాణాలు నేటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులను చవిచూస్తున్నారు. మరుగుదొడ్లు, వంటశాలల పరిస్థితి కూడా అలాగే ఉంది. వీటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

### మంజూరు ఇలా..

పి.గన్నవరం నియోజకవర్గంలో మన బడి రెండోదశ పనులకు మండలాల వారీగా పాఠశాలల భవనాలను కేటాయించారు. వీటికి సంబంధించి నిధుల కేటాయింపులు జరిగాయి. అవి మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా ఉండిపోయాయి.

గంగలకుర్రులోని గుంటమామిడిదొడ్డి ప్రాథమిక పాఠశాలలో నిలిచిన ప్రహరీ నిర్మాణం

### నిధులు రావాల్సి ఉంది

నియోజకవర్గంలో అసంపూర్తి పనులకు నిధుల కొరత ఉంది. దాదాపుగా రూ.20 కోట్ల మేర ఇంకా రావాలి. ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. నిధులు వస్తే నిర్మాణాలు వేగవంతం అవుతాయి.

– వి.నాగేశ్వరరావు, సమగ్రశిక్ష జేఈ

| మండలం | మంజూరైన పాఠశాలలు | నిధుల కేటాయింపు (రూ.కోట్లలో) |
|---|---|---|
| అంబాజీపేట | 28 | 10.10 |
| అయినవిల్లి | 35 | 12.15 |
| పి.గన్నవరం | 42 | 19.36 |
| మామిడికుదురు | 28 | 8.24 |

## యూటీఎఫ్ సాయం

**ఆత్రేయపురం:** మెర్లపాలెం ఎంపీపీఎస్ 3 పాఠశాల ఆవాస ప్రాంతంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు మండల యూటీఎఫ్ శాఖ ఆదివారం 25 కిలోల చొప్పున బియ్యంతోపాటు నిత్యావసర సరకులు, కూరగాయలు, వంట సామగ్రి, దుప్పట్లు అందజేసింది. మండల శాఖ అధ్యక్షుడు టి.రామకృష్ణ రూ.వెయ్యి చొప్పున నగదు, ర్యాలి ఉపాధ్యాయిని ఎ.లక్ష్మి రూ.3 వేలు చొప్పున సహాయం అందజేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఎస్వీవీఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
అవిడి బ్రాంచ్, అవిడి, తూర్పు గోదావరి జిల్లా

**స్వాధీనత ప్రకటన**
(చర మరియు స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అవిడి బ్రాంచ్, అవిడి, తూర్పు గోదావరి జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్13(2)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ కంద్రేగుల శ్రీరామ కృష్ణ,** తండ్రి : వ్యాఘ్రేశ్వరుడు, డి.నెం. 5-72, చిరతపూడి, కట్టవారి పాలెం, అంబాజీపేట మండలం, తూర్పుగోదావరి జిల్లా, (**HL - 36108006652, Top up - 37884336021, Top up - 39187015040, Suraksha - 36063017039**) వారు తేది. **13-08-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 12,56,968/-** (అక్షరాల పన్నెండు లక్షల యాభై ఆరు వేల తొమ్మిది వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) + వడ్డీ, కాస్ట్సు మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది. 03-09-2025న (సంక్షిప్త) డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

ఋణగ్రహీత/ హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూల్సు 8 మరియు 9 ప్రకారము **తేది. 12-11-2025** దిగువ పేర్కొన్న ఆస్తిని **నిర్మాణాత్మక స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది. 13-08-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 12,56,968/-** (అక్షరాల పన్నెండు లక్షల యాభై ఆరు వేల తొమ్మిది వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) + వడ్డీ, కాస్ట్సు మరియు ఇతర ఖర్చులు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. తరువాత చెల్లించిన మొత్తములు తీసివేయబడును.

చర మరియు స్థిరాస్తుల వివరములు

శ్రీ కంద్రేగుల శ్రీరామ కృష్ణ, తండ్రి : వ్యాఘ్రేశ్వరుడు గారికి చెందిన ఆస్తి: ఐటమ్ నెం.1: తూర్పుగోదావరి జిల్లా, చిరతపూడి గ్రామం, అంబాజీపేట ఎస్ఆర్ఓ వద్ద ఆర్.ఎస్.నెం.134/1ఎ లోని జిరాయితీ డ్రై 726 చ॥గ॥లు విస్తీర్ణం గల భూమి అందు ఆర్‌సిసి క్రింది మరియు మొదటి అంతస్తులతో కూడిన భవనం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** దాసరి అన్నపూర్ణ గారి భూమి, **దక్షిణం :** కట్టా అబ్బులు గారి భూమి, **పడమర :** కుడుపూడి వెర్రియ్య గారి కుమార్తెకు చెందిన భూమి, **ఉత్తరం :** హక్కుదారుల నుండి భాగ్యలక్ష్మి గారు కొనుగోలు చేసిన ఆస్తి.

**ఐటమ్ నెం.2:** తూర్పుగోదావరి జిల్లా, చిరతపూడి గ్రామం, అంబాజీపేట ఎస్ఆర్ఓ వద్ద ఆర్.ఎస్.నెం.134/1ఎ లోని జిరాయితీ డ్రై 67 చ॥గ॥లు విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** దాసరి అన్నపూర్ణ గారి స్థలం - 50 అ॥లు, **దక్షిణం :** ఇదే ఆర్.ఎస్.నెం. (డాక్యుమెంట్ నెం.143/11 ప్రకారం) లోని హక్కుదారుని స్థలం - 12 అ॥లు, **పడమర :** హక్కుదారుల స్థలం - 50 అ॥లు, **ఉత్తరం :** పంచాయితీ రోడ్డు - 12 అ॥లు.,

తేది : 12-11-2025
ప్రదేశం : అవిడి

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


(c) eenadu

# అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

## హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పూజలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పార్వతీసమేత కుండలేశ్వరాలయాన్ని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డి.సోమయాజులు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈవో దుర్గ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు కాళ్లకూరి కామేశ్వరరావు ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందించారు.

## తీరంలో చిన్నారుల సందడి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: చిన్నారుల కేరింతలతో ఎస్.యానాం సముద్రతీరం సందడిగా మారింది. ఆదివారం కావడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. పిల్లలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కుటుంబాలంతా కలిసి వనభోజనాలు చేశారు.

బొమ్మరిల్లు కడుతున్న పిల్లలు

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948

అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166

కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

**సమస్య:** అమలాపురం మంచినీటి చెరువుగట్టు వీధిలో రహదారిపై చెట్ల కొమ్మలను నరికి వదిలేశారు. అటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

– ప్రసాద్, స్థానికుడు

**సమస్య:** ముమ్మిడివరంగేట్ మురుగుకాలువలో చెత్త, ప్లాస్టిక్‌వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగు ముందుకు కదలక దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. – దొరబాబు, వ్యాపారి

**సమస్య:** నల్లవంతెన బైపాస్‌రోడ్డు డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త వల్ల దుర్వాసన వస్తోంది. స్థానికులు, అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– అన్నవరం, నల్లవంతెన.

**పరిష్కారం:** మంచినీటి చెరువుగట్టు, ముమ్మిడివరంగేట్, నల్లవంతెన బైపాస్ రోడ్డుల సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. రోడ్డులో బ్లీచింగ్ చల్లించారు.

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

**సమస్య:** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటు సెంటర్ ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు సాగక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– పి.సత్యనారాయణ, స్థానికుడు

**సమస్య:** నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో డ్రెయిన్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీరు దిగక దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కె.నారాయణరావు, స్థానికుడు

**పరిష్కారం:** నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటుసెంటర్, మార్కెట్ ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, ముమ్మిడివరం

## ఆధిపత్యపోరు.. తీస్తోంది ఉసురు..!

● గత ఏడాది ఆదరపల్లిలో మద్యం మత్తులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ ఘటనలో యువకుడు పోలిశెట్టి కిశోర్ హత్యకు గురయ్యాడు.

● ఇటీవల అమలాపురం పట్టణం పరిధిలో కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ హత్యకు గురయ్యాడు.

● ఈ నెల 4న రామచంద్రపురంలో చిన్నారి మృతి సంచలనం రేకెత్తించింది. మృతి చెందిన చిన్నారి కుటుంబంతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి చోరీకి వచ్చి బాలికను హతమార్చాడు.

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో ఇటీవల నేర ప్రవృత్తి చాపకింద నీరులా పాకుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు తీసే వరకు వెళ్తోంది. నేరస్థులతో సహవాసం, గాడి తప్పుతున్న జీవన విధానాలతో కొందరు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. వ్యసనాలతో జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మద్యం మత్తు, క్షణికావేశం, కక్షలు ఇలా కారణం ఏదైనా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, ఏఎస్పీ ప్రసాద్

### నిరంతర నిఘాతోనే..

అమలాపురం పట్టణంతో పాటుగా జిల్లాలోని పలు చోట్ల నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 12 హత్యలు, 3 దోపిడీలు, 46 హత్యాయత్నం కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో నేరస్థుల కదలికలపై మరింత నిఘా పెట్టాల్సి ఉంది. ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా.. నేరాలు పెరుగుతున్నాయి.

### పోలీసు నిఘా ఉంచాం

పాత నేరస్థులు, రౌడీ షీటర్లు నిరంతరం పోలీసులు నిఘాలోనే ఉంటారు. వారి ప్రతికదలిక తెలుస్తుంది. గతంలో నేరాలు చేసి, జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన వారు ప్రవర్తన మార్చుకుని పద్ధతిగా ఉండాలి. లేకుంటే చర్యలు తప్పవు.

– రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ

## దివ్యాంగులకు చేయూత అవసరం

యానాం, న్యూస్‌టుడే: వినికిడి, చూపు లోపంతో ఇతర బహుళ వైకల్యాలతో బాధపడేవారు మానసికంగా కుంగిపోకుండా ఆత్మస్థైర్యం కల్పించేందుకు ఆరోగ్య సిబ్బంది బాధ్యత తీసుకోవాలని మల్టీ డిజేబుల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్ఐ నాయుడు అన్నారు. రాజీవ్‌బీచ్‌లోని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ భవనంలో శని, ఆదివారాలలో వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్, సుశీల, విజయదుర్గ, మహేశ్వరి పాల్గొన్నారు.

## కొనసాగిన గ్రామస్థుల ఆందోళన

యానాం, న్యూస్‌టుడే: దరియాలతిప్ప సొసైటీ భూమి చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, రైతులకు, ప్రభావిత గ్రామాలకు తగిన పరిహారం ఇవ్వాలని దరియాలతిప్ప, ప్రజలు చేపట్టిన ఆందోళన ఆదివారానికి 34వ రోజుకు చేరింది. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు ఎలాంటి కార్యకలాపాలు జరగనివ్వబోమని ఆందోళనకారులు స్పష్టం చేశారు. గిడ్ల చంద్రరావు, తిరుకోటి నాగేశ్వరరావు, సబ్బతి శ్రీను, మోకా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతి రాష్ట్రంలో నకిలీ ఓటర్లు'

యానాం, న్యూస్‌టుడే: నకిలీ ఓటర్లు లేని రాష్ట్రం ఒక్కటీ లేదని తమిళనాడు భాజపా మాజీ అధ్యక్షుడు అన్నామలై అన్నారు. ఆదివారం పుదుచ్చేరి భాజపా కార్యకర్తలకు ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) గురించి ఏర్పాటు చేసిన శిక్షణ సభలో అన్నామలై పాల్గొన్నారు. ప్రస్తుతం పుదుచ్చేరితో సహా 12 రాష్ట్రాల్లో ప్రత్యేక సమగ్ర పరిశీలన జరుగుతోందన్నారు. దేశ వ్యాప్తంగా ఒక ఏడాదిలో ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఈసీ ప్రకటించిందన్నారు.

## కరాటే పోటీల్లో సత్తా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో అమలాపురం పవర్ కిక్ షోటోకాన్ కరాటే క్రీడాకారులు సత్తా చాటారని శిక్షకుడు పడాల అంజి తెలిపారు. కాకినాడ ద్రోణా బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో గోల్డెన్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది పాల్గొనగా అమలాపురం విద్యార్థులు 13 మంది ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు.

## కార్తిక వనసమారాధనల సందడి

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో ఆదివారం పలుచోట్ల కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. సామాజిక వర్గాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో సందడి వాతావరణం నెలకొంది.

దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం వద్ద శెట్టిబలిజ సంఘ నాయకులు

కార్తిక వనసమారాధనకు వస్తున్న మంత్రి సుభాష్‌కు పండ్ల దండ వేస్తూ...

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: శెట్టిబలిజ జాతి ఐకమత్యం, అభ్యున్నతి కోసం ఏటా కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం ఆవరణలో వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, భారీ బాణసంచా నడుమ మంత్రి సుభాష్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, పెచ్చెట్టి చంద్రమౌళి, కడలి ఈశ్వరి, గుత్తుల సాయి, దొంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ● అమలాపురంలోని వడ్డిగూడెంలో రెడ్డి సామాజిక వర్గీయుల కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. కోనసీమ రెడ్డి సంఘం నూతన కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. సినీ రచయిత డాక్టర్ పైడిపాల రెడ్డిని సన్మానించారు.

● అమలాపురంలోని వడ్డిగూడెం వీర్రాజు గార్డెన్స్‌లో రజక సామాజిక వర్గీయుల కార్తిక వనసమారాధన ఆదివారం నిర్వహించారు.

వాసర్లగార్డెన్స్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

**యానాం:** తెలగా అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి వెంకట రామ్మూర్తి ఇతర కార్యవర్గం ఆధ్వర్యంలో జాతీయ రహదారిలోని కాపు కల్యాణ మండపంలో వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, భాజపా అధ్యక్షుడు కనకాల రాజు, తోట రాజు తదితరులు పాల్గొన్నారు. అడవిపోలంలోని రీజెన్సీ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో యానాం కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. పలువురిని సన్మానించారు.

**ముమ్మిడివరం:** నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన యాదవులు హాజరై ఆట పాటలు, ఆనందోత్సాహాల మధ్య గడిపారు.

**అమలాపురం పట్టణం:** విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ ఆర్థికాభివృద్ధి చెందాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. అమలాపురంలోని వాసర్లగార్డెన్స్‌లో విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు.

వీర్రాజు గార్డెన్స్‌లో రజక సామాజికవర్గ నాయకులు

విద్యార్థినిని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

సినీ రచయిత డాక్టర్ పైడిపాల రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

యానాం: తోట త్రిమూర్తులు, గొల్లపల్లి అశోక్ తదితరులు

ఎమ్మెల్యే సుబ్బరాజుకు స్వాగతం పలుకుతున్న సంఘ నాయకులు

## క్షత్రియులు ఐక్యత చాటాలి

**అమలాపురం పట్టణం:** క్షత్రియులు ఐక్యంగా ఉంటూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సూచించారు. అమలాపురంలోని కొంకాపల్లి క్షత్రియ కల్యాణ మండపంలో కోనసీమ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో క్షత్రియుల కార్తిక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. సంగీత విభావరి, ఆటల పోటీలు నిర్వహించారు. సంఘ అభివృద్ధికి ఏటా రూ.1.25 లక్షలు విరాళం ఇస్తున్న క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్యనారాయణరాజును సన్మానించారు.

## నడక మార్గం.. ప్రమాదకరం

అమలాపురం పట్టణంలోని ఎర్రవంతెన నుంచి నల్లవంతెన వరకు ఉండే ఎన్టీఆర్ మార్గ్‌లోని నడకదారి ప్రమాదకరంగా మారింది. ఇక్కడి సిమెంటు బల్లలు విరిగిపోయినా పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడకమార్గాల్లో వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

## వీడని ముంపు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా చాలాచోట్ల చేలల్లో ముంపునీరు దిగకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కాట్రేనికోన, సత్తెమ్మచెట్టు, వేట్లపాలెం, గెద్దనపల్లి, పల్లంకుర్రు తదితరచోట్ల చేలు ముంపులోనే ఉన్నాయి. మండలంలో సుమారు 1,800 ఎకరాల్లో పంటనష్టం నమోదు చేశామని ఏవో మృదుల తెలిపారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

## రాళ్లదారిలో వెళ్లేదెలా..?

ఉప్పలగుప్తం మండలం గోపవరంలోని బేస్తావారిపేట వెళ్లే రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా మారింది. వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రహదారిని బాగుచేసి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

## పునాదుల్లోనే వదిలేశారు

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మల్లాయిపాలెంలో ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో ఏఐబీ నిధులతో నిర్మించతలపెట్టిన ఓహెచ్‌బీఆర్ పునాది స్థాయిలోనే నిలిచిపోయింది. ఇక్కడ రూ.24 లక్షలతో తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడిచిపోతున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. బిల్లుల చెల్లించకపోడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. - న్యూస్‌టుడే, ముమ్మిడివరం

## నూతన కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం తాలూకా ఏపీ ఎన్‌జీఓ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఏపీ ఎన్‌జీఓ అమలాపురం అధ్యక్షుడు సీహెచ్ రాజశేఖర్ ఎన్నికల అధికారిగా, జి.వెంకటేశ్వరరావు సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ముమ్మిడివరం తాలూకా ఎన్‌జీఓ అధ్యక్షుడిగా సీహెచ్‌ఎన్ దొర, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.రమేష్, ఉపాధ్యక్షులుగా ఎంఆర్‌కే ప్రసాద్, వై.ఇంద్రప్రియదర్శిని, డీఎస్ చంద్రబాబు, కార్యదర్శిగా బి.రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షులు మాదవరపు వెంకటేశ్వర్లు, కన్వీనర్ సీహెచ్ చిట్టిబాబు హాజరయ్యారు.

ఏపీ ఎన్‌జీవో కార్యవర్గ ప్రతినిధులు

## దోమల నివారణకు చర్యలు

**కాట్రేనికోన:** రామస్వామితోటలోని ఓ ప్రాంతంలో వర్షాలకు నీరు నిలిచి దోమల వ్యాప్తి చెందుతున్నాయి. ఈ సమస్యను స్థానికులు సర్పంచి గంటి సుధాకర్, కార్యదర్శి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. ఆ గుంతలోని నీటిలో దోమ లార్వా నిరోధక ఆయిల్ బాల్స్‌ను వేయించారు.

## అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ముఖాముఖి

**కాకినాడ నగరం, న్యూస్‌టుడే:** కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో 2025-26 విద్యాసంవత్సరంలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులను డెమో, ముఖాముఖిలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఆంజనేయులు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ లేదా ఆపైన అర్హతలు, సెట్, నెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఈ నెల 18న సంస్కృతం, ఆంగ్లం, స్టాటిస్టిక్స్, హిస్టరీ సబ్జెక్టులకు, 19న కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, పీజీ ఫిజికల్ కెమిస్ట్రీ, పీజీ అనలిటికల్ కెమిస్ట్రీ సబ్జెక్టులకు డెమో, ముఖాముఖి నిర్వహిస్తామని వివరించారు. యూజీ పోస్టులకు సంబంధించి ఆంగ్లం 2, స్టాటిస్టిక్స్ 2, కంప్యూటర్ సైన్స్ 3, సంస్కృతం 1, హిస్టరీ 1, కంప్యూటర్ అప్లికేషన్స్ 3, కామర్స్ మేనేజ్‌మెంట్ 3 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీ పోస్టులకు సంబంధించి ఫిజికల్ కెమిస్ట్రీ 1, అనలిటికల్ కెమిస్ట్రీ 1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్‌ను సంప్రదించాలన్నారు.

## ఉద్యమకారుల సేవలు గుర్తించుకోవాలి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గ్రంథాలయ ఉద్యమానికి జీవితం అంకితం చేసిన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహామూర్తి అన్నారు. భీమనపల్లి గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషకుమార్, రాష్ట్ర ఆర్యవైశ్యసంఘ డైరెక్టర్ కంకటాల రామం తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం గ్రంథాలయంలో మాట్లాడుతున్న కొల్లూరి

**అమలాపురం పట్టణం:** గ్రంథాలయోద్యమంలో అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణంల పాత్ర అమూల్యమని రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ ఎస్ఆర్ఆస్ కొల్లూరి అన్నారు. అమలాపురంలోని ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో అధికారి జీవీఆర్ఎస్ వర్మ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొల్లూరి విద్యార్థులతో మాట్లాడారు. అద్దంకి అమరేశ్వరరావు, యర్రంశెట్టి ధర్మారావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

## రహదారుల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. తాళ్లరేవు మండలం సుంకరపాలెం కూడలి నుంచి అంబేడ్కర్ నగర్ వరకు రహదారుల, భవనాల శాఖ నిధులు రూ.1.80 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు సుంకరపాలెం చెక్‌పోస్టు వద్ద ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం భూమి పూజ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.5 కోట్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు. ఆర్అండ్‌బీ జేఈ లక్ష్మీప్రసన్న, మోపూరి వెంకటేశ్వరరావు, మోపూరి వెంకట రెడ్డి నాయుడు, టేకుమూడి లక్ష్మణరావు, టిళ్లపూడి నాగేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, వేగేశ్న భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందాల హరివిల్లు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటకులతో ఆదివారం కిటకిటలాడింది. ఆట పాటలతో మహిళలు, చిన్నారులు, విద్యార్థులు రోజంతా హాయిగా గడిపారు. మడ అడవుల సందర్శన కోసం బారులు తీరారు. కొందరు ఉద్యోగులు బోటు షికారు చేశారు.

నీటి పిల్లి బొమ్మ చుట్టూ కూర్చున్న విద్యార్థులు

## గదిలో వదిలేశారు..!

గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

గత ప్రభుత్వ హయాంలో కొత్తపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం కారణంగా సిమెంట్ బస్తాలు గడ్డకట్టి పాడయ్యాయి. రెండేళ్ల నుంచి కంకర, గడ్డకట్టిన సిమెంట్ బస్తాలను ఓ గదిలో వదిలేశారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

కంకర గుట్ట

## కిక్కిరిసిన భక్తులు

కాట్రేనికోన: కుండలేశ్వరాలయంలో ఆదివారం భక్తులు కిక్కిరిశారు. తెల్లవారుజాము నుంచే పుష్కరఘాట్‌లో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పీఎస్ఎన్ రాజు, త్సవటపల్లి నాగు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. తెదేపా నేత పీఎస్ఎన్ రాజు కాట్రేనికోన నుంచి ఆలయానికి ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేశారు.

## ఘనంగా లక్షపత్రి పూజ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: క్రాపచింతలపూడిలోని శివాలయంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. స్వామికి లక్ష పత్రి పూజ చేశారు.

## నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు ఆదివారం విరాళం అందజేశారు. కామవరపుకోటకు చెందిన టి.రామనాగ సాయికుమార్ దంపతులు వీరేశ్వర నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10వేలు అందజేశారు. దాతను ఆలయ ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ అభినందించారు.

## కుంగి.. బీటలువారి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పల్లంకుర్రు నుంచి బలుసుతిప్ప వెళ్లే రోడ్డు వడ్డివారిపేట వద్ద పంటకాలువ వైపు బీటలువారి కుంగుతోంది. సుమారు మూడేళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు పొడవునా ఓ వైపు పంటకాలువ ఉంది. చాలాచోట్ల కుంగిపోగా.. కొన్నిచోట్ల బీటలు తీసింది. మరమ్మతులు చేయకుంటే మరింతగా పాడయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

(c) eenadu

మండపేట
•మండపేట •రామచంద్రపురం

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి వద్దే ఉండి పనిచేస్తూ డబ్బు సంపాదించుకోవచ్చని సామాజిక మాధ్యమాల ద్వారా ఆశ చూపి మోసపూరితమైన లింకులు పంపి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులను లక్ష్యం చేసుకుని యువతను నిలువునా దోచేస్తున్నారన్నారు. ఇలాంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా ఇటువంటి కాల్స్ వచ్చినా, మోసాలకు గురైనా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## ధాన్యం రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కాజులూరు, న్యూస్‌టుడే: ధాన్యం రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం ఆయన ఆర్యవటం, గొల్లపాలెం, బంధనపూడి తదితర గ్రామాల్లో పర్యటించి ధాన్యం రంగు మారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వరి కోతకు వారం రోజుల ముందు నుంచే పొలాన్ని ఆరబెట్టి తడి లేకుండా చూసుకోవాలన్నారు. కోత సమయంలో ధాన్యంలో తేమ 23 నుంచి 26 శాతం వరకు ఉంటుందని, నూర్పిడి చేసిన వెంటనే టార్పాలిన్, బరకాలపై పలుచగా ఆరబెట్టాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం 14 కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకుని నిల్వ చేసుకోవాలని తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామ: 80085 74192 ద్వారపూడి: 91543 96553

### వ్యర్థాలు తొలగించారు

రాయవరం, న్యూస్‌టుడే: వెదురుపాక మార్కెట్ కూడలిలో చెత్తకుప్పలు పేరుకుపోయి రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్న సమస్యను పంచాయతీ కార్యదర్శి యు.రేణుక దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తకుప్పలను తీయించారు.

ద్వారపూడి: మండపేట మండలం కేశవరం గ్రామంలో గనిపోతురాజు చెరువుగట్టు వద్ద రహదారి పక్కన వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వ్యాపించి స్థానికులు ఇబ్బంది పడుతున్నారని వి.సురేష్ తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావుకు తెలియజేయగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. మేమున్నాం.

### కాలువ శుభ్రం

మండపేట గ్రామీణం: ద్వారపూడి బంగ్లాదేవి వీధిలో ప్రధాన డ్రైనేజీ కాలువలో మురుగు పేరుకుపోయి ప్రవాహం నిలిచిపోయి రహదారిపైకి పొంగి ప్రవహిస్తూ దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఆకుల రమణకు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపి పూడికను తీయించారు.

## తొమ్మిదేళ్లుగా.. నిలిచిన నిర్మాణం

● అద్దె భవనంలో గ్రంథాలయం

న్యూస్‌టుడే, రామచంద్రపురం

జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహణలో ఉన్న రామచంద్రపురం తోటవారి వీధిలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయానికి కొత్త భవనం సమకూరక పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుస్థితికి చేరిన పాతభవనాన్ని పడగొట్టి అద్దె భవనంలో కొనసాగిస్తున్నప్పటికీ ఇరుకు కారణంగా ఇక్కట్లు తప్పడం లేదు. కొత్త భవనం నిర్మించేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ రూ.15 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించి స్లాబు వరకు వేశారు. సకాలంలో సొమ్ములు రాకపోవడంతో అక్కడితో పనులు నిలిచిపోయాయి. తదుపరి అంచనా వ్యయం పెరగడంతో మొత్తం రూ.32 లక్షలు అవసరమని ప్రతిపాదనలు చేసి అనుమతులిచ్చారు. మిగిలిన పనులతోపాటు టైల్స్ వేసి ప్రహరీ నిర్మించేందుకు మరో రూ.17 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను మరో గుత్తేదారుకు అప్పగించారు. మొదటి గుత్తేదారు స్లాబు వరకు నిర్మించి వదిలేయగా.. రెండో గుత్తేదారు టైల్స్ మినహా గుమ్మాలు, కిటికీలు తదితర పనులు పూర్తి చేశారు. రూ.17 లక్షలు విడుదల కాకపోవడంతో పనులు చేయలేమని ఆపేశారు. నిధులు ఎప్పుడు వస్తాయో.. భవన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియక పాఠకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ఇరుకు గదులతో యాతన

పాత భవనాన్ని కూలగొట్టడంతో రాజకోట వీధిలో రాజగోపాల్ సెంటర్ సమీపంలో అద్దె భవనంలో తాత్కాలికంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ గ్రంథాలయం ఉన్నట్లు చాలామందికి తెలియదు. ప్రస్తుతం గ్రంథాలయ వారోత్సవాలు ఈ భవనంలోనే నిర్వహిస్తున్నారు. పుస్తకాలు, పత్రికలు ఉంచేందుకు, కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొత్త భవనం నిర్మిస్తే సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, పాఠకులు పెరుగుతారని భావిస్తున్నారు.

తోటవారి వీధిలో నిలిచిపోయిన గ్రంథాలయ భవనం

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

తోటవారివీధిలో అసంపూర్తి భవనం విషయాన్ని జిల్లా గ్రంథాలయాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల చేశామని చెబుతున్నారు. వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగానే నూతన భవనంలోకి గ్రంథాలయాన్ని మారుస్తాం.

\- జీవీఎస్ఎన్.త్రినాథ్, గ్రంథాలయాధికారి, రామచంద్రపురం

## ఘనంగా అయ్యప్పల పేటతుళ్లి

వెదురుపాక ఊరేగింపులో మాలధారులు

రాయవరం, న్యూస్‌టుడే: వెదురుపాకలో మాలధారులు అయ్యప్పస్వామి ఉత్సవమూర్తితో గ్రామోత్సవం, పేటతుళ్లి కార్యక్రమాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కడియాల వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో తొలుత అయ్యప్పస్వామి ఉత్సవమూర్తిని రథంపై ఊరేగించారు. స్వామి శరణం. . అయ్యప్పశరణం అంటూ శరణుఘోష, భక్తిగీతాలకు అనుగుణంగా పేటతుళ్లి ఆడారు. సుమారు 40 మంది మాలధారులు రథోత్సవం నిర్వహించారు.

అంగర: కపిలేశ్వరపురం మండలంలోని అంగరలో బరివిశెట్టి శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 32 మంది అయ్యప్ప మాలధారులు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. తొలుత స్థానిక ఖణ్వాలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కనులపండువగా గోవిందుడికి మహాభిషేకం

మండపేట: మండపేట కలువపువ్వు కూడలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 'గోవిందునికి' పంచామృత సుగంధద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహించారు. కార్తిక మాసం ఏకాదశి వేడుకల్లో భాగంగా మిర్తిపాటి సూర్యనారాయణమూర్తి, గంగారావు సౌజన్యంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఈవో కామేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నాట్య అకాడమీకి చెందిన ఎల్ హేమలత బృంద సభ్యుల నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.

వేంకటేశ్వరస్వామికి మహాభిషేకం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

## అన్నాయిపేటలో స్వదేశీ సంకల్ప ప్రతిజ్ఞ

ప్రతిజ్ఞ చేస్తున్న భాజపా నాయకులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామంలో ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మండల భాజపా అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, భాజపా ఆత్మనిర్భర్ అభియాన్ కన్వీనరు, హసనబాద సర్పంచి ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మన జీవన విధానంలో స్వదేశీని భాగంగా అలవర్చుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఇంటింటా స్వదేశీ స్టిక్కర్లను అతికించారు. ఆనాల పాపారావు, భాజపా నాయకులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ

అంబాజీపేట: కోనసీమ సుమన్‌గౌడ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సినీనటుడు సుమన్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించినట్లు అభిమాన సంఘ జిల్లా అధ్యక్షుడు అత్తిలి గిరిబాబుగౌడ్ వెల్లడించారు. ఏలూరులో సినీ నిర్మాత, పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ అతిథిగృహంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అత్తిలి వెంకటప్రసాద్‌గౌడ్, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో లీలాకృష్ణను సత్కరిస్తున్న కాపు అభ్యుదయ సంఘం సభ్యులు

నేలటూరులో ఎమ్మెల్యే వేగుళ్లకు సత్కారం

ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న తోట త్రిమూర్తులు

## సమారాధనలు.. ఐక్యతకు వేదికలు

ద్రాక్షారామ, అంగర, రామచంద్రపురం, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధనలు ఆదివారం ఎక్కడికక్కడ ఉత్సాహంగా జరిగాయి. తాళ్లపాలెంలో ప్రధాన రహదారి పక్కన శెట్టిబలిజ కార్తిక వనసమారాధన జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, కాకినాడ సత్య స్కాన్ అధినేత కాద వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణను సన్మానించారు. కాకినాడ ఎంఎస్ఎన్ ఛార్టీస్ కళాశాలలో డిగ్రీ చదివిన 1989-91 బ్యాచ్ విద్యార్థులు ద్రాక్షారామ సర్పంచి కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో వెంకటాయపాలెంలోని అతిథిగృహంలో కలుసుకుని వనభోజనాలు చేశారు.

అంగర: నేలటూరులోని శ్రీపట్టాభిరామ, వేణుగోపాలస్వామి ఆలయంలో ఉసిరిచెట్టుకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ పూజలు నిర్వహించారు. కపిలేశ్వరపురంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం, కేదార్లంకలో సాదావారి వనసమారాధనల్లో లీలాకృష్ణ పాల్గొన్నారు.

రామచంద్రపురం: కాపు సామాజికవర్గీయులంతా ఐకమత్యంగా ఉంటూ కులాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కాపు సంఘం అధ్యక్షుడు తొగరు బ్రహ్మాజీ ఆధ్వర్యంలో ఆదివారం అరిగెల కృష్ణవేణి వీర్రాఘవులు కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన కాపు వనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి శ్రీధర్, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ చిక్కాల దొరబాబు, దామిశెట్టి గంగాపురుషోత్తమరావు, తోట బాబులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో సూర్యనారాయణను సన్మానిస్తున్న శెట్టిబలిజ నాయకులు

వెంకటాయపాలెంలో కలిసిన పూర్వ విద్యార్థులు

## వైభవంగా శివపంచకోటి అక్షర గ్రంథ ప్రతిష్ఠ

అంగర: కార్తిక మాసం సందర్భంగా కపిలేశ్వరపురం మండలం అంగరలో కొలువైన ఉమా, రామలింగేశ్వరస్వామి, వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొమాళ్లపల్లి సత్యసుబ్రహ్మణ్యం, శ్రీకంఠం మల్లేశ్వరపుశర్మ ఆధ్వర్యంలో శ్రీశివ పంచకోటి అక్షర గ్రంథ ప్రతిష్ఠ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సువాసినీలతో కుంకుమార్చన, రుద్రహోమం, సూర్య నమస్కారాలు, జ్యోతిర్లింగార్చన, తదితర కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. ఈ నెల 18న ఆలయం వద్ద కార్తిక వనసమారాధన ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉమా రామలింగేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

## మండపేట-ఏడిద రహదారికి మరమ్మతులు

మండపేట, న్యూస్‌టుడే: వాహనాలు నడిచేందుకు వీల్లేని విధంగా గుంతలతో అధ్వానంగా మారిన మండపేట-ఏడిద రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ పనులను రామచంద్రపురం ర.భ.శాఖ డీఈఈ టీవీ సూర్యనారాయణ ఆదివారం పరిశీలించారు. స్టేట్ హైవే నిర్వహణ నిధుల నుంచి విడుదలైన రూ.12 లక్షలతో మండపేట బైపాస్ నుంచి ఏడిద, దుళ్ల గ్రామాల వరకు నాలుగు కిలోమీటర్లు, ద్వారపూడి-యానాం రహదారిలో మాచవరం-పసలపూడి వరకు మూడు కిలోమీటర్లు మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

మరమ్మతులు పరిశీలిస్తున్న అధికారులు

## కరాటే పోటీల్లో సత్తా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో అమలాపురం పవర్ కిక్ షోటోకాన్ కరాటే క్రీడాకారులు సత్తా చాటారని శిక్షకుడు పడాల అంజి తెలిపారు. కాకినాడ ద్రోణా బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో గోల్డెన్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది పాల్గొనగా అమలాపురం విద్యార్థులు 13 మంది ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు.

## యూటీఎఫ్ సాయం

ఆత్రేయపురం: మెర్లపాలెం ఎంపీపీఎస్ 3 పాఠశాల ఆవాస ప్రాంతంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు మండల యూటీఎఫ్ శాఖ ఆదివారం 25 కిలోల చొప్పున బియ్యంతోపాటు నిత్యావసర సరకులు, కూరగాయలు, వంట సామగ్రి, దుప్పట్లు అందజేసింది. మండల శాఖ అధ్యక్షుడు టి.రామకృష్ణ రూ.వెయ్యి చొప్పున నగదు, ర్యాలి ఉపాధ్యాయిని ఎ.లక్ష్మి రూ.3 వేలు చొప్పున సహాయం అందజేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఎస్‌వీవీ ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## సంతకాల సేకరణ

మండపేట గ్రామీణం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా వైకాపా నాయకులు ఆదివారం ఏడిదసీతానగరంలో సంతకాలు సేకరించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్, వైకాపా నాయకులు కురుపూడి రాంబాబు, వాసిరెడ్డి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంపై కేసు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో ముత్యాల మెహర్‌బాబాకు చెందిన మూడున్నరెకరాల వ్యవసాయ భూమి ఆక్రమణ ఆరోపణలతో కోర్టులో కేసు నడుస్తోంది. ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నాయని, స్థానికుడు కె.ఎన్.మోహన్‌రావు మద్దతుదారులు పంటను కోసేశారని మెహర్‌బాబా ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై షేక్‌జానీబాషా తెలిపారు.

## గాయపడిన యువకుడు ఆసుపత్రిలో మృతి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన టి.లక్ష్మీప్రతాప్ (26) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని జీజీహెచ్‌లో చేర్చారు. అనపర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆరోగ్యప్రదాత.. ఆదివైద్యుడు

నేడు ధన్వంతరి జయంతి

న్యూస్‌టుడే, ఆలమూరు

ఆదివైద్యుడు శ్రీధన్వంతరి. దేవదానవుల క్షీరసాగర మథన ఫలితంగా అమృత కలశం చేతపట్టుకుని నారాయణుడే ధన్వంతరీ రూపంలో అవతరించాడని పురాణ కథనం. ఆరోగ్యప్రదాతగా కొలిచే ధన్వంతరి ఆలయం రెండు తెలుగు రాష్ట్రాల్లో డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో మాత్రమే ఉంది. సువిశాల ప్రాంగణంలో, శిల్పకళా శోభితమై, నయన మనోహరంగా దర్శనమిచ్చే ఈ ఆలయంలో ప్రధాన దైవం శ్రీధన్వంతరి, ఉపాలయాలుగా కాశీ విశ్వేశ్వరుడు, వేంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్నారు.

### ఎనిమిది దశాబ్దాల క్రితం..

స్వాతంత్ర్యానికి పూర్వమే 1942లో చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం వ్యవస్థాపకుడు ద్విభాష్యం వెంకటేశ్వర్లు ఈ ఆలయాన్ని నిర్మించారు. పూజాదికాలకు 18 ఎకరాల భూమిని శాశ్వత ప్రాతిపదికన కేటాయించారు. వారి వంశీకులైన ద్విభాష్యం వెంకటశ్రీరామమూర్తి ఆలయాన్ని కొత్త సొబగులతో తీర్చిదిద్దారు. ఏకశిలపై మలిచిన ధన్వంతర స్వామి విగ్రహాన్ని కాశీ క్షేత్రం నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. మండపంలో శిల్పాలు కొలువుదీరి చూపరులను మధురానుభూతికి లోనుచేస్తాయి. కార్తిక బహుళ త్రయోదశినాడు ఆలయంలో ధన్వంతరీ వ్రతం ఆచరిస్తారు. వ్రతకథను విన్న తరువాత గోధుమనూక, ఆవుపాలు, నెయ్యి, పంచదార, ద్రాక్ష, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం, లవంగ, జాపత్రి, దాల్చిన చెక్క తదితర సుగంధద్రవ్యాల చూర్ణం కలిపి చేసిన మహాప్రసాదాన్ని స్వామికి నివేదిస్తారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. రావులపాలెం-కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చింతలూరు గ్రామానికి చేరుకోవడానికి రోడ్డు రవాణా సదుపాయాలు ఉన్నాయి.

గర్భాలయంలో స్వామివారు

## 'చిరుదివ్వెలు వెలిగిద్దామా' పుస్తకావిష్కరణ

ఆలమూరు: దేశభక్తి, మానవ సంబంధాలపై ప్రేమ, జీవన నైపుణ్యాల మెరుగుదల ద్వారా ధార్మిక జీవనం సాధ్యపడుతుందని ప్రముఖ కవి, అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ అన్నారు. ఆదివారం మండల వైఖానస సంఘం ఆధ్వర్యంలో జనార్దనస్వామి ఆలయంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. విఖనస, జనార్దనస్వామివార్లకు పూజలు నిర్వహించారు. కృష్ణశ్రీ రచించిన చిరుదివ్వెలు వెలిగిద్దామా పుస్తకాన్ని ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆవిష్కరించారు. సంఘ నాయకులు సత్తిపండు, కృష్ణ, మోదుకూరు శ్రీను, చిన్న, భగవాన్, సింగుబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో వైఖానస సంఘ నాయకులు

## బౌద్ధ ధర్మంపై ప్రచారం

కొత్తపేట: ప్రజలు బౌద్ధం పాటిస్తే పరిపూర్ణులు అవుతారని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్ల శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కమ్మిరెడ్డిపాలెం, వానపల్లిలో ప్రచారం నిర్వహించారు. వానపల్లి సర్పంచి పల్లి భీమారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మన దేశాన్ని బౌద్ధ దేశంగా మార్చాలని అంబేడ్కర్ ఆకాంక్షించేవారన్నారు. చింతపల్లి శివకుమార్, గిడ్ల రమేష్, వై.సురేష్, పిట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన ట్రస్టుకు విరాళాలు

ర్యాలి (ఆత్రేయపురం): ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన దండు వేంకట సత్యనారాయణరాజు, పద్మ దంపతులు, దండు రాజ్‌గోపాలరాజు, వందన దంపతులు రూ. 50,232, ఏలూరుకు చెందిన ఎం.తిరుమలాదేవి, రమేష్ రూ.15 వేలు, నరసాపురానికి చెందిన రుచిత రూ.6,516, రావులపాలేనికి చెందిన పెన్మత్స సిరిచందన రూ.5,116 విరాళం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటాలు అందజేసి దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో బీవీ రమణమూర్తి అభినందించారు.

## మాదకద్రవ్యాల వినియోగంతో భవిత ఛిద్రం

● యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

న్యూస్‌టుడే - మండపేట గ్రామీణం

ఇటీవల కాలంలో గంజాయి రవాణా, వాడకం పెరగడంతో మాదకద్రవ్యాల వినియోగం వల్ల దుష్ఫలితాలపై యువతకు పోలీసు శాఖ అవగాహన కల్పిస్తోంది. మండపేట నియోజకవర్గంలో గ్రామీణ సీఐ పీతల దొరరాజు, రూరల్ ఎస్సై వి.కిషోర్ యువత, బాలలకు సదస్సులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు వాడకం వల్ల మెదడు, మానసిక ఆరోగ్యం, అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. యువత మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దని, ఒక్కసారి బానిసైతే వాటి నుంచి బయటపడటం చాలా కష్టమని హెచ్చరిస్తున్నారు.

మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో సీఐ దొరరాజు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంత జీవన విధానాన్ని అలవాటు చేసుకుని జీవిత లక్ష్యాలు సాధించాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో పల్లెలు, పట్టణాల్లో వాహనానికి డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. మాదకద్రవ్యాల రవాణా నిర్మూలనలో భాగంగా వారంలో ఒకరోజు స్థానిక పోలీసులు జీఆర్పీ, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను తనిఖీ చేస్తున్నారు.

సూచనలు చేస్తున్న రూరల్ ఎస్సై కిషోర్

### కఠినచర్యలు తీసుకుంటాం..

ఎవరైనా మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, వినియోగించినా, రవాణా చేసినా టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలి. మత్తుపదార్థాల నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- పీతల దొరరాజు, సీఐ, మండపేట గ్రామీణం

## శునకాల బోను సిద్ధమైనా.. కార్యాచరణ ఏదీ..?

పట్టణంలో కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ చేయించేందుకుగా ఈ ఆటోను కుక్కల బోనుగా తయారు చేయించి నెల దాటినా ఒక్కసారీ ఉపయోగించలేదు. మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో కుక్కలను పట్టేందుకు ఈ ఆటోను ఇలా మార్పు చేశారు. దీనిపై శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా త్వరలో వ్యాను సహాయంతో కుక్కలను పడతామని తెలిపారు. పట్టణానికి దూరంగా కుక్కల దొడ్డి తయారుచేసేందుకు అనువైన ప్రదేశాన్ని వెతుకుతున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, రామచంద్రపురం

గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న సర్పంచి, తదితరులు

## ఉద్యమకారుల సేవలు చిరస్మరణీయం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని సేవలందించిన ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జూనియర్స్ విభాగంలో పుస్తక పఠనం ఆవశ్యకత, సీనియర్స్ విభాగంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి తెలిపారు. సర్పంచి సాకా శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామలక్ష్మణరాజు, చిట్టూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఉద్యమం చేసిన గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరి సర్వోత్తమరావులను స్మరించుకున్నారు. చిత్రాలు గీసిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. రామచంద్రపురం జూనియర్ కళాశాల లైబ్రేరియన్ కె.నాగేంద్ర, ఆంగ్ల అధ్యాపకుడు బి.శివరావు, కానిస్టేబుల్ పి.నారాయణ, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలో విద్యార్థులు

(c) eenadu

## శ్రీవారి క్షేత్రం.. ఆధ్యాత్మిక వైభవం

దేవేరులతో స్వామివారు

భక్తులకు హారతి చూపుతున్న అర్చకస్వామి

**ఆత్రేయపురం, న్యూస్‌టుడే:** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. కార్తిక ఆదివారం సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

## అన్నవరం @ 10,523 వ్రతాలు

**అన్నవరం:** అన్నవరం సత్యదేవుని దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఘాట్‌రోడ్డులో రెండు కార్లు సాంకేతిక లోపంతో నిలిచిపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. రూ.300 వ్రతమండపాల ప్రాంగణం కిక్కిరిసింది. అత్యధికంగా 10,523 వ్రతాలు జరిగాయి. ఇందులో రూ.300 వ్రతాలే 7,072 ఉన్నాయి. ఓ భక్తురాలు అస్వస్థతకు గురవ్వడంతో ప్రాథమిక చికిత్స అందించారు. పలువురు భక్తులు పాదయాత్ర చేసుకుంటూ స్వామి సన్నిధికి చేరుకున్నారు. సాయంత్రం స్వామివారి రథ సేవ జరిగింది.

## కారాగారం.. సాగు బంగారం..!

సాగుబడిలో ఖైదీలు

జైలులో పండించిన వంకాయలు

కేంద్ర కారాగార ప్రాంగణంలోని ఎనిమిది ఎకరాల్లో వివిధ కూరగాయలు, ఆకుకూరలను సేంద్రియ విధానంలో ఖైదీలతో సాగు చేయిస్తున్నారు. వీటి వల్ల నెలకు సుమారు రూ.1.20 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. దాదాపు రూ.లక్ష విలువైన ఉత్పత్తులను విక్రయిస్తూ, రూ.20 వేల విలువైన కూరగాయలు, ఆకుకూరలను ఖైదీల ఆహార పదార్థాలకు వినియోగిస్తున్నారు. పంటలసాగు, విక్రయాల బాధ్యత సుమారు 20 మంది ఖైదీలకు అప్పగించారు.

**80 పశువులతో డెయిరీ..**

జైలులో 80 పశువులతో డెయిరీ నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 200 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుండగా, వాటిని ఖైదీలకు ఇస్తూ అదనంగా అవసరమైన మేర బయట కొనుగోలు చేస్తున్నారు. పశువుల గడ్డిని సుమారు ఆరెకరాల్లో సాగు చేస్తూ, దాణా బయట కొనుగోలు చేస్తున్నామని జైలు పర్యవేక్షణాధికారి రాహుల్ తెలిపారు. **-ఈనాడు, రాజమహేంద్రవరం**

## కందుకూరి ఆశయాలకు తూట్లు..!

నిఘా

**విలువైన ఆస్తులు అన్యాక్రాంతం**

**ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, టి.నగర్ :** చారిత్రక రాజమహేంద్రవరంలో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు మహోన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన కందుకూరి విద్యా సంస్థల ఆస్తులు పరాధీనమవుతున్నాయి. అక్రమార్కుల చేతిలోకి వెళ్తున్నాయి. విద్యా నిర్వహణలో గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు శాపంగా మారాయి.

ఆస్తులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

**గత సర్కారు నిర్వాకంతో**

ఎయిడెడ్ విద్యా సంస్థలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని గత సర్కారు విలీనం చేసింది. ముందుచూపు లేకుండా కేవలం ఉమెన్స్, డిగ్రీ కళాశాల మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత పాఠశాల, జూనియర్, ఎంబీఏ, డీఎడ్ కళాశాలలపై స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ఉమ్మడిగా ఉన్న విద్యా సంస్థల విషయంలో ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వసతి గృహం నిర్వహణపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 250 మంది ఉన్న వసతి గృహం ప్రభుత్వ ఆధీనంలో లేకపోవడం వివాదాలకు కేంద్ర బిందువు అవుతోంది. గత పాలకవర్గంలో నిధుల గోల్‌మాల్ విషయంలో బహిరంగంగానే రోడ్డెక్కినా ఇప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

**భద్రత లేక**

కందుకూరి ఆస్తులు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి. వై జంక్షన్ ఆనుకొని ఉన్న డిగ్రీ, పీజీ కళాశాలలు, ఆంగ్ల మాధ్యమ పాఠశాల, మహిళా కళాశాలలకు దాదాపు 22 ఎకరాలున్నాయి. ఈ ఒక్క ప్రాంగణం రూ.కోట్లలో ఖరీదు చేస్తుందని అంచనా. ఇప్పటికే విద్యా సంస్థలను ఆనుకొని చుట్టుపక్కల వ్యాపార సముదాయాలు వెలిశాయి. ఇవన్నీ రాజకీయ నేతల అండదండలతో ఆక్రమించారు. గతంలో కొందరు ఇళ్లు నిర్మించగా, రాజకీయ ప్రయోజనాల నేపథ్యంలో పట్టాలు సైతం ఇచ్చారు. ఇటీవల వ్యాపార సముదాయాలు పెరిగిపోయాయి. కల్యాణ మండపం రోడ్డు ఆనుకొని ఉన్న దుకాణాల్లో మద్యం కూడా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇన్నీసుపేటలో జూనియర్ కళాశాల సుమారు 6 ఎకరాల్లో ఉంది. ఈ ఆస్తులకు రక్షణ లేకుండా పోతోంది.

## సివిల్స్ అభ్యర్థులూ మీ కోసమే..!

యువ

**వి.ఎల్.పురం:** యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శశాంక తెలిపారు.

**అర్హులు ఎవరంటే**

జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తులు అందించాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండాలి. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైన వారిని ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

**దరఖాస్తులు ఎక్కడ ఇవ్వాలంటే..**

బయోడేటాతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందించాలి.

**విజయవాడలో తర్ఫీదు**

ఎంపికైన వారికి విజయవాడలోని బీసీ భవన్‌లో సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తారు.

**మరిన్ని వివరాలకు 9494452267, 9000058102, 7032197288 నంబర్లలో సంప్రదించాలి.**

## ప్రజాసమస్యలపై అర్జీల స్వీకరణ నేడు

**కలెక్టరేట్(రాజమహేంద్రవరం):** జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించనున్నారు. వివిధ సమస్యలపై ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు.

## రైలు ప్రయాణంలో.. వైద్యం సులభం

● భీమవరానికి చెందిన దంపతులు పిల్లలతో రైలులో శ్రీకాకుళం వెళుతున్నారు. తణుకు దాటగానే బాబు ఆడుకుంటూ కింద పడి చేతికి గాయమైంది. 139 నంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వగా రాజమహేంద్రవరం స్టేషన్‌కు వచ్చేసరికి రైల్వే వైద్యులు అప్రమత్తమై సేవలందించారు.

రైలు ప్రయాణం చేస్తున్నపుడు ఉన్నట్లుండి అస్వస్థతకు గురైతే వైద్య సేవలను పొందవచ్చు. కాకపోతే దీనిపై పెద్దగా అవగాహన లేకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**139 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదిస్తే సేవలు**

**ప్రయాణిస్తున్న బోగీ నుంచే..**

ప్రయాణ సమయంలో అస్వస్థతకు గురైతే కుటుంబ సభ్యులు లేదా తోటి ప్రయాణికుల సహకారంతో ఆ బోగీ నుంచే ప్రాథమిక వైద్యం పొందొచ్చు. చరవాణిలో 139 టోల్ ఫ్రీ నంబరుకు ఫోను చేసి సమాచారం ఇస్తే వైద్య సాయం తక్షణం పొందవచ్చు. ☛ టికెట్ కలెక్టర్, ఆర్పీఎస్ రైల్వే సిబ్బందికి తెలియజేసినా వెంటనే రైల్వే ఆసుపత్రి సిబ్బంది స్పందిస్తారు. ☛ ముందు కిట్టు పట్టుకొచ్చి వైద్య సేవలందించి అవసరమైన మందులు అందిస్తారు. ☛ పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటే అంబులెన్సులో పెద్ద ఆసుపత్రికి తరలిస్తారు. **-న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం**

## ప్రజ్ఞ కాంతులు ప్రతిభకు వేదికలు..!

**మహిళలకు పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ**

వనిత

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లోని మహిళలకు పలు అంశాల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వివిధ అంశాలపై అవగాహన, స్వీయ, వర్చువల్‌గా శిక్షణ పొందేందుకు వీలుగా 'ప్రజ్ఞ' మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా మహిళలు ఇంట్లోనే ఉంటూ వివిధ అంశాలు నేర్చుకోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు.

● ఇప్పటి వరకు 19,140 మంది మహిళలు ప్రజ్ఞ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నమోదు(ఎన్‌రోల్‌మెంట్) కాగా 7,870 మంది యాప్ ద్వారా స్వీయ శిక్షణ పూర్తి చేసుకున్నారు.

| ✦ నగరం, పట్టణం | ✦ రాజమహేంద్రవరం | ✦ కొవ్వూరు | ✦ నిడదవోలు |
|---|---|---|---|
| ● ఎస్‌హెచ్‌జీ సభ్యులు | ● 83,442 | ● 6,775 | ● 6,681 |
| ▼ యాప్‌లో నమోదైంది | ▼ 16,239 | ▼ 1,459 | ▼ 1,442 |
| ■ ధ్రువపత్రాలు పొందినది | ■ 5,473 | ■ 1,142 | ■ 1,255 |

**విభిన్న అంశాల్లో శిక్షణ**

ప్రజ్ఞ యాప్‌లో పది అంశాలకు సంబంధించిన వీడియోలు ఉన్నాయి. వీటిపై పరిజ్ఞానం పెంచుకున్న తర్వాత ధ్రువ పత్రం అందిస్తారు. అంతర్జాలం ద్వారా నైపుణ్యం పెంచుకోవడం, చరవాణి వినియోగం, సమాచారం టైపింగ్, డాక్యుమెంటేషన్, యూపీఐ ద్వారా చెల్లింపులు, చాట్ జీపీటీ, ఆన్‌లైన్ సమావేశాలు, వీడియో నిర్వహణ తదితర అంశాలపై పట్టు సాధించేలా యాప్ రూపొందించారు. ముఖ్యంగా అతివలు డిజిటల్ అక్షరాస్యత సాధించేలా అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా మంజూరు చేసే ధ్రువపత్రం ఆయా పథకాలకు, బ్యాంకు రుణాలకు అర్హత పొందేందుకు ఉపయోగపడుతుందని మెప్మా అధికారులు చెబుతున్నారు.

చరవాణుల్లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని చూపుతున్న స్వయం సహాయక మహిళా సంఘం సభ్యులు

## అక్కడ ఏం చేశామంటే..!

**నగరంలో పర్యటించిన కుంభమేళా నిర్వహణ బృందం**

**కుంభమేళాలో ఇలా**

● ఏఐ టెక్నాలజీ వినియోగించారు. 2 వేల వరకూ ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు.

● **కుంభమేళాలో 27 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేశారు.**

● 256 ఘాట్‌లు తీర్చిదిద్దారు.

● **800 వరకూ పుష్కర నగరాలు నిర్మించారు. 1.16 లక్షల మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.**

● నగరానికి బయటే వాహనాలు నిలిపేశారు. ఘాట్‌లకు కనీసం రెండు కి.మీ దూరం వరకూ కేవలం నడక మార్గం ద్వారానే లోపలకు అనుమతించారు.

**రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం 2027 పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. తాజాగా జరిగిన ప్రయాగరాజ్ కుంభమేళాలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నారనే దానిపై దృష్టి సారించారు. అక్కడ ప్రభుత్వం రద్దీ నియంత్రణ, నిర్వహణకు సంబంధించి ప్రణాళికలు రూపొందించే ప్రక్రియ ప్రైవేటు కన్సల్టెన్సీలకు అప్పగించింది. ఆ బృందాన్ని ఇటీవల నగరానికి రప్పించారు. వారి సలహాలు స్వీకరించారు. బృందం సభ్యులు రెండు రోజుల పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఘాట్‌ల విస్తరణ, రద్దీని ఎదుర్కోవడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

**అవాంతరాలు అధిగమిస్తేనే**

▲ గోదావరి ఘాట్‌లను ఆనుకొని దిగువన శాశ్వత నిర్మాణాలు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ముందుగానే వాహనాలను నగరంలోకి అనుమతించకూడదు.

▲ గోదావరి తీరం ఆనుకొని 30, 40 అడుగుల రోడ్లు మాత్రమే ఉన్నాయి. వీటిని 60, 80 అడుగులుగా విస్తరించాల్సి ఉంది.

▲ ఘాట్‌లను అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటి వరకూ ఆ పనులు చేపట్టలేదు.

▲ అటు కొవ్వూరు, ఇటు కాతేరు మీదుగా రాజానగరం పరిధిలో ఘాట్‌లను పొడిగించే ప్రతిపాదనలు పూర్తి చేయాలి.

**ఇలా చేయండి ..**

■ 60 వరకూ ఏఐ కెమెరాలు ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేయాలి. ఆతిథ్య నగరం రాజమహేంద్రవరంలో రెండు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏఐకి అనుసంధానం చేయాల్సి ఉంది.

■ **గోదావరి పుష్కరాలకు సుమారు 6 కోట్ల నుంచి 8 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రాథమిక అంచనా.**

■ 14 పుష్కర నగరాలు ఏర్పాటు చేయాలి.

■ **1000 తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలి.**

■ ప్రస్తుతం అందుబాటులో 17 ఘాట్‌లు ఉన్నాయి. వీటిని విస్తరించాల్సిన అవసరం ఉంది.

## మొదలైన ప్రక్షాళన..!

గోదావరి తూర్పు డెల్టా స్లూయిజ్ ఫ్లషింగ్ ఆపరేషన్‌ను కాటన్ బ్యారేజీ వద్ద ఆదివారం నిర్వహించారు. గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ గంగుమళ్ల శ్రీనివాసు ఈ కార్యక్రమం ప్రారంభించారు. కాటన్ బ్యారేజీ ధవళేశ్వరం బ్లాకులోని నాలుగు గేట్లను పైకెత్తి 11,531 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీని వల్ల తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సాగునీటి సరఫరా చేసే కాలువలో పూడిక పూర్తిగా తొలగిపోతుందన్నారు. **-న్యూస్‌టుడే, ధవళేశ్వరం**

## కరుగుతున్న కాసులు.. కానరాని మొక్కలు..!

పరిశీలన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఎయిర్ పోర్టు రోడ్డు ప్రాధాన్యం సంతరించుకొంది. నగరం ఆనుకొని కొంతమూరు నుంచి కోలమూరు వరకూ 5 కి.మీ మేర విస్తరించారు. దీని చుట్టూ గ్రీనరీ, డివైడర్ల మధ్యలో మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఏటా వీటి నిర్వహణ రూ.10 లక్షలు కేటాయించారు.

పచ్చదనం లేకుండా ఇలా.

**టెండర్లలోనూ చేతివాటం**

2015 పుష్కరాలకు రాజమహేంద్రవరం వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రోడ్డు పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఏటా ప్రైవేటు ఏజెన్సీలకు టెండర్ల ద్వారా నిర్వహణ నిమిత్తం రహదారిని అప్పగిస్తున్నారు. టెండర్ల ద్వారా హక్కులు పొందిన గుత్తేదారులు మొక్కలు ఎండిపోయినా పట్టించుకోవడం లేదు. మరోవైపు రహదారి ఆక్రమణకు గురవుతుండటంతో ఇరుగ్గా మారిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అయితే గుత్తేదారులకు, యంత్రాంగానికి మధ్య ఒప్పందం కుదరడంతోనే బిల్లులపై సంతకాలు చకచకా అయిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## ఎత్తు.. బరువు తక్కువే

**చిన్నారుల్లో పోషకాహార లోపం**

**హుకుంపేట, బొమ్మూరు, న్యూస్‌టుడే:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా ఫలితం ఉండటం లేదు. ప్రతి నెలా పోషకాహార కిట్లు, గుడ్లు పాలు ఇస్తున్నా వయసుకు తగ్గ బరువు లేని పరిస్థితి. 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులకు ఉడకబెట్టిన గుడ్లు, 100 మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నారు. రోజువారీ మెనూలో సోమవారం పప్పుదోసకాయ, మంగళవారం పులిహోర పప్పు టమాటా, బుధ, గురువారం పప్పు ఆకుకూర, శుక్రవారం పప్పు బీరకాయ లేదా పప్పు ఆనబకాయ, శనివారం వెజిటేబుల్ రైస్ అందిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎత్తు కొలుస్తున్న కార్యకర్త

| | |
|---|---|
| జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు | 1556 |
| సెక్టార్లు | 59 |
| ప్రాజెక్టులు | 7 |
| చిన్నారులు | 68734 |
| కొలతలు తీసిన వారి సంఖ్య | 68354 |
| బరువు లేనివారు | 359 |
| వయసుకు తగిన ఎత్తు లేనివారు | 866 |

**పర్యవేక్షణ లేక..**

ఐసీడీఎస్ పరిధిలో ఒక్కో సెక్టార్ పరిధిలో 25 నుంచి 30 కేంద్రాలుంటాయి. 59 సెక్టార్లలో 44 మంది సూపర్‌వైజర్లు ఉండగా మిగిలిన వాటికి వారే ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. వీరిని పూర్తి స్థాయిలో నియమించాల్సిన అవసరం ఉంది.

'వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని వారిని గుర్తించాం. వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీపీవో, సూపర్‌వైజర్లను ఆదేశించాం.' అని పీడీ శ్రీదేవి అన్నారు.

## నిడదవోలు.. ప్రగతి పథాన..!

నిడదవోలు పట్టణ పురపాలక సంఘం ఏర్పడి 60 ఏళ్లు పూర్తి చేసుకుంది. దీనిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 5కే రన్, వాక్ కార్యక్రమాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జెండా ఊపి ప్రారంభించారు. వేదికపై మంత్రి స్టెప్పులు వేసి, హాజరైన వారిలో జోష్ నింపారు. పట్టణాభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. **-న్యూస్‌టుడే, నిడదవోలు**

## కళ్లెదుటే కరిగిపోతోంది..!

ఆత్రేయపురం మండలం పేరవరంలోని కోతకు గురవుతున్న గట్టు ఇది. ఆలమూరు, రావులపాలెం మండలాల్లో కోత ఎక్కువగా ఉంటుంది. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కొన్నేళ్లుగా 1300 ఎకరాల భూమి నదిలో కలిసిపోయింది. ఈ ఏడాదే వంద ఎకరాల వరకు కనుమరుగైనట్లు అంచనా. ఆత్రేయపురం మండలం పేరవరం, పులిదిండి, వసంతవాడ, ర్యాలి, బొబ్బర్లంక ప్రాంతాల్లో ఈ ఏడాది 30 ఎకరాల వరకు గోదావరిలో కలిసిపోయింది. **-న్యూస్‌టుడే, ఆత్రేయపురం**

## కావాల్సిన పుస్తకానికి గాలించక్కర్లేదు..!

వినూత్నం

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని పురాతన గ్రంథాలయంలో పుస్తకాల భద్రతకు ఆధునిక సాంకేతికత వినియోగిస్తున్నారు. పుస్తకం ఎక్కడున్నా సులువుగా గుర్తించవచ్చు. దీని కోసం ఆర్ఎఫ్ఐడీ (రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైస్) టెక్నాలజీని వినియోగిస్తున్నారు. 2023-24లో ప్రారంభమైన ఆర్ఎఫ్ఐడీ కోసం మొదటి విడతలో రూ.20 లక్షలు మంజూరయ్యాయి. 500 మీటర్ల పరిధిలో పుస్తకం ఎక్కడున్నా స్కానింగ్ ద్వారా గుర్తించవచ్చు. విద్యార్థుల సిలబస్‌కు అనుగుణంగా ఉన్న పుస్తకాలకు మొదట ప్రాధాన్యం ఇచ్చారు. దీన్ని అమలు చేసేందుకు అత్యాధునిక సాంకేతికత, ప్రత్యేకంగా ప్రవేశ, బయటకు వెళ్లే ద్వారాలు ఏర్పాటు చేశారు.

పుస్తకాలు వేసేందుకు ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్

పుస్తకం ఎక్కడుందో తెలుసుకునేందుకు అందుబాటులో ఉన్న స్కానర్

**ప్రత్యేక గుర్తింపు కార్డులు**

గ్రంథాలయంలో ప్రవేశానికి విద్యార్థులు, సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డు ఇస్తున్నారు. ఇవి ఉన్నవారు మాత్రమే లోపలకు ప్రవేశించే అవకాశం ఉంటుంది. అనుమతి లేకుండా పుస్తకం బయటకు తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తే మార్గం వద్ద బీప్ శబ్దం వస్తుంది. ఒకవేళ పుస్తకం ఒక దగ్గర తీసి మరోచోట ఉంచినా స్కానర్ ద్వారా తెలుసుకోవచ్చు. **-న్యూస్‌టుడే, దేవీచౌక్**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

## ధవళం.. ఉరకలెత్తే ఉత్సాహం..

నిడదవోలులో పురపాలక వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన 5కే రన్, వాక్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ కార్యక్రమాన్ని ప్రారంభించి నిడదవోలు సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అందరూ తెల్లటీషర్టులు ధరించి ఉత్సాహంగా పరిగెత్తారు. పురపాలక సంఘ ఛైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, వైస్‌ఛైర్మన్ వజీరుద్దీన్, పట్టణ జనసేన అధ్యక్షుడు రమేష్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

## అమ్మ ప్రేమకు వెలుగుల వందనం

ర్యాలికి చెందిన ఇంద్రజాలికుడు శ్యామ్ జాదూగర్ తన అమ్మ నాగవీర మణి స్మారకంగా ఇంటి వద్ద మందిరం నిర్మించారు. కార్తికమాసం సందర్భంగా ఆదివారం వేకువజామున మందిరం వద్ద సహస్ర జ్యోతులతో అమ్మ అక్షర రూపంలో ప్రమిదలను వెలిగించి ప్రేమను చాటుకున్నారు. శ్యామ్ మాట్లాడుతూ చిన్నతనంలో ర్యాలి గ్రామానికి వచ్చామని, తల్లిదండ్రులు పెంపకం వల్ల ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సమాజానికి తనవంతు సహకారం అందించగలుగుతున్నానన్నారు. –న్యూస్‌టుడే, ర్యాలి (ఆత్రేయపురం)

## విద్యుద్దీపాలతో తిరునాళ్ల సందడి

మండలంలోని అన్నదేవరపేటలో బంగారు పాపమ్మతల్లి ఉత్సవాలు రెండోరోజు సందడిగా సాగాయి. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం, పరిసరాలు విద్యుద్దీపాలతో కళకళలాడాయి. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవంలో కూచిపూడి జానపద నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, తాళ్లపూడి

## భీమేశ్వరాలయంలో భక్తులతో కిటకిట

కార్తిక మాసంలో చివరి ఆదివారం కావడంతో పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. రామచంద్రపురం వైపు నుంచి వచ్చే వాహనాలను సాక్షివారి వీధి నుంచి, రామచంద్రపురం వైపు వెళ్లే వాహనాలను పీహెచ్‌సీ వైపు నుంచి మళ్లించారు. ఉదయం నుంచి ఆలయంలో క్యూలైన్లు రద్దీగానే ఉన్నాయి. బోస్ కూడలిలో అన్నాయిపేటకు చెందిన ఆకేటి సురేష్ మిత్రబృందం, కట్టా శ్రీనివాసబాబు మిత్రబృందం ఆధ్వర్యంలో అల్పాహారంగా ప్రసాదం అందించారు. – న్యూస్‌టుడే, ద్రాక్షారామ

## వన సమారాధనలు.. ఆత్మీయ వేదికలు

కడియం, న్యూస్‌టుడే: ఆత్మీయతను పంచే చక్కని వేదికలుగా వనసమారాధనలు నిలిచాయని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఆ సందర్భంగా

మాట్లాడుతున్న మంత్రి దుర్గేశ్

దుళ్లలో కాపు సామాజిక వర్గీయుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దుర్గేశ్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ కలసి ఒకే చోట చేరడం శుభపరిణామమన్నారు.

## గత ప్రభుత్వంలో అక్రమ కేసులు

● కార్తిక వనసమారాధనలో మంత్రి సుభాష్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో శెట్టి బలిజలపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెడితే, ఆ పార్టీ నాయకులు పట్టించుకోకుండా విహార యాత్రలకు వెళ్లారని రాష్ట్ర కార్మికశాఖ

మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. అమలాపురంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గతంలో కొంతమంది కులం పేరిట పదవులు పొంది దోచుకున్నారన్నారు. తోటి శెట్టిబలిజ నాయకులే తనను రాజకీయంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని శెట్టిబలిజలను గతంలో ఓసీల్లో కలిపారని, బీసీల్లో చేర్చేందుకు పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్(ఎస్‌ఏఎఫ్) ద్వారా సామాజిక వర్గంలోని పేదలకు సహకారం అందిస్తామన్నారు. ఆస్తులు విక్రయించైనా ఎస్‌ఏఎఫ్‌కు సహాయం చేస్తానన్నారు. ఎమ్మెల్యే, మంత్రి పదవులు శెట్టిబలిజల వల్లనే వచ్చాయన్నారు. 90 శాతం కాపులు తనకు ఓటు వేశారని, ఆ కులానికి చెదోడుగా ఉంటానన్నారు. తనకు రాజకీయ జీవితం ప్రసాదించిన తెలుగుదేశం పార్టీలోనే జీవితాంతం ఉంటానని, లోకేష్ బృందంలో కొనసాగుతానని మంత్రి అన్నారు.

## అదిగదిగో ద్వారపూడి.. ఇదిగిదిగో భక్తి ఇరుముడి

ద్వారపూడి, న్యూస్‌టుడే: హరిహరసుతనే.. శరణమయ్యప్ప.. ఆపద్బాంధవనే.. శరణమయ్యప్ప.. అంటూ మాలధారుల శరణుఘోషతో ద్వారపూడిలోని అయ్యప్ప దేవాలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దేశంలోనే శబరిమల క్షేత్రం ఎంతో ప్రసిద్ధి. మాలధారులంతా ఇరుముడులు సమర్పించేందుకు వెళ్తుంటారు. అక్కడకు వెళ్లలేని వారంతా మండపేట మండలంలోని ద్వారపూడి ఆలయానికి వస్తారు.

రోజూ 10వేల మంది..: అయ్యప్ప దీక్షలు కార్తికమాసంలో ప్రారంభమై మకరసంక్రాంతి వరకు కొనసాగుతాయి. ఈ మండల కాలంలో 41 రోజుల దీక్ష చేస్తారు. దీక్ష పూర్తి చేసి కేరళ వెళ్లలేని వారు ఇక్కడకు వచ్చి

ఆలయంలో స్వాముల సందడి

ఇరుముడులు సమర్పిస్తారు. ఆంధ్రా, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి రోజూ 600 నుంచి 2వేల వరకు ఇరుముడులు సమర్పించేందుకు వస్తారు. దర్శనం కోసం 6వేల నుంచి 10వేల వరకు వస్తారు. దాదాపు 3వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారని ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి తెలిపారు.

### ఆంధ్రా శబరిమల..

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. అందుకే ఆంధ్రా శబరిమలగా పేరొందింది. ఏకశిలతో చెక్కిన పవిత్రమైన 18 మెట్లు ఈ ఆలయం ప్రత్యేకత. ద్వారపూడికి చెందిన వ్యాపారి ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి ఒక కమిటీ ఏర్పాటు చేసి విరాళాలతో 1983లో నిర్మాణానికి భూమిపూజ చేశారు. 1989లో కంచికామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అప్పటినుంచి నిత్యం అర్చన, ప్రత్యేక పూజలు, నెయ్యి అభిషేకం, ఇరుముడి సమర్పణ జరుగుతున్నాయి. రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 8 వరకు దర్శనానికి అనుమతిస్తారు. నిత్యం మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు.

### ప్రాంగణంలో ఆకట్టుకునేలా ఉపాలయాలు

అయ్యప్పస్వామి మూలవిరాట్టు

ఈ ప్రాంగణంలో దేశంలోనే రెండో అతిపెద్ద ఆదియోగి విగ్రహాన్ని చూడగానే తన్మయత్వం కలుగుతుంది. ప్రవేశంలో సుబ్రహ్మణ్య, ఆంజనేయస్వామి భారీ విగ్రహాలు ఎంతో ఆకట్టుకుంటాయి. 10కి పైగా ఉపాలయాలు ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో సాయిబాబా మందిరం, శివాలయం, దుర్గాదేవి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, అష్టాదశ శ్రీఉమాలింగేశ్వరస్వామి, భూగర్భ ద్వాదశ జ్యోతిర్లింగ, పాపవిమోచన దేవాలయాలు ఉన్నాయి. దశావతరాలతో కూడిన వేంకటేశ్వరస్వామి, జగన్మాత అంకాళమ్మ, శనీశ్వరాలయం, నవగ్రహ, శ్రీలక్ష్మీకుబేర ఆలయాలనూ చూడొచ్చు. యజ్ఞయాగాదులు నిర్వహించడానికి యాగశాల ఉంది.

## ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వేములవాడ, కాళేశ్వరం, రామప్ప, వేయిస్తంభాల గుడి, పాలకుర్తి, సమ్మక్క, సారక్క ఆలయాల సందర్శనకు గోకవరం డిపో నుంచి ఈనెల 18న ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ మార్గరెట్ సుచరిత తెలిపారు. బస్సు 21న తిరిగి గోకవరం చేరుకుంటుందన్నారు. టిక్కెట్ రూ.2 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు.

## మానసిక వికాసానికి క్రీడలు దోహదం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 39వ సబ్ జూనియర్, 41వ సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు స్థానిక సూర్యకళా మందిరంలో జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 250 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభచూపిన వారిని ఎమ్మెల్యే సత్కరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌సలామ్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్, రాయుడు శ్రీను, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యాదవులు.. ఆత్మ బంధువులు: ఎంపీ

రాజానగరం, న్యూస్‌టుడే: యాదవులంతా తన తండ్రి ఎన్టీఆర్‌కు ఆత్మ బంధువులని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. శ్రీకృష్ణయాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుష్కరవనంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ హాజరై మాట్లాడారు. మన సంస్కృతిపై యువతకు అవగాహన కల్పించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జాతీయ వెనుకబడిన తరగతుల వారి

మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి, వేదికపై ప్రముఖులు

సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్.వెంగళరావు మాధవ్ మాట్లాడుతూ వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకలన్నారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య, బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ యాదవుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. వారికి పక్కాగా ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూస్తామన్నారు. రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బర్ల సత్యనారాయణ, యాదవ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగు, అంకం గోపి, తెదేపా సీనియర్ నాయకులు గన్ని కృష్ణ, ఆర్యాపురం అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నీలపాల పండు, బాబూరావు, వీపు అప్పారావు, తెల్లమేకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఐకమత్యంతో రాజ్యాధికారం సాధిద్దాం'

రాజానగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల వారంతా విభేదాలను విస్మరించి, కలసికట్టుగా రాజ్యాధికారం సాధిద్దామని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం శివారున గోదావరి మహా పుష్కరవనంలో ఆదివారం రాజమండ్రి శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘ కార్తిక వన సమారాధన జరిగింది. అందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, ఉద్యోగం, అభివృద్ధి, అధికారం కోసం 40 ఏళ్లుగా చేస్తున్న పోరాటానికి ఫలితం వచ్చేలా బీసీవై పోరాటం చేస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే ఈ మార్పు ప్రారంభం అవుతుందన్నారు. ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయ వ్యవస్థ కావాలనుకునే వారంతా ఏకం కావాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. బలహీనవర్గాలను ఏకతాటి పైకి తీసుకొచ్చేలా రాష్ట్రమంతా భరోసా యాత్ర ప్రారంభిస్తామన్నారు.

## కల్తీ నెయ్యి సరఫరా పాపానికి మూల్యం తప్పదు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నిషేధిత సంస్థతో కుమ్మక్కై కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా తితిదేకు కల్తీ నెయ్యి సరఫరాకు కారణమైన వైకాపా చేసిన దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని వీరయ్యస్వామి పేర్కొన్నారు. కాత్రేనికోన మండలం పల్లం నుంచి అన్నవరం వరకు వీరయ్యస్వామి సుమారు వెయ్యి మంది హిందూ భక్తులతో సనాతన ధర్మ పరిరక్షణకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం నగర గణేశ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, మాజీ అధ్యక్షుడు దువ్వూరి

భక్తుల బృందానికి స్వాగతం పలుకుతున్న ఉత్సవసమితి సభ్యులు

సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు కాకినాడలోని భానుగుడి సెంటర్ వద్ద వారికి స్వాగతం పలికి పిఠాపురం వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్యస్వామి మాట్లాడుతూ తిరుమల కేంద్రంగా గతంలో జరిగిన పాపాలు అనేకం నేడు వెలుగులోకి వస్తున్నాయన్నారు.

## గోదావరి జిల్లాలా మజాకా..

● సంక్రాంతికి అప్పుడే నిండిపోయిన రైళ్ల రిజర్వేషన్లు

### హైదరాబాద్ నుంచి ఎక్కువగా

సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలే గుర్తుకొస్తాయి. ఇక్కడి వారు ఉద్యోగ, వ్యాపారాల దృష్ట్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమ వారితో కలిసి పండగ చేసుకునేందుకు వారంతా వస్తారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి పెద్దఎత్తున వస్తారు. జనవరి 13 నుంచి పండగ సందడి మొదలవుతుంది. ఈ క్రమంలో జనవరి 12, 13వ తేదీల్లోనే తమ ప్రాంతాల్లో ఉండేలా రిజర్వేషన్లు చేయించుకున్నారు. జనవరి 15 వరకు రోజూ, వారపు ప్రత్యేక రైళ్లు అన్ని నిండిపోయాయి. విశాఖ, గోదావరి, కాచిగూడ, గరీబ్‌రథ్, ఫలక్‌నామా, కోణార్క్, ఈస్ట్‌కోస్ట్, గౌతమి తదితర రైళ్లల్లో రిజర్వేషన్లు వెయిటింగ్ లిస్టుకు చేరాయి. ముందు తేదీలకు మాత్రం దొరుకుతున్నాయి.

న్యూస్‌టుడే, తుని: భాగ్యనగరం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చే రైళ్లకు సంక్రాంతి సందడి వచ్చేసింది. పెద్ద పండగ వచ్చేందుకు ఇంకా రెండు నెలలు ఉండగా రైల్వేశాఖకు మాత్రం అప్పుడే రావడం విశేషం. రెండు నెలల ముందుగానే రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. అందులో హైదరాబాద్, విజయవాడ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరికి వచ్చే రైళ్లకు రిజర్వేషన్లు నిండిపోగా, ఇక్కడి నుంచి అటువైపు వెళ్లే వాటికి మాత్రం రిజర్వేషన్లు లభ్యం అవుతున్నాయి.

తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

### 80వేల మంది ప్రయాణికులు..

ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, తుని, సామర్లకోట, కాకినాడ ప్రధాన స్టేషన్లు. వీటితో పాటు చిన్న స్టేషన్లు కలిపి రోజుకు సుమారు 100కు పైగా రైళ్లల్లో దాదాపు 80వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ప్రత్యేక రైళ్లు, జనరల్ బోగీలు కలిపి సంక్రాంతి సమయంలో ఈ సంఖ్య లక్ష దాటే అవకాశం ఉంది. పండగ రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు కూడా ప్రారంభం అవుతాయన్నారు.

## ఆకలితో పిల్లలు.. ఆహారం సమకూర్చారు

రాజానగరం: ఆకలితో అలమటిస్తున్న తలసేమియా చిన్నారులకు ఎమ్మెల్యే బత్తుల, జనసేన నాయకులు ఆకలి తీర్చారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖలో రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన 16మంది పిల్లలు తలసేమియాతో బాధపడుతున్నారు. వారంతా వైద్యపరీక్షల నిమిత్తం తల్లిదండ్రులుతో కలిసి ఓ ట్రావెల్ బస్సులో బెంగళూరు బయలుదేరారు. అది మరమ్మతులకు గురై రాజానగరం వద్ద ఆదివారం తెల్లవారుజామున నిలిచిపోయింది. జిల్లా రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ పి.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. వేరే బస్సు ఏర్పాటు చేయాలని ఆయన ట్రావెల్ యాజమాన్యాన్ని కోరినా స్పందన లేదు. డీఆర్‌డీఏ పీడీ మూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఏఎస్‌పీ మురళీ కృష్ణకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాలతో సాయంత్రం 4కు మరో బస్సు ఏర్పాటు చేయగా బయలుదేరింది. ఈ మధ్యలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసైనికులు పిల్లలకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సమకూర్చారు. సాయంకాలం పండ్లు అందజేశారు.

పిల్లలకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

## ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

| కొబ్బరి (క్వింటాళ్లలో) | | ధర (రూ॥లలో) |
|---|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | | 22,000 |
| పాతకాయ: | గండేరా | 29,000 |
| | గటగట | 27,000 |
| కొత్తకాయ: | గండేరా | 28,000 |
| | గటగట | 26,000 |
| సీటీ కాయ (వెయ్యింటికి): | | |
| పాత (ముక్కుడు) కాయ | | 20,000-21,000 |
| కొత్త (పచ్చి) కాయ | | 19,000-20,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | | |
| 15 కిలోలు | | 6,000 |
| కిలో | | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

| | |
|---|---|
| ఫారంరేటు | 111-00 |
| రిటైల్ లైవ్ | 138-00 |
| డ్రెస్డ్ | 200-00 |
| స్కిన్‌లెస్ | 228-00 |

## భక్తులకు తప్పిన ప్రమాదం

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలోని కేశవస్వామి, విశ్వేశ్వరస్వామి ఆలయ మండపం శిథిలావస్థకు చేరింది. 50 ఏళ్ల కిందట నిర్మించిన భవనం స్లాబు పెచ్చులూడుతోంది. ఆదివారం మధ్యాహ్నం పెచ్చులు ఊడటంతో సమీపంలోని భక్తులు భయాందోళన వ్యక్తం చేశారు. ఆలయ అధికారుల తీరుపై మండిపడ్డారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయ పర్యవేక్షణ ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పడిన స్లాబు పెచ్చులు

## ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

● తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టుకు ద్వితీయ స్థానం

చింతలపూడి, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థులను చదువులో ముందు నిలపడమే కాకుండా, ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని క్రిసాలిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అండర్-19 నెట్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నియోజకవర్గంలో నిర్వహించడం ఈ ప్రాంతంలోని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతుందన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ జిల్లా జట్లతో తలపడ్డారు. బాలుర విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా.. తూర్పుగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా, పశ్చిమగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పాల్గొన్నారు.


EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

FLAT FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

3 BHK Flat అమ్మకం. రాజమండ్రి, మోరంపూడి జంక్షన్ వద్ద, హైవే ప్రక్కన 3 BHK Flat అమ్మకమునకు కలదు. Contact Cell: 98480 56558.

LAND FOR SALE

GENERAL

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

PLOT FOR SALE

KAKINADA RURAL

560 Sq.Yds Plot for Sale in Chollangi, Besides Yanam KKD Road; Contact Cell: 93917 11101.

EENADU for Advertisement Contact: 8008597607

JOBS

WANTED COMPUTER Operator female (MS Office, MS Excel) with speed Typing in English at Amalapuram. Salary upto 18K. ✆ 96184 66665.

Data Entry Operator (M/F) with Good knowledge in MS Excel. 1 yr Exp. Location: Rajahmundry. Email: giri.fomra@gmail.com ✆ 93902 07565, 99482 05000.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం॥లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం: 20,000 to 25,000 + ఇన్సెంటివ్, నో టార్గెట్స్, 2 వీలర్ మస్ట్. ✆ 73826 65577.

రాజమండ్రి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ శిక్షణ & ఉద్యోగావకాశాలు, ✆ 96661 20044.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. ✆ 85209 80099, 85208 74499.

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్ మేన్ కావలెను. సంప్రదించవలసిన టైం: 9 am to 6 pm. Contact Cell: 95507 32122.

రాజమండ్రిలోని శ్రీ గిరిధారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందు పనిచేయుటకు CC Roadsలో అనుభవం కలిగినవారు కావలెను. Contact Cell: 80991 91919.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జిలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Contact Cell: 96423 75791.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-25 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175


## శస్త్రచికిత్స చేసిన కాసేపటికే మహిళ మృతి

● కాకినాడ జీజీహెచ్‌లో మృతురాలి బంధువుల ఆందోళన

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: హెర్నియా శస్త్రచికిత్స చేసిన కొద్దిసేపటికే మహిళ మృతిచెందిన ఘటన కాకినాడ జీజీహెచ్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆపరేషన్ తరువాత అపస్మారక స్థితిలో ఉండగా ఆర్ఐసీయూలో చేర్చారని, ఏదో జరిగిందని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. సినిమా తరహాలో కొన్ని గంటలపాటు శస్త్రచికిత్స చేసి చివరికి మృతదేహాన్ని తమకు అప్పగించారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వివరాల ప్రకారం.. పిఠాపురం రథాలపేటకు చెందిన కవిత(20)కు వివాహమైంది. పొత్తికడుపులో కొద్దిరోజులుగా వాపు రావడంతో ఈ నెల 10న జీజీహెచ్‌లో చేర్చారు. పరీక్షల అనంతరం ఆమెకు హెర్నియా అని నిర్ధారించి జీజీహెచ్ వైద్యులు శనివారం మధ్యాహ్నం శస్త్రచికిత్స చేసి ఆర్ఐసీయూ-1కి తరలించారు. అప్పటినుంచి పీజీల నుంచి హెచ్‌వోడీల వరకు ఒక్కొక్కరిగా వచ్చి ఆమె పరిస్థితిని పరిశీలించారు. ఇదంతా చూసిన మహిళ బంధువులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. చివరకు చికిత్సపొందుతూ సాయంత్రం 6 గంటల సమయంలో మృతిచెందింది. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులు వైద్యులను అడగ్గా ఆమె తీవ్ర అస్వస్థత కారణంగా మృతిచెందిందన్నారు. కొద్దిసేపు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బాధిత కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఊరి నుంచి బంధువులు వచ్చాక తీసుకెళ్తామని వైద్యులకు చెప్పారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో మృతదేహాన్ని తీసుకెళ్లారు. దీనిపై ఆసుపత్రి వైద్యాధికారులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ విజేత విజయనగరం

● తృతీయ స్థానంలో తూర్పుగోదావరి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి 12వ యూత్, జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విజయనగరం జట్టు కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో కడప, తృతీయస్థానంలో తూర్పుగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. విజయనగరం జిల్లా కొండవెలగాడలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మంనాయుడు, కార్యదర్శి చల్లారాము, అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

(c) eenadu

## రాజ్యలక్ష్మి కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు అవకాశం

**రాజమహేంద్రవరం సాంస్కృతికం:** కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి ఏడాదిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సుల్లో కొన్ని సీట్లు మిగిలి ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల వారు కళాశాల కార్యాలయంలో ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.

# రాజమహేంద్రవరం

## రైతు బజారులో నిన్నటి ధరలు(రూ.లో)

**దేవీచౌక్, న్యూస్‌టుడే:** టమాట-27, వంకాయలు నలుపు-50/ గులాబీ-78/ తెలుపు-46/ దొమ్మేరు-70, బెండ-50, కాకర-40, బీర పందిరి-52, దొండ-54, క్యారెట్-58, బీట్‌రూట్-48, గోరు చిక్కుళ్లు-54, దోస-34, ఆనబకాయ-38/40, చిక్కుళ్లు-82/98, పచ్చిమిర్చి-48, బంగాళదుంపలు-21, ఉల్లిపాయలు-18

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897 (ఉ॥ 10 - మ॥ 1)

### సమస్యలు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

నగరంలోని వివిధ సమస్యలపై ప్రజల నుంచి 'మేమున్నాం.. మీకుతోడుగా'కు అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థల ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ● స్థానిక ఏవీఏ రోడ్డు జయశ్రీ గార్డెన్స్ మూడో వీధిలో లీకవుతున్న తాగునీటి పైపులైనుకు సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారుడు గౌరీశంకర్ తెలిపారు. ● స్థానిక విద్యుత్తు కాలనీ ఆరో వీధిలోని డ్రెయిన్‌లోని పూడికను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినట్లు ఫిర్యాదుదారుడు శ్రీనివాస్ తెలిపారు. ● స్థానిక ఏకేసీ కళాశాల ఎదుటి రోడ్డులో విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద మొదటి స్తంభానికి దీపం ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదుదారుడు అమర్‌నాథ్ తెలిపారు. ● స్థానిక లాలాచెరువు సాయిదుర్గానగర్‌లో రోడ్డు పైనుంచి పూడిక మట్టి గుట్టలను పారిశుద్ధ్య సిబ్బంది తరలించి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారుడు శంకర్ తెలిపారు. - న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

**సమస్య:** స్థానిక వి.ఎల్.పురంలోని నగరపాలకసంస్థ తెలుకులవారిచెరువు పార్కు ప్రధాన ద్వారం ఎదుట చెత్త పేరుకుపోలోంది. పార్కుకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలి.
- మోహన్‌కృష్ణ, స్థానికుడు

**సమస్య:** స్థానిక శ్రీనగర్ కాలనీలోని పలు వీధి రోడ్ల చెంత చెత్తకుప్పలు దర్శమిస్తున్నాయి. ఏ రోజుకారోజు చెత్త తలించకపోవడంతో కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తుండటంతో స్థానిక నివాసితులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.
- సుబ్రహ్మణ్యం, స్థానికుడు

**సమాధానం:** పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకుంటాం. - వినూత్న, ఎంహెచ్‌వో

- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

## నగరవాసులూ.. సేవలు పొందండిలా..

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పౌర సేవలు నిమిత్తం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్‌ఎంసీ సేవక్ యాప్ పేరిట సమస్యలను తెలియజేసే అవకాశం కల్పించారు. ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. దాంట్లో మీకు అవసరమైన సేవలపై క్లిక్ చేసి ఫిర్యాదు లేదా సమాచారాన్ని పొందవచ్చు. కాలువల శుభ్రత, వీధి దీపాలు, చెత్త సేకరణ, దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి ఫొటోలను సేవక్ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అక్కడే అవసరమైతే సమస్యను పొందుపర్చేందుకు అవకాశం కల్పిస్తారు. నేరుగా సంబంధిత డిపార్ట్‌మెంటుకు సమస్య జత చేయడం జరుగుతుంది. మీరు జత చేసిన ఫొటో, సమస్య ఆ శాఖ అధికారి వద్దకు చేరిందా? లేదా? అనేది కూడా తెలుసుకొనే అవకాశం ఉంది. సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారనేది కూడా ఎప్పటికప్పుడు తాజా సమాచారం యాప్‌లో వీక్షించేందుకు అవకాశం ఉంటుంది.

మీ కోసం

| | |
|---|---|
| నగర జనాభా : | 3.40లక్షలు |
| డివిజన్లు మొత్తం | 50 |
| యాప్ డౌన్‌లోడ్ చేసుకొన్నది : | 2.10 లక్షలు |
| ఏడాది కాలంలో వచ్చిన సమస్యలు : | 15,852 |
| పూర్తి చేసిన సమస్యలు : | 15,802 |

ఆర్ఎంసీ సేవక్ యాప్

### వాట్సాప్ ద్వారా సమస్య తెలియజేయవచ్చు

యాప్‌తోపాటు వాట్సాప్ ద్వారా కూడా సమస్యను తెలియజేసే అవకాశం ఉంది. సమాచారం నేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. వాట్సాప్‌లో ఫొటోతోపాటు సమస్యను జత చేయాల్సి ఉంటుంది. నగరపాలక సంస్థకు చెందిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబరు 9494060060 నిర్ణయించింది. కొన్ని సార్లు నేరుగా ఫోన్ చేసి కూడా సమస్యను వివరించవచ్చు. నగరంలో చెట్లు పడిపోవడం, తాగునీరు రాకపోవడం, చెత్త తరలించకపోవడం వంటి రోజు వారీ సమస్యలతోపాటు విపత్తుల సమయంలో కూడా ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. తాగునీటికి ఇబ్బంది ఏర్పడితే ఫోన్ చేస్తే ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ఒకవేళ మీ పరిధిలో దగ్గర్లో ఎక్కడైనా పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే తక్షణం సిబ్బంది స్పందించడం జరుగుతుంది. నేరుగా క్షేత్రస్థాయికి చేరుకొని లీకేజీలను బాగు చేస్తారు.

## 23న సప్పా ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమం

**రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే :** ప్రముఖ నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్ ఏటా అందించే 'సప్పా ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2025' కార్యక్రమం ఈనెల 23న జరుగుతుందని జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఆదివారం ఉదయం నటరాజ నృత్యనికేతన్‌లో ఆమె ఆవిష్కరించారు. గోదావరి తీరం కళలకు రాజధాని అని, దుర్గాప్రసాద్ ప్రపంచవ్యాప్తంగా తన శిష్యులతో కలిసి ఆంధ్రనాట్య ప్రదర్శనలతో కళారంగానికి అమితమైన సేవలందించడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొంటారన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన నిష్ణాతులకు పురస్కారాలు అందిస్తారని చెప్పారు. సప్పా దుర్గాప్రసాద్, పి.వి.బి.సంజీవరావు, లతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు

**రాజమహేంద్రవరం సాంస్కృతికం :** నగర పరిధిలోని గ్రంథాలయాల్లో వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో విశ్రాంత ఆచార్యులు ముంగండ సూర్యనారాయణ నిర్వహణలో ఆదివారం విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి జి.శ్రీదేవి పర్యవేక్షించారు. సీతంపేటలో గ్రంథాలయ ఉద్యమకారులు - నేటి సమాజంలో గ్రంథాలయాలు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇన్నీస్‌పేటలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ ఉద్యమకారుల సేవలపై చాగంటి వెంకటలక్ష్మీ నరసింహారావు విద్యార్థులకు వివరించారు. అయ్యంకి వెంకట రమణయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆల్కాట్ గార్డెన్స్‌లో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ జరిగింది. పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు.

## సంతాన ప్రాప్తిరస్తు చిత్ర యూనిట్ సందడి

**రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే :** కుటుంబ కథాచిత్రంగా రూపొందించిన సంతాన ప్రాప్తిరస్తు సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలని ఆ చిత్ర కథానాయకుడు విక్రాంత్ అన్నారు. ఆదివారం రాత్రి సూర్యా మినీ థియేటర్‌లో సంతాన ప్రాప్తిరస్తు చిత్రం యూనిట్ సభ్యులు విజయోత్సవ యాత్ర నిర్వహించారు. హీరో విక్రాంత్ విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 14న విడుదలైన చిత్రం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా ప్రదర్శించబడుతోందన్నారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ తదితర ప్రాంతాల్లో పర్యటించినపుడు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభించిందని తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న హీరో విక్రాంత్

## పంచారామాలకు భక్తుల పయనం

**వి.ఎల్.పురం, న్యూస్‌టుడే:** రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు రెండు ప్రత్యేక బస్సుల్లో భక్తులు ఆదివారం రాత్రి 7 గంటలకు బయలుదేరారు. కార్తిక మాసంలో ఆఖరి సోమవారం పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాల్లోని ఆలయాలను దర్శించుకునేందుకు ఒక బస్సులో 36 మంది, మరొక బస్సులో 40 మంది కలిపి మొత్తం 76 మంది భక్తులు పయనమయ్యారు. ఇక్కడి ప్రధాన బస్టాండ్ వద్ద పంచామ క్షేత్ర ప్రత్యేక బస్సులను డిపో మేనేజర్ కె.మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచి బయలుదేరిన బస్సులు అయిదు పుణ్యక్షేత్రాలను దర్శించిన అనంతరం సోమవారం సాయంత్రం తిరిగి ఇక్కడి డిపోనకు చేరుకుంటాయన్నారు. కార్తిక మాసం సందర్భంగా గత నెల 26 నుంచి నాలుగు వారాలు కలిపి మొత్తం 10 ప్రత్యేక బస్సులను పంచారామ క్షేత్రాలకు పంపినట్లు తెలిపారు. శబరిమల యాత్రకు కూడా ఇక్కడి నుంచి సోమవారం అయ్యప్ప భక్తులతో అయిదు బస్సులు బయలుదేరతాయని డీఎం తెలిపారు.

పంచారామ క్షేత్రదర్శిని బస్సులో బయలుదేరే భక్తులతో ఆర్టీసీ డీఎం మాధవ్ తదితరులు

## మహాదేవమణికి గండపెండేరం

**శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే:** అవధాని డాక్టర్ ధూళిపాల మహాదేవమణికి గండపెండేర మహోత్సవం సాధుశాంతి తత్త్వదర్శినీ సత్సంగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. వీరభద్రపురంలోని సాధుస్త్రీల మఠంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఎందరో మహిళలను అవధానులుగా తీర్చిదిద్దిన ఘనత మహాదేవమణికి దక్కుతుందని కొనియాడారు. 22 ఏళ్లుగా నిరాటంకంగా సత్సంగం నిర్వహిస్తున్న దేవమణికి సత్సంగం సభ్యులు గండపెండేరం బహూకరించారు. ఈ కార్యక్రమలో సభ్యులు సూర్యచంద్రరావు, పి.ప్రసాద్, శ్రీనివాస్, రాఘవ, వీరభద్ర, పి.దుర్గాప్రసాద్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


ధూళిపాల మహాదేవమణిని సత్కరిస్తున్న సత్సంగం సభ్యులు

## మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రోత్సహించాలి: మెప్మా పీడీ

**వి.ఎల్.పురం, న్యూస్‌టుడే:** స్వయం సహాయక మహిళా సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచనల మేరకు మెప్మా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పుష్కర ఘాట్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 40 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాము తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. మెప్మా పీడీ స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అందరూ ఆదరించి వారు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సహకరించాలని కోరారు. ఇకపై ప్రతినెల ఇక్కడ మహిళా సంఘాల ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ కనకరాజు

## ఉత్సాహంగా చదరంగం పోటీలు

**శ్యామలాసెంటర్ :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌కేఆర్ పురమందిరంలో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీ లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు మాట్లాడుతూ చదరంగం ఆడటం వల్ల మేధాశక్తి పెరుగుతుందని, మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. విజేతలకు ఈనెల 20న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షులు రెడ్డి రాజు, డాక్టర్ లంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పొంచి ఉన్న ముప్పు

నగరంలోని నందం గనిరాజు కూడలి నుంచి వై.జంక్షన్ వైపు వెళ్లే రహదారిలో ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల సమీపంలో రోడ్డు కింద నుంచి ఉన్న భూగర్భ డ్రైనేజీపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. రోడ్డు డివైడర్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌పై ఇనుప చట్రం దెబ్బతిని కుంగిపోయింది. దీనివల్ల ముప్పు పొంచి ఉందని, రాత్రి వేళలో అటుగా వెళ్లే ద్విచక్రవాహనదారులు గమనించకుంటే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారుల స్పందించి కొత్త చట్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

### మొక్కేనని వదిలేస్తే చిక్కే..

స్థానిక వి.ఎల్.పురంలోని కందుకూరి వీరేశలింగం పార్కు వద్ద ఉన్న నగరపాలక సంస్థ హోమియోపతి డిస్పెన్సరీ భవనం సన్‌షేడ్‌పై రావి, వేప మొక్కలు పెరుగుతున్నాయి. వాటిని అలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తే పెరిగేకొద్ది గోడలు బీటలువారి భవనానికే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఈ భవనం పైఅంతస్తులో వార్డు సచివాలయం కూడా కొనసాగుతోంది. భవనానికి ముప్పు లేకుండా సిబ్బంది ఆ మొక్కలను తొలగిస్తే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

### వంతెనపై దారి.. అధ్వానంగా మారి

నగరంలోని ఆజాద్ చౌక్ నుంచి జేపీ, అప్సరా థియేటర్ రోడ్ల మధ్యలో ఉన్న ఇందిరాగాంధీ వంతెనపై రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ దారిలో రోజూ వేల మంది ప్రయాణిస్తుంటారు. పూల మార్కెట్‌కు సమీపంలో ఉండడంతో కొనుగోలుకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. రోడ్డు బాగాలేక వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

### చెత్త తొలగక.. అవస్థలు తీరక

రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ జంక్షన్ నుంచి మల్లయ్యపేట వెళ్లే దారి పక్కన చెత్త పేరుకుపోయింది. పరిసర ప్రాంతాల్లోని నివాసితులు, అటుగా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇంటింటి చెత్త సేకరణ నేపథ్యంలో గతంలో ఏర్పాటు చేసిన కుండీలు తొలగించారు. చెత్త సేకరణకు కార్మికులు వచ్చే సమయంలో ఇంటి వద్ద లేని వారు ఇలా రోడ్ల పక్కన వేస్తుండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. రోడ్డు పక్కన చెత్తను తొలగించడంతోపాటు ఇకపై అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని పరసరాల్లోని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటగుమ్మం

### రద్దీ బజారు..

రాజమహేంద్రవరంలోని గణేష్ చౌక్ రైతుబజారు వద్ద నిత్యం రద్దీ కారణంగా వాహనాలు నిలిపేందుకు చోటు ఉండటం లేదు. నగరం నడిబొడ్డున ఉండటంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది ఏర్పడుతోంది. ఆదివారం కావడంతో ఇరువైపులా ద్విచక్రవాహనాలు, చిరు వ్యాపారుల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రైతుబజారు వద్ద వాహనాలను నియంత్రించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

## తపాలా ఉద్యోగులు ఐక్యంగా సాగాలి

**నిడదవోలు, న్యూస్‌టుడే:** గ్రామీణ తపాలా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఏపీ సర్కిల్ కార్యదర్శి వై.మర్రిరెడ్డి అన్నారు. నిడదవోలులో ఆదివారం తాడేపల్లిగూడెం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు సంఘ 3వ ద్వైవార్షిక మహాసభను నిర్వహించారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రవీంద్ర, కార్యదర్శిగా ఎస్.రమేష్, కోశాధికారిగా పి.పవన్‌కుమార్‌లను ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గారావు, రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి పి.భూలోకం, ఏలూరు డివిజన్ కార్యదర్శి ఎస్ఎస్ బాజీ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు బీవీ రమణ, తాడేపల్లిగూడెం డివిజన్ పరిశీలకుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వివాహిత మృతి

**ధవళేశ్వరం, న్యూస్‌టుడే:** వివాహిత ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతిచెందడంపై కేసు నమోదు చేశామని బొమ్మూరు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రాజమహేంద్రవరం పద్మావతి నగర్ సాయిఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న తలారి పోశమ్మ అలియాస్ పూజ(23)కు గతంలో పెద్దాపురానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అనంతరం మూడు నెలలకు వీరు విడిపోయారు. తర్వాత హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తితో ఆమె సహజీవనం చేస్తూ రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. ఆయన శనివారం హైదరాబాద్ నుంచి పోసమ్మకు ఫోన్‌చేస్తే ఎంతసేపటికీ తీయలేదు. దీంతో వాచ్‌మెన్‌ను ఆమె ప్లాటుకు పంపారు. గది తలుపు తీసి చూడగా ఆమె ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోశమ్మ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

**రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చెరుకూరి గార్డెన్స్‌లో ఆదివారం కార్తిక వనసమారాధన ఘనంగా జరిగింది. శివుడు, పార్వతీదేవి, నందీశ్వరుడు, వినాయకుడు విగ్రహాలు, ఉసిరి చెట్టుకు పూజ చేసి సమారాధన ప్రారంభించారు. సంఘం ప్రతినిధులు రొబ్బి విజయ శేఖర్, గంపా సోమలింగేశ్వరరావు, పుచ్చల రామకృష్ణ, కాలెపు సత్యనారాయణమూర్తి, బల్లా శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘీయులు హాజరై సందడి చేశారు.

చెరుకూరి గార్డెన్స్‌లో దేవాంగ సంఘీయులు

## ఘనంగా వన సమారాధనలు

### భట్టు దీవెన బ్రహ్మ దీవెన

**రాజమహేంద్రవరం సాంస్కృతికం:** పూర్వకాలంలో రామరాజభూషణుడు, కాసుల పురుషోత్తమ కవి ఆస్థాన కవులుగా ఎంతో పేరు తెచ్చుకున్నారని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి పట్టణ భట్రాజుల సంఘాల సంయుక్త నిర్వహణలో ఆదివారం ఏవీఏ రోడ్డు విద్యుత్ కాలనీలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు భట్టు దీవెన బ్రహ్మ దీవెనగా భావిస్తారన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. లోలభట్టు శ్రీనివాసరాజు, చల్లగాలి వెంకట రామరాజు, చిట్టిమనేని వెంకటరాజు, సరికొండ నరసింహరాజు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని సత్కరించిన భట్రాజుల సంఘం ప్రతినిధులు

## అలయన్స్ క్లబ్ సేవలు

**రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** కార్తిక ద్వాదశి పర్వదినం సందర్భంగా అలయన్స్ క్లబ్ జేమ్స్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా మల్టిపుల్ కోఆర్డినేటర్ పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం, గోదావరిగట్టున ఉన్న అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు కొయ్యాన కుమారి, మాధవరావు, ఆకుల ఈశ్వరరావు, నామని వాసు, దేశినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన గేటు.. తెరుచుకునేది ఎప్పుడో..?

● వైద్య సేవలకు చుట్టూ తిరిగి వెళ్లలేక అవస్థలు ● ఇదీ ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద పరిస్థితి

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

వైద్యసేవల కోసం నగరంలోని ఈఎస్ఐ ఆసుపత్రి వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రి ముందు ప్రాంగణంలో ప్రధాన గేటు మూసేసి వెనుక వైపు నుంచి లోపలికి అనుమతిస్తుండడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ ఆసుపత్రికి సాధారణ రోజుల్లో 150 వరకు, మంగళ, శుక్రవారాల్లో 200 నుంచి 250 వరకు ఓపీ ఉంటుంది. కొత్త భవనంలో వైద్యసేవలు పునః ప్రారంభమై అయిదు నెలలు అవుతున్నప్పటికీ రోగులకు ప్రయాస తప్పడం లేదు. వైద్యం కోసం ఆటోలు, బస్సుల్లో ఇక్కడి వచ్చేవారే ఎక్కువ మంది ఉంటారు. పేపరుమిల్లు రోడ్డు వైపు ఉన్న ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద దిగి లోపలికి రావడానికి వీలు లేకుండా పోయింది. ముందు ప్రాంగణంలోని ద్వారం మూసివేసి ఉండడంతో నడుచుకుంటూ చుట్టూ తిరిగి వెనుకవైపు సిబ్బంది క్వార్టర్ వద్ద ఉన్న మరో గేటులోంచి లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి. నడవలేనిస్థితిలో ఉన్నవారు మరింత ఇబ్బంది పడుతున్నారు. మరికొందరికి ఆసుపత్రిలోపలికి ఎటువెళ్లాలో అర్థంకాక తికమక పడుతున్నారు.

**వాహనాలు నిలిపేందుకూ ఇక్కట్లు..**

ఈఎస్ఐ చందాదారులైన కొందరు కార్మికులు తమ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అస్వస్థతకు గురైతే సొంత వాహనాలపై ఆసుపత్రికి తీసుకొస్తుంటారు. ఇటువంటి వారు వాహనాలు నిలిపేందుకు ఆసుపత్రి ముందు ప్రాంగణంలో పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ వాటిని నిలుపుకోలేని పరిస్థితి. ముందు ద్వారం మూసివేసి ఉండటంతో అటునుంచి లోపలికి వాహనాలు వచ్చే పరిస్థితి లేక వెనుక వైపు ద్వారం వద్ద వాటిని నిలుపుదామంటే షెడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయట ఎండలో నిలపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆసుపత్రి ముందు ప్రాంగణం వైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని తెరిస్తే బాగుంటుందని పలువురు రోగుల బంధువులు అంటున్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ముందు ప్రాంగణంలో మూసి ఉన్న ప్రధాన ద్వారం

**భద్రత కోసమే..**

భద్రతా దృష్ట్యా ముందు ప్రాంగణం వైపు గేటు మూసివేసి ఉంచాల్సి వస్తోందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక్కడ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఆరుగురే ఉన్నారు. వీరు షిఫ్టునకు ఇద్దరు చొప్పున మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. సెక్యూరిటీ సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం ఆసుపత్రికి వచ్చేవారిని వెనుక వైపు ప్రాంగణంలో సిబ్బంది క్వార్టర్స్ వద్ద ఉన్న గేటు నుంచి అనుమతిస్తున్నామని అంటున్నారు. రోగుల ఇబ్బందుల దృష్ట్యా సెక్యూరిటీ సిబ్బందిని పెంచి ముందు ద్వారం కూడా తెరిపించే ఏర్పాట్లు చేస్తామని చెబుతున్నారు.

## హాజరుకండి.. విద్యార్థుల భవిత తెలుసుకోండి!

### నెరవేరని పీటీఎం ఉద్దేశం ● కొరవడుతున్న అవగాహన

**గోపాలపురం, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే:** పిల్లలు ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటున్న తల్లిదండ్రులు.. వారు ఎలా చదువుతున్నారు ? వారి ప్రవర్తన ఎలా ఉంది ? తమ పరంగా ఏమి చేయాలనే విషయంపై దృష్టి పెట్టడం లేదు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు (పీటీఎం) పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేస్తోంది. మెజారిటీ తల్లిదండ్రులు వీటికి హాజరు కాకపోవడం, వాటిని అర్థం చేసుకోకపోవడంతో ఉద్దేశం నెరవేరడం లేదు.

**ఇదీ పరిస్థితి..** ✦ ఇప్పటివరకు పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు ఆ బడిలో విద్యార్థుల సంఖ్యలో 40-50 శాతం మంది, కళాశాలల్లో 20-30 శాతం తల్లిదండ్రులు మాత్రమే హాజరయ్యారు. ✦ పీటీఎం సమావేశాలకు హాజరైన తల్లిదండ్రులు కూడా పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన వెంటనే బయట తిరుగుతున్న పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు చరవాణులతోనే ఎక్కువ సమయాన్ని గడుపుతూ కాలక్షేపం చేస్తున్నారు. సినిమాలు, గేమ్‌లు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తున్నారు.

**ఇలా చేస్తేనే..** ✦ తల్లిదండ్రులు పీటీఎంలకు హాజరవ్వడంతోపాటు అక్కడ చెప్పే విషయాలను ఆకళింపు చేసుకోవాలి. ✦ ఉపాధ్యాయులు సమావేశాల్లో తల్లిదండ్రులను చదువు వచ్చేవారు, రానివారని విభజించాలి. వారి అర్థమయ్యేల్యే సమావేశాల ఉద్దేశాలను వివరించాలి. పిల్లలను ఎలా పర్యవేక్షించాలో అవగాహన కల్పించాలి. ✦ తల్లిదండ్రులకు పిల్లల ప్రగతిని వివరించి ప్రోత్సహించాలి. వారు ఆసక్తితో భాగస్వాములయ్యేలా చూడాలి.

(c) eenadu

# రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

## షష్ఠి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

రాజానగరం: రాజానగరంలో ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న 99వ షష్ఠి మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవాలను అయిదు రోజులు నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటిరోజు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణమహోత్సవం జరుగుతుందన్నారు.

## బూరుగుపూడిలో సహకార వారోత్సవాలు

కోరుకొండ: మండలంలోని బూరుగుపూడి సొసైటీ వద్ద 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ కంటే నాగకేశవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పాల్గొని సిబ్బంది, రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈనెల 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. సొసైటీలు డిజిటలైజ్ అయ్యాయని, అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

**వీధి దీపాలు వెలగడం లేదు**

సమస్య: హుకుంపేట రామకృష్ణ నగర్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - నిరంజన్, స్థానికుడు

సమాధానం: కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. - కాశీ, గ్రామకార్యదర్శి, హుకుంపేట - న్యూస్‌టుడే, బొమ్మూరు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొంకుదురు ప్రాథమికోన్నత పాఠశాలలో 1986-87లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం బుడతలమామిడిలో కలుసుకున్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా కార్తికమాసాన్ని పురస్కరించుకుని వారంతా కలుసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారిలో వివాహం పూర్తయి 25 ఏళ్లు దాటిన దంపతులను సత్కరించారు.

## పేదింటి బిడ్డలు.. క్రీడల్లో ప్రతిభావంతులు

రాజానగర(సీతానగరం), రంగంపేట, న్యూస్‌టుడే: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పోటీలలో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. మండల, జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చదువుతో పాటు క్రీడలలో సైతం తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.

● రాజానగరం మండలంలోని పల్లకడియం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సాఫ్ట్ బాల్ పోటీలో నలుగురు విద్యార్థులు తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీఈటీ అన్నపూర్ణ తమకు శిక్షణ ఇవ్వడంవల్ల తాము రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యామని తెలిపారు.

● రంగంపేటలోని శ్రీవుండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోను సత్తా చాటారు. మలేషియాలోని సైబర్బియాలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఆసియాలోని 10 దేశాలకు సంబంధించిన 2వేల ప్రాజెక్టులను ప్రదర్శించగా పదో తరగతి విద్యార్థిని ఎ.రమ్య పాల్గొని కాంస్య పతకం సాధించింది. పల్లవి, జాహ్నవి, దీక్షిత జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని రజిత పతకం దక్కించుకున్నారు. శిక్షణను అందిస్తున్న పీడీ శైలను క్రీడాభిమానులు అభినందించారు.

జాతీయ స్థాయి క్రీడల్లో ప్రోత్సాహకాలను అందుకున్న రంగంపేట విద్యార్థులు

### దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతా..

సాఫ్ట్ బాల్ క్రీడలో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ కూడా విజయం సాధిస్తాననే విశ్వాసం ఉంది. క్రీడా కోటాలో ఉపాధ్యాయుడి ఉద్యోగం సాధించి విద్యార్థులకు మంచి మార్గాలు చూపించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతా.

-జి.గ్రేసీ, ఎనిమిదో తరగతి పల్లకడియం

### జాతీయ స్థాయిలో రాణించాలని..

క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో రాణించాలనేదే నా కోరిక. అందుకు పాఠశాల స్థాయి నుంచే చిత్తశుద్ధితో ఉదయం, సాయంత్రం శిక్షణ పొందుతున్నాను. తల్లిదండ్రుల సహకారంతో సాఫ్ట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

--ఎస్.బస్నిక ఏడో తరగతి, పల్లకడియం

నియామక పత్రాన్ని తీసుకుంటున్న మల్లికార్జున

## మండల ఆర్యవైశ్య అధ్యక్షుడి నియామకం

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండల ఆర్యవైశ్య అధ్యక్షుడుగా ఒబిలిశెట్టి మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని జిల్లా అధ్యక్షుడు పులపర్తి కుమార్ తెలిపారు. ఆదివారం పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో కార్తిక వనసమారాధనలో ఎంపికలు నిర్వహించామన్నారు. అధ్యక్షుడిగా మల్లికార్జునరావు, కార్యదర్శిగా ఎస్.సూర్యప్రకాష్ రావు, ట్రెజరర్‌గా ఒబిలిశెట్టి గోపాల కృష్ణలచే ప్రమాణస్వీకారం చేయించామన్నారు. మండలంలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పందలపాకలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడియపులంకలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా పూజలు

బిక్కవోలు, కడియం, న్యూస్‌టుడే: పందలపాకలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం నిర్వహించారు. కొంకుదురుకు చెందిన వై.కామాచార్యులు, భాస్కర సాయి నాగదేవ కల్యాణకర్తలుగా పాల్గొన్నారు.★ కడియపులంక గ్రామంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి మూడవ ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి పంచామృత అభిషేకాలతో పూజలు నిర్వహించారు.

**నేడు లక్ష ఒత్తుల దీపోత్సవం**

బలభద్రపురం తోటలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం వద్ద లక్షవత్తుల దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం సా. 6.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు.

## రాజ్యలక్ష్మి కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు అవకాశం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి ఏడాదిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సుల్లో కొన్ని సీట్లు మిగిలి ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల వారు కళాశాల కార్యాలయంలో ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.

## సందడిగా కార్తిక వన సమారాధనలు

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరులోని రాజు తోటలో జరిగిన గౌరీ(గవర) సేవా సంఘ వనసమారాధనలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఏడాది అందరు పచ్చని వాతావరణంలో వనసమారాధనలో పాల్గొనడం వల్ల బంధాలు బలపడతాయన్నారు. సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

బొమ్మూరులో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

మోరంపూడి: కుమ్మరి, శాలివాహన కార్తిక వనసమారాధన కార్యక్రమం ఆదివారం మోరంపూడి, జూపూడి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడారు. కుమ్మరుల కమ్యూనిటీ హాల్ భవనానికి స్థలం అందజేస్తామని ఎమ్మెల్యే గోరంట్ల హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ సోమువీర్రాజు, కుమ్మర శాలివాహన సంఘ నాయకులు మెరుగుమిల్లి సత్యనారాయణ, పేరూరి గంగారావు, టీవీ.రావు పాల్గొన్నారు.

కోరుకొండ: సీతారామభార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవా సమైఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వీరంతా కుటుంబ సమేతంగా హాజరై సందడి చేశారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వైకాపా నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి వనసమారాధనకు హాజరయ్యారు. సంఘ నాయకులు వీరిని శాలువాలతో సత్కరించారు.

వనసమారాధనలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కార్యక్రమంలో అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు ,సిబ్బంది

అనపర్తి గ్రామీణం: అనపర్తిలో ఆదివారం కార్తిక వనసమారాధన కార్యక్రమాలు సందడిగా సాగాయి. అనపర్తి కొత్తూరు, అనపర్తి, దుప్పలపూడి గ్రామాల్లోని తోటల్లో వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కార్తిక వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.తాడి రామగుర్రెడ్డి పాల్గొన్నారు.

రాజానగరం: క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో దివాన్‌చెరువులోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లో ఆదివారం క్షత్రియ కార్తిక వనసమారాధన నిర్వహించారు. సమితి అధ్యక్షుడు డీబీవీ రాజు అధ్యక్షతన జరిగింది. వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆదినారాయణ ఎస్ఆర్ఎస్ ఆలూరి వెంకటసుబ్బరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డి.వి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన జబర్దస్త్ నటులు

రాజానగరం: మహాపుష్కరవనంలో ఆదివారం శ్రీకృష్ణయాదవ సంక్షేమ సంఘం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో జబర్దస్త్ నటులు ఆహుతులను అలరించారు. అప్పారావు, సుధాకర్, వినోద్, నవీన్ ఆటపాటలతో, హాస్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పలువురు వారితో స్వీయచిత్రాలు తీసుకున్నారు.

## చెత్త తొలగించారు

స్పందనకు వందనం

బొమ్మూరు(హుకుంపేట) న్యూస్‌టుడే: హుకుంపేట కల్వర్టు వద్ద కాలువలో పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువ సరిగా పారకపోవడం వల్ల ఉన్నత పాఠశాల సమీపంలో మురుగు రోడ్డుపైకి వస్తోంది. ఈ సమస్యపై ఈనాడులో 'ప్రజారోగ్యంపై ప్లాస్టిక్ పడగ' శీర్షికన వార్త ఆదివారం ప్రచురితమైంది. స్పందించిన గ్రామకార్యదర్శి కాశీ పూడికలు, ప్లాస్టిక్ వస్తువులు తీయించారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్తిక ద్వాదశి పర్వదినం సందర్భంగా అలయన్స్ క్లబ్ జేమ్స్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా మల్టీపుల్ కోఆర్డినేటర్ పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం, గోదావరిగట్టున ఉన్న అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కత్తి కాంతారావు జయంతి

రంగంపేట, న్యూస్‌టుడే : నాటి సినీ హీరో కత్తి కాంతారావు జయంతిని ఆదివారం రంగంపేట మండలం సుభద్రంపేటలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్యతోపాటు స్థానికులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## ఉరేసుకుని వివాహిత మృతి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: వివాహిత ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతిచెందడంపై కేసు నమోదు చేశామని బొమ్మూరు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రాజమహేంద్రవరం పద్మావతి నగర్ సాయిఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న తలారి పోశమ్మ అలియాస్ పూజ(23)కు గతంలో పెద్దాపురానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అనంతరం మూడు నెలలకు వీరు విడిపోయారు. తర్వాత హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తితో ఆమె సహజీవనం చేస్తూ రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. ఆయన శనివారం హైదరాబాద్ నుంచి పోసమ్మకు ఫోన్‌చేస్తే ఎంతసేపటికీ తీయలేదు. దీంతో వాచ్‌మెన్‌ను ఆమె ఫ్లాటుకు పంపారు. గది తలుపు తీసి చూడగా ఆమె ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోశమ్మ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బాలిక అదృశ్యంపై కేసు

రంగంపేట, న్యూస్‌టుడే : ఎస్.టి.రాజాపురానికి చెందిన 17ఏళ్ల బాలిక అదృశ్యమైంది. శనివారం రాజానగరంలోని ఓ కళాశాలకు శనివారం వెళ్లింది. తిరిగి రాకపోవడంతో స్థానికంగాను, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

## 'కల్తీ మద్యం చూపిస్తే రూ.5లక్షలు ఇస్తా'

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ దుకాణాల్లో కల్తీ మద్యం అమ్ముతున్నారంటూచేస్తున్న ఆరోపణలను తెదేపా నాయకుడు మల్లిడి కృష్ణారెడ్డి ఖండించారు. మద్యం దుకాణాలనుంచి ఏ ఎమ్మెల్యేకు డబ్బులు ఇవ్వలేదని ఈ విషయమై తామంతా వినాయకుడి ఆలయంలో సత్యప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. అనపర్తిలో ఆదివారం ఓ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అసత్యఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ దుకాణంలో ఒక్క సీసాలో కల్తీ మద్యం చూపించినా రూ.5లక్షలు ఇస్తానని సవాలు చేశారు.

## కైవల్యకు సత్కారం

నిడదవోలు: అమెరికాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ అంతరిక్ష యాత్రకు ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపికైన నిడదవోలుకు చెందిన కుంచాల కైవల్యారెడ్డిని స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కరుటూరి చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ లయన్స్ క్లబ్ తరపున రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గారపాటి మోహన్, కోశాధికారి మట్టపర్తి చంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

## మురుగు సమస్యను పరిష్కరించండి

మోరంపూడి: శాటిలైట్ సిటీ ఏబీసీ మూడు బ్లాకుల్లోనూ మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. చెత్త తొలగించకపోవడంతో కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. రోడ్లపైకి మురుగు నీరు ప్రవహించడంతో రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సమస్యను నాయకులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపడంలేదని స్థానికులు వాపోతున్నారు. దోమలు పెరిగిపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

**కుక్కల బెడద**

రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో వీధికుక్కలు, పందులు పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రం చేస్తున్నాయి. వీటి సంచారం పెరిగిపోవడంతో అటుగా వెళ్లే పాదచారులపై దాడులు చేస్తున్నాయి. శాటిలైట్ సిటీ ప్రాంతంలో సుమారు 25 వేల మంది నివాసముంటున్నారు. పిల్లలు పరిసర ప్రాంతాల్లోనే ఆడుకుంటుంటారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న శాటిలైట్ సిటీ ప్రాంగణం ఇలా..

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

శాటిలైట్ సిటీలో చెత్తను తరలించుటకు ప్రత్యేక డ్రైవ్‌లు 20 రోజులకు ఒకసారి నిర్వహిస్తున్నాం. గ్రామంలో జనాభా సంఖ్య ఎక్కువగా ఉండడంతో చెత్తకుప్పలుగా వేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. సమయాభావం వలన ముఖ్య కూడల్లో మాత్రమే చెత్తను తొలగిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- టి. కృష్ణ, శాటిలైట్ సిటీ పంచాయతీ కార్యదర్శి.

## 23న సప్పా ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ కార్యక్రమం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ప్రముఖ నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్ ఏటా అందించే 'సప్పా ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2025' కార్యక్రమం ఈనెల 23న జరుగుతుందని జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఆదివారం ఉదయం నటరాజ నృత్యనికేతన్‌లో ఆమె ఆవిష్కరించారు. గోదావరి తీరం కళలకు రాజధాని అని, దుర్గాప్రసాద్ ప్రపంచవ్యాప్తంగా తన శిష్యులతో కలిసి ఆంధ్ర నాట్య ప్రదర్శనలతో కళారంగానికి అమితమైన సేవలందించడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొంటారన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన నిష్ణాతులకు పురస్కారాలు అందిస్తారని చెప్పారు. సప్పా దుర్గాప్రసాద్, పి.వి.బి.సంజీవరావు, లతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంచారామాలకు భక్తుల పయనం

V.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు రెండు ప్రత్యేక బస్సుల్లో భక్తులు ఆదివారం రాత్రి 7 గంటలకు బయలుదేరారు. కార్తిక మాసంలో ఆఖరి సోమవారం పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాల్లోని ఆలయాలను దర్శించుకునేందుకు ఒక బస్సులో 36 మంది, మరొక బస్సులో 40 మంది కలిపి మొత్తం 76 మంది భక్తులు పయనమయ్యారు. ఇక్కడి ప్రధాన బస్టాండ్ వద్ద పంచామ క్షేత్ర ప్రత్యేక బస్సులను డిపో మేనేజర్ కె.మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచి బయలుదేరిన బస్సులు అయిదు పుణ్యక్షేత్రాలను దర్శించిన అనంతరం సోమవారం సాయంత్రం తిరిగి ఇక్కడి డిపోనకు చేరుకుంటాయన్నారు. కార్తిక మాసం సందర్భంగా గత నెల 26 నుంచి నాలుగు వారాలు కలిపి మొత్తం 10 ప్రత్యేక బస్సులను పంచారామ క్షేత్రాలకు పంపినట్లు తెలిపారు. శబరిమల యాత్రకు కూడా ఇక్కడి నుంచి సోమవారం అయ్యప్ప భక్తులతో అయిదు బస్సులు బయలుదేరతాయని డీఎం తెలిపారు.

పంచారామ క్షేత్రదర్శిని బస్సులో బయలుదేరే భక్తులతో ఆర్టీసీ డీఎం మాధవ్ తదితరులు

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి

వి.ఎల్.పురం: స్వయం సహాయక మహిళా సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచనల మేరకు మెప్మా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పుష్కర ఘాట్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 40 మంది ఎస్‌హెచ్‌సీ మహిళలు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాము తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. మెప్మా పీడీ స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అందరూ ఆదరించి వారు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సహకరించాలని కోరారు. ఇకపై ప్రతినెల ఇక్కడ మహిళా సంఘాల ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్వయం సహాయక మహిళా సంఘాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ కనకరాజు

## ఆటలతో మేధాశక్తి పెరుగుతుంది

శ్యామలాసెంటర్ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌కేఆర్ పురమందిరంలో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీ లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు మాట్లాడుతూ చదరంగం ఆడటం వల్ల మేధాశక్తి పెరుగుతుందని, మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. విజేతలకు ఈనెల 20న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షులు రెడ్డి రాజు, డాక్టర్ లంక సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం : నగర పరిధిలోని గ్రంథాలయాల్లో వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో విశ్రాంత ఆచార్యులు ముంగండ సూర్యనారాయణ నిర్వహణలో ఆదివారం విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి జి.శ్రీదేవి పర్యవేక్షించారు. సీతంపేటలో గ్రంథాలయ ఉద్యమకారులు - నేటి సమాజంలో గ్రంథాలయాలు అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ఇన్నీస్‌పేటలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ ఉద్యమకారుల సేవలపై చాగంటి వెంకటలక్ష్మీ నరసింహారావు విద్యార్థులకు వివరించారు.

## నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

అనపర్తి గ్రామీణం, పెదపూడి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్దేశించి సుమారు ఏడాదిన్నర గడిచింది. గ్రామాలు శుభ్రంగా ఉంచడంతో పాటు సంపద సృష్టించాలనే ఉద్దేశంతో గత తెదేపా పాలనలలో ఈ కేంద్రాలను నిర్మించారు. తరువాత వచ్చిన వైకాపా నిర్లక్ష్యం చేయడంతో ఫలితంగా ఆ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామాల్లో స్వచ్ఛత కనుమరుగైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెత్త స్వచ్ఛవారోత్సవాలు నిర్వహించినా పూర్తి స్థాయిలో అమలుకావడంలేదని స్థానికులు చెబుతున్నారు.

రాజుపాలెంలో వినియోగానికి రాని కేంద్రం ఇలా

**యంత్రాలు మూలకు చేరాయి**

అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 59 పంచాయతీలలో 57 గ్రామాల్లో ఈ కేంద్రాలు నిర్మించారు. గ్రామాల్లో హరిత రాయబారుల ద్వారా సేకరించిన చెత్తను ఈ కేంద్రాలకు తరలించాలి. అక్కడ ఎరువు తయారుచేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సృష్టించాలి. కానీ చెత్త సేకరణ నిమిత్తం సమకూర్చిన ట్రాక్టర్లు, ఆటోలు, రిక్షాలు చాలా గ్రామాల్లో మూలకు చేరాయి.

● పెదపూడి మండలంలోని రాజుపాలెం గ్రామంలో నిర్మించిన సంపద కేంద్రం స్థానికులు పశువులు ఉంచేందుకు వాడుకుంటున్నారు. కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డాగా మారింది. తాగిపడేసిన మందుసీసాలు, కాగితాలు, గ్లాసులు అక్కడే పడేయడంతో కేంద్రాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి.

**కేంద్రాల వివరాలు**

| మండలం | పంచాయతీలు | కేంద్రాలు |
|---|---|---|
| అనపర్తి | 11 | 10 |
| బిక్కవోలు | 13 | 12 |
| రంగంపేట | 17 | 17 |
| పెదపూడి | 18 | 18 |

పెద్దాడ, గంగ్రేడు మధ్య రోడ్డుపక్కన చెత్తగుట్ట

**వినియోగంలోకి తీసుకొస్తాం**

పెదపూడి మండలంలోని అన్ని గ్రామాల్లో సంపదకేంద్రాలు నిర్మించారు. పెదపూడి, రామేశ్వరం, గంగ్రేడు, కేంద్రాల్లో ఇప్పటికే తయారైన ఎరువు విక్రయించడానికి సిద్ధంగా ఉంది. మిగిలిన వాటిని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటాం.

- కె.నరేంద్రరెడ్డి, ఎంపీడీవో పెదపూడి

## పేరు మార్పు

నేను, **వాసంశెట్టి వెంకటరావు,** S/o వెంకన్న, D.No: 2-63, సుభద్రంపేట, వెంకటాపురం గ్రామం, రంగంపేట మండలం, తూ॥గో॥జిల్లా. నా పేరు ఆధార్‌కార్డ్సు లేని సమయంలో **వాసంశెట్టి పెద్ద వెంకటరావు,** S/o వెంకన్నగా వుండేది. ఆధార్‌కార్డ్సు వచ్చిన తరువాత నా పేరు **వాసంశెట్టి వెంకటరావు,** S/o వెంకన్నగా మార్చుకున్నాను. ఇక నుండి అన్నింటికి ఇదే పేరుగా పరిగణించగలరు.

(c) eenadu

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

## ఛాయా సోమేశ్వర స్వామికి లక్ష పత్రిపూజ

తాళ్లపూడి, న్యూస్‌టుడే: వేగేశ్వరపురంలో ఛాయా సోమేశ్వర స్వామికి ఆలయ వంశీకులైన చామర్తి కుటుంబ సభ్యులు ఆదివారం లక్ష పత్రిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు, స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. చామర్తి నాగకుమార్, శ్యామలరావు, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. ప్రక్కిలంకలో అన్నపూర్ణాసమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్నదానం జరిగింది.

## మోర్తలో ఆయుర్వేద వైద్య శిబిరం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని మోర్తలో భాస్కర ఆయుర్వేద వైద్యాలయం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు అల్లంరాజు పాపారావు, శ్రీహర్ష, చిరంజీవి, పవన్, కిశోర్ పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

## శివ పంచాక్షరితో మార్మోగిన క్షేత్రం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: శివ పంచాక్షరీ మంత్రంతో కొవ్వూరు గోష్పద క్షేత్రం మార్మోగింది. గోష్పద క్షేత్ర లక్షపత్రి, లక్ష కుంకుమ పూజా కమిటీ 63వ వార్షికోత్సవం సందర్భంగా సుందరేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకం, లక్ష బిల్వార్చన, పూజా కార్యక్రమాలను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పల్లకీసేవ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. సాయంత్రం వేద సభ, పారాయణ, నీరాజన మంత్ర పుష్పాలు, దేవతామూర్తులకు విశేషాలంకరణలు చేశారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న పండితులు, భక్తులకు పిల్లలమర్రి సర్వేశ్వరరావు, మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

మహన్యాస మంత్ర పఠనం చేస్తున్న రుత్వికులు, పండితులు

## వరుస చోరీలు.. బెంబేలెత్తుతున్న జనాలు

నల్లజర్ల, న్యూస్‌టుడే: వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు వదిలి వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. నల్లజర్ల మండలంలో ఇళ్లల్లో చోరీలతోపాటు, వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్తు నియంత్రికల్లో రాగి తీగలనూ దోచుకెళ్లిన ఉదాంతాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ ఏడాది మార్చి నుంచి అక్టోబరు వరకు 32 చోరీ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇంకా నమోదు కాని కేసులెన్నో ఉంటాయని పలువులు అంటున్నారు. సింగరాజుపాలెం, ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, పుల్లలపాడు తదితర గ్రామాల్లో 60కు పైగా వ్యవసాయ బోర్ల వద్ద కేబుళ్లను, రాగిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.

రాగి తీగలు చోరీ జరిగిన నియంత్రిక వద్ద రైతులు

| నెల | కేసులు |
|---|---|
| మార్చి | 5 |
| ఏప్రిల్ | 3 |
| మే | 1 |
| జూన్ | 4 |
| జులై | 3 |
| ఆగస్టు | 2 |
| సెప్టెంబరు | 7 |
| అక్టోబరు | 7 |

**ఇళ్లు గుల్లవుతూ..**

ఈ ఏడాది ఏప్రిల్‌లో పోతవరానికి చెందిన ఓ కుటుంబం శుభకార్యానికి బంధువులు ఇంటికి వెళ్లి వచ్చేసరికి తమ ఇంట్లో బీరువాలో ఉన్న 12 కాసుల బంగారం, కిలో వెండి చోరీకి గురయ్యాయి. జూన్‌లో పుల్లలపాడుకు చెందిన కంచెర్ల వెంకట సీతారామయ్య కుటుంబంతో పుణ్యక్షేత్రాలకు వెళ్లి మూడు రోజుల తర్వాత రాగా ఇంట్లో ఉన్న 3 కిలోల వెండి, 68 గ్రాముల బంగారం, రూ.13 వేలు పోవడంతో ఖంగుతిన్నారు. అచ్చన్నపాలెంలో ఇటీవల ఓ దొంగ తన ఆనవాళ్లు దొరకకుండా అక్కడ ఉన్న కారం పొడినే ఇళ్లంతా జల్లి పరారయ్యాడు.

**సమాచారం ఇవ్వాలి..**

చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకుంటాం. రోజుల తరబడి ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు, చుట్టు పక్కల వారికి సమాచారం ఇవ్వాలి. అనుమానిత వ్యక్తులు ఆయా ప్రాంతాల్లో తిరిగితే తెలపాలి.

- వై.రాంబాబు, సీఐ, నల్లజర్ల పోలీస్‌స్టేషన్

## తపాలా ఉద్యోగులు ఐక్యంగా సాగాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: గ్రామీణ తపాలా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఏపీ సర్కిల్ కార్యదర్శి వై.మర్రిరెడ్డి అన్నారు. నిడదవోలులో ఆదివారం తాడేపల్లిగూడెం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు సంఘ 3వ ద్వైవార్షిక మహాసభను నిర్వహించారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రవీంద్ర, కార్యదర్శిగా ఎస్.రమేష్, కోశాధికారిగా పి.పవన్‌కుమార్‌లను ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గారావు, రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి పి.భూలోకం, ఏలూరు డివిజన్ కార్యదర్శి ఎస్ఎస్ బాజీ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు బీవీ రమణ, తాడేపల్లిగూడెం డివిజన్ పరిశీలకుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూజలో అయ్యప్ప భక్తులు

## రాష్ట్రంలో పెట్టుబడుల యుగానికి పునాది

కొవ్వూరు పట్టణం, దేవరపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహించిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రసిద్ధ పరిశ్రమల రాక, భాగస్వామ్యాలతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు రానుందన్నారు. లక్షలాది మంది యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు దక్కనున్నాయన్నారు. ఈ సదస్సు ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడిందన్నారు. ● ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ వ్యూహాత్మకంగా శ్రమిస్తూ రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చుతున్నారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. దేవరపల్లిలో ఆయన మాట్లాడుతూ విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి అధికంగా పెట్టుబడులు రానున్నాయన్నారు.

## మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రోత్సహించాలి: మెప్మా పీడీ

వి.ఎల్.పురం: స్వయం సహాయక మహిళా సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచన మేరకు మెప్మా, జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(డీఆర్‌డీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పుష్కర ఘాట్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 40 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాము తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. మెప్మా పీడీ స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను అందరూ ఆదరించి వారిని ఆర్థిక స్వావలంబన దిశగా సహకరించాలని కోరారు. ఇక్కడ ప్రతినెల మహిళా సంఘాల ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా కలశపూజ మహోత్సవం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడిలోని ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో మహా కలశపూజ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మండపాన్ని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆకొనిని వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

## కమ్మ సేవా సంఘం అధ్యక్షుడిగా బూరుగుపల్లి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలుపురం(నిడదవోలు) కమ్మ సేవా సంఘం అధ్యక్షుడిగా లింగంపల్లికి చెందిన బూరుగుపల్లి సత్యనారాయణను ఆదివారం ఎన్నుకున్నారు. నందిని చారిటబుల్ ట్రస్ట్ వద్ద వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ సంస్థ రాష్ట్ర ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. అనంతరం 2025-26, 2026-27 సంవత్సరాలకు గాను నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు. సంఘ నాయకులు బిక్కిన సత్యనారాయణ, దాపర్తి రాజేశ్వరరావు, ముళ్లపూడి రామారావు, నల్లూరి ప్రభాకరరావు, ఆత్కూరి శ్రీనివాస్, బండి గోపాలకృష్ణ, నిమ్మగడ్డ గోపాలకృష్ణ, ఎం.కేశవరావు, ఎం.సురేష్‌లు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణతో సభ్యులు

## వనసమారాధనల సందడి

నిడదవోలు, పెరవలి, న్యూస్‌టుడే: కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు వనసమారాధనలతో నిండిపోయాయి. నిడదవోలు పట్టణ పరిధి ఆవరణలో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం, తిమ్మరాజుపాలెం వద్ద శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం, తూర్పు కాపు సంక్షేమ సంఘ వనసమారాధనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, ఏపీఎస్‌డీసీ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, పట్టణ తెదేపా, జనసేన, భాజపా అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, మొర్ల ప్రమోద్‌కుమార్, ఆయా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

**ఆటపాటలతో ఉత్సాహంగా..**

ఉండ్రాజవరం, నల్లజర్ల, కొవ్వూరు పట్టణం: ఉండ్రాజవరం మండలంలోని చివటం పరిధిలో తణుకు కమ్మసంక్షేమ సంఘం వనసమారాధన జరిగింది. ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులు, మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక, శశి విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మద్దిపాటి రాజశేఖర్, పరిమి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ● నల్లజర్ల మండలంలో అనంతపల్లి కాపు సంఘం జరిగిన వనసమారాధనలో రంగా మిత్రమండలి, కాపు సంఘం అధ్యక్షుడు సూర్పిడి కిశోర్ మాట్లాడారు. దివంగత మాజీ సర్పంచి కలం నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ఉప సర్పంచి కలం సత్యనారాయణ, చిలుకూరి శ్రీరామ్, చిట్టి వెంకటేశ్వరరావు, రంగా పవన్ పాల్గొన్నారు. ● ఆధ్యాత్మిక, సామాజిక భావనను వన సమారాధనలు పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వేములూరు రోడ్డులోని డీపీ పాఠశాల సమీపంలోని తోటలో గౌడ సంఘ కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులు అందించి అభినందించారు. తెదేపా పట్టణ నాయకుడు సూరపనేని చిన్ని, గౌడ సంఘ రాష్ట్ర నాయకులు తాత కృష్ణారావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: లింగాకారంలో దీపాలు..

నిడదవోలు: శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘ సభ్యులతో శేషారావు..

తిమ్మరాజుపాలెంలో యాదవ సంక్షేమ సంఘ సభ్యులతో మంత్రి దుర్గేష్

కొవ్వూరు పట్టణం: చిన్నారికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

## మహాదేవమణికి గండపెండేరం

శ్యామలా సెంటర్: అవధాని డాక్టర్ ధూళిపాల మహాదేవమణికి గండపెండేర మహోత్సవం సాధుశాంతి తత్త్వదర్శినీ సత్సంగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. వీరభద్రపురంలోని సాధుస్త్రీల మఠంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఎందరో మహిళలను అవధానులుగా తీర్చిదిద్దిన ఘనత మహాదేవమణికి దక్కుతుందని కొనియాడారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

**కాలువ వద్ద వ్యర్థాలు**

**సమస్య:** తాళ్లపూడి నుంచి వేగేశ్వరపురం వెళ్లే ప్రధాన రహదారిలో సాగునీరు పారే కాలువ వద్ద వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. పంటపొలాలకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

**సమాధానం:** రహదారి పక్కన వ్యర్థాలను తొలగించి, రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

- వీరన్న, పంచాయతీ కార్యదర్శి, తాళ్లపూడి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

## గుంత తీశారు.. మట్టి మరిచారు

చీపురుగూడెం ప్రధాన రహదారిపై ఇటీవల గుంత తీసి తూరలు ఏర్పాటు చేశారు. ఆ తూరలపై సిమెంటు వేసి రహదారి చదును చేశారు. తీసిన మట్టిని మాత్రం అక్కడే గుట్టలుగా వదిలేయడంతో చోదకులు వాటిని ఢీకొని ప్రమాదాల బారినపడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ విజయన్‌ను వివరణ కోరగా మట్టిని తొలగించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నల్లజర్ల

## అధ్వానంగా దారి

నిడదవోలు నుంచి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి వెళ్లే ర.భ.శాఖ రహదారిలో గోపవరం-విజ్జేశ్వరం మధ్య రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో నిడదవోలు నుంచే కాక తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం తదితర ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది రాజమహేంద్రవరం వెళ్తుంటారు. ఈ రహదారి పక్కనే పశ్చిమడెల్టా ప్రధానకాలువ ప్రవహిస్తుండటంతో కోతకు గురైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

## గోశాలలో ఎంపీ ప్రత్యేక పూజలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పవిత్ర గోదావరి నదీ తీరాన చేసే హోమాది, పూజా కార్యక్రమాలకు విశేష ఫలితం ఉంటుందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గోష్పద క్షేత్రంలోని సుందర గోవిందుని ఆలయంలో ఆదివారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్షత్ర హోమాన్ని వీక్షించి గోపూజ, పూర్ణాహుతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, హరిచరణ్ పాల్గొన్నారు.

సుందర గోవిందుని ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

## కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమది సంక్షేమ రాజ్యమని చెబుతూ కార్మిక, మహిళా వ్యతిరేక విధానాలను చట్ట సభల్లో ప్రవేశపెడుతున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పవన్ అన్నారు. నిడదవోలులోని ఓ హాలులో ఆ సంఘ మండల మహాసభను ఆదివారం మండల కన్వీనర్ గంటి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను చేయడం అమానుషమన్నారు. దీనిపై కార్మికులు, ఉద్యోగులు, మహిళలు ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ధనరాజు, హైమావతి, బేబీ, రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్

## మరమ్మతుల పరిశీలన



పూడ్చిన గుంతలను తనిఖీ చేస్తున్న మంత్రి

నిడదవోలు, న్యూస్‌టుడే: వార్షిక నిర్వహణ నిధి కింద నిడదవోలు మండలం గోపవరం నుంచి డి.ముప్పవరం వరకు, డి.ముప్పవరం నుంచి కానూరు వరకు జరుగుతున్న రహదారి మరమ్మతు పనులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం వర్షాలు తగ్గిన వెంటనే నిడదవోలు నియోజకవర్గంలో రహదారి పనులు ప్రారంభించామన్నారు. వార్షిక నిర్వహణ కింద ఉన్న నిధులను వినియోగించి త్వరితగతిన రహదారి మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గుంతలమయమైన రహదారి నుంచి ఉపశమనం లభించడంతో పలువురు దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ద్విచక్ర వాహనం చోరీపై కేసు

చాగల్లు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం చోరీపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన కె.వెంకట సాయి గత నెల 31న తన ద్విచక్ర వాహనంపై దొమ్మేరు గ్రామానికి వచ్చారు. రోడ్డు పక్కన వాహనాన్ని ఉంచి, మరలా వచ్చి చూసే సరికి కనిపించలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.విశ్వం తెలిపారు.

## కోడి పందేలు ఆడుతున్న ఇద్దరిపై..

చాగల్లు, న్యూస్‌టుడే: కోడి పందేలు ఆడుతున్న ఇద్దరిని ఆదివారం అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,400 నగదును స్వాధీన చేసుకున్నామని పట్టణ సీఐ కె.విశ్వం తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

## హాజరుకండి.. విద్యార్థుల భవిత తెలుసుకోండి!

● నెరవేరని పీటీఎం ఉద్దేశం
● కొరవడుతున్న అవగాహన

గోపాలపురం, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పిల్లలు ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటున్న తల్లిదండ్రులు.. వారు ఎలా చదువుతున్నారు ? వారి ప్రవర్తన ఎలా ఉంది ? తమ పరంగా ఏమి చేయాలనే విషయంపై దృష్టి పెట్టడం లేదు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు (పీటీఎం) పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేస్తోంది. మెజారిటీ తల్లిదండ్రులు వీటికి హాజరు కాకపోవడం, వాటిని అర్థం చేసుకోకపోవడంతో ఉద్దేశం నెరవేరడం లేదు.

రాజంపాలెం ఉన్నత పాఠశాలలో పీటీఎంకు హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

**వివరాలు ఇలా..**

| పాఠశాలలు | సంఖ్య | విద్యార్థులు |
|---|---|---|
| ప్రాథమిక | 704 | 28,220 |
| ప్రాథమికోన్నత | 32 | 23,86 |
| ఉన్నత | 213 | 58485 |
| జూ. కళాశాలలు | 18 | 1458 |

**ఇదీ పరిస్థితి..**

✦ ఇప్పటివరకు పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు ఆ బడిలో విద్యార్థుల సంఖ్యలో 40-50 శాతం మంది, కళాశాలల్లో 20-30 శాతం తల్లిదండ్రులు మాత్రమే హాజరయ్యారు.

✦ పీటీఎం సమావేశాలకు హాజరైన తల్లిదండ్రులు కూడా పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన వెంటనే బయట తిరుగుతున్న పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు చరవాణులతోనే ఎక్కువ సమయాన్ని గడుపుతూ కాలక్షేపం చేస్తున్నారు. సినిమాలు, గేమ్‌లు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తున్నారు.

**ఇలా చేస్తేనే..**

✦ తల్లిదండ్రులు పీటీఎంలకు హాజరవడంతోపాటు అక్కడ చెప్పే విషయాలను ఆకలింపు చేసుకోవాలి.

✦ ఉపాధ్యాయులు సమావేశాల్లో తల్లిదండ్రులను చదువు వచ్చేవారు, రానివారని విభజించాలి. వారి అర్థమయ్యేల్యే సమావేశాల ఉద్దేశాలను వివరించాలి. పిల్లలను ఎలా పర్యవేక్షించాలో అవగాహన కల్పించాలి.

✦ తల్లిదండ్రులకు పిల్లల ప్రగతిని వివరించి ప్రోత్సహించాలి. వారు ఆసక్తితో భాగస్వాములయ్యేలా చూడాలి.

కైవల్యను అభినందిస్తున్న లయన్స్ సభ్యులు

## కైవల్యకు నగదు ప్రోత్సాహకం అందజేత

నిడదవోలు, న్యూస్‌టుడే: అమెరికాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ అంతరిక్ష యాత్రకు ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపికైన నిడదవోలుకు చెందిన కుంచాల కైవల్యారెడ్డిని స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కరుటూరి చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ లయన్స్ క్లబ్ తరఫున రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గారపాటి మోహన్, కోశాధికారి మట్టపర్తి చంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మి కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు అవకాశం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి ఏడాదిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాఘవ కుమారి తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సుల్లో కొన్ని సీట్లు మిగిలి ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల వారు కళాశాల కార్యాలయంలో ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు.

## ఉరేసుకుని వివాహిత మృతి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: వివాహిత ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతిచెందడంపై కేసు నమోదు చేశామని బొమ్మూరు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రాజమహేంద్రవరం పద్మావతి నగర్ సాయిఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న తలారి పోశమ్మ అలియాస్ పూజ(23)కు గతంలో పెద్దాపురానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అనంతరం మూడు నెలలకు వీరు విడిపోయారు. తర్వాత హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తితో ఆమె సహజీవనం చేస్తూ రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. ఆయన శనివారం హైదరాబాద్ నుంచి పోసమ్మకు ఫోన్‌చేస్తే ఎంత సేపటికీ తీయలేదు. దీంతో వాచ్‌మెన్‌ను ఆమె ఫ్లాటుకు పంపారు. గది తలుపు తీసి చూడగా ఆమె ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోశమ్మ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## వివేకవంతమైన జీవనానికి గ్రంథాలయం వారధి

కొవ్వూరు పట్టణం, పెరవలి, న్యూస్‌టుడే: విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాలు వివేకవంతమైన జీవనానికి వారధిగా నిలుస్తాయని గైట్ కళాశాల గ్రంథాలయాధికారి, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కొవ్వూరు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. సభకు గ్రంథాలయాధికారిణి కె.సుగుణకుమారి అధ్యక్షత వహించగా మీరా, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాస మూర్తి ప్రముఖుల జీవిత విశేషాలపై విద్యార్థులకు వివరించారు. అంతకుముందు గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడతామంటూ ప్రతిజ్ఞ చేశారు. జూనియర్స్ సీనియర్స్ విభాగాలకు దేశభక్తి గల జానపద గేయాలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించగా ప్రతిభ కనబర్చారు. న్యాయనిర్ణేతలుగా పి.భాగ్యరేఖ, ఎం.రమాదేవి, ఎస్.రాజు వ్యవహరించారు. ● గ్రంథాలయాలు దేశానికి పట్టుగొమ్మలని యినపకోళ్ల రాఘరావుమెమోరియల్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కడియాలసాయిరాం అన్నారు. ముక్కామలలో దేశనాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేతా త్రిమూర్తులు, కరుటూరి విశ్వనాథం, కంటిపూడి సూర్యనారాయణ, పత్తిపాటి ప్రసాదు, గంగోలు సీతమ్మ, జోషఫ్ ఉన్నారు.

కొవ్వూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు, విద్యార్థులు

పెరవలి: ప్రముఖులకు నివాళి అర్పిస్తూ..

(c) eenadu

# ముగిసిన మేళా.. మురిసిన రైతులు

ప్రదర్శనలో సమగ్ర వ్యవసాయ విధానం నమూనాను తిలకిస్తున్న సందర్శకులు

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం జీకేవీకే ఆవరణలో నాలుగు రోజులపాటు సాగుతున్న కృషిమేళా-2025 ప్రదర్శనకు ఆదివారం తెరపడింది. ఈనెల 13న ప్రదర్శన ప్రారంభమైంది. మూడు రోజుల్లో 23 లక్షల మంది సందర్శించారని, 35 వేల మంది రాయితీ ధర రాగి సంగటితో కూడిన రూ.50 భోజనాన్ని రైతులు, సందర్శకులు ఆస్వాదించారని నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, మహిళలు, విద్యార్థులు, నగర ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఏడాదికి ఓసారి జరిగే ప్రదర్శన తిలకించడంతో పాటు తమకు ఇష్టమొచ్చిన మొక్కలు, పండ్లు, రసాయనిక, సేంద్రియ ఎరువులు, విత్తనాలు, ఆధునిక యంత్రాలను కొనుగోలు చేశారు. ఈసారి ప్రదర్శనలో వ్యవసాయ పంటలకు మంచి చెడు చేసే కీటకాల ప్రత్యేక విభాగం, సమగ్ర వ్యవసాయ విధానం, వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు వినియోగం, చిరుధాన్యాలు, కీటకాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు, మల్బరీ ఆకుల టీని ప్రదర్శనలో ఉంచారు. 750 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మొక్కజొన్న, సూర్యకాంతి, చిరుధాన్యాలు, మిరప, మినుము తదితర వ్యవసాయ క్షేత్రాలను సందర్శించేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపించారని ఉపకులపతి డాక్టర్ సురేష్ తెలిపారు.

మేళాకు పోటెత్తిన సందర్శకులు

## భార్యకు వీడియో కాల్ చేసి బలవన్మరణం

**మడికేరి, న్యూస్‌టుడే:** భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చిన కీర్తన్ (36) అనే వ్యక్తి వీడియో కాల్ చేసి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒక దొంగతనం కేసులో కారాగారం చేరిన కీర్తన్ కొద్ది రోజుల క్రితమే బెయిలుపై బయటకు వచ్చాడు. భర్త కారాగారంలో ఉన్నప్పుడు అతని భార్య పుట్టింటికి వెళ్లింది. తాను కారాగారం నుంచి వచ్చానని, ఇంటికి తిరిగి రావాలని ఆమెకు ఫోన్ చేస్తూ వచ్చినా స్పందించకపోవడంతో సోమవారపేట శివార్లకు వెళ్లి, భార్యకు వీడియోకాల్ చేసి, చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మడికేరి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మహిళతో అసభ్యప్రవర్తన

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** కుక్కను ముద్దు పెట్టుకునే పేరుతో ఓ వ్యక్తి మహిళ శరీరాన్ని తాకి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన శనివారం సాయంత్రం జ్ఞానభారతి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. సాయంత్రం 7 గంటలకు ఉల్లాళలేఔట్‌లో ఓ మహిళ తన పెంపుడు కుక్కతో కలిసి వాయువిహారం చేస్తున్నారు. అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి కుక్కను ఆడిస్తూ ఆమె శరీరాన్ని తాకడంతో పాటు ముద్దు పెట్టుకునేందుకు ప్రయత్నించాడు. హఠాత్పరిణామానికి విస్తుపోయిన ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి ఆ వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## మంటల్లో ట్యాంకర్

**కార్వార, న్యూస్‌టుడే:** యల్లాపుర తాలూకా అరబైల్ ఘాట్ రోడ్డులో ఇథనాల్ (స్పిరిట్) ట్యాంకర్ శనివారం అర్ధరాత్రి బోల్తా కొట్టింది. ఇంధన ట్యాంకుకు అంటుకున్న మంటలు ట్యాంకర్ అంతా వ్యాపించాయి. యల్లాపుర మార్గంలో చిక్కిడి నుంచి కేరళకు ఇథనాల్‌ను తరలిస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే క్యాబిన్ నుంచి డ్రైవరు, క్లీనరు కిందకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. యల్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# హస్తినలో కర్ణాటకం

- కొనసాగుతున్న మంతనాలు
- ఈసారి ముఖ్యమంత్రిగా శివకుమార్‌ను ప్రతిపాదిద్దాం

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** మంత్రివర్గంలో మార్పులు, చేర్పులకు సన్నాహాలు చేసుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హస్తిన నుంచి శనివారం అర్ధరాత్రికి తిరిగి రాగా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇంకా అక్కడే ఉన్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు ముఖ్యమంత్రి, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి అధ్యక్షుని మార్పు ఉంటుందా, ఉండదా అని చర్చలు, ఊహాగానాలు ఊపందుకున్నాయి. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కర్ణాటక రాజకీయాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. పార్టీ అధినేతలు రాహుల్, సోనియాలతో సిద్ధు భేటీ కాగా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌లో భేటీ అయ్యేందుకు డీకేకు ఇప్పటి వరకు సమయం లభించలేదు. కర్ణాటక ముఖ్యమంత్రిగా తానే పూర్తి సమయం కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలని పరోక్షంగా అధిష్ఠానాన్ని కోరిన సిద్ధరామయ్య, తదుపరి (2028) ఎన్నికలకు శివకుమార్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదిద్దామని సూచించినట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం తనను ఏమైనా అడిగేంత వరకు మౌనంగా ఉండాలని శివకుమార్ భావిస్తున్నారు. ముఖ్యమంత్రి వర్గానికి చెందిన నాయకునిగా గుర్తింపు ఉన్న జమీర్ అహ్మద్ ఖాన్ ఇప్పటికే కేసీ వేణుగోపాల్‌ను కలుసుకుని, '2028కి డీకే ముఖ్యమంత్రి' అనే ప్రతిపాదనను ఆయన ముందుంచారు. మంత్రివర్గంలో కూర్పులు చేర్పులు జరిగినా, ముఖ్యమంత్రి స్థానంలో మార్పు ఉండదని సీనియర్ మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. 'ప్రతి ఎమ్మెల్యేకు తాను మంత్రి కావాలన్న ఆశ ఉంటుంది. అలా కోరుకోవడంలో తప్పు లేదు. విస్తరణ సమయంలో ఎవరిని తీసుకోవాలన్నది పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రికి పూర్తి అధికారం ఉంటుంది' అని గుర్తు చేశారు. బిహార్ ఎన్నికల ఫలితాల అనంతరం కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. ముఖ్యమంత్రిని మార్చితే, పార్టీలో మూడు, నాలుగు శక్తి కేంద్రాలు ఏర్పడతాయని భావిస్తోంది. డీకేను ముఖ్యమంత్రి చేస్తే కర్ణాటక రెండుగా విడిపోవాలని కోరుకుంటూ పోరాటం చేసే వారి సంఖ్య పెరిగిపోతుందని మరికొందరు నాయకులు పరోక్ష హెచ్చరికలను ఇప్పటికే జారీ చేశారు. సిద్ధరామయ్యకు అహింద, కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్, పాత మైసూరు జిల్లాల కాంగ్రెస్ నేతలు, బాగలకోటె, బెళగావికి చెందిన ఎక్కువ మంది నేతలు మద్దతు ఇస్తున్నారు. సంఖ్యాపరంగా చూస్తే సిద్ధు వెంట ఉండాలని కోరుకుంటున్న నేతలు ఎక్కువ మంది ఉన్నారు.

ఎవరి మనసులో ఏముందో!

### మంత్రుల్లో మొదలైన గుబులు

మంత్రి పదవులు కోరుకుంటున్న పీఎం అశోక్, ఎన్ఎస్ పొన్నణ్ణ, బసవరాజ రాయరెడ్డి, అజయ్ సింగ్ తదితరులు హస్తినలోనే పార్టీ నాయకులను భేటీ అయ్యేందుకు ప్రయత్నాలు కొనసాగించారు. మంత్రివర్గ ప్రక్షాళన చేసి, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తే కేహెచ్ మునియప్ప, హెచ్‌సీ మహదేవప్ప, కె.వెంకటేశ్, శరణ బసప్ప దర్శనాపూర్, శివానంద పాటిల్, ఆర్‌బీ తిమ్మాపుర, డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, రహీమ్ ఖాన్, డి.సుధాకర్‌లను పక్కన పెట్టే అవకాశం ఉందని సమాచారం. గత ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ముందుగా తనకు హామీ ఇచ్చినట్లు రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రిగా తనను ప్రకటించాలని, అనంతరం మంత్రివర్గంలో కూర్పులు, చేర్పులు, మండలి- కార్పొరేషన్లకు ఆశావహులైన ఎమ్మెల్యేలు, సీనియర్ కార్యకర్తలను నియమించేందుకు అవకాశం ఇవ్వాలని డీకే శివకుమార్ ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరారు. తన అన్నకు మద్దతుగా నిలిచేందుకు మాజీ ఎంపీ డీకే సురేశ్ హస్తినకు ఆదివారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు. తన అన్న ముఖ్యమంత్రి కావాలని తనతో పాటు, కోట్లాది మంది అభిమానులు కోరుకుంటున్నారని, దీనిపై పార్టీ పెద్దలే తుది నిర్ణయాన్ని తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జమీర్ అహ్మద్ ఖాన్

### మధ్యంతర ఎన్నికలు వస్తాయి

ముఖ్యమంత్రి స్థానాన్ని డీకేకు అప్పగించినా, అప్పగించకపోయినా, కర్ణాటకలో మధ్యంతర ఎన్నికలు వస్తాయని విపక్ష నేత ఆర్.అశోక్ ధీమా వ్యక్తం చేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని జారీ చేసేందుకు సిద్ధరామయ్య సుముఖంగా లేకపోవడంతో డీకే శివకుమార్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదన్నారు. సిద్ధును పీఠం నుంచి తప్పించడం తేలికైన విషయం కాదన్నారు. బెళగావిలో శీతాకాల శాసనసభ సమావేశాల అనంతరం రాజకీయాలు మరింత వేడెక్కుతాయన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా దళ్‌తో కలిసి ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బిహార్ ఎన్నికల్లో ఘోర పరాజయంతో సిద్ధరామయ్య ముందు రాహుల్ గాంధీ కూడా డమ్మీగా మారిపోయారని ఎద్దేవా చేశారు.

## నేడు ప్రధానితో భేటీ కానున్న సీఎం

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి నేడు మళ్లీ హస్తినకు వెళ్లనున్నారు. చెరకు, మొక్క జొన్న రైతులకు మద్దతు ధరను ప్రకటించాలని ప్రధాని మోదీని భేటీ అయి వినతిపత్రాన్ని అందించనున్నారు. ప్రధాని కార్యాలయం నేటి సాయంత్రం 4 గంటలకు భేటీ అయ్యేందుకు కాలావకాశం కల్పించింది. వరదతో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించేందుకు తక్షణ సాయంగా రూ.1450 కోట్లు విడుదల చేయాలని ప్రధానిని కోరతారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఇటీవల కాలిపోతున్న చెరకు లోడు ట్రాక్టర్లు

## ఐదు కేసులు నమోదు చేశాం

**బాగలకోటె, న్యూస్‌టుడే:** ముధోళ తాలూకా సమీరవాడి వద్ద గోదావరి చక్కెర పరిశ్రమకు చెరకు లోడుతో వచ్చిన ట్రాక్టర్లలో 30 వాహనాలను నిప్పు పెట్టిన ఘటనలో ఐదు కేసులు నమోదు చేసుకున్నామని శాంతిభద్రతల విభాగం అదనపు ఏడీజీపీ ఆర్ హితేంద్ర తెలిపారు. నిప్పు పెట్టిన నిందితులను గుర్తించేందుకు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు, కొందరు అనుమానితులను అదుపునకు తీసుకుని విచారణ చేపట్టామన్నారు. మొత్తం 20 మంది ఈ ట్రాక్టర్లకు నిప్పు పెట్టారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని హితేంద్ర వివరించారు. పరిశ్రమ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు, ఆందోళన చెలరేగుతాయని భావిస్తున్న చోట ఆదివారం వరకు నిషేధాజ్ఞలను జారీలోకి తీసుకువచ్చామని చెప్పారు.

### పోలీసుల అదుపులో పది మంది

టన్ను చెరకుకు రూ.3500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేసిన రబకవి బనహట్టి పరిధి సమీరవాడిలో గోదావరి చక్కెర మిల్లు వద్ద 30కు పైగా చెరకు లోడు ఉన్న ట్రాక్టర్లకు నిప్పు పెట్టిన ఘటనలో పది మందిని అదుపునకు తీసుకున్నామని మహాలింగపుర ఠాణా పోలీసులు తెలిపారు. సిద్ధప్ప బళగానూర, మల్లు మేటగుడ్డ, రాజుగౌడ పాటిల్, బసు నాయ్కర్ నేతృత్వంలో వచ్చిన ఆందోళనకారులు నిప్పు పెట్టారని ప్రాథమిక విచారణలో గుర్తించారు. వారు కూడా రైతులేనని, వారిని తక్షణమే విడిచి పెట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారిని విడిచి పెట్టకపోతే తదుపరి ఆందోళనకు సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు.

## బాలల హక్కుల రక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

పాటకు చప్పట్లు కొడుతున్న జస్టిస్ హెగ్డే, ఇతర ప్రతినిధులు, బాలలు

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** బాలల హక్కుల రక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ చేపట్టాలని జస్టిస్ సంతోశ్ హెగ్డే పిలుపునిచ్చారు. వారికి హక్కులను తెలిపేందుకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించవలసిన అవసరం ఉందన్నారు. చామరాజపేట సెయింట్ జోసెఫ్స్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బాస్కో సంస్థకు చెందిన బాలలతో కలిసి బాలల హక్కుల రక్షణ జాతాలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల బాలలపై లైంగిక దౌర్జన్యాలు, వేధింపులు ఎక్కువ కావడం దురదృష్టకరమని అన్నారు. సరైన జాగృతి, నిందితులకు కఠిన శిక్షలు విధించడం ద్వారా అలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. నటి మోక్షితా పాయ్, ఫాదర్ వర్గీస్ ప్లిపురం, నిర్వాహక ప్రతినిధులు జాన్సన్, యోగేశ్ మాస్టర్, ఆశా, రామస్వామి, వాసుదేవ శర్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాంతియుతంగా కవాతు

**కలబురగి, న్యూస్‌టుడే:** చిత్తాపురలో సంఘ్ పరివార్ కార్యకర్తలు ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన పథ సంచలన్ శాంతియుతంగా కొనసాగింది. భగవాధ్వజ్‌ను పట్టుకుని 300 మంది సంఘ్ కార్యకర్తలు వెళ్తుండగా, వారి ముందు 50 మంది బ్యాండ్ సిబ్బంది బజాజ్ కల్యాణ మండపం నుంచి అంబేడ్కర్ కూడలి, బసవ ఆసుపత్రి, హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డు, బసవేశ్వర కూడలి నుంచి మళ్లీ కల్యాణమండపానికి చేరుకోవడంతో కవాతు ముగిసింది. గణ్ వేషధారులకు స్థానికులు స్వాగతం పలికారు. ప్రధాన రహదారికి ఇరువైపులా నిలబడి గణ్ వేషధారులపైకి పూల రేకులు చల్లారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం, జై శ్రీరామ్, జై భవాని, జై శివాజీ అంటూ నినాదాలు చేశారు. మధ్యాహ్నం 3.45కు ప్రారంభమైన కవాతు 4.22కు పూర్తయింది. సుమారు 47 నిమిషాల పాటు 1.25 కిమీ. మేర కొనసాగిన కవాతు సందర్భంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులు భద్రతను కల్పించారు.

ప్రదర్శనలో సంఘ్ పరివార్ కార్యకర్తలు

### పదండి పోదాం.. వేరుసెనగ జాతరకు

ఉద్యాననగరి బెంగళూరులోని సోమవారం నుంచి భారీ ఎత్తున జరిగే వేరుసెనగ జాతరకు సర్వం సిద్ధమైంది. సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, తదితరులు వేడుకను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం వేరుసెనగ కాయల రాసులను సిద్ధం చేసుకుంటున్న విక్రయదారులను చిత్రంలో చూడవచ్చు. **-న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)**

# ఉరకలెత్తిన ఉత్సాహం

## జాతీయ పికిల్‌బాల్ పోటీల్లో సత్తా

నిర్వాహకులతో విజేతలు శర్మదా దామినీ, విశాల్‌జాదవ్ జంట

**బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే:** కనకపుర సమీపంలోని స్పోర్ట్స్ స్కూల్ ఆవరణలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన జాతీయ పికిల్‌బాల్ పోటీలు ఆదివారం వీక్షకులకు కనువిందు చేశాయి. భారత పికిల్‌బాల్ సంఘం, కర్ణాటక పికిల్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో 'సబల' టైటిల్ భాగస్వామ్యంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వేర్వేరు వయోవిభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు సాధించారు. 14 ఏళ్ల గ్రూపు నుంచి బాలబాలికలు, పురుష, మహిళలతో పాటు వేర్వేరు వయోవిభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో పలువురు విజేతలుగా నిలిచారు. 30+ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో విశాల్‌జాదవ్ - శ్రద్ధాదామినీ జంట 15-6 స్కోర్‌తో మోనికామెనెన్ - రాహుల్‌బెల్వాల్‌పై గెలుపొందారు. అండర్-18లో బాలుర విభాగంలో జరిగిన తుది పోరులో అరీవ్‌రాజ్‌ఖన్నా 15-9 స్కోర్‌తో అరుస్ నిట్యూర్‌పై గెలుపొందాడు. పురుషుల విభాగం ఓపెన్ డబుల్స్‌లో స్టావ్యాబాసిన్ - అమోల్‌రామచందనీ జంట 15-5 స్కోర్‌తో ఆదిత్యసింగ్, అర్జున్‌సింగ్‌పై నెగ్గి విజేతలుగా నిలిచారు. 50+ మిక్స్‌డ్ విభాగం ఫైనల్స్‌లో అఖిల్‌మ్యాథ్యూర్ - గౌరికాచోప్రా జంట 15-6తో కిరణ్‌సాలియన్ - కె.శ్రుతిపై విజయం సాధించారు. 50+మహిళల విభాగం డబుల్స్‌లో ఎస్.షక్‌దేవానీ - గౌరిక చోప్రా జంట 15-12 స్కోర్‌తో పి.బాలాజీ, పి.రూప్‌కుమార్‌పై గెలుపొందారు.

సింగిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించిన అరీవ్‌రాజ్ ఖన్నా

# నిందితులపై కాల్పులు

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే:** వాణిజ్య నగరి హుబ్బళ్లిలో పోలీసుల తుపాకులు ఆదివారం వేకువజామున ఘర్జించాయి. మంటూరు రహదారి బ్యాళి ప్లాట్ వద్ద పాత కక్షలతో మల్లిక్‌జాన్ అహ్మద్ (25)ను గురువారం హత్య చేసిన కేసులో బెండిగేరి ఠాణా పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు బాలరాజ్ అలియాస్ బంగార బాల్య, మహ్మద్ షేక్‌లను మహాజరు కోసం ఆదివారం ఉదయం తీసుకువెళ్లారు. బాలరాజ్, మహ్మద్ షేక్ ఇద్దరూ పోలీసులపై రాళ్లు రువ్వి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్ఆర్ నాయక వారిని హెచ్చరించినా ఆగకపోవడంతో కాళ్లపైకి కాల్పులు జరిపారు. పరుగుపెట్టలేక పడిపోయిన నిందితులను చికిత్స కోసం కిమ్స్‌లో చేర్పించారు. వారి రాళ్లదాడిలో గాయపడ్డ ముగ్గురు కానిస్టేబుళ్లను కూడా కిమ్స్‌లో చేర్పించామని కొత్వాలు శశికుమార్ తెలిపారు.

ఆసుపత్రి పడకపై నిందితులు

## నవంబరు క్రాంతి లేదు- అంతా సంక్రాంతికే!

**బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే:** కర్ణాటక రాజకీయాల్లో నవంబరుకు క్రాంతి (విప్లవం) వస్తుందని విపక్షాలు ఊదరగొడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఎద్దేవా చేశారు. ఏం జరిగినా సంక్రాంతి తర్వాతే మార్పులు ఉంటాయని తన ఆప్తుల వద్ద ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోసం తాను ఎన్నడూ పార్టీ అధిష్ఠానాన్ని బెదిరించలేదని, తాను జీవితాంతం క్రమశిక్షణ కలిగిన సిపాయినని పునరుద్ఘాటించారు. శీతాకాలం శాసనసభ సమావేశాల అనంతరమే మార్పులు చేర్పులు ఉండాలని తాను కోరుకుంటున్నానని పరోక్షంగా చెప్పారు. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితికి రాజీనామా చేస్తేనే, ముఖ్యమంత్రి పదవిని ఇస్తారని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. తాను బ్లాక్ మెయిల్ చేయడం కానీ, రాజీనామా చేయడం కానీ చేయనన్నారు. గత మూడున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రలో పార్టీ పెద్దలు సూచించిన మార్గంలోనే వెళుతున్నానని గుర్తు చేశారు. రాష్ట్రంలో 100 చోట్ల కాంగ్రెస్ కార్యాలయాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై పార్టీ అధ్యక్షుడు ఖర్గేతో చర్చిస్తున్నానని చెప్పారు.

## స్టే తొలగించిన న్యాయస్థానం

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** ధర్మస్థలలో అనుమానాస్పద మరణాలకు సంబంధించి సిట్ చేస్తున్న దర్యాప్తుపై విధించిన స్టేను జస్టిస్ పీఎం నవాజ్ తొలగించారు. సిట్ దర్యాప్తును నిలిపివేయాలని కోరుతూ విఠలగౌడ, గిరీశ్ మట్టణ్ణనవర్, మహేశ్ శెట్టి తిమరోడి, టి.జయంత్ గతంలో అర్జీ వేసుకున్నారు. తమను సిట్ అధికారులు 150 గంటలకు పైగా విచారణ చేశారని, మరోసారి వేధించేందుకు తమకు నోటీసులు జారీ చేశారని వారు ఆరోపించి, గతంలో తెచ్చుకున్న స్టేను న్యాయమూర్తి తొలగించారు.

## అభియోగపత్రాన్ని దాఖలు చేసిన ఈడీ

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** బేలెకేరి పోర్టు నుంచి 8 లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని చైనాకు అక్రమంగా ఎగుమతి చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ శైల్ (59)పై అభియోగపత్రాన్ని దాఖలు చేశామని ఈడీ ప్రకటించింది. ఆయన కంపెనీ శ్రీ మల్లికార్జున షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా అక్రమంగా ఎగుమతులు చేశారని 2010లో లోకాయుక్త మొదట కేసు నమోదు చేసింది. ఈ నేరం రుజువు కావడంతో ఇప్పటికే శిక్ష పడగా, బెయిలుపై బయటకు వచ్చారు. బెయిలు రద్దు కావడంతో మరోసారి దాన్ని పొడిగించుకునేందుకు అర్జీ వేసుకున్నారు. ఇదే సమయంలో రూ.44 కోట్ల అక్రమంగా నగదు లావాదేవీలకు పాల్పడిన ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసుకుంది. దర్యాప్తు పూర్తి చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రాన్ని దాఖలు చేశామని ఈడీ అధికారులు తెలిపారు.

# బ్రాండ్ బెంగళూరుకు ఉద్యాన తోరణం

సంజయ్‌నగర ఉద్యానవనంలో ప్రజల వాయువిహారం

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** పచ్చదనం, చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చే ఉద్యానవనాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార దృష్టి సారించింది. బ్రాండ్ బెంగళూరు దిశగా మరింత వన్నె తెచ్చేందుకు ఉద్యానవనాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఉదయం, సాయంత్రం పూట బాలలు, వృద్ధులు ఎక్కువ సమయం ఉద్యానవనాల్లో గడుపుతారు. తెల్లవారుజామున వాయు విహార కేంద్రాలుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్నపాటి ఉద్యానవనాల్లో నడక దారి, బహిరంగ వ్యాయామశాలను ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం యాంత్రిక జీవనం సాగిస్తున్న ప్రజలు కొద్ది సేపు విశ్రాంతి తీసుకునేలా ఉద్యానవనాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్నపాటి ఉద్యానవనంలోనూ వివిధ జాతుల చెందిన మొక్కలు పెంచుతున్నారు. పశువులు ప్రవేశించకుండా రాత్రి అసాంఘిక కార్యకలాపాలు సాగకుండా చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. నగరంలో 934 చిన్నతరహా ఉద్యానవనాలు, 62 మధ్యతరహా ఉద్యానవనాలను ప్రాధికార అభివృద్ధి చేసింది. ఉద్యానవనాల నిర్వహణ కోసం రూ.వందకోట్లు ఏడాదికి వ్యయం చేస్తున్నారు. వాటితో పాటు వార్డులకు కేటాయించే నిధులను ఉద్యానవనాలకు ఖర్చు చేస్తున్నారు. పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనాల్లో నడక దారి, విశ్రాంతి తీసుకునేందుకు అసనాలు, ఎండావానల నుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేక గుడారాలు, మరుగుదొడ్లు వంటి వాటితో పాటు బహిరంగ వ్యాయామ శాలలను ఏర్పాటు చేశారు. విజయనగర, దాసరహళ్లి, జాలహళ్లి, యలహంక, హెబ్బాళ్, సదాశివనగర, మల్లేశ్వరం, యశ్వంతపుర, శ్రీరామపుర, రాజాజినగర, గాంధీనగర, ఎస్.ఆర్.నగర, హలసూరు, జేబీనగర, సీవీరామన్‌నగర, కేఈబీ లేఔట్, కెంపేగౌడ లేఔట్, బయ్యప్పనహళ్లి, అశోక్‌నగర, కోరమంగల, మడివాళ తదితర ప్రాంతాల్లో కొత్తగా ఉద్యానవనాలను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు.

అన్నివర్గాలు ఇష్టపడే బహిరంగ వ్యాయామశాల


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116



(c) eenadu

జాతరలో వేరుసెనగ రాసులు

వివిధ రకాల వస్తువులతో.. జనం సందడి

# వేరుసెనగ జాతరకు వేళాయె!

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే:** ప్రతి కార్తీక మాసపు చివరి సోమవారం మంగళవారాల్లో నగరంలోని చారిత్రక బసవనగుడి ప్రాంతంలో జరిగే వేరుసెనగ జాతరకు సర్వం సిద్ధమైంది. ఇక్కడి గాంధీబజార్, ఎన్‌ఆర్ కాలనీ, రామకృష్ణ ఆశ్రమం, గణేశ్ భవన్ తదితర ప్రాంతాల వరకు వేలాది వైవిధ్యమైన వస్తు దుకాణాలు వెలిశాయి. కోలారు, చింతామణి, శ్రీనివాస పురం, చిక్కబళ్లాపుర, తుమకూరు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి వేరుసెనగ రైతులు తమ ఉత్పత్తులను టన్నులకొద్దీ తీసుకొచ్చారు. దసరా 10 రకాల వేరుసెనగ కాయలు వ్యాపారాన్ని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వివిధ రకాల బొమ్మలు, ఆకర్షణీయమైన కృత్రిమ పూలు, వివిధ పింగాణీ, వంటింటి వస్తువులు, మహిళలు, యువకులకు సింగార, వస్త్ర దుకాణాలు, గృహ అలంకార సామగ్రితోపాటు బాలల మనసులను ఉల్లాసపరిచే ఆటవస్తువులు, పుస్తకాలు, జెయింట్‌వీల్, రంగులరాట్నం, రైలులాంటి, బస్సులలాంటి రంగుల రాట్నాలు కనువిందు చేస్తున్నాయి. తినుబండారాల బండ్లు, రెస్టారెంట్లకు లెక్కేలేదు. మూడువేలకు పైగా దుకాణాలు ఇక్కడ వారంరోజులపాటు కొలువై ఉంటాయి. విశేషమేమిటంటే ఏటా సోమ, మంగళ వారాలు మాత్రమే జాతర జరిగేది. ఈ ఏడాది నుంచి ప్రజలు, వ్యాపారుల కోరిక మేరకు ప్రభుత్వం ఐదురోజులపాటు నిర్వహిస్తోంది. మూడురోజులు ముందు నుంచే అంగళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

### నేటి నుంచే సందడి

సోమవారం ఉదయం జాతరను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరితోపాటు మంత్రి రామలింగారెడ్డి, బసవనగుడి శాసనసభ్యుడు రవి సుబ్రమణ్య తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఐదు బసవన్నలకు పూజలు చేసి వాటికి వేరుసెనగ కాయలను నైవేద్యంగా పెట్టిన అనంతరం జాతరకు శ్రీకారం చుడతారు.

# అధిరోహిద్దామా.. అందాల గుట్ట

● దేవరమనె బెట్టకు వరుస కడుతున్న పర్యాటకులు

పచ్చదనంతో కనువిందు చేస్తున్న పర్వతాలు

ద్విచక్ర వాహనాలపై యువత దౌడు

**బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే:** పడమటి కనుమల్లో ప్రకృతి సౌందర్యానికి కొదవ లేదు. విశాలమైన పడమటి కనుమల ఎత్తైన పర్వత శిఖరాలు, సెలయేళ్లు, జలపాతాలు, పువ్వులు పండ్లతో కూడిన చెట్లు, శీతలీకరించే పరుచుకున్న పచ్చగడ్డి వాటి మధ్య సంచరించే వన్యజీవులతో ప్రదేశాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. అందులో దేవరమనె బెట్ట అత్యంత సుందరమైన ప్రదేశంగా ఖ్యాతి పొందింది. చిక్కమగళూరు, కొడగు జిల్లాల సరిహద్దులో ప్రదేశం ఉంది. ఎత్తైన పర్వత శిఖరాన్ని ఎక్కేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. అక్కడి నుంచి మార్గం వరకు కొండ ఎక్కేందుకు బైకులు ఆసక్తి చూపుతున్నారు. నిత్యం వర్షం కురిసే ప్రదేశంగా గుర్తింపు పొందడంతో ప్రకృతిప్రేమికులకు జీవితంలో ఓసారైనా సందర్శించాల్సిన పర్యాటకుల్లో ఉత్సాహం ఎక్కువ. కొండపైకి ద్విచక్రవాహనాల్లో రాలు తమ వాహనాలతో వచ్చి పర్వత శిఖరానికి కొంత దూరంలో నిలిపి.. నడిచి అధిరోహిస్తారు. దట్టమైన పచ్చగడ్డి పొదల మధ్య సంచారం నూతన అనుభూతిని ఇస్తుందని పర్యాటకులు తెలిపారు. బెంగళూరు, మైసూరు, మంగళూరు, హైదరాబాద్, ముంబయి, విజయవాడ, తదితర ప్రాంతాల నుంచి వారాంతపు సెలవుల్లో పర్యాటకులు దేవరమనె బెట్టకు వస్తున్నట్లు పర్యాటక, అటవీ శాఖ అధికారులు తెలిపారు. దట్టమైన మంచు ఆవరించడంతో ఆ ప్రదేశంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణంలో గడిపేందుకు ఇష్టపడుతున్నారు. మేఘాలతో కొండలు పూర్తిగా కప్పేసి ఉంటాయి. నడిచి వెళ్లే మార్గంలో చిన్నపాటి జలపాతాలను దాటుకుంటూ ముందుకు సాగాలి. పర్యాటకుల సురక్షిత కోసం వారి వెంట అటవీ శాఖ సిబ్బంది ఉంటారు. వన్యమృగాలు బారి పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వచ్చే పర్యాటకులు ఆరోగ్యానికి గురైతే చికిత్స అందించేందుకు అందుబాటులో వైద్యులు ఉంటారు. చిక్కమగళూరు, మూడిగెరె వెళ్లే అక్కడ నుంచి బస్సు, ట్యాక్సీలో దేవరమనె బెట్ట వద్దకు వెళ్లేందుకు రవాణా వ్యవస్థ ఉంది. కొండ కింద హోం స్టేలు ఉన్నాయి. అక్కడ విడిది తీసుకోవచ్చు. సెలవు రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి బైక్ రైడర్స్ మలుపు తిరిగిన కొండపైకి సంచరిస్తారు. అందుకు కొంత దూరం మాత్రమే అటవీ శాఖ అనుమతించింది. రాత్రిళ్లు సంచారం నిషేధించారు. దేవరమనె బెట్ట ప్రకృతి అందాలను తిలకించేందుకు యువత ముందు ఉంటున్నారు.

ఎత్తైన పర్వత శిఖరం



కొండ ఎక్కుతున్న పర్యాటకులు

# వెల్లివిరిసిన వన భోజన వేడుకలు

కార్తిక వేడుకను ప్రారంభిస్తున్న కమ్మసంఘం పెద్దలు, స్థానిక నాయకులు

**సింధనూరు, న్యూస్‌టుడే:** కార్తిక వేడుకలతో మన సంస్కృతి సంప్రదాయాలు ఇనుమడిస్తాయని ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు పేర్కొన్నారు. ఆయన ఆదివారం యలమంచలి కల్యాణ మండపంలో సింధనూరు తాలూకా కమ్మవారి సంఘం కార్తిక వనభోజన వేడుకల్లో 'ధర్మరక్షక' పురస్కారాన్ని స్వీకరించి మాట్లాడారు. జ్యోతిర్లింగ క్షేత్రం ఆలయ మండలి అధ్యక్షుడ్ని కావడం తన అదృష్టమని.. ఇందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తొలుత సింధనూరు కమ్మసంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష మాట్లాడుతూ.. మా పూర్వీకులు, పెద్దలు చూపిన మార్గంలో పయనించడం వల్లే సింధనూరులో కమ్మ సమాజం పురోభివృద్ధి సాధించిందని చెప్పారు. కార్యక్రమం ప్రారంభోత్సవం అనంతరం సమాజం పెద్ద, ప్రముఖ వైద్యుడు డా. రాధాకృష్ణ మృతికి సభికులంతా మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కె. విరూపాక్షప్ప మాట్లాడారు. అనంతరం బెంగళూరు ఆర్ఆర్.నగర్ ఎమ్మెల్యే మునిరత్నకు 'సేవారత్న-2025' పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి, కాంగ్రెస్, భాజపా సీనియర్ నాయకులు పంపనగౌడ బాదర్లి, కె.కరియప్ప, కమ్మ సమాజం పెద్దలు గొరపాటి రామకృష్ణ, బలుసు సుబ్రహ్మణ్యం, శ్రీహర్ష, కె.సుబ్బారావు, మల్లిన శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా, కమ్మని కార్తిక భోజనాలు నోరూరించాయి.

'సాధకరత్న-2025' పురస్కారాన్ని అందుకుంటున్న బెంగళూరు ఆర్ఆర్‌నగర్ ఎమ్మెల్యే మునిరత్న

# ఉద్యోగులకు మెట్రో పాస్ వితరణ

**బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే:** వాహన రద్దీ సమస్యలకు తాత్కాలికంగా చెక్ పెట్టేందుకు ఒక ఐటీ సంస్థ తన ఉద్యోగులకు మెట్రో రైలు పాస్‌లను వితరణ చేసింది. ఆర్‌వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర వరకు ఎల్లో లైన్‌లో తమ కంపెనీకి వచ్చే ఉద్యోగులకు ప్రయోగాత్మకంగా రూ.1500 విలువైన పాస్‌ను 250 మంది ఉద్యోగులకు ఇచ్చింది. కంపెనీలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తమ ఉద్యోగులు మెట్రోలో ప్రయాణించాలని సూచించింది. ఎలక్ట్రానిక్ సిటీలోని ఐటీ, బీటీ కంపెనీలకు నిత్యం 2.5 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. సొంత వాహనాల బదులుగా, ప్రజా రవాణా వ్యవస్థను విస్తృతంగా వినియోగించుకునేందుకు ఇతర సంస్థలు కూడా ముందుకు రావాలని పౌరులు కోరుకుంటున్నారు.

# పర్యాటకానికి పెద్దపీట

ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా, ఇతర ప్రతినిధులు

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే:** తమ ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీట వేస్తోందని ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా తెలిపారు. ఫిక్కీ సహకారంతో ఒడిశా పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఒడిశా పరబ్-2025 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తమ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయం, హస్తకళలను పరిచయం చేసేందుకు దేశంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్‌షోలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బెంగళూరు, కర్ణాటక నుంచి ఒడిశా పర్యటనకు వచ్చే వారికి, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించేందుకు కుమారకృప రోడ్డు లలిత్ అశోకాలో నేటి (సోమ) సాయంత్రం వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ రాష్ట్ర ఉత్పత్తులు, హస్తకళాకృతులను వివిధ స్టాళ్లలో విక్రయానికి ఉంచామన్నారు. ఆ రాష్ట్ర ఉన్నతాధికారులు బలవంత్ సింగ్, డాక్టర్ విజయ్ కేతన్, దీపంకర మహాపాత్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'కేంద్రం చేతిలో బొమ్మగా మారిపోయింది'

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం చేతిలో కేంద్ర ఎన్నికల కమిషన్ బొమ్మగా మారిపోయిందని రవాణాశాఖ మంత్రి రామలింగా రెడ్డి విమర్శించారు. బిహార్‌లో ఓటరు జాబితా నుంచి 47 లక్షల మందిని తొలగించి, కొత్తగా 18 లక్షల మందిని చేర్చారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందుగా ఒక కోటి మంది ఖాతాలకు పథకాల పేరిట తలా రూ.10 వేలు వేశారని తెలిపారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వమే ఎన్నికల కమిషన్‌తో లోపాయకారి ఒప్పందాలు చేసుకున్నప్పుడు వారిని ఎవరు పట్టుకుంటారని ప్రశ్నించారు.

# 'న్యాయాలయమే దేవాలయం కావాలి'

**రాయచూరు, న్యూస్‌టుడే :** దేవదుర్గలోని జాలహళ్లి రహదారిలో నిర్మించిన న్యాయస్థానం నూతన సముదాయ భవనాన్ని ఆదివారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ విభుబఖ్రు మొక్కకు నీళ్లు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులోని విశాలమైన భవనాలు కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతాయన్నారు. కోర్టుతో సంబంధమున్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని సలహా ఇచ్చారు. సర్వోన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ ప్రసంగిస్తూ న్యాయాలయమే దేవాలయం కావాలని, ఓడిపోయిన వ్యక్తి సంతృప్తి చెందేలా న్యాయం అందించాలని ఆకాంక్షించారు. న్యాయ సమ్మతమైన మార్గంలోనే డబ్బులు సంపాదించాలని, పేదల విషయంలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వొద్దని లాయర్లకు విజ్ఞప్తి చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ భరత్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మారుతి బగాడే, రాష్ట్ర న్యాయసేవల ప్రాధికార సభ్య కార్యదర్శి శశిధర్ శెట్టి, జిల్లా న్యాయసేవల సభ్య కార్యదర్శి సాత్విక్, జిల్లా పాలనాధికారి నితీష్, ఎస్పీ పుట్టమాదయ్య పాల్గొన్నారు.

మొక్కకు నీళ్లు పోస్తున్న జస్టిస్ విభుబఖ్రు తదితరులు

# చోరీల కేసులో నిందితుడి పట్టివేత

**రాయచూరు, న్యూస్‌టుడే :** ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన నిందితుడు గుజ్జల రామకృష్ణను అరెస్ట్ చేసినట్లు రాయచూరు ఎస్పీ పుట్టమాదయ్య వెల్లడించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాయచూరు పశ్చిమ పోలీస్ ఠాణా సర్కిల్ పరిధిలో ఆగంతకుడు ఈ ఏడాది మే 20న రెండు ఇళ్లు, ఆగస్టు 29న ఒక ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ నాగరాజు మేకా, ఎస్సై మంజునాథ్, కానిస్టేబుళ్లు నిజాముద్దీన్, జాఫర్ సాదిక్, రమేశ్, వినాయక్, సుఖ మునియప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, శివప్పతో ఒక బృందాన్ని నియమించామన్నారు. దర్యాప్తులో భాగంగా గుజ్జల రామకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడన్నారు. నిందితుడి నుంచి రూ.36.22 లక్షల విలువైన 315 గ్రాముల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు ధర్మవరం కేతిరెడ్డి కాలనీలో నివసిస్తూ.. చిప్స్ విక్రయిస్తూ జీవనం కొనసాగించే వాడన్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

# ఓట్ల చోరీతోనే ఘోర ఓటమి

**బళ్లారి, న్యూస్‌టుడే:** బిహార్ ఎన్నికల ప్రకటనకు వారం ముందు ఎటువంటి పథకం లేకుండా మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమయ్యాయి. దీని కారణంగానే భాజపాకు మహిళల ఓట్లు వచ్చాయి. దీంతో పాటు ఓటు చోరీతోనే ఇండియా కూటమి ఓటమి పాలైందని రాజ్యసభ సభ్యుడు, జమ్ముకశ్మీర్ వ్యవహారాల బాధ్యుడు డాక్టర్ సయ్యద్ నాసిర్ హుసేన్ తెలిపారు. బళ్లారి నగర పాలికె మేయర్, ఉపమేయర్ ఎన్నిక తర్వాత విలేకరులతో మాట్లాడారు. భారత ఎన్నిక కమిషన్ ఎన్నికల ముందు మహాఘట్ బంధన్‌కు చెందిన సుమారు 65లక్షల ఓటర్లను తొలగించడం వల్ల బిహార్ ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయని ఆరోపించారు. దిల్లీలో కారు విస్ఫోటనం నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తప్పు ఎవరు చేసినా..ఏ సమాజమైనా దోషులకు తగిన శిక్ష విధించాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పే అంశంపై స్పందిస్తూ, ప్రస్తుతం సీఎం స్థానం ఖాళీగా లేదన్నారు. నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందన్నారు. బళ్లారి జిల్లాకు బి.నాగేంద్ర మంత్రిగా పనిచేశారన్నారు. భాజపా నేతల ఆరోపణలు కారణంగా ఆయన నైతిక బాధ్యత వహించి రాజీనామా చేశారు. పార్టీలో ఎవరూ రాజీనామా చేయాలని కోరలేదన్నారు. నాగేంద్ర మరోసారి మంత్రి అవుతారని తెలిపారు. అదే మా కోరిక, ఆయనకు సముచిత స్థానం మా పార్టీలో ఉంది. మా హృదయాల్లో కూడా ఉన్నారని తెలిపారు.

# రాజ్యాంగంతోనే ప్రజలకు హక్కులు

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** రాజ్యాంగంతోనే ప్రజల హక్కులు, దేశ పరిపాలన సాధ్య పడుతుందని అధ్యాపకుడు డాక్టర్ చంద్రకాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సమాజ పరివర్తనా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. వేదిక ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతో దేశంలో ప్రభుత్వాలు పరిపాలనకు, సామాన్యులు, పేదలు, ప్రజల హక్కుల రక్షణ సాధ్యపడుతుంది, విద్యార్థులు, యువత ప్రతి ఒక్కరు రాజ్యాంగం గురించి తెలుసుకుని ఆ దిశలో జీవనం సాగించడం వల్ల ఉత్తమ జీవనం, ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్య పడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం గురించి ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. సమాజ పరివర్తన వేదిక అధ్యక్షుడు మహంతేశ్, దళిత సంఘర్ష సమితి జిల్లా సంచాలకుడు హెచ్.బి.గంగప్ప, సభ్యులు యేసుదాసు, సురేశ్‌బాబు, నాగప్ప, వీరేశ్, చిదానంద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, సభ్యులు

EENADU Classifieds

JOBS

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

# ఆఫ్ బీట్-2025కు చక్కని స్పందన

గానాలాపనలో సమన్విత శర్మ

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** చౌడయ్య స్మారకభవనంలో వీటీ ఎంటర్‌ప్రైజెస్ ఛారిటబుల్ ట్రస్టు శనివారం రాత్రి నిర్వహించిన ఆఫ్‌బీట్-2025 సంగీత కచేరీకి చక్కని స్పందన లభించింది. వరుసగా పదవ ఏడాది నిర్వహించిన ఈ కచేరీకి డాక్టర్ వసుధా తీర్థరామ్ రూపకల్పన చేశారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కళాకారులు శ్రుతి భిడె, అభిషేక్ రావు, సమన్విత శర్మ, దివ్యా రాఘవన్, సౌమ్య, నర్సింహన్ కణ్ణన్, సుబ్రత సాహూ, జ్యోతి కుంజేరు తదితరులు పాత, కొత్త బాలీవుడ్ గీతాలను, రెట్రో, మెట్రో పాటలను ప్రేక్షకుల ముందు ఆలపించారు. కార్యక్రమం ద్వారా సమకూరిన ఆదాయాన్ని రోటరీ కబ్బన్‌పార్కు నేతృత్వంలోని ఆనందమయ హోమ్ ఫర్ సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

పాడేందుకు సిద్ధమవుతున్న దివ్య రాఘవన్

# మంగళూరు కారాగారంలోనూ జామర్

**మంగళూరు, న్యూస్‌టుడే:** పరప్పన అగ్రహార కారాగారంలో ఖైదీలో చరవాణులు వినియోగిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో మంగళూరు కారాగారంలోనూ జామర్లు ఏర్పాటు చేశారు. జామర్ల సంఖ్య ఎక్కువ కావడంతో కారాగారానికి 800 మీటర్ల పరిధిలోని నివాసాలు, దక్షిణ కన్నడ జిల్లా న్యాయస్థానంలో చరవాణులు మూగబోయాయి. తమ విధులు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంగళూరు న్యాయవాదుల సంఘం ఆరోపించింది. న్యాయస్థానం వైపు జామర్లను తొలగించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే తాము విధులు బహిష్కరించి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

# కేబుళ్ల చోరీ.. ఇద్దరికి బేడీలు

**చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే:** గ్రామీణ పోలీసు ఠాణా అధికారులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి చోరీ చేసిన 500 మీటర్ల పొడవైన గొట్టపు బావుల విద్యుత్తు మోటార్లకు అమర్చే కేబుళ్లను స్వాధీనం చేసుకొన్నారు. ఆదివారం కుంచిటగనాళ్ గ్రామ సమీపాన బెంగళూరు పుణె జాతీయ రహదారి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న భరమసాగర గొల్లరహట్టి నివాసితులు కాటేశ(25), సిద్దేశ్(30)లను గస్తీ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అసలు విషయం వెలుగుచూసింది. నిందితులు హిరియూరు తాలూకా ఐమంగళ, జానుకొండ, దేవపురదహట్టి, కరికట్టె, అన్నేహాళ్ తదితర గ్రామాల వద్ద రైతుల పొలాల నుంచి కేబుళ్లను చోరీ చేసినట్లు అంగీకరించారని పోలీసు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వృద్ధుడి హత్య కేసులో..

**చామరాజనగర, న్యూస్‌టుడే:** చేసిన అప్పులు తీర్చేందుకు హెచ్‌ఎం స్వామి (73) అనే వృద్ధుడిని హత్య చేసిన ముగ్గురు నిందితులను గుండ్లుపేట తాలూకా బేగూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. పరశివమూర్తి, సిద్ధరాజు, మహేశ్‌లను నిందితులుగా గుర్తించారు. స్వామి వద్ద పరశివమూర్తి అప్పు తీసుకున్నాడు. తన బకాయి తీర్చాలని కోరిన స్వామిని, బాకీ తీర్చుతానని తన ఇంటికి పిలిపించుకున్నాడు. తన స్నేహితులు ఇద్దరితో కలిసి దాడి చేసి అతన్ని హత్య చేసి కమరహళ్లి వద్ద రహదారి పక్కన మృతదేహాన్ని గత సోమవారం పడేసి వెళ్లారు. పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.

# దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

**మైసూరు, న్యూస్‌టుడే:** బావమరిది, అతని స్నేహితుల దాడిలో తీవ్రంగా గాయపడిన రాజేంద్ర, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. భర్తను అడ్డు తప్పించుకునేందుకు నంజనగూడు శివార్లలోని హుండువినహళ్లి వద్ద అక్టోబరు 26 రాత్రి దోపిడీ నాటకాన్ని తెరపైకి తీసుకువచ్చి, భర్తపై కత్తులతో దాడి చేయించింది. ఈ ఘటనకు సంబంధించి రెండు రోజుల్లోనే రాజేంద్ర భార్య సంగీత, మరో ముగ్గురు నిందితులను నంజనగూడు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. తీవ్రంగా గాయపడుతూ చికిత్స పొందుతూ మైసూరులోని ఆసుపత్రిలో ఆదివారం ఉదయం మరణించారు. హత్యాయత్నం కేసును, హత్యకేసుగా మార్చి దర్యాప్తు కొనసాగించారు.

సంతోషంగా ఉన్న రోజుల్లో భార్యతో రాజేంద్ర

# బెయిలు అర్జీని తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** మహిళా కానిస్టేబుల్‌కు తాళి కట్టి, శారీరక సుఖాలను అనుభవించి, మరో యువతితో వివాహం నిశ్చితార్థం చేసుకున్న కానిస్టేబుల్ భగవంతరాయ బసంతరాయ బిరాదర్‌కు బెయిలు ఇచ్చేందుకు జస్టిస్ ఎస్ రాచయ్య నిరాకరించారు. తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా అమృతూరు ఠాణాలో సింధగికి చెందిన భగవంతరాయ కానిస్టేబుల్‌గా పని చేసేవాడు. షెడ్యూల్డు కులానికి చెందిన కానిస్టేబుల్‌ను వివాహం పేరిట ఇంట్లోనే తాళి కట్టి శారీరక సుఖాలు అనుభవించాడు. మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నట్లు గుర్తించి ఆమె నిలదీయడంతో నీకూ నాకు సంబంధం లేదని చెప్పడంతో ఆమె కేసు పెట్టింది. దిగువ న్యాయస్థానం అతనికి బెయిలు ఇవ్వకపోవడంతో నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా, ఇక్కడా చుక్కెదురైంది.

# రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు..

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** ఎలక్ట్రానిక్ సిటీ సంచార పోలీసుఠాణా పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు విశాల్‌కౌర్(25) మృతిచెందారు. గొల్లహళ్లిలో నివసించే విశాల్‌కౌర్ తెల్లవారు జామున 4 గంటలకు స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎలక్ట్రానిక్‌సిటీ మొదటి ఫేజ్‌లో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ విశాల్‌కౌర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

# కారు చక్రం కిందపడి పసిబిడ్డ దుర్మరణం

**బెంగళూరు(బాణసవాడి):** కారు రివర్స్ తీసే సమయంలో వెనక ఉన్న బాలుడిని ఢీకొని చక్రం దూసుకుపోవడంతో ఏడాదిన్నర వయస్సు కలిగిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం రాత్రి మాదనాయకనహళ్లి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. సాయంత్రం ఏడుగంటలకు బెనకలేఔట్‌లో జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు పాటించాలి

**బెంగళూరు (మల్లేశ్వరం):** సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కుక్క, పాము కాటు బాధితులకు చికిత్సలను అందించేందుకు ఔషధాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు సూచించారు. రోగికి చికిత్స అందించేందుకు ముందస్తుగా నగదు చెల్లించాలని, బయానా ఇవ్వాలని ఒత్తిడి చేయకూడదని ఆదేశించారు. కర్ణాటకలో 2030 నాటికి కుక్క కాటుతో రేబిస్ బారిన పడి మరణించే వారి సంఖ్యను సున్నాకు తీసుకువచ్చే లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆరోగ్యశాఖ సిబ్బంది శ్రమించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలో యాంటీ-రేబిస్, యాంటీ వీనమ్ డోసులను సిద్ధంగా ఉంచుకోవాలని తన ఎక్స్‌కార్ప్ ఖాతాలో ట్వీట్ చేసి సూచనలు చేశారు.

# రెవెన్యూ అదాలత్‌ను వినియోగించుకోండి

**రాయచూరు, న్యూస్‌టుడే :** నగరపాలక సంస్థ ఇళ్ల వద్దకు వచ్చేసి సేవలందిస్తున్న రెవెన్యూ ప్రత్యేక అదాలత్‌ను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని రాయచూరు శాసనసభ్యుడు డాక్టర్ శివరాజ్ పాటిల్ కోరారు. 18వ వార్డులో ఆదివారం అదాలత్ నిర్వహించారు.

(c) eenadu

# బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

వార్షికోత్సవంలో పాల్గొన్న ఎస్‌యూసీఐ నాయకులు

## సమ సమాజమే రష్యా విప్లవ ధ్యేయం

**హొసపేటె, న్యూస్‌టుడే:** ప్రపంచ విప్లవాల్లో భిన్నమైంది రష్యా విప్లవమని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూసీఐ) నాయకురాలు మంజుల పేర్కొన్నారు. రష్యా విప్లవానికి 108 ఏళ్లయిన సందర్భంగా ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రష్యాలో జరిగిన విప్లవాన్ని నేతాజీ సుభాష్‌చంద్రబోసు కూడా కొనియాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పాలాక్ష, ప్రశాంత్, ప్రకాశ్‌నాయక్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

అభయ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందోహం

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** వెంకటేశ్వర నగర్ అభయ వరదాంజనేయస్వామి ఆలయంలో వినాయకుడికి, రామలింగేశ్వరుడికి, ఆంజనేయస్వామికి అభిషేకాలు చేపట్టారు. పుష్పాలతో అలంకరించారు. ఆకాశదీపోత్సవం, సహస్రదీపార్చన పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి కార్తికపురాణ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాలదగు ధనంజయ, భీమలింగనగౌడ, రాజశేఖరరెడ్డి, నగేష్, శ్రీరాములు, భీమేష్, వీరేష్, నటరాజు, ముల్లంగి గిరి, రాజు, లోకరాజు, సత్తిబాబు, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## చిగురుపాటి సేవలు ప్రశంసనీయం

రక్త దూత సేవా వాహనాన్ని అందిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి

**హుబ్బళ్లి (కారటగి), న్యూస్‌టుడే:** హుబ్బళ్లి స్వర్ణ సమూహ సంస్థల అధిపతి డాక్టర్ చిగురుపాటి వి.ఎస్.వి.ప్రసాద్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి కొనియాడారు. హుబ్బళ్లి శాదమజి జాదవజి ఛేడా మెమోరియల్ రాష్ట్రోత్థాన రక్త కేంద్రానికి డాక్టర్ చిగురుపాటి ప్రసాద్ ఓ ఈవీ స్కూటర్ (రక్త దూత సేవా వాహనం), నాలుగు సెల్ఫీ స్టాండులను కానుకగా ఇచ్చారు. కేంద్ర మంత్రి వాటిని ఆదివారం రక్త కేంద్రం ప్రతినిధులకు అందించి మాట్లాడుతూ రోగులకు సకాలంలో రక్తాన్ని అందించేందుకు రక్త దూత సేవా వాహనాల అవసరం ఉందన్నారు. గతంలో కూడా ప్రసాద్ రెండు రక్త దూత వాహనాలు సమకూర్చడమే గాక బస్ కొనుగోలుకు ఆర్థిక సాయం అందించారన్నారు. నూతన సేవా కేంద్రం నిర్మాణంలో వీరేంద్ర ఛేడా, రక్త కేంద్రం ప్రతినిధి దత్తమూర్తి కులకర్ణి సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ వి.ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రోత్థాన రక్త కేంద్రం రోగులకు ఉచితంగా రక్తం అందిస్తుంది. సకాలంలో రక్తం అందించేందుకు ఈ రక్త దూత వాహన సేవను ప్రారంభించామన్నారు. ఆసుపత్రుల్లో అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు రక్త దూత మొబైల్ 93536-23822 నంబరులో సంప్రదించాలని కేంద్రం ప్రతినిధులు సూచించారు. వైద్యులు, వ్యాపారవేత్తలు, నాయకులు పాల్గొన్నారు.

## యాప్ ఉందిగా..రైతన్నలకు తోడుగా

**కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు**

బళ్లారి ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయం

**బళ్లారి, న్యూస్‌టుడే:** కనీస మద్దతు ధర పథకం కింద ఖరీఫ్, రబీలో పండించిన సామలు, కొర్రలు, రాగి, జొన్న ఉత్పత్తులను రైతు నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్య కార్యదర్శి, ఆహార పౌర సరఫరాల ఉపనిర్దేశకులు సకీనా తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం మద్దతు ధర పథకం కింద చిన్న ధాన్యం సామ, కొర్రలు, రాగులు, జొన్న ఉత్పత్తులను విక్రయించడానికి రైతులు ముందు వ్యవసాయ శాఖ పోర్ట్ సాంకేతిక యాప్‌లో పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

**కొనుగోలు కేంద్రాలు**

బళ్లారి తాలూకా వ్యవసాయ ఉత్పత్తి సహకార సంఘం, మోకా, అసుండి, రూపనగుడి గ్రామాల్లోని ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘంలో అవకాశం కల్పించారు. కురుగోడు తాలూకాలో కురుగోడు ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘంలో, సిరుగుప్ప తాలూకాలోని కె.బెళగల్లు, కరూరు, హచ్చొళ్లి, బి.ఎం.సూగూరు, తాళూరు, ముద్దటనూరు, అరళినూరు గ్రామాల్లో ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘంలో, సండూరు తాలూకాలో సండూరు, చోరనూరు ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘంలో అమ్ముకోవచ్చు.

**నమోదు ప్రక్రియ**

తాలూకా స్థాయి పిర్కాలోని మోకా, హచ్చొళ్లి, కరూరు, కొనుగోలు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో, రైతులు నేరుగా కేంద్రాలకు చేరుకుని నమోదు చేసుకోవచ్చు. వ్యవసాయ పోర్టల్లో రైతులు పూర్తి వివరాలతో నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

**ధరల వివరాలు**

హైబ్రిడ్ జొన్నలు రూ.3699, ఎర్రజొన్నలు రూ.3749లు, రాగులు రూ.4889, సామలు, కొర్రలు రూ.4886 ధరలు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**నమోదుకు గడువు**

రాగి, సామ, కొర్రలు డిసెంబరు 15 వరకు నమోదుకు అవకాశం. 2026 జనవరి 1 నుంచి మార్చి 31వరకు కొనుగోలు చేస్తారు. జొన్నలు 2026 మార్చి 31 వరకు నమోదుకు గడువు. 2026 జనవరి 1 నుంచి ఏప్రిల్ 30 వరకు విక్రయించుకోవచ్చు.

**బ్యాంకు ఖాతాల్లో జమ**

జొన్నలను ప్రతి రైతు ఎకరాకు 15 క్వింటాళ్ల గరిష్ఠంగా 150 క్వింటాళ్ల విక్రయించుకోవడానికి అవకాశం కల్పించారు. రాగులు ప్రతి రైతు ఉత్పత్తికి అనుగుణంగా ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 50 క్వింటాళ్ల వరకు విక్రయించుకోవడానికి అవకాశం కల్పించారు. సామలు, కొర్రలు ప్రతి రైతు ఉత్పత్తికి అనుగుణంగా ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 50 క్వింటాళ్ల వరకు విక్రయించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ధాన్యాలను విక్రయించి రైతుల బ్యాంక్ ఖాతాకు ఆర్.టి.జి.ఎస్ ద్వారా జమ చేస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం జిల్లా వ్యవస్థాపక అధికారి కార్యాలయం 8867271187, బళ్లారి 9008841654, కంప్లి 9986266823, సిరుగుప్ప 7259598625, కురుగోడు 8951307333, సండూరు 9980676497ను సంప్రదించాలని కోరారు.

## స్థాయి సమితి సభ్యుల ఎంపిక

**బళ్లారి, న్యూస్‌టుడే:** బళ్లారి నగర పాలికె వివిధ స్థాయి సమితి అధ్యక్షులు ఎంపికయ్యారు.

- **నగర పాలికె పన్నులు, ఆర్థికశాఖ సభ్యులు:** కుబేర(వార్డు-38), ముల్లంగి నందీష్(వార్డు-18), హెచ్.రాజశేఖర్(వార్డు-05), నూర్ మహమ్మద్(వార్డు-15), శ్వేత(వార్డు-31)ఎన్.ఎం.డి.ఆసిఫ్ బాషా(వార్డు-30), బి.రత్నమ్మ(వార్డు-14).
- **శిక్షణ, ఆరోగ్య సభ్యులు:** పి.వివేక్(వార్డు-20), శశికళ(వార్డు-39), జి.శిల్ప(వార్డు-29), బి.జానకి(వార్డు-33), జబ్బర్‌సాబ్(వార్డు-09), ఎం.రాజేశ్వరి(వార్డు-34), ఉమాదేవి(వార్డు-07).
- **నగర యోజన, అభివృద్ధి సభ్యులు:** మాలన్ బి(వార్డు-37), కవిత(వార్డు-17), డి.త్రివేణి(వార్డు-04), నియాజ్ అహ్మద్(వార్డు-27), మంజుల(వార్డు-32), ఎం.కె.పద్మరోజ(వార్డు-6), బి.జానకి(వార్డు-33).
- **లెక్కపత్రాల సభ్యులు:** హనుమంత(వార్డు-22), జి.హనుమంత(వార్డు-01),టి.శ్రీనివాస మోత్కార్(వార్డు-24), నాగరత్న(వార్డు-16), ఎన్.గోవిందరాజులు(వార్డు-11), కె.ఎ.చేతన్(వార్డు-12), ఎస్.సురేఖ(వార్డు-21). ఎంపికయిన వారి జాబితాను ఎన్నికల అధికారి వెల్లడించారు.

## పురస్కార గ్రహీతకు సన్మానం

**బళ్లారి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర సహకార రత్న పురస్కారాన్ని అందుకున్న కె.పి.సి.సి. వ్యాఖ్యాత, బళ్లారి జనతా బజార్ డైరెక్టర్ వెంకటేశ హెగ్డేను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సయ్యద్ నాసిర్ హుసేన్ తన కార్యాలయంలో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు పొంది, పార్టీ అభివృద్ధికి శ్రమించాలని కోరారు. హుమాయూన్‌ఖాన్, వీరనగౌడ, హొన్నూరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## టిప్పుసుల్తాన్ పోరాటయోధుడు

మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్యే తదితరులు

**మాన్వి, న్యూస్‌టుడే :** టిప్పుసుల్తాన్ గొప్ప దేశభక్తి గల స్వాతంత్ర్య పోరాట యోధుడని, దేశం కోసం ఆయన పిల్లలనే పణంగా పెట్టిన త్యాగశీలి అని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. శనివారం రాత్రి టిప్పుసుల్తాన్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఆయన జయంతిని ఆచరించిన ఘనత మాన్వికే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, ముడా అధ్యక్షుడు గఫూర్‌సాబ్, టిప్పుసుల్తాన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హుసేని తదితరులు మాట్లాడారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన సాధకులను, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించారు. పికార్డు బ్యాంకు అధ్యక్షుడు రాజా సుభాశ్చంద్రనాయక్, గ్యారంటీ సమితి అధ్యక్షుడు అమరేశప్ప, సమాజ సేవకుడు అక్బర్‌సాబ్, ఖాలీద్ ఖాద్రి, మిర్జా ఆదం బేగ్, ఇబ్రాహీం కురేషి, ఖలీల్ కురేషి తదితరులు పాల్గొన్నారు.

## కనకదాసు చిత్రపటం ఊరేగింపు

పాల్గొన్న సముదాయ నాయకులు, ప్రజలు

**కంప్లి, న్యూస్‌టుడే:** కనకదాసు జయంతిని పురస్కరించుకుని కంప్లిలో హాలుమత సముదాయ ప్రజలు ఆదివారం ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. జానపద కళా బృందాలు వెంటరాగా సాంగత్రయ సంస్కృత పాఠశాల నుంచి ప్రారంభమైన ఊరేగింపు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బీర లింగేశ్వర ఆలయం వరకు జరిగింది. ఎమ్మెల్యే గణేశ్, హాలు మత సముదాయ నాయకులు కె.వసంతకుమార్, కురి సిద్ధప్ప, బి.శేఖర్, కురి హుసేనప్ప, ప్రజలు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా తులసీ దామోదర కల్యాణం

బాలాజీ క్యాంపులో కల్యాణం చేస్తున్న పండితులు లక్ష్మీనారాయణ ఆచార్

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** బాలాజీ క్యాంపులో వెలసిన లక్ష్మీ బాలాజీ పద్మావతి ఆలయంలో ఆదివారం కార్తిక ద్వాదశి పురస్కరించుకుని కార్తిక దామోదర పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నిత్యకైంకర్యాలు చేపట్టారు. పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో తులసిచెట్టు, ఉసిరిచెట్టు కింద తులసీ దామోదర కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. పండితులు లక్ష్మీనారాయణ ఆచార్యులు మాట్లాడుతూ కార్తిక మాసంలో తులసీ దామోదర కల్యాణం చేసి ఉసిరి చెట్టుకింద వనభోజనం చేస్తే శుభఫలితాలు కల్గుతాయని, కార్తిక పురాణాన్ని చదివి విన్పించారు. అనంతరం భక్తులందరికీ పిండివంటలు వడ్డించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేములపల్లి రాధాప్రసాదు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు శేషమ్మ, చన్నప్ప, బాలాజీ రవికుమార్, అనిల్‌బాబు, డా.సౌజన్య, క్యాంపు వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై స్పందించండి

సంఘం నిర్దేశకులను సత్కరించిన ఉపాధ్యాయులు

**కారటగి, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయ సహకార సంఘం నిర్దేశకులు ఉపాధ్యాయుల సమస్యల పట్ల సక్రమంగా స్పందించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం కారటగి తాలూకా అధ్యక్షుడు విఠల్ జీరగాళి సూచించారు. నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ సహకార సంఘం నిర్దేశకులు నరహరి, అన్నపూర్ణ సజ్జన్‌లను మర్లానహళ్లిలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీలకంఠప్పకు శ్రేష్ఠ సహకార ప్రశస్తి



**బళ్లారి, న్యూస్‌టుడే:** జిల్లా సహకార సంఘం అభివృద్ధికి శ్రమించిన బళ్లారి జనతా బజార్ మాజీ అధ్యక్షుడు జి.నీలకంఠప్పకు బళ్లారి జిల్లా శ్రేష్ఠ సహకార పురస్కారానికి ఎంపికయ్యారు. సోమవారం హొసపేటె సురభి కల్యాణ మండపంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సహకార సంఘం 72వ అఖిల భారత సహకార సప్తాహ సమావేశంలో నీలకంఠప్పకు పురస్కారం అందించనున్నారు.

## విందు..వినోదం..వితరణ

- కార్తిక వనభోజనాలు సందడే..సందడి
- సముదాయ భవనానికి ఎమ్మెల్యే రూ.కోటి విరాళం

మాన్వి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప

**బళ్లారి, న్యూస్‌టుడే:** బీడు భూముల్లో కూడా బంగారు పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న కమ్మ సోదరులు ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని బెంగళూరు రాజా రాజేశ్వరనగర ఎమ్మెల్యే మునిరత్నం ఆకాంక్షించారు. కుడతిని కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో కురుగోడు రహదారిలో విశాలమైన ప్రదేశంలో నిర్మిస్తున్న కుడతిని కమ్మభవనం నిర్మాణానికి ఎమ్మెల్యేలు మునిరత్నం, ఇ.అన్నపూర్ణ, సంఘం అధ్యక్షుడు విఠలాపురం రాము, సంఘం గౌరవ అధ్యక్షుడు సూర వెంకటరమణప్ప, కుడతిని పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత, మాజీ మేయర్ ముల్లంగి నందీష్, బుడా మాజీ అధ్యక్షుడు ముల్లంగి రవీంద్రబాబు, బెస్ట్ విద్యా సంస్థల ఛైర్మన్ కోనంకి రామప్ప పాల్గొని భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఇ.అన్నపూర్ణ మాట్లాడుతూ కుడతిని కమ్మభవనం నిర్మాణానికి నా భర్త ఇ.తుకారామ్ సహకారంతో రూ.కోటి అందజేస్తామని ప్రకటించారు. అనంతరం రుచికరమైన వంటకాలతో వనభోజనాలు ఆరగించారు. బళ్లారి జిల్లా నుంచే కాకుండా కొప్పళ, విజయనగర రాయచూరు జిల్లాల నుంచి కమ్మసోదరులు తరలివచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వివేక్, డా.అరుణ కామినేని, భీమనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మాన్వి, న్యూస్‌టుడే :** సంఘ సంస్థల అభివృద్ధి, బలోపేతానికి స్థలాలు, నిధులను విరాళంగా ఇచ్చిన దాతలను విస్మరించరాదని, కమ్మసంఘం అభివృద్ధికి రూ.20 లక్షల ఇవ్వనున్నట్లు మంత్రి బోసురాజు ప్రకటించారు. స్థానిక కాకతీయ పాఠశాల ప్రాంగణంలో తాలూకా కమ్మవారి సంఘం ఏర్పాటైన కార్తిక మాస వనభోజన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ ప్రారంభించి మాట్లాడారు. బాడ్మింటన్ ఛాంపియన్ రోహన్‌ను ప్రముఖులు సత్కరించారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, కర్ణాటక కమ్మ సంఘాల అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కమ్మభవనం నిర్మాణానికి చెక్కుల వితరణ

భవంతి త్రీడీ చిత్రం విడుదల

## ఆకట్టుకొన్న ముగ్గుల పోటీ

పాల్గొన్న మహిళలు

**చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే:** స్వదేశీ జాగరణ మంచ్ నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో సుమారు 50 మంది మహిళలు పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేశారు. పలువురు మహిళలు వేసిన రంగవల్లులు ప్రేక్షకులను బాగా ఆకట్టుకొన్నాయి. ఉత్తమ రంగవల్లులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

## గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలు

పాఠకులతో గ్రంథాలయ పాలకుడు దేవేంద్ర

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** గ్రంథాలయాలు విద్యార్థులు, యువతకు జ్ఞాన కేంద్రాలని గ్రంథాలయ పాలకుడు దేవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని బైపాస్ రహదారిలో గల అలెమారు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ సప్తాహ కార్యక్రమాన్ని పాఠకులతో కలిసి ఆచరించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ విజ్ఞాన పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి పురస్కరించుకుని ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకు సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తారని, వీటి ద్వారా విద్యార్థులు, యువతలో పుస్తకపఠనాసక్తి, జ్ఞానవృద్ధి పెంపొందుతాయన్నారు. నిత్య పుస్తక పఠనంతో ప్రతి ఒక్కరి జీవితాల్లో గణనీయమైన మార్పు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివలింగప్పకు అభినందనల వెల్లువ

పురస్కారాన్ని అందుకుంటున్న శివలింగప్ప

**బళ్లారి, న్యూస్‌టుడే:** కొత్తదిల్లీలోని త్రివేణి కళ సంఘం భవనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.శివలింగప్పకు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారాన్ని అందజేసి అభినందించారు. బళ్లారి తాలూకా హంద్యాళు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కె.శివలింగప్ప నోట్ బుక్ మక్కళ కథకు కేంద్ర సాహిత్య అకాడమీ 2025 ఏడాదికి శివలింగప్పకు బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. పురస్కారం అందుకున్న సందర్భంగా శివలింగప్పను పలువురు అభినందించారు.

## వీధి కుక్కల దాడి: 50 గొర్రె పిల్లలు మృతి

మృతి చెందిన గొర్రె పిల్లలు

**చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే:** వీధికుక్కల దాడిలో 50కు పైగా గొర్రెల పిల్లలు మృతి చెందిన ఘటన తిమ్మలాపురం వద్ద చోటుచేసుకుంది. ఆదివారం హొసదుర్గం తాలూకా ఎల్లదకెర గ్రామ పంచాయతీ పరిధిలోని పిలాద్నహళ్లి గ్రామానికి చెందిన బాధితుడు శివణ్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రె పిల్లలను గ్రామ సమీపంలోని పొలంలో కంచె మధ్య ఉంచి ఓ వ్యక్తి కాపలా ఉన్నాడు. కాపాలాగా ఉన్న వ్యక్తి గొర్రెలను మేతకు తోలుకొని వెళ్లినప్పుడు ఈ ఘటన చోటు చేసుకొంది. శనివారం సాయంత్రం సుమారు 4 గంటలకు 20కు పైగా వీధి కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందలోకి ప్రవేశించి పిల్లలపై దాడి చేశాయి. ఆపబోయిన కాపలాదారుపైనా కుక్కలు దాడికి యత్నించడంతో అతను అక్కడ నుండి పారిపోయి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కుక్కల దాడిలో గొర్రె పిల్లలు తప్పించుకోవడానికి అవకాశం లేకపోవడంతో అవి మృతి చెందాయి. సుమారు రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు శివణ్ణ తెలిపారు. ప్రభుత్వము బాధితునికి నష్టపరిహారం మంజూరు చేయాలని బాధితుడు డిమాండ్ చేశారు.

## దేశీయ క్రీడలను ప్రోత్సహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున

**సిరివార, (మాన్వి) :** దేశీయ క్రీడలను ప్రోత్సహించాలని మాన్వి బాజపా మాజీ అధ్యక్షుడు మల్లికార్జున పేర్కొన్నారు. తాలూకాలోని బాగలవాడ గ్రామంలో భగత్‌సింగ్ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడలంటే క్రికెట్ అనే విధంగా మాదిరిగా మారిపోయిందన్నారు. క్రికెట్‌ను మించిన దేశీ క్రీడలెన్నో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రప్పగౌడ, డి.అరుణ్‌కుమార్ నాయక్, మల్లనగౌడ పాటిల్, మౌనేశ్ కోరి, తిమ్మణ్ణ, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

## కుడతిని రైతులకు న్యాయం చేయరూ!

ఎంపీ డాక్టర్ హుసేన్‌కు వినతిపత్రం అందిస్తున్న కుడతిని భూపోరాట సమితి సభ్యులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** విజయనగర ప్రదేశాభివృద్ధి ప్రాధికార పరిధిలోకి వచ్చే కుడతిని చుట్టుపక్కల ఎనిమిది గ్రామాలకు చెందిన రైతులు నుంచి 12500 ఎకరాల వ్యవసాయ భూమిని 2010-12మధ్యలో వివిధ కంపెనీలకు తక్కువ ధరకు స్వాధీనం చేసుకున్నారు. రైతులకు న్యాయం చేయాలని 1065 రోజులుగా పట్టణంలో నిరవధిక సత్యాగ్రహం చేస్తున్నాం. రైతులకు న్యాయం చేయాలని కుడతిని భూపోరాట సమితి ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సయ్యద్ నాసిర్ హుసేన్‌కు వినతిపత్రం అందజేసి డిమాండ్లను వివరించారు. నూతన భూస్వాధీన చట్టం ప్రకారం ధర ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినా రైతులకు న్యాయం చేయలేదన్నారు. కె.ఐ.డి.బి నిబంధనలు ఉల్లంఘనతో రైతులు మోసపోయారన్నారు. కార్యక్రమంలో రైతులు తిప్పేస్వామి, జంగ్లిసాబ్, పంపాపతి, స్వామి, మల్లికార్జున, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గుర్తింపు శుభపరిణామం

గురుస్వామిని సత్కరిస్తున్న తిప్పేరుద్రప్ప, కిరణ్, విరుపాక్షప్ప తదితరులు

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** నేత కార్మికుడు, తిప్పేరుద్రప్ప చేనేత సహకార సంఘం సభ్యుడు గురుస్వామికి ఇటీవల రాష్ట్రప్రభుత్వం సహకార రత్న పురస్కారం అందజేసింది. ఆదివారం తిప్పేరుద్రప్ప చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో గురుస్వామికి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కావేరి హ్యాండలూమ్స్ మాజీ అధ్యక్షుడు నేకార విరుపాక్షప్ప మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికులను గుర్తించి పురస్కారం అందజేయడం శుభపరిణామమన్నారు. నేటికి చేనేతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాగరాజు, కొండయ్య, మల్లికార్జున ప్రాల్గొన్నారు.

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 16-11-2025 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1624.61 | 1631.08 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 2,987 | 3,269 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 7,211 | 8,007 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 75.226 | 98.180 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## 12 ఏళ్లుగా తప్పించుకొని..చివరికి బేడీలు

**చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే:** 12 సంవత్సరాలుగా కోర్టుకు హాజరు కాకుండా, పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు బెంగళూరుకు చెందిన గంగాధర్‌ను మొలకాల్మూరు పోలీసులు అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు. ఆదివారం వారు తెలిపిన వివరాల మేరకు బెంగళూరు బాణసవాడి సమీపాన గల చన్నసంద్రలో నివాసముంటున్న గంగాధర్ అప్పట్లో అతని వయస్సు 24, 2013లో మొలకాల్మూరు తాలూకా బిజికెర వద్ద తన వాహనంతో ఎద్దుల బండిని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అతను అప్పటి నుంచి తప్పుడు అడ్రసు ఇచ్చి పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరగడమే కాకుండా కోర్టుకు కూడా హాజరు కాలేదు. పోలీసులు కేసును విచారించి, నిందితునిపై అభియోగ పత్రాన్ని కోర్టుకు దాఖలు చేశారు. నిందితునిపై కోర్టు వారెంటును జారీ చేసింది. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి బెంగళూరులో అరెస్టు చేసి మొలకాల్మూరు కోర్టుకు అప్పగించారు. నిందితుణ్ని న్యాయ నిర్బంధానికి పంపారని పోలీసు అధికారులు తెలిపారు.

(c) eenadu

జాతరలో వేరుసెనగ రాసులు

వివిధ రకాల వస్తువులతో జాతరలో జనం సందడి

# వేరుసెనగ జాతరకు వేళాయె!

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే:** ప్రతి కార్తీక మాసపు చివరి సోమవారం మంగళవారాల్లో నగరంలోని చారిత్రక బసవనగుడి ప్రాంతంలో జరిగే వేరుసెనగ జాతరకు సర్వం సిద్ధమైంది. ఇక్కడి గాంధీబజార్, ఎన్‌ఆర్ కాలనీ, రామకృష్ణ ఆశ్రమం, గణేశ్ భవన్ తదితర ప్రాంతాల వరకు వేలాది వైవిధ్యమైన వస్తు దుకాణాలు వెలిశాయి. కోలారు, చింతామణి, శ్రీనివాస పురం, చిక్కబళ్లాపుర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి వేరుసెనగ రైతులు తమ ఉత్పత్తులను టన్నులకొద్దీ తీసుకొచ్చారు. ఈసారి 10 రకాల వేరుసెనగ కాయలు వర్తకానికి రానున్నాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వివిధ రకాల బొమ్మలు, ఆకర్షణీయమైన కృత్రిమ పూలు, వివిధ పింగాణీ, వంటింటి వస్తువులు, మహిళలు, యువతులకు సింగార, వస్త్ర దుకాణాలు, గృహ అలంకార సామగ్రితోపాటు బాలల మనసులను ఉల్లాసపరిచే ఆటవస్తువులు, పుస్తకాలు, జెయింట్‌వీల్, రంగులరాట్నం, రైలులాంటి, బస్సులాంటి రంగుల రాట్నాలు కనువిందు చేస్తున్నాయి. తినుబండారాల బండ్లు, రెస్టారెంట్లకు లెక్కేలేదు. మూడువేలకు పైగా దుకాణాలు ఇక్కడ వారంరోజులపాటు కొలువై ఉంటాయి. విశేషమేమిటంటే ఏటా సోమ, మంగళ వారాలు మాత్రమే జాతర జరిగేది. ఈ ఏడాది నుంచి ప్రజలు, వ్యాపారుల కోరిక మేరకు ప్రభుత్వం ఐదురోజులపాటు నిర్వహిస్తోంది. మూడురోజుల ముందు నుంచే అంగళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

### నేటి నుంచే సందడి

సోమవారం ఉదయం జాతరను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరితోపాటు మంత్రి రామలింగారెడ్డి, బసవనగుడి శాసనసభ్యుడు రవి సుబ్రహ్మణ్య తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఐదు బసవన్నలకు పూజలు చేసి వాటికి వేరుసెనగ కాయలను నైవేద్యంగా పెట్టిన అనంతరం జాతరకు శ్రీకారం చుడతారు.

# అధిరోహిద్దామా.. అందాల గుట్ట

● దేవరమనె బెట్టకు వరుస కడుతున్న పర్యాటకులు

పచ్చదనంతో కనువిందు చేస్తున్న పర్వతాలు

ద్విచక్రవాహనాలపై యువత దౌడు

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** పడమటి కనుమల్లో ప్రకృతి సౌందర్యానికి కొదవ లేదు. విశాలమైన పడమటి కనుమలు ఎత్తైన పర్వత శిఖరాలు, సెలయేర్లు, జలపాతాలు, పువ్వులు పండ్లతో కూడిన చెట్లు, తివాచీల పరుచుకున్న పచ్చగడ్డి వాటి మధ్య సంచరించే వన్యజీవులతో కూడి ఉన్నాయి. అందులో దేవరమనె బెట్ట అత్యంత సుందరమైన ప్రదేశంగా ఖ్యాతి పొందింది. చిక్కమగళూరు, కొడగు జిల్లాల సరిహద్దులో ప్రదేశం ఉంది. ఎత్తైన పర్వత శిఖరాన్ని ఎక్కేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. అక్టోబరు నుంచి మార్చి వరకు కొండ ఎక్కేందుకు టెకీలు ఆసక్తి చూపుతున్నారు. నిత్యం వర్షం కురిసే ప్రదేశంగా గుర్తింపు పొందడంతో ప్రదేశాన్ని జీవితంలో ఒకసారైన సందర్శించాలని పర్యాటకుల్లో ఉబలాటం ఎక్కువ. కొండపైకి ద్విచక్రవాహనదారులు తమ వాహనాలతో వచ్చి పర్వత శిఖరానికి కొంత దూరంలో నిలిపి.. నడిచి అధిరోహిస్తారు. చుట్టూ పచ్చగడ్డి పొదల మధ్య సంచారం నూతన అనుభూతిని ఇస్తుందని పర్యాటకులు తెలిపారు. బెంగళూరు, మైసూరు, మంగళూరు, హైదరాబాద్, ముంబయి, విజయవాడ, తదితర ప్రాంతాల నుంచి వారాంతపు సెలవుల్లో పర్యాటకులు దేవరమనె బెట్టకు వస్తున్నట్లు పర్యాటక, అటవీ శాఖ అధికారులు తెలిపారు. దట్టమైన మంచు ఆవరించడంతో ఆ ప్రదేశంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణంలో గడిపేందుకు ఇష్టపడుతున్నారు. మేఘాలతో కొండలు పూర్తిగా కప్పివేసి ఉంటాయి. నడిచి వెళ్లే మార్గంలో చిన్నపాటి జలపాతాలను దాటుకుంటూ ముందుకు సాగాలి. పర్యాటకుల సురక్షితం కోసం వారి వెంట అటవీ శాఖ సిబ్బంది ఉంటారు. వన్యమృగాలు బారి పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వచ్చే పర్యాటకులు అనార్యోగానికి గురైతే చికిత్స అందించేందుకు అందుబాటులో వైద్యులను ఉంచారు. చిక్కమగళూరు, మడికెరె వెళ్లి అక్కడ నుంచి బస్సు, ట్యాక్సీలో దేవరమనె బెట్ట వద్దకు వెళ్లేందుకు రవాణా వ్యవస్థ ఉంది. కొండ కింద హోం స్టేలు ఉన్నాయి. అక్కడ విశ్రాంతి తీసుకోవచ్చు. సెలవు రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి బైకు రైడర్స్ మలుపు తిరిగిన కొండపైకి సంచరిస్తారు. అందుకు కొంత దూరం మాత్రమే అటవీ శాఖ అనుమతించింది. రాత్రిళ్లు సంచారం నిషేధించారు. దేవరమనె బెట్ట ప్రకృతి అందాలను తిలకించేందుకు యువత ముందు ఉంటున్నారు.


దేవరమనెబెట్టలో ఎత్తైన పర్వత శిఖరం

కొండ ఎక్కుతున్న పర్యాటకులు

## ఉద్యోగులకు మెట్రో పాసుల వితరణ

**బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే:** వాహన రద్దీ సమస్యలకు తాత్కాలికంగా చెక్ పెట్టేందుకు ఒక ఐటీ సంస్థ తన ఉద్యోగులకు మెట్రో రైలు పాస్‌లను వితరణ చేసింది. ఆర్వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర వరకు ఎల్లో లైన్‌లో తమ కంపెనీకి వచ్చే ఉద్యోగులకు ప్రయోజనకరంగా రూ.1500 విలువైన పాసును 250 మంది ఉద్యోగులకు ఇచ్చింది. కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తమ ఉద్యోగులు మెట్రోలో ప్రయాణించాలని సూచించింది. ఎలక్ట్రానిక్ సిటీలోని ఐటీ, బీటీ కంపెనీలకు నిత్యం 2.5 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. సొంత వాహనాల బదులుగా, ప్రజా రవాణా వ్యవస్థను విస్తృతంగా వినియోగించుకునేందుకు ఇతర సంస్థలు కూడా ముందుకు రావాలని పౌరులు కోరుకుంటున్నారు.

## పర్యాటకానికి పెద్దపీట

ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా, ఇతర ప్రతినిధులు

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే:** తమ ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీట వేస్తోందని ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా తెలిపారు. ఫిక్కీ సహకారంతో ఒడిశా పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ఒడిశా పరబ్-2025 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తమ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయం, హస్తకళలను పరిచయం చేసేందుకు దేశంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బెంగళూరు, కర్ణాటక నుంచి ఒడిశా పర్యటనకు వచ్చే వారికి, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించేందుకు కుమారకృప రోడ్డు లలిత్ అశోక్‌లో నేటి (సోమ) సాయంత్రం వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ రాష్ట్ర ఉత్పత్తులు, హస్తకళా కృతులను వివిధ స్టాళ్లలో విక్రయానికి ఉంచామన్నారు. ఆ రాష్ట్ర ఉన్నతాధికారులు బలవంత్ సింగ్, డాక్టర్ విజయ్ కేతన్, దీపంకర మహాపాత్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

**మైసూరు, న్యూస్‌టుడే:** బావమరిది, అతని స్నేహితుల దాడిలో తీవ్రంగా గాయపడిన రాజేంద్ర, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. భర్తను అడ్డు తప్పించుకునేందుకు నంజనగూడు శివార్లలోని హుండువినహళ్లి వద్ద ఈనెల 26 రాత్రి దోపిడీ నాటకాన్ని తెరపైకి తీసుకువచ్చి, భర్తపై కత్తులతో దాడి చేయించింది. ఈ ఘటనకు సంబంధించిన రెండు రోజుల్లోనే రాజేంద్ర భార్య సంగీత, మరో ముగ్గురు నిందితులను నంజనగూడు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తీవ్రంగా గాయపడి ఉన్న రాజేంద్ర చికిత్స పొందుతూ మైసూరులోని ఆసుపత్రిలో ఆదివారం ఉదయం మరణించాడు. హత్యాయత్నం కేసును, హత్యకేసుగా మార్చి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సంతోషంగా ఉన్న రోజుల్లో భార్యతో రాజేంద్ర

## బెయిలు అర్జీని తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** మహిళా కానిస్టేబుల్‌కు తాళి కట్టి, శారీరక సుఖాలను అనుభవించి, మరో యువతితో వివాహ నిశ్చితార్థం చేసుకున్న కానిస్టేబుల్ భగవంతరాయకు బెయిలు ఇచ్చేందుకు జస్టిస్ ఎస్ రాచయ్య నిరాకరించారు. తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా అమృతూరు ఠాణాలో సింధగికి చెందిన భగవంతరాయ కానిస్టేబుల్‌గా పని చేసేవాడు. షెడ్యూల్డు కులానికి చెందిన కానిస్టేబుల్‌ను వివాహం పేరిట ఇంట్లోనే తాళి కట్టి శారీరక సుఖాలు అనుభవించాడు. మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నట్లు గుర్తించి ఆమె నిలదీయడంతో నీకూ నాకు సంబంధం లేదని చెప్పడంతో ఆమె కేసు పెట్టింది. దిగువ న్యాయస్థానం అతనికి బెయిలు ఇవ్వకపోవడంతో నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా, ఇక్కడా చుక్కెదురైంది.

## వృద్ధుడి హత్యకేసులో నిందితుల అరెస్టు

**చామరాజనగర, న్యూస్‌టుడే:** చేసిన అప్పులు తీర్చేందుకు హెచ్‌ఎం స్వామి (73) అనే వృద్ధుడిని హత్య చేసిన ముగ్గురు నిందితులను గుండ్లుపేట తాలూకా బేగూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. పరశివమూర్తి, సిద్ధరాజు, మహేశ్‌లను నిందితులుగా గుర్తించారు. స్వామి వద్ద పరశివమూర్తి అప్పు తీసుకున్నాడు. తన బకాయి తీర్చాలని కోరిన స్వామిని, బాకీ తీర్చుతానని తన ఇంటికి పిలిపించుకున్నాడు. తన స్నేహితులు ఇద్దరితో కలిసి దాడి చేసి అతన్ని హత్య చేసి కమరహళ్లి వద్ద రహదారి పక్కన మృతదేహాన్ని గత సోమవారం పడేసి వెళ్లారు. పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అరెస్టు చేసి, విచారణ చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతి

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** ఎలక్ట్రానిక్ సిటీ సంచార పోలీసు ఠాణా పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు విశాల్‌కౌర్(25) మృతిచెందారు. గొల్లహళ్లిలో నివసించే విశాల్‌కౌర్ తెల్లవారు జామున 4 గంటలకు స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎలక్ట్రానిక్‌సిటీ మొదటి ఫేజ్‌లో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఇద్దరు గాయపడ్డారు. వారిని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ విశాల్‌కౌర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## కారు చక్రం కిందపడి పసిబిడ్డ మృతి

**బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే:** కారు రివర్స్ తీసే సమయంలో వెనక ఉన్న బాలుడిని ఢీకొని చక్రం దూసుకుపోవడంతో ఏడాదిన్నర వయస్సు కలిగిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం రాత్రి మాదనాయకనహళ్లి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. సాయంత్రం ఏడుగంటలకు బెనకలేఔట్‌లో జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కమనీయం.. కార్తిక వనభోజనం

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చల్లా రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఉండవల్లి సూరిరాజు, కనకమేడల వీరాంజనేయులు, గుమ్మడి సాంబశివరావు, ప్రత్తిపాటి ఆంజనేయులు, హాజరైన ప్రజలు

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ యలహంక సమీపంలోని ఉన్న ప్రత్తిపాటి ఆంజనేయులు తోటలో కార్తిక మాస వనభోజన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. నగర నలుమూలల నుంచి మూడువేల మంది ప్రజలు హాజరయ్యారు. పరస్పరం పలకరించుకుని యోగక్షేమాలను తెలుసుకున్నారు. కార్తికమాస వనభోజన కార్యక్రమం ద్వారా దూర ప్రాంతాల్లో నివసిస్తున్న కమ్మ సామాజిక వర్గ ప్రజలు ఒకదగ్గర కలుసుకునే అవకాశం కల్పించిన కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ అధ్యక్షుడు గుమ్మడి సాంబశివరావు తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రుచికరమైన ఆంధ్రా వంటకాలను ఆహూతులను ఆనందంగా ఆస్వాదించారు. ఆంధ్రా బూరలు, మినపవడ, వంకాయ చట్నీ, పప్పు అందరూ ఇష్టపడే ఉలవచారు, విజయవాడ నుంచి తెచ్చిన గడ్డ పెరుగు తదితర నోరూరించే వంటకాలను వడ్డించారు. సత్యనారాయణ స్వామి వ్రతానికి దంపతులు హాజరై పూజలు చేశారు. ఈటీవీ ఫేమ్ గాయకురాలు లలిత బృందం పాటలు, పిల్లలు నృత్య కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంటినెంటల్ కాఫీ ప్రోడక్ట్ లిమిటెడ్ అధ్యక్షుడు చల్లా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలపెట్టిన ఘనత ఎన్టీ రామారావుకు దక్కుతుందన్నారు. కమ్మవారు కలిసి ఉంటే అన్ని రంగాల్లో విజయం సాధిస్తారన్నారు. కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ ప్రధానపోషకుడు ప్రత్తిపాటి ఆంజనేయులు మాట్లాడుతూ చదువుకునే కమ్మవారి ఆడపిల్లలకు ప్రత్యేక విద్యార్థి వసతి నిలయాన్ని ఏర్పాటు చేస్తామని, అందుకు పారిశ్రామికవేత్త సూరపనేని విద్యాసాగర్ తన వంత విరాళంగా రూ.10లక్షలు ఇచ్చినట్లు ప్రకటించారు. పిల్లల్లో విదేశాల్లో ఉన్నందున వృద్ధులు ఇళ్లలో ఉంటూ పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కోసం ప్రత్యేక ఆశ్రమాన్ని ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన ఉందన్నారు. వచ్చే ఫిబ్రవరి 10న నగరంలో 50వేల మందితో కమ్మ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు తితిదే స్థానిక సలహా మండలి అధ్యక్షుడు కనకమేడల వీరాంజనేయులు మాట్లాడుతూ 'ఈనాడు' గ్రూపు సంస్థల ఛైర్మన్ దివంగత రామోజీరావు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులను గుర్తు చేసుకోవాలని సూచించారు. కమ్మవారి సంఘం బెంగళూరు నార్త్ అధ్యక్షుడు గుమ్మడిసాంబశివరావు మాట్లాడుతూ నగరంలో నివసిస్తున్న కమ్మవారి కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీగల్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఉండవల్లి సూరిరాజు, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు గూడూరు సత్యనారాయణ, కమ్మవారి సంఘం మాజీ అధ్యక్షుడు కె.కృష్ణ, కమ్మ సౌత్ సెంటర్ వెంకట్, సంఘం ప్రధాన కార్యదర్శి కరణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

| | |
|---|---|
| బీన్స్- | 95 |
| క్యారెట్- | 100 |
| బీరకాయలు- | 60 |
| క్యాబేజి- | 35 |
| క్యాలీఫ్లవర్(ఒక్కోటి)- | 30 |
| సొరకాయ- | 50 |
| దొండకాయలు- | 45 |
| పొట్లకాయ- | 45 |
| పచ్చి మిరపకాయలు- | 85 |
| కాకర కాయలు- | 55 |
| టమాటా(నాటు)- | 25 |
| టమాటా(సాధారణ)- | 20 |
| గుమ్మడి- | 35 |
| ఆలుగడ్డ- | 35 |
| ఉల్లి(మేలురకం)- | 25 |
| ఉల్లి(సాధారణ)- | 20 |
| వెల్లుల్లి- | 160 |
| సాంబారు ఉల్లి- | 165 |
| బీట్‌రూట్- | 55 |
| వంకాయలు- | 65 |
| బెండకాయలు- | 55 |
| ముల్లంగి- | 55 |
| నిమ్మకాయ- | 140 |
| **పండ్లు, ఫలాలు ధరలు** | |
| వాషింగ్టన్ ఆపిల్- | 385 |
| సిమ్లా ఆపిల్- | 135 |
| గ్రీన్ ఆపిల్- | 295 |
| అరటి కాయలు- | 35 |
| సపోటా- | 65 |
| పైనాపిల్- | 65 |
| బొప్పాయి- | 35 |
| ఆరంజి- | 65 |
| బత్తాయి- | 65 |

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

## మంగళూరు కారాగారంలోనూ జామర్లు

**మంగళూరు, న్యూస్‌టుడే:** పరప్పన అగ్రహార కారాగారంలో ఖైదీలో చరవాణులు వినియోగిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో మంగళూరు కారాగారంలోనూ జామర్లు ఏర్పాటు చేశారు. జామర్ల సంఖ్య ఎక్కువ కావడంతో కారాగారానికి 800 మీటర్ల పరిధిలోని నివాసాలు, దక్షిణ కన్నడ జిల్లా న్యాయస్థానంలో చరవాణులు మూగబోయాయి. తమ విధులు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంగళూరు న్యాయవాదుల సంఘం ఆరోపించింది. న్యాయస్థానం వైపు జామర్లను తొలగించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే తాము విధులు బహిష్కరించి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

## ఆఫ్ బీట్-2025కు చక్కని స్పందన

గానాలాపనలో సమన్విత శర్మ

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** చౌడయ్య స్మారకభవనంలో వీటీ ఎంటర్‌ప్రైజెస్ ఛారిటబుల్ ట్రస్టు శనివారం రాత్రి నిర్వహించిన ఆఫ్‌బీట్-2025 సంగీత కచేరీకి చక్కని స్పందన లభించింది. వరుసగా పదవ ఏడాది నిర్వహించిన ఈ కచేరీకి డాక్టర్ వసుధా తీర్థరామ్ రూపకల్పన చేశారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కళాకారులు శ్రుతి భిడె, అభిషేక్ రావు, సమన్విత శర్మ, దివ్యా రాఘవన్, సౌమ్య, నర్సింహన్ కణ్ణన్, సుబ్రత సాహూ, జ్యోతి కుంజేరు తదితరులు పాత, కొత్త బాలీవుడ్ గీతాలను, రెట్రో, మెట్రో పాటలను ప్రేక్షకుల ముందు ఆలపించారు. కార్యక్రమం ద్వారా సమకూరిన ఆదాయాన్ని రోటరీ కబ్బన్‌పార్కు నేతృత్వంలోని ఆనందమయ హోమ్ ఫర్ సీనియర్ సిటిజన్స్‌కు అందిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

పాడేందుకు సిద్ధమవుతున్న దివ్య రాఘవన్

## సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు పాటించండి

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కుక్క, పాము కాటు బాధితులకు చికిత్సలను అందించేందుకు ఔషధాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు సూచించారు. రోగికి చికిత్స అందించేందుకు ముందస్తుగా నగదు చెల్లించాలని, బయానా ఇవ్వాలని ఒత్తిడి చేయకూడదని ఆదేశించారు. కర్ణాటకలో 2030 నాటికి కుక్క కాటుతో రేబిస్ బారిన పడి మరణించే వారి సంఖ్యను సున్నాకు తీసుకువచ్చే లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆరోగ్యశాఖ సిబ్బంది శ్రమించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలో యాంటీ-రేబిస్, యాంటీ వీనమ్ డోసులను సిద్ధంగా ఉంచుకోవాలని తన ఎక్స్‌కార్ప్ ఖాతాలో ట్వీట్ చేసి సూచనలు చేశారు.

## ఓటు చోరీతోనే ఘోర ఓటమి

**బళ్లారి, న్యూస్‌టుడే:** బిహార్ ఎన్నికల ప్రకటనకు వారం ముందు ఎటువంటి పథకం లేకుండా మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమయ్యాయి. దీని కారణంగానే భాజపాకు మహిళల ఓట్లు వచ్చాయి. దీంతో పాటు ఓటు చోరీతోనే ఇండియా కూటమి ఓటమి పాలైందని రాజ్యసభ సభ్యుడు, జమ్ముకశ్మీర్ వ్యవహారాల బాధ్యుడు డాక్టర్ సయ్యద్ నాసిర్ హుసేన్ తెలిపారు. శనివారం బళ్లారి నగర పాలికె మేయర్, ఉపమేయర్ ఎన్నిక తర్వాత విలేకరులతో మాట్లాడారు. భారత ఎన్నిక కమిషన్ ఎన్నికల ముందు మహాఘట్ బంధన్‌కు చెందిన సుమారు 65లక్షల ఓటర్లను తొలగించడం వల్ల బిహార్ ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయని ఆరోపించారు. దిల్లీలో కారు విస్ఫోటం నివారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తప్పు ఎవరు చేసినా..ఏ సమాజమైనా దోషులకు తగిన శిక్ష విధించాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్చే అంశంపై స్పందిస్తూ, ప్రస్తుతం సీఎం స్థానం ఖాళీగా లేదన్నారు. నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందన్నారు. బళ్లారి జిల్లాలో బి.నాగేంద్ర మంత్రిగా పనిచేశారని, భాజపా నేతల ఆరోపణలు కారణంగా ఆయన నైతిక బాధ్యత వహించి రాజీనామా చేశారు. పార్టీలో ఎవరూ రాజీనామా చేయాలని కోరలేదన్నారు. నాగేంద్ర మరోసారి మంత్రి అవుతారని తెలిపారు. అదే మా కోరిక, ఆయనకు సముచిత స్థానం మా పార్టీలో ఉంది. మా హృదయాల్లో కూడా ఉన్నారని తెలిపారు.

## కేంద్రం చేతిలో బొమ్మగా మారిపోయింది

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం చేతిలో కేంద్ర ఎన్నికల కమిషన్ బొమ్మగా మారిపోయిందని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి విమర్శించారు. బిహార్‌లో ఓటరు జాబితా నుంచి 47 లక్షల మందిని తొలగించి, కొత్తగా 18 లక్షల మందిని చేర్చారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందుగా ఒక కోటి మంది ఖాతాలకు పథకాల పేరిట తలా రూ.10 వేలు వేశారని తెలిపారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వమే ఎన్నికల కమిషన్‌తో లోపాయకారి ఒప్పందాలు చేసుకున్నప్పుడు వారిని ఎవరు పట్టుకుంటారని ప్రశ్నించారు.


EENADU Classifieds

JOBS

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును


## 28న జీఎస్‌టీ రాక

ప్రముఖ సినీనటుడు లోకేశ్ నటిస్తున్న 'జీఎస్‌టీ' చిత్రం ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందుకు సంబంధించిన టీజర్‌ను ఇటీవల ప్రముఖ సినీనటుడు ఉపేంద్ర విడుదల చేశారు. జీఎస్‌టీ అంటే గోస్ట్ ఇన్ ట్రబుల్ మార్చి గోసీ ఇన్ థియేటర్‌గా తాను పిలుస్తున్నట్లు నటుడు ఉపేంద్ర వ్యాఖ్యానించారు. ఇది కుటుంబ చిత్రమని, హాస్యం థ్రిల్లర్ కూడిన కథ అందరిని ఆకట్టుకుంటుందని తెలిపారు. ఎవరూ ఊహించలేనివిధంగా 40నిమిషాలపాటు క్లైమాక్స్ ఉంటుందని దర్శకుడు సృజన్ లోకేశ్ తెలిపారు. రజని భరద్వాజ్, సుకృత్, అశోక్ తదితరులు నటిస్తున్నారు.

జీఎస్‌టీ చిత్రం టీజర్ విడుదల చేసే కార్యక్రమంలో నటుడు ఉపేంద్ర తదితరులు

కూరగజ్జ చిత్రం పాటలు విడుదల కార్యక్రమానికి హాజరైన సినీప్రముఖులు

## కూరగజ్జ చిత్రం పాటలు విడుదల

మంగళూరులో ప్రముఖ సినీనటులు మధ్య 'కూరగజ్జ' చిత్రం పాటలను విడుదల చేశారు. కార్యక్రమానికి సినీ ప్రముఖులు విజయలక్ష్మీ, శృతి, జైజగదీశ్ తదితరులు హాజరయ్యారు. అన్నిభాషల్లో చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు సుదీర్ అత్తావర్ తెలిపారు. యక్షగానం, కరావళి ప్రజలు మాట్లాడే భాషతో పాటు దేవారాధన అంశాలతో కూడిన దృశ్యాలను కరావళి ప్రాంతంలో చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. సందీప్ సూవార్కర్ నటిస్తుండగా గోపిసుందర్ సంగీతం అందిస్తున్నారు.

## విజయవంతంగా బ్ర్యాట్ చిత్రం

డార్లింగ్ కృష్ణ నటించిన 'బ్ర్యాట్' చిత్రం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఊహించని విధంగా ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వస్తుందని దర్శకుడు శశాంక్ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌తో జీవితాలు ఏవిధంగా నాశనమవుతున్నాయనే అంశమే చిత్రకథ అన్నారు. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలియజేశారు. మనిశ్ కందరూర్, డ్రాగన్ మంజు, డాలర్‌మణి తదితరులు నటించారు.

బ్ర్యాట్ చిత్ర బృందం

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

## ఆపరేషన్ లండన్ కేఫ్ సిద్ధం

నక్సల్స్‌కథ ఆధారంగా 'ఆపరేషన్ లండన్ కేఫ్' చిత్రం నిర్మాణం పూర్తి చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. కన్నడ, మరాఠీ, హిందీ భాషల్లో చిత్రాన్ని నిర్మించినట్లు దర్శకుడు సడగర రాఘవేంద్ర తెలిపారు. సమాజంలో జరిగే అన్యాయాన్ని యువత ఏవిధంగా ఎదిరించి పేదలకు న్యాయం కల్పించాలన్నదే చిత్రకథ. కవీశ్‌శెట్టి, మేఘశెట్టి తదితరులు నటిస్తున్నారు. ఈనెలాఖరులో చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆపరేషన్ లండన్ కేఫ్ చిత్రంలో కవీశ్‌శెట్టి, మేఘశెట్టి

(c) eenadu

# బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

## మేలుకోటెలో స్వచ్ఛతపై జాగృతి

స్వచ్ఛ మేలుకోట నినాదంతో మండ్యలోని కావేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సివిల్ విభాగం విద్యార్థులు స్వచ్ఛత జాగృతి చేపట్టారు. గత ఎనిమిదేళ్లు ఏటా కొద్ది రోజులు ఇక్కడి ప్రాంతాన్ని శుభ్రం చేసి, స్థానికులు, భక్తుల్లో జాగృతి కల్పిస్తున్నట్లు సివిల్ విభాగం ఆచార్యుడు డాక్టర్ వినోద్ తెలిపారు. చెలువనారాయణ స్వామి, యోగ నరసింహా స్వామి ఆలయం చుట్టుపక్కల ప్లాస్టిక్, వ్యర్థాలను విద్యార్థులు తొలగించారు. - న్యూస్‌టుడే, మండ్య

## బైరప్ప వ్యక్తిత్వం యువతకు ఆదర్శం

ప్రసంగిస్తున్న శతావధాని గణేశ్

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే :** నగరంలోని కేంద్ర సాహిత్య అకాడమీ (దక్షిణ ప్రాంత శాఖ) ఆధ్వర్యంలో ఆదివారం సాహిత్య సదస్సు నిర్వహించారు. ప్రముఖ సంస్కృత, కన్నడ రచయిత, శతావధాని ఆర్.గణేశ్..సాహితీవేత్త దివంగత ఎస్.ఎల్.బైరప్ప జీవిత విశేషాలు, రచనా వ్యాసంగం గురించి ప్రసంగించారు. ఆయన ఒక ఆధ్యాత్మికవేత్త అని, ఆయన రచనల్లో ఆధ్యాత్మిక అంశాలు పొందుపరిచారన్నారు. ఆయన వ్యక్తిత్వం యువతకు ఆదర్శం కావాలన్నారు. సంస్థ ఇన్‌చార్జి అధికారి సురేష్‌కుమార్ స్వాగతం పలికారు.

## హో సూ రు క బు ర్లు

### విశ్వశాంతి కోసం ప్రత్యేక పూజలు

జయకుమార్‌రెడ్డి దంపతులను స్వాగతిస్తున్న అర్చకులు

**హోసూరు, న్యూస్‌టుడే :** హోసూరు-బాగలూరు రోడ్డులోని మురుగన్ ఆలయ మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఈ ఆలయ నిర్వాహణకి హాలియాళం గ్రామానికి చెందిన ఏ.ఐ.ఏ.డీ.ఎం.కే. నాయకుడు, చెన్నసంద్రం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి అన్ని విధాలా సహకరించారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మురుగన్ ఆలయానికి వచ్చి విశ్వశాంతికోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించాలని పూజలు చేసినట్లు జయకుమార్‌రెడ్డి తెలిపారు.

### ఘనంగా ఎంపీ కార్తిక్ జన్మదిన వేడుకలు

వృద్ధులకు అల్పాహారం వడ్డిస్తున్న నిర్వాహకులు

**హోసూరు, న్యూస్‌టుడే :** మాజీ కేంద్రమంత్రి పి.చిదంబరం కుమారుడు ఎంపీ కార్తిక్ చిదంబరం పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కృష్ణగిరికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఏకాంబవానన్ తన సన్నిహితులతో కలిసి కృష్ణగిరి పారిశ్రామికవాడలోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కృష్ణగిరిలోని వృద్ధాశ్రమంలో భోజన సౌకర్యం కల్పించి వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చక్రవర్తి, అజీత్ బాష, నిత్యానందం, చంద్రశేఖర్, ఏళుమలై, నజీం తదితరులు పాల్గొన్నారు.

కనకదాసుకు జ్యోతులు అర్పిస్తున్న మహిళలు

### వైభవంగా భక్త కనకదాసు జయంతి

**పావగడ, న్యూస్‌టుడే :** తాలూకాలోని దొమ్మతమర్రి గ్రామ పంచాయతీ అక్కమ్మనహళ్లిలో భక్త కనకదాస జయంతి వేడుకలను ఆదివారం కురుబ సముదాయ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఇంటికొక జ్యోతిని తయారుచేసి కనకదాస చిత్ర పటానికి ప్రదక్షిణలు చేశారు. ఆంజనేయస్వామి, కొల్లాపురమ్మ దేవి ఆలయాల్లో దీపాలు వెలిగించారు. వేడుకల్లో గ్రామ పి.డి.ఓ. రంగదామప్ప, నాయకులు సి.నరసణ్ణ, తిమ్మయ్య, ఆదినారాయణప్ప, సి.ఎన్.చంద్రప్ప, చన్నప్ప, శ్రీరామప్ప, కేశవప్ప, రామాంజినప్ప, బబ్బూర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

### యువత క్రీస్తు మార్గంలో నడవాలి

యువత, చిన్నారులతో శ్యామ్‌సన్, స్టీవ్ తదితరులు

**బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే :** నేటి యువతరం క్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని రెవరెండ్ స్టీవ్ పేర్కొన్నారు. ముద్దప్పగార్డెన్‌లోని జీవనహళ్లి తెలుగు క్రైస్తవ కమ్యూనిటీని బలోపేతం చేయడానికి సజీవ బ్యాప్టిస్ట్ చర్చి వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ ఎన్.జె.శ్యామ్‌సన్ నేతృత్వంలో నిర్వహించిన ఆశీర్వాదాల సభలో స్టీవ్ మాట్లాడారు. ఎస్.బి.సి.వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎన్.జె.శ్యామ్‌సన్ మాట్లాడుతూ చెడును విస్మరించి భక్తిభావాలు పెంపొందించుకోవాలన్నారు. తెలుగు, కన్నడ, తమిళ క్రైస్తవ సంఘాల పాస్టర్లు, నాయకులు, యువత పాల్గొన్నారు.

### కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రాకారోత్సవం

అలంకరణలో వాసవీమాత

**ముళబాగిలు, న్యూస్‌టుడే :** నగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తిక ఆదివారం సందర్భంగా ప్రాకారోత్సవం జరిగింది. వాసవి పరమేశ్వరి విగ్రహాన్ని కవడేతో అలంకరించారు. ఈశ్వరుడు, పార్వతీదేవి, గణేశుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్య వైశ్య మండలి కార్యదర్శి సుబ్బరాయశెట్టి, లక్ష్మీష్ శ్రీనివాసపురం తదితరులు పాల్గొన్నారు. వాసవి మహిళా విభాగం వారిచే లలితా సహస్రనామ కీర్తన నిర్వహించారు.

### ప్రత్యేక డిజిటల్ పారిశ్రామిక విధానం

**బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే :** దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతంలో డిజిటల్ రంగానికి ప్రత్యేకత ఉందని, అందు కోసం ప్రత్యేక డిజిటల్ పారిశ్రామిక విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు ఆజ్మాన్ న్యూవెంచర్ సెంటర్ అధ్యక్షుడు షేక్‌మహ్మద్ తెలిపారు. ఈ విధానం అమలుల్లోకి వస్తే దేశంలో ఆరువేలద కంపెనీలు ఏర్పాటుకు ముందుకొచ్చినట్లు గుర్తు చేశారు. దీని కోసం విషన్-2030 సిద్ధం చేశామని, తద్వారా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని ఒక ప్రకటనలో వివరించారు.

### మరో రెండు కృష్ణజింకల మృతి

**బెళగావి:** కిత్తూరు రాణి చెన్నమ్మ మినీ జూలో కృష్ణ జింకల మారణ హోమం కొనసాగింది. గత గురువారం 8, శనివారం 20, శనివారం రాత్రి ఒకటి మరణించగా, ఆదివారం ఉదయం మరో 2 మరణించాయి. జూలో 38 కృష్ణజింకలు ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 8కి చేరుకుంది.

## పరిశుభ్రతకు నడుంబిగించిన యువత

జయనగరలో రంగులు పూస్తున్న కమిషనర్ రమేష్ తదితరులు

మైదానం గోడలకు రంగులేస్తున్న విద్యార్థులు

**బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే :** నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం సెలవు కావడంతో కొందరు విద్యావంతులు పరిశుభ్రత పనులు చేపట్టారు. వారికి మద్దతుగా బెంగళూరు దక్షిణ నగరపాలికె అధికారులు నిలబడ్డారు. పాలికె మార్షల్స్ కూడా వారితో చేతులు కలిపారు. పాలికె కమిషనర్ కె.ఎన్.రమేష్ స్వచ్ఛంద సేవకులను ప్రోత్సహించారు. జయనగర ప్రాంతంలోని మైదానాలు, ఉద్యానవనాల్లో శుభ్రత పనులు చేపట్టారు. మాసిన గోడలను నీటితో శుభ్రం చేసి రంగులు పూసి అందంగా తీర్చిదిద్దారు. జయనగరలోని ఆటల మైదానం, ఉద్యానవనాల గోడలకు రంగులు వేయడంతో పాటు పాదచారి మార్గాలను శుభ్రం చేశారు. ప్రజలు సాఫీగా నడిచే విధంగా మార్గాలను అభివృద్ధి చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, విద్యావంతులైన యువకులు దాదాపు వంద మంది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శుభ్రత పనుల్లో నిమగ్నమయ్యారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు తదితరులు నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వస్తే అందుకు అన్నివిధాలుగా సహకరిస్తామని కమిషనర్ కె.ఎన్.రమేష్ తెలిపారు. శుభ్రత వల్ల పరిసరాలు బాగు పడటంతో పాటు అంటువ్యాధులను దూరం చేయవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.

## తైక్వాండోతో దృఢత్వం, స్వీయరక్షణ

విజేతలతో శోభాకరంద్లాజే, మునిరాజు తదితరులు

**బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే :** తైక్వాండోతో క్రీడాకారుల్లో శారీరక దృఢత్వం, స్వీయ రక్షణ ఉంటుందని కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ క్రీడా ఉత్సవంలో భాగంగా దాసరహళ్లి నియోజకవర్గంలో ఎంఈఐ క్రీడామైదానంలో నిర్వహించిన క్రీడలను ఎమ్మెల్యే మునిరాజుతో కలసి ప్రారంభించి మాట్లాడారు. చిన్నవయసులోనే కరాటేలో సాధన చేస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. శిక్షకుడు రాఘవేంద్ర ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ క్రీడాకారులు స్వశక్తితో రాణించి బంగారు పతకాలు సాధించాలన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి విగ్రహావిష్కరణ, జయంతి

స్వామీజీ ఆధ్వర్యంలో జ్యోతులు మోస్తున్న మహిళలు

**పావగడ, న్యూస్‌టుడే :** తాలూకాలోని నీలమ్మనహళ్లి గ్రామంలో ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి, విగ్రహావిష్కరణ వేడుకలను ఆదివారం వాల్మీకి సముదాయ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వాల్మీకి విగ్రహం చుట్టూ రంగుల తోరణాలు కట్టి సుందరంగా అలంకరించారు. తాలూకాలోని సముదాయ నాయకులతో పాటు స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి. వెంకటేశ్, అనంతపురం మాజీ ఎం.పి.తలారి రంగయ్య, కుందుర్పి సంస్థాన దొర రాజా జయచంద్ర తదితరులు వాల్మీకి విగ్రహానికి పూజలాచరించారు. మహిళలు జ్యోతులతో ప్రదక్షిణలు చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. తాలూకాలోని దేవలకెరె, నిడిగల్లు హోబళి కోణనకురికె గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను నిడిగల్లు ఆశ్రమ పీఠాధ్యక్షుడు వాల్మీకి సంజయ్‌కుమార్ స్వామీజీ ఆధ్వర్యంలో సముదాయ ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వాల్మీకి జాగృతి వేదిక జిల్లా అధ్యక్షుడు పాలేగార్ లోకేష్, ఓంకారనాయక, భాస్కరనాయక, కె.రాంపుర రమేశ్, ఆనంద నాయక తదితరులు పాల్గొన్నారు.

## మేళాను సందర్శించిన మంత్రి, ఎమ్మెల్యేలు

మేళాలో మంత్రి సుధాకర్, ఎమ్మెల్యేలు

**చిత్రదుర్గం, న్యూస్‌టుడే :** దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించి స్థానిక చేతివృత్తుల వారు రూపొందించిన వస్తువులకు మార్కెట్ సదుపాయం కల్పించడానికి స్వదేశీ జాగరణ మంచ్ ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను ఆదివారం జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్, చెళ్లకెర ఎమ్మెల్యే టి.రఘుమూర్తి, హొసదుర్గం ఎమ్మెల్యే గోవిందప్పలు సందర్శించారు. మేళా ప్రాంగణంలో దుకాణాల వద్ద వస్తువుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రాంగణాన్ని స్థానిక వస్తువులతో అలంకరించిన రీతిని చూచి హర్షం వ్యక్తం చేశారు. స్వదేశీ మేళా సంచాలకులు, ఎమ్మెల్సీ కేఎస్ నవీన్ స్వాగతం పలికారు.

## ఘనంగా హోసకట్టే ఉత్సవం ప్రారంభం

ఉత్సవానికి వెళుతున్న మంజునాథుడు

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే :** ధర్మస్థలలో కార్తిక లక్షదీపోత్సవాలు భారీ ఎత్తున ప్రారంభమయ్యాయి. మంజునాథుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా హోసకట్టెకు తీసుకువెళ్లి భక్తుల సమక్షంలో పూజలు చేశారు. లక్షదీపోత్సవాలను వీక్షించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి యాత్రికులు తరలివచ్చారు. వీరికి దారిపొడవునా తాగునీటిని స్వయంసేవకులు అందించారు. ధర్మస్థల చేరుకున్న వీరికి నాట్య కళాకారులు తమ సహజ నృత్య భంగిమలలో స్వాగతం పలికారు. పాదయాత్రికులను డి.హర్షేంద్రకుమార్ స్వాగతించగా.. వీరిని ఉద్దేశించి ధర్మాధికారి హెగ్గడే ప్రసంగించారు. ధర్మస్థల పవిత్ర క్షేత్రంపై భక్తులు చూపుతున్న ఆదరం, భక్తి ప్రపత్తులు, విశ్వాసాలకు మేమంతా అండగా ఉంటామన్నారు. ఇక్కడి సేవాకార్యక్రమాలే ప్రేరణగా నిలిచాయన్నారు. త్వరలో వంద ఎకరాల్లో వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తామని హెగ్గడే ప్రకటించారు. ఈ ఉత్సవాలకు ఈ సారి భక్తుల సంఖ్య పెరగడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరీష్ మాట్లాడుతూ హెగ్గడే ప్రపంచానికే ఒక ఆదర్శ, స్ఫూర్తిదాయక వ్యక్తిగా అభివర్ణించారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న హెగ్గడే

## అమెరికన్ పౌరులే లక్ష్యంగా సైబర్ మోసాలు

### ● బెంగళూరులో 21 మంది నిందితుల అరెస్ట్

**ఇంటర్నెట్ డెస్క్:** బెంగళూరులో మైక్రోసాఫ్ట్ పేరుతో అమెరికన్ పౌరులను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. 'మస్క్ కమ్యూనికేషన్' అనే నకిలీ సాఫ్ట్‌వేర్ సంస్థను నిర్వహిస్తూ ఈ మోసాలకు పాల్పడుతున్న 21 మందిని అరెస్టు చేశారు.

*ఎలా మోసాలు చేశారంటే?*

ఈ ముఠా సభ్యులు బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ మెయిన్‌రోడ్డులోని సిగ్మా సాఫ్ట్ పార్క్‌లో ఒక కార్యాలయాన్ని అద్దెకు తీసుకున్నారు. అక్కడే 'మస్క్ కమ్యూనికేషన్' పేరుతో నకిలీ కాల్ సెంటర్‌ను నిర్వహించడం మొదలుపెట్టారు. వీరు ఫేస్‌బుక్ యాడ్స్ ద్వారా, మాల్వేర్స్ ద్వారా అమెరికన్ పౌరుల కంప్యూటర్లను హ్యాక్ చేసేవారు. అంతేకాదు వారి సిస్టమ్‌ను ఫ్రీజ్ చేసి, స్క్రీన్‌పై మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్ట్ నంబర్ కనబడేలా చేసేవారు. పొరపాటున బాధితులు ఆ నంబర్‌కు కాల్ చేస్తే, తాము మైక్రోసాఫ్ట్ ప్రతినిధులమని చెప్పేవారు. లేదా ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) అధికారులమని నమ్మించేవారు. సదరు బాధితులపై మనీ లాండరింగ్ కేసులు నమోదు అయ్యాయని బెదిరించి, కేసు నుంచి బయటపడేయాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు లేదా క్రిప్టోకరెన్సీ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేసేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు వారిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సదరు నకిలీ సెంటర్‌లో పనిచేస్తున్న 21 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్లు మొదలైన డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన కంపెనీ యజమాని ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## క్రైమ్.. కార్నర్

### లెక్చరర్‌పై కేసు నమోదు

**మైసూరు, న్యూస్‌టుడే:** ఇంజినీరింగ్ విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఆరోపణలపై ఒక ప్రతిష్ఠిత కళాశాలకు చెందిన లెక్చరర్ భరత్ భార్గవపై జయలక్ష్మీపురం ఠాణాలో కేసు నమోదైంది. ఇంటర్నల్స్‌లో ఎక్కువ మార్కులు ఇస్తానని, ఉద్యోగం ఇప్పిస్తానని, తనకు సహకరించాలని, పబ్‌కు వెళదామని ఒత్తిడి చేస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదుతో భరత్ భార్గవను అదుపునకు తీసుకుని విచారణ చేపట్టారు.

### నగదు రెట్టింపు చేస్తామని వంచన

**దావణగెరె, న్యూస్‌టుడే:** మీరు పెట్టిన పెట్టుబడిని వారంలోనే రెట్టింపు చేసి ఇస్తామని బొగ్గ శ్రీరాములు, పుష్ప దంపతులు పలువురిని వంచించారు. జగళూరు తాలూకాలోని వివిధ గ్రామాలకు చెందిన వారి నుంచి కొద్ది రోజుల్లోనే రూ.90 లక్షలకు పైగా నగదు సేకరించి పరారయ్యారు. భూవ్యాపారంలో పెట్టుబడి పేరిట రేణుకమ్మ, మీనా, ప్రియాంక, టి తిరుమలేశ్ తదితరుల నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో జగళూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### కారుపై ఏనుగు దాడి

**చిక్కమగళూరు, న్యూస్‌టుడే :** ఎన్ఆర్‌పుర తాలూకా ఆడువళ్లి గ్రామం సమీపంలో రోడ్డుదాటుతున్న ఏనుగును ప్రదీప్ అనే వ్యక్తి తన కారుతో ఢీకొట్టాడు. ఏనుగు కోపంతో కారుపై కూర్చోవడంతో కారు పాక్షికంగా దెబ్బతింది. ఒక వైపు పూర్తిగా అద్దాలు పగిలిపోయాయి. ప్రమాదాన్ని గుర్తించి ప్రదీప్ త్రుటిలో కారు నుంచి కిందకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. కొంత సమయం తర్వాత కారు దిగి ఏనుగు చిక్క అగ్రహార వలయ అడవిలోకి వెళ్లిపోయింది. బాధితుని ఫిర్యాదుతో అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

**గదగ, న్యూస్‌టుడే :** ఎంజీఆర్ డీపీఆర్ విశ్వవిద్యాలయం వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మనోజ్ కమతర (9) అనే బాలుడు, ఆనంద వారద (18) అనే యువకుడు మరణించారు. గదగలో జిమ్‌కు వెళ్లి తమ గ్రామం నాగావికి వీరిద్దరూ వెళుతున్న బైకును ఎదురుగా వచ్చిన కాంక్రీటు మిక్సర్ లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. గదగ గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### బాలికపై అత్యాచారం

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే :** పుట్టిన రోజుకు కేకు కోయిస్తానని నమ్మించిన యతీశ్ (26) అనే యువకుడు ఒక బాలిక (15)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తనకు పరిచయం ఉన్న యతీశ్‌కు తన పుట్టిన రోజని చెప్పగా, నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి శనివారం రాత్రి అత్యాచారానికి పాల్పడి నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నిందితుడ్ని మాదనాయకనహళ్లి ఠాణా పోలీసులు ఆదివారం అరెస్టు చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు

### వృద్ధురాలు సజీవ దహనం

**కార్వార, న్యూస్‌టుడే :** ఉత్తర కన్నడ జిల్లా ముండగోడు తాలూకా హనుమాపురలో ఫకీరవ్వ (70) అనే వృద్ధురాలు ఇంట్లో సజీవంగా దహనమైంది. వంట చేస్తున్న సమయంలో చీరకు మంటలు అంటుకున్నాయి. పొగ కమ్మేయడంతో బయటకు రాలేక స్పృహ కోల్పోయింది. స్థానికులు గుర్తించి, ఆమెను బయటకు తీసుకొచ్చేలోగా మంటల్లో పూర్తిగా కాలిపోయింది.

### రుజువు చేస్తే ఆత్మహత్య చేసుకుంటా

**మండ్య:** తాను లంచం తీసుకున్నానని రుజువు చేస్తే, గుండు చేయించుకుని, గాడిదపై ఊరేగి, ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని దళ్ ఎమ్మెల్యే హెచ్‌టీ మంజు వ్యాఖ్యానించారు. తమ పార్టీకి చెందిన ధరణేశ్ చేసిన ఆరోపణలు తనను బాధించాయని ఎమ్మెల్యే ఆక్రోశించారు.

## పాఠశాలలో చిన్నారుల గ్రామసభ

మొక్కకు నీరు పోస్తున్న భవాని, రఘునాథ్

**మండ్య, న్యూస్‌టుడే :** మేలుకోటెలో 150 ఏళ్ల చరిత్ర ఉన్న పురాతన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం బాలల గ్రామసభను నిర్వహించారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు భవానీ హరిధర్, విద్యావేత్త రఘునాథ్ సంయుక్తంగా గ్రామ సభను ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను నడుపుతున్న అధ్యాపకులను పంచాయతీ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ అభినందించారు. పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కొందరు దాతలు హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం నిర్వహించిన నాటకకు చక్కని స్పందన లభించింది. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు జీకే కుమార్, జయరామేగౌడ, మహేశ్, ప్రధానోపాధ్యాయుడు సంతానరామన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పదాధికారులు

## హక్కుల సాధనకు సమష్టి పోరు

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల సాధన కోసం ఐకమత్యం అవసరమని కర్ణాటక మాలమహాసభ అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఇక్కడ కర్ణాటక ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్టభద్రుల సంఘం సమావేశమందిరంలో సమావేశాన్ని అంబేడ్కర్ చిత్ర పటానికి పువ్వులు వేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో ప్రభుత్వ పథకాలు పొందటంతో మాలలు వెనకబడి ఉన్నారని, పథకాలపై అవగాహన లేక పోవడమే కారణమన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మాలల ఐక్యత బయట సమాజానికి చూపించాల్సిన పరిస్థితులు వచ్చాయని, అందరూ సంఘటితం కావాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సాధురామవేంద్ర, దాసరి శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి సంజీవరావు, కార్యదర్శులు చక్రవర్తి, గంధం రామకృష్ణ, కోశాధికారి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ భాషాభిమానం ఉండాలి

వేదికపై రాజేంద్రసింగ్ బాబు, సోమశేఖర్ తదితరులు

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరికీ భాషాభిమానం ఉంటేనే ఏ భాష అయినా మనగలుగుతుందని ప్రముఖ దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే కన్నడిగులు తమ భాషను కాపాడుకునేందుకు మొదటి నుంచి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కేంద్రీయ సదన కన్నడ సంఘం కోరమంగలలో రాజ్యోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. రాజ్యోత్సవాలు కేవలం నవంబరుకే పరిమితం కాకుండా, ఏడాది మొత్తం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటకకు వచ్చి స్థిరపడుతున్న వారికి కన్నడ భాషను నేర్పించేందుకు కన్నడిగులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ సి.సోమశేఖర్, సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, ఆదాయపన్ను శాఖ అధికారి బీఎల్ గురుప్రసాద్, కన్నడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతీయ యోగాసన పోటీలకు ఎంపిక

బంగారు పతకాలతో ఆళ్వాస్ క్రీడాకారులు

**బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే :** నాగమంగలలో జరిగిన రాష్ట్ర బాలబాలికల యోగా పోటీల్లో మైసూరు విభాగం తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆళ్వాస్ పాఠశాల విద్యార్థులు 12 మంది జాతీయ యోగా పోటీలకు అర్హత సాధించారు. పొందారు. అగ్రస్థానం చేపట్టిన విజేతలు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. అండర్-14 బాలుర విభాగంలో శ్యామ, శశికుమార్, రిథమిక్ యోగాలో ఆదర్శ-శశాంక్ తొలి స్థానాలు కైవసం చేసుకున్నారు. సింగిల్స్ బాలుర గ్రూపులో కె.ఎస్.ఆదర్శ, సంప్రదాయ యోగాలో శశికుమార్, అండర్-17 యోగా బాలుర విభాగంలో కార్తీక్, ప్రజ్వల్, బాలికల గ్రూపులో హిమజ, శ్రావణి అగ్రస్థానాల్లో నిలిచారు.

**IN THE HONOURABLE COURT OF IV ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM**
**E.P. 418/2024 in O.S. 663/2015**

**Between:**
Potnuru Siva Prasad ... Dhr/Plaintiff
And
Nandigama Lakshmi Kantham, And 3 others ... Jdrs/Defendant

**PUBLIC NOTICE TO THE JDR's/ DEFENDANT's**

To,
1. Smt. Nandigama Lakshmi Kantham, W/o Late Madhusudhan Patnaik, Hindu, aged around 54 years, Residing at D.No.11/IC-S-22-15-8, Opp Gokul Nivas, Flat No.10, 9th Street, Bank Avenue Colony, Bangalore-43 (KARNATAKA).
2. Sri Nandigama Srikanth (Snandiga), Hindu, aged 29 years, Residing at C/o Sri Manas Sailaja, 10th Street, Babusapalya, Kalyan Nagar, Horamavu, Bangalore-560043.
3. Sri.Nandigama Chandrakanth Deepak, S/o Late Madhusudhan Patnaik, Hindu, aged 28 years, Residing at D.No.11/IC-S-22-15-8, Opp Gokul Nivas, Flat No.10, 9th Street, Bank Avenue Colony, Bangalore-43 (KARNATAKA).
4. Smt. B.Sailaja, W/o Manas, Hindu, aged 31 years, 10th Street/10th Lane, Indira Avenue, Babusapalya, Kalyan Nagar, Horamavu, Bangalore-560043.

Please take notice that the above E.P. 418/2024 in O.S.663/2015 filed by the Dhr/petitioner against all of you for execution of regular sale deed in favour of the Dhr/petitioner Under Order XXI Rule 34 of CPC. The above matter stands posted to 05-12-2025 for your appearance. You all are hereby summoned to appear either in person or through an Advocate before the Hon'ble IV Addl. District Judge Court, Visakhapatnam at 10.30 A.M on 05.12.2025 failing which, the matter will be decided exparte in your absence.

(By order of the Hon'ble Court)
Sri R. SRINIVASA RAO
Advocate
Cell: 9441343837
Visakhapatnam-530002.
Visakhapatnam
Dt: 14.11.2025

(c) eenadu

## వక్ర మార్గాల్లోనే ఎన్‌డీఏ గెలుపు

వీరేశ్

**రాయచూరు, న్యూస్‌టుడే :** బిహార్ విధానసభ ఎన్నికల్లో అధికారాన్ని దుర్వినియోగం చేసి, విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి, మతాలను, కులాలను ప్రేరేపించి ఎన్‌డీఏ విజయం సాధించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.జి.వీరేశ్ ఆరోపించారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపక్షాలు అధికార పార్టీపై మరింత కలసికట్టుగా పోరాటం చేయాలని ఓటర్లు సందేశాన్ని ఇచ్చారన్నారు. మహాఘట్ బంధన్ కూటమికి ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. ఓటమితో కుంగిపోమని చెబుతూ రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం ఆందోళనలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## దేశీయ క్రీడలను ప్రోత్సహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున

**సిరివార, (మాన్వి) :** దేశీయ క్రీడలను ప్రోత్సహించాలని మాన్వి భాజపా మాజీ అధ్యక్షుడు మల్లికార్జున పేర్కొన్నారు. తాలూకాలోని బాగలవాడ గ్రామంలో భగత్‌సింగ్ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడలంటే క్రికెట్ అనే విధంగా మాదిరిగా మారిపోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రప్పగౌడ, డి.అరుణ్‌కుమార్ నాయక్, మల్లనగౌడ పాటిల్, మౌనేశ్ కోరి, తిమ్మణ్ణ, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

## 'న్యాయాలయమే దేవాలయం కావాలి'

మొక్కకు నీళ్లు పోస్తున్న జస్టిస్ విభుబఖ్రు, తదితరులు

**రాయచూరు, న్యూస్‌టుడే :** దేవదుర్గలోని జాలహళ్లి రహదారిలో నిర్మించిన న్యాయస్థానం నూతన సముదాయ భవనాన్ని ఆదివారం రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ విభుబఖ్రు మొక్కకు నీళ్లు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులోని విశాలమైన భవనాలు కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతాయన్నారు. కోర్టుతో సంబంధమున్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని సలహా ఇచ్చారు. సర్వోన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి శివరాజ్ పాటిల్ ప్రసంగిస్తూ న్యాయాలయమే దేవాలయం కావాలని, ఓడిపోయిన వ్యక్తి సంతృప్తి చెందేలా న్యాయం అందించాలని ఆకాంక్షించారు. న్యాయ సమ్మతమైన మార్గంలోనే డబ్బులు సంపాదించాలని, పేదల విషయంలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వొద్దని లాయర్లకు విజ్ఞప్తి చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ భరత్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మారుతి బగాడే, రాష్ట్ర న్యాయసేవల ప్రాధికార సభ్య కార్యదర్శి శశిధర్ శెట్టి, జిల్లా న్యాయసేవల సభ్య కార్యదర్శి సాత్విక్, జిల్లా పాలనాధికారి నితీష్, ఎస్పీ పుట్టమాదయ్య పాల్గొన్నారు.

## ఎన్టీఆర్, చంద్రబాబుతో ప్రపంచ ఖ్యాతి

### కమ్మసంఘం అభివృద్ధికి రూ.20 లక్షలు : మంత్రి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్

**మాన్వి, న్యూస్‌టుడే :** సంఘ సంస్థల అభివృద్ధి, బలోపేతానికి స్థలాలు, నిధులను విరాళంగా ఇచ్చిన దాతలని విస్మరించరాదని, కమ్మసంఘం అభివృద్ధికి రూ.20 లక్షల ఇవ్వనున్నట్లు మంత్రి బోసురాజు ప్రకటించారు. ఏ అభివృద్ధి పనిచేయాలన్నా స్థలం దొరకటం లేదని, దాతలిచ్చిన స్థలాలను సరిగ్గా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. స్థానిక కాకతీయ పాఠశాల ప్రాంగణంలో తాలూకా కమ్మవారి సంఘం ఏర్పాటు చేసిన కార్తిక మాస వనభోజన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞతతో ఆలోచించటం, కష్టపడి పనిచేయటం కమ్మసముదాయ ప్రజల అభిమతమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారికి ముఖ్యంగా కమ్మవారికి పేరుతీసుకుని రావటంలో ఎన్.టి.రామారావు, నారా చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి, కృషే కారణమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని సముదాయం ప్రజలు ముందుకు సాగాలన్నారు. ఇక్కడ బృహత్ కల్యాణ మంటపాన్ని నిర్మించాలని, అందుకు తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, మాజీ ఎమ్మెల్యే బసనగౌడ బ్యాగవాట్, కమ్మ వరల్డ్ ఫౌండేషన్ సంస్థాపకుడు కోడె బాబురావు మాట్లాడారు. బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సాధించిన రోహన్‌ను ప్రముఖులు సత్కరించారు. డాక్టర్ వాణి కుమారి మద్దూరి, కె.సాయిపవన్ శర్మ కార్తికమాసం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రవచనం అందించారు. సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ క్యాంపుల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. కర్ణాటక కమ్మ సంఘాల అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, సంఘం అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌రావు, కార్యదర్శి జి.శ్రీనివాస్, కోశాధికారి మల్లికార్జున, ఉపాధ్యక్షులు పుట్ట ప్రసాద్, రామకృష్ణ, ఎస్.రమేష్, కె.మార్కండేయులు, వైట్ల రవి, డి.రామకృష్ణ, కాకతీయ శిక్షణ సంస్థ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కాకతీయ బ్యాంకు అధ్యక్షుడు జి.పాపారావు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోహన్‌ను సత్కరిస్తున్న బోసురాజు, హంపయ్యనాయక్

పాత్రికేయులకు వివరిస్తున్న మంత్రి ప్రియాంక్

## చెరకు రైతులకు తీపి కబురు

**కలబురగి (రాయచూరు, న్యూస్‌టుడే) :** కలబురగి జిల్లాలోని ఐదు, యాదగిరి జిల్లాలోని ఒక చక్కెర పరిశ్రమ యజమానులు రైతుల నుంచి టన్ను చెరకును రూ.2950తో కొనుగోలు చేసేలా, రెండు వారాల్లో సొమ్ము చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కలబురగి బాధ్య మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. ఆయన ఆదివారం కలబురగి జిల్లా పాలనాధికారి సభా భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నదాతల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి యజమానులతో పలుమార్లు చర్చించిన తర్వాత నిర్దిష్టమైన ధరను ఖరారు చేసినట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరులో సంభవించిన అతివృష్టికి కలబురగి జిల్లాలో 3 లక్షల 24 వేల 205 హెక్టార్లలో నష్టం జరిగినందున నివేదిక ఆధారంగా మూడు రోజుల్లో రూ.250.97 కోట్ల పరిహారాన్ని జమ చేస్తారని చెప్పారు. పంటల బీమా పథకంలో రూ.243.41 కోట్ల నష్ట పరిహారం విడుదలైందని వెల్లడించారు. మద్దతు ధర పెంచడం కేంద్రం పరిధిలో ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పాతిమా, జెస్కాం అధ్యక్షుడు ప్రవీణ్ పాటిల్, కల్యాణ కర్ణాటక రహదారి రవాణా సంస్థ ఛైర్మన్ అరుణకుమార్ పాటిల్, నగరాభివృద్ధి అధ్యక్షుడు మజహర్ ఆలంఖాన్, జిల్లా పాలనాధికారిణి ఫౌజియా తరన్నుమ్, జడ్పీ సీఈవో భంవర్‌సింగ్ మీనా, జిల్లా అదనపు పాలనాధికారి రాయప్ప పాల్గొన్నారు.

## చోరీల కేసులో నిందితుడి పట్టివేత

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

**రాయచూరు, న్యూస్‌టుడే :** ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్య సాయి జిల్లా ధర్మవరానికి చెందిన నిందితుడు గుజ్జల రామకృష్ణను అరెస్ట్ చేసినట్లు రాయచూరు ఎస్పీ పుట్టమాదయ్య వెల్లడించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాయచూరు పశ్చిమ పోలీస్ ఠాణా సర్కిల్ పరిధిలో ఆగంతకుడు ఈ ఏడాది మే 20న రెండు ఇళ్లు, ఆగస్టు 29న ఒక ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ నాగరాజు మేకా, ఎస్సై మంజునాథ్, కానిస్టేబుళ్లు నిజాముద్దీన్, జాఫర్ సాదిక్, రమేష్, వినాయక్, సుబ్బ మునియప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, శివపుత్ర ఒక బృందంగా నియమించారన్నారు. దర్యాప్తులో బాగంగా గుజ్జల రామకృష్ణను అదుపులో తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. నిందితుడి నుంచి రూ.36.22 లక్షల విలువైన 315 గ్రాముల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు ధర్మవరం కేతిరెడ్డి కాలనీలో నివసిస్తూ.. చిప్స్ విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడన్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

భూమిపూజ చేస్తున్న మంత్రి బోసురాజు, తదితరులు

## సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

**రాయచూరు, న్యూస్‌టుడే :** పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో వైజ్ఞానిక మనోభావాలను పెంపొందించాలని, వృత్తి నైపుణ్యతను సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు వెల్లడించారు. రాయచూరు ఉప ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ఆవరణలో ప్రాదేశిక విజ్ఞాన కేంద్రం కేటగిరి-2 పనులకు మంత్రి, నగరపాలక సంస్థ అధ్యక్షురాలు నరసమ్మతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బోసురాజు ప్రసంగిస్తూ శాస్త్ర, సాంకేతిక ప్రగతితోనే ఆర్థిక, విద్య, సామాజిక పురోగతి సాధ్యమని వివరించారు. పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహోపాత్ర, అధికారులు రాజు భాస్కర్, రాజా, సదాశివ ప్రభు, అజిత్, జిల్లా విద్యా శాఖ ఉప నిర్దేశకుడు బడిగేరా, మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుఖాని, జయణ్ణ, కె.శాంతప్ప, శివమూర్తి పాల్గొన్నారు.

మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

## పోరాటయోధుడు టిప్పుసుల్తాన్

**మాన్వి, న్యూస్‌టుడే :** టిప్పుసుల్తాన్ గొప్ప దేశభక్తి గల స్వాతంత్ర్య పోరాట యోధుడని, దేశం కోసం ఆయన పిల్లలనే పణంగా పెట్టిన త్యాగశీలి అని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. శనివారం రాత్రి టిప్పుసుల్తాన్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఆయన జయంతిని ఆచరించిన ఘనత మాన్విదే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్, ముడా అధ్యక్షుడు గఫూర్‌సాబ్, టిప్పుసుల్తాన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హుసేని తదితరులు మాట్లాడారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన సాధకులను, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించారు. పికార్డు బ్యాంకు అధ్యక్షుడు రాజా సుభాశ్చంద్ర నాయక్, గ్యారంటీ సమితి అధ్యక్షుడు అమరేశప్ప, సమాజ సేవకుడు అక్బర్‌సాబ్, ఖాలీద్ ఖాద్రి, మిర్జా ఆదం బేగ్, ఇబ్రాహీం కురేషి, ఖలీల్ కురేషి తదితరులు పాల్గొన్నారు.

## అసాధారణ మహిళ తిమ్మక్క

వృక్షమాతకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

**రాయచూరు, న్యూస్‌టుడే :** పర్యావరణ సంరక్షణకు శ్రమించిన వృక్షమాత తిమ్మక్క జీవితం స్ఫూర్తిదాయకమని ఆదికవి మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శివానంద పేర్కొన్నారు. లక్షల మొక్కలను నాటి పోషించిన ఆమె అసాధారణ మహిళ అని నిరూపించుకుందని కొనియాడారు. విశ్వవిద్యాలయం సిండికేట్ గదిలో ఆదివారం నిర్వహించిన తిమ్మక్క సంతాప సమావేశంలో నివాళులర్పించారు. చిత్రపటానికి ఉపకులపతి పూలమాల వేశారు. అధికారులతో కలిసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ చెన్నప్ప ఉపన్యసిస్తూ మొక్కలను సొంత బిడ్డలుగా భావించి ఆలనా పాలనా చూసుకున్న తిమ్మక్క మహిళా లోకానికి ఆదర్శమని ప్రశంసించారు. ఉప రిజిస్ట్రార్ వెంకటేష్ మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందించిన ఆమె కన్నడిగుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని దక్కించుకుందన్నారు. అధికారులు సుయమీంద్ర కులకర్ణి, పార్వతి, బిరాదార్, ఆశా పాల్గొన్నారు.

## శాంతియుతంగా కవాతు

**కలబురగి, న్యూస్‌టుడే:** చిత్తాపురలో సంఘ్ పరివార్ కార్యకర్తలు ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన పథ సంచలన్ శాంతియుతంగా కొనసాగింది. భగవాధ్వజ్‌ను పట్టుకుని 300 మంది సంఘ్ కార్యకర్తలు వెళ్తుండగా, వారి ముందు 50 మంది బ్యాండ్ సిబ్బంది బజాజ్ కల్యాణ మండపం నుంచి అంబేడ్కర్ కూడలి, బసవ ఆసుపత్రి, హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డు, బసవేశ్వర కూడలి నుంచి మళ్లీ కల్యాణమండపానికి చేరుకోవడంతో కవాతు ముగిసింది. గణ్ వేషధారులకు స్థానికులు స్వాగతం పలికారు. రహదారికి ఇరువైపులా నిలబడి గణ్ వేషధారులపైకి పూల రేకులు చల్లారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం, జై శ్రీరామ్, జై భవాని, జై శివాజీ అంటూ నినాదాలు చేశారు. మధ్యాహ్నం 3.45కు ప్రారంభమైన కవాతు 4.22కు పూర్తయింది.

## రెవెన్యూ అదాలత్‌ను వినియోగించుకోండి

**రాయచూరు, న్యూస్‌టుడే :** నగరపాలక సంస్థ ఇళ్ల వద్దకు విచ్చేసి సేవలందిస్తున్న రెవెన్యూ ప్రత్యేక అదాలత్‌ను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని రాయచూరు శాసనసభ్యుడు డాక్టర్ శివరాజ్ పాటిల్ కోరారు. 18వ వార్డులో ఆదివారం అదాలత్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పాటిల్ ప్రసంగిస్తూ అదాలత్ వల్ల ప్రజలు కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి తప్పుతుందని, సత్వర సేవలు లభిస్తాయని చెప్పారు. ఆస్తి ఖాతాల మంజూరులో జాప్యం వల్ల పౌరులు పడుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు కమిషనర్ జుబిన్ మహోపాత్ర శ్రమిస్తున్నారని కితాబిచ్చారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దాఖలాలను శరవేగంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లలితా, భాజపా నాయకుడు శంకరప్ప, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు..

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శివరాజ్

## విచారణ వాయిదా

**బెంగళూరు (కృష్ణరాజపుర), న్యూస్‌టుడే:** రౌడీషీటరు బిక్లు శివ హత్య కేసులో తనను నిందితునిగా చేర్చడం, కోకా చట్టానికి అనుగుణంగా కేసు నమోదు చేయడాన్ని ప్రశ్నిస్తూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే భైరతి బసవరాజు వేసుకున్న అర్జీ విచారణ బుధవారానికి వాయిదా పడింది. భైరతి తరఫున సీనియరు న్యాయవాది సందేశ్ చౌతా వాదనలు వినిపించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా, వేధించే ఉద్దేశంతోనే తన కక్షిదారునిపై కోకా చట్టాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. భైరతి కుంభమేళాకు వెళ్లిన సమయంలో హత్య జరిగిందని, హతుడు, హంతకులతో ఆయనకు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు లేవని వాదించారు.

## అభియోగపత్రాన్ని దాఖలు చేసిన ఈడీ

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** బేలేకేరి పోర్టు నుంచి 8 లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని చైనాకు అక్రమంగా ఎగుమతి చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ శైల్ (59)పై అభియోగపత్రాన్ని దాఖలు చేశామని ఈడీ ప్రకటించింది. ఆయన కంపెనీ శ్రీ మల్లికార్జున షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా అక్రమంగా ఎగుమతులు చేశారని 2010లో లోకాయుక్త మొదట కేసు నమోదు చేసింది. ఈ నేరం రుజువు కావడంతో ఇప్పటికే శిక్ష పడగా, బెయిలుపై బయటకు బయటకు వచ్చారు. బెయిలు రద్దు కావడంతో మరోసారి దాన్ని పొడిగించుకునేందుకు అర్జీ వేసుకున్నారు. ఇదే సమయంలో రూ.44 కోట్ల అక్రమంగా నగదు లావాదేవీలకు పాల్పడిన ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసుకుంది. దర్యాప్తు పూర్తి చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రాన్ని దాఖలు చేశామని ఈడీ అధికారులు తెలిపారు.

## 7672 బీపీఎల్ కార్డుల తొలగింపు

**రాయచూరు, న్యూస్‌టుడే :** జిల్లా వ్యాప్తంగా అనర్హత కల్గిన 7672 బీపీఎల్ కార్డులను ఆహార పౌరసరఫరా శాఖ తొలగించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గ సూచనలు ఆధారంగానే అనర్హుల పేర్లను తీసేశారు. దేవదుర్గ, సింధనూరు తాలూకాలో ముగ్గురు చొప్పున, లింగసూగూరు తాలూకాలో ఇద్దరి పేరిట కార్డులు ఉన్నట్లు గుర్తించారు. మాన్విలో 935, రాయచూరులో 618, లింగసూగూరులో 613, దేవదుర్గలో 305 మంది రైతులు ఏడున్నర ఎకరాల భూమి కంటే ఎక్కువ ఉన్నట్లు పరిశీలనలో బయటపడింది. కర్ణాటకలోనూ, సొంత రాష్ట్రంలోనే రెండు చోట్ల 3131 మంది కార్డులు ఉన్నట్లు తేలింది. కంపెనీల డైరెక్టర్లుగా ఉన్న 405 మంది, రూ.25 లక్షలకు మించి ఆర్థిక లావాదేవీలు చేస్తున్న 62 మందికి బీపీఎల్ కల్గి ఉండటం ఆశ్చర్యాన్ని కల్గించింది. ఏడాది ఆదాయం రూ.1.20 లక్షలకు మించి ఉన్న, ఈ-కేవైసీ చేయించుకునే వారి, ఆరు మాసాలుగా రేషన్ తీసుకోని వారి కార్డులను రద్దు చేశారు. వీటిని ఏపీఎల్‌గా మార్పు చేశారు. 2017 రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు, గ్రామాల్లో మూడు హెక్టార్ల కంటే భూమి కల్గిన వారికి, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి ఇళ్లు ఉన్నా, నాలుగు చక్రాల వాహనం ఉన్నా బీపీఎల్‌కు అనర్హులు. సాంకేతిక కారణాలతో పేదల కార్డులను తొలగించి ఉంటే, జిల్లా, తాలూకా ఆహార పౌర సరఫరా శాఖ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయంలో దాఖలాలు అందజేస్తే పరిశీలించి న్యాయం చేస్తామని ఆహార పౌరసరఫరా శాఖ ఉప నిర్దేశకుడు నజీర్ అహ్మద్ వెల్లడించారు.

| తాలూకా | బీపీఎల్ | ఏపీఎల్ |
| --- | --- | --- |
| రాయచూరు | 1,11,569 | 1773 |
| సింధనూరు | 97,478 | 1730 |
| మాన్వి | 93,523 | 1485 |
| లింగసూగూరు | 91,017 | 1532 |
| దేవదుర్గ | 65,132 | 1152 |
| **మొత్తం** | **458719** | **7672** |

## మహిళతో అసభ్యప్రవర్తన

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** కుక్కను ముద్దు పెట్టుకునే పేరుతో ఓ వ్యక్తి మహిళ శరీరాన్ని తాకి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన శనివారం సాయంత్రం జ్ఞానభారతి పోలీసుఠాణా పరిధిలో జరిగింది. సాయంత్రం 7 గంటలకు ఉప్పారలేఔట్‌లో ఓ మహిళ తన పెంపుడు కుక్కతో కలిసి వాయువిహారం చేస్తున్నారు. అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి కుక్కను ఆడిస్తూ ఆమె శరీరాన్ని తాకడంతో పాటు ముద్దు పెట్టుకునేందుకు ప్రయత్నించాడు. హఠాత్పరిణామానికి విస్తుపోయిన ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి ఆ వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## భార్యకు వీడియో కాల్ చేస్తూ బలవన్మరణం

**మడికేరి, న్యూస్‌టుడే:** భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చిన కీర్తన్ (36) అనే వ్యక్తి వీడియో కాల్ చేసి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒక దొంగతనం కేసులో కారాగారం చేరిన కీర్తన్ కొద్ది రోజుల క్రితమే బెయిలుపై బయటకు వచ్చాడు. భర్త కారాగారంలో ఉన్నప్పుడు అతని భార్య పుట్టింటికి వెళ్లింది. తాను కారాగారం నుంచి వచ్చానని, ఇంటికి తిరిగి రావాలని ఆమెకు ఫోన్ చేస్తూ వచ్చినా స్పందించకపోవడంతో సోమవారపేట శివార్లకు వెళ్లి, భార్యకు వీడియోకాల్ చేసి, చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మడికేరి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 16-11-2025 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
| --- | --- | --- |
| నీటిమట్టం (అడుగుల్లో) | 1624.61 | 1631.08 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 2,987 | 3,269 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 7,211 | 8,007 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 75.226 | 98.180 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## బ్రాండ్ బెంగళూరుకు 'ఉద్యాన' తోరణం

అన్నివర్గాలు ఇష్టపడే బహిరంగ వ్యాయామశాల

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** పచ్చదనం, చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చే ఉద్యానవనాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార దృష్టి సారించింది. బ్రాండ్ బెంగళూరు దిశగా మరింత వన్నె తెచ్చేందుకు ఉద్యానవనాల అభివృద్ధికి శ్రీకారంచుట్టారు. ఉదయం, సాయంత్రం పూట బాలలు, వృద్ధులు ఎక్కువ సమయం ఉద్యానవనాల్లో గడుపుతారు. తెల్లవారుజామున వాయు విహార కేంద్రాలుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్నపాటి ఉద్యానవనాల్లో నడక దారి, బహిరంగ వ్యాయామశాలను ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం యాంత్రిక జీవనం సాగిస్తున్న ప్రజలు కొద్ది సేపు విశ్రాంతి తీసుకునేలా ఉద్యానవనాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్నపాటి ఉద్యానవనంలోనూ వివిధ జాతుల చెందిన మొక్కలు పెంచుతున్నారు. పశువులు ప్రవేశించకుండా రాత్రి అసాంఘిక కార్యకలాపాలు సాగకుండా చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. నగరంలో 934 చిన్నతరహా ఉద్యానవనాలు, 62 మధ్యతరహా ఉద్యానవనాలను ప్రాధికార అభివృద్ధి చేసింది. ఉద్యానవనాల నిర్వహణ కోసం రూ.వందకోట్లు ఏడాదికి వ్యయం చేస్తున్నారు. వాటితో పాటు వార్డులకు కేటాయించే నిధులను ఉద్యానవనాలను ఖర్చు చేస్తున్నారు. పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనాల్లో నడక దారి, విశ్రాంతి తీసుకునేందుకు అసనాలు, ఎండా వానల నుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేక గుడారాలు, మరుగుదొడ్లు వంటివాటితో పాటు బహిరంగ వ్యాయామ శాలలను ఏర్పాటు చేశారు. హలసూరు, జేబీనగర, సీవీరామన్‌నగర, కేఈబీ లేఔట్, కెంపేగౌడ లేఔట్, బయ్యప్పనహళ్లి, అశోక్‌నగర, కోరమంగల, మడివాళ తదితర ప్రాంతాల్లో కొత్తగా ఉద్యానవనాలను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు.

సంజయ్‌నగర ఉద్యానవనంలో ప్రజల వాయువిహారం

## ప్రభుత్వానికి తాఖీదుల జారీ

**బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే:** దివ్యాంగులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, ప్రత్యేక పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిణామకారిగా జారీ చేయాలని కోరుతూ వచ్చిన అర్జీని ఉన్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఎమ్మెల్సీ వైఎం సతీశ్‌తో పాటు వై.కార్తిక్, వై.కౌశిక్ వేసుకున్న ప్రజాహిత వ్యాజ్యాన్ని జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం పుణచ్చ విచారణకు స్వీకరించారు. ఆరు వారాల్లో వాస్తవ స్థితిగతులతో నివేదిక ఇవ్వాలని తదుపరి విచారణను 2026 ఫిబ్రవరి 4కు వాయిదా వేశారు.

## ఐదు కేసులు నమోదు చేశాం

**బాగలకోటె, న్యూస్‌టుడే:** ముధోళ తాలూకా సమీరవాడి వద్ద గోదావరి చక్కెర పరిశ్రమకు చెరకు లోడుతో వచ్చిన ట్రాక్టర్లలో 30 వాహనాలను నిప్పు పెట్టిన ఘటనలో ఐదు కేసులు నమోదు చేసుకున్నామని శాంతిభద్రతల విభాగం అదనపు ఏడీజీపీ ఆర్ హితేంద్ర తెలిపారు. నిప్పు పెట్టిన నిందితులను గుర్తించేందుకు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు, కొందరు అనుమానితులను అదుపునకు తీసుకుని విచారణ చేపట్టామన్నారు. మొత్తం 20 మంది ఈ ట్రాక్టర్లకు నిప్పు పెట్టారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని హితేంద్ర వివరించారు. పరిశ్రమ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు, ఆందోళన చెలరేగుతాయని భావిస్తున్న చోట ఆదివారం వరకు నిషేధాజ్ఞలను జారీలోకి తీసుకువచ్చామని చెప్పారు.

## పోలీసుల అదుపులో పది మంది

**బాగలకోటె, న్యూస్‌టుడే:** టన్ను చెరకుకు రూ.3500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేసిన రబకవి బనహట్టి పరిధి సమీరవాడిలో గోదావరి చక్కెర మిల్లు వద్ద 30కు పైగా చెరకు లోడు ఉన్న ట్రాక్టర్లకు నిప్పు పెట్టిన ఘటనలో పది మందిని అదుపునకు తీసుకున్నామని మహాలింగపుర ఠాణా పోలీసులు తెలిపారు. సిద్ధప్ప బళగానూర, మల్లు మేటగుడ్డ, రాజుగౌడ పాటిల్, బసు నాయ్కర్ నేతృత్వంలో వచ్చిన ఆందోళనకారులు నిప్పు పెట్టారని ప్రాథమిక విచారణలో గుర్తించారు. వారు కూడా రైతులేనని, వారిని తక్షణమే విడిచి పెట్టాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారిని విడిచి పెట్టకపోతే తదుపరి ఆందోళనకు సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు.

## జి.ఉదయగిరి @ 5.8 డిగ్రీలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత కొనసాగుతోందని, ఆదివారం కొంధమాల్ జిల్లాలోని జి.ఉదయగిరిలో అత్యల్ప ఉష్ణోగ్రత 5.8 డిగ్రీలుగా నమోదైనట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. కొంధమాల్ జిల్లా, పుల్బాణిలో 9 డిగ్రీలు ఉష్ణోగ్రత ఉండగా, మిగతా కేంద్రాల్లో 10 నుంచి 17 డిగ్రీలుగా ఉందన్నారు. మరో వారం రోజుల వరకు చలిగాలుల తీవ్రత కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని, సోమవారం (17న) కటక్, ఝార్సుగుడ, ఖుర్దా, సుందర్‌గఢ్, అనుగుల్, కొంధమాల్ జిల్లాలకు 'కోల్డ్ వేవ్' హెచ్చరికలు జారీ చేశామన్నారు.

## [redacted] సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండండి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన మహేంద్రగిరి పర్వతంపై సోమవారం ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడా పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ మధుమిత ఆదివారం సాయంత్రం ఆ ప్రాంతానికి చేరుకొని పనులను సమీక్షించారు. జిల్లా అటవీశాఖ అధికారి కె.నాగరాజుతో పాటు అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపముఖ్యమంత్రి వచ్చి కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్లే వరకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.

ఈకో రిసార్ట్స్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మధుమిత

## ప్రసార సాధనాలది క్రియాశీలక పాత్ర: గవర్నర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభం ప్రసార సాధనాలని, వ్యవస్థ సక్రమంగా నడవడానికి దోహదపడుతున్నాయని గవర్నరు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ఆదివారం జాతీయ 'ప్రెస్ డే'ను పురస్కరించుకుని ఆయన సందేశమిచ్చారు. దేశ సమగ్రత, అఖండత పరిరక్షణలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ప్రజావాణి వినిపిస్తున్న ప్రసార సాధనాలు భారత ప్రజాస్వామ్య దీపికలని వర్ణించారు.

రాజ్‌భవన్ విడుదల చేసిన చిత్రం

# భిన్న సంస్కృతుల మేలిమి కలయిక భారత్

బిర్సాముండా చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భాషలు వేరైనా మనమంతా భారతీయులమని, సమైక్యతకు, అఖండతకు అద్దం పట్టే భారత్ భిన్న సంస్కృతుల మేలిమి కలయిక అని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో ఝార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతి ఉత్సవాలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నరు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బిర్సాముండా జయంతిని జన జాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించి దేశవ్యాప్త కార్యక్రమాలు చేపడుతూ మహనీయునికి నివాళి అర్పిస్తున్నారని అభివర్ణించారు. ఉత్తరాఖండ్, ఝార్ఖండ్ రాష్ట్రాల వైభవం గురించి చెప్పారు. దీనికి ముందుగా దిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనలో మృతిచెందిన వారి ఆత్మశాంతికి ప్రార్థన చేశారు. కార్యక్రమంలో గవర్నర్ భార్య జయశ్రీ, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రూపారోషన్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఝార్ఖండ్ కళాకారుల సమర విన్యాస నృత్యం

ఒడిశా మహిళల గొట్టిపువా నాట్యం

# సుందర్‌గఢ్‌కు ఉజ్వల భవిత

### ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

బిర్సాముండా చిత్రపటం వద్ద పుష్పాలు వేస్తున్న సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖనిజ సంపదకు నిలయమైన సుందర్‌గఢ్ జిల్లా రాష్ట్ర ఖజానా నింపుతున్నా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, ఇక ఆ పరిస్థితి ఉండదని, అన్నిరంగాల్లో ముందంజ వేస్తుందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. ఈ జిల్లాలోని ఉక్కునగరం రవుర్కెలాలో శనివారం రాత్రి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ రవుర్కెలా ఇస్పాత్ జనరల్ ఆసుపత్రి (ఐజీహెచ్)కి ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని, విమానాశ్రయం విస్తరణ జరుగుతుందని చెప్పారు. ఖనిజ సంపద నుంచి వస్తున్న నిధులతో జిల్లా అంతటా మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జోయల్ ఓరం, ఎమ్మెల్యేలు శారదాప్రసాద్ నాయక్, దుర్గాచరణ్ తంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత రవుర్కెలాలో కొత్తగా నిర్మాణమైన సర్క్యూట్ అతిథి భవనం సీఎం ప్రారంభించారు.

## నేడు గంజాం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా సోమవారం గంజాం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.20 గంటలకు బ్రహ్మపుర రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. నాలుగో నెంబరు ప్లాట్‌ఫాంపై ఏర్పాటయ్యే కార్యక్రమంలో పాల్గొని వృద్ధుల తీర్థయాత్ర యోజన కింద వెళుతున్న యాత్రికుల రైలుకు జెండా ఊపుతారు. అనంతరం ఆమె హెలీకాప్టర్‌లో తప్తపాణి వేడినీటి బుగ్గ పర్యాటక కేంద్రానికి చేరుకుని అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారు. తప్తపాణిలో ప్రజాపనుల శాఖ అతిథి భవనంలో మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం హెలీకాప్టర్‌లో గజపతి జిల్లా పర్యటనకు వెళతారని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## రామాయణం నాటకంలో అశ్లీల ప్రదర్శనలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'రామాయణం' నాటక ప్రదర్శనలో కళాకారులు హద్దు దాటారు. ఎంతో పవిత్రంగా భావించే సీత, ఇతర వేషధారిణులతో వేషధారులు అనుచితంగా ప్రవర్తించారు. ఐటమ్ గర్ల్ నిషా మహరణా అశ్లీల నృత్యం, కిన్నెర (హిజ్రా)ల నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాల పేరిట నిర్వహిస్తున్నారు. దీనిపై కళా సంస్థల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాం జిల్లా దిగపాహండి సమితిలో మౌళాభంజ గ్రామంలోని యాత్ర సందర్భంగా ఇటీవల రెండు నాటక బృందాలు పోటాపోటీగా ప్రదర్శించిన 'రామాయణం' నాటకంలో అశ్లీల అంశాల వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతున్నాయి.

రామాయణం నాటకంలో సీత పాత్రధారిణితో అనుచితంగా ప్రవర్తిస్తున్న రావణుడి వేషధారి

### యాభై గంటలకు పైగా ప్రదర్శనలు

గ్రామంలోని యాత్ర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో రెండు బృందాలతో నిర్వాహకులు 'రామాయణం' నాటకాల ప్రదర్శనలకు ఏర్పాటు చేశారు. ఆయా ప్రదర్శనలు 24 గంటలపాటు నిరవధికంగా జరగాల్సి ఉండగా, రెండు బృందాలు ఆయా నాటకాలను పోటాపోటీగా యాభై గంటలకుపైగా ప్రదర్శించాయి. నాటకంలో సీత పాత్రధారిణిని రావణుడు ఆమె శరీరంలో పలు చోట్ల తాకుతూ, చుంబిస్తూ హద్దు దాటి అశ్లీలతను ప్రదర్శించాడు. నిషా మహరణా, కిన్నెరలు అర్థ నగ్న నృత్యాలు ప్రదర్శించారు. పలువురు వేషధారులు క్రేన్‌పై ఎక్కి ప్రమాదకరంగా విన్యాసాలు చేశారు. రామాయణం వంటి పౌరాణిక నాటకంలో అశ్లీల ప్రదర్శనలు అత్యంత నిందనీయమని రంగస్థల దర్శకుడు, ఆల్ ఇండియా థియేటర్ కౌన్సిల్ జాతీయ ఉపాధ్యక్షుడు రాజ్‌గోపాల్ పాడి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. ఇటువంటి ప్రదర్శనలిచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.


ప్రదర్శనలో ఐటమ్ గర్ల్ అశ్లీల నృత్యం

## ప్రపంచ బాడీబిల్డింగ్ పోటీల్లో అమిత్‌కుమార్ భుయ్యకు రజతం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఇండోనేషియాలోని బటమ్ సిటీలో జరిగిన 16వ ప్రపంచ బాడీబిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీల్లో భారత తరఫున పాల్గొన్న అమిత్‌కుమార్ భుయ్య రెండోస్థానంలో నిలిచాడు. ఆయా పోటీలకు జడ్జిగా బ్రహ్మపుర నుంచి వెళ్లిన ఎస్.రాజేష్‌బాబు ఆచారి ఆ వివరాలను ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పోటీల్లో 75 కిలోల కేటగిరీలో అమిత్ శరీర సౌష్టవం ప్రదర్శించి ద్వితీయస్థానం పొంది రజత పతకం, ట్రోఫీ కైవసం చేసుకున్నట్లు రాజేష్‌బాబు ఆచారి తెలిపారు.

రజత పతకం, ట్రోఫీతో అమిత్‌కుమార్ భుయ్య. చిత్రంలో రాజేష్‌బాబు ఆచారి

## రాష్ట్ర పాఠశాల క్రీడల ఛాంపియన్ భువనేశ్వర్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో బాలేశ్వర్‌లో మూడు రోజులు జరిగిన 69వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14, 17 బాలబాలికల అథ్లెటిక్స్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఇందులో మూడు అంశాల తుదిపోరులో భువనేశ్వర్ బాలబాలికలు ఛాంపియన్‌గా నిలిచి బహుమతులందుకున్నారు. అథ్లెటిక్స్‌లో బాలుర అండర్-14, 17 విభాగంలో నవరంగపూర్ జిల్లా పాఠశాలల జట్టు విజేతగా నిలిచింది.

బేస్‌బాల్ ఛాంపియన్ బహుమతితో భువనేశ్వర్ బాలురు

## 'విభీషణుల' వల్లే కాంగ్రెస్ ఓటమి

### పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్

భక్తచరణ్‌దాస్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విభీషణుల వల్ల కాంగ్రెస్ నువాపడలో ఓటమి పాలైందని, అలాగని తాము నిరాశకు గురి కావడం లేదని, ఎందుకంటే పార్టీ అభ్యర్థి ఘసిరామ్ మాఝి 40 వేలు ఓట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ చెప్పారు. ఆదివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీలో విభీషణులుంటారని, కాంగ్రెస్‌లో ఎవరన్నదానిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో పార్టీ పరాజయంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ధనం, అధికారుల అండదండలతో భాజపా విజయం సాధించిందని, దీనిపై గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని దాస్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాసనసభ లోపల, వెలుపల ఉద్యమిస్తామన్నారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల ఠాణా బొడిగేట బీఎస్ఎఫ్ జవానులు మావో డంప్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం కలిమెల ఠాణా బెజంగివాడ రిజర్వ్ ఫారెస్టు కుర్మానూర్ పంచాయతీ గోరెగంది అడవిలో బీఎస్ఎఫ్ జవానులు సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న సమయంలో దులాగంది గ్రామం దగ్గర ఉన్న అడవిలో మావోయిస్టుల డంప్ స్వాధీనం చేసుకున్నారు. డంప్ నుంచి ఒక ఐడీ మైన్, ఒక తుపాకీ, 320 బుల్లెట్లు, 110 జిలెటిన్‌స్టిక్కులు, 14 పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

డంప్ నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రి

# స్ఫూర్తిశిఖరం బిర్సాముండా

### పాడేరులో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఒడిశా సీఎం

సీఎం మోహన్ చరణ్ మాఝికి అరకు కాఫీ అందజేస్తున్న జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మంత్రి సంధ్యారాణి తదితరులు

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, పాడేరు/పట్టణం, అరకులోయ: ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఆదివారం వనవాసీ కళ్యాణాశ్రమం ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒడిశా సీఎంకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కలెక్టర్ దినేష్‌కుమార్ స్వాగతం పలికారు. చింతలవీధి కూడలిలో ఏర్పాటు చేసిన బిర్సాముండా విగ్రహాన్ని మోహన్ చరణ్ ఆవిష్కరించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

- అల్లూరి జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బహిరంగ సభలో మాట్లాడుతూ పీవీటీజీల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ యోజనను ప్రారంభించిందని చెప్పారు. గిరిజనులు ఈ దేశానికి ప్రథమ పౌరులని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతికి సముచిత గౌరవం ఇవ్వాలన్నారు. వచ్చే ఏడాది ప్రతి గ్రామంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.
- మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళల సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర, భాజపా జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు, బీజేవైఎం జిల్లా నాయకులు మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో ధింసా నృత్యం చేస్తున్న ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి. చిత్రంలో మంత్రి సంధ్యారాణి

## 'కార్తిక వన భోజనాల' సందడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర శివారున హల్దియాపదర్ సమీపాన రళబలోని శ్రీ సౌండేశ్వర మందిరం (శివాలయం) ఆవరణలో స్థానిక తెలుగు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 'కార్తిక సమారాధన' పేరిట వన భోజనాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘం ప్రతినిధులు, ఇతరులు కుటుంబాలతో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. వేద పండితులు శ్రీ సౌండేశ్వరునికి అభిషేకాలు నిర్వహించగా, మహిళలు సామూహిక లలితా పారాయణం, భక్తి గీతాలాపనలు, అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. పలువురు బాలికలు, యువతులు నృత్యాలతో అలరించగా, వి.చంద్రకళ మహావీర కర్ణ ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. మధ్యాహ్నం అంతా తెలుగు వంటకాలతో వన భోజనాలు చేశారు.

యువతుల నృత్యాన్ని తిలకిస్తున్న మహిళలు

## బెంగళూరులో 'పరబ్' వేడుకలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పర్యాటక సింగారాలకు ఆలవాలమైన ఒడిశాకు రావాలని, ప్రకృతి ప్రసాదించిన అందాలు వీక్షించాలని ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి బెంగళూరులో 'ఒడిశా పరబ్-2025' ఉత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాతి మాట్లాడుతూ పర్యాటకులకు సౌకర్యాలు, భద్రత కల్పిస్తున్న నేపథ్యంలో అంతా ఒడిశా రావాలని కోరారు. పర్యాటక రంగంపై ప్రచారంలో భాగంగా బెంగళూరులో రాష్ట్ర ప్రభుత్వం వేడుకలు చేపట్టింది. కార్యక్రమంలో అభివృద్ధి కమిషనర్ అనూగార్గ్, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బిజయ్‌కేతన్ ఉపాధ్యాయ, కర్ణాటక రాష్ట్రానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. ఇక్కడ అయిదురోజుల పాటు వేడుకలు జరుగుతాయి.

వేదికపై ఉపముఖ్యమంత్రి ప్రభాతి, అధికారులు

# రూ.100 కోట్ల వ్యయంతో బలదేవ్ జీ క్షేత్ర కారిడార్

సమీక్షా సమావేశంలో మంత్రి హరిచందన్, ఎంపీ బైజయంత్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడలోని చారిత్రక బలదేవ్‌జీ క్షేత్రం (జగన్నాథుని సన్నిధి) రాష్ట్రంలో మహిమాన్విత ఆలయాల్లో ఒకటి అని, దీనికి మరింత వైభవం కల్పిస్తామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఇటీవల చెప్పారు. పూరీ శ్రీక్షేత్రం మాదిరిగా పరిక్రమణ మార్గం, వసతిగృహాలు, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం భువనేశ్వర్‌లో ప్రజాపనులు, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో కేంద్రపడ ఎంపీ బైజయంత్ పండా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం హరిచందన్ విలేకర్లతో మాట్లాడుతూ బలదేవ్‌జీ ఆలయ పరిక్రమణ (కారిడార్) మార్గం, ఇతర నిర్మాణాలకు రూ.100 కోట్ల వ్యయ అంచనా వేశామన్నారు. ఈ నెలాఖరులోగా నివేదిక (డీపీఆర్) ఇంజినీర్లు సిద్ధం చేస్తారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

## వ్యాయామం, యోగాతో ఆరోగ్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కౌమార దశలో బాలికలు, యువతులు ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలని ప్రముఖ శిశు వైద్య నిపుణుడు డాక్టర్ టి.ప్రకాశరావు అన్నారు. స్థానిక 'ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్' (ఎఫ్‌హెచ్‌సీ) ఆధ్వర్యంలో 'కౌమార దశ- ఆరోగ్యం' అనే అంశంపై చైతన్య సమావేశం గిరిమార్కెట్‌లో గాంధీ వస్త్ర బజారు ఆవరణలోని ఎఫ్‌హెచ్‌సీ 'స్నేహం భవనం'లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశరావు మాట్లాడుతూ శారీరక వ్యాయామం చేయడంతోపాటు యోగా సాధన చేయాలని, చరవాణి, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అవసరం మేరకు వినియోగించాలన్నారు. ముఖ్యంగా ఒత్తిళ్లను ఎదుర్కొనేలా తమను తాము సిద్ధం చేసుకోవాలని సూచించారు. తల్లి తొలి దైవమని, తండ్రి తొలి గురువని, పెద్దల్ని గౌరవించాలని చెప్పారు. నిద్రలేమి, మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, పీసీఓడీ వంటి సమస్యల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఇందులో ఎఫ్‌హెచ్‌సీ ప్రతినిధులు ప్రశాంత కుమార్ పాత్ర్, ఎ.ఎస్.ఎన్.గుప్త, దేబేంద్ర పాత్ర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న శిశు వైద్య నిపుణుడు ప్రకాశరావు. చిత్రంలో ప్రశాంత పాత్ర్, ఎ.ఎస్.ఎన్.గుప్త, దేబేంద్ర పాత్ర్

హాజరైన బాలికలు, యువతులు

# గులాబీ తోట..ఉపాధి బాట

### గిరిజన మహిళలకు ఆసరా కల్పిస్తున్న యమున బృందం

కంబగూడలో సాగవుతున్న గులాబీల తోట

– న్యూస్‌టుడే, రాయగడ గ్రామీణం

రాయగడ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో గులాబీ సాగుతో గిరిజన మహిళలు ఉపాధి పొందుతున్నారు. వారు పెంచిన తోట నుంచి గులాబీలను రాజధాని భువనేశ్వర్ వరకు ఎగుమతులు చేస్తూ ఏడాదికి రూ.3 లక్షలు వ్యాపారం చేస్తున్నామని చెబుతున్నారు. ఇందుకు మండంగి యమున అనే సాగుదారు ఇచ్చిన ప్రోత్సాహమే అని పలువురు ఆదివాసీ మహిళలు పేర్కొంటున్నారు.

★ జిల్లాలోని రామన్నగూడ సమితిలో కంబగూడ గ్రామానికి చెందిన యమున అందరిలాగే ఆమె కూడా అటవీ ఉత్పత్తులు సేకరించి విక్రయించిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తోంది. కొన్ని రోజుల తర్వాత తనకున్న కొద్దిపాటి స్థలంలోనే గులాబీ సాగు ప్రారంభించారు. అది చూసిన గుణుపురం కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు ఆమెను మరింత ప్రోత్సహించారు. దీంతో ఆమె పుణెలో గులాబీ సాగుకు సంబంధించి ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అనంతరం గ్రామానికి వచ్చి తోటి మహిళలకు యమునే స్వయంగా శిక్షణ ఇచ్చారు.

★ ఎకరా భూమిని కౌలుకు తీసుకొని అందులో 13 వేల మొక్కలను నాటారు. ప్రభుత్వ సహాయంతో బోరు ఏర్పాటు చేసి డ్రిప్ విధానంతో మొక్కలకు నీరు అందిస్తున్నారు. ఇప్పుడు వాటి ద్వారా వస్తున్న గులాబీలు ఒక్కొక్కటి రూ.5 నుంచి రూ.10 విక్రయిస్తున్నారు. గ్రామంలో మరి కొందరికి వీటి సాగుపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వారు ఉత్పత్తి చేసిన పువ్వులను రాయగడ, బ్రహ్మపురతోపాటు భువనేశ్వర్‌కు ఎగుమతి అవుతున్నాయని యమున పేర్కొంటున్నారు.

### పరిశ్రమ ఏర్పాటుకు కలెక్టర్ హామీ

వీరి సాగుపై కలెక్టరు అశుతోష్ కులకర్ణి ఆరా తీసి యమున బృందాన్ని అభినందించారు. ఈ ప్రాంతంలో రోజ్ వాటర్ తయారు చేసే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, అందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పుడు గులాబీ గుబాళింపుతో ప్రత్యేక గుర్తింపు పొందింది కంబగూడ గ్రామం.

గులాబీ సాగు చేస్తున్న యమున(కుడి)

(c) eenadu

## ఘనంగా పత్రికా దినోత్సవం

మాట్లాడుతున్న బ్రహ్మపుర సబ్‌కలెక్టరు అవినాష్ కుమార్. చిత్రంలో బీఈఎంసీ మేయరు దొలాయి, బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'జాతీయ పత్రికా దినోత్సవం' సందర్భంగా ఆదివారం వివిధ సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం స్థానిక ఎస్‌బీఐ రోడ్డులోని క్లబ్‌లో ఓ సమావేశం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు అశోక్ బ్రహ్మ అధ్యక్షతన నిర్వహించిన ఇందులో బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) మేయరు సంఘమిత్ర దొలాయి, బ్రహ్మపుర సబ్‌కలెక్టరు అవినాష్ కుమార్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. క్లబ్ కార్యదర్శి ప్రసాద్ సాహు, సంయుక్త కార్యదర్శి గోపాలకృష్ణ రెడ్డి, కోశాధికారి శివ నారాయణ పండా పాల్గొన్నారు. గంజాం జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం, బ్రహ్మపుర ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బ్రహ్మపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వేడుకలు జరిగాయి. సంజయ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఎంఐటీ) ఆధ్వర్యంలో హిల్‌పట్నలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో పత్రికా దినోత్సవం సందర్భంగా సమావేశం జరిగింది.

## రూ.2.7 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు

జలపాతం ప్రాంతం వద్ద అధికారులతో మంత్రి సూర్యవంశీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్య, క్రీడా శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ రాయగడ జిల్లా పర్యటన ముగించుకొని వెళ్తున్న సమయంలో గజపతి జిల్లా రాయగడ సమితిలోని పర్యాటక ప్రాంతమైన గందాహతి జలపాతాన్ని ఆదివారం సందర్శించారు. ఆ ప్రాంతంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమై జలపాతం అభివృద్ధి ప్రణాళికల విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలపాతం వద్దకు చేరుకొని పరిసర ప్రాంతాలను సందర్శించారు. జలపాతం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.7 కోట్లు మంజూరు చేసిందని సబ్ కలెక్టర్ అనూప్ పండా మంత్రికి వివరించారు. సమితి అభివృద్ధి అధికారి సంతోష్ పాలిక్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ● కాశీనగర్ సమితి బూదర పంచాయతీలోని కిత్తింగి గ్రామ ప్రాంతంలో రూ.12 కోట్ల అంచనా వ్యయంతో 2022 ఏడాదిలో నిర్మించిన ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రారంభించాలంటూ మంత్రి సూర్యవంశీ సూరజ్‌కు విన్నవించారు. రాయగడ జిల్లా నుంచి కాశీనగర్ మీదుగా వెళ్తున్న సమయంలో బూదర ప్రాంత నాయకులు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు.

## యాత్రికుల బస్సులు ప్రారంభం

బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ మధుమిత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: వయోవృద్ధుల తీర్థయాత్రల కోసం ఏర్పాటుచేసిన బస్సులను గజపతి జిల్లా పర్యాటక శాఖ ఆదివారం ప్రారంభించింది. పర్లాఖెముండి పట్టణంలోని గజపతి జిల్లా మైదానం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ మధుమిత, అతిథిగా సాంస్కృతిక అధికారిణి అర్చన కుమారి మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఉజ్జయిని నుంచి ఓంకారేశ్వర్ వరకు వయోవృద్ధుల తీర్థయాత్ర కోసం ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమం చాలా మంచిదని కలెక్టర్ అన్నారు. పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 72 మంది యాత్రికులు బస్సుల్లో బ్రహ్మపుర రైల్వేస్టేషన్ చేరుకుని యాత్రలో పాల్గొంటారని జిల్లా పర్యాటక శాఖ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలిపారు.

రాయగడ పట్టణం: వేదికపై ఎమ్మెల్యే అప్పల స్వామి, నవీన్, సరస్వతి తదితరులు

కాశీనగర్‌లో మాట్లాడుతున్న తిరుపతిరావు

● రాయగడలో ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ పాల్గొని మాట్లాడారు. ● కాశీనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు పాల్గొన్నారు. ● కొరాపుట్‌లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ సౌరబ్ గుప్తా, ఎమ్మెల్యే రఘురామచంద్ర కదం పాల్గొన్నారు.

## పాత్రికేయుల సేవలు ఎనలేనివి

పర్లాఖెముండి, కాశీనగర్, రాయగడ పట్టణం, కొరాపుట్, న్యూస్‌టుడే: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆదివారం పలు కార్యక్రమాలు జరిగాయి. పర్లాఖెముండి పట్టణంలోని పాత్రికేయులతో కలెక్టర్ మధుమిత సమావేశమై మాట్లాడారు.

కొరాపుట్: సమావేశంలో ఎమ్మెల్యే రామచంద్ర కదం, ప్రొఫెసర్ గుప్తా

పర్లాఖెముండి: మాట్లాడుతున్న కలెక్టర్ మధుమిత. చిత్రంలో రెవెన్యూ ఏడీఎం మునీంద్రా

## వనభోజన మహోత్సవం

గోవింద్ స్వామీజీని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణ శివారులోని రామసాగరం ప్రాంతంలో పర్లాఖెముండికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గురుపూజ ప్రాంతానికి చెందిన గోవింద్ స్వామీజీ పాల్గొన్నారు. ఆయనకు సంఘం సభ్యులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గజపతి, బ్రహ్మపుర, గుణుపురంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ కులం వారు పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు గోటి శ్రీను, కార్యదర్శి గుగ్గిలపు నాగ, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రమాదం అంచున ప్రయాణం

జయపురం పట్టణం గాంధీ చౌక్ నుంచి కలాగూడ రహదారిపై ఉన్న కాలువ రక్షణగోడ విరిగిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, అదుపు తప్పితే ప్రమాదమని భయాందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయం 'న్యూస్‌టుడే' సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, జయపురం

## ఏకలవ్య విద్యాలయం ప్రారంభం

పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి రాజుగూడలో ఏకలవ్య ఆదర్శ విద్యాలయం ఆదివారం ఎమ్మెల్యే రూపుధర్ బతెరా చేతుల మీదుగా ప్రారంభించారు. సర్పంచి శివప్రధాని, ఎంపీ ప్రతినిధి అంబపాత్రే, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘానికి రూ.15 కోట్లు

పురాధ్యక్షురాలు కల్యాణి ఘోష్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: 'సమస్య వాదిదే-పరిష్కారం మనది' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 35 వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి స్థానికులే ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఖరగ్‌పూర్ పట్టణ పురపాలక సంఘానికి రూ.15 కోట్లు మంజూరు చేసిందని పురాధ్యక్షురాలు కల్యాణి ఘోష్ ప్రకటించారు.

## ప్రపంచ కప్ హాకీ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు ఎంపిక

జట్టులో స్థానం పొందిన రాష్ట్ర క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడులోని చెన్నై, మదురైలో ఈ నెల 28 నుంచి డిసెంబరు 10 వరకు జరగనున్న 14వ ఎఫ్ఐహెచ్ పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్ పోటీలకు భారత హాకీ సంఘం జట్టు క్రీడాకారులను ప్రకటించింది. ఇందులో ఒడిశాకు చెందిన అనమోల్ ఎక్కా, రోహిత్ కుల్లు, అల్బాహిత్ ఎక్కా, రోషన్ కుజూరు స్థానం పొందారు. రాష్ట్ర క్రీడా శాఖ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. భారత జట్టు ఈ పోటీల్లో స్విట్జర్లాండ్, ఒమన్ తదితర దేశాలతో ప్రారంభ మ్యాచులు తలపడనుందని ఇందులో పేర్కొంది.

## ఘనంగా అయ్యప్ప ఆరాట్టు పూజలు

కావడిలతో ఊరేగింపుగా వెళ్తున్న దీక్షాధారులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాయగడలో అయ్యప్ప ఆరాట్టు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌతమనగర్ అయ్యప్ప మందిరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి దీక్షాధారులు ఇందులో పాల్గొన్నారు. పాలు, తేనె, నెయ్యి, పెరుగు, విభూది, చందనం తదితర వాటితో కూడిన కావడిలను భుజాలపై వేసుకొని పట్టణంలో ఊరేగింపుగా వెళ్లారు. దీక్షాధారులు భజన గీతాలు ఆలపిస్తూ నాగావళి నదికి చేరుకున్నారు. అక్కడ ఊరేగింపుగా తీసుకెళ్లిన ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృత, ఇతర పదార్థాలతో అభిషేకం చేశారు.

## ప్రశంసలందుకున్న రైల్వే పోలీసులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైల్వే పోలీసులు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలందుకున్నారు. షాలిమార్ రైల్వేస్టేషన్ పోలీసులు అపహరణకు గురైన బాలికను సురక్షితంగా కాపాడి పోలీసులకు అప్పగించారు. తమ్లూక్ నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలను గుర్తించి బేలూరు ఘాట్ పోలీసులకు సమాచారం తెలియజేసి వారిని సిస్టర్ నివేదిత బాలికల వసతిగృహానికి తరలించారు.

## ఆరోగ్యం కోసం పరుగు

చైతన్య నడకలో పాల్గొన్న బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్, వీహెచ్‌పీ, భజరంగదళ్, బాజపా నాయకులు, ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగదళ్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రహ్మపురలో ఆదివారం 'ఆరోగ్యం కోసం పరుగు' కార్యక్రమాన్ని నిర్వహించింది. స్థానిక కళ్లికోట వర్సిటీ మైదానం వద్ద నిర్వహించిన ఇందులో బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. 'నిషాముక్త యువతరం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నగరంలోని ప్రధాన రహదారుల్లో చైతన్య పరుగు, నడక నిర్వహించారు.

## గంజాయి, డ్రగ్స్‌తో జీవితాలు చిత్తు

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అనూప్ పండా

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మాదకద్రవ్య రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని సబ్ కలెక్టర్ అనూప్ పండా సూచించారు. ఆదివారం గజపతి జిల్లా విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో పర్లాఖెముండి పట్టణంలో సామూహిక పరుగు(వాకథాన్) మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనపై రాజు గారి కోట ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్స్ బారినపడి యువత జీవితాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యదర్శి నరేంద్రకుమార్ జామి, జిల్లా అధ్యక్షుడు రబిన్ కుమార్ షావుకార్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ్ సాగర్‌ను పరిశీలించిన 'అమృత్' టీమ్

సాగరం వద్ద స్థానిక అధికారులతో చర్చిస్తున్న అమృత్ టీమ్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో ఉన్న చారిత్రాత్మక జగన్నాథ్ సాగరం అభివృద్ధి పనులను పరిశీలించేందుకు భువనేశ్వర్ నుంచి ఇద్దరు సభ్యులతో కూడిన 'అమృత్' టీమ్ ఆదివారం వచ్చింది. నువాసాహి-పంచానన్ మందిర చౌక్ వద్ద ప్రధాన కాలువ దెబ్బతిని చెత్త, మురుగు నీరు చేరుతుండటాన్ని గమనించి బృందం సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. టీమ్ సభ్యులు అర్బన్ ల్యాండింగ్ ఇంటర్‌షిప్ ప్రోగ్రామ్ అధికారి అరుణ్ మహంతి, గృహ, పట్టణ అభివృద్ధి శాఖ ఇంజినీర్ పుణ్యతోయ్ ప్రియదర్శిని సాగరం చుట్టూ తిరిగి పరిశీలించారు.

## మెహందీ పోటీలకు మంచి స్పందన

గోరింటాకు అలంకరణ పోటీల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ 30వ వార్షికోత్సవ పోటీల్లో భాగంగా నిర్వహించిన మెహందీ(గోరింటాకు అలంకరణ) పోటీలకు మంచి స్పందన లభించింది. ఆదివారం రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు పాల్గొని రాజస్థానీ, మయూర, రాధాకృష్ణ వంటి ఆకృతులను సృజనాత్మకంగా గోరింటాకుతో తీర్చిదిద్దారు. అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర ప్రసాద్, కార్యదర్శి డా.పతివాడ తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

## బడికి పోదాం.. రండి

ఇరిగేషన్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న బీఈడీ విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా డ్రాపౌట్ అయిన విద్యార్థులను బడిబాట పట్టించేందుకు ఇరిగేషన్ కాలనీలో పీఎంశ్రీ విద్యాలయం తరపున 'లెట్స్ గో టు స్కూల్' కార్యక్రమం నిర్వహించారు. విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థులు ఆదివారం 12 మంది డ్రాపౌట్‌లను గుర్తించి వారికి నచ్చజెప్పి బడికి రావాలని సూచించారు.

## చేనేత వస్త్రాల విక్రయ మేళా

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో చేనేతల ప్రదర్శన, విక్రయమేళాను కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ప్రారంభించారు. ఒడిశా చేనేతలకు మంచి ఆదరణ ఉందని మనోజ్ సత్యవాన్ అన్నారు.

స్టాళ్లను సందర్శిస్తున్న కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, అతిథులు

## భువనేశ్వర్‌లో మళ్లీ 'పథయాత్ర'లు

పథయాత్రలో మేయరు సులోచనాదాస్ తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం నుంచి 'పథ' (రోడ్డు) యాత్రలు ప్రారంభమయ్యాయి. నగర మేయరు సులోచనాదాస్ కార్పొరేటర్లతో కలిసి ఈ వేడుకలను పునఃప్రారంభించారు. శీతాకాలం ముగిసే వరకు ప్రతి ఆదివారం పథయాత్రలు జరుగుతాయని ఆమె చెప్పారు. నగరవాసుల ఆరోగ్యం, సమైక్యత ధ్యేయంగా ప్రజలతో యోగా, పరుగు, రంగోళి, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టడం తెలిసిందే.

## కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలి

మజ్జిగౌరి మందిరంలో కార్డు ఆవిష్కరిస్తున్న మంత్రి సూర్యవంశీ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: సంఘం ఏదైనా తోటి సభ్యుల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ అన్నారు. రాయగడ పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం మజ్జిగౌరి మందిరంలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన ప్రెస్, మీడియా సంక్షేమ సంఘం లోగో కార్డును ఆవిష్కరించారు. అనంతరం స్థానిక తేజస్వీ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యులంతా ఐకమత్యంతో మెలగాలని ఆకాంక్షించారు. బినోద్‌పండా, అమూల్య సాహు, శివాజీదాస్ పాల్గొన్నారు.

## విద్యుత్తు నియంత్రికకు మంటలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం డైలీమార్కెట్ వద్ద ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద ఆదివారం మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా, ఘటనాస్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

EENADU Classifieds
JOBS
త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ప్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బుకు ...

## బిర్సాముండా సేవలు మరువలేనివి

ప్రశంసాపత్రం అందజేస్తున్న సూర్యవంశీ. పక్కన కలెక్టర్ తదితరులు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: ఆంగ్లేయులపై పోరాడిన బిర్సాముండా ఆదర్శమని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ అన్నారు. శనివారం బిజు పట్నాయక్ ఆడిటోరియంలో బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ● మంత్రిని రామన్నగుడ డిగ్రీ కళాశాల విద్యార్థులు కలిసి వినతిపత్రం అందించారు. కళాశాలలో చరిత్ర అధ్యాపకుడు బాదల్ కుమార్ పరిడా విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, కించపరచడం, కుల దూషణ చేస్తున్నట్లు ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జయపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన కొరాపుట్ జిల్లా కుంద్రా సమితిలో జరిగింది. ఐఐసీ అశ్విని కుమార్ పట్నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కుంద్రాకు చెందిన నీలుసింగ్(27) కారులో ఆదివారం జయపురానికి వెళుతుండగా మాసిగావ్ పంచాయతీ బరగావ్-గోలారిగూడ రహదారిపై వాహనం అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న లోయలో పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## ఈ-రిక్షా ఢీకొనడంతో గాయపడిన యువకుడు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ సబ్ డివిజన్ పరిధిలో గల బేల్దా పట్టణ బకారాబాద్ పంచాయతీ పరిధిలోని కులియా గ్రామానికి చెందిన అశ్వినిపండా శనివారం శ్యాంపూర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఈ-రిక్షాను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయన గాయపడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పలు దుకాణాల్లో చోరీలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ జిల్లా డేబ్రా మార్కెట్‌లో పలు దుకాణాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. వ్యాపారులు ఉదయం దుకాణాలు తెరిచేసరికి చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు మొదలుపెట్టారు.

## 120 సీసాల దగ్గుమందు స్వాధీనం



అరెస్టయిన నిందితులు, స్వాధీనం చేసుకున్న దగ్గుమందు సీసాలు, మాత్రలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఝూర్సుగుడలో 'ఆపరేషన్ నేత్ర' పేరిట తనిఖీలు చేపడుతున్న పోలీసులు దగ్గుమందు సీసాలు, నిషేధిత మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. భ్రజరాజ్‌నగర్ ఎస్‌డీపీఓ చింతామణి ప్రధాన్ వెల్లడించిన వివరాల మేరకు.. అర్ధరాత్రి తనిఖీల సందర్భంగా రాజ్‌పూర్ పెట్రోల్ బంకు సమీపాన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 120 సీసాల దగ్గుమందు సీసాలు 400 మాత్రలను గుర్తించారు. నిందితులు రాజ్‌పూర్ తురిపాడ ప్రాంతానికి చెందిన ప్రకాష్‌కంద్రా(21), ఆకాష్‌కంద్రా(23). నుంచి రూ.2,070 నగదు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## గంజాయి రవాణా.. ఇద్దరి అరెస్టు

పోలీసుల అదుపులో గంజాయితో పాటు నిందితులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను ఎం.వి.79 పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మల్కాన్‌గిరి జిల్లా ఎం.వి.79 పోలీసులు శనివారం లచిపేట గ్రామం దగ్గర పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభించింది. దీంతో వారిని అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన టి. త్రినాథ్ కుమార్, బి.ఆదిత్య అని తెలిసింది. గంజాయి విలువ సుమారు రూ. 1.50 లక్షలుగా ఠాణా అధికారి చంద్రకాంతి తెలిపారు.

***కలప రవాణా కేసులో మరో ఇద్దరు...***

అధికారుల స్వాధీనంలో నిందితులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: అక్రమంగా కలప రవాణా కేసులో నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి మైదల్‌పూర్ అటవీశాఖ అధికారులు ఇద్దరిని అరెస్టు చేసి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాయ్‌ఘర్ రాణా పరిధిలో ఉదయ్‌పూర్‌కు చెందిన అమర్‌జిత్‌సేన్, పపదహండి సమితి మాఫిగూడకు చెందిన బజేంద్ర హరిజన్‌గా గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పపదహండి సమితి కంటమాల్ పంచాయతీ బట్కారి గ్రామం వద్ద కలపను రెండు ట్రక్కుల్లో లోడు చేసి మైదల్‌పూర్‌కు రవాణా చేస్తుండగా అధికారులు అడ్డగించి వారిని అరెస్టు చేశారు.

## కళ్లికోటలో అగ్ని ప్రమాదం.. సామగ్రి దగ్ధం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట పట్టణంలో ధారాకోట వీధిలోని దిలీప్ ఖుంటియా అనే వ్యాపారి ఇంట్లో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంట్లో కుటుంబ సభ్యులతో పడుకుని ఉన్న దిలీప్ శివారు గదిలో ఎగిసిపడుతున్న మంటల్ని చూసి, కుటుంబ సభ్యులతో బయటకు పరుగు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. చూస్తుండగానే అగ్నికీలలు ఇల్లంతా వ్యాపించాయి. సమాచారం అందుకున్న కళ్లికోట, రంభ అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను నియంత్రించారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి మొత్తం దగ్ధమైంది. బీరువాలో భద్రపరిచిన రూ.8 లక్షల నగదు కాలి బూడిదైందని బాధితుడు దిలీప్ వాపోయాడు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనపై కళ్లికోట ఠాణా పోలీసులు ఆరా తీస్తున్నారు.

## చోరీ కేసుల్లో 10 మంది అరెస్టు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ పార్థజగదీష్, ఐఐసీలు

జయపురం: కొరాపుట్ జిల్లాలో పలు ప్రాంతాల్లో కేసులకు సంబంధించి 10 మందిని అరెస్టు చేసినట్లు ఆదివారం ఎస్‌డీపీఓ పార్థజగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుంద్రా నుంచి కొట్పాడ్‌కు చిట్స్ వసూలు చేసి నలుగురు యువకులు అక్టోబరు 29న ద్విచక్రవాహనంపై వస్తుండగా, వారిని ఏడుగురు దుండగులు అడ్డగించి వారి దగ్గర రూ.5-6 లక్షలు దోచుకున్నారు. పోలీసులు అప్పుడు అజయ్ హరిజన్, రామాకాంత్ హరిజన్, సుమీద్ సహీల్ నాయక్‌ను అరెస్టు చేయగా, ఇప్పుడు జయపురం సమితి కుందారిగూడకు చెందిన అరుణ్‌ముదులి, గొడపాదర ప్రాంతానికి చెందిన సాన హరిజన్, నందపూర్‌కు చెందిన అనిల్‌ఖోస్లా, కుంద్రాకు చెందిన భుయిన్ హరిజన్‌లను అరెస్టు చేసి వారి దగ్గర నుంచి రూ. 80 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. తేలిగూడ ప్రాంతానికి చెందిన బాస్కరా భుయాన్ ఇంట్లో ఈనెల 5న దుండగులు చొరబడి బంగారు ఆభరణాలను చోరీ చేసి వాటిని ముథూట్ ఫైనాన్స్‌లో పెట్టి రూ.1,25,025 రుణం తీసుకున్నారు. పోలీసులు ఆదివారం కార్తిక్ ముదులి(కెందుగూడ), మనోజ్ జాని(సొరాగుడ), సంజీబ్ ఖోరా(మస్తీపుట్), బబులాబాగ్(దశమంత్‌పూర్), సిమిలిగుడకు చెందిన బాసుల కుల్దీప్, ప్రహ్లాద్ ఖిలోలను అరెస్టు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

## దృష్టి లోపం విజయానికి అడ్డు కాదు

పతకాన్ని చూపిస్తున్న జగన్నాథ్

నవరంగపూర్, న్యూస్‌టుడే: విజయం సాధించటానికి దృష్టిలోపం అడ్డుకాదని జగన్నాథ్ నిరూపించాడు. నవరంగపూర్ జిల్లా జోరిగావ్ సమితి రతాఖంటిగూడ పంచాయతీ పతియాగూడ గ్రామానికి చెందిన జగన్నాథ్ శాంటా(20) రాష్ట్రస్థాయి పారా-అథ్లెటిక్స్ స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకుని జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చాడు. ఈ పోటీల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 200 మంది పాల్గొనగా, శాంటా మొదటిస్థానంలో నిలిచాడు. జగన్నాథ్ విక్రమ్‌దేవ్ వర్సిటీలో కంబైన్డ్ ఆర్ట్స్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దృష్టి లోపం ఉన్నా, జగన్నాథ్ వెనకడుగు వేయకుండా తన ప్రతిభ చాటుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. జగన్నాథ్ పేద కుటుంబానికి చెందినవాడని, యంత్రాంగం ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నాడు.

## గుండెపోటుతో వైద్యుడి మృతి

త్రినాథ్‌పాల్

రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: విధుల్లో ఉండగా గుండెపోటు సంభవించి ప్రభుత్వ వైద్యుడు మృతిచెందిన ఘటన బాలేశ్వర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నీలగిరి సబ్ డివిజనల్ ఆసుపత్రిలో త్రినాథ్‌పాల్ గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉండగా మూత్ర విసర్జనకు వెళ్లిన సమయంలో గుండెపోటు వచ్చింది. దీంతో మరుగుదొడ్డిలో అపస్మారకస్థితిలో పడి ఉన్న ఆయనను మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

(c) eenadu

# చిన్నా.. నేనున్నా..!

సర్వజనాసుపత్రిలో బుజ్జాయిలకు అత్యాధునిక సేవలు

వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న చిన్నారి

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

చిన్నపిల్లలకు ఒంట్లో బాగోలేకపోతే ఏమీ తోచదు. ఏ ఆసుపత్రికి తీసుకెళ్తే బాగుంటుందని ఎంతో మందిని వాకబు చేస్తుంటాం. ఆ సమయంలో ప్రభుత్వాసుపత్రి సంగతి అసలు ఆలోచనకే రాదు. అక్కడ సేవలు సక్రమంగా అందవని.. పరికరాలు అందుబాటులో ఉండవని అనుకుంటాం. ఓసారి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వెళ్లొస్తే కచ్చితంగా అభిప్రాయం మార్చుకుంటారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఇక్కడి చంటిబిడ్డలకు అత్యాధునిక వైద్య సేవలందిస్తున్నారు. నవజాత శిశువుల ఆరోగ్యానికి సంపూర్ణ భరోసానిస్తున్నారు.

### కామెర్లొచ్చినా బెంగ లేదు..

పుట్టుకతో కామెర్లు వచ్చిన బుజ్జాయిలకు కనీసం వారం రోజులు ఫొటోథెరపీ చేయాలి. ఆసుపత్రిలో డబుల్ సర్ఫేస్ 5, సింగిల్ సర్ఫేస్ 15 ఫొటోథెరపీ పరికరాలున్నాయి. దీనికి బయట ఆసుపత్రుల్లో రోజుకు రూ.5 వేల వరకు వసూలు చేస్తారు.

### ఊపిరి నింపే సీ-పాప్..

ఆయాసం, ఊపిరి తీసుకోలేని పిల్లలకు ఒత్తిడితో కూడిన ఆక్సిజన్ గాలిని ముక్కు ద్వారా పంపించేందుకు ఈ పరికరాన్ని వినియోగిస్తారు. నెలలు నిండని చిన్నారులకు ఇది చాలా అవసరం. ఏడు సీ-పాప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వారం నుంచి పది రోజుల పాటు దీని సేవలకు బయట రోజుకు రూ.10 వేల వరకు వసూలు చేస్తారు.

అత్యాధునిక వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూ వార్డు

### అందుబాటులో వెంటిలేటర్లు..

పుట్టుకతోనే రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గినవారు, 30 వారాల కంటే తక్కువ సమయంలో పుట్టినవారు శ్వాస సరిగ్గా తీసుకోలేరు. వీరికి వెంటిలేటర్ సహాయంతో నేరుగా ఊపిరితిత్తులకు ప్రాణవాయువు అందిస్తారు. ఆ వెంటిలేటర్లు 10 వరకు అందుబాటులో ఉన్నాయి. వీటికి బయట రోజుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తారు.

### ఉచితంగా వెచ్చదనం..

నెలలు, బరువు తక్కువ, ఇన్‌ఫెక్షన్ వచ్చిన చిన్నారులను రేడియంట్ బేబీ వార్మర్లలో ఉంచుతారు. వారి జీవ ప్రక్రియ అవసరమయ్యే విధంగా శరీర ఉష్ణోగ్రతలు అందించేందుకు అవసరమయ్యే ఈ పరికరాలు 36 ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజుకు రూ.5 నుంచి రూ.6 వేలు వసూలు చేస్తారు.

- ■ ఆధునిక పల్స్ ఆక్సీమీటర్లు, మల్టీ పెరా మానిటర్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్, సిరంజ్ పంప్ వంటి వైద్య పరికరాలున్నాయి.
- ■ మూడు పీడియాట్రిక్ వార్డుల్లో 100 పడకల్లో వైద్య సేవలందిస్తున్నారు.
- ■ ఆసుపత్రిలోని చిన్న పిల్లల వైద్య విభాగంలో 20 పడకల ఎస్ఎన్‌సీయూ, 12 పడకల పీఐసీయూ, 10 పడకల పీఐసీయూలు ఉన్నాయి.
- ■ 'నవజాత శిశువు నుంచి 12 ఏళ్ల వయసు ఉన్న పిల్లలకు అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. ఏ సమయంలో వచ్చినా సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు' అని చిన్నపిల్లల వైద్యవిభాగాధిపతి ప్రొఫెసర్ పి.రాము తెలిపారు.

## దుర్గమ్మను తాకిన ఆదిత్యుడు!

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మను సూర్యకిరణాలు తాకాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో మూలవిరాట్‌పై ఆదిత్యుని కిరణాలు పడ్డాయి. 5 నిమిషాల పాటు అమ్మవారి విగ్రహంపై భానుడి కిరణాలు ప్రసరించాయి. ఏటా కార్తికంలో ఇదే తొలిసారి అని ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. – న్యూస్‌టుడే, పాలకొండ

## కొరియా సమస్య పరిష్కరించండి

### సీఎంను కోరిన మంత్రి సంధ్యారాణి

ఒడిశా సీఎంకు వినతిపత్రం అందిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: ఆంధ్రా ఒడిశా సరిహద్దు కొఠియా వివాదాస్పద గ్రామాల సమస్యలను పరిష్కరించాలని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కోరినట్లు ఆంధ్రా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన బిర్సా ముండా జయంతి వేడుకలకు ఒడిశా సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయనతో మంత్రి పలు సమస్యలపై చర్చించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పలు అంశాలను ఆమె వివరించారు. గత 50 ఏళ్లుగా డోలియంబ, ముడకారు, కొఠియా, దిగువశెంబి, ఎగువశెంబి తదితర గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందినవో నిర్ధారించలేదు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, వైద్య సేవలు అందించేందుకు వెళ్లినా ఆంధ్రా సిబ్బందిని ఒడిశా అధికారులు అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారని, వాస్తవానికి 21 గ్రామాలు ఆంధ్ర రాష్ట్రంలో భాగమని ఒడిశా సీఎంకు వివరించారు. ఇకపై కొఠియా గ్రామాల్లో జరిగే అభివృద్ధిని అడ్డుకోకుండా తగు ఆదేశాలు ఇచ్చి, వివాదం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సీఎంను కోరారు.

## ట్యాంకర్ ఢీకొని ఒకరి మృతి

కర్రి దుర్యోధనరెడ్డి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన ఇచ్ఛాపురం పట్టణ పరిధి పురుషోత్తపురం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై ఎం.ముకుందరావు చెప్పిన వివరాల మేరకు.. ఒడిశాలోని గంజాం జిల్లా గొలంత్రా సమీపంలోని అల్లాడిపూర్ గ్రామానికి చెందిన కర్రి దురోధనరెడ్డి (30) అదే గ్రామానికి చెందిన చినపాన చంద్రయ్యతో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంపై ఇచ్ఛాపురం వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దుర్యోధనరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దుర్యోధన మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం బ్రహ్మపుర వైద్యకళాశాలకు తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## మండేయిలో మెరవనున్న ఆదివాసీ అలంకరణ సామగ్రి

జయపురం, న్యూస్‌టుడే: ఈ ఏడాది నవరంగపూర్ జిల్లాలో డిసెంబరు 12-16 వరకు మండేయి, పల్లిశ్రీ మేళా జరుగనున్నట్లు యంత్రాంగం ప్రకటించింది. ఈ ఉత్సవంలో విక్రయించేందుకు ఆదివాసీ సంప్రదాయ అలంకరణ ఆభరణాలను సిద్ధం చేయటంలో ఆదివాసీలు నిమగ్నమయ్యారు. మహిళలు ధరించే గాజులు, హారాలు, ఉంగరాలు, చెవిదిద్దులతోపాటు ఇతర సామగ్రి ఇత్తడితో తయారు చేసి రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది విక్రయిస్తామని మహిళలు పేర్కొన్నారు. ఢిల్లీ, హైదరాబాద్, కోరాపుట్, కలహండి, మల్కాన్‌గిరి, కటక్, పూరీ, భువనేశ్వర్, సుందర్‌గఢ్ జిల్లాల్లో జరిగే వివిధ మేళాల్లో తాము విక్రయిస్తున్నామని చెప్పుకొచ్చారు. మండేయిలో విక్రయించేందుకు దాదాపు రూ.2 లక్షలు విలువ చేసే సామగ్రిని తయారీ చేశామని పేర్కొన్నారు.

అలంకరణ ఆభరణాలను సిద్ధం చేస్తున్న మహిళలు

## జేబు తేలికవుతున్నా.. సంచి బరువెక్కట్లే!

ధరలు (కిలో రూ.లలో)

| | గత నెల | ప్రస్తుతం |
|---|---|---|
| టమాటా | 40 | 60 |
| మిర్చి | 60 | 120 |
| దొండ | 50 | 70 |
| వంకాయ | 60 | 100 |
| బెండ | 50 | 80 |
| కాకర | 50 | 70 |
| బీర | 50 | 80 |
| అల్లం | 80 | 120 |
| క్యారెట్ | 60 | 80 |
| బీట్‌రూట్ | 60 | 80 |
| చిక్కుడు | 50 | 70 |

న్యూస్‌టుడే, బొబ్బిలి, రామభద్రపురం

ఉమ్మడి జిల్లాలో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. రెండు, మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. కార్తిక మాసం.. దీనికి తోడు మొంథా తుపాను.. తెగుళ్ల బెడదతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రూ.వందలో ఖర్చు చేసినా సంచి నిండడం లేదని వాపోతున్నారు.

### దిగుబడులు లేవు..

'ఈ ఏడాది ఎకరా మేర సాగు చేశా. వర్షాలతో పంట దెబ్బతింది. అరకొరగా చేతికందినా వ్యాపారులకు అమ్మేశా' అని రామభద్రపురానికి చెందిన రైతు కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దిగుబడులు తగ్గడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, దళారీ వ్యవస్థను అడ్డుకట్ట వేస్తామని, ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ సహాయ కార్యదర్శి ఈశ్వరరావు వెల్లడించారు.

పెరుగుదలకు కారణాలివీ..
- తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- వరుస తుపానులు
- దళారుల ప్రమేయం
- మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణ లేమి
- చిల్లర వ్యాపారులు సిండికేట్ కావడం

పెరిగిన కూరగాయల ధరలు

### నిలిచిన ఎగుమతులు..

ఉమ్మడి జిల్లాకు పెద్ద మార్కెట్ అయిన రామభద్రపురం నుంచి రోజూ 20 నుంచి 30 టన్నుల వరకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు కూరగాయలు ఎగుమతి అవుతుండేవి. తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గడంతో నిలిచిపోయాయి. ఉన్న కొద్దిపాటి పంటను దళారులు నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి మార్కెట్‌కు పలు ప్రాంతాల నుంచి నిత్యం 50 టన్నుల సరకు చేరుతుంది. కొన్ని రోజులుగా 10 టన్నులకు మించి రావడం లేదు. మరోవైపు పనులు చేసుకుంటూ జీవనం సాగించే 100 మంది కూలీలకు సైతం దెబ్బపడింది.

### కొనలేకపోతున్నాం..

'దసరా నుంచి దాదాపు అవే ధరలున్నాయి. గత రెండు వారాల్లో మరింత పెరిగాయి. మార్కెట్‌కు వెళితే కొనలేని పరిస్థితి. దీంతో కిలోకు బదులు.. అరకిలో తీసుకుంటున్నాం' అని విశ్రాంత ఉద్యోగి సీహెచ్.రామినాయుడు తెలిపారు. వంకాయలు రూ.100 దాటి పలకడం తమ ప్రాంతంలో ఇదే తొలిసారని బొబ్బిలి వాసి తిరుపతిరావు వెల్లడించారు.

## ఇంకెన్నాళ్లీ మీన మేషాలు..!

### శీతల గిడ్డంగులు, జెట్టీలు లేక గంగపుత్రుల ఇక్కట్లు

ఈనాడు ఈటీవీ పరిశీలన

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ప్రభుత్వాలు మారుతున్నా గంగపుత్రుల బెంగ తీరడం లేదు. అసలే సముద్రంపై చేపల వేటకు సమయం అనుకూలించడం లేదు. మరోవైపు జెట్టీలు, కోల్డ్ స్టోరేజీలు వంటి సదుపాయాల్లేక మత్స్యకారులు నానా పాట్లు పడుతున్నారు. మార్కెటింగ్ సదుపాయమూ అంతంతమాత్రంగానే ఉండటంతో అవస్థలు తప్పట్లేదు.

ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, మందస, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, గార, పోలాకి, రణస్థలం, శ్రీకాకుళం మండలాల్లో మత్స్యకారులు ఎక్కువ మంది సముద్రంపై వేటకు వెళ్తుంటారు. తుపాన్లు, అల్పపీడనాల సమయాల్లో అలల ఉద్ధృతికి పడవలు మరమ్మతులకు గురికావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జెట్టీలు నిర్మిస్తే ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్న గంగపుత్రులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి.

శీతల గిడ్డంగులు లేక దళారులకు విక్రయిస్తున్న మత్స్యసంపద

### తక్కువ ధరకే అమ్మేస్తున్నారు..

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో నిత్యం వందల టన్నుల మత్స్య సంపద లభిస్తుంది. వాటిని నిల్వ చేసే సదుపాయం లేకపోవడంతో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మిగిలిన వాటిని కోల్డ్‌స్టోరేజీలు లేక ఎండబెట్టుకుంటున్నారు. తాజా చేపల ధర కిలో రూ.150 వరకు పలుకుతుండగా. . ఎండు చేపలకు కిలో రూ.30 కూడా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వానికి నివేదించామని, పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా మత్స్యశాఖాధికారి సత్యనారాయణ చెబుతున్నారు.

### ఏం చేయాలి...

★ తీర ప్రాంతాల్లో జెట్టీలు నిర్మించాలి. ★ కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి. ★ సామాజిక భవనాల నిర్మాణం చేపట్టాలి. ★ మత్స్యసంపద తరలింపునకు రాయితీపై వాహనాలు, ట్రేలు, ఇతర సామగ్రిని అందజేయాలి.

### ఆదాయం కోల్పోతున్నాం..

సదుపాయాల్లేక మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేటకు వెళ్లి తెచ్చిన సంపదను తీరంలోనే ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండు చేపల ద్వారా ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోల్డ్‌స్టోరేజీలు, జెట్టీలు ఏర్పాటు చేయాలి.

- సీహెచ్ గురుమూర్తి, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, డొంకూరు

జిల్లాలో వివరాలిలా..

| తీర ప్రాంత విస్తీర్ణం | మండలాలు | మత్స్యకార గ్రామాలు | రిజిస్టర్ బోట్లు | మత్స్యకారులు | చేపల వేటపై ఆధారపడినవారు | వలస మత్స్యకారులు |
|---|---|---|---|---|---|---|
| 193 కిలోమీటర్లు | 11 | 104 | 3,584 | 1.80 లక్షలు | 80 వేలు | 35 వేల మంది |

## చిత్తడి నేల.. రక్షించలేరా..?

### ధ్వంసమవుతున్న నౌపడా తంపర భూములు

'నౌపడా తంపర భూములు 7,414 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని ఈ నేలలు 30 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉన్నాయి. 145 రకాల పక్షిజాతులు, 236 రకాల మొక్కలతో ఈ ప్రాంతం జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రాంతాన్ని సంరక్షించడం అత్యంత ఆవశ్యం' – **కోయంబత్తూరుకు చెందిన సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచురల్ హిస్టరీ సంస్థ జిల్లాలోని చిత్తడి నేలలపై 2012లో కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన అంశమిది.**

– న్యూస్‌టుడే, టెక్కలి

సిక్కోలు తీర ప్రాంతంలో అరుదైనవి సోంపేట బీలతో పాటు నౌపడా తంపర నేలలు. సోంపేట బీల భూములను సంరక్షించేందుకు ముందుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నౌపడా తంపర నేలలను మాత్రం గాలికొదిలేసింది. ఏళ్ల తరబడి ఇక్కడ జరుగుతున్న విధ్వంసంతో ఇక్కడి జీవవైవిధ్యం దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

నౌపడా చిత్తడి నేలలు

### చర్యలు చేపడుతున్నాం..

నౌపడాలో 7 వేల ఎకరాల్లో తంపర నేలలు లేవు. 4,500 ఎకరాల మేర ఉప్పు భూములే ఉన్నాయి. క్రీక్ ప్రాంతాభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. సముద్రం నుంచి 10 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేస్తాం. దీని వల్ల ముంపు సమస్య తీరుతుంది. జలచరాలు, ఔషధ మొక్కల పెంపకం సాధ్యమవుతుంది. బ్యాక్ వాటర్‌తో పర్యాటక రంగాభివృద్ధి జరుగుతుంది.

– ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

### ఏం జరుగుతోందంటే..

జిల్లాలోని తంపర, చిత్తడి నేలలను మూడు దశాబ్దాలుగా ధ్వంసం చేస్తూనే ఉన్నారు. రొయ్యల చెరువుల నిర్మాణంతో ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినా, హైకోర్టు ఆదేశించినా ఒక్క ఆక్రమణ కూడా తొలగలేదు. దీనికి తోడు పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు, అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలకు ఈ నేలలనే అధికారులు ప్రతిపాదిస్తుండటంపై పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాకాన్ నివేదికతో పాటు రాంసర్ ఒప్పందం పరిధిలోకి వచ్చే ఈ భూముల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని జీవవైవిధ్య నిపుణులు కోరుతున్నారు.

## బురద.. బురద

ఇచ్ఛాపురం మండల పరిధి హరిపురం గ్రామంలోని ఓ వీధిలో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి చెరువులా మారింది. స్థానికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోయారు. నీటిని అధికారులు తొలగించాలని కోరారు. పంచాయతీ ఏవో కె.రామారావుకు వివరణ కోరగా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## మృత్యు మలుపులు

వజ్రపుకొత్తూరు మండలం ఎన్‌పీరోడ్డు నుంచి తామాడపేట మీదుగా కొత్తపేట వెళ్లే రహదారిలో అడుగడుగునా మలుపులు వాహనదారులను దడ పుట్టిస్తున్నాయి. చెట్ల కొమ్మలు, పొదలు పెరిగి రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పీఎంపురం నుంచి రెయ్యిపాడు మీదుగా ఎంఎన్‌పేట మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ జేఈ జగదీశ్ వద్ద ప్రస్తావించగా కొమ్మలు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

## నడిచేది ఎలా..?

ఇచ్ఛాపురం పురపాలకసంఘం కస్పా గౌడవీధి కూడలిలో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. కాలువ ఉన్నా.. రోడ్డుపై లోతుగా ఉండటంతో ఈ సమస్య ఎదురవుతోంది. సమాంతరంగా చేసి నీరు కాలువలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిధుల లభ్యత మేరకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమేష్ తెలిపారు.

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## వాహనదారుల ఉక్కిరిబిక్కిరి..!

ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ప్రధాన రహదారిలో మెళియాపుట్టి వద్ద వ్యర్థాలు కాలుస్తుండటం వల్ల వచ్చే పొగతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం లేకపోవడంతో సేకరించిన చెత్తను మహేంద్రతనయ నది వంతెన సమీపంలో వేస్తున్నారు. తరచూ ఇలాగే వ్యర్థాలు కాలుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

## ముగిసిన సంగీతోత్సవాలు

బ్రహ్మపుర నగరం: స్థానిక త్యాగరాజ భక్త సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల 'వార్షిక సంగీతోత్సవాలు' శనివారం రాత్రి ముగిశాయి. స్థానిక గిరిమార్కెట్‌లోని ప్రకాశం హాల్లో రెండోరోజు రాత్రి డాక్టర్ చట్టి రామకృష్ణ 'వీణా వాదనం' అలరించింది. మృదంగంపై గొన్నాభక్తుల రవికుమార్, మోర్సింగ్‌పై గొన్నాభక్తుల బ్రహ్మ చక్కని సహకారం అందించి కచేరీని రక్తి కట్టించారు. కళాకారుల్ని నిర్వాహకులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. భక్త సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఈపరి జయంతి రావు, మావుడూరు ఉమామహేశ్వర రావు, కోశాధికారి కె.పి. కృష్ణారావు పాల్గొన్నారు.

కళాకారుల్ని సత్కరిస్తున్న భక్త సమితి ప్రతినిధులు

## యువతకు అండగా.. భవితకు బాసటగా..!

వజ్రపుకొత్తూరు/గ్రామీణం, న్యూస్‌టుడే: డిగ్రీ పట్టా చేతిలో ఉన్నా.. సరైన సాధన లేక పోటీ పరీక్షల్లో నెగ్గలేకపోతున్నారు కొంతమంది యువత. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆర్థిక స్థోమత చాలదు. దీంతో పలు సంఘాల దాతలు ప్రోత్సాహంతో సొంత భవనాల్లో గ్రంథాలయాలు నిర్వహించి బాసటగా నిలుస్తున్నారు.

పూండిలోని గ్రంథాలయంలో చదువుతున్న యువకులు

❖ సోంపేట మండలం డొంకలూరులో సంస్కృతి గ్రంథాలయం 2009లో స్థాపించారు. యువతకు ఉపయోగపడే దిన పత్రికలతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించి వందల రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇదే మండలంలో గొల్లగండి, కవిటి మండలం ఇద్దివానిపాలెంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో గ్రంథాలయాలు నడుస్తున్నాయి.

❖ వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం-పెదవంక గ్రామాల ప్రోత్సాహంతో సుమారు 15 ఏళ్ల కిందట విశ్వకవి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పత్రికలు, వివిధ పోటీ పరీక్షలు, విజ్ఞాన పుస్తకాలు, సామాజిక స్పృహ కలిగించే నవలలు సద్వినియోగం చేసుకొని యువత ఆర్మీ, నేవీ, వివిధ ప్రైవేటు రంగాల ఉద్యోగాల సాధించి ముందుకు సాగుతున్నారు.

❖ మందస మండలం బహాడపల్లిలోని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గత మూడేళ్ల నుంచి అబ్దుల్‌కలాం గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఎంతో మంది యువత ఉద్యోగ సాధనకు ఈ గ్రంథాలయం దోహదపడింది. 'స్థానిక గ్రంథాలయంలో యువత పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను ఏర్పాటు చేశాం. ఉద్దాన, తీర ప్రాంత యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోగలిగితే మంచి భవిష్యత్తు అందిపుచ్చుకోవచ్చు' అని పూండికి చెందిన గ్రంథాలయ అధ్యక్షుడు మెట్ట మోహనరావు తెలిపారు.

❖ పూండిలోని దున్న రమేష్ తన కుమారుడి జ్ఞాపకార్థం 2015లో సందీప్ మెమోరియల్ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకున్న యువతలో ముగ్గురు ఉపాధ్యాయులు, మరి కొంత మంది సివిల్ పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, ఆరుగురు రైల్వే, కోర్టు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

## పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కరడుగట్టిన మావోయిస్టు దంపతులు ఆదివారం కొంధమాల్ ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారు. వారు సుకుమా జిల్లా (ఛత్తీస్‌గఢ్) జాగరగుండా పోలీసు స్టేషన్ పరిధిలోని పర్లాగాట్ గ్రామానికి చెందిన ఉంగా కాలము అలియాస్ కిశోర్ (25), ఆయన భార్య మాసె మాధవి (22)లు. కొంధమాల్ జిల్లా కేంద్రం ఫుల్బాణీలోని ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయిన వీరికి దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్, కొంధమాల్ ఎస్పీ హరీష్ బి.సి.లు పుష్పగుచ్ఛాలు అందజేసి జనజీవన స్రవంతిలోకి స్వాగతించారు. ఐజీ, ఎస్పీలు విలేకరులతో మాట్లాడుతూ ఈ దంపతులు 2018లో మావోయిస్టు ఉద్యమంలో చేరారని, వంశధార-ఘుముసుర-నాగావళి డివిజన్‌లో క్రియాశీలకంగా ఉండేవారని, వీరిపై పలు ఠాణాల్లో మావోయిస్టు హింసాత్మక ఘటనలపై కేసులు నమోదయ్యాయన్నారు. పోలీసులు వాంటెడ్ జాబితాలో ఉన్న ఈ దంపతులపై రూ.లక్ష పురస్కారం ఉందని వారు పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమం ఆదర్శాలకు దూరమైందని, ప్రజలతో మావోయిస్టులు బలవంతంగా గంజాయి సాగు చేయిస్తుండటం, అనైతిక కార్యకలాపాల వల్ల తాము ఉద్యమాన్ని వీడి, జనజీవన స్రవంతిలో కలిసేందుకు లొంగిపోయామని మావోయిస్టు దంపతులు విలేకరులకు చెప్పారు.

లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసిన దక్షిణ మండల ఐజీ, కొంధమాల్ ఎస్పీ తదితరులు

**మావోయిస్టుల డంప్ స్వాధీనం:** కొంధమాల్ జిల్లా బలిగుడ ఠాణా పరిధిలోని ఫంగురుమిలా అడవుల్లో సంయుక్తంగా మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేస్తున్న కొంధమాల్ పోలీసులు, జిల్లా స్వచ్ఛంద బలగాలు (డీవీఎఫ్) మావోయిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి, డంప్‌లో డిటోనేటర్లు, ఫ్యూజ్ వైర్, బియ్యం, బ్యాటరీలు, ఔషధాలు, ఏకరూప దుస్తులు, నిత్యావసర సామగ్రి తదితరాలున్నాయని ఐజీ నితీ శేఖర్ తెలిపారు.

## పద్మావతి అమ్మవారికి గొడుగుల కానుక

ఆలయం వద్ద గొడుగులతో హిందూ మహాసభ ట్రస్టు ప్రతినిధులు

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** తిరుపతిలోని శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం చెన్నైకు చెందిన హిందూ మహాసభ ట్రస్టు ప్రతినిధులు నాలుగు గొడుగులను కానుకగా అందజేశారు. అమ్మవారి ఆలయం వద్ద గొడుగులను ఆర్జితం ఇన్‌స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌నాయుడుకు అందజేశారు. ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాల సమయంలో గొడుగులు ఇవ్వడాన్ని సంప్రదాయంగా పెట్టుకున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

## 6-12 తరగతులకు అర్ధవార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** ఆరు నుంచి 12 తరగతుల విద్యార్థులకు అర్ధవార్షిక పరీక్షల షెడ్యూలును పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఆ మేరకు ఆరు నుంచి 9 తరగతులకు డిసెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. 10 నుంచి ప్లస్‌టూ వరకు డిసెంబరు 10 నుంచి 23వ తేదీ వరకు ఉంటాయి.

## నటుడు రజనీకాంత్, ఎంకే అళగిరి ఇళ్లకు బాంబు బెదిరింపులు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** కేంద్ర మాజీ మంత్రి ఎంకే అళగిరి, నటుడు రజనీకాంత్ నివాసాలు సహా 16 ప్రాంతాలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. పోలీసుల వివరాల మేరకు... చెన్నై మైలాపూర్‌లోని డీజీపీ కార్యాలయానికి శనివారం వచ్చిన ఈ-మెయిల్‌లో... చెన్నై పోయెస్ గార్డెన్‌లో ఉన్న నటుడు రజనీకాంత్, డైరెక్టరు రవి కుమార్, నటి స్నేహ, సంగీత దర్శకుడు అనిరుధ్ నివాసాలు, కేంద్ర మాజీ మంత్రి ఎంకే అళగిరి ఇల్లు మొదలైన 16 చోట్ల బాంబులు ఉన్నాయని ఉంది. అనంతరం బాంబు స్క్వాడ్, పోలీసులు 16చోట్ల తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఇందుకు సంబంధించి సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పుస్తక ప్రదర్శన సందర్శించిన ముఖ్యమంత్రి

ఓ పుస్తకాన్ని పరిశీలిస్తున్న స్టాలిన్

**చెన్నై, న్యూస్‌టుడే:** డీఎంకే తరఫున ఏర్పాటు చేసిన ప్రగతిశీల పుస్తక ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ సందర్శించారు. డీఎంకే యువజన విభాగం తరఫున 'డీఎంకే 75 అరివు తిరువిళా'ను నుంగంబాక్కంలోని వళ్లువర్ కొట్టంలో 8న ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రగతిశీల పుస్తక ప్రదర్శనను ఈ వేడుక చివరి రోజైన ఆదివారం స్టాలిన్ సందర్శించారు. పుస్తక ప్రచురణకర్తలు, రచయితలు, ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. అన్ని స్టాళ్లను సందర్శించడంతో పాటు ఎంపిక చేసిన 63 పుస్తకాలను కొనుగోలు చేశారు. వాటిలో ద్రావిడ ఉద్యమానికి సంబంధించిన, చారిత్రక, సాహిత్య, స్వీయచరిత్ర వంటి పుస్తకాలు ఉన్నాయి. వేడుకలను విజయవంతంగా నిర్వహించిన డీఎంకే యువజన విభాగ కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి అయిన ఉదయనిధి స్టాలిన్‌ను అభినందించారు. తన 'ఎక్స్' పేజీలో... ఈ ప్రదర్శనలో 'కేరీ ఆన్, బట్ రిమెంబర్' అనే అన్నాదురై పార్లమెంట్ ప్రసంగ సంకలనాన్ని చూడగానే అప్పట్లో ఆయన హెచ్చరిక నేటి కేంద్ర పాలకులకు వర్తిస్తుందని గ్రహించి విస్మయం చెందినట్లు తెలిపారు.

## నేడు చెన్నైకి అతి భారీ వర్ష సూచన

**ప్యారిస్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో చెన్నై సహా పలు జిల్లాల్లో సోమవారం అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీలంక సముద్రతీరంలోని నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం ఉదయం అదే ప్రాంతంలో కొనసాగుతుందని, అది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా నెమ్మదిగా పయనిస్తుందని పేర్కొంది. దీని ప్రభావంతో తమిళనాడు సముద్రతీర జిల్లాల్లో సోమవారం మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, 22 వరకు రాష్ట్రంలో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పింది. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

**గడచిన 24 గంటల్లో పలు ప్రాంతాల్లో నమోదైన వర్షపాత వివరాలు..**

- తిర్పరప్పు (కన్నియాకుమరి జిల్లా) - 6 సెం.మీ
- సెంబనార్‌కోవిల్ (మైలాడుతురై) - 4
- పరంగిపేట్టై (కడలూరు) - 3
- మైలాడుతురై, చిదంబరం(కడలూరు), వేదారణ్యం(నాగపట్టినం), తరంగంపాడి(మైలాడుతురై), కొడియక్కరై(నాగపట్టినం), వెళాంకణ్ణి (నాగపట్టణ) - 2 సెం.మీ

### పుదుచ్చేరికి ఆరెంజ్ అలెర్ట్

**ఆర్కేనగర్:** పుదుచ్చేరిలో ఆదివారం ఉదయం నుంచి వర్షం పడుతోంది. సోమవారం అతిభారీ వర్షాలు కురుస్తాయని, 55 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించి రాష్ట్రానికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఇళ్లలోనే ఉండాలని, అనవసరంగా బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ కులోత్తుంగన్ సూచించారు.

## చెట్లలో ప్రాణాలు, జలంలో జీవితాలున్నాయి: సీమాన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీమాన్

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** చెట్లలో మన ప్రాణాలు, జలంలో జీవితాలు ఉన్నాయని నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్ పేర్కొన్నారు. తంజావూర్ జిల్లా పూదలూర్‌లో శనివారం రాత్రి ఎన్టీకే తరఫున జల మహానాడు జరిగింది. ఇందులో పాల్గొన్న సీమాన్ మాట్లాడుతూ... కరుణానిధి, ఎంజీఆర్, జయలలితను చూసి రాజకీయం చేయడానికి తాను రాలేదన్నారు. తాను ప్రజా ఓటు నాణ్యతను మార్చాలనుకుంటున్నామని చెప్పారు. అందువలన తమకు ఎవరూ పోటీ కాదన్నారు. నీరు అనేది భూమి మీద జీవిస్తున్న ప్రతి ప్రాణికి అవసరం అన్నారు. నదులు రక్తనాళాల వంటివని, వాటిపై ఆనకట్టలు కట్టడం అంటే వాటిని నింపడం లాంటిదన్నారు. చెట్లలో మన ప్రాణాలు, నీటిలో మన జీవితాలు ఉన్నాయన్నారు.

## దేశ చివరి భూభాగం.. పవన విద్యుత్తు ప్లాంటు నిర్మాణం

- ధనుష్కోడి వద్ద ఏర్పాటుకు సన్నాహాలు
- తీరంలో తొలిసారిగా భారీ ప్రాజెక్టు

– ఈనాడు-చెన్నై

భారతదేశ చివరి అంచు... ధనుష్కోడి తీరంలో భారీ ప్రాజెక్టు రాబోతోంది. వాతావరణ పరిస్థితులకు తట్టుకుని.. అక్కడి గాలి ద్వారా విద్యుత్తును తయారుచేసే అత్యంత కీలక ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. సముద్ర తీరంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తేచోట్ల ఈ తరహా ప్రాజెక్టును తెస్తుండటం దేశంలోనే ఇదే తొలిసారని, ప్రయోగాలు పూర్తయ్యాక దేశంలోని ఇతర తీరాల్లోనూ తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు కేంద్ర నూతన, పునరుత్పాదకశక్తి శాఖ చెబుతోంది. 2030లోపు తీర ప్రాంతాల్లో 30 గిగావాట్ల విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన నేపథ్యంలో తొలి ప్రాజెక్టును ఇక్కడ తీసుకొస్తున్నారు.

### దగ్గర్లో గ్రేటర్ ఫ్లెమింగో అభయారణ్యం

ధనుష్కోడి తీరంలో పవన విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేసేందుకు చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ (ఎన్‌ఐడబ్ల్యూఈ) ప్రతిపాదనలు చేసింది. పర్యాటక పరంగా, ఆధ్యాత్మికంగా ప్రత్యేకత చాటుకుంటూ వస్తున్న ఈ ప్రాంతంలో తాజాగా చిత్తడి నేలలకు ప్రాధాన్యతనిస్తూ గ్రేటర్ ఫ్లెమింగో అభయారణ్యాన్ని ప్రకటించారు. ఇది స్థానిక మత్స్యకార కుటుంబాలకు పెద్ద ఉపాధినిచ్చే ప్రాజెక్టు అవుతోందని ప్రభుత్వం తెలిపింది. ఇప్పుడు మరో ప్రాజెక్టు వస్తుందని ప్రకటించడంతో చర్చ మొదలైంది.

### అంచనా వ్యయం రూ.364.6 కోట్లు

- 50 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంటుకు రూ.364.6 కోట్ల ఖర్చయ్యే అవకాశాలున్నట్లు ఎన్‌ఐడబ్ల్యూఈ తయారుచేసిన డీపీఆర్‌లో పేర్కొంది.
- ఇక్కడ తయారయ్యే విద్యుత్తును నిల్వ ఉంచేందుకు మండపంలోని 110కేవీ సబ్‌స్టేషన్‌ను ఎంపిక చేశారు. ధనుష్కోడి నుంచి ఇక్కడిదాకా 40కి.మీ మేర విద్యుత్తు సరఫరా అయ్యేలా ప్రత్యేక విద్యుత్తు తీగలు ఏర్పాటు చేయనున్నారు.
- ధనుష్కోడి తీరంలో సెకనుకు 8.3మీ వేగంతో గాలులు వీస్తుంటాయి. ఇంత గాలికి తట్టుకునేందుకు భారీ సామర్థ్యమున్న టర్బయిన్లు అవసరం. దీనికి తగ్గట్టు ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేస్తుండటంతో తొలిగా 4 భారీ టర్బైన్‌లను ఏర్పాటుచేయాలని చూస్తున్నారు. 75 ఎకరాల పరిధిలో వీటిని ఉంచనున్నారు. వీటిని తూత్తుకుడి పోర్టు నుంచి ధనుష్కోడి తీరానికి తేవాలని చూస్తున్నారు.

### సమస్యలూ లేకపోలేదు

ఇక్కడి వాతావరణమే కాదు, ఇతర పరిస్థితులూ ప్రాజెక్టుకు సవాలుగా నిలుస్తున్నాయి. ధనుష్కోడి పరిసర ప్రాంతం చిత్తడి నేలల పరిధిలో ఉండటంతో సీఆర్‌జెడ్ పరిధిలోకి వస్తోంది. దీనికి తోడు గ్రేటర్ ఫ్లెమింగో అభయారణ్యానికి దగ్గర్లో ఉండటం అనుమతులకు మరో సవాలుగా మారనుంది. ఇదివరకు రామనాథపురం జిల్లాలోనే పాంబన్‌కు సమీపంలోని తంగచిమడం దగ్గర ఇలాంటి ఓ ప్రాజెక్టును ప్రతిపాదించినా ముందుకు సాగలేదు. తాజా ప్రాజెక్టుకు 13 అంశాల్లో ప్రాథమికంగా ఇప్పటికే అనుమతులపై నిర్ణయం తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ప్రాజెక్టు వలన పక్షులకు ఇబ్బంది కలుగుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ప్రాజెక్టు ప్రతిపాదనల్లో అనుమతుల విషయంలో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### నిర్వహణపై అధ్యయనం

ప్రతికూల వాతావరణాల్లో టర్బైన్‌ల పనితీరును శాస్త్రవేత్తలు గమనించనున్నారు. ఇక్కడి తీరంలో తుప్పుపట్టే సామర్థ్యం, దానికి విరుగుడుగా వాడాల్సిన పద్ధతులు, నిర్వహణ తీరు తదితర అంశాలపై లోతుగా అన్వేషించనున్నారు.

## ఎస్ఐఆర్ ద్వారా డీఎంకే మద్దతు ఓట్లు తొలగించేందుకు కుట్ర

● ఉదయనిధి స్టాలిన్

**ప్యారిస్, న్యూస్‌టుడే:** ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ద్వారా డీఎంకే మద్దతు ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. శివగంగై జిల్లా సింగపుణరిలో పునరుద్ధరించిన మాజీ ఎమ్మెల్యే తెన్నరసు కాంస్య విగ్రహం, బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన అన్నా, కరుణానిధి విగ్రహాలను శనివారం ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. నియంతృత్వ భావజాలం కలిగిన భాజపాను ఓడించి రెండోసారి ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఓ పార్టీకి మంచి నాయకత్వం, లోతైన ప్రాథమిక సూత్రం, బలమైన నిర్మాణం ఉంటేనే ప్రజలు అంగీకరిస్తారని, పార్టీ అభివృద్ధి చెందగలదని చెప్పారు. ఈ మూడు ఉన్న డీఎంకే 75 ఏళ్ల పూర్తి చేసుకుందని, బలమైన సిద్ధాంతంతో పనిచేస్తుందన్నారు. ఎస్ఐఆర్ ద్వారా డీఎంకే మద్దతు ఓట్లను తొలగించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఎంకే స్టాలిన్ దేశంలోనే నెంబర్ వన్ ముఖ్యమంత్రి అని, భాజపాకు అన్నాడీఎంకే నెంబర్ వన్ బానిస అని దేశవ్యాప్తంగా ఎగతాళి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి బానిసలను తమిళనాడు రాజకీయాల నుంచి తరిమికొట్టాలన్నారు. అదే తమిళనాడు భవిష్యత్తుకి మనవంతుగా చేసే కర్తవ్యం అని పేర్కొన్నారు.

### ప్రజలు హెచ్చరికగా ఉండాలి: తిరుమా

**సైదాపేట:** 'సర్' పనులపై ప్రజలు హెచ్చరికగా ఉండాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... బిహార్ ఎన్నికల ఫలితాలు భాజపా, ఎన్నికల కమిషన్ కూటమికి దక్కిన విజయమని విమర్శించారు. ఎన్నికలు నిజాయతీగా జరగలేదన్న అనుమానం కలుగుతోందన్నారు. 'సర్' పనులే ఇందుకు కారణమన్నారు. బిహార్‌లో 65 లక్షల మంది అర్హుల ఓట్లను తొలగించారని తెలిపారు. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టులో పలు రాజకీయ పార్టీలు కేసు వేశాయని, ఆ తర్వాత కూడా సుమారు 47 లక్షల ఓట్లను తొలగించినట్లు ప్రతిపక్షాలు తెలిపాయని పేర్కొన్నారు. కావున రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## చెన్నైలో కొత్త బస్సు రూట్ నెం.96

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** చెన్నై మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) తరఫున అడయారు బస్టాండ్ నుంచి తాంబరం వెస్ట్ బస్టాండ్ వరకు కొత్త మార్గం నెం:96కు బస్సు సేవలను ఆదివారం ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ పళ్లిక్కరణైలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులు జయంతి థియేటర్, రేడియల్ రోడ్డు, కామాక్షి ఆస్పత్రి, పళ్లిక్కరణై, పెరుంగుడి, తురైపాక్కం చెక్‌పోస్ట్, మేడవాక్కం, సంతోషపురం, చేపాక్కం, తాంబరం ఈస్ట్ మీదుగా నడుస్తాయి. కార్యక్రమంలో శోలింగనల్లూర్ ఎమ్మెల్యే అరవింద్ రమేష్, ఎంటీసీ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

బస్సు సేవలను ప్రారంభిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

## 2026 ఎన్నికల్లో విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయం

● బుస్సి ఆనంద్

'సర్'కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బుస్సి ఆనంద్, ఆదవ్ అర్జున తదితరులు

**చెన్నై, న్యూస్‌టుడే:** రానున్న శాసనసభ ఎన్నికల్లో టీవీకే అధ్యక్షుడు విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా చెన్నైలోని శివానంద రోడ్డులో టీవీకే ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆందోళనకు పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య మూలాలను కదిలించేలా 'సర్' పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటర్ల పేర్లను ముందస్తు ప్రకటన లేకుండా తొలగించడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. తప్పుడు కారణాలను చూపించి ఓటర్ల జాబితా నుంచి ఓటు హక్కును తొలగించి అధికార దుర్వినియోగానికి పాల్పడే పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. అదే సమయంలో ఒకే వ్యక్తి పేరును పలుచోట్ల చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీని ద్వారా పాలకులు అడ్డదారిలో వెళ్లడానికి తహతహలాడుతున్నారని విమర్శించారు. 'సర్' గురించి లేవనెత్తే ప్రశ్నలకు అధికారుల నుంచి సరైన సమాధానం లేదన్నారు. ఎవరు ఓటు వేయాలనే విషయాన్ని నేడు అధికారవర్గమే నిర్ణయిస్తోందని తెలిపారు. అందరి ఓటుహక్కును ధ్రువీకరించి 2026 శాసనసభ ఎన్నికల్లో అందరూ ఓటు వేసే హక్కును దక్కేలా చేయాలన్నారు. దీని ద్వారా ప్రజామద్దతుతో ఆ ఎన్నికల్లో విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఎన్నికల నిర్వహణ విభాగం ప్రధానకార్యదర్శి ఆదవ్ అర్జున మాట్లాడుతూ... నేడు తమ కార్యకలాపాలతో డీఎంకే గగ్గోలు పెడుతోందన్నారు. 'సర్'ను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పే ఆ పార్టీ శాసనసభలో ఎందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. 'సర్'పై అవగాహన కల్పించేలా విజయ్ విడుదల చేసిన వీడియోను శనివారం అర్ధరాత్రి వరకు 3 కోట్ల మంది చూశారని, ఎన్నికల సంఘం చేయాల్సిన పనిని ఆయన చేస్తున్నారని తెలిపారు. 'సర్' ప్రక్రియపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆందోళనలో 'సర్'కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## నాలుగేళ్లలో 2,800 పేద జంటలకు వివాహం

కొత్త జంటలతో మంత్రి శేఖర్‌బాబు

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లలో దేవాదాయశాఖ తరఫున 2,800 పేద జంటలకు వివాహాలు జరిపించామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు పేర్కొన్నారు. చెన్నై కొలత్తూర్‌లోని సోమనాథస్వామి ఆలయంలో ఆదివారం 4 పేద జంటలకు ప్రభుత్వం తరఫున వివాహాలు జరిపించారు. పాల్గొన్న శేఖర్‌బాబు కొత్త జంటలకు సారె అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చి చివరిలోగా మరో 1000 జంటలకు వివాహాలు జరిపిస్తామని తెలిపారు. సుమారు 400 ఏళ్లనాటి సోమనాథస్వామి ఆలయంలో రూ.2.73 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని, ఈనెల 30వ తేదీ మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో జరుగనున్న కార్తిక దీపోత్సవాలను పురస్కరించుకొని అక్కడ ఏర్పాట్లపై మంత్రి ఈవీ వేలు అధ్యక్షతన రెండు రోజుల్లో సమీక్ష సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

## భాజపాతో జతకట్టిన ఏ పార్టీతోనూ పొత్తు ఉండదు

❖ నిర్మల్‌కుమార్

**చెన్నై, న్యూస్‌టుడే:** భాజపాతో జతకట్టిన ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని టీవీకే సంయుక్త ప్రధానకార్యదర్శి నిర్మల్‌కుమార్ తెలిపారు. ఆయన చెన్నై నగరంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ... కూటమి వైఖరిలో దృఢంగా ఉన్నామని, అందులో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. తమ సిద్ధాంత ప్రత్యర్థిగా భాజపాను ప్రకటించామని, ఆ పార్టీతో కూటమి ఏర్పాటు చేసిన ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోవడానికి ఒకశాతం కూడా అవకాశం లేదని పేర్కొన్నారు. విజయ్ నాయకత్వాన్ని అంగీకరించేవారితో తమకు సిద్ధాంత వైరుధ్యాలు లేకుంటే కూటమి ఏర్పాటు చేస్తామని, ఇందులోనూ ఎలాంటి మార్పులేదని తెలిపారు.

## ఓటు హక్కు కాపాడేందుకు డీఎంకే పోరాటం

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** ఓటు హక్కుని కాపాడేందుకు డీఎంకే పోరాడుతోందని పరిశ్రమలశాఖ మంత్రి టీఆర్బీ రాజా పేర్కొన్నారు. తిరువారూర్ జిల్లా నన్నిలంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో సహకారశాఖ 72వ అఖిల భారత వారోత్సవాలు ఆదివారం జరిగాయి. పాల్గొన్న మంత్రి టీఆర్బీ రాజా ఉత్తమ సహకార సంఘాలకు అవార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ఐఆర్' పేరిట భాజపా ప్రజల ఓటు హక్కుని లాక్కోవాలని చూస్తోందన్నారు. వారికి మద్దతుగా ప్రతిపక్ష పార్టీ వ్యవహరించడం బాధగా ఉందన్నారు. ఓటు హక్కుని కాపడటానికి డీఎంకే పోరాడుతోందని పేర్కొన్నారు.

## విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసిన ఈపీఎస్

**సేలం, న్యూస్‌టుడే:** అన్నాడీఎంకే తరఫున పేద విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు అందజేసే కార్యక్రమాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి సేలంలో ఆదివారం ప్రారంభించారు. సేలం నగరంలోని కొండలాంపట్టి ప్రాంతానికి చెందిన 50వ వార్డు సర్కిల్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ నిర్వహిస్తున్న 'హర్షన్ విద్యా ట్రస్టు' తరఫున సేలంలోని ఎడప్పాడి నివాసంలో కార్యక్రమం జరిగింది. మొదటి విడతగా 12 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సేలం నగర ఇన్‌ఛార్జి సింగారం, జిల్లా కార్యదర్శి ఏకేఎస్ఎం బాలు తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో పళనిసామి

### పార్టీలో చేరిక

**సేలం, న్యూస్‌టుడే:** సేలం, ఈరోడ్ తదితర పలు జిల్లాలకు చెందిన వివిధ పార్టీల వారు ఆదివారం ఎడప్పాడి పళనిసామి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. మాజీ మంత్రి కేసీ కరుప్పణ్ణన్ ఆధ్వర్యంలో డీఎంకే సహా ఇతర పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు అన్నాడీఎంకే సభ్యత్వం పొందారు. సేలంలోని పళనిసామి నివాసంలో జరిగిన కార్యక్రమంలో భవాని ఉత్తర యూనియన్ కార్యదర్శి తంగవేల్, ఆ ప్రాంత వ్యవసాయ విభాగ కార్యదర్శి కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సేలం జిల్లా ఎడప్పాడి ఉత్తర యూనియన్ కార్యదర్శి మాదేశ్ ఆధ్వర్యంలోనూ పలు పార్టీలకు చెందిన మరో 50 మంది అన్నాడీఎంకేలో చేరారు.

కోయంబత్తూరులో ఈనెల 19న దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సదస్సు జరుగనుంది. ఇందులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఈ క్రమంలో నయినార్ నాగేంద్రన్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అరవింద్ మీనన్, పార్టీ నేత కేశవ వినాయంగానికి ఆదివారం ఆహ్వానపత్రిక అందజేస్తున్న సదస్సు నిర్వాహకులు – కోయంబత్తూరు, న్యూస్‌టుడే

## పెట్టుబడులు రాబట్టడంలో ప్రభుత్వం విఫలం

నయినార్

**సైదాపేట, న్యూస్‌టుడే:** పెట్టుబడులు ఆకర్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడులో దక్షిణ కొరియా సంస్థ రూ.1720 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రభుత్వ ప్రకటించిందని, ప్రస్తుతం ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు తరలివెళ్లినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. దీంతో తమిళనాడు యువతకు దక్కాల్సిన 20 వేల ఉద్యోగ అవకాశాలు పోయాయని పేర్కొన్నారు. అయితే ముఖ్యమంత్రి మాత్రం తమిళనాడును తలవంచనీయం అని వృథా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిసారి పెట్టుబడులు వస్తున్నాయని ప్రకటనలు చేయటం, తర్వాత అవి ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు వార్తలు రావడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు.

## నిరుద్యోగ రేటులో రాష్ట్రానికి 11వ స్థానం

**సైదాపేట, న్యూస్‌టుడే:** నిరుద్యోగ రేటులో తమిళనాడు 11వ స్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో అతి ముఖ్యమైన కొలమానాల్లో నిరుద్యోగ రేటు ఒకటి. ఇది ఉద్యోగం చేసేందుకు అర్హత, ఆసక్తి ఉండి ఉద్యోగం లభించనివారి శాతాన్ని సూచిస్తుంది. ఆర్థిక మందగమనం, కంప్యూటరీకరణ, సంబంధిత పరిశ్రమలు మూతపడటం, మంచి జీతంతో ఉద్యోగం కోసం ఎదురుచూడటం, రైతు కూలీలకు ఉపాధి లేకపోవటం తదితర కారణాలతో ఈ రేటు అన్ని రాష్ట్రాల్లో పెరగటం, తగ్గటం జరుగుతుంటుంది. దీన్ని సక్రమంగా నిర్వహించే రాష్ట్రాలు నిరోద్యగ రేటును సమతుల్యంగా, స్థిరమైన వృద్ధికి అనుగుణంగా ఉంచుతాయి. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఈ డేటాను సంవత్సరానికి నాలుగుసార్లు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎస్ఎఫ్) ద్వారా ప్రచురిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబరు వరకు మూడో త్రైమాసిక గణాంకాలను ఎన్ఎస్ఓ విడుదల చేసింది. ఆ ప్రకారం తమిళనాడులో నిరుద్యోగ రేటు 5.7 శాతంగా ఉంది. అత్యల్ప నిరుద్యోగ రేటు ఉన్న రాష్ట్రాల జాబితాలో తమిళనాడు 11వ స్థానంలో ఉంది. అత్యల్ప నిరుద్యోగ రేటు ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ అగ్రస్థానంలో నిలిచింది.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 92.04 శాతం పూర్తి

**చెన్నై, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 92.04శాతం పూర్తయినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పనుల గురించి ఎన్నికల కమిషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని ఓటర్లకు అందించడానికి 6,41,14,582 ఎన్యూమరేషన్ ఫారాలు ముద్రించినట్లు తెలిపింది. ఇప్పటివరకు 5,90,13,184 ఫారాలు అందించగా ఇది 92.04శాతమని పేర్కొంది. పూర్తి చేసిన ఫారాలను ఇళ్ల వద్దకు వచ్చే సంబంధిత పోలింగ్ బూత్‌స్థాయి అధికారికి ప్రజలు అప్పగించాలని కోరింది. ఈ ఫారాలను పూర్తి చేయడానికి వారు సహకరిస్తారనీ తెలిపింది.

### ఒకే డోర్ నంబరుతో 177 మంది ఓటర్లు

**చెన్నై, న్యూస్‌టుడే:** ఒకే డోర్ నంబరుతో 177 మంది ఓటర్లు ఉండటంతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు చేపట్టడంలో సమస్య తలెత్తింది. చెన్నైలోని పెరుంబాక్కంలో పునరావాసం కల్పించిన కాలనీలో 26వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులు ఇచ్చినా వారిలో పలువురి చిరునామా సమగ్రంగా లేదు. డోర్ నంబరు-1తో 177 మంది, డోర్ నంబరు-29తో 16 మంది ఉన్నారు. దీంతో ఓటరు 'ఎస్ఐఆర్' పనులు చేపట్టడంలో ఇబ్బంది తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు.

(c) eenadu

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఎన్ నెహ్రూ

## తిరుమల ఆలయానికి నేను విరాళం ఇవ్వలేదు

**మంత్రి కేఎన్ నెహ్రూ**

**ట్రిప్లికేన్, న్యూస్‌టుడే:** తన కుటుంబ సభ్యులు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.44లక్షలు విరాళంగా అందజేశారని, తనకు తెలిసుంటే అనుమతించేవాడిని కాదని మంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. కోయంబత్తూరులోని గాంధీపురంలో సెమ్మొళి పార్కు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో మంత్రి కేఎన్ నెహ్రూ, మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ ఆదివారం పనులను పరిశీలించారు. అనంతరం కేఎన్ నెహ్రూ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి సెమ్మొళి పార్కును ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయానికి తాను విరాళం ఇవ్వలేదని, తన వద్ద అంత డబ్బులు లేవని, తన కుటుంబ సభ్యులు తన పేరిట విరాళం అందజేశారని, తనకు ముందుగా తెలిసుంటే వద్దని చెప్పి ఉండేవాడినని పేర్కొన్నారు.

## కరూర్‌లో టీవీకే ఆందోళనకు నిబంధనలు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** కరూర్‌లో టీవీకే ఆందోళనకు పోలీసులు ఆరు నిబంధనలు విధించారు. కరూర్‌లో ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా టీవీకే ఆందోళన చేపట్టనుంది. ఇందుకుగాను అనుమతి కోరుతూ కరూర్ వెస్ట్ జిల్లా కార్యదర్శి వీపీ మదియళగన్ కరూర్ టౌన్ పోలీసు స్టేషన్‌లో వినతి సమర్పించారు. ఆ ప్రకారం పోలీసులు పలు నిబంధనలతో అనుమతి ఇచ్చారు. ఆందోళన సమయంలో వేదిక వద్ద అనుమతి లేదని, ప్రజలు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించకూడదని, పాఠశాలలు, కళాశాలలు, పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని, బయటి ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలను తెప్పించకూడదని, ఆందోళనలో పాల్గొనడానికి వచ్చేవారి వాహనాలను ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కు చేయాలని, కోన్ ఆకారపు సౌండ్ సిస్టమ్‌ను కూడా ఉపయోగించకూడదని హెచ్చరించారు.

## శాస్తాకోవిల్ జలాశయం నీటి విడుదల

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** విరుదునగర్ జిల్లా రాజపాళయం వద్ద ఉన్న శాస్తాకోవిల్ జలాశయం నుంచి ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు సెకనుకు 50 మిలియన్ ఘనపుటడుగుల చొప్పున సాగుకు నీటిని విడుదల చేయనున్నారు. మిగులు నీరు ఉన్నంత వరకు 24 నుంచి వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు నీటిరాక, నిల్వకు అనుగుణంగా నీటిని విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా విరుదునగర్ జిల్లా వత్రిరాయిరుప్పు సర్కిల్‌లోని పెరియార్, కోవిలూర్ జలాశయాల నుంచి సాగుకు సెకనుకు 150 ఘనపుటడుగుల చొప్పున ఈనెల 17 నుంచి 7 రోజులపాటు, పెరియార్ కాలువకు సెకనుకు 3 ఘనపుటడుగుల చొప్పున ఈ నెల 17 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

## 23న సీనియర్ సిటిజన్ల సమావేశం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** తమిళనాడు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నానగర్ ఏహెచ్-9, 2వ అవెన్యూలోని జీవీఎన్ హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అసోసియేషన్ కార్యకలాపాల గురించి వివరిస్తారు. అనంతరం పాత మద్రాసు సంబంధించిన డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారు. జీవీఎన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారు. సమావేశానంతరం అందరికీ భోజనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు 98401 88821 నెంబరుపై ఏజే హరిహరన్, 96000 23348 నెంబరుపై గోవిందరాజన్‌ని సంప్రదించవచ్చు.

## తమిళాభివృద్ధి శాఖ పేరు మార్చాలన్న పిటిషన్ కొట్టివేత

**ప్యారిస్:** తమిళాభివృద్ధి శాఖ పేరు మార్చాలని దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. తిరుచ్చికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లో... 'తమిళ్ వళర్చిత్తురై(తమిళాభివృద్ధి శాఖ)' అనే పదం తప్పుగా ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ శాఖలను 'మేంబాట్టుత్తురై' (అభివృద్ధి శాఖ) అనే పిలుస్తున్నారని తెలిపారు. వళర్చి అనడానికి, మేంబాట్టు అనడానికి వ్యత్యాసం ఉందన్నారు. కావున శాఖ పేరుని తమిళ్ మేంబాట్టుత్తురై అని మార్చేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం... పేరు మార్పుకుండే పిటిషనరుకు ఎలాంటి నష్టం కలగదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

**'నీట్' మినహాయింపు బిల్లు వ్యవహారం**

## సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

**ప్యారిస్, న్యూస్‌టుడే:** నీట్ నుంచి రాష్ట్రానికి మినహాయింపు కోరుతూ అసెంబ్లీలో నెరవేర్చిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపకపోవడంతో సుప్రీంకోర్టులో తమిళనాడు ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. 2021లో తమిళనాడు శాసనసభలో డీఎంకే ప్రభుత్వం నీట్ మినహాయింపు బిల్లుని ఆమోదించి గవర్నర్‌కి పంపించింది. దానికి గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలపకుండా రాష్ట్రపతికి పంపారు. రాష్ట్రపతి ఈ ఏడాది మార్చి 3వ తేదీ బిల్లుకు ఆమోదం తెలపడానికి నిరాకరించారు. దీనిని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అందులో... బిల్లును తిప్పి పంపడం రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్ మళ్లీ బిల్లును పంపాలని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 254 కింద బిల్లుకు ఆమోదం ఇచ్చినట్లు ప్రకటించాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జేఎం నాయుడు, దేవరకొండ రాజు, సినీనటి కస్తూరి తదితరులు

## ఘనంగా కార్తిక వనభోజనాలు

**టీనగర్, న్యూస్‌టుడే:** శ్రీ ఆంధ్ర కళా స్రవంతి, తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక మాస వనభోజన మహోత్సవం జరిగింది. చెన్నై శివారు పొన్నేరిలో జరిగిన కార్యక్రమంలో 500 మందికి పైగా తెలుగువారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు, గోవుకు పూజలు నిర్వహించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర కళా స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాజు, శోభారాజా, నటి కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## అన్నా వర్సిటీ మాజీ ఉపకులపతిపై కేసు నమోదు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** ఉద్యోగం పేరిట నగదు మోసానికి పాల్పడిన అన్నా విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి కళానిధిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మైలాపూర్ పోలీసుల వివరాల మేరకు... చెంగల్పట్టుకి చెందిన ధనశేఖరన్ అనే వ్యక్తి బంధువులకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తారని చెప్పిన కళానిధి రూ.2.50 కోట్లు తీసుకున్నాడని, తర్వాత మోసానికి పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు కళానిధి, ఆయన భార్య రాజ్యలక్ష్మిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

EENADU Classifieds
JOBS
**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

# చెన్నైకి విచ్చేసిన అరుదైన అతిథి

● అడయార్ నది వద్ద జపాన్ పక్షి గుర్తింపు

\- న్యూస్‌టుడే, వడపళని

సాధారణంగా ఎవరి కంటా పడకుండా తిరిగే జపాన్‌కు చెందిన 'స్పారోహాక్' అనే పక్షి ఇటీవల అడయార్ నది ముఖద్వారం వద్ద విహరిస్తూ కనిపించింది. 'మద్రాస్ నేచరల్ సొసైటీ' సభ్యుడు ఆర్వీ రమణన్ ఈ పక్షి ఎగరడాన్ని చూసినట్టు చెప్పారు. కేరళకు చెందిన రాప్టర్ నిపుణుడు సి. సతీష్‌కుమార్ 1980 ప్రాంతాల్లో విశాఖపట్నం సమీపంలోని తూర్పు కనుమలలో, అండమాన్, నికోబార్ దీవుల్లో ఈ పక్షిని గుర్తించినట్లు పేర్కొన్నారు. అలాగే నాగపట్టిణం జిల్లా వేదారణ్యంలో ఉన్న పాయింట్ కేలిమెరే వన్యప్రాణుల అభయారణ్యంలో శీతాకాలంలో స్పారోహాక్ విచ్చేస్తుందని చెబుతున్నారు. 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్)' సంస్థ జపాన్‌కు చెందిన స్పారోహాక్‌ను 'స్వల్ప ఆందోళన' రకానికి చెందినదిగా పేర్కొంది. ఈ జాతిలోని మగ పక్షి సాధారణంగా 23 నుంచి 30 సెం.మీ పొడవు, 45 నుంచి 55 సెం.మీ వరకు రెక్కల పొడవుతో ఉంటుందని, ఆడ పక్షి వైవిధ్యంగా, పెద్దదిగా ఉంటుందని తెలిపింది. చిన్న పక్షి ముదురు గోధుమ రంగు ఈకలు, క్రీమీ లోపలి భాగాలతో కనిపిస్తుందని పేర్కొంది. ఆకులురాలే, శంఖాకార, మిశ్రమ అడవులుండే ప్రాంతాల్లో, 1,800 మీటర్ల ఎత్తులో నివసించేందుకు పక్షి ఆసక్తి చూపిస్తుందని, అయితే ఇది సాధారణంగా 1,000 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఎగురుతుందని చెప్పింది. వలస సమయంలో ఈ పక్షులు అడవులు, చిత్తడి నేలల గుండా తరచూ ఒంటరిగా లేదా చిన్నచిన్న గుంపులుగా విహరిస్తాయని, స్పారోహాక్ సాధారణంగా సంతానోత్పత్తి కాలంలో లోతైన అడవుల్లో ఉంటుందని వివరించింది.

### అవే కీలక ఆవాసాలు

చెన్నైలోని పక్షుల పరిశీలకులు ఈ సంవత్సరం తీర ప్రాంత చిత్తడి భూములకు అరుదైన వలస జాతులు తరలివచ్చాయని చెబుతున్నారు. ఈసారి అడయార్ నది ముఖద్వారం వద్ద ఓరియెంటల్ ప్రాటినోకోల్స్, ఇసాబెలైన్ వీటర్, ఆయిస్టర్ క్యాచర్ అనే రకానికి చెందిన వాటిని కూడా గుర్తించామని మరో రాప్టర్ నిపుణుడు టి.మురుగవేల్ పేర్కొన్నారు. నదీ ముఖద్వారం, థియోసోఫికల్ సొసైటీ గార్డెన్స్, తొల్‌కాప్పియర్ పూంగాలో పునరుద్ధరించిన అడయార్ క్రీక్ వలస పక్షులకు కీలకమైన ఆవాసాలుగా మారాయని ఆయన చెప్పారు.

## అవగాహన లేకుండా మాట్లాడుతున్న ఈపీఎస్

**మంత్రి టీఆర్బీ రాజా**

**సైదాపేట, న్యూస్‌టుడే:** అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పెట్టుబడులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా పేర్కొన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... పారిశ్రామిక పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగావకాశాల గురించి ప్రాథమిక అవగాహన లేకుండా పళనిసామి మాట్లాడుతున్నారని తెలిపారు. చాలా విషయాలను పరిశీలించి ప్రభుత్వం ఓ నిర్ణయానికి వస్తుందని పేర్కొన్నారు. ఆ ప్రకారం వచ్చే పెట్టుబడి ద్వారా వికేంద్రీకృత అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి ఉద్దేశమని అన్నారు. ప్రజల అవసరాలు తీర్చాల్సిన వ్యవస్థే ప్రభుత్వమని చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున బంజరు భూములు ఉన్నాయని, అయితే తమిళనాడులో పట్టణీకరణ పెరగడంతో మన వద్ద ఉన్న భూములు చాలా విలువైనవని పేర్కొన్నారు. కావున కొత్తగా ఏర్పడే పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహ నిధి, దానివల్ల లభించే ఉద్యోగావకాశాలను పోల్చకుండా ఊరికే ఆ స్థలాలను ఇవ్వటం కుదరదని తెలిపారు. కావున పెట్టుబడుల గురించి మాట్లాడి అజ్ఞానాన్ని బయటపెట్టుకోవద్దని ప్రతిపక్ష నేతను కోరుతున్నానని చెప్పారు.

## స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం 21న

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, పొగాకు ఉత్పత్తులు తరలిస్తున్న 11 ద్విచక్ర వాహనాలు, 8 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఈనెల 21వ తేదీ తిరువళ్లూరు ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో వేలం వేయనున్నట్లు ఎస్పీ వివేకానంద శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలిచేవారు ద్విచక్ర వాహనాలకు రూ.వెయ్యి, కార్లకు రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటలలోపు వేలం నిర్వహిస్తామని, ఆధార్ కార్డుతో హాజరవ్వాలని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కని వారికి డిపాజిట్ మొత్తం తిరిగి అందజేస్తామని స్పష్టం చేశారు.

కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## గిరి ప్రదక్షిణ మార్గంలో సీసీ కెమెరాల ఏర్పాటు

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** కార్తిక మహా దీపోత్సవాలను పురస్కరించుకొని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ గిరి ప్రదక్షిణ బాటలో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు ఆలయంలో కార్తిక మహా దీపోత్సవాలు జరుగనున్నాయి. 24వ తేదీ ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. డిసెంబరు 3న ఆలయం వెనుక ఉన్న 1667 అడుగుల ఎత్తైన కొండపై మహా దీపం వెలిగిస్తారు. ఆ రోజు 40 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణకు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ఈ సందర్భంగా ఆలయం, పోలీసుశాఖ, జిల్లా యాజమాన్యం తరపున భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రకారం భక్తుల రక్షణ కోసం గిరి ప్రదక్షిణ బాటలో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 259 సీసీ కెమెరాలు ఉండగా ప్రస్తుతం అదనంగా 572 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

## పాత్రికేయులకు ముఖ్యమంత్రి అభినందనలు

**చెన్నై:** జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ పాత్రికేయులకు అభినందనలు తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... ప్రజాస్వామ్యపాలనలో స్వయం ప్రతిపత్తి సంస్థలను అధికారవర్గం హస్తగతం చేసుకుంటే ప్రజాస్వామ్యాన్ని సంజీవంగా ఉంచే శక్తిగా మీడియా ఉండాలన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఏకచ్ఛత్రాధిపత్యానికి లోబడకుండా ధైర్యంతో వారి వైఫల్యాన్ని, అవినీతిని, మోసాలను బట్టబయలు చేసే జర్నలిస్టులందరికీ జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర అనుమతి లేకుండా 'మేకెదాటు' నిర్మాణం అసాధ్యం

**మంత్రి దురైమురుగన్**

**ట్రిప్లికేన్, న్యూస్‌టుడే:** రాష్ట్ర అనుమతి లేకుండా కర్ణాటక ప్రభుత్వం కావేరి నదిపై మేకెదాటు వద్ద ఆనకట్ట నిర్మించలేదని మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. వేలూరు జిల్లా కాట్పాడిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మేకెదాటు ఆనకట్ట విషయంలో డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం హక్కులను వదులుకునే విధంగా ప్రభుత్వం వ్యవహరించలేదన్నారు. ఇలాంటి ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. మేకెదాటు వ్యవహారంలో సుప్రీంకోర్టు లేదా కావేరి ట్రైబ్యునల్ ఏ నిర్ణయం తీసుకున్నా, రాష్ట్ర అనుమతి లేకుండా నిర్మించడం అసాధ్యమని తాము చాలాసార్లు స్పష్టం చేశామని తెలిపారు. అయినా కొందరు ఒకే విధమైన ఆరోపణలను పదే పదే ఎందుకు చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

ధ్రువపత్రం అందజేస్తున్న కౌశిక్

## వాకథాన్‌లో పాల్గొన్నవారికి ధ్రువపత్రాల అందజేత

**చెన్నై:** వాకథాన్, సైక్లథాన్‌లో పాల్గొన్న ఔత్సాహికులకు ధ్రువపత్రాలను అందజేశారు. చెన్నై నగర ప్రజల శరీర, మానసిక ఆరోగ్య సంరక్షణకు ఈ నెల 1న 'గెట్ ఫిట్ చెన్నై' పేరిట చెన్నై మహానగర పాలకసంస్థ, తమిళనాడు సైక్లింగ్ అసోసియేషన్ సంయుక్తంగా వాకథాన్, సైక్లథాన్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా అన్నానగర్ రౌండ్ టాణా రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున వాకథాన్, సైక్లథాన్‌ను నిర్వహించారు. 4 కి.మీ దూరానికి వాకథాన్, 8 కి.మీ దూరానికి సైక్లథాన్‌ను నిర్వహించగా ఇందులో సుమారు 750 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. వారికి జీసీసీ మధ్య ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు కౌశిక్ పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తమిళనాడు సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, జీసీసీ అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలి

**సైదాపేట, న్యూస్‌టుడే:** మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. తమిళనాడు విశ్వ హిందూ పరిషత్ 41వ సర్వసభ్య సమావేశం శనివారం చెన్నై టీనగర్‌లో జరిగింది. ప్రధాన కార్యదర్శి సోమసుందరం, ఉప ప్రధాన కార్యదర్శి రామసుబ్బు, కోశాధికారి శశికుమార్, నిర్వాహకులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు మహిళల భద్రత ప్రశ్నార్థకంగా ఉందని, లైంగిక నేరాలు పెరుగుతున్నాయని, మహిళల భద్రతను ప్రభుత్వం నిర్ధారించాలని, దిల్లీలో జరిగిన బాంబు పేలుడు వంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ భద్రతకు పాటుపడాలని పలు తీర్మానాలు ఆమోదించారు.

## 2,552 పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు

శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

**చెన్నై:** చెన్నై నగరంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాల ద్వారా 2,552 పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పెంపుడు జంతువులకు లైసెన్సు పొందే విధానాన్ని సరళీకృతం చేసి దాని ద్వారా ఈ విధానాన్ని మరింత విస్తృతం చేయడానికి చెన్నై మహానగర పాలకసంస్థ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈ నెల ఆదివారాల్లో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలను 7 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు ఆదివారం జరిగిన ప్రత్యేక శిబిరాల్లో 2,552 పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వాక్సిన్ వేసి, మైక్రో చిప్‌ను అమర్చి వాటి యజమానులకు లైసెన్సు అందించింది. వచ్చే ఆదివారం కూడా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరాలు జరగనున్నాయి.

## అగ్నిప్రమాదంలో చిక్కుకున్నవారు సురక్షితం

**ప్యారిస్, న్యూస్‌టుడే:** చెన్నై టీనగర్ నార్త్ ఉస్మాన్ రోడ్డు రామచంద్ర వీధిలో ఉన్న అపార్ట్‌మెంట్‌లోని రెండో అంతస్తులో ఉంటున్న గిరిధర్ ఇంట్లోని పూజ గదిలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే గిరిధర్ కుటుంబీకులు బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించడంతో మూడో అంతస్తులో ఉంటున్న వారు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వారు మేడపైకి వెళ్లారు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేసి ఆరుగురిని రక్షించారు. ప్రమాదంలో మూడో అంతస్తు వెనుకవైపు ఉంటున్న డాక్టర్ వరదరాజన్(72), ఆయన భార్య మలర్‌లు శ్వాస సమస్యతో ఇబ్బంది పడటంతో వారిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధర్మపురిలో బస్టాండ్ నిర్మాణ పనులు వేగవంతం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ధర్మపురి నగరంలోని సేలం-బెంగళూరు జాతీయ రహదారిలో రూ.39.14 కోట్ల వ్యయంతో కొత్త బస్టాండ్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక సౌకర్యాలతో ఒకేసారి 55 బస్సులు వచ్చి వెళ్లే విధంగా నిర్మిస్తున్నారు. బస్టాండ్ చుట్టూ ప్రజలు, ప్రయాణికుల కోసం కాలిబాటలు, కూర్చోవడానికి అనువైన ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి అంతస్తులో దుకాణాలు, రెస్టారెంట్‌లు, ఏటీఎం కేంద్రం, వస్తువుల భద్రతా గది, సమయపాలన గది, నర్సింగ్ రూము, రూఫింగ్, ప్రయాణికులు, డ్రైవర్ల విశ్రాంతి గదులతో పాటు పలు పనులు వేగంగా జరుగుతున్నాయి. 85శాతం పనులు పూర్తయ్యాయి. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ సతీష్ పనులను పరిశీలించారు.



వ్యాపారవేత్త, తమిళ సంగీత సంఘం గౌరవ కార్యదర్శి ఎ.సి.ముత్తయ్య ఇంటికి ఆదివారం ముఖ్యమంత్రి స్టాలిన్ వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వెంట ముత్తయ్య కుటుంబ సభ్యులు ఉన్నారు.
\- చెన్నై, న్యూస్‌టుడే

## 2026 ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భారీ విజయం

**సెల్వ పెరుంతగై**

**చెన్నై, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో వచ్చే ఏడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ 'ఇండియా' కూటమి భారీ గెలుపు సొంతం చేసుకోనుందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తెలిపారు. ఆయన తన ప్రకటనలో... బిహార్ తరహాలో తమిళనాడులోనూ అధికార మార్పిడి జరుగుతుందని కొందరు జోస్యం చెబుతున్నారన్నారు. ఆ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి గెలుస్తుందని దేశమే భావించిందని, అనూహ్యంగా భాజపా కూటమి గెలిచిందని తెలిపారు. దీనిపై రాజకీయ నిపుణులు అధ్యయనం చేస్తున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్ర, హరియాణా వంటి రాష్ట్రాల్లో చేపట్టిన ఓట్ల చోరీ యుక్తిని బిహార్‌లోనూ చేపట్టి భాజపా గెలిచిందని ఆరోపించారు. ఇందులో ఎన్నికల కమిషన్ కుట్ర కూడా ఉందనే విషయాన్ని అందరూ నిర్ధారించారని తెలిపారు. 2019, 2024 లోక్‌సభ ఎన్నికలు, 2021 శాసనసభ ఎన్నికలు తరహాలో 2026 శాసనసభ ఎన్నికల్లోనూ 'ఇండియా' కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకోనుందని ధీమా వ్యక్తం చేశారు.

## తోపుడుబండి దుకాణాలకు లైసెన్సులు తప్పనిసరి

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తోపుడుబండి దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఆహార భద్రతాశాఖ అధికారులు తెలిపారు. తోపుడుబండిపై ఆహారపదార్థాలు విక్రయించే యజమానులు ఆహార భద్రతాశాఖ నిబంధనల ప్రకారం సరైన లైసెన్స్ కలిగి ఉండాలని, వాటి యజమానులు ఆన్‌లైన్ ద్వారాగాని లేదా ఈ-సేవా కేంద్రాల ద్వారాగాని ఉచితంగా లైసెన్స్ పొందవచ్చని పేర్కొన్నారు. లైసెన్స్ పొందని దుకాణాలకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

## సంబా పంటలకు బీమా గడువు పొడిగింపు

**టీనగర్, న్యూస్‌టుడే:** సంబా వరి పంటలకు బీమా చేసుకునేందుకు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం ప్రకటించారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో.. ఇప్పటివరకు సంబా వరి పంటలకు బీమా చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలు, పాలనాపరమైన జాప్యాల కారణంగా రైతుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కోరికపై కేంద్రం ఈ గడువును పొడిగించిందని, ఇప్పటివరకు రాష్ట్రంలో 26.25 లక్షల ఎకరాల్లో సంబా వరి సాగు చేయగా, 15 లక్షల ఎకరాలకు (57శాతం) బీమా కల్పించినట్లు పేర్కొన్నారు.

## శ్రీలంక దంపతులకు దేశంలో పుట్టిన వ్యక్తికి పాస్‌పోర్ట్ ఇవ్వాలి

**మదురై ధర్మాసనం**

**ప్యారిస్, న్యూస్‌టుడే:** శ్రీలంక దంపతులకు తిరుచ్చిలో పుట్టిన వ్యక్తికి పాస్‌పోర్ట్ ఇవ్వాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుచ్చికి చెందిన గోకులేశ్వరన్ తనకు పాస్‌పోర్ట్ మంజూరు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఆశా శనివారం జారీచేసిన ఉత్తర్వుల్లో... పిటిషనరు 1986 ఫిబ్రవరిలో తిరుచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టారని, తల్లిదండ్రులు శ్రీలంక శరణార్థులుగా వచ్చి శిబిరంలో ఉన్నారన్నారు. భారతదేశంలో పుట్టడంతో పౌరసత్వ చట్టం ప్రకారం భారతీయ పౌరసత్వాన్ని పొందినట్లు పిటిషనరు తరపున జనన ధ్రువీకరణపత్రం, విద్యా ధ్రువీకరణపత్రం, ఆధార్‌ను సమర్పించారని తెలిపారు. జనన ధ్రువీకరణపత్రాన్ని తిరుచ్చి కార్పొరేషన్ ధ్రువీకరించిందన్నారు. పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం 1987 జులై ముందు భారతదేశంలో పుట్టారని, తల్లిదండ్రులు ఏ దేశానికి చెందిన వారయినా, దానిని పరిగణలోకి తీసుకోకుండా భారతీయ పౌరుడిగా భావిస్తారని చెప్పారు. పిటిషనరు 1987 జులైకి ముందు పుట్టారు కాబట్టి చట్ట ప్రకారం ఆయన భారతీయ పౌరుడని ధ్రువపత్రాలు నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. ఆయనకు పాస్‌పోర్ట్ మంజూరు చేయాలని తిరుచ్చి జోనల్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీ శంకర్‌కు సూచనలిస్తున్న మంత్రి నాజర్

## వేదిక నిర్మాణ పనుల పరిశీలన

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపం తిరువేర్కాడు సుందరచోళపురంలో ఈనెల 24న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 1500 మందికి ఆర్థికసాయం అందజేసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం వేదిక నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి నాజర్ ఆదివారం పనులు పరిశీలించారు. ఆవడి నగర పోలీసు కమిషనర్ శంకర్‌కు బందోబస్తుకు సంబంధించి సూచనలిచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రతాప్, పోలీసు జాయింట్ కమిషనర్ భవానీశ్వరి, డిప్యూటీ కమిషనర్లు ఫెరోజ్‌ఖాన్, సంగు, మున్సిపల్ ఛైర్మన్ మూర్తి, కమిషనర్ రామర్ వెంట ఉన్నారు.

కలుషితమైన చెరువు నీరు

## కాలుష్య కోరల్లో గుమ్మిడిపూండి చెరువు

**గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పట్టణ పొలిమేరలో 48 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. దీని ద్వారా సుమారు 500 ఎకరాల సాగుభూమికి నీరందుతోంది. చెరువు ప్రాంతంలో నిర్మించిన బోరు బావుల నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. చెరువు పరిసర ప్రాంతాల్లోని గృహాలు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలు చెరువులోకి మళ్లించడంతో నీరు కలుషితమైంది. దీంతో ఇటీవల టన్నుల కొద్దీ చేపలు మృతి చెందాయి. చెరువులోకి నీటిని మళ్లించే గృహాల యజమానులు, కర్మాగారాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

లిఫ్ట్ సౌకర్యం లేక మెట్లు వినియోగిస్తున్న ప్రయాణికులు

## తాంబరం రైల్వే స్టేషన్‌లో కొరవడిన వసతులు

### ప్రయాణికుల అవస్థలు

**మహాబలిపురం, న్యూస్‌టుడే:** చెన్నై శివారులోని తాంబరం రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉంటాయి. చెన్నై బీచ్-తాంబరం-బీచ్‌కు రోజుకు 220కు పైగా రైళ్లు నడుస్తున్నాయి. అంతేకాకుండా చెన్నై బీచ్ నుంచి కాంచీపురం సమీప తిరుమాల్‌పూర్ వరకు 10కి పైగా రైళ్లు నడుస్తున్నాయి. అదనంగా ఎగ్మూర్ నుంచి తాంబరం మీదుగా దక్షిణాది జిల్లాలకు 30కు పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుగుతున్నాయి. దీంతో రైల్వే స్టేషన్ ఎప్పుడూ రద్దీగా ఉంటోంది. నిత్యం ఇక్కడి నుంచి సుమారు 2.30లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వే స్టేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.276 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అయితే స్టేషన్‌లో మాత్రం ప్రయానికులకు అవసరమైన వసతులు కనిపించడం లేదు. దక్షిణాది జిల్లాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రస్తుతం 7, 8 ప్లాట్‌ఫారాలపై ఆగుతున్నాయి. కానీ ఈ ప్లాట్‌ఫారాలపై ఎస్కలేటర్లు, లిఫ్టులు లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా 5, 6 ప్లాట్‌ఫారాలపై ఎస్కలేటర్లు, తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు చవిచూస్తున్నారు. బ్యాటరీ కారు వసతి ఉన్నా రుసుము వసూలు చేస్తుండటంతో ఎవరూ ఉపయోగించుకోవట్లేదు. కావున స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

(c) eenadu

## మాస్క్ సరదా చిత్రం: ఆండ్రియా

అభిమానులతో సెల్ఫీ తీసుకుంటున్న ఆండ్రియా

చెన్నై, న్యూస్‌టుడే: నటి, నిర్మాత ఆండ్రియా నటించిన ‘మాస్క్’ ఈ నెల 21న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కోయంబత్తూర్‌లో జరిగిన గోయాజ్ వెండి ఆభరణాల విక్రయ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. తనకు కోయంబత్తూర్ అంటే చాలా ఇష్టమని, ఏడాదికి పదిసార్లు అయినా వస్తానని తెలిపారు. ప్రస్తుతం బంగారు ఆభరణాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వాటి ధరలు చూస్తుంటూనే భయంగా ఉందని పేర్కొన్నారు. ‘మాస్క్’ సరదా చిత్రమన్నారు. ప్రేక్షకులు సినిమా థియేటర్లకు వచ్చి చిత్రానికి మద్దతు ఇవ్వాలని కోరారు. తర్వాత అక్కడి అభిమానుల అభ్యర్థన మేరకు పాట పాడి వారితో సెల్ఫీలు తీసుకున్నారు.

## మొదట వెబ్ సిరీస్‌గా తీయాలనుకున్నాం

✦ విఘ్నేశ్‌కాంత్

కార్యక్రమంలో చిత్రబృందం

చెన్నై: కలైయరసన్ తంగవేల్ దర్శకత్వంలో రియో రాజ్, మాళవిక మనోజ్ జంటగా నటించిన ‘ఆన్ పావం పొల్లాదతు’ విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో అభిమానులు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపే సమావేశాన్ని చిత్రబృందం నిర్వహించింది. నటుడు ఆర్జే విఘ్నేశ్ కాంత్ మాట్లాడుతూ... పురుషుల అంతరంగ జీవితంపై ఇప్పటివరకు వచ్చిన సినిమాల సంఖ్య చాలా తక్కువన్నారు. ఆ లోటును భర్తీ చేసేలా ‘ఆన్ పావం పొల్లాదతు’ను రూపొందించినట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని వెబ్ సిరీస్‌గా తీయాలని భావించినా స్క్రిప్ట్ సిద్ధమైన తర్వాత సినిమాగానే తీయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ చిత్రం ద్వారా రియో రాజ్ స్టార్‌గా మారారన్నారు. దర్శకుడు కలైయరసన్ తంగవేల్ మాట్లాడుతూ... సినిమాలో వన్యప్రాణులకు సంబంధించిన సన్నివేశాలు లేవని, ఒకచోట మాత్రమే మేక అరిచే సన్నివేశం ఉందని తెలిపారు. దానికి నిజమైన మేక అరుపు ఉంటే బాగుంటుందని భావించి, ఆ సన్నివేశాన్ని చిత్రీకరించడం కోసం జంతు సంక్షేమ బోర్డు నుంచి తగిన అనుమతి తీసుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నటుడు రియో రాజ్, నటి మాళవిక మనోజ్, నిర్మాతలు ఎస్.శక్తివేల్, విజయన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన దర్శకుడు శేఖర్ అంత్యక్రియలు

భౌతికకాయానికి అంజలి ఘటిస్తున్న డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ దర్శకుడు వి.శేఖర్ భౌతికకాయానికి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో ఆదివారం జరిగాయి. అనారోగ్యంతో ఆయన చెన్నైలో శుక్రవారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన తిరువణ్ణామలై సమీపం నెయ్యివానత్తం గ్రామంలో ఆదివారం జరిగాయి. ఆయన భౌతికకాయానికి రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, ఎస్‌కేపీ కళాశాల ఛైర్మన్ కరుణానిధి, తిరువణ్ణామలై ఎక్స్‌నోరా అధ్యక్షుడు ఇందిరా రాజన్ తదితరులు అంజలి ఘటించారు.

కార్మికులకు ఆహారం ఉన్న బ్యాగులను అందిస్తున్న అధికారిణి

## శుభ్రతా కార్మికులకు అల్పాహారం అందజేత

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలకసంస్థ (జీసీసీ) తరఫున శుభ్రతా కార్మికులకు అల్పాహారాన్ని అందజేశారు. జీసీసీ శుభ్రతా కార్మికులకు ఆహారం అందించే పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం విధులకు హాజరైన శుభ్రతా కార్మికులకు జీసీసీ అధికారులు ఆహారాన్ని అందించారు. వేళచ్చేరిలోని 58వ డివిజన్, అన్నానగర్‌లోని 108వ డివిజన్, విరుగంబాక్కంలోని 127వ డివిజన్ తదితర డివిజన్ కార్యాలయాల తరఫున జీసీసీకి చెందిన కార్యాలయాల్లో శుభ్రతా కార్మికులకు వేడిని తట్టుకునే బ్యాగుల్లో ఆహారాన్ని అధికారులు అందజేశారు.

## హాకీ ప్రపంచ కప్‌కు తేనిలో ఘన స్వాగతం

కప్‌తో కలెక్టరు రంజిత్ సింగ్ తదితరులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్ పోటీలు ఈ నెల 28 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు చెన్నై, మదురైలలో జరుగనున్నాయి. 24 దేశాల జట్లను 6 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌లో పాల్గొనాల్సిన పాకిస్థాన్ వైదొలగడంతో ఒమన్ జట్టుకు అవకాశం లభించింది. ఈ నెల 5న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రోఫీ, మస్కట్‌ను ఆవిష్కరించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ, హాకీ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ కప్ గురించి ప్రజలకు తెలియజేసేందుకు విజేత జట్టుకు అందజేసే కప్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తేని చేరుకున్న కప్‌కు జిల్లా కలెక్టర్ రంజిత్ సింగ్, ఎంపీ తంగ తమిళ్‌సెల్వన్, ఎమ్మెల్యే శరవణకుమార్, ప్రభుత్వ అధికారులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. తేని పట్టణంలోని క్రీడా మైదానంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో దానిని ప్రజల సందర్శనార్థం ఉంచారు.

కాంచీపురం సమీప చెవిలిమేడులోని కల్యాణ మండపంలో శనివారం రాత్రి నిర్వహించిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో పాల్గొని ఉత్తమ సహకార సంఘాలకు షీల్డులు, ప్రశంసాపత్రాలను మంత్రి ఆర్.గాంధీ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కె.సుందర్, సీవీఎంపీ ఎళిలరసన్, అధికారులు పాల్గొన్నారు. - కాంచీపురం, న్యూస్‌టుడే

## ‘మెట్టూరు’ నుంచి నీటి విడుదల గడువు పొడిగింపు

టీనగర్, న్యూస్‌టుడే: మెట్టూరు జలాశయం నుంచి ఏటా ఆగస్టు మొదటి వారంలో సాగుకు నీటిని విడుదల చేస్తారు. అయితే ఈ ఏడాది గత జులై ఒకటో తేదీ ముందుగానే విడుదల చేశారు. 137 రోజులు కాలువలకు నీరు ప్రవహించిన నేపథ్యంలో గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి మేరకు అదనంగా మరో 62 రోజులపాటు నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు శనివారం నుంచి వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ వరకు సెకనుకు 400 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అన్నాడీఎంకే ఆందోళన వాయిదా

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్నాడీఎంకే సోమవారం చేపట్టనున్నట్లు ప్రకటించిన ఆందోళన వాయిదా పడింది. ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ‘ఎస్ఐఆర్’ పనుల్లో డీఎంకే తన అధికారాన్ని ఉపయోగించి అవకతవకలకు పాల్పడుతుందని, దీనికి వ్యతిరేకంగా చెన్నైలో సోమవారం అన్నాడీఎంకే తరఫున ఆందోళన చేయనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారీ వర్షానికి అవకాశం ఉందని చెన్నై వాతావరణ కేంద్రం ప్రకటించడంతో ఆందోళనను వాయిదా వేసింది. ఆ ప్రకారం 20వ తేదీ ఉదయం నిర్వహించనున్నట్లు పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

# కాంగ్రెస్‌తో కూటమికి విజయ్ మంతనాలు?

✦ నెలాఖరులో రాహుల్‌తో భేటీకి అవకాశం ✦ జోరుగా సాగుతున్న ప్రచారం

రాహుల్‌గాంధీ

విజయ్

- న్యూస్‌టుడే, న్యూస్‌టుడే

రానున్న శాసనసభ ఎన్నికల్లో టీవీకే-కాంగ్రెస్ కూటమి ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయని, ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేతలతో టీవీకే అధ్యక్షుడు విజయ్ మంతనాలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ నెలాఖరులో రాహుల్‌ను కలిసే అవకాశం ఉందనీ ప్రచారం జరుగుతోంది. రాజకీయ తెరంగేట్రం చేసిన నటుడు విజయ్ వచ్చే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే, టీవీకే మధ్య మాత్రమే పోటీ ఉంటుందని తరచూ పునరుద్ఘాటిస్తున్న విషయం తెలిసిందే. ఇది రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తుండటంతో టీవీకే కదలికలు, ఎన్నికల వ్యూహాలను రాజకీయ వర్గాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఈ పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి అన్నాడీఎంకే, భాజపా వంటి అగ్రపార్టీలు సైతం బహిరంగంగానే పిలుపునిస్తున్నాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్‌తో కూటమి ఏర్పాటుకు విజయ్ పావులు కదుపుతున్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇప్పటికే టీవీకే వైపు మొగ్గు చూపుతున్న కాంగ్రెస్ నిర్వాహకులు కొందరు టీవీకే నిర్వాహకులతో మంతనాలు జరిపారని, కాంగ్రెస్ కీలక వ్యక్తి ఒకరు విజయ్‌ను కలిసి మాట్లాడారని ప్రచారం జరుగుతోంది.

### ఖర్గేతో ఫోన్ సంభాషణలు

2011 శాసనసభ ఎన్నికల్లో 63 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ గత శాసనసభ ఎన్నికల్లో 25 స్థానాలతో సరిపెట్టుకుంది. దీంతో వచ్చే శాసనసభ ఎన్నికల్లో అదనపు సీట్లను డీఎంకే కూటమి నుంచి డిమాండ్ చేయాలని, లేకపోతే టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నిర్వాహకులు పలువురు బహిరంగంగానే అధిష్ఠానాన్ని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు గిరీశ్ చోడంకర్ కూడా ఇదే అభిప్రాయంలో ఉన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని భావిస్తున్న తనకు ఇది సానుకూల విషయమని భావించిన విజయ్ నగరానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరి ద్వారా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఫోన్‌లో మాట్లాడారని వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే శాసనసభ ఎన్నికలకు టీవీకేతో కూటమి ఏర్పాటుకు రాహుల్ గాంధీని ఒప్పించాలని కోరినట్లు సమాచారం. ఈ నెలాఖరులో రాహుల్ గాంధీని కలిసేందుకు సమయం కోరారని, అంతా సజావుగా జరిగితే రాహుల్, విజయ్ భేటీ జరుగుతోందని వార్తలు వినిపిస్తున్నాయి.

### ఖండించిన నేతలు

టీవీకేతో కాంగ్రెస్ కూటమి ఏర్పాటు చేయనుందని జరుగుతున్న ప్రచారాన్ని టీఎన్‌సీసీ ప్రధానకార్యదర్శి సెల్వ పెరుంతగై, కాంగ్రెస్ జాతీయ ప్రధానకార్యదర్శి మాణిక్కం ఠాకూర్ తదితరులు ఖండించారు. కూటమిపై నిర్ణయం, అదనపు సీట్లు డిమాండ్ చేయడం వంటి నిర్ణయాలను అధిష్ఠానం తీసుకుంటుందని తేల్చి చెప్పారు. అలాగే రాహుల్ గాంధీతో భేటీకి విజయ్ ప్రయత్నిస్తున్నారనే ప్రచారాన్ని టీవీకే సంయుక్త ప్రధానకార్యదర్శి సీటీఆర్ నిర్మల్‌కుమార్ ఖండించారు. అవి వదంతులు మాత్రమేనని కొట్టిపారేశారు.

## కోవై విమానాశ్రయంలో ఆంక్షలు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు నగరంలోని కొడిసియా మైదానంలో ఈనెల 19న సేంద్రియ వ్యవసాయ సదస్సు జరుగనుంది. ఇందులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ప్రధాని రాక సందర్భంగా కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు నిబంధనలు విధించారు. ఆ మేరకు 18వ తేదీ ఉదయం 6 నుంచి 19వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు టెర్మినల్ ముందు భాగం, వై-జంక్షన్ ప్రాంతాలలో పార్కింగ్‌కు నిషేధం విధించారు. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయంలో వాహనాలు పార్కింగ్ చేయకూడదని అధికారులు సూచించారు.

## పీఎంకే ఆధ్వర్యంలో త్వరలో ఆందోళన

సైదాపేట, న్యూస్‌టుడే: వన్నియర్లకు అంతర్గత రిజర్వేషన్లను డిమాండ్ చేస్తూ డిసెంబరు 17న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి ప్రకటించారు. దీనికి సంబంధించి కార్యకర్తలకు ఆయన రాసిన లేఖలో.. పీఎంకే సోదరులారా సామాజిక న్యాయం కోసం మరో పోరాటం ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో విద్య, ఉపాధి అవకాశాల్లో వన్నియర్లకు 18 శాతం రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ డిసెంబరు 17న ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

## పోలీసులకు వాహనాల అందజేత

ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ షణ్ముగం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లాలో పనిచేస్తున్న పోలీసులకు 24 ద్విచక్ర వాహనాలు, 21 కార్లను ప్రభుత్వం కేటాయించింది. కాంచీపురం కలెక్టరు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అన్నా పోలీస్ మైదానంలో జిల్లాలో ఉంచిన వాహనాలను ఆదివారం ఎస్పీ కె.షణ్ముగం పరిశీలించారు.

## సర్‌కు వ్యతిరేకంగా టీవీకే నిరసన

ఆందోళనలో పాల్గొన్న నిర్వాహకులు, కార్యకర్తలు

వేలూరు, న్యూస్‌టుడే: కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ టీవీకే తరఫున ఆదివారం వేలూరులోని అన్నా కలైయరంగం వద్ద ఆందోళన జరిగింది. పార్టీ తూర్పు జిల్లా కార్యదర్శి నవీన్, పశ్చిమ జిల్లా కార్యదర్శి వేల్‌మురుగన్ నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ‘సర్’కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# నందిని పేరుతో కల్తీ నెయ్యి తయారీ

✦ తిరుప్పూర్‌లో నడుస్తున్న పరిశ్రమకు సీలు

పరిశ్రమలో ఉన్న నెయ్యి డబ్బాలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కర్ణాటక ప్రభుత్వ నెయ్యి పేరిట కల్తీ నెయ్యి విక్రయిస్తున్న పరిశ్రమకు అధికారులు సీలు వేసి, నలుగురిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు... కర్ణాటక ప్రభుత్వ సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య తరఫున ‘నందిని’ పేరుతో నెయ్యి ఉత్పత్తి చేస్తారు. ఆ పేరిట కల్తీ నెయ్యి విక్రయాలు జరుగుతున్నాయని అవినీతి నిరోధకశాఖకు సమాచారం అందింది. ఆ మేరకు దర్యాప్తు జరుపగా పరిశ్రమ తిరుప్పూర్ జిల్లా సేవూర్ వడుక్కాయం పంచాయతీలోని ఆలంగట్టిపాళ్యంయలో ఉన్నట్లు గుర్తించారు. బెంగళూర్‌కు చెందిన కేఎంఎఫ్ పంపిణీదారుడు మహేంద్ర దానిని నడుపుతున్నట్లు తెలిసింది. ఇక్కడ కేఎంఎఫ్ నుంచి కొనుగోలు చేసే అసలు నెయ్యికి డాల్డా, పామోలిన్ నూనె, కొబ్బరి నూనె కలిపి ‘నందిని’ పేరిట ప్యాకెట్లలో నింపి వ్యాన్‌లలో బెంగళూర్‌లోని దుకాణాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ తంతు జరుగుతోంది. అక్కడకు చేరుకున్న బెంగళూర్ పోలీసులు, సేవూర్ పోలీసులు మహేంద్ర, అతని కుమారుడు దీపక్, తిరుప్పూర్‌కు చెందిన విక్రయదారుడు మునిరాజ్, వ్యాన్ డ్రైవర్ అభిని ఆదివారం అరెస్ట్ చేశారు. పరిశ్రమలో ఉన్న రూ.కోటి విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అవినాశి రెవెన్యూశాఖ అధికారులు పరిశ్రమకు సీలు వేశారు.

## రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ సమీపం సిప్‌కాట్, మాంబాక్కంలోని 230 కేవీ సబ్ స్టేషన్లలో 18వ తేదీ మాసాంతర అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఆరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుంగువారిసత్రం, సేందమంగళం, సంతవేలూర్, పాప్పాంగుళి, రామానుజపురం, కీరా నల్లూర్, కున్నం, సిరుమాంగాడు, అయిమిచ్చేరి, ఆరనేరి తదితర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## 21న ‘కడలమ్మా’ మహానాడు: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: నామ్ తమిళర్ కట్చి తరఫున ఈ నెల 21న తిరునెల్వేలి జిల్లా కూత్తన్‌కుళిలో ‘కడలమ్మా’ (సాగరమాత) పేరిట మహానాడును నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ ప్రకటించారు. ఆయన తన ‘ఎక్స్’ పేజీలో కొన్ని ఫొటోలను పంచుకుంటూ ఈ విషయాన్ని వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ మహానాడులో తమిళులంతా తప్పకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీమాన్ పోస్టు చేసిన చిత్రం

## ట్రాక్టర్ ఢీకొని రెండేళ్ల బాలిక మృతి

విజిత (పాతచిత్రం)

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం పళవేర్కాడుకు చెందిన సంధ్య కుమార్తె విజిత(2) శనివారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా అటుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తిరుప్పాళైవనం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి ట్రాక్టర్ డ్రైవర్ దేవన్‌ను అరెస్టు చేశారు.

## లారీని ఢీకొన్న బస్సు.. 20మందికి గాయాలు

ప్రమాదానికి గురైన బస్సు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బెంగళూర్ నుంచి శబరిమలైకి 60మంది అయ్యప్ప భక్తులతో ఓ ప్రైవేటు బస్సు బయల్దేరింది. ఆదివారం ఉదయం తిరుప్పూర్ జిల్లా పెరుమానల్లూర్ వద్ద వెళ్తుండగా అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో బస్సులో ఉన్న 20 మంది గాయపడ్డారు. ఇందులో ఆరుగురికి కాళ్లు, చేతులు విరిగాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జైలులో గంజాయి స్వాధీనం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణికి చెందిన అజిత్ అనే వ్యక్తిని చోరీ కేసులో చెన్నై సెంట్రల్ పోలీసులు ఇటీవల అరెస్టు చేసి పుళల్ జైల్లో ఉంచారు. అదే విధంగా చెన్నై మైలాపూరు అన్నై సత్యానగర్‌కు చెందిన రాము అనే వ్యక్తి గంజాయి తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి పోలీసులు ఖైదీల సెల్‌లలో తనిఖీ నిర్వహించారు. అజిత్, రాము నుంచి 20 గ్రాముల గంజాయి, సిమ్‌కార్డు స్వాధీనం చేసుకున్నారు. పుళల్ పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

## హత్య కేసులో ఐదుగురి అరెస్టు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా వల్లం ప్రాంతానికి చెందిన షణ్ముగ పాండియన్(35) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నారు. ఇతను అదే ప్రాంతానికి చెందిన మదిమళగన్‌కు తన సంస్థలో రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.30 వేలు తీసుకున్నాడు. తర్వాత రుణం రాకపోవడంతో మదియళగన్ తన డబ్బులు తిరిగివ్వాలని షణ్ముగ పాండియన్‌ను అడిగాడు. అతను ఇవ్వకపోవడంతో స్నేహితులైన సూర్యప్రకాష్, రామన్, కలై, సంజయ్‌తో కలిసి కొన్ని రోజుల క్రితం షణ్ముగ పాడియన్‌ను హత్య చేసి పారిపోయారు. నిందితులను పట్టుకోవడానికి ఏర్పాటైన ప్రత్యేక పోలీస్ బృందం చెంగల్పట్టు సమీపంలో దాగి ఉన్న మదియళగన్, అతని నలుగురు స్నేహితులను శనివారం రాత్రి అరెస్టు చేసింది.

### కుమార్తెను గర్భవతిని చేసిన తండ్రి...

ప్యారిస్: కన్నియాకుమరికి చెందిన 45ఏళ్ల వ్యక్తికి 17ఏళ్ల కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాలిక స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. కొన్ని రోజుల క్రితం బాలిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బిడ్డకు జన్మనివ్వడంతో వైద్యులు పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను విచారించగా.. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో తన తండ్రి అత్యాచారానికి పాల్పడినట్లు చెప్పింది. తల్లికి తెలియకుండా ప్రసవానికి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిసింది. దీంతో నిందితుడిని శనివారం పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు.

### మత్తుపదార్థం విక్రేతలు ఇద్దరు...

ఉస్మాన్, ప్రవీణ్

ప్యారిస్: చెన్నై కీల్పాక్కం పోలీసులు శనివారం స్థానికంగా గస్తీ చేపట్టారు. అప్పుడు మెథాంఫెటమైన్ అనే మత్తుపదార్థం విక్రయించడానికి యత్నించిన ఉస్మాన్, ప్రవీణ్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 17 గ్రాముల మెథాంఫెటమైన్ స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వారు బెంగళూరులో కొనుగోలు చేసి చెన్నైలో విక్రయించడానికి యత్నించినట్లు తెలిసింది.

### మత్తుమాత్రలు తరలిస్తున్న వ్యక్తి...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో కొందరు మత్తుమాత్రలు విక్రయిస్తున్నారని జిల్లా ఎస్పీ వివేకానంద శుక్లాకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు ఆదివారం రైల్వేస్టేషన్ వెనుక వైపు తనిఖీలు నిర్వహించారు. అక్కడ మత్తుమాత్రలు విక్రయిస్తున్న చెన్నై సూళైమేడుకు చెందిన రఘుపతి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 517 మాత్రలు స్వాధీనం చేసుకున్నారు.

### వరుస చోరీలకు పాల్పడిన ఆరుగురు యువకులు...

మహాబలిపురం: చెన్నై ఆలపాక్కానికి చెందిన సూర్య(19) ఓ చోరీ కేసులో కొన్ని రోజుల క్రితం అరెస్టయ్యి జైలుకు వెళ్లాడు. జైల్లో చెన్నై కన్నగి నగర్‌కు చెందిన సంతోష్ పరిచయం అయ్యాడు. ఇద్దరూ జైలు నుంచి విడుదలైన తరువాత డబ్బుల కోసం తాంబరం వద్ద తపాలా కార్యాలయంలో పార్శిళ్లను దొంగిలించారు. తపాలాశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు సేలయూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడింది సూర్య, సంతోష్ అని గుర్తించారు. సూర్యను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీ చేసిన పార్శిళ్లలో దుస్తులు ఉన్నాయని, చీరను తన అమ్మకు ఇచ్చి చొక్కా, ప్యాంటు తాను ధరించినట్లు తెలిపాడు. గత వారం సూర్య.. తన పాత స్నేహితులు ఆరుగురితో కలిసి ఒకే రాత్రి చెన్నై నగరం, శివారు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. దీంతో సూర్యను సేలయూర్ పోలీసులు, సంతోష్‌ను కన్నగి నగర్ పోలీసులు, మిగిలిన నలుగురిని తాళంబూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.

### దొరికిన ఏటీఎం కార్డుతో నగదు విత్‌డ్రా చేసిన మహిళ...

క్రైం కార్నర్

వేలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా గుడిపాలకి చెందిన ఇన్బకుమారి అనే మహిళ భర్త మాజీ సైనికుడు. ఇదిలా ఉండగా ఇన్బకుమారి, కుమార్తె రేచల్ కలిసి కళ్లజోడు కొనడానికి వేలూరులోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అధికారులు ఆధార్‌కార్డు జెరాక్స్ తీసుకురమ్మని చెప్పడంతో దుకాణానికి వెళ్లారు. మార్గమధ్యలో వారి బ్యాగులో ఉన్న ఏటీఎం కార్డు, దాని పిన్ నెంబరు స్లిప్ పోగొట్టుకున్నారు. తర్వాత రూ.50వేలు విత్‌డ్రా చేసినట్లు ఇన్బకుమారి సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో వేలూరు దక్షిణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏటీఎం కేంద్రంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీని పరిశీలించి రాజపాళ్యంకి చెందిన దేవి అనే మహిళను అరెస్టు చేసి విచారించారు. డ్రా చేసిన రూ.50వేలలో రూ.30 వేలకు బంగారు కమ్మలు తీసుకున్నట్లు చెప్పింది. నగలు, మిగిలిన నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు శనివారం దేవిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

## నగలు, నగదు చోరీ

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా వేలూరు పట్టణంలోని కోసపేటకి చెందిన బాలకృష్ణన్ అన్నాసాలైలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్య కుమార్తె బాలకృష్ణన్‌ను విడిచి వెళ్లారు. దీంతో బాలకృష్ణన్ అద్దె ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్నం బాలకృష్ణన్ భోజనానికి ఇంటికి రాగా తలుపు తాళం పగులగొట్టి ఉంది. లోనికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 30 సవర్ల బంగారు నగలు, కిలో వెండి వస్తువులు, రూ.1.60 లక్షల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేలూరు సౌత్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి సామినాథన్

## జాతీయస్థాయి మార్కెటింగ్‌కు మంచి అవకాశం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ఉత్పత్తులను జాతీయస్థాయిలో మార్కెటింగ్ చేయడానికి దిల్లీలోని ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ ఓ సదావకాశమని రాష్ట్ర సమాచారశాఖ మంత్రి సామినాథన్ తెలిపారు. దిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరుగుతున్న 44వ ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్-2025లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ‘తమిళనాడు డే’ వేడుకలను మంత్రి సామినాథన్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర ప్రసిద్ధ జానపద కళా ప్రదర్శనలను తిలకించారు. తర్వాత విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పలు శాఖలకు చెందిన స్టాళ్లు చోటుచేసుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ఉత్పత్తులను జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేయడానికి ఈ ప్రదర్శన ఓ మంచి అవకాశంగా ఉంటుందని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

## పాలకొల్లులో నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

**పరిమిత సంఖ్యలో నేడు ఎంట్రీ పాసుల పంపిణీ**

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశిష్ట పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్ ఛానళ్ల ఆధ్వర్యంలో జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు గారి స్నేహపూర్వక భాగస్వామ్యంతో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు.

ఎంట్రీ పాసులు కావాల్సిన వారు సోమవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మధ్యలో పాలకొల్లు పట్టణంలోని కమెరక బాలనాగేశ్వరరావు గ్రౌండ్, రామచంద్ర కన్వెన్షన్ వెనుక, బ్రాడీపేట బైపాస్ రోడ్ వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. - ఈనాడు, పాలకొల్లు

**సమయం:** ఈరోజు (సోమవారం) సాయంత్రం 5 గంటలకు
**స్థలం:** కమెరక బాలనాగేశ్వరరావు గ్రౌండ్, రామచంద్ర కన్వెన్షన్ వెనుక, బ్రాడీపేట బైపాస్ రోడ్, పాలకొల్లు

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

## శ్రీవారి ఆలయంలో రద్దీ

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఏ ఊరు.. ఎంత నీరు

- చిన్న తరహా నీటి వనరుల గణన
- పడిపోతున్న భూగర్భ జలాల రక్షణ

**ఈనాడు-ఏలూరు**

జిల్లాలో సాగు, తాగునీటికి సంబంధించిన చిన్న తరహా నీటి వనరుల గణన జరుగుతోంది. ప్రజల అవసరాలు, వ్యవసాయ పంటలకు ప్రతి గ్రామం పరిధిలో ఏయే నీటి వనరులు ఉన్నాయో గుర్తించి లెక్కిస్తున్నారు. సాగునీటి కాల్వలు, భూగర్భ జలాలు, చెరువులు, బోర్లు, నీటి కుంటలు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులతో సహా ప్రతిదీ దాని భౌగోళిక విస్తీర్ణంతో సహా గ్రామాల వారీగా వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకు ఒకసారి ఈ గణనకు ఆదేశిస్తుంది. కొవిడ్ కారణంగా రెండేళ్లు ఆలస్యమైంది. ప్రస్తుతం ఏడో మైనర్ ఇరిగేషన్ గణన సాగుతోంది.

దెందులూరు మండలం ముప్పవరంలో చెరువు వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న వీఆర్వో, వీఆర్ఏలు

| | |
|---|---|
| గ్రామాలు | 664 |
| సర్వే పూర్తయింది | 13 గ్రామాలు |
| పురోగతిలో ఉన్నవి | 594 |
| ఇంకా ప్రారంభం కానివి | 57 |

### రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో

గ్రామ స్థాయిలో వీఆర్వో, వీఆర్ఏలు, ప్రణాళిక శాఖకు చెందిన అధికారులు సంయుక్తంగా ఈ నీటి వనరుల గణన ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారు. నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సి ఉంది. ఏటా వ్యవసాయ శాఖ కాల్వలు, బోరుబావులు, చెరువులు, కుంటలు కింద ఎంతెంత సాగవుతుందో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తుంది.

### కబ్జాకు గురైన చెరువుల సంరక్షణకు

చివరిగా 6వ మైనర్ ఇరిగేషన్ గణనలో జిల్లాలో కాల్వలు, చెరువులు, భూగర్భ జలాలు ఎన్నో ఉన్నాయో నిర్ధారించారు. అవి ఇప్పుడు ఉన్నాయా లేవా అని నాటి సమాచారం దగ్గర పెట్టుకుని బేరీజు వేసుకుంటున్నారు. ఏమైనా తగ్గితే వెంటనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్రమత్తం చేసి కబ్జాదారుల ఆధీనంలో ఉన్న చెరువులను రక్షించటానికి ఇది దోహదపడుతుంది.

- 6వ మైక్రో ఇరిగేషన్ సర్వేలో తేలిన నీటి వనరుల సంఖ్య: 64,699
- ఇప్పటి దాకా లెక్కించినవి : 44159

## నేడు యథావిధిగా మీకోసం

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' (మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## చెప్పినా.. వినరు.. 'మాట్లాడతారు'

వాహనాలను నడుపుతూ చరవాణుల్లో సంభాషిస్తూ..

ఏమండోయ్.. శిరస్త్రాణం మీ తలకి బరువు కాదు.. మన కుటుంబానికి భద్రత. వాహనాన్ని నడుపుతూ చరవాణుల్లో మాట్లాడొద్దు. వంటి నిబంధనలు నిత్యం చూస్తుంటాం. వింటుంటాం. కానీ ఆచరించడం లేదు. రహదారి భద్రత.. మనందరి బాధ్యత. నినాదంతో ఏలూరులో ఏటా భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. వాహనదారుల్లో స్ఫూర్తి నింపేందుకు ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివకిశోర్ పలు సందర్భాల్లో ద్విచక్రవాహనాలను నడుపుతూ శిరస్త్రాణాలను ధరించారు. ఇదంతా అందరూ చూసినా కొంతమంది శిరస్త్రాణాలు ధరించడం లేదు. మరికొందరు వాటిని వాహనాలకు అలంకరిస్తున్నారు. ఏలూరులో కనిపించిన చిత్రాలివి. -ఈనాడు, ఏలూరు

శిరస్త్రాణాలను ద్విచక్రవాహనాలకు అలంకరించి

## విజయం ప్రాప్తిరస్తు!

ఏలూరులో సంతాన ప్రాప్తిరస్తు చిత్ర బృందం సందడి చేసింది. కథానాయకుడు విక్రాంత్, నాయిక చాందిని చౌదరి, ఓ ఐమ్యాక్స్ థియేటర్ కొచ్చి ప్రేక్షకులను కాసేపు అలరించారు. అనంతరం పడమర వీధి గంగానమ్మ జాతరలో చాందిని చౌదరి ఘటాన్ని తలపై పెట్టుకొని మొక్కు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు వన్‌టౌన్, ఆధ్యాత్మికం

## గోవధ.. మూగ వ్యధ

- అక్రమంగా ఆవుల తరలింపు
- హరియాణా, హైదరాబాద్ ముఠాల దందా

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే**

పశు సంపద.. పాడి పంటలు.. భారతీయ జీవన విధానంలో భాగమయ్యాయి. గోవులను గోమాతగా పూజించే సంస్కృతి మనది.. పాలిచ్చే ఆవులను లాలించాల్సింది పోయి.. కాసులకు కక్కుర్తి పడి కఠినాత్ములకు అమ్మేస్తున్నారు. కొందరు ఓ మాఫియాగా ఏర్పడి ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు తరలిస్తూ.. నోరు లేని మూగజీవాలను వధిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు దళారులు యథేచ్ఛగా గోవుల అక్రమ రవాణాకు పాల్పడుతూ రూ.కోట్లకు పడగెత్తుతున్నారు.

**10-07-2025**

ఏలూరు నగర శివారు జాతీయ రహదారిపై కంటైనర్‌లో గోవులను తరలిస్తుండగా.. ఆ వాహనం ప్రమాదానికి గురైంది. కంటైనర్‌లోని సుమారు 60 గోవుల్లో 16 అక్కడికక్కడే చనిపోయాయి. గాయపడిన మిగతా వాటిని గో సంరక్షకురాలు ఆల్తీ వెంకటేశ్వరి ఆగిరిపల్లిలోని గోశాలకు తరలించారు.

**28-09-2025**

పార్వతీపురం నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 50 గోవులను దెందులూరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. కంటైనర్, గోవులను స్వాధీనం చేసుకొని.. ఉత్తర్‌ప్రదేశ్, మెదక్, హైదరాబాద్‌కు చెందిన ముఠా సభ్యులపై కేసు నమోదు చేశారు.

### ఉత్తరాంధ్ర నుంచే..

విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల నుంచి హరియాణా, మధ్యప్రదేశ్, తెలంగాణకు 16, 216వ నంబర్ల జాతీయ రహదారుల మీదుగా తరలిస్తున్నారు. దీనిపై పోలీసులు నిఘా పెట్టి కొందరిని పట్టుకుంటున్నారు. ముఠాలపై కేసులు నమోదు చేసి.. గోవులను స్వాధీనం చేసుకుంటున్నారు. కానీ, సింహభాగం పోలీసులు, చెక్‌పోస్టుల వద్ద యంత్రాంగం కళ్లుగప్పి గోవులను వాహనాల్లో తరలిస్తూ.. కబేళాకు అమ్మేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

పదుల సంఖ్యలో కుక్కేసి.. గోవులను కొనుగోలు చేసిన దళారులు.. వాటిని లారీలు, వ్యానులు, కంటైనర్లలో సుమారు 450-600 కి.మీ.లు తరలిస్తున్నారు. ఆయా వాహనాల్లో ఒకదానిపై ఒకటి కుక్కేసి.. కనీసం గాలి ఆడకుండా, నిల్చొనేందుకూ చోటులేకుండా తీసుకెళ్తున్నారు. ప్రయాణం సాగినంత సేపు గ్రాసం, నీళ్లు లేక మూగ జీవాలు నరకం చూస్తున్నాయి. 'జిల్లాలోని జాతీయ రహదారి మీదుగా గోవుల అక్రమ తరలింపుపై దృష్టి పెట్టాం. ఇప్పటికే హరియాణా ముఠాను పట్టుకుని కటకటాల్లోకి నెట్టాం. అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**నాలుగేళ్లలో నమోదైన కేసులిలా..**

| సంవత్సరం | కేసులు | పట్టుకున్న ఆవులు |
|---|---|---|
| 2022 | 30 | 1300 |
| 2023 | 26 | 1210 |
| 2024 | 37 | 1650 |
| 2025 | 19 | 890 |

## పంటు.. గోదారోళ్ల బంటు

- దశాబ్దాలుగా ఇదే ఆధారం
- ఎప్పటికి వారధి సాకారం

**నరసాపురం, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, భీమవరం**

ఆయ్..
గోదారోళ్లం కదండీ..
మమకారం ఎక్కువండీ..
ఆ పంటులాగే..
మా తాతముత్తాల నుంచి..
మాకది నమ్మిన బంటు..
ఎందుకంటే..
మా దగ్గర నుంచి..
మా మునిమనువళ్ల వరకు..
అదే మమ్మల్ని మోస్తోంది..
రెండు జిల్లాల ఆపద్బాంధవుడు..
గోదారమ్మ ఎలా కడుపులో
పెట్టుకుని చూస్తుందో.. మంచికీ..
చెడుకీ.. పుట్టుకకీ.. చావుకీ..
రెండు జిల్లాల వారధి.. అదే మాకు నిజమైన సారథి..
ఇంతకీ అప్పుడెప్పుడో అన్నట్టు గుర్తు..
వశిష్ఠ గోదావరి మధ్యలో వంతెన అని..
ఏమైంది.. అదా..
ఇదే దాని కథ.. గోదావరి జిల్లాల వ్యథ.

జిల్లాలు: ఉభయ గోదావరి, కోనసీమ
పంటుపై ప్రయాణం: 70 మీటర్లు
రోజూ ప్రయాణికులు : 12వేలకు పైనే

**ఇబ్బంది:** పంటు ఆగిపోతే 20 కి.మీ. చుట్టూ తిరిగి చించినాడ లేదా రావులపాలెం మీదుగా వెళ్లాలి.
**భయం:** వరదలు, విపత్కర పరిస్థితుల్లోనూ ప్రయాణం.
**పరిష్కారం:** వంతెన

**నిధులు మంజూరైనా..** నరసాపురం-సఖినేటిపల్లిని కలుపుతూ వంతెన నిర్మాణానికి గత తెదేపా హయాంలో రూ.196 కోట్లు మంజూరయ్యాయి. 2020లో వైకాపా ప్రభుత్వం రూ.450 కోట్లతో 2023 నాటికి పూర్తి చేస్తామన్నా.. పనే ప్రారంభం కాలేదు. 2023లో కేంద్రం మరోసారి రూ.580 కోట్లు మంజూరు చేసి 216 జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని సూచించింది. అయినా నేటికీ అడుగు పడలేదు.

### నలుగురు సీఎంల హామీ

✦ బ్రిటిష్ హయాంలో అంకురార్పణ జరిగిన వంతెన దశాబ్దాలుగా కలగానే మిగిలిపోయింది. ✦ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంతెన ప్రతిపాదన తెరమీదకు తెచ్చారు. ✦ తర్వాత ఎన్టీ రామారావు హయాంలో 1986లో నరసాపురంలో, తూర్పుగోదావరి జిల్లాలో శంకుస్థాపనలు చేశారు. ✦ 2003లో చంద్రబాబు, 2008లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు.

సమస్య పరిష్కారానికి చర్చలు జరుపుతున్నామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ తెలిపారు.

**ఆ ఒక్కటే కారణమా..**

వంతెన, అనుసంధాన రహదారుల నిర్మాణానికి సుమారు 56 హెక్టార్ల భూమి అవసరం. కోనసీమలో 36, జిల్లాలో 19.9 హెక్టార్ల భూమిని సేకరించారు. దిండి సమీపంలోని 216 జాతీయ రహదారి నుంచి రామేశ్వరంలోని వంతెన నిర్మాణ ప్రాంతం వరకు సుమారు 14 కి.మీ. అనుసంధాన రహదారి నిర్మాణానికి ప్రణాళిక చేశారు. రాజుల్లంకలో వంతెన నిర్మించనున్న ప్రాంతం నుంచి లక్ష్మణేశ్వరం, వై.ఎస్.పాలెం, సీతారామపురం మీదుగా 216 జాతీయ రహదారి వరకు సుమారు 7.5 కి.మీ. మేరకు పది మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మించేందుకు ప్రణాళిక చేశారు. గుడిమెళ్లంకలో ఓ వ్యక్తి రహదారికి తన భూమిని ఇవ్వనని న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారధి నిర్మాణం నిలిచి పోయిందని అధికారులు చెబుతున్నారు.

## తీసుకోకుంటే.. తీసేసుకుంటారు!

- స్మార్ట్‌కార్డులు పొందడంలో ఉదాసీనత
- నెలాఖరుతో ముగియనున్న గడువు

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రెండు నెలల క్రితం స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి పంపిణీ బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, రేషన్ డీలర్లకు అప్పగించింది. ఇప్పటికీ వేల సంఖ్యలో లబ్ధిదారులు కార్డులు తీసుకోలేదు. వీరిలో వలసెళ్లిన వారు అత్యధికులున్నారు. నెలాఖరులోపు కార్డులు పొందకుంటే వెనక్కి తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తోంది.

### ఏలూరులో అత్యధికం

| | |
|---|---|
| జిల్లాలో స్మార్ట్ కార్డులు | 6,14,879 |
| పంపిణీ చేసినవి | 5,86,152 |
| మిగిలిపోయినవి | 28,727 |

జిల్లాలోనే ఏలూరులో అత్యధికంగా 5,090 కార్డులను లబ్ధిదారులు తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత స్థానాల్లో చింతలపూడి 1,828, నూజివీడు 1,580, జంగారెడ్డిగూడెం 1,538, పెదవేగి 1,400, ఉంగుటూరు 1,271, ముదినేపల్లి 1,228, కొయ్యలగూడెం 1,135, కామవరపుకోట 1,133 ఉన్నాయి. అత్యల్పంగా వేలేరుపాడులో 381 మంది కార్డులు తీసుకోలేదు. 'స్మార్టు రేషన్ కార్డులు పొందాలంటే కుటుంబంలోని లబ్ధిదారుల్లో ఎవరో ఒకరొచ్చి బయోమెట్రిక్ వేసి ఓటీపీ చెప్పాలి. పంపిణీ చేయకుండా మిగిలిపోయిన కార్డులను తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలని ఆదేశాలొచ్చాయి. ఈ నెల 30 నాటికి తీసుకోకుంటే వెనక్కి పంపిస్తాం' అని డీఎస్వో విలియమ్స్ తెలిపారు.

## ఎన్టీఆర్‌తోనే బీసీలకు రాజకీయ గుర్తింపు: ఎంపీ

**వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే:** ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించాకే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీసీలకు రాజకీయ గుర్తింపు వచ్చిందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. వట్లూరు పంచాయతీ సీతాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో కూటమి ప్రజా రంజక పాలన అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్తున్నారని చింతమనేని కొనియాడారు.

మాట్లాడుతున్న మహేశ్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే

## సివిల్ పరీక్షార్థులకు ఉచిత శిక్షణ

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** బీసీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ (ప్రాథమిక), మెయిన్స్ పరీక్షార్థులకు ఉచిత శిక్షణనివ్వనున్నట్లు ఆ కేంద్రం సంచాలకురాలు ఆర్.వి.నాగరాణి తెలిపారు. ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు సోమవారం సాయంత్రం 5 గంటల్లోపు ఏలూరు వెన్నవల్లివారిపేటలోని అధ్యయన కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

## పాలకొల్లు.. దిబ్బరొట్టెకు పుట్టిల్లు!

నిప్పులపై కాల్చుతున్న వ్యాపారి

పాలకొల్లులో 50 ఏళ్లుగా అల్పాహార చక్రవర్తిగా ఏలుతున్న వంటకం ఏదైనా ఉందంటే అది దిబ్బరొట్టె. స్థానిక మారుతీ కూడలి కేంద్రంగా దిబ్బరొట్టె రుచిలో తరతరాలుగా ఎందరో మహానుభావుల మెప్పు పొందుతోంది. మూకిడిలో మినప పిండిని వేసి మూతపెట్టి నిప్పులపై కాల్చగా తయారయ్యే దిబ్బరొట్టెను పాలకొల్లుకు వచ్చిన సెలబ్రిటీలు సైతం తెప్పించుకుని రుచి చూస్తుంటారంటే అతిశయోక్తిలేదు. వేడివేడి చింతామణి చట్నీ (శనగపిండి చట్నీ)లో నంజుకు తింటూ మధ్యలో కాస్త గట్టి చట్నీ కూడా తగిలిస్తే నవరుచి తగిలిన నాలుక లొట్టల రూపంలో చేసిన శబ్దం విని అల్పాహార ప్రియుల పెదవులపై చిరునవ్వు విరబూస్తుంది. వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు అన్నివేళలా అందుబాటులో ఉంటుంది. - న్యూస్‌టుడే, పాలకొల్లు

## ఏ దారీతెన్నూ లేక.. చేయమని చెప్పలేక

✪ కొయ్యలగూడెం-కన్నాపురం మధ్య 7 కి.మీ. ప్రధాన రహదారి దుస్థితి ఇది. రోడ్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. మొంథా తుపానుకు ముందు గుత్తేదారు రహదారి అంచులు బాగు చేసే పనులు చేపట్టడంతో దారి కష్టాలు తీరాయని జనం సంతోషపడ్డారు. ఆ తర్వాత పనులు నిలిచిపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### రహదారుల అభివృద్ధిపై మీనమేషాలు

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** జిల్లాలో గుంతలు లేని రహదారుల కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. రెండు విడతలుగా పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. అధికారులేమో టెండర్లు అన్నారు.. వర్షాలు అన్నారు. వర్షాలు పోయాయి.. టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. నెలలు గడిచిపోతున్నా పనులు ప్రారంభించకుండా గుత్తేదారులు మీనమేషాలు లెక్కబెడుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు.

**అగ్రిమెంటులో గడువు లేదుగా..** గతంలో చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉందని, కనీసం పాత బిల్లులు చెల్లిస్తే కొత్త పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుందని గుత్తేదారు ఒకరు చెప్పారు. టెండరు దక్కించుకున్న గుత్తేదారు అగ్రిమెంటు రాసిన తర్వాత ఆ పనులను ప్రారంభించాల్సిన గడువు అంటూ నిబంధన ఏదీ లేదని, ఇదే అవకాశంగా కొందరు ఏదో ఒక సాకు చెబుతూ పనులను ఏళ్ల తరబడి సాగదీస్తున్నారని వివరించారు. ✪ పాత బకాయిలను త్వరలో చెల్లించనున్నట్లు ర.భ.శాఖ ఎస్ఈ విజయరత్నం చెప్పారు. కొత్త పనులను కొన్నిచోట్ల చేపట్టామని, మిగిలిన వాటిని చేస్తామని అన్నారు.

**గడిచిన నెల్లలో మంజూరైన కొన్ని రోడ్లు**

| మార్గం | పొడవు (కి.మీలు) | నిధులు (రూ.లక్షలు) |
|---|---|---|
| పోలవరం-కొయ్యలగూడెం | 7.60 | 340 |
| చింతలపూడి-రావికంపాడు(రెండు భాగాలు) | 14.00 | 622 |
| భీమడోలు-కామవరపుకోట | 1.80 | 200 |
| నూజివీడు-గన్నవరం | 5.40 | 250 |
| అడవినెక్కలం-వెల్వడం | 9.00 | 300 |
| బయ్యనగూడెం-రేగులకుంట | 8.40 | 300 |
| ఆడమిల్లి- ద్వారకాతిరుమల | 4.20 | 190 |
| యర్నగూడెం-పొంగుటూరు | 1.20 | 40 |
| నరసాపురం - అశ్వారావు పేట | 0.99 | 80 |

## ఆ రెండు చోట్లే సదరం

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జిల్లాలో నాలుగు పట్టణాల్లో ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నప్పటికీ ఏలూరు, నూజివీడులోనే సదరం శిబిరాలు జరిగే అవకాశం ఉంది. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో ఎముకలు, కంటి వైద్యులు లేకపోవడంతో సదరం సందిగ్ధంలో పడింది. చింతలపూడిలో అనుమతులు రావాల్సి ఉంది. సదరానికి శుక్రవారం నుంచే స్లాట్లు తెరిచినా.. సాంకేతిక సమస్యలు తలెత్తాయి. శుక్ర, శనివారాలలో సచివాలయానికి ఒకటి, రెండు మించి నమోదు కాలేదు. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో ఈ స్లాట్లు నమోదు చేసుకోవచ్చని డీసీహెచ్ఎస్ పాల్‌సతీశ్ తెలిపారు.

**బ్యాక్‌లాగ్..** సదరం స్లాట్స్ ఈ ఏడాది జులైలో విడుదల చేశారు. మళ్లీ 4 నెలల తరువాత ఇప్పుడు విడుదలయ్యాయి. అయితే గతంలో స్లాట్ నమోదు చేసుకొని పెండింగ్ ఉన్నవారికి ఈ క్యాంప్‌లలో ప్రాధాన్యం ఇస్తామని డీసీహెచ్ఎస్ చెప్పారు. జిల్లాలో సుమారు 35 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 3,500 మందికి సమస్య వస్తే రీసదరంలో పరీక్షలు చేయాల్సి వచ్చిందని డీఆర్‌డీఏ పీడీ జయరాజు తెలిపారు. వీరిలో పరీక్షలు పూర్తికాని వారికి ప్రస్తుతం చేస్తారన్నారు. కొత్తగా మరో రెండు వేల మంది వరకు విభిన్న ప్రతిభావంతులు ఉండవచ్చని పేర్కొన్నారు.

**ఏలూరులో..** ఎముకలు, కంటి, ఈఎన్‌టీ, మానసిక వికలాంగుల సదరం ఉంటుంది. **నూజివీడులో** ఆర్థో, కంటికి సంబంధించి చేస్తారు.

## ఇస్తారా.. ఇవ్వనంటారా!

**రాయితీ విత్తనాలకు ఎదురుచూపులు**

**దెందులూరు, ఏలూరు గ్రామీణ- న్యూస్‌టుడే:** రబీ సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలకు రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగు చివరి దశకు చేరుకుంది. వరి కోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రబీలో వరి, అపరాలు, మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నా.. ప్రభుత్వం మాత్రం రాయితీపై విత్తనాలిచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

### వ్యయ ప్రయాసలకోర్చి..

ఖరీఫ్‌లో వరి సాగనంతరం మినుము, పెసర సాగు చేసేందుకు జిల్లాలోని కొందరు రైతులు వ్యయ ప్రయాసలకోర్చి దూర ప్రాంతాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఫలితంగా కర్షకులపై అదనపు భారం పడుతోంది. వరి విత్తనాలు ఎకరాకు 25 కిలోలు, మినుము, పెసర 10-15 కిలోలు చల్లుతున్నారు. రబీలో మినుములు 70 వేల ఎకరాల్లో, అపరాలు 50 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు.

**మొంథా తుపానుతో..** ప్రస్తుత ఖరీఫ్‌లో 2.20 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మొంథా తుపాను, భారీ వర్షాలతో 5,700 ఎకరాల్లో వరి, అపరాల పంటలు దెబ్బతిన్నాయి. 11,613 మంది రైతులు నష్టపోయారు. తుపాను కారణంగా ఈ దఫా పెట్టుబడులు సైతం దక్కలేదని.. ప్రభుత్వం స్పందించి రాయితీపై విత్తనాలు అందజేయాలని అన్నదాతలు కోరుతున్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఏపీ సీడ్స్ సంస్థ జిల్లా మేనేజర్ అనితను వివరణ కోరగా.. రబీ సాగుకు సంబంధించి జిల్లాలో రాయితీ విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**రబీలో సాగు వివరాలిలా..**

| అందుబాటులోని విత్తనాలు | | క్వింటాళ్లలో |
|---|---|---|
| వరి ఎంటీయూ | 1121 | 1000 |
| | 1224 | 1000 |
| | 1638 | 3000 |
| మినుము 200 | పెసర | 200 |

10వ వర్ధంతి

మంచికి మారుపేరుగా
మమతానురాగాలు పంచిన మహోన్నత వ్యక్తి,
ఎందరికో ఆరోగ్యాన్ని అందించిన
సేవాతత్పరులు భువి నుండి దివికేగి
పది సంవత్సరములు గడిచిననూ
మీ మధుర స్మృతులు మరువలేకున్నాము.
సదా మీ జ్ఞాపకాలతో.....

కీ॥శే॥ డా॥ నందిగం వివేకానంద గారు
జననం 13-01-1954 చింతలపూడి, ప.గో॥జిల్లా. మరణం 08-12-2015

కుటుంబ సభ్యులు


(c) eenadu

## ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ జూనియర్, సీనియర్ అంతర్ జిల్లాల ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలు నూజివీడులోని సారథి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. నాకౌట్ విధానంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీలు జరుగుతాయని.. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపిక చేస్తామని రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. సీనియర్, జూనియర్, బాలుర, బాలికల విభాగంలో ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏంఎసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడేస్తాం.. గెలిచేస్తాం!

- చదువు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు
- పతకాల సాధనే లక్ష్యంగా ముందుకు

**ఏలూరు నగరం, న్యూస్‌టుడే**

వారు మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు. ఏలూరు ఆర్. ఆర్. పేటలోని శ్రీమతి ఈదర సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు. ఓ వైపు చదువు.. మరోవైపు క్రీడల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన వారు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో రాణించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు పి. కుటుంబరావు సహకారం.. పీఈటీలు ఎన్. లీలాకుమారి, జె. సునీత సూచనలతో మరింత రాటుదేలుతున్నారు.

**జాతీయ జట్టులో స్థానానికి..** నా పేరు బంకపల్లి రాజా కార్తిక్. పదో తరగతి చదువుతున్నా. నాన్న ఏసు లారీ చోదకుడు. అమ్మ దుర్గాంజనేయులు హోంగార్డుగా పని చేస్తున్నారు. నాలుగేళ్లుగా హాకీలో సాధన చేస్తున్నా. గోల్ కీపర్‌గా సత్తా చాటుతున్నా. చదువులోనూ ముందుంటున్నా. అనంతపురం, విశాఖపట్నం, మదనపల్లె, కాకినాడ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించా. త్వరలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యాన కడప వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నా. హాకీ జాతీయ జట్టులో స్థానం సాధించేందుకు నిత్యం శ్రమిస్తున్నా.

**అంతర్జాతీయ క్రీడాకారుడిగా..** నా పేరు కవలకుంట్ల మాధ్యూకేర్. పదో తరగతి చదువుతున్నా. నాన్న రాజు రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటారు. అమ్మ రాణి గృహిణి. ఆరో తరగతి నుంచే కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నా. కబడ్డీని ప్రధాన క్రీడగా ఎంచుకొని నిత్యం సాధన చేస్తున్నా. 2024లో జోనల్ స్థాయి ఖోఖో, అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించా. కబడ్డీలో అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా. తదనుగుణంగా రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నా.

**ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యం** నా పేరు మొత్రపు దొర బాబు. పదో తరగతి చదువుతున్నా. నాన్న సువర్ణరాజు రైతు. అమ్మ ప్రసన్న గృహిణి. 200, 400 మీటర్ల పరుగులో నిత్య సాధన చేస్తున్నా. గతేడాది పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం కైకరం, ఈ ఏడాది చీరాల, గుంటూరులో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించా. త్వరలో పల్నాడు జిల్లా వినుకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నా. చదువులోనూ మంచి మార్కులు సాధిస్తున్నా. ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్ విభాగంలో స్వర్ణ పతకమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.

## దివ్యాంగ బాలికకు నడకొచ్చింది

### కలెక్టర్ చొరవతో వైద్యం

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** దివ్యాంగురాలైన ఏడేళ్ల కుమార్తెకు పింఛను ఇప్పించాలంటూ పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన అంజలి సెప్టెంబరు 8న భీమవరంలోని కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చారు. ఆమె వెంట ఉన్న బాలికతో కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. సమస్య గురించి అడిగి తెలుసుకుని వెంటనే వైద్యం చేయించాలని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త కిరణ్‌కి ఆదేశించారు. ఫిజియోథెరపీ ద్వారా ఆ పాప పూర్తి స్థాయిలో నడవగలుగుతుందని సమాచారశాఖాధికారులు ఆదివారం తెలిపారు. జీవితంలో దివ్యాంగురాలిగా ఉండిపోతుందనుకున్న బాలిక కలెక్టర్ చొరవతో చికిత్స పొంది సాధారణ స్థితికి చేరడంపై అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## తపాలా ఉద్యోగులు ఐక్యంగా సాగాలి

**నిడదవోలు, న్యూస్‌టుడే:** గ్రామీణ తపాలా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఏపీ సర్కిల్ కార్యదర్శి వై. మధురెడ్డి అన్నారు. నిడదవోలులో ఆదివారం తాడేపల్లిగూడెం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘ సర్వసభ్య మహాసభను నిర్వహించారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రవీంద్ర, కార్యదర్శిగా ఎస్. రమేష్, కోశాధికారిగా పి. పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. దుర్గారావు, రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి పి. భూలోకం, ఏలూరు డివిజన్ కార్యదర్శి ఎస్ఎస్ బాజీ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు బీవీ రమణ, తాడేపల్లిగూడెం డివిజన్ పరిశీలకుడు శివకృష్ణ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన విశాఖ మహిళా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

## ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** క్రీడలు విద్యార్థులను చదువులో ముందు నిలపడమే కాకుండా, ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని క్రిసాలిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అండర్-19 నెట్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నియోజకవర్గంలో నిర్వహించడం ఈ ప్రాంతంలోని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతుందన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ జిల్లా జట్లతో తలపడ్డారు. బాలుర విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా.. తూర్పు గోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా, పశ్చిమగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్షణాల్లో.. మార్గదర్శనం!

- పాలకొల్లులో పంచారామ క్షేత్రానికి తెనాలి నుంచి వచ్చిన ఓ భక్తుడు స్వామి దర్శనం పూర్తయ్యాక తిరుగు ప్రయాణమయ్యారు. రైలు రావడానికి సాయంత్రం వరకు సమయం ఉండటంతో సమీపంలో చూడదగిన ఆలయాల కోసం సామాజిక మాధ్యమాల్లో వెతికారు. 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగొండ వాసవీమాత ఆలయ సమాచారంతో అక్కడకు వెళ్లేందుకు అనువైన ప్రయాణ సౌకర్యాలపై పదుల సంఖ్యలో వీడియోలు కనిపించాయి. వాటిలో ఉత్తమమైనవి ఎంపికచేసుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు.
- ద్వారకాతిరుమల వచ్చిన మరో భక్తుడు ఏలూరు జిల్లా ప్రత్యేకతలు అని చరవాణిలో టైప్ చేయగానే పోలవరం ప్రాజెక్టు నుంచి అంబికా దర్బార్ బత్తి వరకు 40 సెకన్లలో చెప్పేసే వీడియోలు బోలెడు కనిపించాయి. అవసరమైన వీడియోను వీక్షించి దానిలో ఉన్న చరవాణి నంబర్లకు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకునేలా యువత చేసిన వీడియోలు సహకరిస్తున్నాయి.

**పాలకొల్లు, న్యూస్‌టుడే**

ఉమ్మడి జిల్లాలో పల్లెల నుంచి పట్టణాల వరకు ఉన్న ప్రముఖ ఆలయాల విశిష్టత, చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన వీడియోలు ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ రీల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. యువ డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు కాలానికి అనుగుణంగా ఆయా విశేషాలను సంక్షిప్త వీడియోలుగా రూపొందిస్తున్నారు. వీటి ద్వారా సులభంగా జిల్లా ప్రత్యేకతలను స్థానికేతరులకు తెలియజేస్తున్నారు.

కొల్లేరులో పడవ షికారు

**ఆకట్టుకునేలా..** ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సామాజిక మాధ్యమాల్లో తమ స్వగ్రామాల వీడియోలను చూసి మన ఊరు ఇంతందంగా ఉందా అని పించేలా రీల్స్, షార్ట్స్, వ్లాగ్స్ రూపొందిస్తున్నారు. ప్రత్యేకించి గోదావరి అందాలు, మన్యంలో జలపాతాలకు సంబంధించిన డ్రోన్ వీడియోలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కొల్లేటి సరస్సు, గుంటుపల్లి గుహలు, నరసాపురంలో వలంధర రేవు, పంటు ప్రయాణం, పేరుపాలెం బీచ్‌లకు సంబంధించిన రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో ఉన్నాయి.

పర్యాటకుల కోసం పశ్చిమలో అతిథి గృహాలు

**సామాజిక మాధ్యమాల్లో జిల్లా ప్రత్యేకతలు**

**పశ్చిమ పేరుతో ఖాతాలు:** ఇలాంటి వీడియోలు ఉన్న సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ఎక్కువ శాతం పశ్చిమ గోదావరి పేరు కలిసేలా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పట్టణాల పేరిట కూడా బృంద ఖాతాలు కొనసాగుతున్నాయి. వీటిలో కొన్ని ఖాతాలను వేలాది మంది అనుసరిస్తుండటం విశేషం.

## స్ఫూర్తి ప్రదాత ఉయ్యాలవాడ

**మార్టేరు, న్యూస్‌టుడే:** స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మార్టేరు కూడలిలో ఏర్పాటు చేసిన నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం, దేశం కోసం పోరాడిన ఆయనకు బ్రిటీషు ప్రభుత్వం ఉరిశిక్ష వేస్తే.. ఇంతకంటే మీరేం చేయగలరంటూ చిరునవ్వుతో సమాధానమిచ్చిన యోధుడు నరసింహారెడ్డి అని చెప్పారు. సమర యోధుడికి ఇచ్చిన గౌరవమే ఈ విగ్రహావిష్కరణ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ దేశభక్తిలో నరసింహారెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు.

ఆవిష్కరించిన విగ్రహం వద్ద మంత్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే పితాని తదితరులు

## సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సనాతన సంప్రదాయ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శివ కేశవ పీఠం(తాడేపల్లి) సంస్థాపకులు మాతా శివానందసరస్వతి అన్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆదివారం భీమవరంలో హిందూ వన విహార్ కన్వీనర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మంతెన రామచంద్రరాజు ఆధ్వర్యంలో వేగిరాజు రామకృష్ణంరాజుతోట(ప్రకృతి ఆశ్రమం)లో ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధనలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్ర ప్రాంత ప్రచారక్ విజయాదిత్య మాట్లాడుతూ ధర్మాన్ని ఆచరించడమే హిందుత్వమన్నారు. పిల్లలకు మన ధర్మంలోని అంతరార్థం తెలియజేస్తే సంస్కారం అలవడుతుందన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలు కులమతాలకు అతీతంగా ఏర్పాటు చేయడంతో.. మన సంస్కృతిని తెలియజేసేందుకు దోహద పడతాయన్నారు. తొలుత ప్రాంగణంలో గోపూజ, కార్తిక దామోదర పూజలు నిర్వహించారు. శివుడు, నందీశ్వరుడు ప్రతిమలు, కూచిపూడి, దాండీ నృత్యాలు, సంగీత కచేరి, డోలు వాయిద్యాలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 15 వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, వివిధ సంస్థల ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మా అమ్మ.. మహాలక్ష్మమ్మ

### ఆదివారపుపేట జాతర ప్రారంభం

ఏలూరు నగరం ఆదివారపుపేటలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజు బాబుల జాతర ప్రారంభ సూచిగా ఆదివారం ముడుపు మహోత్సవం నిర్వహించారు. ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ అప్పలనాయుడు, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. చంటి ముడుపును శిరస్సుపై పెట్టుకొని.. శాస్త్రోక్తంగా క్రతువు పూర్తి చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి, వేడుకను తిలకించారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, జ్యోతి దంపతులు, కొలుపుల కమిటీ అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

జాతరలో భక్త జన సందోహం

## కరుణించమ్మా.. రాట్నాలమ్మ!

**రాట్నాలకుంట (పెదవేగి), న్యూస్‌టుడే:** రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. మహిళలు రాట్నాలమ్మకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ. 1,11,320 ఆదాయం లభించిందని పాలకమండలి ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో ఎన్. సతీశ్‌కుమార్ తెలిపారు.

రాజోలులో మాట్లాడుతున్న రాంబాబు

## కళాకారుల సంక్షేమానికి కృషి

**రాజోలు, న్యూస్‌టుడే:** కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్ర కళాకారుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచంట రాంబాబు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల కళాకారుల సంక్షేమ సంఘ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధ కళాకారులకు అందిస్తున్న రూ. 4 వేల పింఛనును రూ. 6 వేలకు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# నిధులిచ్చినా.. కదలరేం..

### ఆర్అండ్ఆర్‌లో సిబ్బంది నిర్లక్ష్యం

### ముంపు భూముల సేకరణకు యత్నాలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలే దృఢ సంకల్పంతో ఉంది. ఈ క్రమంలోనే ఇటీవల రూ. వెయ్యి కోట్లు పరిహారాన్ని నిర్వాసితులకు అందజేశారు. గడువు కంటే ఆర్నెళ్లు ముందే పునరావాసం పూర్తి చేయాలనే లక్ష్యంతో భూసేకరణపై ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. అల్లూరి జిల్లా పరిధిలోని నిర్వాసితుల కోసం ఏలూరు జిల్లా మన్యంలో సేకరిస్తున్నారు. సుమారు 1,900 ఎకరాల సేకరణకు ప్రకటన విడుదలైంది. ఈ సమయంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, తప్పులు.. పనులకు ప్రతిబంధకంగా మారాయి.

**ముంపు భూమిని కూడా..**

కూనవరం మండలంలోని పంద్రాజుపల్లి నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి మండలం గోపాలపురం రెవెన్యూ పరిధిలో సుమారు 83.17 ఎకరాల భూసేకరణకు ఇటీవల ప్రాథమిక ప్రకటన ఇచ్చారు. ఇందులో సుమారు 10.63 ఎకరాలను ఉపసంహరణ చేస్తున్నట్లు మరో ప్రకటన విడుదల చేశారు. తీరా చూస్తే ఉపసంహరణ ప్రకటన ఇచ్చిన భూమి చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం గతంలోనే సేకరించిందని కావడం గమనార్హం. ఈ విషయాన్ని రెండో ప్రకటనలో భూ సేకరణ అధికారులే వెల్లడించారు. ఒకసారి సేకరించిన భూమికి 2వ పర్యాయం ప్రకటన ఇవ్వడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది.

సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేసి ఎస్‌డీసీ సతీశ్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

**సొమ్ములు ఇవ్వలేదని..** స్పెషల్ కలెక్టర్ అడిగినంత తాము ఇవ్వలేదని కోయరాజమండ్రిలో భూసేకరణను ఆపేశారంటూ వేదాంతపురం రైతులు ఇటీవల ఆరోపించారు. భూసేకరణకు 20 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు ఇటీవల బాహాటంగా ఆరోపించారు.

**గిరిజనుల అభ్యంతరంతో..** గోపాలపురం భూములను సాధారణ విధానంలో కాకుండా కన్‌సెంట్ అవార్డు ద్వారా వేగంగా సేకరించాలని స్పెషల్ కలెక్టర్ సరళావందనం ప్రయత్నించారు. చింతూరు ఎస్‌డీసీని కాదని.. కొవ్వూరు ఎస్‌డీసీ సతీశ్‌కు ఈ పనులు అప్పగించారు. ఆయన సర్వే చేపట్టగా.. గిరిజనులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. కన్‌సెంట్ విధానంలో సేకరించాలని స్పెషల్ కలెక్టర్ తనను ఆదేశించడంతోనే తాను సర్వే చేపట్టానని ఎస్‌డీసీ సతీశ్ పేర్కొన్నారు. కేవలం పది, పదిహేను రోజుల్లోనే అవార్డు జారీ చేయాలని యత్నించారు. కాగా స్పెషల్ కలెక్టర్ బదిలీతో దీనికి గండి పడింది.

**విరమణ లోపు..** పదవీ విరమణకు కొద్ది కాలమే గడువు ఉండటంతో ఈ లోపే తన విస్తృత అధికారాలతో చక్రం తిప్పాలని ఓ అధికారిణి బాగా తాపత్రయపడినట్లు సమాచారం. తప్పులు దొర్లడానికి ఇవే కారణాలన్న విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం కూడా సాగనంపింది.

## గుంతలపూడి రోడ్డు!

చింతలపూడి-జంగారెడ్డిగూడెం రహదారి టి. నరసాపురం వరకు పది కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. వానొస్తే అవస్థలు తీవ్రం. జంగారెడ్డిగూడెం, రాజమహేంద్రవరానికి ఇదే రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. గత పదేళ్లుగా చిన్న చిన్న మరమ్మతులు మినహా రహదారి నిర్మించిన దాఖలాలు లేవు. ఇటీవల మరమ్మతుల పేరుతో అక్కడక్కడ గుంతలు పూడ్చినా.. కొద్ది రోజులకే అతుకులు బయటపడ్డాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు వెళ్లడం కూడా కష్టంగా మారిందని, రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. 'ఇటీవల గుత్తేదారులతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సమావేశమయ్యారు. వచ్చే సంక్రాంతిలోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.' అని ఆర్అండ్‌బీ డీఈ శ్రీకర్ తెలిపారు. - న్యూస్‌టుడే, చింతలపూడి పట్టణం

## పెట్రోలు కల్తీ చేశారంటూ సిబ్బందిపై దౌర్జన్యం

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** పెట్రోల్ కల్తీ చేశారంటూ కొంత మంది వ్యక్తులు బంకు సిబ్బందిపై దౌర్జన్యం చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు వద్ద ఉన్న కె. జగ్గవరం సొసైటీ పెట్రోలు బంకులో శనివారం రాత్రి పోతేపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేశారు. వారి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పెట్రోలు బంకులో పంపుల వద్ద పెట్రోలు చల్లుతూ తగలపెడతామంటూ బెదిరించారు. దాడికి పాల్పడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందాయి. దీనిపై సొసైటీ ఛైర్మన్ బొంతు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తడికలపూడి ఎస్సై చెన్నారావు ఆదివారం సంఘటన స్థలాన్ని తనిఖీ చేశారు. పెట్రోలు కల్తీని పరిశీలించారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని ఎస్సై వివరించారు.

నాణ్యత పరిశీలిస్తున్న పోలీసులు

## కళాశాల వంట గదిలో విద్యార్థి బలవన్మరణం

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడు మండలంలోని మిట్టగూడెం బీసీసీఏ కళాశాల విద్యార్థి పానం నందనకుమార్(19) ఆదివారం వసతి గృహం వంటగదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం బత్రావారిగూడేనికి చెందిన నందనకుమార్ కళాశాల వసతిగృహంలో ఉంటూ బీసీసీఏ సెకండ్ లెవల్ తరగతులకు హాజరవుతున్నాడు. కళాశాల వంటగదిలో ఐరన్‌రాడ్‌కు విద్యుత్తు తీగలు కట్టి ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. వసతిగృహంలో మిగిలిన ఆహార పదార్థాలను పందుల మేత కోసం తీసుకెళ్లే వ్యక్తి ఉదయం వంటగదిలోకి వెళ్లి ఈ విషయాన్ని గుర్తించాడు. వెంటనే కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. యాజమాన్యం మృతుని తల్లిదండ్రులకు, రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో నందన్‌కుమార్ వసతిగృహం నుంచి బయటకు వెళ్లడం చూశామని, తరువాత ఏం జరిగిందో తెలియదని సహచర విద్యార్థులు చెబుతున్నారు. కళాశాల ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. మృతుని తండ్రి అచ్యుతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. తరగతి గదుల్లో సహచర విద్యార్థులతో ఉత్సాహంగా, చదువులోనూ ముందంజలో ఉండే వ్యక్తి ఉరి వేసుకోవడంపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రేమ వ్యవహారమా లేక విద్యార్థుల మధ్య ఏవైనా ఘర్షణలు జరిగాయా, చదువులో ఒత్తిడి ఎదుర్కొంటున్నాడా తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

నందనకుమార్ (పాత చిత్రం)

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.


**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ఏలూరు జిల్లా**
**స్వల్పకాల టెండరు ప్రకటన**

రిఫ్ నెం. P.Proc/65/Tarpaulins/2025-26-2 తేది: 16.11.2025.

ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లాలో గల రైతు సేవా కేంద్రముల ద్వారా రైతులకు పంపిణీ చేయుట కొరకు 2,600 టార్పలిన్లు కొనుగోలుకై www.neml.in website ద్వారా టెండర్లు కోరడమైనది. కొనుగోలు చేయబడిన టార్పలిన్లు ఏలూరు జిల్లాలో నిర్ణయించబడిన ప్రదేశాలకు సరఫరా చేయవలెను.

ఆసక్తిగల టెండరులు www.apscscl.in లేదా www.neml.in వెబ్‌సైట్‌ను సందర్శించి టెండర్ పత్రాలను ఉచితంగా వీక్షించవచ్చు మరియు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

టెండర్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు కస్టమర్ సర్వీస్ గ్రూప్ ను ఫోన్ నంబర్లు (+91-22) - 48810500 / 9962059599 / 9032429420 లేదా ఇమెయిల్: askus@neml.in ద్వారా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్ టెండర్లను సమర్పించడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మరియు ఫార్మాలిటీలను పూర్తి చేయడానికి చివరి తేదీ 19.11.2025 సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుంది. దీనికి సంబంధించిన వివరాల కొరకు తేదీ:18.11.2025 సమయం: మధ్యాహ్నము 03.00 గంటలకు Pre-Bid Meeting (Virtual Mode) లో నిర్వహించబడును. సంబంధిత అధికారి వివరాలు పేరు: K చంద్రశేఖర్ AM (జనరల్) Cell No: 9963479152.

Sd/- Dr. అభిషేక్ గౌడ. M.J, I.A.S
సంయుక్త కలెక్టర్ మరియు ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏలూరు జిల్లా.


## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** వాల్టా చట్టానికి అక్రమార్కులు ఎక్కడికక్కడ తూట్లు పొడుస్తున్నా అధికార యంత్రాంగం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తోంది. నూజివీడులో మామిడి తోటలను యథేచ్ఛగా నరికేస్తూ లారీలపై టింబర్ డిపోలు, ఇటుక బట్టీలు, బొగ్గు తయారీ, వివిధ పరిశ్రమల అవసరాల నిమిత్తం తరలిస్తున్నారు. పొలాల్లో రహదార్ల పక్కన ఉన్న మారుజాతి కర్ర తరలిపోతుంది. విద్యుత్తు సిబ్బంది తీగలకు అడ్డు వస్తున్నాయని మరి కొన్ని చెట్లను నరికివేస్తున్నారు.



నూజివీడులో రహదారి పక్కన లోడు చేస్తున్న మామిడి కలప

**సగానికి పడిపోయిన విస్తీర్ణం..** ధర, తెగుళ్ల బెడదతో మామిడి రైతులు ఏటా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీంతో తోటల నరికివేతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 60 వేల హెక్టార్లలో ఉండాల్సిన మామిడి సగానికి పడిపోయింది.

**నిబంధనలు ఇవే..** ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పొలాలు, రహదారులు, కొండలు, కాలువ గట్లపై చెట్లు నరికి వేయాలంటే వాల్టా చట్టం ప్రకారం తహసీల్దారు అనుమతి పొందాలి. రెవెన్యూ అధికారులు పరిశీలించి అటవీశాఖ అధికారులకు నివేదిక పంపుతారు. కొంత సొమ్మును చలానా రూపంలో చెల్లించాలి. ఈ అనుమతి దక్కిన తరువాత చెట్లను నరకాలి. వ్యాపారులే అంతా తామై రైతుల పేరుతో అనుమతులు తీసుకుని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 'అటవీ ఉత్పత్తులు తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలో ఉన్న కలప ఇటువైపు వస్తుంది. వాటి అనుమతులు పరిశీలిస్తున్నాం' అని నూజివీడు అటవీశాఖ రేంజర్ సత్యనారాయణ తెలిపారు.

## బైండోవర్లతో సారా కట్టడి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో సారా తయారీ, విక్రయాల కార్యకలాపాలను పూర్తిగా అడ్డుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ జిల్లా అధికారి ఎ. ఆవులయ్య అన్నారు. లింగపాలెం మండలం వేములపల్లి, రేచర్లలో ఆదివారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. సారా కాచి విక్రయించిన కేసుల్లో 9 మందిని బైండోవర్ చేశామన్నారు. టి. నరసాపురం, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో మరో 11 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. సారా కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నవోదయ 2.0పై ముద్రించిన గోడ, కరపత్రాలు ఆవిష్కరించి స్థానికులకు పంచిపెట్టారు.


**92.7 FM Rajamahendravaram** ఈ FM 92.7 Mee FM
**ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు**
**సోమవారం నుంచి శుక్రవారం**

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

**EENADU Classifieds**

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

PLOT FOR SALE

తణుకు, వేమవరం 10వ వార్డులో, చిట్టూరి బాపినీడు గారి ఇంటి వెనుక లేఔట్‌లో తూర్పున పంటకాలువ ఉన్న N/E కార్నర్ ఈశాన్య ప్లాట్ (నెం.42) 253 చ॥గజాలు అమ్మకానికి కలదు. మున్సిపాలిటీ వారిచే క్రమబద్ధీకరణ చేయించడమైనది. ✆ 8639 779 569.

JOBS

Vijnana Bharathi EM High School, China amiram. Wanted Vice Principal. Contact Number: 95421 76926. Mail: vbbvkca@gmail.com.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం


(c) eenadu

# ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

## 'మొంథా' బాధితులను ఆదుకోండి

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను, ఉపాధి కోల్పోయిన వృత్తిదారులు, వ్యవసాయ, మత్స్య కార్మికులకు నష్టపరిహారం, నిత్యావసర సరకులు అందజేసి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ నేత తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. బలరాం మాట్లాడుతూ.. తుపాను కారణంగా ఒక్కో రైతు ఎకరాకు 5-10 బస్తాల మేర దిగుబడులు నష్టపోయినట్లు అధికారులు లెక్కలు వేశారన్నారన్నారు. తదనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సన్న, చిన్నకారు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి, నాయకులు ప్రసాద్, లింగరాజు, నాగమణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ భావం పెంచుదాం

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో జాతీయ భావం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారతీయ ఉపాధ్యాయ సంఘం జాతీయ కార్యదర్శి జి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. స్థానిక శాంతినగర్‌లో సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ అధ్యక్షత వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమలవుతున్న జాతీయ విద్యా విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ పటిష్ఠంగా అమలయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయులపై ఒత్తిడికి కారణమవుతున్న నాన్ అకడమిక్ అంశాలను పూర్తిగా తగ్గించాలని కోరారు. పరీక్ష విధానాల్లో మార్పులు తేవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు కె.రాజకుమార్, సతీశ్‌కుమార్, ఆర్.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం

**పెదవేగి, న్యూస్‌టుడే:** ఏలూరు కెనాల్ రోడ్డులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్, కార్యదర్శి అంజనాదేవి, ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా తేరా ప్రభాకర్, పొలిరెడ్డి వెంకటరమణ, ఆర్థిక కార్యదర్శిగా మేకా లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేరా ప్రసాద్‌ను సత్కరించారు.

## అంజన్న సేవలో పుల్లారెడ్డి

**అప్పనవీడు (పెదపాడు), న్యూస్‌టుడే:** అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఏపీ పీసీపీఎల్ ఛైర్మన్ పుల్లారెడ్డి దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని తమలపాకు పూజలు చేశారు. అంతకుముందు వారికి ఆలయాధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.

### ఏలూరు సినిమాలు

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | కాంత |
| అంబిక మినీ | ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ |
| సాయిబాలాజీ | శివ |
| బాలాజీ | గత వైభవం |
| సత్యనారాయణ స్క్రీన్ 1 | కాంత |
| సత్యనారాయణ స్క్రీన్ 2 | గోపి గాళ్ల గోవా ట్రిప్ |
| సత్యనారాయణ స్క్రీన్ 3 | మాస్ జాతర |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | జిగ్రీస్ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | సంతాన ప్రాప్తిరస్తు |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | లవ్ ఓటీపీ |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | కాంత |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | సంతాన ప్రాప్తిరస్తు |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 | కాంత |

## ఏలూరా.. దోమలూరా!

● బెంబేలెత్తుతున్న నగర వాసులు ● నివారణలో అధికారుల విఫలం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

ఏలూరు నగరంపై దోమలు యుద్ధం ప్రకటించాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయి. వారికి కంటిమీద కునుకు వేయనీకున్నాయి. నగరంలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. 2.50 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ముఖ్యంగా వంగాయగూడెం, చిట్టివలసపాక, ఆముదాల అప్పలస్వామి కాలనీ, గాంధీ కాలనీ, సుబ్రహ్మణ్యం కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, పడమర వీధి, రాజీవ్ గృహ కల్ప కాలనీ తదితర ప్రాంతాల్లో దోమల మోత మోగిస్తున్నాయి.

☛ ఏలూరు నగరం తంగెళ్లమూడిలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్యనున్న కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. రోజుల తరబడి మురుగు ముందుకెళ్లడం లేదు. దుర్వాసన రావడంతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

### అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు

నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో పారిశుద్ధ్య సిబ్బంది ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షానికే నీరెళ్లే దారిలేక.. రోడ్లపైకి చేరుతోంది. కొన్నిచోట్ల డ్రెయిన్లలో చెత్తా చెదారం పడేస్తుండటం.. వాటిని శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఆయా ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రస్తుత వాతావరణ మార్పులతో.. కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. నగర వాసులు టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర జ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

### ఫాగింగ్ ఏదీ?

దోమల నివారణకు నగరపాలక సంస్థ అధికారులు తరచూ ఫాగింగ్ చేయించాల్సి ఉంది. వీధుల్లో ఎబేట్ పిచికారీ చేయించాలి. మురికి కుంటలు, డ్రెయినేజీల్లో దోమ లార్వాలు తినే గంబూషియా చేపలు విడిచి పెట్టడం, తరచూ బ్లీచింగ్ చల్లించడం, మురుగునీరున్న చోట ఆయిల్ బాల్స్ వదలడం తదితరాలు చేయాల్సి ఉండగా.. ఆ ప్రక్రియ ఎక్కడా సవ్యంగా సాగడం లేదు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. 'నగరంలో దోమల నివారణకు ఎప్పటికప్పుడు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. బ్లీచింగ్, ఫాగింగ్ తదితరాలు చేయిస్తున్నాం' అని ఉప కమిషనర్ శివారెడ్డి తెలిపారు.

☛ ఏలూరు పవరుపేట చిట్టివలసపాక ప్రాంతంలోని డ్రెయినేజీలో మురుగు పేరుకుపోయిన దృశ్యమిది. ఇక్కడ కాలువలు నిర్మించకపోవడంతో.. మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దోమలు విజృంభిస్తుండటంతో.. రాత్రివేళ కంటిమీద కునుకు వేయలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| ఏలూరు అర్బన్: | 80085 74486 | ఏలూరు టూటౌన్: | 80085 74487 |
| దెందులూరు: | 80085 74535 | పెదపాడు, పెదవేగి: | 80085 74483 |
| భీమడోలు: | 80085 74527 | నిడమర్రు గ్రామీణం: | 97040 21765 |
| ఉంగుటూరు: | 94939 90333 | గణపవరం: | 99480 66777 |

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ? వెంకట్రామ థియేటర్ ఎదురు రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - **రంగారావు, స్థానికుడు**

✔ మరమ్మతులు చేయిస్తాం. - **పవన్, విద్యుత్తు ఏఈ**

**దెందులూరు, న్యూస్‌టుడే:** ? గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల వద్ద చెత్తాచెదారాలు పడేస్తున్నారు. - **కృష్ణకుమార్**

✔ పారిశుద్ధ్య కార్మికులు పని మానేశారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం. - **స్టానిష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

## ఆధార్ నమోదు శిబిరాల్లో అపార్ జారీ

ఈనాడు కథనానికి స్పందన

**భీమడోలు, న్యూస్‌టుడే:** జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఈ నెల 29 వరకు నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాల్లో విద్యార్థులందరికీ అపార్ విశిష్ట సంఖ్యలు అందజేస్తామని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. 'అపారమైన కష్టాలు' శీర్షికన ఈ నెల 15న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ మేరకు ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు.

## యాదవులు ఆర్థికాభివృద్ధికి చేయూత

**దెందులూరు, న్యూస్‌టుడే:** యాదవులు విద్య, వ్యాపార, సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రాంగణంలో జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యాన ఆదివారం యాదవ కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత కార్తిక దామోదరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి మాట్లాడుతూ.. బీసీలకు తెదేపా ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్తిక మాసంలో నిర్వహించే వనసమారాధనలు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. అనంతరం పిల్లలు, యువతీ, యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాయకులు మహేశ్ యాదవ్, వెంకటేశ్వరరావు, చింతయ్య పాల్గొన్నారు.

పాల్గొన్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఎంపీ మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే చంటి తదితరులు

## పేదల విద్యా ఉన్నతికి తోడ్పాటు

**పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే:** జానంపేటలోని విజయా గార్డెన్స్‌లో ఆదివారం కమ్మవారి సేవా సమితి కార్తిక వనసమారాధనను సందడిగా నిర్వహించారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరమాచనేని ప్రభాకర్, ఆయన సహచరుల ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై.. జ్యోతి వెలిగించి చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. కమ్మవారి సేవా సమితి తరఫున ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన పిల్లల విద్యా ఉన్నతికి తోడ్పాటునందించాలన్నారు. వీలైనంత ఎక్కువ మందికి ఉపకార వేతనాలు అందజేయాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలకృష్ణారావు, రాంబాబు, శ్రీనివాసరావు, రాజేశ్, అంకమ్మ చౌదరి తదితరులు మాట్లాడారు.

జ్యోతి వెలిగిస్తున్న భాజపా నేత సీతారామాంజనేయ చౌదరి, చింతమనేని, నిర్వాహకులు తదితరులు

## ఐక్యతకు వన సమారాధనలు దోహదం

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** సామాజిక వర్గాల ఐక్యతకు కార్తిక వన సమారాధనలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కైకరంలో కాపు సేవా సంఘం, నారాయణపురంలో కళింగ సేవా సంఘం ఆధ్వర్యాన వేర్వేరుగా కార్తిక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉంగుటూరులో కులాలు, రాజకీయాలకు అతీతంగా వన సమారాధన ఏర్పాటు చేశారు. కైకరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొని మాట్లాడారు. నారాయణపురంలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన వనసమారాధనకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాద్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చేబ్రోలులో గౌడ-శెట్టి బలిజ సంక్షేమ సంఘం వనసమారాధన చేపట్టారు.

ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరిస్తున్న నాయకులు

## సనాతన ధర్మంలో గోవుకు విశిష్ట స్థానం

**నాచుగుంట(ఉంగుటూరు):** భారతీయ సనాతన ధర్మంలో గోవుకు విశిష్ట స్థానముందని.. కామధేనువుగా ప్రతి ఇంట్లో పూజలందుకుంటోందని ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త గరికిపాటి గురజాడ అన్నారు. నాచుగుంటలోని శ్రీగోపాలకృష్ణ గోశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. తొలుత గోపూజ, మహారుద్ర హోమం చేశారు. గురజాడ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ సహప్రాంత ప్రచారక్ జనార్దన్ జీ, గోశాల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, రాఘవులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గురజాడ

## నేత్రపర్వంగా గంగా హారతి

**భీమడోలు, న్యూస్‌టుడే:** స్థానిక గోదావరి(ఏలూరు) కాలువ గట్టుపైనున్న శివ పీఠంలో శివస్వాములు గంగా హారతిని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఓంకారం, శివలింగం, త్రిశూలం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

**గణపవరం:** వల్లూరు శివాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధనలో పాల్గొని మాట్లాడారు.

**ఉంగుటూరు:** బాదంపూడిలోని భక్తాంజనేయ స్వామిని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, దాతలు కలిసికట్టుగా ఆలయాన్ని పునర్నిర్మించడం అభినందనీయమని కొనియాడారు.

ఓంకారం, లింగాకారాల్లో వెలిగించిన దీపాలు

### ఎక్కడుంటారో.. ఎప్పుడొస్తారో

గణపవరం శాఖా గ్రంథాలయాన్ని ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూసి ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడి గ్రంథ పాలకురాలిని నిడమర్రు ఇన్‌ఛార్జిగా నియమించడంతో సమస్య నెలకొంది. దీనికి తోడు పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేయిస్తామని ఈవో ప్రసాద్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

### ఊయల.. ఊగేదెలా?

ఏలూరు నగరం రామచంద్రరావుపేటలోని ఎన్టీఆర్ ఉద్యానంలో పిల్లలు ఆడుకునే ఊయలలు, ఇతర ఆట పరికరాలు విరిగిపోయాయి. చిన్నారులు ఏమాత్రం అలసత్వంగా ఉన్నా.. పడిపోయే ప్రమాదముంది. దీనికితోడు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో.. పిల్లలను ఉద్యానానికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు**

### దారి చూడండి.. గోతులు పూడ్చండి

ఏలూరు పడమర లాకులు రైల్వే కింది వంతెన నుంచి సీఆర్‌ఆర్ కళాశాల వైపు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, నగరవాసులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు గోతులు తప్పించబోయి అదుపు తప్పి పడిపోతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

### మూస్తారా.. వదిలేస్తారా

నిడమర్రు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్డి గొయ్యి పైకప్పు దెబ్బతింది. ఇటీవల ఆ పైకప్పు తొలగించి వదిలేశారు. దాని పక్కనే పిల్లల సైకిల్ స్టాండు ఉంది. నిత్యం పదుల సంఖ్యలో విద్యార్థులు సైకిళ్లు పెట్టేందుకు, తీసుకెళ్లేందుకు వస్తుంటారు. ఏమాత్రం ఆదమరిచినా గొయ్యిలో పడిపోయే ప్రమాదముంది. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

### కాలువల చెంత.. పిచ్చిమొక్కల చింత

ఏలూరు జిల్లా పరిషత్తు, ఇండోర్ క్రీడా మైదానం ప్రహరీని ఆనుకొని డ్రెయినేజీ చెంత పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మురుగు ముందుకెళ్లకపోవడంతో దుర్వాసన వస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల సమీపాన పారిశుద్ధ్యం లోపించడంతో.. ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

మాట్లాడుతున్న ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు

## పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్: గన్ని

**గణపవరం, న్యూస్‌టుడే:** దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల హబ్‌గా మారిందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. అర్ధవరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర దిశదశ మార్చనుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికొచ్చేందుకు భయపడే వారన్నారు. వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భరోసా నిస్తూ.. పెట్టుబడులు తీసుకొస్తున్నారని కొనియాడారు. రూ.లక్షల కోట్లతో ఏర్పాటయ్యే పరిశ్రమలతో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. నాయకులు రామకృష్ణంరాజు, ముత్యాలస్వామి, పెద్దిరాజు, కోదండ రాంబాబు, వాసురాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## దాటిస్తుందా.. పడేస్తుందా!

● శిథిలావస్థకు చేరిన వంతెనలు
● బిక్కుబిక్కుమంటూ రాకపోకలు

**వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే:** పెదపాడు మండలంలోని ర.భ.శా. రహదారులపై పలుచోట్ల నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు శిథిలావస్థకు చేరడంతో.. ఆయా వారధులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చోటుచేసుకున్న ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలుండగా.. కొందరు క్షతగాత్రులయ్యారు. పాతముప్పర్రు- వీరమ్మకుంట మార్గంలోని వంతెన వద్ద చేపల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి కొల్లేరు కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో భీమవరానికి చెందిన ఇద్దరు కూలీలు మృతి చెందారు. కొత్తూరు- పెదపాడు మార్గంలోని వట్లూరు సమీప వంతెనపై రహదారి ఇరుకుగా ఉండటంతో.. ఎదురొచ్చిన వాహనాన్ని తప్పించబోయి లారీ రక్షణ గోడను ఢీకొంది. ఈ ఘటనలో క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

**ఎక్కడెక్కడ అంటే..**

పాతముప్పర్రు- కొత్తూరు, పెదపాడు- వీరమ్మకుంట, పెదపాడు- కొత్తూరు ర.భ.శా. రహదారుల పైనున్న వంతెనలు దెబ్బతిన్నాయి. వాటికి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం, ఒకట్రెండు చోట్ల ఉన్నా.. శిథిలావస్థకు చేరాయి. ఆయా మార్గాల్లో ఎప్పుడు ఏం జరుగుతోందని చోదకులు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. 'ప్రమాదకర వంతెనలకు మరమ్మతులు చేయిస్తాం. దెబ్బతిన్న రక్షణ గోడలను పునర్నిర్మిస్తాం. అవసరమైన చోట్ల వారధులు విస్తరిస్తాం' అని ర.భ.శా. ఏఈ శేషుకుమార్ తెలిపారు.

పాతముప్పర్రు- కొత్తూరు ర.భ.శా. రహదారి మార్గం మధ్యలోని వట్లూరు మురుగు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్న దృశ్యమిది. రాత్రివేళ వాహనదారులు రోడ్డు అంచున వెళితే.. కాలువలో పడిపోయే ప్రమాదముంది.

పెదపాడు- వీరమ్మకుంట మార్గం మధ్యలోని బాగినీడుపాకలు కాలువపై ఏర్పాటు చేసిన వారధి శిథిలావస్థకు చేరింది. వంతెన ఓవైపు కుంగిపోవడంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

## మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

**భీమడోలు, న్యూస్‌టుడే:** పోలసానిపల్లి పంచాయతీ చందుబాణం చెరువులో చేపడుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు అంబటి దేవి, పలువురు ఆయకట్టు రైతులు ఆదివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో తరచూ మట్టి తవ్వేస్తూ.. అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం ఆదివారం జిల్లా వ్యాప్తంగా వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాల్లేని చోదకులకు ఈ-చలానాలు విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఆలయాలు, ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

## బాగు చేస్తారా.. ప్రాణాలు తీస్తారా!

**ఎన్‌హెచ్ అధికారులపై ఘంటా అసహనం**

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న జాతీయ రహదారులను బాగు చేస్తారా? అలాగే వదిలేసి అమాయకుల ప్రాణాలు తీస్తారా అని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అసహనం వ్యక్తం చేశారు. దెందులూరు సమీప జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రమాదవశాత్తు జారి పడి గాయపడ్డారు. అదే సమయంలో నారాయణపురం పర్యటనకు వెళ్తున్న పద్మశ్రీ.. తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. వారిని తన సిబ్బందితో ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఎన్‌హెచ్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ప్రమాదాలు సంభవించకుండా తక్షణం రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పద్మశ్రీ తదితరులు

## బొమ్మను గీసి.. ప్రాణం పోసి!

**భీమడోలు, న్యూస్‌టుడే:** స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అంతకుముందు గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు అభివృద్ధి కమిటీ సభ్యులు నివాళులర్పించారు. గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్, అభివృద్ధి కమిటి అధ్యక్షుడు టి.ఉమామహేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, చైల్డ్ రైట్స్ అడ్వకసి జిల్లా సమన్వయకర్త వినోద్, ఉపాధ్యాయుడు జటావల్లభుల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

**ఏలూరు గ్రామీణ:** స్థానిక అగ్రహారంలోని బాలల గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణ, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

భీమడోలు: గీసిన చిత్రాలతో విద్యార్థులు

## గుర్తుతెలియని వృద్ధుడి మృతి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** స్థానిక బడేటివారి వీధిలోని ఓ దుకాణం ముందు సుమారు 60 ఏళ్ల వయసున్న వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనారోగ్యంతో వృద్ధుడు మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఆయన వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంపై కేసు

**పెదపాడు:** ఏలూరుకు చెందిన జుజ్జువరపు వెంకట కృష్ణకుమార్ ఈ నెల 11న వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై గుడివాడ వెళ్లారు. తిరిగి నగరానికి వస్తుండగా.. మార్గం మధ్యలోని తాళ్లమూడి వద్ద గుర్తు తెలియని కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ఆయన్ను స్థానికులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎన్.గజపతిరావు తెలిపారు.

## ఆరబోతకు ఇంకో దారి లేక!

**వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే:** రహదారులు కల్లాలుగా మారుతున్నాయి. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు.. ఇటీవల పంట కోతలు ప్రారంభించారు. పెదపాడు మండలం వట్లూరులో సుమారు ఆరొందల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 20-24 టన్నుల మేరకు దిగుబడి వస్తుందని అంచనా. ఈ స్థాయిలో ధాన్యం రాశుల్ని ఆరబెట్టేందుకు గ్రామంలో సరైన స్థలాల్లేవు.

పెదపాడు మండలం వట్లూరులో జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై ధాన్యం ఆరబోసిన చిత్రమిది. ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ధాన్యాన్ని గమనించక వేగంగా వెళ్తూ.. అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

### ఏ మాత్రం జాగ్రత్త లేకున్నా..

తప్పనిసరి పరిస్థితుల్లో రహదారులనే కల్లాలుగా వినియోగిస్తున్నారు. పలు సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు సమీపానికొచ్చే వరకూ ధాన్యం రాశులు కనిపించడం లేదు. దగ్గరకొచ్చి ఒక్కసారిగా బ్రేకులు వేస్తుండటంతో అదుపు తప్పి పడిపోతున్నారు. దీనికితోడు రాత్రుళ్లు ధాన్యాన్ని కుప్పలుగా పోసి పట్టాలు కప్పిలు ఉంచుతున్నారు. చీకట్లో కుప్పలు కనిపించక చోదకులు ఢీకొంటున్నారు. అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ధాన్యం ఆరబోతకు స్థలాలు చూపాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. 'రైతులు ధాన్యాన్ని ఆరబోసేందుకు వీలైనంత మేర స్థలాలు చూపుతాం. త్వరలోనే టార్పాలిన్‌లు సైతం అందజేస్తాం' అని ఏవో ఖాసిం తెలిపారు.

(c) eenadu

పోలవరం
•పోలవరం • చింతలపూడి

## అపూర్వ కలయిక.. ఆనంద వేడుక

**కొయ్యలగూడెం, పోలవరం, న్యూస్‌టుడే:** పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం సందడిగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

కొయ్యలగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పొంగుటూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలిశారు. కొయ్యలగూడెంలో వారు చదువుకున్న పాఠశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఎన్నో ఏళ్ల తరువాత పోలవరంలో కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వారంతా తాలూకాఫీసు పరిసరాల్లోని మామిడి తోటలో సందడి చేశారు. కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన వినోద్, శేషు, గోపిని మిత్రులు అభినందించారు.

## పెద్దింట్లమ్మా రక్షమాం..

**కైకలూరు, న్యూస్‌టుడే:** కష్టాలను తీర్చే కరుణామయి రక్షమాం అంటూ కొల్లేటి ప్రజల ఇలవేల్పు పెద్దింట్లమ్మను భక్తులు వేడుకొన్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మవారి దర్శనానికి ఆదివారం పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అమ్మవారి మాలధారులు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో కూరెళ్ల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## ధాన్యం రాశిపై.. దళారీ కన్ను!

### మద్దతు ధర కోల్పోతున్న రైతులు

రాఘవాపురంలో ఆరబోసిన ధాన్యం

**చింతలపూడి, న్యూస్‌టుడే:** ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. రైతులకు దళారీ బెడద తప్పడం లేదు. కల్లాల్లో ధాన్యం ఆరబెడుతున్నా.. తేమ శాతం ఎక్కువగా ఉందని రైతు సేవా కేంద్రాల సిబ్బంది చెబుతుండటంతో రైతులు దళారుల వైపే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ముందస్తు పెట్టుబడుల పేరుతో నగదు ఇచ్చి.. ధాన్యం తమకే అమ్మాలని నిబంధన పెట్టడంతో.. తప్పనిసరి పరిస్థితిలో పలువురు రైతులు వారికే విక్రయిస్తున్నారు. ఫలితంగా నష్టపోతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇలా..** ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. మండలంలోని ఎంపిక చేసిన ఆర్‌ఎస్‌కేలలో ధాన్యం కొనుగోలు చేపడుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. కొనుగోలు కేంద్రాలు, మిల్లర్ల వద్ద ఉండాల్సిన సంచులు దళారుల వద్దే ఎక్కువగా ఉంటున్నాయి. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరిట.. రైతులను ఇబ్బంది పెట్టడంతో వారు దళారులను ఆశ్రయిస్తున్నారు.

**ఎండపల్లిలో వాగ్వాదం..** ఇటీవల ఎండపల్లిలో ఒక దళారి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఏలూరు నుంచి లారీలు తీసుకొచ్చి లోడ్ చేయిస్తుండగా.. చింతలపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆ లారీలను అడ్డగించారు. దీంతో వ్యవసాయాధికారులు దీనిపై విచారణ చేపట్టారు.

**రూ.1,700కే అమ్మేశా..** 'నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. మొదటగా మూడు ఎకరాల్లో పంట కోసి అయిదు రోజులు ఆరబెట్టా. స్థానిక ఆర్‌ఎస్‌కే సిబ్బంది తేమ శాతం చూసి ఇంకా ఆరబెట్టాలని చెప్పారు. చేసేదేం లేక స్థానికంగా ఉన్న దళారికి బస్తా రూ.1,700కే అమ్మేశా.' - పెంకే సుందరయ్య, రాఘవాపురం

దీంతో పాటు.. తెలంగాణకు సరిహద్దున ఉన్న ఎండపల్లి, శివాపురం, రాఘవాపురం, మల్లాయిగూడెంలో ఉన్న దళారులు తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వాటిని మన ప్రాంతానికి తీసుకొచ్చి.. ఇక్కడి ఆర్‌ఎస్‌కేల్లో విక్రయిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాంతానికి చెందిన ఒక దళారి ఆర్‌ఎస్‌కే సిబ్బందికి ఫోన్ చేసి రైతును, ధాన్యం లారీని లేకుండానే ట్రక్‌షీట్ కొట్టాలని బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. 'రైతులు దళారులను ఆశ్రయించవద్దు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోంది. వినియోగించుకోవాలి.' అని చింతలపూడి ఏడీ సుబ్బారావు తెలిపారు.

సాధారణ రకం మద్దతు ధర క్వింటాకు రూ.2,369
గ్రేడ్ 'ఏ' రకం రూ.2,389

10 AM to 1 PM మెసేజ్ చేయండి.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

**చింతలపూడి, న్యూస్‌టుడే:** ? చింతలపూడి నుంచి వెలగలపల్లి మీదుగా లింగపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. **- వినయ్, వెలగలపల్లి**
✔ కొమ్మలు తొలగిస్తాం. **- శ్రీకర్, డీఈఈ**
? బైపాస్‌కు ఇరువైపులా పెద్ద మొత్తంలో కోళ్ల, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- పుల్లారావు, చింతలపూడి**
✔ చికెన్ షాపుల యజమానులకు ఇటీవలే హెచ్చరికలు జారీ చేశాం. వ్యర్థాలు బైపాస్‌లో పడేయకుండా చర్యలు చేపడతాం. **- రాంబాబు, కమిషనర్**

## సామూహిక సత్య వ్రతాలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** పట్టణంలోని రామచంద్రపురం కోదండ రామాలయంలో ఆదివారం సామూహిక సత్య వ్రతాలు నిర్వహించారు. కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా వ్రతాలు జరిగాయి. ప్రధాన అర్చకుడు అనిపెద్ది సూర్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు విశేష పూజలు జరిగాయి.

## ఘనంగా వార్షికోత్సవం

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో గొంగులమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి విశేషపూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

## గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి కార్తిక మాసం ఆఖరి ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు.

**అయ్యప్ప స్వామి గ్రామోత్సవం.. పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం పంచాయతీ పరిధి కొత్తనూతనగూడెం రామాలయం వద్ద దీక్ష చేస్తున్న మాలధారులు ఆదివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. గురుస్వామి చిరంజీవి ఆధ్వర్యంలో స్వాములు పల్లకిలో కొత్త, పాత నూతనగూడెం వీధుల్లో ఊరేగించారు. వారంతా అయ్యప్ప స్వామి కీర్తనలు, భజనలు చేస్తూ పల్లకి వెంట నడిచారు.

## కార్తిక దీపోత్సవం

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** కన్నాయగూడెంలో మహిళలు కార్తిక దీపోత్సవం నిర్వహించారు. రామాలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. లింగాకృతిలో, అమ్మవారి ముఖాకృతిలో జ్యోతులు వెలిగించారు.

## పట్టిసీమ ఆలయం కిటకిట

**పోలవరం, న్యూస్‌టుడే:** కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ప్రారంభమైన భక్తుల రాక రెండు గంటల వరకు కొనసాగింది. భక్తుల రద్దీని పురస్కరించుకుని అప్పటికప్పుడు పోలవరం నుంచి రెండో లాంచీని రప్పించారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు రేవులో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుడి రేవులో, ఆలయం వద్ద ఏర్పాట్లను ఎస్సై పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

**భోగలింగేశ్వరుడికి లక్షపత్రి పూజ.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** కొయ్యలగూడెం శివారు అంకాలగూడెంలోని ఉమాసమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాల అనంతరం స్వామిని కాలభైరవుడిగా అలంకరించారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ నిర్వహించారు.

## ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డు ఎన్‌హెచ్‌కు అప్పగిస్తాం: ఎంపీ

పనులు ప్రారంభిస్తున్న మహేశ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే రోషన్‌కుమార్

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** నేషనల్ హైవే అథారిటీకి ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డు త్వరలోనే అప్పగించనున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి తడికలపూడి వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర ఎన్‌డీబీ నిధులు రూ.10.30 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులను మండలంలోని దేవులపల్లిలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం కొబ్బరికాయ కొట్టి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కీలకమైన ఈ రహదారిని ఎన్‌హెచ్‌కు అప్పగించేందుకు ప్రతిపాదనలు తయారు చేయమని అధికారులకు చెప్పామన్నారు. డిసెంబరులో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో దీనికి ఆమోదం అయ్యేలా కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఇది నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చెందుతుందన్నారు. తమది మంచి చేసే ప్రజల ప్రభుత్వమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. అన్ని మేజర్ రోడ్ల పూర్తయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, నాయకులు కొండ్రెడ్డి కిశోర్, సాయిల సత్యనారాయణ, మండవ లక్ష్మణరావు, పరిమి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం ఆదివారం జిల్లా వ్యాప్తంగా వాహనాలను తనిఖీ చేశారు. వాహన పత్రాల్లేని చోదకులకు ఈ-చలానాలు విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఆలయాలు, ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## వ్యక్తిత్వ వికాసానికి దోహదం

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి 72 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. దేవస్థానం సంస్కృత ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కాంతారావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి ఎన్.సీహెచ్.రామకృష్ణ, ఉపాధ్యాయులు ఏసురత్నం, జ్యోతి, నాగరాజు, రామాయణం కేశవాచారి తదితరులు పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే:** గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదమవుతాయని వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం సీనియర్ ఉపాధ్యాయుడు వేదుల జనార్దనరావు తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జీలుగుమిల్లి శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారిణి సోదెం రామలక్ష్మి అధ్యక్షతన ఆదివారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు.

## మట్టి తవ్వకాలు అడ్డుకోవాలని ఫిర్యాదు

**భీమడోలు, న్యూస్‌టుడే:** పోలసానిపల్లి పంచాయతీ చందుబాణం చెరువులో చేపడుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు దేవి, పలువురు ఆయకట్టు రైతులు ఆదివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో తరచూ మట్టి తవ్వేస్తూ.. అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై వీఆర్వో సాల్మన్‌రాజు మాట్లాడుతూ.. చెరువులో అనుమతుల్లేని మట్టి తవ్వకాలకు అడ్డుకుంటామని తెలిపారు.

## ప్రయాణికుల చింతలపూడి బస్టాండ్

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలోని ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి లేక అసౌకర్యాలతో దర్శనమిస్తోంది. నియోజకవర్గ కేంద్రం కావడంతో చుట్టు పక్కల మండలాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికుల పెరుగుదలకు తగిన విధంగా ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**నిత్యం రద్దీగా..** ఏలూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి, హైదరాబాద్‌తో పాటు భద్రాచలం, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, రాజమహేంద్రవరం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడి నుంచి నిత్యం కళాశాలల విద్యార్థులతో పాటు, ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుతుంటారు. చింతలపూడి బస్టాండ్ నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 54 బస్సులు 110 ట్రిప్పులతో 2 వేల మందికి పైగా ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నాయి.

### అభివృద్ధి లేక.. ఇక్కట్లు

సిమెంట్ దిమ్మెల మీద కూర్చొని ఇలా..

**అపరిశుభ్రంగా..** బస్టాండ్‌లో ఉన్న తాగునీటి కుళాయిలు అపరిశుభ్రంగా ఉండటంతో బయట దుకాణాల్లో మంచినీళ్ల ప్యాకెట్లు, సీసాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్‌లోని పంకాలు సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో ఉక్కపోతతో ఆరుబయట బస్సుల కోసం వేచి చూస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత మరుగుదొడ్లు శిథిలం కావడంతో కప్పు తొలగించి మరమ్మతులు చేస్తున్నారు. ప్రయాణికుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు అసౌకర్యంగా ఉన్నాయని మహిళలు వాపోతున్నారు. ప్రాంగణం మొత్తం పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది.

**సౌకర్యాలు కల్పిస్తాం..** ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు మెరుగుపరుస్తాం. తాగునీటి కుళాయిలను శుభ్రంగా ఉంచుతాం. మరుగుదొడ్ల మరమ్మతులు జరుగుతున్నాయి. త్వరలోనే వాటిని పూర్తిచేస్తాం.' అని ఆర్టీసీ జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు.

## విద్యార్థుల్లో జాతీయ భావం పెంచుదాం

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో జాతీయ భావం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారతీయ ఉపాధ్యాయ సంఘం జాతీయ కార్యదర్శి జి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. స్థానిక శాంతినగర్‌లో సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ అధ్యక్షత వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమలవుతున్న జాతీయ విద్యా విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ పటిష్ఠంగా అమలయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయులపై ఒత్తిడికి కారణమవుతున్న నాన్ అకడమిక్ అంశాలను పూర్తిగా తగ్గించాలని కోరారు. పరీక్ష విధానాల్లో మార్పులు తేవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు కె.రాజకుమార్, సతీశ్‌కుమార్, ఆర్.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎందుకొదిలేశారో..?

కమ్మరిగూడెం వాసులకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన చేతి పంపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడవుతోంది. గ్రామ సమీపంలోని పెదవాగు ఒడ్డున కొన్నేళ్ల కిందట దీనిని ఏర్పాటు చేయగా.. కొన్నాళ్ల పాటు బాగానే పని చేసింది. అనంతరం మరమ్మతులకు గురవడంతో స్థానిక పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో చుట్టూ పొదలు ఏపుగా పెరిగి కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ.. వెంటనే బాగు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు**

## ఎప్పుడూ అదే వ్యధ.. తొలగని నీటి బాధ..

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** చింతలపూడి పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో ఉన్న పైపు లైన్లు లీకవుతూ.. కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. దీంతో కొంతమంది కుళాయిలకు దుస్తులు కట్టి నీటిని పట్టుకుంటుండగా.. మరికొంత మంది ఫిల్టర్లు వాడుతున్నారు. సుప్రియన్‌పేట, వెలమపేట, ఆంథోనీనగర్, బోయగూడెం, మెరక వీధిలో చాలా చోట్లా తాగునీటి కుళాయిలు మురుగు నీటిలో ఉండటంతో నీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కుళాయిలకు పైపులు అమర్చి దూరంగా ఉండి నీరు పట్టుకుంటున్నామని చెబుతున్నారు. కుళాయిలకు ట్యాపులు లేకపోవడంతో కొన్ని చోట్ల నీరు వృథాగా పోతోంది. వెలమపేటలో స్థానికులు బాటిల్‌ను అడ్డుగా పెట్టారు.

**ట్యాంకర్ల కోసం ఎదురుచూపు..** తుక్కులూరులో గత నెల రోజులుగా తాగు నీరు లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. రెండు, మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసుకుని నీటిని పట్టుకుంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ అవసరాలకు సరిపోక శివారు ప్రాంతాల్లోని ప్రజలు సమీపంలోని తోటల్లో నుంచి నీటిని తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో నీటి సరఫరాపై దృష్టి పెట్టి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరుతున్నారు. 'తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. నీటిని వృథా చేయకుండా కుళాయిలకు ట్యాపులు అమర్చుతాం. లీకవుతున్న ప్రాంతాల్లో పైపులైన్లు మరమ్మతులు చేయిస్తాం.' అని కమిషనర్ రాంబాబు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

**కైకలూరు, న్యూస్‌టుడే:** మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని భుజబలపట్నం గ్రామానికి చెందిన ఉచ్చుల మరియమ్మకు అయిదుగురు ఆడ సంతానం. ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా.. మరో ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. వీరిలో నాలుగో కుమార్తె పవిత్ర (23) చదువు పూర్తయి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో ఇంటివద్ద ఖాళీగా ఉండకపోతే ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు కదా అని ఆమె సోదరి సరదాగా అంది. దీంతో పవిత్ర మనస్తాపానికి గురై ఈ నెల 4న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు కైకలూరు, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరాజు ★ కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి, రెడ్డి అప్పలనాయుడు

## కలిసి మెలిసి.. సందడి చేసి

### ఘనంగా వన సమారాధనలు

**జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం గ్రామీణ, చింతలపూడి, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెంలో వివిధ సామాజిక వర్గాల కార్తిక వన సమారాధనలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, గౌడ వన భోజనాల్లో పాల్గొన్నారు. ● ద్వారకాతిరుమలలో జరిగిన కాపు కార్తిక వనసమారాధన కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. స్వయంగా ఆయన భోజనాలు వడ్డించారు. ● బుట్టాయగూడెం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంచులవారిగూడెంలోని నాగదుర్గాదేవి ఆలయం వద్ద కార్తిక వన సమారాధన జరిగింది. ● కొయ్యలగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రేపల్లెవాడలో వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అనిపెద్ది రాధాకృష్ణ, కార్యదర్శి బద్రీనాథ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ● చింతలపూడి మండలం శెట్టివారిగూడెం తోటల్లో నిర్వహించిన కాపు సంఘ వన సమారాధనలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చింతలపూడి, ఏలూరు ఏఎంసీ ఛైర్మన్లు చీదరాల దుర్గాపార్వతి, మామిళ్లపల్లి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## బాగు చేస్తారా.. ప్రాణాలు తీస్తారా: ఘంటా

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న జాతీయ రహదారులను బాగు చేస్తారా? అలాగే వదిలేసి అమాయకుల ప్రాణాలు తీస్తారా అని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దెందులూరు సమీప జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రమాదవశాత్తు జారి పడి గాయపడ్డారు. అదే సమయంలో నారాయణపురం పర్యటనకు వెళ్తున్న పద్మశ్రీ.. తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. వారిని తన సిబ్బందితో ఆసుపత్రికి తరలించారు.

## 'మొంథా' బాధితులను ఆదుకోండి

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను, ఉపాధి కోల్పోయిన వృత్తిదారులు, వ్యవసాయ, మత్స్య కార్మికులకు నష్టపరిహారం, నిత్యావసర సరకులు అందజేసి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ నేత తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. బలరాం మాట్లాడుతూ.. తుపాను కారణంగా ఒక్కో రైతు ఎకరాకు 5-10 బస్తాల మేర దిగుబడులు నష్టపోయినట్లు అధికారులు లెక్కలు వేశారన్నారన్నారు.

## మినీవ్యాన్‌ను ఢీకొన్న కారు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** కారు బ్రేకు పట్టేయడంతో అదుపుతప్పి పార్కింగ్ చేసి ఉన్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం గుడివాడ నుంచి సింగరాయపాలెం వైపు వస్తున్న కారు శ్రీహరిపురం వంతెన దిగగానే బ్రేకు పట్టేయడంతో అదుపు తప్పింది. రహదారికి కుడివైపు పార్కింగ్ చేసి ఉన్న డ్రింకుల వ్యాన్‌ను ఢీకొట్టింది. కారు ముందుభాగం ధ్వంసమైంది. అందులో వృద్ధుడికి గాయాలవ్వగా ఆటోలో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఇరువైపులా వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

## ఏడీ కార్యాలయం ఏదీ?

### తెదేపా హయాంలో మంజూరు.. వైకాపా పాలనలో రద్దు

### అనాలోచిత నిర్ణయంతో ఉద్యాన రైతుల అవస్థలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** ఉద్యాన రైతులకు మెరుగైన సాగు సలహాలు, సూచనలు అందించేందుకు తెదేపా ప్రభుత్వం జంగారెడ్డిగూడేనికి ఉద్యానశాఖ ఏడీ కార్యాలయాన్ని 2016లో తెచ్చింది. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ కార్యాలయాన్ని 2022లో రద్దు చేసింది. ఉద్యాన రైతులకు ఆరేళ్ల పాటు ఏడీ కార్యాలయం విశేష సేవలందించింది. లక్షల ఎకరాల ఉద్యాన వనాలతో నిండిన ఈ ప్రాంతంలోని ఏడీ కార్యాలయాన్ని జిల్లాల పునర్విభజన కారణంగా భీమవరానికి తరలించారు. అక్కడ నూతన కార్యాలయం మంజూరు చేయకుండా షిఫ్ట్ చేయడం శాపమైంది.

ఈ డివిజన్ పరిధిలోని 11 మండలాలు ఏలూరు ఏడీ కార్యాలయ ఆధీనంలోకి వెళ్లాయి. ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి, జామ, నిమ్మ, మామిడి, జీడిమామిడి, వక్క, అరటి, మునగ, బొప్పాయితో పాటు పలు రకాల ఉద్యాన తోటలు, కూరగాయల తోటలు ఇక్కడ ఉన్నాయి. వందల నర్సరీలు ఉన్నాయి. రైతులు, వ్యాపారులు ఇప్పుడు ఏలూరు వెళ్లాల్సి వస్తోంది. పునర్విభజనకు ముందు ఉమ్మడి జిల్లాలోని 24 మండలాలు దీని పరిధిలో ఉండేవి.

**అందుబాటులో అధికారులు..** ఏడీ కార్యాలయంలో ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ఒక టెక్నికల్ హెచ్‌వో, పలువురు ఉద్యానాధికారులు స్థానికంగా ఉండేవారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్, నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్‌పామ్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన వంటి కార్యక్రమాల కోసం 15 మంది అధికారులు, కార్యాలయ సిబ్బంది ఉండేవారు. రద్దుతో ఆందోళన చెందిన రైతులు 2022లోనే విజయవాడ కమిషనరేట్ వద్ద నిరసనలు తెలిపారు.

**హెచ్‌వో పోస్టు లేదాయే..** కనీసం మండల ఉద్యానాధికారి పోస్టు కూడా లేకుండా చేశారు. దీంతో కొయ్యలగూడెం మండల పరిధిలో జంగారెడ్డిగూడేన్ని చేర్చారు. కొయ్యలగూడెం ఉద్యానాధికారి మూడు మండలాలకు ఇన్‌ఛార్జి అయ్యారు.

**ప్రస్తుతానికి లేదు** ప్రస్తుతానికి ఏడీ కార్యాలయం కోసం ప్రతిపాదన ఏదీ ప్రభుత్వానికి ఇవ్వలేదు. జిల్లాల పునర్విభజన అవుతున్నందున వేచి చూడాలని ఉద్యాన శాఖ డీడీ సాజానాయక్ పేర్కొన్నారు.

## నియంత్రికల్లో రాగి తీగ చోరీ

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** యర్రంపల్లిలోని తమ పొలాల్లో విద్యుత్తు నియంత్రికలను పగలగొట్టి.. అందులోని రాగి తీగను చోరీ చేసినట్లు రైతులు జగ్గవరపు విశ్వేశ్వరరెడ్డి, చెన్నుకుమార్‌బాబు ఆదివారం తెలిపారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లో సంచరిస్తూ.. రాత్రి వేళల్లో ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

(c) eenadu

# నూజివీడు

• నూజివీడు • కైకలూరు

## నయనానందకరం.. దీపోత్సవం

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** గురజ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి వీరిశెట్టి సీతారామయ్య, వీరరాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో సహస్ర దీపారాధన నిర్వహించారు. శివలింగాకారంలో దీపాలు వెలిగించారు. భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

**నేడు సీతారామాలయంలో.. ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం కొర్లగుంటలోని పట్టాభి సీతారామాలయంలో కార్తిక మాసం సందర్భంగా సోమవారం రాత్రి 7 గంటలకు కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో ఇరుముడులు

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల ఇరుముడుల కార్యక్రమం గురుస్వాములు చలపతి, శ్రీను నిర్వహించారు. మండలం పాటు కఠోరదీక్షను ఆచరించిన అయ్యప్ప స్వాములు దీక్ష ముగియడంతో ఆదివారం ఇరుముడులు కట్టుకుని కొండకు బయలుదేరారు. ఈ సందర్భంగా స్వామివారికి కలశపూడి, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

## పెద్దింట్లమ్మా పాహిమాం

**కైకలూరు, న్యూస్‌టుడే:** కష్టాలను తీర్చే కరుణామయీ పాహిమాం అంటూ కొల్లేటి ప్రజల ఇలవేల్పు పెద్దింట్లమ్మను భక్తులు వేడుకొన్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మవారి దర్శనానికి ఆదివారం పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అమ్మవారి మాలధారులు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## ఆయుష్ పోస్తే ఆరోగ్యమే!

ఆగిరిపల్లిలో మూతబడిన వైద్యశాల

**ఇదీ ప్రాముఖ్యత..** దీర్ఘకాలిక వ్యాధులు, మధుమేహం, పక్షవాతం, రక్తహీనత, మూత్ర సంబంధిత వ్యాధులు, అసిడిటీ తదితరాల నియంత్రణకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారం చూపుతుందని ప్రజల్లో గట్టి నమ్మకం. కరోనా సమయంలో ఈ విభాగానికి మంచి ఆదరణ వచ్చింది.

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ముసునూరు, చాట్రాయి మండలాల్లోనూ ఆయుర్వేదిక్ వైద్యశాలలు ఉన్నప్పటికీ నిర్వహణ లేక అవి మూతపడ్డాయి. దీంతో భారతీయ సంప్రదాయ వైద్యం ప్రజలకు దూరమవుతోంది. ప్రకృతి సిద్ధంగా చికిత్స అందించేందుకు తీసుకొచ్చిన ఆయుష్ విభాగం (ఆయుర్వేదిక్, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి) అంతకంతకూ ఉనికిని కోల్పోతోంది. వైద్యులు, సిబ్బంది కొరతతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. నియోజకవర్గంలో చాలా చోట్ల డిస్పెన్సరీల్లో వైద్యులు, సిబ్బంది లేరని మూసేశారు.

**◆ భర్తీకి నోచుకోని పోస్టులు**

ఆసుపత్రుల్లో వైద్యుడు, మెటర్నటీ అసిస్టెంట్, ఎఫ్ఎన్‌వో, నర్సింగ్ ఆర్డర్లీ, ఏఎన్ఎం, ఎస్‌సీఎస్, కాంపౌండర్ పోస్టులు ఉండాలి. చాలా చోట్ల పోస్టుల భర్తీకి నోచుకోక ఆసుపత్రులు మూతపడ్డాయి. దీంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి పెద్ద మొత్తంలో చేతి చమురు వదిలించుకుంటున్నారు.

**సేవలు పునరుద్ధరించాలి..** నేను పదేళ్లుగా ఆయుర్వేదిక్, హోమియో మందులనే వాడుతున్నాను. ఆగిరిపల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో వైద్యం అందుబాటులో లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేటు వైద్యశాలకు వెళుతున్నా. వైద్య సేవలు పునరుద్ధరించాలి. **-జూలూరు చంద్రమౌళేశ్వరరావు, ఆగిరిపల్లి**

☛ ఆగిరిపల్లి ఆయుర్వేదిక్ వైద్యశాల వైద్యురాలిని 11 నెలల క్రితం మరో ప్రాంతానికి బదిలీ చేశారు. ఇక్కడ పోస్టును భర్తీ చేయకపోవడంతో వైద్యశాల మూతపడింది. ఫలితంగా మండలంలోని 25 గ్రామాల్లోని 75 వేల మంది ప్రజలకు ఆయుర్వేదిక్ సేవలు నిలిచి అవస్థలు పడుతున్నారు. హోమియోపతి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులు భర్తీ చేయడం లేదు.

**ఖాళీల భర్తీకి చర్యలు**

'ఖాళీల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే భర్తీ చేసి వైద్య సేవలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం' **-.కుమార్‌బాబు, ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు**

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| నూజివీడు | 80085 74698 | ఆగిరిపల్లి | 9121229090 |
| ముసునూరు | 93983 81268 | చాట్రాయి | 8008574700 |
| కైకలూరు | 73060 88555 | మండవల్లి | 8106099008 |
| కలిదిండి | 90594 84862 | ముదినేపల్లి | 8008574693 |

స్పందనకు వందనం

**కైకలూరు, న్యూస్‌టుడే:** కైకలూరు పట్టణం చెరువు సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో వీధిదీపాలు వెలగడం లేదని స్థానికుడు ఆంజనేయ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెలగని వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.

**కైకలూరు, న్యూస్‌టుడే:** మండలంలోని సీతనపల్లి పీహెచ్‌సీ మార్గంలో కొన్నిరోజులుగా పంచాయతీ వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థుడు శివరామకృష్ణ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో కుమారి దృష్టికి తీసుకురాగా వెలగని వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు.

## సోమేశ్వరునికి లక్ష బిల్వార్చన

**కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే:** కోరుకొల్లు పాటిమీద ఉన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ అర్చకుడు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ఆలయాల్లో కార్తిక కాంతులు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లిలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి శివాలయంలో, దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి శివాలయాల్లో బహుళ ద్వాదశి ఆదివారం సందర్భంగా స్వామికి పంచామృత, ఫలామృత అభిషేకాలు నిర్వహించారు. శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

**కైకలూరు, చాట్రాయి, నూజివీడు రూరల్, ముదినేపల్లి, ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** గ్రంథాలయాలు విద్యార్థుల ఉన్నతికి బాసటగా నిలుస్తాయని సాహితీమిత్రుల సంఘం ప్రధానకార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. వెంకట

కైకలూరు: సాహితీ మిత్రులను సత్కరిస్తున్న సిబ్బంది

## విద్యార్థుల ఉన్నతికి బాసట

నారాయణతో పాటు సహజకవి దండే బెనర్జీ, రుద్రపాక రత్నకరరావులను గ్రంథాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ★ చాట్రాయి మండలం చనుబండ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పలగాని శ్రీనివాసరావు, కొండా చిట్టిబాబు, గ్రంథాలయాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు. ★ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి ఉపన్యాస సభను నూజివీడు గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లభనేని పద్మ.. సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ తదితర స్వాతంత్ర్య సమర యోధుల విశేషాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ★ ముదినేపల్లి గ్రంథాలయంలో ఉద్యమకారుల చరిత్రపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు

చనుబండ గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు

గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి పాల్గొన్నారు. ★ ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఈజీఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించారు.

## మురుగు తొలగింది

ఈనాడు కథనానికి స్పందన

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి హనుమాన్ జంక్షన్ రహదారిలోని థియేటర్ సమీపంలో మురుగు కదలక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దాంతో ఈనెల 16న 'ఈనాడు' లో 'కదలని మురుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్ బాబు స్పందించారు. ఆయన ఆదేశాలతో పారిశుద్ధ్య సిబ్బంది పూడికతీసి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచారు.

మహాత్మా గాంధీ, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## పట్టిసీమ ఆలయం కిటకిట

**పోలవరం, న్యూస్‌టుడే:** కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ప్రారంభమైన భక్తుల రాక రెండు గంటల వరకు కొనసాగింది. భక్తుల రద్దీని పురస్కరించుకుని అప్పటికప్పుడు పోలవరం నుంచి రెండో లాంచీని రప్పించారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు రేవులో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుడి రేవులో, ఆలయం వద్ద ఏర్పాట్లను ఎస్సై పవన్‌కుమార్ పర్యవేక్షించారు.

## నాణ్యత తీసికట్టు.. ప్రజలకు తప్పని పాట్లు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ముదినేపల్లిలో జాతీయ రహదారి నం.165 విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన డ్రెయినేజీల నాణ్యత అంతంతమాత్రంగానే ఉంది. వాటిపై వేసిన శ్లాబుల్లో నాణ్యత తీసుకట్టుగా ఉండటంతో తరచూ అవి విరిగిపోతున్నాయి. ఇటీవల పంచాయతీకి వెళ్లే రహదారిలో, కేడీసీసీ బ్యాంక్ వద్ద శ్లాబులు విరిగి వాహనదారులు గాయాలపాలయ్యారు. దీంతో వాటి స్థానంలో నూతనంగా సిమెంటు పలకలు ఏర్పాటు చేశారు. వేసిన కొన్ని



కేడీసీసీ బ్యాంకు వద్ద

రోజుల్లోనే కేడీసీసీ బ్యాంక్ వద్ద ఫలకం విరిగిపోయింది. తాజాగా శుక్రవారం కైకలూరు రహదారిలోని డ్రెయినేజీ శ్లాబు విరిగి ట్రాక్టరు కూరుకుపోయింది. వీటి వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ వాహనదారులు వాటిలో పడి క్షతగాత్రులవుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణను సంప్రదించగా వెంటనే పరిశీలించి నూతన శ్లాబులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## భాజపా ఇంటింటా ప్రచారం

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా స్వదేశీ ప్రతి ఇంటా స్వదేశీ నినాదంతో భాజపా నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నూజివీడులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహాత్మాగాంధీ, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఇన్‌ఛార్జి డి.నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బి.అప్పారావు, సీనియర్ నాయకులు ఎం.రాజశేఖర్, కొండయ్యసత్రం ఛైర్మన్ ఎం.ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి డి.మల్లికార్జున జగదీష్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## రూపుమారిన శివాలయం రోడ్డు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** చిన్నపాటి వర్షమొచ్చినా కోటపాడు- చీపురుగూడెం రోడ్డులో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడేవారు. గోతుల్లో నీరు వారాల తరబడి నిలిచి ఉండేది. రోడ్డు సమస్యను వారు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యాయి. కోటపాడులో పాత రామాలయం నుంచి యాదవ బజారు వరకు(శివాలయం రోడ్డు) పనులు చేశారు. చీపురుగూడెం ఉప కేంద్రం వరకు పనులు చేస్తారని గ్రామస్థులు భావించగా నిధులు చాలక నిరాశ ఎదురైంది. తమ్మిలేరుకు వరద వస్తే కోటపాడు గ్రామస్థులు చీపురుగూడెం మీదుగా చింతలపూడి వెళతారు. ఈ రోడ్డు కూడా పూర్తి చేస్తే ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

## వైభవంగా ముగిసిన ఆరాధనోత్సవాలు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడులో మూడు రోజుల పాటు నిర్వహించిన హరికథా గాన కళాత్రిమూర్తుల ఆరాధనోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఆఖరి రోజు ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయుడు ఎల్.సూర్యప్రకాశరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. దివి వరప్రసాద్ హరికథ ప్రజాదరణ ప్రసంగం చేశారు. విజయనగరం విశ్రాంత అధ్యాపకుడు సూరి సీతారామయ్య మాట్లాడారు. బహురాగ విశారద భగవన్ భజన తత్పరులు బి.చెన్నారావును ఘనంగా సన్మానించారు. సినీనటి పడాల కల్యాణి భాగవతారిణి రుద్రాక్ష మహోత్యం హరికథను ఆసక్తిగా చెప్పారు. కోట వెంకట శివశాస్త్రి ఇందుమతి దంపతులు పర్యవేక్షించారు.

## సంఘటిత పోరాటాలతో దాడులను అరికట్టగలం

మాట్లాడుతున్న భిక్షాలు, పాల్గొన్న నాయకులు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ఎస్సీలపై జరుగుతున్న దాడులను సంఘటితంగా పోరాడితేనే అరికట్టగలమని ఆదర్శ దళితపరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు అన్నారు. ముదినేపల్లిలో ఆదివారం దళితపరిరక్షణ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం పరిరక్షణకు ఈనెల 26న నిర్వహిస్తున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

## సమాజహితం కోసం కృషి చేయండి: కామినేని

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

**కైకలూరు, నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** పేద వర్గాల అభ్యున్నతిలో ఉన్నత వర్గాలు భాగస్వాములై సమాజహితం కోసం పాటు పడాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కోరారు. స్థానిక ఏలూరు రోడ్డులోని సీఎన్నార్ గార్డెన్స్‌లో ఆదివారం కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఆర్థికంగా వెనకబడిన 26 మంది విద్యార్థులు, వృద్ధులకు సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల చొప్పున నగదు సాయం అందించారు. ఇందులో రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ డైరెక్టరు కొడాలి వినోద్, సంఘ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, చదలవాడ శేషగిరిరావు, కొండ్రెడ్డి సత్యనారాయణ, వల్లభనేని శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.

★ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అవ్వడంతో పాటు ఈర్ష్య ద్వేషాలకు దూరంగా ఉండి కమ్మ సంఘీయుల అభివృద్ధికి కృషి చేయాలని మూల్పూరి పౌల్ట్రీస్ అధినేత మూల్పూరు లక్ష్మణస్వామి తెలిపారు. ఆదివారం నూజివీడు సమీపంలో మామిడితోటలో కమ్మ సంఘీయుల వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేంద్రియ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, భాజపా నాయకులు గారపాటి తపన చౌదరి, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదేళ్ల బ్రహ్మం, కౌన్సిలర్లు యార్లగడ్డ ప్రసాద్, చెరుకూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లి, కైకలూరు, న్యూస్‌టుడే:** సామాజిక ఐక్యతకు వనసమారాధనలు దోహదపడతాయని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. గురజలోని గంగా పార్వతీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. జయమంగళ స్వామివారికి ప్రత్యేక పూజలుచేసి అనంతరం వనసమారాధన ప్రారంభించారు. ★ సమాజంలో జరిగే ప్రతి మంచి, చెడులోనూ తోడుండే రజకులు అందరివారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. కైకలూరు మసీదు కూడలిలోని రజక సామాజిక భవన ప్రాంగణంలో ఆదివారం శ్రీరామ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కమ్మిలి చేతుల మీదుగా పురస్కారాలు అందించి సత్కరించారు.

**కైకలూరు, న్యూస్‌టుడే:** కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకుని కైకలూరు కరకట్ట శివారులో కొలువుదీరిన శివనాగేంద్రస్వామికి ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో సుమారు 1200 మందికి కార్తిక వనసమారాధన నిర్వహించారు. ★ స్థానిక వెలమపేట కోదండ రామాలయంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. చిన్నారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నిర్వాహకులు వారికి బహుమతులు అందించి సత్కరించారు.

కమ్మిలి విఠల్‌రావుకు జ్ఞాపిక అందిస్తున్న సంఘ నాయకులు

మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త లక్ష్మణస్వామి

## జూద శిబిరంపై దాడి

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** జూదాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ఆదివారం ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామ సమీపంలోని మామిడి తోటల్లో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.3,500 నగదు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామ సమీపంలో జూద శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,500 నగదు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. ఏఎస్సై టి.నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువతి మృతి

**కైకలూరు, న్యూస్‌టుడే:** మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు...మండలంలోని భుజబలపట్నం గ్రామానికి చెందిన ఉచ్చుల మరియమ్మకు అయిదుగురు ఆడ సంతానం. ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా.. మరో ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. వీరిలో నాలుగో కుమార్తె పవిత్ర (23) చదువు పూర్తయి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో ఇంటివద్ద ఖాళీగా ఉండకపోతే ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు కదా అని ఆమె సోదరి సరదాగా అంది. దీంతో పవిత్ర మనస్తాపానికి గురై ఈ నెల 4న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు కైకలూరు, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సమాజాభివృద్ధే లక్ష్యం

సమావేశంలో రాయల్ క్లబ్స్ సభ్యులు

**మండవల్లి, న్యూస్‌టుడే:** సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే రాయల్ క్లబ్స్ అసోసియేషన్ లక్ష్యమని జాతీయ అధ్యక్షుడు చిన్నమిల్లి సత్యనారాయణ తెలిపారు. 2017లో ప్రారంభమైన ఈ క్లబ్ మొదటి జాతీయ కార్యవర్గ సమావేశాన్ని మండవల్లిలోని శుభం కల్యాణవేదికలో ఆదివారం నిర్వహించారు. విద్య, వైద్యం అందిచడంలో ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. 2025-26 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు రూ.30 లక్షల ప్రతిభా ఉపకారవేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సూదాబత్తుల విజయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

## యూరియా కొనేద్దాం.. దాచేద్దాం

చాట్రాయి సొసైటీ వద్ద సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న రైతులు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** ఖరీఫ్‌లో పడ్డ కష్టాలు పునరావృతం కాకూడదనే 'ముందస్తు' వ్యూహాన్ని మెట్ట ప్రాంత రైతులు అవలంబిస్తున్నారు. రబీసాగు నిమిత్తం 'యూరియా'కి అప్పుడే పెట్టుబడులు పెడుతున్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఈ ఏడాది రబీలో సాగు విస్తీర్ణం పెరగనుంది. సుమారు 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, వరి సాగు చేయనున్నారు. మిర్చి సాగులో ఉండగా ఆయిల్ పామ్‌కు నిత్యావసరంగా ఉంది.

**తీరిక లేకున్నా..** ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం కేంద్రాలకు తరలింపులో క్షణం తీరిక లేకున్నా రైతులు మాత్రం యూరియా నిల్వ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చాట్రాయి మండలంలో చూస్తే అన్ని సొసైటీల్లో యూరియా నిల్వలు న్నాయి. వీటిని తీసుకెళ్లేందుకు పాసు పుస్తకాలతో వెళ్తున్నారు.

**అపోహలు వద్దు..** 'రబీలో రైతులకు కొరత రాకుండా ముందుచూపుతోనే నిల్వలు సిద్ధం చేశాం. అన్ని సొసైటీల్లో సుమారు 150 టన్నులున్నాయి. యూరియాపై రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు' అని ఏవో బండారు శివ శంకర్ తెలిపారు.

## మినీ వ్యాన్‌ను ఢీకొన్న కారు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** కారు బ్రేకు పట్టేయడంతో అదుపుతప్పి పార్కింగ్ చేసి ఉన్న మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన ఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం గుడివాడ నుంచి సింగరాయపాలెం వైపు వస్తున్న కారు శ్రీహరిపురం వంతెన దిగగానే బ్రేకు పట్టేయడంతో అదుపు తప్పింది. రహదారికి కుడివైపు పార్కింగ్ చేసి ఉన్న డ్రింకుల ఆటోను ఢీకొట్టింది. కారు ముందు భాగం ధ్వంసమైంది. అందులో వృద్ధుడికి గాయాలవ్వగా ఆటోలో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఇరువైపులా వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

## అక్రమార్కులకు అడ్డాగా తేలపోడు తిప్ప

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

మట్టి తవ్విన ప్రాంతం

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడు మండలంలోని దిగవల్లి రెవెన్యూ పరిధిలోని తేలపోడు తిప్ప గట్టు అక్రమార్కులకు అడ్డాగా తయారైంది. హనుమంతులగూడెం గ్రామస్థులు కొందరితో లోపాయికారీ ఒప్పందం చేసుకుని గట్టులోని గ్రావెల్‌ను టిప్పర్లతో అర్ధరాత్రి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. హనుమంతులగూడెం వైపు ఉన్న డొంక రహదారిని అక్రమ రవాణాకు వినియోగించుకుంటూ ధ్వంసం చేస్తున్నారు. మిట్టగూడెం, హనుమంతులగూడెంలలో ఉన్న డోజర్లు, పొక్లెయిన్‌లను వినియోగిస్తున్నారు. ఇటీవల హనుమంతులగూడెం గ్రామస్థులు అభ్యంతరం చెప్పడంతో రెండుమూడు రోజులు తవ్వకాన్ని నిలిపేశారు. తవ్వకాలకు అడ్డు వస్తే ఊరుకోమంటూ కొందరు వీరంగం చేసి మళ్లీ తవ్వకాలు ప్రారంభించారు. గ్రామస్థులు ఆదివారం మీడియాకు సమాచారం ఇవ్వగా.. ప్రతినిధులు అక్కడికి వెళ్లే సమయానికి హుటాహుటిన అక్కడి నుంచి టిప్పర్లు, పొక్లెయిన్లను తరలించారు. దీనిపై తహసీల్దారు బద్రును సంప్రదించగా తేలపోడు తిప్ప గట్టుపై గ్రావెల్ తవ్వకానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్రమ తవ్వకందారులను గుర్తించి హెచ్చరిస్తామన్నారు.

## రేషన్ డీలర్ల నియామకం ఎప్పుడో?

**మండవల్లి, న్యూస్‌టుడే:** రేషన్ డీలర్ల ఖాళీలు ఏళ్లతరబడి భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులు అవస్థలను ఎదుర్కొంటున్నారు. కొన్ని దుకాణాల్లో ఏకంగా నాలుగైదేళ్లుగా డీలర్లు లేకపోవడం గమనార్హం. డీలర్లు లేని దుకాణాలకు పక్కనే ఉన్న డీలర్లను ఇన్‌ఛార్జులుగా నియమిస్తున్నారు. రెండింటిలో ఎప్పుడు ఏ దుకాణంలో సరకులు పంపిణీ చేస్తారో తెలియక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. మరో పక్క సొంత దుకాణాల నుంచి సరకులు అక్కడికి తీసుకురావాల్సి వస్తోందని ఇన్‌ఛార్జులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

| మండలం | మొత్తం దుకాణాలు | ఖాళీలు |
|---|---|---|
| మండవల్లి | 35 | 7 |
| ముదినేపల్లి | 39 | 6 |
| కైకలూరు | 47 | 5 |
| కలిదిండి | 46 | 3 |

లబ్ధిదారు నుంచి వేలిముద్ర తీసుకుంటున్న డీలరు

**◆ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..**

గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం, పంచదార, కంది పప్పు, ఇతర సరకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరకులన్నీ రేషన్ దుకాణాల ద్వారానే పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. కానీ కొన్ని దుకాణాల్లో డీలర్లు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

**◆ గతంలో నోటిఫికేషన్ ఇచ్చి..**

రేషన్ దుకాణాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసింది. కొంత మంది నిరుద్యోగులు డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో నోటిఫికేషన్ నిలిచిపోయిందని అప్పట్లో అధికారులు తెలిపారు.

**◆ ఇబ్బందులు లేకుండా చర్యలు**

'గత నోటిఫికేషన్‌పై న్యాయస్థానంలో కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే డీలర్లు లేని దుకాణాలకు డ్వాక్రా మహిళలు లేదా ఇన్‌ఛార్జులను నియమించి కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. త్వరలో నియామకాన్ని చేపట్టే అవకాశం ఉంది' అని ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ తెలిపారు.

(c) eenadu

## ఆహ్లాదమా.. ఎక్కడ నీ చిరునామా

విరిగిన బెంచీలు ఇలా..

ఎటు చూసిన వ్యర్థాలే

నిత్యం వేల సంఖ్యలో పర్యాటకుల తాకిడి ఉండే కాకినాడలోని ఎన్టీఆర్ బీచ్‌లో పరిస్థితులు నిర్వహణ లోపాలను ఎత్తిచూపుతున్నాయి. వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. సందర్శకుల కోసం వేసిన సిమెంటు బల్లలు ఇసుకలో కూరుకుపోయినా పట్టించుకునేవారే కరవయ్యారు. సేదదీరేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో మత్స్యకారులు ఒడ్డుపై నిలిపిన తెప్పలపై కూర్చుంటున్నారు. సముద్రపు నీటిలో దిగేవారికి హెచ్చరికగా ఏర్పాటు చేసిన బోర్డులు ఎక్కడికక్కడ పడిపోయాయి. పర్యాటకశాఖ అధికారులు పరిస్థితులను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనాఉంది. - ఈనాడు, కాకినాడ

## శంభో.. భక్తజనప్రభో..

హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో సామర్లకోటలోని భీమేశ్వరాలయం కిటకిటలాడింది. ఈవో నీలకంఠం, ఆలయ కమిటీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, సామర్లకోట

## ప్రతి పిల్లాడు.. అల్లాడుతున్నాడు

మంచాలేని తీరు..

న్యూస్‌టుడే, కరప

నిరుపేద కుటుంబాల పిల్లలకు భోజనం, వసతి కల్పించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన వసతి గృహాలవి. కానీ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు నిత్యం యాతనపడుతున్న తీరు విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుత శీతాకాలంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న వారి పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. చలి తీవ్రతకు గజగజలాడుతున్నారు. కాకినాడ గ్రామీణం కరపలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలుర సంక్షేమ వసతిగృహంలో ఐదు నుంచి పదో తరగతి వరకు సుమారు 213 మంది ఉంటున్నారు. ఇక్కడి ఇబ్బందులపై ప్రిన్సిపల్ కేవీ రామకృష్ణారావును అడగ్గా ఉన్నతాధికారులకు తెలిపి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

కాలకృత్యాలు, స్నానాలకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

**సమస్యలెంటే..** ✤ ఎనిమిది పెద్ద హాల్‌లతో ఉన్న భవనంలో గదులుగా ఏర్పాటు లేక. రెండు, మూడు తరగతులను ఒకేచోట నిర్వహిస్తున్నారు. ✤ ఈ గదుల్లోనే విద్యార్థులు పెట్టెలు, పుస్తకాలు, దుస్తులు దాచుకుంటున్నారు. ✤ నిద్రకు పాఠశాలలోని తరగతి గదులను వినియోగించుకోవాల్సిన దుస్థితి. ✤ కూర్చునేందుకు డెస్కులు లేకపోవడంతో నేలపైనే చదువుకుంటున్నారు. ✤ నిద్రించేందుకు డార్మెటరీ మంచాలు లేకపోవడంతో నేలపైనే చాపలు, మ్యాట్లు, బ్లాంకెట్లపై పడుకుంటున్నారు. ✤ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ✤ మరుగుదొడ్లు ఎనిమిది మాత్రమే ఉండడంతో ఉదయం వరుసలో నిల్చోవాల్సిన పరిస్థితి. ✤ సెప్టిక్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రపర్చక.. దుర్వాసన భరించలేకున్నారు. ✤ బయటి మరుగుదొడ్ల వద్ద చెద్దాచెదారంతో విష కీటకాల భయం నెలకొంది.

## ఆహార శుద్ధి.. ఆర్థిక వృద్ధి

ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఆయా పరిశ్రమలకు ఆధునిక సాంకేతికతను జోడించి వ్యాపారాన్ని మరింత లాభదాయకం చేసేందుకు ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్‌ఎంఈ) తోడ్పాటు అందిస్తోంది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ(ఏపీఎఫ్‌పీఎస్) రాయితీతో కూడిన రుణాలు అందిస్తోంది. - న్యూస్‌టుడే, కాకినాడ నగరం

జిల్లాలోని సూక్ష్మ కుటీర ఆహార పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం రుణ కార్యాచరణ ప్రకటించింది. ఇందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 126 యూనిట్లు ఇవ్వనుంది. ఇందులో ఇప్పటికే 40కి పైగా యూనిట్లను గుర్తించి మంజూరు చేశారు. మిగతావి ఆసక్తిగల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇవ్వనున్నారు. లక్ష్యం పూర్తయితే అదనపు యూనిట్లను కూడా ప్రభుత్వం మంజూరు చేయనుంది.

**ఇవి ఏర్పాటు చేసుకోవచ్చు..** పచ్చళ్లు, అప్పడాలు, చిరుతిండ్లు, మామిడి తాండ్ర, గానుగలు, పిండి మరలు, పాల ఉత్పత్తులు, బేకరీలు, స్వీట్ల తయారీ.

పండ్ల రసాల ప్రాసెసింగ్ యూనిట్లు

**ఎవరెవరికి..** ఆసక్తి కలిగిన రైతులు, మహిళలు, యువజన సంఘాలు.

**యూనిట్ల వారీగా..**

**రూ.5 లక్షల లోపు..** పిండి మరలు, వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లు, మిరప, పసుపు, మసాలా పొడులు, కొబ్బరి పొడి, పూత రేకులు, కేకులు, ఇడ్లీలు, దోశపిండి తయారీ.

**రూ.10 లక్షల లోపు..** వంట నూనెలు, చాక్లెట్లు, నూడిల్స్, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు, పండ్ల జామ్, జెల్లీ, పచ్చళ్లు, పరోటా, పశువుల దాణా తయారీ, అల్లం వెల్లుల్లి పేస్ట్, పానీపూరీ.

**రూ.20 లక్షలు..** ధాన్యం, పప్పు మిల్లులు, తేనె శుద్ధి, నూనెల తయారీ, ఆహార శుద్ధి యూనిట్లు, కొబ్బరి పాల తయారీ.

**రూ.50 లక్షలు..** కాఫీ ప్రాసెసింగ్, లెమన్ ప్రాసెసింగ్, జీడిమామిడి పరిశ్రమలు, చేపలు, మాంసం ప్రాసెసింగ్ యూనిట్లు, చెరకు ఆధారిత బెల్లం, పంచదార తయారీ యూనిట్లు, మొక్కజొన్న, పండ్ల రసాల తయారీ.

**రాయితీ ఇలా..** ఆయా యూనిట్లకు సంబంధించి యంత్ర పరికరాల కొనుగోలు, షెడ్ ఏర్పాటు, విద్యుదీకరణ, శీతలీకరణ వంటి ఆధునిక సాంకేతిక హంగుల ఏర్పాటుకు 35 శాతం రాయితీతో రుణాలు అందిస్తారు.

**పరిమితి ఇలా..** పరిశ్రమను బట్టి రూ. లక్ష నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. రూ.10 లక్షల వరకు ఎలాంటి హామీ అవసరం లేదు. ఆయా పరిశ్రమల ఏర్పాటుకు 10 శాతం పెట్టుబడి పెడితే చాలు. ప్రభుత్వమే ఆర్థిక సహకారం అందిస్తుంది. పొదుపు సంఘాల మహిళలకు రూ.40 వేల చొప్పున సాయం అందిస్తారు.

**ఇలా దరఖాస్తు చేయాలి..** యూనిట్ వివరాలతో ఆన్‌లైన్‌లో http://pmfmeap.org ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, పాన్‌కార్డు, యూనిట్ చిరునామా ధ్రువీకరణ పత్రం, యూనిట్ నిర్వహణ భవనం, ఆరు నెలల బ్యాంకు లావాదేవీల వివరాలు, యంత్రాలు, షెడ్ కొటేషన్లు అప్‌లోడ్ చేయాలి. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు సంబంధిత జిల్లా రిసోర్సుపర్సన్(డీఆర్‌పీ)లను కలవొచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ప్రోగ్రాం నోడల్ అధికారి సిలిల్ తెలిపారు.

**సంప్రదించాల్సిన డీఆర్‌పీలు, ఫోన్ నంబర్లు..**

| | |
|---|---|
| సీహెచ్ శ్రీనివాస్ | 99591 55811 |
| పి.సత్య | 90004 21134 |
| పి.బాల | 93912 43450 |
| సీహెచ్ వీరకుమార్ | 78010 53777 |

## పేదల చదువుకు రుణ సాయం

మీ కోసం

పెద్దాపురం, న్యూస్‌టుడే: చదువులో చురుకుగా రాణిస్తున్న గ్రామీణప్రాంత విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నతస్థానాలను అధిరోహించలేకపోతున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పిస్తోంది. పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని 'పీఎం విద్యాలక్ష్మి' పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వారు చదువుకు ఎలాంటి హామీలు, పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణ సదుపాయం కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. విద్యార్థులు ఒకే పోర్టల్ ద్వారా బహుళ బ్యాంకుల సేవలు పొందడానికి, దరఖాస్తు చేసేందుకు వీలు కల్పిస్తోంది. 2024-25 నుంచి 2030-31 వరకు పథకం అమలుకు కేంద్ర నిధులు కేటాయించింది.

**దరఖాస్తు చేయవచ్చు ఇలా..**

www.vidyalaxmi.co.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలు నమోదు చేయాలి. పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, చివరిసారి చదివిన కోర్సుకు సంబంధించి, ప్రస్తుతం చదవాలనుకుంటున్న కోర్సు ప్రవేశ పత్రం, ఆదాయ ధ్రువపత్రాలు జత చేయాలి.

**పథకానికి అర్హులు ఎవరంటే ?**

- ఇంజినీరింగ్, వైద్యవృత్తి విద్యాకోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు.
- కుటుంబ వార్షికాదాయం రూ.4 లక్షలలోపు ఉండాలి.
- ఒకసారి మాత్రమే దరఖాస్తుకు వెసులుబాటు ఉంది.

**మూడు విడతలుగా మంజూరు..**

రుణం మంజూరుకాకపోతే కారణాలు చెబుతూ 15 రోజుల్లో ఈమెయిల్‌కు సందేశం వస్తుంది. అర్హులుగా ప్రకటిస్తే మూడు విడతల్లో రుణం మంజూరు చేస్తారు. మొదటి విడతలో రూ.4 లక్షలు, రెండో విడతలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు, మూడో విడతగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు అందిస్తారు. తీసుకున్న రుణం ఆధారంగా 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తారు.

## అందెల సందడి

కాకినాడ ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని శుభం కాపు కల్యాణమండపం ఆవరణలో ఆదివారం కాపు వన సమారాధన జరిగింది. అందులో భాగంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్యాలతో అలరించారు. - న్యూస్‌టుడే, సర్పవరం

## దస్త్రం.. దాచిపెట్టాలిగా..

రోగి వివరాలు, అందించే వైద్య సంబంధ అంశాలు తెలుసుకునేందుకు కేస్ షీట్ చాలా ముఖ్యం. అలాంటి వాటిని కాకినాడలోని సర్వజన ఆసుపత్రిలోని ఓపీ విభాగం రెండో అంతస్తు వరండాలో ఇలా నిర్లక్ష్యంగా కుప్పలుగా పడేశారు. వీటిని చూసిన వారంతా ఇదేం నిర్వహణ అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే తడిచిపోయేలా ఉన్నాయి. ఈదురుగాలులకు ఎగిరిపోతే ఎవరు బాధ్యత వహిస్తారనేది అర్థం కాని పరిస్థితి. సిబ్బందిని అడిగితే.. త్వరలోనే వీటిని రికార్డుల గదిలో భద్రపరుస్తామని చెప్పారు. జీజీహెచ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ

## దారి.. సౌకర్యం సమకూరి..!

కాకినాడ-సామర్లకోట మధ్య 4.5 కి.మీ. మేర తీవ్రంగా దెబ్బతిన్న ర.భ.శాఖ రహదారిని బాగు చేశారు. రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ దారిలో కొన్నేళ్లుగా చోదకులు నరకం చూస్తున్నారు. ప్రజల నుంచి అందిన అనేక ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ దారి మరమ్మతులకు రూ.4.50 కోట్లు కేటాయించింది. కొన్నాళ్ల కిందట తాత్కాలికంగా మరమ్మతులు చేసినా, భారీ వర్షాలకు యథాస్థితికి చేరింది. గుత్తేదారుకు చేసిన పనికి బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేపట్టలేదు. ఇటీవల ప్రభుత్వం రూ.1.70 కోట్లు చెల్లించడంతో పది రోజులుగా మరమ్మతులు ప్రారంభించారు. గుంతలు పూడ్చి తారు వేయడంతో దారి సౌకర్యంగా తయారైంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ రోడ్డు దయనీయంగా మారింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ చర్యలతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

## లంక దరి కరిగినది..

వరద ఉద్ధృతికి పంటలతోపాటు విలువైన లంక భూములు భారీగా కోతకు గురయ్యాయి. ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం మండలాల్లో కోత ఎక్కువగా ఉంది. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కొన్నేళ్లుగా 1,300 ఎకరాల భూమి నదిలో కలిసిపోయింది. ఈ ఏడాదే వంద ఎకరాల వరకు కనుమరుగైనట్లు అంచనా. గ్రోయిన్‌లు నిర్మించకపోతే ఇంకా నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. ఆత్రేయపురం మండలం పేరవరం, పులిదిండి, వసంతవాడ, ర్యాలి, బొబ్బర్లంక ప్రాంతాల్లో ఈ ఏడాది 30 ఎకరాల వరకు గోదావరిలో కలిసిపోయింది. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు తెలిపారు. సమస్యను హెడ్ వర్క్స్ ఏఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా పలుచోట్ల రివిట్‌మెంట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

## సూరీడ్ని ఇంకా వాడుకుందాం..!

### ఇప్పటికే జిల్లాలో 3,960 గృహాలపై సౌర పలకలు

ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

విద్యుత్తు బిల్లును జీరో చేసుకోవచ్చు. ఒక్కసారి పెట్టుబడితో 25 ఏళ్లపాటు అవసరమైన విద్యుత్తును వినియోగించుకోవచ్చు. వాడుకోగా మిగిలినదానిని విద్యుత్తు సంస్థకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీ కల్పిస్తూ ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనను గృహ వినియోగదారులకు అమలు చేస్తోంది. దీనికి రూ.70 వేల కోట్లను కేటాయించింది. 50 శాతం రాయితీతో 1 నుంచి 3 కిలో వాట్‌ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. మిగతా 50 శాతం బ్యాంకు రుణం కల్పిస్తూ వినియోగదారు వాయిదాల పద్ధతిలో చెల్లించే ఏర్పాట్లు చేసింది. ఎస్‌బీఐ, యూబీఐ, బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు వంటి జాతీయ బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తోంది.

**ఇదీ ప్రగతి**

| డివిజన్ | రిజిస్ట్రేషన్ | రూఫ్‌టాప్ వేసిన గృహాలు | సామర్థ్యం (కిలోవాట్స్) |
|---|---|---|---|
| జగ్గంపేట | 4,088 | 711 | 2,144 |
| కాకినాడ | 5.069 | 2,236 | 7,611 |
| పెద్దాపురం | 3,328 | 1,013 | 3,168 |

**ఇవీ ఉపయోగాలు**

- ✦ విద్యుత్తు పోతుందనే టెన్షన్ ఉండదు.
- ✦ 300 యూనిట్ల వరకు విద్యుత్తు పొందవచ్చు.
- ✦ ఎలక్ట్రానిక్ వాహనాలకు ఛార్జింగ్ చేసుకోవచ్చు.
- ✦ గ్రూప్ హౌసింగ్ సొసైటీలకు రాయితీ వర్తింపు.

**రిజిస్ట్రేషన్ ఇలా:** https://pmsuryaghar.gov.in. వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, కన్జ్యూమర్ లాగిన్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏడు దశల్లో మీకు అవసరమైన వివరాలు నమోదు చేసుకోవచ్చు. వెండర్‌ను మీరే ఎంపిక చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము, మీటర్ ఖరీదు, అదనపు లోడు, మీటర్ అగ్రిమెంట్ వంటి వివరాలను ఆన్‌లైన్‌లో పూర్తి చేసుకోవచ్చు. టోల్ ఫ్రీ నంబరు 1912ను కూడా సంప్రదించవచ్చు. సమీపంలో ఏపీఈపీడీసీఎల్ ఏఈ ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఒక కిలో వాట్‌కు రూ.60 వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.1.20 లక్షలు, మూడు కిలో వాట్‌లకు రూ.1.80 లక్షలు ఖర్చవుతుంది.

**రాయితీ ఇలా..**

- కిలో వాట్‌కు **రూ.30,000**
- రెండు కిలోవాట్‌లకు **రూ.60,000**
- మూడు కిలోవాట్‌లకు **రూ.78,000**
- ఒక కిలోవాట్ సామర్థ్యంలో రూఫ్‌టాప్‌కు ఏర్పాటుకు ఇంటిపై 100 చదరపు అడుగుల స్థలం అవసరం.

**అమలులో జిల్లాకు మూడో స్థానం**

ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో పీఎం సూర్యఘర్ అమల్లో కాకినాడ జిల్లా మూడో స్థానంలో ఉంది. కాకినాడ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్‌లలో 3,960 గృహాలపై ఇప్పటికి 12,922.86 కిలోవాట్‌ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేశారు. దీనిలో కాకినాడ డివిజన్ ముందంజలో ఉంది. పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ప్రసాద్ కోరారు. సులభతరంగా యూనిట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నేడు అర్జీలు ఇవ్వొచ్చు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం కాకినాడలోని కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌కు రాలేనివారు meekosam.ap.gov.in వెబ్‌సైట్ తెరిచి తమ ఫిర్యాదులు దాఖలు చేయవచ్చునని తెలిపారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669


## సౌకర్యాలకే.. విశ్రాంతి..!

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

డ్రైవర్లకు కంటి నిండా నిద్ర.. సరైన విశ్రాంతి ఉంటేనే బస్సులు సక్రమంగా నడిపే వీలుంటుంది. చోదకుడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. హైదరాబాద్, కర్నూలు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.. తదితర దూర ప్రాంతాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో డ్రైవర్లు కాకినాడ ఆర్టీసీ డిపోకు బస్సులతో వచ్చి వెళ్తుంటారు. వీరే కాక గోకవరం, నర్సీపట్నం, తుని ప్రాంతాలకు చెందిన డ్రైవర్లుసైతం రాత్రి సమయంలో నైట్ హాల్ట్ తీసుకోవాల్సిఉంటుంది. వీరంతా కాకినాడ ఆర్టీసీ బస్టాండులోని గదుల్లో విశ్రాంతి తీసుకుంటారు. కానీ సౌకర్యాలు లేవు.

**ఎదుర్కొంటున్న ఇబ్బందులు..**

భవనం పైభాగాన ఉన్న వసతి గదిలో సుమారు 18 వరకు మంచాలున్నాయి. అవి ఏమాత్రం చాలడం లేదు. పరుపులు ఉన్నా కొన్నింటికి సరైన దిండ్లు లేకపోవడంతో చోదకులు పడుకునేందుకు ఇబ్బందిగా ఉంటోంది. రెండు మంచాలకు పరుపులు లేవు. ఇక నిత్యం 60 నుంచి 80 మంది వరకు డ్రైవర్లు ఇక్కడ విశ్రాంతికి వస్తారు. వీరిలో మంచాలు సరిపోక కింద చాపలు వేసుకుని, మరికొందరు బస్సుల్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. పైభాగాన నాలుగైదు చోట్ల సిమెంటు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. పై పిల్లర్లు మూడు చోట్ల బీటలు వారాయి. సిమెంటు పెచ్చులూడి పడేలా ఉన్నాయి. దీంతో గదిలో విశ్రాంతి తీసుకుంటున్న డ్రైవర్లు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు సౌకర్యాలు మెరుగుపర్చాలని చోదకులు కోరుతున్నారు.

పైభాగాన పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయిలా..

మంచం దుస్థితి


ఉద్యోగావకాశాలు
త్వరలో తునిలో ప్రారంభించబోతున్న మా నూతన షోరూమ్‌లో పనిచేయుటకు
శారీస్, లేడీస్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, హ్యాండ్లూమ్, ఫర్నిషింగ్ సెక్షన్లలో నూతన మరియు అనుభవం కలిగిన
▪ సూపర్‌వైజర్స్ ▪ సేల్స్‌మెన్ / సేల్స్‌గర్ల్స్ ▪ హెల్పర్స్
▪ కంప్యూటర్ బిల్ రైటర్స్ ▪ ఆల్టరేషన్ టైలర్స్
▪ క్యాషియర్స్ ▪ ఎలక్ట్రీషియన్స్ కావలెను
ఇంటర్వ్యూలు జరుగు తేదీలు :
నవంబర్ 18 & 19
ఉ॥ 11 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు
ఇంటర్వ్యూలు జరుగు చిరునామా :
సత్య శ్రీనివాస వేదిక, వాణి అపార్ట్‌మెంట్స్ ఎదుట, దారాలమ్మ గుడి ప్రక్కన, జి.ఎన్.టి. రోడ్, తుని
సంప్రదించవలసినది:
88850 10134
ఆకర్షణీయమైన జీతాలు, ప్రత్యేకమైన ఇన్‌సెంటివ్ ప్యాకేజీలు
ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాల (బయోడేటా, 2 లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ వివరములు తప్పనిసరి) తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావలెను.
వివరాలు లేనిచో ఇంటర్వ్యూకు అనర్హులు.
SOUTH INDIA shopping mall
Textiles | Jewellery
శ్రీరామ కాంప్లెక్స్, శ్రీరామ థియేటర్ ఎదుట, జి.ఎన్.టి. రోడ్, తుని


(c) eenadu

## తలుపులమ్మ లోవ.. భక్తజన తోవ

తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో నిండిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్లకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 6 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ.2.50 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

## తప్పు చేయొద్దు.. ముప్పు తేవద్దు

పిఠాపురం నియోజకవర్గంలోని రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం పోలీసుస్టేషన్‌కు రప్పించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. చెడు నడవడిక కలిగి పాత కేసుల్లో నేరస్థులుగా ఉన్నవారంతా ప్రవర్తన మార్చుకోవాలన్నారు. నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం ఆయా స్టేషన్ల వారిగా రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు. నేరాలకు దూరంగా ఉంటామని వారి నుంచి బాండ్లు తీసుకున్నారు. ఎస్సైలు మణికుమార్, జాన్‌భాష, వెంకటేష్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

## అమ్మ ప్రేమకు వెలుగుల వందనం

ర్యాలికి చెందిన ఇంద్రజాలికుడు శ్యామ్ జాదూగర్ తన అమ్మ నాగవీరమణి స్మారకంగా ఇంటి వద్ద మందిరం నిర్మించారు. కార్తికమాసం సందర్భంగా ఆదివారం వేకువజామున మందిరం వద్ద సహస్ర జ్యోతులతో అమ్మ అక్షర రూపంలో ప్రమిదలను వెలిగించి ప్రేమను చాటుకున్నారు. శ్యామ్ మాట్లాడుతూ చిన్నతనంలో ర్యాలి గ్రామానికి వచ్చామని, తల్లిదండ్రులు పెంపకం వల్ల ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సమాజానికి తనవంతు సహకారం అందించగలుగుతున్నానన్నారు. - న్యూస్‌టుడే, ర్యాలి (ఆత్రేయపురం)

## పర్యాటక విందు.. ఆనందాల పసందు

కాకినాడ జిల్లా కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం పర్యాటకులతో ఆదివారం కిటకిటలాడింది. రాష్ట్ర, జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. చెక్కల వంతెనపై నడుచుకుంటూ మడ అడవులను ఆస్వాదించారు. ఆట పాటలతో మహిళలు, చిన్నారులు, విద్యార్థులు రోజంతా హాయిగా గడిపారు. అనకాపల్లికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులంతా నీటి పిల్లి బొమ్మ చుట్టూ కూర్చుని చిత్రాలు తీసుకుంటూ సందడి చేశారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

## మందకొడిగా ఈకేవైసీ నమోదు

పెద్దాపురం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు, అవినీతికి తావులేకుండా అడ్డుకట్ట వేసేందుకు, సకాలంలో బిల్లులు చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. కాకినాడ జిల్లాలోని 20 మండలాల్లో కొన్నిరోజుల నుంచి వేతనదారుల వివరాలు నమోదు ప్రక్రియ సాగుతోంది. దీనిపై అవగాహన లేక కొందరు వేతనదారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా కొందరు ఆసక్తి చూపడంలేదు. సిబ్బంది వేతనదారులకు దీనిపై అవగాహన కల్పించినా చాలా మంది పట్టించుకోవడం లేదు. చేసేదిలేక చాలా గ్రామాల్లో సిబ్బంది ఇళ్లకు వెళ్లి మరీ ప్రక్రియ చేస్తున్నారు.

కార్మికులకు ఈ-కేవైసీ నమోదు చేస్తున్న అధికారులు

| కాకినాడ జిల్లా వివరాలు | |
| --- | --- |
| మొత్తం కూలీలు | : 3,49,132 |
| ఈ-కేవైసీ చేయించుకున్నవారు | : 2,64,567 |
| ఇంకా చేయాల్సింది | : 84,565 |

**నమోదు ప్రక్రియ సాగుతోంది..**

ఉపాధి కూలీల ఇళ్లకు వెళ్లి తమ సిబ్బంది ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారు. జిల్లాలోని ఇప్పటి వరకు 75 శాతం నమోదు జరిగింది. ఈవిధానంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు వలసల నివారణకు ఈ-కేవైసీ దోహదపడుతుంది. - ఎం. భానుప్రకాష్, ఏపీడీ, ప్రత్తిపాడు

## అదిగదిగో ద్వారపూడి.. ఇదిగిదిగో భక్తి ఇరుముడి

ద్వారపూడి, న్యూస్‌టుడే: హరిహరసుతనే.. శరణమయ్యప్ప.. ఆపద్బాంధవనే.. శరణమయ్యప్ప.. అంటూ మాలధారుల శరణుఘోషతో ద్వారపూడిలోని అయ్యప్ప దేవాలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దేశంలోనే శబరిమల క్షేత్రం ఎంతో ప్రసిద్ధి. మాలధారులంతా ఇరుముడులు సమర్పించేందుకు వెళ్తుంటారు. అక్కడకు వెళ్లలేని వారంతా మండలంలోని ద్వారపూడి ఆలయానికి వస్తారు.

**రోజూ 10వేల మంది..:** అయ్యప్ప దీక్షలు కార్తికమాసంలో ప్రారంభమై మకరసంక్రాంతి వరకు కొనసాగుతాయి. ఈ మండల కాలంలో 41 రోజుల దీక్ష చేస్తారు. దీక్ష పూర్తి చేసి కేరళ వెళ్లలేని వారు ఇక్కడ ఇరుముడులు సమర్పిస్తారు. ఆంధ్రా, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి రోజూ 600 నుంచి 2వేల వరకు ఇరుముడులు సమర్పించేందుకు వస్తారు. దర్శనం కోసం 6వేల నుంచి 10వేల వరకు వస్తారు. దాదాపు 3వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారని ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి తెలిపారు.

ఆలయంలో స్వాముల సందడి

**ఆంధ్రా శబరిమల..:** ఇరుగు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. అందుకే ఆంధ్రా శబరిమలగా పేరొందింది. ఎకరాలో ఏర్పాటు చేసిన పవిత్రమైన 18 మెట్లు ఈ ఆలయం ప్రత్యేకత. ద్వారపూడికి చెందిన వ్యాపారి ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి ఒక కమిటీ ఏర్పాటు చేసి విరాళాలతో 1983లో నిర్మాణానికి భూమిపూజ చేశారు. 1989లో కంచి పీఠాధిపతి శ్రీశ్రీ జయేంద్ర సరస్వతి చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అప్పటినుంచి నిత్యం అర్చన, ప్రత్యేక పూజలు, నెయ్యి అభిషేకం, ఇరుముడి సమర్పణ జరుగుతున్నాయి. రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 8 వరకు దర్శనానికి అనుమతిస్తారు. నిత్యం మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు.

**ప్రాంగణంలో ఆకట్టుకునేలా ఉపాలయాలు**

ఈ ప్రాంగణంలో దేశంలోనే రెండో అతిపెద్ద ఆది యోగి విగ్రహాన్ని చూడగానే తన్మయత్వం కలుగుతుంది. ప్రవేశంలో సుబ్రహ్మణ్య, ఆంజనేయస్వామి భారీ విగ్రహాలు ఎంతో ఆకట్టుకుంటాయి. 10కి పైగా ఉపాలయాలు ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో సాయిబాబా మందిరం, శివాలయం, దుర్గాదేవి, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి, అష్టాదశ శ్రీఉమామాలింగేశ్వరస్వామి, భూగర్భ ద్వాదశ జ్యోతిర్లింగ, పాపవిమోచన దేవాలయాలు ఉన్నాయి. దశావతరాలతో కూడిన వేంకటేశ్వరస్వామి, జగన్మాత అంకాళమ్మ, శనీశ్వరాలయం, నవగ్రహ, శ్రీలక్ష్మీకుబేర ఆలయాలనూ చూడొచ్చు. యజ్ఞయాగాదులు నిర్వహించడానికి యాగశాల ఉంది.

అయ్యప్పస్వామి మూలవిరాట్టు

భక్తుల బృందానికి స్వాగతం పలుకుతున్న ఉత్తరపీఠాధిపతి సభ్యులు

## కల్తీ నెయ్యి సరఫరా పాపానికి మూల్యం తప్పదు

గాంధీనగర్: నిషేధిత సంస్థతో కుమ్మక్కై కల్తీ నెయ్యి సరఫరాకు కారణమైన వైకాపా పాలకులకు ... తప్పదని వీరయ్యస్వామి హెచ్చరించారు. కాకినాడ ... వీరయ్యస్వామి సుమారు వెయ్యి మంది హిందూ భక్తులతో ... ఈ సందర్భంగా ఆదివారం నగర గణేశ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, మాజీ అధ్యక్షుడు దువ్వూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు కాకినాడలోని భానుగుడి సెంటర్ వద్ద వారికి స్వాగతం పలికి పిఠాపురం వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్యస్వామి మాట్లాడుతూ తిరుమల కేంద్రంగా గతంలో జరిగిన పాపాలు అనేకం నేడు వెలుగులోకి వస్తున్నాయన్నారు.

## జనసేన కమిటీలో కిషోర్‌కు స్థానం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీకి అయిదుగురు సభ్యులతో నియమించిన కమిటీలో గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఓదూరి కిషోర్‌కు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్థానం కల్పించారు. ఏడాదిన్నరగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన మర్రెడ్డి శ్రీనివాస్ స్థానంలో కిషోర్‌ను నియమించినట్లు జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి ఆదివారం ప్రకటించారు. తనతోపాటు ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కమిటీలో కొనసాగుతుండగా కొత్తగా కిషోర్‌ను నియమించినట్లు తెలిపారు. మర్రెడ్డి శ్రీనివాస్ అనపర్తి జనసేన ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే కిషోర్‌ను నియమించారని చెప్పారు. ఎవరినీ తొలగించడం కాని, తప్పించడంకాని కాదని, అందరికీ బాధ్యతలు అప్పగించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారన్నారు.

## అన్నవరం @ 10,523 వ్రతాలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. రద్దీ నేపథ్యంలో తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. ఉదయం 8 గంటల తర్వాత రద్దీ మరింత పెరిగింది. ఘాట్‌రోడ్డులో రెండు కార్లు సాంకేతిక లోపంతో నిలిచిపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాహనాలను కొండపైకి అనుమతించకుండా కొండ దిగువన కళాశాల ప్రాంగణంలో పార్కింగ్ చేయించారు. అనేక మంది భక్తులు నూతన మెట్ల మార్గం (ఇంకా పనులు పూర్తికాలేదు) నుంచి రత్నగిరికి చేరుకున్నారు. కంపార్టుమెంట్లు భక్తులతో కిక్కిరిశాయి. రూ.300 వ్రతమండపాల ప్రాంగణం కిక్కిరిసింది. వ్రత టికెట్ విక్రయాలను సుమారు గంట నిలిపివేశారు. సాధారణ పరిస్థితి వచ్చిన తర్వాత ప్రారంభించారు. అత్యధికంగా 10,523 వ్రతాలు జరిగాయి. ఇందులో రూ.300 వ్రతాలే 7,072 ఉన్నాయి. ఓ భక్తురాలు అస్వస్థతకు గురవ్వడంతో ప్రాథమికి చికిత్స అందించారు. పలువురు భక్తులు పాదయాత్ర చేసుకుంటూ స్వామి సన్నిధికి చేరుకున్నారు. సాయంత్రం స్వామివారి రథ సేవ జరిగింది. ఏలూరుకు చెందిన చిట్టూరి జయబాబు నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

ఆలయ ప్రాంగణంలో భక్తుల కిటకిట

## గత ప్రభుత్వంలో అక్రమ కేసులు
మంత్రి సుభాష్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో శెట్టిబలిజలపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెడితే, ఆ పార్టీ నాయకులు పట్టించుకోకుండా విహార యాత్రలకు వెళ్లారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. అమలాపురంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గతంలో కొంతమంది కులం పేరిట పదవులు పొంది దోచుకున్నారన్నారు. తోటి శెట్టిబలిజ నాయకులే తనను రాజకీయంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని శెట్టిబలిజలను గతంలో ఓసీల్లో కలిపారని, బీసీల్లో చేర్చేందుకు పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్(ఎస్‌ఏఎఫ్) ద్వారా సామాజిక వర్గంలోని పేదలకు సహకారం అందిస్తామన్నారు. 90 శాతం కాపులు తనకు ఓటు వేశారని, ఆ కులానికి చెదోడుగా ఉంటానన్నారు. తనకు రాజకీయ జీవితం ప్రసాదించిన తెలుగుదేశం పార్టీలోనే జీవితాంతం ఉంటానని, లోకేష్ బృందంలో కొనసాగుతానని మంత్రి అన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సుభాష్

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

## గోదావరి జిల్లాలా మజాకా..

● సంక్రాంతికి అప్పుడే నిండిపోయిన రైళ్ల రిజర్వేషన్లు

**హైదరాబాద్ నుంచి ఎక్కువగా**

సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలే గుర్తుకొస్తాయి. ఇక్కడి వారు ఉద్యోగ, వ్యాపారాల దృష్ట్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమ వారితో కలిసి పండగ చేసుకునేందుకు వారంతా వస్తారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి పెద్దఎత్తున వస్తారు. జనవరి 13 నుంచి పండగ సందడి మొదలవుతుంది. ఈ క్రమంలో జనవరి 12, 13వ తేదీల్లోనే తమ ప్రాంతాల్లో ఉండేలా రిజర్వేషన్లు చేయించుకున్నారు. జనవరి 15 వరకు రోజూ, వారపు ప్రత్యేక రైళ్లు అన్ని నిండిపోయాయి. విశాఖ, గోదావరి, కాచిగూడ, గరీబ్‌రథ్, ఫలక్‌నామా, కోణార్క్, ఈస్ట్‌కోస్ట్, గౌతమి తదితర రైళ్లల్లో రిజర్వేషన్లు వెయిటింగ్ లిస్టుకు చేరాయి. ముందు తేదీలకు మాత్రం దొరుకుతున్నాయి.

న్యూస్‌టుడే, తుని: భాగ్యనగరం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చే రైళ్లకు సంక్రాంతి సందడి వచ్చేసింది. పెద్ద పండగ వచ్చేందుకు ఇంకా రెండు నెలలు ఉండగా రైల్వేశాఖకు మాత్రం అప్పుడే రావడం విశేషం. రెండు నెలల ముందుగానే రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. అందులో హైదరాబాద్, విజయవాడ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరికి వచ్చే రైళ్లకు రిజర్వేషన్లు నిండిపోగా, ఇక్కడి నుంచి అటువైపు వెళ్లే వాటికి మాత్రం రిజర్వేషన్లు లభ్యం అవుతున్నాయి.

తుని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు

**80 వేల మంది ప్రయాణికులు..**

ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, తుని, సామర్లకోట, కాకినాడ ప్రధాన స్టేషన్లు. వీటితో పాటు చిన్న స్టేషన్లు కలిపి రోజుకు సుమారు 100కు పైగా రైళ్లల్లో దాదాపు 80వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ప్రత్యేక రైళ్లు, జనరల్ బోగీలు కలిపి సంక్రాంతి సమయంలో ఈ సంఖ్య లక్ష దాటే అవకాశం ఉంది. పండగ రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు కూడా ప్రారంభం అవుతాయన్నారు.

సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

## విద్యలో నాణ్యత పెంచండి

గాంధీనగర్(కాకినాడ): మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థి తనకు కావాల్సిన కోర్సు, నైపుణ్యాలు నేర్చుకునేలా విధానాలు రూపొందించి అమలు చేయడం ద్వారా విద్యానాణ్యత పెంచాలని నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ ఛైర్మన్ అనిల్ సహస్రబుద్ధే పేర్కొన్నారు. ఎన్‌బీఏ న్యూఢిల్లీ, జేఎన్‌టీయూకే, ఏపీ సంయుక్తంగా అవుట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్, గుర్తింపుపై ఎన్‌బీఏ అవగాహన కార్యశాలను ఆదివారం జేఎన్‌టీయూకేలో నిర్వహించారు. వీసీ ప్రసాద్, ఎన్‌ఈపీ, న్యాక్, ఎన్‌బీఏ ఛైర్మన్ అనిల్ సహస్రబుద్ధే, ఎన్‌బీఏ మెంటార్ సెక్రటరీ అనిల్‌కుమార్ సస్సా, ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్ఎస్ పట్నాయక్, ఎం.ఎస్.రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ డీన్ రంగనాథ్, జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ఐక్యూఏసీ, సీబీ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

## డ్వాక్రా రుణాలపై విచారణ

పిఠాపురం: పిఠాపురం మండలంలోని వెల్దుర్తి, బి.కొత్తూరు గ్రామాల్లో డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ ఆదివారం జరిగింది. స్త్రీనిధి డీజీఎం శ్యామల, సెర్ప్ మేనేజర్లు భవానీ, కస్తూరి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో సభ్యులను ప్రశ్నించారు. వెల్దుర్తిలో రూ.8 లక్షలు, కొత్తూరులో రూ.19 లక్షల రుణాలు అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా గుర్తించారు. చాలామంది రుణాలు చెల్లిస్తున్న బకాయిలు తీరడం లేదని, వేర్వేరు పేర్లతో రుణాలు పొందినట్లు తేలిందన్నారు. ఏపీఎం ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## శస్త్రచికిత్స చేసిన కాసేపటికే మహిళ మృతి

కాకినాడ జీజీహెచ్‌లో మృతురాలి బంధువుల ఆందోళన

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: హెర్నియా శస్త్రచికిత్స చేసిన కొద్దిసేపటికే మహిళ మృతిచెందిన ఘటన కాకినాడ జీజీహెచ్‌లో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆపరేషన్ తరువాత అపస్మారక స్థితిలో ఉండగా ఆర్‌ఐసీయూలో చేర్చారని, ఏదో జరిగిందని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. సినిమా తరహాలో కొన్ని గంటలపాటు శస్త్రచికిత్స చేసి చివరికి మృతదేహాన్ని తమకు అప్పగించారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వివరాల ప్రకారం.. పిఠాపురం రథాలపేటకు చెందిన కవిత(20)కు వివాహమైంది. పొత్తికడుపులో కొద్దిరోజులుగా వాపు రావడంతో ఈ నెల 10న జీజీహెచ్‌లో చేర్చారు. పరీక్షల అనంతరం ఆమెకు హెర్నియా అని నిర్ధారించి జీజీహెచ్ వైద్యులు శనివారం మధ్యాహ్నం శస్త్రచికిత్స చేసి ఆర్ఐసీయూ-1కి తరలించారు. అప్పటినుంచి పీజీల నుంచి హెచ్‌వోడీల వరకు ఒక్కొక్కరిగా వచ్చి ఆమె పరిస్థితిని పరిశీలించారు. ఇదంతా చూసిన మహిళ బంధువులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. చివరకు చికిత్సపొందుతూ సాయంత్రం 6 గంటల సమయంలో మృతిచెందింది. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులు వైద్యులను అడగ్గా ఆమె తీవ్ర అస్వస్థత కారణంగా మృతిచెందిందన్నారు. కొద్దిసేపు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బాధిత కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఊరి నుంచి బంధువులు వచ్చాక తీసుకెళ్తామని వైద్యులకు చెప్పారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో మృతదేహాన్ని తీసుకెళ్లారు. దీనిపై ఆసుపత్రి వైద్యాధికారులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## మానసిక వికాసానికి క్రీడలు దోహదం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 39వ సబ్ జూనియర్, 41వ సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు స్థానిక సూర్యకళా మందిరంలో జరిగాయి. ఆదివారం పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొండబాబు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు ప్రోత్సాహాన్నిస్తోందన్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 250 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభచూపిన వారిని ఎమ్మెల్యే సత్కరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్‌సలామ్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్, రాయుడు శ్రీను, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విజేతలతో ఎమ్మెల్యే కొండబాబు

EENADU e Classifieds

**BUSINESS SERVICES**

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ దర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**REAL ESTATE**

**FLAT FOR SALE**

**RAJAMAHENDRAVARAM CITY**

3 BHK Flat అమ్మకం. రాజమండ్రి, మోరంపూడి జంక్షన్ వద్ద, హైవే ప్రక్కన 3 BHK Flat అమ్మకమునకు కలదు. Contact Cell: 98480 56558.

**LAND FOR SALE**

**GENERAL**

రాజమండ్రికి 30 కి.మీ. దూరంలోగల మురారి - గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ల రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మబడును. (నో బ్రోకర్స్), ✆ 90329 88265.

**PLOT FOR SALE**

**KAKINADA RURAL**

560 Sq.Yds Plot for Sale in Chollangi, Besides Yanam KKD Road; Contact Cell: 93917 11101.

EENADU for Advertisement Contact: 8008597607

**JOBS**

WANTED COMPUTER Operator female (MS Office, MS Excel) with speed Typing in English at Amalapuram. Salary upto 18K. ✆ 96184 66665.

Data Entry Operator (M/F) with Good knowledge in MS Excel. 1 yr Exp. Location: Rajahmundry. Email: giri.fomra@gmail.com ✆ 93902 07565, 99482 05000.

శాఖాహార (వెజిటేరియన్) వంటలు, ఇంటిపని చేయుటకు కాకినాడ ఇంటిలో ఉంటూ ఏ బాదరబందీ లేని 35 సం॥లలోపు స్త్రీ కావలెను. ✆ 99853 57819, 94911 95169.

అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకులో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం: 20,000 to 25,000 + ఇన్సెంటివ్, నో టార్గెట్స్, 2 వీలర్ మస్ట్. ✆ 73826 65577.

రాజమండ్రి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ శిక్షణ & ఉద్యోగావకాశాలు, ✆ 96661 20044.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. ✆ 85209 80099,85208 74499.

RJYలో FMCG ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కొరకు సేల్స్ మేన్ కావలెను. సంప్రదించవలసిన టైం: 9 am to 6 pm. Contact Cell: 95507 32122.

రాజమండ్రిలోని శ్రీ గిరిధారి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందు పనిచేయుటకు CC Roadsలో అనుభవం కలిగినవారు కావలెను. Contact Cell: 80991 91919.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జిలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Contact Cell: 96423 75791.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-25 పైౖ॥ అనపర్తి ఆఫీసు: 08857-226908

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**ధరవరలు**

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
| --- | --- |
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 22,000 |
| పాతకాయ: గండేరా | 29,000 |
| గటగట | 27,000 |
| కొత్తకాయ: గండేరా | 28,000 |
| గటగట | 26,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 20,000-21,000 |
| కొత్త (పచ్చి) కాయ | 19,000-20,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర** కిలోకు రూ॥లో

| | |
| --- | --- |
| ఫారంరేటు | 111-00 |
| రిటైల్ లైవ్ | 138-00 |
| డ్రెస్ట్ | 200-00 |
| స్కిన్‌లెస్ | 228-00 |

## అక్కడ ఏం చేశామంటే..!

● నగరంలో పర్యటించిన కుంభమేళా నిర్వహణ బృందం

● పుష్కరాల ఏర్పాట్లపై దిశా నిర్దేశం

పరిశీలన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 2027 పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. యాత్రికుల రద్దీ నియంత్రణపై కసరత్తు ప్రారంభించింది. తాజాగా జరిగిన ప్రయాగరాజ్ కుంభమేళాలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నారనే దానిపై దృష్టి సారించారు. అక్కడ ప్రభుత్వం రద్దీ నియంత్రణ, నిర్వహణకు సంబంధించి ప్రణాళికలు రూపొందించే ప్రక్రియ ప్రైవేటు కన్సల్టెన్సీలకు అప్పగించింది. అక్కడ పని చేసిన ఏజెన్సీ బృందాన్ని ఇటీవల నగరానికి రప్పించారు. ప్రధానంగా రద్దీ నియంత్రణపైనే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసే క్రమంలో వారి సలహాలు స్వీకరించారు. బృందం సభ్యులు రెండు రోజుల పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టర్, ఎస్పీ, కమిషనర్లతో సమావేశమయ్యారు. పుష్కరాలకు సంబంధించి గోదావరి ఘాట్‌ల విస్తరణ, రద్దీని ఎదుర్కోవడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

**కుంభమేళాలో ఇలా**

● ఏఐ టెక్నాలజీ వినియోగించారు. 2 వేల వరకూ ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు. ● కుంభమేళాలో 27 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేశారు. ● 256 ఘాట్‌లు తీర్చిదిద్దారు. ● 800 వరకూ పుష్కర నగరాలు నిర్మించారు. 1.16 లక్షల మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

**గోదావరి పుష్కరాలకు చేసిన సూచనలు**

● 60 వరకూ ఏఐ కెమెరాలు ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేయాలి. ● ఆతిథ్య నగరం రాజమహేంద్రవరంలో రెండు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏఐకి అనుసంధానం చేయాల్సి ఉంది. ● గోదావరి పుష్కరాలకు సుమారు 6 కోట్ల నుంచి 8 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రాథమిక అంచనా. ● 14 పుష్కర నగరాలు ఏర్పాటు చేయాలి. ● 1000 తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలి. ● ప్రస్తుతం అందుబాటులో 17 ఘాట్‌లు ఉన్నాయి. వీటిని విస్తరించాల్సిన అవసరం ఉంది.

**అవాంతరాలు అధిగమిస్తేనే**

✦ గోదావరి ఘాట్‌లను ఆనుకొని దిగువన శాశ్వత నిర్మాణాలు ఉండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో ముందుగానే వాహనాలను నగరంలోకి అనుమతించకూడదు. రైళ్లు, బస్సులు, ఇతర సొంత వాహనాల్లో వచ్చే యాత్రికులు పుష్కర నగరాలు వరకూ మాత్రమే వాహనాలను అనుమతించాల్సి ఉంది. ✦ గోదావరి తీరం ఆనుకొని 30, 40 అడుగుల రోడ్లు మాత్రమే ఉన్నాయి. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం 60, 80 అడుగులుగా విస్తరించాల్సి ఉంది. ✦ గోదావరి ఘాట్‌లను అనుసంధానం చేయాలని గత పుష్కరాలకే ప్రతిపాదించారు. ఇప్పటి వరకూ ఆ పనులు చేపట్టలేదు. ✦ నగరానికి బయటే వాహనాలు నిలిపేశారు. ఘాట్‌లకు కనీసం రెండు కి.మీ దూరం వరకూ కేవలం నడక మార్గం ద్వారానే లోపలకు అనుమతించారు. ✦ అటు కొవ్వూరు, ఇటు కాతేరు మీదుగా రాజానగరం పరిధిలో ఘాట్‌లను పొడిగించే ప్రతిపాదనలు పూర్తి చేయాలి.

(c) eenadu

# కాకినాడ

## రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా- 26, వంకాయలు- 58, 66, 78, బెండకాయలు- 64, పచ్చిమిర్చి- 40, 45, కాకరకాయ- 56, బీర- 60, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 38, క్యారెట్- 60, దొండకాయలు- 66, బంగాళాదుంపలు- 23, 27, ఉల్లి- 22, 28, గోరుచిక్కుళ్లు- 36, దోసకాయలు- 34, చిక్కుళ్లు- 80, 100, చేమదుంపలు- 30, 36, బీట్‌రూట్- 52, కీరదోస- 40, బీన్స్‌కాయలు- 60, అల్లం- 64, క్యాప్సికం- 86, బొబ్బర్లు- 60, చిలకడదుంపలు- 40, ఒకటి చొప్పున అనపకాయ- 40, 45, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 6, 8, మునగకాడ- 8, 10, మామిడికాయ- 12, 15, నిమ్మకాయలు(డజన్)- 24, 30.

## నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- **కాంత, ప్రిడేటర్, బాహుబలి ది ఎపిక్,** దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- **కాంత, ఆర్యన్, మాస్ జాతర,** లక్ష్మి- **శివ,** సత్యగౌరి- **గోపీ గల్లా గోవా ట్రిప్,** తిరుమల- **సంతాన ప్రాప్తిరస్తు,** సీఅండ్‌సీ1- **జటాధర,** సీఅండ్‌సీ 2- **జిగ్రిస్,** శ్రీప్రియ- **మాస్ జాతర,** పద్మప్రియ- **ది గర్ల్‌ఫ్రెండ్,** సూర్య1(వాకలపూడి)- **మాస్ జాతర,** సూర్య 2- **జటాధర.**

## ఆలయాల్లో కార్తిక ద్వాదశి పూజలు

**గాంధీనగర్:** పవిత్ర కార్తికమాసం ద్వాదశి పర్వదినం సందర్భంగా నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జగన్నాథపురం, గాంధీనగర్, వెంకట్‌నగర్, టూటౌన్, గొడారిగుంట, మూడుగుళ్ల సెంటర్ తదితర ప్రాంతాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు, మెయిన్‌రోడ్డులోని రామాలయంలో స్వామివారికి లక్ష తులసి అర్చనలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. దేవాలయం వీధిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు జగన్మోహిని అవతారంలో, మెయిన్‌రోడ్డు రామాలయంలో శ్రీలక్ష్మీహయగ్రీవ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జగన్మోహిని అవతారంలో వేణుగోపాలస్వామివారు

హయగ్రీవ అవతారం

## స్పందనకు వందనం

### పూడిక తీశారు..

**మసీదు సెంటర్(కాకినాడ):** కాకినాడలోని వైఎస్ఆర్ వంతెన కింద ఉన్న మ్యాన్‌హోల్‌లో పూడిక తీయకపోవడంతో మురుగు రహదారిపై పారుతోంది. దాంతో ఆ మార్గంలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో రహదారిపైనే మురుగు.. శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి పూడిక తీయడంతో సమస్య పరిష్కారమైంది.

వైఎస్ఆర్ వంతెన కింద పూడిక తీసిన కాలువ

### గుంతలు పూడ్చారు..

**మసీదుసెంటర్:** నగరంలోని పలు ప్రధాన రహదారులు గుంతలతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. వెంకటేశ్వరకాలనీలోని ప్రధాన కూడలి వద్ద రహదారి గుంతలతో ప్రమాదకరంగా ఉంది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో అధ్వానంగా రహదారి.. శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి గుంతలు పూడ్చడంతో సమస్య పరిష్కారమైంది.

గుంతలు పూడ్చిన వెంకటేశ్వరకాలనీ ప్రధాన రహదారి

## శిథిలమైన రాళ్లు.. రాకపోకలకు ఇక్కట్లు

కాకినాడ ఏడో డివిజన్ పరిధిలోని బర్మాకాలనీ నుంచి రైతుబజార్‌కు వెళ్లే మూడు రోడ్ల కూడలి వద్ద కాలువపై ఏర్పాటు చేసిన స్లాబు రాళ్లు దెబ్బతిన్నాయి. వాహనదారులతోపాటు స్థానికులు రాత్రి వేళ రాకపోకలకు మలుపులో ప్రమాదాలకు గురవుతున్నామని వాపోయారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

# విన్యాస వీర.. పతక ధీర

న్యూస్‌టుడే, మసీదుసెంటర్

చదువుతోపాటు బాలబాలికలు క్రీడల్లో రాణిస్తున్నారు. తగిన సమయమూ కేటాయిస్తున్నారు. ఆరోగ్యంతోపాటు పతకాలూ సాధిస్తున్నారు. కాకినాడ డీఎస్ఏలోని జిమ్నాస్టిక్స్ హాల్‌లో కోచ్ సురేష్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతూ ప్రతిభ చాటుతున్నారు. పలువురు బాలబాలికలు. కఠినమైన విన్యాసాలు అలవోకగా చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇటీవల కాకినాడ డీఎస్ఏలో జరిగిన కాకినాడ జిల్లా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు, ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

సాధనలో బాలిక

### నిత్యం 5 గంటల సాధనతో రాణిస్తున్నా..

ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నా. నాన్న రాధాకృష్ణ పౌరహిత్యం చేస్తారు. అమ్మ అనూష గృహిణి. ఆరేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ తీసుకుంటున్నా. రోజూ రెండు పూటలా కలిపి 5 గంటలపాటు రిథమిక్ జిమ్నాస్టిక్స్ సాధన చేస్తా. ఇప్పటివరకు 12 సార్లు రాష్ట్ర స్థాయి పతకాలు సాధించా. మూడు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. ఐఏఎస్ అవ్వాలనేది నా లక్ష్యం. **- సహస్ర**

### పోలీసు అధికారిగా సమాజానికి సేవలందిస్తా..

నేనిప్పుడు ఏడో తరగతి చదువుతున్నా. నాన్న శ్రీనివాసుబాబు ప్రభుత్వ ఉద్యోగి, అమ్మ భవాని గృహిణి. ఆరేళ్ల నుంచి డీఎస్ఏలో అండర్-14లో ఆర్టిస్టిక్స్ నేర్చుకుంటున్నా. ప్రతిరోజు రెండు పూటలా 4 గంటల పాటు రిథమిక్ జిమ్నాస్టిక్స్ సాధన చేస్తా. ఇప్పటివరకు 5 సార్లు రాష్ట్ర స్థాయి పతకాలు సాధించా. 2 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. పోలీసు అధికారిగా సేవలందిస్తా. **- మోక్షశ్రీ**

### రాష్ట్ర స్థాయి పతకాలు సాధించా..

నేనిప్పుడు ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాన్న సురేష్ ఇంజినీరు, అమ్మ ప్రసన్న గృహిణి. అయిదేళ్ల నుంచి డీఎస్ఏలో కోచ్ సురేష్ మెలకువలు నేర్పుతున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం 5 గంటలపాటు సాధన చేస్తా. ఆర్టిస్టిక్స్‌లో ప్రావీణ్యం పొందా. ఇప్పటివరకు 15 జిల్లా, 15 రాష్ట్ర స్థాయి పతకాలు సాధించా. 11 సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ నెల 5న ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 31వ స్థానంలో నిలిచా. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. సివిల్స్ సాధించి ప్రజలకు సేవలందిస్తా. **- లెహర్ వలీ సాయిప్రసాద్**

## కొత్త ఆలోచనలతో ముందుకు సాగుదాం

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** ప్రస్తుత ప్రపంచంలో కంప్యూటేషనల్ థింకింగ్ ఒక ప్రాథమిక నైపుణ్యమని, ఇది సమస్యలు పరిష్కరించే శక్తిని పెంచుతుందని, డీవీఎస్ఎం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, మేనేజింగ్ ట్రస్టీ దేవరపల్లి హరిప్రసాద్ అన్నారు. యూసీఈకేలోని సెమినార్ హాల్లో ఆదివారం 'బ్రింగింగ్ కంప్యూటేషనల్ థింకింగ్ టు స్కూల్' కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్లు, డీవీఎస్ఎం ఛారిటబుల్ ట్రస్టులతో సంయుక్తంగా అవగాహన, ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరిప్రసాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు నేర్చుకున్న అంశాలను పాఠశాల విద్యార్థులతో పంచుకుంటే వారు చిన్న వయసులోనే కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల్లో సేవా భావం పెంచుతుందన్నారు.



యూసీఈకేలో మాట్లాడుతున్న హరిప్రసాద్

## పర్యావరణ రక్షణకు పాటుపడదాం

**సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ అధ్యక్షుడు ఎన్.కిషోర్‌కుమార్ సూచించారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల బాలుర వసతి గృహంలో హౌస్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్లు డా.వీరయ్య, డా.రాజేష్ ఆధ్వర్యంలో ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ సభ్యులు ఆదివారం 60 టేకు మొక్కలు, 20 కొబ్బరి మొక్కలు వైద్య విద్యార్థుల సహకారంతో నాటారు. ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్ మొక్కలను సమకూర్చినట్లు కిషోర్‌కుమార్ తెలిపారు.

మొక్క నాటుతున్న ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ సభ్యులు

# వృథా ఇలా.. ఆపేదెలా..?

- న్యూస్‌టుడే, మసీదుసెంటర్(కాకినాడ)

శాంతినగర్‌లోని రహదారిపై మంచినీరు

కాకినాడ నగరంలోని పలు ప్రాంతాల్లో మంచి నీరు వృథాగా పోతున్న దృశ్యాలు తరచూ కనిపిస్తున్నాయి. దాంతో నగరవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. లీకేజీ కారణంగా మంచినీరు వృథా ఓ పక్క, కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం మరో పక్క ఉన్నాయి. ఒక వేళ కలుషిత నీరు చేరితే డయేరియా, ఇతర అనారోగ్యం బారినపడే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నగరంలో తరచూ ఏదో ఒక ప్రాంతంలో మంచినీటి పైపులైన్లకు రంధ్రాలు పడటం, పక్కనే ఉన్న కాలువల్లోకి నీరు చేరడం జరుగుతున్నాయి. పైపులైన్లు లీకేజీకి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. పైపులైన్ లీకేజీ అయిన చోట రహదారిపై గుంతల్లా పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొన్ని చోట్ల కుళాయిలకు మూతలు లేకపోవడం సమస్యగా మారుతోంది.

### రహదారులపై నీరు..

ఆకర్షణీయ నగరంలో పలు ప్రాంతాల్లోని రహదారులపై పైపులైన్లు పగిలిపోవడంతో మంచినీరు వృథాగాపోతూ కనిపిస్తోంది. దాంతో నగరవాసులకు పూర్తి స్థాయిలో నీరందక అవస్థలు పడుతున్నారు. పైపులైన్లు తుప్పుపట్టడం, రహదారులపై ఉండటంతో వాహనాల రాకపోకలకు ప్రతిసారి పగిలిపోతున్నాయి. అలాంటి వాటికి రక్షణ లేకపోవడంతో ఆ పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. కాకినాడలోని శాంతినగర్, మెయిన్‌రోడ్డు, సాంబమూర్తినగర్, వల్లూరునగర్, జగన్నాథపురం, రామారావుపేట, గాంధీనగర్, టౌన్ రైల్వేస్టేషన్, గొడారిగుంట, జయేంద్రనగర్ తదితర చోట్ల పైపులైన్లు పగిలిపోవడంతో కొంతకాలంగా మంచినీరు వృథాగా పోతోంది. పైపులైన్లు పగిలిపోయి గుంతలు ఏర్పడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్లు ఎక్కడ లీకవుతున్నాయో గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై నగరపాలక సంస్థ పర్యవేక్షక ఇంజినీర్‌ను వివరణ కోరగా పలు రహదారులపై పైపులైన్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. మిగిలిన వాటిని కూడా గుర్తించి మరమ్మతులు చేపడతామని వివరించారు.

## రైలు ప్రాంగణం.. హరిత శోభితం

కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద అభివృద్ధి చేశారు. త్వరలో ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాంగణంలో విభాగినుల వద్ద పచ్చదనం కోసం గ్రీన్ లాన్ ఏర్పాటు చేశారు. రకరకాల అందమైన క్రోటన్ మొక్కలు నాటారు. ప్రయాణికులకు ఆహ్లాదం పంచనున్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

## ఇలాగుంటే.. రోగాలు రావా!

కాకినాడ సురేష్‌నగర్ బైపాస్ రహదారి నుంచి వాడపేటకు వెళ్లే దారిలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. రహదారి అనుకుని ఉన్న ఖాళీ స్థలంలో నాచు పేరుకుపోయి మురికి కూపంలా మారింది. దోమలతో రోగాల భయం నెలకొందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్**

## ప్రమాదకరంగా రహదారి..

కాకినాడ శాంతినగర్ ప్రధాన రహదారిపై గుంతలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఆ రోడ్డులో పలు పాఠశాలలు ఉండటంతో ఉదయం, సాయంత్ర వేళ వాహనాలు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఆ సమయంలో గుంతల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. వర్షాలు పడినప్పుడు గుంతలో నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మసీదుసెంటర్**

## మురుగు పారేదెలా..?

కాకినాడలోని సూర్యారావుపేట, భారత మాతసెంటర్ వద్ద రహదారి పక్కన కాలువలో మురుగు కదలకుండా ఉంది. దాంతో దుర్వాసన వ్యాపిస్తుండడంతోపాటు దోమల వ్యాప్తి చెంది వ్యాధుల బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మసీదుసెంటర్**

## వెలగని వీధి దీపం



కాకినాడ, భాస్కర్‌నగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన ఉన్న ఓ వీధిదీపం వెలగడం లేదు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మసీదుసెంటర్**

## కుళాయి నీరు.. వృథా తీరు

కాకినాడ మూడో డివిజన్ పరిధి గొడారిగుంట సమీపంలోని శంతనపురి కాలనీలో తాగునీటి కుళాయి ద్వారా నీరు వృథాగా పోతోంది. మురుగు కాలువ చెంతన ఉండటంతోపాటు నీరు పట్టుకునేందుకు ఇబ్బందిపడుతున్నామని పోతున్నారు. అధికారులు స్పందించి కుళాయి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్**

## దాడికి నిరసనగా నేడు ధర్నా

**కాకినాడ కలెక్టరేట్:** హిందూపురంలో వైకాపా కార్యాలయంపై దాడిని నిరసిస్తూ సోమవారం కాకినాడలోని బాలాజీచెరువు కూడలిలో ధర్నా నిర్వహించనున్నట్లు వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వైకాపా నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

**మసీదుసెంటర్, న్యూస్‌టుడే:** కాకినాడ పరలోవపేటకు చెందిన 24 ఏళ్ల వివాహిత వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెంది ఇంటి వద్ద పురుగుమందు తాగింది. అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స నిమిత్తం ఆదివారం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

### గాయపడిన యువకుడు ఆసుపత్రిలో మృతి

**మసీదుసెంటర్, న్యూస్‌టుడే:** రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన టి.లక్ష్మీప్రతాప్ (26) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని జీజీహెచ్‌లో చేర్చారు. అనపర్తి పోలీసులు కేసు నమోదు చేశారు.

### యువతి మృతిపై ఒకటో పట్టణ స్టేషన్‌లో కేసు

**మసీదుసెంటర్, న్యూస్‌టుడే:** వ్యక్తిగత కారణాలతో విష రసాయనం తాగిన ఓ యువతి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందగా కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడలోని పాతబస్టాండు ప్రాంతానికి చెందిన యువతి(21) ఓ యువకుడితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతోందని నానమ్మ మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు సెప్టెంబరు 6న జీజీహెచ్‌లో చేర్చారు. ఈ నెల 1న ఆమెను డిశ్చార్జి చేశారు. తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఈ నెల 15న మళ్లీ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్సపొందుతూ ఒకరోజుకే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**మసీదుసెంటర్:** కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా స్థానిక టూ టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ఆదివారం జీజీహెచ్‌లో చేర్చారు.

## అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ముఖాముఖి

**కాకినాడ నగరం, న్యూస్‌టుడే:** కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో 2025-26 విద్యాసంవత్సరంలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులను డెమో, ముఖాముఖిలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఆంజనేయులు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ లేదా ఆపైన అర్హతలు, సెట్, నెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఈ నెల 18న సంస్కృతం, ఆంగ్లం, స్టాటిస్టిక్స్, హిస్టరీ సబ్జెక్టులకు, 19న కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, పీజీ ఫిజికల్ కెమిస్ట్రీ, పీజీ అనలిటికల్ కెమిస్ట్రీ సబ్జెక్టులకు డెమో, ముఖాముఖి నిర్వహిస్తామని వివరించారు. యూజీ పోస్టులకు సంబంధించి ఆంగ్లం 2, స్టాటిస్టిక్స్ 2, కంప్యూటర్ సైన్స్ 3, సంస్కృతం 1, హిస్టరీ 1, కంప్యూటర్ అప్లికేషన్స్ 3, కామర్స్ మేనేజ్‌మెంట్ 3 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీ పోస్టులకు సంబంధించి ఫిజికల్ కెమిస్ట్రీ 1, అనలిటికల్ కెమిస్ట్రీ 1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్‌ను సంప్రదించాలన్నారు.

## స్తంభానికి ఈ తీగలేల..?

కాకినాడ వెంకట్‌నగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి, పక్కనే ఉన్న వైర్లకు పిచ్చి పాదులు, తీగలు అల్లుకున్నాయి. వర్షాల నేపథ్యంలో ప్రమాదం పొంచిఉందని, గాలులకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

శ్రీరామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలో ఉసిరిచెట్టు వద్ద పూజలు

## సందడిగా వన సమారాధన

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** నగరంలోని శాంతినగర్‌లో ఉన్న శ్రీరామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలోని పంచవటిలో ఆదివారం రుద్రాభిషేకం, భగవాన్ శ్రీరామకృష్ణుల పూజలు వైభవంగా జరిగాయి. సంస్థ ఉపాధ్యక్షులు వక్కలంక రామకృష్ణ దంపతులు రుద్రాభిషేకం నిర్వహించగా, సంస్థ కరస్పాండెంట్ కేవీఎస్ఎన్ శర్మ, అధ్యక్షుడు వీఎల్ గాంధీ, అధ్యాపకులు రామకృష్ణ, ఆనంద్, పైడా వెంకటనారాయణ తదితరులు శ్రీరామకృష్ణ పరమహంస పూజ, పారాయణం నిర్వహించారు. అనంతరం కార్తిక వనభోజన కార్యక్రమం జరిగింది. సమితి సభ్యులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే హక్కుల సాధన

ఎమ్మెల్సీ రాజశేఖరంను సత్కరించి, జ్ఞాపిక అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

**కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఏ సామాజిక వర్గానికైనా ఐక్యత ముఖ్యమని, అప్పుడే హక్కులు సాధించుకోగలమని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భాస్కర్‌నగర్‌లోని సంఘ కార్యాలయం వద్ద కాకినాడ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 43వ వనసమారాధన నిర్వహించారు. ముందుగా సంఘ ప్రతినిధులు ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రాజశేఖరం మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘ భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ హాజరైన సంఘీభావం తెలిపారు. సంఘ అధ్యక్షుడు వింజమూరి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు, కోశాధికారి వల్లభదాసు శివాజీగణేశ్, పప్పు దుర్గారమేశ్, వింజమూరి భాస్కరరావు, పొన్నగంటి సత్యనారాయణ, జగ్గారపు మల్లికార్జున పాల్గొన్నారు.

## ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవ పోటీలు

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించి నివాళి అర్పించారు. విశ్రాంత లెక్చరర్ పెద్దిరాజు, జిల్లా వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ త్రిమూర్తులు, గాయకులు మేడిశెట్టి శ్రీరాములు, డీఆర్‌డీఏ శిక్షణ నిపుణులు సత్యబాల మాట్లాడుతూ ప్రజలను విజ్ఞానవంతులుగా, చైతన్యవంతులుగా చేసేవి గ్రంథాలయాలన్నారు. విద్యార్థులకు దేశభక్తి, జానపద గేయాల పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయసంస్థ ఉప గ్రంథాలయాధికారి కిషోర్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. రాజాట్యాంకు పార్కు ఆవరణలోని గాంధీనగర్ శాఖాగ్రంథాలయంలో వారోత్సవాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రపై వ్యాసరచన పోటీలు జరిగాయి. విశ్రాంత డిప్యూటీ లైబ్రేరియన్ సత్యనారాయణ, లైబ్రేరియన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణారావుపేటలో లైబ్రేరియన్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జగన్నాథపురంలో వెంకటనారాయణ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు, మహాలక్ష్మి ఉపన్యసించారు.

ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

## సెప్టిక్ ట్యాంకుకు పైపు గండం..!

నగరపాలక సంస్థలో 50 డివిజన్ల పరిధిలో నిండిపోయిన సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసేందుకు కార్పొరేషన్‌కు ఒకటే వాహనం ఉంది. ఇంటి యజమానిపై భారం లేకుండా రూ.2 వేలు చలానా కడితే ఈ వాహనం ద్వారా సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు. ఈ వాహనానికి గతంలో 40 అడుగుల పైపు ఉండేది. అది ఇప్పుడు 10 అడుగులకు చేరింది. దీంతో పేదల వాడల్లోని ఇరుకు వీధుల్లోకి భారీ వాహనం వెళ్లి ట్యాంకులను శుభ్రం చేయడం గగనంగా మారింది. పొడవాటి పైపు అమర్చాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

(c) eenadu

# కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

డైరెక్టర్లను సత్కరిస్తున్న నాయకులు

## సగర కుల అభ్యున్నతికి కృషి

పిఠాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర సగర కుల సంఘ అభ్యున్నతికి పాటుపడతామని ఆ కార్పొరేషన్ డైరెక్టర్లు మొలిశె సూరిబాబు అన్నారు. ఆదివారం పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయ ప్రాంగణంలో వీరికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కుల సంఘ సమస్యలపై ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంఘ పెద్దలు కోరారు.

## 20న కలెక్టరేట్ ముట్టడి

పెద్దాపురం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఇందుకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. గూనూరి రమణ, కరణం అప్పన్న, యాసలపు మహేష్, చందు, అలీ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా గ్రీవెన్స్‌కు 42 అర్జీలు

సామర్లకోట: సామర్లకోట తెదేపా కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో 42 అర్జీలు వచ్చాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం పట్టణ తెదేపా అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చి సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సత్వరం పరిష్కరించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

పిఠాపురం: పిఠాపురం పాడా కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ ఈ వారం యథావిధిగా జరుగుతుందని పాడా పీడీ చైత్రవర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

## మండల ఆర్యవైశ్య అధ్యక్షుడి నియామకం

పెదపూడి: పెదపూడి మండల ఆర్యవైశ్య అధ్యక్షుడిగా ఒబిలిశెట్టి మల్లికార్జునరావు ఏకగ్రీవంగా ఎంపిక చేశామని జిల్లా అధ్యక్షుడు పులపర్తి కుమార్ తెలిపారు. ఆదివారం పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో కార్తిక వనసమారాధనలో ఎంపికలు నిర్వహించామన్నారు. అధ్యక్షుడిగా మల్లికార్జునరావు, కార్యదర్శిగా ఎస్. సూర్యప్రకాష్‌రావు, ట్రెజరర్‌గా ఒబిలిశెట్టి గోపాల కృష్ణలచే ప్రమాణస్వీకారం చేయించామన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీ సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేయండి: కాకినాడ గ్రామీణం: 80085 74325, పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544
ఉ. 10 - మ. 1

**సమస్య:** కరప మండలం పెనుగుదురులోని పెట్రోల్ బంకు ఎదురుగా వీధిదీపాలు పగలూ వెలుగుతుండటంతో విద్యుత్తు వృథా అవుతోంది. - వెంకటేశ్వరరావు
**పరిష్కారం:** ఏఈ ఈశ్వర్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి వీధిదీపాల లైన్ మరమ్మతులు చేశారు. - న్యూస్‌టుడే, కరప

**సమస్య:** స్థానిక కందరదీ[illegible]లో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలి. - శ్రీనివాసరావు, పెద్దాపురం
**పరిష్కారం:** పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కాలువలు శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

**సమస్య:** చేబ్రోలు రహదారిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు
**పరిష్కారం:** పంచాయతీ కార్యదర్శి రాజు సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

**సమస్య:** పిఠాపురంలోని మంగాయమ్మరావుపేటలో డ్రెయినేజీలో పూడికలు పేరిగిపోయి, మురుగునీరు రోడ్డుపైకి చేరి, దోమల వ్యాప్తి పెరుగుతోంది. - సంతోష్
**పరిష్కారం:** పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా కార్మికులతో కాలువల్లో పూడికలు తీయించారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

**సమస్య:** రమణయ్యపేట పంచాయతీ ఏపీఐఐసీ కాలనీలో మురుగుకాలువలో పూడిక తీయడం లేదు. - రామకృష్ణ
**పరిష్కారం:** పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు దృష్టికి తీసుకువెళ్లగా శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, సర్పవరం

# ధాన్యం కొనుగోళ్లకు ఆర్ఎస్‌కేలు సిద్ధం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాగునీటి ఎద్దడి, తెగుళ్లు, వరదలు ఇతర సమస్యలను ఎదుర్కొని రైతులు పంట పూర్తి చేశారు. ఎకరాకు 37 బస్తాలు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కోతలు మొదలవడంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మరోపక్క ఆర్ఎస్‌కే (రైతు సేవా కేంద్రాల)లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇప్పటికే కొనుగోళ్లు, అక్కడ నుంచి మిల్లులకు తరలింపు, రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేసే అంశాలపై శిక్షణ ఇచ్చారు. మరోపక్క ప్రతి కొనుగోలు కేంద్రానికి టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లను నియమించారు. వీరు కాకుండా ప్రతి ఆర్ఎస్‌కేలోనూ వీఏఏ (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్), వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకురాలు కలిసి గ్రామాల్లో మద్దతు ధరపై అవగాహన కల్పిస్తున్నారు.

పిఠాపురంలో పండిన పొలం

| మండలం | సాగు విస్తీర్ణం హెక్టార్లలో | కొనుగోలు కేంద్రాలు | సిబ్బంది సంఖ్య | దిగుబడి మె.టన్నుల్లో |
|---|---|---|---|---|
| పిఠాపురం | 7863 | 23 | 69 | 47,633 |
| గొల్లప్రోలు | 5428 | 08 | 24 | 23495 |
| కొత్తపల్లి | 4408 | 13 | 39 | 27220 |
| పెద్దాపురం | 3901 | 17 | 51 | 23903 |
| సామర్లకోట | 9059 | 16 | 48 | 53706 |
| కరప | 6257 | 18 | 54 | 33513 |
| కాకినాడ గ్రామీణం | 1441 | 05 | 15 | 8827 |

### ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి..

రైతులు పండించిన ధాన్యం కొనాలంటే ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి. వరితోపాటు ఇతర పంటలు కూడా 99 శాతం ఈ-పంట నమోదు పూర్తి చేశారు. యంత్రాలతో కోత కోసిన ధాన్యం, రంగు మారింది, పొల్లు ఉందని, ఇతరత్ర కారణాలతో దళారులు ధర తగ్గించే అవకాశం ఉంది. అందుకోసం వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం సాధారణ రకం 75 కేజీలు రూ.1,777, ఏగ్రేడ్ 75 కేజీలు 1,792గా నిర్ణయించాం. ఈ ధర పొందాలంటే తేమ శాతం 17 ఉండాలి. ధాన్యం బాగా ఆరబెట్టుకుని అమ్ముకుంటే మద్దతు ధర పొందవచ్చు.

- స్వాతి, పిఠాపురం, ఏడీఏ

# సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం

పిఠాపురం: విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఆదివారం పిఠాపురం తెదేపా కార్యాలయంలో ఆయన సమావేశంలో మాట్లాడారు. 613 ఒప్పందాలతో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లిలో 41 వేల కోట్లతో ఏఎం గ్రీన్ మెటీరియల్స్ ఒప్పందం కుదిరిందన్నారు. 3 వేల మంది యువతకు ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. నాయకులు బొజ్జా సతీష్, సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, చిన్న, మూర్తి, ప్రదీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

### ఉద్యోగాల కల్పనే ముఖ్యమంత్రి ఉద్దేశం

సామర్లకోట: రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పరిశ్రమలను ప్రోత్సహించి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. ఆదివారం సామర్లకోట తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో పరిశ్రమల భాగస్వామ్య సదస్సు ఎంతో విజయవంతంగా జరిగిందన్నారు. తెదేపా నాయకులు రాజాసూరిబాబురాజు, పట్టణ తెదేపా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు కుమారస్వామి, జగదీష్‌మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

## సత్యదేవుని సన్నిధికి మహా పాదయాత్ర

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ఆర్టీసీ బస్టాండు దగ్గర విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయం నుంచి అన్నవరం సత్యదేవుని సన్నిధికి మహా పాదయాత్ర ఆదివారం నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి చెందిన రథంతో పాదయాత్రలో భక్తులు పాల్గొన్నారు. ఆలయకమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ధాన్యం రంగు మారకుండా జాగ్రత్తలు

కాజులూరు: ధాన్యం రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం ఆయన ఆర్యవటం, గొల్లపాలెం, బంధనపూడి తదితర గ్రామాల్లో పర్యటించి ధాన్యం రంగు మారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

## 25 వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం

సామర్లకోట: ఇంటర్ పబ్లిక్ పరీక్షకు ఫీజు చెల్లించని విద్యార్థులకు ప్రభుత్వం ఈనెల 25వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఇచ్చిందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లీలాశ్రీదేవి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు రూ.2000 ఆలస్య రుసుంతో ఫీజు చెల్లించవచ్చన్నారు. 23 ఫిబ్రవరి 2026 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు 27 జనవరి 2026 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు, జనరల్ విద్యార్థులకు 1 ఫిబ్రవరి 2026 నుంచి 10వ తేదీన వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

గుంతలతో ఆర్బీకొత్తూరు రహదారి (నాడు)

అద్దంలా (నేడు)

## గతంలో నరకం.. ఇప్పుడు మోక్షం

పెద్దాపురం మండలం ఆర్బీకొత్తూరు, ఆర్బీపట్నం మీదుగా రంగంపేట మండలం మర్రిపూడికి వెళ్లే రహదారి గుంతలతో వాహనచోదకులు గత ఐదేళ్లు నరకాన్ని చవిచూశారు. సుమారు 4 కిలోమీటర్లు గుంతలతో ఈ రహదారి గుండా నిత్యం రాకపోకలు సాగించే ఆర్బీకొత్తూరు, ఆర్బీపట్నం, సీబీ దేవం, తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం మర్రిపూడి, సింగంపల్లి వంటి వివిధ గ్రామస్థులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం రావడంతోనే సుమారు 4 కిలోమీటర్లు రహదారిని సుమారు రూ.కోటితో నిర్మించారు. దీంతో వాహనచోదకులు సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

## గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ

పెద్దాపురం, కరప, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య వంటి ఉద్యమకారుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జోశ్యుల కృష్ణబాబు, చల్లా విశ్వనాథం, కొత్త శివ, వంగలపూడి శివకృష్ణ, బళ్లమూడి సూర్యనారాయణమూర్తి, శాఖ గ్రంథాలయం అధికారి పాలంకి నాగరాజు పాల్గొన్నారు. ● విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ పి.వెంకటరంగయ్య సూచించారు. కరపమండలం వేళంగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆయన విద్యార్థులు, గ్రామస్థులతో కలిసి గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు తదితరులు గ్రంథాలయ అభివృద్ధికి, ప్రజలకు అందుబాటులోనికి రావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఎర్రా విక్రమ్, షేక్ లాలిబాబు, కొండేపూడి రాంబాబు, చెక్క నూకరాజు పాల్గొన్నారు.

శాఖ గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సాహితీవేత్తలు

## భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

కరప, న్యూస్‌టుడే: కరపలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు జరిపి ఆలయ ప్రాంగణంలో మహాగణపతి, రుద్ర హోమాలు జరిపారు. యాళ్ల రాంబాబు, గోన చిన్నయ్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పొదలు అల్లేసి.. ప్రమాదంగా మారి

పిఠాపురం మండలంలోని బి.ప్రత్తిపాడు నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభాల చుట్టూ పొదలు అలుముకున్నాయి. దాదాపు నాలుగు స్తంభాలకు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయ పనులు చేయడం, పశువులను తోలుకెళ్లడం చేస్తుంటారు. పొదల వల్ల విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. డీఈ శ్రీనివాస్ శుభ్రం చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పిఠాపురం

## అధ్వానంగా వాకింగ్ ట్రాక్

కరపలోని మంచినీటి ట్యాంకు చుట్టూ ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ చెంతనే వ్యర్థ మొక్కలు విపరీతంగా పెరిగి అధ్వానంగా మారింది. దీంతో విషసర్పాలు కలియ తిరుగుతుండటంతో ప్రతిరోజూ ఈ ట్రాక్‌పై నడిచివెళ్తున్న వాకర్స్ భయాందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో జె.శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఉపాధిహామీ పథకం ద్వారా పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కరప

## నూతన పైపులైన్లు ఏర్పాటు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పురపాలిక కార్యాలయం వెనుక భాగంలో మరుగుదొడ్ల పాత పైపులైన్లను తొలగించి నూతన పైపులైన్లు ఏర్పాటు, ఇతర మెరుగు చర్యలను అధికారులు చేపట్టారు. సెప్టెంబరు 17న ఈనాడులో 'ఇక్కడే ఇలా ఉంటే ఎలా?' అనే శీర్షికన కథనం ప్రచురితమవ్వడంతో స్పందించిన అధికారులు పురపాలిక సాధారణ నిధులు సుమారు రూ.2 లక్షలు కేటాయించి మరమ్మతు చర్యలు చేపట్టారు.

ఈనాడు కథనానికి స్పందన

## వ్యర్థాలతో కాలువ

గొల్లప్రోలులోని ఎస్సీపేటకు వెళ్లే మార్గంలో ప్రధాన కాలువ వ్యర్థాలతో మూసుకుపోయి మురుగు సమస్య నెలకొంది. సేకరించిన చెత్తను కాలువలో వేస్తుండడంతో మురుగునీరు నిలిచిపోతుంది. ప్రధాన కాలువలో చెత్తను వేయకుండా పర్యవేక్షిస్తామని ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

## వైకాపా సంతకాల సేకరణ

గొల్లప్రోలు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైకాపా నాయకులు రచ్చబండ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గొల్లప్రోలులోని 9, 10 వార్డుల్లో పర్యటించి సంతకాలు సేకరించారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు మైనం రాజా, ఆపార్టీ నాయకులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, గంటా అప్పలస్వామి, అంజూరి రాంబాబు, దాసం లోవబాబు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి వద్దే ఉండి పనిచేస్తూ డబ్బు సంపాదించుకోవచ్చని సామాజిక మాధ్యమాల ద్వారా ఆశ చూపి మోసపూరితమైన లింకులు పంపి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు.

# ఆదివారం ఆనందాల హేల..

సర్పవరం: కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని శుభం కాపు కల్యాణమండపం ఆవరణలో ఆంధ్ర కాపు సద్భావన సంఘం, కాపునాడు ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ తదితరులు ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా వనసమారాధన జరిగింది. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘానికి గత 30 ఏళ్లుగా సేవలు అందించిన గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, ఇతర ప్రతినిధులను ఎమ్మెల్యే, ప్రతినిధులు చేతుల మీదుగా సన్మానించారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, తోట త్రిమూర్తులు, పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, మాజీ ఎంపీ వంగ గీత, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు, డైరెక్టర్ శిరింగు శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

కొత్తపల్లి: న్యాయవాదులకు ఆహ్లాదమైన వాతావరణం ఎంతో అవసరమని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి అన్నారు. యు.కొత్తపల్లి మండలం కోనపాపపేట తీరప్రాంతంలో ఏర్పాటుచేసిన పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదుల కార్తిక వన సమరాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ● సర్పవరం: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ రత్నగిరి రిసార్ట్స్‌లో ఆదివారం హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డా. నిష్కించిన దాస ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, కృష్ణ భక్తులకు కార్తిక వనసమారాధన నిర్వహించారు. సుమారు 300 విద్యార్థులు పాల్గొన్నారు. ● కాకినాడ గ్రామీణం రమణయ్యపేట పెనుమర్తి రోడ్డులోని మామిడితోటలో రాయుడుపాలెం బాల గణపతి కాపు సేవాసంఘం అధ్యక్షుడు బుల్లయ్య, కార్యదర్శి ఏసుబాబు ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమెల్యే నానాజీ, ఆంధ్రకాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు ఇతర ప్రతినిధులను నిర్వహకులు సన్మానించారు.

తాళ్లరేవు: తెలగా అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాళ్లరేవు మండలంలోని జాతీయ రహదారి చెంతన 25వ కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం హాజరై మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులు, మహిళలకు బహుమతులు అందజేశారు. ● తాళ్లరేవు మండల శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో కేశవపురంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో కార్తిక వన మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ● గొల్లప్రోలు: కార్తికమాసం చివరి సోమవారం పురస్కరించుకుని గొల్లప్రోలులోని శివాలయంలో తెల్లవారుజామునుంచే అభిషేకాలు, దర్శనాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ● పెద్దాపురం: పెద్దాపురం పట్టణంలో సూర్యబలిజ సంక్షేమ సంఘం, బ్రాహ్మణ సేవా సంఘం, తెలగా అభ్యుదయ వనభోజనాలు జరిగాయి.

కాకినాడ కాపు వనసమారాధనలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ దంపతులు

యు.కొత్తపల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి శ్రీహరి

పెద్దాపురంలో ఆటలాడుతున్న మహిళలు

## పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలి

పిఠాపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామంలో సంఘ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామని చెప్పారని, ఇప్పటికి చర్యలు తీసుకోలేదన్నారు. పేద దళితులు చేతుల్లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములను సంపన్నులకు కట్టబెట్టే ఫ్రీ హోల్డ్ పై నిషేధం ఎత్తివేయడం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కారకుల సింహాచలం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని 17 మందితో ఎన్నుకున్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గొల్లప్రోలు, సర్పవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను దుర్గాడ, చేబ్రోలులోని బాధితుల ఇళ్లకు వెళ్లి జనసేన నాయకులు చెక్కులు అందజేశారు. పవన్‌కల్యాణ్ జీతంతో ప్రతినెలా ఇచ్చే ఆర్థిక సాయం చెక్కులను భగవంతుని పిల్లలకు పంపిణీచేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, ఓదూరి కిషోర్, చల్లా లక్ష్మి, సూరిశెట్టి జయకృష్ణ, మురాలశెట్టి సునీల్ కుమార్, జనసేన నాయకులు పాల్గొన్నారు. ● కాకినాడ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పంతం నానాజీ చేతుల మీదుగా 18 మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకి సుమారు రూ.11 లక్షలు విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, కూటమి నాయకులు, లబ్ధిదారులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాడలో చెక్కులు పంపిణీ చేస్తున్న తుమ్మల రామస్వామి

## రహదారుల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు: కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. తాళ్లరేవు మండలం సుంకరపాలెం కూడలి నుంచి అంబేడ్కర్ నగర్ వరకు రహదారుల, భవనాల శాఖ నిధులు రూ.1.80 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు సుంకరపాలెం చెక్ పోస్టు వద్ద ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం భూమి పూజ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.5 కోట్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు. ఆర్అండ్‌బీ జేఈ లక్ష్మీప్రసన్న, మోపూరి వెంకటేశ్వరరావు, వెంకట రెడ్డినాయుడు, టేకుమూడి లక్ష్మణరావు, టిళ్లపూడి నాగేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, వేగేశ్న భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

సుంకరపాలెంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

## అసౌకర్యాల వాకిట.. ఇదేమి శ్మశానవాటిక

పెద్దాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని మరణించిన వ్యక్తి అంత్యక్రియలు పూర్తిచేయడానికి శ్మశానవాటికలోకి అడుగుపెట్టాలంటే బంధువులు పడే కష్టాలు అంతా ఇంతా కాదు. శవాన్ని మోసుకొని శ్మశానవాటికకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎండ కాస్తేనే వెళ్లలేని పరిస్థితి ఉంటే వర్షం పడితే అక్కడ పరిస్థితి వర్ణనాతీతం. పెద్దాపురం నుంచి ఆర్బీపట్నం వెళ్లే రహదారిలో ఉన్న శ్మశానవాటిక లోపల అంతా గుబురుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ ప్రాంతానికి నాగంపేట, వీర్రాజుపేట, అంకయ్యపేట, సుబ్బయ్యమ్మపేట, మంగళవారిపేట, గౌరికోనేరు కాలనీ, బంగారమ్మగుడివీధి, వ్యాపారపుంత, సినిమా సెంటర్, కొత్తపేట, భాస్కర్‌కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన వారు మరణిస్తే అంత్యక్రియలకు ఇక్కడకు తీసుకువస్తారు.

### దుర్వాసన వస్తోంది..

వీర్రాజుపేట, నాగంపేట ప్రాంతాలకు చెందిన వారు వచ్చే రహదారి మార్గం చెత్తతో నిండిపోయి దుర్వాసన వస్తోంది. ఈ రహదారి గుండా రాలేక చుట్టు కిలోమీటరు తిరిగి రావలసి వస్తుంది. పురపాలిక అధికారులు ఈ శ్మశానవాటికను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో ఆర్బీపట్నం రహదారిలోని రుద్రభూమి

### శుభ్రం చేయడానికి చర్యలు..

శ్మశానవాటిక లోపల పెరిగిపోయిన పిచ్చి మొక్కలను, వీర్రాజుపేట నుంచి ఇక్కడకు వచ్చే రహదారి మార్గాన్ని శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోమని సిబ్బందిని ఆదేశిస్తాను. - కె.శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్, పెద్దాపురం


ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. పంచాయతీ రాజ్ శాఖ

సంక్షిప్త టెండర్ నోటీస్ నెం. 01/2025 తేది: 15-11-2025

ఎంజీఎన్ఆర్ఈజీఎస్(MGNREGS) కార్యక్రమము క్రింద పెదపూడి మండలములోని వివిధ గ్రామ పంచాయతీలలో చేపట్టవలసిన పనుల కొరకు పదార్థాలు/నైపుణ్య కలిగిన మరియు అర్ధ నైపుణ్యం కలిగిన కార్మికులు/యంత్రాలు సరఫరా చేయుటకు మూసివేసిన టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. సదరు టెండర్లు పైన తెల్పినవి సరఫరా చేయుటకు రేట్లు నిర్ధారణ కొరకు మాత్రమే ఆసక్తి కలిగిన వారిని ఆహ్వానించడమైనది.

| | |
|---|---|
| టెండర్ షెడ్యూల్ జారీ తేదీలు: | 17-11-2025 నుండి 24-11-2025 వరకు సాయంత్రం 05.00 గంటల వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయము, పెదపూడి మండలం. |
| బిడ్ సమర్పణకు చివరి తేది: | 25-11-2025 మధ్యాహ్నం 03.00 గంటలకు |
| టెండర్లు తెరవడం: | ది25-11-2025 సాయంత్రం 04.00 గంటలకు |
| టెండర్ షెడ్యూల్ ధర: | రూ. 2,000/- |

టెండర్ ఆమోదించే అధికారి ఏదైనా టెండర్ లేదా అన్ని టెండర్లను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కును కలిగి ఉంటారు. ఒడంబడిక అమలు ముందే ఎప్పుడైనా టెండర్ ప్రక్రియను రద్దు చేసే అధికారం ఆయనకు ఉంది. ఈ చర్య వల్ల ప్రభావిత బిడ్డర్ లేదా బిడ్డర్లపై ఎటువంటి బాధ్యత లేదా వాటికి ఆ నిర్ణయానికి గల కారణాలు తెలియజేయాల్సిన బాధ్యత టెండర్ ఆమోదించే అధికారికి ఉండదు. సదరు నిర్ధారించిన రేట్లకు భవిష్యత్తులో టెండర్ నందు పాల్గొనని వారు ఎవరైనా పదార్థాలు/నైపుణ్యం కలిగిన మరియు అర్ధ నైపుణ్యం కలిగిన కార్మికులు/యంత్రాలు సరఫరా చేస్తాము అని అంగీకరించినట్లయితే వారిని కూడా సరఫరా చేయుటకు పరిగణించబడే అధికారము టెండర్లు ఆమోదించే అధికారి కలిగియుంటారు.

సం/- మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు ప్రోగ్రామ్ ఆఫీసర్, మండల ప్రజా పరిషత్, పెదపూడి.

# తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందడుగు

**కిర్లంపూడి:** సోమరాయణింపేట నుంచి ఉద్యోగాలు సాధించి వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు ఆదివారం గ్రామంలో సమావేశమయ్యారు. గ్రామాభివృద్ధి లక్ష్యంతో ఏర్పాటుచేసిన సోమరాయణింపేట సేవాసమితి ద్వారా గ్రామస్థులకు మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సేవాసమితి అధ్యక్షుడు పీలా అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులుగా ఉన్న పలువురు ఉద్యోగులు పలు కార్యక్రమాలను గ్రామంలో అమలుచేయాలని సూచనలు చేశారు.

ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు

గ్రామంలో సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని అభివృద్ధి పరచాలని, క్రీడాభివృద్ధికి పరికరాలు సమకూర్చాలని, ప్రస్తుతం 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యాసంబంధిత సహకారం అందించాలని నిర్ణయించారు. గ్రామంలో పేద కుటుంబాలకు చెందిన వారు మరణిస్తే దహన సంస్కారాలకు ఇస్తున్న రూ.ఐదువేలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికే గ్రామం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా 200 మంది ఉన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సమావేశంలో అభినందించారు. సేవాసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మళ్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి పెనగంటి సన్యాసిరావు, కోశాధికారి చదరం రాంబాబు అధిక సంఖ్యలో ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బాలికలు

## మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

**ఏలేశ్వరం, న్యూస్‌టుడే:** ప్రజల మేలు కోసం ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారు, వారు అందరూ చిరస్మరణీయులని ఏలేశ్వరం గ్రంథాలయాధికారి వికేంకిరణ్ సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి ఆదివారం పలు పాఠశాలలకు చెందిన బాలికలు నివాళి అర్పించారు. ప్రస్తుత గ్రంథాలయాలు అందుబాటులోకి వచ్చాయంటే అయ్యంకి కృషే కారణమన్నారు. కార్యక్రమంలో గురుకులం లైబ్రేరియన్ మజ్జి శ్యామల, ఉపాధ్యాయులు కిలారి రామచంద్రరావు, గిద్ద వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

**తుని పట్టణం, న్యూస్‌టుడే:** శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలలో 'స్పెస్' (శ్రీప్రకాష్ ఇంటర్ క్రియేటివ్ ఎనర్జీస్) కార్యక్రమం ఆదివారం సందడిగా జరిగింది. విద్యార్థులు హుషారుగా పాటలుపాడి, నృత్యాలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

## డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

**తొండంగి :** పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 17 నుంచి 20 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ కె.మెహర్ ఆదివారం తెలిపారు. విద్యార్థులు కళాశాల సమయంలో సంప్రదించాలన్నారు.

## పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**తుని, రౌతులపూడి :** పట్టణంలోని కొండవారిపేట ప్రాంతంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు (కార్డన్ సర్చ్) నిర్వహించారు. పలువురు అనుమానితుల ఆధార్ కార్డులు పరిశీలించి వివరాలు సేకరించామని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. వాహన పత్రాలను పరిశీలించామన్నారు. ఈ ప్రాంతంలో నాటుసారా అమ్మకాలు, గంజాయి వినియోగం ఎక్కువగా ఉందనే అనుమానంతో తనిఖీలు చేశామన్నారు. ● రౌతులపూడి మండలం ధారపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అటవీ జంతువుల వేట కోసం విద్యుత్తు తీగలు అమర్చడం, సారా తయారీ, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్థానికులకు సూచించారు.


పార్టీలో చేరిన ఏవీనగరం నాయకులు

## తెదేపాలోకి చేరికలు

**తుని గ్రామీణం, న్యూస్‌టుడే:** తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన పలువురు దళిత నాయకులు తెదేపాలోకి చేరారు. తేటగుంట పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే దివ్య సమక్షంలో ఏవీ నగరానికి చెందిన పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు పార్టీలోకి చేరారు. వీరికి పార్టీ నాయకుడు యనమల రాజేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు కోయ్యా కేశవ, సూరిబాబు, బొండాడ బాబ్జీ, డేగల సుబ్బారావు, పీర్ల శివ, కడారి శ్రీని తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో ప్రత్తిపాడు విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులు

**ప్రత్తిపాడు, న్యూస్‌టుడే :** కాకినాడలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్ పోటీల్లో ప్రత్తిపాడు అఖిల్ విద్యా సంస్థలకు చెందిన బాల బాలికలు ప్రతిభ చాటారని ఛైర్మన్ ఇనకోటి గంగాధర్, ప్రిన్సిపల్ సునీత చెప్పారు. సీనియర్స్ విభాగంలో జి.హేమని లత, కె.డేవిడ్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. జూనియర్ కేటగిరీలో ఎన్.నిశాంత్ ప్రథమ, జి.కస్తూరి రెండో స్థానంలో నిలిచారు.

# సంపద కేంద్రాలు.. తీరు మెరుగుపడేనా..!

**జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి-న్యూస్‌టుడే:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ తూతూమంత్రంగానే ఉంది. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద సృష్టించాలని పై స్థాయిలో విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామస్థాయిలో ఆర్భాటమే తప్ప అమలు కావడంలేదు. గ్రామాల్లో కనీసం చెత్త సేకరణ కూడా చిత్తశుద్ధితో జరగడంలేదు. దీని వల్ల ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి గ్రామ పొలిమేరల్లో అధ్వానంగా ఉంటోంది. ఉపముఖ్యమంత్రి అక్టోబరు 2 నుంచి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాల పనితీరు మెరుగుపరచాలని ఆదేశించి నెలలు గడుస్తున్నా ఏ మార్పు లేదు.

● జగ్గంపేట మండలంలో 16 చోట్ల సంపదకేంద్రాల్లో సగానికిపైగా నేటికీ అలంకారప్రాయంగానే కొనసాగుతున్నాయి. నరేంద్రపట్నం, రామవరం, కాండ్రేగుల, కాట్రావులపల్లి తదితర గ్రామాల్లో రోడ్లపైనే చెత్త వేస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరించి వేరుచేయాల్సి ఉండగా గ్రామాల వెలుపల నిప్పు పెడుతున్నారు.

రాజుపాలెంలో నిరుపయోగంగా సంపద కేంద్రం

● కిర్లంపూడి మండలంలోని 19 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించారు. ఒక్క బూరుగుపూడిలో తప్ప ఎక్కడా మిగిలిన గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. జిల్లా స్థాయి అధికారులు వచ్చినపుడు మాత్రమే గ్రామస్థాయి అధికారులు ఆర్భాటం తప్ప మిగిలిన సమయాల్లో దృష్టిసారించడంలేదు. చెత్త సేకరణకు పలు పంచాయతీలకు ట్రాక్టర్లు ఇచ్చినప్పటికీ వాటి నిర్వహణ పంచాయతీలకు భారంగా మారింది..

| మండలం | గ్రామాలు | సంపదకేంద్రాలు |
|---|---|---|
| జగ్గంపేట | 21 | 16 |
| కిర్లంపూడి | 21 | 19 |
| గండేపల్లి | 18 | 18 |

● గండేపల్లిలో 18 పంచాయతీల్లోనూ సంపదకేంద్రాలు నిర్మించగా సంపద సృష్టి అరకొరగానే జరుగుతోంది. రామయ్యపాలెం, నాయకంపల్లి, సింగరంపాలెం, కె.గోపాలపురం, బొర్రంపాలెం గ్రామాల్లో సంపదకేంద్రాల నిర్వహణ సక్రమంగా లేదు. చెత్త సేకరించాల్సిన ట్రైసైకిళ్లు నిర్వహణ లేక మూలకు చేర్చారు.

### సిబ్బంది కొరత ఉంది

గ్రామాల్లో ఉన్న సంపదకేంద్రాలను నిర్వహణకు చర్యలు చేపడుతున్నాం. రోడ్లపై చెత్తవేయకుండా పంచాయతీల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బంది లేకపోవడంతో రోజువారి కూలీలతో నిర్వహిస్తున్నాం. తయారుచేసిన వర్మీ కంపోస్టు అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవు.

**- సత్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో, జగ్గంపేట.**

## బాల భీముడు

**ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:** సాధారణంగా అపుడే జన్మించిన బాలలు 3.5 కిలోల బరువు ఉంటారు. కానీ ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ఆదివారం తునికి చెందిన వెలుగుల క్రాంతి అనే మహిళ 4.2 కిలోల బరువు ఉన్న బాలభీమునికి జన్మనిచ్చింది. నెలలు నిండిన క్రాంతి ఆసుపత్రికి వచ్చింది. రెండో కాన్పు నిమిత్తం వచ్చిన ఆమె మధుమేహ వ్యాధిగ్రస్తురాలు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సౌమ్య సిజేరియన్ చేయడంతో మగ బిడ్డ జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న నవజాత శిశువును పలువురు ఆసక్తిగా చూశారు.

## సత్యదేవుని సన్నిధికి మహా పాదయాత్ర

**గొల్లప్రోలు, న్యూస్‌టుడే:** గొల్లప్రోలులోని ఆర్టీసీ బస్టాండు దగ్గర విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయం నుంచి అన్నవరం సత్యదేవుని సన్నిధికి మహా పాదయాత్ర ఆదివారం నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి చెందిన రథంతో పాదయాత్రలో భక్తులు పాల్గొన్నారు. ఆలయకమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ప్రత్తిపాడులో లక్ష తులసి దళాల పూజ

ప్రత్తిపాడులో విశేష అలంకరణలో వెంకటేశ్వరస్వామి

**ప్రత్తిపాడు, శంఖవరం, న్యూస్‌టుడే :** ప్రత్తిపాడు తోట వీధిలోని షిర్డీ సాయినాథుని మందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మందిరంలో కొలువైయున్న శ్రీదేవిభూదేవీ సమేత వెంకటేశ్వరస్వామికి లక్ష తులసి దళాలతో గురువు వాడపల్లి గోపాలాచార్యుల బృందం నిర్వహించింది. ఉదయం విష్వక్సేన పూజతో ఆరంభమై అగ్ని హోత్ర హోమం జరిగింది. మహిళలు విష్ణు, లలితాదేవికి పారాయణ చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు చిలకమర్తి సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో రామరాజువర్మ, ప్రముఖుడు జల్లిగంపల ప్రభాకరరావు పాల్గొన్నారు. ● శంఖవరంలోని పర్యాటకప్రాంతాలన్నీ సందడిగా మారాయి. ఆంధ్రాఊటీగా పిలిచే అయ్యప్పస్వామి ఆలయం, వేళంగిలోని దారపల్లి జలపాతం క్షేత్రాలకు భక్తులు తరలివచ్చారు. దారలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు.

ఇర్రిపాకలో శివకేశవుల విగ్రహాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

### కార్తిక సోమవారం ఏర్పాట్లు పరిశీలన

**జగ్గంపేట గ్రామీణం:** ఇర్రిపాకలో ఏలేరు నదీతీరాన వేంచేసి ఉన్న శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన శివకేశవుల విగ్రహాల వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యవేక్షించారు. ● 17న ఆలయం వద్ద పంచామృతాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలేరు జలాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించనున్నారు.

## బ్లాక్ స్పాట్ల పరిశీలన

ఈనాడు స్పందన

**గండేపల్లి, న్యూస్‌టుడే:** ఈనాడు కథనానికి స్పందించి జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్‌స్పాట్‌లను శనివారం ఏఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. కాకినాడ జిల్లా మీదుగా కొనసాగుతున్న కీలకమైన 16వ నంబర్ రహదారిపై నిత్యం ఏదో ఒక కూడలిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మురారి నుంచి తుని వరకు 78కి.మీ మేర, బ్లాక్‌స్పాట్‌లు 58 ఉండగా, సీసీ కెమెరాలు 112 ఉన్నాయి. కూడళ్ల వద్ద ఇసుక డ్రమ్ములు, భారీ గేట్లు లేవని అవి ఏర్పాటు చేస్తే మేలని శుక్రవారం ఈనాడులో 'గండాల గమనం' అనే శీర్షికతో ఇచ్చిన జిల్లా కథనానికి అధికారులు స్పందించారు. యర్రవరం నుంచి మురారి వరకు సుమారు 30 బ్లాక్ స్పాట్‌లను ఏఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

జెడ్.రాగంపేట కూడలిని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ సీఐలు

## మలుపులో జాగ్రత్త..!

కాట్రావులపల్లి శివారు సూరంపాలెం వెళ్లే మార్గంలో మలుపులో ఉన్న కల్వర్టు ప్రమాదాన్ని తలపిస్తుంది. ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టుపై రెయిలింగ్ పాడవడంతో రక్షణ కొరవడింది. సూరంపాలెం కళాశాలలకు ఎక్కువ బస్సులు ఈ మార్గం మీదుగా రోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుకు రోడ్డు కావడంతో మలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పితే ప్రమాదం జరుగుతుందనే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొనిఉంది. రోడ్డును విస్తరించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం**

## పిచ్చి మొక్కలు తొలగించండి

తొండంగి- తిమ్మాపురం వెళ్లే రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బందిగా ఉంటోంది. రాత్రి సమయాల్లో పిచ్చి మొక్కలు తగిలి గాయపడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తొండంగి**

## ప్రమాదాల కూడలి.. రక్షణ చర్యలు శూన్యం

రామవరం కూడలి వద్ద రోడ్డుదాటే వాహనాలకు రక్షణ కొరవడింది. రోజూ రద్దీగా ఉండే కూడలి వద్ద వేగనియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఎన్‌హెచ్ పర్యవేక్షణ అధికారులు, పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. రామవరం, మర్రిపాక గ్రామాలకు చెందిన ప్రజలు, వాహనదారులు ఇదే కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామాల వద్ద సర్వీసురోడ్డు, రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. అధికారులు దృష్టిసారించి ఈ ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం**

## స్తంభానికి చెట్టే ఆధారం

హైవేపై అన్నవరం నుంచి బెండపూడి వెళ్లే మార్గంలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల ఆశ్రమం వద్ద ఓ విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా కనిపిస్తుంది. రహదారి పక్కనే ఉన్న ఓ వృక్షం ఆ స్తంభానికి ఆధారంగా మారింది. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తొండంగి**

## ఆర్యవైశ్య పేదల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

**జగ్గంపేట గ్రామీణం:** ఆర్యవైశ్యుల్లోని పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు)ను సేవాసంఘం గౌరవ అధ్యక్షుడు అత్తులూరి సాయిబాబు, చిత్రపుబాబులు కోరారు. గుర్రంపాలెం రోడ్డులో కొత్త నరసింహారావు పామ్ ఆయిల్ తోటలో కార్తిక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కొత్త వెంకటేశ్వరరావును సేవా సంఘం తరపున సత్కరించారు. సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య కులంలో వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కొండబాబుకు జ్ఞాపిక అందిస్తున్న సంఘ సభ్యులు

## సందడిగా వన సమారాధనలు

**తుని పట్టణం, శంఖవరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి, రౌతులపూడి, తుని పట్టణం, న్యూస్‌టుడే:** కార్తిక వనసమారాధన చివరి ఆదివారం కావడంతో సందడి నెలకొంది. తునిలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని సాయి సీతారామ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉసిరి చెట్టుకు పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు దంపతులు, దెందుకూరి మురళీరాజులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భార్గవ బ్రాహ్మణ సేవా సంఘం వన సమారాధన ఆదివారం సందడిగా జరిగింది. పట్టణ శివారు పెంటకోట రోడ్డులోని ఓ తోటలో కుటుంబసమేతంగా బ్రాహ్మణులు హాజరై ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ● కత్తిపూడి శివారు తోటలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఉసిరి చెట్లు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు నృత్యాలు చేసి అలరించారు. ● ప్రత్తిపాడులో ఆదివారం విశ్వ బ్రాహ్మణ సంఘ కుటుంబాలు సందడి చేశాయి. ముందుగా గౌరీ శంకరులకు, ఉసిరి మొక్కకు పూజలు చేశారు. నాయకులు ధరణాలకోట శ్రీను, పత్రి రమణ తదితరులు పాల్గొన్నారు. ● రాజుపాలెం మురళీకృష్ణుని ఆలయం వద్ద గణేశుల రాంబాబు, గణేశుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద లక్ష్మీనారాయణులకు పూజలు చేశారు.

ప్రత్తిపాడులో ఉసిరి మొక్క వద్ద విశ్వ బ్రాహ్మణుల పూజలు

తుని: జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాజా అశోక్‌బాబు తదితరులు

కొత్తరాజుపాలెం: ఉసిరి చెట్టు వద్ద లక్ష్మీనారాయణుల పూజ

## పార్కు స్థలంపై కబ్జాదారుల కన్ను

**తుని, న్యూస్‌టుడే:** పట్టణంలోని 30వ వార్డు గణపతినగర్ పార్కు సమీపంలో అనుమతి పొందిన లేఅవుట్ రోడ్లపై కొందరు కబ్జాదారుల కన్ను పడిందని స్థానికులు ఆరోపించారు. ఎంతోకాలంగా ఇక్కడే ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, పురపాలక సంఘం పార్కును అభివృద్ధి చేసిందన్నారు. అయితే పార్కు చుట్టూ ఉన్న నాలుగు రోడ్లపైనా మట్టి వేసి ఎత్తు చేసేందుకు ఆ వ్యక్తులు పనులు ప్రారంభించారన్నారు. ఎత్తుచేయడంతో ఈ ప్రాంతం అంతా ముంపునకు గురి అవుతుందన్నారు. ఇప్పటికే పురపాలక అధికారులకు ఫిర్యాదు చేశామని, తక్షణం చర్యలు తీసుకోవాలని అయోధ్య, సిటీ వాకర్స్ క్లబ్బుల సభ్యులు, స్థానికులు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ఎ.వెంకట్రావును వివరణ కోరగా స్థలం పురపాలక సంఘం ఆధీనంలోనే ఉందని, పరిశీలించి నోటీసులు జారీ చేస్తామన్నారు.

పార్కు వద్ద మట్టివేసి ఇలా...

## ఉరేసుకుని వివాహిత అనుమానాస్పద మృతి

**ధవళేశ్వరం, న్యూస్‌టుడే:** వివాహిత ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందడంపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు రాజమహేంద్రవరం పద్మావతి నగర్ సాయిఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న తలారి పోశమ్మ అలియాస్ పూజ(23)కి గతంలో పెద్దాపురానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. మూడు నెలలకే భర్త నుంచి విడిపోయింది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న మరోవ్యక్తితో రాజమహేంద్రవరంలో నివాసము ఉంటుంది. ఆవ్యక్తి 15 రోజులకు ఒకసారి రాజమహేంద్రవరం వచ్చి వెళుతుంటాడు. ఈక్రమంలో శనివారం పోసమ్మకు ఫోన్‌చేస్తే ఎంతసేపటికీ తీయకపోవడంతో వాచ్‌మెన్‌ను ఆమె ఇంటికి పంపాడు. తలుపు తీసి చూడగా ఉరివేసుకొని కనిపించింది. వాచ్‌మెన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని జగ్గంపేటలో ఉన్న తన తల్లికి సమాచారం అందించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ప్రమాదవశాత్తు జారిపడి కార్మికుడి..

**తుని:** బ్యాంకు కాలనీలో భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. విశాఖపట్నం మద్దెలపాలెం ప్రాంతానికి చెందిన పి.వెంకటరమణ (40) శనివారం పడిపోగా తలకు గాయమైందన్నారు. చికిత్స చేయించాక కొద్దిసేపటికి మృతి చెందాడన్నారు. బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని అప్పగించామన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

### చేతిపంపును బాగు చేయించరూ..!

**సమస్య:** తొండంగి మండలంలోని శృంగవృక్షం నుంచి కోదాడ వెళ్లే దారిలో ఓ చేతిపంపు మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీవాసులు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. **- గంగాధర్, స్థానికుడు**

**సమాధానం:** రెండు రోజుల్లో చేతి పంపునకు మరమ్మతులు చేయిస్తాం. **- ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

### తాగునీరు అందించరూ..!

**సమస్య:** శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో కాలనీకి కొళాయిల ద్వారా తాగునీరు అందించాలి. **- వరలక్ష్మి, స్థానికురాలు**

**సమాధానం:** కొన్నిచోట్ల పైపులైను ఏర్పాటు చేయాల్సి ఉంది. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. **- మధుశేఖర్, కార్యదర్శి, కత్తిపూడి**

### బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

**సమస్య :** ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న బస్ షెల్టర్ అపరిశుభ్రంగా ఉంటోంది. కొందరు వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారు. పరిశుభ్రం చేయించి, వినియోగానికి తీసుకురావాలి. **- రామారావు, ఏలేశ్వరం.**

**సమాధానం:** బస్‌షెల్టర్‌ను శుభ్రం చేసేందుకు ఆదేశాలిస్తాం. ప్రయాణికులు కూర్చునేందుకు అవసరమైన పనులు చేయిస్తాం. **- సూర్యప్రకాశ్‌రావు, కమిషనర్, ఏలేశ్వరం.**

- న్యూస్‌టుడే, తొండంగి, శంఖవరం, ఏలేశ్వరం

## గురుకుల విద్యార్థినులు.. క్రీడల్లో మెరికలు

### రాష్ట్రస్థాయి పోటీలకు 22 మంది ఎంపిక

**న్యూస్‌టుడే, తుని గ్రామీణం.**

మారుమూల ప్రాంతాలు.. మధ్య తరగతి జీవితాలు.. కొందరికి తల్లిదండ్రుల్లో ఒకరుంటే మరొకరు దూరమైన నేపథ్యం.. అయితేనేమి చదువుకోవాలనే ఆకాంక్షతోపాటు క్రీడల్లో రాణించాలనే వారి అభిలాషను నెరవేర్చుకుంటూ ముందడుగు వేస్తున్నారు ఆ బాలికలు. దానికి అనుగుణంగా గురుకుల పాఠశాలల్లో విద్యావ్యవస్థ తీరుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించడంతో క్రీడల్లో రాణిస్తూ జిల్లా స్థాయిని దాటి రాష్ట్రస్థాయి వివిధ క్రీడల్లో పోటీపడేందుకు ఎంపికయ్యారు తుని మండలం వి.కొత్తూరు పరిధి అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు.

శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

### నిత్యం సాధన చేయిస్తూ..

వి.కొత్తూరు పరిధిలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సుమారు 500కు పైగా విద్యార్థినులు ఉన్నారు. వీరిలో సుమారు 70 మంది విద్యార్థినులు జూడో, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్ ఫుట్‌బాల్, చదరంగం, క్యారమ్స్, యోగాలో శిక్షణ పొందడం విశేషం. దీంతో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన 12 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం వారి పట్టుదలకు నిదర్శనం. జూడోకు ఇద్దరు, అథ్లెటిక్స్ ఇద్దరు, చెస్‌కు ఇద్దరు, యోగాకు నలుగురు, అట్యాపాట్యాకు 12 మంది ఎంపికయ్యారు. వీరికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణతోపాటు అదనపు ఆహారం అందిస్తూ పాఠశాల ప్రిన్సిపల్ ప్రసన్నకుమారి ప్రోత్సహిస్తున్నారు.

### క్రీడలకు ప్రాధాన్యం..

చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో పలు క్రీడల్లో రాణిస్తున్నాం. ఆత్మరక్షణతోపాటు ఆరోగ్యపరిరక్షణకు జూడో క్రీడను ఎంపిక చేసుకున్నాను. ప్రస్తుతం జిల్లాస్థాయిలో పోటీ పడి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ సత్తాచాటి పతకం సాధిస్తాననే నమ్మకంతో ఉంది.

**-సీహెచ్.సత్య, జూనియర్ ఇంటర్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, వి.కొత్తూరు.**

(c) eenadu

## గుంతల మార్గం.. చేరేదెలా గమ్యం

కర్నూలు-బళ్లారి రహదారి అధ్వానంగా మారింది. ఈదులదేవరబండ, కప్పట్రాళ్ల, కరివేముల గ్రామాల వద్ద రోడ్డు దెబ్బతిని పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. దీనికి తోడు రాత్రివేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. అయినప్పటికీ మరమ్మతులు కానరావడం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దేవనకొండ

## పైకప్పు.. పెనుముప్పు

ఆదోనిలోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రి పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. కాన్పుల గది ముందు పైకప్పు దెబ్బతిని ఇనుప కడ్డీలు బయటకు వచ్చాయి. అసలే పాత భవనం.. పెచ్చులూడటంతో ఎప్పుడేం జరుగుతుందోనని గర్భిణులు ఆందోళన చెందుతున్నారు. గతంలో తాత్కాలిక పనులు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. శాశ్వత నిర్మాణాలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

## అభయారణ్యం.. ఆయుర్వేద భాండాగారం

ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నెలవైన నల్లమల. ఔషధ మొక్కలకు పేరొందింది. అనేక ఔషధ మొక్కలు ఇక్కడ లభిస్తాయి. వైవిధ్యమైన జంతువులతోపాటు అరుదైన వృక్ష సంపద నల్లమల సొంతం. ప్రాచీనమైన భారతీయ వైద్య శాస్త్రంలో నల్లమలలోని శ్రీశైలం, శ్రీగిరి పేర్లు కనిపిస్తాయి.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు

నల్లమలలో ఏర్పాటుచేసిన వనమూలికల సంరక్షణ కేంద్రం

● నల్లమల కొండలు తూర్పు కనుమల్లో విస్తరించి ఉన్నాయి. నల్లమల మొత్తం విస్తీర్ణం 5,947 చ.కి.మీ.లు కాగా ఇందులో 3,040.74 చ.కి.మీ.లు రాజీవ్‌గాంధీ పులుల అభయారణ్యం ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఇది విస్తరించి ఉంది. దీనికి మరోపేరు నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యం.

### ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

నల్లమల పరిధిలో దాదాపు 4 వేల రకాల మొక్కలున్నాయి. ఇందులో ప్రతి మొక్క ఔషధ గుణాలున్నవి కావడం విశేషం. రోళ్లపెంట నుంచి పెచ్చెర్వు గూడేనికి వెళ్లే దారిలో ఒకే ప్రాంతంలో అత్యంత ప్రాముఖ్యమైన 70-80 జాతుల ఔషధ మొక్కలు ఉండటంతో వనమూలికల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

## అక్రమాలను పత్తించుకోరు

☛ సరిహద్దులు దాటిస్తున్న వ్యాపారులు

పశ్చిమ ప్రాంతాల నుంచి పత్తి సరిహద్దులు దాటుతోంది. అధిక ధర చెల్లిస్తామంటూ మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు దిగుబడులను కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లోనే తూకాలు వేసి నగదు చెల్లించి లారీల్లో తరలిస్తున్నారు. దీంతో మార్కెట్ యార్డులకు రావాల్సిన పత్తి అక్రమ మార్గం సరిహద్దులు దాటుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. – న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్

ఉమ్మడి జిల్లాలో 2.17 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. దిగుబడులు చేతికొస్తున్నాయి. ఆదోనితోపాటు కౌతాళం, కోసిగి తదితర మండలాల్లో పలువురు వ్యాపారులు రైతుల ఇళ్ల వద్దే క్వింటా రూ.7,100కు పత్తి కొనుగోలు చేస్తున్నారు. హమాలీ ఖర్చులు, రవాణా ఛార్జీల భారం తగ్గుతుందని నమ్మిస్తున్నారు. కౌతాళం మండలం కుంటనహాల్ గ్రామంలో ఈనెల 12న నాలుగైదు లారీల పత్తి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించారు. రాళ్లతో తూకాలు వేసి రైతులను మోసగిస్తున్నారు.

కుంటనహాల్‌లో రైతు ఇంటి వద్దే కొనుగోలు

### ఆదాయానికి గండి కొడుతూ..

● నిబంధనల ప్రకారం పత్తి కొనుగోలు చేయాలంటే ముందుగా మార్కెటింగ్ శాఖ నుంచి అనుమతులు పొందాలి. ఎక్కడైతే పత్తి కొనుగోలు చేస్తారో అక్కడే మార్కెట్ యార్డుకు సెస్సు కట్టి తరలించుకోవాలి. ఇది ఎక్కడా అమలుకావడం లేదు. ప్రస్తుతం 8 టైర్ల లారీల్లో పత్తి తరలిస్తున్నారు. ఈ వాహనాలకు ఇరువైపులా ఎత్తుగా కర్రలు పెట్టి అందులో పత్తి వేసి తొక్కి నిల్వచేస్తే సుమారు 150 క్వింటాళ్ల పత్తి పడుతుంది.

### మాటలతో మోసగిస్తూ..

ప్రస్తుతం విపణిలో పత్తి ధరలు నేలచూపులు చూస్తున్నాయి. ఆదోని మార్కెట్ యార్డులో వంద మందికి పైగా పత్తి వ్యాపారులున్నారు. పత్తి క్వింటా కనిష్ఠంగా రూ.3,980, గరిష్ఠంగా రూ.7,330 పలుకుతోంది. ఆత్మధరకు రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపే ఉంటోంది. అధిక వర్షాలు, తేమ శాతం పెరగడం, నాణ్యతపై ప్రభావం చూపుతుండటంతో ఆశించిన ధర లభించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్ ధరకే పత్తిని కొనుగోలు చేస్తామంటూ బయటి వ్యాపారులు రైతులను మోసగిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గమనార్హం.

● వ్యాపారులు క్వింటాకు రూ.7,100 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన లారీలోని సరుకు విలువ రూ.10.65 లక్షలుగా ఉంటుంది. ఒక శాతం మార్కెట్ యార్డుకు సెస్సు రూపంలో చెల్లించాల్సి ఉంది. వ్యాపారులు అక్రమంగా తరలిస్తుండటంతో ఒక్కో లారీపై మార్కెట్ యార్డు రూ.10,650 మేర ఆదాయం కోల్పోతోంది. చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ సిబ్బందికి మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

## ప్రత్యర్థుల భరతం పట్టి.. పతకాలు కొల్లగొట్టి

సాధించాలన్న పట్టుదల.. గెలవాలన్న కసి ఉంటే వైకల్యం ఏమాత్రం అడ్డురాదని నిరూపించారు భరత్‌కుమార్. పుట్టుకతో పోలియో సోకడంతో ఒక కాలు పనిచేయదు. అయినప్పటికీ కుంగిపోలేదు. అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగారు. చదువుకుంటూనే పారా ఫెన్సింగ్, పడవ పోటీల్లో రాణిస్తూ ప్రతిభ చాటుతున్నారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన భరత్‌కుమార్ బీటెక్ చదువుతున్నారు. గతేడాది నుంచి పారా ఫెన్సింగ్‌తోపాటు కెనోయింగ్, కయాకింగ్ (పడవ పోటీలు)లో లక్ష్మణ్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. ఏడాదిలోనే ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ ఏడాది నంద్యాలలో నిర్వహించిన కెనోయింగ్, కయాకింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించి ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. ఈ ఏడాది మేలో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కెనోయింగ్, కయాకింగ్ పోటీల్లో రాణించి బహుమతి అందుకున్నారు. జూన్‌లో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పారా ఫెన్సింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. అదే నెలలో జూన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. జులైలో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి పారా ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించి అందరి మన్ననలు అందుకున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పాత పట్టణం

## మాతృ వేదన

● ఆర్థిక భరోసాకు అడ్డంకులు

గర్భిణులకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన అండగా నిలుస్తోంది. అర్హులైన వారు వివరాలు నమోదు చేయించుకుంటే ఆర్థిక భరోసా లభిస్తుంది. ఈ పథకం కింద మొదటి కాన్పులో రూ.6 వేలు, రెండో కాన్పులో ఆడ బిడ్డ అయితే రూ. 6 వేలు అందిస్తారు. గర్భిణులకు విడతల వారీగా ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ తీసుకుంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా వివరాలు నమోదు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా అర్హులకు పథకం ఫలాలు అందడం లేదు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

### అంగన్‌వాడీలకు అప్పగింత..

పీఎం మాతృ వందన యోజనకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు, ఎంపిక ప్రక్రియను గతంలో వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించేది. తాజాగా ఈ బాధ్యతలను అంగన్‌వాడీ కార్యకర్తలకు (ఐసీడీఎస్) అప్పగించారు. గతంలో నమోదు చేసిన వివరాలను పరిశీలించి అర్హులైనవారిని గుర్తించే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉంది. ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ముందుకు సాగడం లేదు. అర్హుల గుర్తింపు విషయంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా 16, నంద్యాల జిల్లా 14వ స్థానంలో ఉండడం గమనార్హం. గర్భిణుల వివరాలను వైద్య, ఆరోగ్య శాఖ గంపగుత్తగా ఐసీడీఎస్‌కు అప్పగించింది. ఈ కారణంతోనే క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులను గుర్తించడంలో ఆలస్యమవుతోందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

| జిల్లా | నంద్యాల | కర్నూలు |
|---|---|---|
| దరఖాస్తులు | 25,661 | 45,105 |
| అర్హుల గుర్తింపు | 4,142 | 4,111 |
| తిరస్కరించినవి | 13,335 | 25,507 |
| పరిశీలించాల్సినవి | 8,184 | 15,487 |

వివరాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

### నగదు నేరుగా జమ

మొదటి కాన్పు తర్వాత లబ్ధిదారుల ఖాతాలో రూ.6 వేలు జమ చేస్తారు. గర్భిణిగా నమోదైన 5 నెలల్లోపు రూ.2 వేలు, గర్భిణి అన్నిరకాల టీకాలు వేసుకుంటూ సరైన పరీక్షలు చేయించుకుంటే 9 నెలల లోపు మరో రూ.2 వేలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైతే రూ.వెయ్యి, పుట్టిన బిడ్డకు మూడున్నర నెలల వయస్సులో అవసరమైన టీకాలన్నీ వేయించుకుంటే మరో రూ.వెయ్యి ఖాతాలో జమ చేస్తారు. రెండో కాన్పునకైతే బిడ్డ (ఆడ బిడ్డకు మాత్రమే) పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం ఒకేసారి రూ.6 వేలు ఖాతాలో జమ చేస్తారు.

### నత్తనడకన ఎంపిక

డోన్ ఐసీడీఎస్ సెక్టారులో 1,014 గర్భిణులు, బాలింతలను గుర్తించగా వారిలో 350 మంది తిరస్కరణకు గురయ్యారు. 14 మందిని అర్హులుగా గుర్తించారు. ఇంకనూ 650 మందిని గుర్తించాల్సి ఉంది. దాదాపు 64 శాతం దరఖాస్తుల పరిశీలన అసంపూర్తిగా ఉండటం గమనార్హం. ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలోని రుద్రవరం సెక్టారులో 61 శాతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. డోన్ ప్రాజెక్టులోని మిగతా సెక్టార్లలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పురోగతిలో ఉంది.

## గుండం మల్లికార్జునుడు.. మహిమాన్వితుడు

బనగానపల్లి మండలం పసుపల గ్రామ శివారులోని ఎర్రమల కొండల్లో వెలసిన గుండం మల్లికార్జునస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. బనగానపల్లి నుంచి 20 కి.మీ. దూరంలో ఉంది. ఏటా కార్తిక మాసంతోపాటు శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కార్తిక మాసం చివరి సోమవారం నేపథ్యంలో వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేస్తారు. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక భక్తులు తరలివస్తారు. 2012లో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేసినట్లు అర్చకులు మల్లికార్జునశాస్త్రి తెలిపారు.

- ఆలయం చుట్టూ చిన్నపాటి రాతి గుహలు ఉన్నాయి. వీటిల్లో మునులు, యోగులు తపస్సు చేసినట్లు పెద్దలు చెబుతారు.
- ఆలయ సమీపంలోని కోనేరులో భక్తులు స్నానమాచరించి పూజలు చేస్తుంటారు. వర్షాకాలంలో జలపాతం నుంచి కోనేరుకు నీరు వస్తుంది.

– న్యూస్‌టుడే, పసుపల (బనగానపల్లి గ్రామీణం)

## వసతి చూపి.. వలసలు ఆపి

▶▶ 5 సీజనల్ హాస్టళ్లు ప్రారంభం

ఢణాపురంలో ఇటీవల సీజనల్ వసతిగృహాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్ పరిధిలో వలసల ప్రభావం అధికంగా ఉంటుంది. విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లడం మానేసి తల్లిదండ్రుల వెంట సుగ్గికి వెళుతుంటారు. ఇక్కడ డ్రాపౌట్ల శాతం ఎక్కువే. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు వలస వెళ్లకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వలసలు అధికంగా వెళ్లే గ్రామాల్లో సీజనల్ వసతి గృహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

### నిర్వహణ బాధ్యతల అప్పగింత

▲ ఆదోని నియోజకవర్గంలో వలసలు అధికంగా ఉండే గ్రామాలను గుర్తించి ఇటీవల ఐదు సీజనల్ వసతి గృహాలను ప్రారంభించారు. మండల పరిధిలోని ఢణాపురంలో 1, పెద్దహరివాణంలో 2, దొడ్డనగేరిలో రెండు చొప్పున మొత్తం 5 వసతి గృహాలను ఏర్పాటు చేశారు. త్వరలో పెద్దతుంబళంలో 2, అలసందగుత్తి-1, కపటి-1, అరేకలు-1, బైచిగేరలో ఒక సీజనల్ వసతి గృహం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.

▲ నిర్వహణను స్వచ్ఛంద సంస్థలు, పొదుపు మహిళలు, గ్రామైక్య సంఘం నిర్వాహకులకు అప్పగిస్తున్నారు. వీరు ఉదయం విద్యార్థులకు అల్పాహారం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం వడ్డించాలి. పాఠశాల సెలవు రోజుల్లో టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం పెట్టాల్సి ఉంది.

## నేడు జిల్లాలో కేంద్ర మంత్రి పర్యటన

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. 17వ తేదీ ఉదయం 10.44 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు పిన్నాపురంలోని గ్రీన్‌కో సంస్థకు చేరుకుంటారు. గ్రీన్‌కో- పీఎస్‌పీ ఐఆర్ఈపీ ప్రాజెక్టును హెలికాప్టర్ ద్వారా పరిశీలించనున్నారు. 1.30 వరకు పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీతో సమావేశమవుతారు. 2.30 నుంచి 3.30 గంటల వరకు గ్రీన్‌కో పరిశ్రమను మంత్రి పరిశీలిస్తారు.

## లాభాలు పట్టుకో

● రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంతో చిన్న, సన్నకారు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. తక్కువ పెట్టుబడి కావడంతో ఎకరాలో ఏడాదికి నాలుగు పంటల చొప్పున.. రెండెకరాల్లో 8-10 పంటలు సాగు చేయడం ద్వారా నెలనెలా ఆదాయం అందుకుంటున్నారు. ఒకసారి మల్బరీ నాటితే పది నుంచి పదిహేను ఏళ్లపాటు పంట వస్తుంది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 1,800, నంద్యాల జిల్లాలో 2,098 ఎకరాల్లో పట్టు సాగు చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

● 2025-26 సంవత్సరానికిగాను కర్నూలు జిల్లాలో 150, నంద్యాల జిల్లా పరిధిలో 250 ఎకరాల్లో కొత్తగా పంట సాగు చేయించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 75 శాతం రాయితీ అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది.

● పెరిగిన ధరలకు అనుగుణంగా 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు కలిగిన ఒక షెడ్డు నిర్మాణానికి రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చవుతుంది. దశాబ్దాల కిందట కేంద్రీయ పట్టు మండలి నిర్ణయించిన మేరకు.. ఒక యూనిట్ ధర రూ. 4.50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 4.05 లక్షలు, ఇతరులకు రూ. 3,37,500 రాయితీ ఇస్తారు.

పరికరాలు : స్టాండ్లు, నేత్రికలకు కలిపి ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.63 వేలు, ఇతరులకు రూ.56,750 రాయితీ ఇస్తారు. మల్బరీ రైతులకు వ్యవసాయ పరికరాల యూనిట్ ధర రూ.లక్ష కాగా.. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.90 వేలు, ఇతరులకు రూ.50 వేలచొప్పున రాయితీ ఉంటుంది.

### మంచి ఆదాయం లభిస్తుంది

– డి.ఆంజనేయులు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి, కర్నూలు

ఇతర పంటలతో పోల్చుకొంటే పట్టు సాగు మంచి ఆదాయం ఇస్తుంది. ఏడాదికి ఎకరాకు నాలుగు పంటలు సాగు చేసుకోవచ్చు. పెట్టుబడులు పోను ఎకరాకు రూ. 80-90 వేల వరకు ఆదాయం లభిస్తుంది. రైతు మొదట మల్బరీ సాగుతో పాటు షెడ్డు నిర్మించుకోవాల్సి ఉంటుంది. మల్బరీ సాగు నుంచి పట్టుగూళ్ల విక్రయం వరకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా సూచనలు ఇస్తాం.

### చేయూతనిస్తూ..

మల్బరీ తోటల పెంపకానికి రాయితీ ఇస్తున్నారు. ఎకరాకు 5 వేల మొక్కలు అవసరం కాగా ఒక మొక్క ధర రూ.2 ఉంది. మల్బరీ మొక్కలు, పంట సాగుకు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి కాగా.. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27 వేలు, ఇతరులకు రూ.22,500 రాయితీ అందుతుంది.

## నైపుణ్యమే

☛ శిక్షణ తరగతులు అంతంతే

☛ మూలకు చేరిన పరికరాలు

నంద్యాల పట్టణం, డోన్ పట్టణం, న్యూస్‌టుడే : బాల్యం నుంచే విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాయి. పాఠశాల స్థాయి నుంచే పాఠ్య ప్రణాళికలకు అనుబంధంగా వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చాయి. పదో తరగతి పూర్తైన వెంటనే ఐటీఐ, పాలిటెక్నిక్‌తో పాటు ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సుల్లో చేరడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చు. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి.

వృత్తి విద్యా కోర్సులు ఉన్న పాఠశాలలు: కర్నూలు 78, నంద్యాల 65

### 143 పాఠశాలల్లో శిక్షణ

2015-16లో ఆదర్శ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 143 పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో 78 పాఠశాలల్లో, నంద్యాల జిల్లాలో 65 పాఠశాలల్లో ఇస్తున్నారు. సోషల్ వెల్ఫేర్ ఆరు, ట్రైబల్ వెల్ఫేర్ మూడు, జ్యోతిరావు పులె పాఠశాల ఒకటి, కేజీబీవీలు 11, ఆదర్శ పాఠశాలలు 22, జడ్పీహెచ్ఎస్ 13, బాలికల ఉన్నత పాఠశాలలు తొమ్మిదింటిలో వివిధ ట్రేడ్‌లలో వృత్తి విద్యా బోధన సాగుతోంది.

డోన్ జడ్పీ బాలికల పాఠశాలలో ఒక గదిలో నిల్వ ఉంచిన కంప్యూటర్లు, వివిధ పరికరాలు

### అవసరమైన గదులు లేక..

● డోన్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ముగ్గురు శిక్షకులు ఉన్నారు. ఒక్కో కోర్సులో 90 మంది ఉన్నారు. మూడు కోర్సుల్లో ఒక కోర్సుకు మాత్రమే గది కేటాయించారు. మిగతా కోర్సులకు గదులు అందుబాటులో లేవు. శిక్షణ ఇవ్వాలంటే నిర్మాణంలో ఉన్న గదులు పూర్తి కావాల్సిందే. ● వృత్తి విద్యా కోర్సుల బోధన, శిక్షణపై క్వాలిటీ కంట్రోల్ ఇటీవల తనిఖీలు నిర్వహించింది. కొన్ని ప్రాంతాల్లో బోధన అటకెక్కించినట్లు గుర్తించారు.

## టమాటాకు ఆధరణ

☛ అన్నదాతల్లో ఆనందం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే : పత్తికొండ మార్కెట్‌లో టమాటా ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. మొదట్లో ధర లేకపోవడంతో చాలామంది తీవ్రంగా నష్టపోయారు. పలువురు పంట పొలాల్లోనే వదిలేశారు. మరోవైపు వర్షాల కారణంగా పంట దెబ్బతింది. ఫలితంగా విపణికి సరకు రావడం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ధర ఒకింత బాగుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

### మూడు రోజుల వ్యవధిలో..

మార్కెట్‌లో మూడు రోజుల వ్యవధిలోనే క్వింటాకు రూ.వెయ్యి అదనంగా ధర పెరిగింది. గత గురువారం వరకు క్వింటా గరిష్ఠ ధర రూ.2 ఉండగా.. శుక్ర, శని, ఆదివారాల్లో క్వింటా రూ.3 వేలు దాటడం విశేషం. గత మూడు రోజులుగా కనిష్ఠ ధరలు రూ,1,800, రూ.2 వేలు, రూ.2 వేలు పలకగా.. మధ్యస్థ ధర రూ.2,200, రూ.2,400, రూ.2,500గా ఉంది. మూడు రోజుల్లో 473 క్వింటాళ్ల సరకు వచ్చినట్లు యార్డు అధికారులు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో టమాటా ధరలు పెరగటంతో వ్యాపారులు సైతం పోటీ పడి సరకు కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధరలు అంతకంతకు పెరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

విక్రయించేందుకు తెచ్చిన టమాటాలు

● రానున్న రోజుల్లో ధరలు మరింత ఆశాజనకంగా ఉంటాయని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ దిగుబడులను పత్తికొండ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు.

## సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ, డా.బి.ఆర్.అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ - 2026, మెయిన్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, దివ్యాంగ అభ్యర్థులు అర్హులు. ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో https:///apstudycircle.ap.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 340 సీట్లు ఉండగా విజయవాడలో 120, విశాఖపట్నం 100, తిరుపతిలో 120 సీట్లు ఉన్నాయి. ఈనెల 30వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. డిసెంబరు 10న శిక్షణ ప్రారంభించేలా తాత్కాలిక తేదీలుగా నిర్ణయించారని కర్నూలు కలెక్టర్ డా.సిరి తెలిపారు. అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దారులు పూడ్చేసి.. నిధులు ఊడ్చేసి

● ఆయకట్టు రోడ్లపై పూడిక మట్టి ● రైతులకు తప్పని ఇబ్బందులు

హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ నుంచి ఎక్కువ నీటిని తరలించడంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు రైతుల పాలిట శాపంగా మారింది. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని తరలించేందుకుగాను తొమ్మిది ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లాకు సైతం నీటిని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించి కాలువ విస్తరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మొదట్లో గుత్తేదారుడికి పనులు అప్పగించారు. 1వ కి.మీ. నుంచి 9వ కి.మీ. వరకు పూడిక తొలగించారు. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, నందికొట్కూరు

రహదారిపై వేసిన వ్యర్థాలు

### అదనపు వ్యయం

పొలాలకు వెళ్లే దారులకు అడ్డుగా పూడిక మట్టి వేయడంతో దీనిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమే. కాలువ వెంబడి పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పూడిక మట్టి వేయడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

### తవ్వి.. ఇష్టానుసారంగా పడేసి..

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు-వడ్డెమాను మధ్య హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో పూడికతీత పనులు ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. 9 కి.మీ. పొడవునా తీసిన పూడిక మట్టిని కొంత కాల్వ గట్టుపైనే వేశారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని జలవనరుల శాఖకు చెందిన రిజర్వు స్థలంలో వేయాలి. అది దూరంగా ఉండటంతో కాలువలో నుంచి తీసిన పూడికను ఎక్కడికక్కడ వేసుకుంటూ వెళ్లిపోయారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గంలోనూ వేశారు. వాహనాలు, ఇంధనం ఖర్చు కలిసివస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా పడేశారు. పొలాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా వేయడంతో వడ్డెమాను గ్రామానికి చెందిన 100 ఎకరాలకు దారి కరవైంది. ప్రస్తుతం దిగుబడులు తీసుకెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

(c) eenadu

## రైలుబండి.. కిటకిట

డోన్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాంలో ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. కర్నూలు నుంచి డోన్ మీదుగా గుంతకల్లుకు వెళ్లే రైలు కోసం ప్లాట్‌ఫాంలో ప్రయాణికులు గంటన్నర నుంచి ఎదురు చూశారు. ఉదయం 11 గంటలకు స్టేషన్‌కు చేరాక డెమూ రైలు ప్రయాణికులతో కిక్కిరిపోయింది. శనివారం రోజు మరింత రద్దీ నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు. కార్తిక మాసంలో చివరి శనివారం కావడంతో కసాపురం ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు, శుభకార్యాలు ఉండటంతో రద్దీ నెలకొందని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, డోన్ పట్టణం

## నాణ్యతా లోపం.. ప్రయాణికులకు శాపం

ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామం నుంచి బాచేపల్లె రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు ధ్వంసమై రాళ్లు తేలడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 3 కి.మీ ఉన్న ఈ దారిని ఈ ఏడాది ఆరంభంలో రూ.4.50 లక్షల నిధులతో మరమ్మతులు చేశారు. నామమాత్రంగా పనులు చేయడంతో కొంత కాలానికే రోడ్డు దెబ్బతింది. చాలా చోట్ల ఛిద్రం కావడంతో పాటు రోడ్డు చివరి భాగాలు కొట్టుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- న్యూస్‌టుడే, బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం)

## ఫుట్‌బాల్ విజేత ఆదోని జట్టు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయలసీమ విశ్వవిద్యాలయ ఇంటర్ కాలేజీయేట్ క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో ఫుట్‌బాల్ క్రీడకు ఐదు జట్లు, చదరంగం పోటీలకు ఏడు జట్లు పాల్గొన్నట్లు కళాశాల పీడీ చంద్రశేఖర్ తెలిపారు. ఫుట్‌బాల్ తుది పోటీల్లో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. చదరంగం తుది పోటీల్లో కర్నూలులోని ఆర్‌యూ కళాశాల జట్టు విజయం సాధించింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.భారతి, సీఐ ఇంతియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడ్, న్యాయవాదులు రాగుల రాముడు, బొంకూరి రవికుమార్, టీఈ నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

గెలిచిన జట్టుకు బహుమతి అందిస్తున్న కళాశాల యాజమాన్యం

## ఆలయాల్లో న్యాయమూర్తుల పూజలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శివనంది, క్రిష్ణనంది శైవ క్షేత్రాల్లో ఆదివారం ఉమ్మడి జిల్లాల న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, నంద్యాల జిల్లా మొదటి అదనపు కోర్టు న్యాయమూర్తి కమలాదేవి, పోక్సో ప్రత్యేక జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజేంద్రప్రసాద్, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి, నంద్యాల జిల్లా మూడో అదనపు కోర్టు న్యాయమూర్తి అమ్మన్న రాజా, ఎక్సైజ్, కర్నూలు, నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తులు, కర్నూలు మొబైల్ కోర్టు, కర్నూలు ఎక్సైజ్, లోకాయుక్తా న్యాయమూర్తులతో పాటు మరో ముగ్గురు న్యాయమూర్తులు ఆలయాల్లో పూజలు చేశారు.

పూజలో పాల్గొన్న న్యాయమూర్తులు

### సర్వేయర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా జగదీశ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని నిశ్శాంత్ భవనంలో ఆదివారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రపాల్, సర్వేయర్ సుధాకర్ అధ్యక్షత ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా షేక్‌అబ్దుల్ మన్నన్, కార్యదర్శిగా సహదేవుడు, సంయుక్త కార్యదర్శిగా జునైద్, కోశాధికారిగా చిన్నమల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా చిన్నమల్లయ్య, నాగార్జునరెడ్డి, అలీఖ్‌కుమార్‌రెడ్డి, విజయకిరణ్, గంగాధర్, అహమ్మదలీ ఎన్నికయ్యారు.

### ఎన్నికలు వాయిదా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: విజయ పాల ఉత్పత్తుల పరస్పర సహాయ సహకార సంఘం ఎన్నికలు పలుచోట్ల వాయిదా పడినట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. ఆదివారం వివరాలు వెల్లడించారు. నామపత్రాల దాఖలుకు ఎవరూ రాకపోవడం, పాడి రైతులు ఎన్నికలకు సుముఖంగా లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నగళ్లపాడు, గడివేములు, రుద్రవరం, ఆర్.పాంపల్లె, బోయిలకుంట్ల, వీరారెడ్డిపల్లె ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రతిభ చాటి.. పతకాలు సాధించి

☛ జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు విద్యార్థులు యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. పాఠశాల స్థాయిలోనే ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారు. పరుగు పందెంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు సాధన చేస్తున్నారు. యోగాలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పలు ఆసనాలు వేస్తూ సత్తా చాటారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి అబ్బురపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన విద్యార్థులపై క్రీడా కథనం.

### మెరుపు వేగంతో పరుగు

-అశ్వర్థకృష్ణ, 9వ తరగతి ఎమ్మిగనూరు

చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్ ఆటలంటే ఇష్టం. అమ్మనాన్నలు మురళీకృష్ణ, రూప. నాన్న పోలీస్ వృత్తిలో రాణిస్తున్నారు. పరుగు పందెంలో రాణించాలనే పట్టుదలతో రెండేళ్లుగా సాధన చేశా. కర్నూలులో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ పోటీల్లో వంద మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాను. అనంతరం రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన పోటీల్లో 12 సెకండ్లలో గమ్యస్థానాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలిచి పతకం అందుకున్నా. 1004 రన్నింగ్ రేస్‌లో 22 సెకండ్లలో చేరుకోవడంతో రాష్ట్రం తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబర్ 1వ తేదీన నుంచి 3వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటున్నాను. ఇందులో ప్రథమ స్థానం సాధించాలనే లక్ష్యంతో రోజూ రెండు గంటల పాటు మైదానంలో రన్నింగ్ సాధన చేస్తున్నా.

### ఆసనాల్లో అద్భుతం

- చరణ్‌సాయి, 10వ తరగతి, సోమప్పనగర్ జడ్పీహెచ్‌ఎస్

నాలుగేళ్లుగా యోగాసనాల్లో ప్రతిభ చూపుతున్నా. ఎమ్మిగనూరు డివిజన్‌తో పాటు, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయి పోటీల లక్ష్యంగా రెండేళ్లుగా సాధన చేస్తున్నా. వృక్షికాసనం, శీర్షాసనం, ప్రాణాయామం, ధనురాసనం, మత్స్యాసనం, త్రికోణాసనం, ఇతర ఆసనాల్లో రాణించాను. 2025 సెప్టెంబర్‌లో మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యాను. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 23,24వ తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రతి రోజూ రెండు గంటల పాటు సాధన చేస్తున్నా. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనే లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్నా.

## అన్నదాతల సంక్షేమమే లక్ష్యం

చాగలమర్రి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని నంద్యాల డివిజన్ సహకార సంఘ అధికారి రుక్సానా బేగం తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు హుశేన్‌రెడ్డి ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్సానా బేగం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 56 సహకార సంఘాలు ఉన్నాయన్నారు. రైతుల అభివృద్ధే సహకార సంఘాల ధ్యేయమని సహకార వ్యవస్థలు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. సంఘం ద్వారా రైతులకు అర్హతను బట్టి రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు సేవలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు.

## సతీశ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల పరకామణి కేసులో విచారణకు వెళ్తూ తాడిపత్రి సమీపంలో హత్యకు గురైన గుంతకల్లు రైల్వే సీఐ సతీశ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆదివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పత్తికొండలో ఆందోళన చేపట్టారు. ఇంటి నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన పోలీసు అధికారిని హత్య చేసిన దుండగులను, వారి వెనుక ఉన్న సూత్రదారులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సతీశ్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. పట్టణ ప్రజలు వారికి సంఘీభావం తెలిపారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

## రైతుల పాదయాత్ర ఫలించేనా?

తుంగభద్ర బోర్డు కార్యాలయానికి పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక రైతులు

హాలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర దిగువ కాల్వకు నీటి విడుదల చేయాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర రైతులు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 12వ తేదీ నుంచి 20 గ్రామాలకుపైగా చెందిన అన్నదాతలు యాత్ర చేపడుతున్నారు. హొసపెటె తుంగభద్ర బోర్డు కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టనున్నారు. రాజకీయ, వివిధ సంఘాల వారు మద్దతు ఇస్తున్నారు. జనవరి 10 వరకు నీరు విడుదల చేసినా, వృథా కావడం తప్ప కర్షకులకు ఉపయోగం ఉండదని చెబుతున్నారు. మార్చి వరకు నీరు అందించినా.. మరో మూడు నెలలు ఉంటుందని, అప్పటిలోగా గేట్ల పనులు పూర్తి చేయొచ్చని చెబుతున్నా స్పందించడం లేదన్నారు. సోమవారం చేపట్టే నిరసనతో బోర్డు అధికారులు స్పందించి నీటి విడుదల చేస్తారా? లేదా? అనేది తేలనుంది. ఒకవేళ అధికారులు స్పందించి సరిహద్దు వరకు నీటి విడుదల చేస్తే హాలహర్వి, హొళగుంద, ఆదోని మండలాలకు ప్రయోజనం కలగనుంది. దీనికి మన అధికారులు, పాలకులు సైతం స్పందించి మనవాటా నీటిని తీసుకుంటే మేలు చేకూరనుంది. ప్రస్తుతం డ్యాంలో 75.23 టీఎంసీలు నీటి నిల్వ ఉండగా 2,987 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 7,211 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## మండలాల విభజనకు పూర్తి మద్దతు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఏకైక అతి పెద్ద మండలంగా ఉన్న ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలని తాను మొదటి అసెంబ్లీ సమావేశంలోనే మాట్లాడానని ఎమ్మెల్యే డా.పార్థసారథి అన్నారు. ఆదోని మండలంలోని పెద్ద హరివాణం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. కోట్ల కూడలిలో మండల సాధన కమిటీ చేపట్టిన రిలే దీక్షలకు ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే, ఆదోనితో పాటు చుట్టూ ఉన్న పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలను కలుపుకొని జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్నారు. దీంతో పాటు ఆదోనిని నాలుగు మండలాలుగా విభజించాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ సైతం చేసిందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు జిల్లాతో పాటు మండలాల విభజన చేయాలని తమ అభిమతాన్ని తెలిపారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రభుత్వానికి చేరినా, నేటికి ఊగిసలాడుతోందన్నారు. జిల్లా, మండలాల విభజనకు తాను పూర్తి మద్దతిస్తున్నట్లు చెప్పారు.

దీక్షా శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి

## విద్యుత్తుశాఖలో పలువురికి పదోన్నతులు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని విద్యుత్తుశాఖ అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేసే జూనియర్ అకౌంట్స్ అధికారుల (జేఏవో)ను అసిస్టెంట్ అకౌంట్స్ అధికారులు (ఏఏవో)గా పదోన్నతిపై బదిలీ చేస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివశంకర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలులో ఎల్‌టీ సెక్షన్ జేఏవోగా విధులు నిర్వహిస్తున్న అశోకవర్ధన్‌గుప్తాను నందికొట్కూరు ఏఏవోగా, నంద్యాల జేఏవోగా పనిచేస్తున్న సుంకన్నను బనగానపల్లికి, ఆదోని జేఏవో హనుమేష్‌ను విజయవాడకు, కర్నూలులో జేఏవోలుగా పనిచేస్తున్న డేనియల్‌ను ఎమ్మిగనూరుకు, వెంకటరాఘవను అనంతపురం జిల్లా రాయదుర్గంకు, కృష్ణనాయక్‌కు కళ్యాణదుర్గం ఏఏవోగా బదిలీ చేశారు.

## సంప్రదాయ పండగ.. సంతోషాలు నిండుగా

☛ ఘనంగా కార్తిక వనభోజనోత్సవాలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కార్తిక మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని కర్నూలు నగరంలో వివిధ సంస్థలు, కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవాలు సందడిగా జరిగాయి. ఆయా సామాజిక వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉసిరి చెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

నగరంలోని సెయింట్ జోసఫ్ విద్యా సంస్థల మైదానంలో ఆర్యవైశ్యుల కార్తిక వనభోజన వేడుక నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్ హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

మునగాలపాడు గ్రామంలోని బాలసాయి ప్రాంగణంలో ఉన్న కేశవ స్మృతి మండలి ప్రాజెక్ట్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్తిక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ కుటుంబ ప్రబోధన్ సంయోజక్ పుట్టా శేషు, నగర సంచాలక్, వైద్యుడు డా.చల్లా వాసురెడ్డిలతో రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏపీలో ఆర్ఎస్ఎస్‌ను ఎలా హిందువుల్లోకి తీసుకెళ్లారో వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా చిన్నారులు యోగాసనాలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మహా బలిజ వనభోజన కార్యక్రమం జరిగింది. జనసేన పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ లీలా కోటేశ్ పాల్గొన్నారు.

నగర శివారులోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న కమ్మ సంఘం ప్రాంగణంలో కార్తిక వన భోజన కార్యక్రమం సందడిగా సాగింది. సంఘం అధ్యక్షుడు డా.కృష్ణమోహన్ మాట్లాడుతూ కమ్మ కులస్థులు ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. అనంతరం 2026 నూతన సంవత్సరం కాలమానిని ఆవిష్కరించారు. కార్యదర్శి రాజశేఖర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాతనగరంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మాలల కార్తిక వనభోజన కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ డీఎస్పీ మురళీధర్, ఆలయ అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి చెన్నకేశవ రాజు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ సీఎండీ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు ఉదయం 10 నుంచి 12 గంటల మధ్యలో 8977716661 నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యలను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఎల్.శివశంకర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

## పోక్సో కేసు నమోదు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన బాలికను వేధింపులకు గురిచేసిన ఓ పార్టీ నాయకుడు మహేశ్‌నాయక్‌పై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మూడో పట్టణ సీఐ రామలింగమయ్య తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహేశ్‌నాయక్ బాలికను వేధింపులకు గురిచేయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా.. ఈనెల 15న మహేశ్ నాయక్, అతని కుటుంబసభ్యులు తమపై దాడి చేసినట్లు బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. మహేశ్‌నాయక్‌పై పోక్సో చట్టం కింద, మరో ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. బాలిక కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారని మహేశ్ నాయక్ ఫిర్యాదు చేయడంతో బాలిక కుటుంబసభ్యులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భంలోనే శిశువు మృతి

◆ చికిత్స పొందుతూ ప్రాణాలొదిలిన తల్లి

◆ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నందవరం మండలం ముగతికి చెందిన బాణాల మౌనిక(21) అనే గర్భిణి కాన్పు కోసం ఆసుపత్రికి వెళ్తే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తల్లీబిడ్డ మృతి చెందారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రసవం కోసం శనివారం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సాధారణ కాన్పు అవుతుందని రాత్రి వరకు వైద్యులు, సిబ్బంది చెప్పారని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. సాధారణ ప్రసవం జరగకపోగా.. వైద్యుల నిర్లక్ష్యం వల్ల గర్భంలోనే బిడ్డ మృతి చెందినట్లు ఆరోపిస్తున్నారు. ఇది తెలిసిన వైద్యులు, సిబ్బంది కాన్పు కష్టంగా ఉందని శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి పంపినట్లు చెప్పారు. మౌనిక ఆసుపత్రిలో సోమవారం ఉదయం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తల్లీబిడ్డ మృతి చెందారని బీఎస్పీ నాయకులు కర్నూలు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదినాగేష్ దృష్టికి తీసుకెళ్లగా. . మౌనికకు సాధారణ కాన్పు చేసేందుకు వైద్యులు, సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. రాత్రి మరోసారి పరీక్షిస్తే గర్భంలోనే బిడ్డ మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ గుర్తించారని.. దీంతో రాత్రి గైనకాలజిస్టును ఆసుపత్రికి పిలిపించి పరీక్షించగా అదే తేలిందని చెప్పారు. విషయం కుటుంబసభ్యులకు తెలపడంతో వారు ఆమెను ప్రైవేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేస్తే అక్కడ కూడా ఇదే తేలిందని అన్నారు. మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో వైద్యులు కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారని చెప్పారు. అక్కడ సోమవారం తెల్లవారుజామున మృతి చెందిన నవజాత శిశువును తీశారని.. తర్వాత కొన్ని గంటలకే తల్లి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. ఇందులో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం లేదని.. తల్లీబిడ్డ మృతి చెందడం బాధాకరమని అన్నారు.

బాణాల మౌనిక (పాత చిత్రం)

## ఆసుపత్రి మేనేజరు అనుమానాస్పద మృతి

కర్నూలు నేరవిభాగం, వైద్యాలయం న్యూస్‌టుడే : కర్నూలు నగర పరిధిలోని జొహరాపురం వద్ద ఉన్న కిమ్స్ ఆసుపత్రి మేనేజరు మహ్మద్ అన్వర్‌హుస్సేన్ (60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం ఆదివారం వెలుగుచూసింది. స్థానిక కొత్తపేటకు చెందిన అన్వర్ కొన్నేళ్లుగా కిమ్స్ ఆసుపత్రి మేనేజరుగా పనిచేస్తున్నారు. నగరానికి చెందిన ఓ ప్రముఖ వైద్యుడికి ఈయన సమీప బంధువు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 15న సాయంత్రం ఈయన సంతోష్‌నగర్ సమీపంలోని భారత్ పెట్రోలు బంకు వద్దకు వెళ్లి తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశారు. వాహనం తాళంచెవులు అక్కడ పనిచేసే క్యాషియర్‌కు ఇచ్చి కొద్దిసేపు మాట్లాడి నడుచుకుంటూ వెళ్లిపోయారు. అక్కడికి వెళ్లిన సమయంలో ఆయన ఫోన్‌లో ఆవేశంగా మాట్లాడటాన్ని పెట్రోలు బంకు సిబ్బంది గమనించారు. ఆయన వెళ్లిన తర్వాత ఫోన్ చేసినా స్పందించకపోవడం, రాత్రి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం స్టాంటన్‌పురం వద్ద కేసీ కాలువలో శవమై కనిపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి సోదరుని కుమారుడు జావెద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మహ్మద్అన్వర్ (పాతచిత్రం)

### చికిత్స పొందుతూ..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇద్దరు మహిళలు ఆదివారం మృతి చెందారు. కర్నూలులోని శరీన్‌నగర్‌కు చెందిన నాగేంద్రమ్మ (56) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఈనెల 13న మోతాదుకు మించి మాత్రలు మింగారు. కుటుంబ సభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా పైపాడుకు చెందిన భానుప్రియ (21) ఈనెల 10వ తేదీన కర్నూలు మండలం పంచలింగాల వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. జీజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించారు. కర్నూలు తాలూకా పోలీసులు కేసు విచారిస్తున్నారు.

### పురుగుమందు తాగి బలవన్మరణం

హాలహర్వి, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిద్ధాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మారుతి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తిమ్మప్ప(45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి నలుగురు సంతానం ఉన్నారు. మృతుని భార్య ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి శ్రీనివాస రోడ్డు రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బసన్న(75) ప్రమాదానికి గురై మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్సై ఎర్రన్న తెలిపారు. నందవరం మండలం ముగతికి చెందిన బసన్న.. గ్రామం నుంచి పట్టణంలోకి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కింద పడి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. బసన్న ముగ్గురు కుమార్తెలు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై చెప్పారు.



బసన్న (పాత చిత్రం)

### అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని నన్నూరుకు చెందిన బాలరాజు (35) అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బాలరాజు తనకున్న ఎకరం భూమితో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశారు. పెట్టుబడుల కోసం రూ.6 లక్షలు అప్పు చేశారు. ఆశించిన దిగుబడులు రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక మనస్తాపానికి గురైన ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

MARRIAGE SERVICES

మనోజ్ఞ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. మా ప్రత్యేకత రెడ్డి కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ఆసక్తి గల వారు సంప్ర: 94900 04404.

TO LET

For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, లేడీ టెలికాలర్స్ కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ 10 to 15K +ఇన్సెంటివ్స్, నో టార్గెట్. ✆ 6305597809.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

కర్నూలులోని ప్రముఖ విద్యాసంస్థలో లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీతో పాటు MS-Excel తెలిసి 1 సం॥ అనుభవం ఉండాలి. ✆ 70328 20850.

కర్నూలులోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు "లేడీ వార్డెన్స్" కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. సంప్ర: 83176 99283.

SECURITY GUARDS

కర్నూలులోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ 10th+ఇంటర్ అర్హత, వయసు 30 సం॥-50సం॥లోపు స్త్రీ/పురుషులు కావలెను. సంప్ర: 97015 41899.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

## నేడు లక్ష దీపోత్సవం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఇస్కాన్, అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక దామోదర లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పుష్పావతి దంపతులు తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రులు కేఈ కృష్ణమూర్తి, కేఈ ప్రభాకర్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరవుతారన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బొమ్మిరెడ్డిపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మిరెడ్డి, నాగేశ్వరమ్మ దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం లక్షదీపోత్సవం ఉంటుందన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఏరీనా బ్యాడ్మింటన్ అకాడమిలో ఆదివారం ఏరీనా ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు ప్రారంభమయ్యాయి. తెదేపా యువ నాయకుడు సిద్ధార్థనాయుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పత్తికొండలోని మూడో సచివాలయ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా ఉంది. దీంతో వాహనాల రాకపోకలతో పాటు, పాదచారులకు ఇబ్బందిగా మారింది.
– కళాశాల విద్యార్థులు, పత్తికొండ

✔: కొద్ది రోజుల క్రితమే పట్టణంలో పలు చోట్ల గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టాం. ప్రస్తుతం ఎక్కడెక్కడ గుంతలు పడ్డాయో పరిశీలించి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. – సునీల్, ఆర్‌అండ్‌బీ జేఈ

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సాయిబాబానగర్ ప్రాంతంలో ఏబీజీ పురపాలక పాఠశాల సమీపంలో తాగునీటి సరఫరా గొట్టం లీకై నీరు వృథా అవుతోంది. లీకేజీని నివారించాలి. – నసీరుద్దీన్‌పటేల్, ఆదోని

✔: నీటి విభాగం ద్వారా సమస్యను పరిష్కరింపజేస్తాం. – నాసీర్‌హుస్సేన్, ఇన్‌ఛార్జ్ కమిషనర్

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని బోగప్పబావిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి. నీరు రంగు మారింది. – సురేశ్, మద్దికెర

✔: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.
– శివకుమార్, పంచాయతీ కార్యదర్శి

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: కల్లపరి, యాటకల్లు రహదారి నుంచి బైలుపత్తికొండకు వెళ్లే రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. బీటీ రహదారి ఏర్పాటు చేయాలి.
– సుంకన్న, రంగన్న, గోవిందు, బైలుపత్తికొండ

✔: బీటీ రహదారి ఏర్పాటుకు గతంలోనే నిధులు మంజూరవగా అప్పటి గుత్తేదారు వంతెనలు మాత్రమే నిర్మించి వదిలేశారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారి నిర్మాణానికి కృషి చేస్తాం.
– వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ, ఆస్పరి

## చదువుతోనే అభివృద్ధి సాధ్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఏటా వాల్మీకులంతా కలసికట్టుగా, కార్తిక వనభోజన కార్యక్రమాన్ని పండగలా నిర్వహించుకుందామని ఎమ్మెల్యే డా.పార్థసారథి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. స్థానిక జేబీ గార్డెన్‌లో ఆదివారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనభోజన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంతా ఐక్యంగా పోరాడి ఎస్టీ రిజర్వేషన్ సాధించుకుందామన్నారు. పిల్లలను బాగా చదివించి, ప్రయోజకులను చేయాలని సూచించారు. చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లోకేశ్వరి, సంఘ పెద్దలు గుడిసె కృష్ణమ్మ, రాంభీంనాయుడు, వీరేష్, వెంకన్న, సాయి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలనగర్‌లో సామూహిక వన భోజనాలు

తిరుమలనగర్(ఆదోని సాంస్కృతికం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణం తిరుమలనగర్‌లోని శ్రీ భారతి తీర్థ ఉద్యానవనంలో ఆదివారం సామూహిక కార్తిక వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పిల్లలు, యువత సంగీతానికి అనుగుణంగా నృత్యం చేసి అలరించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, హనుమంతరావు, శివరామిరెడ్డి, భాస్కర్‌గౌడు, ధనుంజయరెడ్డి, సుదీంద్రరావు, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

## తరుముకొస్తున్న నీటి ఎద్దడి

☛ పురపాలక సంఘంలో ట్యాంకర్ల కొరత
☛ ఉన్న ఒక్కటి మరమ్మతుల కారణంగా మూలకు..

☛ వార్డులు: 42
☛ జనాభా: 2 లక్షలు
☛ కుళాయిల సంఖ్య: 25 వేలు
☛ నీటి సరఫరా: 22-24 ఎంఎల్‌డీ
☛ అవసరమైన నీటి ట్యాంకర్లు: 4 లేదా 5

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలో నీటి ట్యాంకర్ల కొరత వేధిస్తోంది. ప్రత్యేక శ్రేణి కలిగిన ఇక్కడి పురపాలక సంఘంలో ఒక్కటీ సొంత నీటి ట్యాంకరు లేదు. ఉన్న ఒక్కటీ మూలకు చేరి ఏడాదవుతోంది. అది కూడా 1999-2004 మధ్య తెదేపా హయాంలో ఎంపీ నిధులతో మంజూరు చేసింది. రెండు దశాబ్దాలు కావడంతో మరమ్మతులకు గురైంది. నీటి ట్యాంకర్ల కేటాయింపులు, కొనుగోళ్లపై పాలకులు దృష్టి పెట్టలేదు. ఫలితంగా వార్డుల్లో నీటి సరఫరాకు అద్దె ట్యాంకర్లను వినియోగించాల్సి వస్తోంది.

### ప్రజాధనం వృథా

తుంగభద్ర జలాశయం వాకిళ్ల మరమ్మతుల కారణంగా, డిసెంబరు మధ్య నుంచి మూడు నెలల పాటు దిగువ కాలువకు నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఇక ప్రధాన నీటి వనరైన బసాపురం నీటి కుంట దెబ్బతిని.. నీటి నిల్వలు పడిపోయేలా చేశాయి. ఇలాంటి తరుణంలో వార్డుల్లో అత్యవసర సమయాల్లో నీటి సరఫరాకు ట్యాంకర్ల సేవలు అత్యవసరం. ఏటా వేసవిలో అద్దె ట్యాంకర్ల వినియోగంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఏలికల ముందుచూపు లేమి కారణంగా ప్రజలు సీజన్‌తో నిమిత్తం లేకుండా నీటి సమస్యలు చవిచూస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి.. నీటి కష్టాలు గట్టెక్కించే మార్గం చూపాలి.

మరమ్మతులకు గురైన ఆదోని పురపాలక సంఘం నీటి ట్యాంకరు

### పాలకుల ముందుచూపు లేక..

రెండు లక్షలకు పైగా జనాభా కలిగిన ఆదోని పట్టణానికి కనీసం నాలుగైదు ట్యాంకర్లు ఉండాలి. అలాంటిది ఒక్క సొంత ట్యాంకరు కూడా లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. ఏటా నీటి నిర్వహణ పేరుతో రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ప్రత్యేక నిధులూ వస్తున్నాయి. వీటి ద్వారా నీటి ట్యాంకర్ల సమస్యలు పరిష్కరించుకుని ఉంటే ప్రజలు కొంత ఊరట చెందేవారు. అసలే నీటి సరఫరాలో భౌగోళికంగా అనుకూల పరిస్థితులు లేవు. దిగువ కాలువ పంపింగ్ మొదలు, పట్టణానికి నీటిని మోసుకొచ్చి, ఉపరితల నీటి కుంటలకు నింపుకొనేంత వరకు అంతా మోటార్లపైనే ఆధారం. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడ లీకేజీ వచ్చినా, మరమ్మతులకు కనీసం 2-3 రోజులు పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పాలకులు సత్వరం మేల్కోవాల్సిన అవసరముంది.

## లీకేజీ నిత్యం.. పట్టించుకోని వైనం

హాలహర్వి మండలం చింతకుంట గ్రామ శివారులో జాతీయ రహదారికి పక్కనున్న తాగునీటి పైపులైన్ కొన్ని నెలలు నుంచి లీకేజీ అవుతోంది. దీంతో రహదారిపై నీరు వృథాగా పారుతోంది. రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చింతకుంట (హాలహర్వి)

## నీరు రాక.. ఇబ్బందులు తీరక

మండలంలోని హలిగేర గ్రామంలో మినీ ట్యాంకులు వృథాగా మారాయి. వాటి నుంచి నీరు రాకపోవడంతో స్థానికులు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. గ్రామంలో మూడు చోట్ల ఇలాంటి పరిస్థితి ఉంది. బీసీ కాలనీలో ట్యాంకు నుంచి నీరు రావడం లేదని స్థానిక కాలనీ వాసులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

## నియంత్రిక.. ప్రమాద ఘంటిక

మండలంలోని శంకరబండ గ్రామంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. బీసీ కాలనీలో విద్యుత్తు స్తంభానికి నియంత్రికను ఏర్పాటు చేశారు. కానీ కంచె ఏర్పాటు చేయలేదు. ఇది చిన్నారులకు అందేంత ఎత్తులో ఉండటంతో వారు ఆడుకునేటప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

## జనజీవన ప్రవంతి పుస్తకావిష్కరణ

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన కవి సవ్వప్ప గారి ఈరన్న రచించిన జనజీవన ప్రవంతి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాహితీ ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, కార్యదర్శి సత్యరాజ్‌బస్సూర్, విశ్రాంత తహసీల్దారు పిల్లావలి మాట్లాడుతూ.. కవి సవ్వప్ప గారి ఈరన్న 75 పుస్తకాలు రచించడం అభినందనీయమన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో మారుతిమోహన్, వెంకటేశ్వర్లు, దస్తారు నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

## నూతన విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

స్పందనకు వందనం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు అధికారులు కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయించారు. సమస్యపై ఈ నెల 9వ తేదీన 'ఈనాడు'లో 'సరఫరా స్తంభించి ప్రాణ పాయం పొంచి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించి విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం, సహాయ ఇంజినీర్ సహకారంతో హనుమాన్‌పేటలో పాటు ఎన్జీవో నగర్, బాజీగడ్డ ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయించారు. కౌడల్‌పేట ప్రాంతంలో విద్యుత్తు నియంత్రిక అరుగు దెబ్బతినడంతో కొత్తది నిర్మించారు.

### ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

కౌతాళం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి ఆలయ అభివృద్ధికి బళ్లారికి చెందిన హెచ్.జి.నరసింహ య్యశెట్టి రూ.లక్ష విరాళంగా అందజేశారు.

## పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలంలోని పెద్దహరివాణం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని మండల సాధన సమితి నాయకులు డిమాండు చేశారు. పట్టణంలోని కోట్ల కూడలి వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఈ నెల 20వ తేదీ వరకు దీక్షలు కొనసాగిస్తామని సమితి నాయకుడు ఆదినారాయణరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మెడికల్ నాగరాజు, సున్నుసాబ్, రేణుకాచారి స్వామి, శేషు, శేకప్ప, కర్రెప్ప, బలరాం, మధు తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలో పాల్గొన్న గ్రామస్థులు

### జిల్లా ఏర్పాటుకు మద్దతిస్తున్నాం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా కేంద్రంతో పాటు మండలాల విభజనకు తమ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కోట్ల కూడలిలో పెద్దహరివాణం మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. రాష్ట్రంలో అన్ని చోట్ల జిల్లాలను చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇక్కడి ప్రజల ఆకాంక్షలను గుర్తించి నెరవేర్చాలన్నారు. పార్టీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ పత్తికొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌జీ గాదిలింగన్న, ఆర్.నాగేంద్రనాయక్‌లు ఎన్నికయ్యారు. పత్తికొండ ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా శ్రీనివాసులు, ప్రకాశ్ వ్యవహరించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షునిగా బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎం.హరికృష్ణ, కోశాధికారిగా రాజానాయక్, సభ్యులుగా సురేశ్, యశోదమ్మ, భానుప్రకాశ్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంఘం సభ్యులు

## ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తలు, కేఈ జయన్న దంపతులు

కంబాలపాడు (కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని కంబాలపాడులో ఆదివారం గంగమ్మ విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, కేఈ జయన్న గార్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహప్రతిష్ఠగావించారు. మూడు రోజులుగా పురోహితులు హోమాలు నిర్వహించారు. కార్యక్రమ అనంతరం భక్తులు భజనలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం కేఈ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్న వితరణ చేపట్టారు.

### కనులపండువగా అయ్యప్పస్వామి మండల పూజ

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని పేట బసవేశ్వరస్వామి దేవాలయంలో వెలసిన అయ్యప్పస్వామి సన్నిధిలో ఆదివారం మండల పూజోత్సవం కనులపండువగా జరిగింది. గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమ అభిషేకం, పుష్పార్చన, మహామంగళహారతి వంటి పూజలు నిర్వహించారు.

ఊరేగింపులో నృత్యం చేస్తున్న మాలధారులు

### అన్ని రంగాల్లో రాణించాలి

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోనిలోని బీరప్ప దేవాలయంలో కురవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీకమాస వన భోజన మహోత్సవంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. డీఎస్సీ-2025లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వారికి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కురవలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి, కురవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎంపీ బస్తిపాటి నాగరాజు

## పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి

చిప్పగిరి, న్యూస్‌టుడే: చెడు స్నేహాలు, దురలవాట్ల ప్రభావం విద్యార్థులపై పడకుండా తల్లిదండ్రులు, గురువులు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని గ్రంథాలయ అధికారి నబీరసూల్ కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిప్పగిరి గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ.. పుస్తక పఠనం, క్రీడల్లో రాణించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ అధికారి నబీరసూల్, విద్యార్థులు

### గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గ్రంథాలయ ఉద్యమకారుల స్ఫూర్తి ఎనలేనిదని గ్రంథాలయ అధికారిణి తోటమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణ, రంగనాథ్‌ల చిత్రపటాలకు నివాళి అర్పించారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాబోయే ఎన్నికల నాటికి వైకాపాను భూస్థాపితం చేస్తామని భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ పరమహంస అన్నారు. ఆలూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పాత, కొత్త నాయకులు పరిచయ కార్యక్రమం పార్టీ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజల అకాంక్షను నెరవేరుస్తూ ముందుకు వెళ్తుందన్నారు.

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ పరమహంస

సమావేశంలో పాల్గొన్న తెదేపా మండల నాయకులు

## సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

చిప్పగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు పెద్ద పీట వేసిందని తెదేపా నాయకులు వైకుంఠం శ్రీనివాసులు, చికెన్ రామాంజని, రామదుర్గం తిమ్మయ్య, నగరడోణ క్రిష్టప్ప అన్నారు. చిప్పగిరిలో ఆదివారం తెదేపా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ నెల 19న కేడీసీసీ మాజీ ఛైర్మన్ వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశం ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పోతరాజు రాముడు, మీసాల రామాంజనేయులు, భూపాల్, మహేష్, ధనుంజయ, సర్పంచులు పురుషోత్తం, నీలకంఠ, శ్రీనివాసులు, రాఘవేంద్ర, ఓబయ్య, పులికొండ, హరి పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనదారుడికి గాయాలు

జి.ఎర్రగుడి(తుగ్గలి), న్యూస్‌టుడే: జి.ఎర్రగుడి గ్రామ సమీపంలో ఆదివారం వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి రాయిని ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ములకలపెంట గ్రామానికి చెందిన రవి గాయపడినట్లు జొన్నగిరి పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడిని పోలీసులు చికిత్స కోసం సమీపంలో ఉన్న గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## వృత్తి ధర్మాన్ని పాటించాలి

హొళగుంద, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని పాటించాలని సీనియర్ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, అన్ని రంగాల వారిని తయారు చేయడం ఒక ఉపాధ్యాయుడికే సాధ్యమన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కార్తి వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

కార్తిక వనభోజనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

## గిరిజన విద్యార్థినులు.. క్రీడల్లో మెరికలు

☛ వాలీబాల్‌లో సత్తా చాటుతున్న బాలికలు

ఆలూరు, న్యూస్‌టుడే: విద్యాలయానికి సొంత భవనం లేదు. పాఠశాలకు చెందిన కొన్ని గదులను కేటాయించడంతో అక్కడే ఉంటూ చదువులు కొనసాగిస్తున్నారు. చదువుకునేందుకు, ఉండేందుకే స్థలం సరిపోదు. ఆడుకునేందుకు సరైన మైదానం లేదు. అయినా క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు ఆ విద్యార్థినులు. వారే ఆలూరుకు చెందిన గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు.

### వివిధ పోటీల్లో పాల్గొంటూ..

ఆలూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు వాలీబాల్ క్రీడలో సత్తా చాటుతున్నారు. జిల్లా, రాయలసీమ జోన్‌తో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. ఈ నెల 1 నుంచి 3 వరకు తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఐషమ్మ సత్తా చాటింది. ఈ నెల 6న కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని వైష్ణవి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గతేడాది రేణిగుంటలో జరిగిన గురుకులం రాయలసీమ జోన్ క్రీడల్లో విజేతలుగా నిలిచారు.

### ఉన్న కొద్ది స్థలంలోనే సాధన చేస్తూ..

ఆలూరులో 2016లో గిరిజన గురుకుల బాలికల పాఠశాలను మంజూరు చేశారు. అప్పట్లో పాఠశాలకు ప్రత్యేకంగా భవనం లేకపోవడంతో బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన కొన్ని గదులు కేటాయించారు. 3 నుంచి 10వ తరగతి వరకు 301 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాలకు ప్రత్యేకించి మైదానం లేకపోయినా ఉన్న కొద్ది స్థలంలోనే బండలపై వాలీబాల్ సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.

వాలీబాల్ సాధన చేస్తున్న విద్యార్థినులు

### జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం

– ఐషమ్మ, 9వ తరగతి

మాది ఆస్పరి మండలం తంగరడోణ గ్రామం. తల్లిదండ్రులు హరినాథ్, రేణుకమ్మలు వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. 6వ తరగతి నుంచి వాలీబాల్ క్రీడపై ఆసక్తి పెంచుకున్నా. ఇప్పటివరకు 2 సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. అలాగే 2 సార్లు గురుకులం రాయలసీమ జోన్ పోటీల్లోనూ పాల్గొన్నాను. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటడమే నా లక్ష్యం.

### ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

– వైష్ణవి, 8వ తరగతి విద్యార్థిని

మాది ఆలూరు పట్టణం. తల్లిదండ్రులు నాగరాజు, మారెమ్మ. తండ్రి నాగరాజు పెట్రోలు దుకాణంలో పని చేస్తూ నన్ను చదివిస్తున్నారు. ఏడాదిగా వాలీబాల్ సాధన చేస్తున్నా. తాజాగా కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

## క్రీడాకారుడికి సన్మానం

ఆదోని క్రీడలు, పాతపట్టణం న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఖాజాబాయ్ చెన్నైలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని, ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడుగా నిలిచిన పీడీ రామన్నలను ఆదివారం రాత్రి తెదేపా ఆదోని యువనాయకుడు మారుతినాయుడు, పీడీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాందాసు, ఓబన్న, మహేంద్ర, నరసింహరాజు, చెన్న, బసవ, శివ, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్‌చౌదరి, జయరాం, వినయ్ పాల్గొన్నారు. అలాగే స్థానిక రాజాశ్రీ హాల్‌లో రాచోటిసుధాకర్ శెట్టి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘ పెద్దలు దేవిశెట్టి ప్రకాష్, నసిరుద్దీన్ పటేల్ తదితరులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

### రోగులకు వైద్య సేవలు

మద్దికెర, న్యూస్‌టుడే: కురవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మద్దికెరలో భక్త కనకదాసు జయంత్యుత్సవాలను నిర్వహించారు. కర్నూలుకు చెందిన అమీలియో ఆసుపత్రి ఆధ్వర్యంలో కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

### అంతర్జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన డాడ్జ్‌బాల్ క్రీడాకారుడు బి.వెంకట్ అంతర్జాతీయ స్థాయిలో జరిగే డాడ్జ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే పోటీలకు జాతీయ జట్టు సభ్యుడుగా ఎంపికైనట్లు డాడ్జ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కంబిరెడ్డి, కార్యదర్శి సాబీర్‌అహ్మద్ తెలిపారు.

బి.వెంకట్


**మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు కర్నూలు, ఆదోని**
(మైనర్ S.సంధ్య, S.సంజన మరియు S.అజయ్ కుమార్)
**G.O.P: 25/2025**

మధ్య:
సూరీపోగు సౌమ్య -పిటిషనర్
-Vs-
శ్రీమతి సూరీపోగు మూకమ్మ @ పందికోన మూకమ్మ -రెస్పాండెంట్

పబ్లిక్ నోటీసు

కల్లుబావి ఆదోని పట్టణము మరియు మండలం, కర్నూలు జిల్లా కాపురస్తులయిన శ్రీమతి సూరీపోగు సౌమ్య W/o Late సూరీపోగు తాయన్న ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా, నా భర్త Late సూరీపోగు తాయన్న గారికి తన సొంతంగా కొన్న షెడ్యూల్ ఆస్తిని సూరీపోగు తాయన్న మరణానంతరం ఆ షెడ్యూల్ ఆస్తిని ఆయన భార్య మరియు పిల్లలకు వారసత్వ హక్కు కలిగియున్నది. మైనర్ల పోషణార్థం, సంరక్షణ మరియు చదువుల కోసం షెడ్యూల్ ఆస్తిని అమ్మకం చేయుటకు గాను ఆస్తిని అనుమతి మంజూరు కోసం పై పిటిషనర్ దాఖలు చేశారు. కాబట్టి ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉన్నచో, 28-11-2025న ఉదయం 10.30 నిమిషాలకు కోర్టు ముందు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా కాని హాజరు అయి తమ అభ్యంతరాలను తెలుపవలెను. ఒకవేళ ఎవరూ హాజరుకాని ఎడల గౌరవ న్యాయస్థానం పిటిషనర్ల తరఫున తగిన తీర్మానం చేయబడును.

**షెడ్యూలు:** కర్నూలు డి॥ ఆదవాని సబ్ డి॥ ఆదవాని మునిసిపల్ చెందిన కల్లుబావి గ్రామం S.No.365A పూరా యం.5-08 శ.లేక 2.05 హె.యా విస్తీర్ణం గల భూమిలో వేయబడిన ప్లాట్ల పైకి ప్లాటు నెం. 10(పది)వ నెంబరు ప్లాటు పైకి ద॥ దిశ సమోహి సగ భాగం ప్లాటుకు
**చెక్కుబంది: తూర్పు**- గొల్ల నరసప్ప గారి భూమి, **పడమర**- 20 అడుగుల వెడల్పుగల రోడ్డు, **ఉత్తరం**- యిందు పైకి ఈదినం నేను పి.చంద్ర గారికి విక్రయించిన ప్లాటు, **దక్షిణం**- ప్లాటు నెంబరు.11. ఈ మధ్యసగలది.
**ప్లాటు కొలతలు:** తూ॥ప॥ 30 అడుగులు లేక 9.14 మీటర్లు, ఉ॥ద॥ 15 అడుగులు లేక 4.16 మీటర్లు. యీ కొలతలు గలది. దీని మొత్తం జాగా విస్తీర్ణము 50 చ.గ.లు.

Sd/- **B.Veeresh**, M.S.W, B.Ed., LL.B, Advocate,
పిటీషనర్ తరఫున న్యాయవాది
Adoni, Kurnool Dist: 518301. Ph: 95333 30608

# ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

## కార్యకర్తలకు అండగా ఉంటాం

చెక్కు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి, సురేష్‌నాయుడు, వెంకటపతిరాజు, టిప్పు సుల్తాన్

కౌతాళం, న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్తకు తెదేపా అండగా ఉంటుందని మంత్రాలయం సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్‌నాయుడు, కౌతాళం సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు, టీబీపీ ఛైర్మన్ టిప్పు సుల్తాన్ అన్నారు. కౌతాళం మండలం ఎరిగేరి గ్రామంలో తెదేపా సభ్యుడు బీమన్న కుమారుడు పశుల నాగేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పార్టీ నుంచి ప్రమాద బీమా కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును ఆదివారం తెదేపా నాయకులు బాధిత కుటుంబీకులకు అందజేశారు. కౌతాళం పట్టణ అధ్యక్షుడు రాజానంద్, గిరి, బసవరాజు, కుంటనహాల్ మారెప్ప, సతీష్‌నాయుడు, కురువ వీరేష్, కరిబసవనగౌడ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామానికి మంచి పేరు తేవాలి

నూతన పోలీసులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పట్టుదలతో కష్టపడి చదివి పోలీసు ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కష్టాలు తీర్చి, ఊరి ప్రతిష్ఠ పెంచారని విశ్రాంత ఎస్సై అచ్చుగంట్ల షరీఫ్ అన్నారు. ఆదివారం గోనెగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల పోలీసుల బృందం సభ్యుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. గోనెగండ్ల, ఐరన్‌బండ, కులుమాల, ఎర్రబాడు, అల్వాల, బైలుప్పల, తిప్పనూరు గ్రామాల నుంచి నూతన పోలీసు ఉద్యోగాలు సాధించిన 25 మంది యువతీ యువకులను సన్మానించారు. షరీఫ్ మాట్లాడుతూ మెరుగైన సేవలందించి క్రమశిక్షణ కలిగిన పోలీసులుగా గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడాలని ఉపాధ్యాయుడు రామన్, పోలీసులు షేక్షావలి, మాబు,పెద్దయ్య సూచించారు. మహిళా పోలీసుగా ఎంపికైన రంగవేణి తల్లిదండ్రులతో సన్మానం చేయించారు. కార్యక్రమంలో అలీగౌడ్, ఖలీల్, శాంతకుమార్, బక్తర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయండి

నందవరం, న్యూస్‌టుడే: ఆదోనిలో ఈనెల 19, 20 తేదీన జరిగే రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనం జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి గిడ్డయ్య, శాంతప్ప పిలుపునిచ్చారు. ఆదివారం నందవరంలో రైతు సమస్యలపై కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, నరసింహులు, దేవరాజు, బసవరాజు, చెన్నప్పగౌడ్ పాల్గొన్నారు.

## నిజ బృందావన రూపంలో రాఘవేంద్రుడు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం ఇవ్వడంతో, నిజ బృందావన రూపంలో భక్తులకు రాఘవేంద్ర స్వామి దర్శనం ఇచ్చారు. కాషాయ వస్త్రాలు, తులసీ మాలతో బృందావనాన్ని అలంకరించి హారతి ఇచ్చారు.

## వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,620

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,620 మధ్యస్థ ధర రూ.5,170 కనిష్ఠ ధర రూ.3,316లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,805 మధ్యస్థ ధర రూ.5,787 కనిష్ఠ ధర రూ.5,059 పలికింది.

# తగ్గనున్న రద్దీ.. తప్పనున్న తిప్పలు

■ వంద అడుగులకు రోడ్డు విస్తరణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: చేనేతపురి రహదారుల్లో వాహనాలు నిత్యం కిక్కిరిసి తిరుగుతుంటాయి. మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీతో ట్రాఫిక్ చిక్కులు నెలకొంటున్నాయి. ఈ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు కూటమి సర్కార్ అడుగుల వేసింది. మాస్టర్ ప్లాన్ రోడ్డు అమలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో వేలాది మంది ప్రజలు, వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నిర్మించే రోడ్డు, తొలగనున్న అవస్థలపై ప్రత్యేక కథనం.

### మాస్టర్ ప్లాన్ రోడ్డుకు శ్రీకారం

ఎమ్మిగనూరు పట్టణంలో పెరిగిన జనాభా, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం వంద అడుగుల రోడ్డుకు శ్రీకారం చుట్టింది. దీనిపై ముసాయిదా విడుదల చేసింది. పట్టణంలో గూడూరు బైపాస్ రోడ్డు నుంచి నేరుగా మంత్రాలయం రోడ్డుకు కలిపేందుకు టిడ్కో ఇళ్లు, పారం పైన ఉన్న పొలాల మీదుగా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. పట్టణంలో సర్వే నంబర్లు 17,18,20,22,23,24,25,26,28,30, 34,35,41,42,43,50,51,76,77,351,357,358 పొలాల మీదుగా రోడ్డు వెడల్పు చేసేందుకు డెవలప్‌మెంట్ ప్లాన్ అలైన్‌మెంట్ తయారు చేసి ముసాయిదా ప్రకటించారు. 2006 అర్బన్ డెవలప్‌మెంట్ చట్టం ప్రకారం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. రహదారి

రహదారిలో వాహనాల రద్దీ

పొడవు 3.5 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డుకు దాదాపు 20 ఎకరాలకు పైగానే భూములు కోల్పోతున్నారు. భూ సర్వేలు చేపట్టి ప్రభుత్వం నిబంధనల మేరకు పరిహారం కోసం సిద్ధం చేసే ప్రక్రియ నిర్వహిస్తారు.

### రోజూ ట్రాఫిక్ చిక్కులు

ఎమ్మిగనూరు పట్టణానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాదాపు 600కు పైగానే బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. వీటితో పాటు ప్రైవేటు వాహనాలు దాదాపు 3వేల నుంచి 4వేలు తిరుగుతున్నాయి. ఇందులో భారీ వాహనాలు ఉంటున్నాయి. కర్నూలు-రాయచూరు, బళ్లారికి వెళ్లే వాహనాలు పట్టణం మీదుగా రాకపోకలు సాగుతున్నాయి. పట్టణంలో మూడు కిలోమీటర్లు రద్దీగా ఉండే రహదారిపై ప్రయాణం సాగుతున్నాయి. కర్నూలు నుంచి వాహనాలు ప్రతి రోజూ పట్టణంలో ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. వీటి సమస్య తీర్చేందుకు కూటమి ప్రభుత్వం జాతీయ రహదారి 167ను మంత్రాలయం రోడ్డుకు అనుసంధానం చేసేందుకు మాస్టర్ ప్లాన్ రోడ్డును సిద్ధం చేసింది.

### ప్రతిపాదనలు సిద్ధం చేశాం

– గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

మాస్టర్ ప్లాన్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇందుకు సంబంధించిన సర్వేలు పూర్తి చేశాం. మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే సగం వాహనాల రద్దీ పూర్తిగా తగ్గుతుంది. ఈ రహదారిని జాతీయ రహదారి 167కి కలపడంతో రహదారిలో వాహనదారుల రద్దీ తగ్గనుంది.

పట్టణ జనాభా: 1.30 లక్షలు
రోజు పట్టణంలో రాకపోకలు: 25 వేల మంది
భారీ వాహనాలు: 3 వేల నుంచి 4 వేలు
కొత్త రోడ్డుకు ప్రతిపాదనలు: 3.5 కిలోమీటర్లు

## సమస్యలు పట్టించుకోని సర్కారు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధిక వర్షాలతో పంటలన్నీ నష్టపోయారని, కూటమి సర్కార్ పట్టించుకోవడం లేదని రైతు సంఘం జిల్లా నాయకులు పంపన్నగౌడ్ ఆరోపించారు. ఎమ్మిగనూరు పట్టణంలో రైతుల సమావేశాన్ని నిర్వహించి కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో కురిసిన వర్షాలతో పత్తి, ఉల్లి, మిరప, ఆముదం, వేరుసెనగ, మొక్కజొన్న, ఇతర పంటలు పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. అధిక వర్షాలతో రైతులకు పెట్టిన పెట్టుబడులు రాలేదన్నారు. రైతు సమస్యలపై ఈనెల 18,19వ తేదీల్లో ఆదోనిలో చేపట్టే మహాసమ్మేళనానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజీవ్, వెంకటేశు, బీజీ విరూపాక్షినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గోమాత ఆరాధన మహోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోనెగండ్ల,న్యూస్‌టుడే:మండలంలోనికైరవాడి గ్రామంలో శ్రీదుర్గా భవాని దేవత గోమాత ఆరాధన మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో రథోత్సవం సందర్భంగా వేద పండితులు హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ పరిసరాల్లో రథోత్సవం ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.

## కమనీయం లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం

స్వామికి వెండి అలంకరణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటేకల్లు శ్రీకనుమదొడ్డి లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామికి పీఠాధిపతి హేమలతమ్మ ఆధ్వర్యంలో నరసింహామూర్తి స్వామికి బిందెసేవ, రాత్రి పల్లకోత్సవం నిర్వహించారు. ప్రత్యేక వెండి ఆభరణాలతో అలంకరణ చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవంలో ప్రజలు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794 కోసిగి 9550434095

నందవరం, న్యూస్‌టుడే: ?: మండలంలోని బీరప్ప దేవాలయం బయట తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతోంది. పైపులైన్ మరమ్మతులు చేయండి. **-కురువ మల్లయ్య, కాలనీవాసులు**

✔: విషయం సంబంధిత అధికారులకు తెలియజేసి, పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. **-పుల్లయ్య, ఎంపీడీవో, నందవరం**

?: నందవరం ప్రధాన రహదారి పక్కన కాల్వలు లేక రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. **- ఓంకార్, నందవరం గ్రామస్థుడు**

✔: మండలంలో అభివృద్ధికి నిధులు మంజూరు కాగానే రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలను ఏర్పాటు చేస్తాం. **- పుల్లయ్య, ఎంపీడీవో, నందవరం**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-నర్సన్న, చిన్నకడబూరు.**

✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. **- ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: ఎమ్మిగనూరు పట్టణంలో అబ్దుల్లా కాలనీలో శునకాల బెడద అధికంగా ఉంది. కుక్కలు పట్టేందుకు చర్యలు తీసుకోండి **- బాషా, కాలనీవాసి**

✔: శునకాల బెడద అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. **-గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

?: పట్టణంలో ఎస్సీ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-ప్రసాద్, కాలనీవాసి**

✔: సిబ్బంది పంపించి శుభ్రం చేయిస్తాం. **- శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

?: ఎస్ఎంటీ కాలనీలో శివారు ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు వేసి వీధి దీపాలు అమర్చలేదు. **- నరసింహులు, కాలనీవాసి**

✔: కొత్త వీధి దీపాలు వేయిస్తాం. **- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సంజీవయ్య నగర్ కాలనీలో తాగునీరు సరఫరా సక్రమంగా రావడం లేదు. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేపట్టాలి. **-రవి, స్థానికుడు**

✔: కాలనీలకు తాగునీరు అందేలా చర్యలు చేపడతాం. **-కృపాకర్, ఏఈ.**

?: పట్టణంలోని కుమ్మరి వీధిలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో దోమల బెడద పెరిగిపోతుంది. **-రాము, స్థానికుడు**

✔: పారిశుద్ధ్య కార్మికులతో మురుగు తీయించే చర్యలు చేపడతాం. **-రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

## ఎండిన చెట్టు.. ఎప్పుడు కూలుతుందో

మండల కేంద్రం గూడూరు నుంచి పులకుర్తి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిలో ఓ భారీ వృక్షం పూర్తిగా ఆకులు రాలి ఎండిపోయి రోడ్డుపై వాలి ప్రమాదకరంగా ఉంది. ఈ దారిలో నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎండిన చెట్టు ఎప్పుడు వాహనాలపై పడుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

## పైపులైన్ లీకేజీ.. నీరు వృథా

మండల పరిధిలోని మిట్టాసోమాపురం గ్రామంలో సర్పంచి, అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతోంది. గ్రామంలోని తెలుగువీధిలో వృథా నీరంతా రహదారిపై ప్రవహిస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. పైపులైన్ లీకేజీలను సరి చేయించాల్సిన పాలకులు, పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, సర్పంచి స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నందవరం

## విరిగిన కడ్డీలకు.. బండరాళ్లు అడ్డు

ప్రధాన సమస్యలు తెలిపేందుకు వెళ్లే ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఎమ్మిగనూరు పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీవో, అంగన్‌వాడీ, ఉప ఖజానా కార్యాలయాలకు వెళ్లే దారికి కడ్డీలతో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. వాహనాలు వేగంగా వెళ్లకుండా కడ్డీల శబ్దాలతో నెమ్మదిస్తారు. ఈ కడ్డీలు రెండు విరిగిపోయి పైకి లేచాయి. వాహనదారులకు ప్రమాదం పొంచి ఉండటంతో విరిగిన కడ్డీల చోట బండరాళ్లు పెట్టారు. వీటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు.

–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

## పగుళ్ల దారి.. ఇబ్బందిగా మారి

మండలంలోని గాజులదిన్నె స్టేజీ-ఈదుల దేవరబండ గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పగుళ్లు ఏర్పడి ధ్వంసమైంది. ఈ రోడ్డు దేవనకొండ, గోనెగండ్ల మండలాల్లోని పది గ్రామాల ప్రజలకు ప్రధానమైంది. ఇది సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈచప్టా కొన్నేళ్లుగా పగుళ్లు వచ్చి సిమెంట్ కొట్టుకుపోయింది. ఏటా కురుస్తున్న వర్షాలకు చప్టా కుంగిపోతోంది. దీనికి తోడు రహదారిపై అధిక లోడుతో కంకర లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

## పుస్తకాలు చదివితే మరింత విజ్ఞానం

మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు శారద

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు చదవాలని ఉపాధ్యాయులు నీలకంఠ, శారద అన్నారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు గ్రంథాలయ ఉద్యమాలను గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ లైబ్రేరియన్ హరికృష్ణ, రాజేశ్వరి, సరస్వతి, హైమావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

నందవరం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న గ్రామ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్వేయర్ల సంఘం సభ్యులు సోనియా సుల్తానా, కురువ ఉరుకుంద తెలిపారు. ఆదివారం సంఘం సభ్యులుగా ఎన్నికైన సోనియా సుల్తానా, కురువ ఉరుకుందులను సన్మానించారు. వారు మాట్లాడుతూ భూముల సర్వేకు అవసరమైన ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, స్టేషనరీ ప్రభుత్వం సమకూర్చడం లేదన్నారు. టైం స్కేల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్బర్‌బాషా, ముగతి శేఖర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు

తనిఖీలు చేస్తున్న ఎస్సై హనుమంతరెడ్డి, సిబ్బంది

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా యజమానులపై కేసులు నమోదు చేస్తామని వాహన చోదకులను ఎస్సై హనుమంతరెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ ప్రధాన రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణిస్తున్న వాహనాలకు జరిమానా విధించారు. ఎస్సై హనుమంతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఎస్సై వీ.మణికంఠ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని కర్నూలు ప్రధాన రహదారిలో పోలీసు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు.

## రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలని సి.బెళగల్ ఠాణా ఎస్సై వేణుగోపాల్‌రాజ్ అన్నారు. పోలకల్, సి.బెళగల్ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఘర్షణల్లో జోక్యం చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచనలు ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

కౌతాళం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్న స్వామి ఆలయ అభివృద్ధికి బళ్లారికి చెందిన హెచ్.జి.నరసింహయ్యశెట్టి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ముస్లిం, మైనారిటీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇమామ్, మౌజమ్‌లకు నిధులు విడుదల చేసి హామీని నిలబెట్టుకున్నారని జామియా మసీదు అధ్యక్షులు షాబీర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటానికి ఆదివారం మైనార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా మైనార్టీ తాలూకా అధ్యక్షులు ఉసేన్ పీరా, నాయకులు కల్లీ ముల్లా, తురేగల్ నజీర్ అహ్మద్, బందేనవాజ్, ఫరూక్, దాదా సాహెబ్, సలీం, అబ్దుల్లా, రఫీక్, కౌన్సిలర్లు వహిద్, అమానుల్లా, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

## గార్లదిన్నెలో రూ.10లక్షలతో బోరు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గార్లదిన్నెలో తాగునీటి పరిష్కారానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కృషితో రూ.10లక్షలతో తాగునీటి బోరు, పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం బోరు వేయగా నీరు ప్రవహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్‌కుమార్ చెప్పారు. ప్రస్తుతం గ్రామానికి అల్వాల నీటి పథకం ద్వారా నీరు సక్రమంగా అందక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. దాదాపు 2కి.మీ దూరం పైపులైన్ ఏర్పాటు, బోరు వేయడంతో తాగునీటి సమస్య తీరనుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు.

## ప్రజాసేవ చేసేందుకు ముందుకు రావాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ల్యాబ్ టెక్నీషియన్లు ప్రజాసేవ చేసేందుకు ముందుకు రావాలని, ఐక్యతను చాటాలని ఎమ్మిగనూరు తాలూకా ల్యాబ్ టెక్నీషియన్స్ అధ్యక్షుడు బీరప్ప పిలుపునిచ్చారు. సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించారు. బీరప్ప మాట్లాడుతూ పేదలకు, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి అత్యవసర వైద్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సూర్యల్ బాబు, కార్యదర్శి హరిబాబు, నాగరాజు, హరిరేఖ, సత్యన్న, వీరకుమార్, రాజారమేష్, భానుప్రకాష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వనమహోత్సవం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని సామాజిక అటవీ శాఖ విభాగం వనంలో కార్తిక మాసం సందర్భంగా అర్చకుడు రేవయ్యస్వామి ఆధ్వర్యంలో సామూహిక వన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. అర్చకుడు సత్యనారాయణ వ్రతం, కలశపూజ చేయించారు. అనంతరం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి భక్తులు భారీగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మునిస్వామి, విశ్వనాథరెడ్డి, ప్రకాష్, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చే ఆర్డీఎస్ కుడి కాల్వ, వేదవతి పెండింగ్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని ప్రజా ఐక్యవేదిక సంఘాల నాయకులు నాగన్న, గణేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమప్ప కూడలిలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయాలన్నారు. ఎల్లెల్సీ ఆయకట్టు స్థిరీకరణ చేయాలన్నారు. నాయకులు బతకన్న, నరసన్న, సత్యన్న, నాగరాజు, స్వామిదాసు, బాలరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

## 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఎమ్మిగనూరు ఆర్కే కంటి వైద్యశాల యాజమాన్యం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి సమస్యలతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు సుమారు 150 మంది హాజరైనట్లు వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ తెలిపారు. అందరికీ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరమైనట్లు గుర్తించామని వెల్లడించారు. వీరికి తమ ఆస్పత్రిలో సూచించిన తేదీల్లో ఎన్టీఆర్ ఆరోగ్య సేవ కింద ఉచిత ఆపరేషన్లు చేస్తామన్నారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సి.బెళగల్, న్యూస్‌టుడే:ముడుమాల గ్రామంలో తుంగభద్ర నదీ తీరాన మృతదేహం లభ్యమైంది. ఎస్సై వేణుగోపాల్‌రాజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో అనుమానిత కేసుగా నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కర్నూలు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణుడు బ్రహ్మాజీ సంఘటన స్థలంలో శవపరీక్ష నిర్వహించారు. మృతుడి ఎడమ భుజంపై ఎస్‌యూ అక్షరాలు ఉన్నాయి. మృతుడి సమాచారం తెలిస్తే సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణానికి సమీపంలో బొలేరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. మూడు పశువులు మృత్యువాత పడ్డాయి. ఆదివారం ఎమ్మిగనూరు సంతలో పశువులను కొనుగోలు చేసి బనగానపల్లెకు తీసుకెళ్తున్నారు. కోడుమూరు వద్ద బొలేరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. బొలేరో డ్రైవర్‌తో పాటు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న లింగమూర్తి కాలికి తీవ్రగాయమైంది.

# గోదాములు లేక.. గోస తీరక

■ 31 నిర్మాణాలు అసంపూర్తి

ఎమ్మిగనూరు వ్యవసాయం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చిన్న సన్నకారు రైతులు దిగుబడులు ఇంట్లో నిల్వ చేసుకోలేక అవస్థలు పడ్డారు. పంట దిగుబడులు, ఉద్యాన ఉత్పత్తులను నిల్వ ఉంచుకొనేందుకు, ఆరబెట్టడానికి బహుళ ప్రయోజన గ్రామీణ గోదాములు అవసరం ఉంది. వీటి నిర్మాణాలు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. ఇప్పటికే కొన్ని గోదాముల నిర్మాణాలు పూర్తవగా.. మరికొన్ని అసంపూర్తిగా మిగిలాయి.

### స్థలం చూపక రద్దు

జిల్లాలో 102 బహుళ ప్రయోజన గ్రామీణ గోదాములు మంజూరయ్యాయి. స్థలం చూపక కొన్ని రద్దయ్యాయి. ప్రస్తుతం 72గోదాములకు గాను 41గోదాముల నిర్మాణం పూర్తయ్యాయి. మిగిలిన 31గోదాముల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని నాబార్డు కింద సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ నిర్మాణాలు చేపట్టింది. జిల్లాలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు 59, వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 13గోదాముల నిర్మాణం చేపట్టారు. 500మెట్రిక్ టన్నుల గోదాములను రూ.43లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాములను రూ.83లక్షలతో చేపట్టారు.

### రైతులకు ఎంతో ఉపయోగం

గోదాముల నిర్మాణం 2022 సంవత్సరం ఆఖరిలో చేపట్టారు. ఏడాదిలో పూర్తి చేయాల్సి

గోనెగండ్లలో నిలిచిన గోదాము నిర్మాణం

ఉండగా నేటికి ఇంకా 31గోదాములు అసంపూర్తిగా ఉన్నాయి. గోదాములను అర, ఎకరం విస్తీర్ణంలో నిర్మించాల్సి ఉంది. గ్రామాల్లో చాలా చోట్ల స్థలం లభించక తక్కువ స్థలంలో నిర్మించారు. స్థలాలు చూపక 30 గోదాములు రద్దయ్యాయి. బిల్లులు సకాలంలో రాక నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. మిగిలిన గోదాములను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### ధాన్యం నిల్వ చేసుకోవడానికి

నవంబరు రెండో వారం నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం నిల్వ పెట్టుకొని రైతుల నుంచి సహకార సంఘం నామమాత్రపు రుసుం వసూలు చేస్తుంది. జిల్లాలో ముగతి, నాగలదిన్నె, సుంకేశ్వరి, కల్లుదేవకుంట, ఢణాపురం, విరుపాపురం, ఆరేకల్, చిన్నపెండేకల్, గణేకల్ తదితర చోట్ల పూర్తయ్యాయి. గోనెగండ్ల, అల్వాల తదితర చోట్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఎమ్మిగనూరు మండలంలో ఉద్యాన, వాణిజ్య వంటి పంటలు సాగు ఎక్కువగా చేస్తారు. కానీ ఒక్క గోదాము చేపట్టకపోవడం గమనార్హం.

### జనవరికి పూర్తి చేస్తాం

-రఘురామిరెడ్డి, డీఈఈ, మార్కెటింగ్ శాఖ

జిల్లాలో 31 గోదాముల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే 41గోదాములు పూర్తి చేశాం. అసంపూర్తిగా ఉన్న గోదాములను జనవరి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

## సంక్షిప్త సమాచారం

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేసి పార్టీ జెండా ఎగరవేయాలని ఇటీవల ఎన్నికైన తెదేపా మండల అధ్యక్షులు జె.సురేష్ అన్నారు. ఆయనను రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరాముడు, ఎంపీటీసీ మద్దిలేటి ఆదివారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: యాదవులు కార్తిక వన భోజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు న్యాయవాది సోమశంకర్‌యాదవ్ తెలిపారు. ప్యాలకుర్తి సాయిబాబా ఆలయం ఆవరణలో సోమవారం కార్యక్రమం ఉంటుందన్నారు.

నందవరం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి శివరామప్రసాద్ పేర్కొన్నారు.

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: మండలంలోని శ్రీ సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.ఎన్. రాధాకృష్ణ తెలిపారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సోమవారం రోజున ఎమ్మిగనూరులో మహాదీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: గ్రంథాలయ ఉద్యమకారుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథాలయ అధికారి కవితబాయి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గూడూరు శాఖ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి విద్యార్థులకు వారి జీవిత విశేషాలను తెలియజేశారు.

(c) eenadu

కర్నూలు
• కర్నూలు • పాణ్యం

## బుగ్గరామేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కాల్వబుగ్గలో ఉన్న బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో కార్తిక ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోనేర్లలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయం ముందు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణ, ఈవో మద్దిలేటి భక్తులు పాల్గొన్నారు.

← కాల్వబుగ్గలో స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

## పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని కవి వెంకటకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం 'వ్యక్తిత్వాన్ని మలిచే జీవన సరళి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్, న్యాయవాది జయరాజ్, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణ : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ: ?: వీకర్‌సెక్షన్ కాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేయడంలేదు. చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. - **ప్రసాద్**

?: బిర్లాగేటు సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. మరమ్మతులు చేయాలి. - **మోహన్**

✔: కాలువల్లో పూడిక తొలగిస్తాం. రోడ్డుకు మరమ్మతులు చేస్తాం. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. - **నగరపాలక అధికారులు**

## విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

పోటీలకు హాజరైన విద్యార్థినులు

విజేతలతో అధ్యాపకులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే అన్ని రంగాల్లో రాణిస్తారని ప్రిన్సిపల్ రంగయ్య పేర్కొన్నారు. నగర పరిధిలోని మాస్టర్స్ జూనియర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు 'కృత్రిమ మేధ' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఆర్.అఖిల, కె.నందిని, బి.వైష్ణవిరామ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రిన్సిపల్, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

## నీళ్లు నములుతున్న పథకాలు

★ రూ.4.07 కోట్లు ఖర్చవుతున్నా గ్రామీణులకు తీరని దాహార్తి

★ గాడి తప్పిన సీపీడబ్ల్యూఎస్‌ల నిర్వహణ

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : గ్రామీణులకు రక్షిత జలాలు సరఫరా చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సమగ్ర రక్షిత నీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణ గాడి తప్పింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వీటిని గుత్తేదారులకు అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. వారికి ఏటా రూ. కోట్లలో బిల్లులు చెల్లిస్తున్నారు. వారు పథకాలను ఎలా నిర్వహిస్తున్నారని పర్యవేక్షించడం లేదు. దీంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పథకాలను మొక్కుబడిగా నిర్వహిస్తూ నిధులు స్వాహా చేస్తున్నారు. ఫలితంగా నిధులు ఖర్చవుతున్నా. పల్లె ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

ఇది గార్గేయపురం సీపీడబ్ల్యూఎస్ పథకం. దీని ద్వారా 16 గ్రామాల్లో 52,990 మందికి మంచినీళ్లు ఇవ్వాల్సి ఉంది. కేసీ కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసి ఎస్ఎస్ ట్యాంకులో నిల్వ చేసి పల్లెలకు సరఫరా చేయాల్సి ఉంది. ఇందుకోసం ఏటా రూ. 1.62 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 12 గ్రామాలకు మాత్రమే అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

### 67 గ్రామాలు.. 1.97 లక్షల మంది

కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోని కర్నూలు గ్రామీణ, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో సుంకేసుల, గార్గేయపురం, పంచలింగాల, ఓర్వకల్లు సీపీడబ్ల్యూఎస్ పథకాలున్నాయి. వీటి నిర్వహణకు ఏటా రూ.4.07 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఈ పథకాల ద్వారా 67 గ్రామాల పరిధిలోని 1.97 లక్షలమంది ప్రజలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ చాలా గ్రామాలకు నీరు అందడం లేదు. గుత్తేదారులు మాత్రం అన్ని గ్రామాలకు సరఫరా చేసినట్లుగా దస్త్రాల్లో రాస్తున్నారు. వాటిపై ఇంజినీర్లు సంతకాలు చేసి బిల్లులు చెల్లిస్తున్నారు.

### అన్నిచోట్లా అరకొర సరఫరానే..

● సుంకేసుల పథకం కింద 34 గ్రామాల్లోని లక్షమందికి పైగా జనాభాకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది. సుంకేసుల జలాశయం నుంచి నీటిని పంపింగ్ చేస్తారు. దీని నిర్వహణకు ఏడాదికి రూ.1.65 కోట్లు వ్యయం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 22 గ్రామాలకు కూడా నీరు సక్రమంగా అందడం లేదని గ్రామీణులు చెబుతున్నారు.

● ఓర్వకల్లు సీపీడబ్ల్యూఎస్ పథకం కింద 13 గ్రామాల్లోని 18,900 మందికి, పంచలింగాల పథకం ద్వారా 5 గ్రామాల్లోని 15,200 మందికి నీళ్లు ఇవ్వాల్సి ఉంది. ఇక్కడ కూడా లక్ష్యం మేరకు సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది.

## నేటి నుంచి పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించనున్నట్లు వెల్లడించారు. 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సేవలను ఉచితంగా పొందవచ్చని వివరించారు.

## 19న వాల్మీకుల వనభోజనోత్సవం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగర శివారు నందికొట్కూరు రోడ్డులోని రేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఈనెల 19వ తేదీన వాల్మీకి బోయ కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం పెద్దలు సత్రం రామకృష్ణుడు, మద్దిలేటి, తలారి కృష్ణమనాయుడు, శ్రీనివాసులు, బాలసంజన్న, మండ్లశేఖర్ తదితరులు తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం వారు కార్తిక వన మహోత్సవ కార్యక్రమం గోడపత్రాలు, కరపత్రాలను ఆవిష్కరించారు.

## పనులు ఆపేసి.. ప్రమాదాలకు బాటేసి

ఇది నంద్యాల చెక్‌పోస్ట్ నుంచి ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి మీదుగా అరుంధతి నగర్, అంబేడ్కర్ నగర్, వాసవీనగర్ కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి. ఈ రోడ్డు నిర్మాణం వంద మీటర్ల మేర అసంపూర్తిగా ఆగిపోయింది. దీంతో దారంతా గుంతలమయం అయ్యింది. ఈ దారిలో ప్రయాణించేందుకు ఆయా కాలనీల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారి నిర్మాణం పూర్తి చేయాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

## స్వచ్ఛత జాడలేని.. వ్యవసాయ విపణి

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి షెడ్ల దగ్గర చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, కూరగాయల వ్యర్థాలు దిబ్బలా పేరుకుపోయాయి. ఆవులు, పందులు అక్కడ చేరి చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో బయటకు తరలించకపోవడంతో వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. మార్కెట్‌యార్డు

మొత్తం తీవ్ర అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టి స్వచ్ఛ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

## మూత వేయకుంటే ముప్పే

నగరంలోని సి.క్యాంపు నుంచి మద్దూర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో పార్కు సమీపంలో మూతలేని ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ఇది సి.క్యాంపు ప్రభుత్వ గృహాల్లోని పార్కు, మద్దూర్‌నగర్‌కు రహదారి మధ్యలో ఉంది. ఈ దారి మార్కెట్‌కు, ఆసుపత్రులకు వెళ్లే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు వాహనదారులు దీన్ని గుర్తించలేక ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

## అడ్డు తొలగక.. మురుగు కదలక

సి.క్యాంపు కూడలికి వచ్చే దారిలో సుద్దవాగు సమీపంలో రహదారిని ఆనుకుని మురుగు కాలువ ఉంది. ఇందులో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలువలో పెద్ద సిమెంటు గొట్టం పడిపోయింది. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. మురుగు నిల్వచేరి దుర్వాసన వ్యాపిస్తోంది. అధికారులు స్పందించి సిమెంటు పైపును తొలగించి కాలువను శుభ్రం చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలకసంస్థ

## అలరించిన 'గజ్జె కట్టిన పల్లెపాట'

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గజ్జె కట్టిన పల్లె పాట పేరుతో జానపద సంగీత విభావరి నిర్వహించారు. అనంతపురానికి చెందిన పరిమళరాజు బృందం గాయకులు, కళాకారులు పలు జానపద గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ అలరించారు. ఉస్మాన్‌బాషా మిమిక్రీ, ఎమ్మిగనూరుకు చెందిన ఖాజావలి బృందం జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శేషాద్రిరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న పత్తి ఓబులయ్య, తదితరులు

## హంతకులను కఠినంగా శిక్షించాలి

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : తితిదే మాజీ ఏవీఎస్వో, గుంతకల్లు జీఆర్‌పీ సీఐ సతీష్‌కుమార్‌ను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు సోమేష్, ఉపాధ్యక్షుడు తిరుపతయ్య డిమాండ్ చేశారు. స్థానిక వినాయక ఘాట్ వద్ద ఉన్న సంఘం కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. విధి నిర్వహణలో సతీష్‌కుమార్ నిక్కచ్చిగా వ్యవహరించేవారని, పరకామణి కేసులో ప్రధాన సాక్షిగా ఉండి విచారణకు వెళ్తూ హత్యకు గురయ్యారని చెప్పారు. ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు మధు, నాయకులు లింగన్న, చిట్టిబాబు, బజారప్ప, గుడంపాడు శీను, గిడ్డయ్య, నాగన్న పాల్గొన్నారు.

## మొక్కజొన్నకు మద్దతు ధర కల్పించాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. నన్నూరులో ఆదివారం ఆయన మొక్కజొన్న దిగుబడులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న దిగుబడులు తగ్గిపోయాయని తెలిపారు. అరకొర దిగుబడులను కూడా దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.2500 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు.

## బెదరగొడుతున్న కూరగాయలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై ప్రభావం పడుతోంది. పలు రకాలు కిలో రూ.50 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడం.. మరోవైపు కార్తిక మాసం కావడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ5- 6 వేల హెక్టార్లకు మించి కూరగాయల పంటలు సాగు చేయడం లేదు. ఈ పంటలు కూడా తెగుళ్ల బారినపడి, వర్షాలకు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోయాయి. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు బెంగళూరు, మహారాష్ట్ర రాష్ట్ర నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

దీంతో డిమాండ్ పెరిగి ధరలు ఎగబాకాయని వ్యాపారులు చెబుతున్నారు. రూ.500 లేనిదే ఐదారు రకాల కూరగాయలను ఇంటికి తెచ్చుకోలేని పరిస్థితని ప్రజలు చెబుతున్నారు.

### కొనాలంటే కష్టమే..

రైతుబజార్‌లో ఆదివారం కిలో టమాట రూ.34, వంకాయలు రూ.46- 56, పచ్చిమిరప రూ.50, గోరుచిక్కుడు రూ.70, బీన్స్ రూ.50, చిక్కుడు రూ.50, బంగాళదుంపలు రూ.36, బెండ రూ.50, బీర రూ.36-40, కాలీఫ్లవర్ రూ.50, క్యారెట్ రూ.50, బీన్స్ రూ.50, అల్లం రూ.100, లావు మిర్చి రూ.60, క్యాబేజీ రూ.24, ఉల్లిగడ్డలు రూ.10-16 ధర పలికాయి. బయట వ్యాపారులు కిలోపై రూ.5- 10 అధిక ధరకు విక్రయిస్తున్నారు. టమాటను మాత్రం కిలో రూ.40- 50 వరకు అమ్ముతున్నారు. ఉల్లిగడ్డలు కిలో రూ.20-30 ధర పలుకుతున్నాయి.

● ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి రూ.500 ఖర్చుచేసినా వారం రోజులకు సరిపడా సరకులు రావడం లేదని కల్లూరుకు చెందిన వినియోగదారుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వీధుల్లో చిరు వ్యాపారులు, కిరాణా దుకాణదారులు అన్ని రకాలనూ కిలో రూ.50- 70 పైనే విక్రయిస్తున్నారని గణేశ్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి వాపోయారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో ఇన్‌ఛార్జి కార్యదర్శి పెద్దక్క ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రంథాలయాల స్థాపన కోసం ఎంతోమంది మహనీయులు పోరాటం చేశారని తెలిపారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈ ప్రేమకుమారి, సైనిక సంక్షేమాధికారిణి రత్నరూత్, సహాయ గ్రంథాలయ అధికారి గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల అడుగు జాడల్లో నడవాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు మహనీయుల అడుగు జాడల్లో నడిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఓర్వకల్లు, నన్నూరు గ్రంథాలయాల అధికారులు హనుమేనాయక్, కౌసల్య పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం గ్రంథాలయాల స్థాపన కోసం పోరాడిన రంగనాథన్, పొత్తూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, తదితరులకు నివాళి అర్పించారు. వారి సేవలను కొనియాడారు.

ఉద్యమకారులకు నివాళి అర్పిస్తున్న అధికారులు

## ఉద్యమాలతోనే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉద్యమాలతోనే రాయలసీమకు చెందిన రైతులు, యువత, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇ.వెంకటేష్ పేర్కొన్నారు. నగరంలోని డా.బ్రహ్మారెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటేష్

జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జవివే రాష్ట్ర కమిటీ సభ్యుడు రత్నం ఏసేపు అధ్యక్షతన రాయలసీమ హక్కుల ఉల్లంఘనపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు శతాబ్దాలుగా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పాలకులు కోస్తాంధ్రపైనే శ్రద్ధ పెడుతూ రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సీమ ప్రజలు, రైతులు, ప్రజాసంఘాలు ఉద్యమిస్తేనే ఇక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఆర్థిక నిపుణుడు మన్సూర్‌రహిమాన్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు శేషాద్రిరెడ్డి, సురేష్, సుంకన్న, యోహాన్, రామకృష్ణారెడ్డి, నగేష్, రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : రాయలసీమ ప్రాంత ప్రయోజనాలను కాపాడే శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని బీసీ సంక్షేమ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాయలసీమ జిల్లాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. సీమ సమస్యలను

నినాదాలు చేస్తున్న నాయకులు

పట్టించుకునే నాయకుడే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, రాయలసీమ రాష్ట్ర సమితి మైనారిటీ నాయకుడు ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడుల వేదికగా ఆంధ్రప్రదేశ్

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు వేదికగా మారిందని నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు, తితిదే బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని హుసేనాపురంలో ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ద్వారా రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ చొరవ తీసుకున్నట్లు తెలిపారు.

## మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఆదోనిలోని విక్టోరియావీధికి చెందిన కురువ రవికుమార్ (39) కనిపించకుండాపోయారు. ఇతనికి మానసిక స్థితి సరిగా లేదు. అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు సర్వజన ఆసుపత్రిలో చేరిన తండ్రిని చూసేందుకు వచ్చారు. ఆసుపత్రి నుంచి అక్టోబరు 22వ తేదీ నుంచి కనిపించకుండాపోయారు. అతని స్నేహితుడు మహాలింగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు మూడో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు.

## వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,620

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.6,620 మధ్యస్థ ధర రూ.5,170 కనిష్ఠ ధర రూ.3,316లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,805 మధ్యస్థ ధర రూ.5,787 కనిష్ఠ ధర రూ.5,059 పలికింది.

## సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలక సంస్థ: ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి త్వరగా పరిష్కరిస్తామన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ : ఆదోనిలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించే పత్తి రైతుల రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం పిలుపునిచ్చారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు.

కర్నూలు నగరపాలక సంస్థ: నగర సుందరీకరణను మసకబార్చే పనులు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నగరంలోని కూడళ్లు, విభాగినులు, ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు అతికించడం, బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టడం, గోడలపై రాతలు రాయడం వంటివి చేయరాదన్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ : స్థానిక గుత్తి రోడ్డులోని వెంకన్నబావి ప్రాంగణంలో ఈనెల 18న నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. నాయీ బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

## తైక్వాండోలో అమ్మాయిల తడాఖా

☛ జాతీయస్థాయిలో రాణిస్తున్న విద్యార్థినులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఆత్మరక్షణ కోసం తైక్వాండో క్రీడ నేర్చుకున్న అమ్మాయిలు.. పోటీల్లో సత్తా చాటుతూ విజయ పథంలో దూసుకెళ్తున్నారు. కర్నూలు నగరానికి చెందిన లేఖ్య సిరి చందన, సుగంధిని ప్రత్యేకంగా శిక్షణ పొందుతూ పట్టుదలతో సాధన చేస్తూ.. ఆటలో నైపుణ్యాలు మెరుగుపరుచుకున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలుస్తూ.. పతకాలు, ప్రశంసలు అందుకుంటున్నారు.

### పోటీల్లో మెరిసిన.. చందన

నగరంలోని సప్తగిరినగర్‌కు చెందిన రూప, వినోద్‌కుమార్ దంపతుల కుమార్తె **లేఖ్య సిరి చందన.** ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. మూడేళ్లుగా తైక్వాండో మాస్టర్ షబ్బీర్ హుసేన్ వద్ద శిక్షణ పొందుతూ పోటీల్లో రాణిస్తోంది. ● 2024 సెప్టెంబరులో నంద్యాలలోని పద్మావతి ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 పోటీల్లో స్వర్ణ పతకం గెలుపొందింది. ● 2024 అక్టోబరులో తిరుపతిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం అందుకుంది. ● 2025 ఏప్రిల్‌లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి అసోసియేషన్ క్యాడెట్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించింది. ● 2025 మే 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహరాడూన్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించింది. ● ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు ఏలూరులో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం అందుకుంది.

### తిరుగులేని సుగంధిని

నగరంలోని ఎన్.ఆర్.బిల్డింగ్స్ ప్రాంతానికి చెందిన సంగీత, రాముడు దంపతుల కుమార్తె సుగంధిని. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆత్మరక్షణ కోసం తైక్వాండో నేర్చుకుంది. ఐదేళ్లుగా శిక్షణ తీసుకుంటూ పోటీల్లో సత్తా చాటుతోంది. ● 2022 అక్టోబరులో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ● 2023 జులైలో నంద్యాలలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో రజత పతకం అందుకుంది. ● 2024 అక్టోబరులో తిరుపతిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం సాధించింది. ● 2025 మార్చిలో తెనాలిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి జూనియర్ పోటీల్లో స్వర్ణం పతకం గెలుచుకుంది. ● 2025 ఏప్రిల్ 2న తెనాలిలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. ● 2025 ఏప్రిల్ 2న ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. ● 2025 జూన్‌లో బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో కుంసే, కటాస్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించింది.

## ఆటోడ్రైవర్లపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో అతివేగంతో ఆటోలు నడుపుతూ మిగతా వాహనదారులను భయాందోళనకు గురిచేసిన నలుగురు చోదకులకు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం మంత్రణం నిర్వహించారు. వారి విన్యాసాలను పలువురు చరవాణుల్లో చిత్రీకరించి పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారిని పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేసి వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. సీఐ మన్సూరుద్దీన్ మంత్రణం చేసి కేసులు నమోదు చేశారు. ఎవరైనా వాహన చోదకులు అతివేగంతో నడిపినా, విన్యాసాలు చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించినా ట్రాఫిక్ పోలీసులకు గాని, డయల్ 112, డయల్ 100కు గాని ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సీఐ ప్రజలకు సూచించారు.

## తిప్పాయిపల్లెలో నాలుగిళ్లలో చోరీ

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని తిప్పాయిపల్లెలో ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన మహమ్మద్‌బాషా, కురువ అంకన్న, శేఖర్‌రెడ్డి, రవికుమార్ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు పడ్డారని వెల్లడించారు. తాళాలు పగులగొట్టి 15 తులాల బంగారు నగలు, రూ.75 వేల నగదు అపహరించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామాన్ని ఇళ్లను పరిశీలించి, కేసు విచారిస్తున్నట్లు వివరించారు.

అంత్యక్రియలు

ప్రేమ, ఆప్యాయత, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన కీ॥శే॥ మనబోలు శ్రీధర్ రావు గారి మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ మనబోలు శ్రీధర్ రావు గారు
జననం: 01-07-1968, మరణం: 14-11-2025

శోకతప్త హృదయాలతో...
భార్య: విజయలక్ష్మి
కూతుర్లు: మౌనిక చౌదరి, మధులిక
అల్లుడు: గొడుగులూరి మనోజ్ కుమార్
మామయ్యలు, అత్తయ్యలు & బంధు మిత్రులు

గమనిక: 17-11-2025 వ తేది సోమవారం ఉదయం. 11:00 లకు కల్లూరు స్మశాన వాటిక నందు అంత్యక్రియలు జరుగును.
సెల్: 95024 47140, 90630 19787

(c) eenadu

## అభయారణ్యం.. ఆయుర్వేద భాండాగారం

నల్లమలలో ఏర్పాటుచేసిన వనమూలికల సంరక్షణ కేంద్రం

ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలకు నెలవైన నల్లమల.. ఔషధాల ఖిల్లాగా పేరొందింది. అనేక ఔషధ మొక్కలు ఇక్కడ లభిస్తాయి. వైవిధ్యమైన జంతువులతోపాటు అరుదైన వృక్ష సంపద నల్లమల సొంతం. ప్రాచీనమైన భారతీయ వైద్య శాస్త్రంలో నల్లమలలోని శ్రీశైలం, శ్రీగిరి పేర్లు కనిపిస్తాయి. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

- నల్లమల కొండలు తూర్పు కనుమల్లో విస్తరించి ఉన్నాయి. నల్లమల మొత్తం విస్తీర్ణం 5,947 చ.కి.మీ.లు కాగా ఇందులో 3,040.74 చ.కి.మీ.లు రాజీవ్‌గాంధీ పులుల అభయారణ్యం ఉంది. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఇది విస్తరించి ఉంది. దీనికి మరోపేరు నాగార్జున సాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యం.

### ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

భారతీయ ఆయుర్వేదానికి ప్రపంచంలోనే ఎంతో గుర్తింపు ఉంది. ప్రాచీన కాలం నుంచి భారతావనికి ఆయుర్వేదం.. ఆయువు పట్టులాంటిది. నల్లమల పరిధిలో దాదాపు 4 వేల రకాల మొక్కలున్నాయి. ఇందులో ప్రతి మొక్క ఔషధ గుణాలున్నవి కావడం విశేషం. శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ జీవ వైవిధ్య కేంద్రం పరిధిలో అరుదైన, ఔషధ గుణాలున్న 353 జాతుల ప్రాధాన్యాన్ని గుర్తించి వాటి వివరాలు నోటీసు బోర్డుల్లో పొందుపరిచారు. రోళ్లపెంట నుంచి పెచ్చెర్వు గూడేనికి వెళ్లే దారిలో ఒకే ప్రాంతంలో అత్యంత ప్రాముఖ్యమైన 70-80 జాతుల ఔషధ మొక్కలు ఉండటంతో ఇక్కడ వనమూలికల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

## గుండెలదిరే ప్రయాణం

మండల పరిధిలోని ఫతేనగర్ ప్రాంతానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. దశాబ్దాలు గడుస్తున్నా రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. రాతి గుండ్లతోపాటు మలుపుల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలువురు ప్రమాదాలబారిన పడ్డారు. ఇకనైనా స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
– న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులు హాజరు కావాలని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా కానీ.. టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని చెప్పారు.

# దారులు పూడ్చేసి.. నిధులు ఊడ్చేసి

- ఆయకట్టు రోడ్లపై పూడిక మట్టి
- రైతులకు తప్పని ఇబ్బందులు

హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ నుంచి ఎక్కువ నీటిని తరలించడంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు రైతుల పాలిట శాపంగా మారింది. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని తరలించేందుకుగాను తొమ్మిది ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లాకు సైతం నీటిని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించి కాలువ విస్తరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మొదట్లో గుత్తేదారుడికి పనులు అప్పగించారు. 1వ కి.మీ. నుంచి 9వ కి.మీ. వరకు పూడిక తొలగించారు. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, నందికొట్కూరు

రహదారిపై వేసిన వ్యర్థాలు

### అదనపు వ్యయం

పొలాలకు వెళ్లే దారులకు అడ్డుగా పూడిక మట్టి వేయడంతో దీనిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమే. కాలువ వెంబడి పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పూడిక మట్టి వేయడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

### తవ్వి.. ఇష్టానుసారంగా పడేసి..

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు-వడ్డెమాను మధ్య హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో పూడికతీత పనులు ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. 9 కి.మీ. పొడవునా తీసిన పూడిక మట్టిని కొంత కాల్వ గట్టుపైనే వేశారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని జలవనరుల శాఖకు చెందిన రిజర్వు స్థలంలో వేయాలి. అది దూరంగా ఉండటంతో కాలువలో నుంచి తీసిన పూడికను ఎక్కడికక్కడ వేసుకుంటూ వెళ్లిపోయారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గంలోనూ వేశారు. వాహనాలు, ఇంధనం ఖర్చు కలిసివస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పడేశారు. పొలాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా మట్టి వేయడంతో వడ్డెమాను గ్రామానికి చెందిన 100 ఎకరాలకు దారి కరవైంది. ప్రస్తుతం దిగుబడులు తీసుకెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

## ప్రత్యర్థుల భరతం పట్టి.. పతకాలు కొల్లగొట్టి

నా దివ్యాంగుడు పుట్టుకతో.. గెలవాలన్న కసి ఉంటే వైకల్యం ఏమాత్రం అడ్డురాదని నిరూపించారు భరత్‌కుమార్. పుట్టుకతో పోలియో సోకడంతో ఒక కాలు పనిచేయదు. అయినప్పటికీ కుంగిపోలేదు. అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగారు. చదువుకుంటూనే పారా ఫెన్సింగ్, పడవ పోటీల్లో రాణిస్తూ ప్రతిభ చాటుతున్నారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన భరత్‌కుమార్ బీటెక్ చదువుతున్నారు. గతేడాది నుంచి పారా ఫెన్సింగ్‌తోపాటు కెనోయింగ్, కయాకింగ్ (పడవ పోటీలు)లో లక్ష్యమ్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. ఏడాదిలోనే ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ ఏడాది నంద్యాలలో నిర్వహించిన కెనోయింగ్, కయాకింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించి ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. ఈ ఏడాది మేలో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కెనోయింగ్, కయాకింగ్ పోటీల్లో రాణించి బహుమతి అందుకున్నారు. జూన్‌లో నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పారా ఫెన్సింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. అదే నెలలో జూన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. జులైలో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి పారా ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించి అందరి మన్ననలు అందుకున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పాత పట్టణం

# మాతృ వేదన

- ఆర్థిక భరోసాకు అడ్డంకులు

గర్భిణులకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన అండగా నిలుస్తోంది. అర్హులైన వారు వివరాలు నమోదు చేయించుకుంటే ఆర్థిక భరోసా లభిస్తుంది. ఈ పథకం కింద మొదటి కాన్పులో రూ.6 వేలు, రెండో కాన్పులో ఆడ బిడ్డ అయితే రూ.6 వేలు అందిస్తారు. గర్భిణులకు విడతల వారీగా ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ తీసుకుంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా వివరాలు నమోదు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా అర్హులకు పథకం ఫలాలు అందడం లేదు.
– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

### అంగన్‌వాడీలకు అప్పగింత..

పీఎం మాతృ వందన యోజనకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు, ఎంపిక ప్రక్రియను గతంలో వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించేది. తాజాగా ఈ బాధ్యతలను అంగన్‌వాడీ కార్యకర్తలకు (ఐసీడీఎస్) అప్పగించారు. గతంలో నమోదు చేసిన వివరాలను పరిశీలించి అర్హులైనవారిని గుర్తించే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉంది. ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ముందుకు సాగడం లేదు. అర్హుల గుర్తింపు విషయంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా 16, నంద్యాల జిల్లా 14వ స్థానంలో ఉండడం గమనార్హం. గర్భిణుల వివరాలను వైద్య, ఆరోగ్య శాఖ గంపగుత్తగా ఐసీడీఎస్‌కు అప్పగించింది. ఈ కారణంతోనే క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులను గుర్తించడంలో ఆలస్యమవుతోందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

| జిల్లా | నంద్యాల | కర్నూలు |
|---|---|---|
| దరఖాస్తులు | 25,661 | 45,105 |
| అర్హుల గుర్తింపు | 4,142 | 4,111 |
| తిరస్కరించినవి | 13,335 | 25,507 |
| పరిశీలించాల్సినవి | 8,184 | 15,487 |

వివరాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

### నగదు నేరుగా జమ

మొదటి కాన్పు తర్వాత లబ్ధిదారుల ఖాతాలో రూ.6 వేలు జమ చేస్తారు. గర్భిణిగా నమోదైన 5 నెలల్లోపు రూ.2 వేలు, గర్భిణి అన్నిరకాల టీకాలు వేసుకుంటూ సరైన పరీక్షలు చేయించుకుంటే 9 నెలల లోపు మరో రూ.2 వేలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైతే రూ.వెయ్యి, పుట్టిన బిడ్డకు మూడున్నర నెలల వయస్సులో అవసరమైన టీకాలన్నీ వేయించుకుంటే మరో రూ.వెయ్యి ఖాతాలో జమ చేస్తారు. రెండో కాన్పునకైతే బిడ్డ (ఆడ బిడ్డకు మాత్రమే) పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం ఒకేసారి రూ.6 వేలు ఖాతాలో జమ చేస్తారు.

### నత్తనడకన ఎంపిక

డోన్ ఐసీడీఎస్ సెక్టారులో 1,014 గర్భిణులు, బాలింతలను గుర్తించగా వారిలో 350 మంది తిరస్కరణకు గురయ్యారు. 14 మందిని అర్హులుగా గుర్తించారు. ఇంకనూ 650 మందిని గుర్తించాల్సి ఉంది. దాదాపు 64 శాతం దరఖాస్తుల పరిశీలన అసంపూర్తిగా ఉండటం గమనార్హం. ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలోని రుద్రవరం సెక్టారులో 61 శాతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. డోన్ ప్రాజెక్టులోని మిగతా సెక్టార్లలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పురోగతిలో ఉంది.

## గుండం మల్లికార్జునుడు.. మహిమాన్వితుడు

బనగానపల్లి మండలం పసుపల గ్రామ శివారులోని ఎర్రమల కొండల్లో వెలసిన గుండం మల్లికార్జునస్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. బనగానపల్లి నుంచి 20 కి.మీ. దూరంలో ఉంది. ఏటా కార్తిక మాసంతోపాటు శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కార్తిక మాసం చివరి సోమవారం నేపథ్యంలో వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేస్తారు. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక భక్తులు తరలివస్తారు. 2012లో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేసినట్లు అర్చకులు మల్లికార్జునశాస్త్రి తెలిపారు.

- ఆలయం చుట్టూ చిన్నపాటి రాతి గుహలు ఉన్నాయి. వీటిల్లో మునులు, యోగులు తపస్సు చేసినట్లు పెద్దలు చెబుతారు.
- ఆలయ సమీపంలోని కోనేరులో భక్తులు స్నానమాచరించి పూజలు చేస్తుంటారు. వర్షాకాలంలో జలపాతం నుంచి కోనేరుకు నీరు వస్తుంది.

– న్యూస్‌టుడే, పసుపల (బనగానపల్లి గ్రామీణం)

## కట్టు తప్పొద్దు.. ఊచలు లెక్కపెట్టొద్దు



భావప్రకటన స్వేచ్ఛ.. సామాజిక మాధ్యమాల్లో శ్రుతి మించుతోంది. పలువురిని లక్ష్యంగా చేసుకుని దురుద్దేశంతో అసభ్యకర సందేశాలు పెడుతుంటారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటిని నిలువరించేందుకు జిల్లా పోలీసు శాఖ గట్టి చర్యలు చేపడుతోంది. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినవారితోపాటు దానిని ఇతరులకు పంపినవారిపైనా చర్యలు తీసుకుంటున్నారు.




- ఒకరు తనను మోసం చేశారంటూ ఓ వ్యక్తి సామాజిక మాధ్యమంలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా పరిధిలో పలువురు బాధితులు ఉన్నారు. గత రెండేళ్లతో పోల్చితే బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.
- బాధితులు ఇబ్బంది పడుతుంటే సమీప పోలీసు స్టేషన్‌లోగానీ.. https://cybercrime.gov.inలో ఫిర్యాదు చేయొచ్చు.

### అసత్య ప్రచారం చేస్తే చర్యలు
–సునీల్ షొరాణ్, ఎస్పీ

తమ స్వార్థ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేసేవారితోపాటు ఆ పోస్టులను ఇతరులకు పంపినా నిందితులవుతారు. ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే అన్నీ వివరాలు సరిచూసుకోవాలి. ఇష్టానుసారంగా పోస్టులు చేస్తే ఇబ్బందులు పడతారు. –న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

## తెప్పోత్సవం వాయిదా

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 18న పాతాళగంగలో నిర్వహించాల్సిన తెప్పోత్సవాన్ని వాయిదా వేసినట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పాతాళగంగ వద్ద నీటిమట్టం హెచ్చుతగ్గులుగా ఉన్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. శ్రీశైలం ఆనకట్ట ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించి నీటిమట్టం వివరాలు సైతం తీసుకున్నట్లు ఈవో తెలిపారు.

# లాభాలు పట్టుకో

- రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంతో చిన్న, సన్నకారు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. తక్కువ పెట్టుబడి కావడంతో ఎకరాలో ఏడాదికి నాలుగు పంటల చొప్పున.. రెండెకరాల్లో 8-10 పంటలు సాగు చేయడం ద్వారా నెలనెలా ఆదాయం అందుకుంటున్నారు. ఒకసారి మల్బరీ నాటితే పది నుంచి పదిహేను ఏళ్లపాటు పంట వస్తుంది. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 1,800, నంద్యాల జిల్లాలో 2,098 ఎకరాల్లో పట్టు సాగు చేస్తున్నారు.
–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

- 2025-26 సంవత్సరానికిగాను కర్నూలు జిల్లాలో 150, నంద్యాల జిల్లా పరిధిలో 250 ఎకరాల్లో కొత్తగా పంట సాగు చేయించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 75 శాతం రాయితీ అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది.

- పెరిగిన ధరలకు అనుగుణంగా 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు కలిగిన ఒక షెడ్డు నిర్మాణానికి రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చవుతుంది. దశాబ్దాల కిందట కేంద్రీయ పట్టు మండలి నిర్ణయించిన మేరకు.. ఒక యూనిట్ ధర రూ.4.50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.4.05 లక్షలు, ఇతరులకు రూ.3,37,500 రాయితీ ఇస్తారు.

మల్బరీ తోటల సాగు

**పరికరాలు :** స్టాండ్లు, నేత్రికలకు కలిపి ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.63 వేలు, ఇతరులకు రూ.56,750 రాయితీ ఇస్తారు. మల్బరీ రైతులకు వ్యవసాయ పరికరాల యూనిట్ ధర రూ.లక్ష కాగా.. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.90 వేలు, ఇతరులకు రూ.50 వేలచొప్పున రాయితీ ఉంటుంది.

### మంచి ఆదాయం లభిస్తుంది
– డి.ఆంజనేయులు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి, కర్నూలు

ఇతర పంటలతో పోల్చుకొంటే పట్టు సాగు మంచి ఆదాయం ఇస్తుంది. ఏడాదికి ఎకరాకు నాలుగు పంటలు సాగు చేసుకోవచ్చు. పెట్టుబడులు పోను ఎకరాకు రూ.80-90 వేల వరకు ఆదాయం లభిస్తుంది. రైతు మొదట మల్బరీ సాగుతో పాటు షెడ్డు నిర్మించుకోవాల్సి ఉంటుంది. మల్బరీ సాగు నుంచి పట్టుగూళ్ల విక్రయం వరకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా సూచనలు ఇస్తాం.

### చేయూతనిస్తూ..

మల్బరీ తోటల పెంపకానికి రాయితీ ఇస్తున్నారు. ఎకరాకు 5 వేల మొక్కలు అవసరం కాగా ఒక మొక్క ధర రూ.2 ఉంది. మల్బరీ మొక్కలు, పంట సాగుకు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి కాగా.. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27 వేలు, ఇతరులకు రూ.22,500 రాయితీ అందుతుంది.

## గుంతల దారి.. పడతారు జారి

అధ్వానంగా నందికొట్కూరు–పగిడ్యాల రహదారి

రహదారుల నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్ గ్రామీణ రహదారులు రూపు కోల్పోయాయి. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

### మరమ్మతులు చేయక..

- నందికొట్కూరు-పగిడ్యాల బీటీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ఒక్క వాహనం వెళ్లాలంటేనే ఇరుకుగా ఉంటుంది. ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులే.
- నందికొట్కూరు-బ్రాహ్మణకొట్కూరు కేజీ (కర్నూలు-గుంటూరు) మార్గం మీదుగా ఓర్వకల్లు పారిశ్రామికవాడకు పైపులైను ఏర్పాటుచేస్తున్నారు. పనులు పూర్తి చేసినా రోడ్డుకు మరమ్మతులు చేయకుండా అలానే వదిలేశారు.

### రూ.2 కోట్లు కేటాయించినా..

- నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మిడుతూరు నుంచి గార్గేయపురం వెళ్లే రహదారి 15 కి.మీ. ఉంది. ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా గోతులే. ఈ రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవల డస్ట్ కంకర వేసి వదిలేశారు.
- నందికొట్కూరు-నంద్యాల రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనిపైనా డస్టు కంకర వేసి వదిలేశారు.

## సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ, డా.బి.ఆర్.అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ - 2026, మెయిన్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, దివ్యాంగ అభ్యర్థులు అర్హులు. ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో https:///apstudycircle.ap.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 340 సీట్లు ఉండగా విజయవాడలో 120, విశాఖపట్నం 100, తిరుపతిలో 120 సీట్లు ఉన్నాయి. ఈనెల 30వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. డిసెంబరు 10న శిక్షణ ప్రారంభించేలా తాత్కాలిక తేదీలుగా నిర్ణయించారని కర్నూలు కలెక్టర్ డా.సిరి తెలిపారు. అర్హులైనవారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గోకులం.. బిల్లుల్లో జాప్యం

పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా పశు పోషకులకు 90 శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీ కల్పించింది. ఒక్కో మినీ షెడ్డుకు రూ.1.15 లక్షలు, పెద్ద షెడ్డుకు రూ.2.30 లక్షల వరకు నిధులు కేటాయించింది. అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.
– న్యూస్‌టుడే, బనగానపల్లి

బనగానపల్లి సమీపంలో నిర్మించిన గోకులం షెడ్డు

- బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు 150కి పైగా గోకులం షెడ్లు మంజూరయ్యాయి. కొన్ని నిర్మాణాలు పూర్తై నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో నిధులు అందలేదు.

### రూ.2.50 కోట్లకుపైగా మంజూరైనా..

మొత్తం రూ.2.50 కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.80 లక్షలకు పైగా బిల్లులు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన నిధుల కోసం పలువురు ఎదురుచూస్తున్నారు. గోకులం షెడ్లు ఎక్కువగా మంజూరైనప్పటికీ బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

- ఈ విషయమై బనగానపల్లి ఏపీవో రమణ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని.. త్వరలోనే నిధులు జమ చేస్తామని తెలిపారు.

# నైపుణ్యమే

- శిక్షణ తరగతులు అంతంతే
- మూలకు చేరిన పరికరాలు

బాల్యం నుంచే విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాయి. పాఠశాల స్థాయి నుంచే పాఠ్య ప్రణాళికలకు అనుబంధంగా వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చాయి. పదో తరగతి పూర్తైన వెంటనే ఐటీఐ, పాలిటెక్నిక్‌తోపాటు ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సుల్లో చేరడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చు. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి.
–న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, డోన్ పట్టణం

### 143 పాఠశాలల్లో..

2015-16లో ఆదర్శ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 78 పాఠశాలల్లో 15 మంది, నంద్యాల జిల్లాలో 65 పాఠశాలల్లో 13 మంది శిక్షణ ఇస్తున్నారు. సోషల్ వెల్ఫేర్ ఆరు, ట్రైబల్ వెల్ఫేర్ మూడు, జ్యోతిరావుపులె పాఠశాల ఒకటి, కేజీబీవీలు 11, ఆదర్శ పాఠశాలలు 22, జడ్పీహెచ్ఎస్ 13, బాలికల ఉన్నత పాఠశాలలు తొమ్మిదింటిలో వివిధ ట్రేడ్‌లలో వృత్తి విద్యా బోధన సాగుతోంది.

| వృత్తి విద్యా కోర్సులు ఉన్న పాఠశాలలు | |
|---|---|
| కర్నూలు | 78 |
| నంద్యాల | 65 |


డోన్ పాతపేట ఉన్నత పాఠశాలలో రెండు కోర్సులకు ఒకే గదిలో శిక్షణ

### కానరాని ప్రయోగశాలలు

- నంద్యాల జిల్లాలోని అయ్యలూరు మెట్ట, డోన్ పాతపేట, డోన్ బాలికల ఉన్నత పాఠశాల, జలదుర్గం విద్యాలయం, నంద్యాల, పాణ్యం బాలికల ఉన్నత పాఠశాలలు, ఆళ్లగడ్డ, యర్రగుంట్ల తదితర పాఠశాలల్లో అవసరమైన ప్రయోగశాలలు లేవు. ఇక్కడ పరికరాలన్నీ ఒక గదిలో ఉంచి అవసరమైనప్పుడు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు.
- వృత్తి విద్యా కోర్సుల బోధన, శిక్షణపై క్వాలిటీ కంట్రోల్ ఇటీవల తనిఖీలు నిర్వహించింది. కేవలం 5 శాతం పాఠశాలల్లో మాత్రమే తనిఖీలు జరిగాయి. కొన్ని పాఠశాలల్లో బోధనను అటకెక్కించారు. మరికొన్ని ప్రాంతాల్లో గదుల కొరత పేరుతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో ఇరుకు గదుల్లో బోధిస్తున్న విషయాన్ని కమిటీ గుర్తించింది.

### అవసరమైన గదులు లేక..

- డోన్ పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ముగ్గురు మహిళా శిక్షకులు ఉన్నారు. ఒక్కో కోర్సులో 90 మంది విద్యార్థినులు ఉన్నారు. మూడు కోర్సుల్లో ఒక కోర్సుకు మాత్రమే గది కేటాయించారు. మిగతా కోర్సులకు గదులు అందుబాటులో లేవు. దీంతో ఐటీ, బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సుల సామగ్రిని ఒక గదిలో ఉంచేశారు.
- డోన్ పాతపేట జడ్పీ హైస్కూల్‌లో ఐటీ, ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించి వృత్తి విద్యా కోర్సులు అమలవుతున్నాయి. 9, 10 తరగతులకు చెందిన 200 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. రెండు కోర్సులకు ఒక గది మాత్రమే కేటాయించి శిక్షణ ఇస్తున్నారు.

(c) eenadu

## రైలుబండి.. కిటకిట

డోన్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. కర్నూలు నుంచి డోన్ మీదుగా గుంతకల్లుకు వెళ్లే రైలు కోసం ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు గంటల్లగా నుంచి ఎదురు చూశారు. ఉదయం 11 గంటలకు స్టేషన్‌కు చేరిన డెమూ రైలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. శనివారం రోజు మరింత రద్దీ నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు. కార్తీక మాసంలో చివరి శనివారం కావడంతో కసాపురం ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు, శుభకార్యాలు ఉండటంతో రద్దీ నెలకొందని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, డోన్ పట్టణం

## నాణ్యతా లోపం.. ప్రయాణికులకు శాపం

ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామం నుంచి బాచేపల్లె రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు ధ్వంసమై రాళ్లు తేలడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. 3 కి.మీ. ఉన్న ఈ దారిని ఈ ఏడాది ఆరంభంలో రూ.4.50 లక్షల నిధులతో మరమ్మతులు చేశారు. నామమాత్రంగా పనులు చేయడంతో కొంత కాలానికే రోడ్డు దెబ్బతింది. చాలా చోట్ల ఛిద్రం కావడంతో పాటు రోడ్డు చివర భాగాలు కొట్టుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. - న్యూస్‌టుడే, వాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం)

## ఫుట్‌బాల్ విజేత ఆదోని జట్టు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయలసీమ విశ్వవిద్యాలయ ఇంటర్ కళాశాలల క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో ఫుట్‌బాల్ క్రీడకు ఐదు జట్లు, చదరంగం పోటీలకు ఏడు జట్లు పాల్గొన్నట్లు కళాశాల పీడీ చంద్రశేఖర్ తెలిపారు. ఫుట్‌బాల్ తుది పోటీల్లో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. చదరంగం తుది పోటీల్లో కర్నూలులోని ఓర్వకల్లు కళాశాల జట్టు విజయం సాధించింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.భారతి, సీఐ ఇంతియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రామచంద్రుడుగౌడ్, న్యాయవాదులు రంగుల రాముడు, బొంతరి రవికుమార్, టీఈ నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

గెలిచిన జట్టుకు బహుమతి అందిస్తున్న కళాశాల యాజమాన్యం

## ఆలయాల్లో న్యాయమూర్తుల పూజలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని శివనంది, కృష్ణనంది శైవ క్షేత్రాల్లో ఆదివారం ఉమ్మడి జిల్లాల న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది, నంద్యాల జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కమలాదేవి, పోక్సో ప్రత్యేక జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజేంద్రప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి, నంద్యాల జిల్లా మూడో అదనపు కోర్టు న్యాయమూర్తి అమ్మన్న రాజా, ఎక్సైజ్ కోర్టు, నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తులు, కర్నూలు మొబైల్ కోర్టు, కర్నూలు ఎక్సైజ్, లోకాయుక్త న్యాయమూర్తులతో పాటు మరో ముగ్గురు న్యాయమూర్తులు ఆలయాల్లో పూజలు చేశారు.



పూజలో పాల్గొన్న న్యాయమూర్తులు

## సర్వేయర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా జగదీష్ ఎన్నికయ్యారు. పట్టణంలోని సిల్వర్ భవనంలో ఆదివారం ఎన్నిక నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్, సర్వేయర్ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యక్షుడిగా షేక్‌బల్లీ మస్తాన్, కార్యదర్శిగా సహదేవుడు, సంయుక్త కార్యదర్శిగా జుబైర్, కోశాధికారిగా చిన్నమల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా చిన్నమల్లయ్య, నాగార్జునరెడ్డి, అఖిల్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కిరణ్, గంగాధర్, అలీ ఎన్నికయ్యారు.

### ఎన్నికలు వాయిదా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: విజయ పాల ఉత్పత్తుల పరస్పర సహాయ సహకార సంఘం ఎన్నికలు పలుచోట్ల వాయిదా పడినట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. వారంతా ఆదివారం ఎన్నికల వివరాలు వెల్లడించారు. నామినేషన్లు దాఖలుకు ఎవరూ రాకపోవడం, పాడి రైతులు ఎన్నికలకు సుముఖంగా లేకపోవడం వంటి కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నగళ్లపాడు, గడివేములు, రుద్రవరం, ఆర్.పాంపల్లె, బోయిలకుంట్ల, వీరారెడ్డిపల్లె ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రతిభ చాటి.. పతకాలు సాధించి

☛ జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు విద్యార్థులు యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. పాఠశాల స్థాయిలోనే ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారు. పరుగు పందెంలో రాష్ట్ర స్థాయికి ఎంపికై.. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు సాధన చేస్తున్నారు. యోగాలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పలు ఆసనాలు వేస్తూ సత్తా చాటారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి అబ్బురపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన విద్యార్థులపై క్రీడా కథనం

### మెరుపు వేగంతో పరుగు

-అశ్వర్థకృష్ణ, 9వ తరగతి, గుడ్‌బెన్ స్కూల్

చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్ ఆటలంటే ఇష్టం. అమ్మానాన్నలు మధు శ్రీకృష్ణ, రూప. నాన్న పోలీస్ వృత్తిలో రాణిస్తున్నారు. పరుగు పందెంలో రాణించాలని పట్టుదలతో రెండేళ్లుగా సాధన చేశా. కర్నూలులో జరిగిన అండర్-17 ఎస్జీఎఫ్ పోటీల్లో వంద మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాను. అనంతరం రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన పోటీల్లో 12 సెకండ్లలో గమ్యస్థానాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలిచి పతకం అందుకున్నా. 100మీ రన్నింగ్ రేస్‌లో 22 సెకండ్లలో చేరుకోవడంతో రాష్ట్రం తరఫున జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. డిసెంబర్ 1వ తేదీన నుంచి 3వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటున్నాను. ఇందులో ప్రథమ స్థానం సాధించాలనే లక్ష్యంతో రోజూ రెండు గంటల పాటు మైదానంలో రన్నింగ్ సాధన చేస్తున్నా.

### ఆసనాల్లో అద్భుతం

- చరణ్‌సాయి, 10వ తరగతి, సోమప్పనగర్ జడ్పీహెచ్‌ఎస్

నాలుగేళ్లుగా యోగాసనాల్లో ప్రతిభ చూపుతున్నా. ఎమ్మిగనూరు డివిజన్‌తో పాటు, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా రెండేళ్లుగా సాధన చేస్తున్నా. వృక్షాసనం, శీర్షాసనం, ప్రాణాయామం, ధనురాసనం, మర్కటాసనం, త్రికోణాసనం, ఇతర ఆసనాల్లో రాణించాను. 2025 సెప్టెంబర్‌లో మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యాను. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 23,24వ తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రతి రోజూ రెండు గంటల పాటు సాధన చేస్తున్నా. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలనే లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్నా.

## అన్నదాతల సంక్షేమమే లక్ష్యం

చాగలమర్రి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యమని నంద్యాల డివిజన్ సహకార సంఘ అధికారి రుక్సానా బేగం తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్సానా బేగం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 56 సహకార సంఘాలు ఉన్నాయన్నారు. రైతుల అభివృద్ధే సహకార సంఘాల ధ్యేయమని సహకార వ్యవస్థలు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. సంఘం ద్వారా రైతులకు అర్హతను బట్టి రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు సేవలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ రామసుబ్బయ్య, సబ్‌డివిజనల్ కోఆర్డినేటర్ నాగరాజు, సీఈవో హుసేనయ్య, సంఘం నాయకులు నరసింహారెడ్డి, ఇంద్ర లక్ష్మీరెడ్డి, బ్రహ్మం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రుక్సానా బేగం

### సతీశ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల పరకామణి కేసులో విచారణకు వెళ్తు తాడిపత్రి సమీపంలో హత్యకు గురైన గుంతకల్లు రైల్వే సీఐ సతీశ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆదివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పత్తికొండలో ఆందోళన చేపట్టారు. ఇంటి నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. నీతి, నిజాయతీకి మారుపేరుగా నిలిచిన పోలీసు అధికారి హత్య చేసిన దుండగులను, వారి వెనుక ఉన్న సూత్రధారులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సతీశ్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. పట్టణ ప్రజలు వారికి సంఘీభావం తెలిపారు.

## కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మొంథా తుపానులో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు డిమాండు చేశారు. పట్టణంలోని నరసింహయ్య భవన్‌లో ఆదివారం సంఘం జిల్లా మహాసభను అధ్యక్షుడు మార్కు అధ్యక్షతన నిర్వహించారు. నష్టపోయిన రైతుల పేర్లు జాబితాలో చేర్చడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇవ్వాలన్నారు. రామచంద్రుడు, సోమన్న, నరసింహులు, ఏలియా, నరసింహ నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరిబాబు

## రైల్వే గేటు మూత.. వాహనదారుల అవస్థ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ట్రాక్ మరమ్మతుల కారణంగా కర్నూలు రైల్వే గేటు మూసివేయడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొండపేట, చిగురుమానుపేట, రాజీవ్‌నగర్, బంగారయ్య కాలనీ, త్రివర్ణకాలనీ తదితర కాలనీలకు చెందిన ప్రజలు, వాహనదారులు చాలా అవస్థలు పడుతున్నారు. గేట్లు మూసివేతతో ద్విచక్రవాహనాలు గేట్ల కింద దూర్చుకుంటూ అవతల వైపునకు ప్రమాదకరంగా తీసుకెళ్తున్నారు.

### ఐదు రోజులుగా నరకయాతన

ద్విచక్రవాహనదారులు, ఆటోలు, మినీ వ్యాన్లు తదితర వాహనాలు పట్టణంలోకి రావాలంటే ఉపరితల వంతెనపై వెళ్లి వంతెన దిగువ భాగంలో దిగి.. తిరిగి పట్టణంలోకి రావాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇలా ఇప్పటికి ఐదు రోజులు కావస్తోంది. మరమ్మతుల అనంతరం సోమవారం సాయంత్రం 6గంటల తర్వాతే గేట్లు తెరుస్తామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. గేట్లు మూసివేస్తే గేట్ల అవతలి వైపు వారు ఇవతలికి, ఇవతలి వైపు ఉన్న కొత్తపేట, శ్రీనివాసనగర్, ఇందిరానగర్, నెహ్రూనగర్, తారకరామానగర్, రైతుమిత్రకాలనీ, కేవీఎస్ కాలనీ, తదితర కాలనీలకు చెందిన వారు అవతల వైపు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.


### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ

జిల్లా కార్యాలయం, డోర్ నెం: 26-475, రైల్వే స్టేషన్ రోడ్డు, నంద్యాల- 518502

స్టేజ్-2 కాంట్రాక్టర్ల నియామకం కొరకు రీ-టెండరు ప్రకటన (5th Call)

No. PDS.3/Movt/FG/Stage-II Tenders/2025-27 Dated: 15.11.2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారు, నంద్యాల జిల్లాలోని 3 మండల స్థాయి స్టాక్ పాయింట్ గోదాములు అయిన 1) ఆళ్లగడ్డ 2) శిరివెళ్ల మరియు 3) శ్రీశైలం నుండి ప్రజాపంపిణీ వ్యవస్థ మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల క్రింద కేటాయింపబడిన నిత్యావసర సరుకులను ఆయా ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలోని మండలాలలో గల చౌకధరల దుకాణాలకు, సంక్షేమ వసతి గృహాలకు లేదా ప్రభుత్వము సూచించిన ఏదైనా సంస్థలకు 2025 -27 సంవత్సరాలకు గాను రవాణా చేయుటకు, తిరిగి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఈ కాంట్రాక్టు నియామకపు తేది నుండి 31-03-2027 వరకు ఉండును.

| | |
|---|---|
| ఆన్‌లైన్ నందు అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొను మొదలు తేది మరియు సమయం | 17.11.2025 at 5.00PM |
| ఆన్‌లైన్ నందు అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొను ఆఖరు తేది మరియు సమయం | 28.11.2025 at 5.00PM |
| ఆన్‌లైన్ నందు అప్లికేషన్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం | 28.11.2025 at 5.30PM |
| టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ మరియు సమయం (అర్హత దశ) | 29.11.2025 at 10.00 AM |
| ఆర్థిక బిడ్ తెరుచు తేదీ మరియు సమయం (ఆర్థిక బిడ్ దశ) | 29.11.2025 at 11.00 AM |

పూర్తి వివరములు కొరకు మరియు టెండర్ ఫారము కొరకు https://apeprocurement.gov.in అను వెబ్‌సైట్ నుండి పొందవచ్చును. టెండరు దాఖలు చేయుటకు మాత్రం పైన తెలిపిన website నందు రిజిస్టర్ చేసుకొని ప్రవేశ రుసుము రూ. 5,900/- ఆన్‌లైన్ లేదా డి.డి. ద్వారా చెల్లించి బిడ్ నందు పాల్గొనవలెను. ఒకటి కంటే ఎక్కువ మండల స్థాయి గోదాములకు టెండర్లు దాఖలు చేయు కాంట్రాక్టర్లు, రెండవ గోదాముకి సంబంధించి అప్లికేషన్ ఫీజును డి.డి. రూపంలో జిల్లా కార్యాలయం నందు సమర్పించవలెను. ఎటువంటి కారణం తెలుపకుండా 'e' టెండర్లను పూర్తిగా కాని, పాక్షికముగా గాని రద్దు చేయుటకు తిరస్కరించుటకు మరియు కొత్తగా టెండర్లు పిలుచుటకు జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, నంద్యాల వారికి పూర్తి అధికారం కలదని తెలియజేయడమైనది. ఈ అధికారములను ఎవరు ప్రశ్నించ వీలులేదు.

సం/- జాయింట్ కలెక్టర్ & ఈ.ఓ.ఈ.డి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, నంద్యాల జిల్లా.


## సంప్రదాయ పండగ.. సంతోషాలు నిండుగా

◆ ఘనంగా కార్తిక వనభోజనోత్సవాలు

కార్తిక మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వివిధ సంస్థలు, కుల సంఘాల ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవాలు సందడిగా జరిగాయి. ఆయా సామాజిక వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉసిరి చెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలోని చౌడేశ్వరిదేవి అమ్మవారి కల్యాణ మండపంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తిక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉస్సేన్‌రెడ్డి, బుగ్గన ప్రసన్నలక్ష్మి, మధుమోహన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆలయం: మండల పరిధిలోని శాలివాహన కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో హఠకేశ్వరం వద్ద కార్తిక వనభోజనాలు జరిగాయి. ఆ సంఘం ప్రతినిధులు శివలింగానికి పూజలు నిర్వహించారు. భిక్షపతి, నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసులు, శిల్పి ఎ.వి.నరసింహ, తేదేపా మండలాధ్యక్షుడు వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం: జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో ప్రథమనంది దేవస్థానంలో వనభోజనాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ రజకులు బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫయాజ్, ధోబీఘాట్ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శ్రీరాములు, వెదుర్ల రామచంద్రరావు, ఏవీఆర్.ప్రసాద్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ, శ్రీశైలం బోర్డు సభ్యురాలు జిల్లెల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల పట్టణం: ఆహార పదార్థాల్లో టెస్టింగ్ సాల్టు, సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించరాదని జిల్లా ఆహార భద్రతాధికారి వెంకటరాముడు పేర్కొన్నారు. నంద్యాల హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మూలమఠంలో కార్తిక వనభోజనాలు, సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్, జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర కల్యూరను సన్మానించారు.

నంద్యాల రైతునగరం: నంద్యాలలోని ప్రథమనందీశ్వర ఆలయంలో బంజారా సంఘం నాయకులు బంజారా కార్తిక వనభోజనాలు నిర్వహించారు. మహిళలు దేవాలయం ఎదుట దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. బంజారా సంఘం కార్యనిర్వహణ కమిటీ సభ్యులు రాజునాయక్, కృష్ణనాయక్, పుల్లన్ననాయక్, హతీరామ్ నాయక్, కాంతారావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డోన్: డోన్‌లోని దొరపల్లెగుట్ట వద్ద వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకుల కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు డా.మాధవకృష్ణతోపాటు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, చిన్నమద్ది తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రైతునగరం: నంద్యాల పట్టణంలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో కురువల కార్తిక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు విజయ కిరణ్, పురపాలక మాజీ ఛైర్మన్ కైప రాముడు, వెంకటేశ్వర్లు, హరినాథ్, శ్రీరాములు, కత్తి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల గాంధీచౌక్: నంద్యాల పట్టణంలోని బ్రహ్మానందీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వీర శైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో కార్తిక ధాత్రీ సమారాధాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సంక్షేమ సమాజం నంద్యాల అధ్యక్షుడు నాగరాజు, అర్చకులు సంబయ్యా స్వామి, శశిభూషణ సిద్ధాంతి, నాగమల్లయ్య, సభ్యులు వీరప్ప, హరీష్, సీనప్ప, మల్లికార్జున, చంద్రశేఖరప్ప, కిశోర్ పాల్గొన్నారు.

## కార్తిక దీపం.. ఓంకార నాదం

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. పెద్ద కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కార్తిక దీపాలు వెలిగించి స్వామివారికి పూజలు చేశారు.

కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

### సోమవారం టోల్ వసూలు రద్దు

కార్తికమాసం చివరి సోమవారం కావడంతో ఏర్పాట్లు చేసినట్లు ఆలయాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం టోల్‌గేటు వసూలు రద్దుచేసినట్లు చెప్పారు. అలాగే 25వేల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు. తాగునీటి వసతి కల్పించినట్లు చెప్పారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుంది. దైవ దర్శనానికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించినట్లు ఈవో తెలిపారు.

## అహోబిలంలో ఏకాదశి పూజలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి ధూపదీపాలతో మహామంగళహారతి అందించారు. సాయంత్రం విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

## శ్రీబాగ్ ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కృష్ణా, తుంగభద్ర నదీ జలాల పంపిణీలో రాయలసీమకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నప్పటికీ.. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎన్.రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీబాగ్ ఒప్పంద దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం-2014 అనంతరం రాయలసీమకు చట్టబద్ధ నీటి కేటాయింపులు కల్పించినప్పటికీ.. తదనంతరం ఏర్పడ్డ ప్రభుత్వాలు సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. శ్రీబాగ్ ఒప్పందంలోని కీలక అంశాల అమలుకు రాయలసీమ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సమితి నాయకులు ఆకుమల్ల రహీం, మహేశ్వరరెడ్డి, మహబూబ్‌బాషా, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర నాయుడు, భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్ర, కొమ్మా శ్రీహరి, అసదుల్లా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైఎన్.రెడ్డి

## రైతు నిర్లక్ష్యం.. 30 ఎకరాల్లో పంట దగ్ధం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంట కోత తర్వాత చెత్తకు నిప్పు పెట్టి నిర్లక్ష్యం వహించడంతో 30 ఎకరాల్లో పంట దగ్ధమైన సంఘటన వడ్డెమాను గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వడ్డెమాను గ్రామానికి చెందిన బోయ సోమన్న రెండు ఎకరాల్లో కోత తర్వాత మిగిలిన మొక్కజొన్న చెత్తకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు పక్కనే ఉన్న పొలాలకు వ్యాపించాయి. గమనించిన స్థానికులు పొలాల వద్దకు చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవడంతో తెలుగు రోశన్న 10, అబ్దుల్ రహిమాన్ 7, ముర్తుజావలి 4, ఈశ్వర్ 5, నూరుల్లా 4 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. దీంతో రైతులు బ్రాహ్మణకొట్కూరు ఎస్సై తిరుపాలుకు ఫిర్యాదు చేశారు. పంటలను పరిశీలించిన ఎస్సై రైతు సోమన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హాలహర్వి, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిద్ధాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మారుతి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తిమ్మప్ప(45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి నలుగురు సంతానం ఉన్నారు. మృతుని భార్య ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రైలు ఢీకొని.. ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప రైల్వేస్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. నంద్యాల జిల్లా బనగానిపల్లె మండలం దేవీనగర్‌కు చెందిన మహేష్ (22) కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కడప రైల్వే స్టేషన్ సమీపంలో నంద్యాల డెమో రైలు వెళ్తుండగా ట్రాక్ పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

MARRIAGE SERVICES

మనోజ్ఞ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. మా ప్రత్యేకత రెడ్డి కులాల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. ఆసక్తి గల వారు సంప్ర: 94900 04404.

TO LET

For Rent to Hospital, Poly Clinics, Diagnostic Centres 5200 Sft, G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: ✆ 89851 32552.

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, లేడీ టెలికాలర్స్ కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ 10 to 15K +ఇన్సెంటివ్స్, నో టార్గెట్. ✆ 6305597809.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

కర్నూలులోని ప్రముఖ విద్యాసంస్థలో లేడీ టెలీకాలర్స్ కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీతో పాటు MS-Excel తెలిసి 1 సం॥ అనుభవం ఉండాలి. ✆ 70328 20850.

కర్నూలులోని ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు "లేడీ వార్డెన్స్" కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. సంప్ర: 83176 99283.

SECURITY GUARDS

కర్నూలులోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ 10th+ఇంటర్ అర్హత, వయసు 30 సం॥-50సం॥లోపు స్త్రీ/పురుషులు కావలెను. సంప్ర: 97015 41899.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

## శ్రీశైల దేవస్థానం ఛైర్మన్‌కు అవార్డు

ఛైర్మన్ రమేశ్‌నాయుడికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం సింధనూరు పట్టణంలో ఆదివారం కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో ధర్మ రక్షక పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడికి ధర్మ రక్షక పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు వివరించారు.

## కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

నంద్యాల పట్టణం: కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రవి పేర్కొన్నారు. వైఎస్సార్‌నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ వసతి గృహాన్ని ఆదివారం తనిఖీ చేసి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆయా రిజిస్ట్రేషన్లు పరిశీలించారు. శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేయించి అవగాహన కల్పించారు.

## రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా నేరచరిత్ర, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. పోలీసుల మాటలను వినకుండా నేరాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పుస్తకాలు నిత్య స్ఫూర్తిదాయకాలని సాహితీవేత్తలు అన్నం శ్రీనివాసరెడ్డి, డా.నీలం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమ పితామహులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, డా.ఆర్ఎస్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

## బస్టాండులో భద్రత డొల్ల

★ నంద్యాలలో వరుస చోరీలతో ప్రయాణికుల బెంబేలు

● రెండు రోజుల క్రితం నంద్యాల బస్టాండులో ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా దొంగలు ఆమె పర్సును అపహరించారు. అందులో ఎనిమిది తులాల బంగారు నగలు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● వారం క్రితం ఓ వ్యక్తి బస్టాండులో బస్సు ఎక్కే సమయంలో అతని బ్యాగులోని పర్సును అపహరించారు. అందులో రూ.40 వేలతోపాటు చరవాణి పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● ఐదు రోజుల క్రితం నంద్యాల ఆర్టీసీ డిపోలో పనిచేసే అధికారి బస్టాండులో మరమ్మతులు చేయిస్తుండగా ప్యాంటు వెనక జేబులోంచి రూ.3,800 లను దొంగలు కొట్టేశారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

### రక్షణ చర్యలేవి?

జిల్లా కేంద్రం నంద్యాల బస్టాండులో వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. చాలామంది ఎవరికి చెప్పుకోలేక వెళ్లిపోతున్నారు. అధికారులు మాత్రం ప్రయాణికుల రక్షణ చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో బస్టాండులో రద్దీ పెరిగిపోయింది. దీనికి అనుగుణంగా వసతులు కల్పించాల్సి ఉన్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దొంగతనాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రయాణికుల భద్రతపై సందేహాలు తలెత్తుతున్నాయి.

● నంద్యాల ఆర్టీసీ బస్టాండు ద్వారా రోజూ 15 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నంద్యాల డిపోలో 106 బస్సులు రోజూ 40 రూట్లలో తిరుగుతూ.. 42వేల కి.మీ. ప్రయాణిస్తుంటాయి. ఆర్టీసీ ద్వారా రోజూ రూ.16 లక్షల ఆదాయం వస్తుంది.

బస్టాండులో సీసీ కెమెరాలు

### కనిపించని పోలీసులు

నంద్యాలలో పాత, కొత్త ఆర్టీసీ బస్టాండ్లు ఉన్నాయి. వీటిలో ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి అమరావతి కమాండ్ కంట్రోల్ కేంద్రం, నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానమై ఉన్నాయి. ఇవి పని చేస్తున్నాయో లేదో అర్థం కాని పరిస్థితి. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఇటీవల 16 సీసీ కెమెరాలు కొత్తవి ఏర్పాటు చేశారు. బస్టాండ్లలో పోలీసుల గస్తీ లేకపోవడంతో దొంగతనాలు అధికమవుతున్నాయి. పోలీసు ఔట్ పోస్టులు ఖాళీగా కనిపిస్తున్నాయి. పోలీసులు గస్తీ పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఖాళీగా ఉన్న పోలీసు ఔట్‌పోస్టు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు: 94403 61729
ఆత్మకూరు: 90149 09024
నంద్యాల: 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వెనకవైపు ఉన్న వీధి దీపం వెలగక ఇబ్బందిగా ఉంది. - రబ్బానీ, స్థానికుడు
✔ వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. - షాహిద్‌బాషా, పురపాలక ఏఈ

?: కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలో ఆవులు సంచరిస్తుండటంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. - రాజు, వాహనదారులు
✔ ఆవులను తీసుకువెళ్లాలని యజమానులకు సూచిస్తాం. - రమేశ్‌బాబు, కమిషనరు

నందికొట్కూరు: ?: సాయిబాబా ఆలయం దుకాణ సముదాయం సమీపాన చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన కారణంగా రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. - సంతోష్‌కుమార్, స్థానికుడు.
✔ కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - బేబి, కమిషనర్.

?: సాయిబాబాపేటలోని ఖాళీ స్థలాల్లో వర్షం నీటి నిల్వలు పేరుకున్నాయి. నీరు పాచి పట్టి దోమలకు నిలయాలుగా మారడమే కాకుండా, దుర్వాసన వస్తుంది. - చిన్న, స్థానికుడు.
✔ యజమానులకు నోటీసులిస్తాం. నీటి నిల్వలు తొలగించే చర్యలు తీసుకుంటాం. - బేబి, కమిషనర్.

నంద్యాల గ్రామీణం: ?: మండలంలోని పుసులూరు గ్రామంలో వాటర్‌షెడ్ నుంచి బోయిపేట రహదారి వరకు మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. - ప్రసాదరెడ్డి, స్థానికుడు
✔ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. - శివనాగ జ్యోతి డిప్యూటీ ఎంపీడీవో

?: మండలంలోని భీమవరం గ్రామంలో తాగునీటి ట్యాంకు రిపేరు జలాశయానికి నీటిని ఎక్కించడం లేదు. ప్రజలు గ్రామ శివారులోని కుందూ బ్రిడ్జి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. - మాబున్నీసా, స్థానికురాలు
✔ పైపులైను సరిగా లేక నీటిని ఎక్కించలేకపోతున్నాం. నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే పనిపూర్తి చేస్తాం. - నాయక్, ఏఈఈ తాగునీటి సరఫరా విభాగం

నంద్యాల రైతునగరం: ?: పట్టణంలోని విజయపురికాలనీలో ఇంటింటి చెత్త సేకరణ కోసం పారిశుద్ధ్య సిబ్బంది రోజూ రావడం లేదు. - సుధ, స్థానికురాలు
?: నందమూరినగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. - శ్రావణ్, స్థానికుడు
✔ ఇంటింటి చెత్త సేకరణకు రోజూ సిబ్బంది వచ్చేలా చర్యలు తీసుకుంటాం. కాల్వలు శుభ్రం చేయించి దోమల మందు పిచికారీ చేయిస్తాం. - లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

## దారి తెలియక అయోమయం

నంద్యాల నుంచి కర్నూలు వెళ్లే రహదారిలో జిల్లా కేంద్రం శివారులోని మూడు రోడ్ల కూడలి వద్ద ఏ ప్రాంతానికి ఏ దిశలో వెళ్లాలో తెలియజేసేలా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విరిగిపోయి.. ఇందులో ఉన్న ఊర్ల పేర్లు కనిపించడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే దారి తెలియని వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. అయోమయంతో కొంతదూరం వెళ్లాక.. మళ్లీ వెనక్కి తిరిగి రావాల్సి వస్తుంది. అధికారులు స్పందించి కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

## కచ్చా కాల్వ.. రోగాలు పక్కా

పట్టణంలోని పాత బస్టాండు నుంచి దుద్యాల మార్గంలో ఉన్న కచ్చా కాల్వ పూడిక, మురుగు నీటితో నిండి ఉంది. ఈ కాల్వ సంగమేశ్వరం సర్కిల్, విజయ పాల డైరీ వరకు విస్తరించి ఉంది. కాల్వలో పూడిక, మురుగు నీటిపై దోమలు సాయంత్రం, రాత్రి వేళల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులకు విషజ్వరాలు వస్తున్నాయి. కాల్వలో మురుగు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

## వంతెనకు చెట్లు.. తొలగించని అధికారులు



నంద్యాల నూనెపల్లె వంతెనపై పిల్లర్ల వద్ద చెట్లు పెరుగుతున్నాయి. చెట్ల వేర్లు పెరిగి పిల్లర్లతోపాటు వంతెనకు పాకుతున్నాయి. దీంతో వంతెనకు బీటలు ఏర్పడుతున్నాయి. వంతెన దెబ్బతినకుండా చెట్లు, వేర్లను తొలగించి వంతెనను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

## తగిలితే దిమ్మెతిరిగేను

నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ రోడ్డులో ఉన్న దిమ్మె ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు నిత్యం వాహనదారులతో రద్దీగా ఉంటుంది. రాత్రి సమయంలో వాహనదారులకు దూరం నుంచి కనపడక తరచూ దిమ్మెను తగులుకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి దాన్ని పక్కకు జరిపి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

## మరుగుదొడ్లకు నీటి సౌకర్యం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని ఎస్టీ వసతి గృహ విద్యార్థుల సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడి టాయిలెట్లకు నీరు రాక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 5వ తేదీన 'ఈనాడు'లో 'వసతి వేదన' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మురుగు దొడ్లకు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

స్పందనకు వందనం

## కాల్వల్లో పూడిక తొలగింపు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని మురుగు కాల్వల్లో అధికారులు పూడిక తీయించారు. పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ శర్మతో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి ప్రజలు ఫోన్ చేసి, వార్డుల్లోని కాల్వలో పూడిక తీయక మురుగు పారడం లేదంటూ ఫిర్యాదు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుద్ధ్య సిబ్బందితో కాల్వలను శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు.

## బస్సులో ప్లాస్టిక్ బాటిల్స్.. జరిమానా

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలానికి వచ్చిన కొందరు యాత్రికులకు చేదు ఘటన ఎదురైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. కొందరు యాత్రికులు ఈనెల 15న బస్సులో శ్రీశైలం దర్శనానికి వచ్చారు. వారి బస్సును స్థానిక అటవీశాఖ సిబ్బంది తనిఖీలు చేశారు. 5 ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ గుర్తించి రూ.5 వేలు జరిమానా విధించారు. అయితే, రసీదులో ప్లాస్టిక్ బ్యాన్ అని ముద్రించకపోవడంపై అటవీశాఖ అధికారుల తీరును భక్తులు, స్థానికులు తప్పుపడుతున్నారు. దీనిపై శ్రీశైలం అటవీశాఖ రేంజర్ పరమేశులను చరవాణి ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## అడవి పందుల దాడితో అరటి పంట నష్టం

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం ఆంజనేయపురం గ్రామంలోని అరటి పంటపై అడవి పందులు దాడి చేశాయి. రైతు పెద్ద పుల్లయ్య సాగు చేసిన రెండు ఎకరాల పంటపై దాడి చేసి నాశనం చేశాయి. ఆదివారం పంటను చలమ బీట్ అధికారి మద్దిలేటి స్వామి పరిశీలించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు వివరించారు.

## సంక్షిప్త సమాచారం

నంద్యాల గాంధీచౌక్: నంద్యాల పట్టణంలోని ప్రథమనంది ఆలయంలో కార్తిక చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్తికమాస ఉత్సవ కమిటీ, దేవస్థానం అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నంద్యాల గాంధీచౌక్: నందమూరినగర్‌లో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కుర్ణి సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు అమర్నాథ్, అధ్యక్షుడు శివప్ప, ప్రధాన కార్యదర్శి బాలసుధాకర్, కోశాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల పాతపట్టణం: నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 19న సీనియర్ పురుషుల, మహిళల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ ఛైర్మన్ నిమ్మకాయల సుధాకర్ ప్రకటనలో తెలిపారు. 15ఏళ్లు పైబడిన వివిధ బరువుల కేటగిరీలలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు.

నంద్యాల గాంధీచౌక్: మాస శివరాత్రి సందర్భంగా ఈనెల 18న పట్టణంలోని కోట వీధిలో ఉన్న బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

నంద్యాల గాంధీచౌక్: యాదవుల ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న కృష్ణ మందిరంలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు, పురుషులకు ఆటల పోటీలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిడుతూరు: త్రైత సిద్ధాంతం గురించి తెలుసుకోవాలని మిడుతూరు కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు పేర్కొన్నారు. మిడుతూరు మండలం జలకనూరులో దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం, నిషిద్ధమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సంయుక్తంగా భగవద్గీత ప్రచారం నిర్వహించారు.

గడివేముల: కొరటమద్ది గ్రామంలో ప్రభుత్వ కొలువులు సాధించిన వారిని ఆదివారం గ్రామస్థులు సన్మానించారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన కృష్ణకిషోర్, చెన్నయ్య, శ్రీనివాసులు, కానిస్టేబుల్ శ్రీకాంత్‌ను ఆధునిక దేవాలయంలో సన్మానించారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు.

శ్రీశైలం ఆలయం: శ్రీశైలం బస్టాండు సమీపంలోని జూద శిబిరంపై ఆదివారం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. నలుగురు జూదరుల నుంచి నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

నంద్యాల వ్యవసాయం: విజయ పాల డైరీ ఎన్నికలు జరగకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే ఉద్యోగులు అపహరణకు గురయ్యారంటూ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అనడం హాస్యాస్పందంగా ఉందని విజయ పాల డైరీ పాలకవర్గ మాజీ సభ్యురాలు సరళమ్మ ఆరోపించారు. ఆమె మాట్లాడుతూ.. చక్రవర్తులపల్లె, ఎర్రగుడిదిన్నె, నెరవాడ, గోనవరం, శిరివెళ్ల పాల సొసైటీలను రద్దు చేసినప్పుడు ఎక్కడున్నారుని ప్రశ్నించారు. సొసైటీలకు బోనస్ ఎందుకు వేయలేదు, గతేడాది ఎన్నికలు జరగకుండా మీరు ఎన్నికైనట్లు రాసుకోలేదా, అన్యాయాన్ని ప్రశ్నించినందుకే దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు.

## అన్నదాన సేవకు విరాళం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం కోసం రూ.1.11 లక్షలు విరాళాన్ని దాత అందజేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. గుంటూరు పట్టణానికి చెందిన శ్రీభువనేశ్వరి ట్రేడర్స్ అధినేత వనకూరి శ్రీనివాసరెడ్డి, ధర్మపత్ని సుహాసిని కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సిబ్బందికి విరాళాన్ని అందజేశారు. దాతకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఈవో పేర్కొన్నారు.

సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాత

## స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండులో పనిచేసే స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డిపో వద్ద రామసుబ్బమ్మ అధ్యక్షతన స్వీపర్లతో సమావేశం నిర్వహించారు. స్వీపర్లకు మాస్కులు, గ్లౌజులు, యూనిఫాంలు ఇవ్వాలన్నారు. వేతనాలు పెంచాలన్నారు. స్వీపర్లు లచ్చమ్మ, నాగేంద్రమ్మ, పుల్లమ్మ, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

## మహానందీశ్వరుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యేలు

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఏఈవో మధు స్వాగతం పలికారు. మహానందీశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యేలు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. వీరి వెంట భువనేశ్వరరెడ్డి, మధుసూదనరెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిహార్ ఎన్నికలు రద్దు చేయాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: బిహార్ ఎన్నికలను రద్దు చేయాలని రిజర్వేషన్ల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పోతుల నాగరాజు డిమాండు చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం రిజర్వేషన్ల పోరాట సమితి, బహుజన సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఎన్నికల పోలింగ్ తర్వాత ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటింగ్ శాతం, ఫలితాల తర్వాత వచ్చిన ఓటు సంఖ్య వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. నాగభూషణం, శ్రీనివాసులు, పెరుగు శివకృష్ణ, శ్రీనివాస్, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య సూచించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కొత్తపల్లి మండలం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎల్‌వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎమ్ఎస్ఆర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా హర్షద్, కిషోర్, సంధ్యారాణి, మహేష్, కార్యదర్శులుగా మహబూబ్‌బాషా, గౌసియా, స్రవంతి, జిల్లా కౌన్సిలర్లు శివయ్య, రామచంద్రరాజు, మోహన్‌కుమార్, అమిదున్, రాజేశ్వర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ప్రమాణం చేస్తున్న సభ్యులు

## శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేయాలంటూ ఆత్మకూరుకు చెందిన సామాజిక కార్యకర్తలు డిమాండు చేశారు. శ్రీబాగ్ ఒడంబడిక జరిగిన రోజును పురస్కరించుకొని పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాయలసీమ సాధన సమితి నాయకులు డాక్టర్ నాగన్న, సామాజిక కార్యకర్తలు నూర్‌మహమ్మద్, రమణయ్య, రాజశేఖర్, వలి పాల్గొన్నారు.

## నవరసాలు పలికించే ప్రాంతం నంద్యాల

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల నవరసాలు పలికించే ప్రాంతమని తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళీ పేర్కొన్నారు. చిన్నయసూరి సాహితీ సమితి అధ్యక్షుడు డా.వైష్ణవ వెంకట రమణమూర్తి రచించిన మూడు పుస్తకాలను వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం ఆవిష్కరించారు. సుధాకర్‌రెడ్డి, నాగరాజు, బీబీఎస్ ప్రసాద్‌లు ఆళ్వారుల కథలు, నాయనార్ల చరిత్ర, వైష్ణవ శాకుంతలమ్ పుస్తకాలను సమీక్షించారు. అవధాని డా.గంగుల నాగరాజు, కవి కోలం మధుసూదన్, గాయకులు శేషాచార్యులు, మహబూబ్‌బాషా, నీలకంఠమాచారి, డా.ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణలో సాహితీవేత్తలు, కవులు

## ఉమ్మడి జిల్లా బేస్‌బాల్ పోటీలు 18న

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో ఈనెల 18వ తేదీన ఉమ్మడి జిల్లా బేస్‌బాల్ అండర్-14, 17 బాలబాలికలకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, ఆశాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే అనుమతించబడతారన్నారు. తప్పనిసరిగా క్రీడా యూనిఫాంలో హాజరు కావాలని చెప్పారు.

## ఆలయం అభివృద్ధిపై ఆశలు

★ కొలనుభారతిలో వేగంగా పనులు చేపట్టాలని విన్నపాలు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కొలను భారతి క్షేత్రం అభివృద్ధిపై భక్తుల ఆశలు పెరిగిపోయాయి. సరస్వతీదేవి కొలువుదీరిన రాష్ట్రంలోనే ఏకైక ఆలయం కొలనుభారతి క్షేత్రం సమస్యల నిలయంగా మారింది. గతంలో తెదేపా ప్రభుత్వంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి గోపురం పనులు జరుగుతుండగా.. వైకాపా అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే గిత్త జయసూర్య అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావన తీసుకొచ్చారు. కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైలం క్షేత్రం పరిధిలో చేర్చి అభివృద్ధి చేయాలని కోరడంతో ప్రభుత్వం ఇటీవల కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైలం పరిధిలోకి చేర్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయాన్ని వేగంగా అభివృద్ధి చేయాలని భక్తులకు కోరుతున్నారు.

మధ్యలో ఆగిపోయిన ఆలయ నిర్మాణం

### భక్తుల ఇబ్బందులు, సూచనలు

● అమ్మవారికి నూతన ఆలయాన్ని నిర్మించేందుకు తొమ్మిదేళ్ల క్రితం తెదేపా ప్రభుత్వంలో 2016 కృష్ణా పుష్కరాల నిధులు రూ.కోటితో పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో ఆలయ నిర్మాణ పనులు ఆగిపోయాయి. వాటిని తిరిగి ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలి.

● ఆలయ ప్రాంగణంలో ఉన్న చారుఘోషిణి నది కోనేరులో నీరు లేదు. కార్తిక, శ్రావణ మాసం, శివరాత్రి వేళల్లో కోనేరులో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుంటే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. కోనేరులో నీరు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనేరును పునర్నిర్మించాలి.

● అమ్మవారి ఆలయంలో సౌకర్యాలు కరవయ్యాయి. సదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వసతులు లేవు. ఆలయ ప్రాంగణంలో తాత్కాలికంగా మూడు మరుగుదొడ్లు నిర్మించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరిన్ని మరుగుదొడ్లతోపాటు విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలి.

● శివపురం గూడెం కొలనుభారతి క్షేత్రానికి బీటీ రహదారి లేకపోవడంతో వర్షం పడితే.. ఆ దారిలో క్షేత్రానికి చేరుకోవడానికి భక్తులకు కష్టాలు తప్పట్లేదు. బీటీ రహదారి నిర్మించాలి.

● రాష్ట్రంలో ఏకైక క్షేత్రమైన కొలనుభారతి విశిష్టతపై ప్రభుత్వం విస్తృత ప్రచారం చేయాలి.

● కొలనుభారతి క్షేత్రానికి వచ్చే మార్గంలోని ఆత్మకూరు భవనాశి, శివపురం పెద్దవాగు, చెరువు అలుగు నీరు రహదారులపై పొంగే ప్రాంతాల్లో హై లెవెల్ వంతెనలు నిర్మించాలి.

● క్షేత్రంలో పర్యాటకులను ఆకట్టుకునేలా పార్కు వంటి నిర్మాణాలు చేపట్టాలి

● అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేయాలి.

## గోడపత్రాల విడుదల

మిడుతూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండు చేశారు. మండలంలోని కాజీపేట గ్రామంలో ఆదివారం సీపీఎం నాయకులు, రైతులతో కలిసి సోమవారం నుంచి చేపట్టనున్న రిలే నిరాహార దీక్షల కరపత్రాలు విడుదల చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ప్రకటించాలన్నారు.

## నంద్యాల సమితి మాజీ అధ్యక్షుడి మృతి

మునిశేషిరెడ్డి (పాతచిత్రం)

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల సమితి మాజీ అధ్యక్షుడు, పాణ్యం నూలుమిల్లు సహకార సమితి మాజీ ఛైర్మన్, తెదేపా నాయకుడు కౌలూరు గ్రామానికి చెందిన నల్లల మునిశేషిరెడ్డి(96) మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురికావడంతో వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన కుమారుడు విజయభాస్కరరెడ్డి కౌలూరు ఎంపీటీసీ సభ్యుడు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తెదేపా నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ తదితరులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

నంద్యాల పట్టణం: మునిశేషిరెడ్డి మరణం తీరని లోటని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు మంత్రితోపాటు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు తెదేపా ఇన్‌ఛార్జి గౌరు వెంకటరెడ్డి సానుభూతి తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సుబ్బారావుపేట బ్రాంచి
నందికొట్కూరు-20770, నంద్యాల జిల్లా.

స్వాధీనతా ప్రకటన (సింబాలిక్)

రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

అకౌంట్ నెం. 62505899321 HL, 62505901228-Suraksha

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు-2002 పరిధిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సుబ్బారావుపేట బ్రాంచి నందికొట్కూరు - 20770, నంద్యాల జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్-2002 యొక్క రూలు 9తో కూడిన 13(12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో ఋణగ్రహీత: శ్రీ గొల్లా బాలకృష్ణ, తండ్రి: జి.రాముడు, 1) హెచ్.నెం. 16-38/B, శివాజీ నగర్, కాలేజ్ రోడ్డు, నందికొట్కూరు, నంద్యాల జిల్లా-518401. 2) డి.నెం. 15-12-D99, సర్వే నెం.387, సాయిబాబాపేట, రెవెన్యూ వార్డు.13, నందికొట్కూరు. 3) డి.నెం. 13-252-1 & 13-252-2, సాయిబాబాపేట, నందికొట్కూరు మండలం. వారిని నోటీసులో తెలిపిన మొత్తము ది.02.09.2025 నాటికి రూ.16,31,426.00 + రూ.14,119.00 = రూ.16,45,545.00 (అక్షరాల పదహారు లక్షల నలభై ఐదు వేల ఐదు వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు ది.03.09.2025 తేదీ నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారము తదుపరి జమకూడు వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 దినములలోగా తిరిగి చెల్లించవలసినదిగా ది.02.09.2025 తేదీన డిమాండ్ నోటీసును జారీచేసినారు.

ఋణగ్రహీత / హామీదారు సదరు మొత్తమును చెల్లించుటలో విఫలమైనారు. అందువలన సదరు చట్టం యొక్క 13(4) విభాగంతో చదువుకొనే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8తో కూడిన పరిధిలో ఆయనకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తిని 11 నవంబర్ 2025 న క్రింది సంతకందారు స్వాధీనపరచుకొనినారని ఇందుమూలముగా ఋణగ్రహీత / హామీదారుకు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియపరచటమైనది.

ఋణగ్రహీత / హామీదారును ప్రత్యేకంగాను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు ఏవైనను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సుబ్బారావుపేట బ్రాంచి నందికొట్కూరు - 20770, నంద్యాల జిల్లా వారికి చెల్లించవలసిన మొత్తంబకాయి రూ.16,31,426.00 + రూ.14,119.00 = రూ.16,45,545.00 + వడ్డీ మరియు ఖర్చులు మొ॥ లోబడి మాత్రమే నిర్వర్తించవలెను.

సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉప విభాగం (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతలకు విన్నవించటమైనది.

తనఖా వుంచిన స్థిరాస్తి యొక్క పూర్తి వివరములు

30-06-2016 తేదీగల రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.2128/2016 ప్రకారము శ్రీ గొల్లా బాలకృష్ణ, తండ్రి: జి.రాముడుకు చెందిన ఆస్తి. కర్నూలు యొక్క ఆర్.డి. మరియు నందికొట్కూరు యొక్క యస్ఆర్‌డి, నందికొట్కూరు టౌన్ & మండలం, సాయిబాబాపేట, సమీప ఇల్లు డి.నెం.15-12-D99, సర్వే నెం.387, పాత వార్డు నెం.15, న్యూ హెచ్.నెం.13-252-1 & 2 ఇంటికి సంబంధించిన యావదాస్తి. విస్తీర్ణము: య॥ 0.02 సెంట్లు లేదా 96.8 చ॥గ॥. కొలతలు: తూర్పు-పడమర: 13 గజాలు; ఉత్తరం-దక్షిణం: 7.44 గజాలు. దీనికి హద్దులు: తూర్పు: రస్తా; పడమర: తిరువీధి సుధాకరశెట్టి యొక్క ఇల్లు; ఉత్తరం: జి.కృష్ణవేణి యొక్క ఇల్లు; దక్షిణం: జి.ప్రకాశరావు యొక్క ఇల్లు.

తేది : 11.11.2025
ప్రదేశం : నందికొట్కూరు
సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

## విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

ప్యాపిలి, న్యూస్‌టుడే: కొత్త 11కేవీ వెంగళాంపల్లి ఫీడర్ నిర్మాణం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి మండలంలోని వెంగళాంపల్లి, ఎన్.రంగాపురం, వెంకటాంపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు (6 గంటలు) విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేజ్ విద్యుత్తు ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

## సద్వినియోగం చేసుకోండి

సంజామల, న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి బాలకృష్ణారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు, విద్యార్థులు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జీవాలకు వ్యాధులా?

బనగానపల్లి, న్యూస్‌టుడే: చలికాలంలో జీవాలు, పశువులు, కోళ్లకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, ముందు జాగ్రత్తలపై సందేహాలు తీర్చుకునే అవకాశం 'ఈనాడు' ఫోన్-ఇన్ కల్పిస్తోంది. యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం పశుపోషణ శాస్త్రవేత్త డా.కృష్ణమూర్తికి నేరుగా ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చు.

**తేదీ: నవంబరు 17 (సోమవారం)**
**సమయం: ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు.**
**ఫోన్ నంబర్లు: 9848555659, 8008573763**

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్

చాగలమర్రి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, ఆజాంబేగ్ తెలిపారు. ఆదివారం ఎస్టీయూ చాగలమర్రి మండల శాఖ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన వేతన సవరణ బకాయిలు, కేంద్ర ప్రభుత్వంతో సమానంగా కరవు భత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం డీఎస్సీ 2025 ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌బాబు, రమేష్‌బాబు, శివప్రసాద్, అమీర్, ఉస్మాన్ పాల్గొన్నారు.

## యంత్రాంగం స్పందించాలి.. సౌకర్యాలు చేకూరాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: కాలనీలో సమస్యలతో సతమతమవుతున్నాం.. కనీస సౌకర్యాలు సమకూరక.. పాలకులు, అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా నేటికీ పరిష్కారం కావడం లేదు. కాలనీలను బాగు చేసుకునేందుకు ఏమి చేసుకుంటే బాగుంటుంది? అని డోన్ పట్టణంలోని కొత్తఇందిరానగర్, ఆటోనగర్ కాలనీవాసులతో 'ఈనాడు' ఓ చిన్నపాటి చర్చను ఆదివారం నిర్వహించింది. చర్చలో ప్రస్తావనకు వచ్చిన అంశాలను 'న్యూస్‌టుడే' మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌తో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించింది.

?: డోన్ పురపాలక పరిధిలోని 15 ఏళ్లుగా సమస్యలతో ఆటోనగర్, కొత్త ఇందిరానగర్ కాలనీవాసులు అవస్థలు పడుతున్నాం. పలు వీధుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేవు. **– శంకర్‌గౌడ్, కొత్త ఇందిరానగర్.**

?: కొత్త ఇందిరానగర్‌లోని పలు వీధుల్లో విద్యుత్తు స్తంభాలు లేక జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ విద్యుత్తు స్తంభాలు అవసరమో గుర్తించి ఏర్పాటు చేయాలి. **–వెంకటసుబ్బయ్య, లక్ష్మమ్మ.**

?: కొత్త ఇందిరానగర్‌లోని పలు వీధుల్లో చెత్త సేకరణకు మినీ ఆటో సరిగా రావడం లేదు. పోగైన చెత్త నిల్వతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉంది. చెత్త సేకరణకు రోజూ మినీ ఆటో రావాలి. **– వెంకటేశ్వర్లు, సావిత్రి.**

?: ఆటోనగర్‌లో సీసీ రహదారిని నిర్మించలేదు. పలు వీధుల్లో మురుగు కాల్వలు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. **–సుదర్శన్, ఆదిలక్ష్మి.**

సమస్యలను విన్నవిస్తున్న కొత్తఇందిరానగర్, ఆటోనగర్ కాలనీవాసులు

?: కొత్త ఇందిరానగర్‌లో ప్రధాన రహదారితో పాటు వీధుల్లో కూడా సీసీ రహదారులు దెబ్బతిన్నాయి. వర్షం వస్తే ఇళ్ల చెంత నీరు నిల్వ ఉండి కుంటలను తలపిస్తున్నాయి. **– గోవిందమ్మ.**

?: కొత్త ఇందిరానగర్‌లోని వీధుల్లో దీపాలు కాలిపోతే వాటిని తీసివేసి..కొత్త దీపాలను అమర్చడం లేదు. కాలిపోయిన దీపాల స్థానాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేయాలి. **– మాధవి, ఈశ్వరమ్మ.**

?: పట్టణంలోని కాలనీల్లో కుక్కల దాడులు ఎక్కువయ్యాయి. రాత్రి వేళ పిల్లలు, వృద్ధులు బయట రాలేకపోతున్నారు. **– రంగస్వామి, కొత్త ఇందిరానగర్.**

### త్వరలో పనులు ప్రారంభిస్తాం –ప్రసాద్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

కాలనీలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం. డోన్ మున్సిపాలిటీకి ప్రభుత్వం మొదటి విడతలో రూ.39 కోట్లు మంజూరు చేసింది. టెండరు పూర్తైతే ఆటోనగర్, కొత్త ఇందిరానగర్‌లో నిర్మాణ పనులు చేపడతాం. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్తు స్తంభాలు ఏర్పాటుకు కృషి చేస్తాం. ఇళ్ల చెంత వర్షం నీరు నిల్వ లేకుండా చేస్తాం. చెత్తను రోజువారీ సేకరిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. కుక్కల దాడులను నియంత్రిస్తాం.

## ఆ ఊళ్లు.. పూల లోగిళ్లు

చామంతి పూలు కోస్తున్న కూలీలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: అక్కడ ఏ గ్రామంలో చూసినా హరివిల్లులా పూల సాగు కనువిందు చేస్తోంది. కార్తికమాస ఉత్సవాలు, పూజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బేతంచెర్ల మండలంలోని రైతులు విస్తారంగా సాగు చేసిన పూలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. మండలంలోని సీతారాంపురం, సంకలాపురం, బైనపల్లె, గొరుమానుకొండ, కొలుములపల్లె, మండ్లవానిపల్లె, ఎంబాయి, రుద్రవరం తదితర గ్రామాల్లో 800 ఎకరాల్లో పేపరు వైట్, చామంతి, బటన్ రోజా, చిట్టి గులాబి వంటి రకాలు సాగవుతున్నాయి. కిలో రూ.150 నుంచి రూ.200 ధరకు విక్రయిస్తున్నారు. వీటిని హైదరాబాదు, చెన్నై, విజయవాడ, రాజమహేంద్రవరం, బెంగళూరు తదితరులు మార్కెట్లకు తరలిస్తున్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రగుడి, బీరవోలు గ్రామాల్లో గ్రామాల కమిటీలు, అనుబంధ కమిటీలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కమిటీలు పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులున్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో నష్టం

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బత్తలూరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలంతా కలిసి రావాలని ఆయన కోరారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రజలతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎంపీపీ గజ్జల రాఘవేంద్రరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో గంగుల బ్రిజేంద్రరెడ్డి

## ట్రాఫిక్ సమస్య.. తీరేదెలా!

డోన్ పట్టణంలోని నంద్యాల రైల్వేగేట్ల సమీపంలోనే బేతంచెర్ల సర్కిల్‌లో వంతెన దిమ్మెల వద్ద ద్విచక్రవాహనాలు, ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. సర్కిల్‌లో వంతెన వద్ద ఇరుకైన దారుల్లో నిత్యం వందల సంఖ్యలో లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, బస్సులతో పాటు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.
**– న్యూస్‌టుడే, డోన్ పట్టణం**

## రహదారులే పశువుల అడ్డా

ఆళ్లగడ్డ పురపాలికలో పశువులు రహదారులపై ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. సమస్యను గుర్తించిన పురపాలిక సిబ్బంది సెప్టెంబరు 14న కొన్ని పశువులను పట్టుకుని బయటకు తరలించేందుకు సిద్ధమయ్యారు. ఏమైందో ఏమో వాటిని బయటకు తరలించకుండా వాటి యజమానులకు కేవలం హెచ్చరికలు ఇచ్చి వదిలేశారు. దీంతో పట్టణంలో పశువుల సంచార సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. **–న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ**

## కోరుమానుపల్లె అవస్థలు తీర్చరూ..

కొలిమిగుండ్ల మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పారిశుద్ధ్యం లోపించి గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం, మురుగునీటితో గ్రామస్థులు అల్లాడుతున్నారు. ప్రధాన రహదారిలో సిమెంటు రోడ్డుపై మురుగునీరు పారుతోంది. స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులకు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, కొలిమిగుండ్ల**

## పాఠశాలకు ప్రహరీ కరవు

ఉయ్యాలవాడ ఎస్సీ బాలుర వసతి గృహానికి మౌలిక సదుపాయాల కొరకు ప్రభుత్వం ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ నుంచి రూ.29.28 లక్షలు నిధులు విడుదల చేశారు. దీంతో భవనం మరమ్మతులు, మరుగుదొడ్లు, స్నానం గదులు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు చాలకపోవటంతో ప్రహరీ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేశారు. ప్రహరీ లేకపోవడంతో పశువులు, విషకీటకాలు వసతి గృహంలోకి వస్తున్నాయి.
**– న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ**

## సంక్షిప్త సమాచారం

**అవుకు, న్యూస్‌టుడే:** అవుకు మండల ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తాలేపల్లి బలరామయ్య(74) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి, తెదేపా నాయకులు ఐవీ పక్కీరారెడ్డి, ఉగ్రసేనారెడ్డి, గూడాల ప్రతాప్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

**అవుకు, న్యూస్‌టుడే:** కార్తిక మాసం చివరి సోమవారం నేపథ్యంలో మండలంలోని పలు శివాలయాలను ముస్తాబు చేశారు. అవుకులోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో పూజలు, అభిషేకం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రామప్ప, వెంకటేశ్వర్లు తెలిపారు.

**కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే:** మండలంలోని నందిపాడు గ్రామంలో పొలాల రస్తాలో కంపచెట్లు పెరిగిపోయాయి. పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి కంపచెట్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**డోన్, న్యూస్‌టుడే:** మహిళలు అనుకుంటే ప్రస్తుతం ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారని సామాజిక కార్యకర్త షేక్షావలి అన్నారు. డోన్‌లో ఆటో డ్రైవర్ భారతిని అభినందించి సన్మానం చేశారు.

**డోన్, న్యూస్‌టుడే:** పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయానికి సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన శంకరనారాయణగౌడ్, రేణుకలు రెండు దీప స్తంభాలు, ఇత్తడి గిన్నెలను విరాళంగా అందజేశారు.

**డోన్, న్యూస్‌టుడే:** సాయిబాబా ఆలయంలో కార్తిక చివరి సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సహస్ర దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున రావాలని కోరారు.

**డోన్, న్యూస్‌టుడే:** మెప్మాలోని ఓ పొదుపు సంఘంలో ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా నాయకురాలు షమీంబేగం, సిరీనా, మాధవి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ.. అక్రమాలకు వత్తాసు పలికిన మున్సిపాలిటీ అధికారిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు.

**బనగానపల్లి, న్యూస్‌టుడే:** రైల్వే సీఐ సతీష్ కుమార్ మృతిపై విచారణ చేపట్టాలని శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, శివరాజ్, నాగరాజు, రవి పాల్గొన్నారు.

**సంజామల, న్యూస్‌టుడే:** ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం 'చలో దిల్లీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శివరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం నేపథ్యంలో నిరసన తెలియజేస్తున్నామన్నారు. నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

**ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే:** మాయలూరు గ్రామంలో కార్తిక మాసం చివరి సోమవారం కావటంతో గ్రామస్థులు అన్నదాన చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మూడు వేల మందికి అన్నదానం చేయాలని నిర్ణయించారు.

**ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే:** మాయలూరు-రూపనగుడి గ్రామాల మధ్య వెలసిన పెద్దమ్మ దేవతకు ఆదివారం రూపనగుడి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కార్తికం.. శోభాయమానం

పల్లెలు, పట్టణాల్లో కార్తిక మాసం సందర్భంగా శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. కార్తిక మాస పూజలు ఘనంగా జరిగాయి. అందరూ కలిసి వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

డోన్: ప్రత్యేక అలంకరణలో శివుడు

**ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.కృష్ణాపురం గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం పుట్టాలమ్మ ఆలయం ఆదివారం కిక్కిరిసింది. కార్తిక మాసం కావడంతో దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఆవరణలో బావుల వద్ద చన్నీటి స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలతో కార్తిక దీపాలు వెలిగించారు.

**దొర్నిపాడు, న్యూస్‌టుడే:** దొర్నిపాడు మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మతల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వాహనాల్లో పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడే వంటా వార్పు చేసుకొని భోజనాలు చేశారు.

**అవుకు, న్యూస్‌టుడే:** అవుకులో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సామూహిక వనభోజనాలు ఆనందోత్సాహాలతో ముగిసింది. నిర్వాహకుడు వెంకటరమణనాయక్ ఆధ్వర్యంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు కొవ్వూరి మద్దయ్య, మద్దిలేటిగౌడు, సుబ్బయ్య పాల్గొన్నారు.

దొర్నిపాడు: పూజలు అందుకుంటున్న పెద్దమ్మతల్లి

సంజామల: శివయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

### ఘనంగా ఉత్సవాలు ప్రారంభం

**సంజామల, న్యూస్‌టుడే:** మండలంలోని నయనాలప్ప క్షేత్రంలో కార్తిక చివరి సోమవారం వేడుకలు ఆలయ కమిటీ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, ఆలయ ఈవో చంద్రుడు ఆధ్వర్యంలో ఆదివారం అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం కల్యాణోత్సవం జరుగనుంది. అనంతరం ధ్వజారోహణం, రుద్రాభిషేకం, గ్రామోత్సవం, నాటకప్రదర్శన నిర్వహించనున్నారు. ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 19 జతలు ఎడ్లు వచ్చాయి. వీటి మధ్య హోరాహోరీగా సాగిన పోరు భక్తులను ఆకట్టుకుంది.

**నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** బనగానపల్లి మండల నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి హైదరాబాదుకు చెందిన నాగరాణి రూ.25వేల విరాళాన్ని ఆలయ అర్చకులకు ఆదివారం అందజేశారు. అంతకుముందు దాతలు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అర్చకులు దాతలను సత్కరించి ప్రసాదాలు అందించారు.

ఆళ్లగడ్డ: కార్తిక మాస పూజల్లో పాల్గొన్న మహిళలు

అవుకు: సామూహిక వనభోజనాల్లో అయ్యప్ప భక్తులు

ఆళ్లగడ్డ గ్రామీణం: పుట్టాలమ్మ ఆలయ ఆవరణలో..

## ముమ్మరంగా విద్యుత్తు స్తంభాల పనులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలో ఇటీవల విద్యుత్తు స్తంభాల మార్పు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇటీవల పట్టణంలో పర్యటించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్తు స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవాటివి అమర్చడం ప్రారంభించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలను తొలగించి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇటీవల భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతుండటంతో ఆయా మార్గాల్లో స్తంభాలు మధ్యలోకి రావడంతో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకొని పనులు చేస్తున్నారు.

## గొడవలకు దూరంగా ఉండండి

బేతంచెర్ల,న్యూస్‌టుడే: రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బేతంచెర్ల పోలీసు స్టేషన్‌లో ఎస్సై రమేష్‌బాబుతో కలిసి రౌడీ షీటర్లకు, పాత కేసుల్లో ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఎవ్వరైనా మద్యం, మట్కా, జూదం వంటి వాటిలో ఉన్నట్లు సమాచారం వస్తే తగిన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై మల్లికార్జునరెడ్డి అన్నారు. కోవెలకుంట్ల నుంచి నంద్యాలకు వెళ్లే దారిలో ఆదివారం వాహనాల తనిఖీ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

**నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:** కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ వసతి గృహాన్ని వారు తనిఖీ చేసి విద్యార్థులతో సమావేశం అయ్యారు.

## వృథాగా నీరు.. కనిపించని తీరు

**డోన్ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని వైఎస్ఆర్ నగర్ శివారులో రైల్వే ట్రాక్ సమీపంలో గాజులదిన్నె ప్రాజెక్టు ప్రధాన నీటి గొట్టం లీకేజీకి గురైంది. ఇది వరకు రెండు, మూడు సార్లు అధికారులు మరమ్మతులు చేయించినా ఫలితం మాత్రం కన్పించడం లేదు. శాశ్వత మరమ్మతులు చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

**కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల సమీపంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంటు సమీపంలో రహదారిపైకి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు చర్యలు తీసుకుని రహదారిపైకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అరకొర వసతులు.. అవస్థల్లో రోగులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నిర్వాకం నేటికీ శాపంలా వెంటాడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, రన్నింగ్ వాటర్, పైకప్పు మరమ్మతులు, అవసరాల మేరకు చిన్న నిర్మాణాలు చేసేందుకు నాడు-నేడు పథకంలో పనులు మంజూరు చేశారు. అయితే కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇంకా అరకొర వసతులే అగుపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ భవనాలు శిథిలాలుగా కనిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

### శిథిలావస్థకు భవనాలు

★ చాగలమర్రి పట్టణంలోని పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ ఉండేది. ప్రస్తుతం పనిచేయడం లేదు. ఆసుపత్రి పరిధిలో టీకాలు వేసే గది శిథిలావస్థకు చేరకపోవడంతో అందులో ఎవరూ విధులు నిర్వహించడం లేదు. స్థానిక ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రత నెలకొంది.

★ ముత్యాలపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం లేకపోవడంతో ఇక్కడి వైద్యులు 104 వాహనం, ఎఫ్‌డీపీ కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే ముత్యాలపాడు గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు.

★ శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. యర్రగుంట్లలో 24 గంటల ఆసుపత్రి లేకపోవడంతో ఏదైనా జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే ఇటు ఆళ్లగడ్డ, అటు నంద్యాల వైపు వెళ్లే పరిస్థితి నెలకొంది.

చాగలమర్రిలో శిథిలావస్థకు చేరిన ఇమ్యూనైజేషన్ భవనం

★ శిరివెళ్ల మండల కేంద్రంలోని వైద్యశాలలో యునాని వైద్యులు ఉన్నా ప్రత్యేక గది లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

### కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

★ కోవెలకుంట్ల మండలంలోని రేవనూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. 24 గంటల ఆసుపత్రి కాకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

★ దొర్నిపాడులోని ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ పరీక్షలు చేయట్లేదు. స్టాఫ్ నర్సులు బదిలీపై వెళ్లడంతో సిబ్బంది కొరత వేధిస్తోంది.

★ ప్యాపిలి, జలదుర్గం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్యాపిలి పీహెచ్‌సీ ఆవరణలో కంపచెట్లు పెరిగిపోయాయి.

★ ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలంలో వర్షానికి ఆసుపత్రి ఆవరణ మొత్తం బురదమయంగా మారుతోంది.

★ బనగానపల్లి మండలంలో పలుకూరు, టంగుటూరు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. టంగుటూరు ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రి చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని మాజీ సర్పంచి కానాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ఎదురుగా కాల్వలు లేక రహదారిపై మురుగు నిలుస్తోంది. వర్షాలకు మురుగు మరింత పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- సుధాకర్.**
✔: పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.**

?: పట్టణంలోని జమ్మలమడుగు మలుపు నుంచి చిదానంద పాఠశాలకు వెళ్లేదారిలో మురుగు కాల్వల నిర్మాణం లేక మురుగు అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాల్వల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. **- రవికుమార్**
✔: మురుగు కాల్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: కొత్త ఇందిరానగర్‌లో 8-1-167-100-31/1 ఇంటి వద్ద ఉన్న విద్యుత్తు స్తంభానికి దీపం కాలిపోయింది. **-శంకర్‌గౌడ్, కొత్త ఇందిరానగర్.**
✔: సిబ్బందితో కొత్త దీపాన్ని ఏర్పాటు చేయిస్తాం. **- సురేష్, మున్సిపల్ ఏఈ.**

?: శ్రీనివాసనగర్ శివారులో ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోయి రోడ్డుపైకి వచ్చాయి. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని తొలగించడంలేదు. **- రమేష్, శ్రీనివాసనగర్**
✔: రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను సిబ్బందితో తొలగిస్తాం. **-సునీల్, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి.**

అర్జునాపురం (దొర్నిపాడు), న్యూస్‌టుడే: ?: మండలంలోని అర్జునాపురం గ్రామంలోని రహదారి పక్కన ఉన్న మురుగు కాల్వలో చెత్త చేరి అధ్వానంగా మారింది. సంబంధిత అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలి. **- రాముడు, అర్జునాపురం.**
✔: సంబంధిత సిబ్బందితో మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. –ప్రభాకర్‌రెడ్డి, సర్పంచి, అర్జునాపురం.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల పట్టణంలోని పశువైద్యశాల ప్రాంతంలో మురుగు కాల్వ నిర్మించాలి. **- నాగేంద్ర, గ్రామస్థుడు.**
✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జీ, ఈవో.**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలో ఉప్పునీళ్ల బావి సమీపంలో మురుగు కాల్వల్లో ఉన్న చెత్తను తొలగించాలి. **- పుర ప్రజలు.**
✔: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించే విధంగా చూస్తాం. **- మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

?: పట్టణంలో పలు కాలనీల్లో కుక్కల దాడులు ఎక్కువయ్యాయి. నివారణ చర్యలు తీసుకోగలరు. **- పట్టణ ప్రజలు.**
✔: త్వరలోనే కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్.**

(c) eenadu

భోజనం చేస్తున్న బాటసారులు, వినుకొండలో కాశినాయన ఆశ్రమం

## ఆశ్రమం.. ఆకలి తీర్చుతోంది

వినుకొండ, న్యూస్‌టుడే

**ఎనిమిదేళ్లలో లక్షల మందికి అన్నదానం**

అదో అక్షయ పాత్ర.. ఆకలితో అక్కడికి వెళ్లిన వారికి అన్నం లేదు అన్న మాట వినపడదు. ముఖం చూడరు.. కులం అడగరు.. మతం పట్టించుకోరు. అర్ధరాత్రి వెళ్లినా ఇంట్లో మాదిరిగానే అన్ని పదార్థాలు వడ్డిస్తారు. ఇలా వారం, నెల కాదు.. ఎనిమిది సంవత్సరాలుగా నిరంతరం అన్నదానం ఒక యజ్ఞంలా చేస్తున్నారు. కరోనా కాలంలోనూ పొయ్యి వెలిగించని రోజు లేదు. రోజుకు సగటున 500 మంది చొప్పున ఇప్పటివరకు 14 లక్షల మందికి పైగా భోజనం చేశారు. అదే వినుకొండ ఏనుగుపాలెం రోడ్‌లోని కాశినాయన ఆశ్రమం.

ఆశ్రమానికి వచ్చిన వారిని అతిథులుగా చూడాలన్న రామచంద్ర నాయన మాట గుర్తుకు వస్తుంటుందని.. అందుకే ఆహారం విషయంలో రాజీ పడబోమని ఆశ్రమ ప్రధాన సేవకులు సురేష్ తెలిపారు.

### అన్నార్తుల సేవలో..

పట్టణానికి చెందిన కాంతారావు.. కాశినాయనపై ఉన్న భక్తితో విలువైన ఎకరమున్నర భూమిని 2017 ఏప్రిల్‌లో ఆశ్రమానికి ఉచితంగా అప్పగించారు. రేకుల షెడ్డు నుంచి వంట పాత్రల వరకు అన్నీ దాతలే సమకూర్చారు. పప్పులు, ఉప్పు, బియ్యం, కూరగాయలు.. ఇలా అన్ని రకాల వంట సరకులు ఇస్తున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా వంట నుంచి వడ్డించడం వరకు ఉచితంగా సేవలందిస్తున్నారు. మూడు పూటలా ఆకలితో వచ్చినవారి ఆకలి తీరుస్తున్నారు. అర్ధరాత్రి వచ్చేవారి కోసం ఆహారం పాత్రల్లో ఉంచి వెళ్తారు. కరోనా సమయంలో ఆశ్రమం అన్నార్తుల ఆకలి తీర్చింది.

## హోరాహోరీ

వినుకొండ, న్యూస్‌టుడే: అంతర్ జిల్లాల అండర్-19 కబడ్డీ పోటీలు రెండోరోజు ఆదివారం లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సాగాయి. వివిధ జిల్లాల బాల, బాలికల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహించారు. గ్యాలరీల నుంచి ప్రేక్షకులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు పోటీలను తిలకించారు. పోటీల రాష్ట్ర పరిశీలకురాలు అజిరాబేగం, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, పోటీల కో-ఆర్డినేటర్ చిరంజీవి, వీరాంజనేయులు, బాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ప్రభుత్వ ప్రోత్సాహం.. ప్రగతికి ఊతం

## పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులు

నరసరావుపేట, న్యూస్‌టుడే

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. జిల్లాలోనూ పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలకు రూపకల్పన చేసింది. గతంలో పరిశ్రమ పెట్టాలంటే 12 వరకు ప్రభుత్వ శాఖల అధికారులను కలవాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తెచ్చింది. 2024-29 పాలసీలో భాగంగా త్వరితగతిన పరిశ్రమలకు అనుమతులు ఇస్తోంది.

నడికుడి పార్కులో పరిశ్రమలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు (పాత చిత్రం)

### పరిశ్రమల అధికారులకు కీలక బాధ్యతలు

కొత్త పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు కోరుతూ www.apindustries.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తే పరిశ్రమల శాఖాధికారులు పరిశీలిస్తారు. నోడల్ ఏజెన్సీగా పని చేస్తూ విద్యుత్తు, పంచాయతీ, పురపాలక, అగ్నిమాపక, రెవెన్యూ శాఖలు, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్, భూగర్భ జల విభాగం తదితర అధికారుల్ని సంప్రదిస్తారు. స్థాయినిబట్టి వారం, పక్షం, 21 రోజుల్లో అనుమతులన్నీ వచ్చేలా చూస్తారు.

### రాయితీలు పెరిగాయి

పరిశ్రమలు స్థాపించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మహిళలకు గతంలో 35 శాతం రాయితీ అందించేవారు. ప్రస్తుతం 45 శాతానికి పెంచారు. ఇతరులకు పరిశ్రమల ఆధారంగా వివిధ విభాగాల్లో 25 శాతం వరకు రాయితీ ఇస్తున్నారు. కొవిడ్ సమయంలో ఆగిపోయిన రూ.1.97 కోట్ల బకాయిలను ఇటీవలే 132 పరిశ్రమల ఖాతాకు జమచేశారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

### వీటిపై ఆసక్తి

రైస్ మిల్లులు, ఆటో మొబైల్ పరిశ్రమ ఏర్పాటు, బ్రిక్స్, కాగితపు కప్పులు, ప్లేట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, స్టీల్ వస్తువుల తయారీ, పీవీసీ పైపుల ఉత్పత్తి, ఆహారశుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ, పాలు, బేకరీ ఉత్పత్తులు, ప్రింటింగ్, రబ్బర్, ఇంజినీరింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారని పరిశ్రమలశాఖ అధికారులు తెలిపారు.

### పారిశ్రామికవాడల్లో స్థలాలు

జిల్లాలోని గుండ్లపల్లి, నడికుడి, బొల్లాపల్లి, రాయవరంలో నూతన పారిశ్రామికవాడలు ఏర్పాటవుతున్నాయి. వాటిలో ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు)ల ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తారు. ప్రాజెక్టు నివేదిక, అనుమతిపత్రాలు సమర్పిస్తే పరిశీలించి ప్రోత్సహిస్తారు. జిల్లాలో గత ఏడాదిలో ఎంఎస్ఎంఈలకు వేలాది దరఖాస్తులు రాగా.. 4 వేల వరకు పరిశీలనలో ఉన్నాయి.

## జనసంద్రం

సూర్యలంక సముద్రతీరం సందర్శకులు, భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. స్థానిక అటవీ శాఖ తోటల్లో కార్తిక వన సమారాధనలు భారీఎత్తున నిర్వహించారు. భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి సైకత శివలింగాలకు పూజలు చేశారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా మెరైన్, బాపట్ల గ్రామీణ పోలీసులు డ్రోన్లతో పటిష్ఠ నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు పడవల్లో తిరుగుతూ పహారా కాశారు. – న్యూస్‌టుడే, బాపట్ల

## బాపట్ల పీతల రుచి అదుర్స్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని కర్లపాలెం, నిజాంపట్నం, రేపల్లె తీర ప్రాంతాల్లో లభించే సముద్ర పీతలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. వీటి రుచే వేరని ఆహార ప్రియులు చెబుతుంటారు. పచ్చ పీతలను విదేశాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. పెద్ద పీత బరువు 750 గ్రాముల నుంచి కిలోకు పైనే ఉంటుంది. తీరంలో ప్రత్యేకంగా పీతల వేట సాగిస్తున్నారు. జిల్లా నుంచి చైనా, తైవాన్, థాయ్‌లాండ్, వియత్నాం, చైనా, కాంబోడియా, సింగపూర్, యూఏఈ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. స్థానిక మార్కెట్లో కిలో పెద్ద పీతల ధర రూ.800 ఉంటుంది. విదేశాలకు పంపించే పచ్చ పీతల కిలో ధర రూ.1800 పలుకుతుంది. చెరువుల్లోనూ పీతల సాగు చేపడుతున్నారు. సాగుదారులు తమిళనాడు, పుదుచ్చేరి నుంచి పిల్లలను తెస్తున్నారు. ప్రస్తుతం 200 ఎకరాల్లో సాగు జరుగుతోంది.

బాపట్ల మండలం ఆదర్శనగర్లో మత్స్యకార మహిళలు ఘుమఘుమలాడే పీతల కూర, ఫ్రై వండి పర్యాటకులకు వడ్డిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ నుంచి వస్తున్న పర్యాటకులు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి పీతల కూర తిని రుచిని ఆస్వాదిస్తున్నారు.

## ఈ-నారీ.. ఆర్థికాభివృద్ధికి దారి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు వ్యవస్థల్లో మార్పులు చేపట్టింది. మహిళా స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించింది. అందుకు పలు పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ-నారీ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఇది గ్రామాల్లోని యువతులకు జీవనోపాధి కల్పనకు దోహదపడుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో వెలుగు సిబ్బంది సంఘాల సభ్యురాళ్లతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ-నారీల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఎంపికైన మహిళలకు బ్యాంకింగ్, రికార్డుల నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం వంటివి చేపట్టాల్సి ఉంటుంది.

గ్రామాల్లో వెలుగు గ్రూపులను ఇప్పటి వరకు సీఏలు పర్యవేక్షించేవారు. ఇకపై ఈ-నారీగా ఒకరిని ఎంపిక చేసి వీరికి బాధ్యతలు అప్పగిస్తారు. పది సంఘాలకు ఒక మహిళను ఎంపిక చేసి, వారికి గౌరవ వేతనం ఇవ్వనున్నారు. ఎంపికైన మహిళ తమ పరిధిలోని పది సంఘాల బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. సభ్యురాళ్లు పొదుపు చేసేలా, రుణాలు సకాలంలో చెల్లించడం, సంఘాల రికార్డులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేస్తారు. ఈ-నారీగా ఎంపిక కావాలంటే కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

**జిల్లాలో**
- మండలాలు : 28
- మండల సమాఖ్యలు : 28
- గ్రామ సంఘాలు : 1056
- మహిళా సంఘాలు : 36,620
- సభ్యులు : 3,66,215 మంది
- ఈ-నారీ లక్ష్యం : 3,625 మంది

**సమర్థ నిర్వహణకే..**

'వెలుగు సంఘాలను సమర్థంగా నిర్వహించడానికే ఈ-నారీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి దోహదపడుతుంది' అని డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు.

## విత్తన మొక్కజొన్న @ పల్నాడు

ఈనాడు – అమరావతి

జిల్లాలో విత్తన మొక్కజొన్న సాగు క్రమంగా విస్తరిస్తోంది. వెల్దుర్తి, మాచర్ల, కారంపూడి, దుర్గి, బొల్లాపల్లి, గురజాల మండలాల రైతులు గత రెండేళ్ల నుంచి సేద్యంపై మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం రబీ సీజన్లో ఇప్పటికే విత్తనాలు నాటారు. ప్రైవేటు విత్తన కంపెనీలు పంటను కొనుగోలు చేసే ఒప్పందంలో భాగంగా అన్నదాతలు సాగు చేస్తున్నారు. క్వింటాలు మొక్కజొన్న విత్తనాలకు రూ.4500 వరకు ధర ఇస్తున్నారు. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. సాధారణం కంటే విత్తన మొక్కజొన్న లాభసాటిగా ఉండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

### వాతావరణం, నేలల అనుకూలం

ఖరీఫ్ సీజన్లో నాగార్జునసాగర్ జలాశయం నుంచి సకాలంలో సాగునీరు అందక వరి సాగుకు సమయం ముగుస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు మొదలుపెట్టారు. మంచి దిగుబడులు రావడంతోపాటు నాణ్యత బాగుండటంతో విత్తన కంపెనీల దృష్టి పడింది. వాతావరణం, నేలలు అనుకూలంగా ఉండటం.. రబీలో సాగు చేసేటప్పుడు నీటి తడులు అందుబాటులో ఉండటంతో విత్తన నాణ్యత ఆశాజనకంగా ఉంటోంది.

### ఏలూరుకు ప్రత్యామ్నాయం

కొంతకాలం కిందటి వరకు మొక్కజొన్న విత్తనోత్పత్తికి ఏలూరు జిల్లా కేంద్రంగా ఉండేది. జిల్లాలోని ఉత్తర ప్రాంతం అనుకూలంగా ఉండటంతో చాలా ఏళ్లపాటు ప్రైవేటు విత్తన కంపెనీలు అక్కడ సంకర మొక్కజొన్న విత్తనాల్ని ఉత్పత్తి చేశాయి. కొంతకాలంగా అక్కడ విత్తన మొక్కజొన్న సాగు విస్తీర్ణం తగ్గుతుండగా.. పల్నాడులో పెరుగుతోంది.

# శత శాతం ఉత్తీర్ణతకు సంకల్పం

నరసరావుపేట, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

## జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా సంకల్ప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. అన్ని కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వంద రోజుల కార్యాచరణను పక్కాగా అమలు చేస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసిన అధ్యాపకులు రోజూ సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత గంటసేపు విద్యార్థులకు పునశ్చరణ, సందేహాల నివృత్తి, మంచి మార్కులు సాధించడానికి ఎలా చదవాలో అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ ఎందులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రగతి సాధించేలా వెన్నుతడుతున్నారు.

❖ ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విద్యార్థుల్ని విభజించి సీ, డీ గ్రేడ్‌లో ఉన్నవారిపై దృష్టి సారిస్తున్నారు.

పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు

❖ సంకల్ప్‌తో గతేడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాలు మెరుగయ్యాయి. ఈ సంవత్సరం శత శాతం ఉత్తీర్ణత సాధనపై జిల్లాలోని తొమ్మిది కళాశాలలు దృష్టి సారించాయి. 24 కేజీబీవీలు, 14 ఏపీ ఆదర్శ జూనియర్ కళాశాలల్లోనూ కార్యాచరణ అమలు చేస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సూచనలు చేస్తున్నారు. సంకల్ప్‌తో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు ఇంటర్ బోర్డు జిల్లా పర్యవేక్షకాధికారి నీలావతిదేవి తెలిపారు.

**జిల్లాలో జూనియర్ కళాశాలలు**
- మొత్తం: 132
- ప్రభుత్వ : 09
- విద్యార్థుల సంఖ్య: 33 వేలమంది

## ఐఎన్ఐ సెట్‌లో యువ వైద్యుల ప్రతిభ

సాయి త్రిష

శంకర్

గురజాల, నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎయిమ్స్ మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐఎన్ఐ సెట్‌లో జిల్లాకు చెందిన యువ వైద్యులు రాణించారు. గురజాలకు చెందిన సాయిత్రిష రెడ్డి 7వ ర్యాంకు, నరసరావుపేటకు చెందిన ఈదర శంకర్ 60వ ర్యాంకు సాధించారు. సాయిత్రిష రెడ్డి యూజీ ప్రవేశ పరీక్షలో 14వ ర్యాంకు సాధించి ఎయిమ్స్ దిల్లీలో విద్యనభ్యసించారు. ఈదర శంకర్ 2019లో నీట్(యూజీ)లో 149వ ర్యాంకు సాధించి బెంగళూరు కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు.


**అమ్మకమునకు స్థలము**

బాపట్ల జిల్లా, చిన్నగంజాం మండల రెవిన్యూ ఆఫీస్ సమీపంలో 1.27 (ఒక ఎకరం ఇరవై ఏడు సెంట్లు) గల స్థలం తూర్పు ముఖంగా 180 అడుగుల వెడల్పుతోనూ పాత జాతీయ రహదారిని ఆనుకుని ఒంగోలు - చీరాల రోడ్డు ప్రక్కన నాలుగు పక్కల ప్రహరి గోడతో మరియు 30 అడుగుల పక్కా రోడ్డుతో రెవెన్యూ వారిచే నాన్ అగ్రికల్చరల్ భూమిగా మార్పు చేయబడి ఉన్న స్థలము అమ్మకమునకు కలదు. విద్యా సంస్థలకు మరియు షోరూములకు కావలసిన వారు సంప్రదించగలరు.

98663 96135
98484 90931

## చార్మినార్ పోలిక.. చెక్కు చెదరక..

రాజులు కాలం చేసినా నాడు వారు నిర్మించిన కట్టడాలు నేటికీ చెక్కు చెదరలేదు. అటువంటి వాటిల్లో వినుకొండలోని జామియా మసీదు (పెద్ద మసీదు) ఒకటి. 1685-86లో కుతుబ్‌షాల కాలంలో వినుకొండ ప్రాంత దళవాయి(సైన్యాధిపతి)గా పనిచేసిన అల్లీరజాఖాన్ ఈ మసీదును నిర్మించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతి పెద్దదిగా దీనికి గుర్తింపు ఉంది. హైదరాబాద్‌లోని చార్మినార్‌ను పోలినట్లు ముందు, వెనుక ఎత్తైన మినార్లు మసీదుకు ప్రత్యేక ఆకర్షణ. సున్నం, గచ్చురాయితో నిర్మించారు. చిన్న చిన్న మరమ్మతులు ఉన్నా అసలు నిర్మాణం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. మసీదు నిర్వహణకు ముస్లిం రాజులు 150 ఎకరాలు భూమి ఇచ్చారు. అందులో కొంత భాగం ఆక్రమణలకు గురికాగా మిగిలిన దానికి కంచె వేసి రక్షణ కల్పిస్తున్నారు. మసీదులో నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు. – న్యూస్‌టుడే, వినుకొండ

## అభివృద్ధి పనుల తనిఖీ

వినుకొండ, న్యూస్‌టుడే: గుంటూరు- నంద్యాల రైలు మార్గంలోని పలు స్టేషన్లలో అభివృద్ధి పనులను డీఆర్ఎం సుధేష్ణసేన్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ప్రత్యేక రైల్లో వచ్చిన ఆమె వినుకొండ స్టేషన్లో చేపట్టిన పనులు పరిశీలించారు. ముందున్న ఖాళీ స్థలం అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. దివ్యాంగులకు అవసరమైన వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. తొలుత ప్రకాశం జిల్లా కంభం, తర్లుపాడు, గజ్జలకొండ, దొనకొండ, పొట్లపాడు, కురిచేడు, నుదురుపాడు స్టేషన్లను ఆమె పరిశీలించారని అధికారులు తెలిపారు. డీఆర్ఎం వెంట ఏడీఆర్ఎం (గతిశక్తి) సైమన్, ఏడీఆర్ఎం శ్రీనివాస్, అధికారులున్నారు.

అధికారులతో చర్చిస్తున్న డీఆర్ఎం సుధేష్ణసేన్

## ఇప్పటికింతే.. నిధులొచ్చాక మిగతాది

అంచనాలు రూపొందించడంలో తప్పు జరిగిందో లేక.. నిధుల వినియోగంలో తేడా జరిగిందో తెలియదు కానీ సీసీ రోడ్డు పూర్తిగా నిర్మించలేదు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని శ్మశాన వాటిక వెళ్లడానికి ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలతో 600 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఊరి నుంచి కాకుండా శ్మశానవాటిక నుంచి పనులు మొదలు పెట్టారు. వంద మీటర్ల దారి నిర్మాణం ఆగిపోయింది. నిధులు అక్కడివరకే సరిపోయాయని, మళ్లీ డబ్బులొచ్చాక మిగతా భాగం పూర్తిచేస్తామని పంచాయతీ కార్యదర్శి నాని బదులిచ్చారు. – ఈనాడు డిజిటల్, నరసరావుపేట

## అగ్నిపథ్‌పై అవగాహన సదస్సు 18న

గుంటూరు, న్యూస్‌టుడే: అగ్నిపథ్‌పై ఈ నెల 18న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సదస్సు జరుగుతుందన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నిపథ్ నియామకాలకు సంబంధించిన వివరాలు తెలపనున్నట్లు 12వ ఎయిర్‌మెన్ సెలెక్షన్ కేంద్రం వింగ్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ షేక్ యాకుబ్ అలీ తెలిపారు.

## సాగర్ నీటిమట్టం 586.40 అడుగులు

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం రాత్రి 8 గంటలకు 586.40 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 14,274 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రధాన జల విద్యుత్తు కేంద్రానికి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541


# సహకారం.. స్వాహాకార్యం

నరసరావుపేట, న్యూస్‌టుడే

## ప్రజాధనం లూటీలో ఉద్యోగులు, నాయకుల పోటాపోటీ

ప్రజాధనం స్వాహాలో ఉద్యోగులు, నాయకులు పోటీపడ్డారు. బినామీ సంఘాల్ని సృష్టించి ఉద్యోగులు సహకార రుణాల్ని పక్కదారి పట్టిస్తే.. సెంటు భూమిలేని వైకాపా నాయకులు, కార్యకర్తలు తప్పుడు పత్రాలు సృష్టించి భూస్వాముల్లా మారి నిధులు జేబుల్లో వేసుకున్నారు. డీసీసీబీల పరిధిలో గత అయిదేళ్లలో జరిగిన లావాదేవీలు, అక్రమాల వివరాల్ని సభా సంఘం ఎదుట పెట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశించడంతో అక్రమాల గుట్టు రట్టు చేస్తున్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లు, జగనన్న పాలవెల్లువ, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, ఫిష్ ఆంధ్రా పేరుతో కొందరు వైకాపా నేతలు సహకార బ్యాంకుల నుంచి ఇష్టారాజ్యంగా రుణాలు తీసుకున్నారు. ఆ సొమ్ముతో యూనిట్లు ఏర్పాటుచేశారా అని పరిశీలిస్తే అవేమీ కనిపించట్లేదు. ఏ పథకాల కింద ఎంత రుణమిచ్చారు.. లబ్ధిదారులెవరు.. బ్యాంకు గ్యారంటీ వివరాలేంటి.. అనేవి సభా సంఘం నిశితంగా పరిశీలిస్తుంది.

### వెలుగులోకి వస్తున్న అక్రమాలు

జిల్లాలో 60 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) ఉన్నాయి. వీటితోపాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో రుణాల దుర్వినియోగం ఒక్కొక్కటిగా బయటపడుతోంది.

❖ జొన్నలగడ్డ పీఏసీఎస్‌లో రూ.2 కోట్ల అవకతవకలు జరిగినట్లు విచారణ అధికారులు నిర్ధారించారు. ఇక్కడ మాజీ కార్యదర్శితోపాటు సొసైటీ గుమస్తా ఒకరు నిధులు మింగడంలో కీలక పాత్ర పోషించారు. వారికి బ్యాంకు అధికారులు సహకరించారు. ఆడిటింగ్ చేసిన కొందరు ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించలేదని గుర్తించి వారిపై కూడా చర్యలకు సిఫార్సు చేస్తూ నివేదిక సిద్ధం చేశారు.

❖ వినుకొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.1.02 కోట్లు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలింది. ఇక్కడ బినామీ సంఘాల పేరిట ప్రజాధనం దారిమళ్లించడంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కీలకంగా వ్యవహరించారు. మరో 10 మంది భాగస్వాములైనట్లు గుర్తించారు.

❖ గురజాలలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.6 కోట్ల రుణాలు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలపై విచారణ సాగుతోంది. భూములు లేకపోయినా ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, దొంగ పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించి వైకాపా మద్దతుదారులు రుణాలు తీసుకున్నారు. వారికి పీఏసీఎస్, బ్యాంకు ఉద్యోగులు సహకరించారు. ఉద్యోగులతోపాటు అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు, ఉద్యోగుల్ని కూడా విచారిస్తున్నారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీల్లో రుణాల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చేసి నివేదికలు సభా సంఘానికి అందజేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి నాగరాజు తెలిపారు.


(c) eenadu

## ఘనంగా కమ్మజన కార్తిక వనసమారాధన

కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా, మన్నవ మోహనకృష్ణ, దరువూరి నాగేశ్వరరావు తదితరులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అమరావతి మేజర్ కాల్వ వద్ద ఉన్న ఎన్టీఆర్ ఎస్టేట్‌లో నియోజకవర్గ కమ్మజన కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, చైతన్యం నింపే ప్రదర్శనలు, ముఖ్య నాయకుల ప్రసంగాలు స్ఫూర్తి నింపాయి. ఎన్టీఆర్ ప్రతిమకు పూలమాలలువేసి నివాళి అర్పించారు. కాకతీయ సేవా సమితి 2026 సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. వివిధరంగాల్లో సేవలందించిన వారిని సత్కరించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, డీవీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, తెదేపా నియోజకవర్గ నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, ఏపీ ఎస్ ఆకాడమి డైరెక్టర్ బాలుకు, మార్కెట్ యార్డు ఛైర్మన్ శోభారాణి, సాంబయ్య, శ్రీనివాసరావు, నలపతి, పవన్‌కుమార్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## కరదీపిక.. బోధన సులువిక..!

బెల్లంకొండ, పెదకూరపాడు, న్యూస్‌టుడే

విద్యా రంగం ప్రక్షాళనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. బడుల్లో చేపడుతున్న మార్పులు విద్యాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కూటమి ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు తీసుకొస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల టీచర్లకు తొలిసారిగా ఉపాధ్యాయుల కరదీపిక(హ్యాండ్ బుక్) పేరుతో పుస్తకాలు అందిస్తోంది. తొలిసారిగా ఉపాధ్యాయులకు అందించిన కరదీపిక ఇప్పుడు చదువుల ప్రగతికి ఉపకరిస్తోంది. బడుల్లో ఇప్పటి వరకు సొంతంగా తయారుచేసుకున్న నోట్ పుస్తకం ఆధారంగా పాఠాలు బోధిస్తూ వచ్చారు. కొందరు వీటికి బదులు పాఠ్య ప్రణాళిక ఆధారంగా డైరీల్లో అన్నింటినీ రాసుకొని ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు ఈ విధానంలో సమూల మార్పునకు నాంది పలికారు. ప్రత్యేక తరహాలో శాస్త్రీయంగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికలు అందుబాటులోకి వచ్చాయి.

**రోజుకో పాఠమే**

కరదీపికలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బడుల్లో ఒకరోజు ఒకే పాఠం బోధన కొనసాగిస్తున్నారు. ప్రతి తరగతికి బోధన సమయం, ఉపయోగించిన టీఎల్ఎం, అభ్యసన విధానం, రిమార్కులను ఇందులో ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అకడమిక్ క్యాలెండర్‌లోని పనిదినాలతో దీనిని అనుసంధానం చేశారు. ఏ రోజు ఏఏ సబ్జెక్టులు, అంశాలు ఎలా చెప్పాలో వీటిల్లో తేదీలతో సహా వివరించారు. విద్యా పురోగతికి ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

ఉపాధ్యాయులకు కరదీపిక పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

**పక్కా ప్రణాళికతో..**

కరదీపికలు ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉన్నాయి. బోధన మరింత మెరుగుపడుతోంది. పక్కా ప్రణాళికతో వీటిలో నిర్దేశించిన భాగాలుగా పాఠాలు చెప్పడం చాలా తేలికగా ఉంది. పిల్లలకు ఇవి సరిగ్గా అర్థం కాకుంటే మళ్లీ పునశ్చరణకు ఉపకరిస్తున్నాయి. విద్యార్థులు ఎంత వరకు నేర్చుకుంటున్నారన్నది స్పష్టం కావటంతో వారిని ఏఏ అంశాల్లో తీర్చిదిద్దాలన్నది తెలుస్తోంది.

– శివనాగేశ్వరరావు, హెచ్‌ఎమ్, గారపాడు జడ్పీ ఉన్నత పాఠశాల

**పల్నాడు జిల్లాలో ఇలా...**

- 1188 ప్రాథమిక పాఠశాలలు
- 53 ప్రాథమికోన్నత పాఠశాలలు
- 280 ఉన్నత పాఠశాలలు
- 1.40 లక్షలు విద్యార్థులు
- 6323 ఉపాధ్యాయులు

**ఉపయోగకరం..**

ఉపాధ్యాయులకు కరదీపిక ఉపయోగకరంగా ఉంది. పెద్దది, చిన్నది అని కాకుండా పాఠాన్ని ఎన్నిభాగాలుగా చెప్పాలో ఉండటంతో బోధన పారదర్శకంగా సాగుతుంది. అకడమిక్ క్యాలెండర్‌లోని పనిదినాలతో దీనిని అనుసంధానం చేయడంతో ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉంది. పిల్లలకు బోధించడానికి కూడా తేలికైంది.

– నార్ని శాంతి, హెచ్‌ఎం, బెల్లంకొండ జడ్పీ ఉన్నతపాఠశాల

## స్థానికులే యాచకులై.. భక్తులకు యాతనై..!

అమరావతి, న్యూస్‌టుడే: పంచరామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులను యాచకులు చికాకు పెడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి స్వామిని దర్శనం చేసుకొన్న కొంత సేపటికే భక్తుల ప్రశాంతతను పోగొడుతున్నారు. పదుల సంఖ్యలో గుంపుగా ఆలయ పరిసరాల్లో ఉన్న యాచకులు భక్తుల వెంట పడుతుండటంతో తప్పించుకోవడానికి కొందరు పరుగులు తీయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కార్తిక మాసం సందర్భంగా పంచారామాల దర్శనాల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో యాచకుల సంఖ్య కూడా పెరుగుతోంది. స్థానికులే కొందరు యాచకుల అవతారమెత్తి ఆలయం వద్ద మకాం వేశారు. సుమారు 100 మందికి పైగా అమరేశ్వరాలయ పరిసరాల్లో తిరుగుతూ యాచకులు ఇబ్బంది పెడుతున్నారు. వారిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉంటున్నారు. అధికారులు స్పందించి యాచకులను నియంత్రించాలని భక్తులు కోరుతున్నారు.

## నేడు కబడ్డీ ఫైనల్ పోటీలు

వినుకొండ, న్యూస్‌టుడే: అండర్-19 అంతర్ జిల్లాల బాల బాలికల కబడ్డీ ఫైనల్ పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. సమయం తక్కువ ఉన్నందున ఉదయం 7.30 గంటల నుంచే పోటీలు మొదలవుతాయని పరిశీలకులు అజారాబేగం తెలిపారు. లీగ్ పద్ధతిలో బాలికల జట్టు పోటీలు పూర్తి కావడంతో నాకౌట్‌లో ఆరు జట్టు వివరాలను ఆర్గనైజ్ చీఫ్ పి.కృష్ణమూర్తి ఆదివారం ప్రకటించారు. పూల్ ఏలో నెల్లూరు, విశాఖపట్నం పూల్ బీలో అనంతపురం, ప్రకాశం పూల్ సీలో శ్రీకాకుళం, కృష్ణా, పూల్ డీలో విజయనగరం, గుంటూరు జట్టు తలపడుతున్నాయి. బాలుర జట్టు లీగ్ పోటీలతో పాటు నాకౌట్ ఫైనల్ అన్నింటిని పూర్తి చేస్తామని చెప్పారు. ఆటలో చిత్తూరు, పశ్చిమగోదావరి జట్టుకు చెందిన ఇద్దరు బాలికలు గాయపడటంతో ఆసుపత్రి చేర్చి చికిత్స చేయించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, డీసీ ఛైర్మన్ గంగినేని రాఘవరావు వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

## అందరికీ సమానంగా రాజ్యాంగ ఫలాలు

మాట్లాడుతున్న సంఘ నాయకులు

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: మాల సంఘీయులు ఆత్మీయ సమ్మేళనం స్థానిక జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్ పాల్గొని ప్రసంగించారు. మాలలు ఆర్థికంగా ఎదగాలన్నారు. అందుకు దోహదపడే పలు అంశాలపై చర్చించారు. అంబేడ్కర్ గొప్ప విద్యావేత్త, మహామేధావి, న్యాయవాది, సంఘ సంస్కర్త అని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగ ఫలాలు ప్రతిఒక్కరికీ అందాలని ప్రపంచంలోనే అత్యుత్తమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారన్నారు. మాలలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, అన్ని రంగాల్లో ప్రావీణ్యం చాటాలన్నారు. విజయపురిసౌత్ విచ్చేసిన యశ్వంత్ అంబేడ్కర్‌కు మాల సంఘం కమిటీ సభ్యులు ఘనంగా పూలమాలలు, దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ మాల కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు, విశ్రాంత ఉద్యోగులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పల్నాడు తిరునాళ్లకు ముమ్మర ఏర్పాట్లు

కారంపూడి, న్యూస్‌టుడే: పల్నాటి వీరుల తిరునాళ్లకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న తిరునాళ్లకు వచ్చే భక్తులను అలరించేందుకు వీర్ల దేవాలయ ప్రాంగణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే పనులు చేపట్టారు. నాగులేరు వాగును శుభ్రం చేసిన సిబ్బంది స్నానపుఘాట్ వద్ద లోతైన ప్రాంతాల్లోకి భక్తులు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. మహిళల కోసం పరదాలతో కూడిన జల్లు స్నానపు గదులు నిర్మించారు. మరోపక్క మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. దుకాణాల ఏర్పాటు చేసుకునేందుకు మార్కింగ్‌లు ఇచ్చారు. విద్యుత్తు అధికారులు ప్రాంగణంలో నూతన నియంత్రిక ఏర్పాటుచేసి నిరంతరాయం సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా పోలీసులు సీసీ కెమెరాలను అమరుస్తున్నారు.

వీర్ల దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్

## త్వరితగతిన కాలువల మరమ్మతులు

దెబ్బతిన్న కాలువలను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

నూజెండ్ల, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావానికి దెబ్బతిన్న కాలువలను బాగు చేయిస్తామని ఎన్నెస్పీ ఈఈ శ్రీనివాసరావు అన్నారు. జమ్మలమడక, వేముల మేజర్లను ఆయన పరిశీలించారు. వెంటనే నిధులు విడుదలకు కృషి చేస్తామని తెలిపారు. డీఈ వెంకటనారాయణ, డీసీ ఛైర్మన్ నక్కా బుల్లెయ్యచౌదరి, ఏఈ ప్రసన్నకుమార్, నీటి సంఘం అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

## తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా రామోజీరావు

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే: చరిత్ర ఉన్నంత వరకు తెలుగు ప్రజల హృదయాల్లో రామోజీరావు చిరస్థాయిగా నిలిచిపోతారని పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి నివాసంలో ఆదివారం రామోజీరావు జయంతిని కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి పుల్లారావు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ తెలుగుజాతి ఆణిముత్యం రామోజీరావు అని, స్వయంకృషి, పట్టుదలతో ఎదిగిన వ్యక్తిత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. రామోజీరావు జయంతిని మాజీ ఉపరాష్ట్రపతి, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితర ప్రముఖులు తమ వేదికల మీదుగా రామోజీ ఎక్సలెన్సీ అవార్డులు అందించడం తెలుగుజాతి గర్వించదగ్గ విషయమన్నారు.

## పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రమేష్

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పీఆర్‌ఓ జిల్లా జనరల్ సెక్రటరీ శేషప్పయ్య వ్యవహరించారు. అధ్యక్షుడిగా వై.వి రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.వసుంధరను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శేషప్పయ్య ప్రకటించారు. వారికి కార్యాలయం అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

## అటవీ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చల్లగరిగలో అటవీభూముల దురాక్రమణపై గ్రామ తెదేపా నేతలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. అచ్చంపేట మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన సపావత్ మారోణీబాయి, సపావత్ రవీంద్రబాయిలకు 5ఎకరాలు అటవీభూమిని వైకాపా హయాంలో పట్టాలు పొందారని పేర్కొన్నారు. 2005కు ముందే అటవీభూమిలో సాగులో లేకుండానే ఉన్నట్లుగా నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు పొందారని ఆరోపించారు. రవీంద్రబాయిని వివాహం కాకుండానే అయినట్లు పట్టా పొందారన్నారు. విచారణ జరిపి ఆ పట్టాలు రద్దుచేయాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ రాశారని నేతలు తెలిపారు.

## పెట్టుబడిదారుల విశ్వాసానికి నిదర్శనంగా సీఐఐ సదస్సు

మాట్లాడుతున్న కొమ్మాలపాటి

నరసరావుపేట అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంలో సీఐఐ సదస్సు విజయవంతమైందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న బాధ్యత తీసుకుని సీఎం చంద్రబాబు, రాష్ట్రమంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, మద్దినేని నరసింహారావు పాల్గొన్నారు.

## కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను అందుబాటులోకి తెచ్చిందని, వినియోగించుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. పరిష్కార నిమిత్తం కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి అర్జీ పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గతంలో అర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## భక్తులతో కిటకిటలాడిన అమ్మసన్నిధి

అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాట ప్రసిద్ధి చెందిన శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధి ఆదివారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి తెలుగురాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శనివారం రాత్రినుంచే అమ్మవారి సన్నిధికి తరలి వచ్చారు. అమ్మవారి కైంకర్యాలైన బిందెతీర్థం, అభిషేకాలు, నక్షత్రహారతి, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు తిలకించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో, ఏసీ ఆదిశేష నాయుడు సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

## రొట్టెలు, బిస్కట్ల విక్రయాలే జీవనోపాధి

కొమెరపూడి(సత్తెనపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో రొట్టెలు, బిస్కట్ల తయారీదారులు సుమారు 100 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. జనాభాలో 25శాతం ఉన్న ఒక సామాజిక వర్గానికి చెందిన నాలుగు కుటుంబాలు ఇక్కడ ఏర్పాటు చేసిన కుటీర పరిశ్రమల్లో వాటిని తయారు చేస్తున్నారు. వారి వద్ద సరుకును 70 మంది స్థానికులు టోకుగా కొనుగోలు చేస్తున్నారు. వారితోపాటు సిరంగిపాలెం, కొర్రపాడు, కనపర్తి తదితర గ్రామాలకు చెందిన మరో 30 మంది చిరు వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. వారంతా ఒంగోలు, తెనాలి, గుంటూరు, తాటికొండ, మాచర్ల, పిడుగురాళ్ల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లి విక్రయించి ఉపాధి పొందుతున్నారు. వ్యవసాయ కూలి పనులు లేని రోజుల్లో సరుకు కొనుగోలు చేసి 150 మంది గ్రామస్థులు వేరే ప్రాంతాల్లో అమ్ముతూ కుటుంబాలు పోషించుకుంటున్నారు. పనులు లేని రోజుల్లో ఈ వ్యాపారమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

రొట్టెలు తయారీలో మహాబూబ్‌సుభాని


EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

PEOPLE CARE

OLD AGE HOME

గాయిత్రి గ్రూపు, VJA వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 97040 21122, 96038 42233.

REAL ESTATE

GENERAL

గుంటూరు-సత్తెనపల్లి హైవే, కొత్త 4 లైన్ల ORR ఆనుకొని, నలంద కాలేజి ఎదురు, గేటెడ్ కమ్యూనిటీలో ఇళ్ళ ప్లాట్లు కలవు. 96447 77888, 7036722521.

TO LET

Commercial Space for Rent 2500 sft Opp: ASN college, Tenali. Cont no: 63026 41154.

3BHK Independent House with veranda for Rent in Guntur (Opp Green Lawn School, Ponnur Road) Contact: 94903 77220.

COMMERCIAL

గుంటూరు, అరండల్‌పేట, 11/1వ లైను D.No:6-11-39, 1st Floor Backside Office/ Residence అద్దెకు కలదు. Ph.No: 93983 26564, 73828 92714.

JOBS

Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 year experience in tally. Cont: 91333 99257.

Wanted MBA Marketing/ Business Development/ Supply Chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257.

Wanted Shop Keepers Salary 10,000/- Shift: 8Hrs Etukuru Rd & Nalla Cheruvu Raithanna Milk Dairy, Guntur 82475 95344.

గుంటూరులోని శానిటరీ షాపులో కంప్యూటర్ బిల్స్‌చేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M) కావలెను. వ|| 30సం||లోపు, జీ||12K-15K. ✆ 9493656892.

DSA ఏజెన్సీ గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగల వారు కావలెను. జీతము: (15Kto20K), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతము: 20K సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 8919080894, 8309132382.

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు సౌత్ ఇండియన్ ఆల్‌రౌండర్ మాస్టర్స్, వంటమాస్టర్స్, తందూరి అసిస్టెంట్స్, కటర్స్, రెస్టారెంట్ కెప్టెన్స్, చైనీస్ & ఇండియన్ అసిస్టెంట్స్, పార్సిల్ కౌంటర్ సిబ్బంది కావలెను. అనుభవమును బట్టి మంచి జీతం ఇవ్వబడును. 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

మహానాడు మీడియా, గుంటూరు నందు పనిచేయుటకు 'వీడియో ఎడిటింగ్' లో అనుభవం ఉన్న వారు కావలెను. సంప్రదించండి. Ph: 73372 22004.

గుంటూరు నారాకోడూరు ప్రముఖ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్స్ 8 గ. పది వేలు సె. సూపర్‌వైజర్స్ 8 గ. 13 వేలు, ప్రముఖ బట్టలషాపులో సెక్యూరిటీగా 12 గ. 12 వేలు వయస్సు 50 Y. లోపు, 10th. ✆: 85209 77729, 85209 77759.

గుంటూరులోని ప్రముఖ లిఫ్ట్ కంపెనీ నందు పనిచేయుటకు M(21) ఎంప్లాయిస్ కావలెను. ✆: 99083 10004.

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. జీతం: 10,000 నుండి 15000+ ఇన్‌సెంటివ్స్. ✆: 83282 68208, 70138 73164.

టెలీకాలింగ్ ఫ్రమ్ హోమ్, ఆఫీసు వర్క్ చేయుటకు M/F కావలెను. Age: 18 to 35, జీతం: 18K to 25K. ✆ 84640 16870, 86394 39870.

FACULTY/ TEACHERS

అనంతపురం టౌన్ రఘుసైనిక్ స్కూల్ నందు High School English & Spoken English అనుభవం కల్గిన టీచర్స్‌కావలెను. ✆ 79810 45257.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541


## ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం బహూకరణ

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యూటీ (కట్టుబడివారిపాలెం) గ్రామానికి చెందిన దాత డేరంగుల వెంకటేశ్వర్లు-అంజమ్మ దంపతులు, కుమారుడు రామాంజనేయులు, చిరంజీవి, మనవడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో వెండి కిరీటాన్ని స్వామి వారికి బహూకరించారు. 1.480 కిలోల బరువు గల ఈ కిరీటం ఖరీదు రూ.2.80 లక్షలుగా ఉంది. కిరీటంతో పాటు రసీదును పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్‌కు అందించారు. గతంలో గుడి ఎదుట దుకాణ సముదాయంలో రెండు గదుల నిర్మాణంతో పాటు జనరేటరు అందజేసినట్లు దాత వెల్లడించారు. ఆమేరకు దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, అర్చకులు వేదాశీర్వచనం అందించారు. మొక్కులో భాగంగా కిరీటం తయారు చేయించినట్లు దాత వెల్లడించారు. పాలకమండలి సభ్యులు బత్తుల చంద్రశేఖర్, ప్రధానాచర్చకులు కోట లక్ష్మీనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి ఛైర్మన్‌కు కిరీటం అందిస్తున్న దాత కుటుంబికులు

## కార్తిక సమారాధనలో సందడే సందడి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ సామాజిక వర్గాల వారు వివిధ ప్రాంతాల్లో కార్తిక వనసమారాధన కార్యక్రమాలను నిర్వహించటంతో ఆదివారం సందడి నెలకొంది. కాకతీయ సేవా సంఘం, యాదవ సేవాసంఘం దేవరంపాడు వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో, కొండమోడు కోదండరామ స్వామి ఆలయంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సంఘం, కొండమోడు ముచికుంద ఆశ్రమంలో పట్టణ ఆర్యవైశ్యుల సంఘీయులు కార్తీక వనభోజనాల కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణ వాసులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో పాల్గొన్నారు.

హాజరైన మహిళలు, చిన్నారులు

**బ్రాయిలర్ ధరలు (కిలో |కి రూ.లలో)**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 113, రిటైల్ ధర - 140, చికెన్ విత్‌స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

## 'పాఠశాల విద్యా వ్యవస్థను కుంగదీస్తున్న సంస్కరణలు'

గుంటూరు విద్య: విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు పాఠశాలలను బలోపేతం చేయాలి కానీ.. బలహీన పరచరాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు.

## 30న కాపునాడు స్వర్ణోత్సవ సభ

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: నవంబరు 30న విజయవాడ జింఖానా మైదానంలో జరిగే కాపునాడు స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని జిల్లా కాపునాడు అధ్యక్షుడు పి.వెంకటసత్యనారాయణ కోరారు. ఆదివారం క్రోసూరులో నియోజకవర్గ కాపునాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పార్థసారథి, నారాయణ, ఎన్.రామారావు, నీలం ప్రసాద్ మాట్లాడారు. అనంతరం భాజపా జిల్లాకార్యదర్శిగా నియమితులైన బి.సులోచనను ఘనంగా సత్కరించారు. వివిధ హోదాల్లోని కాపునాడు నాయకులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు

చింతపల్లి(అచ్చంపేట) న్యూస్‌టుడే: పిచ్చికుక్క దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం మండలంలోని చింతపల్లిలో బత్తుల అంజయ్య నాలుగేళ్ల కుమారుడు అఖిలేష్ ఇంటి ముందు ఆడుకొంటుండగా పిచ్చికుక్క ముఖంపై తీవ్రంగా గాయపరచింది. బాలుడికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పిచ్చికుక్కను పట్టుకోవాలని గ్రామస్థులు కోరారు.


91.9FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297


## సంఘటిత పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సంఘటిత పోరాటాలతోనే బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగారావు అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సత్యధ్యాన మందిరంలో ఆదివారం బ్రాహ్మణుల కార్తిక వనసమారాధన నిర్వహించారు. వచ్చే నెల 13న బ్రాహ్మణ యువత కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు కోరారు. సంఘ ప్రముఖులు భృగుబండ మల్లికార్జునరావు, పాటిబండ్ల వెంకటరమణ దంపతులను సత్కరించారు. సంఘ అధ్యక్షుడు విజయరామారావు, నాయకులు పాల్గొన్నారు.


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

నరసరావుపేట
• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

## రహదారికి మరమ్మతులు

**నూజండ్ల, న్యూస్‌టుడే:** యోగిరెడ్డిపాలెం వద్ద దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు ఏఈ అల్లాభక్షు పేర్కొన్నారు. ఈ నెల 6న ఈనాడులో వచ్చిన దెబ్బతిన్న రోడ్లు.. దిగబడుతున్న లారీలు కథనానికి స్పందించిన అధికారులు రోడ్డులో ఉన్న లూజు మట్టి తొలగించి వెట్‌మిక్స్ తోలి రోలింగ్ చేస్తున్నారు. రైల్వే అండర్ పాస్ నుంచి గ్రామం వరకు రోడ్డు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు.

## తెదేపా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియామకం

**నూజండ్ల:** తెదేపా వినుకొండ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నూజండ్ల మండలం దాట్లవారిపాలేనికి చెందిన ఈపెనగండ్ల యోగేశ్వరరావును నియమించారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, వినుకొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ మురళీకృష్ణకు యోగేశ్వరరావు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పంచభూత లింగేశ్వరుడికి పూజలు

**వినుకొండ రూరల్, న్యూస్‌టుడే:** మార్కాపురం రోడ్డులోని డాలర్ సిటీ వద్ద నేడు ప్రతిష్ఠించనున్న పంచభూత లింగేశ్వరుడికి రెండోరోజు పూజలు కొనసాగాయి. పరమ శివుడిని మహా పంచభూత లింగేశ్వరస్వామి రూపంలో ఈనెల 17న సోమవారం ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు యెండ్లూరి సతీష్ దంపతులు తెలిపారు.

## టిడ్కో గృహాలు అద్దెకు ఇవ్వడంపై ఎమ్మెల్యే ఆగ్రహం

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట పట్టణం, చిలకలూరిపేట గ్రామీణ:** ప్రభుత్వం ఇచ్చిన టిడ్కో గృహాల్లో లబ్ధిదారులు లేకుండా అద్దెకు ఇవ్వడమేమిటని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయాన్ని, నిర్మాణంలో ఉన్న గృహాలను మున్సిపల్, పోలీసు, గృహ నిర్మాణశాఖ అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. టిడ్కో గృహాల్లో పేదలు ఉంటారని దుకాణ సముదాయాలు, ప్రభుత్వ భవనాలు, ఇతరత్రా అన్ని హంగులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడం మంచిపద్ధతి కాదన్నారు. మార్చి నాటికి నిజమైన అర్హులు గృహ ప్రవేశాలు చేసేలా చూడాలని అధికారులను కోరారు. పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కరిముల్లా, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, కమిషనర్ శ్రీహరిబాబు, సీఐ రమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. టిడ్కో గృహ సముదాయంలో పార్కింగ్‌కు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకుని వేసిన షెడ్లు తొలగిస్తామని పుర ఛైర్మన్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు చెప్పారు. ✦ చిలకలూరిపేట సీఆర్ కాలనీ వాకర్స్ కాలనీ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన సమారాధనలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొన్నారు.

### అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

అన్న క్యాంటీన్లలో అన్నదానం నిమిత్తం చిలకలూరిపేట పట్టణానికి చెందిన బొగ్గవరపు చెంచుపున్నయ్య రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే పుల్లారావుకు ఆదివారం అందజేశారు. చెంచుపున్నయ్య భార్య రామ తులసమ్మ జ్ఞాపకార్థం నగదు ఇచ్చారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేట పట్టణ శివారు ప్రాంతాలైన కోడెల శివప్రసాదరావు, శ్రీనివాస గిరిజన కాలనీల్లో పగలు విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. **- వెంకటేశ్వర్లు, స్థానికుడు** ✔ సిబ్బందికి చెప్పి వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. **- సురేంద్ర, డీ-2 సెక్షన్ విద్యుత్తు ఏఈ - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)**

? చిలకలూరిపేట పట్టణం రైతుబజారు ఎదురుగా రహదారిపై ఉన్న గుంతకు మరమ్మతులు చేశారు. దాని చుట్టూ ఉన్న మట్టిని మాత్రం తొలగించలేదు. ఇబ్బందిగా ఉంది. **- పరమేశ్వరరావు** ✔ మరమ్మతులు చేసిన ప్రాంతంలో ఉన్న మట్టిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **- అన్సర్, పురపాలక సంఘ ఏఈ – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

## అవకాశాలు అందిపుచ్చుకుంటూ.. ఆటల్లో రాణిస్తూ

### క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే :** గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు ఆ విద్యార్థులు. విద్యతో పాటు క్రీడల్లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జిల్లా, రాష్ట్ర స్థాయి బహుమతులు పొందుతున్నారు. వారే చిలకలూరిపేట ఎంజేపీ పాఠశాలకు చెందిన క్రీడాకారులు.

**జాతీయస్థాయిలో రాణించాలని.. -తిరుపతి ప్రణీ జాకబ్ జోన్స్ 10వ తరగతి**

మాది పల్నాడు జిల్లా సత్తెనపల్లి. చదువుతో పాటు క్రీడలంటే ఇష్టం. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కాకినాడలో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరిగాయి. దీనిలో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించా. డిసెంబరులో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నా. జాతీయ స్థాయిలో జూడో పోటీలలో పతకం సాధించాలన్నదే లక్ష్యం.

**సాధనతో బహుమతులు.. -చొప్పరపు శ్రీమణికంఠ 9వ తరగతి**

ప్రకాశం జిల్లా ముద్దమూరు సుంకరవారిపాలెం మాది. రోజు ఉదయం, సాయంత్రం ఆటలు ఆడుతాను. ఆసక్తిని గమనించిన పీఈటీ హ్యాడ్ బాల్, బాక్సింగ్ పోటీల్లో ఆడేందుకు అవకాశం కల్పించారు. తెనాలిలో ఈ నెల 3 నుంచి 11 వరకు జరిగిన స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించాను. ఈనెల 8 నుంచి 11 వరకు విజయవాడ పటమట జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో త్వరలో రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యా. అక్కడ కూడా ప్రతిభ చాటేందుకు క్రీడను సాధన చేస్తున్నాను.

**బంగారు పతకం సాధిస్తా.. - యక్కల అమూల్య 10వ తరగతి**

మాది చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం. అమరావతిలో జూడో అసోసియేట్ మీట్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించాను. కాకినాడలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన జూడో 17 సంవత్సరాల బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించా. హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలలో బంగారు పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది.

## పదవికి వన్నె తెచ్చేలా పనిచేద్దాం

బైక్ ర్యాలీలో జనసేన కార్యకర్తలు

**నరసరావుపేట వ్యవసాయం:** కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన వారు వాటికి వన్నె తెచ్చేలా పని చేయాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ కోరారు. రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన జనసేన పార్టీ నేత వీరవల్లి వంశీకి ఆదివారం కూటమి నేతల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. తొలుత పట్టణంలోని సాయినగర్ నుంచి జనసేన పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వంశీని సన్మానించారు.

## తెలుగుజాతికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీవీ ఆంజనేయులు

**ఈపూరు, న్యూస్‌టుడే:** ప్రపంచ స్థాయిలో తెలుగుజాతికి పేరు తెచ్చిన మహానేత నందమూరి తారకరామారావు అని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈపూరు మండలం గోపువారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. విగ్రహాన్ని గ్రామానికి చెందిన ఎన్టీఆర్ అభిమాని గోనుగుంట్ల వీరాంజనేయులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, అంగలూరు సొసైటీ అధ్యక్షుడు బాలయ్య, ఈపూరు సొసైటీ డైరెక్టరు అయినాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రాయితీలు

సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మక్కెన

**వినుకొండ రూరల్:** రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే వారికి రాయితీలు వస్తాయని, అదనపు రుణాలు ఇవ్వడంతో పాటు కొత్త వారికి రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా వినుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ఆయన సహకార పతాకాన్ని ఎగురవేశారు. రుణాలు ఇవ్వడంలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. సీఈవో చెన్నకేశవరెడ్డి, డైరెక్టర్ గణపా శ్రీను, నేతలు గుర్నాధం, వెంకటరత్నం, నాగూర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇలా ఉంటే పొలాలకు వెళ్లేదెలా?

నాదెండ్ల మండలంలోని ఎండుగుపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అప్పాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు అధ్వానంగా ఉన్న 900 మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.55 లక్షల నిధులు గత ఏడాది పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కేటాయించింది. అప్పట్లో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. ఇది జరిగి ఏడాది పూర్తైంది. అయినా పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. దీంతో ఈ మార్గంలో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా స్పందన లేదు. పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా నిధుల కొరత వల్ల పనులు జరగలేదన్నారు. ప్రస్తుతం నిధులు మంజూరవుతున్నాయని నెల రోజుల లోపు పనులు పూర్తిచేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, నాదెండ్ల(చిలకలూరిపేట గ్రామీణ)**

## నీరు నిలబడకుండా చూడరూ..

చిలకలూరిపేట పట్టణంలోని 100 పడకల ఏరియా ఆసుపత్రి ఆవరణలో రోగులు, వారికి సహాయకులుగా వచ్చినవారి కోసం మంచినీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ వృథా నీరు పోయే మార్గం లేక నీరు నిలబడి ఉండటంతో పెద్ద ఎత్తున గడ్డి మొలిచి ఉండటం, గుంతల్లో నీరు నిలబడి ఉంటున్నాయి. దీంతో అక్కడకు వెళ్లి నీటిని తాగే రోగులకు అసౌకర్యంగా మారింది. సమస్యను ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా గుంతలను పూడ్చివేస్తామని, నీరు నిలబడకుండా చూస్తామని చెప్పారు. **-న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

## మురుగు పారదు.. సమస్య తీరదు

నరసరావుపేట పట్టణ శివారు శ్రీనివాస గిరిజన కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపై, ఇళ్ల మధ్య పారుతోంది. అధికారులు చొరవ తీసుకుని మురుగు కాల్వలు నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై యల్లమంద పంచాయతీ కార్యదర్శి గాబ్రియేలు మాట్లాడుతూ మురుగు తొలగించి కాల్వలు శుభ్రం చేయిస్తామని, డ్రైనేజీల నిర్మాణంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. **-న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)**

## తక్కువ ఎత్తులో నియంత్రిక.. తీగలు

**నూజండ్ల, న్యూస్‌టుడే:** ముకలలూరులోని రేణుకాదేవి ఆలయం సమీపంలో నియంత్రిక తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు దానికి లింకు కల్పే విద్యుత్తు తీగలు నాలుగు అడుగుల ఎత్తులోనే ఉన్నాయి. వర్షం కురిసినప్పుడు, గాలివీచిన సమయంలో మంటలు వస్తున్నాయని చుట్టుపక్కల వారు వాపోతున్నారు. సమస్యను ఏఈ సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు వైర్లను మార్చి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **-న్యూస్‌టుడే, నూజండ్ల**

## అల్లుకున్న నిర్లక్ష్యం.. కనిపించని సిగ్నల్ లైట్

బొప్పూడి - చిలకలూరిపేట మధ్య జాతీయ రహదారిపై రోడ్డు దాటే ప్రాంతాలలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. అందులో ఒక లైట్‌కు తీగలు అల్లుకుని అది వెలుగుతున్నా.. వాహనచోదకులకు కనిపించని పరిస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ**

## వన సమారాధనలతో సామాజిక బంధాలు బలోపేతం

మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

కుంకుమార్చనలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘ సభ్యులు

**వినుకొండ రూరల్, వినుకొండ, న్యూస్‌టుడే:** సంఘాలు నిర్వహించే వన సమారాధన ద్వారా సామాజిక బంధాలు మరింత బలపడతాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం మార్కాపురం రోడ్డులోని కాకతీయ బాలుర వసతి గృహం వద్ద కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. సామాజిక సామరస్యం, ఐక్యత, ప్రాముఖ్యతను సంఘం నిర్వహించిన ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇలాంటి వేదికలు ఆత్మీయత, అనురాగాలను పెంచుతాయన్నారు. శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు బోడేపూడి వెంకట సుబ్బారావును ప్రముఖులు సత్కరించారు.

★ బ్రాహ్మణ కార్తిక వన సమారాధన ఆదివారం వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. హజరైన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బ్రాహ్మణ సత్రం నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

★ వినుకొండలోని పసుపులేరు వంతెన సమీపంలోని ఖాదర్ బాబా ఆశ్రమంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు హాజరయ్యారు.

## ముప్పాళ్ల వాసుల ఆత్మీయ సమావేశం

సినీ గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రితో ముప్పాళ్ల వాసులు

**ఈపూరు, న్యూస్‌టుడే:** ముప్పాళ్ల వాసులు ఆదివారం హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ సుమారు 460 మంది గ్రామ వాసులు పార్టీలు, కులాలకు అతీతంగా సమావేశమై కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్, ఏపీ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టరు రాపర్ల జగ్గారావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**నేడు శావల్యాపురంలో..**

**శావల్యాపురం:** సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని శ్రీ రామాపబ్లిక్ ఆవరణలో కార్తిక సోమవారం సందర్భంగాన వనసమారాధన నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్ చంద్ తెలిపారు. విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

## నరసరావుపేటలో కోలాహలంగా..

న్యాయవాద సంఘ సభ్యులతో ఎమ్మెల్యే అరవిందబాబు

**నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే:** కోటప్పకొండలో కార్తిక వనసమారాధన కార్యక్రమాలు ఆయా సత్రాల్లో కోలాహలంగా జరిగాయి. రెడ్ల, ఏకలవ్య, యాదవ, మేదర, రజక, ముదిరాజుల సత్రాలతో పాటు ఆయా కుల సంఘాల సత్రాల్లో సంఘీయులు అంతా ఒక చోట చేరి వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఏకలవ్య సత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేశారు. యాదవ, మేదర, ముదిరాజు, రజక సత్రాలు, న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొని మాట్లాడుతూ అన్ని కుల సంఘీయులు ఒక చోటకు చేరి సమైక్యతను చాటుతూ వన భోజనాలు చేయడం మంచి పరిణామమన్నారు. ముదిరాజుల అన్నదాన సత్రంలో టీటీడీ మెంబర్ జంగా కృష్ణమూర్తిని సత్రం కార్యదర్శి వెంకటేశ్వర్లు సత్కరించారు. రెడ్ల సత్రంలో జరిగిన కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి కాసుమూరి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

**నరసరావుపేట అర్బన్:** పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో బొందిలి సేవాసంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. మహిళలు భవానీ మాతకు పూజలు చేశారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాససింగ్, కార్యదర్శి కృష్ణాసింగ్, కోశాధికారిగా క్షత్రి నవీన్‌సింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## గ్యాస్ రాయితీ రాకపోతే అడగొచ్చు.. పొందొచ్చు

**నూజండ్ల:** ప్రభుత్వం ఇస్తున్న గ్యాస్ సిలిండర్ల రాయితీ రాకపోతే అడిగి పొందవచ్చని మేనేజర్ గణేష్ అన్నారు. కంభంపాడులో ఆదివారం భారత్ గ్యాస్ వారు వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ 3 సిలిండర్ల నగదు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. రాయితీ రానివారు కార్యాలయానికి వెళ్లి తెలుసుకోవాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మాణిక్యాలరావుకు నివాళి

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకుల సమస్యలపై పోరాడిన మాజీ ఎమ్మెల్సీ మాణిక్యాలరావు జీవితం ఆదర్శప్రాయమని వక్తలు పేర్కొన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆక్టా(ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకుల సంఘం)ఆధ్వర్యంలో మాణిక్యాలరావు శతజయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

**మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే:** నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని రవిశంకర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో శనివారం అర్ధరాత్రి అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు రెండో పట్టణ ఎస్సై ప్రియాంక దాడి చేశారు. 94 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న సాగర్, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బాలుడి ఆచూకీ లభ్యం

**మల్లమ్మ సెంటర్(నరసరావుపేట):** నరసరావుపేట పట్టణం షాలేమ్‌నగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ ఈ నెల 9న ఇంటి నుండి వెళ్లిపోయాడు. బాలుడు కనిపించడంలేదని తల్లి సుజాత ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడు తిరుపతిలో ఉన్నాడన్న సమాచారం మేరకు.. అక్కడికి వెళ్లిన పోలీసులు తిరుపతి రైల్వేస్టేషన్ బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

## ప్రత్యేక ఆధార్ శిబిరాలు

**వినుకొండ:** పురపాలక సంఘంలో 17 నుంచి 26 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రాంగణంలోని కేంద్రంలో మూడో వార్డు సిబ్బంది ఎం.ఏడుకొండలు, ఆర్.ప్రసన్నలక్ష్మి, గీతాంజలి ఉన్నత పాఠశాలలో 8వార్డు సచివాలయ సిబ్బంది జడ మహేశ్వరి, యం.ధనలక్ష్మి సేవలందిస్తారని పేర్కొన్నారు.

## ఊడిజర్ల ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం

**ఈపూరు:** ఊడిజర్ల ఎస్సీ కాలనీలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాలనీలో జ్వర పీడితులు ఎక్కువగా ఉండటంతో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే నిర్వహించారు. మురుగు కాలువల వెంట బ్లీచింగ్, బ్రయోటెక్స్‌ను చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. పీహెచ్ఎన్ టి.లక్ష్మినరసమ్మ, ఏఎన్ఎం విజయలక్ష్మి, మలేరియా సిబ్బంది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే:** హిందూపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడికి నిరసనగా స్థానిక గడియార స్తంభం సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వైకాపా కార్యకర్తలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో చంద్రబాబునాయుడు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై మాట్లాడిన వ్యాఖ్యలను దారి మళ్లించడానికి హిందూపురంలో ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.

## సత్యనారాయణ స్వామి వ్రతం

పూజలు నిర్వహిస్తున్న దంపతులు

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** చినపసుమర్రు పరిధిలో జాతీయ రహదారి ఓగేరు వాగుకు దక్షిణాన ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో కార్తికమాస పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సామూహిక రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల

జల బిందెలతో దేవాలయం వద్దకు ప్రదర్శనగా వస్తున్న బాలికలు

**శావల్యాపురం, న్యూస్‌టుడే :** శావల్యాపురంలోని నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బాలికలు జల బిందెలతో అమ్మవారి రాళ్ల గుట్టను శుద్ధి చేశారు. మహిళలు దేవాలయం వద్ద పొంగళ్లు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రాత్రి 7 గంటల నుంచి నాగరాజ జెండా గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు ఘనంగా చేపట్టారు. తిరునాళ్ల సందర్భంగా 5వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అయ్యప్ప స్వామికి పుష్పయాగం

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** సత్తెనపల్లి రోడ్డులో అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం మండల పూజ, నక్షత్ర పుష్పయాగం నిర్వహించారు. ఉదయం నిత్య పూజలు చేశారు.

(c) eenadu

## తెలుగు జాతి కీర్తిశిఖరం రామోజీరావు

**పెదకూరపాడు:** తెలుగుజాతీ కీర్తి శిఖరం రామోజీరావు అని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అక్షరయోధుడు రామోజీరావు జయంతిని పురస్కరించుకుని ఆదివారం నివాళులర్పించారు. 50ఏళ్లుగా ఈనాడు ప్రజాభిమానం పొందడానికి ఆయనపై ప్రజలుకున్న అచంచల విశ్వాసమే కారణమన్నారు. సమాజ హితులకు దార్శనికుడు రామోజీరావు పేరుతో పురస్కారాలు అందించటం అభినందనీయమన్నారు.

## సామూహిక వ్రతాలు

**దుర్గి, న్యూస్‌టుడే :** మండల పరిధిలోని అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధిలో ఉన్న ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాల్గొని కార్తిక సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన సత్రం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

## గొడవలతో జీవితాల్ని నాశనం చేసుకోవద్దు

**ముప్పాళ్ల, న్యూస్‌టుడే :** గొడవలుపడి జీవితాల్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై అనిల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని మాదల గ్రామంలోని ముస్లిం మైనార్టీల కాలనీలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూపులుగా మైనార్టీ సోదరులు ఏర్పడి గొడవలుపడటం మంచిది కాదన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే జైళ్లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పిల్లల చదువులు వారి భవిష్యత్తుపై కూడా గొడవల ప్రభావం చూపిస్తాయన్నారు. శాంతి, సోదరభావంతో అందరూ జీవించాలని కోరారు. ఏఎస్సై నవరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై అనిల్‌కుమార్

## కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం పట్టణం, జానపాడులో కాకతీయ సేవా సంఘం, శ్రీకృష్ణదేవరాయ కాపుసేవా సమితి, పట్టణ ఆర్యవైశ్యుల సంఘం, యాదవసంఘాల కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని పట్టణం, కొండమోడు, దేవరంపాడు ప్రాంతాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సేవాకార్యక్రమాల్లో ముందు ఉంటారన్నారు. ఆర్యవైశ్యులు ఎన్నికల సమయంలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి తీసుకెళ్లాలని కోరారని, ఇప్పటికే కొన్ని కుటుంబాలను తీసుకవెళ్లానని తెలిపారు. త్వరలో మరికొన్ని కుటుంబాలను తీసుకెళుతానన్నారు. కాకతీయ కల్యాణ మండపానికి రూ.2కోట్లు నిధులు నాలుగు నెలలు క్రితం మంజూరు చేయించినట్లు చెప్పారు, కమిటీ వేసుకొని నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. కాకతీయసేవాసంఘం సభ్యులు మిగిలిన వర్గాలకు తలలో నాలుకలా ఉండాలన్నారు. దేశంలో అన్నీ రంగాల్లో కాకతీయసేవాసంఘం సభ్యులు ఉండి, లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త చిన సుబ్బారావు, వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు

## తల్లులకు తోడ్పాటు.. బిడ్డలకు భరోసా..!

పులిపాడు (గురజాల గ్రామీణ), న్యూస్‌టుడే

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ పూర్తి

**ఆ**ర్థికంగా వెనకబడిన వర్గాల మహిళలకు ప్రసూతి ప్రయోజనాలు, పోషక పదార్థాలు అందించేందుకు ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై)పథకం వారి అభివృద్ధికి దోహదపడుతోంది. అర్హత కలిగిన మహిళలు తమ పేర్లు నమోదు చేసుకుంటే ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో పనిచేసే అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గురజాల ప్రాజెక్టు పరిధిలోని రెండు మండలాల్లో 132 సెంటర్లు ఉండగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుంచి లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నారు.

### రెండు విడతల్లో సాయం

ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాల్లో ప్రసవం తరువాత బిడ్డలకు సరైన పోషకాహారం అందించే లక్ష్యంతో 2017లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. గత వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీన్ని పటిష్ఠంగా అమలు చేయాలని నిర్ణయించింది. పథకం కింద అర్హులైన వారికి రెండు విడతల్లో రూ.11వేలు ఇస్తారు. మొదటి కాన్పు అయితే రూ.5వేలు, రెండో కాన్పులో ఆడ పిల్ల పుడితే రూ.6వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సంప్రదిస్తే వివరాలు నమోదు చేస్తారు. ఇందుకోసం ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు.

### అమలు ఇలా..

గర్భిణులకు, బాలింతలకు ప్రధానమంత్రి మాతృత్వయోజన పథకం వర్తిస్తుంది. గతంలో గర్భం దాల్చిన వెంటనే పేరు నమోదు చేసుకుంటే రూ.3వేలు, ప్రసవం అనంతరం మూడు టీకాలు పూర్తయిన తరువాత మిగిలిన రూ.2వేలు ఇస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే మూడు టీకాలు వేసుకున్న అనంతరం ఒకేసారి రూ.6వేలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సీఎంఎంవీవై నమోదు ప్రక్రియ జరుగుతోంది.

✧ పీఎంఎంవీవై లబ్ధిదారుల వివరాలు నమోదు

అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు

| గురజాల ప్రాజెక్టు పరిధిలో... | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు: | 132 |
| బాలింతలు: | 620 |
| గర్భిణులు: | 720 |
| 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు: | 4384 |
| 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు: | 4198 |

○ ఈ విషయంపై గురజాల సీడీపీవో అపరంజి జ్యోత్స్న మాట్లాడుతూ పీఎంఎంవీవై పథకానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. అర్హులైన వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటికే 155 పేర్లు నమోదు చేశామని చెప్పారు.

## చంద్రబాబుపై నమ్మకంతో భారీగా పెట్టుబడులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

**పెదకూరపాడు, మాచర్ల, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై ఉన్న నమ్మకంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారని, గత ప్రభుత్వంలో వెనక్కి వెళ్లిపోయిన పరిశ్రమలు సైతం తిరిగి వస్తున్నాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ నిలిచిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాత్రమే కాకుండా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ఏపీ ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. సింగిల్ విండో సిస్టమ్ నిర్ణయాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగిందన్నారు. రెండు రోజుల్లో 613 ఒప్పందాలు, 13లక్షల కోట్ల పెట్టుబడులు, 16లక్షల మందికి ఉద్యోగాలు రాష్ట్ర అభివృద్ధి పట్ల పెట్టుబడిదారుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ✦ విశాఖలో నిర్వహించిన సీఐఐ సమ్మిట్‌తో రూ.లక్షకోట్ల పెట్టుబడులను సాధించి కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామంగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖా మంత్రి లోకేశ్ తీర్చిదిద్దారని కొనియాడారు.

## 14 రోజులు ఇంటి వద్దనే పరీక్షలు

**రెంటచింతల, న్యూస్‌టుడే :** శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే తక్షణమే వైద్య సిబ్బందికి తెలపాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 17-30 వరకు నిర్వహించనున్న కుష్ఠు వ్యాధిపై అవగాహన-నిర్మూలన కార్యక్రమ గోడపత్రాన్ని ఆవిష్కరించారు. 14 రోజులపాటు ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధి లక్షణాలు ఉంటే చికిత్స ఉచితంగా అందిస్తామన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా జాగ్రత్త పడవచ్చని, కార్యక్రమంలో వైద్యులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, శర్మ, కోటేశ్వరరావు, అంకమ్మరావు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో కార్యదర్శి భూషణం, కోచ్ సత్యనారాయణ నాయక్

**అచ్చంపేట, న్యూస్‌టుడే:** జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్(కుస్తీ) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. పురుషుల విభాగంలో కె.శివనాగరాజు, టి.రోహిత్, ఎన్.శ్రీకరప్రసాద్, టి.మరియబాబు, బి.విజయబాబు, వై.వంశి, ఎం.అఖిల్, మారుతికుమార్, సూర్యకాంత్, వై.మల్లికార్జునరావు, పి.చంటి, ఎన్.విజయ్‌కుమార్, కె.భరత్‌కుమార్, కె.ప్రభాకర్‌లు ఎంపికయ్యారు. మహిళల విభాగంలో ఎన్.స్నేహస్వరూప, జి.నితీషా ఎంపికయ్యారు. వీరు డిసెంబరు 2, 3తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.భూషణం తెలిపారు.

## సంఘ సేవకులు స్ఫూర్తి ప్రదాతలు

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే :** సంఘ సేవకులు సమాజానికి స్ఫూర్తిప్రదాతలని న్యాయవాదులు పాములయ్య, నరసింహారావు, సీపీఎం రాష్ట్ర నాయకుడు చలమయ్య, పణిదం చేనేత సొసైటీ అధ్యక్షుడు శివదుర్గారావు అన్నారు. పట్టణంలోని పణిదం చేనేత సొసైటీ కాలనీలో ఆదివారం సంఘ సేవకుడు వీరస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామాజిక సేవా కార్యక్రమంలో మాట్లాడారు. కార్తిక మాసంలో క్రమం తప్పకుండా అన్నార్తులను గంజ వీరస్వామి ఆదుకోవడం అభినందనీయమన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున, మరొకరికి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 800 మందికి రగ్గులతోపాటు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు విమల, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నగదు అందజేస్తున్న అతిథులు

## ఇమామ్, మౌజన్లకు ఇళ్ల స్థలాలు

థ్యాంక్యూ సీఎం సార్ పోస్టర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే యరపతినేని, ముస్లిం నేతలు

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** ఇమామ్, మౌజన్లకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. నియోజకవర్గంలోని మసీదుల్లో నమాజ్ చదివే వారికి ఎప్పటి నుంచో ఆగిపోయిన గౌరవవేతనాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని ఆదివారం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆదివారం కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని ఇమామ్, మౌజన్లు వచ్చి ఎమ్మెల్యే యరపతినేనికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 64 మసీదుల్లో పనిచేసే వారికి ఏడాదికి రూ.1.15 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఒక్కొక్క మసీదుకు రూ.1.80లక్షలు విడుదల చేయించినట్లు వివరించారు. మరో 34 మసీదులు ఆన్‌లైన్ చేసి ఉన్నాయని, వారికి కూడా త్వరలో గౌరవ వేతనాలు మంజూరు చేయిస్తామని చెప్పారు. సమావేశంలో షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలీ, షేక్ సైదా, మస్తాన్‌వలి, ఫరీద్‌మేస్త్రీ, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

## కోతుల గుంపు.. కాలు కదపనివ్వదు

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** ఇంట్లో నుంచి కాలు కదలనివ్వకుండా కోతుల గుంపు దాడులకు పాల్పడుతున్నాయి. ఇళ్లు, రోడ్లపై తిరుగుతూ పట్టణంలోని నాగార్జునానగర్ వాసులను హడలెత్తిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. వాటిని పట్టి అటవీ ప్రాంతంలో వదలాలని జంతు ప్రేమికులు కోరుకుంటున్నారు.

## ఈ-పంట పొరపాట్ల సవరణకు అవకాశం

**పెదకూరపాడు, న్యూస్‌టుడే:** రైతులు వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేందుకు, విపత్తుల సమయంలో పెట్టుబడి రాయితీ, బీమా వంటి పరిహారం పొందేందుకు కీలకమైన ఈ-పంట నమోదులో పొరపాట్ల సవరణకు 17న ఒక్కరోజు అవకాశం కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల ముసాయిదా జాబితాను సామూహిక తనిఖీలో భాగంగా అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించామన్నారు. పంట పేరు, రకం, నాటిన తేదీ, నీటి వసతి, పంట సరళి తదితర వివరాలు సరి చూసుకొని పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వాహనాలు ఇలా.. రాకపోకలు ఎలా?

**దాచేపల్లి, న్యూస్‌టుడే:** దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఉన్న ప్రధాన వీధి పూర్తిగా పార్కింగ్ స్థలంగా మారిపోయింది. రోజూ ద్విచక్ర వాహనాలు అడ్డంగా నిలిపి వేయడంతో రాకపోకలు అస్తవ్యస్తమవుతున్నాయి. వీధిలో బ్యాంకులు, విద్యాసంస్థలు ఉండటంతో రోజంతా రద్దీ నెలకొంది. పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతంలో పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో వాహనదారులు నియమ నిబంధనలు పట్టించుకోవడంలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రూపు మారింది.. ఆహ్లాదం నిండింది

**అమరావతి, న్యూస్‌టుడే:** ఆటపాటలతో ఆడుకునే పార్కును గత వైకాపా ప్రభుత్వంలో అధ్వానంగా మార్చారు. పట్టించుకోకపోవడంతో అడవిగా మారిపోయి పిచ్చి చెట్లు పెరిగి కళావిహీనంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పార్కును అందుబాటులోకి తీసుకొచ్చారు. మండల పరిధిలోని లేమల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాల వెనకాల గుంటూరు రహదారిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2014లో పార్కు ఏర్పాటు ఏర్పాటు చేశారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని ఇటీవల గ్రామస్థులు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పార్కును పరిశీలించి అభివృద్ధికి సహకారం అందించడంతో పార్కును అధికారులు తీర్చిదిద్దారు. ఇప్పటికే పార్కులో లైటింగ్, నడకదారి ఏర్పాటు చేయగా దాతల సహకారంతో కూర్చునేందుకు బల్లలు, పిల్లలు ఆడుకునే ఆటల పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ పార్కుగా నామకరణం చేసి అందుబాటులోకి తీసుకుని రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆట స్థలంగా కూడా పార్కును అందుబాటులో ఉంచుతామని పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు.

## ముమ్మరంగా పనులు.. తీరనున్న కష్టాలు

**కొం**డమోడు-పేరేచర్ల రహదారి విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి, నందిగామ పంచాయతీ పరిధిలో ఇటీవల వరకు మందకొడిగా సాగిన రహదారి విస్తరణ పనులు ముమ్మరమయ్యాయి. మార్గంలోని లింగంగుంట్ల మేజరు కాలువ సమీపం నుంచి ప్రారంభమయ్యే సత్తెనపల్లి బైపాస్ రోడ్డు పనులు వేగవంతం అయ్యాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తూ పనులను గమనిస్తున్న ఈ ప్రాంత వాహన చోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నరలో ట్రాఫిక్ కష్టాలు తొలగిపోనున్నాయని సంతోషిస్తున్నారు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**

## స్వచ్ఛత వైపు అడుగులు పడాలి

**లగడపాడు(పెదకూరపాడు), న్యూస్‌టుడే:** గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని ఎన్నారై మైనేని అప్పారావు అన్నారు. శ్రీకాకతీయ కళాశాల జాతీయ విద్యార్థి సేవా విభాగం విద్యార్థులు ఆదివారం కన్నెగండ్ల, లగడపాడు గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల పరిసరాలతోపాటు, రహదారులు శుభ్రం చేశారు. చిల్లచెట్లు తొలగించారు. వారం రోజులపాటు ఎన్ఎస్ఎస్ సేవా విభాగం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ ఆదివారంతో ముగిసిందని కళాశాల నిర్వాహకులు దివి లలితబాబు, ప్రిన్సిపల్ అశోక్‌లు తెలిపారు.

## మహనీయుల జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలి

నివాళులర్పిస్తున్న గ్రంథాలయశాఖ బాధ్యులు, సిబ్బంది

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే :** మహనీయుల జీవితాల నుంచి యువత, విద్యార్థులు స్ఫూర్తి పొందాలని, వారి అడుగుజాడల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని వక్తలు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సత్తెనపల్లి, గురజాల, క్రోసూరు, మాచర్ల, కారంపూడిలో ఉద్యమ నేతలకు ఘన నివాళి అర్పించారు. వారి త్యాగాలను విద్యార్థులకు వివరించారు.

### 18న ఉద్యోగ మేళా

**మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే :** ఈనెల 18న ఎస్కేబీఆర్ కాలేజీలో నిర్వహించే ఉద్యోగ మేళాను మాచర్ల నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. స్కిల్‌డవలప్ మెంట్ ట్రైనింగ్ కార్పొరేషన్ నేతృత్వంలో నిర్వహించే ఈ మేళాలో దాదాపు పది మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటున్నాయని, అర్హులైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అచ్చంపేట గ్రామ తెదేపా అధ్యక్షుడిగా గాంధి

**అచ్చంపేట, న్యూస్‌టుడే:** అచ్చంపేట గ్రామ తెదేపా అధ్యక్షుడిగా సందెపోగు గాంధి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను పలువురు తెదేపా నేతలు అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

### అమరేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే

**అమరావతి, న్యూస్‌టుడే:** పంచారామ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరున్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో రేఖ స్వామి వారి శేష వస్త్రాలు, చిత్రపటం అందజేశారు. ఆయన వెంట తెదేపా నేతలు ఉన్నారు.

## అవీ ఇవీ

### భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భజన

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే :** హరిహర సుతనే అయ్యప్ప.. స్వామి శరణం, అయ్యప్ప శరణం అంటూ దీక్షాధారులు పూజలు చేశారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లోని రామాలయం వద్ద అయ్యప్ప పడిపూజ ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పట్టణ శివారులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

### వైభవంగా సహస్రలింగార్చన పూజ

**రెంటచింతల, న్యూస్‌టుడే:** సత్రశాల ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మల్లయ్య-భ్రమరాంబ దేవతామూర్తులకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం నిర్వహించారు. బ్రాహ్మణ సత్రంలో చండీ హోమం, సహస్రలింగార్చన, ఏకాదశరుద్రాభిషేకం అత్యంత భక్తి శ్రద్ధలతో 20 మంది రుత్వికులు నిర్వహించారు. భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

★ స్థానిక మహాకాలభైరవ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శరభయ్య గుప్తా హైందవోన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనీశ్వర పాశుపత రుద్ర మహాయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

### అలరించిన భక్తి గీతాలు

**మాచవరం, న్యూస్‌టుడే :** కార్తిక మాసం పురస్కరించుకొని స్థానిక కృష్ణాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకొన్నారు. ఆలయంలో భక్త భజన బృందం, భక్తి గీతాలు ఆలపించింది. వచ్చినవారందరికీ అన్నదానం చేశారు.

### అంకమ్మతల్లికి పొంగళ్లు

**పెదకూరపాడు:** పెదకూరపాడు అంకమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మకు పొంగళ్లు నివేదన చేశారు. గ్రామ పెద్దలు అర్తిమళ్ల రమేష్, ఏటుకూరి బ్రహ్మయ్య, గళ్లా బాబు, అంద్ర ప్రసాద్, గుత్తా రాములు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్తికమాసం సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ బెల్లంకొండ శ్రీధర్, సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## 'ఎవరినీ వదిలి పెట్టం'

**కారంపూడి, న్యూస్‌టుడే:** కక్ష కట్టి కేసులు పెడుతున్నారు.. ఎవరినీ వదిలి పెట్టం, అంతకంత తీర్చుకుంటామని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కొండవీటి రెడ్ల వనసమారాధన కార్యక్రమాన్ని చిన్నకొదమగుండ్ల పరిధిలోని రాధాకృష్ణ సత్సంగం పక్కన నిర్వహించారు. కార్యక్రమంలో పిన్నెల్లి పాల్గొని మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గాన్ని అణగదొక్కేందుకు రాష్ట్రంలో కొంతమంది ప్రయత్నిస్తున్నారని, అందరం కలివిగా ఉండి వైకాపాను మళ్లీ అధికారంలోకి తీసుకొద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నటి శ్యామల, మురళీధరరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

**అమరావతి, న్యూస్‌టుడే :** ల్యాంప్, జనచైతన్య సమితి ఆధ్వర్యంలో జ్యూట్, క్లాత్ బ్యాగుల తయారీతో పాటు టైలరింగ్ ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు జనచైతన్య సమితి ప్రతినిధులు సాంబశివరావు, అనిల్‌కుమార్ తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రెండు సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అమరావతిలోని శ్రీనివాస థియేటర్ వద్ద గల నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## రజతోత్సవం.. ఐక్యతకు నిదర్శనం

వనసమారాధనలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

**ముప్పాళ్ల, న్యూస్‌టుడే:** కార్తిక వనసమారాధన రజతోత్సవం మండలంలోని ఆర్యవైశ్యుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అత్తలూరి సుబ్బారావు అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్తిక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. పోతుగంటి ముత్యాలు రావమ్మ ఛారిటబుల్ ట్రస్టు తరపున తొండపి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. సుప్రీంకోర్టులో ఉన్నత ఉద్యోగం సాధించిన బొండా ధరణి మౌనికను సన్మానించారు. ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర, స్థానిక నాయకులు శ్రీనివాసరావు, సుబ్బారావు, నరసింహరావు, వీరాంజనేయులు, రామమోహనరావు, రామకృష్ణ, అప్పారావు, సుబ్బరామారావు తదితరులు పాల్గొన్నారు.

## సహకార వ్యవస్థ బలోపేతంతో విస్తృత సేవలు

మాట్లాడుతున్న పీఏసీఎస్ ఛైర్మన్ రత్నకుమార్, పక్కన డైరెక్టర్లు

**75త్యాళ్లూరు (పెదకూరపాడు), న్యూస్‌టుడే:** వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న సహకార వ్యవస్థ బలోపేతం ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు 75త్యాళ్లూరు పీఏసీఎస్ ఛైర్మన్ ఏటుకూరి రత్నకుమార్ అన్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా ఆదివారం సంఘ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు పంట రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నామన్నారు. అన్నదాతలకు అవసరమైన ఎరువులు అందించి మేలైన పంట దిగుబడులకు కృషిచేసినట్లు వివరించారు. సహకార సంఘాల బలోపేతమే రాష్ట్ర అభివృద్ధికి మూలమన్నారు. వారివెంట డైరెక్టర్లు కల్లం సుందరరామిరెడ్డి, బండి అప్పారావు, సీఈవో శివకుమారి, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తి కనిపించడంలేదని ఫిర్యాదు

**చర్లగుడిపాడు (గురజాల (గ్రామీణ) న్యూసటుడే:** చర్లగుడిపాడుకు చెందిన ఐనాల పెద్ద సుబ్బారావు కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 6న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల దగ్గర, చుట్టు పక్కల ఆరాతీసినా జాడతెలియక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

## జూద శిబిరాలపై దాడులు

**మాచర్ల (కారంపూడి):** మాచర్ల పట్టణం, మండల పరిధిలోని జమ్మలమడక గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ వెంకటరమణ, రూరల్ ఎస్సై ఉదయలక్ష్మి సిబ్బందితో దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మురుగు కదలదు.. చెత్త తొలగదు

**రఘురామ్‌నగరం (సత్తెనపల్లి), న్యూస్‌టుడే:** మురుగు ముందుకు కదలకపోవడం, చెత్త వీధుల్లో నుంచి వదలకపోవడంతో పట్టణంలోని రఘురామ్‌నగర్ వాసులు అవస్థలు పడుతున్నారు. పురపాలక సంఘానికి వివిధ పన్నుల రూపంలో ఆదాయం వచ్చే ప్రాంతాల్లో రఘురామ్‌నగర్ కీలకంగా ఉన్నప్పటికీ ఇక్కడ రోడ్లు, డ్రెయినేజి వ్యవస్థ, ఖాళీ స్థలాల శుభ్రత సరిగ్గా లేదు. అధ్వాన పారిశుద్ధ్యంతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన వీధుల్లో మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండట్లేదు. చెత్త, వ్యర్థాలకుతోడు వరహాల బెడద ఎక్కువైంది. ఎక్స్‌టెన్షన్ ఏరియా సమస్యల మయంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా వీధులు తటాకాలను తలపిస్తున్నాయి. శాశ్వత రోడ్డు నిర్మాణాలకు వినతులు అందజేసినా మున్సిపల్ అధికారులు దృష్టి సారించడంలేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త, వ్యర్థాలు డంపింగ్ యార్డులకు కదలకపోవడం సమస్యగా ఉందని, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుకుంటున్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ విజయసారథి మాట్లాడుతూ రఘురామ్‌నగర్‌లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు.



(c) eenadu

# మెరుపై సాగారు.. మేటిగా నిలిచారు

నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు యూత్, జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను విజయనగరం జట్టు కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో కడప, తృతీయస్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. మన క్రీడాకారుల్లో మణికంఠ తదితరులు రాణించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మంనాయుడు, కార్యదర్శి చల్లా రాము, అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

ట్రోఫీ అందిస్తున్న ఎంపీ కలిశెట్టి, కడగల ఆనంద్‌కుమార్ తదితరులు

బరువు ఎత్తుతున్న మణికంఠ

## ఊటీ కాదు.. మన ఉద్యానమే

సీతంపేట మన్యంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలు, స్నేహితులతో తరలివచ్చారు. ఎన్టీఆర్ సాహస ఉద్యానంలో సాహస క్రీడలు ఆడారు. బోటింగ్ చేస్తూ మురిసిపోయారు. కొందరు ఊగే వంతెనపై నడిచారు. 5డీ థియేటర్‌లో ప్రదర్శనలను వీక్షించారు. ఆనంద వేదిక వద్ద నృత్యాలు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి జలపాతల వద్ద పెద్దఎత్తున సందర్శకులు కనిపించారు. ఆడలి వ్యూ పాయింట్, జగతిపల్లి హిల్ రిసార్ట్సు యువతతో కిక్కిరిశాయి. – న్యూస్‌టుడే, సీతంపేట

## శిలాద తనయ.. నందీశ్వరాయ

పార్వతీపురం జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్డాపుశీలలో ఉన్న కాశీ విశ్వేశ్వరాలయ ఆవరణలో భారీ నంది విగ్రహం దర్శనమిస్తోంది. పదేళ్ల కిందట ఇక్కడ పెద్ద రాతిగుట్ట ఉండేది. దీనిని విగ్రహంగా మలచాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.తవిటినాయుడు నిపుణులను రప్పించారు. వారి ఆధ్వర్యంలో 47 అడుగుల పొడవు, 42 అ. వెడల్పు, 27 అ. ఎత్తులో నందీశ్వరుడు రూపుదిద్దుకున్నాడు. ఇది ఏకశిలా రూపం కావడంతో ఏటా కార్తికమాసం రోజుల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

## జలకాలాటల్లో.. గలగల పాటల్లో

సాలూరు మండలంలోని శిఖపరువు, దళాయివలస గ్రామాల సమీపంలో ఉన్న జలపాతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులు, మిత్రులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడుతూ, పాడుతూ ఆనందంగా గడిపారు. కొందరు అక్కడే వన భోజనాలు చేశారు. నృత్యాలతో అలరించారు. కొందరు సమీపంలో ఉన్న వాగుల్లో జలకాలాటలాడారు. రాళ్ల ప్రాంతం కావడంతో ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## నెట్‌లో నక్కలు!!

ఇంటికొచ్చి బెదిరించరు.. దారి కాచి దోచేయరు.. కత్తులు, రాడ్లతో వారికి పనే ఉండదు.. పేర్లు.. ఊర్లు తెలియాల్సిన అవసరం లేదు.. రెక్కీ నిర్వహించరు.. ఎక్కడో ఉంటారు.. కానీ క్షణాల్లో రూ.కోట్లలో కాజేస్తున్నారు.. లింకులతో లంకేసి.. యాప్‌లతో మాయచేసి నిలువు దోపిడీ చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. ఉమ్మడి జిల్లాలో గత మూడేళ్లలో రూ.22 కోట్లకు పైగా లాగేశారు. ఇటీవల బొబ్బిలికి చెందిన ఓ ఉపాధ్యాయుడు రూ.22.18 లక్షలు పోగొట్టుకున్నారు. – ఈనాడు, పార్వతీపురం మన్యం, న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

గత మూడేళ్లలో ఇలా.. (రూ.కోట్లలో)

| సంవత్సరం | కేసులు | పోగొట్టుకుంది | ఫ్రీజ్ చేసింది |
|---|---|---|---|
| 2023 | 144 | 5.67 | 0.38 |
| 2024 | 153 | 10.41 | 2.63 |
| 2025 | 83 | 6.17 | 0.61 |

➜ ఈ ఏడాది సెప్టెంబరు వరకు..

'2023 నుంచి ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 10 వరకు కోర్టులో ఉన్నాయి. 28 కేసులకు సంబంధించి ఆధారాలు దొరకలేదని ఛార్జి షీట్లు మూసేశారు. మిగిలిన వాటిపై విచారణ సాగుతోంది' బాధితుల్లో చదువుకున్నవారే ఎక్కువ. యువతతో పాటు ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు, మహిళలు దెబ్బతింటున్నారు. కొందరు ఆలస్యంగా ఫిర్యాదు చేస్తున్నారు. వెంటనే స్పందిస్తే రికవరీకి అవకాశం ఉంటుందని **సైబర్ సెల్ సీఐ శోభన్‌బాబు** తెలిపారు.

### ఇలా చేయొద్దు..

- అనవసరపు లింకులు తెరవద్దు
- ఏపీకే ఫైల్స్‌తో ముప్పు పొంచి ఉంటుంది
- యాప్‌ల వినియోగంలో అప్రమత్తత అవసరం
- డిజిటల్ అరెస్టు లేనే లేదు. ఆ పేరుతో ఎవరైనా కాల్ చేస్తే నమ్మొద్దు
- ఎక్కడా వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీల వివరాలను ఇవ్వొద్దు
- ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దు

ఫిర్యాదు చేయాలంటే.. వెబ్‌సైట్: www.cybercrime. gov.in టోల్‌ఫ్రీ: 1930

## డ్యూటీ కొత్తది.. డేటా పాతది

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో జిల్లా అధికారులదే కీలక పాత్ర. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులు తమకు కావాల్సిన సమాచారాన్ని పొందడానికి, ఫిర్యాదులకు ప్రభుత్వ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తుంటారు. నేరుగా కలిసే అవకాశం లేకున్నా అందులో ఉండే నంబర్లను సంప్రదించి మాట్లాడొచ్చని భావిస్తారు.. మీరలా చేశారంటే ఇబ్బంది పడినట్లు.. ఎందుకంటే చాలా వెబ్‌సైట్లలో పాత అధికారుల నంబర్లే దర్శనమిస్తున్నాయి. vizianagaram.ap.gov.in లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇందులో విభాగాధిపతుల పేర్లు, నంబర్లు ఉండాలి. అయితే గతంలో బదిలీపై వెళ్లినవారివే కనిపిస్తున్నాయి.

### వీరు ఇంకా ఉన్నారట..

ప్రస్తుతం బీసీ సంక్షేమాధికారిణిగా, బీసీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడీగా జె.జ్యోతిశ్రీ పనిచేస్తున్నారు. వెబ్‌సైట్‌లో మాత్రం గతంలో పనిచేసిన జి.పెంటోజీరావు కొనసాగుతున్నారు. పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు ఉద్యోగ విరమణ చేసి నెలలు గడుస్తోంది. కానీ ఆయన పేరు కనిపిస్తోంది. డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి మారినా ఇంకా ఉన్నట్లే చూపిస్తోంది. ఉద్యానశాఖ అధికారి జమదగ్ని, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త కె.అప్పారావు, కార్మిక శాఖ ఉప కమిషనర్ సుబ్రహ్మణ్యం, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.పద్మలీల, డీపీవో టి.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, సమగ్ర శిక్షా పీవో ఎన్.ప్రేమ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బి.రామానందం.. ఇలా.. అన్ని విభాగాల అధికారుల స్థానాల్లో పాత వారే ఉన్నారు. దాదాపు 25 మంది వరకు కొత్తవారు చేరినా వారి పేర్లు కానరావడం లేదు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

హోం పేజీలో పాత అధికారిణి పేరు

వెబ్‌సైట్‌లో బదిలీ అయిన అధికారుల పేర్లు

## ఖుషి.. ఖుషీగా

– న్యూస్‌టుడే, పార్వతీపురం మయూరికూడలి

స్వయం సహాయక సంఘాలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎలాంటి పూచీకత్తు లేకుండానే స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా 48 గంటల్లోనే రుణం మంజూరు చేస్తోంది. 129 రకాల జీవనోపాధుల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తోంది. తాజాగా గ్రేడింగ్ రుణం మంజూరు శాతాన్ని పెంచడంతో మరింత లబ్ధి కలగనుంది.

స్త్రీనిధిలో గ్రేడింగ్ రుణం పెంపు

వేల మందికి ఉపయోగం

మంజూరు ఇలా.. (రూ.లక్షల్లో)

| గ్రేడ్ | గతంలో | ఇప్పుడు |
|---|---|---|
| బి | 65 | 90 |
| సీ | 55 | 80 |
| డి | 45 | 70 |

స్త్రీనిధి రుణంతో ఏర్పాటు చేసిన యూనిట్

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఇలా..
సంఘాలు: 59 వేలు
సభ్యులు: 6.86 లక్షలు
లక్ష్యం: 35,214 మందికి రూ.367.95 కోట్లు
ఇచ్చింది: 22189 మందికి రూ.196.59 కోట్లు

### మార్పులు ఇలా..

సంఘాల లావాదేవీల ఆధారంగా గ్రామైక్య సంఘాలకు ఏ, బీ, సీ, డి పేరిట గ్రేడింగ్ ఇస్తారు. ప్రతి రెండేళ్లకోసారి మార్పులు జరుగుతాయి. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి రాకతో పరిశీలించి, కొత్త గ్రేడ్‌లు కేటాయించింది. 'ఏ'లో ఉంటే గతంలో ఏడాదికి రూ.75 లక్షల వరకు వచ్చేది. ఇక నుంచి రూ.కోటి వరకు తీసుకోవచ్చు. ఇలా మిగిలిన వాటినీ పెంచారు.

### దృష్టిసారించాల్సిందే..

ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చినా.. క్షేత్రస్థాయిలో రుణాలు పక్కదారి పడుతున్నాయి. కొందరు వీవోఏలు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. వీరికి కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నారు. మరోవైపు తమకు కావాల్సిన వారికే త్వరితగతిన రుణాలు ఇప్పిస్తున్నారని తెలుస్తోంది. విజయనగరం, డెంకాడ, జామి, కొత్తవలస మండలాల్లో జరిగిన ఘటనలపై ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో దృష్టి సారించాల్సి ఉంది.

### రూ.8 లక్షల వరకు..

మరోవైపు సభ్యుల వ్యక్తిగత రుణాన్ని కూడా పెంచారు. గతంలో ఒక్కొక్కరికీ కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు అందించేవారు. ఇక నుంచి ఒక్కో సంఘానికీ రూ.8 లక్షలిస్తారు. దీంతో వాటా పెరగనుంది. తీసుకున్న సొమ్ములో వెయ్యికి రూ.4 చొప్పున(రూ.లక్ష తీసుకుంటే రూ.400) వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తారు. ఒక వేళ లబ్ధిదారు మరణిస్తే మాఫీ చేస్తారు. తీసుకున్న రుణంపై 92 పైసల వడ్డీ పడుతుందని **స్త్రీనిధి విభాగం విజయనగరం ఏజీఎం చిట్టిబాబు** తెలిపారు.

## అక్రమం కొండంత.. కనపడదా రవ్వంత

పాలకొండ మండలంలోని నాగావళి నదీ తీరంలో పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. రాత్రివేళల్లో భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. ఇటీవల తుపాను కారణంగా నదికి వరద పోటెత్తడంతో భారీగా నిల్వలు చేరాయి. ప్రస్తుతం ప్రవాహం తగ్గడంతో చిన్న మంగళాపురం, యరకరాయపురం తదితర ప్రాంతాల్లో తవ్వేస్తున్నారు. తీరంలో పొక్లెయిన్లు, ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. అవి వెళ్లేందుకు ప్రత్యేకంగా దారి సైతం నిర్మించారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రాధాకృష్ణ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

## ఆయుష్మాన్ భవ

ఆధునిక యుగంలో మానవుడి జీవితం యాంత్రికంగా మారిపోయింది. ఉదయం నిద్రలేచింది మొదలు ఉరుకులు, పరుగులే. సరైన ఆహారం లేకపోవడం, దీనికితోడు ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. అయితే ఇంటి పెరట్లో పెంచుకునే మొక్కలు, ఆకులతో పలు వ్యాధులను దూరం చేసుకోవచ్చని ఆయుష్ వైద్య విభాగం సూచిస్తోంది. శీతాకాలంలో వచ్చే జలుబు, ముక్కు దిబ్బడ, ఆయాసం తదితర సమస్యల నుంచి ఉపశమనానికి సులువైన మార్గాలు ఉన్నాయంటున్నారు ఆయుష్ వైద్యురాలు టి.హేమాక్షి.

### మన్యంలో 8 కేంద్రాలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్ సేవలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. జిల్లాలోని సీతానగరం మండలం బూర్జ, మక్కువ మండల కేంద్రంతో పాటు దుగ్గేరు, కవిరిపల్లి, జియ్యమ్మవలస, రస్తాకుంటుబాయి, సీతంపేట, నీలానగరంలో వైద్యశాలలు నడుస్తున్నాయి. అన్నిచోట్లా ఔషధ మొక్కలను పెంచడంతో పాటు వాటి గుణాలను వివరించే బోర్డులను ఏర్పాటు చేశారు. బూర్జ ఆయుర్వేద వైద్యశాలకు రోజూ 50 నుంచి 60 మంది రోగులు వస్తున్నారని వైద్యురాలు హేమాక్షి తెలిపారు. వారికి ఆకు పసరతో తయారైన మందులను అందిస్తున్నామని చెప్పారు. – న్యూస్‌టుడే, సీతానగరం

ఉపయోగాలతో కూడిన బోర్డులు

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ పేరిట వినతులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని మీటింగ్ హాలు-4లో సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లు నిర్వహిస్తారు. పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీల ప్రస్తుత పరిస్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోను చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. రోజూ కలెక్టరేట్ సెల్లార్‌లోని పీజీఆర్ఎస్ విభాగంలో ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయొచ్చని, 'మీకోసం' వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకొని పరిష్కారం పొందొచ్చని ఆయన వెల్లడించారు.

## దోచుకోనివ్వకుండా.. దాచుకుందాం

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

దొంగతనాలు.. ఇంకోవైపు మోసాలు.. దోపిడీలు.. ఇలా అన్ని వైపుల నుంచి ప్రజలను ముప్పు వెంటాడుతోంది. సొత్తును సులువుగా ఎత్తుకెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది లాకర్ల వైపు దృష్టిసారిస్తున్నారు. బ్యాంకుల్లో వీటి వినియోగం ఇటీవల కాలంలో అధికమవుతోంది. భద్రతను దృష్టిలో ఉంచుకుని విలువైన నగలు, నగదు, డాక్యుమెంట్లను భద్రపరుచుకుంటున్నారు. మరోవైపు అద్దె రూపంలో బ్యాంకులకు ఆదాయం చేకూరుతోంది.

### బోలెడు అవకాశాలు..

విజయనగరం జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కలిపి 29 బ్యాంకుల పరిధిలో 302 శాఖలు పనిచేస్తున్నాయి. సుమారు 20 వేల లాకర్లు ఉన్నట్లు తెలుస్తోంది. డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ తరహాలో ఖాతాదారులకు కొన్ని మెరుగైన సేవలు అందిస్తున్నాయి. సెక్యూరిటీని బట్టి జిల్లా, మండల కేంద్రాల్లో అవకాశం కల్పిస్తున్నాయి. గ్రామీణం పరిధిలో కొంతమేర లాకర్ల సంఖ్య తక్కువే.

లాకరు సదుపాయంతో మేలు

**ఎస్‌బీఐలో ఇలా..** జిల్లాలో ఎస్‌బీఐ శాఖలు ఎక్కువగా ఉన్నాయి. 54 కార్యాలయాలు పనిచేస్తున్నాయి. లాకర్ల సంఖ్య కూడా అధికమే. జీఎస్టీతో కలిపి ఏడాదికి కొంతమేర కడితే అందిస్తారు.

| పరిమాణం | అర్బన్ (రూ.లలో) | గ్రామీణం |
|---|---|---|
| చిన్నవి | 2000 | 1500 |
| మధ్యస్తం | 4000 | 3000 |
| పెద్దవి | 8000 | 6000 |

వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(రూ.లలో)

| | |
|---|---|
| చిన్నవి | 500+జీఎస్టీ |
| మధ్యస్తం | 500+ |
| పెద్దవి | 1000+ |

ప్రధాన శాఖల్లో లాకర్లు..

| బ్యాంకు | సంఖ్య |
|---|---|
| ఎస్‌బీఐ | 6,500 |
| ఏపీజీవీబీ | 1,055 |
| యూబీఐ | 3,950 |
| డీసీసీబీ | 974 |

### పొందేందుకు నిబంధనలివీ..

- 18 సంవత్సరాలు నిండాలి
- ఖాతా తప్పనిసరి
- ముందుగా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- మూడేళ్ల అద్దెను ముందుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, తర్వాత ఏడాదికోసారి చెల్లించాలి.
- కొందరికి రాయితీ కల్పిస్తారు.

### ఉపయోగించే విధానం..

★ ఏడాదిలో 12 సార్లు మాత్రమే ఉపయోగించాలి. అంతకు మించితే ఒకసారికి రూ.100 చెల్లించాలి. ఈ మొత్తం బ్యాంకుల వారీగా మారుతుంది.

★ లాకర్ తాళం పోతే నిర్దేశించిన ఛార్జీ, జీఎస్టీ, తాళం ఖరీదును చెల్లించాలి.

★ తెరిచేటపుడు బ్యాంకు అధికారి, లాకర్ హోల్డర్ తప్పనిసరి.

**అధిక భద్రత:** లాకర్ల సదుపాయంతో అధిక భద్రత ఉంటుంది. ఎక్కువ మంది ఉపయోగించుకోవడంతో ఒకప్పటి కంటే డిమాండు ఎక్కువైంది. ఖాళీ ఉంటే ఎవరు మొదట వస్తే వారికే ప్రాధాన్యమిస్తారు. లోపాలకు ఆస్కారం లేకుండా దృష్టిసారిస్తున్నాం. అన్నివర్గాల వారూ సద్వినియోగం చేసుకోవచ్చు. – రమణమూర్తి, లీడ్‌బ్యాంకు ప్రబంధకుడు

## 186 ఆలయాల్లో సీసీ కెమెరాలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఆలయాల రద్దీ, ఏర్పాట్ల పర్యవేక్షణకు 186 ప్రాంతాల్లో తొలి విడతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని దేవాదాయశాఖ జిల్లా అధికారి(డీఈడీవో) ఎస్.రాజారావు చెప్పారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 350 ఆలయాలు శాఖ పరిధిలో ఉన్నాయని, వీటిలో రూ.44.70 లక్షల వ్యయంతో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంబంధిత ఈవోలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. మరో 598 కెమెరాల ఏర్పాటుకు అంచనాలు వేశామని తెలిపారు. పార్వతీపురంలోని సత్యనారాయణస్వామి ఆలయం, అడ్డాపుశీల-విశ్వేశ్వర ఆలయం, పాలకొండ- కోటదుర్గమ్మ, సాలూరు- శ్యామలాంబ ఆలయాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

అడ్డాపుశీల ఆలయంలో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ

## జైకొట్టక.. పనులు జరగక

– న్యూస్‌టుడే, పార్వతీపురం, జియ్యమ్మవలస

ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి సుమారు రూ.153 కోట్లున్నాయి. కానీ వినియోగించడం లేదు. దీంతో ఏటా అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. రెండు జిల్లాల్లో జైకా నిధులతో ప్రారంభమైన పనుల్లో స్తబ్ధత నెలకొంది. వైకాపా హయాంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. తాజాగా అంచనాలు పెరగడంతో కదలిక లేకుండా పోతోంది.

లైనింగ్ పనులు చేపట్టక అధ్వానంగా వట్టిగెడ్డ కుడి ప్రధాన కాలువ

రూ.153 కోట్లున్నా పారని నీరు

### సాగునీటి లక్ష్యం ఇలా..

వెంగళరాయ సాగర్ ద్వారా బొబ్బిలి, మక్కువ మండలాల్లోని 24 వేల ఎకరాలకు, వట్టిగెడ్డ ద్వారా జియ్యమ్మవలస, గరుగుబిల్లిలోని 16,684 ఎ., పెద్దగెడ్డతో పాచిపెంట, సాలూరు, రామభద్రపురంలో 12 వేలు, పెదంకలాం ఆనకట్ట నుంచి బలిజిపేట మండలంలోని 9 వేల ఎకరాలను సాగునీరు అందాలి.

### 30 శాతం పెరుగుదల..

మధ్య తరహా సాగునీటి పథకాల ఆధునికీకరణకు 2019-20 నాటి ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలు రూపొందించారు. అప్పట్లో కొందరు గుత్తేదారులు పనులు చేపట్టారు. ధరలు పెరిగిన నేపథ్యంలో ముందుకు రావడం లేదు. వారిని తొలగిస్తే కొత్తవారికి అప్పగించాలి. ఈమేరకు టెండర్లు పిలవాలి. ఇలాగైతే అదనంగా రూ.30 కోట్ల వరకు అవసరమని భావిస్తున్నారు.

### గుత్తేదారులతో మాట్లాడుతున్నాం

'జలవనరుల శాఖలో పనులు చురుగ్గా సాగే కాలం ఇదే. సంబంధిత గుత్తేదారులతో మాట్లాడుతున్నాం. అన్నీ అనుకూలిస్తే త్వరలోనే ప్రారంభం కావచ్చు' అని **జలవనరులశాఖ ఈఈ డీఎస్.ప్రదీప్** తెలిపారు. ★ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని **మంత్రి జి.సంధ్యారాణి** పేర్కొన్నారు.

నిధుల వినియోగం ఇలా.. (రూ.కోట్లలో)

| జలాశయం | కేటాయింపు | ప్రగతి శాతం | పెండింగ్ బిల్లులు |
|---|---|---|---|
| వెంగళరాయసాగర్ | 63.50 | 22 | 8.29 |
| వట్టిగెడ్డ | 44.55 | 15 | 3 |
| పెద్దగెడ్డ | 28.18 | 10 | 1.47 |
| పెదంకలాం ఆనకట్ట | 17.30 | 5 | 0.36 |

(c) eenadu

## నెడితేనే నడుస్తా..

గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గుముఖం పట్టాయి. చల్లదనానికి ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. రాత్రి సమయాల్లో కాంప్లెక్సుల్లో నిలిపి ఉంచిన పలు బస్సులు స్టార్ట్ కావడం లేదు. పాలకొండ ఆర్టీసీ బస్సు నిలయంలో ఆదివారం కనిపించిన పరిస్థితి ఇది. బస్సుల కండీషన్ బాగానే ఉన్నాయని శీతాకాలంలో మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

## వనమంతా సందడి

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: తాటిపూడిలో కార్తిక వనవిహారాల నేపథ్యంలో ఆదివారం పర్యాటకుల తాకిడితో సందడి వాతావరణం నెలకొంది.

- కొప్పలవెలమ సామాజిక వర్గం ప్రతినిధులు వనవిహారంలో పాల్గొని జీబీ అప్పారావు విగ్రహానికి నివాళులు అర్పించారు. వనంలో అంతా ఉత్సాహంగా గడిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.
- కళింగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వన విహారం ఉత్సాహంగా జరిగింది. జిల్లా మలేరియా అధికారిణి మణి..యూనిట్ సభ్యులు, ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ హాజరయ్యారు.
- జల విహారానికి సందర్శకులు పోటీ పడ్డారు. వనవిహారం సందర్భంగా వందలాదిగా వాహనాలు రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

దళాయివలస జలపాతం వద్ద సందర్శకులు

పాలకొండ: మ్యూజికల్ చైర్ పోటీలో వనితల ఉత్సాహం

## సూరీడూ యాడున్నావయ్యా..

జిల్లా మంచుదుప్పటి నుంచి బయటకు రావడం లేదు. గత నాలుగు రోజులుగా చలితీవ్రత పెరిగింది. సాయంత్రం 5 గంటలకే మంచు దట్టంగా పడి చీకటి పడుతోంది.. ఉదయం 8 గంటలైనా వీడడం లేదు. వేపాడలో ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో కనిపించిన చిత్రమిది. – న్యూస్‌టుడే, వేపాడ

## 'హాట్ ఎయిర్ బెలూన్' ఆగింది..

సీతంపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన హాట్ ఎయిర్ బెలూన్‌ను ఆపేశారు. దీన్ని ఏర్పాటు చేసిన తర్వాత పర్యాటకులతో పైకి వెళ్లే సమయాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా దీన్ని ఆపేశారు. అనుకూలమైన పరిస్థితులు ఏర్పడితే తిరిగి ప్రారంభిస్తామన్నారు.

## దుర్గమ్మను తాకిన సూర్యకిరణాలు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మను సూర్యకిరణాలు తాకాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో మూలవిరాట్‌పై ఆదిత్యుని కిరణాలు పడ్డాయి. 5 నిమిషాల పాటు అమ్మవారి విగ్రహంపై భానుడి కిరణాలు ప్రసరించాయి. ఆలయ చరిత్రలో ఇదే తొలిసారని ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.
– న్యూస్‌టుడే, పాలకొండ

# ఊరూరా.. విజ్ఞాన వీచిక

చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా పుస్తకాలు కొని చదివే స్థోమత లేక, పోటీ పరీక్షలకు దూరమైన నిరుద్యోగులకు వరంగా మారుతున్నాయి ఈ గ్రంథాలయాలు. వ్యక్తులు.. సంఘాల సంకల్పం పాఠకులకు విజ్ఞాన కాంతులు పంచుతోంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రజా గ్రంథాలయాలు మరింత మందికి స్ఫూర్తిబాట పరుస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వారి సేవలపై 'న్యూస్‌టుడే' కథనమిది.



### నిరుద్యోగుల్లో నవోదయం

కూర్మరాజుపేటకు చెందిన రాజేశ్వరరావు గ్రూప్-1 పరీక్షల్లో డీఎస్పీగా ఎంపికై ప్రస్తుతం జైళ్లశాఖ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఎన్.శ్రీనివాసరావు ఏటీడబ్ల్యూవోగా, వి.నాగరాజు, ఇ.శ్రీను, బి.గణేష్ ఎస్సైలుగా ఇలా చెబుతూ పోతే పలువురి యువత జీవితాల్లో నవోదయం నింపింది ఈ గ్రంథాలయం. ఇక్కడ సాధన చేసే టీచర్లు, కానిస్టేబుళ్లుగా పలువురు ఎంపికయ్యారు. సాలూరు పట్టణంలోని **నవోదయ సేవా సమితి గ్రంథాలయం** నిరుద్యోగ యువతకు కొండంత అండగా నిలుస్తోంది. వెలమపేట సీతారామ ధర్మశాల ఆవరణలో ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలతో పాటు అకడమిక్ పుస్తకాలు అందుబాటులో ఉంచారు. పిల్లల కోసం నిర్వాహకులు ప్రత్యేక పుస్తకాలు తెప్పిస్తున్నారు. సమితి సభ్యులంతా ఒక్కమాటపై ఉండి అవసరమైన పుస్తకాలు సమకూర్చుతున్నారు. –న్యూస్‌టుడే, సాలూరు

### కుమారుడి పేరిట చదువుల కోవెల

పాలకొండ పట్టణంలో **వై.శశాంక్‌రావు మెమోరియల్ గ్రంథాలయం** యువతకు అండగా నిలుస్తోంది. సుప్రీం న్యాయవాది ఎలకల రాజగోపాలరావు తనయుడి జ్ఞాపకార్థం 2018లో దీన్ని స్థాపించారు. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఇది తెరిచి ఉంటుంది. పోటీపరీక్షలకు అవసరమైనవి, పిల్లలు, వృద్ధులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. అంతర్జాల సౌకర్యం కల్పించారు. నిత్యం 50 మంది వరకు యువత వస్తున్నారు. సచివాలయ, ఉపాధ్యాయ, రైల్వే, కానిస్టేబుళ్లతోపాటు పలు రంగాల్లో ఇక్కడ చదువుకున్న 27 మంది ప్రభుత్వ కొలువులు పొందారని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

### విరాళంతో విజయీభవ

రాజాం మండలం కంచరాం గ్రామంలో యువత స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గ్రామస్థుల సహకారంతో ప్రజా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.15 లక్షలతో భవనాన్ని గతేడాది అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల మరికొందరు దాతలు ముందుకు రావడంతో మరుగుదొడ్లు, ప్రహరీ ఏర్పాటు చేశారు. ఇంకా రూ.7 లక్షలు నిల్వ ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్థులంతా సంక్రాంతికి స్వగ్రామం వస్తుంటారు. ఆ మూడు రోజులూ గ్రంథాలయం కోసం విరాళాలు సేకరిస్తారు. ఇక్కడ సాధన చేసిన 50 మంది వరకూ పోలీసు, ఆర్మీ, రైల్వే, బ్యాంకు, బీఎస్ఎఫ్, సచివాలయం.. తదితర ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం మరో రూ.3 లక్షల విలువైన పుస్తకాలు సమకూర్చుకునేందుకు నిర్ణయించారు. – న్యూస్‌టుడే, రాజాం

గ్రామంలో విరాళాలు సేకరిస్తున్న యువత

### అవకాశాల వేదిక.. యువశ్రీ

అతనో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. తనలాగే నిరుద్యోగ యువత ఉద్యోగం సాధించేలా సాయపడాలనుకున్నారు. యువశ్రీ పేరిట గరివిడిలో గ్రంథాలయం స్థాపించారు గరివిడికి చెందిన ఎస్.ఎల్.ఎన్ సతీష్ రత్నగిరి. 'పుస్తకాలను బహుమతిగా ఇవ్వండి.. యువతకు చేయూతనివ్వండి' అనే నినాదాన్ని స్థానికంగా బలంగా తీసుకెళ్లారు. దాతలు వి.గోపి, వి.శ్రీనివాసరావు స్పందించి గ్రంథాలయానికి శాశ్వత భవనాన్ని సమకూర్చారు. సేవను అక్కడితో ఆపేయలేదు. రోజూ దిన పత్రికల్లో వస్తున్న విద్య, ఉద్యోగ, ఉపాధి సమాచారంతో ఈ-బుక్‌ను రూపొందించి సామాజిక మాధ్యమాల ద్వారా యువతకు అందుబాటులో ఉంచుతున్నారు సతీష్. ప్రతినెలా పుస్తకరూపంలో సమకాలీన కరదీపికను తయారు చేసి అందిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల ఖాళీల సమాచారం, జాబ్ మెటీరియల్‌ను ఈ-పుస్తక రూపంలో అందిస్తున్నారు. నిత్యం అయిదు గంటలపాటు ఈ సేవలకు వెచ్చిస్తానని, పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగం సాధించామని పలువురు చెప్పడం ఎనలేని సంతృప్తి ఇస్తోందని సతీష్ చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గరివిడి

## యూటీఎఫ్ నమూనా పరీక్షకు స్పందన

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ నమూనా ప్రవేశ పరీక్షకు 303 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజయనగరం జిల్లా నుంచి సాయిసుదీప్(75), గంట హనూక్(73.25), మన్యం నుంచి ఎ.వేణుమాధవ(85), ఎం.సమన్విత(80), కె.రాఘవ(77.5), ఎస్.దామిని(76.25), సీహెచ్.వికాస్(76.25), వి.యశ్వంత్(65) అధిక మార్కులు సాధించారు.

విజేతలతో యూటీఎఫ్ సంఘ నాయకులు

## తూర్పుకాపుల ఆత్మీయ సమ్మేళనం

విజయనగరం మయూరికూడలి/ఉడా కాలనీ, న్యూస్‌టుడే: రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక పరంగా అవకాశం ఉన్నవారు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం విజయనగరం శివారు శ్రీనివాసనగర్ వద్ద తూర్పుకాపు ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ సంఘానికి ఎటువంటి అవసరాలున్నా ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, మాజీ మంత్రి పడాల అరుణ, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని, ఏ అవసరమైనా ముందుంటామన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన సంఘ సభ్యులను సన్మానించారు. బాలల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉమ్మడి జిల్లా నుంచి సామాజిక వర్గీయులు కుటుంబాలతో పాల్గొన్నారు.

పాల్గొన్న మంత్రి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, ఎమ్మెల్యే కళా వెంకటరావు తదితరులు

జలపాతం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్

## పర్యాటకాభివృద్ధికి చర్యలు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో ప్రకృతిసిద్ధంగా ఉన్న అందాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం కుస జలపాతాన్ని ఆదివారం సందర్శించి, పూజలు చేశారు. సందర్శకులు సేదతీరేందుకు వెదురు కర్రలతో బెంచీలు ఏర్పాటు చేసి, శ్రమదానంతో అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులను కోరారు. అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలు వివరించారు. తహసీల్దారు శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## సంక్రాంతికి ధాన్యం కొనుగోలు పూర్తి

గజపతినగరం, న్యూస్‌టుడే: గతంలో లేనివిధంగా ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు నవంబరులోనే ప్రారంభించామని, సంక్రాంతి నాటికి జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం పీఏసీఎస్‌లో ఆదివారం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో డిసెంబరులో ప్రారంభించి సంక్రాంతికి చెల్లింపులు చేయడం గగనంగా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు పాత బకాయిలు రూ.600 కోట్లు చెల్లించామన్నారు. వ్యవసాయ పరికరాలపై రాయితీ సైతం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, ఏఎంసీ, పీఏసీఎస్ అధ్యక్షులు గోపాలరాజు, బంగారు నాయుడు, డీఆర్వో శ్రీనివాసమూర్తి, పౌరసరఫరాల డీఎం శాంతి, డీఎస్‌వో మురళీనాథ్, డీఏవో రామారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్

## వనరులు పెరగాలి.. యాప్‌లు తగ్గాలి

### వైద్య శాఖకు సీఆర్ఎం సూచనలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: మన్యంలో వైద్య సేవల పరంగా లోటుపాట్లను కేంద్ర సమీక్షా బృందం(సీఆర్ఎం) గుర్తించింది. వాటిని అధిగమించాలని వైద్య శాఖకు సూచించింది. ఆరోగ్య స్వస్థత కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు అన్నిస్థాయిల్లో అందుతున్న వైద్య సేవలపై ఈనెల 3 నుంచి 8 వరకు ఆరురోజులపాటు కేంద్ర సమీక్షా బృందం పరిశీలించింది. మారుమూల ప్రాంతాలను కూడా సందర్శించి, అక్కడి గిరిజన ప్రాంత ప్రజలతో డాక్టర్ దీపికాశర్మ, నీరజ్‌కుమార్, రమణల బృందం నేరుగా మాట్లాడింది. వసతులు, సేవల్లో గుర్తించిన లోపాలను సరిదిద్దాలని సిఫార్సు చేసింది.

- జిల్లాలో ఎక్కువ భాగం గిరిజన ప్రాంతం కావడం వల్ల చాలాచోట్ల అంతర్జాల సేవలు, విద్యుత్తు పంపిణీలో ఇబ్బందులు ఉన్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 284 ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో మెరుగైన సేవలు అందేందుకు వీలుగా 'సౌరశక్తి'ని వినియోగించి విద్యుత్తు ఉత్పత్తి చేసే వ్యవస్థలు ఏర్పాటు చేయాలి.
- క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది పనిలో లెక్కకు మించిన 'యాప్'లు వినియోగించాల్సి వస్తోంది. 'యాప్'లు ఏకీకృత విధానంలో రూపొందించి అమలు చేస్తే పని సులభతరం అవుతుంది.
- సచివాలయాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఉన్నప్పటికీ వారిపై వైద్య ఆరోగ్య శాఖకు పరిమితమైన అధికారాలు మాత్రమే ఉన్నాయి. సేవలు అందని పరిస్థితి ఉంది. శాఖకు పూర్తి స్థాయి అధికారాలు ఉండాలని సూచించింది.
- జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖకు ఉండాల్సిన వ్యవస్థీకృత వనరులు ఏవీ లేవు. ఔషధ పంపిణీ కేంద్రం (సెంట్రల్ డ్రగ్ స్టోర్), టీకాలు భద్రపరిచేందుకు 'కోల్డ్ లింకేజీ సిస్టమ్' ఏర్పాటు చేయాలి.
- క్షేత్రస్థాయిలో ఆరోగ్య, వైద్య కార్యక్రమాల అమలులో భాగస్వాములవుతున్న వారికి సమగ్ర అవగాహన లేదు. ఇందుకోసం కార్యక్రమాలు రూపొందించాలి.
- జిల్లాలో క్షయ విముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న 'నిక్షయమిత్ర'ల సంఖ్యను పెంచాలి. అవసరమైతే కార్పొరేట్ సామాజిక బాధ్యతగా కొందరిని దత్తత తీసుకొనేలా చూడాలి.

వైద్య సేవలపై కేంద్ర సమీక్షా బృందం సమావేశం (పాత చిత్రం)

### సానుకూల సూచనలిచ్చారు

సీఆర్ఎం బృందంసానుకూల సూచనలిచ్చింది. వాటిని రాష్ట్రస్థాయి సమావేశంలోనూ ప్రస్తావించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– డా.భాస్కరరావు,డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

## చట్టాలపై అవగాహన పెరగాలి

భోగాపురం, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఆదివారం మండలంలోని నందిగాం పంచాయతీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టం, న్యాయం దృష్టిలో అంతా సమానమేనని.. అందరికీ ఉచిత సేవలు అందించాలనే లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఎల్‌ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గయ్య, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె.విజయలక్ష్మి, సీనియర్ సివిల్ జడ్జి బి.లక్ష్మీకుమారి, సీఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

**పంచాయితీ అప్రూవల్** 30x50 సైజు బిట్స్ చ॥గ॥ 5500 పార్వతీపురం మం॥ నర్సిపురం గ్రామ పంచాయితీ కారాడవలసలో సైట్స్ సేల్ ✆ 8331852489.

**గజం 5,500** రూ. మాత్రమే. 100 అడుగుల రోడ్‌ని అనుకొని NH16 రణస్థలంకి కేవలం 7KM 133 గజాలు 7,50,000 మాత్రమే. ✆ 8978679512.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

JOBS

JOB OPPORTUNITY for Retd, Officials Best Opportunity ★ PROPERTY ADVISING CHIEF MANAGERS for Vizag and Vizianagaram Prefer State, Central Teachers-Banking Govt/ Private Factories any Job Exp., any Degree- Housewives-full/ Part time Age: 34+years Monthly Package : 85,000/- Including Incentives (T&C Apply) Interviews on : 17th, 18th, 19th Nov25 Con: Dr.SANJEEVA RAO SEETHAMMADHARA-VSP Ph: 9989245662

**VZM 90రోజులు** ఉచితంగా Electronics & Hardware సెక్టార్‌లో ట్రైనింగ్‌తో పాటు ఉద్యోగం కల్పించబడును. SSC (పాస్), ఇంటర్, డిగ్రీ, ITI (పాస్ / ఫెయిల్) Age 18 to 35 Cont: 7036406699, 9493359472.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

**ప్రముఖ సంస్థలో** పనిచేయుటకు డ్రైవర్స్ జీ:15,000 to 18,000 హెల్పర్స్12k to15k ఆఫీస్‌బోయ్ 8,000/- టెలికాలర్స్:7k to 10k ✆: 6305450460.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## కొఠియా సమస్య పరిష్కరించండి

### ఒడిశా సీఎంను కోరిన మంత్రి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: ఆంధ్రా ఒడిశా సరిహద్దు కొఠియా వివాదాస్పద గ్రామాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కోరినట్లు గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన బిర్సా ముండా జయంతి వేడుకలకు ఒడిశా సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పలు సమస్యలపై చర్చించామన్నారు. 50 ఏళ్లుగా డోలియంబ, ముడకారు, కొఠియా, దిగువశెంబి, ఎగువశెంబి తదితర గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందినవో నిర్ధారించలేదు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, వైద్య సేవలు అందించేందుకు వెళ్లినా ఆంధ్రా సిబ్బందిని ఒడిశా అధికారులు అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారని ఒడిశా సీఎంకు వివరించామన్నారు.


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237


## వీరఘట్టంలో చోరీ

వీరఘట్టం, న్యూస్‌టుడే: పట్టణంలో శనివారం రాత్రి జరిగిన ఆభరణాల చోరీపై పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాదరావు క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌లతో ఆదివారం పరిశీలన చేశారు. టంగుడు నరసింహమూర్తి ఇంటికి తాళం వేసి భార్యతో కలసి స్థానికంగా జరుగుతున్న అయ్యప్పస్వామి ప్రతిష్ఠ మహోత్సవానికి వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న ఆభరణాలు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 తులాల బంగారం, 20 తులాల వెండి చోరీ జరిగినట్లు కేసు నమోదు చేశామని ఎస్సై జి.కళాధర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## యువకుల అతివేగం.. అనర్థం

### కారు అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అతివేగంతో ఓ కారు.. రోడ్డు దాటుతున్న మనిషిని ఢీకొట్టి.. .రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి ఎక్కింది. ఈ ఘటన ఆదివారం అశోక్ నగర్ సమీపంలో చోటుచేసుకుంది. కొత్తపేట-రింగురోడ్డు మీద అతివేగంగా వెళ్తున్న కారు అశోక్‌నగర్ మలుపు వద్ద రోడ్డు దాటుతున్న నర్సింహులు అనే వ్యక్తిని ఢీకొట్టింది. వాహన బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న యువకుడు, పక్కన మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డారు. నర్సింహులు రెండు కాళ్లూ బాగా దెబ్బతినడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

## వ్యాను బోల్తా: 11 మందికి గాయాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం. . విశాఖ నగరంలోని ఆరిలోవ కాలనీకి చెందిన పలు కుటుంబాల సభ్యులు, స్నేహితులు 16 మంది విజయనగరం జిల్లా గంట్యాడ మండలం ఎగువ కొండపర్తిలో ఉన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఓ వ్యానులో వెళ్లారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం 4 గంటల సమయంలో తిరిగి బయలుదేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం సమీపంలో జలపాతం చేరువకు చేరే సమయంలో వాహనం బ్రేక్ ఫెయిల్ అయ్యి, అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివప్రసన్న, స్నేహ, ఎల్లమ్మ, రాములమ్మ, శిరీషలకు ఓ మోస్తరు, మిగిలిన వారికి స్వల్పంగా.. మొత్తం 11 మంది గాయపడ్డారు. వీరిని ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరంతా వేరే వాహనంలో విశాఖ వెళ్లిపోయారు.

బోల్తాపడిన వ్యాను

తలకు గాయమైన శిరీష

## చలి తీవ్రతకు వృద్ధుడి మృతి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: చలి తీవ్రతకు తట్టుకోలేక వృద్ధుడు మృతి చెందిన ఘటన ఎస్.కోట మండలం కురిడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గిరిజన సంఘం నాయకుడు గౌరీష్, స్థానికుల వివరాల ప్రకారం.. దారపర్తి పంచాయతీలోని కురిడి గ్రామానికి చెందిన మజ్జి తమ్మన్న(60) చలికి తట్టుకోలేక చనిపోయారు. గిరిశిఖర గ్రామాల్లో మంచు కురుస్తోంది. ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోవడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. కలెక్టరు స్పందించి రగ్గులు, దుప్పట్లు గిరిజన ఉప ప్రణాళిక ద్వారా అందజేయాలని నాయకులు కోరారు.



తమ్మన్న (పాత చిత్రం)

### చికెన్ ధరలు

| రకం | బ్రాయిలర్ |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | 127 |
| డ్రెస్డ్ | 224 |
| స్కిన్‌లెస్ | 234 |

(c) eenadu

## గెడ్డ పొంగితే వీధి దాటలేం!

తుపాను ప్రభావంతో గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతం పాలకొండ పట్టణం గారమ్మ కాలనీలోని పలు వీధుల్లో నీరు చేరుతోంది. రహదారిపై ప్రవహిస్తుండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. విషసర్పాలు సంచరించే అవకాశం ఉందని, జారి పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

## రెండేళ్లుగా.. అసంపూర్తిగానే..

గంగాడ గ్రామంలో రెండేళ్ల కిందట ప్రారంభించిన రైతు సేవా కేంద్ర భవనం నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. ఈ భవన నిర్మాణం చేపట్టిన గుత్తేదారుడు చనిపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం గోడలపై పిచ్చి మొక్కలు పెరిగాయి. దీని నిర్మాణానికి ప్రభుత్వం అప్పట్లో రూ.21.80 లక్షలు మంజూరు చేసింది. తదుపరి చర్యలు చేపడతామని పంచాయతీరాజ్ శాఖ జేఈ అంబేడ్కర్ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

## నిర్మించి.. నిరుపయోగంగా వదిలేశారు

సుమిత్రాపురంలో కోనేరు గట్టుపై నిర్మించిన రక్షిత పథకం ఓవర్ హెడ్ ట్యాంకు పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. గ్రామంలో తాగునీటి కుళాయిల పైపులైను మరమ్మతులకు గురికావడంతో సరఫరా ఆపేశారు. అప్పటినుంచి పలు కారణాలతో బాగు చేయలేదు. దీంతో తాగునీటి అవసరాలకు గొట్టపు బావుల పైనే గ్రామస్థులు ఆధారపడుతున్నారు. సువర్ణముఖి నది నుంచి జలం అందించాలని కోరుతున్నారు. నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు.
– న్యూస్‌టుడే, సీతానగరం



## ఇంకెన్నాళ్లీ రాళ్ల దారిలో..?

కురుపాం మండలం గొటివాడ పంచాయతీ కొత్తబల్లకోట గిరిజన గ్రామానికి వెళ్లేందుకు రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న మట్టిరోడ్డు ఇది. అత్యవసర సమయాల్లో 108 వాహనాలు వెళ్లలేక గర్భిణులు, రోగులు కాలి నడకన వెళ్లాల్సి వచ్చింది. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మాణానికి పదేళ్లుగా పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు అన్నారు.
– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

## అసలే మలుపు.. ఆపై తుప్పలు

పాలకొండ-రాజాం ప్రధాన రహదారిలో గోపాలపురం గ్రామం వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. రహదారికి ఇరువైపులా తుప్పలు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సమీపంలోకి వచ్చేంత వరకు కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. – న్యూస్‌టుడే, పాలకొండ

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

| | |
|---|---|
| పార్వతీపురం | 8008566244 |
| పాలకొండ | 8008574299 |
| సాలూరు | 8008786820 |
| కురుపాం | 9849044696 |

?: పార్వతీపురం మండల కార్యాలయంలో చెట్టు పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉపాధిహామీ కంప్యూటర్ గది, కార్యాలయం పక్కన చెట్టు ప్రమాదకరంగా ఉన్నాయి. - గోవింద, తాళ్లబురిడి ★ చర్యలు తీసుకుంటాం. - కె. సత్యం, ఎంపీడీవో - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: సీతానగరం మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించాలి. - రామారావు, స్థానికుడు ★ సిబ్బందితో చెప్పి, తొలగిస్తాం. - సురేష్, ఈవో - న్యూస్‌టుడే, సీతానగరం

?: సీలంవలస గ్రామంలో బోరు మరమ్మతులకు గురైంది. తాగునీటి ఇబ్బందులు పడుతున్నాం. - గ్రామస్థులు ★ వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపడతాం. - రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ

?: పాలకొండలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. - రామారావు, విశ్రాంత ఉద్యోగి ★ ఫాగింగ్ చేపడతాం. - రత్నరాజ్, నగర పంచాయతీ కమిషనర్ - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: గుడివాడ-కొట్టిశ నిర్వాసిత ఎంపీ పాఠశాలకు చేరుకునేందుకు పక్కా రహదారి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

★ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తదుపరి చర్యలు చేపడతాం. - ఎస్.సింహాచలం, ఎంఈవో – న్యూస్‌టుడే, బలిజిపేట

?: పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సులో మరుగుదొడ్లు వినియోగంలో లేవు. -తేజేశ్వరరావు, ప్రయాణికుడు

★ నీటి సదుపాయం కల్పించి వినియోగంలోకి తీసుకువస్తాం. -పి.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డీఎం –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

## చలిపులి.. చిన్నారి భద్రం మరి

ఓ వైపు చల్ల గాలి, మరోవైపు మంచు ప్రభావం, తగ్గిన ఉష్ణోగ్రతలతో చిన్నారులు వేగంగా జలుబు, దగ్గుకు గురవుతున్నారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. న్యుమోనియా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని తొలి దశలోనే కట్టడి చేయకపోతే ప్రాణాంతకంగా మారుతుందని గుర్తించిన ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తోంది. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పాపను పరీక్షిస్తున్న వైద్యురాలు

### ఇంటింటి సర్వే

ఆరు నెలలలోపు చిన్నారులపై చలి ప్రభావం అధికంగా ఉంటుంది. న్యుమోనియాకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వీరిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో వేగంగా బ్యాక్టీరియా, వైరస్ వ్యాప్తి చెందుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు ఉపక్రమించింది. ఇంటింటి సర్వే చేస్తోంది.

### ఏజెన్సీలో బాధితులు ఎక్కువ..

జిల్లాలోని మొత్తం 2,064 అంగన్‌వాడీ కేంద్రాల్లో 54 వేల మంది చిన్నారులు ఉన్నారు. ప్రస్తుతం మైదాన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీలు, రాత్రి 20 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో పగలు 23, రాత్రి 18-15 డిగ్రీలకు పడిపోతున్నాయి. నిజానికి మన్యంలో ఏజెన్సీ ప్రాంతమే ఎక్కువ. ఈ నేపథ్యంలో శ్వాస సంబంధిత ఇబ్బందులతో వస్తున్న పిల్లల కేసులే రోజుకు వందల్లో ఉంటున్నాయి. ఒక్క జిల్లా ఆసుపత్రికి రోజుకు 80 మంది వరకు చిన్నారులు రాగా.. ఇందులో 50-60 మంది జలుబు, దగ్గు, ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడేవారు ఉంటున్నారు.

**వెచ్చగా ఉంచాలి:** శీతాకాలంలో చిన్నారుల్లో శ్వాససంబంధ సమస్యలు కనిపిస్తే సొంత వైద్యం చేయొద్దు. తక్షణం వైద్యులకు చూపించాలి. వీలైనంత వరకు పిల్లల చుట్టూ వెచ్చని వాతావరణం ఉండేలా చూడాలి. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో బయట తిప్పకూడదు. కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. సర్వేలో న్యుమోనియా లక్షణాలు గుర్తిస్తే తక్షణం వైద్యం అందిస్తాం. – జగన్మోహనరావు, ప్రోగ్రాం అధికారి

## త్రిలోకేశాయ.. పాహిమాం

కార్తిక మాసం ఆఖరి ఆదివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి అభిషేకాలు, అష్టోత్తరాలతో పూజలు చేశారు. తెప్ప దీపాలు, అఖండ జ్యోతులు వెలిగించారు. భామిని మండలం ఘనసరలోని శ్రీ మధనకామేశ్వరస్వామి, పాచిపెంట త్రిమూర్తుల ఆలయాల్లో కుంకుమ పూజలు చేశారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ గ్రామీణం, భామిని, పాచిపెంట

పాలకొండ: నక్కలపేట మృత్యుంజయేశ్వర ఆలయంలో దీపారాధన

పార్వతీపురం పట్టణంలో అభిషేకాలు అందుకున్న పశుపతినాథుడు

## సువర్ణముఖి పరవళ్లు

తుపాను హెచ్చరిక నేపథ్యంలో వెంగళరాయ సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో సువర్ణముఖి నది పొంగి ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి నది నిండుగా ఉండటంతో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇరువైపులా సమీప ప్రాంతాల్లోని స్థానికులను అప్రమత్తం చేశారు. పొలం పనులకు నదిని దాటి వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని గ్రామాల్లో దండోరా వేయించారు.
– న్యూస్‌టుడే, సీతానగరం

## పచ్చని తోటల్లో.. పండగ వాతావరణంలో..

బలిజిపేట: తుమరాడ తోటలో చెట్ల నీడన భోజనాలు

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం, పాలకొండ గ్రామీణం, బలిజిపేట, గరుగుబిల్లి గ్రామీణం, పాచిపెంట

కార్తిక మాసం సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో వన భోజనాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో పచ్చని తోటల్లో చేరి ఆనందంగా గడిపారు. నదీ తీర ప్రాంతాల్లో ఎక్కువ సందడి కనిపించింది. చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా కలిసి ఆటలాడారు. పలుచోట్ల నృత్య ప్రదర్శన నిర్వహించారు. గరుగుబిల్లి మండలం సుంకి వద్ద తోటపల్లి జలాశయం గట్టు, ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, చిన్నారుల పార్కులో పర్యాటకుల సందడి నెలకొంది. పార్వతీపురం అడ్డాపుశీల, బాలగుడబ, సీతారాంపురం తోటలు, బలిజిపేట మండలం వంతరాం, అంపావల్లి, తుమరాడ, వెంగాపురం, పలగర, చిలకలపల్లి గ్రామాల్లోని ప్రజలు ఆనందంగా గడిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాచిపెంట మండలం పి.కోనవలస, శిష్టకరణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పాలకొండ మండలం అన్నవరం తోటల్లో వన భోజనాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తోటపల్లి పార్కులో చిన్నాపెద్దా ఆటలు

పాచిపెంట: పి.కోనవలసలో మహిళల సందడి

పాలకొండ: అన్నవరంలో చిన్నారుల కేరింతలు

## మృతిపై విచారణకు డిమాండు

మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు

పార్వతీపురం గ్రామీణం/పట్టణం, న్యూస్‌టుడే: మద్యం మాన్పిస్తామంటూ వ్యక్తిని తీసుకెళ్లిన సంస్థ.. మృతదేహాన్ని అప్పగించిందని, దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర కార్యదర్శి రంజిత్ కుమార్, సీపీఐ ప్రతినిధి సంగాం తదితరులు డిమాండు చేశారు. ఆదివారం పెదమరికి పంచాయతీ కొత్తఊరుకి చెందిన ఎం.భాస్కరరావు(35) మృతదేహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ.. మద్యానికి బానిసైన భాస్కరరావును వైద్యం అందించి, దానికి దూరం చేస్తామని పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థ మూడు రోజుల క్రితం వైకేఎం నగర్‌లో ఓ గృహానికి తీసుకెళ్లారని చెప్పారు. శనివారం ఆయన మృతిచెందారని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. అప్పటికే ఉన్న అనారోగ్య సమస్యల కారణంగా బాధితుడు మృతిచెందినట్లు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

## అరుదైన శస్త్రచికిత్స

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంఎస్‌వీ పోలీక్లినిక్ వైద్యుడు ఎం.రోహిత్ ఓ బాలికకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. వీరఘట్టంకు చెందిన బాలిక కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చింది. పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాదు శరీరం లోపల కుడివైపు ఉండాల్సిన పిత్తాశయం, కాలేయం ఎడమ వైపు ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ఐసీజీ టెక్నాలజీతో పిత్తాశయాన్ని తొలగించారు. తర్వాత అన్ని పరీక్షలు చేసి బాలిక ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించి డిశ్చార్జి చేసినట్లు ఆయన చెప్పారు. 20 వేల మందిలో ఒకరికి ఇలా ఉంటుందని తెలిపారు.

## అక్రమ రవాణాకు అడ్డుకట్ట

పాలకొండ, న్యూస్‌టుడే: మండలంలోని అంపిలి గ్రామ సమీపంలో నాగావళి నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. ఈ నెల 9న 'ఈనాడు'లో 'కన్ను పడింది... కరకట్ట తెగింది' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టారు. కరకట్ట వద్ద కందకాలు ఏర్పాటు చేయించారు.

## ప్రమాదం జరగకుండా ఏర్పాట్లు

గరుగుబిల్లి గ్రామీణం: మండలంలోని నాగావళి కుడి పిల్ల కాలువ స్లూయిస్ వద్ద రంధ్రాన్ని అధికారులు తాత్కాలికంగా రాళ్లు పేర్చి, కప్పారు. తోటపల్లి పర్యాటకానికి వచ్చే సందర్శకులు ఇక్కడ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండటంపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన కథనానికి స్పందించారు.

## కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వలసబల్లేరు పంచాయతీ ఆగంగూడ గిరిజన గ్రామ రహదారి కోతకు గురైంది. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన చిత్ర సమస్యపై గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారి ఎ.మణిరాజు స్పందించారు. బాగుకు రూ.4.50 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## అమ్మో..ఎప్పుడు కూలుతుందో!

గెడ్డకోల-కురసింగి గ్రామాల మధ్య వంతెన(కల్వర్టు) పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీనివల్ల అంటికొండకు వచ్చే ఆర్టీసీ బస్సు నిలిపివేశారు. ఫలితంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. కాంక్రీటు గోడ కట్టించి, వంతెన బాగు చేస్తామని పీఆర్ ఏఈ గౌరీశంకర్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.
– న్యూస్‌టుడే, సీతంపేట



## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సీతంపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న సంకిలి గ్రామంలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన లిమ్మల భీమయ్య(55) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భీమయ్య గతంలో పక్షవాతానికి గురై మంచాన పడ్డారు. దీంతో వైద్యం కోసం అప్పులు చేశారు. తరచూ అనారోగ్యానికి గురవడం, ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై.. ఉరేసుకున్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై మస్తాన్ తెలిపారు.

భీమయ్య(పాత చిత్రం)

## సత్యసాయి మార్గం అనుసరణీయం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: శ్రీ భగవాన్ సత్యసాయి చూపిన మార్గం సదా అనుసరణీయమని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి అన్నారు. ఆదివారం జియ్యమ్మవలసలో శ్రీ భగవాన్ సత్యసాయి భజన మండలి కన్వీనరు కె.నాగరాజు ఆధ్వర్యంలో బాబా శత జయంతి సందర్భంగా శత అమృత కలశారాధన కార్యక్రమం నిర్వహించారు. వంద మంది నిరుపేదలకు బియ్యం, సరకులు వితరణగా అందించారు. ఎంపీపీ బొంగు సురేష్, తెదేపా నాయకులు డి.రామకృష్ణ, ఎం.సత్యంనాయుడు, జి.భుజంగరావు తదితరులు ఉన్నారు.

పేదలకు సరకులు అందిస్తున్న జగదీశ్వరి

## రహదారి నిర్మాణం ప్రారంభం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: జియ్యమ్మవలస జడ్పీ ఉన్నత పాఠశాల గేటు నుంచి లోపలికి సీసీ రహదారి నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలు తెలిపారు. చింతల బెలగాం జంక్షన్-పరజపాడు, కుదమ-పరజపాడుకు గతంలో వేసిన బీటీ రహదారులు పాడవడంతో చోదకులు అవస్థలు పడుతున్నారని సర్పంచి జి.రామకృష్ణ నాయుడు, గ్రామస్థులు జగదీశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. పక్కా రోడ్లు నిర్మించాలని వినతిపత్రం అందించారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## విలు విద్యలో సత్తా

సీతానగరం, న్యూస్‌టుడే: ఏపీ జూనియర్, సీనియర్ విలు విద్య ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో సీతానగరం కుమ్మరి వీధికి చెందిన ధనుష్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు శిక్షకుడు డీజీ గాంధీ తెలిపారు. నూజివీడులో నిర్వహించిన పోటీల్లో జిల్లా తరఫున రికర్వ్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని శిక్షకుడు తెలిపారు.

శిక్షకులతో విజేత ధనుష్‌కుమార్

## సభా సంఘం ముందుకు.. పలగర పీఏసీఎస్ వివరాలు!

పార్వతీపురం, బలిజిపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో జరిగిన ఆర్థిక లావాదేవీలు, అవకతవకలపై విచారణ జరుగుతోంది. జిల్లాలో పీఏసీఎస్‌ల్లో గుర్తించిన ఆర్థిక లోపాలకు సంబంధించి సోమవారం సహకారశాఖకు చెందిన అధికారులు సభా సంఘంతో సమావేశమయ్యే అవకాశం ఉందని సహకార శాఖ వర్గాలు చెప్పాయి. జిల్లాకు సంబంధించి బలిజిపేట మండలం పలగర పీఏసీఎస్‌లో గుర్తించిన లోపాలపై వివరాలను సమర్పించారు. ఈ సంఘంలో రూ.36,66,622 చెల్లింపులకు సంబంధించి అప్పటి పర్సన్ ఇన్‌ఛార్జులకు, సభ్యులకు, బ్రాంచి ఉద్యోగులకు సహకారశాఖ అధికారులు సర్‌ఛార్జీ నోటీసులు జారీ చేశారు. ప్రధానంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి వచ్చిన కమీషను డబ్బుల నుంచి రూ.22,83,308 హమాలీ ఛార్జీలుగా చెల్లించినట్లు లెక్కల్లో చూపించారు. అలాగే కొవిడ్ సమయంలో రూ.2 లక్షలు ఖర్చులను గుర్తించారు. హెచ్ఆర్ విధానంలో సిబ్బందిని నిబంధనలకు భిన్నంగా 2024 జనవరి జీతాలు చెల్లించారని గుర్తించారు. సర్‌ఛార్జీల నోటీసు అనుసరించి బాధ్యులైన పాలకవర్గం, బ్రాంచి సిబ్బందిపై విచారణ కూడా నిర్వహిస్తున్నారు. అయితే తాము చూపిన లెక్కలకు సంబంధించి, అన్నింటికీ ఆధారాలు ఉన్నాయని పలగర సొసైటీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా ఈనెల 19న విచారణ జరిగే వీలుందని సమాచారం. బాధ్యులపై చర్యలకు విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకును కోరినప్పటికీ.. ఇంకా చర్యలు లేవు. జిల్లా నుంచి ఈ సంఘానికి సంబంధించిన సమాచారం కమిటీకి సమర్పించినట్లు జిల్లా సహకారశాఖ అధికారిణి వాణీశైలజ చెప్పారు.

## మహాసభల విజయవంతానికి పిలుపు

సీతానగరం: విశాఖలో ఈనెల 31 నుంచి నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము పిలుపునిచ్చారు. తహసీల్దారు కార్యాలయం ఆవరణలో గోడపత్రికలను ఆవిష్కరించారు.

## నిబంధనలు పాటించాలి

జియ్యమ్మవలస: చోదకులు విధిగా రహదారి నిబంధనలు పాటించాలని ఏఎస్సై గోపి అన్నారు. బొమ్మిక కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన పత్రాలు లేనివారి వద్ద అపరాధ రుసుం వసూలు చేశారు.

## వెలుగు కార్యక్రమాలపై అవగాహన

పార్వతీపురం గ్రామీణం: జిల్లాలో సహకార సంఘాల వారోత్సవాలను సభ్యులు విజయవంతం చేయాలని, గ్రామాల్లో వెలుగు కార్యక్రమాలపై మహిళలకు వీఆర్వేలు అవగాహన కల్పించాలని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రమణమూర్తి కోరారు. వెలుగు కార్యాలయం వద్ద ఆదివారం జెండా వందనం చేసి, మాట్లాడారు. జిల్లా సమన్వయకర్త రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ స్థలాలు కాపాడండి

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.అప్పలనాయుడు డిమాండు చేశారు. డీసీఎంఎస్ స్థలాన్ని పరిశీలించి, మాట్లాడారు. అధికారుల అండతో అక్రమార్కులు నకిలీ పట్టాలు పుట్టించి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాలు

సీతంపేట: సీతంపేట శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులు ఆచార్య ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్యల చిత్ర పటాలకు అధికారి బి.గణేష్ బాబు, పి.శ్రీరాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

## అమలు అంతంత.. భారం కొండంత

– న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కలిగించేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించింది. దీనివల్ల ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేలు ఆదా అవుతుందని పేర్కొంది. పలు ప్రాంతాల్లో ఇంకా అమలు కావడం లేదు. దీంతో పేదల కష్టాలు కొనసాగుతునే ఉన్నాయి.

### కానరాని బోర్డులు

సెప్టెంబరు 22 నుంచి తగ్గించిన జీఎస్టీ ఆధారంగా క్రయవిక్రయాలు జరపాలని కేంద్రం ప్రకటించింది. ప్రతి దుకాణం వద్ద ధరల తగ్గింపు బోర్డులు విధిగా ఉంచాలని ఆదేశించింది. పాలకొండలో నేటికీ బోర్డులు కనిపించడం లేదు కదా.. ధరలు తగ్గిన దాఖలాలు లేవు. ఎప్పటిలాగే క్రయ విక్రయాలు సాగుతున్నాయి. ఔషధాలు, వస్త్రాలు, పాదరక్షలపై గతంలో 12 శాతంగా ఉన్న జీఎస్టీని అయిదు శాతానికి, స్టేషనరీపై ఏడు శాతం ఉన్నది అయిదుకు తగ్గించారు. కానీ ఇవేమీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. కొత్తవాటి ప్రకారం విక్రయిస్తే తమకు నష్టం వాటిల్లుతుందని పలువురు వ్యాపారులు చెప్పడం విడ్డూరం.

### అతిక్రమిస్తే.. చర్యలు తప్పవు

కొత్త జీఎస్టీ ప్రకారమే అమ్మకాలు చేయాలి. ఇప్పటికే పట్టణంలోని అన్ని దుకాణాలను తనిఖీ చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.
– రత్నరాజ్, కమిషనర్, పాలకొండ నగర పంచాయతీ

## విద్యుత్తు అంతరాయాలకు చెక్

గ్రామీణ ప్రాంతాలకు నిరంతర విద్యుత్తు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలోభాగంగా ప్రతి సబ్‌స్టేషన్ నుంచి దాని పరిధిలోని గ్రామాలకు నేరుగా విద్యుత్తు లైన్లు వేస్తున్నారు. తాజాగా పార్వతీపురం మండలంలో నర్సిపురం, తాళ్లబురిడి సబ్‌స్టేషన్ల పరిధిలో 50 కి.మీ మేర కొత్త లైన్ కోసం స్తంభాలు వేశారు. ఇక్కడ ఇప్పటివరకు ఒకే లైన్‌తో ఇళ్లు, పొలాలకు సరఫరాతో తరచూ ఇబ్బందులు ఏర్పడేవి. ఈ సమస్యను అధిగమించేందుకు ఆర్‌డీఎస్ఎస్‌ను ప్రవేశపెట్టిందని ట్రాన్స్‌కో ఏఈ రామారావు చెప్పారు. ప్రస్తుతం స్తంభాలు వేస్తున్నారని, తర్వాత కనెక్షన్లు ఇస్తామన్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

## వారి సేవలు ఆదర్శనీయం

మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం గ్రామీణం, గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం నియోజకవర్గంలో కళింగ వైశ్యుల సామాజిక, ఆధ్యాత్మిక సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో జరిగిన కళింగ వైశ్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ఇలానే సేవా గుణంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. ★ **బలిజిపేట:** పలువురు అయ్యప్ప స్వాములకు ఎమ్మెల్యే భిక్షను ఏర్పాటు చేశారని అజ్జాడ గ్రామ సర్పంచి, తెదేపా నాయకులు అక్కేన జగన్మోహనరావు తెలిపారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండల కళింగ వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. తుమరాడ తోటలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమం సందర్భంగా కళింగ వైశ్యులంతా నూతన సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్వీ జగన్నాథం, అధ్యక్షుడిగా కె.రమేష్, సెక్రటరీగా ఇ.సత్యనారాయణ, కోశాధికారిగా పి.జనార్దనరావుతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. ఆపై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రమాణం చేస్తున్న కళింగ వైశ్య సంఘం నూతన కార్యవర్గం

## ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కిశోర్‌తో సంఘ నూతన అధ్యక్షుడు సంజీవరావు, చంద్రమౌళి, శర్మ తదితరులు

పార్వతీపురం: జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగు అధికారుల సంఘానికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఉపకార్యనిర్వాహక ఇంజినీరు సంజీవరావు ఎన్నిక కాగా, కార్యదర్శిగా జి.చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా డబ్ల్యూవీఎస్ఎస్ శర్మ, కోశాధికారిగా వి.మౌనిక, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా డి.కల్యాణి, దుర్గ ఎన్నికయ్యారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ల సమస్యలను పరిష్కరించేందుకు, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం వెల్లడించింది.

## 200 మందికి వైద్య సేవలు

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని చినహరిజనపేట పాఠశాల ఆవరణలో మహాత్మా గాంధీ క్యాన్సర్, అనిల్ నీరుకొండ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు హెరా, సుదర్శన్, గణేష్, హరిణి, అనూష, శ్వేత, పాల్ 200 మందికి సేవలందించారు. నవజీవన్ ఆశ్రమ ప్రబంధకురాలు చినమ్మలు, సమన్వయకర్త స్వాతిశ్రీ తదితరులు ఉన్నారు.

## లీకులు అరికట్టేదెప్పుడో..!

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కుళాయి పైపుల ద్వారా నీరు వృథాగా పోతోంది. శివారు ప్రాంతాలకు తాగు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ లీకులు అరికట్టేందుకు ఎటువంటి చర్యలు లేవు. ప్రధాన పైపులైన్లు లీకై రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. చర్యలు చేపడతామని డీఈ ప్రసాద్ తెలిపారు.

(c) eenadu

## పిచ్చుకలు కాదు.. విదేశీ పక్షులు

స్టోన్‌చాట్

కామన్‌రోజ్ ఫించ్

చూసేందుకు పిచ్చుకల్లా కనిపిస్తున్నా ఇవి విదేశీ పక్షులు. తరిమెళ్ల చెరువు, ఆ పరిసర ప్రాంతాల్లో సందడి చేస్తున్నాయి. వీటిలో మొదటిది సైబీరియా, మధ్య ఆసియాలో ఉండే స్టోన్‌చాట్. అక్కడి అతి శీతల వాతావరణం నుంచి తప్పించుకోవడంతో పాటు సంతానోత్పత్తి కోసం మన దేశానికి వస్తుంటాయని బర్డ్ వాచర్ బెల్లంకొండ భాను తెలిపారు. గడ్డి భూములు, చిత్తడి నేలలు, సరస్సులు, చెరువుల చుట్టూ ఆవాసం ఏర్పరచుకుని కీటకాలు, పురుగులు, పండ్లు తింటాయని చెప్పారు. రెండోది... ఆసియా, యూరప్‌లో కనిపించే కామన్‌రోజ్‌ఫించ్. ముదురు గోధుమ, ఆలివ్ రంగులో ఆకర్షణీయంగా ఉంటుంది. చెట్ల పైభాగాల్లో ఉంటూ కోకిలలా పాటలు పాడుతుంది. అందుకే దీనిని పాటపక్షిగానూ స్థానికులు పిలుస్తారని... గింజలు ఎక్కువగా తింటాయని వివరించారు. – న్యూస్‌టుడే, కంభం

## చీమకుర్తిలో తృప్తిగా తినొచ్చు!

తక్కువ ధరకే పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేలా పురపాలక శాఖ ఆధ్వర్యంలో తృప్తి క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరులో ఇప్పటికే ప్రారంభం కాగా... జిల్లా వరకు తొలిగా చీమకుర్తిలో ఏర్పాటు కానుంది. ఇప్పటికే స్థలం చదును చేశారు. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు నిర్వహణకు ఆసక్తి చూపడంతో... వారికి రూ.14 లక్షల బ్యాంకు రుణం మంజూరు దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. మరో ఐదారు రోజుల్లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. – న్యూస్‌టుడే, చీమకుర్తి

## 35 సెంట్లు... నాలుగు పాఠశాలలు

కేవలం 35 సెంట్ల స్థలంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక, జడ్పీ ఉన్నత, ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల భవనాలివి. ఇంత ఇరుగ్గా ఉన్నాయి... విద్యార్థులు లేరేమో అని భావిస్తే మీరు తప్పులో కాలేసినట్లే. దాదాపు 900 మంది ఇక్కడ చదువుతున్నారు. అంతమందికి ఈ ప్రాంగణం చాలక... ఉదయం ప్రార్థన, మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటల సంగతి సరేసరి. యర్రగొండపాలెం పట్టణం బ్రహ్మంగారి ఆలయం పక్కన ఈ బడులున్నాయి. అధికారులు, నాయకులు స్పందించి ప్రత్యామ్నాయం చూపాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, యర్రగొండపాలెం



## పూల సోయగం... శ్రీహరి వైభవం

కార్తిక మాసం సందర్భంగా మిట్టపాలెం నారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మహా పుష్పయాగం కనుల పండువగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులను ప్రత్యేక మండపంలో కొలువుదీర్చి... వేదపండితులు శాస్త్రోక్తంగా ఈ వేడుక జరిపారు. కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

# నల్లమలలో గడ్డి పెంచుతున్నారు!

నల్లమల అభయారణ్యం కదా... అక్కడ గడ్డి పెంచడమేంటి? ఇదేనా మీ సందేహం. అయితే చదవండి మరి...

దేశంలోని పులుల అభయారణ్యాల్లో విస్తీర్ణం పరంగా నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వు పెద్దది. 300కు పైగా పులులు ఇక్కడ జీవనం సాగించే వీలున్నా 87 మాత్రమే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం... అవి ఆహారంగా తీసుకునే కణితి, సాంబార్, కృష్ణజింక, దుప్పి, చింకార, కొండ గొర్రెలు వంటి శాకాహార జంతువులు తగినన్ని లేకపోవడమే. ఇవి సంచరించేందుకు విశాల ప్రాంతం ఉన్నా వాటి ఆహారమైన గడ్డి, నీరు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గ్రాస్‌మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన మురార్కర్ నల్లమలను ఇటీవల సందర్శించి గడ్డి మైదానాలను పరిశీలించారు. గ్రాసం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. – న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

నల్లమలలో సంచరిస్తున్న సాంబార్లు

శాకాహార జీవుల మనుగడకు కసరత్తు

అటవీ శాఖ మూడేళ్ల ప్రణాళిక

నల్లమల విస్తీర్ణం 5.95 లక్షల హెక్టార్లు. అధికారుల గణాంకాల ప్రకారం ప్రతి వంద హెక్టార్లకు మూడు చొప్పున మొత్తంగా సుమారు 18 వేల శాకాహార జంతువులు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం వీటి సంఖ్యను రెట్టింపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### తీసుకునే చర్యలివి...

- అటవీ ప్రాంతంలోని గడ్డి ముదురుగా, గరుకుగా ఉండడంతో జింకలు తినలేకపోతున్నాయి. ఇప్పుడు ఆ గడ్డిని కత్తిరించి లేత చిగుళ్లు వచ్చేలా చేస్తారు.
- వ్యర్థ జాతులైన పార్థీనియం, ల్యాంటేనా, క్యాషియాటోరా, అల్లికంప, పిచ్చికంప తదితరాలను తొలగిస్తారు.
- ముదురు గడ్డి విత్తనాలు సేకరించి... నర్సరీల్లో వాటిని మొలకెత్తించి అడవి నలుమూలల్లో నాటతారు.
- పోషకాహార రకాలైన శాంక్రసీ, దీనానాథ్, సైకోస్కాబ్రా వంటి గడ్డి జాతులను పెంచుతారు.
- నీటి వనరులు పెంచడంతో పాటు.. వాటి సంతానోత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకుంటారు.

ఈ మొత్తం చర్యలు చేపట్టేందుకు మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎన్‌ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు.

గడ్డి పెంపకంపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న గ్రాస్ మ్యాన్ ఆఫ్ ఇండియా మురార్కర్, ఎఫ్‌డీ విజయ్‌కుమార్

# ఉత్తరం రాయండి... బహుమతి గెలవండి!

## ధాయీ ఆఖర్ పేరిట తపాలాశాఖ పోటీలు

అంతర్జాలం విస్తృతి పెరిగాక ఉత్తరాలు రాయడం కనుమరుగైంది. నేటి తరంలో చాలామందికి వాటి గురించి తెలియదంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు తపాలాశాఖ వారు 'ధాయీ ఆఖర్' పేరిట ఏటా ఉత్తరాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'నన్ను ప్రభావితం చేసిన వ్యక్తి' (లెటర్ టు మై రోల్ మోడల్) అన్న అంశంపై వీటిని ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం, పామూరు




**రెండు విభాగాల్లో...:** హిందీ, ఆంగ్లం, తెలుగు... ఏ భాషలోనైనా రాయొచ్చు. ఎన్వలప్ విభాగంలో ఏ4 పేపరుపై వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌ల్యాండ్ లెటర్ విభాగంలో 500 పదాలకు మించకుండా స్వదస్తూరితో మాత్రమే రాయాలి. జిల్లా వరకు ఒంగోలు, మార్కాపురంలో ఉన్న తపాలా డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. డిసెంబరు 8లోగా వీటిలో దేన్నికైనా పంపొచ్చు. లేఖలపై 'ఎంట్రీ ఫర్ ఢాయీ ఆఖర్ - 2025-26' అని పేర్కొనాలి. కళాశాలల అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు ఈ పోటీలపై విద్యార్థులకు అవగాహన కల్పించి అందరూ పాల్గొనేలా ప్రోత్సహించాలని మార్కాపురం తపాలా సూపరింటెండెంట్ జి.వి.శ్రీనివాసులు కోరారు.

**అందరూ అర్హులే...:** వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చు. 18 ఏళ్లలోపు, ఆపై విభాగాలుగా విభజించి బహుమతులు అందజేస్తారు. వయసుకు సంబంధించిన స్వీయ ధ్రువీకరణ పత్రం అందించాల్సి ఉంటుంది.

### బహుమతులు ఇలా...

జాతీయ స్థాయిలో ప్రథమ విజేతకు రూ.50 వేలు, ద్వితీయ... రూ.25 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు నగదు బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తారు.

# ర్యాపిడోలో రయ్‌రయ్!

## మహిళలే సారథులు... ఉపాధికి బాటలు

బైకుపై గమ్యస్థానానికి తీసుకెళ్తున్న యువతి

ఒంగోలు నగరంలో ర్యాపిడో వాహనాలు రయ్‌రయ్ మంటూ దూసుకుపోతున్నాయి. ఇందులో గొప్పేముందని అనుకుంటున్నారా...? వాటిని నడుపుతున్నది మహిళలు కావడం ఇక్కడి విశేషం. – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

### మెప్మా ప్రోత్సాహం...

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు స్వయం సహాయక సంఘాల్లోని ఔత్సాహికులను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించారు. ఆ మొత్తంతో 12 ఎలక్ట్రిక్ ఆటోలు, 50 బైకులు కొనుగోలు చేయించారు. ఈ వాహనాలను ర్యాపిడోకు అనుసంధానం చేశారు. అలా నగరంలో మొత్తం 62 మంది ఈ సేవలందిస్తున్నారు. నెలకు సగటున రూ.15 వేల వరకు సంపాదిస్తూ ఉపాధికి బాటలు వేసుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీనే సేవలు ప్రారంభమైనా.. గత రెండు నెలల్లోనే పూర్తి స్థాయిలో విస్తరించాయి.

ఆటో నిర్వహణలో..

### నిర్భయంగా ప్రయాణాలు...

సదరు మహిళలకు అవసరమైన సలహాలు, సూచనలను ర్యాపిడో, మెప్మా అధికారులు అందజేస్తున్నారు. కిలోమీటరుకు రూ.3 నుంచి రూ.5 వరకు ఛార్జి పడుతోంది. అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ వాహనాలు అందుబాటులో ఉంటున్నాయి. గతంలో రాత్రివేళ ఒంటరిగా ఆటోల్లో వెళ్లేందుకు భయపడిన మహిళలు... ఈ సేవలు వచ్చాక నిర్భయంగా వినియోగించుకుంటున్నారు. బైకులూ అందుబాటులో ఉండడంతో మరింత వెసులుబాటు లభిస్తోంది.

## విలువిద్యలో అభిలాష

ఒంగోలుకు చెందిన కొప్పోలు అభిలాష స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైంది. ఇటీవల అల్లూరులో నిర్వహించిన అంతర్ జిల్లాల టోర్నీలో సత్తా చాటి ఈ అవకాశం దక్కించుకుంది. ఈ నెల 19 నుంచి వారణాసి (ఉత్తర్‌ప్రదేశ్)లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. నగరంలోని కృష్ణా మెమోరియల్ స్కూల్ (కేఎంఎస్)లో ఏడో తరగతి చదువుతున్న అభిలాషను పాఠశాల ప్రతినిధులు అభినందించి జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. – న్యూస్‌టుడే, ఒంగోలు క్రీడా విభాగం

ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న బాలికలు

## వృత్తి విద్య... ఉపాధికి భరోసా

ఎస్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు (స్కిల్ కాంపిటేషన్) ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పొదిలిలోని బీఎడ్ కళాశాల ఇందుకు వేదికైంది. జిల్లాలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ (వృత్తి విద్య) ఉన్న 71 పాఠశాలల విద్యార్థులు హాజరై తాము రూపొందించిన నమూనాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా జీసీడీవో హైమావతి మాట్లాడుతూ... ప్రస్తుతం వృత్తి విద్య ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం వల్ల ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకొనే అవకాశం కలుగుతోందన్నారు. పోటీల్లో ఎంపికైన నమూనాలు రాష్ట్రస్థాయికి వెళ్తాయన్నారు. న్యాయనిర్ణేతలుగా వివిధ విభాగాల నిష్ణాతులు డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ గాయత్రిలక్ష్మి, సీహెచ్.రామసుబ్బారెడ్డి, టి.లక్ష్మయ్య, శంకర్, వెంకట సుబ్బమ్మ, కిషోర్‌కుమార్, భరత్‌కుమార్, పి.మోజెస్, వేణుగోపాల్ వ్యవహరించారు. – న్యూస్‌టుడే, పొదిలి

## కత్తెరకు అడ్డుకట్ట వేయాలని!

ఏంటిది... సీసాల్లో మందు నింపి పైరుకు పోస్తున్నారనేగా మీ అనుమానం. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు పడుతున్న పాట్లివి. స్ప్రేయర్ల ద్వారా పిచికారీ చేస్తే మొక్క సుడిలోకి మందు చేరడం లేదు. దీంతో ఖర్చు పెరిగినా మొవ్వ తడిచేలా కూలీలతో ఇలా సీసాలతో పోయిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన కొద్ది రోజులకు ఇదే తరహాలో గుళికలు సైతం వేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. విత్తన జొన్న క్వింటాకు రూ.3,800 వరకు ఇస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో పశ్చిమ ప్రకాశం రైతులు ఈ సాగుకు మొగ్గు చూపుతున్నారు. పై దృశ్యం గిద్దలూరు మండలం ముండ్లపాడులోనిది. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

## నిమ్మ... కన్నీటి చెమ్మ

గత కొద్ది రోజులుగా నేల చూపులు చూస్తున్న నిమ్మ ధరలు... ఇప్పుడు పూర్తిగా పడిపోయి కిలో రూ.5కు చేరాయి. శని, ఆదివారాల్లో ఆ ధరకూ కొనేవారు లేక... కనిగిరి, హెచ్‌ఎంపాడు మార్కెట్‌లకు సరకు తెచ్చిన రైతులు ఆందోళనకు గురయ్యారు. చలి తీవ్రతతో పాటు తెనాలి, గూడూరు ప్రాంతాల నుంచి అహమ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయికి ఎగుమతులు పెరగడంతో ధరలు దిగజారినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు కోతకు సిద్ధంగా తోటలు ఉండడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నామని సాగుదారులు వాపోతున్నారు. రూ.లక్షలు వెచ్చించి కౌలుకు తీసుకున్న వారు నిండా మునిగిపోయారు. నిల్వకు కోల్డ్ స్టోరేజీలు సైతం లేక పూర్తిగా నష్టపోవాల్సి వస్తోందని... ప్రభుత్వమే ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

ఎగుమతులు లేక కమీషన్ దుకాణాల్లో పేరుకుపోయిన సరకు

## సివిల్స్ ఔత్సాహికులకు ఉచిత శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి నిర్మలా జ్యోతి తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 25లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. అర్హత సాధించిన వారికి విజయవాడలోని గొల్లపూడి బీసీ స్టడీ సర్కిల్‌లో... 10వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

# మళ్లీ అవే అడ్డగోలు పనులు!

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

నాణ్యమైన విద్యుత్తు సరఫరా దిశగా చేపడుతున్న ఆర్‌డీఎస్‌ఎస్ (రీన్యూ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్) పనులు యర్రగొండపాలెంలో అడ్డగోలుగా సాగుతున్నాయి. దాదాపు రూ.6 కోట్లతో వై.పాలెం ఉప కేంద్రాన్ని పుల్లలచెరువు మండలం యండ్రపల్లె, కవలకుంట్లలోని ఉప కేంద్రాలకు అనుసంధానిస్తూ రెండు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. గత వారం రోజులుగా పట్టణంలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. రహదారి విస్తరణతో యాభై ఏళ్ల క్రితం వేసిన స్తంభాలు రోడ్డు పైన ఉన్నాయి. ప్రస్తుతం వాటిని తొలగించి... మళ్లీ దారికి అడ్డంగానే కొత్తవి ఏర్పాటు చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. మరీ చిత్రమేంటంటే... కాలువకు అవతల కాకుండా రహదారిపైనే రాకపోకలకు అడ్డంగా వేస్తున్నారు. భవిష్యత్తులో ఈ మార్గం విస్తరించే అవకాశం ఉంది. అప్పుడు మళ్లీ ఇబ్బందులు తప్పవని తెలిసినా యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం.

కాలువకు ఇవతల రహదారి పైనే అడ్డంగా వేసిన కొత్త స్తంభాలు

### దెబ్బతింటున్న పైపులు...

మరోవైపు ఈ పనులకు సంబంధించి పంచాయతీ వారికి కనీస సమాచారం లేదు. దీంతో స్తంభాల కోసం తవ్వుతున్న సమయంలో భూగర్భంలోని తాగునీటి పైపులు దెబ్బతిని పలు ప్రాంతాలకు సరఫరా నిలిచిపోతోంది. వాటిని బాగుచేయడం పంచాయతీ వారికి ఆర్థికంగా భారమవుతోంది. ఈ విషయమై కార్యదర్శి రామసుబ్బయ్యను సంప్రదించగా.. పనుల సమాచారం లేదని, పైపులు దెబ్బతిని సమస్య నెలకొంటున్న మాట వాస్తవమేనని తెలిపారు. విద్యుత్తు శాఖ డీఈ (కన్‌స్ట్రక్షన్) సత్యనారాయణను సంప్రదించగా... జిల్లా వ్యాప్తంగా పనులు జరుగుతున్నాయని, పంచాయతీ అనుమతితోనే ఇక్కడ పనులు చేపడుతున్నామని తెలిపారు.

## నారు మూట @ రూ.6,700

మొంథా తుపాను ధాటికి దాదాపు రెండు వేల ఎకరాల్లోని పొగ నారుమళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. మరోవైపు నాట్లకు రైతులు సన్నద్ధం కావడంతో నారు ధర రికార్డు స్థాయికి చేరి మూట (ఆరు వేల మొక్కలు) రూ.6,700 వరకు పలుకుతోంది. గతేడాది రూ.4 వేలు అంటేనే ఇంత ధరా అని ఆందోళనకు గురయ్యారు. ఎకరానికి రెండు మూటలు చొప్పున పదెకరాలకు ఇరవై అవసరం కావడంతో... గత సీజన్‌తో పోలిస్తే నారుకే రూ.54 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం



## పునరావాసం... అపహాస్యం!

చిల్లచెట్ల మధ్య భవనాలు

ఓ నిర్మాణంలో మాయమైన కిటికీలు, ద్వారాలు

మార్కాపురం సమీపంలో ఏర్పాటు చేసిన వెలిగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీలోని ప్రభుత్వ భవనాల పరిస్థితి ఇది. 2018లోనే అంతర్గత రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్యకేంద్రం భవనాలు నిర్మించారు. మౌలిక వసతులూ కల్పించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం... ఆ పనులు కొనసాగించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో చిల్లచెట్లు పెరిగి ఆ ప్రాంతమంతా చిట్టడవిని తలపిస్తోంది. దీనికితోడు దొంగలు పడి ఆయా భవనాల ద్వారాలు, కిటికీలు, గేట్లు వంటివి ఎత్తుకుపోయారు. గోగులదిన్నె, ఇడుపూరు, జమనపల్లెతో పాటు పెద్దారవీడు మండలంలో రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన కట్టడాలన్నీ నిరుపయోగంగా మార్చారు. – ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

# ఆత్మలకూ చౌక బియ్యం!

## స్మార్ట్ కార్డుల్లోనూ కొనసాగుతున్న మృతుల పేర్లు

న్యూస్‌టుడే – ఒంగోలు కలెక్టరేట్

రేషన్ పంపిణీలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం స్మార్ట్‌కార్డులను అందుబాటులోకి తెచ్చినా వాటిలోనూ మృతుల పేర్లు కొనసాగుతున్నాయి. దీంతో వారి పేరిటా ప్రతి నెలా సరకులు పంపిణీ అవుతున్నాయి.

### చిత్తశుద్ధి లేకనే...

ప్రతి నెలా ఒకటో తేదీన బయోమెట్రిక్ ఆధారంగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ జరుగుతోంది. వయసు రీత్యా, ఇతరత్రా కారణాలతో సగటున నెలకు 750 మంది మృతి చెందుతున్నారు. అక్టోబరులో 865, సెప్టెంబరులో 712, ఆగస్టులో 763 మంది కాలం చేయడంతో... సచివాలయ సిబ్బంది గుర్తించి తరువాతి నెల నుంచి వారి పింఛన్లు నిలిపేశారు. అదే రేషన్ సరకులకు వచ్చేసరికి ఈ ప్రక్రియ సరిగా సాగడం లేదు. దీంతో పెద్ద మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. సింహభాగం సరకులు పక్కదారి పడుతున్నాయి.

### పథకాలు వస్తాయని...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికంగా మారింది. ఆరోగ్యశ్రీ నుంచి కార్పొరేషన్లు అందించే రాయితీ యూనిట్ల వరకు ఇదే కీలకం కావడంతో అనర్హులు కూడా వీటిని పొందారు. ఈ-కేవైసీ పూర్తయితే బోగస్‌కు అడ్డుకట్ట పడే అవకాశం ఉన్నా ఏడాదిన్నరగా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. దీంతో పదేళ్ల క్రితం మృతి చెందిన వారి పేర్లు సైతం కార్డుల్లో కొనసాగుతున్నాయి. పారదర్శకత పేరిట క్యూఆర్ కోడ్‌తో జారీ చేసిన స్మార్ట్‌కార్డుల్లోనూ వీరి వివరాలు కొనసాగుతుండడం గమనార్హం.

| జిల్లాలోని స్మార్ట్ రేషన్ కార్డులు | వీటిలోని మొత్తం సభ్యులు | ఈ-కేవైసీ చేయించుకోనివారు |
| --- | --- | --- |
| 6,51,818 | 19,78,828 | 77,120 |

## ఏదీ పర్యాటక వెలుగు!

గుండ్లకమ్మ దారిలో దీపాలు లేని స్తంభాలు

కార్తిక మాసం కావడంతో వన సమారాధనలకు గుండ్లకమ్మ, రామతీర్థం జలాశయాలకు పెద్ద సంఖ్యలో జనం తరలివస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఆలయాలూ ఉండడంతో రద్దీ మరింతగా ఉంటోంది. వర్షాల కారణంగా ప్రాజెక్టులు నిండుకుండల్లా మారడంతో సందర్శకుల తాకిడీ పెరిగింది. ఇంతవరకు బాగానే ఉన్నా... ఆయా ప్రాంతాల్లో దీపాలు లేక వారంతా అవస్థలు పడుతున్నారు. – ఈనాడు, ఒంగోలు

## పంట రక్షణకు మూడో కన్ను

పీసీపల్లి మండలం చిరుకూరివారిపల్లెకు చెందిన రైతు కూరపాటి కొండయ్య అయిదెకరాల్లో దానిమ్మ తోట సాగు చేశారు. ప్రస్తుతం నిండుగా దిగుబడి వచ్చి కోతకు సిద్ధంగా ఉంది. ఉదయం వేళ కాపలాగా ఉంటున్నా... చోరుల భయం, వన్యప్రాణుల ముప్పుతో రాత్రి వేళ రక్షణ కష్టమవుతోంది. ఆ సమస్యను అధిగమించేందుకు తోట వద్ద సీసీ కెమెరాతో ఇలా నిఘా ఏర్పాటు చేశారు. దీంతో పర్యవేక్షణ సులువవుతోందని ఆయన తెలిపారు. మిగతా రైతులు ఈ దిశగా అడుగులు వేస్తుండడం విశేషం. – న్యూస్‌టుడే, పీసీపల్లి

(c) eenadu

# పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తోపుడు బండిని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా మహిళల ఆర్థిక పరిపుష్టి, సామాజిక భద్రత, పౌష్టికాహారం అందించేందుకు ఎగ్ కార్టు తోపుడు బండ్లను కూటమి ప్రభుత్వం అందిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్ఈసీసీ సహకారంతో మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం డీఆర్‌డీఏ వెలుగు స్వయం సహాయక బృంద మహిళలకు ఎగ్ కార్టు తోపుడు బండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.50 వేల ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున వీటిని అందిస్తున్నామని, భవిష్యత్తులో వీటి సంఖ్య పెంచుతామన్నారు. కొండపి నియోజకవర్గంలో ఆరు మండలాలకు ఒక్కొక్కటి చొప్పున అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టంగుటూరు, జరుగుమల్లి మండలాల తెదేపా అధ్యక్షులు పదులవాడ చంద్రశేఖర్, పోకూరి రవీంద్ర పాల్గొన్నారు.

## జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక

సింగరాయకొండ (గ్రామీణం): సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి ఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శంకరరావు, చంద్రశేఖర్, మౌలాలి, సురేష్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

# సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి

ఒంగోలు (గ్రామీణం), న్యూస్‌టుడే: వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం జిల్లా రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా రజకులు ఉన్నా ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాలతో పాటు, ఆదరణ పథకం కింద పరికరాలు ఇవ్వాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రజకుల సంక్షేమానికి సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.రాము, రాయల మాలకొండయ్య, ఏ.రమణయ్య, ఆర్.వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం నేత భాస్కరయ్య

# 23న దర్శిలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలు (గ్రామీణం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23న దర్శిలోని డ్రూస్ విద్యా సంస్థల ఆవరణలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ సీనియర్ నాయకులు ఏవీ పుల్లారావు తెలిపారు. ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ మార్పు కోసం శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జేవీవీ 38 సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు సైన్సును నిత్య జీవితంలో ఆచరించడం ద్వారా సమాజానికి ఆదర్శనీయంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జిల్లా కోశాధికారి తిరుపతయ్య, జయప్రకాష్, కె.సుబ్రమణ్యం, జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబరాల గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

**నేడు సూచించిన కోడిగుడ్డు ధర**

[illegible]

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)**

నెకాఫ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, లిఫ్టింగ్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234

## దరిమడుగులో వ్యక్తి మృతదేహం

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: మార్కాపురం మండలం దరిమడుగులోని రహదారి పక్కన ఆదివారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దూదేకుల పెద్దకాశిం(48) మృతదేహం దరిమడుగు బస్టాండ్ కూడలిలో పడివుండగా, పంచనామా నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అంకమ్మరావు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

ఒంగోలు ప్రముఖ డెంటల్ హాస్పిటల్‌లో పనిచేయుటకు అసిస్టెంట్ స్టాఫ & PROS అవసరం. సెల్: 9182484425.

బంగారం బ్యాంకులో/ ప్రైవేటు ... Ph: 81422 92071.

... 9848824181

TO LET

Commercial Space for Rent 2500 sft Opp: ASN college, Tenali. Cont no: 63026 41154

FACULTY/ TEACHERS

... High School English & Spoken English ... 7981045257

JOBS

... 9154882189, 9154882192.

DSA ఏజెన్సీ ... 99489 35789, 80081 00672.

... 85209 80099, 85208 74499.

గమనిక

[illegible]

# ప్రతిభకు ఉపకారం.. భవితకు ప్రోత్సాహం

డిసెంబరు 7న ఎన్.ఎం.ఎం.ఎస్. పరీక్ష

విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయుడు

చదువుల్లో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పలు రకాల ఉపకార వేతనాలు అందిస్తోంది. వాటిలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్.) ఒకటి. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా పరీక్ష నిర్వహించి దాంట్లో ప్రతిభ చూపేవారికి ఏటా రూ. 12,000 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తోంది.

- న్యూస్‌టుడే, కంభం, రాచర్ల

### ఈసారి ఎక్కువ దరఖాస్తులు

ఎన్.ఎం.ఎం.ఎస్. ఉపకార వేతనం కోసం జిల్లాలో గతేడాది 3,338 మంది దరఖాస్తు చేయగా, ఈ ఏడాది 4011 మంది చేశారు.

- జిల్లాకు 200 మందికి మాత్రమే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తారు.
- పరీక్ష తేదీ: డిసెంబరు 7.
- పరీక్ష కేంద్రాలు: ఒంగోలు, మార్కాపురం, కనిగిరి

### మెంటల్ ఎబిలిటీపై పట్టు అవసరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి అవకాశం. మెంటల్ ఎబిలిటీపై పట్టు సాధించాలి. తద్వారా భవిష్యత్తులో జరిగే పలు రకాల పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పరీక్షకు సన్నద్ధమైతే గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టుల్లోనూ పట్టు వస్తుంది. పాఠ్యాంశాలను బాగా అర్థం చేసుకుంటే ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు రాయవచ్చు. బట్టీ విధానం ఉండకూడదు. వేగం కచ్చితత్వం అవసరం.

- ఎన్. చంద్రశేఖర్, సైన్సు ఉపాధ్యాయుడు, రాచర్ల

### అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులు లెక్కలకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. షార్ట్ కట్‌లో లెక్కలు చేయగలగాలి. రోజూ సాధన చేస్తే సమయాన్ని దృష్టిలో పెట్టుకొని వేగంగా చేయవచ్చు. తెలిసిన విషయంలాగే ఉంటాయి. తార్కికంగా ఆలోచించాలి. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధం కావడం వల్ల గణితంపై పట్టు సాధించేందుకు అవకాశం కలుగుతుంది.

- ఎస్ఎస్. శ్రీనివాసులు, గణితం ఉపాధ్యాయుడు, రాచర్ల

## వాహనం అదుపుతప్పి గృహిణి మృతి

నల్లగుంట్ల (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వివాహిత మృతిచెందారు. ఈ సంఘటన నల్లగుంట్ల వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దలూరు మండలం త్రిపురాపురానికి చెందిన గుమ్మళ్ల నందిని (25) భర్త బాల వెంకటరాజుతో కలిసి అల్లినగరానికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. నల్లగుంట్ల సమీపం లోంచి వెళుతుండగా.. ఒక్కసారే కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి దంపతులిద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో నందిని తలకు బలమైన గాయం కావడంతో ఆమెను గిద్దలూరుకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. మృతురాలికి ఓ కుమార్తె ఉన్నారు.

## గుండ్లాపల్లి విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణింపు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అప్రాల్ (వృత్తి పరమైన వస్త్ర నైపుణ్యాలు) ప్రదర్శనలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులైన ఆటోమోటివ్, రిటైల్, అప్రాల్ కోర్సులలో విద్యాబోధన నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులకు సంబంధించి ఆదివారం పొదిలిలో నిర్వహించిన జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో గుండ్లాపల్లి విద్యార్థులు ఈ విజయం సాధించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ఎం.లక్ష్మికి, బహుమతిని గెల్చుకున్న విద్యార్థులు గౌతమి, ధరణి, రక్షిత, కీర్తనలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండవ ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

మొదటి బహుమతి అందుకుంటున్న గుండ్లాపల్లి విద్యార్థులు

# ఆచితూచి.. పొగాకు నాట్లు

న్యూస్‌టుడే, పొదిలి:

పశ్చిమ ప్రాంతంలోని రైతులు ఆచితూచి పొగాకు నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో ఒడిదుడుకుల నేపథ్యంలో రైతులు నాట్లు వేయడంలో జాగ్రత్త వహిస్తున్నారు.

### ఈ ఏడాది 10 ఎకరాలకే పరిమితం

గతంలో బ్యారన్‌కు పది నుంచి 12 ఎకరాలు సాగుచేసిన రైతులు ఈఏడాది పది ఎకరాలకే పరిమితమవుతున్నారు. తుపాను ప్రభావంతో పడిన వర్షాలకు నీరు నిలిచిన పొలాలు ప్రస్తుతం ఆరాయి. దీంతో నాట్లకు అనుకూల వాతావరణం ఏర్పడింది. పొగాకు నారు మూట ధర రూ. 6,000 వరకూ పలుకుతోంది.

### రాజమహేంద్రవరం నుంచి నారు తెచ్చి

పశ్చిమ ప్రకాశంలో కొంతమంది రైతులు రాజమహేంద్రవరం ప్రాంతం నుంచి పొగాకు నారు తెప్పించుకుంటున్నారు. స్థానికంగా దొరికే నారు కంటే అక్కడి నారు నాణ్యత బాగుంటుందన్న ఉద్దేశంతో ధర ఎక్కువైనా వెనుకాడటంలేదు.

### ☛ గతానుభవాలతో రైతన్నల ముందుచూపు

- ఎస్ఎల్ఎస్ పరిధిలోని వేలం కేంద్రాల్లో గత ఏడాది బ్యారన్‌కు 42.75 మి.కిలోలు పంటకు అనుమతించగా ఈ ఏడాది 36.65 మి.కిలోలకు తగ్గించారు. పొదిలి వేలం కేంద్రంలో 4332 మంది రైతులు ఉండగా, 2400 బ్యారన్లు ఉన్నాయి.

సాగునీటి వనరులు లేక వర్షాలే ఆధారం

జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగునీటి వనరులు లేనందున వర్షాధారంపై పండే పొగాకు సాగువైపే ఈ ప్రాంత రైతులు మొగ్గుచూపుతున్నారు. కాలం కలిసొచ్చి రెక్కల కష్టానికి ఫలితం దక్కుతుండటంతో పొగాకు వైపే ఆసక్తి చూపుతున్నారు. పొదిలి, కనిగిరి, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని రైతులు లాభనష్టాలతో సంబంధం లేకుండా వర్జీనియా పొగాకు సాగుకే అలవాటుపడ్డారు. ఈ ఏడాది బర్లీ సాగు పూర్తిగా నిషేధించారు. దీంతో కొంతమంది రైతులు ప్రత్యామ్నాయ పంటలైన వరి, ఆరుతడి వంటి ఆహార పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. బర్లీ పొగాకు వద్దని అధికారులు పదేపదే హెచ్చరించడంతో సాగు పంథా మారుస్తున్నామని కొందరు రైతులు తెలిపారు.

పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

# రాగి తీగలు మాయం చేసే.. అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు

### ◗ ఏడాది వ్యవధిలో 101 ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఏడాది కాలంగా తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి.. రాగి తీగలను చోరీచేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సాయిచైతన్య ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం గన్నారం వద్ద ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన 8 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇదే జిల్లాలోని పలు మండలాల్లో 101 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిల్లోని విలువైన రాగి తీగలను చోరీచేసినట్లు అంగీకరించారు. ఈ ముఠాపై ఇప్పటికే 44 కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది. పట్టుబడిన వారిలో మహారాష్ట్ర అహ్మద్‌నగర్‌కు చెందిన సుధాకర్(45), యూపీకి చెందిన హర్‌బీర్ శర్మ(50), ఏపీలోని గుంటూరుకు చెందిన అలీఅహ్మద్(41), ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు(24), మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాపూర్‌కు చెందిన రవీందర్(42), కర్ణాటక రాష్ట్రం ఇండ్లూరుకు చెందిన లింగప్ప(24), సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన గాజుల శ్రీశైలం(60), హైదరాబాద్ ముషీరాబాద్ వాసి అయిన మహ్మద్ హైదర్(24) ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఇదే ముఠాకు చెందిన అనిల్, వలీ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 40 కిలోల రాగి తీగలు, రూ. 5.50 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఏసీపీ, డిచ్‌పల్లి సీఐ వినోద్, ఎస్సైలు సందీప్, షరీఫ్‌బీ, మహేశ్, సిబ్బందిని సీపీ అభినందించారు.

స్వాధీనం చేసుకున్న రాగితీగలతో నిజామాబాద్ సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

## సుంకరవారిపాలెంలో రెండు కిలోల వెండి చోరీ

ముండ్లమూరు, న్యూస్‌టుడే: ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగలు చోరీకి పాల్పడ్డారు. ముండ్లమూరు మండలం సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన గునిపూడి సురేష్ గత సోమవారం అత్తగారి ఊరు అయిన చిలకలూరిపేట వెళ్లారు. ఆదివారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపులకు వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. బీరువా పగలగొట్టి వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడేసి అందులో ఉన్న రెండు కిలోల వెండి వస్తువులు అపహరించుకువెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె. కమలాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై కమలాకర్, క్లూస్‌టీమ్

## గుత్తేదారు నుంచి రక్షణ కల్పించాలని ఈఈ ఆందోళన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తేదారుడు రామాంజనేయులు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక సంతపేటలోని గ్రామీణ నీటి సరఫరా విభాగం సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఒంగోలు ఈఈ నాగేశ్వరరావు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వాలని గుత్తేదారుడు డిమాండ్ చేస్తూ ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేసినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ధర్నా చేపట్టిన నాగేశ్వరరావు

- ఈఈ నాగేశ్వరరావు ధర్నా చేపట్టినట్లు సమాచారం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ ఎన్‌వీవీ సత్యనారాయణ ఒంగోలులోని సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. ఇటు ఈఈ నాగేశ్వరరావు... అటు గుత్తేదారుడు రామాంజనేయులుతో మాట్లాడారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి కరచాలనం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈ బాల శంకరరావు, డీఈ మహేశ్వరరావుతోపాటు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ముందుగా గుర్తిద్దాం.. వ్యాధి నివారిద్దాం

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుష్ఠు వ్యాధి నిర్మూలించాలనే లక్ష్యంతో ఏడాదికి రెండుసార్లు ఇంటింటి సర్వే చేపడుతున్నాయి. గత జనవరి నెలలో మొదటి సర్వే పూర్తి చేయగా, రెండో సర్వేను నేటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

### ఆశా కార్యకర్తలు, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలో 2,038 బృందాలను ఏర్పాటు చేసి సర్వే ఎలా చేపట్టాలి అనే అంశంపై ఆశా కార్యకర్తలు, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందజేశారు. సర్వే బృంద సభ్యులు గృహాల వద్దకు వెళ్లి ఎవరికైనా చర్మవ్యాధులు ఉన్నాయా అని తెలుసుకొని

**జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఇదీ లెక్క**

| కుష్ఠు బాధితులు | పీబీ కేసులు | ఎంబీ కేసులు |
|---|---|---|
| 36 | 7 | 29 |

| | |
|---|---|
| ఈ ఏడాది చికిత్స పూర్తిచేసుకున్న కేసులు | 52 |
| గతంలో చికిత్స పూర్తిచేసుకున్న కేసులు | 440 |
| పింఛను పొందుతున్న వారు | 271 |

### ☛ నేటి నుంచి మలి విడత కుష్ఠు సర్వే

రోజుకు 25గృహాలను పరిశీలిస్తారు. స్పర్శ లేని, దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని, రాగిరంగు మచ్చలు తదితర లక్షణాలను గమనించి అనుమానిత కేసులను గుర్తించాలి.

- కుష్ఠు వ్యాధి ఉన్న వారికి మల్టీడ్రగ్ థెరపీ చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశం ఉంది. చర్మంపై 1 నుంచి 5 మచ్చలు ఉన్నవారికి 6నెలల పాటు, 5కంటే ఎక్కువ మచ్చలు ఉన్న వారికి ఏడాది పాటు ఉచితంగా మందులు అందజేస్తారు.

కృష్ణంశెట్టిపల్లె పీహెచ్‌సీలో కుష్ఠు సర్వే నిర్వహణ

| | | |
|---|---|---|
| జిల్లా జనాభా | : | 25,28,219 |
| గ్రామీణ జనాభా | : | 20,22,574 |
| పట్టణ జనాభా | : | 5,05,645 |
| జిల్లాలోని గృహాలు | : | 7,56,456 |
| మండలాలు | : | 38 |

### అందరూ సహకరించాలి

కుష్ఠును ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయించుకుంటే నయమవుతుంది. గ్రామాల్లో ప్రజలు సర్వేకు వచ్చిన వైద్య సిబ్బందికి చర్మవ్యాధులపై అడిగిన సమాచారాన్ని అందించి సహకరించాలి. – డా.శ్రీవాణి, జిల్లా కుష్ఠు నివారణ వైద్యాధికారిణి

# 'సనాతన ధర్మమే అసమానతలకు మూలం'

మాట్లాడుతున్న సామాజిక విశ్లేషకురాలు పీఏ.దేవి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సామాజిక అసమానతలకు మూలం సనాతన ధర్మమేనని సామాజిక విశ్లేషకురాలు పీఏ.దేవి తెలిపారు. సైంటిఫిక్ సోషల్ స్టడీ సర్కిల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం 'సనాతన ధర్మం, సామాజిక అంతరాలు, ప్రజాస్వామ్యం' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అక్టోబర్ విప్లవం ప్రపంచంలోని అన్ని దేశాలతో పాటు, నెహ్రూను కూడా ప్రభావితం చేసిందన్నారు. మతం పేరుతో దోపిడీ చేయడమే సనాతన ధర్మం లక్ష్యమని పేర్కొన్నారు.

# సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు డిప్యుటేషన్లు కాకుండా, పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హక్కుల ప్రొటెక్షన్ ఫెడరేషన్ ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల సచివాలయ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి విభాగ ఉద్యోగులకు స్పష్టమైన మార్గదర్శకాలను వెంటనే కల్పించాలన్నారు. న్యాయబద్ధంగా రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు బీఎల్వో బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాసరావు, ప్రభాకర్, శ్యామ్యూల్, శివకుమార్ పాల్గొన్నారు.

# ఏపీ సర్వే ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఒంగోలు మండలం వెంగముక్కపాలెం గ్రామ సచివాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆవుల శ్రీనివాసరావు (ఒంగోలు), ఉపాధ్యక్షులుగా ఎం.మహేందర్ రెడ్డి, కార్యదర్శిగా వై.బాబూరావు, సంయుక్త కార్యదర్శిగా జి.సైదారావు, కోశాధికారిగా డి.పరిశుద్ధరావు ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా సీహెచ్.మాధవరావు, ఐ.రామాంజనేయులు, ఎల్.విష్ణువర్ధన్, డి.శివకృష్ణ, కె.సాయి శ్రీదివ్య, పి.అఖిల్‌ను ఎన్నుకున్నారు.

ఎంపికైన సంఘం సభ్యులు

### గాజుల సింగారం.. అమ్మ మనసు బంగారం

తాళ్లూరు మండలంలోని మాధవరంలో ప్రఖ్యాతిగాంచిన గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పూజారి బెల్లంకొండ శ్రీనివాసశర్మ సుమారు రెండున్నర వేల గాజులతో దండలు తయారు చేసి ఆదివారం రాత్రి ముస్తాబు చేశారు. కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అలంకరణ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులందరికీ తీర్థ, ప్రసాదాలతోపాటు గాజులు అందజేయనున్నారు. అందువల్ల అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. –న్యూస్‌టుడే, తాళ్లూరు

ఆర్టీసీ బస్టాండు వద్ద శ్రీశైలం వెళ్లేందుకు ఆటోలు ఎక్కిన భక్తులు

## బస్సులు లేక భక్తుల అగచాట్లు

పెద్దదోర్నాల: కార్తికమాసం చివరి సోమవారం కావడంతో శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్లే భక్తులతో పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండు ఆదివారం కిటకిటలాడింది. బస్సుల్లో రద్దీ ఎక్కువవడంతో వారికి ఆటోలే దిక్కయ్యాయి. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

# వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన ఒంగోలు రాజీవ్‌నగర్‌లో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికంగా నివసించే బోడపాటి వరమ్మ అనే వృద్ధురాలు ఆదివారం ఉదయం 6.40 గంటల సమయంలో వాకింగ్ చేసేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై నెత్తికి టోపీలు, ముఖాలకు మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు ఆమె మెడలోనున్న బంగారు గొలుసు లాక్కున్నారు. ప్రతిఘటించే ప్రయత్నంలో ఆమె చేతిలో కొంత ముక్క మిగిలిపోగా మిగిలిన ఆభరణం దుండగుల చేతిలోకి వెళ్లింది. బాధితురాలు కేకలు వేసినప్పటికీ అప్పటికే వారు ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్సై ఫిరోజ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. స్థానికంగా లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# గాయపడిన కానిస్టేబుల్‌కు మెరుగైన వైద్యం

గిద్దలూరు పట్టణం: కారు దొంగను పట్టుకునే యత్నంలో గాయపడి చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రసూల్‌ను ఆదివారం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నిందితుడిని త్వరితగతిన పట్టుకోవాలని గిద్దలూరు సీఐ సురేష్‌కు సూచించారు. కార్యక్రమంలో గిద్దలూరు జడ్పీటీసీ సభ్యుడు బుడతా మధుసూదన్ యాదవ్, తెదేపా నాయకులు పాల్గొన్నారు

రసూల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

(c) eenadu

# మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెద్దారవీడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. దేవరాజుగట్టులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. ఆయన వెంట మండల ఉపాధి హామీ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో తెదేపా నేత ఎరిక్షన్‌బాబు

## స్వదేశీ వస్తువులే వినియోగించాలి

పొదిలి, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడు స్వదేశీ వస్తువులనే వినియోగించాలని భాజపా మండల అధ్యక్షుడు డి.రమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోతవరంలో స్వదేశీ ఆత్మనిర్భర్ భారత్ పై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాజపా మార్కాపురం నియోజకవర్గ నాయకులు పి.వి.కృష్ణారావు, ఖాదర్‌బాషా, రఫి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి పాచి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : మోడంపల్లెలోని నీటి ట్యాంకుకు పాచిపట్టి అపరిశుభ్రత నెలకొంది. గత కొన్ని నెలలుగా ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో పాచిపట్టింది. అయితే స్టాపర్లు లేకపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిన సమయంలో ట్యాంకు వద్ద నీరు పట్టుకొనేందుకు అవకాశం ఉండటం లేదు. నీళ్లు వెళ్లే దారి లేక ట్యాంకు ప్రాంతం బురదమయంగా ఉంది. తక్షణం శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా మోడంపల్లె నీటి ట్యాంకు

## జలకళతో రైతన్నల్లో ఉత్సాహం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: దశాబ్దం క్రితం చిన్నపాటి వర్షానికే చిన్నగుడిపాడు చెరువు నిండి అలుగు పారేది. దీంతో ఆయకట్టు రైతులు వరి సాగుచేసి మంచి దిగుబడులు సాధించేవారు. అయితే పెద్దదోర్నాలలో వెలిగొండ తీగలేరు కాలువ నిర్మించడంతో చెరువుకు రావాల్సిన నీరు కాలువలోకి వెళుతున్నాయి. కాలువపై యూటీ సరిగా నిర్మించకపోవడంతో నల్లవాగులోకి రావాల్సి నీరంతా కాలువలోకి వెళ్లేది. దీంతో చెరువుకు చుక్క నీరు అందని పరిస్థితి నెలకొంది. అయితే ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో చెరువుకు నీరు చేరడంతో రైతన్నల్లో ఉత్సాహం కన్పిస్తోంది.

చిన్నగుడిపాడు చెరువులో చేరిన నీరు

## నీటి కష్టాలు ఇక దూరం: కందుల

మార్కాపురం పట్టణం: ఇటీవల కురిసిన వర్షాలతో మార్కాపురం చెరువు పూర్తిగా నిండటంతో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం అలుగు వద్ద పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 10సంవత్సరాల తరువాత చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారడం సంతోషకరమన్నారు. చెరువుకు పూర్తిస్థాయిలో నీరు రావడంతో డీప్‌బోర్లు రీఛార్జి అయ్యి నీటి కష్టాలు దూరమవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, సాధిక్, తెదేపా నాయకులు ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అలుగు వద్ద జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, తదితరులు

## జనసేన బలోపేతానికి కృషి

కంభం, న్యూస్‌టుడే : జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాచర్ల మండల పార్టీ అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ అన్నారు. స్థానికంగా నిర్వహించిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జనసేనకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నాయకులు సూరే ప్రసాద్, కాసుల పాండు, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

కంభం : కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

## కనుల పండువగా కోటి దీపోత్సవం

కంభం: కోటా సత్యమాంబదేవి ఆలయంలో ఆదివారం కోటి దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శివుని ఆకారంలో దీపాలు పేర్చి మహిళలు వెలిగించారు.

**కోటా సత్యమాంబకు బోనాల సమర్పణ:** కంభం: పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబ దేవికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. బోనాలు, చీరలు, గాజులు సమర్పించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు, పుట్టాలమ్మ వద్ద పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. కోటా సత్యమాంబదేవి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వాహన పూజలు చేశారు.

**ప్రత్యేక అలంకరణలో ముద్దసానమ్మ**

మార్కాపురం గ్రామీణం: కోలభీమునిపాడు గ్రామ సరిహద్దులో వెలసిన ముద్దసానమ్మగుడిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో దేవేరిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ భక్తులకు అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

(c) eenadu

## జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక

సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల టెన్ని కాయిట్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి ఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శంకరరావు, చంద్రశేఖర్, మౌలాలీ, సురేష్ పాల్గొన్నారు.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)**

వెన్కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 115, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

## ప్రతిభకు ఉపకారం.. భవితకు ప్రోత్సాహం

వచ్చే నెల 7న ఎన్.ఎం.ఎం.ఎస్. పరీక్ష

విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

చదువుల్లో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పలు రకాల ఉపకార వేతనాలు అందిస్తోంది. వాటిలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్.) ఒకటి. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా పరీక్ష నిర్వహించి దాంట్లో ప్రతిభ చూపేవారికి ఏటా రూ. 12,000 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తోంది.

**- న్యూస్‌టుడే, కంభం, రాచర్ల**

### ఈసారి ఎక్కువ దరఖాస్తులు

ఎన్.ఎం.ఎం.ఎస్. ఉపకార వేతనం కోసం జిల్లాలో గతేడాది 3,338 మంది దరఖాస్తు చేయగా, ఈ ఏడాది 4011 మంది చేశారు.

- జిల్లాకు 200 మందికి మాత్రమే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తారు.
- **పరీక్ష తేదీ:** డిసెంబరు 7.
- **పరీక్ష కేంద్రాలు:** ఒంగోలు, మార్కాపురం, కనిగిరి

### మెంటల్ ఎబిలిటీపై పట్టు అవసరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి అవకాశం. మెంటల్ ఎబిలిటీపై పట్టు సాధించాలి. తద్వారా భవిష్యత్తులో జరిగే పలు రకాల పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పరీక్షకు సన్నద్ధమైతే గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టుల్లోనూ పట్టు వస్తుంది. పాఠ్యాంశాలను బాగా అర్థం చేసుకుంటే ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు రాయవచ్చు. బట్టీ విధానం ఉండకూడదు. వేగం కచ్చితత్వం అవసరం.

**- ఎన్. చంద్రశేఖర్, సైన్సు ఉపాధ్యాయుడు, రాచర్ల**

### అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులు లెక్కలకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. షార్ట్ కట్‌లో లెక్కలు చేయగలగాలి. రోజూ సాధన చేస్తే సమయాన్ని దృష్టిలో పెట్టుకొని వేగంగా చేయవచ్చు. తెలిసిన విషయంలాగే ఉంటాయి. తార్కికంగా ఆలోచించాలి. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధం కావడం వల్ల గణితంపై పట్టు సాధించేందుకు అవకాశం కలుగుతుంది.

**- ఎస్ఎస్. శ్రీనివాసులు, గణితం ఉపాధ్యాయుడు, రాచర్ల**

## పేద కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పారంపర్య మూలికా సంఘంలోని ఆయుర్వేద వైద్యులు ఉమర్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. పారంపర్య మూలికాసంఘం ఆదివారం వారి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఇమామ్ సాహెబ్, షఫీ పాల్గొన్నారు.

రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న మూలికా సంఘం సభ్యులు

## 23న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలు గ్రామీణం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23న దర్శిలోని ఝాన్సీ విద్యా సంస్థల ఆవరణలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ సీనియర్ నాయకులు ఏవీ పుల్లారావు తెలిపారు. ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల గోడప్రతులను ఆవిష్కరించారు.

## పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎగ్‌కార్టు తోపుడు బండిని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా మహిళల ఆర్థిక పరిపుష్టి, సామాజిక భద్రత, పౌష్టికాహారం అందించేందుకు ఎగ్ కార్టు తోపుడు బండ్లను కూటమి ప్రభుత్వం అందిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్ఈసీసీ సహకారంతో మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం డీఆర్‌డీఏ వెలుగు స్వయం సహాయక బృంద మహిళలకు ఎగ్ కార్టు తోపుడు బండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బండ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల ఆర్థిక సాయం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున వీటిని అందిస్తున్నామని, భవిష్యత్తులో వీటి సంఖ్య పెంచుతామన్నారు. కొండపి నియోజకవర్గంలో ఆరు మండలాలకు ఒక్కొక్కటి చొప్పున అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టంగుటూరు, జరుగుమల్లి మండలాల తెదేపా అధ్యక్షులు చదలవాడ చంద్రశేఖర్, పోకూరి రవీంద్ర పాల్గొన్నారు.


**EENADU e Classifieds**

**BUSINESS SERVICES**

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

**TO LET**

Commercial Space for Rent 2500 sft Opp: ASN college, Tenali. Cont no: 63026 41154

**JOBS**

**ఒంగోలు, త్రోవగుంట** ఆటోనగర్ ఎదురు హీరోస్పేర్ పార్ట్స్ డిస్ట్రిబ్యూటర్ ఆఫీసునందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ స్టాఫ్ కావలెను. 9154882189, 9154882192.

**DSA ఏజెన్సీ** గుంటూరు నందు పనిచేయుటకు లేడీ టెలీకాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 99489 35789, 80081 00872.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను స్త్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**ఒంగోలు ప్రముఖ** డెంటల్ హాస్పిటల్‌లో పనిచేయుటకు అసిస్టెంట్స్ స్త్రీలు & PROS కావలెను. ఒంగోలు స్థానికులు మాత్రమే. సెల్: 9182484425.

**శ్రీరామ్ చిట్స్** ఒంగోలు బ్రాంచీ నందు పని చేయుటకు మార్కెటింగ్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీ:16వేలు+ఇన్సెంటివ్స్. అ:ఏదైనా డిగ్రీ. టూవీలర్ తప్పనిసరి. వ: 32సం|| లోపు. సంప్ర|| 9849824191

**FACULTY/ TEACHERS**

**అనంతపురం టౌన్** రఘుసైనిక్ స్కూల్ నందు High School English & Spoken English అనుభవంకల్గిన టీచర్స్ కావలెను. ✆7981045257

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## ఆచితూచి.. పొగాకు నాట్లు

☛ గతానుభవాలతో రైతన్నల ముందుచూపు

పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

న్యూస్‌టుడే, పొదిలి: పశ్చిమ ప్రాంతంలోని రైతులు ఆచితూచీ పొగాకు నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో ఒడిదుడుకుల నేపథ్యంలో రైతులు నాట్లు వేయడంలో జాగ్రత్త వహిస్తున్నారు.

**ఈ ఏడాది 10 ఎకరాలకే పరిమితం:** గతంలో బ్యారన్‌కు పది నుంచి 12 ఎకరాలు సాగుచేసిన రైతులు ఈఏడాది పది ఎకరాలకే పరిమితమవుతున్నారు. తుపాను ప్రభావంతో పడిన వర్షాలకు నీరు నిలిచిన పొలాలు ప్రస్తుతం ఆరాయి. దీంతో నాట్లకు అనుకూల వాతావరణం ఏర్పడింది. పొగాకు నారు మూట ధర రూ.6,000 వరకూ పలుకుతోంది.

**రాజమండ్రి నుంచి నారు కొనుగోలు**

పశ్చిమ ప్రకాశంలో కొంతమంది రైతులు రాజమండ్రి ప్రాంతం నుంచి పొగాకు నారు తెప్పించుకుంటున్నారు. స్థానికంగా దొరికే నారు కంటే అక్కడి నారు నాణ్యత బాగుంటుందన్న ఉద్దేశంతో ధర ఎక్కువైనా వెనుకాడటంలేదు. ● ఎస్ఎల్ఎస్ పరిధిలోని వేలం కేంద్రాల్లో గత ఏడాది బ్యారన్‌కు 42.75 మి.కిలోలు పంటకు అనుమతించగా ఈ ఏడాది 36.65 మి.కిలోలకు తగ్గించారు. పొదిలి వేలం కేంద్రంలో 4332 మంది రైతులు ఉండగా, 2400 బ్యారన్లు ఉన్నాయి.

**సాగునీటి వనరులు లేక..**

జిల్లా పశ్చిమ ప్రాంతంలో సాగునీటి వనరులు లేనందున వర్షాధారంపై పండే పొగాకు సాగు వైపే ఈ ప్రాంత రైతులు మొగ్గుచూపుతున్నారు. కాలం కలిసొచ్చి రెక్కల కష్టానికి ఫలితం దక్కుతుండటంతో పొగాకు వైపే ఆసక్తి చూపుతున్నారు. పొదిలి, కనిగిరి, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని రైతులు లాభనష్టాలతో సంబంధం లేకుండా వర్జీనియా పొగాకు సాగుకే అలవాటుపడ్డారు. ఈ ఏడాది బర్లీ సాగు పూర్తిగా నిషేధించారు. దీంతో కొంతమంది రైతులు ప్రత్యామ్నాయ పంటలైన వరి, ఆరుతడి వంటి ఆహార పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. బర్లీ పొగాకు వద్దని అధికారులు పదేపదే హెచ్చరించడంతో సాగు పంథా మారుస్తున్నామని కొందరు రైతులు తెలిపారు. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించే పంటలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నామన్నారు.



## చిల్లచెట్లు తొలగించండి మహాప్రభో..

సీతాగులవరం-తర్లుపాడు రోడ్డులో రోడ్డు అంచుల వరకు పెరిగిన చిల్లచెట్లు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం-తర్లుపాడు రహదారిలో సీతానాగులవరం నుంచి తర్లుపాడు వరకు రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి రోడ్డు అంచుల వరకు వచ్చాయి. దీంతో ఎదురుగా వాహనాలు వస్తే తప్పుకునేందుకు సైతం అవకాశం లేకుండా పోయింది. తరచూ ఈ రోడ్డులో వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ మార్గంలో మూలమలుపుల వద్ద ఇటీవల ప్రమాదాలు జరిగి నలుగురికి గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

## ఈ మండప నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..

పునాదిలోనే నిలిచిపోయిన కల్యాణ మండపం నిర్మాణం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పేదలు శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణం పునాది దశ దాటలేదు. పెద్దదోర్నాలలో శ్రీశైల దేవస్థానానికి చెందిన శివసదనంలోని ఆవరణలో రూ.1.20కోట్లతో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. ఏడాది క్రితం పనులు చేపట్టిన గుత్తేదారుడు పునాది, పిల్లర్లు వేసి వదిలేశాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్యాణ మండప నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.




(c) eenadu

సొంతగడ్డపై ప్రత్యర్థులను స్పిన్‌తో వణికించి, పరుగుల వరదపారించిన టీమ్‌ఇండియానేనా ఇది? భారత్‌కు ఏమైంది? న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనా.. అది ఓ పీడకలలా మరిచిపోదామనుకున్నారు అభిమానులంతా! కానీ మళ్లీ ఓ షాక్.

కివీస్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబాటు తాత్కాలికం కాదని, మన బ్యాటర్లకు అదో బలహీనతగా మారిందని తేటతెల్లమైపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో సఫారీలకు టీమ్‌ఇండియా తలవంచింది. బ్యాటర్లు స్పిన్‌కు దాసోహమన్న వేళ.. తొలి టెస్టులో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. అవమానకర ఓటమిని చవిచూసింది.

# మన స్పిన్ ఉచ్చులో మనమే..

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్‌ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

కోల్‌కతా

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్‌ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

హార్మర్ 4/21

**ఏదో అనుకుంటే...:** ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంత గడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు.

**తడబడ్డారిలా..:** లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్‌ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా భారత్‌ను హార్మర్ మళ్లీ దెబ్బ తీశాడు. అంతే.. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) ప్రయత్నం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. కుల్‌దీప్ (1), సిరాజ్ (0) వెంటవెంటనే ఔటైపోయారు. గిల్ గాయంతో బ్యాటింగ్‌కు రాక పోవడంతో తొమ్మిదో వికెట్‌కే ఇన్నింగ్స్ ముగిసింది.

**బవుమా.. అమూల్యమైన 55:** అస్థిర బౌన్స్ ఉన్న పిచ్‌పై కెప్టెన్ బవుమా నిలబడి అమూల్యమైన 55 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా (ఓవర్‌నైట్ 93/7).. అనుకున్న దానికన్నా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బవుమా 29తో, బోష్ 1తో ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. బోష్ (25; 37 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో సఫారీ జట్టుకు విలువైన పరుగులు వచ్చాయి. చివరికి బోష్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో 44 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత బవుమా అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. హార్మర్, మహరాజ్‌ను సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159**
**భారత్ తొలి ఇన్నింగ్స్: 189**
**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికిల్టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా నాటౌట్ 55; టోని జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ (బి) బుమ్రా 25; హార్మర్ (బి) సిరాజ్ 7; కేశవ్ మహరాజ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 11
**మొత్తం:** (54 ఓవర్లలో ఆలౌట్) **153**;
**వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; అక్షర్ 14-0-36-1; కుల్‌దీప్ 8-1-30-2; జడేజా 20-3-50-4; సిరాజ్ 2-0-2-0-2
**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్‌క్రమ్ 31; ధ్రువ్ జురెల్ (సి) బోష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్‌దీప్ ఎల్బీ (బి) హార్మర్ 1; బుమ్రా నాటౌట్ 0; సిరాజ్ (సి) మార్‌క్రమ్ (బి) మహరాజ్ 0; గిల్ అబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 1
**మొత్తం:** (35 ఓవర్లలో ఆలౌట్) **93**;
**వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2; హార్మర్ 14-4-21-4; కేశవ్ 9-1-37-2; బోష్ 2-0-14-0; మార్‌క్రమ్ 3-0-5-1

ఛాంపియన్

# శ్రీకాంత్ పసిడి మెరుపులు

డెఫ్లింపిక్స్

మొర్తజాకు రజతం

మొర్తజా, శ్రీకాంత్

దిల్లీ: హైదరాబాద్ కుర్రాడు ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. డెఫ్లింపిక్స్‌లో అతడు స్వర్ణంతో మెరిశాడు. పోటీల తొలి రోజు, ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ధనుష్ ఫైనల్లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలుచుకున్నాడు. అతడు 252.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ మహ్మద్ మొర్తజా వానియా 250.1 పాయింట్లతో రజతం గెలుచుకున్నాడు. అతడు రెండో స్థానంలో నిలిచాడు. మహిళల ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిత్ సంధు రజతం, కోమల్ మిలింద్ కాంస్యం సాధించారు. ఫైనల్లో మహిత్ 250.5 పాయింట్లతో రెండో స్థానం సాధించారు. కోమల్ 228.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 2022 డెఫ్లింపిక్స్‌లో ధనుష్.. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించాడు. డెఫ్లింపిక్స్‌లో స్వర్ణం గెలిచినందుకు శ్రీకాంత్‌కు రూ.1.2 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

హరికృష్ణ

## హరికృష్ణ ఔట్

పనజిమ్: ఫిడే ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ కథ ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో అతడు టైబ్రేక్‌లో మార్టినెజ్ అల్కాంటర (మెక్సికో) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ డ్రా కావడంతో ఈ ఆటగాళ్లు ఆదివారం టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్‌లో తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాతి గేమ్‌లో మార్టినెజ్ విజయం సాధించాడు. నాలుగో గేమ్ డ్రా కావడంతో హరికి ఓటమి తప్పలేదు. భారత్ నుంచి ఒక్క అర్జున్ మాత్రమే ఈ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు.

## 4 పతకాలు ఖాయం

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. బొలొత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రీతి అంతే తేడాతో నిగినా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గాడు. కలెనిన్స్ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించడంతో సెమీస్ చేరింది.

## ఝార్ఖండ్ 259/6

జంషెడ్‌పూర్: ఆంధ్రతో రంజీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఝార్ఖండ్ తొలి రోజు ఆట చివరికి మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 259 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్ (115; 209 బంతుల్లో 16×4) సెంచరీ సాధించాడు.. కెప్టెన్ విరాట్ సింగ్ (41), ఆదిత్య సింగ్ (29) రాణించడంతో ఒక దశలో 213/3తో బలమైన స్థితిలో నిలిచిన ఝార్ఖండ్.. తర్వాత 31 పరుగుల తేడాతో 3 వికెట్లు చేజార్చుకుంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

పతకాలతో మహిళల డబుల్స్ విజేతలు

## తెలంగాణకు 2 స్వర్ణాలు, రజతం

ముగిసిన జాతీయ పికిల్‌బాల్

ఈనాడు, బెంగళూరు, క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ పికిల్‌బాల్ పోటీల్లో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరు వేదికగా జరిగిన ఈ టోర్నీకి క్రీడా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ రజతంతో తెలంగాణ.. గుజరాత్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచింది. 21 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో మహారాష్ట్ర మొత్తం 8 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక నాలుగు పతకాలతో రెండో స్థానం సాధించింది. పోటీల సందర్భంగా సబల మిల్లెట్స్ ఉత్పత్తుల పట్ల క్రీడాకారులతో పాటు సందర్శకులు, విద్యార్థులు ఆసక్తిని ప్రదర్శించారు.

## పాక్ చేతిలో భారత్ ఓటమి

దోహా: యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించిన భారత్-ఎ.. తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ చేతిలో 8 వికెట్ల తేడాతో కంగుతింది. మొదట అజీజ్ (3/24), సదాఖత్ (2/12), మసూద్ (2/31)ల ధాటికి భారత్-ఎ 19 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (45: 28 బంతుల్లో 5×4, 3×6), నమన్ ధీర్ (35) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. సదాఖత్ (79 నాటౌట్; 47 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

## గాయపడిన కానిస్టేబుల్‌కు మెరుగైన వైద్యం

కానిస్టేబుల్ రసూల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

**గిద్దలూరు పట్టణం:** కారు దొంగను పట్టుకునే యత్నంలో గాయపడి చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రసూల్‌ను ఆదివారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నిందితుడిని త్వరితగతిన పట్టుకోవాలని గిద్దలూరు సీఐ సురేష్‌కు సూచించారు. కార్యక్రమంలో గిద్దలూరు జడ్పీటీసీ సభ్యుడు బుడతా మధుసూదన్ యాదవ్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**బేస్తవారపేట, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బేస్తవారపేట పట్టణంలోని తెదేపా నూతన కార్యాలయంలో ఆదివారం మండల స్థాయి ప్రజాదర్బార్‌ను నిర్వహించగా, 44 అర్జీలొచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, కంభం ఏఎంసీ ఛైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ముప్పూరి రాము, జనసేన జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పోటీలు

**తర్లుపాడు, న్యూస్‌టుడే:** మండల కేంద్రమైన తర్లుపాడులోని గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. తర్లుపాడు, మీర్జాపేట, చెన్నారెడ్డిపల్లె, సీతానాగులవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి మాట్లాడారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**రాచర్ల :** స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్. రంగనాథన్, వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం చిత్రపటాలను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు లెమన్ స్పూన్, స్కిప్పింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చదరంగం పోటీలు : యర్రగొండపాలెం పట్టణం :** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఎ.సత్యవచన్, టి.దేవాన్ష్, కె.మహిమ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ, ఎంఈవోలు ఆంజనేయులు, మల్లునాయక్, ప్రభుత్వ వైద్యుడు చలపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో చదరంగం పోటీలు

## ముందుగా గుర్తిద్దాం.. వ్యాధి నివారిద్దాం

☛ నేటి నుంచి మలివిడత కుష్ఠు సర్వే

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుష్ఠు వ్యాధి నిర్మూలించాలనే లక్ష్యంతో ఏడాదికి రెండుసార్లు ఇంటింటి సర్వే చేపడుతున్నాయి. గత జనవరి నెలలో మొదటి సర్వే పూర్తి చేయగా, రెండో సర్వేను నేటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

**ఆశా కార్యకర్తలు, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ**

జిల్లాలో 2,038 బృందాలను ఏర్పాటు చేసి సర్వే ఎలా చేపట్టాలి అనే అంశంపై ఆశా కార్యకర్తలు, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందజేశారు. సర్వే బృంద సభ్యులు గృహాల వద్దకు వెళ్లి ఎవరికైనా చర్మవ్యాధులు ఉన్నాయా అన్నది తెలుసుకొని రోజుకు 25గృహాలను పరిశీలిస్తారు. స్పర్శలేని, దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని, రాగిరంగు మచ్చలు తదితర లక్షణాలను గమనించి అనుమానిత కేసులను గుర్తించాలి.

- కుష్ఠు వ్యాధి ఉన్న వారికి మల్టీడ్రగ్ థెరపీ చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశం ఉంది. చర్మంపై 1 నుంచి 5 మచ్చలు ఉన్నవారికి 6నెలల పాటు, 5కంటే ఎక్కువ మచ్చలు ఉన్న వారికి ఏడాది పాటు ఉచితంగా మందులు అందజేస్తారు.

కృష్ణంశెట్టిపల్లె పీహెచ్‌సీలో కుష్ఠు సర్వే నిర్వహణ

**జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఇదీ లెక్క**

| కుష్ఠు బాధితులు | పీబీ కేసులు | ఎంబీ కేసులు |
|---|---|---|
| : 36 | : 7 | : 29 |

| | |
|---|---|
| ఈ ఏడాది చికిత్స పూర్తిచేసుకున్న కేసులు | 52 |
| గతంలో చికిత్స పూర్తిచేసుకున్న కేసులు | 440 |
| పింఛను పొందుతున్న వారు | 271 |

| | | |
|---|---|---|
| జిల్లా జనాభా | : | 25,28,219 |
| గ్రామీణ జనాభా | : | 20,22,574 |
| పట్టణ జనాభా | : | 5,05,645 |
| జిల్లాలోని గృహాలు | : | 7,56,456 |
| మండలాలు | : | 38 |

**అందరూ సహకరించాలి**

కుష్ఠును ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయించుకుంటే నయమవుతుంది. గ్రామాల్లో ప్రజలు సర్వేకు వచ్చిన వైద్య సిబ్బందికి చర్మవ్యాధులపై అడిగిన సమాచారాన్ని అందించి సహకరించాలి.
– డా.శ్రీవాణి, జిల్లా కుష్ఠు నివారణ వైద్యాధికారిణి

నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న కార్యవర్గ సభ్యులు

## ఎన్‌జీవో నూతన కార్యవర్గం ఎన్నిక

కంభం, న్యూస్‌టుడే : కంభం తాలూకా ఎన్‌జీవో నూతన కార్యవర్గాన్ని కందులాపురం కూడలి సమీపంలోని వారి భవనంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి. రాధాకృష్ణమూర్తి, అసోసియేట్ అధ్యక్షునిగా జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కె.కోటేశ్వరరెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, రంగస్వామిరెడ్డి, కార్యదర్శులుగా షేక్.మహబూబ్ సుభాని, సంయుక్త కార్యదర్శులుగా సీహెచ్. వెంకటరెడ్డి, ఆర్.వి.శైలజా, ఎం.వి. శ్రీకాంత్, ఎస్. భారతి, కోశాధికారిగా జె.రంగస్వామిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పి.వి.రమణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

**మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మకు ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పవన్‌కుమార్‌శర్మ అమ్మవారిని నిమ్మకాయలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పొంగళ్లు, నైవేద్యాలతో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా ఆలయంలోని నాగమయ్య విగ్రహాలు, నాగులపుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం పట్టణం: ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

### ఘనంగా మండల పూజా మహోత్సవం

పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మండల పూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి కాశీనాథ్, సీఐ సుబ్బారావు అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు టి.గోపాలకృష్ణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## బస్సులు లేక భక్తుల అవస్థలు

**పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:** కార్తికమాసం చివరి సోమవారం కావడంతో శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్లే భక్తులతో పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండు ఆదివారం కిటకిటలాడింది. బస్సుల్లో రద్దీ ఎక్కువవడంతో వారికి ఆటోలే దిక్కయ్యాయి. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఘాట్‌రోడ్లపై వెళ్లడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్టాండు వద్ద శ్రీశైలం వెళ్లేందుకు ఆటోలు ఎక్కిన భక్తులు

## ఉత్సాహంగా వన భోజనాలు

**కంభం, న్యూస్‌టుడే :** పశ్చిమ ప్రకాశంలోని వివిధ ప్రాంతాల్లో వన భోజనాలు ఉత్సాహంగా జరిగాయి. కంభం చెరువు కట్టపై కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో కమ్మ సామాజిక కార్తిక వన భోజనాలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రూపూరి వెంకట సుబ్బయ్య, సంఘం రాష్ట్ర కార్యదర్శి వెలగ కోటేశ్వరరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చనూతుల గోపీనాథ్ చౌదరి మాట్లాడారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున శ్రీశైలం అన్నదాన సత్రం అధ్యక్షుడు సుబ్బారావు ఆర్థిక సాయం అందజేశారు. బోయపాటి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, బాల కోటయ్య, లక్ష్మయ్య, కొండయ్య, సురేష్, గని వెంకటేశ్వర్లు, రమేష్, త్రివిక్రమరావు, నాసరయ్య పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం పట్టణం:** సీనియర్ తెదేపా నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ మన్నె రవీంద్రకు ఆదివారం హైదరాబాద్‌లో సన్మానించారు. కేపీహెచ్‌బీ కాలనీలో కమ్మవారి కార్తిక వన మహోత్సవం సందర్భంగా ఆయన్ను శాలువాతో సన్మానించారు.

**ముక్తీశ్వరక్షేత్రంలో..:** బేస్తవారపేట, న్యూస్‌టుడే: ముక్తీశ్వరక్షేత్రంలో ఆదివారం కొండా ఇంటి పేరున్న వారు వన సమారాధన నిర్వహించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కొండా ఇంటి పేరున్న రెడ్డి సామాజిక వర్గం వారు ఇందులో పాల్గొన్నారు. డిల్లీ పబ్లిక్ స్కూల్ యజమాని కొండా రాఘవరెడ్డి, జయవర్ధన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**రెడ్ల సంఘం ఆధ్వర్యంలో:** అర్ధవీడు: యోగి వేమన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నాగులవరం నరవ సమీపంలో కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరై.. రెడ్ల సంఘం సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. అర్ధవీడు, కంభం, బేస్తవారపేట మండలాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంభం : చెక్కును కాకతీయ సేవా సమితి సభ్యులకు అందిస్తున్న సుబ్బారావు తదితరులు

బేస్తవారపేట : వన భోజనాల్లో పాల్గొన్న రెడ్డి సామాజిక వర్గీయులు

### సుగాలి ఆత్మీయ సమ్మేళనం

**పెద్దారవీడు:** సుగాలి కార్తిక వనభోజనాల కార్యక్రమాన్ని దేవరాజుగట్టులోని కాశినాయన ఆశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుగాలి, లంబాడి, బంజారా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా జాతి గురువు అహిన శ్రీ సేవాలాల్ మహరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## వాహనం అదుపుతప్పి గృహిణి మృతి

**నల్లగుంట్ల (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే:** ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వివాహిత మృతిచెందారు. ఈ సంఘటన నల్లగుంట్ల వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గిద్దలూరు మండలం త్రిపురాపురానికి చెందిన గుమ్మళ్ల నందిని (25) భర్త బాల వెంకటరాజుతో కలిసి అల్లినగరానికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. వారు నల్లగుంట్ల సమీపంలోంచి వెళుతుండగా..ఒక్కసారే కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి దంపతులిద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో నందిని తలకు బలమైన గాయం కావడంతో ఆమెను గిద్దలూరుకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. మృతురాలికి ఓ కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

**దరిమడుగులో వ్యక్తి మృతదేహం:** మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: మార్కాపురం మండలం దరిమడుగులో రహదారి పక్కన ఆదివారం ఉదయం వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దూదేకుల పెద్దకాశిం(48) మృతదేహం దరిమడుగు బస్టాండ్ కూడలిలో పడివుండగా, పంచనామా నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనారోగ్యంతో మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ అంకమ్మారావు తెలిపారు.

**కేసు నమోదు:** కంభం : లింగాపురంలో అక్రమంగా పొలం దున్నడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఆయన కథనం మేరకు..గ్రామానికి చెందిన నరాల రమణారెడ్డి గతంలో గ్రామానికి చెందిన కొందరి నుంచి పొలం కొనుగోలు చేశారు. ఆ పొలాన్ని గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి అక్రమంగా దున్నారని రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

(c) eenadu

కనిగిరి
• కనిగిరి • దర్శి • కొండపి

## ప్రయాణికులు ఎక్కువ.. రైళ్లు ఆగేది తక్కువ

న్యూస్‌టుడే, టంగుటూరు

టంగుటూరు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాలంటే వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రం ఒంగోలు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, చదువుల కోసం వెళ్లే విద్యార్థులు ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పెద్ద మొత్తంలో రైల్వే ఆదాయానికి గండిపడుతోంది.

టంగుటూరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

### దూర ప్రాంతాలకు వెళ్లలేక..

టంగుటూరు రైల్వే స్టేషన్ నుంచి ఏటా రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య 60 వేల మంది వరకు ఉంటుంది. కొండపి నియోజకవర్గంతోపాటు కందుకూరు, కనిగిరి, పొదిలి ప్రాంతాలకు చెందిన కొన్ని గ్రామాల ప్రజలకు టంగుటూరు రైల్వేస్టేషన్ అనుకూలంగా ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయకపోవడంతో వారు రైలు కోసం మరింత దూరం ప్రయాణించాల్సి వస్తుంది. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, ఇతర ప్రాంతాలకు టంగుటూరు నుంచి నిత్యం అయిదు వందల మందికి పైగా ప్రయాణిస్తుంటారు. వీరంతా అధికంగా ప్రైవేటు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. రాత్రివేళ హైదరాబాద్, తిరుపతి ప్రాంతాలకు వెళ్లే సింహపురి, పద్మావతి, శేషాద్రి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసినా ఐటీ ఉద్యోగులు, వివిధ వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుంది.

### ప్రస్తుతం ఆగుతున్న రైళ్లు ఇవే..

టంగుటూరు రైల్వేస్టేషన్‌లో ఏళ్లనాటి నుంచి ప్యాసింజర్ రైళ్లే నిలుపుదల చేస్తున్నారు. దీని కారణంగా రైల్వేస్టేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. విజయవాడ-బిట్రగుంట, విజయవాడ - గూడూరు, కాకినాడ టౌన్ - తిరుపతి వంటి కొన్ని మాత్రమే ఆగుతున్నాయి. కృష్ణ, పూరీ, బిలాస్‌పూర్ వంటి ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతున్నప్పటికీ అవి అత్యంత రద్దీగా ఉండటంతో పెద్దగా ఉపయోగం లేదని ప్రయాణికులు ఆసక్తి చూపడం లేదు.

### అభివృద్ధి కమిటీ ధర్నాలు చేసినా..

టంగుటూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం గ్రామస్థులు ఓ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. 2021లో ఏర్పాటైన ఈ కమిటీ పలుమార్లు ఆందోళనలు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల కోసం ధర్నాలు, నిరసనలు చేపట్టినప్పటికీ యంత్రాంగం స్పందించడం లేదు. గతంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి విన్నవించగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల కోసం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## నేడు శివాలయంలో స్పర్శ దర్శనం

కొండపి గ్రామీణం: కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలోని పెద్దకండ్లగుంట గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో స్పర్శ దర్శనం అవకాశం కల్పించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కర్నాటి వెంకటరెడ్డి తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయ దుస్తులతో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

ఆలయం వద్ద పడిపూజలో పాల్గొన్న మాలధారులు

## కొండపిలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వామి నామస్మరణతో కొండపి గ్రామం మార్మోగింది. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో 18 మెట్ల కలశపూజ, ఇతర ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురు స్వాములు దగ్గి రామారావు, బాలాజీ, సాయిరాం శ్రీను, ఆలయ అర్చకుడు సాయి శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులతో భజన ఏర్పాటు చేశారు. మెట్ల పూజ తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు స్వాములు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.

## కాలువలు కట్టరు.. మురుగునీరు కదలదు

### కనిగిరిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం

న్యూస్‌టుడే, కనిగిరి

- పేరు: కనిగిరి మున్సిపాలిటీ
- వార్డులు: 28
- విస్తీర్ణం 54.2 చ.కి.మీ
- జనాభా: 55 వేల మంది
- గృహాలు: 15,375
- మురుగు కాలువలు 135 కి.మీ

కనిగిరి పేరుకే గ్రేడ్-2 మున్సిపాలిటీ. పారిశుద్ధ్య నిర్వహణ తీరు మాత్రం అధ్వానంగా ఉంది. సైడ్ కాలువలు ఉన్నట్లు లెక్కల్లో చూపుతున్నా.. వాటిలో అధికంగా 20 ఏళ్ల కిందట నిర్మించినవే. ఇటీవల కాలంలో ఎంతో మంది గ్రామీణ, ఇతర పట్టణ ప్రాంతాల నుంచి కనిగిరి వచ్చి నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇలాంటి చోట్ల కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఇళ్లలోని వాడకపునీరు మొత్తం ఎక్కడికక్కడే రోడ్లు మీదకు చేరి ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వర్షం పడినా బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచి పోతుంది. గత వైకాపా ప్రభుత్వంలో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో సుమారు రూ. 3 కోట్ల వరకు ఖర్చు చేసి బిల్లులు చేసుకున్నారు. ఎప్పటి మాదిరిగానే రోడ్లు శిథిలావస్థకు చేరి అధ్వానంగా కనిపిస్తున్నాయి.

కనకపట్టణం వద్ద మురుగునీరు చేరి రోడ్డుపై ఏర్పడిన గుంతలు

### సీసీ రోడ్లు నిర్మించినా..

ఇటీవల కాలంలో కనక పట్టణం, ఆర్టీసీ డిపో వెనుక ప్రాంతం, కాశీనాయన గుడి ప్రాంతం, శివనగర్‌కాలనీ, ఎన్జీవోకాలనీ, బీసీ కాలనీ, పాతూరు, కొత్తూరు చింతలపాలెం తదితర ప్రాంతాల్లో కొత్తగా సీసీ రోడ్లు వేసినా కాలువలు నిర్మించలేదు. వెంటనే అధికారులు స్పందించి ఎక్కడ మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేదో గుర్తించి వెంటనే దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్త డ్రైనేజీలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంతా కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈఈ కోటేశ్వరరావును వివరణ కోరగా.. వెంటనే ఆయా ప్రాంతాల్లో పరిశీలించి కాలువలకు మరమ్మతులు చేయిస్తామని, నూతనంగా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.

## పుస్తక పఠనం.. భవితకు సోపానం

గ్రంథాలయోద్యమానికి సేవలు అందించిన వారి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దర్శి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం దర్శిలో విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయోద్యమానికి సేవలు అందించిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్సార్ రంగనాథన్, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల విస్తరణలో వారి పాత్ర గురించి వక్తలు విద్యార్థులకు వివరించారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో పిల్లల చేత నీతి కథల పుస్తకాలు చదివించారు. అనంతరం పుస్తక పఠన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాలో 120 మంది ఎంపిక

ముఖాముఖికి హాజరైన యువకులు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని అమరావతి మైదానంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మేన్ పవర్ సర్వీసెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం జాబ్ మేళా నిర్వహించారు. దీనికి 170 మంది హాజరు కాగా, వీరిలో 120 మంది ఎంపికయ్యారు. వీరందరికీ శ్రీసిటీలో ఉద్యోగం కల్పించనున్నట్లు సంస్థ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన వారందరికీ జాబ్ ఆఫర్ లెటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఫిరోజ్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, జంషీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్టీయూ మండల కార్యవర్గ సభ్యులు

## ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక కార్యాలయంలో ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా నూకసాని వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా పనపాకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కీర్తి శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా సుధాకరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మాలీరావు, అజయ్‌కుమార్‌చౌదరి, జయలక్ష్మిలను ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి ప్రసాదు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2011కు ముందు ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని తీర్మానించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను సాధించేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కనుల పండువగా పుష్పయాగం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మహా పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకను తిలకించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం, రాజగోపురం, ప్రాంగణం విద్యుత్తు దీపాల వెలుగుల్లో కాంతులీనాయి. కోలాట ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దాతల సహకారంతో భక్తులకు భోజన వసతి కల్పించారు. ఈవో ఎస్.నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కె.చిన్నఆదినారాయణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన

## వ్యవసాయ విద్యార్థుల రక్తదానం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో ఏజీబీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం-2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఒంగోలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 26 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారిని కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్, అధ్యాపకులు అభినందించారు. ఎన్ఎస్ఎస్ బాధ్యులు స్టెఫి, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ, సిబ్బంది రవి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

## మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: కురిచేడు మండలంలోని నమశ్శివాయపుర అగ్రహారం నుంచి పొలాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.
– నారాయణ, స్థానికుడు

✓: పొలాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పనులు చేపడతాం. – వెంకటరమణ, సర్పంచి

?: హెచ్‌ఎంపాడు మండలం కొండారెడ్డిపల్లి పంచాయతీ రసీదుపురంలో కొళాయిలకు నీరు సక్రమంగా రావడం లేదు. డీప్‌బోరు మోటారు, పైపులైన్ మరమ్మతులకు గురయ్యాయి.
–జి.బోయజ్, గ్రామస్థుడు

✓: సర్పంచికి సమాచారం ఇచ్చి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. –శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పరిధిలోని విద్యానగర్, పంచాయతీ కార్యాలయం సమీపంలో పదిరోజులుగా వీధి దీపాలు వెలగక రాత్రుల సమయంలో అధకారం నెలకొంది. అపరిచిత వ్యక్తులు సంచరిస్తూ నివాస గృహాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. –రాజేష్, స్థానికుడు

✓: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల వీధి దీపాలు కాలిపోయాయి. త్వరలో మరమ్మతులు చేయిస్తాం.
–హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి

?: తాళ్లూరు మండలం తూర్పుగంగవరం ఎస్సీకాలనీ ప్రధాన వీధిలోని ప్రాథమిక పాఠశాల వద్ద విద్యుత్తు దీపం వెలగడం లేదు. దీంతో రాత్రివేళ ఇటువైపు రాకపోకలు సాగిస్తున్న ప్రజలు చీకటిలో ఇబ్బందులకు గురవుతున్నారు.
–కోటేశ్వరరావు, స్థానికుడు

✓: వెంటనే వీధి దీపానికి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. –మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శి

**న్యూస్‌టుడే, కురిచేడు, హనుమంతునిపాడు, సింగరాయకొండ గ్రామీణం, తాళ్లూరు**

## ఎండిన చెట్టు.. విరిగి పడితే చేటు

జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో ప్రధాన రహదారి పక్కన ఒక ఎండిన చెట్టు ప్రమాదకరంగా నిలిచింది. దీని కొమ్మలు ఎప్పుడైనా విరిగిపడే అవకాశం ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ చెట్టు పక్కనే బస్సులు, ఆటోలు నిలిపి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ ఆ మార్గంలో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు నడుచుకుంటూ వెళ్తుంటారు. ఏ క్షణంలోనైనా కొమ్మలు విరిగి పడతాయేమోనని భయపడుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ మాధవరావును వివరణ కోరగా.. ఈ చెట్ల తొలగించడానికి అటవీశాఖ అధికారుల అనుమతులు కోరామని, రాగానే వెంటనే తొలగిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, జరుగుమల్లి

## వాగు.. వారధి ఉంటే బాగు

తాళ్లూరు మండలంలోని కొర్రపాటివారిపాలెం సమీపాన ఉన్న రెండు వాగులపై వంతెనలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో వాటిపై ఉన్న కాజ్‌వే, పైపుల కల్వర్టు తుపానుకు కొట్టుకుపోవడంతో మళ్లీ ఇబ్బందులు పునరావృతమయ్యాయి. నిత్యం ఇటువైపుగా వందలాది మంది ప్రజలు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు మహిళలు గేదెలకు కొండ ప్రాంతం నుంచి మేతను తీసుకువస్తున్నప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లును సంప్రదించగా త్వరలోనే అక్కడి సమస్యపై విచారించి నిధులు మంజూరుకోసం ప్రయత్నిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, తాళ్లూరు

## చెత్త.. ఇలా వేస్తే ఎలా..?

కనిగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. వాటిలో వేయకుండా చెత్తను కిందే పడేస్తున్నారు. ఇలా చేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి పందులు, ఆవులకు నిలయంగా మారి ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను వివరణ కోరగా తప్పనిసరిగా చెత్తను కుండీలో వేసేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. పట్టణంలోని ఇందిరాకాలనీలోని చిత్రమిది. –న్యూస్‌టుడే, కనిగిరి

## విద్యుత్తు పరికరాల చోరీ

కనిగిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధి అర్బన్ కాలనీలోని ఓ ఇంటిలో దొంగలు చొరబడి సుమారు రూ. 3 లక్షల విలువ చేసే విద్యుత్తు పరికరాలను అపహరించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ కాలనీలో నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్న ప్రకాష్‌రెడ్డి విద్యుత్తు వైరింగ్, ఇతర విలువైన పరికరాలను అక్కడ ఉంచారు. శనివారం రాత్రి నిర్మాణంలో ఉన్న ఆ ఇంటికి తాళం వేసి కనిగిరికి వచ్చారు. ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి వస్తువులన్నీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.

## ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి అప్పగింత

పామూరు: పాఠశాలకు వెళ్లి కనిపించకుండా పోయిన మండలంలోని గుమ్మలంపాడు గ్రామానికి చెందిన బాలుడిని పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. 10వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థి 8 రోజుల క్రితం చదువు విషయంలో తల్లి మందలించడంతో పాఠశాలకు వెళ్లి, ఆ తర్వాత అక్కడ నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అతడు కందుకూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పామూరు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై కిషోర్ బాబు, ఏఎస్సై జిలాని బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## సందడిగా వన సమారాధనలు

తాళ్లూరు, నూస్‌టుడే: మండలంలోని సోమవరప్పాడు పరిధి గుంటిగంగలోని కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో ఆదివారం కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు. సొసైటీ అధ్యక్షుడు వి.సుబ్బయ్యతోపాటు మరికొందరు ప్రముఖులను సత్కరించారు. యువతులు, మహిళలు కోలాటంతో ఆకట్టుకున్నారు. సత్రం అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో..

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు శివాలయం వద్ద దర్శి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గరం సుబ్బారావు, కోట హనుమంతరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ◗ జరుగుమల్లి: బిట్రగుంటలోని కాలభైరవ స్వామి ఆలయంలో టంగుటూరు ఆర్యవైశ్యులు వనసమారాధనను నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ధర్మాచరణ, సేవ, సానుకూల జీవన విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు దేవకి వెంకటేశ్వర్లు, భద్రీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ◗ పామూరు: అనుమునిగిరి శివరామ బ్రహ్మేంద్ర స్వామి క్షేత్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు.

పామూరు: పల్లకి సేవలో పాల్గొన్న మహిళలు

### బీసీ ఐక్యవేదిక తరఫున...

కనిగిరి: బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీలంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని. మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్, పల్లా మాలకొండయ్య, దేపూరి వెంకటేశ్వర్లు, షేక్ బారాయి మామ్, చింతలపూడి తిరిపాలు తదితరులు పాల్గొన్నారు.

### రామకృష్ణ ధ్యాన మందిరంలో..

కనిగిరిలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో కార్తిక వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కడప రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీమత్ స్వామి అనుపమానందజీ మహారాజ్ కార్తిక మాస విశిష్టతను వివరించారు.

## వైద్య ఖర్చులకు సాయం

పామూరు: పామూరులో ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ముగ్గురు పేదలకు ఒక్కొక్కరికీ రూ. అయిదు వేల చొప్పున వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. దేవయ్య, రత్తయ్య, జయలక్ష్మి ఈ సహాయం పొందారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## గుంతల రహదారికి మోక్షం!

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సీతారామపురం-కోనపల్లి ఆర్ అండ్‌బీ రహదారి డీజీపేట నుంచి పిల్లిపల్లి వరకు 13 కిలోమీటర్ల మేర అధ్వానంగా తయారైంది. 2012లో దీనిని తారు రోడ్డుగా నిర్మించారు. గుంతలు పడి వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసింది. 12 అడుగుల వెడల్పుతో 13 కిలోమీటర్లు కొత్తగా మళ్లీ తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా నిర్మించిన సీతారామపురం - కోనపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు

## సింగరాయకొండలో దాహం కేకలు

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

మండల కేంద్రం సింగరాయకొండలో పది రోజులుగా తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. గ్రామ పరిధిలో సుమారు 150 చేతి పంపులున్నా 100కు పైగా అవి మూలకు చేరడంతో పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయి. గత తెదేపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి బాలవీరాంజనేయ స్వామి నిధులు మంజూరు చేయించి రామతీర్థం నుంచి జలాలను పైపుల ద్వారా ఇక్కడికి తీసుకొచ్చారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొండపి, జరుగుమల్లి మండలాల పరిధిలో కొందరు వైకాపా నేతలు పైపులు ధ్వంసం చేసి తమ గ్రామాలకు మళ్లించుకున్నారు. ప్రస్తుతం ఆ నీరు అరకొరగా వస్తుండటంతో సింగరాయకొండ మండలంలోని గ్రామాలకు పూర్తిస్థాయిలో అందడం లేదు.

### ఇంటింటికీ కుళాయిలు వేసినా..

సింగరాయకొండకు శానంపూడి పరిధిలోని మన్నేరు వద్ద నుంచి తాగునీరు వారానికొకసారి అందిస్తున్నా, నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాతసింగరాయకొండ పరిధిలోని గవదకట్లవానిపాలెం ప్రధాన రహదారి వెంబడి భారీ వాహనాలు రాకపోకలతో పైపులు ధ్వంసమవుతున్నా పంచాయతీ అధికారులు మిన్నకుంటున్నారు. మరోవైపు నీటి సరఫరా కోసం 4 విద్యుత్తు మోటార్లు ఉన్నా అవి నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. వీటిని పట్టించుకునే నాథుడే కరవయ్యారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి ఉచిత కుళాయిలు అమర్చారే తప్ప అవి పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా.. రామతీర్థం జలాలు తరలించే పైపులు, మన్నేరు నుంచి వచ్చే పైపులు ధ్వంసమయ్యాయని, త్వరలోనే వాటికి మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు.

గవదకట్లవానిపాలెం వద్ద దెబ్బతిన్న మన్నేరు బావి ప్రధాన పైపులైన్

## అధిక వేగం.. ప్రమాదాలకు ఆస్కారం

తాళ్లూరు, న్యూస్‌టుడే: అధిక వేగంతో వాహనాలు నడపడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎస్సై ఎస్.మల్లికార్జునరావు సూచించారు. గుంటిగంగ వద్ద ఆదివారం ద్విచక్ర వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహన చోదకులంతా విధిగా శిరస్త్రాణం ధరించి పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు ఉండాల్సిందేనని, లైసెన్సులు కూడా తప్పనిసరి అని వివరించారు. ఏలోపాలున్నా అపరాధ రుసుముతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మల్లికార్జునరావు

### మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా..

కొండపి గ్రామీణం: ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఇద్దరు మైనర్లకు ఒక్కొక్కరికి రూ. 5,035 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కొండపిలో మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో కనీస వయసు, శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న ఇద్దరికి మొదటి తప్పుగా జరిమానా విధించామన్నారు. రెండోసారి పట్టుపడితే రూ. 25 వేలు జరిమానాతోపాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

(c) eenadu

# ఛాంపియన్

సొంతగడ్డపై ప్రత్యర్థులను స్పిన్‌తో వణికించి, పరుగుల వరదపారించిన టీమ్‌ఇండియానేనా ఇది? భారత్‌కు ఏమైంది? న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనా.. అది ఓ పీడకలలా మరిచిపోదామనుకున్నారు అభిమానులంతా! కానీ మళ్లీ ఓ షాక్.

కివీస్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబాటు తాత్కాలికం కాదని, మన బ్యాటర్లకు అదో బలహీనతగా మారిందని తేటతెల్లమైపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో సఫారీలకు టీమ్‌ఇండియా తలవంచింది. బ్యాటర్లు స్పిన్‌కు దాసోహమన్న వేళ.. తొలి టెస్టులో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. అవమానకర ఓటమిని చవిచూసింది.

# మన స్పిన్ ఉచ్చులో మనమే..

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్‌ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

కోల్‌కతా

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్‌ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

హార్మర్ 4/21

**ఏదో అనుకుంటే...:** ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంత గడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు.

**తడబడ్డారిలా...:** లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్‌ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు.. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా భారత్‌ను హార్మన్ మళ్లీ దెబ్బ తీశాడు. అంతే.. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) ప్రయత్నం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. కుల్‌దీప్ (1), సిరాజ్ (0) వెంటవెంటనే ఔటైపోయారు. గిల్ గాయంతో బ్యాటింగ్‌కు రాకపోవడంతో తొమ్మిదో వికెట్‌కే ఇన్నింగ్స్ ముగిసింది.

**బవుమా.. అమూల్యమైన 55:** అస్థిర బౌన్స్ ఉన్న పిచ్‌పై కెప్టెన్ బవుమా నిలబడి అమూల్యమైన 55 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా (ఓవర్‌నైట్ 93/7).. అనుకున్న దానికన్నా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బవుమా 29తో, బోష్ 1తో ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. బోష్ (25; 37 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో సఫారీ జట్టుకు విలువైన పరుగులు వచ్చాయి. చివరికి బోష్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో 44 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత బవుమా అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. హార్మర్, మహరాజ్‌ను సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159**
**భారత్ తొలి ఇన్నింగ్స్: 189**
**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికిల్టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా నాటౌట్ 55; టోని జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యెన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ (బి) బుమ్రా 25; హార్మర్ (బి) సిరాజ్ 7; కేశవ్ మహరాజ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 11
**మొత్తం:** (54 ఓవర్లలో ఆలౌట్) **153;**
**వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; అక్షర్ 14-0-36-1; కుల్‌దీప్ 8-1-30-2; జడేజా 20-3-50-4; సిరాజ్ 2-0-2-0-2

**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్‌క్రమ్ 31; ధ్రువ్ జురెల్ (సి) బోష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్‌దీప్ ఎల్బీ (బి) హార్మర్ 1; బుమ్రా నాటౌట్ 0; సిరాజ్ (సి) మార్‌క్రమ్ (బి) మహరాజ్ 0; గిల్ ఆబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 1
**మొత్తం:** (35 ఓవర్లలో ఆలౌట్) **93;**
**వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2; హార్మర్ 14-4-21-4; కేశవ్ 9-1-37-2; బోష్ 2-0-14-0; మార్‌క్రమ్ 3-0-5-1

## శ్రీకాంత్ పసిడి మెరుపులు

మొర్తజాకు రజతం

డెఫ్లింపిక్స్

మొర్తజా, శ్రీకాంత్

**దిల్లీ:** హైదరాబాద్ కుర్రాడు ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. డెఫ్లింపిక్స్‌తో అతడు స్వర్ణంతో మెరిశాడు. పోటీల తొలి రోజు, ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ధనుష్ ఫైనల్లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలుచుకున్నాడు. అతడు 252.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ మహ్మద్ మొర్తజా వానియా 250.1 పాయింట్లతో రజతం గెలుచుకున్నాడు. అతడు రెండో స్థానంలో నిలిచాడు. మహిళల ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిత్ సంధు రజతం, కోమల్ మిలింద్ కాంస్యం సాధించారు. ఫైనల్లో మహిత్ 250.5 పాయింట్లతో రెండో స్థానం సాధించగా.. కోమల్ 228.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 2022 డెఫ్లింపిక్స్‌లో ధనుష్.. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించాడు. డెఫిలింపిక్స్‌లో స్వర్ణం గెలిచినందుకు శ్రీకాంత్‌కు రూ.1.2 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

హరికృష్ణ

## హరికృష్ణ ఔట్

**పంజిమ్:** ఫిడే ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ కథ ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో అతడు టైబ్రేక్‌లో మార్టినెజ్ అల్కాంటరా (మెక్సికో) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ డ్రా కావడంతో ఈ ఆటగాళ్లు ఆదివారం టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్‌లో తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాతి గేమ్‌లో మార్టినెజ్ విజయం సాధించాడు. నాలుగో గేమ్ డ్రా కావడంతో హరికి ఓటమి తప్పలేదు. భారత్ నుంచి ఒక్క అర్జున్ మాత్రమే ఈ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు.

## 4 పతకాలు ఖాయం

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

**గ్రేటర్ నోయిడా:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. బొలోత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రీతి అంతే తేడాతో నిగినా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గగా.. కలెట్‌స్కీ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించడంతో సెమీస్ చేరింది.

## ఝార్ఖండ్ 259/6

**జెంషెడ్‌పుర్:** ఆంధ్రతో రంజీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఝార్ఖండ్ తొలి రోజు ఆట చివరికి మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 259 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్ (115; 209 బంతుల్లో 16×4) సెంచరీ సాధించడం.. కెప్టెన్ విరాట్ సింగ్ (41), ఆదిత్య సింగ్ (29) రాణించడంతో ఒక దశలో 213/3తో బలమైన స్థితిలో నిలిచిన ఝార్ఖండ్.. తర్వాత 31 పరుగుల తేడాతో 3 వికెట్లు చేజార్చుకుంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

పతకాలతో మహిళల డబుల్స్ విజేతలు

## తెలంగాణకు 2 స్వర్ణాలు, రజతం

ముగిసిన జాతీయ పికిల్‌బాల్

**ఈనాడు, బెంగళూరు, బెంగళూరు క్రీడలు, న్యూస్‌టుడే:** జాతీయ పికిల్‌బాల్ పోటీల్లో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరు వేదికగా జరిగిన ఈ టోర్నీకి ప్రియా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ రజతంతో తెలంగాణ.. గుజరాత్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచింది. 21 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో మహారాష్ట్ర మొత్తం 8 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక నాలుగు పతకాలతో రెండో స్థానం సాధించింది. పోటీల సందర్భంగా సబల మిల్లెట్స్ ఉత్పత్తుల పట్ల క్రీడాకారులతో పాటు సందర్శకులు, విద్యార్థులు అమితాసక్తిని ప్రదర్శించారు.

## పాక్ చేతిలో భారత్ ఓటమి

**దోహా:** యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించిన భారత్-ఎ.. తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ చేతిలో 8 వికెట్ల తేడాతో కంగుతింది. మొదట అజీజ్ (3/24), సదాఖత్ (2/12), మసూద్ (2/31)ల ధాటికి భారత్-ఎ 19 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (45; 28 బంతుల్లో 5×4, 3×6), నమన్ ధీర్ (35) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. సదాఖత్ (79 నాటౌట్; 47 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

# కేంద్ర బడుల్లో కొలువులు!

## 14967 పోస్టుల భర్తీ

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయల్లో పలు పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ, వైస్ ప్రిన్సిపల్, ప్రిన్సిపల్, మ్యూజిక్ టీచర్, లైబ్రేరియన్, పీఈటీ, బోధనేతర పోస్టులు.. అన్నీ కలిపి 14967 ఖాళీలు భర్తీ చేస్తారు. పోస్టు ప్రకారం పరీక్షలు, ఇంటర్వ్యూ, స్కిల్‌టెస్టుల్లో ప్రతిభతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు సుస్థిరమైన కెరియర్ సొంతం చేసుకోవడంతోపాటూ, ఆకర్షణీయ వేతనమూ అందుకోవచ్చు.



కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయల్లో ఖాళీలను ఉమ్మడి పరీక్షతో సీబీఎస్‌ఈ భర్తీ చేయనుంది. ఈ ఉద్యోగాలకు ఎంపికైనవారు దేశంలో ఎక్కడి నుంచైనా విధులు నిర్వర్తించాలి. ప్రైమరీ టీచర్లు సుమారు రూ.60,000, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు దాదాపు రూ.80,000, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు ఇంచుమించు రూ.90,000 మొదటి నెల నుంచే జీతం పొందగలరు. కొన్నేళ్ల అనుభవంతో భవిష్యత్తులో సొంత రాష్ట్రంలో సేవలకూ వీలవుతుంది. ఇంటర్మీడియట్/డిగ్రీ/పీజీతోపాటూ డీఎడ్, బీఎడ్ పూర్తిచేసినవారు ఈ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. పీఆర్‌టీ, టీజీటీ పోస్టులకు సీటెట్‌లో అర్హత తప్పనిసరి. నాన్ టీచింగ్ పోస్టులకు పది, ఇంటర్, డిగ్రీ.. మొదలైన సాధారణ విద్యార్హతలతోనూ అవకాశం ఉంది. వీరికీ ఆకర్షణీయ వేతనాలు అందుతాయి. కొన్ని ఉద్యోగాలకు మాత్రం అనుభవం కావాలి.

**పోస్టు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) **ఖాళీలు:** 2996 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో పీజీ, బీఎడ్ **వయసు:** 40 ఏళ్లకు మించరాదు. **పే స్కేల్:** లెవెల్ 8 రూ.47,600-1,51,100

**పోస్టు:** ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) **ఖాళీలు:** 6215 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ, బీఎడ్ పూర్తిచేసి, సీటెట్‌లో అర్హత సాధించాలి. **వయసు:** 35 ఏళ్లకు మించరాదు. **పే స్కేల్:** లెవెల్ 7. రూ.44,900-1,42,400.

**పోస్టు:** ప్రైమరీ టీచర్ **ఖాళీలు:** 2684 **అర్హత:** ఇంటర్మీడియట్ 50 శాతం మార్కులతో పాటూ రెండేళ్ల డీఎడ్ కోర్సు పూర్తిచేయాలి. లేదా 50 శాతం మార్కులతో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీబీఎడ్. వీటితోపాటు సీటెట్ పేపర్-1లో అర్హత సాధించాలి. **వయసు:** 30 ఏళ్లకు మించరాదు. **పే స్కేల్:** లెవెల్ 6. రూ.35,400-1,12,400

**పోస్టు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1312 **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి కోర్సు పూర్తిచేయాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35, హిందీ అయితే 30 పదాలు కంప్యూటర్‌పై టైప్ చేయగలగాలి. **వయసు:** 27 ఏళ్లు మించరాదు **వేతన శ్రేణి:** లెవెల్ 2. రూ.19,900-63,200

ఇవే కాకుండా అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, లైబ్రేరియన్, ప్రైమరీ టీచర్ మ్యూజిక్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, ల్యాబ్ అటెండెంట్, మరి కొన్ని విభాగాల్లోనూ కొన్నేసి చొప్పున ఖాళీలు ఉన్నాయి. దాదాపు అన్ని పోస్టులకూ కంప్యూటర్ అప్లికేషన్ ప్రావీణ్యం ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది. రెండు దశల్లో నిర్వహించే పరీక్షలు, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్టు ప్రతిభతో నియామకాలుంటాయి.

### టైర్-I పరీక్ష..

పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ, ఇతర ఏ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రశ్నాంశాలు ఉమ్మడిగానే ఉంటాయి. పీఆర్‌టీ ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలో, టీజీటీకి డిగ్రీ స్థాయిలో, పీజీటీ, ఆపై స్థాయి పోస్టులకు పీజీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. మల్టీ టాస్కింగ్ తప్ప మిగిలిన అన్ని పోస్టులకూ టైర్-1 పరీక్ష 300 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నకు 3 మార్కులు చొప్పున 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. జనరల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, బేసిక్ కంప్యూటర్ లిటరసీ, జనరల్ నాలెడ్జ్ ఒక్కో విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 10, అభ్యర్థి ఎంచుకున్న మరో భాష నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ఓఎంఆర్ పత్రంపై సమాధానాలు గుర్తించాలి.

**ఇంటర్వ్యూ..**

టైర్-2 మార్కుల మెరిట్ ప్రకారం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. స్కిల్ టెస్టు అవసరమైన పోస్టులకు ఒక్కో ఖాళీకీ ఐదు మందిని పిలుస్తారు.

### టైర్-2..

దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించి విభాగాల వారీ ఉన్న ఖాళీలకు పది రెట్ల మందిని టైర్-1 మార్కుల మెరిట్ ప్రకారం టైర్-2కు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షను పోస్టు, సబ్జెక్టుల వారీ విడిగా నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించిన సబ్జెక్టులో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరిశీలిస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలు 60, ప్రశ్నకు 4 చొప్పున డిస్క్రిప్టివ్ ప్రశ్నలు 10 వస్తాయి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు ఓఎంఆర్ పత్రంపై సమాధానాలు గుర్తించాలి. ఈ విభాగంలో తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. డిస్క్రిప్టివ్‌కు పేపర్‌పై పెన్నుతో జవాబులు రాయాలి.

### టైర్-I సన్నద్ధత..

- జనరల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీలకు సంబంధించి సీబీఎస్‌ఈ 8,9,10 తరగతుల్లోని ఈ విభాగాల పరిధిలోకి వచ్చే చాప్టర్లు బాగా చదవాలి. ఈ విభాగాల్లో ఆర్‌ఎస్ అగర్వాల్ ఆబ్జెక్టివ్ అరిథ్‌మెటిక్, రీజనింగ్ పుస్తకాల అధ్యయనం చేస్తే సరిపోతుంది.
- కంప్యూటర్ లిటరసీ కోసం ప్రాథమికాంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ స్థాయిలోని అంశాలు సన్నద్ధమైతే చాలు.
- జనరల్ నాలెడ్జ్ కోసం ఏప్రిల్, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే దేశాలు-రాజధానులు-కరెన్సీ, అవార్డులు, పుస్తకాలు-రచయితలు, ఎత్తైనవి, లోతైనవి.. ఇలా స్టాక్ జీకే ప్రాధాన్యం ప్రకారం చదవాలి. మనోరమ ఇయర్ బుక్ లేదా లూసెంట్ జీకే ఉపయోగపడతాయి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లోనూ ప్రాథమిక స్థాయి ప్రశ్నలే వస్తాయి. అలాగే ఎంచుకున్న భాషలోనూ అభ్యర్థి ఎదుర్కోగలిగేలా ప్రశ్నలు ఉంటాయి. పాఠ్య పుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకోవాలి.

### టైర్-2కు ఇలా..

- పోస్టులు, సబ్జెక్టుల వారీ సిలబస్ ప్రకటించారు. వాటిని శ్రద్ధగా పరిశీలించాలి. అందులోని అంశాలనే బాగా సన్నద్ధమైతే సరిపోతుంది.
- టీచింగ్ పోస్టులకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు క్షుణ్నంగా చదవాలి. పరీక్షలో విజయానికి ఇవే ముఖ్యమైన అస్త్రాలు. పోటీ పడుతోన్న పోస్టు ప్రకారం డీఎడ్/బీఎడ్ పాఠ్యాంశాలు బాగా అధ్యయనం చేయాలి.
- ప్రైమరీ టీచర్ పోస్టులకు.. పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులపైనా పట్టు ఉండాలి. డీఎడ్ రెండేళ్ల పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి.
- టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ స్థాయి వరకు లోతైన అధ్యయనం తప్పనిసరి. అలాగే బీఎడ్ పాఠ్యపుస్తకాలు బాగా చదువుకోవాలి.
- పీజీటీ కోసమైతే.. పీజీ స్థాయిలో సబ్జెక్టుపై పట్టు పెంచుకోవాలి. వాటితో పాటూ బీఎడ్ పాఠ్యపుస్తకాలు చదివితే సరిపోతుంది.
- అధ్యయనం తర్వాత పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. ప్రశ్నల స్థాయి, పరీక్ష స్వరూపంపై అవగాహన పెంచుకోవాలి. గతంలో జరిగిన డీఎస్సీ, టెట్, సీటెట్, టీఆర్‌టీ...ప్రశ్నపత్రాలూ సన్నద్ధతకు ఉపయోగపడతాయి. పీజీటీ పోస్టులకైతే సంబంధిత సబ్జెక్టుల్లో.. జేఎల్, డీఎల్, యూజీసీ/సీఎస్ఐఆర్ నెట్ పాత ప్రశ్నపత్రాలను సాధన చేస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.
- పరీక్షకు ముందు వీలైనన్ని మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకుని, సన్నద్ధతను మెరుగుపరుచుకుంటే పోటీలో ముందుంటారు. రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయడమే మేలు చేస్తుంది.

**ముఖ్య వివరాలు**

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 4
**పరీక్ష తేదీ:** తర్వాత ప్రకటిస్తారు. **దరఖాస్తు ఫీజు:** అభ్యర్థులందరూ రూ.500 ప్రాసెసింగ్ ఫీ చెల్లించాలి. పరీక్ష ఫీ పోస్టు ప్రకారం రూ.1200 నుంచి 2300 వరకు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పరీక్ష ఫీ లేదు.
**వెబ్‌సైట్లు:** https://www.cbse.gov.in, https://kvsangathan.nic.in, https://navodaya.gov.in

# చదువు

■ **e-mail:** edc@eenadu.in

## విట్ మారిషస్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్..

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), మారిషస్.. ఇంజినీరింగ్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతోంది. కోర్సులు ఫిబ్రవరి, ఆగస్టుల్లో ప్రారంభమవుతాయి. ప్రవేశ పరీక్ష లేదు. విద్యార్హతలకు సంబంధించిన మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూతో ఎంపిక చేస్తారు. ప్రతిభ, ఆర్థిక నేపథ్యం ప్రాతిపదికన స్కాలర్‌షిప్పులు అందజేస్తారు. కోర్సుల్లో చేరినవారికి.. పార్ట్ టైమ్ వర్క్‌తోపాటూ మూడేళ్ల పోస్ట్-స్టడీ వర్క్ పర్మిట్ కూడా ఉంటుంది.

**వెబ్‌సైట్:** www.vitmauritius.mu

## వ్యాపార రంగానికి ఏ కోర్సులు?

**మా అబ్బాయి పదోతరగతి చదువుతున్నాడు. వ్యాపార రంగమంటే ఆసక్తి. ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపులో చేరితే బాగుంటుందా. ఆ తర్వాత ఏ కోర్సు చదవాలి? - బి.సుమలత**

■ మీ అబ్బాయి పదో తరగతి చదువుతున్నప్పుడే వ్యాపార రంగంపై ఆసక్తి చూపడం అభినందనీయం. భవిష్యత్తులో వ్యాపార రంగంలోకి ప్రవేశించాలన్న ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు చదివినా పెద్ద ఇబ్బందేమీ ఉండదు. అయితే, ఎంఈసీ లేదా సీఈసీ వంటి కోర్సులు చదివితే అకౌంటింగ్, కామర్స్, ఎకనామిక్స్ వంటి వ్యాపారానికి అవసరమైన విషయాలపై ముందుగానే పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిజ్ఞానం భవిష్యత్తులో బీకాం, బీబీఏ, ఎంబీఏ వంటి కోర్సుల్లో ఉపయోగపడుతుంది.

ఇంటర్మీడియట్ చదవడానికి సరైన కళాశాల ఎంచుకోవడం ముఖ్యం. కేంద్రీయ విద్యాలయాలు, కొన్ని ఇంటర్నేషనల్ స్కూళ్లు విద్యార్థుల్లో కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అనలిటికల్ థింకింగ్, లీడర్‌షిప్, సమస్యలు పరిష్కరించే సామర్థ్యం వంటి లక్షణాలను అభివృద్ధి చేస్తాయి. హైదరాబాద్‌లో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. హైదరాబాద్‌లో వీలు కాకపోతే వివిధ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ లేదా మంచి పేరున్న ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్/డిగ్రీ చదవొచ్చు.

వ్యాపార రంగంలో రాణించాలంటే.. అకౌంటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ అనలిటిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ.. లాంటి అంశాలపై బలమైన అవగాహన ఉండాలి. ఇప్పటి నుంచే వ్యాపారానికి సంబంధించిన పుస్తకాలు చదువుతూ, యూట్యూబ్ లెక్చర్లు చూస్తూ, వ్యాపార వేత్తల బయోగ్రఫీలను చదివి అర్థం చేసుకుంటూ అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయమని చెప్పండి.

వాస్తవానికి, ఇంటర్‌లో ఏ గ్రూప్ చదివినా, తర్వాత డిగ్రీలో బీటెక్, బీకాం, బీబీఏ, బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కోర్సులు ఎంచుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంజినీరింగ్ లేదా వేరే ఏదైనా కోర్సు చదివిన తర్వాత ఉద్యోగానుభవం సంపాదించి వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్నారు.

- ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

(c) eenadu

# ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

## వైద్య సేవలు మరింత చేరువ

● ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆరోగ్య కేంద్ర భవనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ఎస్సీ కాలనీలో ఏళ్లుగా నిర్మాణం సాగుతున్న అర్బన్ ఆరోగ్య కేంద్ర భవనం ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పనులు పూర్తి కావడానికి రమారమి మూడు సంవత్సరాలకు పైగా పట్టడం పలికినాటకం మారింది.

**పాత గుత్తేదారు పనులు వదిలేయడంతో..**

ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణం కోసం రూ.80 లక్షలు మంజూరయ్యాయి. అంత వరకు పనులు నిర్వహించిన పాత గుత్తేదారు వదిలేసి వెళ్లి పోయారు. ఈ నేపథ్యంలో 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తలతో మిగిలిన పనులు చేపట్టేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా రూ.28 లక్షలు మంజూరు చేశారు. రంగులు వేయడం, విద్యుత్తు, నీటి పనులు, ప్రహరీ నిర్మాణం తదితర అసంపూర్తి పనులను ఈ నిధులతో పూర్తి చేశారు. ఇప్పటి వరకు పురపాలక సంఘం వారు ఈ పనులను పర్యవేక్షించారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో నూతన భవనాన్ని ప్రారంభించ వేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్.ఎన్.పాడు: విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలు

నాగులుప్పలపాడులో: చిన్నారులు, తదితరులు

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమానికి సేవలందించిన ప్రముఖులు గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం తోపాటు పలువురు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ధనమ్మ, శ్రీనివాసులు సామాజిక సేవా కార్యకర్త శామ్యూల్, వంకా వెంకట సుబ్బారావు, అమరా బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు: విద్యార్థులు, తదితరులు

● సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక ఏపీ గురుకుల పాఠశాల్లో గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఆదివారం వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పితామహులు సి.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్యలకు ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం గ్రంథపాలకులు కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులకు దేశభక్తి గీతాలు, పాటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎం.మోషే తదితరులు పాల్గొన్నారు.

## మురుగు శుద్ధి.. పర్యావరణం వృద్ధి

15 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ

నల్ల కాలవపై త్వరలో మరొకటి

నగరాలు, పట్టణాల్లో వచ్చే మురుగునీరు, వ్యర్థాల వల్ల వచ్చే నీటి కాలుష్యాన్ని నివారించడం, సముద్రంలో, ఇతర నీటి వనరుల్లో కలవడం వల్ల జలచరాలకు కలిగే హాని నివారించడానికి ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తోంది. దీన్లో భాగంగా 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో అమృత్-1 పథకం కింద నగరానికి మురుగునీటి శుద్ధి కేంద్రం (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) మంజూరు చేశారు. రూ.32 కోట్ల వ్యయంతో కొప్పోలు సమీపంలోని పోతురాజు కాలువపై నిర్మించారు. గుత్తేదారు 10 సంవత్సరాలు దానిని నిర్వహిస్తారు. నిర్మాణం పూర్తయ్యాక మూడేళ్లు నిరాటంకంగా సాగింది. అక్కడ పనిచేసే సిబ్బందికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద కార్పొరేషన్ వేతనాలు చెల్లిస్తుంది. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

కొప్పోలు సమీపంలో పోతురాజు కాలువపై నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రం

**దిగువకు విడుదల చేస్తున్నారు**

ఎస్టీపీ ద్వారా రోజుకు 10 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేస్తారు. పోతురాజు కాలువ ద్వారా రోజుకు 8 మిలియన్ లీటర్ల మురుగునీరు వస్తున్నట్లు అంచనా. శుద్ధి చేసిన నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రైతులకు ఇష్టమైతే వినియోగించుకోవచ్చు. లేదంటే సముద్రంలో కలుస్తుంది. ప్రస్తుతం శుద్ధిచేసిన నీరంతా సముద్రానికి పోతోంది.

**హానీ కలగరాదనే ఈ ప్రాజెక్టు నిర్మాణం**

జిల్లా ప్రజారోగ్య ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజయ్ మాట్లాడుతూ పోతురాజు కాలువలో వచ్చే మురుగునీటిలో బయో ఆక్సిజన్ డిమాండ్ లీటరుకు సుమారు వంద మిల్లీగ్రాములు ఉంటుందన్నారు. ఆ నీరు అలాగే చెరువులు, దొరువులు, సముద్రంలో కలిస్తే జీవరాశులకు హానికలుగుతుందన్నారు. అందుకే శుద్ధి చేసి బయటికి పంపాలని ఈ ప్రాజెక్టు నిర్మించారన్నారు. మరుగుదొడ్ల నుంచి తొలగించే మల వ్యర్థాలను గల్ఫర్ మిషన్ల వారు ఎక్కడంటే అక్కడ పోయకుండా ఎస్టీపీకి తీసుకొచ్చి డంప్ చేయాలనేది ప్రభుత్వ ఆదేశాలని, త్వరలో అదికూడా అమలు జరుగుతుందన్నారు. నల్లకాలువపై అమృత్-2 కింద రూ.42 కోట్లతో త్వరలో రెండో ఎస్టీపీ నిర్మాణం జరుగుతుందన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదు. ద్వారకా నగర్, సమతా నగర్, లింగారెడ్డి కుంట, వీర్రమాన్యం, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, జడ్పీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ డీఈ పాండు రంగారావు తెలిపారు.

## కుష్ఠు నివారణపై దృష్టి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో కుష్ఠు వ్యాధి కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టే దిశగా ఎల్‌సీడీసీ సర్వే చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొత్తపట్నం మండల పరిధిలో నేటి నుంచి 30 తేదీ వరకు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరుగుతారు. వ్యాధి సోకిన వారిని గుర్తించి ప్రారంభ దశలోనే చికిత్స అందించడం జరుగుతుందని కొత్తపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. ముందుగా వ్యాధిని గుర్తించగలిగితే వెంటనే చికిత్స చేసే వ్యాధి పూర్తి నయమవుతుందన్నారు. అందుకోసం తమకు ప్రజలు సహకరించాలని కోరారు.

## 18న జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మైనంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఈ నెల 18న జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక చేపడుతున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎ.శిరీషలు పేర్కొన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ డి.శ్రీనివాసరావు సెల్ నంబర్ 7989440879లో సంప్రదించాలని కోరారు.

ఉమామహేశ్వరరావు, నాగభూషణం, జ్యోతిబసు

## ఏపీ మున్సిపల్ సిబ్బంది నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని కొత్త మార్కెట్ వద్ద జరుగుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని రెండో రోజైన ఆదివారం రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా కె.నాగభూషణం (అనంతపురం), కె.ఉమామహేశ్వరరావు (విజయవాడ), కోశాధికారిగా జ్యోతిబసు (విజయవాడ)తోపాటు; 21 మంది కార్యాలయ బేరర్స్, మరో 50 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలతోపాటు, పలు తీర్మానాలను ఆమోదించారు.

## ప్రయాణికులు ఎక్కువ.. రైళ్లు ఆగేది తక్కువ

టంగుటూరు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాలంటే వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రం ఒంగోలు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, చదువుల కోసం వెళ్లే విద్యార్థులు ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పెద్ద మొత్తంలో రైల్వే ఆదాయానికి గండిపడుతోంది.

**దూర ప్రాంతాలకు వెళ్లలేక.. :** టంగుటూరు రైల్వే స్టేషన్ నుంచి ఏటా రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య 60 వేల మంది వరకు ఉంటుంది. కొండపి నియోజకవర్గంతో పాటు కందుకూరు, కనిగిరి, పొదిలి ప్రాంతాలకు చెందిన కొన్ని గ్రామాల ప్రజలకు టంగుటూరు రైల్వేస్టేషన్ అనుకూలంగా ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయకపోవడంతో వారు రైలు కోసం మరింత దూరం ప్రయాణించాల్సి వస్తుంది. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, ఇతర ప్రాంతాలకు టంగుటూరు నుంచి నిత్యం అయిదు వందల మందికి పైగా ప్రయాణిస్తుంటారు. వీరంతా అధికంగా ప్రైవేటు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. రాత్రి వేళ హైదరాబాద్, తిరుపతి ప్రాంతాలకు వెళ్లే సింహపురి, పద్మావతి, శేషాద్రి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసినా ఐటీ ఉద్యోగులు, వివిధ వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతోంది.

- న్యూస్‌టుడే, టంగుటూరు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **మద్దిపాడు:** రాచవారిపాలెం గ్రామ పంచాయతీలో బీసీ కాలనీలో పలు చోట్ల విద్యుత్ వీధి దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల అసలు వెలగడంలేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోగలరు. **- పురాలశెట్టి రామారావు, మద్దిపాడు**

✓: మా సిబ్బందిని పంపించి విద్యుత్ వీధి దీపాల నిర్వహణపై పరిశీలింపజేస్తాం. వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం

**- చెన్నారెడ్డి, ఏఈ, మద్దిపాడు, విద్యుత్ శాఖ**

?: **మద్దిపాడు:** గ్రామ పంచాయతీల ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు మురుగుతో నిండిపోయి రోడ్డు మీద పారుతున్నాయి. దీంతో దోమలు పెరిగిపోతున్నాయి. కాలువల్లో పూడికలు తీయించి దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

**- కాకుమాను చిన్న కోటేశ్వరావు, మద్దిపాడు**

✓: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువల్లో మురుగు తొలగింపజేస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయడానికి చర్యలు తీసుకుంటాం.

**- నూరుల్లా, కార్యదర్శి, మద్దిపాడు గ్రామ పంచాయతీ**

?: **చీమకుర్తి :** ప్రధాన రహదారిలో చేనేత సహకార సంఘం ఎదురు అభయాంజనేయ స్వామి దేవస్థానం ముందు వీధి దీపం కొద్ది రోజులుగా వెలగడం లేదు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే మరమ్మతులు చేయించగలరు. **- ఎస్.రాజా, చీమకుర్తి.**

✓: సిబ్బంది పంపించి సమస్య పరిశీలిస్తాం. వీధి దీపానికి, అలాగే ఇతర ప్రాంతాల్లో దీపాలకు అవసరమైన మరమ్మతులు చేయిస్తాం.

**- వై.రామకృష్ణయ్య, కమిషనర్, చీమకుర్తి పురపాలక సంఘం.**

?: **కొత్తపట్నం:** మండలం రంగాయపాలెంలో రాత్రి, పగలు తేడాలేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. అధికారులు స్పందించి రాత్రి వేళ్ల వెలిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. **- రామచంద్ర, సుబ్బారెడ్డి కొత్తపట్నం.**

✓: సిబ్బందిని పంపించి సమస్య పరిశీలిస్తాం. పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

**- అల్లయ్య, పంచాయతీ కార్యదర్శి**

?: **మైనంపాడు (సంతనూతలపాడు):** గ్రామంలోని ఎస్సీ కాలనీలో కాలువల్లో మురికి నీరు నిలిచింది. దీంతో దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నాం. సిబ్బందిని పంపింది వెంటనే సమస్య పరిష్కరించగలరు.

**- ఏడుకొండలు, వెంకటరావు, ఎస్.ఎన్.పాడు**

✓: సిబ్బందిని పంపించి ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయిస్తున్నాం. ఇతర చోట్ల కూడా పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

**- రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, ఎస్.ఎన్.పాడు.**

## తొలగని మురుగు.. తప్పని పరుగు

చీమకుర్తి పురపాలక సంఘ పరిధిలోని మహా ప్రస్థానం ముందు ఉన్న కాలువలో మురుగు నీరు సక్రమంగా పారక దుర్గంధం పెరిగి ఇబ్బందులు తలెత్తున్నాయి. ఈ ప్రాంతంలో దిగువకు నీరు సక్రమంగా పారక పోతుండటంతో మొంథా తుపాను సమయంలో కురిసిన భారీ వర్షాలకు చీమకుర్తి గంగవరం రహదారి కూడలిలో భారీగా నీరు చేరి రవాణాకు అంతరాయం ఏర్పడింది. కాలువ వాలు సక్రమంగా లేక పోవడం, చీమకుర్తి గంగవరం రహదారిలో నిర్మాణం చేసిన వంతెన దిగువగా అవతలి వైపు నీరు సక్రమంగా ప్రవహించక పోతుండటంతో ఈప్రాంతంలో తరచుగా సమస్య తలెత్తుతోంది. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ వర్షాల సమయంలో జేసీబీ సాయంతో పనిచేసేందుకు సాధ్యం కాలేదని సమస్య పరిష్కారం దిశగా తగిన చర్యలు చేపడతామని చెప్పారు. **- న్యూస్‌టుడే, చీమకుర్తి**

## పరిమితికి మించి ప్రయాణం.. ఆందోళనకరం

మద్దిపాడు మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు 16వ నంబరు జాతీయ రహదారిలో సరకులను రవాణా చేసే వాహనంలో పరిమితికి మించి కూలీలు ప్రయాణిస్తున్నారు. కొందరు వెనుక వైపు నుంచుని, వారి వెనుక కొందరు కూర్చుని ప్రమాదకర రీతిలో ప్రయాణించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని పలువురు పేర్కొంటున్నారు. అంతే కాకుండా వాహన చోదకులు నిర్లక్ష్య ధోరణితో నడపడం వల్ల తరచూ ప్రమాదాల జరుగుతున్నాయి. అధికారులు దీనిపై వెంటనే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. **- మద్దిపాడు, న్యూస్‌టుడే**

పుస్తకావిష్కరణలో శ్రీనివాసరావు, తేళ్ల అరుణ తదితరులు

## మతాల మధ్య సమన్వయాన్ని ఆవిష్కరించారు

ఒంగోలు సాంస్కృతం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ మేనేజర్ అచ్యుతుని శ్రీనివాసరావు రచించిన 'సనాతన ధర్మక్షయం, కలి ధర్మం' అనే పుస్తక ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ సభకు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ సమకాలీన సమాజానికి ఇటువంటి రచనలు అవసరమన్నారు. మతాల మధ్య సమన్వయాన్ని రచయిత చక్కగా ఆవిష్కరించారని చెప్పారు. పరిశోధనాత్మక స్థాయిలో రాసిన ఈ రచనను ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణ, గిరిజా శాండిల్య, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం బస్టాండులో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు నగరం: మాట్లాడుతున్న పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు

మద్దిపాడు: రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డిలకు సన్మానం

## వన భోజనం.. ఆనంద పరవశం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆదివారం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వనభోజన కార్యక్రమాలు వైభవంగా సాగాయి. ● పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేమూరి లక్షణ కల్యాణ మండపంలో కె.బాలకృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు పర్యవేక్షించారు. ●మద్దిపాడు, న్యూస్‌టుడే: యాదవ కార్తిక వన భోజనాలకు రాష్ట్ర బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి యాదవులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ● రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ అధ్యక్షురాలు బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డిలు పాల్గొన్నారు.

●ఒంగోలు సాంస్కృతికం: నగరంలో కాఫీబారు వెనకాల విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో వన సమారాధన మహోత్సవం జరిగింది. జిల్లా కమిటీ అధ్యక్షులు పీఎస్ బాబు, కల్యాణ మండపం అధ్యక్షులు చోడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు రంగారాయుడు చెరువు గాంధీ పార్కులో వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన భోజన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వాకర్స్ ప్రతినిధులు సాంబశివరావు, పైనం మల్లికార్జునరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

● సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు నేలబొట్ల శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు వి.నాగసాయికృష్ణశర్మతో సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు.

నినాదాలు చేస్తున్న శాలివాహన సంఘు నాయకులు

## సతీష్‌కుమార్ హత్యకేసు సీబీఐకి అప్పగించాలి

ఒంగోలు నగరం, ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తిరుమల పరకామణి కేసు ఫిర్యాదుదారుడైన ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ హత్యకేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని జిల్లా శాలివాహన సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కానుగుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ హత్యకేసును ఖండించారు. దారుణంగా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటరాయలు, ఉపాధ్యక్షుడు దండు ఆంజనేయులు, కె.వాసు, తిరుపతయ్య, వీరాంజనేయులు, దండు శ్రీధర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పారో.. అంతే మరి!

మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లాపల్లి పారిశ్రామిక వాడ నుంచి 16వ జాతీయ రహదారిలోకి రాకపోకలు సాగించే మార్గంలో పెద్ద లోతైన గుంతతో ఆందోళనకరంగా మారింది. మంచి నీటి పైప్ లైన్ లీక్‌తో గుంత తీసి వంద రోజులు పైగా అవుతోంది. ఇటీవల మొంథా తుపాను సమయంలో పూడ్చలేదు. ఇటీవల కాలంలో స్థానిక శాసన సభ్యులు పారిశ్రామికవాడలో అభివృద్ధి పనుల నిమిత్తం వచ్చిన సమయంలో కూడా సదరు గుంతను అధికారులు పూడ్చలేదు.

**వందలాది వాహనాలు తిరిగేవి..**

గుంత తీయకముందు ఈ మార్గంలో వందలాది వాహనాలతో పాటు మహిళా కార్మికులు రాకపోకలు సాగించేవారు. దాదాపు వంద రోజుల నుంచి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు. వీధి దీపాలు కూడా లేని ఈ మార్గంలో రాత్రి సమయంలో తెలియని వ్యక్తులు వచ్చి పొరపాటున గుంతలో పడితే ఇక అంతే సంగతులు. సంబంధిత పారిశ్రామిక వాడ అభివృద్ధి అధికారులు కల్పించుకుని ఆ కుంటను పూడ్చాలని కార్మికులు, స్థానికులు కోరుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, మద్దిపాడు

## పునరావాసం కల్పించారు.. సాయం మరిచారు

న్యూస్‌టుడే, కొత్తపట్నం, న్యూస్‌టుడే

మొంథా తుపాన్ బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం నగదు క్షేత్ర స్థాయిలో అమలు కావడంలేదు. దీంతో బాధితులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి నిదర్శనంగా కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామంలోని బాధితులను పేర్కొనవచ్చు.

**ఒక్కొక్కరికి రూ.1,000**

పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం రెవెన్యూ శాఖ ద్వారా బాధితులకు అందజేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబంలో ముగ్గురి కంటే ఎక్కువ ఉంటే గరిష్ఠంగా రూ.3 వేలు అందజేయాలి. పునరావాస కేంద్రం నుంచి ఇంటికి వెళ్లేముందు నగదు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం అధికారులకు పంపిణీ చేయమని నగదు ఇచ్చినా పంపిణీ చేయకుండా దాట వేస్తున్నారని పలువురు తెలిపారు. నెల రోజులు కావొస్తున్నా కానీ.. ఇంత వరకు గ్రామంలో ఒక్కరికి కూడా నగదు పంపిణీ చేయకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు.

**ప్రభుత్వానికి జాబితా పంపారు**

కె.పల్లెపాలెం గ్రామంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న 72 మందిని అధికారులు గుర్తించి, ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం కూడా నగదుని పంపిణీ చేయాలని రెవెన్యూ శాఖని ఆదేశించింది. కానీ నేటికీ ఇవ్వలేదు. దీనికి పలు కారణాలు చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు.

**అందని వారికి కూడా ఇస్తాం**

పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి ఒక్క బాధితుడికి నగదు పంపిణీ చేశాం. ఆ సమయంలో ఎవరైనా అందుబాటులో లేకపోతే వారిని గుర్తించి వారికి కూడా ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. - **శాంతి, తహసీల్దార్**

## పత్రికా ప్రకటన

నా క్లయింటు విశ్వనాధుని సూర్యప్రకాశరావు S/o వి.వి. కొండయ్య, R/o ఒంగోలు, ప్రకాశం జిల్లా అను వారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిలో గుర్రం కృష్ణమూర్తి S/o శేషయ్య, R/o కన్యకాపరమేశ్వరి వీధి, ఒంగోలు, ప్రకాశం జిల్లా అనువారు తన స్వార్జిత ధనముతో 1988వ సంవత్సరంలో తన కుమారుడి పేరుతో కొనుగోలు చేసి తదుపరి తన కుటుంబ అవసరముల నిమిత్తం తేదీ 15.03.2000న మా క్లయింటు అయిన విశ్వనాధుని సూర్యప్రకాశరావుకు గది ఒకటికి రూ. 46,500/-ల చొప్పున విక్రయించి తేదీ 15.03.2000న రూ.1,00,000/-, తేదీ 31.03.2000న రూ.1,00,000/- తేదీ 2.04.2000న రూ.1,00,000/- తేదీ 05.04.2000న మిగిలిన రూ. 3,30,000/-లు తీసుకొనియున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్థిని తేదీ 05.04.2000న మా క్లయింట్‌కు స్వాధీన పరచివున్నారు. అప్పటి నుండి షెడ్యూలు ఆస్థి మా క్లయింట్ యొక్క స్వాధీనానుభవములో ఉండియున్నది.

అయితే ఇప్పుడు మాకు తెలియుటలో కొంతమంది వ్యక్తులు సదరు గుర్రం కృష్ణమూర్తి మరియు అతని కుమారుడు గుర్రం శ్రీధర్‌బాబుతో కలిసి మాకు విక్రయించి స్వాధీనపరచిన విషయములు అన్నియు తెలిసియుండి కూడా అక్రమ లబ్ధి కొరకు కొన్ని పత్రాలు సృష్టించి మా క్లయింట్ స్వాధీనానుభవములో ఉన్న ఆస్థిని విక్రయాలు చేయటానికి ప్రయత్నించుచున్నారని తెలిసినది. సదరు షెడ్యూలు దాఖలాస్థి మా క్లయింట్ స్వాధీనంలోవుండి ఉన్నది.

కావున ఈ క్రింది దాఖలా షెడ్యూలు ఆస్థి గురించి ఎవరైనా, ఏవైనా లావాదేవీలు, క్రయ విక్రయాలు ఎవరితోనైనా జరిపిన ఎడల మరియు షెడ్యూలు ఆస్థిలోకి అక్రమంగా దౌర్జన్యంగా ప్రవేశించడానికి ప్రయత్నించిన ఎడల అట్టివారిపై తగు చర్యలు తీసుకొనబడునని తెలియపరచుచున్నారు.

**షెడ్యూలు:–** ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ ఇలాకా ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, ఒంగోలు టౌన్ - 2వ వార్డు, 6వ బ్లాకు - టి.యస్.నెం.197 రులో అసెస్‌మెంట్ నెం. 7082, డోర్ నెం. 20-1-156(3)రులో గల 52 సంవత్సరముల క్రింతం కట్టబడిన పురాతనపు పెంకుటిల్లు, ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** విశ్వనాధుల వెంకట సుబ్బమ్మ ఆస్థి వెంబడి ఈ ఆస్థి స్వంత గోడ కొంత వరకు, ప్రహరీ గోడ కొంతవరకు - ఈ దిశ 46 అడుగుల 10 అంగుళములు - ప్రహరీ గోడ - 21 అడుగులు, **దక్షిణం:** విశ్వనాధుల వెంకట సుబ్బమ్మ ఆస్థి వెంబడి ఈ ఆస్థి స్వంత గోడ కొంతవరకు, ప్రహరీ గోడ కొంతవరకు - ఈ దిశ 21 అడుగుల 4 అంగుళములు, **పడమర:** ఈ విక్రయ ఆస్థికి మా తాలూకు ఆస్థికి మధ్య జాయింట్ ఇంటిగోడ - ఈ దిశ 45 అడుగుల 9 అంగుళములు, **ఉత్తరం:** బజారు - ఈ దిశ 21 అడుగుల 4 అంగుళములు ప్రహరీ గోడ 21 అడుగులు.

ఈ హద్దులలోని 988 చదరపు అడుగులు లేక 110 చ.గజములు 91.9 చ.మీటర్ల స్థలము గల సుమారు అనగా 144 చ.అడుగులు లేక 13.3 చ.మీటర్ల పురాతనపు పెంకుటిల్లు, ఇంటికి సంబంధించిన తలుపులు, ద్వారబంధములు, యావద్విశిష్ట కప్పు, కలప సామానులతో సహా ఈ ఆస్థిలో గల నీటి హక్కులతో సహా పైన ఉదహరించిన ఆస్థిని పై మొత్తమునకు విక్రయించి స్వాధీనపరడమైనది.

సం/- **కరేటి శ్రీనివాసులు**, బి.కాం, ఎల్.ఎల్.బి., అడ్వకేట్
రూమ్ నెం.5, శ్రీసాయినివాస్, ఆంధ్రాబ్యాంక్ ఎదురు, కోర్టు సెంటర్,
ఒంగోలు. సెల్: 94404 72986

(c) eenadu

## వెలుగులే లక్ష్యం.. చరిత్రకు సాక్ష్యం

న్యూస్‌టుడే, కావలి : చరిత్రకు ఎన్నో సాక్ష్యాలుగా ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి గురుతులు నేటికీ కావలి పట్టణంలో దర్శనమిస్తున్నాయి. అదే.. అయిదులాంతర్ల మండపం. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఇది నిర్మితమైంది. సముద్రతీరానికి ఆరున్నర మైళ్ల దూరంలోని కావలిలో నిర్మించారు. విదేశీయుల రాకను అడ్డుకునేందుకు మండప ప్రదేశంలోనే సైనిక గుడారాలు ఉండేవి. రాత్రివేళల్లో విస్తృత వెలుగులతో గస్తీ కోసం అయిదులాంతర్లతో మండపం చేపట్టారు. సైనిక కాపలాదారుల నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తుండటంతో ఊరుగా ఏర్పడింది. కాపలాదారులతో ఏర్పడిన ఊరు కావడంతో కాలక్రమంలో కావలిగా పేరు మారింది. అలా వారితో ఏర్పడిన ఊరు కావలి పాతూరుగా ఇప్పటికీ కొనసాగుతోంది. మండపానికి నేరుగా ఉండే సందులోనే పాతూరు ప్రాంతం, అక్కమ్మబావి వంటివి ఇప్పటికీ కనిపిస్తుంటాయి. ఆ తరువాత కాలంలో స్వతంత్ర భారతావనిలోనూ పంచాయతీ సిబ్బంది నిత్యం అయిదులాంతర్లను వెలిగించడం పరిపాటిగా కొనసాగింది. ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా బెజవాడ గోపాల్‌రెడ్డి 1956లో కావలికి విద్యుత్తు వసతి కల్పించగా.. లాంతర్ల మండపం ఇప్పటికీ పదిలంగానే ఉంది. అందులో విద్యుత్తు బల్బులు ఏర్పాటు చేస్తూ ఓ మంచి ల్యాండ్ మార్కుగా కొనసాగిస్తున్నారు.

# పాల బుగ్గలపై పైశాచికం!

### చిన్నారులపై ఆగని మృగాళ్ల అఘాయిత్యాలు

న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

జిల్లాలో పోక్సో కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. వీధుల్లో ఆడుకోనివ్వాలన్నా.. ఆలోచిస్తున్నారు.. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతుండటమే ఇందుకు కారణం. పోలీసులు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నా, జైలు శిక్ష విధిస్తున్నా.. అఘాయిత్యాలు ఆగడం లేదు.

జిల్లాలో నమోదైన పోక్సో కేసులు..




● నెల్లూరు నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ స్కూలులో చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు లొంగదీసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. తీరా విషయం పెద్దలకు తెలియడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

● బిస్కెట్లు కొనిస్తానని చెప్పి తాతా వయసు ఉండే ఓ వ్యక్తి చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ప్రతి రోజూ ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడుతుండగా విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటన నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

● తండ్రే బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటన జలదంకి పోలీసు స్టేషన్ పరిధిలో జరగ్గా.. ఇటీవల నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. చాక్లెట్లు ఇప్పిస్తానని చెప్పి బాలికను నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ఇటీవల న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ ఘటన నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

### గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన ఏదీ?

పాఠశాలలు, కళాశాలల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మహిళా పోలీసుల ఆధ్వర్యంలో చిన్నారులకు వివరించాలి. ఏయే ప్రదేశాల్లో ఇతరులు తాకకూడదు, తాకితే ఎవరికి చెప్పాలి? ఎలా వ్యవహరించాలనేది వారికి తెలియజేయాలి. ప్రస్తుతం దీనిపై ఎలాంటి కార్యక్రమాలు జరగడం లేదు. సమాజంలో జరుగుతున్న ఇలాంటి ఘటనలపై సంస్థలు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ధైర్యంగా ముందుకు రావాలి..

పిల్లలు ఇలాంటి ఘటనలు ఎదుర్కొంటే వారి తల్లిదండ్రులు ధైర్యంగా పోలీసులకు దగ్గరకు రావాలి. ముందుగా మీ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి. వారితో కలిసిమెలిసి ఉండాలి. అప్పుడే వారు మీ దగ్గర ఎలాంటి విషయాలు దాచిపెట్టరు. పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – టీవీ సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీసు స్టేషన్

## కబ్జా గుంత.. కదలికి గంత

ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్నట్లు ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలే కాదు.. సముద్ర తీరాన్ని సైతం గుప్పిట్లో ఉంచుకుంటున్నారు. ఉలవపాడు మండలంలో తీరం వెంట రొయ్యల గుంతలు సాగు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సముద్రానికి 500 మీటర్ల దూరంలోపు వీటిని సాగు చేయకూడదు. మండలంలోని రామాయపట్నం తీరం వెంబడి గుంతలు ఏర్పాటు చేసి రొయ్యలు సాగు చేశారు. ఇలా జిల్లాలో తీరం వెంట దాదాపు 500 ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నారు. అధికారులు అడ్డుకోక ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. రామాయపట్నం దగ్గర సముద్రం తీరం వెంబడి రొయ్యల గుంతలు సాగు చేయగా.. రెండింటికి మధ్య గట్టే అడ్డుగా ఉంది. దీన్ని బట్టి ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. – న్యూస్‌టుడే, ఉలవపాడు

## గుర్రపు డెక్క.. ఎరువులు ఎంచక్కా

తరుణవాయిలో గుర్రపు డెక్క ఆకుతో ఎరువుల తయారీ

న్యూస్‌టుడే, సంగం

వినూత్న ఆలోచనలతో పథకాలు రూపొందించి జీవనోపాధిని మెరుగుపరుచుకునేందుకు ముందుకు వచ్చే మహిళలకు చేయూతనందిస్తోంది.. డీఆర్‌డీఏ. సంగం మండలం తరుణవాయి గ్రామంలో పొదుపు మహిళలు గుర్రపు డెక్క ఆకు నుంచి ఎరువు తయారీ చేస్తున్నారు. దీన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఇలా చేయడం వల్ల సాగునీటి కాలువల్లో గుర్రపు డెక్క సమస్య తొలగడంతో పాటు మహిళలకు ఉపాధి కలుగుతుంది. వ్యవసాయ భూములకు మేలైన ఎరువు లభిస్తుంది. తయారీని ఆదివారం డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పరిశీలించారు. అరటి వ్యర్థాలతో వినియోగ వస్తువులు ఇందుకూరుపేటలో చేస్తున్నారు. అన్ని ఆలయాల్లో వాటి వినియోగం జరిగేలా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళతామని పీడీ తెలిపారు.

# దాతృత్వ ఫలం.. ఉపాధి బలం

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్నవారు: 2,400 మంది
డిగ్రీ విద్యార్థినులు: 1200
ఏటా ఉద్యోగాలకు ఎంపికవుతున్నవారు: 320 మంది
ఇప్పటివరకు సాధించినవారు : 1500 మంది

దొడ్ల కౌశల్యమ్మ, సుబ్బారెడ్డి దాతృత్వంతో నెల్లూరు నగరంలో ఏర్పాటైన దొడ్ల కౌశల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల చదువులు నేర్పించడంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధికి బాటలు వేస్తోంది. దాతల సహకారంతో 1965లో 800మంది విద్యార్థినులతో ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రారంభించారు. ఇక్కడ చదివిన వారు నేడు ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులుగా ఉన్నారు. నేడు 19 కోర్సుల్లో విద్యాబోధన చేస్తున్నారు. అదనంగా బీఎస్ఈలో అగ్రి, ఆక్వాకల్చర్ తదితర కొత్త కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టారు. ఇక్కడ చదువుతోపాటు కొలువుల సాధనకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు.

### రూ.30 లక్షలతో స్టూడియో ఏర్పాటు

కళాశాలకు 'రూసా' అందించిన రూ.2 కోట్లతో విద్యార్థుల విద్యాబోధనకు గదులు, పరికరాలు అందించడమే కాదు.. ఇటీవల కళాశాలలో రూ.30 లక్షలతో స్టూడియో ఏర్పాటు చేశారు. దీని ద్వారా పాఠ్యాంశాలను రికార్డ్ చేసి పలు సామాజిక మాధ్యమాల్లో, వెబ్‌సైట్స్‌లో, వాట్సప్‌ల ద్వారా విద్యార్థులకు పంపుతారు. తరగతి గదిలో పాఠాలు వినలేని విద్యార్థులకు ఉపయోగ పడుతున్నాయి.

### ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో..

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కళాశాలలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థినులు ఇంటర్న్‌షిప్, జాబ్ మేళాల ద్వారా ఏటా పలు ప్రైవేట్ కంపెనీలతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. కళాశాలలోని ఆక్వాకల్చర్ విభాగంలో రెండు కంపెనీల భాగస్వామ్యంతో విద్యార్థినులు చేపలు, రొయ్యల ఉత్పత్తులతో రెడీ టూ ఈట్ తయారు చేస్తున్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు.

ఆక్వా ఉత్పత్తులు అమ్ముతున్న విద్యార్థినులు

● ఇక్కడ చదువు పూర్తిచేసుకున్న విద్యార్థినులకు వెంటనే ఉద్యోగాలు వస్తున్నాయి. పలు కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకొని తరచూ ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి తెలిపారు.

## చిన్నారుల సాహితీ కుసుమం.. గంగిశెట్టి

తిరుపతి సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి ద్వారా సన్మానం అందుకుంటున్న శివకుమార్

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

తిక్కన నడియాడిన పెన్నాతీరంలో ఎందరో కవులు తమ కలానికి జీవం పోశారు. కాని పిల్లల కోసం సాహితీ కుసుమంగా ఎదిగిన వారు అరుదు. పిల్లల బాధ్యత సామాజిక కర్తవ్యంగా కథలతో సింహపురి సాహితీ కిరణంగా గల్లీ నుంచి దిల్లీ వరకు ఎదిగి కేంద్ర బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు.. గంగిశెట్టి శివకుమార్. ఆయన రాసిన కబుర్ల దేవత కథల పుస్తకానికి పురస్కారం లభించింది. జిల్లాలోని రాపూరులో జన్మించిన గంగిశెట్టి.. నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈయన పదోఏట నుంచే పుస్తక పఠనం అలవర్చుకుని.. 14వ ఏట నుంచే కథలు రాయడం ప్రారంభించారు. చందమామ బాలల పత్రికలో కొంతకాలంపాటు ఉప సంపాదకుడిగా పనిచేశారు. బాల సాహిత్యంపై ఎస్వీ విద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆయన రాసిన వివిధ కథలు పసిపిల్లలను ఆకర్షించేలా చేశాయి.

### ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా...

శివకుమార్ కవి మాత్రమే కాదు.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రాణించారు. దాదాపుగా 40 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆయన రాసిన పలు కథలు ఏపీతోపాటు కర్ణాటక రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

# అడుగంటి.. అడగరేంటి!

### అక్రమంగా బోర్ల ఏర్పాటు.. ఆపై నీటి విక్రయం

న్యూస్‌టుడే, వెంకటాచలం, ముత్తుకూరు

ముత్తుకూరు- నెల్లూరు ప్రధాన రహదారి పక్కన ముత్తుకూరు సమీపం మల్లూరు రోడ్డు వద్ద, ముత్తుకూరు- వెంకటాచలం మార్గాల్లో పంటపాళెం, కోళ్లమిట్ట సమీపంతో పాటు పలుచోట్ల అనధికారంగా బోర్లు తవ్వి నిత్యం 110 నుంచి 130 ట్యాంకర్లతో పరిశ్రమలకు తరలిస్తున్నారు. 16 ఏళ్లుగా నీటి దోపిడీ జరుగుతోంది. మొత్తం 42 వరకు బోర్లుండగా.. వాటిలో కేవలం ఏడింటికే అనుమతులున్నాయి. ఒక్క మల్లూరు రోడ్డు వద్దే 24 బోర్లు ఏర్పాటు చేసి నిరంతరం నీరు తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయి.. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తుతోంది.

ముత్తుకూరు మండలంలో నీటి దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఈ ప్రాంతంలో కృష్ణపట్నం పోర్టుతో పాటు ఇతర పరిశ్రమలు ఉండగా.. అక్కడ ఉప్పు నీరు లభిస్తుండటంతో మంచినీటికి డిమాండ్ ఉంది. ఇది అక్రమార్కులకు కలిసొచ్చింది. కొందరు రోడ్ల పక్కన, పొలాల్లో అనుమతుల్లేకుండా బోర్లు తవ్వి అనధికారికంగా ట్యాంకర్లలో నీటికి పరిశ్రమలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

### ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసినా..

నీటి దోపిడీపై మండలంలోని చలివేంద్ర గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గతంలో జాతీయ హరిత ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్‌జీటీ అధికారుల బృందం దిల్లీ నుంచి వచ్చి క్షేత్ర పరిశీలన చేసింది. అనుమతులు లేకుండా బోర్లు తవ్వకాలు, అక్రమ నీటి తరలింపు నిజమని తేల్చి.. వీటి కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. అనుమతి లేని బోర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది.

### శాశ్వత చర్యలేవి?

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు, ఎన్‌జీటీ సూచనల మేరకు ఆరు నెలల కిందట ముత్తుకూరు తహసీల్దార్ ఆధ్వర్యంలో బోర్లను తనిఖీ చేశారు. ఒకే ప్రాంతంలో 24 బోర్లుండగా.. వాటిలో ఆరింటికే అనుమతులున్నట్లు గుర్తించి మిగిలిన వాటిని సీజ్ చేసినట్లు ప్రకటించారు. వాటిలో కొన్నింటికి తిరిగి కొనసాగిస్తుండటం గమనార్హం.

మల్లూరు రోడ్డు సమీపంలో బోర్ల నుంచి ట్యాంకరుకు నింపుతున్న నీరు

### నేడు ప్రత్యేక బృందం పరిశీలన

అక్రమంపై ఇటీవల కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన బోర్ల పరిశీలనకు నెల్లూరు ఆర్డీవో ఆధ్వర్యంలో సంయుక్త కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సోమవారం పర్యటించి బోర్లను పరిశీలించనుంది. ఈసారైనా శాశ్వత చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# పల్లె పాలనలో.. సంస్కరణలు

### జిల్లాలో నాలుగు డీడీవో కార్యాలయాలు

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్) : గ్రామ పాలనలో కీలకపాత్ర వహించే పంచాయతీరాజ్ వ్యవస్థ వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. ఫలితంగా పల్లెల్లో అభివృద్ధి అటకెక్కింది. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం సంస్కరణలపై దృష్టి సారించింది. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు నిరంతర పర్యవేక్షణకు డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో) వ్యవస్థను తీసుకొచ్చింది. జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియను జిల్లా పరిషత్ అధికారులు దాదాపు పూర్తి చేశారు. డీడీవో కార్యాలయాల ద్వారా గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించనున్నారు. పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ కీలకపాత్ర పోషించనున్నాయి. అభివృద్ధికి సంబంధించి అన్ని పనులు చేయనున్నాయి.

### అదనపు విభాగాలు

డీడీవో కార్యాలయ పరిధిలోనే డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌డీవో), డ్వామా ఏపీడీ విభాగాలు పని చేస్తాయి. కార్యాలయ పాలనా వ్యవహారాలు చూసేందుకు సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ సహాయకులు, అటెండర్ పోస్టులను కేటాయించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో హోదా కలిగిన డీడీవోలకు ప్రత్యేక అధికారాలు అప్పగిస్తారు.

ఎక్కడెక్కడ ఏర్పాటంటే.. నెల్లూరు జడ్పీ కార్యాలయం, ఆత్మకూరు, కావలి, కందుకూరు

### ప్రజలకు ఉత్తమ సేవలు

డీడీవో కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చి వాటి ద్వారా ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపడుతున్నాం. పంచాయతీల పాలనలో కీలకపాత్ర పోషిస్తాయి. – శ్రీధర్‌రెడ్డి, డీపీవో

## సివిల్స్‌కు ఉచిత శిక్షణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా సివిల్స్‌కు శిక్షణ ఇస్తారని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకటలక్ష్మమ్మ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17 నుంచి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వీరికి డిసెంబరు అయిదో తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 93815 54779 నంబరును సంప్రదించాలని సూచించారు.

# సింహపురి.. సాఫ్ట్‌గా కొలువుల సిరి

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

సాఫ్ట్‌వేర్ రంగాన్ని మెట్రోపాలిటిన్ నగరాల నుంచి ద్వితీయ శ్రేణి నగరాలకు తీసుకొచ్చే ఆలోచన చేశాయి.. కొన్ని సంస్థలు.. గ్రామీణప్రాంతాల్లో యువత ఇంజినీరింగ్ చదివి ఇష్టం లేకపోయినా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాలకు వెళుతున్నారు. అలాంటి వారు ఇష్టంగా ఉద్యోగం చేయాలంటే గ్రామాలకు దగ్గరగా జిల్లా కేంద్రాల్లో సాఫ్ట్‌వేర్ రంగం విస్తరించాలనే లక్ష్యంతో కొన్ని సంస్థలు ముందడుగు వేశాయి. నెల్లూరులో బ్లేజ్ అఫ్, శ్రీనివాస్ ఇన్స్, నెక్ట్‌జన్ కంపెనీ, రూరీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, కోడింగ్ లిమిట్స్, క్లౌడ్ ఎక్స్‌ట్రీమ్ వంటి సంస్థలు ఉన్నాయి. వీటిలో జిల్లాకు చెందిన వందలాది మంది యువత ఉద్యోగాలు చేస్తున్నారు.

### యూఎస్‌లో మాస్టర్స్ చదివి..

నేను యూఎస్‌లో మాస్టర్స్ చదివాను. పుట్టి పెరిగింది నెల్లూరులోనే. నా తల్లిదండ్రులు ఇక్కడే ఉన్నారు. వారితో కలిసి ఉంటూ ఉద్యోగం చేయడం అదృష్టం. యూఎస్‌లో నేర్చుకుంది నెల్లూరు వాసులకు నేర్పిస్తా. అందరూ మెట్రోపాలిటిన్ సిటీలకు వెళ్లాల్సిన అవసరం లేదు. స్థానికంగా ఉపాధి లభిస్తోంది. – తన్మయి

### ఆరోగ్యపరంగా బాగుంటాం..

మూడేళ్ల క్రితం వరకు బెంగళూరులో పని చేశా. అక్కడ వచ్చే జీతం అంతా అద్దెలు, భోజనం ఖర్చులకు సరిపోయేది. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడేవాడిని. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అంటే బెంగళూరు, హైదరాబాద్ అనుకుంటారు. స్థానికంగా ఉండటం వల్ల కుటుంబంతో ఉండొచ్చు. ఖర్చులు తగ్గుతాయి. ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటాం. – భానుప్రకాష్

### బాబును చూసుకుంటున్నా

ఎంసీఏ పూర్తిచేసి.. ఉద్యోగం ఇక్కడి నుంచి ప్రారంభించా. మొదటి నుంచి ఇతర నగరాల్లో పని చేయడం ఇష్టం లేదు. నెల్లూరులో మంచి కంపెనీలో ఉద్యోగం దొరకడం సంతోషంగా ఉంది. స్థానికంగా ఉద్యోగం చేయడంతో తల్లిదండ్రులకు ఆందోళన ఉండదు. నాకు వివాహమై చిన్న బాబు ఉన్నాడు. ఉదయం చూసుకుని.. ఆఫీసుకు వస్తాను. సాయంత్రం ఇంటికెళ్లి చూసుకుంటాను. – అర్షియా

### మాది చాలా చిన్న పల్లెటూరు

మాది చిన్న పల్లెటూరు. ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగం వచ్చింది. మహా నగరాల్లో ఉద్యోగాలు వచ్చాయి. అయితే స్థానికంగా ఉంటూ తల్లిదండ్రులను చూసుకుంటూ ఉద్యోగం చేసుకోవడం సంతోషంగా ఉంది. మా సంస్థలో ఇతర దేశాల్లో పని చేసిన వారు ఉన్నారు. నెల్లూరుకు ఇంకా కంపెనీలు వస్తే యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. – లిఖిత, నాయుడుపాలెం

మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రై.లి.
ఫార్మర్లీ క్యాడ్‌బరీ ఇండియా లిమిటెడ్
Job Location: తడ, శ్రీసిటీ, తిరుపతి జిల్లా
Mondelez International
TVS Training & Services
WALK - IN INTERVIEW
Date: 18-11-2025 NELLORE
అర్హత: ✔ టీమ్ మెంబర్ ట్రైనీ ✔ ఇంటర్, ITI, డిప్లమో, మొదటి ప్రయత్నంలో 50% కనీస మార్కులు
✔ కంపార్ట్‌మెంటల్, బి.టెక్, యం.బి.ఎ, పి.జి, డిగ్రీ చేసిన వారు అర్హులు కారు
✔ Manufacturing work నందు 1-2 సం॥ అనుభవం గల వారు అర్హులు
వయస్సు: 18-21 సం॥లు, ✔ స్త్రీలకు మాత్రమే
✔ సంవత్సరానికి రూ॥ 2,34,000/- CTC మరియు All Statutory benifits
✔ నెలకు 15,300/- జీతం (అన్ని కటింగ్స్ మినహాయించి)
✔ ఇంటర్వ్యూకు ఉ॥ 9.00 గం॥లకు అన్ని సర్టిఫికేట్స్‌తో రావలెను.
ఇంటర్వ్యూ జరుగు స్థలము: LAAVA CONSULTING SERVICES PVT LTD BV Nagar, Bank Colony, Near KNR Elementary School, NELLORE
ఆపరేషన్ నైట్ షిఫ్ట్‌తో సహా 3 షిఫ్ట్‌లు,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసించే వారికే అర్హత,
గత 3 నెలల్లో ఇప్పటికే హాజరైన అభ్యర్థులు నియామక ప్రక్రియకు అర్హులు కాదు.
Required Documents: SSC, INTER, Aadhar Card, Pancard
సంప్రదించవలసినవారు: శ్రీకాంత్: 93848 43268

30వ వర్ధంతి

క్రమశిక్షణే ఊపిరిగా, కష్టమే ఇష్టంగా, నిరాడంబరతే ఆలంబనగా చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ... అందరి హృదయాలలో మంచి పేరు సంపాదించుకున్న కీ॥శే॥ నలగండ్ల వెంకటరమణయ్య గారు మా నుండి భౌతికంగా దూరమై నేటికి 30 సంవత్సరములు గడిచినను మీ మధురస్మృతులు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. ఆ భగవంతుని సన్నిధిలో మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ...
కీ॥శే॥ నలగండ్ల వెంకట రమణయ్య గారు
ప్రొహిబిషన్ - ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, నెల్లూరు
జననం : 1-7-1942 ● మరణం : 17-11-1995
భార్య : నలగండ్ల వెంకట రత్నమ్మ
కుమార్తెలు : కె. మాధురి, డి. శైలజ, టి. లక్ష్మి
అల్లుళ్లు : కె. మురళీకృష్ణ, డి. వెంకటేశ్వరరావు, టి. సురేష్‌బాబు
మనుమరాండ్రు : ఎన్. లాస్యశ్రీ, ఎన్. అలేఖ్యరమణి, ఎన్. మేధ,
మనుమడు : రుద్రాన్ష్‌నాయుడు
కుమారులు : ఎన్. కృష్ణప్రసాద్, ఎన్. రాంబాబు
కోడళ్లు : స్వర్గీయ ఎన్. సునీత, ఎన్. సునీత

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

## చందాలు వేసుకొని పూడికతీత

రబీ సీజన్ మొదలైనా సాగునీటి కాలువల్లో ఇంత వరకు అధికారులు పూడిక తీత పనులు చేపట్టలేదని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవూరు డెల్టా పరిధిలోని ఉపకాలువల్లో పూడిక పేరుకుపోయింది. సాగునీరు విడుదల చేయడంతో అన్నదాతలే చందాలు వేసుకొని చెర్లోపాలెంలోని కాలువలు శుభ్రం చేయిస్తున్నారు. నీటిపారుదల అధికారులు పరిశీలించి పూడిక తీసి బాగు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కోవూరు

## శిథిలమై... కూలేందుకు సిద్ధమై

వెంకటాచలం మండలం సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి నక్కల కాలువకు వెళ్లే ఎల్లువ కాలువపై నిడిగుంటపాళెం వద్ద సుమారు నాలుగు దశాబ్దాల క్రితం కల్వర్టు నిర్మించారు. ప్రస్తుతం రక్షణ గోడలు కూలిపోవడంతో పాటు, శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, వెంకటాచలం

## పడుగుపాడు.. అభివృద్ధి నడవా చూడు

కోవూరు సమీపంలోని పడుగుపాడు వద్ద ఒక వైపు రోడ్డు, మరోవైపు రైలు మార్గాలు సమాంతరంగా ఉండడంతో చూపరులను ఆకట్టుకుంటోంది. నెల్లూరు పట్టణానికి కూత వేటు దూరంలో ఉంది. నిత్యం వేలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఆక్రమణలతో ఇరుకుగా ఉన్న ప్రాంతం విశాలమైన రోడ్లు వేయడంతో ఆకట్టుకుంటోంది. కోవూరులో సైతం ఇలా రోడ్డు విస్తరించి అభివృద్ధి చేయాలని స్థానికులు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

## కాలువ ఆక్రమించి.. నిర్మాణాలు చేపట్టి

కోవూరు పట్టణ పరిధిలో కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. బజారు కూడలి సమీపంలో మురుగు కాలువపై నిర్మాణాలు చేపట్టారు. పలు గృహాలు శిథిలావస్థకు చేరాయి. వర్షాలకు తడిసి ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, విడవలూరు

## రూ.2 కోట్లతో కాపు భవన్ అభివృద్ధి: మంత్రి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన నెల్లూరులో కాపు భవన్‌ను రూ.2 కోట్లతో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఇందులో కోటి రూపాయలు మా కుటుంబ సభ్యులు విరాళంగా ఇస్తారని ప్రకటించారు. నగరంలోని కాపు భవన్‌లో ఆదివారం కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో జరిగిన వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివలింగానికి పూజలు చేస్తున్న నారాయణ దంపతులు

ఇక్కడ ఏర్పాటుచేసిన శివలింగానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో భవనం ఏర్పాటుకు మూడున్నర ఎకరాల స్థల సేకరణ చేసి నిధులు విడుదల చేశామన్నారు. అప్పుడు తన కుటుంబం తరపున కోటి రూపాయలు విరాళంగా ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వం కాపు భవన్, బీసీ భవన్ నిర్మాణాలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న ఈభవన్‌కు తన కుటుంబ సభ్యులు కోటి ఇస్తారని, సీఎస్సార్ నిధులు మరో కోటి మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా, కాపు నాయకులు పాల్గొన్నారు.

### దాతల సహకారంతో 15 పాఠశాలల అభివృద్ధి

నెల్లూరు (విద్య) : దాతల సహకారంతో నగరంలో 15 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించారు. నగరంలోని మూలాపేట బాలికల ఉన్నత పాఠశాలలో చేస్తున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతల సహకారంతో వీఆర్‌సీ తరహాలో వసతులు కల్పించి 15 వేల మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందిస్తామన్నారు. ఈమేరకు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, జిగ్మా, టీపీఎస్, ఏఎంఆర్ కంపెనీలు, రెడ్డి ల్యాబ్స్ దత్తత తీసుకున్నాయని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, పలువురు అధికారులు పాల్గొన్నారు. సండే మార్కెట్ ముంపు సమస్య పరిష్కారానికి రోడ్డు ఎత్తు పెంచే పనులు సోమవారం ప్రారంభిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఈమార్కెట్‌ను పరిశీలించారు.

## ప్రణాళికాబద్ధంగా అడుగులు..

# సాగుదారులకు మేలు

| | |
|---|---|
| జిల్లాలో తొలి పంట అంచనా | : సుమారు 5.5 లక్షల ఎకరాలు |
| యూరియా అవసరం | : 95వేల టన్నులు |
| అక్టోబరు, నవంబరు నెలలకు అవసరమైనది | : 27,066 |
| ఇప్పటి వరకు పంపిణీ | : 17వేల టన్నులు |
| అందుబాటులో | : మూడు టన్నులు |

న్యూస్‌టుడే, సంగం, బుచ్చి

తొలి పంట సాగుకు యూరియా సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా వ్యవసాయశాఖ ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టింది. ఎకరానికి మూడు బస్తాల వంతున మాత్రమే పంపిణీ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న సమస్యలను అధిగమించే దిశగా ముందుకు సాగుతోంది.

ఈ పోస్ యంత్రం

జిల్లాలో 400 రైతు సేవా కేంద్రాలున్నాయి. వాటి ద్వారా యూరియా సరఫరా చేయాలంటే ఈపోస్ యంత్రాల ద్వారా మాత్రమే జరగాల్సి ఉంది. 400 యంత్రాలకు గాను 120 మాత్రమే ఉన్నాయి. దీంతో జాప్యం జరుగుతుందని, రైతు సేవాకేంద్రాల్లోని డెస్క్‌టాప్ ద్వారా పని చేసేలా కొత్త యాప్‌ను అందుబాటులోకి తేవడంతో సమస్యకు చెక్ పడింది.

### నీటి కేటాయింపులు..

జిల్లాలో తొలి పంట కోసం 4.65 లక్షల ఎకరాలకు సాగునీటి కేటాయింపులు జరిగాయి. ఫిల్టర్ పాయింట్లు, చెరువుల ద్వారా కలిసి మొత్తం మీద 5.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, గతంలో జరిగిన 'ఈ పంట' నమోదు ఆధారంగా వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. సుమారు 95 వేల టన్నుల యూరియా అవసరం ఉంటుందని, దాన్ని పంపిణీ చేసే క్రమంలో నూతనంగా అమలు చేస్తున్న కార్డుల విధానం ద్వారా ఎటువంటి పొరపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### నిల్వలుండేలా..

యూరియా నిల్వ చేసుకునేందుకు ప్రస్తుతం 305 రైతు సేవా కేంద్రాల్లో మాత్రమే అవకాశముంది. మరో 20 చొప్పున పెంచనున్నారు. ఫలితంగా 325 కేంద్రాల్లో నిల్వ ఉండటంతో పాటు, 56 సహకారసంఘాలు, 400 మంది ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలుండేలా చర్యలు చేపడుతున్నారు. నిల్వ అవకాశం లేని ఆర్ఎస్‌కే పరిధిలోని రైతులు సహకార సంఘాల ద్వారా యూరియా తీసుకునేలా అవకాశం కల్పిస్తుండడం విశేషం.

### పారదర్శకంగా...

యూరియా పంపిణీ పారదర్శకంగా ఉండేలా వ్యవసాయ శాఖ అందించే కార్డుల్లో రైతు పేరు, ఆధార్ సంఖ్య, భూ యజమానా..? లేక కౌలు రైతా.. ప్రభుత్వ, శివాయి భూమి సాగు చేస్తున్నారా, ఖాతా సంఖ్య, పొలం విస్తీర్ణం, సాగు చేసే పంట వివరాలు నమోదు చేస్తున్నారు. అవసరమైన యూరియా బస్తాల సంఖ్యను అందులో పొందుపరుస్తున్నారు. ఎక్కడ నుంచి తీసుకుంటున్నారనే సమాచారం ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో తెలిసేలా చేశారు.

● డీఏవో సత్యవాణి మాట్లాడుతూ... రైతులకు యూరియా ఇబ్బందులుండవన్నారు. ఇప్పటికే దాదాపుగా తొలి విడత అందించామని, నారుమడులకు వినియోగం తక్కువగా ఉంటుందని, నాట్లు వేసిన తరువాత సరఫరా చేస్తామన్నారు. సమస్యలు గుర్తించి అధిగమించేందుకు నూతన విధానం మేలు చేస్తుందని ఆశిస్తున్నామన్నారు.

## సూక్ష్మంలో శివ రూపం



మనుబోలు, న్యూస్‌టుడే: కార్తిక మాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని మనుబోలు పంచాయతీ యాచవరం గ్రామానికి చెందిన ఆలూరు రాము ఆచారి ఆదివారం సూక్ష్మ శివలింగం తీర్చిదిద్ది అబ్బురపరిచారు. వేరుసెనగ పప్పుతో గోరుపై ఇమిడిపోయే సూక్ష్మ రూపంలో ఉన్న శివలింగాన్ని రూపొందించడంతో పలువురు అభినందించారు.

## పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రానికి స్వర్ణయుగం : అజీజ్

**నెల్లూరు (మార్కెట్ సెంటర్):** ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రంలో స్వర్ణయుగం మొదలైందని వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు రావడం హర్షణీయమన్నారు. దేశ విదేశాల నుంచి 113 ప్రముఖ సంస్థలు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. వీటితో 18 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు.

## హుషారుగా ఈత పోటీలు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం ఈత కొలనులో ఆదివారం జిల్లా స్థాయి ఈత జట్లకు క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 22, 23 తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి కె.సనత్‌కుమార్, సుంకర మధు పేర్కొన్నారు. గ్రూప్-1లో పి.మణికంత, ఎన్.గణేష్, బి.హిమనీష్, కె.ధన్యశ్రీ, గ్రూప్-2లో సయ్యద్‌ఫర్హాన్, స్మతేష్, గ్రూప్-3లో కె.లక్ష్మీనారాయణ, సయ్యద్ మహమ్మద్, ఎస్.పెరసిస్, ఎల్.తులసి గెలుపొందారు.

గెలుపొందిన క్రీడాకారులు

## 19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి సైక్లింగ్..

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరులో జరుగుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సొంత పరికరాలతో ఈ నెల 19న గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు వి.కనకారావు సైక్లింగ్ కోచ్ 63011 77119, కె.సంగీతాబాబు ఫెన్సింగ్ కోచ్ 87906 23461 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## స్వానిధి.. వీధి వ్యాపారులకు పెన్నిధి

నెల్లూరు(పద్మావతిసెంటర్), న్యూస్‌టుడే: వీధుల్లో తోపుడు బండ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే పేదలకు ప్రధాన మంత్రి స్వానిధి పథకం ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వనున్నారు. వీటిని అన్ని ప్రభుత్వ బ్యాంకుల్లో పొందొచ్చు. మొదటి విడతలో రూ.15 వేలు రుణంగా ఇస్తారు. సకాలంలో చెల్లిస్తే రెండో విడతలో రూ.25 వేలు, వాటిని కూడా సకాలంలో చెల్లిస్తే మూడో విడతలో రూ.50 వేలు మంజూరు చేస్తారు.

జిల్లాలో డిసెంబర్ 31వ తేదీ నాటికి 50 వేల మంది వ్యాపారులకు రుణాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఎంత మంది వీధి వ్యాపారులు వచ్చినా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని బ్యాంకు అధికారులు తెలిపారు. తీసుకున్న రుణానికి వడ్డీ 10 శాతమని, బ్యాంకు ఇచ్చిన గడువు లోపు చెల్లిస్తే 70 శాతం వడ్డీ రాయితీ ఉంటుంది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో వ్యాపారం చేసుకునే వారే పథకానికి అర్హులు. అవకాశాన్ని జిల్లాలోని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మణి శేఖర్ తెలిపారు.

## అందుబాటులో లేని వైద్యులు.. గుండెపోటుతో ఒకరి మృతి

సీతారామపురం, న్యూస్‌టుడే: వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గుండెపోటుకు గురైన వ్యక్తి మృతిచెందిన వైనమిది. స్థానికుల కథనం మేరకు.. సీతారామపురం బెస్తకాలనీకి చెందిన మారబోయిన వెంకటరమణ(55) ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో పడిపోయారు. కుటుంబసభ్యులు గమనించి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఎఫ్ఎన్‌వో తప్ప వైద్యులు, స్టాఫ్ నర్సులు ఎవరూ లేకపోవడంతో కుటుంబీకులే సీపీఆర్ చేశారు. అనంతరం ప్రైవేటు వాహనంలో ఉదయగిరికి తరలిస్తుండగా.. మార్గంమధ్యలో ఆయన మృతిచెందారు. పీహెచ్‌సీ 24గంటల ఆసుపత్రి అయినప్పటికీ వైద్యులు, సిబ్బంది లేకపోవడం.. వారం క్రితం 108 వాహనం మరమ్మతులకు గురవడంతో సకాలంలో వైద్యం అందక ఒకప్రాణం పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారిణిని 'న్యూస్‌టుడే' ఫోనులో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వెంకటరమణను వాహనం వద్దకు మోసుకెళుతున్న కుటుంబసభ్యులు

## స.హ చట్ట కమిషన్ నుంచి కావలి ఎంపీడీవోకు తాఖీదు

కావలి, న్యూస్‌టుడే: రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ నుంచి కావలి ఎంపీడీవో, అన్నగారిపాలెం పంచాయతీ కార్యదర్శులకు తాఖీదులు వచ్చాయి. కావలిలోని వాయినందన వీధికి చెందిన జీవీ బ్రహ్మయ్య.. అన్నగారిపాలెం పంచాయతీకి సంబంధించి 2019-20 నుంచి 2023-24 సంవత్సరాల్లో జరిగిన ఆడిట్‌పై వచ్చిన అభ్యంతరాలతోపాటు 2013- 2024వరకు గ్రామంలో డెత్‌రిజిస్ట్రర్‌లో నమోదైన వివరాలు కావాలని అధికారులను కోరారు. వివరాలు తప్పుగా ఇచ్చారని కొన్నాళ్ల క్రితం రాష్ట్ర కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 19న మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయంలో నేరుగా, లేక ఆన్‌లైన్‌లో ద్వారా వాదనలు వినిపించాలని నోటీసులో పేర్కొన్నారు.

## బడులకు అందని బియ్యం.. పంపిణీలో జాప్యం

న్యూస్‌టుడే, కలువాయి, కోవూరు

పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి అందించే బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీ ఇవ్వాల్సి ఉన్నా 15వ తేదీ దాటినా చాలా చోట్ల అందలేదు. రాపూరు మండలంలో మారుమూల గ్రామాలకు చేరుతుందా.. లేదా.. పర్యవేక్షించే వారే లేరు. ప్రతి నెలా ఇదే పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

● జిల్లాలోని మారుమూల ప్రాంతాలైనా రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లో నిర్వహణ సరిగా లేదు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా దృష్టి పెట్టకపోవడంతో పొరుగు పాఠశాలల నుంచి సర్దుబాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కలువాయి మండలంలో 56 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పతి నెల ఒకటో తేదీ బడులకు రావాల్సిన బియ్యం సమయానికి రాకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. నాలుగు రోజులకు సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుందని ఎక్కువ రోజులైతే కష్టంగా మారుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతి పాఠశాలకు చేర్చాల్సి ఉన్నా.. ఏదో ఒక పాఠశాలలో మొత్తం చేర్చి అక్కడి నుంచి తీసుకెళ్లాలని కోరుతున్నారు. కనీసం గ్రామాల్లోని రేషన్ దుకాణాల వద్దకైన చేరిస్తే బాగుంటుందని, సూచించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలాగే కొనసాగితే నిర్వహణ కష్టమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి పాఠశాలకు బియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎంసీ సభ్యులు విన్నవిస్తున్నారు.

● రాపూరు పౌరసరఫరాల డీటీ అజిత్ కుమార్ మాట్లాడుతూ కలువాయి మండల పరిధిలో పాఠశాలలకు శనివారం బియ్యం పంపామన్నారు. గుత్తేదారు సరిగ్గా సహకరించకపోవడంతో సమయానికి సరఫరా చేయలేకపోతున్నామని చెప్పారు. వచ్చే నెల నుంచి కాంట్రాక్టర్లను మార్చి ఒకటో తేదీకి పాఠశాలలకు బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## బాలలకు భత్యం.. భవితకు ప్రత్యేకం

### చిన్నారులకు ప్రోత్సాహకాలు విడుదల

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, బుచ్చి

ప్రత్యేకావసరాల పిల్లల విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. బాల, బాలికలకు విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో సమ్మిళిత విద్య పేరిట ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి అమలు చేస్తోంది.. విద్యార్థులకు నాలుగు రకాల భత్యాలు అందజేస్తోంది. అంధత్వంతో బాధపడేవారికి రీడింగ్ అలవెన్స్, మిగతా విద్యార్థుల మాదిరిగా నడవలేక వాహనంపై వచ్చేవారికి రవాణా, వారి సహాయకులకు ప్రతినెలా ప్రత్యేక భత్యం అందిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఇచ్చే వివిధ ప్రోత్సాహకాలను నిలిపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై దృష్టి పెట్టింది. చిన్నారుల ప్రత్యేకావసరాలను గుర్తించిన ప్రభుత్వం, అందులో ప్రధానంగా రవాణా, ఎస్కార్ట్, బాలికలకు ఉపకారవేతనాలు సహా దృష్టి మాంద్యం, బాలికలు, సహాయకులకు అలవెన్సులను మంజూరు చేస్తోంది. బడిఈడు పిల్లలంతా కచ్చితంగా బడిలో లేదా మరేదైనా చోట చదువుకునేందుకు ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం అందిస్తోంది.

**వివిధ విభాగాల్లో ఇస్తున్నారిలా... (రూ.లక్షల్లో)**

| అలవెన్సు | విద్యార్థులు | మొత్తం నగదు |
|---|---|---|
| బాలికల ప్రోత్సాహకం | 763 | 7.63 |
| రవాణా | 139 | 4.17 |
| హోమ్‌బేస్డ్ | 355 | 5.32 |
| ఎస్కార్ట్ | 213 | 3.19 |

భవిత కేంద్రాల్లో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● ప్రస్తుత ఏడాదికి పది నెలలకుగాను తొలి విడతగా పలు రకాల భత్యాలను విడుదల చేశారు. బాలికలకు ఉపకార వేతనం నెలకు రూ.200 చొప్పున అందిస్తున్నారు. హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్‌కు ఒక్కొక్కరికి రూ.300, రవాణా భత్యం నెలకు రూ.600 పది నెలల పాటు ఇస్తున్నారు. తల్లిదండ్రులకు ఎస్కార్ట్ అలవెన్స్ నెలకు రూ.300 వారి బ్యాంకు ఖాతాలకు జమకానున్నట్లు అధికారులు తెలిపారు.

● సహిత విద్య సమన్వయకర్త ప్రసాద్‌రావు మాట్లాడుతూ... జిల్లాలో మిగతా అలవెన్సులకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అర్హులైన విద్యార్థుల నివేదికలు ఉన్నతాధికారులకు పంపామన్నారు.

## ఫుట్‌బాల్ జాతీయ పోటీలకు బాలిక ఎంపిక

నెల్లూరు (విద్య) : నగరంలోని కపాడిపాలేనికి చెందిన అరవ నిసి అభిరూప ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 18వ తేదీ నుంచి అనంతపురంలో జరగనున్న అండర్-15 జూనియర్ ఆలిండియా పోటీల్లో పాల్గొననుంది. నగరంలోని మిలీనియం స్కూల్లో 10వ తరగతి చదువుతుంది.

సమాచార స్రవంతి

**బంగారం ధరలు**

| | |
|---|---|
| గ్రాముధర: | రూ.11,809 |
| (3 శాతం జీఎస్టీ కలిసిన ధర) | |
| సవర ధర: | రూ.94,472 |
| వెండి గ్రాము : | రూ.164.70 |

**నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు**

| | |
|---|---|
| బ్రాయిలర్ | 136 |
| లేయర్ | 120 |
| బ్రాయిలర్స్ | 244 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 270 |
| లేయర్ మాంసం | 204 |


**SBI భారతీయ స్టేట్ బ్యాంక్**
RASMECC, నెల్లూరు, వెంకటరెడ్డి నగర్, వేదాయపాలెం, యస్‌పియస్‌ఆర్ నెల్లూరు (జిల్లా)

**స్వాధీనం చేసుకున్న వాహనాల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన**

మా ఋణగ్రహీతల క్రింద పేర్కొన్న వాహనాలు కార్లు "అవి ఉన్న చోటనే ఉన్నట్లుగా" ఇ-వేలం పద్ధతిలో అమ్మకం కోసం ఇ-కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి ఈ వాహనాలకు బ్యాంకు నిధులు సమకూర్చింది మరియు ఋణగ్రహీతలు వాయిదాలు (EMI) లు చెల్లించడంలో విఫలం అయినందున బ్యాంకు ఆ వాహనాలను స్వాధీనం చేసుకుంది మరియు వాటిని తేదీ.24-11-2025 న ఇ-వేలం పద్ధతిలో వేలం వేస్తున్నారు.

| వ. నెం. | ఋణగ్రహీత పేరు / చిరునామా & ఖాతా నెం. | వాహనం నెం./ రిజిస్ట్రేషన్ నెం./ మోడల్ వివరాలు | రిజర్వు ధర / ధరావతు / బిడ్ పెంపుదల మొత్తం |
|---|---|---|---|
| 1) | ఋణ గ్రహీత : శ్రీ లక్ష్మణ్‌కుమార్ 14-5-45, సుందరగిరివారి స్ట్రీట్, మండపాల వీధి, నెల్లూరు-524001 కార్ లోన్ అకౌంట్ నెం.: 39693523625 | MARUTHI SUZUKI INDIA LTD CAR WITH REGISTRATION No: AP 39GC 7753 DATE OF REGISTRATION: 17-10-2020 Mfg : MARUTHI SUZUKI INDIA LTD FUEL TYPE: PETROL MFG. YEAR: 09/2020 TYPE OF BODY: RIGID (PASSENGER CAR)(EECO 5 STR AC) COLOUR: GLISTENING GREY CHASSIS NO: MA3ERLF1S00849220 ENGINE NO: G12BN843210 | రిజర్వు ధర : రూ.2,80,000.00 + GST వర్తించును ధరావతు : రూ.28,000.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.2,000.00 ASSET ID: SBIN15546006 |
| పై వాహనము ఈ-వేలం తేది & సమయం : తేది.24.11.2025, సా.03.30 గంటల నుండి సా.4.00 గంటల వరకు | | | |
| 2) | ఋణ గ్రహీత : శ్రీ కోట్ల సుబ్రమణ్య ఉమేష్ డోర్ నెం.:25-2-1023 2వ స్ట్రీట్, రెవెన్యూ కాలనీ, నెల్లూరు-524004 కార్ లోన్ అకౌంట్ నెం.: 42268349012 | TATA MOTORS INDIA LTD CAR WITH REGISTRATION No: AP40 AE 3784 DATE OF REGISTRATION: 22-09-2023 Mfg : TATA MOTORS FUEL TYPE: PETROL MFG. YEAR: 08/2023 TYPE OF BODY: 5 DOOR STEEL SHELL (ALTROZ DCA XZ 1.2P BS6PH2) COLOUR: DOWNTOWN RED CHASSIS NO: MAT632153PPH02184 ENGINE NO: REVTRN2OHWXME8836 | రిజర్వు ధర : రూ.7,20,000.00 + GST వర్తించును ధరావతు : రూ.72,000.00 బిడ్ పెంపుదల మొత్తం రూ.5,000.00 ASSET ID: SBIN15546007 |
| పై వాహనము ఈ-వేలం తేది & సమయం : తేది.24.11.2025, సా.04.00 గంటల నుండి సా.4.30 గంటల వరకు | | | |

నియమ నిబంధనలు : 1) వాహనము రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడదు.
2) గెలుపొందిన బిడ్డరు అమ్మకం మొత్తంలో 15% శాతాన్ని వెంటనే డిపాజిట్ చేయవలెను మరియు మిగిలిన 75% మొత్తాన్ని విక్రయ తేదీ నుండి 7 రోజులలోగా చెల్లించవలెను.
3) వేలంను రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు బ్యాంకుకు హక్కు కలదు.
4) గెలుపొందిన బిడ్డరు వాహనం రిజిస్ట్రేషన్ చేసుకోవలెను. వాహనాన్ని గెలుపొందిన బిడ్డరుకు మాత్రమే అప్పగించబడును మరియు గెలుపొందిన బిడ్డరు పేరున మాత్రమే పేరు మార్చబడును.
5) ఆసక్తి గల బిడ్డర్లు వేలం తేదికి మూడు రోజుల ముందుగా పైన తెలిపిన బ్రౌజర్‌లో https: //ebkray.in/baankenet.com/eauction-psb/x-login నందు లేదా యూఆర్ఎల్ https://baanknet.com నందు ఎవరికి వారే రిజిస్ట్రేషన్ లేదా నమోదు చేసుకొనవలెను.
6) ఆసక్తి గల బిడ్డర్లు పైన తెలిపిన వెబ్‌సైట్‌లోని "Buyer / Guide for Login & Registration" విభాగంలో అందించిన వీడియోలు/ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకొని చూడవలసినదిగా సూచించడమైనది.
7) అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన URL https://ekray.in లేదా baanknet.com నందు వేలం తేదిని పరిశీలించి, యస్‌బిఐ బ్యాంకు ఎంచుకుని, నియమ నిబంధనలు అనుమతించి పాల్గొనవలెను.
8) తదుపరి వివరములకు శ్రీ రామ్ స్వరూప్, ఫోన్ నెం. : 98664 21789,
చీఫ్ మేనేజర్, ఎమ్.సుబ్బారావు ఫోన్ నెం. : 96660 74255, జె.రాజు ఫోన్ నెం. : 90009 45109

తేది: 16.11.2025, ప్రదేశం : నెల్లూరు సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్


## కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా..

### నేటి నుంచి గ్రామాల్లో ఇంటింటి సర్వే

న్యూస్‌టుడే, దుత్తలూరు

కుష్ఠు నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిలావ్యాప్తంగా బాధితులను గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరంతా సోమవారం నుంచి ప్రతి ఇంటిని సర్వే చేయడంతోపాటు వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

### గుర్తింపు.. ఆపై చికిత్స

జిల్లాలో 722 పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పది సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పది పట్టణ ఆరోగ్య కేంద్రాలు, రెండు ఏరియా వైద్యశాలలు, ఒక జిల్లా వైద్యశాల, ఒక జీజీహెచ్ ఉన్నాయి. వైద్య సిబ్బందితోపాటు సచివాలయ ఉద్యోగులు సర్వేలో పాల్గొంటారు. లక్షణాలు గుర్తించడంతోపాటు వారిలో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. గుర్తించిన బాధితులకు క్రమం తప్పకుండా చికిత్స అందిస్తారు.

మాక్ సర్వేలో వైద్య సిబ్బంది

### ప్రజలు సహకరించాలి

కుష్ఠు నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేలో ఇంటికి వచ్చిన సిబ్బంది అడిగిన వివరాలను తెలియజేసి ప్రజలు సహకరించాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు.

## ఎనిమిది నెలలుగా ఉడకని కందిపప్పు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, మనుబోలు

రేషన్ కార్డుదారులకు ఎనిమిది నెలల నుంచి కందిపప్పు అందడం లేదు. పౌరసరఫరాల సంస్థ నుంచే జిల్లాకు కేటాయింపులు లేకపోవడంతో డీలర్లు డీడీలు తీయలేదు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం, పంచదార మాత్రమే అందిస్తున్నారు.

జిల్లాలో రేషన్ కార్డులున్న వారిలో ఎక్కువ మంది పేదలున్నారు. బహిరంగ మార్కెట్లో అధిక ధరను వెచ్చించి కందిపప్పు కొనుగోలు చేసే శక్తి లేదు. వీరంతా చౌక దుకాణాలు ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో కందిపప్పు రూ.120 నుంచి రూ.140 వరకు ఉంది. రేషన్ దుకాణాల ద్వారా రూ.70కే ఇవ్వడంతో కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల సరకులందించేలా చర్యలు తీసుకుంది. ఫిబ్రవరి, మార్చి నెలలో 50 శాతం కుటుంబాలకే అందించింది. మార్చి నుంచి పూర్తిస్థాయిలో కేటాయింపులు లేకపోవడంతో ఎనిమిది నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పౌరసరఫరాల డీటీ రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి సరఫరా లేదన్నారు. ఉన్నతాధికారులను నివేదించామని త్వరలో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

జిల్లాలో రేషన్ కార్డులు : 7,32,331 ● చౌకదుకాణాలు : 1,513 ● ప్రతి నెలా అవసరమైన కందిపప్పు : 732 టన్నులు


EENADU Classifieds

TO LET

COMMERCIAL

నెల్లూరు మినీబైపాస్‌రోడ్ GPR కళ్యాణ మండపం ప్రక్కన కమర్షియల్ ఆఫీసులకు / షోరూంలకు అద్దెకు ఇవ్వబడును. Contact ✆ 9010559955, 7032088809

భారతప్రభుత్వ గుర్తింపుతో 7 రాష్ట్రాలలో 200+ బ్రాంచీలతో 28 సం||లుగా నడుస్తున్న MSCS (కోర్ బ్యాంకింగ్) సంస్థలకు యువతీ/యువకులు కావలెను. 9182440586

JOBS

Sales Consultant : 10, Sal: 14K to 20K, Fuel & Cug Sim and Incentives, Male. Qual: Any Degree, Kun Auto Company Private Limited (Hyundai Car Dealer) : Contact 70933 33846, 81064 01818

బ్యాంక్ లోన్స్ ప్రాసెస్‌లో Back-end, టెలీకాలర్, మేనేజర్ కావలెను. 30Y, మ్యారీడ్ స్త్రీలు, నో టార్గెట్స్, 10K, 12K, 25K వర్తకి సెంటర్ నెల్లూరు.8885802000

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800 ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

## కావలి మున్సిపాలిటీలో సమస్యలా? నేడు కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో ఫోన్‌ఇన్

మీ ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందా.. తాగునీరు సరిగా రావడం లేదా.. మురుగుకాలువల్లో పూడిక పేరుకుపోయిందా.. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా ? వీధి దీపాలు వెలగడం లేదా ? వీటితోపాటు మరే ఇతర సమస్యలు ఉన్నా.. నేరుగా కావలి కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చు. ఇందుకు 'ఈనాడు' మీతోడు ఆధ్వర్యంలో ఆయనతో సోమవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో మీరు ఎదుర్కొంటున్న సమస్య చెబితే ఆయన సమాధానం ఇస్తారు. - న్యూస్‌టుడే, కావలి

తేదీ : 17-11-2025 (సోమవారం)
సమయం : ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య
ఫోన్ నంబరు : 98499 07342

## బొబ్బిలి కోటను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల

**వింజమూరు, ఉదయగిరి, న్యూస్‌టుడే:** ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చరిత్ర కలిగిన విజయనగరం జిల్లాలోని బొబ్బిలి కోటను ఆదివారం సందర్శించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనతో కలిసి కోటలోని దర్బార్ మహల్, బొబ్బిలి యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలను అప్పటి వాహనాలను తిలకించారు. ఈ సందర్భంగా బొబ్బిలి వీణను కాకర్ల సురేష్‌కు బహూకరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

**సమస్య:** అన్నవరం గ్రామంలో విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల కారణంగా చిన్నపాటి వర్షం కురిసినా సరఫరాలో అంతరాయం కలుగుతోంది. - మాల్యాద్రి, గ్రామస్థుడు
**సమాధానం:** సరఫరా సజావుగా ఉండేలా చూస్తాం. - సునీల్, ఏఈ జలదంకి

? కావలిపట్టణం ఉత్తర జనతాపేటలో దోమల బెడద అధికంగా ఉంది. పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. - ఎం.శంకరయ్య
✓ ఫాగింగ్ చేయిస్తాం. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. - జి.శ్రావణ్‌కుమార్,కమిషనర్, పురపాలక సంఘం - న్యూస్‌టుడే, కావలి

? రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే తాగునీరు మురికిగా వస్తున్నాయి. దుర్వాసన సైతం వస్తోంది. - పావని, పోలినేనిపాలెం
✓ పరిశీలించి పరిశుభ్రమైన నీరు సరఫరా అయ్యేలా చూస్తాం. - రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

? దగదర్తి - సున్నపుబట్టి రహదారి పక్కనే పలువురు కోళ్ల వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. - వెంకయ్య, స్థానికుడు
✓ సిబ్బందికి తెలిపి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.- మయూరి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, దగదర్తి

? వరికుంటపాడులోని అశోక్‌నగర్‌లో తాగునీటిని సరఫరా చేసే బోరు మరమ్మతులకు గురయింది. నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. - నాగేశ్వరరావు
✓ పరిశీలించి బోరుకు మరమ్మతులు చేయిస్తాం. - ప్రభుదాస్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, వరికుంటపాడు

? దుత్తలూరు కూడలి నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో చెరువుకట్ట దగ్గర వీధిదీపాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. - చిన్నా, స్థానికులు
✓ దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం - నజీముల్లా, పంచాయతీ కార్యదర్శి

? మండల పరిధిలోని తెట్టు తూర్పు బజారులో వీధి దీపాలు వెలగడం లేదు. - వై.దీప్తి
✓ పరిశీలించి మరమ్మతులు చేయించి వెలిగించే ఏర్పాటు చేస్తాం.- మార్టిన్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, గుడ్లూరు

## నిధులకు నిరీక్షణ

**కావలి, న్యూస్‌టుడే:** కావలి పట్టణంలో ట్రంకు రోడ్డు అభివృద్ధికి నిధుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఎనిమిది కిలోమీటర్ల పొడవున్న రోడ్డుకు గత వైకాపా పాలనలో ర.భశాఖ తరఫున అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. అయిదేళ్లలో ముసునూరు వద్ద ఓ కల్వర్టు, కొంతదూరం కాలువ నిర్మాణంతోనే సరిపెట్టారు. పలు చోట్ల గుంతలు ఏర్పడి మరమ్మతులకు నోచుకోక వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుత కూటమి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 25శాతం లోబడి చేపట్టిన అభివృద్ధి పనులన్నీ రద్దు కావడంతో కావలి ట్రంకు రోడ్డు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ మార్గంలో ఉదయగిరి వంతెన కూడలి నుంచి ఉత్తరం మద్దూరుపాడు వరకు జాతీయ రహదారుల సంస్థకు అప్పగించారు. అటువైపు అభివృద్ధికి అడుగులు పడుతుండగా, దక్షిణం ముసునూరుకు రోడ్డు బాగుకోసం నిధులు మంజూరు కావాల్సి ఉంది.

కావలి పట్టణం ముసునూరు వద్ద ట్రంకురోడ్డుపై గుంత

### రూ.35 కోట్ల అంచనాతో..

ర.భశాఖ ఆధ్వర్యంలో 4.56 కిలోమీటరు నుంచి 8వ కిలోమీటరు వరకు మొత్తం 3.44 కి.మీ. దూరానికి రూ.35 కోట్లతో అంచనాలు రూపొందించారు. అందులో 1.4కిలోమీటరు నిడివి వరకు 17 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించేలా ప్రతిపాదించారు. అక్కడి నుంచి మిగిలిన రెండు కిలోమీటర్ల దూరం తారుతో వేస్తారు. ఈ ప్రతిపాదనలకు మోక్షం కలిగి పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి. ఆలోగా మరమ్మతులు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

### మరమ్మతులు చేయిస్తాం

నూతనంగా సవరించిన అంచనాల ప్రకారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు ఉత్తర్వులు రాగానే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. నిర్వాహక నిధులతో మరమ్మతులు పూర్తిచేయిస్తాం. - చక్రధర్, డీఈ, ర.భశాఖ, కావలి

## పేదల పక్షంగా.. ఆపదలో అండగా

లబ్ధి చేకూరుస్తోన్న సీఎంఆర్‌ఎఫ్

కందుకూరు పట్టణం నాంచారమ్మకాలనీకి చెందిన దాసరి మధుసూదన్‌రావు నాలుగు నెలల క్రితం ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కాళ్లు, చేతులు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్య ఖర్చులు భారీగా అవడంతో ఇంటిని అమ్మేశారు. ఇంకా నగదు అవసరమవడంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో రూ.7లక్షలు విలువైన ఎల్‌వోసీ మంజూరైనట్లుతెలిపారు.

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్)తో పేద, బలహీన వర్గాలకు సాంత్వన చేకూరుతోంది. వైద్య, ఆర్థికసాయం అందుతుండడంతో కొండంత భరోసా దక్కుతోంది. గత వైకాపా హయాంలో ఆరోగ్యశ్రీ సక్రమంగా పనిచేయక, సీఎంఆర్‌ఎఫ్ సాయం అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి ఆదుకుంటోంది.

పేదప్రజలు వైద్యచికిత్సల కోసం, ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయినప్పుడు, ప్రమాదాలబారినపడినప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికసాయం అందించేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుంది. రాష్ట్రానికి చెందిన ఆర్థికంగా వెనుకబడిన వారు ఇందుకు అర్హులు.

### నియోజకవర్గంలో వివరాలు ఇలా..

| మండలం | లబ్ధిదారులు | ఆర్థికసాయం (రూ.లక్షల్లో) |
|---|---|---|
| కందుకూరు గ్రామీణం | 130 | 93.88 |
| కందుకూరు పట్టణం | 180 | 157 |
| గుడ్లూరు | 146 | 120 |
| వలేటివారిపాలెం | 152 | 116 |
| లింగసముద్రం | 117 | 88.27 |
| ఉలవపాడు | 91 | 80.62 |

### 816 మందికి రూ.6.57 కోట్లు

కందుకూరు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా అయిదు మండలాల్లో మొత్తం 816 మందికి రూ.6.57కోట్ల విలువైన నగదు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. మరికొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. పేదలపై ఆర్థికభారం పడకుండా సాయం అందిస్తుండటం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చికిత్సకు అయిన ఖర్చులు పొందడం లేదా ముందుగానే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) ఇవ్వడంతో రోగులకు వైద్య ఖర్చుల ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చేయూతనిస్తుంది. గుండె సంబంధిత సమస్యలు, మోకాళ్ల చికిత్సలు, లివర్, కిడ్నీ బాధితులు, రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారు దరఖాస్తు చేసుకుని సాయం పొందొచ్చు.

### రూ.3.4లక్షలు సాయం అందింది

మాది పట్టణంలోని పడమటియాదవపాలెం. లారీ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నా. ఆరు నెలల క్రితం గుండెకు సంబంధించి సమస్య రావడంతో ఆసుపత్రిలో చేరా. భారీగా ఖర్చు అయింది. ఆర్థికంగా ఇబ్బందులు పడ్డా. ఎమ్మెల్యే ద్వారా సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.3.4లక్షలు సాయం అందింది. మాలాంటి ఎంతోమందిని ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు. - బి.కృష్ణమూర్తి, కందుకూరుపట్టణం

## దెబ్బతిన్న కాలువ.. సాగునీరు అందేదెలా?

**సీతారామపురం, న్యూస్‌టుడే:** వర్షాలకు సీతారామపురం స్వామి చెరువులోకి నీరుచేరి నిండుకుండలా దర్శనమిస్తోంది. అయినా తమపొలాలకు సక్రమంగా నీరందడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. చెరువుకట్ట వద్ద నుంచి పొలాలకు నీరందేలా ఏర్పాటుచేసిన కాలువ పూర్తిగా దెబ్బతినడమే దానికి కారణం. అధికారులకు చెప్పినా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలోనే కొందరు సాగుకు సిద్ధం కాగా వారే కాలువకు చిన్నపాటి మరమ్మతులు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో బాగుచేయాలని కోరుతున్నారు.

## యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎంపిక

**లింగసముద్రం, న్యూస్‌టుడే:** లింగసముద్రం మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా కె.వెంకట్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకర్‌రావుతో పాటు, కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో వి.వి.శేషులు, కిలారి వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

**గుడ్లూరు, న్యూస్‌టుడే:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎర్రాప్రగడ గ్రంథాలయంలో ఆదివారం బాలబాలికలకు చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలు గీస్తున్న బాలబాలికలు

## వైభవం.. శివపార్వతుల కల్యాణం

**ఉలవపాడు, న్యూస్‌టుడే:** మండలంలోని కరేడులోని శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కన్నులపండగగా కల్యాణోత్సవం జరిగింది. స్వామిఅమ్మవార్లను విశేష పుష్పాలతో అలంకరించారు. మండపంలో వేదమంత్రాల మధ్య కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రత్యేక అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

### రామాలయ తృతీయ వార్షికోత్సవం

**ఉదయగిరి :** మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సీతారాముల ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

హోమం నిర్వహిస్తున్న భక్తులు

## ఆర్థిక సాయం అందజేత

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** మండలంలోని దక్కనూరుకు చెందిన యడవల్లి దేవయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం పామూరు మానవతా సంస్థ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి రూ.5 వేల నగదు అందజేశారు. సభ్యులు హరిశ్చంద్రప్రసాద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## కల్వర్టు వద్ద జరభద్రం

కమ్మవారిపాలెం పేరపునాయుడి చెరువు సమీపంలో ర.భ రోడ్డుపై కల్వర్టు అనుసంధానం కోతకు గురై ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అజాగ్రత్తగా ఉంటే గాయాలపాలయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ర.భ ఏఈ అహ్మద్‌బాషా మాట్లాడుతూ మరమ్మతులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, జలదంకి

## నిలువెత్తు వృథా

స్థానిక పంచాయతీ పరిధిలోని నారాయణప్పపేట దిగువకాలనీలో ఓవర్‌ఫ్లో పైపు నుంచి నిత్యం నీరు వృథాగా పోతోంది. రహదారి పక్కనే తరచూ సమస్య నెలకొంటున్నా.. అధికారులకు పట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సీతారామపురం

## అధ్వాన రోడ్డు.. రాకపోకలకు ఇక్కట్లు

పట్టణంలోని బిట్-3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఆర్‌ఎస్కేలకు వెళ్లే మార్గంలో నివాసాల మధ్య రోడ్డు అధ్వానంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రాళ్లు తేలడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. విన్నవిస్తున్నా.. అధికారులకు పట్టడం లేదని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు - న్యూస్‌టుడే, ఉదయగిరి

## చిట్టడవిలా ఎంఐజీ లేఅవుట్

పట్టణంలోని ఉప్పు చెరువు ప్రాంతంలో ప్రతిపాదించిన ఎంఐజీ లేఅవుట్ నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. పిచ్చిమొక్కలు, చిల్లచెట్లతో చిట్టడవిని తలపిస్తోంది. గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా త్వరగా వినియోగంలోకి తీసుకువస్తే.. అటు ప్రజలకు, ఇటు మున్సిపాలిటీకి మేలు జరుగుతుందని పలువురు భావిస్తున్నారు. - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

## బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఉమ్మడి ప్రకాశంజిల్లా అండర్-14, 17 బాల, బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక కార్యక్రమం ఆదివారం పట్టణంలోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో జరిగింది. జిల్లా జట్లకు ఎంపికైన వారు ఈనెల 21 నుంచి 23 వరకు అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి టి.సుబ్బారావు, సభ్యుడు సయ్యద్‌జిలానీబాషా తెలిపారు.

## కడుపునొప్పి భరించలేక వృద్ధురాలి ఆత్మహత్య

**కావలి, న్యూస్‌టుడే:** కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓ వృద్ధురాలు చికిత్సపొందుతూ మృతిచెందారు. కావలి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన రీటాదేవి (65) కుటుంబం స్థానికంగా ఉన్న పెద్దపవని బస్టాండ్ వద్ద సులభ్‌కాంప్లెక్స్ నిర్వహిస్తున్నారు. ఆమె కొన్నాళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈక్రమంలో నొప్పి భరించలేక రెండు రోజుల క్రితం ఎలుకలమందు తినేశారు. కుటుంబ సభ్యులు గమనించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం చెన్నైకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

## ఆలయాల్లో చోరీ

**వరికుంటపాడు, న్యూస్‌టుడే:** మండలంలోని కనియంపాడు రామాలయం, నాగార్పమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. నాగార్పమ్మ ఆలయానికి సంబంధించి హుండీని పగలకొట్టి నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం సమీపంలోని కంపచెట్లల్లో వదిలి వెళ్లారు. రామాలయానికి సంబంధించిన హుండీ కనిపించలేదని.. అందులో సుమారు 20 వేల వరకు నగదు ఉండొచ్చని స్థానికులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. ఇటీవల మండలంలో వరుసగా ఆలయాల్లో చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## బంగారు నగల అపహరణపై దర్యాప్తు

**ఉదయగిరి :** పట్టణంలో బీసీ కాలనీలో తాళం వేసిన ఇంట్లో బంగారు నగలు చోరీ జరిగిన విషయమై కావలి డీఎస్పీ శ్రీధర్ దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఆ ఇంటిని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో కాలనీలో ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు.

నివాసాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీధర్

## పంటకాలువలోకి దూసుకెళ్లిన కారు

**కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** రహదారి మలుపులో ఎదురుగా వస్తున్న లారీ పైకి రావటంతో కారు పంటకాలువలోకి వెళ్లిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు వింజమూరుకు చెందిన శ్రీనివాసులు హైదరాబాద్ నుంచి వచ్చి కందుకూరులో వివాహానికి హాజరై స్వగ్రామానికి వెళ్తుండగా మాచవరం అయ్యల్‌రెడ్డి కొండ దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్రేన్‌సహాయంతో వాహనాన్ని బయటకు తీశారు.

కారును బయటకు తీస్తున్న క్రేన్

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**ఉదయగిరి, న్యూస్‌టుడే:** గ్రామ, మండలస్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ సభ్యుడు, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త కొట్టె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో పార్టీ సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విశేషంగా కృషి చేసిన వాలంటీర్ల సన్మాన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు కల్లూరి సురేంద్రరెడ్డి నాయకులు ఆల్లూరి రవీంద్ర, పి.శ్రీనివాసులు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. **బిట్రగుంట :** బోగోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ పుట్టినరోజు వేడుకలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వనభోజన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

**కావలి, బిట్రగుంట, న్యూస్‌టుడే:** ఆర్యవైశ్య, కాపు సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన కార్తిక వన సమారాధన, భోజన కార్యక్రమాల్లో కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆదివారం కావలి పట్టణంలోని కాపు నాయకుల నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాపు సంక్షేమభవన్‌కు రూ.25లక్షల విరాళాన్ని ప్రకటించారు. అనంతరం బోగోలు మండలం ముంగమూరు నగరవనంలో జరిగిన ఆర్యవైశ్య వన సమారాధనల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ పీఠాధిపతి బాలస్వామీజీ పాల్గొన్నారు. ఆర్యవైశ్య మండల కమిటీ అధ్యక్షులు తటవర్తి రమేష్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

❖ బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీప్రసన్నవెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమం జరిగింది. జిల్లా నాయకులు ఐలాపురం భాస్కర్, శ్రీనివాస్, నరసయ్య, పెళ్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దారి.. గుల్లబారి

**దుత్తలూరు, న్యూస్‌టుడే:** ఉదయగిరి- నందిపాడు మార్గం నుంచి పాపంపల్లికి వెళ్లే కంకర తేలి రహదారి దారుణంగా ఉంది. నడవడానికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈవిషయమై పీఆర్ ఏఈ హజరత్‌ను వివరణ కోరగా సమస్యపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

## డివైడర్ ఏర్పాటు షురూ

పట్టణవాసులకు దశాబ్దాల కలగా ఉన్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటుకు ఎట్టకేలకు అడుగులు ముందుకుపడ్డాయి. పామూరురోడ్డులో ఇటీవలే రోడ్డు వెడల్పు పనులు పూర్తికాగా.. తొలి విడతగా అక్కడే డివైడర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. వీలైనంత త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

## సాగునీరు విడుదల చేయాలి

**బిట్రగుంట, న్యూస్‌టుడే:** కావలి కాలువ, శ్రీవెంకటేశ్వరపాళెం మేజరు కాలువకు త్వరగా సాగునీరు విడుదల చేయాలని వైకాపా మండల అధ్యక్షుడు ఎం.వీరరఘు అన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామన్నారు. ఆదివారం బోగోలులోని వైకాపా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులు మల్లారెడ్డి, సురేంద్రరెడ్డి, ఏకే.సుందరరాజ్ తదితరులు ఉన్నారు.

## గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలి

**అల్లూరు, న్యూస్‌టుడే:** అల్లూరు నగర పంచాయతీ ప్రజలు నూతన ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ ఏఈ హేమంత్ తెలిపారు. నివాస స్థలం ఉండి ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నెలలో మంజూరు అవుతుందన్నారు. ఈనెల 30 తేదీలోగా అవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో ఈ యాప్ ద్వారానే గృహాలు మంజూరు అవుతాయన్నారు. ఇందుకు ప్రతి గ్రామానికి ఒక అధికారి నియమించినట్లు వివరించారు. గ్రామకార్యదర్శి, వర్క్‌ఇన్‌స్పెక్టరు, డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకులు ద్వారా చేయించుకోవచ్చన్నారు. రూరల్ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నివాస స్థలాలకు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. అసంపూర్తి గృహాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు.

## అడ్డగోలు తవ్వకాలు.. పైపులైన్లకు లీకులు

ఇంటర్నెట్ సేవలు అందించేందుకు కేబుల్ల ఏర్పాటు కోసం కావలి పట్టణంలోని పోస్టల్ కార్యాలయం ఎదుట, ప్రధాన రహదారికి అంచున కొందరు.. శ్రామికులతో గుంతలు తవ్విస్తున్న దృశ్యమిది. అర్ధరాత్రి వేళల్లో తరచూ వివిధ ప్రాంతాల్లో పురపాలక సంఘం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇలా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు.

❖ కొద్ది నెలల క్రితం పట్టణంలోని తుపానునగర్‌లో అనుమతులు లేకుండానే తవ్వకాలు జరపడంతో తాగునీటి పైపులైన్లన్నీ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. తుపాన్‌నగర్, బైరాగుల, జంగాలకాలనీల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పురపాలక సిబ్బంది అతికష్టంమీద మరమ్మతులు చేయాల్సి వచ్చింది.

**న్యూస్‌టుడే, కావలి**

పురపాలక పరిధిలో.. ప్రైవేట్ కంపెనీల ద్వారా అంతర్జాల(ఇంటర్నెట్) సేవలు అందించే కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నారు. దీంతో పలుచోట్ల తాగునీటి పైపులైన్లు దెబ్బతింటున్నాయి. మరమ్మతులకు పురపాలక సిబ్బంది విస్తృతంగా శ్రమించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం వారు అనుమతులు తీసుకుంటే ఇబ్బంది ఉండేది కాదు. పురపాలకానికి ఆదాయం సైతం వస్తోంది. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. వీధుల్లో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది ఏర్పడుతోంది. వెంగళరావునగర్‌లో ఇటీవల పైపులైన్ల లీకులతో నీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడ్డాయి. గతంలో ట్రంకురోడ్డు రూపాయిమిద్దె కూడలికి సమీపంలో, ఉదయగిరి వంతెన కింద చాలాసార్లు పైపులైన్ లీకులయ్యాయి. ఈ విషయమై అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా.. ఫలితం ఉండడం లేదు.

### ఇబ్బందులు లేకుండా చూస్తాం

అనుమతులు లేకుండా జరిగే తవ్వకాలు అడ్డుకుంటాం. పట్టణ పరిధిలో లీకేజీల వ్యవహారం కొలిక్కి వచ్చేలా చూస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - జి.శ్రావణ్‌కుమార్, కమిషనర్

## అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ సంప్రోక్షణ

**ఉదయగిరి, న్యూస్‌టుడే:** మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కలశస్థాపన, విశేష హోమాలు, పూర్ణాహుతి, నివేదన నీరాజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

## దర్గాకు వెళ్లాలంటే మురుగు దాటాల్సిందే

**గుడ్లూరు, న్యూస్‌టుడే:** మండలంలోని తెట్టు సుల్తాన్‌బీబీ దర్గాకు పోయే సిమెంటు రహదారిపై నీరు నిల్వ ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఉన్న చెరువు నుంచి నీరు వచ్చి చేరుతుండడంతో ఈ పరిస్థితి వచ్చింది. పరిసరాలు బురదమయంగా మారడంతో అసౌకర్యంగా ఉందని శుభ్రం చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

(c) eenadu

## విద్యుత్తు సరఫరాలో సమస్యలా..?

తోటపల్లిగూడూరు, వెంకటాచలం, ముత్తుకూరు, కోడూరు సెక్షన్ల పరిధిలో విద్యుత్తు సరఫరాలో సమస్యలున్నాయా..? స్థానిక సిబ్బందికి చెప్పినా స్పందించడం లేదా..? సూర్యఘర్ పథకంలో సౌర పలకలు ఏర్పాటు చేసుకునే వారికి ఏమైనా సందేహాలున్నాయా..? దీంతో పాటు విద్యుత్తు శాఖ పరిధిలోని సమస్యలు నేరుగా ముత్తుకూరు ట్రాన్స్‌కో డీఈఈ రాము దృష్టికి తీసుకురావచ్చు. ఇందు కోసం 'ఈనాడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఈఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వినియోగదారులు తమ సమస్యలు, వినతులు ఫిర్యాదులకు దిగువ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయొచ్చు.

తేదీ: 18-11-2025 (మంగళవారం) సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య

- న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ఫోన్ నంబరు : 94408 17480

# కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

## రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

**కోవూరు, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువగా వస్తున్నాయని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కోవూరులో మాట్లాడుతూ విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో అంచనాలకు మించి పెట్టుబడులు వచ్చాయని, దీంతో రాష్ట్ర రూపు రేఖలు మారనున్నాయని పేర్కొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

**సమస్య:** సంగం మండలం తరుణవాయిలో చెత్త సంపద కేంద్రం వద్దకు రాకపోకలు సాగించేందుకు మార్గం అనువుగా లేదు. ఆ వసతి కల్పించాలి. – పెంచలయ్య, తరుణవాయి

**సమాధానం:** ఉపాధి హామీ పథకం ద్వారా వేసేలా చర్యలు తీసుకుంటాం.–షాలెట్, ఎంపీడీవో

? అనంతసాగరంలోని పూసల కాలనీలో అంతర్గత రహదారులు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. – భిక్షం

✓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతాం. – ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరులోని ప్రధాన మార్గాల్లో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. – రత్నయ్య, స్థానికుడు

✓ ఇన్‌ఛార్జి కార్యదర్శిని నియమించి దీపాలు వెలిగించే ఏర్పాటు చేయిస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో

? పొదలకూరు రూరల్ పరిధిలోని రత్నగిరి గ్రామంలో కాలువలు లేక మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. – మహేశ్, స్థానికుడు

✓ సమస్య పరిశీలించి త్వరలో కాలువలు నిర్మిస్తాం. – నరసింహారావు, ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండల పరిధిలోని పొట్లపూడి సమీపంలో కాలువకు ఇరువైపులా గోడ లేదు. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. కాలువ గోడ నిర్మించాలి. – శ్రీనివాసులు, స్థానికుడు

✓ పరిశీలించి గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.– రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం కోడూరు రోడ్డులో చింతోపు సమీపంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. వాహనదారులతో పాటు స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. – చంద్ర, స్థానికుడు

✓ స్థానికుల ఇబ్బందులు తొలగిస్తాం. – లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

కొమ్మలపూడి వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

**మనుబోలు, కోవూరు, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. మనుబోలు మండలంలోని కృష్ణపట్నం పోర్టు అడ్డరోడ్డు నుంచి బద్దెవోలు అడ్డరోడ్డు వరకు ఉన్న ఏడు కూడళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హైవే అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై రాకేశ్, సిబ్బంది ఉన్నారు. ● అతి వేగం అనర్థమని, వేగంగా వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. కోవూరు, కొడవలూరు మండలాల పరిధిలో జాతీయ రహదారిపై అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. హైవేపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి ఎస్పీకి తెలియజేస్తామన్నారు. ఆయన వెంట సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## పనిచేయని ప్లాంట్లు.. విద్యార్థులకు పాట్లు

పాఠశాలల్లో మూలనపడిన నీటి శుద్ధి యంత్రాలు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, వెంకటాచలం

గ్రామీణ ప్రాంతాల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల్లో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో చాలా చోట్ల సమస్య తీవ్రంగా ఉంది. తాగునీరు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ప్రభుత్వం పాఠశాలల్లో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. సురక్షిత నీరు చాలా చోట్ల విద్యార్థులకు అందడం లేదు. ఇంటి నుంచి సీసాల్లో తెచ్చుకుంటున్నారు. చాలా చోట్ల పాఠశాలలకు నీటి కనెక్షన్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొన్నినెలలుగా మరమ్మతులకు గురైనా బాగు చేసేందుకు చొరవ చూపడం లేదు. మండల, జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఇంటి నుంచి సీసాల్లో తాగునీరు తెచ్చుకున్న విద్యార్థులు

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా వాటిని బాగు చేసి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలున్నాయి. ● ఎంఈవో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పనిచేయని చోట మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### అధికారుల పర్యవేక్షణ లేక...

సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 357 ప్రాథమిక, 37 ప్రాథమికోన్నత, 27 ఉన్నత పాఠశాలలున్నాయి. 50 వేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఒక వైపు సీజనల్ వ్యాధులతో ఆసుపత్రులు కిక్కిరిస్తున్నాయి. శుద్ధిచేయని నీరు తాగడంతో అతిసారం వ్యాపించే అవకాశముంది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక పరిస్థితి భిన్నంగా ఉంది. రూ.లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసినా నిర్వహణ సరిగా లేక మూలనపడ్డాయి. ఎక్కువ మంది విద్యార్థులు ఇళ్ల నుంచి సీసాల్లో నీరు తెచ్చుకుంటున్నారు. మరమ్మతులకు గురైతే నిధులు లేక అలాగే వదిలేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్తు సౌకర్యం లేదు. తాగునీరు ఇవ్వాలంటే ఆర్వో ప్లాంట్లు పనిచేయాలి. విద్యుత్తు సరఫరా లేకుండా మోటార్లు పనిచేయవు. ఆర్వోప్లాంట్లు వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.10 వేల వరకు ఖర్చవుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

## ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం

మాట్లాడుతున్న జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్

**మర్రిపాడు, న్యూస్‌టుడే:** యాదవుల ఐక్యతను చాటుకోవాలని, సమాజంలో మంచి స్థాయిలో నిలవాలని జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్ అన్నారు. ఆదివారం మర్రిపాడులోని పీఎన్నార్ బృందావనంలో జిల్లా యాదవ ట్రస్టు భవన్ ఛైర్మన్ నాగకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వనభోజన కార్యక్రమానికి యాదవులు తరలివచ్చారు. వక్తలు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉద్యోగ రంగాల్లో యాదవులు మంచి గుర్తింపు సాధించాలని, సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ రమణయ్య, సాహో ఫౌండేషన్ అధినేత నాగేశ్వరరావు, ఆల్ఫా హేచరీస్ అధినేత సుధాకర్, బీసీ నాయకులు సుబ్రహ్మణ్యం, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు గ్రంథాలయాలు దోహదం

విడవలూరులో రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

**విడవలూరు, అనంతసాగరం, న్యూస్‌టుడే:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి నిరూప పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎన్జీవో శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత జీవిత లక్ష్య సాధనలో గ్రంథాలయాలు ఉపయోగపడతాయని అందుకు తానే నిదర్శనమని అనంతసాగరం ఎంఈవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. జాతీయ వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వసతి సంక్షేమాధికారి శ్రీనివాసులు, గ్రంథాలయాధికారి నారాయణరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే:** విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని బీసీ సంక్షేమశాఖ అధికారిణి శ్రీదేవి అన్నారు. పొదలకూరు రాంనగర్‌లోని బీసీ వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించిందన్నారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు. వసతి గృహంలోని సదుపాయాలు, మెనూపై తల్లిదండ్రుల పలు ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారిణి సుధారాణి, ఏఎన్ఎం అరుణ, ఆశావర్కర్ లక్ష్మీనరసమ్మ ఆమె వెంట ఉన్నారు.

మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారిణి శ్రీదేవి

## ఆత్మకూరులో త్వరలో స్పోర్ట్స్ స్టేడియం : ఆనం

**నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే:** ఆత్మకూరులో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న స్పోర్ట్స్ స్టేడియాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ రూ.1.80 కోట్లు మంజూరు చేయడంతో నెల్లూరులో ఆదివారం శాప్ అధికారులతో సమీక్షించారు. స్టేడియం మాస్టర్ ప్లాన్, అంచనాలు, టెండరు ప్రక్రియ అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం ప్రతిపాదించిన స్టేడియం త్వరలో ఏర్పాటవుతుందని వివరించారు.

## రాయితీలను సద్వినియోగం చేసుకోండి

పతకావిష్కరణ చేస్తున్న అధికారులు

**ఇందుకూరుపేట, న్యూస్‌టుడే:** ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రాయితీలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం ఛైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. సహకార సంఘాల వారోత్సవాల్లో భాగంగా ఇందుకూరుపేటలోని పీఏసీఎస్‌లో ఆదివారం పతకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతులను అభివృద్ధి చేసేందుకు సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సహకార అభివృద్ధి అధికారి గురప్ప, కమిటీ సభ్యులు చైతన్య, ప్రేమలత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సోమశిలకు 5,434 క్యూసెక్కుల వరద

**అనంతసాగరం, న్యూస్‌టుడే:** సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి 5,434 క్యూసెక్కుల వరద వచ్చిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 73.445 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 327.913 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 560, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 292 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే:** ఏఎస్‌పేట మండలం కావలిఎడవల్లి గ్రామంలో ఆదివారం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం చేపట్టారు. కంచర్ల శేషయ్య నాయుడు మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు అంకయ్యనాయుడు గ్రామానికి 200 వివిధ రకాల నీడ నిచ్చే మొక్కలు అందజేశారు. వాటిని సర్పంచి ధనమ్మ, సురేంద్ర, నాయకులు, స్థానికులు పాల్గొని నాటారు. సంగం- కలిగిరి ర.భ రోడ్డు నుంచి కావలిఎడవల్లి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, ట్రీ గార్డ్‌లను ఏర్పాటు చేశారు.

మొక్కలు నాటుతున్న స్థానికులు

## కదలని మురుగు

కోవూరు పట్టణ పరిధి సీహెచ్‌సీ గోడ వద్ద పంట కాలువలో చెత్త, వ్యర్థాలు వేయడంతో మురుగు కదలక దుర్వాసన వస్తోంది. దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. కాలువ మొత్తం పూర్తిగా పూడిక తీయించాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

## చెట్టెక్కిన నిఘానేత్రాలు



పొదలకూరు పట్టణ పరిధిలో నేరాలు అరికట్టేలా ప్రధాన రహదారుల వెంట, వివిధ కూడళ్ల, దేవాలయాలు, విద్యాసంస్థల వద్ద సుమారు 2 వేలకు పైగా నిఘానేత్రాలు ఏర్పాటు చేశారు. మనుబోలు రోడ్డులోని నిమ్మమార్కెట్ యార్డు సమీపంలో ఉన్న తాటిచెట్టుకు అమర్చడంతో పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. ఇనుప స్తంభం ఏర్పాటు చేసి దానికి అమరిస్తే శాశ్వతంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

## ప్రయాణికుల గోడు వినేదెవరు

పొదలకూరు-మనుబోలు మార్గంలోని పార్లపల్లి రోడ్డు పాయింట్ వద్ద నిర్మించి ఉన్న బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరింది. నాలుగు దశాబ్దాల క్రితం ప్రయాణికుల వసతి కోసం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గోడలు ధ్వంసమై స్లాబు పెచ్చులూడుతున్నాయి. వసతుల్లేక నిరుపయోగంగా ఉంది. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. అధికారులు స్పందించి ప్రయాణికులకు ఉపయోగపడేలా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

## దుర్వాసనతో సతమతం

కోవూరు పట్టణంలోని జంగం వీధిలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. రైల్వే ఫీడర్స్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వెళ్లే దారిలో పలుచోట్ల చెత్త, వ్యర్థాలు పేరుకు పోయాయి. దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని మండల అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పలువురు విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

## ఇలాగైతే చెత్త వేసేదెలా..!

కోవూరు పట్టణంలోని మైథిలీ థియేటర్ సమీపంలో ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన చెత్తకుండీ వినియోగంలో లేదు. ఇసుక, మట్టి వేయడంతో స్థానికులు చెత్త రోడ్డు పక్కన వేస్తున్నారు. పలుమార్లు పంచాయతీ, సచివాలయ సిబ్బందితో పాటు మండల అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

## అయ్యప్ప స్వాముల భజనలు

కోవూరులో..

**కోవూరు, న్యూస్‌టుడే:** కోవూరు పట్టణంలోని శివాలయంలో అయ్యప్ప స్వాముల భజనలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ ధరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తితో శరణు అయ్యప్ప అంటూ గీతాలు ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు..

## జాతీయ రహదారిపై ఆటోను ఢీకొన్న లారీ

ఒకరి పరిస్థితి విషమం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**మర్రిపాడు, న్యూస్‌టుడే:** ఆటోను లారీ ఢీకొట్టడంతో 12 మందికి గాయాలైన ఘటన మండలంలోని నందవరం కూడలి వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఆత్మకూరు మండలం బంటపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు జామాయిల్ మొక్కలు నాటేందుకు ఆటోలో దుత్తలూరు వైపు వెళుతున్నారు. నందవరం కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా నెల్లూరు నుంచి బద్వేల్ వైపు బూడిద లోడుతో వెళుతున్న లారీ ఒక్కసారిగా ఆటోను ఢీకొంది. ప్రయాణిస్తున్న వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎనిమిది మంది స్వల్పంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వేగాన్ని నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎంవీఐ రాములు పరిశీలించారు.

ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

నివాళులర్పిస్తున్న ఆశ్రమ సిబ్బంది

**ఇందుకూరుపేట, న్యూస్‌టుడే:** స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీ పోరాడిన తీరు మరువలేనిదని ఆశ్రమ కమిటీ సభ్యుడు దయాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గాంధీ విగ్రహానికి పట్టు వస్త్రాలు, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆశ్రమ స్థల దాత పొనకా కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా పల్లిపాడులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కనకమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమశిల డ్యాంలో సిబ్బంది కొరత

**అనంతసాగరం, న్యూస్‌టుడే:** సోమశిల ప్రాజెక్టులో సిబ్బంది కొరత అధికారులను వేధిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం జలాశయానికి చేరుతున్న సమయాల్లో డ్యాం క్రస్ట్‌గేట్లు ఆపరేటింగ్, ఇతర నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టులో పని చేస్తున్న అరకొర సిబ్బందిపై పనిభారం పెరగడంతో విధులు సక్రమంగా నిర్వహించలేక పోతున్నారు. గతంలో సోమశిల డ్యాంపై వివిధ పనుల కోసం 30 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహించేవారు. కాలానుగుణంగా సిబ్బంది పదవీ విరమణ, బదిలీల కారణంగా ప్రస్తుతం నలుగురు కొనసాగుతున్నారు. పని భారం మొత్తం ఆ నలుగురిపైనే పడడంతో నానా పాట్లు పడుతున్నారు. కనీసం జలాశయానికి వరద కొనసాగుతున్న సమయంలోనైన తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్టు అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందించినా పట్టించుకోవడం లేదు. డీఈఈ రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సోమశిల డ్యాంపై సిబ్బంది కొరత ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.

సోమశిల డ్యాంపై కానరాని సిబ్బంది

## ఆర్యవైశ్యుల అన్నాభిషేకం

**బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే:** బుచ్చి పరిధిలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద ఆర్యవైశ్యుల కార్తిక వనభోజనాలు, పరమేశ్వరుడికి అన్నాభిషేకం, గంగాహారతి కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. ఆదివారం పురపాలక ఛైర్‌పర్సన్ సుప్రజ పాల్గొని నిర్వాహకులను అభినందించారు. సురేష్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సుబ్బారావు, శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

దర్శించుకుంటున్న శాసనసభ్యులు శ్రీధర్‌రెడ్డి

**సంగం, న్యూస్‌టుడే:** పడమటిపాళెం గ్రామంలో వివిధ దేవతా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా వివిధ యాగాలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో విజయగణపతి, నాగేంద్ర స్వామి, మహాలక్ష్మమ్మ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సతీమణి సుజిత, సోదరుడు గిరిధర్‌రెడ్డితో కలసి స్వామి వార్లను దర్శించుకున్నారు. సర్పంచి బాలకృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

## దుకాణాలు ఆక్రమించారని ఫిర్యాదు

**తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే:** వ్యాపార దుకాణాలు ఆక్రమించారని, ఖాళీ చేయమంటే దౌర్జన్యం చేస్తున్నారని ఈదూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరిని తీసుకొచ్చి దాడికి యత్నిస్తున్నారని పేర్కొన్నారు. వారి నుంచి రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని కోరారు.

## చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

**కొడవలూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని తలమంచి వద్ద చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని ఎస్సై కోటిరెడ్డి కేసునమోదు చేశారు. ఆదివారం వ్యర్థాలు పూడ్చి వాహనం స్వాధీనం చేసుకున్నారు.

## విద్యుత్తు తీగల చోరీ

**పొదలకూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని ఆల్తుర్తిలో రైతుల పొలాల్లోని మోటార్లలోని స్టార్టర్లకు వచ్చే విద్యుత్తు రాగి తీగను శనివారం రాత్రి దొంగలు అపహరించారు. గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న నిమ్మతోటల్లో ఒకేసారి అయిదు చోట్ల చోరీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. పొలాల వద్ద సంచరిస్తున్న దొంగలపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

## బరిలో నిలిచి.. సత్తా చాటి

న్యూస్‌టుడే, మనుబోలు

వారంతా గ్రామీణ కుటుంబాలకు చెందిన వారు.. క్రీడల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే తపనతో చదువులో రాణిస్తూ ఆటల్లో పతకాల వేట సాగిస్తున్నారు. తమకిష్టమైన క్రీడలను ఎంచుకొని సాధన చేస్తున్నారు. మనుబోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని మంజువాణి తర్ఫీదులో స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ గేమ్స్‌లో సత్తా చాటుతున్నారు. కబడ్డీ, లాంగ్ జంప్, వాలీబాల్ క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి విజేతలుగా నిలుస్తున్నారు.

### కబడ్డీలో దిట్ట : మిథునశ్రీ

పిడూరు గ్రామానికి చెందిన రాఘవులు, హేమలత దంపతుల కుమార్తె మిథునశ్రీ ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల కష్టం తెలుసుకొని ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతోంది. కబడ్డీ పోటీల్లో డివిజన్, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. బాగా చదివి ఉపాధ్యాయిని కావాలని ఆకాంక్షిస్తోంది.

### వాలీబాల్‌లో ప్రతిభ చూపి : బాలాజీ

గోవిందరాజుపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు బాలాజీ. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ పదో తరగతి చదివిస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. వాలీబాల్ పోటీల్లో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. గతంలోనూ కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో సత్తా చాటాడు. భవిష్యత్తులో వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవడమే లక్ష్యమన్నారు.

### లాంగ్‌జంప్‌లో దూకుడు : దాకేశ్

మనుబోలు బీసీకాలనీకి చెందిన శివ, రమాదేవి దంపతుల కుమారుడు దాకేశ్ పదో తరగతి చదువుతున్నాడు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్-17 విభాగంలో జిల్లా స్థాయి లాంగ్ జంప్ పోటీల్లో సత్తాచాటాడు. డివిజన్ స్థాయిలో చదరంగం పోటీల్లోనూ రాణించాడు. ఉన్నత చదువులు చదివి నలుగురికి ఉపాధి కల్పిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు.

## రోగికి సాయం

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ముంబయి రహదారిపై చిరిగిన దుస్తులతో దుర్భరంగా ఉన్న మానసిక రోగికి సీఐ గంగాధర్ గమనించి నూతన దుస్తులు అందజేసి అల్పాహారం పెట్టించారు. వివరాలు ఆరా తీయగా కరీంనగర్‌కు చెందిన సుభానీగా తెలిపారు. మానసిక అనారోగ్యంతో ఏఎస్‌పేట దర్గా వద్ద కుటుంబ సభ్యులు వదిలివెళ్లారు. సుభానీని తన వాహనంలో ఏఎస్‌పేట దర్గాలోని సంరక్షకుని వద్ద వదిలారు.

## దుర్గంధమయం

కోవూరు పట్టణంలోని శివాలయం వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. కార్తిక మాసం కావడంతో శివాలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

(c) eenadu

# నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

## ట్రాఫిక్ సమస్యలా!

'ఈనాడు' మీకు తోడులో సీఐలతో రేపు ఫోన్ ఇన్

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఎక్కడ పడితే అక్కడ వాహనాల నిలిపివేత. ఆటోవాలాల ఇష్టారాజ్యం.. దీంతో ట్రాఫిక్ స్తంభన. ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి నగరంలోని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లతో 'ఈనాడు' మీతోడులో ఫోన్ ఇన్ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తోంది. ఇందులో మీరు ఎదుర్కొంటున్న సమస్యలు చెబితే చాలు.. వారు సమాధానాలు చెబుతారు.

**తేదీ: 18-11-25, మంగళవారం**
**సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల మధ్యలో ఫోన్ చేసి సమస్య చెబితే చాలు.**

**నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ - కె.రామకృష్ణ - 94407 00095**
**సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ - వెంకటరెడ్డి - 94407 96374**

## సేవా కార్యక్రమాలు అభినందనీయం

**నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే:** నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు తెలిపారు. ఆదివారం వనంతోపు సెంటరులోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో నెల్లూరు స్పెషల్ బ్రాంచి సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సతీమణి విజయలక్ష్మి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీ సాంబశివరావు, అరవ పరిమళ, మల్లికార్జున, గిరి పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

**సమస్య:** హరనాథపురం రెండో వీధిలోని రామాలయం మందిరం ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. –వరలక్ష్మి, స్థానికురాలు

? కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? అంబేడ్కర్‌నగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – శ్రావ్య, స్థానికురాలు

**సమాధానం:** కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

## నేటి నుంచి ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి మూసివేత

బస్టాండు వద్ద పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే:** మరమ్మతులు చేస్తున్నందున సోమవారం నుంచి 45 రోజుల పాటు ఆత్మకూరు బస్టాండు వంతెన, అండర్ బ్రిడ్జి మూసివేయనున్నారు. దీంతో అటు వైపు రాకపోకలు సాగించే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. బుచ్చి, కోవూరు నుంచి వచ్చే వాహనాలు నూతన పెన్నా వంతెన మీదుగా రంగనాయకులపేట వైపు లేదా పోతిరెడ్డిపాలెం వద్ద పెన్నాబ్యారేజీ మీదుగా వెళ్లవచ్చు. నవాబుపేట, స్టోన్‌హౌస్‌పేట, బాలాజీ నగర్ నుంచి సంతపేట, గాంధీబొమ్మ వైపు వెళ్లాల్సిన వాటిని విజయమహల్ గేటు వైపు నుంచి లేదా రామలింగాపురం వైపు నుంచి మళ్లించారు. కనకమహల్ వైపు నుంచి కోవూరు, బుచ్చి వైపు వెళ్లే వాహనాలు ఆత్మకూరు బస్టాండు అండర్ బ్రిడ్జి మీదుగా వెళ్లవచ్చు. మినీబైపాసు రోడ్డు నుంచి కోవూరు వైపు వెళ్లే వాహనాలు ప్లైఓవరు మీదుగా కాకుండా కింద సర్వీసు రోడ్డు మీదుగా వెళ్లవచ్చు. వంతెనపై 28 బ్లాకులు ఉన్నాయి. ఒక్కో బ్లాకు మరమ్మతులు ఒక రోజు పడుతుంది. ఈ మార్పును వాహనదారులు గుర్తించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## హౌసింగ్ బోర్డు కాలనీలో పార్కు ప్రారంభం

**నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే:** నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.24 లక్షలతో నిర్మించిన పార్కును తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 28వ డివిజన్‌లో రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. 26వ డివిజన్‌లో 17 ఎకరాల ప్రభుత్వ భూమికి రూ.6.70 లక్షలతో ప్రహరీ నిర్మించి, రూ.300 కోట్ల విలువైన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పలువురు పాల్గొన్నారు.

## శునకమా..కరవకుమా!

### గుంపులుగా దండయాత్ర
### నగరవాసుల బెంబేలు

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

'ప్రధాన రహదారులు, కూడళ్లు, విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు తదితర జనసమ్మర్థ ప్రదేశాల్లో కుక్కలు కనిపించకుండా చూడాలి.. వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించాలి.' **ఇవి ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు.**

సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా.. నగరంలో శునకాల నియంత్రణ చర్యలు కానరావడం లేదు. ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. ఎంతోమంది వీటి బారిన పడి ఆసుపత్రులపాలవుతున్నారు. రోజుకు సగటున 20 మంది వీటి కాటుకు గురవుతున్నా నివారణ చర్యలు అంతంతమాత్రమే. వీటికి సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు, టీకా పేరుతో ఏడాదికి రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు నగరపాలకసంస్థ బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్నా క్షేత్రస్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. నగరంలో 54 డివిజన్లు ఉన్నాయి. 1.50 లక్షల ఇళ్లు ఉండగా.. 10 లక్షల మంది నివాసం ఉంటున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శస్త్రచికిత్సల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో 17 వేల వరకు ఉన్నట్లు అధికారుల వద్ద లెక్కలు ఉన్నాయి. వాస్తవానికి 40 వేలకు పైగా ఉన్నట్లు సమాచారం.

నగరంలో ఇలా గుంపుగా..

**శస్త్రచికిత్స చేశామని చెబుతున్నా..**

● గతంలో పట్టుకున్న కుక్కలకు చికిత్స అనంతరం చెవికి క్లిప్పు వేసే వారు. ప్రస్తుతం వాటి చెవులను కొద్దిగా కత్తిరిస్తున్నారు. అలా కోసిన శునకాలు ఎక్కడా కనిపించడం లేదు. ● కు.ని. చికిత్స చేసి యాంటీ రేబిస్ టీకాలు వేయాల్సి ఉంది. అనంతరం అయిదు రోజుల పాటు నియంత్రలో ఉంచాలి. వీటికి ఆహారం, చికిత్సకు అయ్యే ఖర్చు కలిపి ఒక్కో దానికి రూ.1500 కేటాయించారు. ● శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితుల సంఖ్య తగ్గాల్సి ఉండగా.. మరింత ఎక్కువవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ఒంటరిగా రావాలంటే భయమేస్తోంది – ఖలీద్**

వీధుల్లోకి రావాలంటే భయమేస్తోంది. రాత్రి పూట గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

**నియంత్రణకు చర్యలు**

– డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

నగరంలో కుక్కల నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. ఏబీసీ కేంద్రంలో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. ఫిర్యాదులు అందిన వెంటనే పట్టిస్తున్నాం.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా ధ్వజారోహణ

**నెల్లూరు (జడ్పీ):** నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మండల పూజకు ధ్వజారోహణ కార్యక్రమం వేడుకగా జరిగింది. మంగళ వాయిద్యాలు, అయ్యప్ప శరణ ఘోష మధ్య కేరళ సంప్రదాయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలుగా కిషోర్‌రెడ్డి, శరణమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రక్షణ గోడ శిథిలం.. కూలితే ప్రమాదం

నగరంలోని పరమేశ్వరి నగర్ అయిదో వీధిలో కాలువపై ఉన్న కల్వర్టు రక్షణ గోడ ప్రమాదకరంగా తయారైంది. గతంలో సాగునీరు ప్రవహించేది. ప్రస్తుతం మురుగుకాలువగా మారింది. దీనిపై ఉన్న కల్వర్టు గోడ శిథిలమై పగుళ్లిచ్చింది. పడిపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. – న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

### రోడ్డుపై ఇసుక.. వాహనదారుల బేజారు

నెల్లూరు-పొట్టేపాలెం రోడ్డుకు ఇరువైపులా ఇసుక పేరుకుపోయింది. పెన్నా నది నుంచి నిత్యం వందల ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నాయి. ట్రక్కు పరిమితికి మించి నింపడంతో ఇసుక రోడ్డుపై పడుతుంది. దీని కారణంగా ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడి గాయపడుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

### పైపులైనుకు రంధ్రం.. తాగునీరు వృథా

నగరంలోని కోటమిట్ల మెక్లిన్స్ రోడ్డులో మినీ ఫంక్షన్ హాలు ప్రాంతంలో తాగునీటి పైపులైనుకు రంధ్రం పడింది. ప్రధాన పైపులైను కావడంతో నిత్యం వేలాది లీటర్ల నీరు రోడ్డు పాలవుతోంది. ఈ వీధి బురదమయంగా మారుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

### సిమెంట్ రహదారుల ధ్వంసం

నగరంలో సిమెంట్ రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్, ఫత్తేఖాన్‌పేట మెయిన్ రోడ్డు, బృందావనం తదితర ప్రాంతాల్లో తవ్వేశారు. ప్రైవేటు కంపెనీలు భూ గర్భంలో తీగల ఏర్పాటుకు, పబ్లిక్ హెల్త్ శాఖ వారు పైపులైన్ల కోసం ధ్వంసం చేశారు. తిరిగి పూడ్చకుండా మట్టిపోసి వదిలేశారు. –న్యూస్‌టుడే, నెల్లూరు (జడ్పీ)

### పూడిక తీయక.. మురుగు కదలక

నగరంలోని రవీంద్రనగర్‌లో కాలువలు దుర్గంధ భరితంగా ఉన్నాయి. పిచ్చిమొక్కలు మొలిచి, వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగునీరు ముందుకు కదలక దుర్వాసన వస్తోంది. వీటి వల్ల దోమల సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

## కలుజులపై వంతెనల నిర్మాణానికి కృషి: ఎమ్మెల్యే

**నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే:** రూరల్ మండలంలోని పొట్టేపాలెం, ములుమూడిలో కలుజులపై వంతెనల నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ములుమూడి గ్రామంలో ఆదివారం చంద్రన్న విద్యుత్తు వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, అచ్యుత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రదీప్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న విద్యుత్తు వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

## ఆటోనగర్.. సమస్యల మోత

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నగరంలోని ఆటోనగర్‌లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఈప్రాంతంలో వాహనాలకు మరమ్మతులు చేసే దుకాణాలెన్నో ఉన్నాయి. దీంతో నిత్యం ఈప్రాంతం రద్దీగా ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో వాహనాల మరమ్మతులు చేయించుకోవడానికి వస్తుంటారు. వీరందరికీ సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి తొలగించకపోవడంతో కొండల్లా పేరుకుపోతున్నాయి. మురుగునీరు నిల్వలతో కాలువలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. కొంత కాలం క్రితం పలు వీధుల్లో రోడ్ల నిర్మాణాలు చేశారు. ఇవి గుంతలు పడడంతో వీటిపై నడిచేందుకు ఈప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు కూడా సరిగా వెలగడం లేదు. రాత్రిళ్లు అంధకారంలో ఇళ్లలో నుంచి బయటకు రాలేకున్నామని వాపోతున్నారు. వర్షం కురిస్తే వీధుల్లోని గుంతల్లో నీరు చేరడంతో నడిచేందుకు కష్టంగా మారుతుంది. రాత్రిళ్లు ద్విచక్ర వాహనదారులు వీటిలో పడిపోతున్నారు. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వీధిలో పేరుకుపోయిన చెత్త

**ఏ వీధి చూసినా..**

– కళ్యాణ్ కుమార్, మెకానిక్

ఏ వీధిలో చూసినా గుంతలే. కనీసం వీటిలో చారెడు మట్టి కూడా పోయలేదు. వీటి కారణంగా ఎక్కడ పడిపోతామోనని భయమేస్తోంది. అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు పడుతున్నాం. దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయి.

**పారిశుద్ధ్యం ఘోరంగా ఉంది**

– ఖాదర్ బాషా, వ్యాపారి

వీధులన్నీ చెత్తకుప్పలతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీనికితోడు కాలువల్లో పూడిక చేరడంతో మురుగునీరు ఎక్కడిదక్కడ నిలిచిపోతుంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

## కమనీయం.. మూలస్థానేశ్వరుడి కల్యాణం

**నెల్లూరు(మార్కెట్ సెంటర్):** కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కల్యాణం కమనీయంగా జరిగింది. వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సత్యనారాయణ, పూర్ణిమ దంపతులు వ్యవహరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు (జడ్పీ) :** నగరంలోని మూలాపేటలో ఉన్న శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. కలశాలతో ప్రధాన అర్చకులు శివస్వామి, పండితులు ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ప్రాకారోత్సవం జరిగింది. ఈవో ఎ.వి.శ్రీనివాసులరెడ్డి, మాజీ ఈవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుప్పట్ల పండగ

**నెల్లూరు,(జడ్పీ)న్యూస్‌టుడే:** నగరంలోని మూలాపేటలో భగవాన్ వెంకయ్య స్వామి పేరుతో ఆదివారం దుప్పట్ల పండగ ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు పది వేల మందికి పైగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని హైకోర్టు న్యాయవాది చంద్ర, హైదరాబాద్‌కు చెందిన పెంచలయ్య, ఆశ్రమ నిర్వాహకులు మాకాని గోపి, విద్యుత్తు శాఖ మాజీ అధికారి ధనుంజయ్య తదితరులు ప్రారంభించారు. ముందుగా ఆశ్రమ సేవకురాలు దివంగత లతకు నివాళులర్పించారు. వెంకయ్య స్వామి శిష్యులు, గురునిలయం భక్తులు సేవలు అందించారు.


## జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి **M.సత్యనారాయణ** గారి కుమారుడు **M.V.ప్రసాద్** గారికి పూర్తి హక్కు అనుభవం కలదని చెప్పుచూ నా కక్షిదారునికి అమ్మచూపినారు. ఈ ఆస్తి మీద **The Citizen Co-Operative Society Ltd.** వారికి గల తనఖా తప్ప ఇతర అన్యాక్రాంతములు లేవని చెప్పుచున్నారు. ఈ ఆస్తి మీద సదరు **M.V.ప్రసాద్** గారికి గల హక్కు అనుభవములు గురించి ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు, క్లెయిములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల నాకు వ్రాతమూలకముగా తెలుపుకొనవలసినది. లేనిచో ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి, నా కక్షిదారుడు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయగలరు.

**ఆస్తి షెడ్యూలు**

Sri Potti Sreeramulu Nellore Registration District, Stonehousepet, Sub-Registration, Nellore Municipal Corporation Limits, Nellore Bit-II, Kodandarama puram area, Survey Nos. 551, 554, Plot No: 22 an extent of 43 ankanams of site, Plot No. 23 an extent of 46 ankanams of site and Plot No. 27 an extent of 36 ankanams of site. Total an extent of 125 ankanams of site or 1000 sq.yds of site having **SACHIVALAYAM** previously Kalyanamandapam kodandaramapuram area A.C.Nagar therein within the following boundaries:- **East:** Plot No.29 of Bijjam Krishna Reddy abutting own compound wall of this building, **South:** Irrigation Channel abutting own compound wall of this building, **West:** Road, **North:** Road.

ఇట్లు : కొండూరు శేషారెడ్డి B.Com., B.L., అడ్వకేటు, బాలాజీనగర్, నెల్లూరు.Cell: 94402 77290


## అండర్‌పాస్ నిర్మించాలి

**నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే :** చింతారెడ్డిపాలెం కూడలిలో జాతీయ రహదారిపై వెంటనే అండర్ పాస్ నిర్మించాలని సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అండర్ పాస్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన కోసం సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని ఆరోపించారు. ఇక్కడ ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, వామపక్షాల నాయకులు కాయం శ్రీనివాసులు, సతీష్, మాదాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న కార్యదర్శి కుమార్‌రాజా

## పుస్తక పఠనంతో విజ్ఞానం

**నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే:** పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా అన్నారు. వారోత్సవాల్లో భాగంగా నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరు నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ తదితరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. రిటైర్డు తహసీల్దార్, రచయిత పొట్లూరి సుబ్రమణ్యం, విశ్రాంత గ్రంథాలయ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురు నేరస్థులపై పీడీ యాక్టు

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** తరచూ నేరాలకు పాల్పడే ఆరుగురిపై పీడీ యాక్టు (ముందస్తు నిర్బంధం) అమలు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. ఆదివారం పోలీసు అతిథిగృహంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'జిల్లా చరిత్రలో మొదటిసారి ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేశామని, బాలికలపై వేధింపులకు పాల్పడుతున్న 160 మందిపై అనుమానిత షీట్లు తెరిచామన్నారు. గంజాయి రవాణా, భూకబ్జాలకు పాల్పడే వారిపైనా అమలు చేయనున్నట్లు తెలిపారు. పీడీ యాక్టు పెట్టిన వారిలో గూడూరు మండలం చవటపాలేనికి చెందిన షేక్ కాలేషా, గూడూరు పట్టణం అరుంధతీయపాలేనికి చెందిన కనుపూరు శ్రీహరి, తిరుపతి కొర్లగుంట కొత్తపల్లికి చెందిన సయ్యద్ అజీమ్, చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం కమ్మపల్లికి చెందిన వట్టికుంట అరుణ్‌కుమార్, నెల్లూరులోని జనార్దనరెడ్డి కాలనీకి చెందిన మీధూరి సునీల్, సూళ్లూరుపేటకు చెందిన ప్రసన్నకుమార్ ఉన్నారు

## రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

**నెల్లూరు (నేర విభాగం):** నగరంలోని నర్తకి సెంటరులోని ఓ కాంప్లెక్స్‌లో ఉన్న ది క్రీమి స్పాట్ రెస్టారెంట్‌లో ఆదివారం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. వాహనంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. హోటల్‌లోని ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ రెస్క్యూలో లీడింగ్ ఫైర్‌మెన్లు బి.శివసాయి కుమార్, టి.శ్రీనివాసులు, ఫైర్‌మెన్ రవి, డ్రైవరు నరహరి పాల్గొన్నారు.

కాలిపోయిన ఫర్నీచర్

**ఎం.1 సినిమాస్.:** స్క్రీన్.1 శివ(తెలుగు), నువ్వు వస్తానంటే నేనొద్దంటానా (తెలుగు) స్క్రీన్ .2. కాంత(తెలుగు)స్క్రీన్..3.ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), నువ్వు వస్తానంటే నేనొద్దంటానా (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్ 1..దేదే ప్యార్ దే 2 (హిందీ) స్క్రీన్ 2. .ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), సీత ప్రయాణం కృష్ణతో, (తెలుగు)స్పైడర్ మా 2 ( ఇంగ్లిష్ )స్క్రీన్ 3..జిగ్రీస్ (తెలుగు), ది రన్నింగ్ మాన్ (ఇంగ్లిష్) స్క్రీన్.4..శివ (తెలుగు) స్క్రీన్.5 కాంత (తెలుగు) **రెయిన్ సినిమా;** స్క్రీన్..1. కాంత (తెలుగు) స్క్రీన్..2.. ది గర్ల్ ఫ్రెండ్ (తెలుగు), ది రన్నింగ్ మ్యాన్ ( ఇంగ్లిష్ ) స్క్రీన్..3. శివ (తెలుగు ) .దేదే ప్యార్ దే 2 (హిందీ) స్క్రీన్. .4..సంతాన ప్రాప్తిరస్తు (తెలుగు), దేదే ప్యార్ దే 2 (హిందీ), జిగ్రీస్ (తెలుగు)


## మనుమసిద్ధినగర్.. కష్టాలతో బేజార్

న్యూస్‌టుడే, నెల్లూరు (మార్కెట్ సెంటర్)

నగరంలోని మనుమసిద్ధినగర్ సమస్యలమయంగా తయారైంది. పలు రహదారులు నడిచేందుకు కూడా వీల్లేని విధంగా మారాయి. ప్రధాన రహదారి మాత్రమే సిమెంట్ రోడ్డు కాగా మిగతావన్నీ మట్టిరోడ్లు కావడంతో అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతం ముంపునకు గురైంది. వర్షాలు తగ్గి రోజులు గడుస్తున్నా ఇంకా కొన్ని వీధులు నీటిలోనే నానుతున్నాయి. రోజుల తరబడి నిల్వ ఉంటున్న నీరు పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు ఉద్ధృతమవుతున్నాయి. ఈ ప్రాంతంలోని సాయినగర్, ఎంపీనగర్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు మురుగునీటిలో నడవలేక అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు, బురదతో నిండిన రోడ్లపై వెళ్లలేక ఇతర మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇక్కడ ఖాళీ స్థలాలన్నీ వర్షం, మురుగునీటితో నిండి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో తుంగ, పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో రోడ్లపై రావాలంటేనే భయంభయంగా ఉందని చెబుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి దయనీయంగా ఉంటుందని వాపోతున్నారు. ముంపునకు గురైనప్పుడు హడావుడి చేసే ప్రజాప్రతినిధులు, అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై నీరు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మనుమసిద్ధినగర్ ప్రాంతంలో నీటితో నిండిన రహదారి

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే:** ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన వైనమిది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా సోంపేట ప్రాంతానికి చెందిన ధనలక్ష్మి (31) తిరుపతి జిల్లా శ్రీసిటీలో పనిచేస్తూ అక్కడే పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్‌ని ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండు వారాల క్రితం నెల్లూరు దర్గామిట్టలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు వచ్చారు. హోటల్ వెనుక ఓ అపార్టుమెంటులో ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. అప్పుల బాధలు భరించలేక ధనలక్ష్మి ఈ నెల 10న కొండాయపాలెం వద్ద తలకు రాసే నూనె తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో భర్త చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు తల్లి జోగమ్మ ఆదివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

శత వసంత సత్యసాయి

★ ఇంటింటా దీపం వెలిగిస్తే వీధికంతా వెలుగే..

★ బుద్ధిజీవుల్ని ప్రేమించండి.. కానీ మూర్ఖులను ద్వేషించకండి



విరాజిల్లుతున్న చిత్రావతి పరిసరాలు

## విద్యుత్తు కాంతుల్లో ఆధ్యాత్మిక కేంద్రం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** సత్యసాయి శత జయంతి వేడుకలు తిలకించడానికి భక్తజనం పుట్టపర్తికి తరలివస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంలోకి ప్రవేశించగానే భక్తిభావం ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్తు కాంతుల్లో పుట్టపర్తి పరిసర ప్రాంతాలు విరాజిల్లుతున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. ఆయా ప్రాంతాల్లో పర్యవేక్షణకు వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను నియమించారు.

● వేడుకల్లో భాగంగా ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఆదివారం కలెక్టరేట్లో ఆయన మాట్లాడుతూ 19న ప్రధాని మోదీ, 22న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, 19న ముఖ్యమంత్రి చంద్రబాబు, 18న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రానున్నట్లు తెలిపారు.

● తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు 'సాయి100' యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న అంజాద్ ఆలీ ఖాన్ బృందం

## సాయికీర్తనం.. భక్త పరవశం

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** సరోద్ వాయిద్య సంగీత కారుడు అంజాద్ ఆలీఖాన్ ఆలపించిన సంగీతగానంతో ప్రశాంతినిలయం ప్రతిధ్వనించింది. ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్ మందిరంలో ఆలీఖాన్ కచేరీ నిర్వహించారు. సాయి గీతాలాపనతో మందిరం మార్మోగింది. అనంతరం అలీఖాన్ బృందాన్ని ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సత్కరించారు.

## పరిహారం ఇవ్వక.. లీజు సొమ్ము అందక

**ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే ముదిగుబ్బ, బుక్కపట్నం:** తమ ప్రాంతంలో పెద్ద జలాశయం వస్తుందని సంబరపడిపోయారు. తాము కొంత త్యాగంచేస్తే ఇతర రైతులకూ మేలు జరుగుతుందని తలంచారు. తమ కున్నది కొంతే అయినా ప్రజాప్రయోజనం ఆశించి భూమిని ఇచ్చేశారు. లీజు పేరుతో తీసుకొన్న పొలంలో అధికారులు కట్ట నిర్మించేశారు. అయినా నేటికీ ప్రాజెక్టు పూర్తవ లేదు. దీంతో జిల్లేడు బండ జలాశయ నిర్వాసితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులు రూ.680 కోట్లతో 2021, డిసెంబరులో ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన గుత్తేదారు సంస్థ పనులను దక్కించుకుంది. ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లితండా, బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామాలకు చెందిన 30ఎకరాల భూములు కట్ట నిర్మించే ప్రాంతంలో ఉన్నాయి. అందులో వేరుసెనగ, చీనీ, మామిడి ఇతరత్రా పంటలు సాగులో ఉన్నాయి. భూములు లీజుకిస్తే ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున చెల్లిస్తామని, ముంపు భూములన్నింటికీ పరిహారం వచ్చినప్పుడు మీకు కూడా ఇస్తామని గుత్తేదారు చెప్పారు. ఈమేరకు రైతులతో అగ్రిమెంటు తీసుకుని భూములను తీసుకున్నారు. పంటపొలాలన్నీ తొలగించి ఆ ప్రాంతమంతా మట్టితో కప్పి 7.92 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించారు.

### కొందరికే...

### ■ అయోమయంలో రైతులు

అగ్రిమెంటు ప్రకారం మూడేళ్ల రైతుల ఖాతాల్లో లీజు నగదు జమ చేశారు. తర్వాత కొందరికి జమ కాలేదు. జలాశయ ముందు భాగంలో కట్ట నిర్మాణానికి ఖర్చయిన సుమారు రూ.వందకోట్ల వరకు బిల్లులను గుత్తేదారు పూర్తి చేసుకున్నారు. పరిహారంపై వైకాపా ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనక్కివెళ్లిపోయారు. ఇప్పుడు రైతులకు లీజు డబ్బులు, పరిహారం చెల్లించలేదు. తిరిగి సాగు చేసుకుందామంటే భూములన్నీ కట్టనిర్మాణంలో కలిసిపోయాయి.

పూర్తయిన జిల్లేడుబండ కట్ట

★ ఇటీవల రైతులు.. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించేలా అధికారులను పంపుతామని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

### అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం

**- శైలేష్, ఏఈ, నీటిపారుదల శాఖ**

భూములు కోల్పోయినవారికి లీజు ప్రకారం గుత్తేదారు ఏటా నగదు చెల్లిస్తున్నారు. జలాశయం ముంపు భూములకు పరిహారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాము. త్వరలోనే పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటాం

## కనకదాస జీవితం ఆదర్శనీయం

**హిందూపురం, న్యూస్‌టుడే:** కురుబ సామాజిక వర్గానికి దైవంగా నిలిచిన కనకదాస జీవితం ఆదర్శనీయమని ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి అన్నారు. ఆదివారం హిందూపురంలో కనకదాస జయంతి వేడుకల్లో భాగంగా వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బీసీలను అక్కున చేర్చుకొన్న ఘనత తెదేపాకు దక్కుతుందన్నారు. ప్రస్తుతం కురుబ సామాజిక వర్గానికి చెందిన వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారం అని మంత్రి సవిత అన్నారు. కాపరులకు, గొర్రెలకు బీమా సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ర్యాలీలో తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యదర్శి బాలాజీ, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, చిత్రంలో మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి తదితరులు

### ప్రపంచం గుర్తించేలా పురం అభివృద్ధి చేస్తా ..

ప్రపంచం గుర్తించేలా హిందూపురాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. రూ.92.50 కోట్లతో పట్టణంలో చేపట్టే మౌలిక సదుపాయాల పనుల పైలాన్‌ను బాలాజీ కూడలిలో ఆయన ఆవిష్కరించారు. హిందూపురం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు రాష్ట్ర మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారని, నియోజకవర్గానికి త్వరలో పరిశ్రమలు వస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, కమిషనర్ మల్లికార్జున, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వంతెన పూర్తి.. అవస్థలకు స్వస్తి

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** మండలంలోని గంగిరెడ్డిపల్లి- కొడవండ్లపల్లి మధ్య వంతెన నిర్మాణం పూర్తికావడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. 2021లో తుపాను కారణంగా మద్దిలేరువాగు ఉద్ధృతికి వంతెన ధ్వంసం కావడంతో నాలుగేళ్లుగా ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. దీనిపై 'ఈనాడు'లో 'వంతెన వెతలు తీరేదెన్నడో', 'అడుగడుగునా నిర్లక్ష్యం..గతితప్పిన లక్ష్యం', 'వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఆగిన వంతెన నిర్మాణం', శీర్షికలతో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.2.97 కోట్లతో వంతెన నిర్మించింది. రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఈనాడు కథనానికి స్పందన

## జల వాహిని.. హరిత హాసిని

నిండుకుండలా జలాశయం.. దాని మధ్యలో రెండెకరాల విస్తీర్ణంలో ద్వీపం.. అక్కడ పచ్చదనం.. ఈ అందాలన్నీ ముదిగుబ్బ మండలం యోగి వేమన డ్యాం వద్ద సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. 2,000 సంవత్సరంలో ప్రారంభించిన ఈ జలాశయ సామర్థ్యం ఒక టీఎంసీ. డ్యాంలో నీటినిల్వ 0.98 టీఎంసీ దాటితే దిగువకు విడుదల చేస్తారు. ఎల్లప్పుడూ 20 అడుగుల మేర నీటిని నిల్వ చేయడంతో జలాశయం కళకళలాడుతోంది. వారాంతపు సెలవులు, పండగల రోజుల్లో పర్యాటకులు డ్యాం వద్దకు వచ్చి సందడి చేస్తారు. ఇక్కడ బోటింగ్, రిసార్ట్ ఏర్పాటు చేస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుంది.

**- ఈనాడు అనంతపురం, న్యూస్‌టుడే-ముదిగుబ్బ**

స్టేడియంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

## ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టపర్తి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య కమిషనర్, పర్యటన సమన్వయాధికారి వీరపాండ్యన్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఆదివారం ప్రధాని పర్యటనకు సంబంధించిన సత్యసాయి విమానాశ్రయం, ప్రశాంతి నిలయం, హిల్‌వ్యూస్టేడియాన్ని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ప్రధాని పర్యటించే ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ మౌర్యభరద్వాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 580 కామన్ సర్వీస్ సెంటర్లతో అతివలకు ఆర్థిక దన్ను

■ ఉమ్మడి అనంతలో ప్రయోగాత్మకం ■ నెలకు రూ.30 వేల వరకు పొందే వీలు

**అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే:** మహిళలను లక్ష్యాధికారులు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు డిజి-లక్ష్మి కామన్ డిజిటల్ సేవల ద్వారా ఆర్థిక భరోసా కల్పించనుంది. డిజిటల్ రంగంలో సేవల ద్వారా ఉపాధికి దన్నుగా నిలవనుంది. అర్హులైన, విద్యావంతులైన మహిళలను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా నగర, పట్టణాల్లో గుర్తించి వారే సేవా కేంద్రాలను నిర్వహించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలికల్లో 580 కేంద్రాల్లో కామన్ సర్వీసు సెంటర్లుగా ఏర్పాటు చేయనున్నారు.

### ఇబ్బందులు తొలగిపోయేలా...

**శ్రీసత్యసాయి జిల్లాలో**

| ప్రాంతం | సర్వీసు కేంద్రాలు |
|---|---|
| ధర్మవరం | 63 |
| హిందూపురం | 78 |
| కదిరి | 43 |
| మడకశిర | 15 |
| పుట్టపర్తి | 23 |
| పెనుకొండ | 20 |

అనంతపురం నగరంలో ముందుగా ఒక కేంద్రాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించబోతున్నారు. అశోక్‌నగర్‌లో హరిహర దేవాలయం వెనుక వైపున సచివాలయం 39 ముందు భాగాన ఏర్పాటు చేయబోతున్నారు. ప్రభుత్వం అందించిన డిజి-లక్ష్మి ఆన్‌లైన్ సేవలకు సంబంధించి ప్రత్యేకంగా తయారు చేసి పంపిన కామన్ సర్వీసు సెంటరు సిద్ధం చేశారు. గతంలో ధ్రువపత్రాలు, ఇతర ఆన్‌లైన్ సేవలకు మీ సేవా కేంద్రాల ద్వారా జాప్యం అయ్యేది. ప్రభుత్వం ఆధీనంలోనే కామన్ సర్వీసు సెంటర్లు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని నిర్ణయించారు.

అనంతపురంలో ప్రారంభానికి సిద్ధం చేసిన కామన్ సర్వీసు సెంటరు

### ముంగిట్లోనే సేవలు

● కామన్ సర్వీసు సెంటర్లలో 250 సేవలు అందివ్వనున్నారు. సేవలు అందించినందుకు రుసుం చెల్లిస్తుండటంతో ఆర్థికంగా నెలకు కనీసం రూ.30 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది.

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వం నుంచి పౌరులకు సేవలు, బీ2బి సర్వీసెస్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, రుణాలు, బీమా, పెట్టుబడులు, చెల్లింపులు తదితరాలు, వ్యవసాయం, ఆరోగ్య సేవలు, చట్టపర సేవలు, పట్టణ ఇ-స్టోర్, పర్యటనలు, ప్రయాణం, ఇ-మొబిలిటీ, నైపుణ్యాభివృద్ధి, విద్య, ఇతర సర్వీసులు కామన్ సెంటర్ల ద్వారా అందజేస్తారు.

## మ్యుటేషన్ మాయాజాలం

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** భూ సమస్యలు పరిష్కరించాల్సిన కొందరు గ్రామరెవెన్యూ అధికారులు (వీఆర్‌ఓ) వ్యక్తిగత స్వార్థంతో సమస్యను జఠిలం చేస్తున్నారు. మ్యుటేషన్ల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అర్హులైన రైతులను వ్యయప్రయాసలకు గురి చేస్తున్నారు. అవినీతికి పాల్పడుతూ హక్కుపత్రాలు, రికార్డులను పరిశీలించకుండా అనర్హులకు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు.. వాటిని ఆన్‌లైన్ చేస్తున్నారు. తమ భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరిట ఉన్నట్లు తెలుసుకుంటున్న రైతులు అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు కోర్టును ఆశ్రయించాల్సి వస్తోంది.

### మరొకరికి 15 సెంట్లు

ఓరువాయిలో రంగస్వామికి 1.70 సెంట్ల భూమి ఉంది. వీఆర్‌ఓ, గతంలో పనిచేసిన తహసీల్దార్... 15 సెంట్లు మరొకరి పేరిట పట్టాదారుపుస్తకం ఇచ్చి ఆన్‌లైన్‌లో చేర్చారు. విషయం తెలుసుకున్న బాధితుడు తనకు అన్యాయం చేయవద్దని అధికారులను వేడుకున్నారు. స్పందించకపోవడంతో ఆగస్టులో కార్యాలయ ఆవరణలోనే ఆత్మహత్యాయత్నం చేశారు.

### తొలగించి.. తాఖీదు ఇచ్చి

సైదాపురంలోని సర్వేనంబరు 180-1లో రైతు రాజేశ్ కుటుంబానికి 0.46 ఎకరాల భూమి పిత్రార్జితంగా సంక్రమించింది. రాజేశ్ పేరిట పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసి ఆన్‌లైన్‌లో చేర్చారు. ఇదే సర్వేనంబరులో భూమి కలిగిన రైతులు ఫిర్యాదు చేశారని ఆన్‌లైన్ నుంచి తొలగిస్తూ రాజేష్‌కు నోటీసు ఇచ్చారు. పెద్దల నుంచి సంక్రమించిన హక్కుపత్రాలను వీఆర్‌ఓకు సమర్పించినా తొలగించారు.

### ఉన్నతాధికారులు ఆదేశించినా..

కదిరి మండలం ముత్యాలచెరువు రెవెన్యూ గ్రామం పరిధిలోని యాకాలచెరువుకొత్తపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి పెద్దల నుంచి సంక్రమించిన నాలుగు ఎకరాల భూమిని గతంలో పనిచేసిన వీఆర్‌ఓ... ఆమె దాయాదుల పేరిట పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయించారు. జరిగిన అన్యాయాన్ని బాధితురాలు ఆధారాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పట్టాదారు పాసుపుస్తకం రద్దు చేసి, హక్కుల రికార్డుల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడి అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బాధితులకు న్యాయం చేస్తాం

**- వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి**

బాధితులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. హక్కుపత్రాలు ఉన్నవారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

## నెట్టికంటయ్యకు ప్రగతి కళ ● శరవేగంగా పనులు

నూతన శోభతో స్వామి ఆలయ ప్రాంగణం

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే :** రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రగతి పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త ఈవో చొరవతో భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి దాతలు రూ.కోట్లలో విరాళాలు ఇవ్వడంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఆయా పనులతో స్వామివారి ఆలయ ప్రాంగణం కళకళలాడుతోంది.

### తాజాగా పూర్తయివి..

ఆలయ పశ్చిమన, ఉత్తరం వైపుల సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఆలయ దక్షిణ రాజగోపురం ఎదురుగా సీసీరోడ్డులో సెంట్రల్ లైటింగ్స్ ఏర్పాటు చేశారు. రాజ గోపురాలకు పంచరంగులు వేశారు. ఆలయ పరిసరాల్లో వివిధ జాతుల మొక్కలు నాటించారు. రెండు వారాల కిందట రాజగోపురాలకు 18 కలశాలు ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు.

### పట్టాలపై మరికొన్ని..

దక్షిణ రాజగోపురం ముందర భక్తుల కూర్చోవడానికి సీసీఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. తూర్పున ఒక వైపు లడ్డూ తయారీ, ప్రసాదాల కౌంటర్ల గదుల నిర్మాణాలకు పిల్లర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోకి వాహనాలు రాకుండా దేవస్థానం చుట్టూ ప్రహరీ పనులు సాగుతున్నాయి. బయటే వాహనాల పార్కింగ్‌కు ప్రణాళిక రూపొందించారు. ఆలయానికి సమీపంలోని పార్కులో ఈవో కార్యాలయం, పరిపాలన విభాగం గదుల నిర్మాణాలు చేపట్టనున్నారు. చేపడుతున్నారు.

### గుట్టపై వసతి గదుల నిర్మాణం

దాతల సహకారంతో గుట్టపై 91 వసతి గదుల నిర్మాణాలను చేపడుతున్నాం. పనులకు తొందరలో పరిపాలన విభాగం నుంచి అనుమతులు రానున్నాయి. త్వరలో విమాన గోపురం, గర్భాలయం, ముఖ మండపం పనులు మొదలవుతాయి.

**- వెంకటేశ్వరుడు, ఏఈవో, కసాపురం**

పూర్తయిన ప్రహరీ, సీసీ రోడ్డు

## ప్రకటన

సమాచారం ఇవ్వకుండా జరిగిన అనధికార తవ్వక పనుల కారణంగా మా థింక్ గ్యాస్ 125mm MDPE పైప్‌లైన్ దెబ్బతింది. అయితే మా త్వరిత స్పందన వల్ల థింక్ గ్యాస్ ఎమర్జెన్సీ టీమ్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గ్యాస్ లీకేజిని నియంత్రించి దెబ్బతిన్న పైప్‌లైన్‌ను సురక్షితంగా పునరుద్ధరించారు.

దెబ్బతిన్న చోట పైప్‌లైన్ ఇండికేషన్ టైప్-1 మార్కర్లు మరియు 0.5 మీటర్ల లోతులో వార్నింగ్ మ్యాట్ సముచితంగా అమర్చబడి ఉన్నాయి. అయినప్పటికీ తవ్వకం చేసిన థర్డ్‌పార్టీ ఈ భద్రతా సూచనలను పట్టించుకోకుండా తవ్వకాన్ని కొనసాగించడం వల్ల ఈ ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది.

థింక్ గ్యాస్ ఎమర్జెన్సీ టీమ్ త్వరితగతిన స్పందించి, గ్యాస్‌లీకును నియంత్రించి, దెబ్బతిన్న పైప్ సెక్షన్‌ను తవ్వి మరమ్మతులు చేసి పైప్‌లైన్‌ను పునరుద్ధరించి, గ్యాస్ సరఫరాను అత్యంత వేగంగా తిరిగి ప్రారంభించింది.

థింక్ గ్యాస్ ఎల్లప్పుడూ భద్రతకు ప్రాధాన్యత ఇస్తుంది. తవ్వక పనులు ప్రారంభించే ముందు "డయల్ బిఫోర్ యూ డిగ్" విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని మేము తరచూ సూచిస్తున్నాము. ఏవైనా తవ్వక పనులు ప్రారంభించే ముందు తప్పనిసరిగా మా ఎమర్జెన్సీ టోల్-ఫ్రీ నంబర్ 1800-2022-999ను సంప్రదించాలని కోరుకుంటున్నాము.

ఈ విధంగా భద్రతా చర్యలు పాటించకుండా జరిపే తవ్వకాలు తీవ్రమైన ప్రమాదాలకు దారితీసి ఆస్తి నష్టం, గాయాలు లేదా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.

ఈ విధమైన నిర్లక్ష్యపూరిత చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలతో పాటు శిక్షార్హమైనవి.

- Think Gas యాజమాన్యం, అనంతపురం

- Advertisement

స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

## పంపనూరుకు పోటెత్తిన భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరుడు

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. యాగ మండపంలో హోమాలను చేయించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. రాష్ట్రంలో జరిగిన పలు ఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులను దర్శనానికి పంపారు. క్యూలైన్లు ఎక్కువగా ఉండటంతో భక్తులకు దర్శనం సులువుగా అయినప్పటికి 2 గంటలకు పైగా సమయం పట్టింది. ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంతాలతో పాటు ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. భక్తుల రద్దీ కారణంగా 108 ప్రదక్షిణలు, పాలాభిషేకాలు, అర్చనలు, పల్లకీసేవలను నిలిపివేశారు. వచ్చే మంగళవారం ఈ పూజాసేవలు భక్తులకు అందుబాటులో ఉండవని ఈవో బాబు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు రాహుకాలంలో హోమాలను నిర్వహిస్తామన్నారు.

# కృష్ణదేవరాయా.. సెర్చ్‌కే పరిమితమా?

◆ నియామకం కాని మూడో కమిటీ ◆ ఇన్‌ఛార్జి పాలనలోనే వర్సిటీ

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 16 నెలలుగా ఇన్‌ఛార్జి ఉపకులపతి పాలన కొనసాగుతోంది. కొత్త వీసీ నియామకానికి సెర్చ్ కమిటీది కీలకపాత్ర. రెండుసార్లు కమిటీలు ఎంపికయ్యాయి. ఉపకులపతి నియామకం మాత్రం జరగలేదు. వివిధ కారణాలతో రెండు సార్లు సెర్చ్ కమిటీలు రద్దు అయ్యాయి. మూడోసారి నియమిస్తేనే ప్రక్రియ కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఇన్‌ఛార్జి వీసీలు నియమితులయ్యారు. అదే క్రమంలో గతేడాది జులై 18న ఎస్కేయూ ఎంబీఏ విభాగానికి చెందిన ఆచార్య అనిత ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆరు నెలల్లోనే ఇతర వర్సిటీలకు రెగ్యులర్ ఉపకులపతులు నియామకం జరగగా.. కేవలం రెండు విద్యాలయాలకు భర్తీ చేయలేదు. అందులో ఎస్కే ఒకటి కావడం గమనార్హం.

● మొదటి సారి 2024లో సెర్చ్ కమిటీ నియమించారు. అప్పట్లో పలువురు ఉపకులపతి పదవికి దరఖాస్తు చేశారు. వాటిని పరిశీలించిన తరువాత నియామక ప్రక్రియ ఆగిపోయింది.

● రెండోసారి జులై, 3న కొత్త సెర్చ్ కమిటీ నియమించారు. ఇందులో రాయ్‌పూర్ ఐఐఎంకి చెందిన రామకుమార్ కాకాని, గీతం విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య శివప్రసాద్, లక్నో వర్సిటీ వీసీ అలోక్ కుమార్‌రాయ్ ఉన్నారు. అందులో ఓ సభ్యుడు కమిటీ నుంచి తప్పుకున్నారు. దీంతో మూడోసారి కమిటీ నియమించాల్సిన అవసరం ఏర్పడింది. సాధారణంగా కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఒక సభ్యుడిని వర్సిటీ పాలకమండలి ఎంపిక చేస్తుంది. మరో సభ్యుడిని ప్రభుత్వం, మూడో సభ్యుడిని యూజీసీ నియమిస్తుంది. వారి దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు అభ్యర్థులను ఉపకులపతి పదవికి సిఫారసు చేస్తారు. వారి పేర్లను ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుంది. గవర్నర్ ఆమోదంతో ఒకరు ఉపకులపతిగా నియమితులవుతారు.

**ఆశావహుల పోటీ**

ఎస్కేయూ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు మొత్తం 11 మంది పదవిని ఆశిస్తున్నారు. వీరే కాకుండా ఇతర వర్సిటీ ఆచార్యులు కూడా పదవి కోసం దరఖాస్తు చేసుకొన్నట్లు సమాచారం. వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు తమ వర్గానికే వీసీని నియమించాలని కోరుతున్నారు.

● అకడమిక్ అంశాలు, పరిశోధనలు, ప్రగతి పనులు.. వంటివి రెగ్యులర్ వీసీ నియామకంతో ముడిపడి ఉన్నాయి. పాలనలో కొత్త విధానాలు అమలులోకి వస్తాయి.

## ప్రధాని పర్యటనకు పకడ్బందీ భద్రత

అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో డీఐజీ షిమోషి

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు ఈనెల 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో సమన్వయంతో భద్రత నిర్వహించాలని పోలీస్ అధికారులకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. పుట్టపర్తికి ఈనెల 19న ప్రధాని, 22, 23న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వస్తుండటంతో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన 17 జిల్లాల పోలీస్ అధికారులతో ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రముఖులు వచ్చే విమానాశ్రయం నుంచి కాన్వాయ్ వెళ్లే రోడ్డుమార్గం, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్లను, సాయికుల్వంత్ మందిరం, హిల్‌వ్యూ స్టేడియం రూట్‌మ్యాప్‌ను అధికారులకు చూపిస్తూ భద్రతా ఏర్పాట్లను వివరించారు.

● ఏమైనా సమస్యలుంటే కమాండ్ కంట్రోల్ రూంల ద్వారా తెలుసుకోవాలన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా 340 సీసీ కెమెరాలు, ఏఎన్పీఆర్ కెమెరాలతోపాటు నైట్‌డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరినీ డీఎఫ్ఎండీ ద్వారా తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల నుండి వచ్చిన ఐపీఎస్‌లు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## బలిజ కల్యాణ మండపానికి రూ.50 లక్షలు: ఎంపీ

శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి, ఎంపీ తదితరులు

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** తెదేపాకు అండగా నిలుస్తున్న బలిజ కులస్థుల సంక్షేమం కోసం కల్యాణ మండపం నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించనున్నట్లు ఎంపీ బీకే పార్థసారథి హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయుల విగ్రహాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణ దేవరాయులు పెనుకొండను రెండో రాజధానిగా చేసుకొని సాగించిన పాలన ఒక స్వర్ణయుగమని చెప్పారు. గత తెదేపా హయాంలో నలగొండ్రాయనపల్లి చింత తోపులో బలిజ కులస్థుల కోసం 50 సెంట్లు స్థలం కేటాయించామని, అయితే వైకాపా నాయకులు తీవ్ర అడ్డంకులు కలిగించారని ఎంపీ ధ్వజమెత్తారు. ప్రస్తుతం అక్కడి స్థలాన్ని చట్టబద్ధం చేయించి, అక్కడ కల్యాణ మండపం నిర్మించుకొనేందుకు ఎంపీ ల్యాడ్స్ నుంచి తప్పక నిధులు అందించనున్నట్లు నాయకులకు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త నరసింహారావు, అహుడా మాజీ ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, సంఘం నాయకులు అశ్వర్థప్ప, వెంకటరమణ, రమేశ్, తిప్పన్న, సుబ్రహ్మణ్యం, నారాయణస్వామి, నాగమణి, సుమిత్ర, గంగాధర్, నవీన్‌కుమార్, రంగనాథ్, కులస్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి జూడో పోటీలకు విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులతో పీడీ ప్రతాప్‌రెడ్డి

**ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఇటీవల విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాఠశాలకు చెందిన బాలుర కేటగిరిలో 45 కేజీల విభాగంలో విక్రాంత్, 50 కేజీల విభాగంలో అఫ్జల్ మెహరాజ్, బాలికల విభాగంలో 28 కేజీల విభాగంలో సంజన పాల్గొన్నారు. బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీ నుంచి 20 వరకు హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

## ముదిగుబ్బలో ఒకేరోజు నాలుగు చోరీలు

కిరాణా దుకాణంలోకి చొరబడిన దొంగ

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** ముదిగుబ్బ మండలంలో ఒకేరోజు వరుస చోరీలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ముదిగుబ్బ స్టేషన్ పరిధిలోని అనంతపురం రోడ్డులో ఉన్న సోమశేఖర్ మెకానిక్ దుకాణంలో దొంగలు శనివారం రాత్రి తాళాలు పగలగొట్టారు. లోపలికి చొరబడి రూ.50 వేలు విలువ చేసే 35 కిలోల కొత్త, 20 కిలోల పాత కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. సొసైటీ దగ్గర ఉన్న శ్రీవారి హోటల్, చికెన్ సెంటర్ తాళాలు పగలగొట్టి ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగారు. పట్నం స్టేషన్ పరిధిలోని మద్దన్నగారిపల్లిక్రాస్‌లో ఉన్న కిరాణా దుకాణం తాళాలు పగలగొట్టి అందులోని రెండు లీటర్ల పెట్రోలు ఎత్తుకెళ్లారు. సమీపంలోని గుడిదగ్గర మూడు సెల్‌ఫోన్లు చోరీచేశారు. అన్ని ఘటనలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్సై జయరామ్‌నాయక్ తెలిపారు.

## ట్యాంకర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

**తల్లీ కుమారుడికి తీవ్ర గాయాలు**

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల మండల పరిధిలోని బూడిదగడ్డపల్లి సమీపంలో 342వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి నిలిపి ఉన్న ట్యాంకర్‌ను గోరంట్లవైపు వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీ కొట్టింది. ఈప్రమాదంలో తల్లీకొడుకు లక్ష్మీదేవి, అమరనాథరెడ్డిలకు బలమైన గాయాలయ్యాయి. తల్లి పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు. క్షతగాత్రులది చిలమత్తూరు మండలం బీదిరెడ్డిపల్లిగా తెలిసింది.

**శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము**

కదిరి పట్టణము, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ నెం: 08494-221066, 221366

**e-Procurement Tender మరియు సీల్డ్ టెండరు - కమ్ - బహిరంగ వేలము**

1) లగేజి, సెల్‌ఫోన్‌లు భద్రపరచుకొనుటకు ఒక సంవత్సర కాలము హక్కు 2) శివాలయము నందు టెంకాయలు, పూజ సామాగ్రి అమ్ముకొనుటకు ఒక సంవత్సర కాలము హక్కు 3) విద్యుత్ సామాగ్రి కరెంటు వస్తువులు సప్లయ్ చేయుటకు 3 నెలలు లీజుకు లైసెన్స్ ఇచ్చుటకుగాను 29-11-2025 తేదిన శనివారం 10.30 గం॥లకు బహిరంగ వేలము ప్రారంభమగును. పాట ముగిసిన వెంటనే డిపాజిట్లతో కలిపి పూర్తి మొత్తం అదే రోజు చెల్లించవలెను. వివరములకు www.apeprocurement.gov.in నందు చూచి తెలుసుకొనగలరు. మరిన్ని వివరములకు దేవస్థానము కార్యాలయములో సంప్రదించగలరు.

శ్రీ స్వామి వారి సేవలో...

సం/- వి.శ్రీనివాసరెడ్డి, ఉప కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి


## బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పోటీలకు ఎంపికైన బేస్‌బాల్ జట్టు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** పాఠశాల క్రీడల అండర్-17 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. ఆర్డీటీ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో చేవ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుహాసిని, సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి గాయత్రి, మాజీ కార్యదర్శి వెంకటేష్, పీడీలు ప్రభాకర్, గోపాలరెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, ఫక్కీరప్ప, రమేష్, శివ, రాజశేఖర్‌రెడ్డి, సంజీవరాయుడు తదితరుల సమక్షంలో జట్లను ఎంపిక చేశారు.

*ఎంపికైన జట్ల వివరాలు ఇలా...*

**సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు:** బాలు, భరత్‌సింగ్ నాయక్, ప్రణీత్, సాయిరాజ్, ఖాసీం, కులశేఖర్, దినేష్‌నాయక్, మునీంద్ర, గణేష్, తరుణ్ కుమార్, వేదశ్యామ్, శరవణ్ కుమార్, ఫణీంద్రనాథ రెడ్డి, అజయ్, జి.యాదవ్, దీక్షిత్ రెడ్డి, రాజేష్

**బాలికల జట్టు:** చందన, అంజలి, మైనావతి, పల్లవి, సుకన్య, రాధిక, నందిని, హేమలత, లక్ష్మీదేవి, శ్రావణి, ఆమని, లలితప్రియ, జనని, హారిక, పూజితాంజలి, లలిత.

**బేస్‌బాల్ బాలుర జట్టు:** స్టీఫెన్, నౌషాద్, జగన్‌మోహన్ రెడ్డి, శాంతన్‌సాయి, లోహిత్ కుమార్, శివానంద, సందీప్, సంతోష్, రాహుల్, ప్రవీణ్, హుస్సేన్‌వలి, రాజశేఖర్, శివసాయి, రాఘవేంద్ర, సంతోష్, ధరణి

**బాలికల జట్టు:** పూర్ణిమ, వెన్నెల, కరీనా, సింధు, లిఖిత, చైతన్య, అక్షయ, తేజశ్రీ, అంజలి, తబస్సుం, రిషిత, నస్రీన్, ప్రత్యూష, జానూ, జ్యోత్స్న

## ఎన్టీఆర్.. దైవాంశ సంభూతుడు : ఎమ్మెల్యే బాలకృష్ణ

బాలకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే సింధూర, తదితరులు

**సోమందేపల్లి, పెనుకొండ:** ఎన్టీఆర్ మనిషి కాదు. . కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దైవాంశ సంభూతుడని ఆయన తనయుడు, ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సోమందేపల్లిలో నెలకొల్పిన తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు విగ్రహాన్ని మంత్రి ఎస్.సవిత, ఎంపీ బీకే పార్థసారథి తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు తండ్రి మాత్రమే కాదు.. గురువు, దైవంతో సమానమని చెప్పారు. రాజకీయాల్లో అడుగుపెట్టిన 9నెలల్లోనే అధికారం చేపట్టి.. పేదల కోసం సంక్షేమ పథకాల అమలుకు ఆద్యుడిగా నిలిచారన్నారు. ఎమ్మెల్యేగా మూడుమార్లు గెలిపించి, చరిత్ర సృష్టించిన హిందూపురం ప్రజలకు రుణపడి ఉంటామని, నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తుండటంతోనే ప్రజలు ఆదరిస్తున్నారని ఆయన చెప్పారు. ఒక్క ఛాన్స్ అని వైకాపాకు అధికారం అప్పగిస్తే.. రాష్ట్రాన్ని నాశనం చేశారని, మళ్లీ తెదేపాకు ప్రజలు పట్టం కట్టి అండగా నిలిచారని, రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. బాలయ్యతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు ఎమ్ఎస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, స్థానిక నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు తదితరులను మంత్రి సవిత ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలను అందజేశారు.

## పర్యాటక ప్రదేశంగా కుందుర్పమ్మ కొండ

**కుందుర్పి:** కుందుర్పి గ్రామదేవత కుందుర్పమ్మ కొండను పర్యాటక ప్రదేశంగా మార్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల పురావస్తు శాఖ సహాయ సంచాలకులు స్వామి నాయక్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా డ్వామా పీడీ సలీంబాష, ఇతర అధికారులతో కలిసి కుందుర్పమ్మ కొండను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం అధికారులు, గ్రామస్థులతో కలిసి కుందుర్పమ్మ కొండకు ఎక్కుతూ.. నూతన మెట్లమార్గం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు.

## సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ప్రశాంతం

**అనంత గ్రామీణం:** జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఆదివారం ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాయలంలో 9 పదవులకు ఎన్నికలు జరిగాయి. ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా.. ఆరు మంది బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికయ్యారు. జిల్లా సహకార శాఖ అధ్యక్షుడిగా బి.మల్లరాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.స్రుజన్, ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్, కార్యదర్శిగా ఎస్.కుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.రమేష్‌బాబు, ఆర్.రమణ మాధవి, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు, క్యాడర్ కార్యదర్శులుగా ఎం.నరసింహమూర్తి, ఎం.లతీఫ్‌లు ఎన్నికయ్యారు.

# పారిశ్రామిక హబ్‌గా అనంతపురం

◆ చంద్రబాబు, లోకేశ్ అహర్నిశలు కృషి ◆ తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

మాట్లాడుతున్న తెదేపా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆదినారాయణ, నాగరాజు, నారాయణస్వామి

**రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే :** అనంతపురం జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సే అందుకు ముఖ్య ఉదాహరణ అని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరం రాంనగర్‌లోని జిల్లా తెదేపా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గంజినాగరాజు, రాష్ట్ర కురుబ సాధికార సమితి సభ్యుడు నారాయణస్వామిలతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెన్యూపవర్, బ్రైట్ ఫ్యూచర్, ఏసీఎంఈ ఉర్జా, సెరెంటికా వంటి కంపెనీలు పెట్టేందుకు ముందుకొచ్చారన్నారు. పెట్టుబడులతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఐదేళ్లలో వైకాపా దౌర్జన్యాలతో కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలి పోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, సీఎంపై ఉన్న నమ్మకంతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారన్నారు. పరిశ్రమల రావడంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు.

## ఆలయ సమాచారం

**కదిరి, న్యూస్‌టుడే:** శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు(సోమవారం) ఉదయం పది గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణం నిర్వహిస్తారు. స్వామి దర్శనం ఉదయం 6 గంటలకు ఉంటుంది. 7 గంటల నుంచి 9 మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు జరుగుతాయి. 9 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది.

## సంతల ఆదాయం రూ.3.43 లక్షలు

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే :** అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం 3,43,550 ఆదాయం వచ్చింది. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.2,07,350 ఆదాయం రాగా, ఆదివారం జరిగిన పశువుల సంతలో రూ.1,36,200 ఆదాయం వచ్చిందని, వచ్చిన ఆదాయ సొమ్మును సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు.

## సాఫీగా సాగేలా..

హైదరాబాద్ బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారిలో పుట్టపర్తికి వెళ్లాలంటే మామిళ్లపల్లి నుంచి ధర్మవరం మీదుగా పుట్టపర్తి వెళ్లాలి. మామిళ్లపల్లి నుంచి ధర్మవరం రోడ్డులో చాలాచోట్ల పెద్ద గుంతలున్నాయి. సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు వాహనదారులకు పూర్తిగా అసౌకర్యంగా ఉంటోంది. అందువల్ల గోతులు పడిన చోట పూర్తిగా పొక్లెయిన్‌తో తవ్వి కొత్తగా రోడ్డు వేస్తున్నారు. - ఈనాడు అనంతపురం

## విమర్శిస్తే దాడులు చేస్తారా? : వైకాపా

పెనుకొండలో రోడ్డుపై బైఠాయించిన వైకాపా జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, పార్టీ శ్రేణులు

**హిందూపురం పట్టణం, పెనుకొండ, అనంతనగరపాలక:** ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, విమర్శిస్తే దాడులు చేస్తామంటే ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఏపాటిదో అర్థం అవుతుందని అనంతపురం జిల్లా వైకాపా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ధ్వజమెత్తారు. వైకాపా కార్యాలయంపై తెదేపా నాయకుల దాడులను నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు ఆదివారం హిందూపురానికి రావడానికి ప్రయత్నించారు. అయితే పట్టణ శివార్లలో పోలీసులు ప్రత్యేక పికెట్లను ఏర్పాటు చేసి అడ్డుకొన్నారు. అనంత వెంకట్రామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తదితరులను డీఎస్పీ మహేశ్ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని కొట్నూరు ఇందిరమ్మ కాలనీ వద్ద నిలిపివేశారు. వారు పోలీసులతో వాదనకు దిగారు. అక్కడే నిరసనకు దిగారు. వైకాపా శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీతో పాటు ఇతరులను పట్టణానికి రాకుండా పెనుకొండ వద్ద పోలీసులు అడ్డుకొన్నారు. హిందూపురం నాయకులు మాత్రం పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దీపికా ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. బాలకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

అనంత వెంకట్రామిరెడ్డిని వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

## 19, 20, 21 తేదీల్లో దివ్యాంగుల పింఛన్ పునఃపరిశీలన వాయిదా

**అనంత సంక్షేమం, న్యూస్‌టుడే:** సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా ఈనెల 19, 20, 21 తేదీల్లో దివ్యాంగుల పింఛన్ల పునఃపరిశీలన వాయిదా వేసినట్లు పీడీ శైలజ తెలిపారు. ఆయా తేదీల్లో సదరం క్యాంపులకు హాజరు కావాలని నోటీసులు పొందిన వారు హాజరుకావాల్సిన అవసరం లేదని తదుపరి తేదీలను నోటీసుల ద్వారా అందజేస్తారన్నారు. ఈ నెల 23న సత్యసాయి శతజయంతి వేడుకలకు వచ్చే వీఐపీలు, భక్తులకు వైద్య సేవలు అందివ్వడానికి ప్రత్యేక వైద్యులు అందరూ సేవలు అందివ్వడానికి పుట్టపర్తికి వెళ్లనున్నారన్నారు. అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం ప్రాంతాల్లో జరిగే వైకల్య పునఃపరిశీలన వాయిదా వేశారు.

## సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

**అనంత సంక్షేమం, న్యూస్‌టుడే:** వెనుకబడిన తరగతుల వారికి సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఖుష్బూ కొఠారి తెలిపారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుంది. పూర్తి వివరాలకు 95502 50770 నంబరును సంప్రదించాలని సూచించారు.

## హంద్రీనీవా కాలువలో వైద్యుడి గల్లంతు

కార్తిక్ కుమార్ రెడ్డి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** ఈత కోసం నీటిలో దిగి వైద్యుడు గల్లంతయిన ఘటన మండలంలోని పంపనూరు హంద్రీనీవా కాలువలో ఆదివారం చోటు చేసుకుంది. బెళుగుప్ప మండలం ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న కార్తిక్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి కార్తిక మాసం సందర్భంగా వనభోజనాలకు పంపనూరు నగరవనంలోకి వచ్చాడు. ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకొని నగరవనంలో మధ్యాహ్నం భోజనాలు చేశాడు. అనంతరం మధ్యాహ్నం 2గంటల సమయంలో పంపనూరు సమీపంలోని హంద్రీనీవా కాలువలోకి కుటుంబ సభ్యునితో కలసి వెళ్లి సరదాగా ఈతకు దిగాడు. కాలువ మధ్యలో ప్రవాహం ఎక్కువగా ఉన్నా అలానే ముందుకు వెళ్లసాగాడు. గమనించిన కుటుంబ సభ్యుడు వెంటనే నీటిలో నుంచి బయటకి వచ్చి కార్తిక్‌ని బయటకు రావాలని అరిచాడు. అప్పటికే కార్తిక్ కుమార్ రెడ్డి నీటిలో కొట్టుకుపోయాడు. కార్తిక్ కుమార్ రెడ్డి స్వగ్రామం బెళుగుప్ప మండలం దుద్దేకుంట కాగా అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తుంది. ఇతని కోసం ఆత్మకూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించారు.

భర్త గొంతు కోసిన ఘటనలో...

## చికిత్స పొందుతూ భార్య మృతి

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి గ్రామంలో ఐదు రోజుల కిందట అనుమానంతో క్షణికావేశంలో భార్య రత్నమ్మ గొంతు కోసిన భర్త ఎర్రిస్వామికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించగా.. ఆమె అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఆ ఉపాధ్యాయ సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని నిబంధనలు పెట్టారని, డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులతో టెట్ రాయించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రమణయ్య, రామప్ప, ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, సంజీవ్‌కుమార్, రాముడు పాల్గొన్నారు.

సమావేశంలో యూటీఎఫ్ నాయకులు


**EENADU Classifieds**

**BUSINESS SERVICES**

**BUSINESS OFFER**

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

**REAL ESTATE**

**PLOT FOR SALE**

**ఉరవకొండ నందు** అనంతపురం - బళ్లారి హైవే ప్రక్కన కస్తూరిబా స్కూల్ ముందర DTCP అప్రూవల్ 40x55 సైజ్ గల 15 ప్లాట్లు అమ్మబడును. Cont: 9440006008.

**JOBS**

**కావలెను:** M.G.B Mobiles (మహీంద్రా కార్ షోరూమ్) నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసినవారు కావలెను. ఆటోమొబైల్ సేల్స్ నందు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకొనవచ్చును. సంప్ర: 8333929186.

**అనంతపురంలో కీర్తి** సోలార్ నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సంప్ర॥ Cell: 84668 87348.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును


(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

## దత్తపీఠానికి చీరల వితరణ

**హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే:** వచ్చే నెల 4న జరిగే శ్రీదత్తజయంతిని పురస్కరించుకొని హిందూపురం ప్రాంతం అనమా ట్రస్టు ఆధ్వర్యంలో 108 చీరలను దత్త భక్తులు మైసూరు దత్తపీఠానికి వితరణ చేశారు. వీటిని ఆదివారం మైసూరులోని పీఠానికి పంపుతున్నట్లు ట్రస్టు ప్రతినిధులు విశ్వేశ్వరయ, రాజేశ్వరిదేవి, సుబ్రహ్మణ్యం తెలిపారు. చీరలను గణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా పేద ప్రజలకు పంపిణీ చేస్తారు.

చీరలను సేకరించిన పురం దత్త భక్తులు

## వైభవం.. రుద్రహోమం

**హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే:** కార్తిక మాసం పురస్కరించుకొని లక్ష్మీపురంలోని గాయత్రీ దేవస్థానంలోని ప్రాంగణంలో బ్రాహ్మణ సేవా ట్రస్టు భవనంలో ఆదివారం వేదపండితులు రుద్ర హోమం నిర్వహించారు. ఉదయం తులసీ దామోదర పూజ, కలశస్థాపన, శివుడికి అభిషేకాలు, విశేషాలంకరణలు చేశారు. ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తరలివచ్చిన భక్తులకు కార్తిక వనభోజన సదుపాయాన్ని కల్పించారు.

రుద్రహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

### మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

**సమస్య:** వీవర్స్‌కాలనీ సమీపంలోని బైపాస్ రోడ్డు కూడలిలో వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి. - శ్రీనివాసులు
**సమాధానం:** సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తాం. -భాగ్యలక్ష్మి, సర్పంచి, కిరికెర
**సమస్య:** కంబాలపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. -నరేశ్
**సమాధానం:** సిబ్బంది చేత పైకి మార్పిస్తాం. -శ్రీనివాసమూర్తి, ఏఈ, రొద్దం
**సమస్య:** సుబ్బరాయప్ప కొట్టాల వద్ద మట్టి దారిలో కంపచెట్లు తొలగించాలి. -రామాంజి.
**సమాధానం:** ప్రతిపాదనలు పంపించాం. -వెంకటనారాయణ, మండల ఇంజినీరు.
**సమస్య:** కల్లూరిపల్లి బీసీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. -నాగరాజు
**సమాధానం:** సత్వరమే పరిష్కరిస్తాం. -లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి
**సమస్య:** తిమ్మలాపురం ఐదిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. -హనుమంతరాయప్ప
**సమాధానం:** వెంటనే ఏర్పాటు చేస్తాం. -రంగస్వామి, సర్పంచి, తాకటికె
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం, రొద్దం, గుడిబండ

# అందని పశువైద్యం.. మృత్యువుతో పోరాటం

**మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే:** పదిరోజులుగా ఉదయాన్నే చల్లటి వాతావరణం ఏర్పడటంతో గొర్రెలు, మేకలకు ముక్కుల్లో నీరు కారడం, తుమ్మడం, దగ్గడం చేస్తున్నాయి. తరువాత మేత, నీరు మానేసి రెండు రోజులకే మృత్యువాత పడుతున్నాయని కాపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధుల బారిన పడిన మేకలు

గ్రామాల్లో వ్యాధుల బారిన మూగజీవాలు

### 10వేల కుటుంబాలకు జీవనాధారం

మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం ప్రాంతీయ పశువైద్యశాలల పరిధిలో 5 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయి. 10వేల కుటుంబాలు వీటి పెంపకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఐదేళ్ల గొర్రె, మేక విలువ భారీగా పెరిగింది. ఒక్కో పొట్టేలు విలువ దాదాపు రూ.20వేలు, గొర్రె రూ.15వేల వరకు ధర పలుకుతున్నాయి. ఇలాంటి తరుణంలో రోగాల కారణంగా మృత్యువాత పడుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

### రెండు వారాల్లో 20..

మడకశిర మండలంలోని ఉగ్రేపల్లి, కంబాలపల్లి, కొత్తపల్లి, కదిరేపల్లి గ్రామాల్లో రెండు వారాల్లో 20 మేకలు, గొర్రెలు మృతి చెందాయని కాపర్లు వాపోతున్నారు. స్థానికంగా వైద్య సిబ్బంది అందుబాటులో లేక కర్ణాటక గ్రామాల నుంచి వేల రూపాయలు ఖర్చుచేసి మందులు కొనుగోలు చేసి వేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు.

### రూ.30 వేలు నష్టపోయా..

-తిమ్మప్ప, ఉగ్రేపల్లి, మడకశిర మండలం

మాకు 30 మేకలున్నాయి. కుటుంబ పోషణకు ఇవే ఆధారం. వారం రోజుల్లో దగ్గు, జలుబు సోకి నాలుగు మేకలు మృతి చెందాయి. దాదాపు రూ.30వేల వరకు నష్టపోయాం. మేకలకు రోగాలు సోకితే మందులు, మాత్రలు ఖర్చుచేసే స్తోమత లేదు. పశువైద్యాధికారులు గ్రామంలో పర్యటించి వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేస్తే ఎంతో ఉపశమనం కలుగుతుంది.

### మేకలు, గొర్రెల మృతిపై పరిశీలిస్తాం

-అమర్, వెటర్నరీ ఏడీ, మడకశిర

మేకలు, గొర్రెల మృతి చెందిన విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకురాలేదు. పరిశీలించి రోగాల నివారణకు తగు చర్యలు చేపడతాం.

**నియోజకవర్గంలో సిబ్బంది కొరత ఇలా** | పశువైద్యశాలలు : మడకశిర, అమరాపురం | ఏడీలు ఇద్దరికి గాను ఒక్కరే ఉన్నారు | వైద్యులు : 12 మందికి కేవలం ఇద్దరే | ఎల్ఎస్ఏ : ఐదుగురు, జేవీఓలు : ముగ్గురు, వీఎల్ఓ : ఒకరు

## భక్తిశ్రద్ధలతో కనకదాస జయంతి వేడుకలు

**రొద్దం, న్యూస్‌టుడే:** కోగిర గ్రామంలో ఆదివారం భక్త కనకదాస జయంతి వేడుకల సందర్భంగా మహిళలు జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. స్థానిక శ్రీరామాలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం కనకదాస చిత్రపటాన్ని రథంపై ఉంచి ఊరేగించారు. కురుబ సంఘ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎల్ఐసీ అంజి, వన్నూరప్ప, జయచంద్ర, అరివప్ప, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కోగిరలో మహిళల జ్యోతుల ప్రదర్శన

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

**అమరాపురం, న్యూస్‌టుడే:** మండలంలోని కె.శివరం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని వర్షిత, అండర్14లో 7వ తరగతి దీపాలి, 8వ తరగతి విద్యార్థి తేజ్‌పాల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయురాలు తభిహాబాను తెలిపారు. ఈనెల 27నుంచి 29వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## వాల్మీకి ఉద్యోగ సంక్షేమ సంఘం ఏకగ్రీవం

**పెనుకొండ, న్యూస్‌టుడే:** వాల్మీకి ఉద్యోగ సంక్షేమ సంఘం (ఎంప్లాయిస్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పెనుకొండ నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నరసింహమూర్తి, అధ్యక్షుడిగా సత్యమయ్య, ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా రాజశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.అంజనేయులు, గౌరవ సలహాదారులుగా రాఘవయ్య, ఈశ్వరప్రసాద్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పెనుకొండ శివప్రసాద్, వసంత్, సోమందేపల్లి నాగరాజు, నవీన్‌కుమార్, రొద్దం సంజీవ్, అశోక్, పరిగి వెంకటేశ్, సజ్జరాయప్ప, గోరంట్ల రామకృష్ణ, పవన్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చదరంగం పోటీల్లో రాణించిన విద్యార్థులు

**హిందూపురం, న్యూస్‌టుడే:** బాలల దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన ఎస్‌బీఐ లైఫ్‌వారు చిన్నారులకు మేళాపురంలోని స్పర్టన్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీల్లో 28 మంది చిన్నారులు పాల్గొనగా జి.జ్ఞాపిక రెడ్డి ప్రథమ, మధున్‌పెద్దన్న ద్వితీయ, నిఖిలేంద్ర తృతీయ స్థాయిలో రాణించినట్లు కోచ్ ఆరిపుల్లా తెలిపారు. పోటీలో ప్రతిభ చూపిన వారికి ఎస్‌బీఐ యూనిట్ మేనేజర్ వీఎస్ చంద్రశేఖర్ బహుమతులు అందించారు.

చెస్ పోటీలో ప్రతిభ కనబరచిన చిన్నారులు

## మూర్ఛవ్యాధి బాధితులకు వైద్యసేవలు

**హిందూపురం, న్యూస్‌టుడే:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ పాఠశాలలో జేవీవే ఆధ్వర్యంలో మూర్ఛవ్యాధి బాధితులకు వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ ఈటీ రామ్మూర్తి తెలిపారు. శిబిరంలో జేవీవే ప్రతినిధులు రామకృష్ణ, అతావుల్లా, శ్రీనివాసులు, లక్ష్మీపతి, నాగేంద్రాచారి, ఉగ్రప్ప, నాగరాజగుప్త తదితరులు పాల్గొన్నారు.

# చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పిస్తా

### రాయితీ పరికరాల పంపిణీలో ఎమ్మెల్యే బాలకృష్ణ

**హిందూపురం, న్యూస్‌టుడే:** వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి రంగమైన చేనేత ఆధునిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో 90 శాతం రాయితీ కింద మంజూరైన చేనేత పరికరాలను ఆశాఖ మంత్రి సవిత, కమిషనర్ రేఖ రాణి చేతుల మీదుగా 181 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికులు అధిక శాతం ఉన్న ప్రాంతాల్లో స్మాల్‌క్లస్టర్లు ఏర్పాటు చేసి వారికి ఆధునిక పద్ధతిలో వస్త్రాల తయారీ, నూతన డిజైన్‌లపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. చేనేత రంగాన్ని ఆదుకొనేందుకు ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్తు రాయితీతో అందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి రామకృష్ణ, టీసీపీఎస్‌కే సంయుక్త సంచాలకులు కె.కన్నబాబు, సంయుక్త అధికారి వనజ, తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి హరికృష్ణ, మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం నిర్వహించిన ర్యాలీలో బాలకృష్ణ, మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, పుర ప్రజలు

### ఆర్టీసీ ఆసుపత్రి ప్రారంభం

హిందూపురంలో ఆర్టీసీ బస్టాండులో రూ.69లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ ఆసుపత్రిని ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్ పూలనాగరాజు, కడప జోన్ ఈడీ పి.చంద్రశేఖర్, పుట్టపర్తి డీపీటీవో మధుసుదన్, స్థానిక డీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా డిపోకు నూతన బస్సులు మంజూరు చేయించాలని ఎన్ఎంయూ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రి అందించారు. అంతకు ముందు ఎమ్మెల్యే మలగూరులో రూ.26.50 లక్షలతో నిర్మించిన పసువుల ఆసుపత్రి ప్రారంభించి వాల్మీకి దేవాలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం తెదేపా సీనియర్ నాయకుడు జేఈ వెంకటస్వామి వర్ధంతిలో ఎమ్మెల్యే పాల్గొని నివాళి అర్పించారు.

మగ్గంపై చీర నేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

## వసతి గృహానికి స్థలం కేటాయించండి

**హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే:** హిందూపురం పట్టణంలో వాల్మీకి విద్యార్థులకు ప్రత్యేక వసతి గృహం నిర్మించుకోవడానికి రెండు ఎకరాల స్థలాన్ని మంజూరు చేయాలని, కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని వాల్మీకి సంఘం నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణను కోరారు. వాల్మీకి ఆలయాన్ని ఆదివారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటరమణప్ప, గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, కోశాధికారి ఆకుల సూరి తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

**పెనుకొండ :** రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి కార్మికుల సంక్షేమబోర్డు ఎత్తివేస్తూ జీవో ఇచ్చారని, ఇప్పటి వరకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కార్మికుల సమస్యలపై ఈనెల 30న కడపలో జరిగే రాయలసీమ భవన నిర్మాణ కార్మికుల సదస్సు జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ డివిజన్ కార్యదర్శిశ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్, కార్మిక సంఘం నాయకులు మల్లికార్జున, కిష్టప్ప, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

**పెనుకొండ:** ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని, స్మార్ట్‌ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జయప్ప సూచించారు. ఆదివారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో గ్రామంలో వాలంటీర్లతో సైబర్ భద్రత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు.

# అలరించిన శ్రీసత్యసాయి నామ సంకీర్తన

సాయి నామ సంకీర్తన ఆలపిస్తున్న భక్తులు

**హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే:** పుట్టపర్తి శ్రీసత్యసాయి శతజయంతి పురస్కరించుకొని పట్టణంలోని పులమతి రోడ్డులో ఉన్న శ్రీమాతా రాజేశ్వరీదేవి ఆలయ ధర్మకర్త రాజకిశోర్ స్వగృహం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన శ్రీసత్యసాయి నామ సంకీర్తన అలరించింది. హిందూపురం సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య, ధర్మ, శాంతి, ప్రేమతో తమ జీవితాలను సాయి సేవలో తరలించాలన్నారు. సమితి, బాలవికాస్, సాయిసదన్ సభ్యులు, సాయి భక్తులు ఇందులో పాల్గొన్నారు.

### ఘనంగా మహానారాయణ సేవ

**లేపాక్షి, న్యూస్‌టుడే:** సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం లేపాక్షి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహా నారాయణ సేవ సభ్యులు అన్నదానం నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూజలు చేసి గ్రామవీధుల్లో ఊరేగిస్తూ భజనలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

**లేపాక్షి, న్యూస్‌టుడే:** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో లేపాక్షి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్ చదువుతున్న గీతాంజలి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటినట్లు ప్రత్యేకాధికారిణి నీలిమ తెలిపారు. 'ఈరోజు చేసే పనుల మీద రేపటి భవిష్యత్తు ఆధార పడింది' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో మూడో స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థిని ఆదివారం సత్యసాయి ట్రస్టు విద్యా కో ఆర్డినేటర్లు లక్ష్మి, రాజేంద్రప్రసాద్‌ల చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు ఆమె వివరించారు.

బహుమతి అందుకుంటున్న గీతాంజలి

## గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వాటి ఏర్పాటుకు కృషిచేసిన ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం తదితరులు గ్రంథాలయ ఏర్పాటుకు పాటుపడి, సొంత ఆస్తులు దానం చేసినట్లు ప్రసంగాల్లో వక్తలు వివరించారు. అధికారి శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న కమిటీ సభ్యులు

## కల్యాణ మండపం పనుల పరిశీలన

**సోమందేపల్లి:** స్థానిక అక్కమ్మకొండ పక్కనున్న స్థలంలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న ఉప్పర కల్యాణ మండపం నిర్మాణ పనులను ఆదివారం ఎంపీ బీకే పార్థసారథి పరిశీలించారు. ఎంపీ నిధులతో ఇక్కడ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగిస్తున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆయన సంఘం నాయకులకు సూచించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, తెదేపా నాయకులు గోపాల్, టీడీ బాబా, కదిరప్ప, రామాంజనేయులు, కులస్థులు పాల్గొన్నారు.

# భక్తి భావం.. సేవే మార్గం

### ఆదర్శంగా గోరంట్ల అయ్యప్పస్వామి అభివృద్ధి కమిటీ

**గోరంట్ల, న్యూస్‌టుడే:** ప్రతిఏటా నవంబరు నుంచి జనవరి వరకు సుమారు రెండు నెలలకు పైగా పల్లెలు, పట్టణాలు, నగరాలు 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ నామస్మరణతో మారుమోగుతాయి. అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులు 40 రోజులపాటు కఠోర దీక్షతో, భక్తి పారవశ్యంతో గడుపుతారు. గోరంట్ల మండలంలో ఏటికేడు భక్తుల సంఖ్య పెరుగుతోంది. అలాంటి మాలధారులకు స్థానిక దామరోడ్డు అయ్యప్ప ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని రకాల వసతులతో పాటు సన్నిధానంలోనే మధ్యాహ్నం భిక్ష (అన్నదానం) ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

**ఆలయానికి 94 సెంట్లు**

ఆలయానికి పదేళ్ల క్రితం 94 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. 2017-18లో అప్పటి ఎంపీ పార్థసారథి కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎంపీలాడ్స్ నుంచి రూ.10లక్షలు ఇచ్చారు. మరోవైపు కమిటీ సభ్యులు విరాళాలు సేకరించి భక్తులు భోజనం చేయడానికి పెద్ద భవనం నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.70లక్షలకు పైగా అభివృద్ధి కోసం వెచ్చించినట్లు తెలిపారు. దుకాణ భవనం నిర్మించి అద్దెకు ఇవ్వడంతో ఏటా రూ.1.20లక్షలు వస్తోందన్నారు.

### ఏటా 15వేల మందికి భిక్ష

కమిటీ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు భక్తులకు ఉదయం పాలు, మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం 300 మందికిపైగా భక్తులు 45 రోజుల పాటు దైవసన్నిధిలోనే గడుపుతున్నారు. దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నందున 17 సంవత్సరాలుగా ఈకార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయని కమిటీ సభ్యులు ఆనందంగా చెబుతున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

### గర్భగుడి నిర్మాణానికి భూమిపూజ

ఆలయ ప్రాంగణంలో గర్భగుడి నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. రాతిస్తంభాలు సిద్ధం చేస్తున్నారు. అలాగే భక్తులకు మధ్యాహ్నం భిక్ష కార్యక్రమం ఆదివారం నుంచి ప్రారంభించారు.

### 12 ఏళ్లుగా వస్తున్నా



ప్రస్తుతం 12వ సారి అయ్యప్పమాల ధరించాను. ప్రతిఏటా ఈసన్నిధానంలో భజనలకు, భిక్షకు హాజరౌతున్నా. నాలాంటి ఎందరో భక్తులకు ఈకమిటీ వారు 45 రోజల పాటు వసతులు కల్పిస్తుండడం గొప్పవిషయం. **-కన్నారెడ్డి, మందలపల్లి**

## బీటీ రోడ్డు గుంతలమయం

గుణేమోరుబాగల్ నుంచి హరేగెర వరకు ఉన్న బీటీ రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వందలాది గుంతలు ఉండడంతో వర్షం వస్తే నీరు నిలిచి అధ్వానంగా మారుతోంది. ఈ విషయమై మండల ఇంజినీరు సాయికుమార్ మాట్లాడుతూ రోడ్డు మరమ్మతుకు ప్రతిపాదనలు పంపుతామని, మంజూరైన వెంటనే పనులు చేస్తామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

## రహదారే కల్లం.. రైతు దైన్యం

మొక్కజొన్న దిగుబడిని ఆరబెట్టేందుకు సరైన కల్లాలు లేకపోవడంతో రైతన్నలకు అవస్థలు తప్పడం లేదు. రొద్దం నుంచి బూచెర్లకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో పెన్నానదిపై నిర్మించిన వంతెనపై ఇలా ఆరబెట్టుకోవాల్సిన దయనీయ స్థితి. పంటలను ఆరబెట్టుకొనేందుకు శాశ్వత కల్లాల నిర్మాణానికి యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రొద్దం**

## ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

మణూరు గ్రామంలో గ్రామ సచివాలయం ముందు మతాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ట్యాంకు నుంచి నీరు వృథా అవుతుండడంతో చుట్టూ పాచిపట్టింది. సత్వరమే తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఈరలింగప్ప మాట్లాడుతూ సత్వరమే ట్యాంకు చుట్టూ నెలకొన్న అపరిశుభ్రతను తొలగిస్తామన్నారు.

**-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం**

## అడ్డదిడ్డంగా రాకపోకలు..!

రొద్దంలో ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఉదయం, సాయంత్రం వేళ స్థానిక బస్టాండు వద్ద నుంచి ప్రధాన రహదారి పక్కనే అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. హెడ్‌కానిస్టేబుల్ కాంతప్పను వివరణ కోరగా అడ్డదిడ్డంగా నిలిపిన వాటిపై చర్యలు తీసుకొంటామన్నారు. **-న్యూస్‌టుడే, రొద్దం**

(c) eenadu

# పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

## రహదారిపై నిలిపి.. రాకపోకలు స్తంభించి

అన్నమయ్య జిల్లా వైపు వెళ్లే దారిపై ఆపిన వాహనాలు

**కొక్కంటిక్రాస్, (తనకల్లు), న్యూస్‌టుడే:** వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే 42వ జాతీయ రహదారిపై ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ అధికమవుతోంది. ఇలాంటి ఘటనల వల్ల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ గోపిని వివరణ కోరగా.. ఆటోల డ్రైవర్లకు అవగాహన కల్పించి, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

## అయ్యప్ప ఆలయానికి పూజా సామగ్రి వితరణ

**ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే:** మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయానికి ఆదివారం ఓడీసీకి చెందిన ముస్లిం సోదరుడు, టైలర్ నిజాం పూజాసామగ్రి అందించినట్లు ఆలయ పూజారి ఆంజనేయులునాయుడు తెలిపారు. 14 ఏళ్ల నుంచి ఏటా 45 రోజులకు సరిపడా టెంకాయలు, దీపారాధన పూజా సామగ్రి అందిస్తూ మత సామరస్యాన్ని చాటుకుంటున్నారని అభినందించారు. 250 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పిట్టాప్రభాకర్‌రెడ్డి, తెదేపా మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు సుభాసిని, మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

## ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** ప్రాథమిక సహకార సంఘాల ద్వారా అందే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు ముమ్మినేని వెంకటరాముడు పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాలు పుట్టపర్తిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సంఘం ద్వారా అందుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, సంఘాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా సహకార శాఖ అధికారి ఆదినారాయణ, అసిస్టెంట్ రిజిస్టర్ ప్రభాకర్‌నాయక్, సీఈఓ రవిశంకర్‌రెడ్డి, పుట్టపర్తి సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

# కుంటుపడ్డ చెత్త సేకరణ

### మరమ్మతులకు గురైన స్వచ్ఛాంధ్ర వాహనాలు

**కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే:** స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించేందుకు మండలానికి ట్రాక్టర్, ఆటో, రిక్షా వంటి వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా వాహనాలు మరమ్మతులకు గురై మూలకు పడటంతో చెత్త, ఇతర వ్యర్థాల సేకరణ ఆలస్యం అవుతోంది. దీంతో వ్యర్థాలు పేరుకుపోయి గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలు నిరుపయోగంగా మారాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**కేటాయించిన వాహనాల వివరాలు..**

మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి, పట్నం మేజర్ పంచాయతీలకు రెండు ట్రాక్టర్లు, 5 డీజిల్ ఆటోలను కదిరి బ్రాహ్మణపల్లి, ముత్యాలచెరువు, కదిరి కుంట్లపల్లి, కాళసముద్రం, కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలకు అందజేశారు. చెత్త సేకరణ రిక్షాలు 2019లో 36, 2022లో 12 అందజేశారు. ట్రాక్టర్లు రెండూ వినియోగంలో ఉండగా, ఆటోల్లో కదిరి కుంట్లపల్లి, కాళసముద్రం పంచాయతీల్లో మాత్రమే పని చేస్తున్నాయి.

● 3 ఆటోలు వివిధ రకాల మరమ్మతులకు గురై నిలిచిపోయాయి. నెలలు గడుస్తున్నా వాటిని బాగు చేయించడంలో అధికారుల అలసత్వం కారణంగా వాహనాలు ఎండ, వానకు తుప్పు పడుతున్నాయి. ఒక్కోటి రూ. 7.25 లక్షలు విలువ చేసే చెత్త సేకరణ ఆటో, రూ. 25 వేలు విలువ చేసే రిక్షాలు మరమ్మతులకు గురై మూలకు చేరడంతో వ్యర్థాల తరలింపు కుంటుబడింది. ఫలితంగా గ్రామాల్లో చెత్త పేరుకుపోయి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని బాగుచేసి వ్యర్థాల సేకరణ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు గురైన కుమ్మరవాండ్లపల్లి చెత్తసేకరణ ఆటో

**వినియోగంలోకి తెస్తాం**

- కె.పోలప్ప, ఎంపీడీవో, కదిరి

మరమ్మతులకు గురైన చెత్త సేకరణ ఆటోలు, రిక్షాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేపడతాం. వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుని, వ్యర్థాల సేకరణ సక్రమంగా జరిగేలా చూస్తాం. వాహనాల మరమ్మతుల్లో నిర్లక్ష్యం చూపితే పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేస్తాం.

## మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి: 80085 73033
ధర్మవరం: 99596 98222

**సమస్య :** పట్టణంలోని బెంగళూరుకు వెళ్లే ప్రధాన రహదారిలోని ర.భ.శా ప్రాంగణంలో కొందరు మెకానిక్ దుకాణదారులు ఆయిల్ వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. - ప్రియాంకనగర్ కాలనీ వాసులు

సమాధానం : వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటాం. మరోసారి వేస్తే జరిమానాలు విధిస్తాం.

**సమస్య :** మండల పరిధిలోని గొట్లూరు ప్రధాన రహదారిపై గుంతపడి ప్రమాదకరంగా ఉంది. గుంతపడిన ప్రదేశంలో మలుపు ఉండటంతో దగ్గరకు వచ్చేంత వరకు అది కనబడటం లేదు. రోడ్డు ప్రమాదాలు జరగకముందే గుంతను పూడ్చాలి.

**- రాజేష్, శివయ్య, గొట్లూరు గ్రామస్థులు**

**సమాధానం :** సిబ్బందితో మాట్లాడి గుంతను తారుతో పూడ్చివేయిస్తాం.

**సమస్య:** పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్దనున్న రైల్వే ఉపరితల వంతెనపై అక్కడక్కడ గుంతలు పడ్డాయి. చోదకులు గుంతలు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

**- రఫీ, వెంకట్‌రెడ్డి, కుణుతూరు గ్రామస్థులు**

**సమాధానం :** వంతెనపై గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే సమస్య పరిష్కరిస్తాం.

**(పై ప్రశ్నలకు ర.భ.శా డీఈ నాగపుల్లంరావు సమాధానాలిచ్చారు)**

– న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

**సమస్య:** మండలంలోని వేపకుంటలో రోడ్డుకు ఆనుకొని ఎరువు దిబ్బలు నిల్వ చేయడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. **- నారాయణ, స్థానికుడు.**

**సమాధానం:** రోడ్డుకు ఆనుకొని నిల్వ చేసిన ఎరువు దిబ్బలను తొలగిస్తాం.

**- విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి**

**సమస్య:** మండలంలోని ముక్తాపురంలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో ముళ్ల పొదలు పెరిగి అంత్యక్రియలు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**- మధు, స్థానికుడు.**

**సమాధానం:** ముళ్లపొదలను తొలగిస్తాం.

**- సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కనగానపల్లి

## నేటి నుంచి అయ్యప్ప మాలధారులకు భోజన సౌకర్యం

**ధర్మవరం:** పట్టణంలోని కేశవనగర్ అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి అయ్యప్ప మాలధారులకు రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని గురుస్వామి విజయ్‌కుమార్ ఆలయ కమిటీ అధ్యక్షుడు బండపల్లి వెంకట జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప మాలధారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సదస్సు జయప్రదానికి సీపీఎం పిలుపు

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** విప్లవం- విస్తృత అనే అంశంపై రేపటి సోమవారం జరగనున్న జిల్లాస్థాయి సదస్సును జయప్రదం చేద్దామని సీపీఎం నాయకులు అన్నారు. సదస్సుకు రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఓబులు, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ హాజరవుతున్నట్లు విలేకరుల సమావేశంలో నాయకులు ఆదివారం తెలియజేశారు. ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కోనేరువరకు నిర్వహించే ర్యాలీలో పార్టీకార్యకర్తలు, సానుభూతి పరులు తరలిరావాలని కోరారు. జగన్మోహన్, సాంబశివ, బాబ్జాన్, రామ్మోహన్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పల్లెపండగతో రూపుమారిన దారి

**తాడిమర్రి, న్యూస్‌టుడే:** గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. పల్లెపండగ పేరుతో గ్రామాల ప్రధాన రహదారుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తోంది. దీని కోసం ప్రతి మండలానికి రూ.కోట్లు మంజూరు చేసింది. మండలంలోని మేడిమాకులపల్లి గ్రామానికి గతంలో గుంతల దారిపై రాకపోకలు సాగించేవారు. దీంతో ప్రభుత్వం రూ.30 లక్షలతో రోడ్డు వేయించింది. దారికి ఇరువైపులా చెట్లు నాటడంతో పచ్చగా కనిపిస్తోంది.

మేడిమాకులపల్లి గ్రామ రహదారి

## పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం

**కదిరి, న్యూస్‌టుడే:** విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయశాఖ సంచాలకులు కృష్ణమోహన్ పేర్కొన్నారు. 58వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం కదిరిలో ఆకస్మిక తనిఖీ చేశారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలతో నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంతో పాటు గ్రంథాలయ ఉద్యమంలో పోరాడిన యోధుల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగేంద్రకుమార్‌రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

## ఉద్యమాల తోనే గ్రంథాలయాల స్థాపన

**చెన్నేకొత్తపల్లి:** మహోన్నత వ్యక్తుల ఉద్యమాలతోనే గ్రంథాలయాలు స్థాపన జరిగిందని చెన్నేకొత్తపల్లి గ్రంథాలయ అధికారి జయరామ్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పాఠకులు, విద్యార్థినులతో కలిసి పూలమాలలువేసి, నివాళి అర్పించారు.

## వైకాపా నాయకులను అడ్డుకున్న పోలీసులు

**కదిరి, న్యూస్‌టుడే:** వైకాపా కార్యాలయంపై దాడి ఘటనకు ప్రతిగా హిందూపురం వెళ్తున్న వైకాపా నాయకులను ఆదివారం కదిరి పోలీసులు అడ్డుకున్నారు. పులివెందుల నుంచి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సతీష్‌రెడ్డి బయల్దేరి వెళ్తుండగా కుటాగుళ్ల రైల్వేగేట్ వద్ద పోలీసులు ఆపేశారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తీసుకుంటున్న ముందస్తు చర్యలకు సహకరించాలన్నారు. సమీపంలోని వైకాపా నాయకుడు శ్రీనివాసరెడ్డి నివాసానికి తీసుకెళ్లి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవటం సరికాదని వైకాపా నాయకులు ఖండించారు.

## ‘ఏ నోట విన్నా సాయి నామమే వినిపిస్తోంది’

భక్తి ప్రవచనాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో ఎవరి నోట విన్నా.. సాయి నామమే వినిపిస్తోందని, మైకుల ద్వారా సాయి ప్రవచనాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మహిళా పోలీసుస్టేషన్ ప్రాంగణంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి ‘దివ్య నామ స్మరణ చాంటింగ్’ ను ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె ప్రారంభించారు. గణేష్ కూడలి నుంచి చిత్రావతినది వరకు రోజూ మైకుల ద్వారా ప్రజలు, భక్తులకు వినిపించనున్నారు. నేటి నుంచి 24 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. సాయికుల్వంత్ మందిరంలో జరిగే కార్యక్రమాలను ఆడియో ద్వారా ప్రసారం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కలిసికట్టుగా పనిచేద్దాం

**బుక్కపట్నం:** కూటమి నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిద్దామని ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టరుగా పత్తి చంద్రశేఖర్ నియమితులైన విషయం తెలిసిందే. ఆదివారం బుక్కపట్నంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పత్తిచంద్రశేఖర్‌ను వారు సన్మానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, నాయకులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందంటే దానికి కారణం ఎన్డీయే ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## పిల్లలతో పనిచేయించడం నేరం

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** చంటి బిడ్డలను ఎత్తుకుని బిక్షాటన చేయడం, పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని ఎస్.ఐ రవికుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి పట్టణంలో చంటిబిడ్డలను చూపిస్తూ బిక్షాటన చేస్తున్న నలుగురు మహిళలు, ఇద్దరు బాలకార్మికులను పోలీస్‌శాఖ, సమత స్వచ్ఛంద సంస్థ ఆదివారం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సమత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, సునీత, కళావతి, శారద పాల్గొన్నారు.

## రసవత్తరంగా సాగిన మ్యాచ్

క్రీడాకారులతో కోచ్ నజీర్

**కదిరి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కేఎంసీఏ సెక్రటరీ జట్టు 30 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేఎంసీఏ ప్రెసిడెంట్ జట్టు 29 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ఆజామ్, షకీల్, సిబక్తుల్లా, గణేష్, శీనా, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రాయితీ విత్తనాలు

**గాండ్లపెంట, న్యూస్‌టుడే :** రైతు సేవా కేంద్రాల్లో రాయితీతో ప్రత్యామ్నాయ ఉలవ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ షాదాబ్ తెలిపారు. 80 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఉలవ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరుతో ఆర్ఎస్కేలో సంప్రదించాలని కోరారు.

## తొలగించారు సరే.. నిర్మించేదెన్నడు!

ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోకి పీఆర్టీ కాలనీ నుంచి వాహనదారులు దూసుకొస్తున్నారు. యోగా దినోత్సవం నిర్వహించేందుకు ప్రహరీని పురపాలక అధికారులు తొలగించడంతో వాహనదారులు లోపలికి ప్రవేశిస్తున్నారు. దీంతో వ్యాహ్యాలికి వెళ్లేవారు, క్రీడాకారులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రహరీని నిర్మించాలని స్థానికులు పురపాలక అధికారులను కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం

## గుంత.. ఆదమరిస్తే చింత

ముదిగుబ్బలోని కదిరి రోడ్డులో సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న కాలనీలోకి వెళ్లే మార్గంలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదు. సీసీ రోడ్డుకి అంచుల భాగంగా ఓ గుంత ప్రమాదకరంగా ఉంది. చుట్టూ గడ్డిపెరిగి కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అందులోకి పడే ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి గుంతలేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ముదిగుబ్బ

## చెట్టులో యమపాశాలు

ధర్మవరం పట్టణంలోని చిన్నూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్ తీగలు ఇలా చెట్టు కొమ్మల్లో ప్రమాదకరంగా ఉన్నాయి. కొమ్మలు తీగలను తాకుతుండటంతో చెట్టుకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ మార్గంలో వెళ్లేవారు పొరపాటున చెట్టును తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి తీగల్ని తాకుతున్న కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం

## ఉలవల పంపిణీ

**చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే:** చెన్నేకొత్తపల్లి మండల రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ పేర్కొన్నారు. 80 శాతం రాయితీతో ఒక్కో రైతుకు 10 కేజీలు పంపిణీ చేస్తామన్నారు. రాయితీ పోనూ రైతు వాటా రూ.112 చెల్లించాలన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

## బాలిక అదృశ్యంపై గొడవ

**బత్తలపల్లి, న్యూస్‌టుడే:** బాలిక అదృశ్యంపై అనుమానిత యువకుడి తల్లిదండ్రులతో గొడవపడి గాయపరిచిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన హరీష్ అనే యువకుడు తీసుకెళ్లాడని బాలిక తల్లిదండ్రులు యువకుడి తండ్రి శేఖర్, తమ్ముడు నరేష్, తల్లిపై కర్రలు, ఇనుప కడ్డీలతో దాడి చేసి గాయపరిచారని యువకుడి తండ్రి శేఖర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మవరం రెండో పట్టణం సీఐ రెడ్డెప్ప గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ‘పీపీపీ పద్ధతి వద్దు’

**ధర్మవరం, న్యూస్‌టుడే:** వైద్య కళాశాలలు పీపీపీ పద్ధతిలో కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డా.ఆదిశేషు పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో సమావేశ భవనంలో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు సుమలత, అతావుల్లా, కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి తుంపర్తి పరమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, జిల్లా కార్యదర్శి పెద్దన్న, సీపీఎం ఎస్‌హెచ్‌బాషా, చేనేత కార్మిక సంఘం నాయకుడు ఖాదర్‌బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య తదితరులు పేర్కొన్నారు.

## తిమ్మమ్మ మర్రిమాను సందర్శనలో జిల్లా న్యాయమూర్తులు

**నంబులపూలకుంట, గాండ్లపెంట, న్యూస్‌టుడే :** ఎన్పీకుంట, గాండ్లపెంట మండలంలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక ప్రాంతాలైన తిమ్మమ్మ మర్రిమాను, కటారుపల్లిలో యోగి వేమన సమాధిని జిల్లా న్యాయమూర్తులు షాదుబాబు, చిన్నబాబు, పద్మా, డీఎల్ ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్, కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు.

## ఆర్టీసీ కండక్టరు మృతికి సంతాపం

**కదిరి, న్యూస్‌టుడే :** కండక్టరు శ్రీవాణి మృతికి ఎన్ఎంయూఏ నాయకులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. కదిరి డిపోలో పనిచేసి కొంతకాలంగా అనారోగ్యం బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు హరిమోహన్, గోపాలకృష్ణ, బాష, సురేంద్రరెడ్డి, నరసింగరావు, ఎన్ఎంయూఏ నాయకులు ఎన్వీ రమణ, బైరిశెట్టిలు సంతాపం తెలిపారు.

## వైద్య శిబిరానికి స్పందన

**నాగసముద్రం (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే:** చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గ్రామంలో ఆదివారం ఎస్వీ ఇన్‌ఫ్రాటెక్ అధినేత, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేశు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పలువురికి ఉచిత వైద్యసేవలు అందించారు. సవేరా ఆస్పత్రివారి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో గుండె, కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ, టీఎంటీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఐదు మందికి గుండె శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా శస్త్రచికిత్స నిర్వహిస్తామన్నారు. 80 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య సేవల ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు ఎంతో ఉపయుక్తమని శిబిరానికి వచ్చిన వారు పేర్కొన్నారు.

పరిశీలిస్తున్న ఎస్వీ ఇన్‌ఫ్రాటెక్ అధినేత, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేశు

## ఆర్‌సీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

**ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే :** పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ఆ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి మ్యాచ్‌లో ధర్మవరం, బత్తలపల్లి జట్లు తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ధర్మవరం నిర్ణీత 40 ఓవర్లలో 5 వికెట్లకు 284 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బత్తలపల్లి 55 పరుగులకే కుప్పకూలింది. సాయిసంతోష్, కుందన్ చెరో మూడు వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును దెబ్బతీశారు. ఆర్‌సీఎల్ మొదటి మ్యాచ్‌ను పట్టణంలోని కేఎల్ఎన్ సిల్క్ హౌస్ దుకాణ యజమాని చింతా రవి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

# పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

### కలవర పెడుతున్న వరుస ఘటనలు

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** పగలంతా రెక్కీ నిర్వహించడం.. రాత్రిళ్లు చోరీలకు పాల్పడటం.. కొద్ది నెలలుగా దొంగల తీరిది. ప్రధానంగా ఆలయాల్లో హుండీ పగలగొట్టడం, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, పెట్రోల్, డీజిల్, గొర్రెలు, ఆవులు, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్ పెట్టెలు ఇలా దేన్నీ వదలడం లేదు. ఏది దొరికితే అది ఎత్తుకెళ్తున్నారు. ముదిగుబ్బ మండలంలో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**సిబ్బంది కొరత.. తగ్గిన నిఘా?**

పోలీసు శాఖలో సిబ్బంది కొరత కారణంగా రాత్రిళ్లు గస్తీ తగ్గిపోతోంది. దీన్ని దొంగలు ఆసరాగా తీసుకుంటున్నారు. సత్యసాయి జయంత్యుత్సవాల సందర్భంగా స్టేషన్లలోని సిబ్బంది అంతా బందోబస్తుకు వెళ్లడంతో చోరులు అవకాశంగా మలుచుకుంటున్నారు. ఇదే అదునుగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు.

● ఈనెల 7వ తేదీ రాత్రి కొండగట్టుపల్లిలో ఆరు బయట కట్టేసిన ఆవులను బొలెరోలో ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్థులు గమనించడంతో నిందితులు పరారయ్యారు.

**వరుస చోరీల వివరాలిలా..**

● సెప్టెంబరు 25న అర్ధరాత్రి ముదిగుబ్బలోని నాయీబ్రాహ్మణకాలనీలో రమణమ్మ ఇంట్లో బీరువా పగలగొట్టి 6 తులాల బంగారం దోచుకున్నారు.

● అదే నెల 17న ముదిగుబ్బలోని సాయినగర్‌లో యూసఫ్ ఇంట్లో పట్టపగలే ఇంట్లోకి చొరబడి 8 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. 8న బూదనాంపల్లి గ్రామంలో బూదలమ్మ ఆలయంలో దొంగలు హుండీ పగలగొట్టి అందులోని సొమ్ము ఎత్తుకెళ్లడంతోపాటూ ఆధారాలు దొరక్కుండా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు.

● అక్టోబరులో మర్తాడు నేలకోటమ్మ, మంగళపడక గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయాల్లోనూ నగదు చోరీ చేశారు.

● నవంబరు 8న చెంచుగారిపల్లితండాలో శంకర్‌నాయక్‌కు చెందిన 11గొర్రెలు ఎత్తుకెళ్లారు.

మర్తాడులోని నేలకోటమ్మ ఆలయంలో పగలగొట్టిన హుండీ

**నివారణకు చర్యలు తీసుకుంటాం**

- శివరాముడు, శ్యామ్‌రావ్, సీఐలు

దుకాణాలు, హోటళ్లు, ఇళ్లకు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలను పట్టుకునేందుకు మరింత వీలుగా ఉంటుంది. దొంగతనాలకు పాల్పడేవారిపై నిఘా ముమ్మరం చేస్తాం.

## కళాశాలలో తక్షణ ప్రవేశాలు

**కదిరి పట్టణం:** కదిరి పట్టణంలోని బ్లూమూన్ డిగ్రీకళాశాలలో తక్షణ ప్రవేశాలు చేపట్టనున్నట్లు బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న కోర్సుల సీట్ల భర్తీలో భాగంగా సోమవారం నుంచి తక్షణ ప్రవేశాలు చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

**కదిరి, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా పనిచేద్దామని అటవీ అధికారి గురప్ప, పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు తెలిపారు. కదిరిలోని ఆర్అండ్‌బీ అతిథి భవనంలో ఆదివారం సమావేశమయ్యారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. నేషనల్ హ్యూమన్‌రైట్స్ కల్చర్, నేచర్ అభివృద్ధి సంస్థ తరఫున కదిరి ఖాజాపీర్‌ను స్నేక్‌క్యాచర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్షావలి, మహేష్, మోహన్ పాల్గొన్నారు.

## దొంగతనాల కేసులో నిందితుడి పట్టివేత

**రాయచూరు, న్యూస్‌టుడే :** ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన నిందితుడు గుజ్జల రామకృష్ణను అరెస్ట్ చేసినట్లు రాయచూరు ఎస్పీ పుట్టమాదయ్య వెల్లడించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాయచూరు పశ్చిమ పోలీస్ ఠాణా సర్కిల్ పరిధిలో ఆగంతకుడు ఈ ఏడాది మే 20న రెండు ఇళ్లు, ఆగస్టు 29న ఒక ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ నాగరాజు మేకా, ఎస్సై మంజునాథ్, కానిస్టేబుళ్లు నిజాముద్దీన్, జాఫర్ సాదిక్, రమేష్, వినాయక్, సుఖ మునియప్ప, మంజునాథ్, చంద్రశేఖర్, శివప్పతో ఒక బృందాన్ని నియమించామన్నారు. దర్యాప్తులో భాగంగా గుజ్జల రామకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి రూ.36.22 లక్షల విలువైన 315 గ్రాముల ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు ధర్మవరం కేతిరెడ్డి కాలనీలో నివసిస్తూ.. చిప్స్ విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడని చెప్పారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలు చూపుతున్న పోలీసులు

(c) eenadu

# కన్నోళ్ల ఆశలు జలసమాధి..!


రమేష్ (పాత చిత్రం)

**ఆదివారం కావడంతో ఆనందం హద్దులు దాటింది.. మిత్రులతో కలిసి.. ఈతకొట్టేందుకు వెళ్లారు.. నీళ్ల చాటున మాటువేసిన మృత్యువును గుర్తించలేకపోయారు అందరినీ శోక సంద్రంలోకి నెట్టేసి వేదన మిగిల్చారు. క్షణాల్లోనే కన్నోళ్ల ఆశలను జలసమాధి చేసేశారు..**

**వేర్వేరు ఘటనల్లో నీట మునిగి ముగ్గురి మృత్యువాత**

శ్రీకాకుళం గ్రామీణం, సంతబొమ్మాళి న్యూస్‌టుడే

జిల్లాలో ఆదివారం ఘోర విషాదం జరిగింది. వేర్వేరు చోట్ల నీటమునిగి ఇద్దరు బాలురు.. ఓ యువకుడు మృత్యువాత పడ్డారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం కుందువానిపేటలో జరిగిన ఘటనలో గ్రామానికి చెందిన సోడిముడి రమేష్(23) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొందరు చిన్నారులు ఆదివారం సెలవు కావడంతో ఈతకొట్టేందుకు స్థానిక చెరువులో దిగారు. రోషన్ అనే బాలుడు ఈత రాక మునిగిపోవడంతో గమనించిన రమేష్ రక్షించి బాలుడిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే తీవ్రంగా అలసిపోయిన రమేష్ నీటమునిగి చనిపోయారు. మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. రమేష్ ఇటీవల ఓ ఫిషింగ్ కంపెనీలో ఉన్నతోద్యోగానికి ఎంపికయ్యారు. మంగళవారం విధుల్లో చేరాల్సి ఉండగా.. ఇంతలో దుర్ఘటన జరగడంతో కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు. తండ్రి అప్పారావు గతంలోనే మృతి చెందగా.. తల్లి లక్ష్మి ఊళ్లోనే కిరాణా నడుపుతున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రాము తెలిపారు.

**బాలుడిని కాపాడి.. మృత్యుఒడికి చేరి..**

## ఉసురు తీసిన నీటి కుంట

అవినాష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఉపాధి హామీ పనుల నిమిత్తం తవ్విన ఓ నీటి కుంట ఇద్దరు చిన్నారులను బలిగొంది. ఈ ఘటన సంతబొమ్మాళి మండలం నరసాపురం పంచాయతీలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పందిగుంట గ్రామానికి చెందిన రాము, పుష్ప దంపతుల కుమారుడు పిల్లల సుధీర్ (8), పాపారావు, అనురాధ దంపతుల కుమారుడు ముద్ద అవినాష్(9) స్థానిక మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో గ్రామ సమీపంలోని నీటికుంటలో స్నానానికి తోటి పిల్లలతో కలిసి వెళ్లారు. కుంటలోకి దిగిన సుధీర్, అవినాష్ మునిగిపోయారు. మిగతా వారు స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి వచ్చి పిల్లల్ని బయటకు తీసి కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. సంతబొమ్మాళి ఎస్సై సింహాచలం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### మృత్యువులోనూ వీడని స్నేహం..

అవినాష్, సుధీర్

సుధీర్, అవినాష్ ఇద్దరు మిత్రులు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్తారు. తరగతి గదిలోనూ పక్కపక్కనే కూర్చుంటారు. వీరి తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. ఆరో ప్రాణంగా చూసుకుంటున్న కంటి పాపలు విగతజీవులుగా మారే సరికి వారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఘటనపై మంత్రి కె.అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## బోధన భారమై.. యాతన ఏకమై..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నవారు సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు. ఇక్కడ 37 మంది పిల్లలు చదువుకుంటున్నారు. వారికి ఇద్దరు పాఠాలు బోధిస్తున్నారు. గదుల కొరత వేధిస్తుండటంతో అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. దీంతో ఎవరు.. ఏ పాఠం చెబుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఎంఈవో బాలరాజు మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరైతే నూతన భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

● శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో గత నెలలో ఓ ప్రభుత్వ ఉద్యోగి సీటు కోసం హడావుడిగా బస్సెక్కారు. ఆ సమయంలో చొక్కా జేబులో పెట్టుకున్న ఫోన్ మాయమైంది. కాసేపటి తర్వాత చూసుకుని దిక్కుతోచక బస్సు దిగి రెండో పట్టణ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

● కవిటి పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ మహిళ ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. ఇంతలో బైక్‌పై ఓ యువకుడు ఎదురుగా వచ్చి ఆమెను ఢీకొన్నాడు. ఆమె కింద పడిపోగానే రక్షిస్తున్నట్లు నటించి చరవాణి ఎత్తుకెళ్లిపోయాడు.

## స్మార్ట్‌గా దోచేస్తున్నారు..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

ప్రస్తుత రోజుల్లో స్మార్ట్ ఫోన్ అందరి జీవితాల్లో భాగమైపోయింది. ఆర్థిక లావాదేవీలతో పాటు వివిధ దైనందిన కార్యకలాపాలు దాంతోనే ముడిపడి ఉంటున్నాయి. అవసరాన్ని బట్టి ఒక్కొక్కరూ రూ.వేల నుంచి రూ.లక్షలు వెచ్చించి స్మార్ట్ ఫోన్లు కొంటున్నారు. కొందరు దుండగులు వాటి కోసమే మాటేసి.. తెలివిగా కొట్టేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా చరవాణి చోరీ కేసులు ఇటీవల అధికమయ్యాయి. ఒక్కో పోలీసు స్టేషన్ పరిధిలో నెలకు సగటున ఐదారు ఫిర్యాదులు వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**జిల్లాలో పెరుగుతున్న చరవాణుల చోరీలు**

### రెక్కీ నిర్వహించి.. నొక్కేస్తున్నారు..

నలుగురైదుగురు సభ్యులు ముఠాగా ఏర్పడతారు. బజార్లు, బస్టాండ్లు.. ఇలా రద్దీ ప్రదేశాల్లో రెక్కీ నిర్వహిస్తారు. ఆయా చోట్ల చరవాణిలో మాట్లాడే వారిని గుర్తిస్తారు. వారి ముఖ కవళికలు గమనించి.. గాబరా పడుతున్నవారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. కొందరు దగ్గరికి వెళ్లి మాటలతో ఏమారుస్తారు.. మరి కొందరు వేరే రూపంలో బాధితులను మోసం చేసి క్షణాల్లో మాయమైపోతారు. వెంటనే స్విచ్ఛాఫ్ చేసేస్తారు.

జిల్లాలో వివరాలిలా..




### స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు..

- చరవాణి పోగొట్టుకుంటే పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే https://www.ceir.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు.
- వెబ్‌సైట్‌లోకి వెళ్లాక పేరు, వివరాలు, ఫోన్ ఐఎంఈఐ నంబరు, ఐడీ సంఖ్య నమోదు చేస్తే వివరాలు సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళ్తాయి.
- లోకేషన్ ఆధారంగా స్థానిక పోలీసులు ట్రాక్ చేసి నిందితుల్ని పట్టుకుని రికవరీ చేస్తారు.
- సీఈఐఆర్ అన్ని నెట్‌వర్క్ డేటా బేస్‌లతో అనుసంధానించడంతో దుండగులు ఫోన్‌లో వేరే సిమ్ వేసినా వెంటనే సమాచారం తెలిసిపోతుంది.

**ఆలస్యం చేయొద్దు..** చరవాణి వినియోగించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. చోరీకి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాలి. అప్పుడు త్వరగా రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుంది. సంబంధిత సైబర్ క్రైం స్టేషన్‌తో పాటు ceir పోర్టల్ ద్వారా కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చు. – పి.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ

## టెస్ట్ క్రికెట్‌లో మెరిసిన మోక్షిత్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విశాఖ నగరంలోని ఎంఎస్‌కే మైదానంలో ఆదివారం నిర్వహించిన అండర్-14 టెస్ట్ క్రికెట్‌లో సిక్కోలు క్రీడాకారుడు పొలుమూరు మోక్షిత్ శ్రీనైతిక్ 186 బంతుల్లో 12 బౌండరీలతో 62 పరుగులు చేశాడు. శ్రీకాకుళం జట్టు టాస్ గెలిచి 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 243 పరుగులు సాధించింది. మోక్షిత్‌ను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హాసన్‌రజా, కోశాధికారి కేఎస్ఎం షైలానీ, మెంటార్ ఇలియాజ్ అహ్మద్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.

## రోజుకు 25 ఇళ్లు.. 2,234 బృందాలు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం నుంచి నిర్వహించనున్న కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేలో పరీక్షలు చేసి స్పర్శ లేని మచ్చలు గుర్తించాలని కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డా.తాడేల శ్రీకాంత్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆదివారం కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 2,234 బృందాలను సర్వే నిమిత్తం నియమించినట్లు తెలిపారు. ఆశా కార్యకర్త, ఓ వాలంటీరు రోజుకు 25 ఇళ్లు సర్వే చేస్తారన్నారు. ఈ నెలాఖరు వరకు సర్వే జరుగుతుందన్నారు. అనుమానిత కేసులు గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపుతారని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్యుని ఆదాయం రూ.11.10 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.11.10 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు.

## తేమ ఉన్నా.. తేడా రాకుండా

న్యూస్‌టుడే, నరసన్నపేట

- ధాన్యం కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు
- కేంద్రాలు, మిల్లర్ల వద్ద ఒకే తరహా మీటర్లు

ఖరీఫ్ వచ్చిందంటే చాలు ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులు మోసపోతుంటారు. తేమ శాతం పేరుతో మిల్లర్లు అన్నదాతలను దోచుకోవడం పరిపాటైపోయింది. కొనుగోలు కేంద్రాల్లో నమోదైన తేమ శాతానికి, రైసు మిల్లుల్లోని తేమ శాతానికి తేడాలుండటం మిల్లర్లకు కలిసొస్తోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో ఒకేలాంటి మీటర్లను పౌరసరఫరాల సంస్థ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే దీనిపై మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ మేరకు జిల్లాలో ఒకే తరహా తేమ శాతం కొలిచే యంత్రాల కొనుగోలు పెరిగింది.

తేమ శాతం కొలిచే పరికరం

జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల పంట కొనేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆ మేరకు తేమ శాతం కొలిచే యంత్రాలు కొత్తవి సమకూర్చుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దాదాపు రూ.30 వేల విలువైన ఇండోసా కంపెనీకి చెందిన మీటర్లను కొనుగోలు చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారులు సూచించారు. వాటిని సమకూర్చుకున్న మిల్లుల్ని మాత్రమే ధాన్యం సేకరణకు ప్రభుత్వం గుర్తించనుంది. ఆ మేరకు చాలా మంది మిల్లర్లు సమకూర్చుకున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇదీ..**

- మొత్తం ధాన్యం మిల్లులు: 267
- వరి సాగు విస్తీర్ణం: 5.9 లక్షల ఎకరాలు
- దిగుబడి అంచనా: 8 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు కేంద్రాలు: 406

**ఆ మీటర్లు ఉంటేనే..** రైతులు తీసుకొచ్చే ధాన్యంలో తేమ శాతంలో తేడాలు ఉండకుండా చర్యలు చేపడుతున్నాం. గతంలో ఆర్ఎస్‌కేల్లో ఒకలా, మిల్లర్ల వద్ద మరోలా నమోదయ్యేది. ఇకపై ఆ పరిస్థితి లేకుండా ఒకేలాంటి మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం సూచించిన మీటర్లు లేని మిల్లులను ధాన్యం సేకరణకు గుర్తించాం. – టి.వేణుగోపాల్, డీఎం, పౌరసరఫరాల సంస్థ

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు meekosam.ap.gov.in లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## మా ఇష్టం.. తవ్వేస్తాం..!

వంశధార నదీ తీర గ్రామాల్లో జరుగుతున్న ఇసుక దోపిడీకి అద్దం పడుతోంది చిత్రం. కొత్తూరు మండలం వసప వద్ద నదిలో యంత్రాలతో ఇలా ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాల ద్వారా సమీపంలోని ఒడిశాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర సరిహద్దులోని కడుములోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అక్రమార్కులు పగలు, రాత్రి తేడా లేకుండా చెలరేగిపోతున్నారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో నాటు బండ్లపై తరలించుకుపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై కొత్తూరు తహసీల్దార్ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని, నిందితులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

## కొంటే నష్టం.. తింటే కష్టం..!

న్యూస్‌టుడే, రణస్థలం

ఉరుకులు పరుగుల జీవనం.. భార్యాభర్తలిద్దరికీ ఉద్యోగాలు.. ఇంట్లో వంట చేసుకునే ఓపిక లేకపోవడం.. తదితర కారణాలతో చాలా మంది బయట ఆహారాన్నే ఎక్కువగా తింటున్న రోజులివి. ఇదే అదనుగా హోటళ్లు, దాబాల్లో నచ్చినట్లు వండి వడ్డిస్తున్నారు. కల్తీ పదార్థాలతో చేసిన ఆహారం పెడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. రుచి బాగుండాలని విచ్చలవిడిగా రంగులు, రసాయనాలు కలిపేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రణస్థలం సమీపంలోని ఓ దాబాలో అపరిశుభ్ర వాతావరణంలోనే వండుతున్న సిబ్బంది

● జులైలో వజ్రపుకొత్తూరు మండలం పూండి కూడలి వద్ద, రణస్థలం, సోంపేట మండలం కొర్లాంలోని దాబాల్లో సెప్టెంబరులో వంటకాల్లో రంగులు కలుపుతున్నట్లు గుర్తించారు. నమూనాలు సేకరించి..ల్యాబ్‌కు పంపారు.

● శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఓ అల్పాహార దుకాణంలో అక్టోబరులో అధికారులు తనిఖీ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తున్నట్లు గుర్తించడంతో పాటు వంటగదిలో ఎలుకలు, ఇతర కీటకాలు సంచారాన్ని గమనించి కేసు నమోదు చేశారు.

### మొక్కుబడిగా తనిఖీలు..

అనుమతి లేకుండా వందలాది మంది వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. మొక్కుబడిగా తనిఖీలు చేసి.. నామమాత్రంగా నమూనాలు సేకరించి చేతులు దులిపేసుకుంటున్నారు. ఫిర్యాదులు అందితే తప్ప సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లని పరిస్థితి నెలకొంది. కొన్ని ఘటనల్లో నమూనాల ఫలితాలు వచ్చాక కూడా కేసుల నమోదుకు తాత్సారం చేస్తున్నారు. కల్తీ, నాసిరకం ఆహారం తీసుకుంటే కలిగే నష్టాలపై ఆహార భద్రతాధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవట్లేదు.

**కల్తీ ఆహారంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

**ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు:**

- లక్ష్మి: 94417 67210 (డివిజన్ 1: శ్రీకాకుళం ఆమదాలవలస పాతపట్నం నరసన్నపేట న్యాయస్థానాల పరిధి)
- జి.శ్రీరాములు: 81067 89839 (డివిజన్ 2: ఎచ్చెర్ల, పొందూరు, శ్రీకాకుళం, పలాస, సోంపేట కోర్టుల పరిధి)

### చర్యలు తీసుకుంటాం..

రెండు డివిజన్ల పరిధిలో ప్రతి నెలా తనిఖీలు జరుగుతున్నాయి. అధికారులు నమూనాలు సేకరించి.. పరీక్షలకు పంపిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. సెప్టెంబరులో వీధి వ్యాపారులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. ఎక్కడైనా సమస్య ఉంటే తెలియజేయండి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – లక్ష్మీనారాయణ, జిల్లా ఆహార భద్రతాధికారి

- జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దాబాలు: సుమారు 1,600
- వాటిల్లో పూర్తి స్థాయి అనుమతులున్నవి: 300లోపే
- కేవలం రిజిస్ట్రేషన్ చేసుకున్నవి: 800 వరకు
- న్యాయస్థానాల్లో నడుస్తున్న ఆహార కల్తీ కేసులు: 60

## చింతలేకుండా.. చేతికే పత్రం..!

**‘జీవన్ ప్రమాణ్ యాప్’తో వృద్ధులకు ఊరట**

న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన వారు ఏటా జీవన ప్రమాణ పత్రం పొందాలి. వాటి కోసం పింఛనుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా తంటాలు పడేవారు. వాటికి స్వస్తి పలికేందుకు కేంద్ర ప్రభుత్వం ‘జీవన్ ప్రమాణ్ యాప్’ను అందుబాటులోనికి తీసుకొచ్చింది. దాని ద్వారా సులువుగా ధ్రువపత్రాన్ని పొందేలా అంతా సిద్ధం చేసింది.

● కొత్తూరు, ఇచ్ఛాపురం, సోంపేట వంటి దూర ప్రాంతాల నుంచి వృద్ధులు ఈ పత్రాల కోసం కి.మీ. దూరంలోని సమీప పట్టణాల్లోని కార్యాలయాలకు వెళ్లి ఇబ్బంది పడేవారు. యాప్ రావడంతో వారి వ్యయప్రయాసలు తగ్గనున్నాయి.

**ధ్రువపత్రం పొందడం ఇలా..**

- యాప్‌లో పెన్షన్ ఆధార్ సంఖ్య, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదు చేయగానే పింఛన్‌దారుల పూర్తి వివరాలు ప్రత్యక్షమవుతాయి.
- పేరు, పీపీవో సంఖ్య, బ్యాంకు, డిపార్ట్‌మెంట్, పింఛను మంజూరు ఏజెన్సీ వివరాలు పొందుపరచాలి.
- తర్వాత ఫేస్ స్కాన్ చేస్తే ‘లైఫ్ సర్టిఫికేట్ జనరేట్’ అనే సందేశం వస్తుంది.
- గతంలో జీవన పత్రం పొందని వారు వివరాలను కొత్తగా నమోదు చేయాల్సి ఉంటుంది.

**రిజిస్ట్రేషన్ విధానం ఇదీ..**

● గూగుల్ ప్లే స్టోర్‌లో జీవన్ ప్రమాణ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ● ఆధార్, చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ నమోదు చేసి లాగిన్ అవ్వాలి. ● చరవాణికి వచ్చిన ఓటీపీ ఎంటర్ చేయగానే ముఖ ధ్రువీకరణ అడుగుతుంది. ● అనంతరం పచ్చటి గీతతో సర్కిల్ వచ్చి సక్సెస్ అని సందేశం వస్తే రిజిస్ట్రేషన్ పూర్తయినట్లే.

**జిల్లాలో వివరాలిలా..**

- ఉప ఖజానా కార్యాలయాలు: 12
- పింఛనుదారులు 16,556 మంది

**మంచి అవకాశం..** డిసెంబరులోగా కేంద్ర ప్రభుత్వ, వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లోనూ పత్రాలు తీసుకుంటాం. యాప్ ద్వారా సులువుగా వాటిని పొందొచ్చు. ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – సీహెచ్ రవికుమార్, ఖజానాశాఖ ఉప సంచాలకులు

## కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కండి

మాట్లాడుతున్న ఆచార్య పాల్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాజ్యాంగ వ్యవస్థల కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడటానికి అన్ని వర్గాలు సిద్ధం కావాలని రాజ్యాంగ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య ఎన్ఏడీ పాల్ అన్నారు. ఈ నెల 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ‘రాజ్యాంగ వ్యవస్థల కాషాయీకరణం - మన కర్తవ్యం’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు ఎం.కృష్ణయ్య, ఎస్వీ జగన్నాథం, డి.గణేశ్, కె.వేణు, ఆర్.అప్పారావు కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## కడలి దిశగా కన్నీటి పరవళ్లు..!

న్యూస్‌టుడే, హిరమండలం

వంశధార నదిలోని వరద నీరంతా వృథాగా పోతోంది. అక్టోబరు మొదటి వారంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆ నెల 3న నదిలో లక్ష క్యూసెక్కులకుపైగా నీటి ప్రవాహం చేరింది. ఆ జలమంతా గొట్టాబ్యారేజీ మీదుగా కడలిలోకి విడిచిపెట్టేశారు. సమస్యకు పరిష్కారం చూపే అభివృద్ధి పనులు అటకెక్కడంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు.

● ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల అధికారులు 1962లో నదిలో ఏటా సుమారు 105 టీఎంసీలకుపైగా నీరు పారుతోందని లెక్కించారు. అందులో చెరి సగం నీటిని అంటే 52.5 టీఎంసీలు వినియోగించుకునేందుకు నిర్ణయించారు. ఇంతవరకు ఎప్పుడూ పూర్తి స్థాయిలో వాడుకోలేదు.

● జిల్లాలో వరద నీటిని సద్వినియోగం చేసుకునేందుకు హిరమండలంలో 2005లో 19 టీఎంసీల సామర్థ్యంతో వంశధార ఫేజ్-2, స్టేజ్-2 జలాశయం పనులు ప్రారంభించారు. 18 ఏళ్లలో 93 శాతం పనులు చేసినా ఉపయోగం శూన్యం. కొత్తూరు, భామిని మండలాల్లో నిర్మించిన వరద కాలువలు, మినీ జలాశయాల ద్వారా ఆశించిన మేరకు జలాశయంలోకి నీరు రావట్లేదు.

గొట్టాబ్యారేజీ నుంచి దిగువకు పోతున్న వంశధార నీరు

● వీటికి ప్రత్యామ్నాయంగా రూ.176 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న హిరమండలం ఎత్తిపోతల పథకం పనులు 45 శాతం జరిగినా ఇంతవరకు బిల్లు మంజూరు కాలేదు. ఫలితంగా కళ్లెదుటే విలువైన నీరు కడలి పాలవుతోంది.

**వంశధార జలాశయం పనులు పూర్తికాక ఇబ్బందులు**

- అక్టోబరులో వృథాగా సముద్రంలో కలిసిన నీరు: 47.7 టీఎంసీలు
- ఎడమ ప్రధాన కాలువ ద్వారా పొలాలకు విడిచిపెట్టింది: 13.38 టీఎంసీలు
- ఆయకట్టు వివరాలు: 12 మండలాల్లో 1.48 లక్షల ఎకరాలు
- కుడి ప్రధాన కాలువ ద్వారా విడుదల: 2.69 టీఎంసీలు
- సాగు భూమి: ఏడు మండలాల్లో 68 వేల ఎకరాలు

● కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వంశధార ఫేజ్-2, స్టేజ్-2 పనుల పూర్తికి నిధులు కేటాయిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రైతులు భావిస్తున్నారు.

### ప్రభుత్వానికి నివేదించాం

వంశధార ఫేజ్-2, స్టేజ్-2 పనులు పూర్తి చేసేందుకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించాం. ఎక్కడైనా పనులు చేసేందుకు ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరిస్తున్నాము. వచ్చే ఏడాదికి అన్ని పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. – బి.రవీంద్ర, ఈఈ, వంశధార కన్‌స్ట్రక్షన్ డివిజన్, హిరమండలం


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80085 97609

# గ్యాస్ బండకూ ఉందో గడువు..!

● బట్వాడా సమయంలో చూసుకుంటే మేలు

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వంటకు గ్యాస్ సిలిండరు వినియోగించని కుటుంబం లేదంటే అతిశయోక్తి కాదు. వినియోగదారులకు కేంద్రం రాయితీ ఇస్తుండగా.. అర్హులైన పేద కుటుంబాలకు దీపం 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి 3 బండలు ఉచితంగా అందజేస్తోంది. వినియోగంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం పొంచి ఉన్నట్లే. సిలిండరు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

**సిలిండర్లు సరఫరా చేస్తున్న కంపెనీలు: ఇండేన్, భారత్, హెచ్‌పీసీఎల్**

## తేదీ చూడండి..

సిలిండరు ఇంటికి వచ్చినప్పుడు బరువు నిర్ధారించుకోవాలి. దానిపై ఉండే గడువు తేదీని తప్పనిసరిగా చూడాలి. గడువు ముగిసిన బండను వినియోగిస్తే ప్రమాదం పొంచి ఉన్నట్లే. సిలిండరుపై భాగంలో రింగుకు దిగువ ప్లేట్‌పై కోడ్ రాసి ఉంటుంది. అక్కడ ఏ-26 అని ఉంటే 2026 జనవరి నుంచి మార్చిలోగా గడువు ముగుస్తుందని అర్థం. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు 'ఏ' అక్షరం వినియోగిస్తున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు 'బి', జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు 'సి', అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు 'డి' అక్షరాలను కోడ్‌గా నమోదు చేస్తున్నారు. బట్వాడా సమయంలో జాగ్రత్తగా గమనించి తీసుకుని వినియోగించడం మేలు.

**జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు : 43 కనెక్షన్లు : 6,92,825**

## ప్రమాద బీమా పొందొచ్చు

ఒక్కోసారి సిలిండరు కారణంగా ప్రమాదం జరగొచ్చు. బీమా పొందొచ్చనే విషయం తెలియక చాలా మంది నష్టపోతున్నారు. ప్రమాదం జరిగిన కుటుంబానికి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకూ బీమా వర్తిస్తుంది. దీని కోసం రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదు. గ్యాస్ బుక్ చేసుకున్నప్పుడే 'పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్' పాలసీ ద్వారా బీమా వర్తిస్తుంది.

➤ గ్యాస్ బండ పేలి ఆస్తి నష్టం జరిగితే రూ.2 లక్షలు, వ్యక్తి మృతి చెందితే రూ.6 లక్షలు, గాయపడి చికిత్స పొందుతూ ఉంటే ఒక్కో వ్యక్తికి రూ.2 లక్షలు ఇస్తారు. తక్షణ సాయంగా రూ.25 వేలు చెల్లిస్తారు.

## వెంటనే సమాచారం ఇవ్వాలి..

ప్రమాదం జరిగితే ఆలస్యం చేయకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారమివ్వాలి. అగ్నిమాపక సిబ్బంది ధ్రువీకరణ పత్రం అవసరం. ఇంధన కంపెనీల నిర్వాహకులు విచారణ చేపట్టి బీమా వర్తింపజేస్తారు. సిలిండరు తీసుకునే సమయంలో పరిశీలన అవసరం. గ్యాస్ లీక్ అయినట్లు వాసన వస్తున్నా.. బరువులో తేడా ఉన్నా ఆ బండను వెనక్కి ఇచ్చేయాలి.

– సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

# ఫెర్రో ఎల్లాయిస్‌కు మంచి రోజులు..!

రావివలసలోని ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ

టెక్కలి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ మళ్లీ తెరుచుకోనుంది. ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేసి ప్రారంభానికి యాజమాన్యం సిద్ధం చేస్తోంది. 1990లో గ్రంధి మల్లికార్జునరావు శారదా ఫెర్రోఎల్లాయిస్ పేరుతో దీన్ని స్థాపించారు. కొన్నేళ్ల తర్వాత జీఎమ్మార్ ఫెర్రో ఎల్లాయిస్‌గా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఆయన సోదరుడు గ్రంధి ఈశ్వరరావు చేతికి ఇది వెళ్లింది. అక్కడి నుంచి కొన్నాళ్లకు మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయిస్ పేరిట బదలాయింపు జరిగింది. 2016లో తొలిసారిగా నష్టాల పేరుతో పరిశ్రమకు లాక్‌డౌన్ ప్రకటించారు. ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఇక్కడి తాత్కాలిక నిరసన శిబిరాన్ని సందర్శించి పరిశ్రమను తెరిపిస్తానని మాటిచ్చారు. ఆ క్రమంలోనే 2022లో అభిజిత్ సంస్థ మెట్‌కోర్ ఫెర్రోఎల్లాయిస్‌ను న్యాయస్థానంలో దక్కించుకుంది. అంతవరకు కార్మికులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను న్యాయస్థానంలో పరిష్కరించుకునే విధంగా ఒప్పందం జరిపి, తాత్కాలిక మరమ్మతులు చేసి పరిశ్రమను ప్రారంభించారు. కొన్నాళ్లకు అభిజిత్ సంస్థ నష్టాల పేరుతో పరిశ్రమను మూసివేసింది. ఆ తర్వాత ఎన్నికలకు కొద్దిరోజుల ముందు వెంకటేశ్వర ఇంజినీరింగ్ వర్క్స్ సంస్థ పరిశ్రమను తెరిచింది. కొద్దికాలం నడిపిన అనంతరం వారు సైతం 2024, జులై 31న మూసివేశారు. ఇటీవల ఓస్వాల్ మినరల్స్ సంస్థ యూనిట్‌ను నడిపేందుకు ముందుకొచ్చింది. మరమ్మతులను పూర్తిచేశారు. భారీగా పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. దీంతో స్థానికంగా కార్మికులకు, ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగావకాశాలు దక్కుతాయని, ఇతర వ్యాపారాలు సైతం పుంజుకుంటాయని ఆశిస్తున్నారు.

## కాలుష్య సమస్య అధిగమించేనా..

శారద ఫెర్రోఎల్లాయిస్ ప్రారంభించిన నుంచి 2016లో మూత పడే వరకు కాలుష్య సమస్య తలెత్తలేదు. అభిజిత్ సంస్థ బాధ్యతలు చేపట్టాక కాలుష్య సమస్యపై స్థానికుల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఫెర్రో క్రోమ్‌తో పాటు మాంగనీస్‌కు సంబంధించిన కొన్ని మిశ్రమాలు ఉత్పత్తి చేస్తున్నారని, దాని వల్ల ప్రాణాంతక విష వాయువులు వ్యాపిస్తున్నాయన్న ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సైతం పరిశీలించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పురాలేదు. తాజాగా నూతన యాజమాన్యం పరిశ్రమను ప్రారంభిస్తున్న నేపథ్యంలో స్థానికుల నుంచి మళ్లీ అదే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా పరిశ్రమ చుట్టూ ఆవాసాలు పెరగడంతో కాలుష్య ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పరిశ్రమకు సంబంధించి గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేయకపోవడం, గ్రీన్‌బెల్టు కోసం కొనుగోలు చేసిన భూమిని ఇతరులకు అమ్మేయడం వంటి పరిణామాలతో కాలుష్య నివారణకు ఎటువంటి చర్యలు చేపడతారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# ఇలా తీస్తే అలా విస్తరణ

● రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం శూన్యం

దేశవానిపేట వద్ద 11ఆర్.కిల్లాం కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

నరసన్నపేట, న్యూస్‌టుడే: వంశధార కాలువల్లో గుర్రపుడెక్క సమస్య వేధిస్తోంది. నరసన్నపేట డివిజన్ పరిధిలో 11. ఆర్.కిల్లాం కాలువ ఆయకట్టు పరిధి 4,800 ఎకరాలు. దాదాపు 5 కి.మీ. మేర గుర్రపుడెక్క పేరుకు పోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో సుమారు రూ.8 లక్షలతో పనులు చేపట్టినా సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీనిపై ఈఈ మురళీమోహనరావు వద్ద ప్రస్తావించగా.. వచ్చే ఏడాదిలో పనులు చేపడతామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి సరఫరా దృష్ట్యా చర్యలు తీసుకోలేమని చెప్పారు.

# వైకాపా సభలో గందరగోళం

రసాభాసగా మారిన రచ్చబండ కార్యక్రమం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసలో వైకాపా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం గందరగోళానికి దారితీసింది. పార్టీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా రచ్చబండ సమావేశం చేపట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, సంక్షేమాన్ని గాలికొదిలేశారని మాట్లాడుతూ.. మంత్రి అచ్చెన్నాయుడిపై పేరాడ తిలక్ విమర్శలు చేశారు. దీంతో యువకులు, మహిళలు, పలువురు తెదేపా కార్యకర్తలు ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. గ్రామంలో వైకాపా హయాంలో చేపట్టిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని.. అచ్చెన్నపై అనవసర విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు. దీంతో కొద్దిసేపు వైకాపా, తెదేపా కార్యకర్తల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. సంతబొమ్మాళి పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రోద్బలంతో తెదేపా నాయకులు గందరగోళం సృష్టించారని వైకాపా నేత పేరాడ తిలక్ ఈ సందర్భంగా ఆరోపించారు.

# యూటీఎఫ్ నమూనా పరీక్షకు స్పందన

విజేతలతో యూటీఎఫ్ నాయకులు

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జవహర్ నవోదయ నమూనా ప్రవేశ పరీక్షకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 303 మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్రీకాకుళం జిల్లా నుంచి రఘుచంద్ర (85), పి.గిరీష (81.5), కె.వరుణ్‌సాయి (80), మోక్షజ్ఞశ్రీ (80), కె.భరత్‌చంద్ర (78.7), ఎస్.సాయితేజ (77.5), వై.రోహిత్‌ఖేష్ (77.5), ఎం.హితిక (75), ఎ.మన్వితసాయి (75), ఎస్.జ్ఞానదీప కసిద్దార్థ (75), జి.చేతనశ్రీ (73.75), చాందిని (67.5) మార్కులు సాధించారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికలు బహూకరించారు. సమాఖ్య నాయకులు ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, ఎస్.సతీశ్, బి.దుర్గాప్రసాద్, ఎ.స్వామిబాబు, రాజ్యలక్ష్మి, బి.వాసుదేవరావు, ఎస్.గణేశ్, వి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ తోటలో యువ కుసుమాలు..!

సామాజిక అంశాలపై కలం సంధిస్తున్న రచయితలు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

వృత్తులు వేరైనా తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారీ యువ రచయితలు. ఎన్నో కోణాల్లో వారు రాసిన కవితలు, నాటికలు, కథలు, నవలలు, నాటకాలు పాఠకులను ఆలోచింపజేస్తున్నాయి. సిక్కోలు పుస్తక మహోత్సవంలో యువ రచయితల రచనలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వారిలో కొందర్ని 'న్యూస్‌టుడే' పలకరించగా పంచుకున్న విశేషాలు వారి మాటల్లోనే..

## సాధికారక సమాచారమిచ్చేది పుస్తకమే..

మాది నందిగాం మండలం బడగాం గ్రామం. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. వలస పక్షుల విడిది తేలినీలాపురం, కొంగా నా గోరు మీద పువ్వెయ్యవా, నీటిగింజల పంట, గీసి చెరిపే బొమ్మ కవితా సంపుటాలు, సుమారు 400 కవితలు రాశా. వివిధ సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నా. 2020లో 'ఈనాడు' కరోనాపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. నా కవితలు పలు వార, మాస పత్రికల్లో ప్రచురించారు. సెల్‌ఫోన్ అందించలేని సాధికారక సమాచారాన్ని పుస్తకం మాత్రమే ఇస్తుంది. గొప్ప సాహిత్యం చదవితే ఉత్తమ వ్యక్తిత్వంతో మంచి మనుషులుగా ఎదగడానికి అవకాశం కలుగుతుంది. – కంచరాన భుజంగరావు, రచయిత

## ప్రజా సమస్యలపై చైతన్యం

మాది పలాస మండలం మాకన్నపల్లి. విశ్రాంత సైనికుడ్ని. ఉద్దానంలో కిడ్నీ సమస్యలు, పేదల బతుకులు, వలస జీవితాలపై విరోజ్గర్జన్ కలం పేరిట రచనలు చేస్తూ పాటలు పాడి చైతన్యం తీసుకొస్తున్నా. 120 ప్రజా పాటలు, 130 కవిత్వాలు రాశాను. వివిధ పత్రికల్లో ప్రచురించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 'స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు' పేరిట పుస్తకం రాశా. ఉత్తరాంధ్రలో జానపద కళారూపాలకు జవసత్వాలు కల్పించడానికి సిక్కోలు జానపద సాహిత్య వేదిక ఏర్పాటు చేశాం. యువత పుస్తక పఠనం చేస్తేనే ఉత్తమ పౌరులవుతారు. – కుత్తుం వినోద్, ప్రజాకవి

## పఠనంతో సాహిత్యంపై జిజ్ఞాస పెరుగుతుంది..

మాది శ్రీకాకుళం నగరం. ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నా. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, దళిత నేపథ్యంలో రచనలు చేస్తుంటా. 70 కవితలు రాశాను. నేను రాసిన కళింగోరా కవిత ప్రసిద్ధి పొందింది. చుక్కల నిచ్చెన కవితకు జాతీయ పురస్కారం లభించింది. పుస్తకాలు పఠిస్తే సాహిత్యంపై జిజ్ఞాస పెరుగుతుంది.

– కలమట దాసుబాబు, రచయిత

## సామాజిక రుగ్మతలపై రచనలు రావాలి

మాది పొందూరు మండలం రామదాసుపురం. తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. నా సోదరులు వెంకటరావు, విశ్వనాథం నటులు, నాటక దర్శకులు కావడంతో చిన్నప్పట్నుంచే రచనా వ్యాసంగం చేశాను. ఆఖరి మెట్టు, ప్రేమించే హృదయాలు పేరిట నవలలు, కూన కథలు పేరిట కథా సంకలనం, నటసింహ సాంఘిక నాటకం, సుమారు 50 కవితలు రాశాను. వివిధ పత్రికల్లో వాటిని ప్రచురించారు. నేను రాసిన చైతన్యం నాటిక ఆధారంగా హైదరాబాద్‌లో పిల్లలు ప్రదర్శన ఇచ్చారు. సమకాలీన సామాజిక రుగ్మతలపై రచనలు రావాలి. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రచనలు చేయాలి

– కూన రంగనాయకులు, రచయిత, తెలుగు భాషోపాధ్యాయుడు

# ఆదర్శ సమాజ నిర్మాణంలో రచయితల పాత్ర కీలకం

టెలిస్కోప్ ద్వారా చూడటానికి వరుస కట్టిన సందర్శకులు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదర్శ సమాజ నిర్మాణంలో రచయితలు, కవుల పాత్ర కీలకమని పలువురు వక్తలు తెలిపారు. శ్రీకాకుళం నగరంలో ఏడు రోడ్ల కూడలి వద్ద నగరపాలక సంస్థ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో ఆదివారం కళింగాంధ్ర సాహిత్యం మహిళ, ఆదివాసీ, దళిత ఆవరణాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. రచయిత చింతాడ తిరుమలరావు సమన్వయకర్తగా నిర్వహించిన సాహితీ సమావేశంలో రెండు పుస్తకాలు ఆవిష్కరించారు. పలాసకు చెందిన కుత్తుం వినోద్, శాంతారాం ఆధ్వర్యంలో సిక్కోలు జానపద కళా వేదిక బృందం గేయాలు ఆలపించింది. డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.ఆర్.రజని అధ్యక్షతన జరిగిన సదస్సులో రచయిత కంచరాన భుజంగరావు రాసిన కేఎల్ఎన్ కొల్లి ఆంగ్లానువాదం పెయిన్స్ అండ్ గెయిన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మల్లిపురం జగదీశ్ రాసిన అడవి పూల దారిలో పుస్తకాన్ని పక్కి రవీంద్రనాథ్ పరిచయం చేశారు. రచయిత్రి కత్తి పద్మ సిక్కోలు ఉద్యమ సాహిత్యంతో ప్రసిద్ధి పొందారని తెలిపారు. కవితా పఠనం చేసిన కవులు, రచయితలకు సమగ్ర శిక్షా ఏపీసీ శశిభూషణ్, డా.కె.సుధీర్ జ్ఞాపికలు అందజేసి అభినందించారు. పుస్తక మహోత్సవం నిర్వాహక ప్రతినిధులు కె.లక్ష్మయ్య, కేతవరపు శ్రీనివాస్, గొంటి గిరిధర్, కంచరాన భుజంగరావు, సుధాకరరావు, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెయిన్స్ అండ్ గెయిన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ రజని, రచయితలు, కవులు

# వ్యవసాయ శాఖ అధికారుల సంఘ కార్యవర్గ ఎన్నిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ అధికారుల సంఘ కార్యవర్గ ఎన్నిక శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.బాలభాస్కర్, ఉపాధ్యక్షుడు బి.విజయప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.ప్రవీణ్ పర్యవేక్షణలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎల్.వెంకట మధు, ఉపాధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా వై.సూర్యకుమారి, కోశాధికారిగా ఎం.మోహనరావు, గౌరవాధ్యక్షుడిగా కె.జగన్‌మోహనరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యవసాయ శాఖ అధికారుల సంఘ నూతన కార్యవర్గం

# ప్రతి ఒక్కరిలో దేవుడున్నాడు..!

పొందూరు, న్యూస్‌టుడే: హిందూ ధర్మపరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పలువురు పీఠాధిపతులు అన్నారు. పొందూరు మండలం కృష్ణాపురం(గారపేట) ఆనందాశ్రమంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానందసరస్వతి అధ్యక్షతన హిందూ ధార్మిక మహా సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు యోగీశ్వర్ ప్రభుజీ, రామారావు స్వామీజీ మాట్లాడుతూ గురువును గౌరవించినప్పుడే తెలుగు సంప్రదాయాలను కాపాడినట్లవుతుందన్నారు. దేవుడు ప్రతి మనిషిలో ఉంటారన్నారు. భగవద్గీత, భారతం, రామాయణం తదితర గ్రంథాల్లో పలు అంశాలను భక్తులకు వివరించారు. శ్రీనివాసనందసరస్వతి మాట్లాడుతూ హిందూ ధర్మం కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పీఠాధిపతులు అడుగు జాడల్లో ఆధ్యాత్మికత విరాజిల్లాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ సనాతన ధరాన్ని ప్రతి ఒక్కరూ రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య యాగం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వేల మంది భక్తులు తరలివచ్చారు.

ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, ఈశ్వరరావులను సత్కరిస్తున్న శ్రీనివాసానందసరస్వతి

# ట్యాంకర్ ఢీకొని ఒడిశా వాసి దుర్మరణం

దుర్యోధనరెడ్డి (పాత చిత్రం)

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఒడిశా వాసి మృతి చెందిన ఘటన ఇచ్ఛాపురం పట్టణ పరిధి పురుషోత్తపురం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై ఎం.ముకుందరావు చెప్పిన వివరాల మేరకు.. ఒడిశా గంజాం జిల్లా గొలంత్రా సమీపంలోని అల్లాడిపూర్ గ్రామానికి చెందిన కర్రి దుర్యోధనరెడ్డి (30) అదే గ్రామానికి చెందిన చినపాన చంద్రయ్యతో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంపై ఇచ్ఛాపురం వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వీరిని ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దుర్యోధనరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దుర్యోధన మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం బ్రహ్మపుర వైద్యకళాశాలకు తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# నెల్లూరులో జిల్లా మహిళ మృతి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన వైనమిది. పోలీసుల కథనం మేరకు. . సోంపేట ప్రాంతానికి చెందిన ధనలక్ష్మి (31) తిరుపతి జిల్లా శ్రీసిటీలో పనిచేస్తూ అక్కడే పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండు వారాల క్రితం నెల్లూరు దర్గామిట్టలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు వచ్చారు. హోటల్ వెనుక ఓ అపార్టుమెంటులో ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. అప్పుల బాధలు తాళలేక ధనలక్ష్మి ఈ నెల 10న కొండాయపాలెం వద్ద తలకు రాసే నూనె తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో భర్త చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు తల్లి జోగమ్మ ఆదివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పూరీ- గుణుపూర్ రైలు మార్గంలో ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తి 2- 3 రోజుల క్రితం చనిపోయినట్లు ఎస్సై సింహాచలం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 50- 60 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిస్తే సంతబొమ్మాళి పోలీసులను సంప్రదించాలని ఎస్సై చెప్పారు

# ఈవీ షోరూంలో అగ్ని ప్రమాదం

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని ఓ ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాల షోరూంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఛార్జింగ్‌లో ఉన్న మొదటి బ్యాటరీ నుంచి మంటలు చెలరేగడంతో లోపల ఉన్న 13 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. శ్రీకాకుళం అగ్నిమాపక శాఖ అధికారులు మంటల్ని అదుపు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని గ్రామీణ పోలీసుస్టేషన్ ఎస్సై కె.రాము తెలిపారు.



ఈవీలు దగ్ధమైన ప్రదేశం

# మాజీ సైనికుల సంక్షేమానికి కార్యాచరణ

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: మాజీ సైనికుల సంక్షేమానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ఆ సంఘ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు అన్నారు. శ్రీకాకుళం నగరం రెల్లి వీధిలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలో సభ్యులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఈసీహెచ్ఎస్ పాలి క్లినిక్ 'డి' కేటగిరీ నుంచి 'సి' కేటగిరీగా మెరుగుపర్చుకోవాలని, కిమ్స్ ఆసుపత్రిని ఎంప్యానెల్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సూపరింటెండెంట్ క్యాడర్ పోస్ట్ సాధించుకోవాలని.. క్యాంటీన్ క్యాడి ఫండ్ ద్వారా సంక్షేమ కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. గ్రూప్ ఛైర్మన్ విశ్రాంత కెప్టెన్ పి.ఈశ్వరరావు, వి.సూర్యనారాయణ, మురళీధరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

## చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 145 | 245 | 265 |

# 4ఆర్ కాలువ పైనుంచి అనధికారిక రోడ్డు

వంశధార నదిలో ఇసుక తవ్వకాలకు కొంత మంది జిరాయితీ భూమి నుంచి అనధికారికంగా రోడ్డు వేస్తున్నారు. భగీరథపురం గ్రామ సమీపంలో ఆర్ వంశధార పిల్ల కాలువ పైనుంచి ఎటువంటి అనుమతులు లేకుండా దీన్ని నిర్మిస్తున్నారు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతుండటంతో నదికి ఎడమవైపున ఉన్న పంట పొలాలు వరద పోటుతో కోతకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై గొట్టా బ్యారేజీ సబ్ డివిజన్ కార్యాలయం డీఈఈ బి.సరస్వతి, తహసీల్దారు జోగారావు మాట్లాడుతూ.. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, హిరమండలం

# రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో విజేతలు వీరే

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఆదివారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన విజేతల వివరాలు నిర్వాహకులు ప్రకటించారు. ● గ్రూపు-4 బాలుర విభాగం 100 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో బి.రిషిత్ నందన్ (శ్రీకాకుళం) ● గ్రూపు-5 బాలుర విభాగం 50 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో కె.అభిరామ్ (శ్రీకాకుళం)

గ్రూపు-5, 4లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించిన క్రీడాకారులతో అతిథులు

# ఏదీ రక్షణ ఛత్రం..?

● తరచూ తీరం కోతకు గురవుతుండటంతో ప్రజల్లో ఆందోళన

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

బంగాళాఖాతంలో తరచూ ఏర్పడుతున్న అల్పపీడనాలు, తుపాన్లు జిల్లాలో తీర ప్రాంతంపై ప్రభావం చూపుతున్నాయి. రక్షణ చర్యలు లేకపోవడం, అలల ఉద్ధృతి కారణంగా కోతకు గురై సమీప గ్రామాలకు ముప్పు వాటిల్లుతోంది. పలు మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. తీరం వెంబడి కొందరు వేల ఎకరాలు ఆక్రమించి ఆక్వా సాగు చేస్తున్నారు. ఆ పరిధిలో ఎక్కడా మడ అడవులు, సరుగుడు తోటలు పెంచడం లేదు. భౌగోళిక పరిస్థితుల కారణంగా కవిటి మండలం ఇద్దివానిపాలెం వద్ద ఆటుపోట్ల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. సొంత భూములు సైతం కోతకు గురై నష్టపోతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దివానిపాలెం వద్ద కోతకు గురైన తీరం

| | |
|---|---|
| జిల్లాలో తీర ప్రాంతం | : 191 కి.మీ. |
| మండలాలు | : 11 |
| మత్స్యకార గ్రామాలు | : 154 |

## ఇదీ పరిస్థితి

● ఇద్దివానిపాలెం వద్ద 15 ఏళ్ల కిందట నిర్మించిన రక్షణ గోడ శిథిలావస్థకు చేరింది. ఇక్కడి మడ అడవులు కనుమరుగవుతున్నాయి.

● ఆయా ప్రాంతాల్లో సరుగుడు, ఇతర తోటలున్నా వాటి విస్తీర్ణం నామమాత్రమే.

● అటవీ శాఖ సహకారంతో తీరం వెంబడి వనాల పెంపకానికి గతంలో కొంత కదలిక వచ్చినా ఆ తర్వాత ముందుకు సాగలేదు.

● ఇటీవల తాటి టెంకలు నాటడానికి చర్యలు తీసుకున్నా అనుకున్న స్థాయిలో జరగడం లేదు.

● ఇచ్ఛాపురం మండలం డొంకూరు, సోంపేట మండల బారువ, ఎర్రముక్కాం, ఎకువూరు, ఇసకలపాలెం, చేపలగొల్లగండి, మందస మండలం గెడ్డూరు, బేతాళపురం, రట్టి, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, డోకులపాడు, మంచినీళ్లపేట, తోటూరు తదితర గ్రామాల్లో తరుచూ తీరం కోతకు గురువుతోంది.

**వనాల పెంపకానికి కృషి..** తీర ప్రాంతాల్లో ఇసుక దిబ్బలు కోతకు గురికాకుండా తాటి వనాల పెంపకానికి కృషి చేస్తున్నాం. స్థానికుల సహకారంతో ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. సరుగుడు చెట్లు పెంచడంపై రైతులకు అవగాహన కల్పించాం.

– వై.సత్యనారాయణ, డీడీ, మత్స్య శాఖ, శ్రీకాకుళం


EENADU eClassifieds

TO LET

COMMERCIAL

శ్రీకాకుళం టౌన్ RTC కాంప్లెక్స్‌ఎదురి అంబేడ్కర్ జంక్షన్ లైన్‌లో 5500 sftగల G+3 బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. C:9398873241, 9290163952

JOBS

Wanted sales executives M/F for HDFC, ICICI, AXIS & other Banks (DSA) attractive payout & Other benefits Contact: 9848428859, 9866063862-7799260666

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ప్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

# పలాస

• పలాస • ఇచ్ఛాపురం

## మరుగున పడేశారు..

మందస మండలం సొండిపూడి ఉన్నత పాఠశాలకు నాడు-నేడులో భాగంగా చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు మధ్యలో నిలిచాయి. రెండేళ్లు కావొస్తున్నా పురోగతి లేదు. గోడలు నిర్మించి పైకప్పు వేసి పనులు ఆపేశారు. అరకొరగా ఉండే పాత వాటిని వినియోగిస్తున్నారు. త్వరలోనే ఈ పాఠశాల మైదానంలోనే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు జరగనున్న నేపథ్యంలో మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. పనులు పూర్తిచేస్తామని హెచ్‌ఎం సుందర్‌సోలోమన్ తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

## వీధి దీపాలు వెలిగాయ్..

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పుర పరిధి బెల్లుపడ కాలనీలో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్న ఇబ్బందులను 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పురాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పుర కమిషనర్ నల్లి రమేష్ స్పందించి ఏఈ కిశోర్ పర్యవేక్షణలో సమస్యను పరిష్కరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పలాస : 80085 74279 ఇచ్ఛాపురం : 90631 44707

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: పురుషోత్తపురం పాత జాతీయ రహదారిపై నిరుపయోగంగా ఉన్న వేగనియంత్రికలు తొలగించారు. తిరిగి రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. -ఎన్.ఢిల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం

● సమస్య పరిష్కారానికి కృషిచేస్తా. - డి.విక్రమ్, ఏఈ, ర.భ.శాఖ, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: రాజపురం నుంచి కమలాయిపుట్టుగ వెళ్లే రోడ్డులో పలు చోట్ల పెద్ద గుంతలు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. - గ్రామస్థులు

● నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేస్తాం. - ధనంజయ, పంచాయతీరాజ్ ఏఈ, కవిటి

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## ఆదాయాభివృద్ధి సాధించాలి

మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎఫ్‌ఈవో నుంచి ముడిసరకు సేకరించి దానిని మార్కెటింగ్ చేసి ఆదాయాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం కవిటిలో ఫిషరీస్, కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల ఎఫ్‌పీవో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఈవోలు బలోపేతం చేయాలని దిశ నిర్దేశం చేశారు. మత్స్యకారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆరంగి అనిల్ మాట్లాడుతూ కొబ్బరిలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని దీని వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఈవో ఏపీఎం ఈశ్వరరావు, గోవింద్, ఎంఎంఎస్ అధ్యక్షుడు సుమన్, బి.నారాయణరావు, కోఆర్డినేటర్ సీసీలు సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్మారక కార్యక్రమం విజయవంతం చేయండి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్మారక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని మర్రిపాడు అమరవీరుల స్తూపం వద్ద ఈ నెల 22 నిర్వహించే స్మారక కార్యక్రమం సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## అక్రమణ ఆగదు.. అధికారులకు పట్టదు

● వజ్రపుకొత్తూరులో జోరుగా రియల్ దందా

–న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరు పరిసరాల్లో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. రూ.కోట్లలో క్రయ విక్రయాలు సాగుతున్నాయి. సెంటు భూమి విలువ రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో రియల్ దందా జోరుగా సాగుతోంది. ఇదే అదనుగా చేసుకొని కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఆక్రమణలకు తెరతీస్తున్నారు. ప్రధాన రహదారుల అనుకొని లేఅవుట్లు వేస్తున్నారు. వరద కాలువలు, గోర్జిలు, శ్మశాన భూములు ఆక్రమించి సొమ్ము చేసుకుంటున్నారు.

వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాల ఎదురెదురుగా ఉన వరద కాలువను కంకరతో కప్పేసి లేఅవుట్ వేసి దృశ్యం

▶ కంకర వేసి లేఅవుట్‌తోపాటు చదును చేసి రహదారులకు వాడుకుంటున్నారు. ఒక్కొక్క లేఅవుటు దగ్గర సుమారు 5 సెంట్ల వరకు కలుపుకొని అక్రమ సంపాదన చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికార యంత్రాంగం కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

▶ వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాల సమీప రహదారి ఇరువైపులా రెండు ప్రధాన వరద కాలువలు ఉన్నాయి. వీటి ద్వారా గ్రామంతో పాటు కాలనీ నుంచి వచ్చే వరద నీరు, మురుగునీరు పక్కనే ఉన్న ఉప్పుటేరులోకి కలుస్తున్నాయి. ఒక వైపు కాలువ పూర్తిగా కప్పేయడం, శ్మశానం మొదలుకొని పాఠశాల వరకు లేఅవుట్లు వెలియడంతో కన్పించకుండా పోయింది. కాలువల మార్గాన్ని వారికి అనుకూలమైన విధంగా మార్చేస్తుండటంతో సమీపంలో ఉన్న వజ్రపు మంచినీటి కోనేరులోకి వరద, మురుగు నీరు చేరుతోంది.

▶ కిడిసింగి వైపు వెళ్లే రహదారికి అనుకొని వేసిన మరికొన్ని లేఅవుట్లలో గ్రామం నుంచి తోటలకు వెళ్లే గోర్జిని సైతం కలిపేయడంతో స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేఅవుట్లకు సంబంధించి అన్ని అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. తూతూమంత్రంగా కొలతలు వేయడంతో ఆక్రమణదారులు అదనపు హద్దులు వేసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండల కేంద్రంలో లేఅవుట్లు పరిశీలించి అక్రమమైతే తొలగిస్తాం, అనుమతులు లేకుంటే రద్దు చేసి బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– సీతారామయ్య, తహసీల్దార్

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

మందస, న్యూస్‌టుడే : మందసలోని శ్రీసత్యసాయి బృందావన్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారన్నారు. చుట్టు గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## ప్రారంభించారు.. వదిలేశారు!

వజ్రపుకొత్తూరులో నాలుగేళ్ల కిందట రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో అక్కడ రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన సామాజిక భవనంలో రైతులకు సేవలు అందిస్తున్నప్పటికీ ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. కొత్త భవనంలోకి మార్చేలా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ధనంజయ తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

## అల్లుకున్న నిర్లక్ష్యం..

కవిటి మండలం జగతి నుంచి సూరిపుట్టుగ వెళ్లే ఆర్ అండ్‌బీ మార్గంలో పలు చోట్ల స్తంభాలకు తీగజాతి మొక్కలు దట్టంగా అల్లుకున్నాయి. దీంతో స్థానిక గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వాటిని తొలగించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## అటకెక్కిన శుద్ధజల యంత్రం

వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలో ఎంపీడీవో, వెలుగు, తహసీల్దార్, ఉపాధి హామీ తదితర అధికార కార్యాలయాల వద్ద శుద్ధజలం అందించేందుకు మూడేళ్ల కిందట యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకు మండల పరిషత్తు నిధులు రూ.లక్షల్లో వెచ్చించారు. అనంతరం కొన్ని నెలలకే అవి మూలకు చేరి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామీణ మంచినీటి సరఫరా పథకం జేఈ సతీష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

## ముక్కు మూసుకోవాల్సిందే..

ఇచ్ఛాపురం మండలంలో మండపల్లి నుంచి బుడ్డెపుపేటకు వెళ్లే రహదారి డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు, పాదచారులు పేర్కొంటున్నారు. రోజులు తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వై. ప్రభాకరరావు వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## ఇదీ ఓ దారే..

మందస మండలం కుసుమాల నుంచి బంసుగాంకు వెళ్లే రహదారి దుస్థితి ఇది. ఉపాధి పనుల్లో భాగంగా పలేళ్ల కిందట సీసీరోడ్డేశారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇలా మట్టి రోడ్డులా మారింది. చినుకు పడితే బురదగా మారుతోందని, ఎదురెదురుగా వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి విస్తరణ పనులు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రతిపాదనలో ఉందని, నిధులు వస్తే పనులు ప్రారంభిస్తామని ఐటీడీఏ డీఈఈ కృష్ణకుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, మందస

## మోదుగులపుట్టిలో ఎమ్మెల్యే పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి గౌతు శివాజీ, ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం మోదుగులపుట్టిలో రామకృష్ణ పరమహంస, శారదామాత, స్వామి వివేకానంద ఆలయాల్లో భక్త సమ్మేళన వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం నగర సంకీర్తన, రామకృష్ణ, శారదామాత, వివేకానందల అష్టోత్తర శతనామ పూజ, కథామృత పఠనం, అనంతరం అతిథులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఎమ్మెల్యే శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. వారితో కమిటీ సభ్యుడు, అవుగాన షణ్ముఖరావు ఉన్నారు.

## ధనరాజతులసమ్మ దర్శనానికి బారులు

మండలంలోని లొద్దపుట్టి కూడలి వద్ద కొలువుతీరిన ధనరాజతులసమ్మకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఒడిశాతో పాటు సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బారులు తీరారు. డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక ఘటాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## బాధిత కుటుంబానికి చేయూత

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం పొందూరుపుట్టుగకు చెందిన దూగాన రామ్మూర్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకుని శ్రీవృక్ష విద్యాసంస్థల యాజమాన్యం రూ.50,000 ఆర్థిక సాయం అందించింది. ఆదివారం కుటుంబ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. విద్యాసంస్థల యాజమాన్య సభ్యుడు బెందాళం రమణమూర్తి, సర్పంచి ప్రతినిధి తమరాల శోభన్‌బాబు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే మనుగడ

మందస, న్యూస్‌టుడే : మందస ప్రధాన రహదారి విభాగినిపై గ్రీన్ గ్రో సభ్యులు ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఉన్నత పాఠశాల నుంచి కొత్త వీధి వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవునా మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జి. తిరుపతిరెడ్డి, ఐ.కేశవరావు, పాడి, సోమనాథ్, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి అన్నారు. పలాస మండలం కేదారిపురం, ఈదురాపల్లి, గంగువాడ గ్రామాల్లో ఆదివారం చైతన్య సభలు నిర్వహించారు. సైబర్‌నేరాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై మాట్లాడారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరును ప్రజలకు వివరించారు.

## ఎమ్మెల్సీ పరామర్శ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కొండిపుట్టుగ గ్రామంలో వైకాపా సీనియర్ నాయకులు నర్తు గురయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుప్పట్ల వితరణ

మందస, న్యూస్‌టుడే: బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించిన నేపథ్యంలో మందసలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు చేపట్టారు. పేదలకు చలి దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. వై.కృష్ణమోహన్, టి.సురేష్, ఐ.వెంకటరావు, హడ్డి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తేలుకుంచి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన ఆచార్యులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం వృద్ధులను సన్మానించి చీరలు పంపిణీ చేశారు.

## వైభవంగా వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని చిదంబరేశ్వరాలయంలో కొలనులో కొలువై ఉన్న ధ్యాన శంకరుడికి ప్రత్యేకంగా హారతులు సమర్పించారు. ఆలయ సింహద్వారం వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు అఖండ దీపార్చన చేశారు.

## మహిళా సమాఖ్య కార్యవర్గ ఎన్నిక

సమాఖ్యప్రతినిధులతో కొండ శంకర్‌రెడ్డి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : పురపాలకసంఘం బెల్లుపడ 12వ వార్డు మహిళా సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా జమున ఎన్నికయ్యారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో సమాఖ్య సభ్యులతో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షురాలిగా జె.లక్ష్మి, కార్యదర్శిగా జి.ఈశ్వరి తదితరులు ఎన్నికయ్యారు. తెదేపా రాష్ట్ర బీసీ సాధికార కమిటీ కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీవో సంతోష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

సంతోష్‌ను సత్కరిస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తెదేపా జిల్లా వాణిజ్యవిభాగ అధ్యక్షుడు ఊన సంతోష్‌ను తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. పట్టణం కొమ్మనవీధిలో సంతోష్ ఇంటికి ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్.కోటి, జిల్లా తెలుగుమహిళ కార్యదర్శి ఆశిలీలారాణి, వార్డు కౌన్సిలర్లు, వార్డు ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నవోదయ నమూనా పరీక్షలో ప్రతిభ

మందసలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఒరియా మాధ్యమంలో జిల్లా స్థాయి నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మందస, కంచిలి, సోంపేట, కవిటి, బూర్జ మండలాల నుంచి 120 మంది చిన్నారులు హాజరయ్యారు. మొదటి నాలుగు స్థానాల్లో కంచిలి మండలం బడ్డాయిపుట్టుగ పాఠశాల విద్యార్థి పి.జ్యోత్స్న, సాగరినువాగాం నుంచి శ్రావణి ప్రధాన్, అలెన ప్రధాన్ నిలిచారు. వీరితో పాటు పది స్థానాల వరకు ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్ బడిత్య, డి.ఈశ్వరరావు, దుర్గాప్రసాద్ చౌదరి, లండ బాబూరావు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మందస

## ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇ.శ్రీనివాసులు ఆదివారం ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శి ఎస్.నవీన్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## చేయిచేయి కలిపారు.. నీటి వృథా ఆపారు..

మొంథా తుపాను, భారీ వర్షాలకు చేరిన నీరు వృథాగా సాగరానికి పోతోంది. ఇలాగైతే మరో నెలలో బాహుదా నది ఖాళీ అయ్యి సాగుతో పాటు తాగునీటికీ ఇబ్బంది తప్పదని గుర్తించిన అన్నదాతలు పొలాలను వదలి నదికి పరుగులు తీశారు. చేయిచేయి కలిపి, శ్రమించి, నీటిప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. బాహుదా ఉత్తరాయణ ఘట్టం వద్ద గతంలో అడ్డుగా రాతిగట్టు ఉండేది. దానికి మధ్యలో నీరు వెళ్లేందుకూ మార్గం ఉంది. దీని ద్వారా సుమారు 1,800 ఎకరాలకు సాగునీరు వెళ్తుంది. నిర్వహణ లేకపోవడం, భారీ వర్షాలకు రాతి కట్టు దెబ్బతిని కాలువలోకి నీరు చేరడం లేదు. దీంతో అప్రమత్తమైన రైతులు ఆదివారం సమావేశమయ్యారు. శ్రమదానంతో అడ్డుకట్ట నిర్మించాలని యంత్రపనులకు రూ.50 వేలను పోగు చేశారు. యువత, మహిళలు ఇసుక మూటలను తలపై మోసుకుని, ప్రమాదకరంగా ఉన్న రాతిగట్టుపై నడచివెళ్లి ఇలా గట్టు కడుతున్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## అయ్యప్పకు ప్రత్యేక అభిషేకాలు

ఇచ్ఛాపురం, కంచిలి గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : వృశ్చిక సంక్రమణ పర్వదినం సందర్భంగా దేవీ, అయ్యప్ప, శివ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అయ్యప్ప పంచాయతన దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున అష్టాదశ అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం పంచహారతి నివేదించారు. రాత్రి వరి కంకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగాయి. ● కంచిలి మండలం సాలినపుట్టుగ గ్రామంలో భూలోకమాత అమ్మవారికి గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భజన చేశారు. ● వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మెట్ల పూజ నిర్వహించారు.

### సందడిగా వనభోజనాలు...

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మకరాంపురం గ్రామస్థుల ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఆటపాటలతో సందడి చేశారు.

ఇచ్ఛాపురం: ధాన్యం కంకుల అలంకరణలో అయ్యప్పస్వామి

వజ్రపుకొత్తూరు: మెట్ల పూజ చేస్తున్న మాలధారులు

## నాడు వైభవం.. నేడు దయనీయం

● రూపుమారిన సైత్కాన్ చెరువు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో సుమారు ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ ఆలయాలతో అలరారే సైత్కాన్ చెరువు ఒకప్పుడు మంచినీటి కోనేరు. గత పాలకుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారింది. ఆరు వార్డుల ప్రజలకు తాగునీరందించే తాటకం దుర్వాసన, పనికిరాని మొక్కలతో దారుణంగా తయారైంది. పురపాలక అధికారుల పర్యవేక్షణలేక కోనేరు అభివృద్ధి రోజురోజుకూ కుంటుపడుతోంది. మొంథా తుపాను దాటికి నదులన్నీ నిండుకుండల్లా మారినా ఈ చెరువులో చుక్కనీరు లేని దుస్థితి నెలకొంది.

పనికిరాని మొక్కలతో మంచినీటి కోనేరు

● పుర నిధులతో, అధికారుల పర్యవేక్షణలో చుట్టూ కాలిబాట మార్గం, రక్షణ గ్రిల్స్, సేదదీరేందుకు చుట్టూ కుర్చీల ఏర్పాటు, మెట్ల అభివృద్ధి, చెరువులో ఉండే మంచినీటి బావి అభివృద్ధి తదితర పనులు చేపట్టారు. పూర్తిస్థాయిలో నిర్వహణ లేకపోవడంతో ఇప్పుడు వాటి ఆనవాళ్లు మాత్రం మిగిలాయి.

● పట్టణానికి వాయువ్య దిశలో తారకేశ్వరాలయం, సంతోషిమాత, గణపతి మందిరాలతో పాటు హనుమాన్ విగ్రహం కొలువుతీరి ఆధ్యాత్మికతో కూడిన తటాకం గతంలో కనువిందు చేసేది. ఒక వైపు పాత జాతీయ రహదారి, మరో వైపు రైలు పట్టాలు, వాటి నడుమ సువిశాలంగా ఈ కోనేటిని వందల ఏళ్ల కిందట నిర్మించారు.

● పంచాయతీ కాలంలో చెరువు నీరు కలుషితం కాకుండా ఉండేందుకు వాచ్‌మ్యాన్ కూడా ఉండేవారు. పురపాలనలో చెరువు రూపు మారిపోవడంతో గత వైభవం చరిత్రగా మారిపోయింది. గత ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్ (క్లాప్)లో ఈ చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేసి వదిలేశారు.

అధ్వానంగా నడక దారి..

### అభివృద్ధి చేస్తాం..

సైత్కాన్ చెరువు పరిరక్షించుకోవాల్సి అవసరం ఉంది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్తాం. అవసరమైన నిధుల సేకరణకు కృషిచేసి అభివృద్ధి చేస్తాం.

– బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం

## యువతి అదృశ్యంపై కేసు

కాశీబుగ్గ: పలాస మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

## పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/S శ్రీరామ్ ఫైనాన్స్ Ltd., కె.టి.రోడ్, పలాస బ్రాంచ్ వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు.

శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, సిరిమామిడి గ్రామం, యర్రముక్కం (పోస్ట్), వీధి కాపురస్థుడైన కారాగి తిరుమల S/o కారాగి సన్యాసిరావు నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా అతని అన్నయ్య కారాగి వెంకటేష్ S/o కారాగి సన్యాసిరావు స్వాధీన, హక్కు అనుభవములో నున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించయున్నారు. కావున సదరాస్తి పై వేరెవ్వరికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకు గాని నా క్లయింటుకు గాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తి పై గాని, దానిపై జరుపబోవు తాకట్టుపై గాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని యిందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, మందస సబ్‌డిస్ట్రిక్ట్ పరిధిలో గల సిరిమామిడి గ్రామ పంచాయితీ వీధిలో గల వార్డు నెం.D.No:- 1-42 పట్టా నెం. 668కు, సర్వే నెం. 43-17 గల తూ॥ప॥ లకు 48 అడుగులు, ఉ॥ ద॥లకు 80 అడుగులు మొత్తం 426.66 చ॥గలు గల హద్దులు.

తూర్పు: రోడ్డు పశ్చిమ: కారాగి వెంకటేష్ తాలూక వాటర్ ప్లాంట్, ఉత్తరం: కారాగి సన్యాసిరావు & కారాగి వెంకటేశ్ తాలూకా ఖాళీ స్థలం (రోడ్డు), దక్షిణ: కారాగి సన్యాసిరావు తాలూక ఖాళీ స్థలం.

YAVVARI HEMAKUMAR
Advocate, Palasa, Cell: 9440592204

(c) eenadu

# టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

## అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు నరసింగరావు

సింహచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి హిరమండలం పరిధి కొండరాగోలు గ్రామానికి చెందిన బోర జోగినాయుడు, జ్యోత్స్న దంపతులు ఆదివారం రూ. 1,03,000 విరాళాన్ని సమర్పించారు. నగదును అన్నప్రసాద విభాగం పర్యవేక్షకుడు పాలూరు నరసింగరావుకు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు ఇచ్చారు.

## వ్యవసాయం లాభసాటిగా మారాలి

మంత్రి అచ్చెన్నాయుడిని సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రోజు రోజుకు ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఉద్యోగోన్నతులు పొందిన వ్యవసాయ ఉన్నతాధికారులు ఆదివారం నిమ్మాడలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ.. దిగుబడులు పెంచేందుకు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో రైతులు

టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

టెక్కలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ విధానాలతో రైతులు సంక్షోభంలో కూరుకుపోతున్నారని రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం టెక్కలిలో నిర్వహించిన రైతుసంఘం జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. సమగ్ర సర్వే జరిపి వ్యవసాయ సాగుదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని డిమాండు చేశారు. కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి సత్యం లోకనాథం అన్నపూర్ణమ్మ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పోలాకి ప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా కోనారి మోహనరావు, బగాది వాసుదేవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## తెదేపా బలోపేతానికి కృషి

కొత్తూరు, న్యూస్‌టుడే: కడుము పంచాయతీలో తెదేపా బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ మండల కోశాధికారి విశ్వనాథుల షణ్ముఖరావు (బుచ్చి) అన్నారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు కిల్లారి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, ఇతర కార్యవర్గం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

# వారికి చెబితే గోడకు చెప్పినట్లే..!

– న్యూస్‌టుడే, హిరమండలం, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, కొత్తూరు, మెళియాపుట్టి

ప్రభుత్వాలు మారుతున్నా పాతపట్నం నియోజకవర్గం ముఖచిత్రం మారడం లేదు. దశాబ్దాలుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోక పోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం పాలకులు అనంతరం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

### దశాబ్దాలుగా ఇక్కట్లు

● హిరమండలం మేజర్ పంచాయతీలో 18 వేలకు పైగా జనాభా ఉన్నారు. కొన్ని వీధుల్లో తాగునీటి కుళాయిలు మురుగు కాలువల్లోనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల అసలు నీరు సరఫరా కావడం లేదు. వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. పంచాయతీ కార్యాలయం లేదు. తాత్కాలికంగా ఓ శిథిల భవనంలో ఉపఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. మార్కెట్ భవనంలో చెత్త పేరుకుపోయింది. సుభలయ- గొట్టా బ్యారేజీ

అధ్వానంగా పాతపట్నం మండలం సరాళి రోడ్డు

### హామీలకే పరిమితమవుతున్న పాలకులు

గొట్టా బ్యారేజీ దిగువున కోతకు గురైన వంశధార కుడి కరకట్ట

రహదారి విస్తరించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

● ఎల్ఎన్‌పేట మండలం కేంద్రంలో ప్రయాణికుల విశ్రాంతి భవనం లేదు. కడగండి జలాశయం కాలువలు పూర్తయితే 600 ఎకరాలకు సాగునీరందుతుంది. స్వాట్ పేట నుంచి సమంతజేపురం వరకు వంశధార నదికి కుడి వైపున కరకట్టలు లేకపోవడంతో వరద నీరు పోటెత్తితే పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కొత్తూరు మండలం అడ్డంగి, అల్లి, కకరగూడ, గొట్టిపల్లి గ్రామ పంచాయతీలకు తా...

● పాతపట్నంలోని సబ్ రిజిస్ట్రార్, కోర్టు కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. సరాళి రోడ్డు అధ్వానంగా ఉంది. శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు జరగలేదు. ఆల్ ఆంధ్రా రహదారి పరిస్థితి ఇలాగే ఉంది. సీతారాంపల్లి, లోగిడి గ్రామాల్లో ప్రయాణికుల విశ్రాంతి భవనాలు లేవు.

**పాతపట్నం నియోజకవర్గ వివరాలు**

| మండలం | పంచాయతీలు | జనాభా |
|---|---|---|
| హిరమండలం | 23 | 31,395 |
| ఎల్ఎన్‌పేట | 23 | 32,018 |
| పాతపట్నం | 34 | 64,302 |
| కొత్తూరు | 43 | 67,309 |
| మెళియాపుట్టి | 37 | 52,494 |

నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. వంశధార నదికి సిరుసువాడ నుంచి నివగాం వరకు కరకట్టలు లేవు. పెనుగోటివాద రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు పూర్తికాలేదు.

● మెళియాపుట్టి మండలం కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం లేదు. చందనగిరి, అడ్డవాడ, కేరాసింగి గ్రామాల్లో చేపడుతున్న రహదారుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

### దశల వారీగా పరిష్కారం

పాతపట్నం నియోజకవర్గంలో సమస్యలు గుర్తించాం. కలెక్టర్, సీతంపేట ఐటీడీఏ పీవోల దృష్టికి వాటిని తీసుకెళ్లాం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సైతం తెలియజేసి, అసెంబ్లీలోనూ వీటి గురించి ప్రస్తావించాను. దశల వారీగా పరిష్కారానికి కృషి చేస్తాం. – మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

## మంత్రిని కలిసిన ఏజీపీలు

టెక్కలి పట్టణం, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: టెక్కలి, కోటబొమ్మాళి కోర్టుల పరిధిలో ఏజీపీలుగా బాధ్యతలు చేపట్టిన దివ్వల వివేకానంద, పల్లి వాసుదేవరావు మంత్రి అచ్చెన్నాయుడిని నిమ్మాడలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టెక్కలి బీపీ కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నారు. ● నిమ్మాడ మంత్రి కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో పెద్దఎత్తున ప్రజలు మంత్రిని కలిసి వినతిపత్రాలు అందించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్ ద్వారా వివరించొచ్చు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: కోటబొమ్మాళి రైతుబజారు నిర్వహణను పట్టించుకోక పోవడంతో అధ్వానంగా మారింది. పాములు, ముళ్లపొదలు, కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. – రాజు, కాయగూరల వ్యాపారి

●: తక్షణమే మార్కెటింగ్, గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. – గడ్డెమ్మ, ప్రత్యేకాధికారి, కోటబొమ్మాళి

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

?: సందిగాం మండలం కర్లపుడి కాలనీ నుంచి బెజ్జిపల్లి వరకు బీటీ రహదారి గుంతలమయంగా తయారైంది. రాకపోకలు చేయడానికి అవస్థలు ఎదుర్కొంటున్నాం. – జగన్ పోలయ్య, కర్లపుడి

●: ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే మరమ్మతులు చేపడతాం. – మోహన్, ఏఈ, పీఆర్ శాఖ, సందిగాం

?: పెద్దబమ్మిడి సమీపంలోని ఊరకొండ దిగువున పంట పొలాలను అడవి పందులు గుంపులుగా వచ్చి నాశనం చేస్తున్నాయి. – మండల జడ్డయ్య, పెద్దబమ్మిడి

●: సిబ్బందిని తెలియజేసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – ఎస్.కృష్ణారావు, అటవీ శాఖ సెక్షన్ అధికారి, టెక్కలి – న్యూస్‌టుడే, సందిగాం

## కేంద్రాల ఏర్పాటులో జాప్యం తగదు

కొత్తూరు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం తగదని వైసీపీ ఎస్ మాజీ అధ్యక్షుడు దింతాడ సూర్యనారాయణ, నాయకులు తమ్మినాయుడు, మాజీ సర్పంచి కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని మెట్టూరులో వారు ఆదివారం మాట్లాడుతూ రైతులు కోతలు చేసి, ధాన్యం సిద్ధం చేసి నెల దాటుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

## మోక్షం కలిగించండి మహాప్రభో

నందిగాం మండలం వల్లభరాయపాడు గ్రామంలోని బీసీ కాలనీకి 30 ఏళ్ల కిందట మట్టి రహదారి నిర్మించారు. అది గోతులమయంగా మారడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీసీ రోడ్డు నిర్మాణానికి కొలతలు తీస్తుండగా.. భూ వివాదాల కారణంగా కొంతమంది అడ్డుకోవడంతో అడుగులు ముందుకు పడలేదు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని డిప్యూటీ ఎంపీడీవో యు.కుమార్ పట్నాయక్ పేర్కొన్నారు – న్యూస్‌టుడే, నందిగాం

## ప్రయాస ప్రాంగణం..!

ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని నివగాం బస్‌స్టేషన్ పరిస్థితి అధ్వానంగా మారింది. రెండు రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నిర్వహణకు ఆదాయం లేదని రెండేళ్ల కిందట భవనాన్ని అధికారులు ఓ వ్యక్తికి లీజుకి ఇచ్చినా పరిస్థితి మారలేదు. దీంతో బస్సుల కోసం రహదారి పైనే ఎదురు చూడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను తక్షణమే శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్తామని కొత్తూరు ఆర్టీసీ కంట్రోలర్ వెంకట్రావు తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

## కాసారం కనుమరుగు

కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు సాగునీరందించే కోటబొమ్మాళి పెద్ద చెరువు రూపు కోల్పోయింది. దీని ద్వారా సుమారు మూడు వందల ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. పనికిరాని మొక్కలు, పూడిక పేరుకు పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయింది. సంబంధిత సిబ్బంది స్పందించాలని అన్నదాతలు కోరుతున్నారు. నీటి పారుదల, ఉపాధిహామీ అధికారులతో మాట్లాడి కాసారాన్ని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ చెప్పారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

## నిర్లక్ష్యానికి నిదర్శనం..!

నరసన్నపేట మండలం కొల్లవానిపేట- కామేశ్వరపేట రహదారిలో కొల్లవానిపేట సమీపంలో విద్యుత్తు స్తంభానికి పనికిరాని మొక్కలు అల్లుకున్నాయి. దీంతో విద్యుత్తు సిబ్బంది మరమ్మతులు చేయాలన్నా.. వీలు లేకుండా పోయిందని ఆ మార్గంలో రాకపోకలు చేసే వారు చెబుతున్నారు. పనికిరాని మొక్కలు తొలగించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ వద్ద ప్రస్తావించగా.. తక్షణమే సిబ్బందికి తెలియజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

## పక్కకు వెళ్తే ప్రమాదమే

సారవకోట మండలం కోదడ్డపనస గ్రామ సమీపంలో వంశధార ఎడమ కాలువపై వంతెనకు రక్షణ గోడలు కూలి పోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ సరోజ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట

# పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు

టెక్కలిలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

టెక్కలి పట్టణం, పాతపట్నం, న్యూస్‌టుడే: పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని విశ్రాంత గ్రంథపాలకులు జి.ప్రసాద్, టి.వైకుంఠరావు అన్నారు. ఆదివారం టెక్కలి శంభానవీధిలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో వారు పాల్గొన్నారు. గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. గ్రంథ పాలకురాలు బి.రూపవతి పాల్గొన్నారు. ● పాతపట్నం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి సాయమ్మ, విశ్రాంత గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, తెదేపా పట్టణ కమిటీ అధ్యక్షుడు సైలాడ సతీష్, జి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

సవరడ్డపనసలో పూజలు చేయిస్తున్న రుత్వికులు

సారవకోట, కొత్తూరు, కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సారవకోట మండలంలోని సవరడ్డపనస తెదేపా కార్యాలయం ఆవరణలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. తెదేపా రాష్ట్ర బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అయ్యప్ప దీక్షాధారులు పాల్గొన్నారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ, సారవకోట పీఏసీఎస్ అధ్యక్షుడు సురవరపు తిరుపతిరావు, జలుమూరు తెదేపా మండలాధ్యక్షుడు బగ్గు గోవిందరావు పాల్గొన్నారు. ❑ కొత్తూరులో గురుస్వాములు పిన్నింటి ప్రసాదరావు, రామారావు, భాస్కరరావుపాత్రుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కోటబొమ్మాళిలో గురుస్వామి కృష్ణస్వామి, అర్చకులు సుసరాపు కృష్ణబాబు నేతృత్వంలో తిరువీధి జరిగింది.

## శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి

మాట్లాడుతున్న రాంబాబు

నరసన్నపేట, న్యూస్‌టుడే: శిష్టకరణ సామాజిక వర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం తీర్మానించింది. స్థానికంగా ఓ కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్.రాంబాబు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, ప్రతినిధులు వెంకటేశ్వరరావు, మూర్తి, హరిప్రభాకరరావు, ఆర్.గోవిందరాజులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం

నరసన్నపేట, న్యూస్‌టుడే: సత్యవరం గ్రామంలో మారుతీ బ్రాహ్మణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సామూహిక లలితా పారాయణం ఘనంగా జరిగింది. కార్తిక బహుళ ద్వాదశి సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు మావుడూరు జగదీశ్వర శర్మ పాల్గొన్నారు.

## ఆలయ మండపం ప్రారంభం

సారవకోట: బద్రి నీలమణిదేవి అమ్మవారి ఆలయ మండపాన్ని మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మెండ ప్రభాకరరావు సొంత నిధులు రూ.4.5 లక్షలు వెచ్చించి దీన్ని నిర్మించారు. జలుమూరు మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, నాయకులు తులసీదాస్, కృష్ణారావు పాల్గొన్నారు.

## మిత్రమా.. అంతా కుశలమా

సారవకోట ఉన్నత పాఠశాలలో 1971-72లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. చదువు నేర్పిన గురువులు బి.శ్రీరాములు నాయుడు, చిట్టి సత్యనారాయణ, జి.అప్పారావులను సన్మానించారు. 53 ఏళ్ల తరువాత అంతా ఒకచోట కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. దాము వెంకటేశ్వరరావు, పొట్నూరు షణ్ముఖరావు, ఎన్.బెనర్జీ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

## శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో రద్దీ

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తికమాసం చివరి వారం కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో అష్ట గణపతులు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వారాహీ అమ్మవారికి పూజలు చేశారు. ఈవో ఏడుకొండలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై అశోక్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నేటి నుంచి ఆధార్ కేంద్రాల్లో సేవలు

పోలాకి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జడూరు, మబగాం పల్లిపేట, ప్రియాగ్రహారం, చీడివలస, దీర్ఘాశి, ఉరజాం, తలసముద్రం, కోడూరు, గాతలవలస గ్రామాల్లో నేటి నుంచి ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహిస్తామని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఇంత వరకు కార్డు తీసుకోనివారు, మార్పులు చేర్పులు చేయాలనుకునే వారు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సకాలంలో హాజరై సేవలందించాలని కోరారు.

## తీరం.. సందడి వాతావరణం

పోలాకి, న్యూస్‌టుడే: కార్తిక మాసం నేపథ్యంలో సముద్ర తీర ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. రాజారాంపురం, గుప్పిడిపేట, కొత్తరేవు గుల్లవానిపేటల్లోని సమీప తోటల్లో ఆదివారం పర్యాటకులు వన భోజనాలు చేశారు. పిల్లలు, మహిళలు, యువత సందడి చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ జి.రంజిత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజారాంపురం సముద్ర తీరంలో ప్రజలు

# నిర్వహణ కరవు.. ప్రమాదాలకు నెలవు

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు రహదారులకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట, పోలాకి, నరసన్నపేట, నరసన్నపేట గ్రామీణం

దాసుపురం- కాలనీ మాళువ సీసీ రహదారిలో పరిస్థితి

### ఇదీ పరిస్థితి..

● జలుమూరు నుంచి కరవంజ మీదుగా నరసన్నపేట వెళ్లే రహదారిలో మలుపుల వద్ద పరిస్థితి భయానకంగా ఉంది. కళింగపట్నం- పాతపట్నం రహదారి నుంచి టెక్కలిపాడు వెళ్లే రోడ్డు, రాణా కూడలి- కరవంజ మార్గం, నగిరికటకం నుంచి బైరాగిపేట మీదుగా మర్రివలస రహదారిలో రాకపోకలు చేయాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు.

కొబగాం వద్ద కుచించుకు పోయిన మార్గం

● సారవకోట మండలంలో కాలనీ మాళువ, బొంతుగూడ రహదారులు, సారవకోట- బద్రి, చోడసముద్రం- కిమిడి మార్గాలు, అలుదు- పాకివలస, అన్నుపురం- పెద్దగుజ్జువాడ రోడ్లకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి.

● నరసన్నపేట పరిధిలో కామేశ్వరపేట- ముద్దాడపేట మార్గం పొదలతో కుచించుకు పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గొనపుపేట- పారశెల్లి, పోలాకి మండలానికి సంబంధించి డోల- నౌపడా, సుసరాం- కొత్తరేవు రహదారుల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది.

### చర్యలు తీసుకుంటాం

రహదారుల పక్కన పనికిరాని మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్ల నిర్వహణ నిధులతో పాటు, ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు కృషి చేస్తాం. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాం.

– తిరుపతిరావు, డీఈ, రహదారులు భవనాల శాఖ

# పేదలకు ఆపన్నహస్తం సీఎం సహాయ నిధి

ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తం లాంటిదని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కాగువాడ గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్ మొఘల్ దుబాయ్‌లో ప్రమాదవశాత్తూ మరణించారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా రూ.లక్ష మంజూరైంది. స్థానిక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. సర్పంచి నల్లి జగదీశ్వరరావు, తెదేపా మండలాధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ కమిటీ అధ్యక్షుడు సైలాడ సతీష్ పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు పొంది వినియోగించుకోవాలని జనసేన నాయకులు ఎస్.రామ్మూర్తి, లక్ష్మీపురం కిరణ్ సూచించారు. పరశురాంపురం పంచాయతీ పరిధిలో పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కల్పించాలన్నారు.

## పేదలకు వస్త్రాల పంపిణీ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీలోని పేదలకు తలగాపు వెంకటరమణ ఆదివారం వస్త్రాలు పంపిణీ చేశారు. భార్య జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. నౌగాపు నారాజు పాల్గొన్నారు.

## స్వదేశీ వస్తువులు వినియోగించాలి

హిరమండలం, న్యూస్‌టుడే: స్వదేశీ వస్తువులు కొనుగోలు చేసి, వినియోగించేలా ప్రజలను ప్రోత్సహించాలని భాజపా మండలాధ్యక్షుడు రెల్ల డిల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం హిరమండలంలో పార్టీ నాయకుల సమావేశం జరిగింది. నూతన కమిటీ కార్యవర్గ సభ్యుల ఎన్నికపై చర్చించారు. అనంతరం హిరమండలంలోని పలు వీధుల్లో ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించారు. నాయకులు బి.ధర్మారావు, నీలమోహన్, రవివర్మ, రాజు పాల్గొన్నారు.

## ఘనంగా రాజశ్యామల యాగం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం లక్ష్మీనర్సుపేట బంగారమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం రాజశ్యామల యాగం ఘనంగా ప్రారంభమైంది. గ్రామానికి చెందిన వైశ్యరాజు చంద్రశేఖర్ రాజు, పాండురాజు, శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

స్పందనకు వందనం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని టి.కృష్ణాపురం సచివాలయం పరిధిలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు జామి ఈశ్వరమ్మ తెలిపారు. ఈ నెల 15న 'ఈనాడు'లో 'ఎటు చూసినా ధాన్యం.. అన్నదాత దైన్యం' శీర్షికతో వెలువడిన కథనానికి కలెక్టరు, వ్యవసాయాధికారులు స్పందించి కొనుగోళ్లకు చర్యలు తీసుకున్నారు.

## పారాపురంలో వన మహోత్సవం

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పారాపురం గ్రామంలో తెలగ కులస్థుల ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనమహోత్సవం నిర్వహించారు. కుల నాయకులు తోట తులసీరామ్, కాళీప్రసాద్, ఎ.రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వారంతా సమావేశమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.

## సంఘటితంగా పోరాడుదాం

జలుమూరు, న్యూస్‌టుడే: విశ్రాంతి ఉద్యోగులంతా సంఘటితంగా పోరాడి సమస్యలు పరిష్కరించుకుందామని సంఘ బుడితిశాఖ ఉపాధ్యక్షుడు పంచాది కాంతారావు అన్నారు. ఎలమంచిలి వద్ద ఎండల కామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. మరో ఉపాధ్యక్షుడు వాన కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శశిభూషణ్ పాఢి, కార్యదర్శి ఆనెం చంద్రశేఖర్, కోశాధికారి శివాజీ పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకీ సేవ

నరసన్నపేట, న్యూస్‌టుడే: కరగాంలో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పల్లకీ సేవ, నగర సంకీర్తన, సేవా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నరసన్నపేట, కంబకాయ ప్రాంతాల సత్యసాయి సేవా సమితుల ప్రతినిధులు, రావాడ చిరంజీవి, పాగోటి రాజులు పాల్గొన్నారు.

(c) eenadu

# శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

## నగర వాసులూ..సమస్యలు వేధిస్తున్నాయా..?

శ్రీకాకుళం నగరంలో పౌర సేవలు అందటం లేదా? నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం క్షీణించిందా? వీధి దీపాలు వెలగడం లేదా? కుళాయి బెడద ఎక్కువగా ఉందా? తాగునీరు అందటం లేదా? చెత్త తొలగించడం లేదా? ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఇంకెందుకు ఆలస్యం.. మీ సమస్యను నేరుగా శ్రీకాకుళం నగరపాలక

నేడు డయల్ యువర్ కమిషనర్

సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తుంది 'ఈనాడు'. మీరు చేయాల్సిందల్లా కింద పేర్కొన్న వాట్సాప్ నంబరుకు మీ సమస్యల చిత్రాలు పంపి ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

తేదీ: 17.11.2025 (సోమవారం) (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు) సమస్యలు ఫోన్ నంబరు: 98499 06969
చిత్రాలు పంపాల్సిన వాట్సాప్ నంబరు: 94408 41047

## తెరపై ఈనాడు

• మారుతి: లవ్ ఓటీపీ, నువ్వోస్తానంటే నేనొద్దంటానా • కిన్నెర: సంతాన ప్రాప్తిరస్తు • కీర్తన: ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో • కీర్తిక: ది గర్ల్ ఫ్రెండ్ • ఎస్వీసీ (రామలక్ష్మణ): కాంత • సూర్యమహల్: శివ • సినీమ్యాక్స్: జిగ్రీస్ • సరస్వతి: మాస్ జాతర – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

## యురవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం యువ రచయితల వేదిక (యురవే) ఆధ్వర్యంలో కార్తిక వన మహోత్సవం, సాహితీ సమ్మేళనం జరిగింది. యురవే అధ్యక్ష, కార్యదర్శులు తంగి ఎర్రమ్మ, పొట్నూరు మాలతి ఆధ్వర్యంలో పలువురు కవులు, రచయితలు కవితలు చదివారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పోలినాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

**సమస్య:** శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీలోని పలు వీధుల్లో కొన్ని రోజులుగా వీధి దీపాలు పని చేయడం లేదు. - పి.నరసింగరావు, పీఎన్ కాలనీ, శ్రీకాకుళం
**సమాధానం:** మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - పీవీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ
-న్యూస్‌టుడే,ఆమదాలవలస పట్టణం

**సమస్య:** వెంగళరావుకాలనీలో కుళాయిల ద్వారా రంగుమారిన నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. - శ్రీను, స్థానికులు
**సమాధానం:** తగు చర్యలు తీసుకుంటాం. - జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

**సమస్య:** పట్టణ ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా కూరగాయలు, పండ్ల తదితర దుకాణాలు పెట్టడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. – శ్రీహరి, స్థానికుడు
**సమాధానం:** కూరగాయల భవనంలోకి వీరిని తరలిస్తాం. – టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

## గ్రంథ పాలకులకు సత్కారం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలో ఉత్తమ గ్రంథ పాలకులను సత్కరించారు. విద్యార్థులకు తెలుగులో వ్యాసరచన, పఠనం అంశంలో పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి వీవీజీఎస్ శంకరరావు, గ్రంథాలయాధికారి భాస్కర్ రాజా, విశ్రాంత గ్రంథాలయాధికారి డి.గోపాలరావు ఉత్తమ గ్రంథ పాలకులను సత్కరించారు. గణేశ్‌కుమార్ (సీతంపేట), సీహెచ్ వెంకటేశ్ (పొందూరు), ఆర్.చిట్టిశ్యాం (జలుమూరు), కె.ఎర్రమ్మ (సరుబుజ్జిలి), కె.రామకృష్ణ (సంతబొమ్మాళి) సత్కారం పొందిన వారిలో ఉన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## బస్సులు రావు.. అవస్థలు తీరవు

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస రోడ్డుపై బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఆమదాలవలస పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నా.. బస్సులు లోపలకు రావడం లేదు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు రోడ్డుపై నిరీక్షిస్తున్నారు. లేదంటే ఆటోల్లో వెళ్లిపోతున్నారు. తెదేపా హయాంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ 54 సెంట్ల స్థలంలో రూ.61 లక్షల వ్యయంతో 2018న బస్టాండ్ ప్రారంభించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ఇక్కడే ఉండటంతో రైలు దిగి సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్టాండ్‌కు వెళ్లేవారు. కొన్ని బస్సులు లోపలకు రావని తెలుసుకుని ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను ఆశ్రయిస్తున్నారు. రోజుకు 5 వేల మంది ప్రజలు, సుమారు 6 వందల మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఇంత ఖర్చు పెట్టి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

• ఒడిశాకు తక్కువ సమయంలో చేరుకోవాలంటే ఆమదాలవలస పట్టణం మీదుగా ప్రయాణం చేయాలి. శ్రీకాకుళం, పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురం, రాయగడ, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, భామిని, నరసన్నపేట, సీతంపేట ఇతర ప్రాంతాలకు చేరుకోవాలంటే బస్సు ప్రధాన రవాణా వ్యవస్థ. బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతోపాటు వాటిని బస్టాండ్‌లో ఆగేలా చర్యలు తీసుకుంటే ఆయా ప్రాంతాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది.

• పాలకొండ త్రిస్టాప్‌లు, పార్వతీపురం, రాయగడ, కొత్తూరు, గుణుపురం, పాతపట్నం, ఆమదాలవలస శ్రీకాకుళం మార్గంలో తిరిగే బస్సులతోపాటు అన్నీ.. బస్టాండ్‌లో ఆగేలా చూస్తాం.' అని ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ ఆర్ ఎస్ఎన్ శర్మ తెలిపారు.

## ఎన్ని సార్లు చెప్పినా.. వినరే..!

కృష్ణాపురం కూడలి నుంచి పైవంతెన వరకు ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద లారీలు ఆపేసి సరకులు దించుతుండటంతో ప్రజలు, రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు రోడ్డు కావడంతో వాహనాలు ఢీకొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. కొనిసార్లు ప్రయాణికులు రైళ్లు తప్పిపోయిన సంఘటనలు సైతం జరిగాయి. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్సై బాలరాజు వివరణ కోరగా పట్టణ శివారుల్లో లారీలను ఆపి సరుకులు తరలించాలని చెప్పామని, విస్మరించిన వ్యాపారులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ప్రారంభం

గార మండలం అంపోలులో ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణం ప్రారంభమైంది. రాజరాజేశ్వరి సహిత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రతువులో తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు. అన్నసమారాధన జరిగింది.
– న్యూస్‌టుడే, గార (అంపోలు)

## ఇది తారు రోడ్డే

సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోట-డకరవలస గ్రామాల మధ్య రాకపోకల కోసం కొత్తకోట మినీ జలాశయం గట్టుపై నిర్మించిన తారు రోడ్డు పెచ్చులు ఊడి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు లేదంటే కొత్త రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ జేఈ కూర్మనాథరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

## పందుల సంచారంతో ఇక్కట్లు

శ్రీకాకుళం నగరం భైరివానిపేట పరిసర ప్రాంతాల్లో పందుల పెంపకందారులు వాటిని బహిరంగంగా విడిచిపెట్టేస్తుండటంతో గుంపుగా సంచరిస్తూ ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గేటు తీసి ఉన్న ఇళ్లలోకి ప్రవేశించి దాడులకు పాల్పడుతున్నాయి. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

## కానరాని సంపద సృష్టి

జి.సిగడాం మండలం పెంట గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం నిరుపయోగంగా మారింది. వ్యర్థాల సేకరణ సక్రమంగా జరగడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఈ విషయమై ఎంపీడీవో రామకృష్ణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

## మొక్కలు పెరిగి దోమలు వృద్ధి

పొందూరు మండలం లోలుగు గ్రామంలో బస్టాప్ పక్కను వెళుతున్న మురుగు కాలువలో పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. దుర్వాసన, దోమలు ఎక్కువయ్యాయి. అధికారులు మొక్కలు తొలగించి, కాలువ శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

## ఎప్పటికి పూర్తయ్యేనో..!

సరుబుజ్జిలి మండలంలోని పాలవలస గ్రామంలో వైకాపా పాలనలో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం పనులు మధ్యలో నిలిచిపోయాయి. పాలవలస గ్రామంలో నిర్మించాలని కొందరు, పాలవలసకాలనీలో కట్టాలని మరికొందరు ఒత్తిడి చేయడంతో ఆగిపోయింది. దీంతో పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వివాదం పరిష్కరించి త్వరితగతిన పూర్తి చేయాలని అంతా కోరుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ జేఈ కూర్మనాథరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

## ఆదిత్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్

అరసవల్లిలో కొలువైన సూర్యనారాయణస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆదిత్యాలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం పలికి ప్రసాదాలు అందజేశారు. ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

## దుర్గగుడికి పలువురి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు దాతలు విరాళం అందజేశారు. శ్రీకాకుళానికి చెందిన ఎం.ప్రభాకర్ రూ.లక్ష, తెలంగాణ సూర్యాపేటకు చెందిన రూ. 1,00,116 విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ జగదీష్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాత ఎం.ప్రభాకర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

## వ్యర్థాలతో దుర్వాసన

ఆమదాలవలస మండలం ఎన్టీవాడ గ్రామంలో రహదారిపై ఉన్న వ్యర్థాలు తొలగించాలని గ్రామస్థులు ప్రయాణికులు, కోరుతున్నారు. అవి తడిసిపోయి దుర్వాసన వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పందులు, కుక్కలు చెత్తను రోడ్లపైకి లాగేస్తున్నాయన్నారు. వ్యర్థాలను తొలగిస్తామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

## వన భోజన సందడి

ఆహారం తింటున్న స్థానికులు

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండల కేంద్రానికి చెందిన శ్రీ భ్రమరాంబ మల్లన్న దేవాంగ సమాఖ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బొడ్డపాడు సమీపంలోని మామిడితోటలో కార్తిక వనభోజన కార్యక్రమం సందడిగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతోపాటు పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 2 వేల మంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మన ఊరు మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఇంటర్నేషనల్ క్లబ్‌సభ్యులు మొక్కలు నాటారు. లయన్ పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ డి.సూర్యప్రకాశ్, కేవీ సుబ్బరాజు, డీఎస్ఎస్‌వీ వర్మ, డీసీవీఎం రావు, సాహూ రమణ తదితరులు మాట్లాడారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ప్రతినిధి బరాటం లక్ష్మణరావు, సభ్యులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## శ్రీకూర్మ క్షేత్రంలో భక్తుల తాకిడి

గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక ఆదివారం కావడంతో ఈ మార్గంలో వనభోజనాలకు వచ్చే వారు క్షేత్రాన్ని సందర్శించడంతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.
– న్యూస్‌టుడే, గార (శ్రీకూర్మం)

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

శ్రీకాకుళం నగర పరిధి పీఎన్ కాలనీ వరసిద్ధి వినాయక కల్యాణ మండపంలో ఆదివారం డబ్బీరు నరసింహమూర్తి పట్నాయక్ వారసత్వ కుటుంబ సభ్యుల ఆత్మీక కలయిక సందడిగా సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన పోలుమహంతి జగన్మోహనరావు, రమ దంపతులను కుటుంబ సభ్యులంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ద్వారా అందిస్తున్న సేవలను కొనియాడారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డబ్బీరు జనార్దనరావు, వెంకట రమణమూర్తి, ఇతర సభ్యులను పలువురు అభినందించారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

## వాహనాలు కనిపించట్లేదు

ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట-నెల్లిపర్తి గ్రామాల మధ్య రహదారిలో పేరుకుపోయిన పనికిరాని మొక్కల వల్ల మలుపులు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు ఫిర్యాదు చేశారు. మొక్కలు తొలగించి, మలుపులు వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలన్నారు. తొలగిస్తామని ఎంపీడీవో ఆర్.వెంకటరావు వెల్లడించారు.
–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

## ఆకట్టుకున్న పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు

సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులోని సత్యసాయి పెద్ద మందిరంలో ఆదివారం బాలవికాస్ పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కన్వీనర్ కె.మురళీకృష్ణ, డా.బొడ్డేపల్లి సురేష్, వెంకట్రామన్, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## రబీ పంటల సాగుపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న ఆచార్య అనిల్‌కుమార్

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు వరిలో పూతిక, నలుపు ధాన్యం మొక్కలు వేరు చేయాలని శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్, ఆచార్య అనిల్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం నైరా కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా చల్లవానిపేట, భైరివానిపేటలో ఆదివారం రబీ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీడపీడలు, కలుపు, ఎరువుల యాజమాన్య పద్ధతులు వివరించారు. 40 రకాల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. డాక్టర్ రాజేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుశాలి సామాజికవర్గీయుల సంక్షేమానికి కృషి

బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నియోజకవర్గంలోని పట్టుశాలి సామాజికవర్గీయుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తోటపాలెం సమీపంలో వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతుగా సాయం చేయడానికి నిరంతరం సిద్ధంగా ఉంటానని తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘ నాయకులు ఎం.శివరామకృష్ణ, పి.మధుబాబు, జె.గిరిధర్, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాప్రసాద్‌కు సత్కారం

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం బలదేవ్ బాక్సింగ్ క్లబ్, స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం, గేదెల ఇందిరాప్రసాద్‌కు సత్కారం నిర్వహించారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు పీజీ గుప్తా, స్టార్ మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, జోగినాయుడు, జి.రాజీవ్, ఆర్.గణేశ్, వాకర్స్ క్లబ్ సభ్యులు గోపాలరావు, కామేశ్వరరావు, శేఖర్ తదితరులు ఇందిరాప్రసాద్‌ను అభినందించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

## జూదరుల అరెస్టు

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని చిల్లపేటరాజాంలో జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. సాయంత్రం 5 గంటల సమయంలో దాడి చేసి రూ.8090 నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## సాగర తీరాల్లో సందడి

కార్తిక ఆదివారం సందర్భంగా గార మండలం కళింగపట్నం-మత్స్యలేశం, మొగదాలపాడు సాగర తీరాలకు సందర్శకులు పోటెత్తారు. ఇసుక తిన్నెలపై ఆటపాటలతో సరదాగా గడిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది పహారా కాశారు.– న్యూస్‌టుడే, గార

## అంటువ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం పిల్లలవలస గ్రామంలో డాక్టర్ అన్నెపు శశిధర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామంలో మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతోపాటు పరిసర గ్రామాల నుంచి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శశిధర్ మాట్లాడుతూ అంటువ్యాధులపై అప్రమత్తం ఉండాలని ఆరోగ్యంపై తగు జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.చిన్నంనాయుడు, సర్పంచి బుడుమూరు పోలినాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం బొడ్డేపల్లిలో ఆదివారం శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులు, చుట్టుపక్కల వారు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు 13 మందిని మెరుగైన చికిత్సకోసం ఆసుపత్రికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయికృష్ణ, పావని, తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ లేని బడులు.. విద్యార్థులకు పాట్లు

• పాఠశాలలకు ప్రహరీలు లేక ఇబ్బందులు

-న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీలు లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా, పశువులకు ఆవాసంగా మారుతున్నాయి. పాఠశాల పని దినాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కనిపెట్టుకుని ఉంటున్నా.. సెలవు రోజుల్లో భద్రత కరవైంది. ఆమదాలవలస నియోజకవర్గంలో మొత్తం పాఠశాలలు 285 ఉండగా వాటిలో 137 పాఠశాలలకు ప్రహరీలు లేవు.

• కొన్ని బడుల్లో ప్రభుత్వం అందించిన విలువైన విద్యా క్రీడా సామగ్రిని భద్రపరచడం, కష్టపడి పెంచుకుంటున్న కిచెన్ గార్డెన్‌ను కాపాడుకోవడం

ప్రహరీ లేని అమృతలింగానగరం పాఠశాల

• ప్రహరీలు లేకపోవడంతో పశువులు, విష కీటకాలు విద్యార్థుల మధ్యకు వచ్చేస్తున్నాయి. మధ్యాహ్న భోజనాల సమయాల్లో గుంపులుగా శునకాలు ఆవరణలో ఉంటున్నాయి. పశువులు, పాములు, శునకాల బెడదతో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో..

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు | ప్రహరీలు లేనివి |
|---|---|---|---|
| సరుబుజ్జిలి | 43 | 1737 | 29 |
| ఆమదాలవలస | 99 | 5,486 | 59 |
| పొందూరు | 69 | 4600 | 22 |
| బూర్జ | 63 | 3,238 | 27 |

ఇబ్బందిగా ఉందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులకు చెప్పినా.. ఫలితం ఉండటం లేదన్నారు.

• ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించేందుకు కృషి చేస్తున్నాం. ప్రహరీలు లేని పాఠశాలలను గుర్తించి జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మిస్తాం.' అని సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల ఎంఈవోలు డి.బాలరాజు, అప్పలరాములు, వాగ్దేవి, ధనుంజయరావులు తెలిపారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం: 1949
మరణం: 07-11-2025

అనునిత్యం మీ రక్తాన్ని స్వేదంగా మలిచి, మా ప్రగతి సోపానంలో ఆలంబనగా నిలిచి, ఆప్యాయత, అనురాగాలకు నిలువెత్తు రూపానివై, విలువలుతో కూడిన క్రమశిక్షణ గల జీవితాన్ని ప్రసాదించిన మీరు, అకస్మాత్‌గా దైవసన్నిధికి చేరినందులకు మిక్కిలి చింతిస్తూ.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సదా భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ శ్రీమతి రమణి గారు
న్యూకాలనీ, శ్రీకాకుళం

భర్త
ఆచంటి తాతాజి

కుమారుడు - కోడలు - మనుమడు/ మనుమరాలు
ఆచంటి రాము - పావని, సాయిహర్ష, లలితావైష్ణవి
కుమార్తె - అల్లుడు మనుమరాలు - మనుమరాలు భర్త
శింగంశెట్టి శ్రీవల్లీదేవి - కీ॥శే॥ వెంకటరంగారావు, కావ్యప్రియ - సందీప్

పెద్దకర్మ: తేది 17-11-2025 సోమవారం శ్రీకాకుళం టౌన్, న్యూకాలనీ, సాయిపార్వతీహైట్స్ అపార్ట్‌మెంట్ ప్లాట్ నెం: 101 గల మా స్వగృహం నందు జరుగును.

శ్రీమాత కన్‌స్ట్రక్షన్స్, ఇంజనీర్స్ & బిల్డర్స్ / శ్రీకాకుళం సెల్: 9440195035

# చరవాణి ఆగమనం చూపు మందగమనం

## చిన్నారుల్లో మయోపియా సమస్య



తిరుపతికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సక్రమంగా చదవడం లేదని తండ్రి మందలించేవారు. విషయం ఆరా తీస్తే బోర్డుపై అక్షరాలు సరిగా కనిపించడం లేదని చెప్పడంతో ఆ తండ్రి నేత్ర వైద్యుడిని సంప్రదించారు. ఆ విద్యార్థికి మయోపియా ఉన్నట్లు తేల్చారు.

**తిరుపతి (వైద్యవిభాగం), పుంగనూరు, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అందులో 15 శాతం మంది పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. మయోపియా కారణంగా పిల్లల్లో కంటి చూపు మందగిస్తున్నట్లు వైద్యులు ధ్రువీకరించారు.

- బోర్డుపై అక్షరాలు కనిపించకపోవడానికి 80 శాతం మయోపియా. 20 శాతం హైపర్ మెట్రోపియా కారణమని వైద్యులు అంటున్నారు.
- ఉమ్మడి జిల్లాలో నిత్యం 50-70 మంది మసక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు.

### అంటే ఏంటీ..?

సాధారణంగా నేత్రాలకు వెయ్యి లక్స్ కంటే ఎక్కువ కాంతి అవసరం. అప్పుడే కళ్లు తేజోవంతంగా పనిచేస్తాయి. అంతకంటే తక్కువ కాంతిలో చదవడం, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోతే మయోపియాకు దారి తీస్తుంది. కొందరు పిల్లల్లో పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుంది. కొందరికి యుక్త వయసులో వస్తుంది. ఈ సమస్యతో దూరంగా ఉన్న వస్తువులను చూడలేరు. అతి దగ్గర నుంచి తక్కువ కాంతిలో టీవీ, ఫోన్, ట్యాబ్ గంటల తరబడి చూస్తే దీని బారినపడతారు. కొవిడ్ సమయంలో ఎక్కువగా పిల్లలు కంటి సమస్యలకు గురైనట్లు గుర్తించారు.

### 20 - 20 - 20 తెలుసా..!

పిల్లలు డిజిటల్ పరికరాలు ఉపయోగించే సమయం తగ్గించాలి. మూడేళ్ల కంటే తక్కువ వయసున్న వారి చేతికి డిజిటల్ పరికరాలు ఇవ్వకూడదు. కంటికి దగ్గరగా పెట్టి చదవడం.. రాయడం చేయరాదు. ప్రతి 20 నిమిషాలు కంప్యూటర్ చూసిన తర్వాత 20 సెకన్లు చూపు మరల్చాలి. 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువును చూడాలి. ఇది కంటి కండరాలను సడలిస్తుంది.

### ఏం చేయాలి

ఏటా పిల్లలకు నేత్ర పరీక్షలు చేయించాలి. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ భాగస్వాములు కావాలి. సహజ సూర్యకాంతి మానవ నేత్రం మయోపియాకు గురి కాకుండా రక్షిస్తుంది. చరవాణి చూడటం ఆపేయాలి. ఒకరు మయోపియాకు గురైతే వారితో పుట్టిన వారికి పరీక్షలు చేయించాలి. వెంటనే అద్దాలు వాడితే సమస్య తీవ్రత పెరగదు. జాగ్రత్తలు తీసుకోవాలి.

**తిరుపతి జిల్లా వివరాలు ఇలా..**

| సంవత్సరం | పరీక్షలు | అద్దాలు |
|---|---|---|
| 2024 | 64,712 | 4,517 |
| 2025 | 24,813 | 1,724 |

(ఇప్పటివరకు)

### జాగ్రత్తలు తీసుకోవాలి: డాక్టర్ పీఏఎస్ చలపతిరెడ్డి, కంటి వైద్య విభాగాధిపతి, ఎస్వీ వైద్య కళాశాల

పిల్లల్లో మయోపియా సంకేతాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బ్లాక్ బోర్డుకు దగ్గరగా వెళ్లి చదువుతున్నారా.. ఇంట్లో దూరపు వస్తువులు చూడలేకపోతున్నారా.. తదితర లక్షణాలు ఉంటే వెంటనే చికిత్స అందించాలి. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, మాంసం, గుడ్లు, పాలు అన్నీ ఉండేలా చూసుకోవాలి.

# ఆరే.. తీరే.. కులే..

**పలమనేరు, న్యూస్‌టుడే:** ఆరే.. తీరే.. కులే.. సరక్.. దల్.. ఏంటీ మాటలు అనుకుంటున్నారా.. ఇది ఏనుగుల భాష. వాటిని నియంత్రించడానికి మావటీలు వాడే పదాలు. సాధారణంగా అవేం తింటాయి.. ఎలా ఉంటాయి.. అనేది అందరికీ తెలిసిందే. మరీ ఈ ఏనుగుల భాష కూడా తెలుసుకుందామా..! ఈ పదాలనే మావటీలు ఏనుగులకు అలవాటు చేస్తారు. వాటిని నియంత్రించడానికి చిన్న చిన్న పదాలు ఉపయోగిస్తారు. పలమనేరు మండలం ముసలిమడుగు కుంకీ శిబిరంలో ఉన్న 6 ఏనుగులు కూడా ఇదే భాషకు అలవాటు పడిపోయాయి.

**మావటీలు ఉపయోగించే కమాండ్లు**

- **దల్:** తొండం పైకి ఎత్తు
- **జుక్:** ముందు కాళ్లు మడచి వంగటం
- **కులే:** వెనక్కి వంగటం (వెనుక కాళ్లు వంచి)
- **సరక్:** వెనక్కి నడవటం
- **ఆరే:** ఇటు రా
- **బైట్:** కూర్చో
- **తీరే:** పడుకో

### పేరుతో పిలిస్తే చాలు..

కుంకీ శిబిరంలో ఉన్న ఏనుగుల పేర్లు జయంత్, రంజన్, అభిమన్యు, కృష్ణ, దేవ, వినాయ్. పేరు పెట్టి పిలిస్తే ఆ ఒక్కటి మాత్రమే స్పందిస్తుంది. అంటే వాటికి తమ పేర్లు కూడా తెలుసు.

### త్వరలో సందర్శనకు అనుమతి

కుంకీ శిబిరంలోని ఏనుగులు, వాటి విన్యాసాలను చూడటానికి ప్రజలకు త్వరలోనే అనుమతి ఇవ్వనున్నట్లు అటవీశాఖ అధికారి నారాయణ తెలిపారు. శిబిరంలోకి టిక్కెట్టు ధర నిర్ణయించగానే అనుమతిస్తాం. సందర్శకుల కోసం టీకొట్టు, దుకాణాల ఏర్పాటు ఆలోచనలో ఉన్నట్లు వివరించారు.

## తిరుమల బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో..

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంటే కనులపండగే.. లక్షలాది మంది భక్తులు వచ్చి వాహనసేవల్లో విహరించే స్వామిని చూస్తూ తన్మయత్వం చెందుతారు. ఇంత అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు పూర్వ కాలంలో తిరుమలలో నిర్వహించేవారు కాదని తెలుసా.. గతంలో తిరుమల గిరుల దట్టమైన అరణ్యంతో నిండి ఉండడంతో క్రూరమృగాలు ఎక్కువగా సంచరించేవి. దీనికి తోడు అక్కడ వసతులు లేకపోవడంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను తిరుచానూరులోనే జరిపించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ముందుగా శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణం చేసి.. ఆ తరువాత వాహన సేవలను తిరుచానూరులో చేసేవారు. తరువాత కాలంలో భగవద్రామానుజాచార్యులు సూచనతో నాటి నుంచి తిరుమల క్షేత్రంలోనే నిర్వహిస్తున్నారు.

## అద్దంలా.. అందంగా..



చంద్రగిరి మండలం కొటాల వెంకట్రాయుని చెరువు ఇటీవల వర్షాలకు నిండుకుండలా మారింది. పైభాగాన ఉన్న ఎత్తైన కొండలు చెరువు నీటిలో ప్రతిబింబాలుగా కనువిందు చేస్తున్నాయి. – న్యూస్‌టుడే, చంద్రగిరి

# అమెరికాలో అందెల రవళి.. ..సింగపూర్‌లో సరిగమలు

మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో విదేశాల్లో సంగీతం, నృత్య కోర్సులు

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు సాధిస్తోంది. వర్సిటీలో ఉన్న ఇంటర్నేషనల్ రిలేషన్స్ కార్యాలయం (ఐఆర్) ఆధ్వర్యంలో అమెరికా, సింగపూర్‌లో సంగీతం తరగతులు నిర్వహిస్తోంది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా)తో అవగాహన ఒప్పందం చేసుకుని వర్సిటీ సంగీతం, నృత్య కళల విభాగం ఆధ్వర్యంలో తరగతులు నిర్వహిస్తూ, ఎన్ఆర్ఐలకు, విదేశీయులకు భారతీయ కళలను పరిచయం చేస్తోంది.

– న్యూస్‌టుడే, తిరుపతి (మహిళా వర్సిటీ):

### 2016లో ఏర్పాటు

వర్సిటీ సంగీత విభాగం ఆధ్వర్యంలో ఈ కోర్సులను అమెరికాలో 2016లో ప్రారంభించగా.. సింగపూర్‌లో 2021 నుంచి మొదలుపెట్టారు. అమెరికాలో తానా కళాశాల, డల్లాస్‌లో సుస్వర అకాడమీ ఆఫ్ మ్యూజిక్, రాగ వాహిని మ్యూజిక్ అకాడమీ, సింగపూర్‌లో విద్యా సంగీతం అకాడమీల ద్వారా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నారు.

### డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు..

4 సంవత్సరాల డిప్లొమాలో మ్యూజిక్ (వోకల్), డ్యాన్స్ (భరతనాట్యం, కూచిపూడి), ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సుల్లో వాగ్గేయకారామృతం, వర్ణం, అన్నమయ్య సంకీర్తనం కోర్సులున్నాయి. ఏడాది పూర్తి చేస్తే డిప్లొమా ఇన్ ఇంట్రడక్టరీ సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు పూర్తి చేస్తే డిప్లొమా సర్టిఫికెట్, 3, 4 ఏళ్ల కోర్సు పూర్తి చేస్తే అడ్వాన్స్‌డ్ డిప్లొమా సర్టిఫికెట్లను మహిళా వర్సిటీ అందిస్తోంది.

### 3 వేలకుపైగా విద్యార్థులు

ఇప్పటి వరకు అమెరికా, సింగపూర్‌లోని అకాడమీలలో దాదాపు 3వేలకు పైగా ఎన్నారై విద్యార్థులు సంగీతం, నృత్యంలో శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడాది 500 మంది వరకు కోర్సులను అభ్యసిస్తున్నారు. వారానికి 4 గంటలు థియరీ, 8 గంటల ప్రాక్టికల్ ట్రైనింగ్‌తో వర్సిటీ రూపొందించిన సిలబస్‌కు అక్కడి తెలుగు కమ్యూనిటీ నుంచి మంచి స్పందన లభిస్తోంది.

నృత్యంలో శిక్షణ తీసుకుంటున్న ఎన్నారై విద్యార్థినులు

### విదేశీయులూ ఆసక్తి..

భారతీయ కళలను, తెలుగు నృత్య, సంగీత కళలను ప్రపంచమంతటా విస్తరించడానికి శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ కృషి చేస్తోంది. తెలుగు కుటుంబాలతోపాటు విదేశీ విద్యార్థులు కూడా ఆసక్తి చూపుతున్నారు. చాలామంది భారతీయ సంగీతం, నృత్యం పట్ల ఆకర్షితులై శిక్షణ తీసుకుంటున్నారు. – ఆచార్య పి.విజయలక్ష్మి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్, మహిళా వర్సిటీ

**సంప్రదించాల్సిన నంబర్లు**

- అమెరికా: (972)501-04111, (214)649-8278
- మహిళా వర్సిటీ: 98498 40015

# అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ముందు అంకురార్పణ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారు, సర్వసైన్యాధిపతి విష్వక్సేనుడిని ఊరేగింపుగా ఆలయ సమీపంలోని ఉద్యానవనానికి తీసుకెళ్లి పుట్ట వద్ద కొలువుదీర్చారు. పుట్టమట్టి సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. యాగశాలలో పుట్టమట్టిలో నవధాన్యాలు నింపి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం జరగనుంది. రాత్రి 7 గంటల 9 గంటల మధ్య అమ్మవారికి చిన్నశేష వాహనసేవ జరగనుంది.

పుట్టమట్టి సేకరిస్తున్న అర్చకులు

అలంకరణలో విష్వక్సేనుడు

# పట్టణ అవినీతి ప్రణాళిక

## అడ్డదారిలో అక్రమ నిర్మాణాలు

క్రమబద్ధీకరణకు లభించని ఆదరణ



**తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:** తిరుపతి నగరపాలక సంస్థ ప్రతిష్ఠను పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు దిగజార్చుతున్నారు. తిరుపతిలో జరుగుతున్న వందల అక్రమ నిర్మాణాలు, వేలాది అనధికారిక కట్టడాలకు కర్త, కర్మ, క్రియ పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులనేది బహిరంగ రహస్యమే. అక్రమ కట్టడాలకు సంబంధించి అంతస్తుకో ధర నిర్ణయించి విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నా.. అడిగే నాథుడు కరవయ్యాడు.

- బీపీఎస్-2019 దరఖాస్తులు: 1,408
- ఆమోదించినవి: 1,227
- తిరస్కరించినవి: 17
- దరఖాస్తుల్లో సవరణలు: 159
- పెండింగ్: 5

నగరంలో ఏటా 1,500 వరకు భవన నిర్మాణాలు జరుగుతుంటాయి. అందులో 500 వరకు నగరపాలిక అనుమతి కోసం దరఖాస్తు చేసినా అందులో 90 శాతం అనుమతి పొందిన ప్లాన్ ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారు. నగరంలో ప్రభుత్వ స్థలాలు, కాలువ పోరంబోకు, తితిదే స్థలాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు ఎక్కువగా ఉండటంతో వాటికి నిబంధనల ప్రకారం అనుమతులు రావు. వీటికి అనుమతుల కోసం పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి రుసుములు చెల్లించాల్సి రావడంతో భవన యజమానులు దరఖాస్తు చేయడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులతో గుట్టుగా ఒప్పందం కుదుర్చుకుని వారు అడిగినంత ఇస్తే భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వారే బాధ్యత వహించి అక్రమ నిర్మాణానికి అండగా ఉంటారు.

### బీపీఎస్‌పై ఆశలు నీరుగార్చుతూ...

వైకాపా పాలనలో తిరుపతి నగరంలోని 4,500 వరకు అక్రమ కట్టడాలకు తాఖీదులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించి వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఓ మోస్తరు భవనాలకు తాఖీదులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. ఈ లెక్కన నగరంలో 90 శాతం అక్రమ కట్టడాలే ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కల్పించిన బీపీఎస్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు భవన యజమానులు ముందుకు రావడం లేదు. బీపీఎస్ విషయంలో కూడా నగరపాలిక అధికారులు తమ స్వార్థ ఆలోచనలు అమలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. 'మేం రక్షగా ఉంటాం.. భవనం కూల్చివేత జరగనే.. జరగదని.. అనవసరంగా ఎందుకు ప్రభుత్వానికి రుసుములు చెల్లిస్తారు' అంటూ భవన నిర్మాణ యజమానుల్ని బీపీఎస్‌పై నిరుత్సాహానికి గురిచేస్తున్నారు. ఈ క్రమంలో దరఖాస్తులు తక్కువ వస్తున్నట్లు చెబుతున్నారు.

# తోతాపురి.. బకాయిలెప్పుడో మరి..?

- పుత్తూరు మండలం కేబీఆర్‌పురానికి చెందిన 50 మంది రైతులు కార్వేటినగరం, పుత్తూరు, నారాయణవనం మండలాల్లోని మామిడి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి కాయలు తోలారు. కార్వేటినగరంలోని ఏబీసీ గుజ్జు పరిశ్రమ రైతులకు టన్నుకు రూ.5 వేలు ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన పరిశ్రమలు ఇప్పటివరకు రూపాయి ఇవ్వకపోగా అసలు ఎప్పుడిస్తామనేది చెప్పడం లేదు. ఈ గ్రామ రైతులకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు బకాయిలు రావాలి.
- వెదురుకుప్పం మండలానికి చెందిన రైతులు జీడీ నెల్లూరులోని గుజ్జు పరిశ్రమకు కాయలు తరలించారు. ఆ కర్మాగార యాజమాన్యం విడతల వారీగా బిల్లులు చెల్లిస్తోంది. ఈ పరిశ్రమ ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా చేసి బకాయిలు ఇవ్వాలని కోరినా స్పందించలేదు.

**పుత్తూరు, న్యూస్‌టుడే:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తోతాపురి టన్నుకు రూ.4 వేలు అందజేస్తే.. గుజ్జు పరిశ్రమలు చెల్లించాల్సిన రూ.8 వేలు నేటికీ జమ చేయలేదు. కొన్ని పరిశ్రమలు టన్నుకు రూ.5 వేల కంటే ఎక్కువ ఇవ్వలేమని చెప్పినా ఆ మొత్తాన్ని ఎప్పుడిస్తాయో పేర్కొనడం లేదు. మరికొన్ని బకాయిల ఊసే ఎత్తడం లేదు.. రైతు సంఘాల ప్రతినిధులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా యంత్రాంగానికి చీమకుట్టినట్లయినా లేదు.

- ఉమ్మడి జిల్లాలో విస్తీర్ణం: 1.12 లక్షల హెక్టార్లు
- తోతాపురి సాగు: 55 వేల హెక్టార్లు
- ఈ ఏడాది దిగుబడి: 5.5 లక్షల టన్నులు
- పరిశ్రమలు కొనుగోలు చేసినది: 5.5 లక్షల టన్నులు
- బకాయిలు రావాల్సినది: 2.5 లక్షల టన్నులు
- బకాయిల మొత్తం: రూ. వంద కోట్లు (టన్నుకు కనీసం రూ.4 వేల చొప్పున చెల్లిస్తే)

### పరిశ్రమలకే లాభాలు

ఉమ్మడి జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు రెండు విధాలా లాభపడ్డా.. అన్నదాతలకు బకాయిలు మాత్రం చెల్లించడం లేదు. తోతాపురి కాయలను ప్రభుత్వ ధరకు కొనకపోవడం, నాలుగు నెలలుగా బిల్లులు ఇవ్వకుండా వడ్డీ పరంగా యాజమాన్యాలు లాభపడుతున్నాయి. రైతులు మాత్రం రెండు విధాలా నష్టపోయారు. పరిశ్రమల యజమానులు తమవద్ద తయారైన గుజ్జు ఎగుమతి కాలేదని, రైతుల బకాయిలకు బ్యాంకుల్లో రుణం తీసుకుని చెల్లించాలని యోచిస్తున్నట్లు చెప్పి తప్పించుకుంటున్నారు.

### ఏదీ నాటి చొరవ

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సీజన్ మొదలు నుంచి బకాయిల జమ వరకు కలెక్టర్లు చొరవ తీసుకుని సమన్వయ సమావేశాలు నిర్వహించి నగదు జమయ్యేలా చేసేవారు. నేడు ఆ పరిస్థితే లేదు. మొక్కుబడి సమావేశాలు మినహా రైతుల కన్నీరు తుడిచిన దాఖలాల్లేవు.

# పంట్రంగం.. మరో రామేశ్వరం

**గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** వాకాడుకు 40 కిలోమీటర్ల దూరంలో తీరం వెంబడి వెలసిన శ్రీకామాక్షిదేవి సమేత శ్రీపాండురంగేశ్వర స్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి పురాతన ఆలయంలో రెండు శివలింగాలు ఉన్నాయి. ఇలా ఒకే ఆలయంలో రెండు శివలింగాలు పూజలందుకోవడం తమిళనాడులోని రామేశ్వరం ఆలయం తర్వాత రెండవది పంట్రంగం ఆలయం అని పండితులు చెబుతున్నారు. ఆలయం చోళరాజుల కాలం నాటిది. రాముడు తీరం వెంబడి వెళ్తున్న సమయంలో ఆలయాన్ని సందర్శించి తనతో పాటు వచ్చిన ఆంజనేయుడిని శివలింగాన్ని తీసుకొని రమ్మనగా ఆంజనేయుడు రావడం ఆలస్యం కావడంతో రాముడు సైకత లింగాన్ని చేసి ప్రతిష్ఠించాడని, తర్వాత ఆంజనేయుడు తెచ్చిన లింగాన్ని కూడా అదే ఆలయంలో పక్కనే ప్రతిష్ఠించారని శాసనాలు చెబుతున్నాయి. ఆలయం చుట్టు పక్కల 101 కోనేర్లు, 101 శివలింగాలు ఉన్నాయని చెబుతుండగా, నేటికీ కొన్ని కన్పిస్తుంటాయి. కార్తిక మాసం.. మహాశివరాత్రి పర్వదినాల్లో ఆలయంలో విశేష పూజలను నిర్వహిస్తుంటారు.

ఆంజనేయస్వామి ప్రతిష్ఠించిన శ్రీపాండురంగేశ్వరస్వామి శివలింగం

రాముడు చేసిన రామలింగేశ్వరస్వామి సైకత శిల్పం

## నేడు డయల్ యువర్ సీఎండీ

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. డిస్కం పరిధిలోని వినియోగదారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చరవాణి నంబరు 89777 16661కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలుపవచ్చన్నారు.


**104FM Tirupati**

**ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు**

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వానేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499


## నేడు పీజీఆర్ఎస్

**తిరుపతి (కలెక్టరేట్):** కలెక్టరేట్, రెవెన్యూ, మండల కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు అధికారులు ప్రజల వినతులు స్వీకరిస్తారని చెప్పారు.

**ఎస్పీ కార్యాలయంలో రద్దు..**

ప్రముఖుల పర్యటన నేపథ్యంలో ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు చేశారు.

# అక్రమాలు పట్టేస్తుంది.. అక్రమార్కులను పట్టిస్తుంది!

యుక్తధారతో ఉపాధి హామీలో లెక్క ఇక పక్కా

**తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే:** ఉపాధి హామీ పనుల కొలతల్లో తేడా చూపి చేసిన పనులనే మళ్లీ చేసినట్లు బిల్లులు పెట్టేందుకు వీల్లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుక్తధార జియో స్పేషియల్ ప్లానింగ్ పోర్టల్ ద్వారా సర్వే చేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బందికి దీనిపై శిక్షణనిచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల ప్రణాళికను ఇందుకు అనుగుణంగానే సిద్ధం చేస్తున్నారు. సాంకేతిక సిబ్బందికి శిక్షణ పూర్తయింది.

ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులు

జిల్లాలో 2023 నుంచి ఇప్పటి వరకూ రూ.18,87,480 అవినీతి జరిగినట్లు గుర్తించారు. అందులో రూ.14,56,493 రికవరీ చేయగా, రూ.4,29,555 రాబట్టాల్సి ఉంది. 2023-25 మధ్య కాలంలో అవినీతి అక్రమాల్లో భాగస్వాములైన 96 మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. వారిలో 38 మంది రికవరీ చెల్లించడంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు.

**ముందు కొలతలేసి..:** ప్రతి పనిని యాప్‌తో సర్వే చేసి, 50మీటర్లకు ఒక ఫొటో తీసి, పొడవు, వెడల్పు, లోతు కొలతలను ఆటోమేటిక్ గూగుల్ ఎర్త్ మ్యాప్‌లతో గుర్తిస్తారు. వాటిని కంప్యూటర్‌లో నమోదు చేసి నిధులు మంజూరు చేస్తారు. ముందుగా గుర్తించిన ప్రదేశంలో నిర్ణీత కొలతల మేరకే పనులు చేయాలి. అంతకుమించి చేసినా, చేసినట్లు చూపినా బిల్లులు మంజూరు కావు. ఏ రోజుకారోజు కొలతలను అప్‌లోడ్ చేయాలి.

### వెలుగు చూసిన అక్రమాల్లో కొన్ని..

బాలాయపల్లిలో రూ.16.38 కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. బాధ్యులైన ఒక సాంకేతిక సహాయకుడు, ముగ్గురు క్షేత్ర సహాయకులను సస్పెండ్ చేశారు. దొరవారిసత్రం మండలంలో రూ.7.50 లక్షలు అవినీతి జరిగినట్లు గుర్తించారు. ముగ్గురు క్షేత్ర సహాయకులకు, ముగ్గురు సాంకేతిక సహాయకులకు తాఖీదులు ఇచ్చి, సస్పెండ్ చేశారు.

### ఏ రోజు చేసిన పనికి ఆరోజే కొలతలు

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. యుక్తధార టూల్‌తో పని ప్రదేశంలో ముందుగానే కొలతలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఏ రోజుకారోజు చేసిన పనిని కొలతలు తీస్తారు. ఒకసారి చేసిన పనిని మరో సారి చేసినట్లు చూపే అవకాశం ఉండదు. – శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

# ఆలయ దర్శిని

## కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో సేవలు

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30 గంటలు
పంచామృతాభిషేకాలు: ఉదయం 5.30 (ప్రథమ కాల), 9.00 (ద్వితీయకాల), 11.00 (తృతీయకాల)
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.30 గంటలకు
హోమాలు: ఉదయం 7 నుంచి 10 గంటల వరకు

నిజరూప దర్శనం: ఉ. 7-7.30, 8.30-9.00, 10.30-11.00
సాయంత్రం: 4.30- 5.00
సర్వదర్శనం: ఉ. 6-7,8-8.30, 9.30 -10.30 గంటల వరకు
మ. 12.00, సా. 4.30, రా. 7-9

– న్యూస్‌టుడే, కాణిపాకం

## శ్రీవారి ఆలయంలో

**నిత్యోత్సవాలు** తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, మంగళ, బుధ, గురువారాలు ఉ.3.45 గంటలకు తోమాలసేవ, 4.45 గంటలకు అర్చన, మ.12 గంటలకు కల్యాణోత్సవం, 2 గంటలకు డోలోత్సవం, 3 గంటలకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం 5 గంటలకు సహస్ర దీపాలంకారసేవ.

**సర్వదర్శనం:** తెల్లవారి 3.30-5.45, ఉ.8-9.30కు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. గురువారం, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సర్వదర్శనం.

**వారోత్సవాలు:** ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9కి నిర్వహిస్తారు. బుధవారం సహస్రకలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం ఉదయం 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

## ముక్కంటి ఆలయంలో

**ఉదయం:** 5.30: సుప్రభాత సేవ. 5.45: గోమాత పూజ
6.30: ప్రథమ కాలాభిషేకం
7.30: ద్వితీయ కాలాభిషేకం
11.00: నిత్యోత్సవం, చండీ, రుద్రహోమాలు
11.30: నిత్య కల్యాణం
**సాయంత్రం:** 3.30: ప్రదోష కాలాభిషేకం **రాత్రి :** 7.00: నీరాజన మంత్రపుష్పం
9.00: ఏకాంతసేవ
**సర్వదర్శనం:** ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.

**రాహు, కేతు పూజలు:** ఉదయం 6 నుంచి సాయంత్రం 5. వరకు.

**అభిషేకాలు:** మృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళ), శ్రీమేధాదక్షిణామూర్తికి (గురు), శనిభగవానునికి (శని), సూర్యనారాయణుడికి (ఆది). మనోన్మణికి ఊంజల్‌సేవ(శుక్ర వారం).

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

---

ఆరోగ్య పరిరక్షణ.. మహిళా వర్సిటీ మైక్రోబయాలజీ పరిశోధకుల కృషి

# సూక్ష్మజీవులపై పరిశోధన

**తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే:** ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో అంతుచిక్కని వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఈ వ్యాధులకు కారణమైన సూక్ష్మజీవుల స్వభావం, వాటి ప్రవర్తన, వ్యాధుల పుట్టుకపై విలువైన సమాచారాన్ని అందించడంలో మైక్రోబయాలజీ పరిశోధనలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. సూక్ష్మజీవుల విశేషాలను తెలుసుకునేందుకు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగంలోని పరిశోధకులు నూతన పరిశోధనలు చేస్తున్నారు. ఆరోగ్య రంగంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారం చూపే దిశగా ప్రయోగాత్మక పరిశోధనలు సాగిస్తున్నారు పీహెచ్‌డీ విద్యార్థినులు.

### సముద్రపు జీవుల వ్యర్థాలను కుళ్లబెట్టి..

రొయ్యలు, ఎండ్రకాయల పొట్టు, వాటి వ్యర్థాలు భూమిలో కుళ్లబెట్టేందుకు బ్యాక్టీరియా ఉపయోగపడుతుంది. ఆ బ్యాక్టీరియా ఒక ఎంజైమ్‌ను విడుదల చేస్తుంది. ఆ ఎంజైమ్‌లో ఉండే కైటోఆల్గోస్కరైడ్‌లపై నేను పరిశోధనలు చేస్తున్నా. ఆచార్య చండీ మారుతీకుమారి మార్గదర్శకత్వంలో ఈ పరిశోధనలు జరుగుతున్నాయి. కైటోఆల్గోస్కరైడ్ వైద్య, ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయ రంగాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఆరోగ్య సంరక్షణలో కొత్త చికిత్సా విధానాలను అభివృద్ధి చేయొచ్చు. సముద్రపు జీవుల వ్యర్థాలను కుళ్లబెట్టే బ్యాక్టీరియా నుంచి తీసుకున్న ఎంజైమ్‌లో ఉండే కైటోజాన్‌ను కైటోఆల్గోస్కరైడ్‌లుగా మార్చితే కైటోజనీస్ అనే ఒక ఎంజైమ్ వచ్చింది. దీనికి నానో సింథసిస్‌ను యాడ్ చేసి పలు క్యాన్సర్ రుగ్మతలను ఎదుర్కోవడానికి, కాలిన గాయాలు, పుండ్లను తక్కువ రోజుల్లో నయం చేసే అంశాలపై పరిశోధనలు చేస్తున్నా.

**- కె.సబీహాతబసుమ్, పీహెచ్‌డీ విద్యార్థిని**

### ఉప్పుశాతం అధికంగా ఉన్న మట్టిపై..

ఉప్పు మడుగులు ఉన్న మట్టిలో ఉప్పుశాతం ఎక్కువగా ఉంటుంది. ఉప్పుశాతం అధికంగా ఉన్న మట్టిలో హ్యాలోఫిలిక్ అనే సూక్ష్మజీవులుంటాయి. ఇవి పలు రకాల పిగ్మెంట్లను విడుదల చేస్తాయి. ఈ పిగ్మెంట్లపై నేను పరిశోధనలు చేస్తున్నా. వాటి వల్ల చాలా ఉపయోగాలున్నాయని తెలుసుకున్నా. క్యాన్సర్‌కు మందుల తయారీలో ఉపయోగించవచ్చు. ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు తగ్గించవచ్చు. చర్మ సంరక్షణకు వాడే వివిధ రకాల స్కిన్ కేర్ కాస్మొటిక్స్‌లో వీటిని ఉపయోగించవచ్చు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కూడా ఈ పిగ్మెంట్లు ఉపయోగపడతాయి.

**- పి.సుచరిత, పీహెచ్‌డీ విద్యార్థిని**

---

# ఆలస్యంపై ఆగ్రహం

## క్యూలైన్లలో భక్తుల కేకలు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చిన భక్తులు తీవ్ర అసంతృప్తితో క్యూలైన్లలో కేకలు వేస్తూ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వారాంతం అంటే ఊహించని విధంగా రద్దీ నెలకొంటోంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి 35 వేల మందికి పైగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. 5,044 రాహు, కేతు సర్పదోష నివారణ పూజలు జరిగాయి. రాత్రి ఆలయం మూత వేసే వరకు రద్దీ కొనసాగింది.

శీఘ్ర దర్శనం క్యూలైన్ వద్ద బారులు తీరిన భక్తులు

**రద్దీ అయితే ఇబ్బందులు :** స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో క్యూలైన్లు పలు చోట్ల దుస్థితికి చేరాయి. ఎక్కువ మంది వస్తే క్యూలైన్లు ఊడిపోయే పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు జరగకముందే వీటిని పరిశీలించి బాగు చేసే దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

**నిరీక్షణతో ఆవేదన:** సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆలయంలో ఆర్జిత అభిషేక సేవలు, దీపారాధనలతో పాటు లక్ష, బిల్వ, కుంకుమార్చనల సందర్భంగా క్యూలైన్లు నిలుపుదల చేయాల్సి వచ్చింది. వీఐపీల రాక నేపథ్యంలో క్యూలైన్లు నిలిపేశారు. అప్పటికే గంటల తరబడి క్యూలైన్లలో ఉన్న భక్తులను నిలుపుదల చేయడం, ఇతర మార్గాల్లో సిఫార్సు దర్శనాలను అనుమతించడం పట్ల భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దర్శనాలకు వదలిపెట్టాలంటూ క్యూలైన్లలో కేకలు వేశారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. రద్దీ నేపథ్యంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుంటే రానున్న రోజుల్లో మరిన్ని కష్టాలు తప్పవు మరి.

---

## కంచి పీఠాధిపతికి తితిదే పెద్ద మర్యాద

**తిరుమల, న్యూస్‌టుడే:** కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామీజీకి తితిదే పెద్ద మర్యాద చేసింది. ఆదివారం తిరుమలలోని రావిచెట్టు వద్దకు చేరుకున్న పీఠాధిపతికి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చకులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీకి శ్రీబేడి ఆంజనేయస్వామి ఆలయంలో దర్శనం చేయించారు. శ్రీవారి ఆలయం ముందు పీఠాధిపతి శిరస్సుపై శఠారీ సమర్పించారు. అనంతరం మహద్వారం గుండా ఆలయంలోకి తీసుకెళ్లగా ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామీజీ అనంతరం శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.

## నేరాలు చేయాలంటే భయపడేలా చేస్తాం: ఎస్పీ

### ఆరుగురు నేరస్థులపై పీడీ యాక్టు

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు.. మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేసే వారు.. బాలికలపై అఘాయిత్యాలకు తరుచూ పాల్పడే వారు సమాజంలో ఉండటం కంటే లోపలికెళ్లడమే సమంజసమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం పోలీసు అతిథి గృహంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తరుచూ నేరాలకు పాల్పడే ఆరుగురు నేరస్థులపై పీడీ యాక్టు(ముందస్తు నిర్బంధం) అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. 'జిల్లా చరిత్రలో మొదటిసారి ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేశాం. బాలికలపై వేధింపులకు పాల్పడుతున్న 160 మందిపై అనుమానిత షీట్లు తెరిచాం. మరోసారి వేధిస్తే పీడీ యాక్టు తప్పదు. గంజాయి అక్రమ రవాణాకు తరుచూ పాల్పడుతున్న 16 మంది నేరస్థులను గుర్తించాం. త్వరలో వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం. త్వరలో తరుచూ భూకబ్జాలకు పాల్పడే వారిపైనా పీడీ యాక్టు అమలు చేయనున్న'ట్లు ఎస్పీ తెలిపారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి పాల్గొన్నారు.

**వీరిపైనే అమలు:** గూడూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన షేక్ కాలేషా, గూడూరు పట్టణం అరుంధతియపాలెంకు చెందిన కనుపూరు శ్రీహరి, తిరుపతి కొర్లగుంట కొత్తపల్లికి చెందిన సయ్యద్ అజీమ్, చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం కమ్మపల్లికి చెందిన వట్టికుంట అరుణ్‌కుమార్, నెల్లూరు జనార్దనరెడ్డి కాలనీకి చెందిన మీధారి సునీల్, సూళ్లూరుపేటకు చెందిన ప్రసన్నకుమార్‌పై పీడీ యాక్టు అమలు చేశారు.

## సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలకు బస్సులు

**తిరుపతి(ఆర్టీసీ):** పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా తిరుపతి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి జగదీష్ తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

## సింగిల్‌విండో సీఈవో జగదీష్ సస్పెన్షన్

**చిన్నగొట్టిగల్లు:** వన్ గ్రామ్ గోల్డ్ పెట్టి రూ.72 లక్షలు రుణాలు పొందిన సంఘటనలో చిన్నగొట్టిగల్లు మండల సింగిల్ విండో సీఈవో జగదీష్‌ను అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 18, 21, ఫిబ్రవరి 11 తేదీల్లో కె.రెడ్డమ్మ, రుతున్ పేర్లతో రుణాలు తీసుకున్నారు. దీనిపై విచారణ చేసిన చిన్నగొట్టిగల్లు డీసీసీబీ బ్యాంకు మేనేజర్ లక్ష్మీప్రసాద్ అధికారులకు ప్రాథమిక నివేదిక అందజేయడంతో అతనిపై చర్యలు తీసుకున్నారు. అతని స్థానంలో బ్యాంకు సూపర్‌వైజర్ రెడ్డిశ్రావణ్‌ను నియమించారు.

---

## 'గోవింద కోటి'తో యువతికి శ్రీవారి దర్శనం

దర్శన టోకెన్ చూపుతున్న పూజ

**తిరుమల, న్యూస్‌టుడే:** గోవింద కోటి రాయడం ద్వారా 25 ఏళ్లలోపు యువతకు తితిదే.. తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనం కల్పిస్తుండగా, పలువురు వినియోగించుకుంటున్నారు. 'గోవింద' నామాన్ని కోటి సార్లు రాస్తే కుటుంబం సహా, పది లక్షల సార్లు రాస్తే.. రాసిన వారికి మాత్రమే బ్రేక్ దర్శన భాగ్యం ఉంటుంది. ముందుగా నామాలు రాసిన పుస్తకాన్ని తితిదేకు సమర్పించాల్సి ఉంటుంది. తాజాగా కాకినాడ జిల్లా తునికి చెందిన పూజ 10 లక్షల సార్లు గోవింద నామాన్ని రాయడంతో ఈ నెల 14న తితిదే ఆమెకు బ్రేక్ దర్శనం కల్పించింది.

## రాధేయ కవితా సంపుటి ఆవిష్కరణ

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని కళామందిరంలో కవి, విమర్శకులు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ కవితా సంపుటి పావుకోళ్లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆదివారం రచయిత పలమనేరు బాలాజీ పుస్తకావిష్కరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కవిత్వం కవుల జీవన తాత్విక తను ప్రతిబింబిస్తుందని అన్నారు. మగ్గం బతుకు కవితా సంపుటితో అని ప్రాంతాల పాఠకులను తన రచనలతో రాధేయ ఆకట్టుకున్నారని అన్నారు.

## యువశాస్త్రవేత్తల ప్రోత్సాహానికి వేదిక

### ఐసర్‌లో ముగిసిన పరిశోధన సదస్సు

ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీకి జ్ఞాపిక అందజేస్తున్న ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడంతోనే సులభంగా పరిశోధన ఫలితాలు సాధించవచ్చని తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ (ఐసర్) రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన బెంగళూరు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 91వ వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటీ, ఐసర్, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, నేషనల్ అట్మాస్ఫిరియక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ సంయుక్తంగా విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా 150 మందికి పైగా శాస్త్రవేత్తలు, ఆచార్యులు ఐసర్ వేదికగా వ్యాక్సిన్ అభివృద్ధి, అంటువ్యాధుల పరిశోధన, స్థిరత్వం, ఖగోళ, భౌతికశాస్త్రం, ఏఐ ఆధారిత శాస్త్రం, జీవావరణ శాస్త్రం, సింపోజియంలతో పరిశోధన ఆలోచనలు పంచుకున్నారని పేర్కొన్నారు. ఇండియన్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ ఐసర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీకి జ్ఞాపికను అందజేశారు.

## సర్వదర్శనానికి 12 గంటలు

**తిరుమల, తిరుపతి (తితిదే):** శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం శ్రీవారిని 73,852 మంది దర్శించుకున్నారు. రూ.3.16 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

**16 వేల టోకెన్ల జారీ:** తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 16 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో 2 వేల టోకెన్లు జారీ చేశారు.

### కాణిపాకంలో ఐదు గంటలు

**కాణిపాకం:** శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి అయ్యప్ప, సాధారణ భక్తులు ఆలయానికి ఆదివారం పోటెత్తారు. దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది.

---

# దేశవాళీ ఆవులు కనుమరుగవుతున్నాయి..

- పరిరక్షించాల్సిన బాధ్యత నేటి తరానిదే
- 13వ పంచగవ్య ముగింపు సదస్సులో విశ్వప్రసన్న తీర్థస్వామి

**ఈనాడు డిజిటల్, తిరుపతి:** 'ప్రాచీన కాలంలో ప్రతి దేవస్థానంలో పంచగవ్యను ప్రసాదంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇందుకు కారణం దేశీ ఆవులు కనుమరుగవడమే' అని ఉడిపి పేజావర అధోక్ష మఠం జగద్గురు విశ్వప్రసన్న తీర్థస్వామి తెలిపారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న 13వ పంచగవ్య జాతీయ వైద్య సమ్మేళనం ముగింపు సదస్సు ఆదివారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచగవ్యను ఔషధంగా కాకుండా ఆహారంగా తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని.. ఇదే అధర్వణ వేదంలోనూ ఉందని పేర్కొన్నారు. గోమాత పరిరక్షణకు ఉడిపిలోని తమ మఠం కృషి చేస్తుందని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం గవ్య సిద్ధ వైద్యులు ఆచార్య జీవన్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. దేశీ ఆవులు ఉన్న ఇల్లు వైద్యాలయంగా, దేవాలయంగా శోభిల్లుతుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఒంగోలు గిత్త, ఆవులను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని సూచించారు. పుంగనూరు ఆవుల సంరక్షణ సైతం ఆశాజనకంగా లేదని వాపోయారు. సదస్సు చివరిరోజు 150 మంది ప్రముఖులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు తరలివచ్చారు. గోమాత స్పర్శ, 16వ గవ్య, విద్యుత్ శరీర సమతౌల్యం అనే అంశాలపై చర్చించారు. పంచగవ్య విద్యాపీఠం నుంచి కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. పంచగవ్య విద్యాపీఠం ఉప-గురుకులపతి డా.కమల్ తాయోరి, పంజాబ్ శ్రీమద్ భగవత్ కథ వాచక్ శ్రీధరాచార్య మహరాజ్, ఆచార్య మదన్‌సింగ్ కుశ్వాహ, ఆచార్య రణవీర్ కేఆర్ సింగ్, ఆమోద్ కేల్కర్, పంచగవ్య గురుకులం సభ్యులు భవనేశ్ దేవర, శ్రీకృష్ణన్ పటేల్, పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రముఖులు

---

## ఎర్రచందనం స్వాధీనం: నలుగురి అరెస్టు

**తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే:** టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆదివారం శ్రీకాళహస్తి మండలంలో నిర్వహించిన వేర్వేరు దాడుల్లో ఎర్రచందనం స్వాధీనం చేసుకుని, స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నాయి. శ్రీకాళహస్తి మండలం ఆదవరం అటవీ బీటులో కూంబింగ్ చేపట్టిన ఆర్ఐ సాయిగిరిధర్, ఆర్ఎస్సై టి.విష్ణువర్ధన్‌కు చెందిన బలగాలు 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లు తమిళనాడులోని కల్లకుర్చి జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. అలాగే శ్రీకాళహస్తి మండలం తీర్థాలపాలకోన వద్ద ఏఆర్ ఎస్సై కె.మహేశ్వరనాయుడు, అతని బృందాలతో ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్లపై దాడులు నిర్వహించారు. ఒక స్మగ్లర్‌ను పట్టుకుని 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇతనూ తమిళనాడులోని కల్లకుర్చి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. .

### తిరుమల ఘాట్‌లో కారు బోల్తా

**తిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల రెండో ఘాట్ రోడ్డులో ఆదివారం కారు ప్రమాదానికి గురైంది. తమిళనాడుకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు ఘాట్ రోడ్డు మీదుగా వెళ్తుండగా వాహనం మలుపు వద్ద అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని భక్తులను తితిదే అశ్విని ఆసుపత్రికి తరలించారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

### మంటల్లో రూ.2 లక్షల నగదు బూడిద

విస్తరించిన మంటలు

**నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:** నాయుడుపేట లోతువానిగుంట కాలనీ వాసి యానాది సుబ్బమ్మకు చెందిన పూరింట్లో ఆదివారం గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటల్లో సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. గిరిజన మహిళ బేల్దారీ పనికి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఆమె కుమార్తె, అల్లుడు గుడికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలేర్పడి విస్తరించాయి. ఇంటిపైన పూరికప్పు, ప్లాస్టిక్ పట్ట కప్పడంతో మంటలు వ్యాపించి సిలిండరు పేలింది. ఈ ఘటనలో పక్కా ఇంటికి పునాది వేసేందుకు సుబ్బమ్మ దాచుకున్న రూ.2లక్షలు నగదు మంటల్లో బూడిదగా మారింది. ఆరేడు సవర్ల బంగారు నగలు, వస్తువులు కాలిపోయాయి.

**అగ్నిమాపక సిబ్బందికి తప్పిన ముప్పు:** అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి స్థానికులు నీటితో మంటల్ని అదుపు చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు బయటకు తెచ్చారా అని సిబ్బంది స్థానికులను అడగడంతో వారు రెండు సిలిండర్లు తెచ్చామని చూపారు. ఈ క్రమంలో సిబ్బంది ఇంట్లోకి వెళ్లేందుకు పూనుకున్నారు. ఇంతలో నీటి పైపు సరిచేసేందుకు బయటకు వస్తుండగా ఇంట్లోని మరో సిలిండర్ పేలి భారీ శబ్దంతో మంటలు పైకి ఎగశాయి. అగ్నిమాపక సిబ్బంది లోపలికి వెళ్లి ఉంటే పెనుప్రమాదం జరిగేది.

## ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

మాట్లాడుతున్న మోహన్‌దాస్

**గూడూరు పట్టణం:** తిరుపతి జిల్లా ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర కౌన్సిలర్ మోహన్‌దాస్ తెలిపారు. గూడూరు పట్టణంలో ఆదివారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వెంకటముని, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, నారాయణ, భువనేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణ, కార్యదర్శులుగా రామసుబ్బయ్య, గోపాల్, సాయి, ప్రసూన్న, ఉస్మాన్‌బాషా, రాష్ట్ర కౌన్సిలర్లుగా మోహన్‌దాస్, బాలసుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు.

## కొండవల్లిపాడులో పురాతన విగ్రహాలు

విగ్రహాలను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

**ఓజిలి, న్యూస్‌టుడే:** మండలంలోని కొండవల్లిపాడు సమీపంలో పొలాన్ని ట్రాక్టరుతో చదును చేస్తుండగా శ్రీదేవి, భూదేవి, మహావిష్ణు రాతి విగ్రహాలు బయటపడ్డాయి. రైతు విషయాన్ని గ్రామస్థులకు తెలియజేయడంతో విగ్రహాలను చెట్టు వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రాంతంలో శివాలయం, కోనేరు ఉన్నాయి. పూర్వం ఇక్కడున్న ఆలయం కాలగర్భంలో కలిసిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు.

## ఈత సరదాకు ఇద్దరు బలి

శివ నరేష్(పాత చిత్రం)

**రేణిగుంట :** ఈత సరదా ఆ కుటుంబాల్లో చీకటిని నింపింది. మల్లెమడుగు రిజర్వాయర్లో ఈతకు దిగిన ఇద్దరు మృతి చెందారు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో తిరుపతి తాతయ్యగుంటకు చెందిన శేఖర్, శివ(35) నరేష్(36) ముగ్గురు మల్లెమడుగు రిజర్వాయర్‌కు చేరుకున్నారు. వీరిలో మొదట శివ ఈతకు నీటిలో దిగి లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. గమనించిన అతని బావ నరేష్.. శివను రక్షించేందుకు రిజర్వాయర్‌లోకి దూకాడు. అయితే అతని వల్ల కాక అదే ప్రదేశంలో మునిగిపోయాడు. శేఖర్ గ్రామస్థులకు, పోలీసులకు తెలియజేయడంతో పట్టణ పోలీసులు గ్రామస్థుల సాయంతో ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు.

---

# సుత్తితో కొట్టి.. ఇంట్లో పూడ్చిపెట్టి

## డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు కడతేర్చిన అన్న

**కుప్పం పట్టణం:** వరుసకు తమ్ముడి వద్ద అవసరానికి డబ్బులు తీసుకొని, తిరిగి అడిగినందుకు కడతేర్చిన ఘటన కుప్పం పురపాలిక పరిధిలోని జగనన్న కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇంట్లో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు కుప్పం ఎన్టీఆర్ కాలనీకి చెందిన శ్రీనాథ్(37) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 27 నుంచి కనిపించడం లేదంటూ అతని భార్య నీలా బెంగళూరు అతిబెలే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడిగా శ్రీనాథ్ పెద్దనాన్న కుమారుడైన రామకుప్పం మండలం ముద్దనపల్లికి చెందిన ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు చిత్తూరుకు చెందిన జగదీష్‌ను విచారించారు. కుప్పం పురపాలిక పరిధిలోని డీకే పల్లెలోని జగనన్న కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్దకు చేరుకొని, తవ్విచూడగా మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం రెవెన్యూ అధికారుల సమక్షంలో కాలనీ ఇంటిలో తవ్వి మృతదేహాన్ని వెలికితీశారు. నిందితులైన ప్రభాకర్, జగదీష్‌లను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

శ్రీనాథ్ (పాత చిత్రం)

**పథకం ప్రకారమే..** శ్రీనాథ్ నుంచి ప్రభాకర్ రూ.40 లక్షల వరకు డబ్బులు తీసుకొని, ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని నమ్మబలికాడు. అనారోగ్యంతో ఉన్న తన కుమార్తె హైరా(3)కు వైద్యం చేయించేందుకు డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ ప్రభాకర్‌పై శ్రీనాథ్ ఒత్తిడి తెచ్చారు. డబ్బులు రావాల్సి ఉందని కుప్పానికి వస్తే ఇస్తానంటూ గత నెలలో శ్రీనాథ్‌ను పిలిచారు. కుప్పం జగనన్న కాలనీలో ప్రభాకర్ కొనుగోలు చేసి, నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్దకు తీసుకొచ్చారు. డబ్బులు తిరిగి రాకపోవడంతో గత నెల 16, 18వ తేదీల్లో శ్రీనాథ్ కుప్పం వచ్చాడు. ఆ సమయంలో వెంట మొబైల్ తీసుకురావద్దంటూ ప్రభాకర్ చెప్పడంతో రెండు సార్లు అతను చెప్పినట్లే చేశాడు. 27న ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వచ్చిన శ్రీనాథ్‌కు మిఠాయిలో మత్తు మందు ఇచ్చి, జగనన్న కాలనీ ఇంటిలో స్పృహ కోల్పోయినప్పుడు తలపై సుత్తితో మోది హతమార్చారు. ముందుగా ఇంటిలో తీసిన గుంతలో పూడ్చి పెట్టారు.

**పట్టించిన లొకేషన్..** గత నెల కుప్పం వచ్చిన శ్రీనాథ్ భార్య నీలాకు ఫోన్‌లో తన లొకేషన్ మొదటిసారి పంపాడు. డబ్బుల కోసం వెళ్తున్నాడన్న విషయం తెలిసిన ఆమె పోలీసులకు చెప్పడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా విచారణ సులభమైంది.

### గతంలోనూ ఓ మహిళ హత్య కేసులో..

2013 ప్రాంతంలో నూలుకుంట వద్ద ఓ మహిళను హతమార్చిన కేసులో ప్రభాకర్ ఏ2 ఉండి, మూడేళ్ల కిందట విడుదలయ్యాడు. హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న జగదీష్‌తో ప్రభాకర్‌కు పరిచయమైంది. జగదీష్ సాయంతో శ్రీనాథ్‌ను హతమార్చి, రక్తపు మరకలు కనిపించకుండా సిమెంటు చల్లారు. మృతి చెందిన శ్రీనాథ్‌ను ఇంటిలోనే పాతిపెట్టారు.


EENADU Classifieds

MARRIAGE SERVICES

**ప్రముఖ వివాహ** సంస్థ నందు బలిజ/ కమ్మ/ రెడ్డి/ BC సామాజిక వర్గానికి చెందిన వధూవరులకు పెళ్లి సంబంధాలు చూడబడును. ✆ 98666 98833.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

**తిరుపతికి 12km** దూరం నార్త్, ఈస్ట్ కార్నర్ TUDA ఫైనల్ అప్రూవల్ ప్లాట్స్ అం|| తక్కువ ధరకే అమ్మబడును. ✆ 77991 81448, 94943 92069.

LEASE/ RENT

GENERAL

2.75 ACRES Comm Land Suitable for School or College or Warehouse, off NH205, 15 Mits from Tirupati. ✆ 94452 53860.

JOBS

**తిరుపతిలోని ప్రముఖ** కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**గాయత్రి హాస్పిటల్‌లోని** ఇంట్లో పనిచేయుటకు పనిమనిషి కావలెను. D.No.484&485, వి.వి.మహల్ రోడ్డు, లలిత జ్యూవెలరీ ప్రక్కన, తిరుపతి. 0877-2253714, 2228082,78422 89558.

**శ్రీచరిత్ హాస్పిటల్స్‌లో** పని చేయుటకు రిసెప్షనిస్ట్ (Male) కావలెను. రెడ్డి&రెడ్డి కాలనీ, ఆశాలత హాస్పిటల్ ఎదురుస్ట్రీట్, ICICI బ్యాంక్‌లైన్, తిరుపతి. ✆0877-2222177, 80083 75568.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600

Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును


(c) eenadu

# తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

## భక్తులకు స్నేహపూర్వకంగా సేవలు అందించాలి

వీజీవో గిరిధర్

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీపద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు తితిదే విజిలెన్స్ సిబ్బంది స్నేహపూర్వకంగా సేవలు అందించాలని వీజీవోలు గిరిధర్, సురేంద్ర అన్నారు. ఆదివారం అమ్మవారి ఆస్థాన మండపంలో బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహించే విజిలెన్స్ సిబ్బందితో వీజీవోలు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ వాహనసేవల సమయంలో, క్యూలైన్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది సహనంతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఏవీఎస్వో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల, తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీవారిని ఆదివారం ఉదయం బ్రేక్‌లో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. * శ్రీపద్మావతీ అమ్మవారిని కూడా వీసీ సజ్జనార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

## పొరుగుసేవల ప్రాతిపదికన ఉద్యోగావకాశాలు

**తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే:** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని చిల్డ్రన్ హోమ్స్‌లో పొరుగుసేవల ప్రతిపదికన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును 24వ తేదీ సాయంత్రం లోపు పోస్టు ద్వారా గానీ, అభ్యర్థి నేరుగా గానీ కలెక్టరేట్‌లోని శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు.

## అమ్మవారికి నాలుగు గొడుగుల కానుక

ఆలయం వద్ద గొడుగులతో హిందూ మహాసభ ట్రస్టు ప్రతినిధులు

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం చెన్నైకు చెందిన హిందూ మహాసభ ట్రస్టు ప్రతినిధులు నాలుగు గొడుగులను కానుకగా అందజేశారు. అమ్మవారి ఆలయం వద్ద గొడుగులను అర్జితం ఇన్‌స్పెక్టర్ చలపతి, వాహనం ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌నాయుడుకు అందజేశారు. ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాల సమయంలో గొడుగులు ఇవ్వడాన్ని సంప్రదాయంగా పెట్టుకున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

# గోఉత్పత్తులతో ఆరోగ్యం

ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ రేణు దీక్షిత్ • ముగిసిన 13వ పంచగవ్య జాతీయ వైద్య సమ్మేళనం

మాట్లాడుతున్న రేణు దీక్షిత్, విజయ భాస్కర్

**ఈనాడు డిజిటల్, తిరుపతి:** గోవులతో వచ్చే ప్రతి ఉత్పత్తుల(పాలు, పెరుగు, మూత్రం..)ను సద్వినియోగం చేసుకోవడం వల్ల మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ రేణు దీక్షిత్ తెలిపారు. ఇందుకోసం గోవులను రక్షించాలని, ఇది దేశ సుస్థిరాభివృద్ధికి పాటు పడుతుందని ఆమె పేర్కొన్నారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో మూడు రోజులుగా జరుగుతున్న 13వ పంచగవ్య జాతీయ వైద్య సమ్మేళనం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోవులను రక్షించడమెలా అనే అంశంపై ఆమె సుదీర్ఘంగా చర్చించారు. గోఉత్పత్తులపై వివిధ రకాల పరిశోధనలు జరిపిన విద్యార్థులు.. వాటిని కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయుర్వేద కళాశాల సర్జన్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లితో పోల్చే పవిత్రమైందని గోమాతేనని పేర్కొన్నారు. గోవులను రక్షించుకుంటే.. ప్రకృతి, సంప్రదాయాన్ని రక్షించుకున్నట్లేనని ఆయన తెలిపారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మూడు రోజుల సమ్మేళనం ఆద్యంతం కోలాహలంగా ముగిసింది. రోజులో నాలుగు సెషన్ల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బ్రహ్మ ముహూర్తంలో(4.15) ప్రారంభించి.. గోసేవలో ధర్మ, అర్థ, కామ, మోక్షం ఉన్నట్లు రెండు గంటల పాటు పంచగవ్య విద్యాపీఠం వ్యవస్థాపకులు నిరంజన్ వర్మ ఆధ్వర్యంలో సవివరంగా చర్చించారు. ఉదయం 9 గంటలకు రెండో సెషన్ ప్రారంభమై.. 11.00 గంటల వరకు అతిథి ఉపన్యాసాలిచ్చారు. మూడోది మధ్యాహ్నం ఒంటి గంట నుంచి విద్యార్థులకు పరిశోధన పత్రాలు అందజేయడం, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, మేధావులతో సాయంత్రం 6 గంటల వరకు చర్చించారు. నాలుగో సెషన్‌లో వివిధ కళా బృందాలు పలు రకాల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారుల ఆటపాటలు ప్రజలను అలరించాయి.

దేవిశ్రీప్రసాద్‌ను అభినందిస్తున్న రవి నాయుడు, డీఎస్‌డీవో శశిధర్

## క్రీడాకారులకు అభినందన

**తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే:** జాతీయ స్థాయి షూటింగ్, రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన తిరుపతికి చెందిన క్రీడాకారులను శాప్ ఛైర్మన్ రవి నాయుడు అభినందించారు. స్థానిక శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం శాప్ ఛైర్మన్‌ను క్రీడాకారులు హితేష్ (షూటింగ్), జాతీయ స్కేటర్ దేవిశ్రీప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేసి, జాతీయ స్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభకనబరచాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న సాధన సమితి సభ్యులు

తిరుపతి కేంద్రంగా

## అదనపు రైల్వే డివిజన్ అవసరం

**తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే:** తిరుపతి కేంద్రంగా అదనపు బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు అవసరం ఉందని బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ పేర్కొన్నారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో తిరుపతిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం భవిష్యత్తు కార్యాచరణపై మేధావులు, వివిధ వర్గాల వారితో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కుప్పాల గిరిధర్ కుమార్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం పోరాటం చేస్తున్నామని, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులకు ఎన్ని విజ్ఞాపనలు ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నూతనంగా అమల్లోకి రానున్న దక్షిణ కోస్తా రైల్వేలో అదనంగా తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. సాధన సమితి సభ్యులు భూమన్, వేణుగోపాల్ రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, భూపాల్ నాయుడు, బుజ్జిబాబు నాయుడు, వైఎస్ బాబు, పుష్పరాజ్, చరణ్ కుమార్, మాధవీలత, నీలేష్ కమార్, అనిల్, అజయ్ ప్రసన్న, కృష్ణయ్య, దామోదర్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కార్తిక వనభోజనం



అలంకరణలో దేవేరులతో శ్రీవారు

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామి దేవాలయంలో ఆదివారం కార్తిక వనభోజన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవర్లను బంగారు తిరుచ్చిపై గ్రామోత్సవంగా శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపంలో కొలువుదీర్చారు. సంకల్ప పూజలు, స్నపన తిరుమంజనం సేవలను నిర్వహించారు. ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి స్వామివారి సర్కారు హారతి పూజలు అందుకున్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు, భక్తులు వన భోజనం చేశారు.

**నామాల కాలువలో.. రామచంద్రాపురం, న్యూస్‌టుడే:** కొత్త నెన్నూరు సమీపంలో గల నామాల కాలువ గట్టుపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ప్రాంగణంలో తిరుపతికి చెందిన హరే రామ హరే కృష్ణ భక్తులు ఘనంగా వన భోజన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భజనలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

**తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే:** తిరుపతిలోని దివ్యారామంలో ఆదివారం అఖిలభారత తోట వారి ఐక్యవేదిక ఆధ్వర్యంలో తోట కుటుంబాల కార్తిక వన భోజన మహోత్సవం జరిగింది.

రామచంద్రాపురం: భజన చేస్తున్న భక్తులు

# మంచినీటి చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు

కోనేటి చెరువులో కోళ్ల వ్యర్థాల గోనె సంచులు

**పాకాల, న్యూస్‌టుడే:** మండలంలోని దామలచెరువు పరిసరాల్లో వ్యర్థాల కారణంగా మంచినీటి చెరువులు కలుషితమవుతున్నాయి. మ్యాంగోనగర్ వద్ద లింగన చెరువులోకి కోళ్లు, ఇతర వ్యర్థాలను తీసుకొచ్చి వదిలివెళ్తుండటంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులో నీరు కలుషితమవడమే గాక అందులోనే ఉన్న గ్రామ పంచాయతీ బోరు నీరు సైతం దుర్గంధభరితమై అదే నీరు ఇళ్లకు సరఫరా జరుగుతోంది. దామలచెరువు బజారు వద్ద రోడ్లకిరువైపులా చికెన్ సెంటర్లు, మాంసం దుకాణాల యజమానులు వ్యర్థాలను పెద్దవంక వంతెన వద్దకు వచ్చి పారబోస్తున్నారు. హైస్కూల్ గేటు పరిసరాల్లోని చికెన్ సెంటర్లు, హోటళ్లు, మాంసం దుకాణాల యజమానులు వ్యర్థాలను పాత గోనె సంచుల్లో తీసుకొచ్చి మంచినీటితో కళకళలాడే కోనేటి చెరువులోకి విసిరి వెళుతున్నారు. నీరు కలుషితమవుతున్న కారణంగా హైస్కూల్ గేటు, పోలిచెట్టిపల్లి, కేశవనగర్, కొత్తపల్లి గ్రామాల ప్రజలు దుర్గంధాన్ని భరించడంతో పాటు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## తొలగని వ్యర్థాలు.. తప్పని దుర్వాసన

కొత్తపేట భారతీనగర్‌లో రోడ్డు పక్కన చెత్త నిల్వలు పేరుకున్నాయి. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రీపగలు తేడా లేకుండా దోమలు ప్రజలపై దండెత్తుతున్నాయి. చెత్తాచెదారం తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. చంద్రగిరి పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. చెత్తకుప్పలు తొలగిస్తామన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, చంద్రగిరి**

## పంటలపై గజరాజుల దాడులు

ఏనుగులు ధ్వంసం చేసిన టమాటా పంట వద్ద రైతు

**చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే:** మండలంలో ఏనుగులు మళ్లీ పంటలపై దాడులు ప్రారంభించాయి. కొన్ని రోజులుగా పాకాల, చంద్రగిరి మండలాల్లో పంటలపై దాడులు చేస్తున్న ఏనుగులు శనివారం రాత్రి మండలంలోని పూజారివాండ్లపల్లి, ఈదల చెరువుపల్లి, పాలమాకులపల్లి గ్రామాల్లో పంటలను ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో ఎగవూరు గ్రామం, ఉలసలవాండ్లపల్లికి చెందిన తారకేశవ, జయరామయ్య రాతి కూసాలను కూల్చేశాయి. ఈదలచెరువుపల్లికి చెందిన జయముని టమాటా తోటను ధ్వంసం చేశాయి. ఆదివారం రాత్రి భాకరాపేట, గాండ్లపల్లిలో గల పొలాల వైపు వచ్చే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

## బహుజనులకు అధికారం సాధించడమే లక్ష్యం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** పల్లెపల్లెకు బహుజన సమాజ్ పార్టీ కార్యక్రమం కరపత్రాలను ఆదివారం చంద్రగిరి బస్టాండు కూడలిలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ బహుజనులకు అధికారం సాధించడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో బీఎస్పీ బలోపేతం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు పుణ్యమూర్తి, బీఎస్పీ నాయకులు బాబు, రవి, నాగరాజు, జయదేవ్, మార్కొండేయులు, రెడ్డిలోకేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చినబాబుకు చిత్రపటం అందజేస్తున్న ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు

## చినబాబుకు ఘన సత్కారం

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన మురళీమోహన్(చినబాబు)ను ఆదివారం నగరానికి చెందిన తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు. నగర ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, పాతకం వెంకటేశ్, జగ్గా, ధనంజయ్, సుబ్బుయాదవ్, దేవాచారి, హేమంత్, ముని ఆయన్ని సత్కరించిన వారిలో ఉన్నారు.

## రోగులకు సేవ.. ఓ వరం

మాట్లాడుతున్న ఎస్ఐ సరస్వతి

**తిరుపతి (గ్రామీణం):** రోగులకు సేవ చేయడం ఒక వరమని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై సరస్వతి పేర్కొన్నారు. రాస్ కార్యాలయంలో స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న (రాస్ జన్ శిక్షణ సంస్థాన్) పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిత్వ వికాసంపై ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళా వర్కర్లు శక్తియాప్ ఉపయోగాలు తెలుసుకోవాలన్నారు. రాస్ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ స్విమ్స్‌లో రాస్ ద్వారా సేవలు అందించడం ఒక అవకాశంగా తీసుకున్నామని తెలిపారు. ఏఎస్సై గిరిజ, జేఎస్ఎస్ అధికారి హరి, రాస్ అధికారి రవి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోటి సంతకాల ప్రజాభిప్రాయ సేకరణ

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** తిరుచానూరు పంచాయతీ పరిధిలోని చైతన్యపురంలో ఆదివారం చంద్రగిరి వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నరేష్‌రెడ్డి నాయకులు చింతలహరి, మహేష్, సునీల్, మోహన్, చంద్రశేఖర్‌ఆజాద్, కృష్ణ, దుర్వాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ ప్రదానం

రాజమ్మ

**తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే:** శ్రీపద్మావతి మహిళా వర్సిటీ విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని ఎం.రాజమ్మకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య మాధవి మార్గదర్శకత్వంలో 'అకడమిక్ అచీవ్‌మెంట్ ఇన్ రిలేషన్ టు మెంటల్ హెల్త్ అకాడమీ స్ట్రెస్ అండ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ అమాంగ్ హై స్కూల్ స్టూడెంట్స్' అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించిందని డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు.

# చంద్రగిరిలో గంజాయి పడగ

భవితను అంధకారం చేసుకుంటున్న యువత

గంజాయి లిక్విడ్ బాటిల్

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** మండలంలో యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గత వైకాపా పాలనలో నిత్యావసర సరుకుగా గంజాయి విచ్చలవిడిగా యువతకు చేరువైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిని పూర్తిస్థాయిలో నివారించేందుకు ప్రయత్నాలు చేస్తున్నా చాపకింద నీరులా గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది.

**ఇవే స్థావరాలు..** మండలంలోని ఎగువరెడ్డివారిపల్లిలోని స్వర్ణముఖి నది ఒడ్డున, గంటా మండపం ప్రాంతాలను గంజాయి స్థావరాలుగా చేసుకున్న యువత గంజాయి లిక్విడ్‌ను వినియోగిస్తూ మత్తులోకి జారుకుంటున్నారు. ప్రధానంగా కొందరు విద్యార్థులు, రోజువారి కూలీలు, యువత బానిసలుగా మారుతుండటంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పొలాల వైపు వెళ్లాలంటే భయమేస్తోంది..** పొలానికి వెళ్లాలంటే భయంగా ఉంది ఊరికి దూరంగా ఉన్న పొలం వద్దకు చేరుకోవాలంటే స్వర్ణముఖి నది ఒడ్డుపై వెళ్లాలి. ఇదే మార్గంలో నది ఒడ్డున కర్మక్రియలు నిర్వహించే షెడ్డులో యువకులు గంజాయి సేవిస్తూ అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారు. మత్తులో వారేం చేస్తారో తెలియని పరిస్థితి. దీంతో ఒంటరిగా పొలం వైపు వెళ్లాలంటే భయమేస్తోంది. వారిని హెచ్చరించినా ఫలితం లేదు.

**- ఓ మహిళా రైతు, ఎగువరెడ్డివారిపల్లి**

**కఠిన చర్యలు తీసుకుంటాం..** మండలంలో మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచి నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి సేవించడంతో జరిగే అనర్థాలపై గ్రామీణ ప్రాంతాలు, కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

**-సురేష్‌కుమార్, సీఐ**

# ప్రముఖులొస్తేనే వెలుగులు.. తర్వాత చీకట్లు

**తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే:** తిరుపతి-కరకంబాడి రోడ్డు ఎయిర్ పోర్టు, రేణిగుంట వైపు నుంచి తిరుమలకు చేరుకోవడానికి వచ్చే యాత్రికులకు ప్రవేశమార్గం. తిరుపతికి చేరుకునే మూడు ప్రధాన మార్గాల్లో ఒకటి. భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం ఈ మార్గంలో తితిదే సెంటర్ లైటింగ్ వ్యవస్థను ఏడాదిన్నర క్రితం ఏర్పాటు చేసింది. పట్టుమని పది రోజులు కూడా వీధి దీపాలు వెలగలేదు. సీఎం పర్యటన కారణంగా ఏడాదిలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే అలా వెలిగించి, తర్వాత ఆర్పేశారు.

ఇదీ మంగళం-కరకంబాడి మధ్య వీధి దీపాల పరిస్థితి

### ఎటూ తేల్చని తితిదే

ఎస్పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన బకాయిలను తితిదే చెల్లించకున్నా ఆ శాఖ విద్యుత్తు సరఫరాకు అభ్యంతరాలు చెప్పలేదు. కానీ తితిదేనే వీధి దీపాలను ఆర్పేసింది. బిల్లుల అప్రూవల్ నిర్ణయాన్ని పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

### విషయం ఏంటంటే

తిరుపతి-కరకంబాడి మార్గాన్ని విద్యుదీకరణ చేయడంలో భాగంగా భూపాల్ హౌసింగ్ కాలనీ నుంచి మంగళం మీదుగా కరకంబాడి వరకు 6 కిలోమీటర్ల దూరానికి 2023లో తితిదే విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించింది. స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల అమరిక పనులను పూర్తి చేసి, 2024 ఆగస్టులో పనులు పూర్తి చేశారు. విద్యుత్తు సరఫరా బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా 2025 వరకు వీధి దీపాలను వెలిగించకుండా వదిలేశారు. విద్యుత్తు సరఫరా కోసం ఏపీఎస్పీడీసీఎల్ పది సర్వీసులు(మీటర్లు) మంజూరు చేసింది. తితిదే సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.60,800, సర్వీస్ లైన్ ఛార్జీలకు రూ.11,70,658 లక్షలు, డెవలప్‌మెంట్ ఛార్జీలకు రూ.82 వేలు మొత్తంగా రూ.13,13,458 లక్షలు చెల్లించాల్సి ఉన్నా ఎటూ తేల్చకుండా ఉండిపోయింది. ● బకాయిల చెల్లింపుపై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఏప్రిల్‌లో తితిదేకు వివరణాత్మకంగా లేఖ రాసినా స్పందన కరవైంది. మంగళంలో జాతీయ స్థాయిలో టెంపుల్ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం, దేశ నలుమూలల నుంచి వీఐపీలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని కార్యక్రమం జరిగే నాలుగు రోజులపాటు వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. సెప్టెంబరులో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సీఎం రాక సందర్భంగా వీధి దీపాలను వెలిగించారు. తర్వాత ఆపేశారు.

## కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

**చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే:** చిన్నరామాపురం పంచాయతీ పరిధిలోని భీమవరం గ్రామంలో తెదేపా మహిళా కార్యకర్త మధుబాల మృతి చెందింది. ఎమ్మెల్యే పులివర్తి నాని, స్థానిక నాయకులు భీమవరంలోని ఆమె స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెదేపా మండల అధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, కూరపాటి సుధాకర్ చౌదరి, గుర్రప్పనాయుడు, ఎ.మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

## మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**తిరుపతి(భవానీనగర్):** విదేశాల్లో ఎంబీబీఎస్ చదివిస్తామని చెప్పి మోసం చేసి తమ పిల్లల భవిషత్తు నాశనం చేసిన హైదరాబాదులో ఈడీ ప్లస్ కన్సల్టెన్సీని నడుపుతున్న మారెడ్డి వెంకటరెడ్డిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు మదనపల్లికి చెందిన లక్ష్మీ తాయారమ్మ, కర్నూలుకు చెందిన సాయి కౌశిక్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు.

## 8వ వేతన సంఘం ప్రయోజనాలు అందించాలి

**రేణిగుంట, న్యూస్‌టుడే:** పింఛనుదారులకు 8వ వేతన సంఘం ప్రయోజనాలు అన్నింటినీ కల్పించాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం రేణిగుంట చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది.

(c) eenadu

# శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

## గ్రామస్థాయి నుంచి పార్టీ పురోభివృద్ధి

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** జనసేన పార్టీని అట్టడుగు గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రైవేటు అతిథి గృహంలో ఆదివారం విలేకరులతో పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చంద్ర, జయప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

## 30 అడుగులకు చేరిన నీటిమట్టం

**పిచ్చాటూరు :** అరణియార్ జలాశయ నీటిమట్టం ఆదివారం 30 అడుగులకు చేరినట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు. జలాశయంలో 31 అడుగుల నీటి మట్టంతో 1.853 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం 1.711 టీఎంసీల నీరు జలాశయంలో ఉండగా.. 50 క్యూసెక్కుల మేర నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో ప్రాజెక్టును పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.

దర్శనానంతరం సుప్రీంకోర్టు తదుపరి సీజే సూర్యకాంత్‌తో స్థానిక న్యాయమూర్తులు, ఆలయ అధికారులు

## ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు తదుపరి సీజే

**శ్రీకాళహస్తి:** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్(డిసిగ్నేట్) దంపతులు వాయులింగేశ్వరుడిని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి ఆదివారం స్థానిక న్యాయమూర్తులు, ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసనాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, ఆలయ డిప్యూటీ ఈవో ఎన్. ఆర్. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా గ్రామీణ రహదారి

మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ తొట్టిబావి నుంచి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో రైతులు తమ పంట దిగుబడులను రవాణా చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

**- న్యూస్‌టుడే, నారాయణవనం**

## దారుణంగా చెత్తకుండి

రేణిగుంట పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పంచాయతీలోని పాంచాలీనగర్ 11వ వీధి చివరిలో సుమారు ఆరు రోజులుగా వ్యర్థాలు పేరుకు పోయాయి. దీంతో దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

## మరమ్మతులైనా చేయరా?

నాగలాపురం పడమటి ఎస్సీకాలనీ సమీపంలోని ఎర్రచెరువు వద్ద రహదారి అధ్వానంగా మారింది. బీటీరోడ్డు కాస్తా కంకరరాళ్లు, గుంతలతో వాహన చోదకులకు ప్రమాదకరంగా తయారైంది. నూతన రహదారి నిర్మాణంపట్ల తీవ్ర జాప్యం నెలకొన్న నేపథ్యంలో కనీసం రహదారికి మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, నాగలాపురం**

## తీరం.. దేదీప్యం

సువర్ణముఖి నదీ హారతులు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నారు. ఈ విశేషతను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సువర్ణముఖి తీరం వెంబడి ప్రత్యేకంగా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. వంతెనలకు దీపాలను అమర్చే పనుల్లో సాంకేతిక వర్గం తలమునకలైంది. విద్యుద్దీప వెలుగులతో తీరం ఇలా శోభాయమానంగా దర్శనమిస్తోంది.

**- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

## మంత్రి నారా లోకేశ్ పేరుతో పూజలు

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** సీఐఐ సదస్సు విజయవంతం కావడంతో మంత్రి నారా లోకేశ్ పేరుతో తెదేపా రాష్ట్ర అధికారప్రతినిధి గురువారెడ్డి ఆదివారం గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతలతో కలిసి ఆలయానికి చేరుకుని అర్చనలు, పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే అంతర్జాతీయ సంస్థలను ఆకట్టుకుంటూ రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేలా చర్యలు చేపట్టడం ఆనందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రామచంద్రారెడ్డి, నేతలు పీఏసీఎస్ అధ్యక్షులు మహేష్‌రెడ్డి, సదాశంకర్‌నాయుడు, సోమశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ఐఅండ్‌పీఆర్ కమిషనర్

**శ్రీకాళహస్తి:** రాష్ట్ర సమాచార పౌర సంబంధాల కమిషనర్ కృష్ణతేజ వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆదివారం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయం తరఫున స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు.

● తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ కుటుంబ సభ్యులతో కలసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆదివారం ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.

✧ పట్టణ జనాభా: 91,247 ✧ నివాస గృహాల సంఖ్య: 23,619 ✧ రక్షిత మంచినీటి పథకాలు: 09 ✧ కుళాయి కనెక్షన్లు: 7329

✧ చేతిపంపుల సంఖ్య: 327 ✧ పవర్‌బోర్లు : 34 ✧ రోజువారీ తాగునీటి అవసరం: 9.5 ఎంఎల్‌డీ ✧ రోజువారీ తాగునీటి పంపిణీ: 7.8 ఎంఎల్‌డీ

## సామర్థ్యం పెంపు సాధ్యమేనా..!

### కాగితాల్లోనే.. జలాశయం అభివృద్ధి

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పురపాలక సంఘానికి అవసరమైన తాగునీటి నిల్వలు శ్రీసత్యసాయి తెలుగుగంగ ద్వారా సమకూరుతున్నాయి. కాల్వగుండా నీటి ప్రవాహానికి అనుసంధాన ఏర్పాట్లు చేసి, నీటిని వేసవి జలాశయంలోకి మళ్లింపు చేసి నిల్వ చేస్తున్నారు. మోటార్ల సాయంతో నీటిని పట్టణ పరిధిలోని రక్షిత మంచినీటి పథకాలకు పంపింగ్ చేసి తద్వారా కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.

వేసవి జలాయంలో తాగునీరు

### వర్షాభావ పరిస్థితుల్లో ఉపయోగం

వేసవి జలాశయం సామర్థ్యం 67 ఎంసీఎఫ్‌టీలు మాత్రమే. ఒక్కసారి నిండుగా నీటి నిల్వలు సమకూరితే నాలుగు నెలల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఉండవు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. కండలేరు జలాశయం నుంచి చెన్నైకు తాగునీరు సరఫరా చేసే సమయంలో ఇక్కడి వేసవి జలాశయాన్ని నింపుకోవడం, అవసరమైన మేర తాగునీటిని పంపిణీ చేస్తూ రావడంతో వీలైనంత వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తడం లేదు. సామర్థ్యం పెంపునకు సంబంధించి తెదేపా హయాంలో అప్పటి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక అమల్లోకి తీసుకువస్తామని చెప్పి ఏళ్లు గడిపేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సమస్య పరిష్కార రూపం దాల్చుతుందని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

### వృథాతోనే వ్యథ

నీటిని నిల్వ చేసుకోవడం ఎంత కష్టమో.. అంతకు మించి వృథా నియంత్రణ విషయంలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి సరఫరా సమయంలో పలు చోట్ల లీకేజీలు అవుతూనే ఉన్నాయి. దీంతో పాటుగా కుళాయిలకు మూతలు లేక పోవడంతో తాగునీరంతా వృథా అవుతోంది. తాగునీటి వృథాను నియంత్రించడంతో పాటు నీటి నిల్వలను పొదుపుగా వాడుకోగల్గితే మరిన్ని రోజులు వేసవి జలాశయంలోని నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** సమస్య: ఏర్పేడు మండలంలోని పల్లంపేటలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన విచ్చలవిడిగా ఆటోలు నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. **- మాధవరావు**

సమాధానం: ప్రధాన రహదారి పక్కన వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

**- శ్రీకాంత్‌రెడ్డి, సీఐ, ఏర్పేడు**

**నాగలాపురం, న్యూస్‌టుడే:** సమస్య: నాగలాపురం భద్రావతీ వీధిలో రహదారిపైనే చెత్తా చెదారాలు ఉన్నాయి. చెత్తకుండీలు లేక పోవడంతో కాలువ పక్కన సిమెంటు రహదారిపైనే స్థానికులు వ్యర్థాలను పడవేస్తుండటంతో దుర్గంధభరితంగా మారింది. **- ఉమాశంకర్**

సమాధానం: రెండు రోజుల్లో సిబ్బందితో వ్యర్థాలను తొలగిస్తాం. **- చిన్నదురైసుధ, సర్పంచి**

**వరదయ్యపాళెం, న్యూస్‌టుడే:** సమస్య: గూడలవారిపాళెంలో ట్రాన్స్‌ఫార్మరు అధికలోడు కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోతుంది. విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. **- జగదీష్‌రెడ్డి**

**సమాధానం:** విద్యుత్తుశాఖ ఏఈకి విన్నవించాం. అదనపు ట్రాన్స్‌ఫార్మరు త్వరలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- చంద్రారెడ్డి, సర్పంచి**

### మురుగు కాలువల్లో పూడికతీత

**నాగలాపురం, న్యూస్‌టుడే:** స్థానిక బజారు వీధిలోని మురుగునీటి కాలువలను పంచాయతీ సిబ్బంది ఆదివారం శుభ్రం చేశారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికమవడంతో నీటి ప్రవాహం ఆగిపోయి స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతుండటంపై ఈనెల 16వ తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి చిన్నదురైసుధ స్పందించారు.

స్పందనకు వందనం

### అంధకారం తొలగింది

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** ఇలగనూరు గ్రామంలో వీధి దీపాలు వెలగక అంధకారంతో స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం-మీకుతోడుగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి కొత్త వీధిదీపాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

వాసుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

**పిచ్చాటూరు :** మండలంలోని అప్పంబట్టుకు చెందిన వాసుకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి సహాయనిధిలో మంజూరైన రూ.25 వేల విలువైన చెక్కును తన నివాసంలో ఆదివారం అందించారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడే నియోజకవర్గ వాసులకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయనిధితో తోడ్పాటు నందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి ఉన్నారు.

## పట్టుబట్టి పంచాయతీ అద్దె వసూళ్లు

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** విధులకు వెళ్లామా.. నేతలు చెప్పిన పనులు చేశామా.. అనే అధికారులు కొందరు ఉండగా ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటిస్తూ ప్రజలకు సేవచేసే అధికారులు మరికొందరు ఉన్నారు. ఈ కోవకు చెందిన వ్యక్తే ఏర్పేడు పంచాయతీ కార్యదర్శి అయ్యపురెడ్డి. పంచాయతీలో దుకాణాలకు వేలం ప్రక్రియ నిర్వహించి నెలలు గడుస్తున్నా నగదు చెల్లించకుండా నేతల పేరుతో బురిడీ కొట్టిస్తున్నా వారికి చుక్కలు చూపించాడు. ఏప్రిల్ నెలలో 23 గదులకు వేలం వేయడంతో సుమారు రూ.52లక్షలుపైగా పంచాయతీకి నగదు రావాల్సి ఉంది. అయితే నెలలు తరబడి చెల్లించక పోవడంతో కర్నూలు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఈయన గుర్తించి దుకాణాదారులకు పలుమార్లు నోటీసులు జారీ చేయడంతో కొందరు చెల్లించగా తొమ్మిది మంది దుకాణాదారులు మాత్ర నేతల పేరుచెప్పి కాలాతీతం చేస్తున్నారు. దీంతో అయ్యపురెడ్డి నగదు చెల్లించని దుకాణాలకు తాళాలువేశారు. దీనిపై నేతలు, ఉన్నతాధికారుల నుంచి పెద్దఎత్తున ఒత్తిడి ఎదురైనా వెనక్కి తగ్గక పోవడంతో శనివారానికి ఏడు దుకాణాలకు సంబంధించి నగదును పంచాయతీకి చెల్లించారు. అయితే మిగిలిన రెండు దుకాణాలకు మాత్రం ఇంకా నగదు చెల్లించకుండా నేతలు నుంచి ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. నగదు చెల్లించేంత వరకు తాళాలు తెరిచే ప్రసక్తేలేదని పంచాయతీ కార్యదర్శి తేల్చిచెప్పడంతో పలువురి నుంచి మన్ననలు పొందుతున్నారు.

## 8వ వేతన సంఘం ప్రయోజనాలు అందించాలి

రైల్వే స్టేషన్ నుంచి బయటకు వస్తున్న శ్రీధర్ తదితరులు

**రేణిగుంట, న్యూస్‌టుడే:** పింఛనుదారులకు 8వ వేతన సంఘం ప్రయోజనాలు అన్నింటినీ కల్పించాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం రేణిగుంట చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాలిడేషన్ ఆఫ్ పెన్షన్ రూల్స్ 2025ను తక్షణమే రద్దు చేయాలని, 8వ కేంద్ర వేతన సంఘం 2026కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి పింఛను సవరణను తప్పనిసరిగా చేర్చాలని, 'నాన్-కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకాలకు నిధులు లేని ఖర్చు' అనే అంశాన్ని తొలగించాలని, ప్రస్తుతం ఉన్న రూ. 10 లక్షల కోట్ల పింఛన్ ఫండ్‌ను కేవలం ఈ పథకాలకే వినియోగించాలన్నారు. గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్ జయంత్ కుమార్, సీఆర్ఎస్ సెక్రెటరీ విజయ్‌కుమార్, ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు వెంకటరెడ్డి, రామ్మూర్తి, ట్రెజరర్ అన్బు పాల్గొన్నారు.

## బలిజలకు ప్రాధాన్యం కల్పించండి

**సత్యవేడు, న్యూస్‌టుడే:** నామినేటెడ్ పదవుల్లో బలిజలకు అవకాశం కల్పించాలని బలిజ సేవా సంఘం మండల అధ్యక్షుడు కానాల బాలమురళీకృష్ణ నియోజకవర్గ తెదేపా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి విన్నవించారు. ఆదివారం తిరుపతిలోని శంకర్‌రెడ్డి స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సత్యరాయల్, సురేష్‌రాయల్, గణేష్, బాలాజీ, మురళి, దినేష్ పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న ఇన్ఫోసిస్, అపిటా ప్రతినిధులు, అధ్యాపకులు

## పుత్తూరు సిద్ధార్థలో ఇన్ఫోసిస్ ఫుల్ క్యాంపస్ డ్రైవ్

**నారాయణవనం, న్యూస్‌టుడే:** పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమి(అపిటా) ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఇన్ఫోసిస్ ఫుల్ క్యాంపస్ డ్రైవ్ విజయవంతమైనట్లు కళాశాల ఛైర్మన్ డా. అశోకరాజు తెలిపారు. ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొత్తం 43 ఇంజినీరింగ్ కళాశాల నుంచి 5,899 మంది అర్హులైన విద్యార్థులు నమోదు చేసుకోగా, అందులో 5,220 మంది పరీక్షకు హాజరయ్యారని వీరిలో 782 మంది విద్యార్థులు ముఖాముఖీలో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్స్ మధు, జనార్ధన్ రాజు. ఇన్ఫోసిస్ లీడ్ అసోసియేట్ మిస్ దిషా, అపిటా జిల్లా కోఆర్డినేటర్లు డా. అనిల్‌కుమార్(నెల్లూరు), లక్ష్మీప్రసాద్(చిత్తూరు) పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాదు కుకట్‌పల్లికి చెందిన గడేపల్లి అనిల్‌కుమార్ దంపతులు ఆదివారం రూ. లక్ష నగదు చెక్కును, వెంకటగిరికి చెందిన కలగండ సుబ్రహ్మణ్యం, ఇందిర దంపతులు నిత్యాన్నదాన పథకానికి సంబంధించి రూ. 62,500ల నగదు చెక్కును డిప్యూటీ ఈవో ఎన్. ఆర్. కృష్ణారెడ్డికి అందజేశారు.

చెక్కును అందజేస్తున్న గడేపల్లి అనిల్‌కుమార్ దంపతులు

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**నెల్లూరు (నేరవిభాగం):** ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ధనలక్ష్మి(31) మృతి చెందింది. శ్రీసిటీలో పని చేస్తూ అక్కడే పని చేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్‌ని ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పుల బాధ తాళలేక ధనలక్ష్మి ఈ నెల 10వ తేదీన ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శంకర్‌రెడ్డితో కలిసిన కోనేటి చేతులు

**నారాయణవనం, న్యూస్‌టుడే:** మండలంలోని కైలాసనాథేశ్వర కోన పాలకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆదివారం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. తెదేపాలో ఆధిపత్యపోరుతో సతమతమవుతున్న కార్యకర్తలకు స్పష్టత వచ్చేలా ఎమ్మెల్యే వర్గం శంకర్‌రెడ్డితో చేతులు కలిపింది. పార్టీ క్రమ శిక్షణ కమిటీ పిచ్చాటూరుకు చెందిన ఇళంగోవన్‌రెడ్డికి శనివారం షోకాజ్ నోటీసు జారీ చేయటంతో పార్టీలో ఐక్యతారాగం వినిపించింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు నారాయణవనం జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ కైలాసకోనలో పార్టీ నియోజకవర్గ కార్యక్రమాల సమన్వయకర్త శంకర్‌రెడ్డికి పూలమాలలు వేసి ఆహ్వానించి కరచాలనం చేశారు. శంకర్‌రెడ్డికి వ్యతిరేకంగా అధిష్ఠానం వద్ద ఫిర్యాదులు చేసిన నేతలు సైతం ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం విశేషం.

శంకర్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న కోనేటి సుమన్‌కుమార్

## వసతులు నాస్తి.. పతకాలు జాస్తి

**నారాయణవనం, న్యూస్‌టుడే:** పాఠశాలలో ఆటలాడేందుకు తగిన మైదాన వసతి లేదు.. అయితేనేం. అంకిత భావం గల వ్యాయామ ఉపాధ్యాయుడి శిక్షణ.. ప్రతిభ చాటాలనే విద్యార్థుల తపన ఉంటే చాలు.. క్రీడల్లో సత్తా చాటవచ్చని నిరూపించారు మండలంలోని అరణ్యంకండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థులు. పల్లెల్లో పుట్టినా రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో సత్తా చాటి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారు.

### అదిరిందమ్మా.. 'చంద్ర'ం

మండలంలోని మిట్టనైనారుకండ్రిగకు చెందిన మనోహర్, మునెమ్మ దంపతుల కుమార్తె చంద్ర అరణ్యంకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వ్యాయామ ఉపాధ్యాయుడు శిక్షణతో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో మండల స్థాయిలో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికైంది. మదనపల్లి మండలం అంగళ్లులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా తరపున జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడల్లో సత్తా చాటి పోలీసు కావాలన్నదే తన ఆశయమని చంద్ర పేర్కొంది.

### జాతీయ స్థాయిలో రాణిస్తా

మండలంలోని అరణ్యంకండ్రిగకు చెందిన అనిల్, ఎల్లమ్మ దంపతులు గాజుల అమ్మకం ద్వారా జీవనం సాగిస్తూ కుమార్తె వసును స్థానిక ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. పదో తరగతి చదువుతున్న వసు చదువుతోపాటు ఆటల్లోనూ తపన ఉండటంతో గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు బాలికను ఆటల్లో తీర్చిదిద్దాడు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికైంది. మదనపల్లి అంగళ్లులో జరిగిన జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి జట్టునకు జిల్లా జట్టు తరపున ఎంపికైంది. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించాలన్నదే తన ఆశయమని అంటోంది వసు.

### ఆటలో 'కావ్య'మైన ప్రతిభ



మండలంలోని గోవిందప్పనాయుడుకండ్రిగలో కూలీ ద్వారా జీవనం సాగిస్తున్న ఏలుమలై, మంజుల దంపతుల కుమార్తె కావ్య. స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుకుంటోంది. చదువుతోపాటు, ఆటలోనూ సత్తా చాటుతున్న కావ్య ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు బాలికకు మంచి శిక్షణ ఇచ్చాడు. కబడ్డీలో ప్రతిభ చాటి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. గతేడాది బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తనదైన శైలిలో సత్తా చాటి ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల అభినందనలు అందుకుంది.

### వసతులు లేకపోయినా సత్తా

మైదానవసతి అంతంత మాత్రమే. ఉన్న అరకొర స్థలంలోనే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. చదువుతో పాటు ఆటలలో ప్రతిభ చాటుతుండటం మా పాఠశాలకు గర్వకారణంగా ఉంది. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి పోటీలకు మా పాఠశాల విద్యార్థులు ఎంపికై సత్తా చాటడంతో పాఠశాలకు గుర్తింపు తీసుకువస్తున్నారు. **- వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు**

**రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం.. ఏర్పేడు:** జాతీయ రహదారి సీతారాంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాళహస్తి మండలంలోని చల్లపాలేనికి చెందిన లక్ష్మీనారాయరెడ్డి(25) మృతి చెందాడు. ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

## వివాహిత ఆత్మహత్య

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సదాశివపురం ఎస్సీ కాలనీకి చెందిన జి. మారయ్య భార్య రేవతి(34) అనారోగ్య సమస్యలతో శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

## 29 స్టార్టర్లు, విద్యుత్తు సర్వీస్ వైర్ల చోరీ

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** మండలంలోని బైరాజులకండ్రిగ, కోవనూరు, కర్లపూడి, తిమ్మసముద్రం గ్రామాలకు చెందిన 20 మంది రైతులకు చెందిన 29 స్టార్టర్లు, మోటార్ కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారు. ఈమేరకు ఆదివారం బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టార్టర్లు, విద్యుత్తు తీగలు లేక పోవడంతో వ్యవసాయానికి నీటి పారుదల సమస్య తీవ్రమైందని రైతులు వాపోతున్నారు. ఫలితంగా పైర్లు ఎండిపోతున్నట్లు తెలిపారు.

## గొలుసు అపహరణకు యత్నం

నిఘా కెమెరాలకు చిక్కిన గొలుసు అపహరణకు ప్రయత్నించిన నిందితులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఎన్టీఆర్ ఉద్యానం సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించారు. ఆదివారం జరిగిన ఘటనలో ఆమె ప్రతిఘటించడంతో వీలుకాక వెళ్లి పోవడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడున్న సీసీ ఫుటేజీల ద్వారా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వీళ్ల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.


## GENERAL PUBLIC NOTICE

This General Public are hereby informed that my clients are interested in purchasing the below schedule mentioned property In this regard, if anyone who are having concerns or issues with the said below mentioned schedule property can raise their objections before me within 5 days from the date of this general notice failing which my clients assumes as no objections from anyone regarding the below schedule mentioned property and can proceed as per law.

**SCHEDULE**

Tirupati District, Sri Balaji Registration district, Sri Kalahasti Sub district, Yerpedu Mandal, Pangur Village accounts an extent of Ac.0.17 cents in the survey numbers

**S.No.41/6 – Ac.0.06 cents**
**Bounded by**
North – others land in S.No.41/7
South – others land in S.No.41/12
East – others land in S.No.41/5
West – others and in S.No.41/10 and S. No.41/8
And
**S.No.41/9 – Ac.0.11 cents**
**Bounded by**
North – Others land in S.No.41/2
South – others land in S.No.41/10
East – others lands S.No.41/3 and S.No.41/8
West – others land in S.No.11

**K SAILENDRA CHAKRAVARTHI,** Advocate
# 6-16, Annadhana Satram Street, Renigunta – 517520, Andhra Pradesh.
Email id : sailendra.law@gmail.com, Mobile : 93983 28387

## GENERAL PUBLIC NOTICE

This General Public are hereby informed that my clients are interested in purchasing the below schedule mentioned property In this regard, if anyone who are having concerns or issues with the said below mentioned schedule property can raise their objections before me within 5 days from the date of this general notice failing which my clients assumes as no objections from anyone regarding the below schedule mentioned property and can proceed as per law.

**SCHEDULE**

Tirupati District, Sri Balaji Registration district, Sri Kalahasti Sub district, Yerpedu Mandal, Pangur Village accounts an extent of Ac.1.26 cents in the survey numbers

**S.No.37/6 – Ac.0.37 cents, Bounded by**
North – others land in S.No.37
South – others land in S.No.37
East – others land in S.No.37
West – others land in S.No.37
**S.No.41/5 – Ac.0.37 cents**
**S.No.41/7 – Ac.0.07 cents**
**S.No.41/8 – Ac.0.05 cents**
**S.No.41/10 – Ac.0.10 cents**
**S.No.41/12 – Ac.0.21 cents**
**S.No.41/13 – Ac.0.09 cents**
**Combinedly Bounded by**
North – Others land in S.No.41/3
South – others land in S.No.41/16, S.No.41/14 & S.No.41/15A
East – other lands in S.No.41/11 and S.No.41/9A
West – others lands in S.No.37

**K SAILENDRA CHAKRAVARTHI,** Advocate
# 6-16, Annadhana Satram Street, Renigunta – 517520, Andhra Pradesh.
Email id : sailendra.law@gmail.com, Mobile : 93983 28387


(c) eenadu

# గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

## నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

చెక్కు ఇస్తున్న సుబ్రహ్మణ్యం దంపతులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కొందరు భక్తులు నగదు అందజేశారు. వెంకటగిరికి చెందిన కలగండ సుబ్రహ్మణ్యం, ఇందిర దంపతులు నిత్యాన్నదాన పథకానికి సంబంధించి రూ.62,500 నగదు చెక్కును డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డికి అందజేశారు. వీరికి ఆలయం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**గూడూరులో నిమ్మ ధరలు**

**మొదటి రకం:** కేజీ రూ. 16 నుంచి రూ. 25 వరకు

**రెండో రకం:** కిలో రూ. 06 నుంచి రూ. 15 వరకు

## మట్టి దారి.. అవస్థలే మరి

పదిహేను గ్రామాల ప్రజలకు ఈ మట్టి దారే దిక్కు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక ప్రజలు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. సమీప గ్రామాలకు వెళ్లేందుకు సైతం రెండు గంటల సమయం తీసుకుంటున్నారు. అత్యవసర వేళల్లో 108 రాలేని పరిస్థితి. రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఆటోలు సైతం తిరగడం లేదు. గర్భిణులు, వృద్ధులు ఆసుపత్రులకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ● అటకామ తిప్ప నుంచి కొరిడి, పేర్నాడు వెళ్లే మార్గంలో 15 కిలోమీటర్ల దూరంలో 15 గ్రామాలున్నాయి. ఇక్కడ ప్రజలు మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా అటవీ అనుమతుల పేరుతో అడుగులు ముందుకు పడటం లేదు.

● అటకామతిప్ప నుంచి వేనాడుకు 13 కిలోమీటర్ల దూరం. ఈ మార్గం గుంతలమయం. చిన్న వర్షం పడినా రాకపోకలు నిలిచిపోతాయి. పులికాట్ నుంచి నీరు రోడ్డు మీదకు వచ్చినా సమస్య ఏర్పడుతుంది. గతంలో రోడ్లు వేస్తేనే ఓటేస్తామని యువత ఆందోళన చేపట్టారు. ఇక్కడకు దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

### ఉపముఖ్యమంత్రి దృష్టికి..

అటవీశాఖ అనుమతులు లేవని ఇక్కడ రోడ్డు పనులు నిలిపేశారు. ఇదే విషయం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తీసుకెళ్లారు. ప్రజా సమస్యలు గుర్తించి రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.

## తుడా నిధులు రూ.5 కోట్లతో పురాభివృద్ధి

మాట్లాడుతున్న తుడా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, కూటమి నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక సంఘం అభివృద్ధికి రూ.5 కోట్ల తుడా నిధులు మంజూరు చేస్తామని సంస్థ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను ఎమ్మెల్యే పి.సునీల్‌కుమార్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. గూడూరు చెరువు కట్టను పరిశీలించారు. నెల్లటూరులో తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎన్.బాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విలీన గ్రామాల అభివృద్ధికి రూ.కోటి, పురపాలికకు రూ.4 కోట్లు మంజూరు చేస్తామన్నారు. తుడా పరిధిలోని అన్ని పురపాలికల్లో తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్తు దీపాల పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తుడా అధ్యక్షుడికి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గత వైకాపా పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, నాయకులు కిరణ్‌కుమార్, చెంచురామయ్య, లీలావతి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, శ్రావణి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## అందని రుణం.. అన్నదాతకు అన్యాయం

✦ రైతులను వెంటాడుతున్న రీసర్వే సమస్యలు

యల్లరిసిలో వరినాట్లు వేస్తున్న రైతులు

గూడూరు, నాయుడుపేట, న్యూస్‌టుడే: రబీలో పంటలు సాగు చేయనున్న రైతులను రీసర్వే సమస్యలు వెంటాడుతున్నాయి. సంయుక్త ఎల్పీఎంల పరిష్కారంలో జాప్యం, రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పంట రుణాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలు వారికి చేరడం లేదు.

### ఎక్కువగా జాయింట్ ఎల్పీఎంలు..

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో జలవనరులు పుష్కలంగా నిండాయి. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో 1.60 లక్షల ఎకరాల్లో రబీ సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. వీరు రుణాల కోసం బ్యాంకులకు వెళ్తుండగా వెబ్‌ల్యాండ్‌లో వివరాలు సక్రమంగా లేక జాప్యం జరుగుతోంది. రీసర్వే సమస్యల పరిష్కారంపై కొన్ని నెలల క్రితం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ఎక్కువగా జాయింటు ఎల్పీఎంల సమస్యలు వచ్చాయి.

### ఎమ్మెల్యేకు రైతుల ఫిర్యాదులు..

❖ ఓజిలి మండలంలో శ్రీనివాసులునాయుడుకు 4 ఎకరాల భూమి ఉండగా రీసర్వే తర్వాత విస్తీర్ణం తగ్గించారు. కలెక్టర్, తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ❖ పెళ్లకూరు మండలంలో జాయింటు ఎల్పీఎం సమస్యలు పరిష్కరించడం లేదని ఇటీవల ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో రైతులు ఫిర్యాదు చేశారు. ❖ నాయుడుపేట మండలం మేనకూరు రెవెన్యూ పరిధిలో రీసర్వేని రాజకీయ కారణాలతో నిలిపేశారు. ఇక్కడ భూముల వివరాలు తారుమారు చేయడంతో రైతులు పంట రుణాలకు దూరమయ్యారు.

### సబ్‌డివిజన్ పరిధిలో....

| | |
|---|---|
| ▸ రీ సర్వేలో ఫిర్యాదులు: 5,003 | ▸ పరిష్కరించినవి: 1,385 |
| | ▸ అపరిష్కృతం: 3,618 |
| ▸ జాయింట్ ఎల్పీఎం ఫిర్యాదులు: 605 | ▸ పరిష్కరించినవి: 167 |

### పరిష్కారంపై దృష్టి..

జాయింట్ ఎల్పీఎంలలో సమస్యలున్న రైతులు సబ్ డివిజన్‌కు చలానా కడితే పరిష్కారంపై దృష్టి సారిస్తాం. రెండో విడతలో రీసర్వే చేపట్టి గ్రామాల్లో రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం. **- రాజేంద్ర, హరికృష్ణ, తహసీల్దార్లు, నాయుడుపేట, పెళ్లకూరు**

### గత ప్రభుత్వ వైఫల్యంతో..

వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ అస్తవ్యస్తంగా చేసింది. క్షేత్రస్థాయిలో రైతులకు సమాచారం లేకుండా కొన్నిచోట్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఒకే సర్వే నంబరులో ఇద్దరు ముగ్గురు ఉంటే సబ్‌డివిజన్ చేయకుండా ఒకే ఎల్పీఎంలో వారి పేర్లు చేర్చారు. దీంతో పాత సర్వే, వన్‌బీ నంబరు, వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో కొందరి రైతుల వివరాలు కనిపించకపోవడంతో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. పెట్టుబడి రాయితీలు, ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారు.

## కంటి వైద్య శిబిరం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. టాటా ట్రస్ట్, విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సిబ్బంది 143 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్యురాలు తనూజ తెలిపారు. అయిదుగురికి శస్త్రచికిత్సలు, 25 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్లు చెప్పారు. 21 మందికి రెటీనా సమస్య ఉందన్నారు. ఫౌండేషన్ సభ్యులు మస్తాన్, మూర్తి, ఆసుపత్రి ప్రతినిధి దిలీప్, కళాశాల ప్రిన్సిపల్ రవి పాల్గొన్నారు.

## కాలేషా జీవితం పేదలకు అంకితం

ప్రసంగిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదల సమస్యల పరిష్కారానికి కాలేషా కృషి చేశారని, ఆయన జీవితం అంకితం చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని కస్పా పాటిలెన్ క్లబ్‌లో కాలేషా సంతాప సభ ఆదివారం నిర్వహించారు. పార్టీలో 40 ఏళ్ల పనిచేశారని, గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేశారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, చంద్రయ్య, గోపాల్, శివకుమార్, రామరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘ కార్యవర్గం ఎన్నిక

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా బీటీఏ ప్రధాన కార్యదర్శి వెంకటరావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా డి.సిద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.నాగరాజు, గౌరవాధ్యక్షుడిగా జి.సుబ్రహ్మణ్యం, సలహాదారుగా టి.విశ్వనాథ్, అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.సుధాకర్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎ.లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా పి.వెంకటయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని వారంతా పేర్కొన్నారు.

## రక్తదానంతో ఆరోగ్యం సొంతం

కోట, న్యూస్‌టుడే: మండలంలోని చెందోడు గ్రామంలో దివంగత వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం ఎంవీరావ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగారక్త దాన శిబిరం నిర్వహించారు. పలువురి నుంచి మేడిపల్స్ రక్తనిధి వైద్యులు రక్తం సేకరించారు. రక్తదానంతో ఆరోగ్యం సొంతం అవుతుందన్నారు. అపోహలు వీడి ముందుకు రావాలన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మిని సత్కరించారు. దాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. రక్తనిధి ఉపాధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చామ.. కంట చెమ్మ

**ధర లేక రైతు దిగాలు**

మన్నేగుంటలో కొనుగోలు లేక గుట్టలుగా పంట

**వెంకటగిరి గ్రామీణం (బాలాయపల్లి), న్యూస్‌టుడే:** రూ.వేలల్లో పెట్టుబడులు పెడుతూ.. నెలల తరబడి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రస్తుతం చామ దుంపల రైతులకు ఇలాంటి కష్టాలే ఎదురవుతున్నాయి.

### దుక్కిలో కలిపేశారు..

ఎకరా సాగుకు రూ.60 వేల నుంచి రూ.80 వేలు పెట్టుబడి పెట్టాలి. గతేడాది ఎకరాకు రెండొంతుల ఆదాయం వచ్చింది. కానీ ఈ సారి కొనుగోలుదారులే లేక పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. వెంకటగిరి మండలంలోని మన్నేగుంట, కుర్జాగుంట, బొప్పాపురం, పాళెంకోట, మరాటిపల్లి, చెలికంపాడు, సిద్ధవరం గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో చామ దుంపలు సాగవుతున్నాయి. మన్నేగుంటలో వందెకరాలకు పైగా పంటను రైతులు దుక్కిలో కలిపేశారు. బొప్పాపురంలోనూ అదే పరిస్థితి.

### గతేడాది లాభాలు..

గతేడాది 80 కిలోల బస్తా రూ.1,500 నుంచి రూ.1,700 మధ్య పలికింది. ఎకరాకు 160 నుంచి 200 బస్తాల దిగుబడి సాధించిన రైతులు భారీగా లాభాలు పొందారు. మొత్తం ఖర్చు రూ.90 వేలు అయినా రూ.2 లక్షలకు పైగా లాభాలు రావడంతో ఆదాయం సంపాదించారు. బొప్పాపురం, సిద్ధవరం రైతులు సరకును చెన్నై, విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలకు తరలించి విక్రయించారు.

### ఈసారి కొనేవారే లేరు..

గతేడాది భారీగా లాభాలు రావడంతో ఈసారి రైతులు విస్తీర్ణం పెంచారు. కానీ స్థానికంగా బస్తా రూ.400 కూడా పలకడం లేదు. బయట ప్రాంతాల్లోనూ ధర లేదు. దీనికి తోడు కూలి ఖర్చుల భారం. ఏటా అక్టోబరులో దిగుబడులు పూర్తి చేసి, నవంబరులో వరి పంట కోసం సిద్ధమవుతారు. ఈసారి పంట తియ్యకుండానే దుక్కులు చేపట్టారు. పంట నిల్వ చేసుకోవడంపై ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేక రైతులకు నష్టాలు తప్పడం లేదు.

## వైభవంగా కార్తిక వనభోజనాలు

స్వామి వారికి అన్నాభిషేకం

**నాయుడుపేట, న్యూస్‌టుడే:** మండలంలోని తిమ్మాజీకండ్రిగ సమీపంలో స్వర్ణముఖి తీరంలోని అభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి ఉద్యాన క్షేత్రంలో ఆదివారం కార్తిక వనభోజనాలు నిర్వహించారు. ఉదయం వేద పండితులు సాలిగ్రామ విగ్రహాలకు పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు వివిధ రకాల క్రీడలు ఆడుతూ ఆనందంగా గడిపారు.

**అయ్యప్పకు అభిషేకాలు.. వెంకటగిరి, న్యూస్‌టుడే:** కుమ్మరిగుంట అయ్యప్ప ఆలయంలో ఆదివారం స్వామి వారికి శత కలశాభిషేకాలు చేపట్టారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో సేకరించిన జలాలను 108 కలశాల్లో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించి స్వామికి అభిషేకాలు, పడిపూజ చేశారు. మాలధారణ స్వాములు, భక్తులు భజనలు నిర్వహించారు.

**వేడుకగా పూజలు.. కోట, న్యూస్‌టుడే:** స్థానిక భవానీశంకర ఆలయంలో ఆదివారం షిర్డీ సాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు సుధాకర్‌శర్మ అర్చక బృందం గోపూజ, రుద్ర, అన్నాభిషేకాలు, పల్లకీ సేవ చేపట్టింది. కోట దేవతమ్మ ఆలయ ధర్మకర్త ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి, కవిత దంపతులు, సేవా సమితి అధ్యక్షుడు ఎ.రమణయ్య, ప్రతినిధులు కోటేశ్వరరెడ్డి, గిరిధర్ రెడ్డి, పన్నాగసాయి, వెంకటరమణ రెడ్డి, దాతలు పాల్గొన్నారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన సుమారు 6 వేల మందికి వన భోజనాలు ఏర్పాటు చేశారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

**మేమున్నాం.. మీకు తోడుగా..**

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

? స్టేట్ బ్యాంకు వీధిలో రోడ్డుపై మురుగు పారుతోంది. దుకాణదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- కుమరేషన్** ✓ కాలువలో వ్యర్థాలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **- గాబ్రియేల్, కార్యదర్శి – న్యూస్‌టుడే, తడ**

? వాకాడు- చిట్టమూరు మార్గంలో శివాలయం వెనుక విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. **- రమేష్** ✓ త్వరలో స్తంభం సరిచేయించేలా చర్యలు తీసుకొంటాం. **- చిన్నయ్య, ఏడీ డిస్కం, కోట – వాకాడు**

## గ్రామాల్లో ముమ్మర తనిఖీలు

వివరాలు ఆరా తీస్తున్న ఎస్సై తిరుపతయ్య, సిబ్బంది

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులకు ప్రజలు సహకరించాలని గ్రామీణ ఎస్సై తిరుపతయ్య సూచించారు. గూడూరు పట్టణ సమీపంలోని ఇందిరమ్మకాలనీలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టి వివరాలు ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు లేని అయిదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులు వీధుల్లో తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు తదుపరి సీజే

**శ్రీకాళహస్తి:** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్(డిసిగ్నేట్) దంపతులు వాయులింగేశ్వరుడిని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి ఆదివారం స్థానిక న్యాయమూర్తులు, ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసనాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

వెంకటగిరి, న్యూస్‌టుడే: యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి, ఉపాధ్యాయిని విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం వెంకటగిరి గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. యువత చరవాణులకు పరిమితం కాకుండా విజ్ఞానం పెంచే పుస్తకాలను చదవాలన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులు వెంకటరమణయ్య, రంగనాథన్, నాగభూషణం చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, రత్నశేఖర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీమాపై అవగాహన సదస్సు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులో ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలపై భవన నిర్మాణ అధికారి శ్రీకాంత్ వివరించారు. ప్రమాదాల బారిన పడే కార్మికులు బీమా పథకాలను వినియోగించుకోవాలన్నారు. బాల కార్మికులతో పనులు చేయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నిర్వాహకులు మస్తాన్ రహీం, జలానీ బాషా, అక్బర్, యాసిన్‌బాషా, కాలేషా, అమీరా బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఏడుగురు జూదరుల అరెస్టు

కోట, న్యూస్‌టుడే: ఊనుగుంటపాలెం సమీపంలో జూద స్థావరంపై ఆదివారం ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్టు చేసి రూ.65 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా జూదం ఆడితే చర్యలు చేపడతామన్నారు.

## దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మేల్చూరు సమీపంలో తనపై శనివారం రాత్రి ముగ్గురు దాడి చేసి గాయపరిచినట్లు చిలమనూరుకు చెందిన కోటయ్య ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు.

## దిల్లీకి ఎమ్మార్పీఎస్ నాయకుల పయనం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట, నాయుడుపేట పరిసర ప్రాంతాలకు చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి గూడూరు రైల్వేస్టేషన్ నుంచి దిల్లీకి పయనమయ్యారు. మరికొందరు చెన్నై నుంచి ప్రత్యేక రైలులో వెళ్లారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండిస్తూ దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు.

## విగ్రహాల ఏర్పాటుపై వివాదం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని గొట్టుప్రోలు పంచాయతీలో విగ్రహాల ఏర్పాటుపై రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి ఆదివారం గ్రామానికి వెళ్లి వారితో చర్చించారు. ముఖద్వారం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహం పెట్టేందుకు పది రోజుల క్రితం పనులు ప్రారంభించారు. ఆ ప్రాంతంలోనే అంబేడ్కర్ విగ్రహం పెట్టాలని కొందరు జెండాలు పాతారు. దీంతో ఆంజనేయ విగ్రహం గ్రామంలోని చర్చి ఎదురుగా పెడతామని మరికొందరు చెప్పడంతో వివాదం ప్రారంభమైంది. దీంతో డీఎస్పీ, సీఐ చేరుకొని అనుమతులు లేకుండా విగ్రహాలు పెట్టొద్దన్నారు.

## 30 అడుగులకు చేరిన నీటిమట్టం

పిచ్చాటూరు: అరణియార్ జలాశయ నీటిమట్టం 'ఆదివారం 30 అడుగులకు చేరినట్లు డీఈ శ్రీనివాసులు తెలిపారు. జలాశయంలో 31 అడుగుల నీటి మట్టంతో 1.853 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం 1.711 టీఎంసీల నీరు జలాశయంలో ఉండగా.. 50 క్యూసెక్కుల మేర నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు.

## గూడూరులో వెలుగులు

గూడూరు పట్టణం విద్యుత్తు కాంతులతో వెలుగులీనుతోంది. పురపాలక సాధారణ నిధులు రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను ఆదివారం ప్రారంభించారు. జాతీయ రహదారి సమీపం నుంచి పట్టణంలోని నీళ్ల ట్యాంకు వరకు దీపాలు వెలిగాయి. వైకాపా పాలనలో అంధకారంలో ఉన్న పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు.
**- న్యూస్‌టుడే, గూడూరు పట్టణం**

## వివాహిత, పిల్లలు అదృశ్యం

తడ, న్యూస్‌టుడే: మండలంలోని కాదలూరుకు చెందిన బిందుప్రియ, ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం నుంచి పిల్లలతో సహా తల్లి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండపనాయుడు తెలిపారు.

## తైక్వాండో పోటీల్లో సత్తా

నిర్వాహకులతో ఎంపికైన క్రీడాకారులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మాస్టర్స్ తైక్వాండో విద్యార్థులు కాకినాడ జిల్లాలో జరుగుతున్న 39వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటారు. పలువురు క్రీడాకారులు 18 పతకాలు సొంతం చేసుకున్నారు. పూజిత, మహిత బంగారు పతకాలు అందుకున్నారు. వీరు డిసెంబరులో దిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. వారికి పట్టణానికి చెందిన ప్రముఖులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## రోడ్డుపై దుకాణాలు.. రాకపోకలకు అవస్థలు

ఏళ్లుగా వేధిస్తున్న సమస్య

కోట మండలం విద్యానగర్‌లో రోడ్డుపైనే వాహనాలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు-దుగరాజపట్నం మార్గంలో ఆక్రమణలు జోరందుకున్నాయి. పదేళ్ల క్రితం తెదేపా పాలనలో రూ.17 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి కోట అడ్డరోడ్డు నుంచి కోట మండలం విద్యానగర్ వరకు 10 మీటర్ల వెడల్పుతో తారు రోడ్డు, 14 మీటర్ల వెడల్పుతో సిమెంటు రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో పలు చోట్ల ఆక్రమణలు తొలగించి పనులు చేపట్టారు. ప్రస్తుతం మళ్లీ యథాస్థానానికి దుకాణాలు వచ్చేశాయి.

**ఇదీ పరిస్థితి..** ✦ వెడల్పు: 10 మీటర్లు ✦ రహదారి: గూడూరు-దుగరాజపట్నం ✦ దుకాణాలు: ఇరువైపులా 100 వరకు ✦ తగ్గిన వెడల్పు: మూడు మీటర్లు

### ఈ ప్రాంతాల్లో సమస్య..

✦ అయిదేళ్ల క్రితం విద్యానగర్ నుంచి వాకాడు మండలం కోడివాక వరకు రూ.15 కోట్లు వెచ్చించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ సమయంలో ఆక్రమణలను తొలగించకపోవడంతో ప్రస్తుతం రోడ్డు ఇరుకుగా మారింది.

✦ జాతీయ రహదారి కోట అడ్డరోడ్డు నుంచి వాకాడు మండలం కోడివాక వరకు రెండు విడతల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కడివేడు, కొండుగుంట, కేశవరం, చిట్టేడు, విద్యానగర్, కోటఅడ్డరోడ్డు ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు వేశారు. మధ్యలో డివైడర్లు నిర్మించినా ఆక్రమణలను వదిలేశారు. దీంతో పెద్ద వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

### విద్యానగర్‌లో ట్రాఫిక్ కష్టాలు..

గూడూరు- దుగరాజపట్నం మార్గం విద్యానగర్‌లో నిత్యం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు చెందిన ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తారు. ఈ దారిలో బస్సులు, టిప్పర్లు, ఇసుక లారీలు వెళ్తుంటాయి. కానీ ఇరువైపులా ఆటోలు, ఎక్కడికక్కడ ఆవులు ఉండటంతో ప్రయాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. విషయం ర.భ.శాఖ ఈఈ రామాంజనేయులు వద్ద ప్రస్తావించగా. . పరిశీలించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తామన్నారు.

## ఇనుప చక్రాలతో రోడ్లు ఛిద్రం

రూ.కోట్లు వెచ్చించి రహదారులు నిర్మిస్తుండగా కొందరి కారణంగా పాడవుతున్నాయి. వెదురుపట్టు, వెదురుపట్టురాజుపాలెం పరిధిలో నాబార్డు నిధులు రూ.2 కోట్లతో ఎన్ఎంఅగ్రహారం నుంచి దుప్పలవారికండ్రిగ వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు. ప్రస్తుతం పొలం పనులకు వెళ్తున్న వారు ఇనుప చక్రాల ట్రాక్టర్లను నేరుగా రోడ్లపైకి తెస్తుండటంతో కోతకు గురవుతున్నాయి.
**– న్యూస్‌టుడే, దొరవారిసత్రం**

(c) eenadu

# గమ్య నగరం.. పెట్టుబడుల స్వర్గధామం!

- భాగస్వామ్య సదస్సుతో ప్రపంచ ఖ్యాతి
- విశాఖకు వరుస కట్టిన విదేశీ కంపెనీలు
- రాబోయే రోజుల్లో 5లక్షల ఉద్యోగాలు

ఈనాడు, విశాఖపట్నం

విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షించింది. రాష్ట్రానికి అంచనాలకు మించి పెట్టుబడులు రాగా అందులో విశాఖకు సింహభాగం వచ్చాయి. ప్రధానంగా ఐటీ, ఆతిథ్య, పర్యాటక రంగంతో పాటు ఆహార శుద్ధి రంగంలోనూ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు వరుస కట్టారు. ఫలితంగా ఈ సమ్మిట్‌కు ముందు.. తర్వాత అన్న తరహాలో విశాఖ నగరం ఎదగనుందని నిపుణులు భావిస్తున్నారు. రాష్ట్రానికి వస్తున్న మొత్తం పరిశ్రమల్లో 30 నుంచి 40 శాతం వరకు విశాఖ కేంద్రంగా ఏర్పాటు కానున్నాయి. వీటిల్లో దిగ్గజ సంస్థలతో పాటు స్థానికులవీ ఉన్నాయి.

ఒప్పందాలు జరిగిన రంగాలు: 12

జిల్లాకు వచ్చే పెట్టుబడుల అంచనా : రూ. 4 లక్షల కోట్లు

లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: 5 లక్షలు

**సాఫ్ట్‌వేర్, ఇతర కంపెనీలు..**

● సెయిల్స్ సాఫ్ట్‌వేర్ ● ఐ స్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ● టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ● ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ● రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్టు ● రెన్యూ ఎనర్జీ సంస్థ

**ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు**

- రూ. 1.33 లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల గూగుల్..
- రూ. 1.10 లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల రిలయన్స్..
- రూ. 1.10లక్షల కోట్లతో వెయ్యి మెగావాట్ల బ్రూక్‌ఫీల్డ్..
- రూ. 15వేల కోట్లతో టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్.

**✦ పర్యాటక రంగంలో రూ.10వేల కోట్లు..:** ఆతిథ్య, పర్యాటక రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు జిల్లాలో విభిన్న ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యంగా థీమ్‌పార్కులు, జల విన్యాసాలు, హోటళ్లు, రిసార్టులు, వైద్య పర్యాటకం, వెల్‌నెస్ సెంటర్లు, డెస్టినేషన్ వెడ్డింగ్, హోంస్టే, సాహస క్రీడల రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపారు. ఈ రంగంలో సుమారు రూ. 10వేల కోట్ల ప్రాజెక్టులు ఒక్క విశాఖ కేంద్రంగానే ఏర్పాటు కానున్నాయి.

**ఏఐ సాంకేతికతపై పని చేస్తాం..** ఐటీ హిల్స్‌పై సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఏఐ సాంకేతికతపై పనిచేసేలా కంపెనీని విస్తరిస్తున్నాం. ఇటీవల మంత్రి నారా లోకేశ్ భూమి పూజ చేశారు. సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తాం. సీఐఐ భాగస్వామ్య సదస్సుతో స్థానిక ఐటీ కంపెనీలకు మంచి గుర్తింపు లభించింది. – ఎస్.కిరణ్, సీఈవో, సెయిల్స్ సాఫ్ట్‌వేర్

**త్వరలో మరిన్ని కంపెనీల రాక..**

సీఐఐ భాగస్వామ్య(సమ్మిట్) సదస్సుతో విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. ఐటీ, పర్యాటకరంగాల్లో అధిక శాతం పెట్టుబడులు వచ్చాయి. ఈ రంగాల్లో ప్రస్తుతానికి జిల్లాలో 1.5 లక్షల నుంచి 2 లక్షల మందికి ఉపాధి లభించొచ్చు. త్వరలోనే మరికొన్ని కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. తద్వారా జిల్లాలో మొత్తం ఐదు లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. – హరేంధిర ప్రసాద్, కలెక్టర్, విశాఖ

**తీరం.. జనసంద్రం..!**

ఆర్కే బీచ్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. యువత, మహిళలు ఇసుక తిన్నెలపై ఆడుకుంటూ, రాళ్లపై సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. రాత్రి 7గంటలైనా రద్దీ తగ్గలేదు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పర్యాటకులు సముద్రంలోకి వెళ్లకుండా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. - ఈనాడు, విశాఖపట్నం

## నేడు ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా సోమవారం కలెక్టరేట్‌లో, జీవీఎంసీ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

వాయుసేన విన్యాసాల్లో భారత్, ఫ్రెంచ్ ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది

## ఫ్రాన్స్, భారత్ ద్వైపాక్షిక ఎయిర్ విన్యాసాలు

సింధియా, న్యూస్‌టుడే: ఎనిమిదో ఎడిషన్‌గా ఫ్రాన్స్‌లోని మాంట్-డి-మార్సన్‌లో ఆదివారం భారత్-ఫ్రెంచ్ దేశాల నడుమ వాయుసేనకు చెందిన ద్వైపాక్షిక (గరుడ-2025) విన్యాసాలు ప్రారంభమయ్యాయి. భారత వాయుసేన టీమ్‌లు ఈనెల 10న అక్కడకు చేరుకున్నాయి. సుఖోయ్-30ఎంకేఐ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్టులు, ఐఎల్-78 ఎయిర్ టు ఎయిర్ రీఫ్యూయల్ ట్యాంకర్లతో ఫ్రెంచ్ ఎయిర్, స్పేస్ ఫోర్స్ (ఎఫ్ఏఎస్ఎఫ్)కు చెందిన విమానాలతో ఈనెల 17 వరకు ఎయిర్ విన్యాసాలు కొనసాగుతాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

స్ఫూర్తి శిఖరం.. బిర్సా ముండా 10లో

# మీ డబ్బు.. మీ హక్కు

✤ జిల్లాలో నిర్వహణలో లేని ఖాతాలు 6.22 లక్షలు
✤ వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు

ఈనాడు, విశాఖపట్నం

జిల్లాలో వినియోగించని బ్యాంకు ఖాతాల్లో రూ.195 కోట్ల డబ్బు పోగుబడి ఉందంటే నమ్ముతారా? అవును ఇది వాస్తవం. ఆయా బ్యాంకుల అధికారులు దీన్ని ధ్రువీకరించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న నగదును బ్యాంకులు తిరిగిచ్చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది. ఇలా ఏళ్ల తరబడి నిర్వహించని ఖాతాలను డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్) అని పిలుస్తారు. ఏయే బ్యాంకుల్లో ఎన్ని ఖాతాలు అలాంటివి ఉన్నాయి, వాటిల్లో ఎంత నగదు ఉందో వివరాలు తెప్పించుకుంది. ఇందులో భాగంగా డిసెంబరు నెలాఖరు వరకు జిల్లాలో అన్ని చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆ నగదును వెనక్కి ఇస్తారు.

**ఎవరిని సంప్రదించాలంటే..** ▮ ఖాతా ఉన్న బ్యాంకు మరోదాంట్లో విలీనమై ఉంటే ఆ బ్యాంకును సంప్రదించొచ్చు. ▮ ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి. ▮ పరిశీలన అనంతరం బ్యాంకు ప్రతినిధి ధ్రువీకరించిన తర్వాత ఆ మొత్తం అక్కడే పొందొచ్చు. ▮ ఖాతాదారు మృతి చెందితే సంబంధిత కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి

**ఇలా తెలుసుకోవచ్చు..:** జిల్లాలో డీఈఏఎఫ్ ఖాతాలు 6.22 లక్షలు ఉండగా, వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని ఎల్‌డీఎం శ్రీనివాస్ తెలిపారు.. నిర్వహణలో లేని ఖాతాలను ఆ బ్యాంకు వెబ్‌సైట్ లింకులోనూ తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ https://udgam.rbi.org.in లోనూ చూడొచ్చు.

**ఆ డబ్బు తీసుకోండి..:** వినియోగించని బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సంబంధిత వినియోగదారులు సులభంగా పొందొచ్చు. రిజర్వ్‌బ్యాంకు కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఆరు లక్షలకుపైగా ఖాతాల్లో డబ్బులు ఉండిపోయాయి. దీనికి సంబంధించి ఇటీవల సిరిపురం ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాం. –శ్రీనివాస్, ఎల్‌డీఎం, విశాఖ

# చదువుతూనే ఉద్యోగ నైపుణ్యాలు..!

**విద్యార్థులను తీర్చిదిద్దుతున్న 'సీమెన్స్' కేంద్రం**

**నాలుగు ల్యాబ్‌లలో 120 మందికి శిక్షణ**

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని సీమెన్స్ ఎక్సలెన్స్ సెంటర్(నైపుణ్యాభివృద్ధి కేంద్రం) విద్యార్థులకు కల్పతరువుగా మారింది. ఇందులో 14 ల్యాబ్‌లు ఉండగా ప్రస్తుతం నాలుగు ల్యాబ్‌లలో సుమారు 120మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందాక శిక్షణ అవసరం లేకుండా నేరుగా విధులు నిర్వహించేలా ఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ నేర్పించే అంశాల గురించి సీమెన్స్ మేనేజర్ శివశంకర్ వివరించారు..

మ్యాప్ వేస్తున్న రోబో

▲ **ఆటోమేషన్ ల్యాబ్:** ఇక్కడ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్, మెకానికల్, మెకట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఆటోమొబైల్ కంపెనీల్లో ఆటోమేషన్ ఇంజినీర్, పీఎల్‌సీ ప్రోగ్రామర్, రోబోటిక్స్ ఇంజినీర్, మెయింటెనెన్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

▲ **రోబోటిక్స్ ల్యాబ్ :** రోబోట్ల రూపకల్పన, ప్రోగ్రామింగ్, నియంత్రణ ఇక్కడ నేర్పిస్తున్నారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రోబోటిక్ కంపెనీలు, రీసెర్చ్ సెంటర్లు, అంకుర సంస్థలు, ఇస్రో, డీఆర్‌డీవో వంటిచోట్ల ఉద్యోగాలు లభిస్తాయి.

▲ **ప్రొడక్ట్ డిజైన్ వ్యాలిడేషన్ ల్యాబ్ :** మెకానికల్, ప్రొడక్షన్, మెకట్రానిక్స్, డిజైన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఆటోమొబైల్, ఏరోస్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, మెషిన్ డిజైన్ పరిశ్రమలు, ప్రైవేట్ ఆర్ అండ్ డీ కేంద్రాలు, కన్సల్టెన్సీ, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

సీఎన్‌సీ మిషన్

▲ **సీఎన్‌సీ ప్రోగ్రామింగ్ ల్యాబ్:** కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ ల్యాబ్ (సీఎన్‌సీ)లో మెకానికల్, మెరైన్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఆటో మొబైల్ కంపెనీలు, ఏరోస్పేస్ ఇండస్ట్రీస్, ప్రైవేట్ మిషినింగ్ వర్క్‌షాప్ వంటి చోట్ల ఉద్యోగాలు లభిస్తాయి.

■ **ప్రయోగాత్మక అనుభవం:** రోబోటిక్స్‌పై ప్రాథమిక అంశాలు, సెన్సర్స్, కంట్రోలర్, ప్రోగ్రామింగ్ వంటి అంశాలు అర్థమయ్యేలా చెబుతున్నారు. రియల్ టైమ్ ఉదాహరణలతో బోధన చేయడం బాగుంది. ప్రయోగాత్మకంగా చెప్పడంతో రోబో ఆర్క్, ఆటోమేషన్ టాస్కులపై అనుభవం వచ్చింది. – సయ్యద్ తాజుద్దీన్, మెకానికల్ ఇంజినీరింగ్

■ **నైపుణ్యాలు పెంచుకున్నా..:** నేను ఎన్ఎక్స్ సీఏడీ డిజైన్ అంశం నేర్చుకుంటున్నా. స్కెచింగ్, మోడలింగ్, అసెంబ్లింగ్ వంటి టూల్స్‌పై అవగాహన వచ్చింది. ప్రయోగాత్మకంగా బోధన చేస్తున్నారు. డిజైన్ చేయడం ఎలాగో తెలిసింది. ప్రొడక్ట్ డిజైన్, సీఏడీ రంగంలో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు సంపాదించా. – సుస్మిత, మెకానికల్ ఇంజినీరింగ్

## వంటింట్లో కూరగాయల మంట

గురుద్వారా, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువులైన కూరగాయల ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే పేద, మధ్య తరగతి ప్రజలు జంకుతున్నారు. ప్రస్తుతం ఏ కూరగాయ కొనాలన్న కిలో రూ.50 కంటే తక్కువ లేదు. ప్రతి వంటకంలో టమాట తప్పనిసరిగా ఉండాల్సిందే. దీని ధర రైతుబజారులోనే కిలో రూ.39 పలుకుతోంది. ఫలితంగా కూరగాయల నెలవారీ ఖర్చు రెండు రెట్లు పెరిగిందని సామాన్యులు వాపోతున్నారు. గతంలో రూ.1000తో నెలకు సరిపడా కూరగాయలు వచ్చేవని ప్రస్తుతం దానికి రెట్టింపు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. కార్తిక మాసంలో వినియోగం పెరగడంతో పాటు ఇటీవలి తుపాన్లకు పంటలు దెబ్బతినడం ధరలు పెరగడానికి కారణమని రైతుబజార్ అధికారులు చెబుతున్నారు.

**రైతుబజారులో రూ.కిలో..**

| రకం | గత వారం | ప్రస్తుతం |
|---|---|---|
| టమాట | 26 | 39 |
| వంగ | 44 | 68 |
| బీర | 54 | 58 |
| బెండ | 48 | 60 |
| దొండ | 42 | 60 |
| కాకర | 40 | 58 |
| పచ్చిమిర్చి | 28 | 60 |
| చిక్కుడు | 70 | 80 |
| క్యాప్సికం | 58 | 80 |
| క్యారెట్ | 40 | 60 |

## పంచారామాలకు ఆరు బస్సులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నుంచి ఆదివారం సాయంత్రం పంచారామాలకు ఆరు ప్రత్యేక బస్సులు బయలుదేరాయని ఆర్ఎం బి. అప్పలనాయుడు తెలిపారు. కార్తిక మాసంలో శైవక్షేత్రాలను సందర్శించుకునే భక్తుల కోసం ఆయా బస్సులు ఏర్పాటు చేయగా, మంచి స్పందన వచ్చిందన్నారు. శబరిమలకు వెళ్లేందుకు ఐదు బస్సులు సిద్ధంగా ఉన్నాయని, అవసమైన భక్తులు ఆర్టీసీ అధికారులను సంప్రదించాలన్నారు. పంచారామాల బస్సులకు ఆర్ఎం జెండా ఊపారు.

(c) eenadu

## త్వరితగతిన అభివృద్ధి పనులు
### అధికారులకు మంత్రి నారాయణ ఆదేశాలు

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో కమిషనర్లు తేజ్‌భరత్, కేతన్‌గార్గ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ, వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. ఆదివారం ఆయన వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు, అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మిస్తున్న ఏడు మాస్టర్‌ప్లాన్ రహదారులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలన్నారు. కొత్తవలసలో 120 ఎకరాల్లో, [illegible] 80 ఎకరాల్లో [illegible] నగరాల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, సంయుక్త కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి శిల్ప, ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సైదారావు (డీడీ, పౌరసంబంధాల శాఖ), వి.భాస్కరరావు (డీఎస్‌ఓ), సంగీత్ మాధుర్ (ఆర్డీఓ), రామలక్ష్మి (డీడీ, ఐసీడీఎస్), రమణ (అడ్మిన్, కేజీహెచ్), సుధీర్‌బాబు (డీటీ, కలెక్టరేట్), జిలానీ (డీటీ) (కుడి నుంచి ఎడమకు). చిత్రంలో సీఎస్ విజయానంద్, కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రతబాగ్చీ

## సదస్సు ముగిసె.. ప్రశంసలతో మురిసె..!
### మెరుగైన సేవలు అందించిన అధికారులకు జ్ఞాపికల అందజేత

పన్‌టౌన్, న్యూస్‌టుడే: జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులతో రెండు రోజుల పాటు విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు విజయవంతంగా ముగియడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో సహా పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, జిల్లా అధికారులు సదస్సు నిర్వహణ కోసం రేయింబవళ్లు కష్టపడి పని చేశారు. అలా మెరుగైన సేవలు అందించిన 120 మందిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. సదస్సు ముగింపు సందర్భంగా పలువురికి సీఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందాయి.

**అంచనాకు మించి..:** ఈ సదస్సుకు దాదాపు 1800 మంది ప్రతినిధులు వస్తారని అధికారులు అంచనా వేయగా, ఆ సంఖ్య 2500 దాటింది. అయినా ప్రభుత్వ యంత్రాంగం అత్యంత వ్యూహాత్మకంగా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేశారని సీఎం కితాబిచ్చారు.

**దాదాపు రూ.10కోట్లు ఖర్చు:** అతిథులు, దేశ, విదేశీ ప్రతినిధులకు అవసరమైన రవాణా, వసతి, ఇతర సౌకర్యాలను యంత్రాంగం కల్పించింది. వారి రవాణాకు దాదాపు 750 కార్లను వినియోగించారు. విదేశీయుల కోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు నుంచి సౌకర్యవంతమైన కార్లను రప్పించారు. సదస్సు నిర్వహణకు దాదాపు రూ.10 కోట్ల వరకు ఖర్చు అయింది. ప్రొటోకాల్ పద్దుల కింద ఆయా నిధులు ఖర్చు చేశారు.

## 13వ వర్ధంతి

సమాజసేవపట్ల మీ నిబద్ధత ఎందరికో ఆదర్శనీయం. మాకు ఎనలేని ప్రేమానురాగాలు పంచిన అమృతమూర్తి, మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహనీయులు, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, మాకు మార్గదర్శకులు అయిన మీరు భౌతికంగా మానుండి దూరమై నేటికి 13 సం॥లు గడిచినమా మీ జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... సదా మీ జ్ఞాపకాలతో...

కీ॥శే॥ చొచ్చిపట్ల గురుమూర్తి గారు
Retd. Sub Divisional Engineer (BSNL)
సాయినగర్, మర్రిపాలెం
జననం: 03-06-1941 స్వర్గప్రాప్తి: 17-11-2012

భార్య: చొచ్చిపట్ల వరహాలమ్మ
మరియు కుటుంబ సభ్యులు
సెల్: 8019140908, 9903098383

## శ్రద్ధాంజలి

శ్రీమతి బొలిశెట్టి నాగమణి గారు

శ్రీ విశ్వావసు నామ సంవత్సర కార్తీక బహుళ ఏకాదశి శుక్రవారం రాత్రి ఉత్తరా ఫల్గుణి నక్షత్రంలో సద్గతి పొందారు.
అంతిమయాత్ర: తేది. 17-11-2025 సోమవారం ఉదయం ఎమ్.వి.పి. కాలనీ, HIG సెక్టార్-1 లో మా నివాసం నుండి ప్రారంభం అవుతుంది.
పెద్దకర్మ: తేది. 24-11-2025 సోమవారం ఎమ్.వి.పి. కాలనీలో మా స్వగృహము నందు జరుపబడును.

భర్త: బొలిశెట్టి సత్యనారాయణ
కుమార్తె: బొలిశెట్టి శ్రీలక్ష్మి
కుమారులు - కోడళ్ళు:
బొలిశెట్టి శైలేష్ - ప్రియాంక
బొలిశెట్టి ఈశ్వర్ - హిమబిందు
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు


## 'నాడీ'.. వేడి..!
### నేడు జాతీయ మూర్ఛవ్యాధి నివారణ దినం

పన్‌టౌన్, న్యూస్‌టుడే

'మూర్ఛ'.. ఇది మెదడులో విద్యుత్ చర్యలు అసాధారణ స్థాయిలో పెరగడం వల్ల తలెత్తే నాడీ సంబంధిత రుగ్మత. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొవిడ్ తర్వాత మూర్ఛ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. సోమవారం జాతీయ మూర్ఛవ్యాధి నివారణ దినం సందర్భంగా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య నిపుణుల సూచనలివి.

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పలువురు బాధితులు చికిత్స కోసం విశాఖలోని కేజీహెచ్‌కు వస్తుంటారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన వైద్యసదుపాయాలు కేజీహెచ్‌లో ఉన్నాయి. ■ కొవిడ్ తర్వాత న్యూరాలజికల్ బాధితుల్లో ఎక్కువ మంది మూర్ఛ వ్యాధి బారిన పడుతున్నారు. పక్షవాతం వచ్చిన వారిలోనూ మూర్ఛ లక్షణాలు కనిపిస్తున్నాయి. దీంతో కేజీహెచ్‌తో పాటు, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరే బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది.



**కేజీహెచ్‌లో నమోదైన వివరాలు**

| ఏడాది | కేసులు |
|---|---|
| 2023 | 469 |
| 2024 | 595 |
| 2025 (అక్టోబరు వరకు) | 604 |

**లక్షణాలు ఇలా...**

▲ ఈ వ్యాధితో బాధపడేవారు తరచూ స్పృహ, స్పర్శజ్ఞానం కోల్పోతుంటారు. బాధితుల మానసిక స్థితిలోనూ కొన్ని మార్పులు వస్తుంటాయి. ▲ మెదడులో నాడీ వ్యవస్థ ఓ క్రమపద్ధతిలో పని చేయదు. ఈ సమస్య ఒక్కసారితో ఆగిపోకుండా, తరచూ వస్తుంటుంది. ▲ అధికశాతం మందిలో ఒకే రకమైన లక్షణాలు కనిపిస్తుంటాయి.

**ఏం చేయాలి..?**

▲ మూర్ఛ వచ్చిన వ్యక్తిని వెంటనే నేలపై ఎడమవైపునకు పడుకోబెట్టాలి. ▲ చుట్టూ జనం గుమిగూడకుండా, గాలి వెలుతురు ప్రసరించేలా చూడాలి. ▲ బాధితులు సులభంగా శ్వాస తీసుకునేలా చర్యలు చేపట్టాలి. వారికి కళ్లద్దాలు ఉంటే వెంటనే తొలగించాలి.

**ఏం చేయకూడదు..!**

▲ బాధితుల కాళ్లు, చేతులు కట్టేయడం, సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) వంటివి చేయరాదు. ▲ నోటిలో, చేతిలో ఎలాంటి వస్తువులు పెట్టకూడదు. ▲ మూర్ఛ వచ్చిన వ్యక్తి పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకు నీరు, ఆహారం పెట్టకూడదు.

**మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం..**

మూర్ఛ (ఫిట్స్)కు కేజీహెచ్‌లో మెరుగైన చికిత్స అందిస్తున్నాం. బాధితులకు సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఈఈజీ పరీక్షలు చేసి, వ్యాధిని నిర్ధారిస్తున్నాం. ఆ తర్వాత వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ మూర్ఛ వ్యాధి నియంత్రణపై అవగాహన పెంచుకోవాలి. బాధితులు క్రమం తప్పకుండా రెండేళ్ల పాటు మందులు వాడితే వ్యాధి నయమవుతుంది. - డాక్టర్ ఎస్.గోపి, న్యూరాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

## రాష్ట్రాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

సదస్సులో పాల్గొన్న లంకా దినకర్, కె.వి.రామ్మోహనరావు, డేవిడ్ మాక్వాన్, చల్లా సురేశ్, రవికుమార్ గుప్తా తదితరులు

కాటిచెట్ల పాలెం, అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నగరంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రానికి 13 లక్షల కోట్ల పెట్టుబడుల ఎంఓయూలు జరగడంతో, తొమ్మిది జిల్లాలతో కలిపి విశాఖ ఎకనామిక్ జోన్ మరింత అభివృద్ధి చెందుతుందని ఇందులో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. [illegible] రోడ్డులోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా కార్యాలయంలో ఆదివారం 'స్వర్ణాంధ్ర- వికసిత్ భారత్‌లో ఇంజినీర్ల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ నిర్మాణంలో ఇంజినీర్ల సేవలు ప్రశంసనీయమని, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక పురోగతి, విపత్తు నిర్వహణ, ప్రజా సంక్షేమ రంగాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఛైర్మన్ డాక్టర్ కె.వి.రామ్మోహనరావు, గౌరవ కార్యదర్శి చల్లా సురేశ్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ ఆవిష్కరణలను మిళితం చేయడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీనియర్ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా మాట్లాడుతూ ఇంజినీర్లు నూతన సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే సృజనాత్మక ఆలోచనలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఇ.ఆర్.డేవిడ్ మాక్వాన్, భుజంగరావు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో క్రీస్తు మహోత్సవం

దివ్యబలిపూజ అర్పిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల, ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, తదితరులు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: సర్వలోకానికి క్రీస్తుయేసు రక్షకుడని విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల పేర్కొన్నారు. జ్ఞానాపురం దరి రక్షణగిరి పుణ్యక్షేత్రంపై ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం దివ్యబలిపూజ అనంతరం బైబిల్ ఉజ్జీవసభలో ఫాదర్ పి.బెంజిమిన్, ఫాదర్ వర్గీస్ చాపరత్, ఫాదర్ సరిసా ప్రతాప్ పలు అంశాలను విశ్వాసులకు వివరించారు. ఫాదర్ పి.జీవన్ బాబు దివ్య సత్ప్రసాద, స్వస్థత ఆరాధన నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు క్రీస్తుప్రభువు స్వరూప తేరును పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన దివ్యబలిపూజలో విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, విశాఖ ఆర్‌సీఎం అగ్రపీఠం ప్రొక్యురేటర్ ఫాదర్ దుగ్గింపూడి బాలశౌరి, ఫాదర్ కోన జయరాజు, పునీత పేతురు ప్రధాన దేవాలయం సహాయక విచారణకర్తలు ప్రేమ్‌కుమార్, థోమస్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన చర్చి ఫాదర్లు, సిస్టర్లు, వేలాదిగా విశ్వాసులు పాల్గొన్నారు.

## ఏయూకు రూ. 70 లక్షల విరాళం
### పూర్వ విద్యార్థి దేవ పురాణం ప్రకటన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో నిధుల సేకరణ, ఇతర కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామ్యం చేసేందుకు నగరంలోని ఏయూ పూర్వ విద్యార్థులతో డా.వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అమెరికాలో స్థిరపడిన ఏయూ పూర్వ విద్యార్థి దేవ పురాణం మాట్లాడుతూ ఏయూలో చదివినప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రూ.70లక్షల విరాళం ప్రకటించారు. అందులో రూ.50లక్షలు ఏయూ ప్రాంగణం సుందరీకరణకు, మిగిలినది అధునాతన పరిశోధనలను ప్రోత్సహించేందుకు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ స్థాపన కోసం వినియోగించాలని సూచించారు. దిల్లీ ఐఐటీ మాజీ సంచాలకులు, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థి ఆచార్య వి.ఎస్.రాజు ఏయూలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. ఐఐటీ భువనేశ్వర్ పూర్వ సంచాలకులు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘానికి రూ.7.5 లక్షలు విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. శతాబ్ది వేడుకల నేపథ్యంలో ఏయూలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వీసీ వివరించారు.

సదస్సులో పాల్గొన్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, పూర్వ విద్యార్థులు

## ఘనంగా ముగిసిన నరెడ్కో ప్రాపర్టీ ఫెస్ట్

లక్కీ డిప్ విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నరెడ్కో మూడు రోజుల ప్రాపర్టీ ఫెస్ట్-2025 ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ పీలా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గూగుల్ వంటి సంస్థలు వస్తున్నందున అందుకు తగిన రీతిలో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టి నగరాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా లక్కీ డిప్‌లో ఆరుగురు ఎంపిక కాగా ఎం.వీరేంద్రకుమార్, కె.వరప్రసాద్ ద్విచక్రవాహనాలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మిగతా నలుగురికి బహుమతులు అందజేశారు. నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు జి.చక్రధర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రవాసుల కోసం స్థిరాస్తి రంగంలో మరింత నమ్మకంతో ముందుకు సాగుతామన్నారు. ఆఖరి రోజు కావడంతో ఫెస్ట్‌లోని 65 స్టాల్స్ సందర్శకులతో కిక్కిరిశాయి. నరెడ్కో ఉత్తరాంధ్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉత్తరాంధ్ర సలహాకమిటీ ఛైర్మన్ సి.హెచ్.వి.పట్టాభిరాం, విశాఖ అధ్యక్షుడు రాజశేఖర్, నరెడ్కో ప్రతినిధులు పాపారావు, వెంకన్నచౌదరి, సుబ్బారావు, మిధున్, ధర్మారావు, అపోలో సీఈఓ కృష్ణప్రసాద్, సీఆర్‌డీఏ అదనపు సంచాలకుడు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్ వద్ద సందర్శకుల కోలాహలం


## సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638



# EENADU Classifieds

**BUSINESS SERVICES**

**లోకేష్ గోల్డ్** లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

**శ్రీవల్లి గోల్డ్** లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

**BUSINESS OFFER**

**క్లాత్, గుడ్డ** సంచులు హోల్‌సేల్‌గా చాలా తక్కువ ధరకే అమ్మబడును. మార్కెటింగ్ చేసుకునేవారికి చాలా మంచిలాభాలు కలుగును. (ప్లాస్టిక్ నివారణ వలన) 8121760605.

**FINANCIAL SERVICES**

**ఆంధ్రప్రదేశ్‌లో Govt.** ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీ పద్ధతిలో పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ ✆ 73862 01191.

**స్థిరాస్తులపై విశాఖ** జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్. ✆ 9396 999 669.

**REAL ESTATE**

**FLAT FOR SALE**

**GENERAL**

**MVP కాలనీలో** 3BHK ఫ్లాట్, సాగర్‌నగర్ మరియు PM పాలెంలో 2BHK ఫ్లాట్ బ్యాంక్‌లోన్ సదుపాయంతో అమ్మకం. Contact Phone: 8686997700.

**LAND FOR SALE**

**GENERAL**

**విజయనగరం జిల్లాలో** భూమి అమ్మకము కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్: 9948486127, 9948096199.

**PLOT FOR SALE**

**ATCHYUTAPURAM**

DTCP Approved Plot (1120 Sq.Yds) Cheemalapalli, Atchutapuram, Vizag. Contact Phone Number : ✆ 9923879631.

**GENERAL**

**సంక్రాంతి ఆఫర్!!** మేము ఇచ్చే ధరలకు ఎవ్వరూ ఇవ్వలేరు (ఉడా ప్లాట్లు) పూసపాటిరేగ, సవరవిల్లి, రెడ్డిపల్లి, R. తాళ్ళవలసలో తక్కువ ధరకే! ✆ 9246643836.

**6 లక్షలకు** GVMCపరిధి 107 చ॥గ॥ స్టీల్‌ప్లాంట్‌కి 4 కి॥మీ॥లో న్యూలేఅవుట్ ప్రారంభంలో 15 బిట్లు ఆఫర్‌గా EMI సదుపాయం కలదు. Contact Ph: 7386414017

**TO LET**

**KURMANNAPALEM**

To-Let: 3 BHK, Beside Annapurna Theatre, Kurmannapalem & 4 BHK, Greencity Heights @Vpl Greencity, Vadlapudi. Ph: 9848771300.

**COMMERCIAL**

**MVP COLONY**

Commercial Space for Rent 4800 Sft. 3 Floors Building with Central Lift for Showrooms, Shops near Vijaya Hospital MVP Main Road. Contact Phone: 9908507169.

**JOBS**

Special Recruitment for Retired Persons to Work Marketing Support for Financial Growth M/F, Part/ Full Excellent Package for Suitable Candidates. Call: 9553021026, 7702999763.

**JOB OPPORTUNITY**
for Retd. Officials Best Opportunity
★ PROPERTY ADVISING CHIEF MANAGERS
for Vizag and Vizianagaram
Prefer State, Central Teachers-Banking Govt/ Private Factories any Job Exp., any Degree- Housewives-full/ Part time
Age: 34+years
Monthly Package : 85,000/- Including Incentives (T&C Apply)
Interviews on : 17th, 18th, 19th Nov25
Con: Dr.SANJEEVA RAO SEETHAMMADHARA-VSP
Ph: 9989245662

**ప్రముఖ కార్పొరేట్** సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైవ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. Contact Ph: 9701719746.

**అయోధ్య కోఆపరేటివ్** సొసైటీ బ్యాంకులో పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం: 20,000 to 25,000 + ఇన్సెంటివ్, నో టార్గెట్స్, 2 వీలర్ మస్ట్. ✆ 70932 67891.

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. Contact Phone: 85209 80099,85208 74499.

**కావలెను: VICKS** & Tide Company నందు పనిచేయుటకు గోడౌన్ సూపర్‌వైజర్స్. లొకేషన్: వైజాగ్ షీలానగర్. Age: 18to 45 Yrs. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. Contact Phone: 77996 12340, 90521 23444.

**MARKETING/ SALES**

**2 సంవత్సరాల** అనుభవం ఉన్న సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. బైక్ ఉండవలెను. జీతం: 20,000/-. Contact Phone Numbers: 9603616759, 7416582567.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## స్ఫూర్తి శిఖరం బిర్సా ముండా
### పాడేరులో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఒడిశా సీఎం

ఒడిశా సీఎం మాఝిని సన్మానిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, తదితరులు

ఈనాడు డిజిటల్, పాడేరు - న్యూస్‌టుడే, పాడేరు/పట్టణం, అరకులోయ: ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఆదివారం వనవాసీ కళ్యాణాశ్రమం ఆధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒడిశా సీఎంకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కలెక్టర్ దినేష్‌కుమార్ స్వాగతం పలికారు. చింతలవీధి కూడలిలో ఏర్పాటు చేసిన బిర్సాముండా విగ్రహాన్ని ఒడిశా సీఎం ఆవిష్కరించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ▮ అల్లూరి జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బహిరంగ సభలో మాట్లాడుతూ పీవీటీజీల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ యోజనను ప్రారంభించిందని చెప్పారు. గిరిజనులు ఈ దేశానికి ప్రథమ పౌరులని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతికి సముచిత గౌరవం ఇవ్వాలన్నారు. వచ్చే ఏడాది ప్రతి గ్రామంలో బిర్సా ముండా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ▮ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ దొన్నుదొర, భాజపా జిల్లా అధ్యక్షురాలు మతం శాంతకుమారి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు, బీజేవైఎం జిల్లా నాయకులు మత్స్య కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కును నిలబెట్టడానికి రూ.14వేల కోట్ల ఆర్థికసాయం
### సీఎం వ్యాఖ్యల్ని కొందరు వక్రీకరిస్తున్నారు: పల్లా

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇప్పటికే రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాయని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సీఎం చంద్రబాబు కృషితో కేంద్రం భారీ ఆర్థిక సాయాన్ని అందించిందని, దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థకూ ఈ స్థాయిలో సహకారం లభించిన దాఖలాలు లేవన్నారు. సీఐఐ సదస్సులో విశాఖ ఉక్కు కర్మాగారం గురించి సీఎం చంద్రబాబు చెప్పిన మాటలను.. వైకాపా నాయకులతో కలిసి కొందరు వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. 'చంద్రబాబు కృషితోనే ఉక్కు కర్మాగారం లాభాల బాటలో నడుస్తోంది. అపోహలు సృష్టించే ప్రయత్నాలను కార్మికులు, ప్లాంటు సిబ్బంది తిప్పికొట్టాలి' అని శ్రీనివాసరావు కోరారు. నేడు విశాఖ ఉక్కు కర్మాగారం నడుస్తోందంటే అందుకు కూటమి ప్రభుత్వమే కారణమని స్పష్టంచేశారు. 'చంద్రబాబు 2000 సంవత్సరంలో రూ.1,350 కోట్లు తీసుకొచ్చి అప్పట్లో పరిశ్రమను నిలబెట్టారు. ప్లాంటు విషయంలో కార్మికులు, యాజమాన్యం, ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో.. ప్రతిపక్షానికీ అంతే ఉంది. కార్మికుల్ని భయాందోళనలకు గురిచేసే తప్పుడు ప్రచారాల్ని మానుకోవాలి' అని హితవు పలికారు.

## ఐఐఎంలో విద్యార్థులకు పట్టాల ప్రదానం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డేటా సైన్స్ ప్రోగ్రామ్‌లో అభ్యాసకులకు శనివారం సాయంత్రం పీజీ సర్టిఫికేట్స్ అందజేశారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మనం చేపట్టే పనికి ఎటువంటి ఆటంకాలు వచ్చినా విజయం సాధించేందుకు ప్రణాళికా రచనతో పూర్తి చేసే సామర్థ్య నైపుణ్యాలు ప్రదర్శించాలన్నారు. 11 నెలల ఈ పీజీ కోర్సులో వివిధ రంగాలకు చెందిన 31 మంది వ్యక్తులు అభ్యసించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టర్లు శివశంకర్ సింగ్ పటేల్, అనుపమ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సు పూర్తి చేసి పట్టాలు అందుకున్న అభ్యాసకులు

## కిడ్నీ రాకెట్ కేసు నిందితులకు 14 రోజుల రిమాండ్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కిడ్నీ రాకెట్ కేసులో ఆరుమంది నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు, మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ మేనేజరు బాలరంగడు, కదిరి ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ కేంద్రం మేనేజర్ మెహరాజ్, విశాఖపట్నానికి చెందిన పిల్లి పద్మ, సత్య, సూరిబాబులను శనివారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఆదివారం మధ్యాహ్నం వైద్యపరీక్షల కోసం మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. అనంతరం మదనపల్లె న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు మదనపల్లె సబ్‌జైలుకు నిందితులను తరలించినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

**పరారీలో ఉన్నవారి కోసం గాలింపు**

కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి మరో ప్రధాన నిందితుడైన బెంగళూరుకు చెందిన వైద్యుడు, ఇందులో ప్రమేయమున్న ఏడు మంది కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరి కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి బెంగళూరు, గోవా, తెలంగాణ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు.

**చికెన్ ధరలు** (కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 110 | 107 |
| లైవ్ | 137 | 127 |
| డ్రెస్డ్ | 199 | 224 |
| స్కిన్‌లెస్ | 226 | 234 |


## బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన చలపాక బాల వినాయక్, S/o, కాసులు, శ్రీహరిపురం, విశాఖపట్నం నివాసస్తులు యిచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింట్ శనివాడ గ్రామం, అగనంపూడి పంచాయతీలో చేరిన సర్వే నెం.91/1A, Plot నెం. 39 లో 379 చ.గజములు విస్తీర్ణం కలిగిన నివేశన స్థలంను రిజిస్టర్డు క్రయదస్తావేజు ద్వారా కొనుగోలు చేసియుంటిరి. సదరు స్థలం నా క్లయింట్ యొక్క స్వాధీన, అనుభవ, హక్కు భుక్తములలో యున్నది. కల్లుబంటి పైడితల్లి మరియు వారి కుటుంబ సభ్యులు పై సుదహరించిన సర్వే నెంబరులో గల స్థలంనకు సంబంధించి, ఎ.3.41 సెంట్లకుగాను గాజువాక తహసీల్దార్ గారి నుండి నెం. AIP/02/2017/Dt. 02-05-2019 గల రైత్వారీ పట్టాను పొందియున్నారు. సదరు పట్టాను రద్దు చేయమని నా క్లయింట్ మరియు యితర ప్లాట్లు యొక్క యజమానులు రెవెన్యూ డివిజనల్ ఆఫీసరు గారియందు అప్పీలు చేసుకొనగ, వారి యొక్క పట్టాను తే.12-04-2021న రద్దు చేయటం జరిగింది. మరియు సదరు కల్లుబంటి పైడితల్లి వగైరాలు నా క్లయింట్ యొక్క మరియు యితర ప్లాట్లు యజమానులు యొక్క ఆస్తులను ఆక్రమించుటకు ప్రయత్నించగా, నా క్లయింట్ మరియు ఇతర ప్లాట్లు యజమానులు మహారాజశ్రీ గాజువాక సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో O.S. 530/2019 మరియు O.S.529/2019 అను దావాలను వేయగా, శ్రీ కోర్టువారు Ad-Interim Injunction Order ను కూడా జారీ చేసియున్నారు. పై విషయములన్నీ మరుగుపరచి, సదరు కల్లుబంటి కుటుంబసభ్యులు రద్దు చేయబడ్డ రైత్వారీ పట్టాను ఆధారంగా చేసుకొని తప్పుడు దస్తావేజులు సృష్టించి, నా క్లయింట్ యొక్క మరియు యితర ప్లాట్లు యజమానులు యొక్క ఆస్తులను సర్వే నెం. 91/D గా చూపించి ఇతరులకు అమ్ముటకు ప్రయత్నించుచున్నట్లుగా తెలియవచ్చినది. కావున లోకులు ఎవరైనా సదరు కల్లుబంటి కుటుంబ సభ్యులతో ఏ విధమైన లావాదేవీలు క్రయవిక్రయాములు గాని సర్వే నెం 91/1A (సర్వే నెం. 91/D) సంబంధించి జరిపినచో సదరు వ్యవహారములు చెల్లనేరవనియు, నా క్లయింట్ మరియు యితర ప్లాట్లు యజమానులు యొక్క హక్కులను ఏ విధంగాను బంధింపజాలవనియు మరియు నా క్లయింట్ తీసుకొనబోవు చట్టపరమైన చర్యలకు పూర్తి బాధ్యులగుదురని యిందుమూలంగా హెచ్చరించటమైనది.

శ్రీమతి ఎల్. శ్రీనివాసమ్మ, న్యాయవాది
డో.నెం.7-15-35, గాజువాక, విశాఖపట్నం
ఫోన్ నెం. 9989234547

# పెందుర్తి

సూచనలిస్తున్న ఎస్సై స్వామినాయుడు

## రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉందని ఎస్సై స్వామినాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం తప్పనిసరిగా స్టేషన్‌కు హాజరుకావాలని ఆదేశించారు.

## నేటి నుంచి స్వామిత్వ సభలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈనెల 17వ తేదీన వంగలి, 18న నారపాడు, బోదివలస సచివాలయాల్లో, 19న ఉదయం బంగారమ్మపాలెం సచివాలయంలో, మధ్యాహ్నం అసకపల్లి శివారు ఎరుకునాయుడుపాలెం రామాలయంలో సభలు జరుగుతాయని తెలిపారు.

## వారం రోజులుగా తాగునీరు వృథా

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో చేపట్టిన తవ్వకాల కారణంగా జీవీఎంసీ 97వ వార్డు పరిధి కిశోర్ లే అవుట్ దరి వ్యవసాయ కళాశాలకు వెళ్లే రహదారిలో మంచి నీటి పైపులైను పగిలిపోయింది. దీనికి సమీపంలోనే యూజీడీ పైపులైను ధ్వంసమైంది. మరమ్మతు చేయాలని పనులు చేస్తున్న సిబ్బందిని కోరినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తెలిపారు. వారం రోజులుగా నీరు వృథాగా పోవడంతో పాటు మురుగు నీరు కలిసే ప్రమాదం ఉందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

## పుస్తక పఠనంతో మేధో వికాసం

పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న పాఠకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పుస్తకాలు చదవడంతో మేధో వికాసం పెరుగుతుందని గ్రంథాలయ అధికారిణి బి.చంద్రకళ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పెందుర్తి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన జరిగింది. గ్రంథాలయోద్యమ నేతల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త మూర్తి, అభివృద్ధి కమిటీ కార్యదర్శి రామకృష్ణ, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కవి సమ్మేళనం

పరవాడ(సబ్బవరం), సబ్బవరం, న్యూస్‌టుడే: పరవాడ శాఖా గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు కవులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కె.రామారావు, నారాయణరావు వారి కవితలను వినిపించారు. ★సబ్బవరం శాఖా గ్రంథాలయంలో బి.నర్సింహమూర్తి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. గ్రంథాలయ అధికారిణి వి.షిరీష ఆధ్వర్యంలో విజేతగా నిలిచిన టి.తిరువతిస్వామిని ఘనంగా సత్కరించారు.

## సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో పాల్గొన్న పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు అయితి సింహాచలంనాయుడు, తదితరులు

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు అయితి సింహాచలంనాయుడు పిలుపునిచ్చారు. అఖిల భారత సహకార సంఘం 72వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ బి.నగేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని పీఏసీఎస్ ద్వారా అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ చిరికి అవతారం, కార్యదర్శి శంకర్రావు, కొండబాబు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం వచ్చేంతవరకు పోరాటం

సమావేశమైన పొర్లుపాలెం, చింతలగ్రహారం రైతులు

పొర్లుపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తమ వద్ద నుంచి తీసుకున్న భూములకు తగిన నష్టపరిహారం వచ్చేంతవరకు పోరాటం చేస్తామని పొర్లుపాలెం, చింతలగ్రహారం గ్రామాల రైతులు ఆదివారం పొర్లుపాలెంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేశారు. నష్టపరిహారాన్ని ప్రభుత్వం వెంటనే చెల్లించేలా అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొర్లుపాలెం ఉప సర్పంచి గల్లా వెంకటరమణ, చింతలగ్రహారం మాజీ సర్పంచి పలమరశెట్టి వెంకటరమణ, లక్ష్మీపురం మాజీ సర్పంచి ఆళ్ల తాతారావు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, స్థానిక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పసలమ్మ పండగ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెంలో పసలమ్మ పండగ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్థులంతా డప్పులు, బాణసంచా నడుమ పసలమ్మ అమ్మవారి పుట్టవద్దకు వెళ్లి పూజలు చేశారు. ఇలా చేయడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉండి పశు సంపద వృద్ధి చెందుతుందని భక్తుల విశ్వాసం. ● మల్లునాయుడుపాలెంలో సర్పంచి బోని దేముడమ్మ ఆధ్వర్యంలో పసలమ్మ అమ్మవారి పూజలు జరిగాయి.

## వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.వి.సతీశ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు **అబ్దుల్ హుసేన్** (44) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటారు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో అతని బావమరిది షేక్ మౌలాలీ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలు హెచ్‌సీ డీవీకే స్వామికి అప్పగించారు.









# చాంపియన్

సొంతగడ్డపై ప్రత్యర్థులను స్పిన్‌తో వణికించి, పరుగుల వరదపారించిన టీమ్‌ఇండియానేనా ఇది? భారత్‌కు ఏమైంది? న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనా.. అది ఓ పీడకలలా మరిచిపోదామనుకున్నారు అభిమానులంతా! కానీ మళ్లీ ఓ షాక్.

కివీస్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబాటు తాత్కాలికం కాదని, మన బ్యాటర్లకు అదో బలహీనతగా మారిందని తేటతెల్లమైపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో సఫారీలకు టీమ్‌ఇండియా తలవంచింది. బ్యాటర్లు స్పిన్‌కు దాసోహమన్న వేళ.. తొలి టెస్టులో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. అవమానకర ఓటమిని చవిచూసింది.

## మన స్పిన్ ఉచ్చులో మనమే..

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్‌ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

కోల్‌కతా

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్‌ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

**ఏదో అనుకుంటే...:** ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంతగడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు.

**తడబడ్డారిలా..:** లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్‌ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా భారత్‌ను హార్మన్ మళ్లీ దెబ్బ తీశాడు. అంతే.. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) ప్రయత్నం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. కుల్‌దీప్ (1), సిరాజ్ (0) వెంటవెంటనే ఔటైపోయారు. గిల్ గాయంతో బ్యాటింగ్‌కు రాకపోవడంతో తొమ్మిదో వికెట్‌కే ఇన్నింగ్స్ ముగిసింది.

**బవుమా.. అమూల్యమైన 55:** అస్థిర బౌన్స్ ఉన్న పిచ్‌పై కెప్టెన్ బవుమా నిలబడి అమూల్యమైన 55 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా (ఓవర్‌నైట్ 93/7).. అనుకున్న దానికన్నా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బవుమా 29తో, బోష్ 1తో ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. బోష్ (25; 37 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో సఫారీ జట్టుకు విలువైన పరుగులు వచ్చాయి. చివరికి బోష్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో 44 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత బవుమా అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. హార్మర్, మహరాజ్‌ను సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159**
**భారత్ తొలి ఇన్నింగ్స్: 189**
**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికిల్టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా నాటౌట్ 55; టోని జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యెన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ (బి) బుమ్రా 25; హార్మర్ (బి) సిరాజ్ 7; కేశవ్ మహరాజ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 11
**మొత్తం:** (54 ఓవర్లలో ఆలౌట్) **153;**
**వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; అక్షర్ 14-0-36-1; కుల్‌దీప్ 8-1-30-2; జడేజా 20-3-50-4; సిరాజ్ 2-0-2-0-2
**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్‌క్రమ్ 31; ధ్రువ్ జురెల్ (సి) బోష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్‌దీప్ ఎల్బీ (బి) హార్మర్ 1; బుమ్రా నాటౌట్ 0; సిరాజ్ (సి) మార్‌క్రమ్ (బి) మహరాజ్ 0; గిల్ ఆబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 1
**మొత్తం:** (35 ఓవర్లలో ఆలౌట్) **93;**
**వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2; హార్మర్ 14-4-21-4; కేశవ్ 9-1-37-2; బోష్ 2-0-14-0; మార్‌క్రమ్ 3-0-5-1

## శ్రీకాంత్ పసిడి మెరుపులు

డెఫ్లింపిక్స్

మొర్తజాకు రజతం

మొర్తజా, శ్రీకాంత్

**దిల్లీ:** హైదరాబాద్ కుర్రాడు ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. డెఫ్లింపిక్స్‌తో అతడు స్వర్ణంతో మెరిశాడు. పోటీల తొలి రోజు, ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ధనుష్ ఫైనల్లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలుచుకున్నాడు. అతడు 252.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ మహ్మద్ మొర్తజా వానియా 250.1 పాయింట్లతో రజతం గెలుచుకున్నాడు. అతడు రెండో స్థానంలో నిలిచాడు. మహిళల ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిత్ సంధు రజతం, కోమల్ మిలింద్ కాంస్యం సాధించారు. ఫైనల్లో మహిత్ 250.5 పాయింట్లతో రెండో స్థానం సాధించగా.. కోమల్ 228.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 2022 డెఫ్లింపిక్స్‌లో ధనుష్.. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించాడు. డెఫిలింపిక్స్‌లో స్వర్ణం గెలిచినందుకు శ్రీకాంత్‌కు రూ.1.2 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

హరికృష్ణ

## హరికృష్ణ ఔట్

**పంజిమ్:** ఫిడే ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ కథ ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో అతడు టైబ్రేక్‌లో మార్టినెజ్ అల్కాంటరా (మెక్సికో) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ డ్రా కావడంతో ఈ ఆటగాళ్లు ఆదివారం టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్‌లో తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాతి గేమ్‌లో మార్టినెజ్ విజయం సాధించాడు. నాలుగో గేమ్ డ్రా కావడంతో హరికి ఓటమి తప్పలేదు. భారత్ నుంచి ఒక్క అర్జున్ మాత్రమే ఈ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు.

## 4 పతకాలు ఖాయం

### ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

**గ్రేటర్ నోయిడా:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. బొలోత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రీతి అంతే తేడాతో నిగినా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గగా.. కలెట్స్కీ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించడంతో సెమీస్ చేరింది.

## ఝార్ఖండ్ 259/6

**జెంషెడ్‌పుర్:** ఆంధ్రతో రంజీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఝార్ఖండ్ తొలి రోజు ఆట చివరికి మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 259 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్ (115; 209 బంతుల్లో 16×4) సెంచరీ సాధించడం.. కెప్టెన్ విరాట్ సింగ్ (41), ఆదిత్య సింగ్ (29) రాణించడంతో ఒక దశలో 213/3తో బలమైన స్థితిలో నిలిచిన ఝార్ఖండ్.. తర్వాత 31 పరుగుల తేడాతో 3 వికెట్లు చేజార్చుకుంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

పతకాలతో మహిళల డబుల్స్ విజేతలు

## తెలంగాణకు 2 స్వర్ణాలు, రజతం

ముగిసిన జాతీయ పికిల్‌బాల్

**ఈనాడు, బెంగళూరు, బెంగళూరు క్రీడలు, న్యూస్‌టుడే:** జాతీయ పికిల్‌బాల్ పోటీల్లో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరు వేదికగా జరిగిన ఈ టోర్నీకి ప్రియా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ రజతంతో తెలంగాణ.. గుజరాత్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచింది. 21 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో మహారాష్ట్ర మొత్తం 8 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక నాలుగు పతకాలతో రెండో స్థానం సాధించింది. పోటీల సందర్భంగా సబల మిల్లెట్స్ ఉత్పత్తుల పట్ల క్రీడాకారులతో పాటు సందర్శకులు, విద్యార్థులు అమితాసక్తిని ప్రదర్శించారు.

## పాక్ చేతిలో భారత్ ఓటమి

**దోహా:** యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించిన భారత్-ఎ.. తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ చేతిలో 8 వికెట్ల తేడాతో కంగుతింది. మొదట అజీజ్ (3/24), సదాఖత్ (2/12), మసూద్ (2/31)ల ధాటికి భారత్-ఎ 19 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (45: 28 బంతుల్లో 5×4, 3×6), నమన్ ధీర్ (35) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. సదాఖత్ (79 నాటౌట్; 47 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.




## ఘనంగా సన్నిధానం పూజ

**కోటనరవ(వేపగుంట), న్యూస్‌టుడే :** అయ్యప్ప సన్నిధానం పూజను కోటనరవలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌరీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షాదారులు హాజరయ్యారు. శబరిమల సంప్రదాయ విధానంలో అర్చకులు ప్రసాద్‌దేవర పూజలు చేశారు. తూర్పుగోదావరికి చెందిన కొండలస్వామి భజన బృందం అయ్యప్ప పాటలతో అలరించింది. అనంతరం స్వాములకు అల్పాహారం వితరణ చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొల్లలపాలెంలో పూజల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

**సబ్బవరం, న్యూస్‌టుడే:** సబ్బవరం మండలం గొల్లలపాలెంలో అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప పీఠం స్వాములు నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్వాములు హాజరయ్యారు.

## లింగాల మల్లికార్జునుడికి అన్నాభిషేకం

**పెందుర్తి, న్యూస్‌టుడే:** జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లో కొలువైన స్వయంభూలింగాల మల్లికార్జున స్వామికి ఆదివారం అన్నాభిషేకం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు పరమేశ్వరుడిని వేదమంత్రాల నడుమ అన్నంతో అభిషేకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

## సీఎస్ఆర్ నిధులతో దోబీఖానా నిర్మాణం

**పరవాడ (పెందుర్తి), న్యూస్‌టుడే:** పరవాడ పెద్ద చెరువుకు దిగువున దోబీఖానా నిర్మాణం ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.8లక్షలతో చేపడుతున్నట్లు సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెదేపా సాంస్కృతిక విభాగం జిల్లా అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పెద్ద చెరువు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధికార ప్రతినిధి బండారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం

**వేపగుంట, న్యూస్‌టుడే:** వేపగుంట పరిధి పవన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రామ్మోహనరావు ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు శనివారం దాడి చేశారు. అదనపు కమిషనర్ హెచ్.వి.మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు దాడి చేసి 40 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను, నిందితుడిని పెందుర్తి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దీనిపై వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

కేంద్రం వద్ద మేనేజర్ శేషు, తదితరులు

**పరవాడ (పెందుర్తి), న్యూస్‌టుడే:** పరవాడ మండలం హస్తినాపురంలో హెరిటేజ్ డెయిరీకి చెందిన నూతన పాల సేకరణ కేంద్రాన్ని ఆ సంస్థ మేనేజర్ కూండ్రపు శేషు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సంస్థ కృషి చేస్తుందన్నారు.

# భీమిలి

**సినిమాలు**

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- కాంత
రాములమ్మ- జిగ్‌రీస్
తాతా- జటాధర
సప్తగిరి- మాస్ జాతర

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ జగన్మోహనరావు తెలిపారు. పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, కృష్ణాపురం, మద్ది, తునిపాలం, విలాస్‌ఖాన్‌పాలెం, బాందేవపురం, విజయరాంపురం, శేరీఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, తునివలస, నరసాపురం, చిన్నాపురం, కొయ్యపేట, విజయానందపురం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, పద్మనాభం, న్యూస్‌టుడే: ?: కీతన్‌పేట(భీమిలి) నుంచి తగరపువలస వరకు స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నాయి. – సంజయ్‌కుమార్, తగరపువలస ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. – అయ్యప్పనాయుడు, జెడ్పీ

?: మిథిలాపురి వుడా కాలనీ(మధురవాడ)లో తారురోడ్డు గోతులమయంగా ఉంది.–స్థానికులు, మధురవాడ ✓: త్వరలో రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, ఏఈ

?: విజేత సూపర్‌మార్కెట్ (పీఎంపాలెం) నుంచి సాంకేతిక కళాశాలకు వెళ్లే రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు అతివేగంగా ప్రయాణిస్తున్నాయి. – రమణ, పీఎంపాలెం ✓: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. – పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

?: 5వ వార్డు పరిధి గణేష్‌నగర్ (మధురవాడ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – రామకృష్ణ, స్థానికుడు ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజారవి కుమార్, ఆరోగ్య అధికారి

?: సాగర్‌నగర్ శివాలయం ఆలయం దగ్గర వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టడంతో ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. – స్థానికులు, ఎండాడ ✓: ఆర్టీసీ బస్సులకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. – ట్రాఫిక్ పోలీసులు, ఆరిలోవ

?: జూపార్కు (సాగర్‌నగర్) ఎదురుగా ఉన్న బీచ్‌లో సాయంత్రం ఆకతాయిల బెడద ఉండటంతో ఇక్కట్లకు గురవుతున్నాం. – సాగర్‌నగర్ వాసులు ✓: పరిశీలించి గస్తీ ఏర్పాటు చేస్తాం. – నాయుడు, గస్తీ పోలీసులు

# సందర్శనీయ బీచ్‌ల్లో... సమస్యల తిష్ఠ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే

పర్యాటకంగా పేరు ప్రఖ్యాతులు సంతరించుకున్న రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం తదితర సందర్శనీయ బీచ్‌ల్లో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ముఖ్యంగా శని, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో అధిక సంఖ్యలో సందర్శకులు తీరాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రాంతీయులు జిల్లా ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరుతున్నారు.

కోతకు గురైన రుషికొండ బీచ్‌లోకి వెళ్లే మెట్ల మార్గం

■ ఇక్కడ సముద్రం ఎంతో లోతైనది. స్నానాలు చేస్తూ పలువురు మృతి చెందారు. నెలకొల్పిన హెచ్చరిక బోర్డులు చాలా కాలం క్రితమే ధ్వంసమై నామరూపాలు లేకుండా ఉన్నాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

**పరిస్థితి ఇలా..**

■ రుషికొండ బీచ్‌లోని మెరైన్ టవర్ సమీపంలో నేరుగా తీరానికి వెళ్లేందుకు అనువుగా నిర్మించిన సిమెంట్ మెట్లు వెంబడి ప్రదేశం కోతకు గురై అధ్వానంగా ఉంది. గతంలో కురిసిన వర్షాలకు ఎగువ బీచ్ రోడ్డు ప్రాంతాల నుంచి వాననీరు సముద్రంలో కలిసే క్రమంలో కోతకు గురై ప్రాంతం కూడా కోతకు గురవుతోంది. మరమ్మతులు చేపట్టకపోతే మెట్లు సైతం దెబ్బ తినే అవకాశాలు ఉన్నాయి.

■ తీరంలో పలుచోట్ల ఎల్ఈడీ దీపాలు మరమ్మతులకు గురై వెలగక అలంకారప్రాయంగా మారాయి.

■ సాగర్‌నగర్ తీరం వద్ద గతంలో తొలగించిన సామాజిక మరుగుదొడ్ల స్థానంలో కొత్తవి నిర్మించక సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్మించిన వీటిని పునరుద్ధరించకపోవడం శోచనీయమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

■ స్థానిక ప్రాంతంతో పాటు సమీప గుడ్లవానిపాలెం బీచ్ పరిసరాల్లో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ దీపాలు మరమ్మతులకు గురవడంతో జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఆయా చోట్ల కొత్తవి ఏర్పాటు చర్యలు తీసుకోకపోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

■ విధుల నిర్వహణలో భాగంగా జీవీఎంసీ లైఫ్‌గార్డులు ఉండేందుకు ఎలాంటి వసతి లేక పోవడంతో ముఖ్యంగా ఎండలు, వాన సమయాల్లో ఎక్కువగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గుడ్లవానిపాలెం వద్ద విద్యుద్దీపాలు లేని స్తంభం

## గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: పుస్తక పఠనం అన్ని వయసుల వారికీ విజ్ఞాన దాయకమని ఉపాధ్యాయులు సూచించారు. అడివివరం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పుస్తక ప్రదర్శన జరిగింది. గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం ఆధ్వర్యంలో వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు పార్థసారథి, సంధ్య, ఆంగ్ల బోధకుడు మహేంద్ర పాల్గొని ప్రారంభించారు. పుస్తక పఠనం ప్రయోజనాలను బాలలకు వివరించారు.

పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న బాలలు, పాఠకులు

## 'జూ' ఆదాయం రూ.8 లక్షలు

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం విశాఖ జంతు ప్రదర్శనశాల (జూ పార్కు) సందర్శకులతో కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను తిలకించడంతో పాటు ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ రకాల పక్షులు, హంసలు, కోతులు, ఖడ్గమృగాలు, ఏనుగులు, జిరాఫీలు, చింపాజీలు, పాములు, పులులు సందర్శకులను అలరించాయి. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకున్నారు. చెట్ల కింద, షెల్టర్లలో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. జాతీయ రహదారి ప్రధాన ద్వారం, బీచ్‌రోడ్డులో సాగర్ ద్వారం నుంచి ఆదివారం ఒక్కరోజు 11,099 మంది సందర్శించినట్లు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సందర్శకులతో పాటు లోపలకు ప్రవేశించిన కార్ల ద్వారా రూ.8,02,050 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. సమీప కంబాలకొండ ఎకో టూరిజం పార్కుకు రూ.74 వేల ఆదాయం వచ్చినట్లు రేంజ్ అధికారి శాస్త్రి పేర్కొన్నారు.

ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

## పద్మశాలీలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి

మధురవాడ, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు విద్య, వ్యాపార రంగాలతో పాటు రాజకీయంగా ఎదగాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కందగట్ల స్వామి, వానపల్లి వెంకట్రావు అన్నారు. ఆదివారం మధురవాడ పరిధి నగరంపాలెంలో ఉన్న జిల్లా పద్మశాలీ అధ్యక్షుడు వాసుపల్లి ఈశ్వరరావు నివాసానికి వచ్చిన ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి చట్టసభల వరకు పద్మశాలీల ప్రాతినిధ్యం పెంచే స్థాయిలో ఉండాలన్నారు. జాతీయ అధ్యక్ష, కార్యదర్శులను నాయకులు సత్కరించారు. తెదేపా నాయకులు వి.ముత్యాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సత్య, కోశాధికారి నామాల అనీష్‌కుమార్, జి.వేణు, జి.నాగరాజు, పి.రామ, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించిన జిల్లా నాయకులు

## సాయినాథుడికి బిల్వార్చన

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని బంటుపల్లివారి కళ్లాలు రోడ్డులో ఓ కల్యాణ మండపంలో శ్రీసాయి బిల్వార్చన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. హిమాలయ యోగి సంతు వేదానంద స్వామి వారి సమక్షంలో అర్చకుల వేద మంత్రాల నడుమ బిల్వార్చన పూజాది అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామీజీ ఆశీర్వాచనాలు అందించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. మామిడి తిరుమలేష్, షిణగం అప్పలరాజు, శివయోగి, శివప్రసాద్ మాస్టారు, కరోత్రు సత్యనారాయణ, దొంతల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి తిరువీధి ఉత్సవం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరోవార్డు పరిధి పీఎంపాలెంలో గురుస్వామి పోతిన వరకుమారు, ఆతని శిష్య బృందం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా కేరళలో ప్రధాన ఆలయంలో మండలదీక్షాధారులు అయ్యప్ప దర్శనం ప్రారంభమయ్యే రోజున ఇక్కడ ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా చేపడుతున్నామని గురుస్వామి ప్రధాన శిష్యులు పోతిన ఎల్లాజీ తెలిపారు. పోతిన కన్‌స్ట్రక్షన్, దుర్గాంబ కార్పొరేట్ సంస్థల వితరణతో సుమారు 4 వేల మంది స్వాములు, స్థానిక ప్రజలకు నారాయణ సేవ నిర్వహించారు. అక్టోబర్ 22న ప్రారంభమైన నిత్యాన్నదానం వచ్చే నెల 27న ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీవిశ్వ కళాశాలల ఛైర్మన్ జగ్గారావు ఆర్థిక సహకారం అందించినట్లు పేర్కొన్నారు. వాల్తేరు భాస్కర్ స్వామి, బోడేపల్లి చిరంజీవి, పోతిన అప్పన్న, సంతోష్‌పాండే, సీహెచ్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్: రుషికొండలోని శ్రీధర్మశాస్త సన్నిధానం గురుస్వామి అనిల్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఊరేగింపు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి మహిమలపై గీతాలాపనలు చేశారు. అధిక సంఖ్యలో అయ్యప్ప, భవానీ స్వాములు పాల్గొన్నారు.

పీఎంపాలెంలో తిరువీధి ఉత్సవంలో స్వామి దీక్షాధారులు

# ఎగుడుదిగుడు ట్రాక్.. తప్పని నొప్పులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: శరీర పటుత్వాన్ని పెంపొందించుకోవటానికి వాకింగ్ ట్రాక్ మీద నడక సాగిస్తే సాంత్వన కలగకపోగా కొత్తగా మోకాళ్ల నొప్పులొస్తుండటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలిలోని జీవీఎంసీ మినీ స్టేడియంలో 2008లో అప్పటి పురపాలక సంఘం అధికారులు రూ.10 లక్షలతో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. సుమారు కిలోమీటరు వృత్తాకారంలో ఉండే ఈ ట్రాక్ క్రమేపీ పాడైంది. గోతులతో రాళ్లు తేలి ఎగుడుదిగుడుగా మారింది. దీనిమీద నడిచే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం లేకపోగా మోకాళ్ల చిప్పలు దెబ్బతిని ఎముకలకు సంబంధించిన సమస్యలు పుట్టుకొస్తున్నాయని పలువురు వాపోతున్నారు.

★ ఎంతో మందికి ఉపయుక్తం..: మధుమేహం, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వ్యక్తులు దీనిమీద ప్రతి రోజు నడక సాగిస్తుంటారు. అలాగే కానిస్టేబుల్, ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తులు చేస్తున్న యువకులు దీనిమీద పరుగు సాధన చేస్తుంటారు.

భీమిలి మినీ స్టేడియంలో గోతులు, రాళ్లు తేలి ఉన్న వాకింగ్ ట్రాక్

● ముఖ్యంగా సాయంత్రం వేళ మహిళలు ఎక్కువమంది వస్తుంటారు. ● ఇక్కడ ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ ఆడే యువకులు శరీర దారుఢ్యానికి కొంత ట్రాక్‌మీద పరుగులు పెడతారు. ● భీమిలి ప్రాంతంలో ఇదొక్కటే ట్రాక్ కావడంతో ప్రత్యామ్నాయం లేనప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగించుకోక తప్పడం లేదు.

★ పరిశీలించి అభివృద్ధి చేస్తాం..: భీమిలి మినీస్టేడియంలో క్రీడాకారులు అనువుగా వాకింగ్ ట్రాక్‌ను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతాం. క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు పరిశీలిస్తాం. చాలా ఏళ్ల క్రితం నుంచి దీనికి మరమ్మతులు చేయకపోవడంతో పాడైనది గుర్తించాం. ట్రాక్‌మీద గ్రావెల్ వేసి ఎగుడుదిగుడులేకుండా సమతులం చేస్తాం. ఇందు కోసం నిర్మాణ వ్యయ అంచనాలను తయారు చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే ట్రాక్ మార్గాన్ని నడిచేందుకు అనుకూలంగా అభివృద్ధి చేస్తాం.
– జి.సురేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీవీఎంసీ, పబ్లిక్‌వర్క్స్ విభాగం భీమునిపట్నం జోన్

## అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లా హిరమండలం కొండరాగోలు గ్రామానికి చెందిన బోర జోగినాయుడు, జోత్స్న దంపతులు ఆదివారం రూ.1,03,000 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో అన్నప్రసాద విభాగం పర్యవేక్షకుడు పాలూరి నరసింగరావుకు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతలకు విరాళం ధ్రువపత్రం అందిస్తున్న పర్యవేక్షకుడు నరసింగరావు

## సిరుల స్వామికి స్వర్ణ తులసీదళార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వర్ణ తులసీదళార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

## ప్రధాన పర్యాటక కేంద్రంగా 'జూ' అభివృద్ధి

ఎండాడ, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు పర్యావరణ, అటవీ, సాంస్కృతిక, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దాండే (ఐఏఎస్) తెలిపారు. కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మొహమ్మద్‌దివాన్‌మైదీన్, క్యూరేటర్ జి.మంగమ్మతో కలిసి జూ పార్కు, కంబాలకొండ తదితరాలను సందర్శించారు. ఈ సందర్భంగా జూలో విభిన్న జాతుల జంతువులు, పక్షులు వాటి సంరక్షణ, జీవ వైవిధ్యం, వన్యప్రాణి అవగాహన కార్యక్రమాలు, సందర్శకుల అనుభవం, వారికి కల్పించే సౌకర్యాలను క్యూరేటర్ ఆయనకు వివరించారు. నూతన ప్రాజెక్టులు, జరుగుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. ఈ సందర్భంగా కాంతిలాల్‌దాండే మాట్లాడుతూ.. జూ ప్రాంగణం, వైవిధ్య జంతు జాతులు ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి జూగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు, సిబ్బంది పనితీరుని ప్రశంసించారు.

జూలో పర్యటిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దాండే తదితరులు

## పైపులైన్ పగిలే.. మంచినీరు పోయే

పద్మనాభం-నీళ్లకుండీల రోడ్డు పక్కన వృథాగా పోతున్న నీరు

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల కేంద్రం పద్మనాభం గ్రామంలో మంచినీటి పైపులైనుకు రంధ్రం పడటంతో తాగునీరు వృథాగాపోతోంది. ఈ నెల 19న జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి విద్యుత్‌దీపాలంకరణ కోసం ఇనుప గొట్టాలు వేస్తుండగా భూమి లోపల ఉన్న పైపులైనుకు రంధ్రం పడింది. దీంతో పద్మనాభం-నీళ్లకుండీల ప్రధాన రోడ్డు పక్క నుంచి తాగునీటి సరఫరా ఉన్నంత సేపు వృథాగా పారుతూనే ఉంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఘాట్ రోడ్డులో సౌర వెలుగులు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభంలోని శ్రీఅనంత పద్మనాభ స్వామివారి కొండపైకి రోడ్డు నిర్మాణం అందుబాటులోకి రావడంతో భక్తుల రాకపోకలు ఒక్కసారిగా పెరిగాయి. భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్డులో ఆదివారం సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ కె.రాంబాబు, ఉత్సవ కమిటీ పిలుపు మేరకు పలువురు భక్తులు ముందుకొచ్చి సుమారు 20 లైట్లు (లైట్లు, స్తంభాలు) వరకు వితరణ చేశారు. దీపోత్సవం నేపథ్యంలో వీటిని ఆదివారం ఏర్పాటు చేశారు. చిమ్మచీకటిగా ఉండే ఘాట్ రోడ్డులో సోలార్ వెలుగు ప్రసరించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహాయంతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ దీపం

## అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన భాగస్వామ్య సదస్సు సందర్భంగా ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి, సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆయా సంస్థలు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం విశాఖ నగరం, జిల్లాలో రూ.150 కోట్ల పైబడి పెట్టుబడితో మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హోటల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని సన్ సంస్థ యోచిస్తోంది. తద్వారా సుమారు 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం ఛైర్మన్ జాస్తి శ్రీకాంత్ ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

## అలరించిన లక్ష దీపోత్సవం

ఆనందపురం, న్యూస్‌టుడే: గంభీరం ఐఐఎం రోడ్డులోని శ్రీ రాధా మదన్‌మోహన్ స్వామి ఆలయ ఆవరణలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత హరేకృష్ణ మూవ్‌మెంట్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్త దాస ఆకాశ దీపం వెలించారు. శ్రీకృష్ణ లీలలను నృత్యరూపకంలో చిన్నారులు హేమ, సాయిల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో యదురాజు దాస, అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

దీపాలు వెలిగిస్తున్న నాట్యకారులు

## బీసీ బాలికల వసతిగృహం సందర్శన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ ప్రాంతంలోని బీసీ సంక్షేమ శాఖకు చెందిన కళాశాలల బాలికల వసతి గృహాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఆదివారం సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థినులు చదువుకోవడానికి అనువైన సదుపాయాలు, వంటశాల నిర్వహణ తీరుతెన్నులు, సిబ్బంది పనితీరు వంటి మౌలిక సదుపాయాల అమలు తీరు అంశాల్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. చక్కటి ప్రణాళికలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువులో రాణించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతతకు యోగాసనాలు చేయాలన్నారు. డీడీ కె.రాజేశ్వరి, ఆర్.కృష్ణారావు, ఎల్.శ్రీలత, సీహెచ్‌వీ.రమణి, శివ తదితర ఆయా విభాగాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

# ఉత్సాహంగా వన సమారాధనలు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకుని సింహాచలం పరిసరాల్లో ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు ఉత్సాహంగా జరిగాయి. సింహాచలం ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని మామిడి తోటలో జరిగిన కళింగ వైశ్య వన సమారాధనలో ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళింగ వైశ్య సామాజికవర్గం అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా సంఘం అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు గెంబలి మధుసూదనరావు, కార్యదర్శి శంకర్రావు, కోశాధికారి గుడ్ల మిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

★ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురంలోని సింహాచలం దేవస్థానం గోశాల ఆవరణలో వన సమారాధన జరిగింది. అటవీ శాఖ విశ్రాంత ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై రసాయన రహిత పంటల ఆవశ్యకతను వివరించారు. సంకల్ప కళాగ్రామం నిర్వాహకులు ఆకుల చలపతిరావు ఆధ్వర్యంలో కట్టెల పొయ్యిపై వండిన వంటకాలతో వనసమారాధన జరిగింది. భారత కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామంలో శ్రీమాత ఆరామ ద్రావిడ బ్రాహ్మణ సేవా సంఘం వనభోజన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన బ్రాహ్మణ కుటుంబాలు 500 వరకు పాల్గొన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. శ్రీమాత ఆరామ ద్రావిడ బ్రాహ్మణ సంఘం పాలకవర్గ సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస శ్రీ ఉమామహేశ్వర దేవాంగుల సంక్షేమ సేవా కార్తిక వన సమారాధన జరిగింది. సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.సూర్యారావు హాజరయ్యారు. విజేతలు పది, ఇంటర్, వైద్య, ఇంజినీరింగు విద్యార్థులకు బహుమతులను అందించారు. సంఘం ఉపాధ్యక్షులు మోర అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మావూరి తౌడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ సాయిరాం కాలనీకి చెందిన కాపు సామాజిక వర్గం వన సమారాధన ఆదివారం నిర్వహించారు. రోజువారి యాంత్రిక జీవనాన్ని విడిచి అంతా కలిసి సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఖండివ గోపాలనాయుడు, వై.ఎస్.మూర్తి, ఎస్.శ్రీనివాసనాయుడు, గంగరాజు, జగదీష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో యువతకు బహుమతులు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పి.గణబాబు, కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

చిన్నారి నృత్య ప్రదర్శన

మధురవాడ శిల్పారామంలో..

కార్యక్రమంలో సాయిరాం కాలనీవాసులు

## బాలల్లో సాహిత్య భాషను పెంపొందించాలి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: బాలలు పుస్తకాల పఠనం ద్వారా సాహిత్యాభిలాషను పెంపొందించుకోవాలని భీమిలి కళాసాహితి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ పేర్కొన్నారు. భీమిలి గ్రేడ్.1 శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాహిత్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వై.ఎస్.వి.ప్రసాదరావు మాట్లాడారు. గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## సందడిగా రుషికొండ బీచ్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌కు కార్తికమాసం నేపథ్యంలో ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు విచ్చేయడంతో సందడి వాతావరణం నెలకొంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిల్లాపాపలతో విచ్చేసిన వీరు మత్స్యరాశుల పార్కు, మెరైన్ పోలీసు టవర్, అటవీభూములు వంటి ఆహ్లాదకర ప్రదేశాల్లో ఆనందోత్సాహాల నడుమ వన భోజనాలు ఆచరించారు. సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ మెరైన్ పోలీసులు, ఏపీటీడీసీ బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు ప్రచారమాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

## హోమియో వైద్య శిబిరానికి స్పందన

భీమునిపట్నం: భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హోమియో వైద్య శిబిరం విజయవంతమైంది. ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు డా.జగన్నాథరావు, డా.మోహనరావు అక్కడకు వచ్చిన 95 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రతినిధులు కె.చంద్రశేఖర్, కె.బి.భానోజీరావు, సభ్యులు వి.తాతాజీ, ఎం.శంకర్, జి.రాము పాల్గొన్నారు.

## సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్: సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజేశ్వరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఎంవీపీకాలనీ స్టడీసర్కిల్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు.

(c) eenadu

# విశాఖ తూర్పు

## పర్యాటక ప్రదేశాలకు సందర్శకుల తాకిడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కార్తిక మాసం ఆఖరి ఆదివారం కావడంతో నగరంలోని పర్యాటక ప్రదేశాలకు సందర్శకుల తాకిడి అధికంగా కనిపించింది. కైలాసగిరికి ఎక్కువ మంది సందర్శకులు వచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 1200 మంది రోప్‌వే ద్వారా వచ్చారని వెల్లడించారు. తెన్నేటిపార్కు, ముడసర్లోవ పార్కులలో వనభోజనాలు, ఆట పాటలతో సందడి చేశారు.

కైలాసగిరి శివపార్వతుల విగ్రహాల వద్ద కోలాహలం

## మేమున్నాం.. మీకు తోడుగా

| సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య | పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769 |
|---|---|
| | మద్దిలపాలెం: 9912120229 |

**పెదవాల్తేరు, న్యూస్‌టుడే:** ?: పెదవాల్తేరు చేపలబజారు వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద వెంటాడుతోంది. –గోవిందమ్మ, స్థానికులు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగిస్తాం. –శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

**విశాలాక్షినగర్, న్యూస్‌టుడే:** ?: ఎంవీపీకాలనీ అప్పుఘర్ నుంచి మెడికవర్ ఆసుపత్రి వరకు కొండ ప్రాంతంలో దోమల బెడద అధికంగా ఉంది. –శివకుమార్, ఎంవీపీకాలనీ ✓: వెంటనే సిబ్బందిని పంపి నివారణ చర్యలు చేపడతాం. –బోయిన శ్రీనివాస్, మలేరియా అధికారి

**ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే:** ?: పదోవార్డు ఆదర్శనగర్, నేతాజీనగర్‌లలో మంచినీటి కుళాయిల్లో నీటి ధార చాలా తక్కువగా వస్తోంది. –కనకమహాలక్ష్మి, పొదుపు సంఘం ప్రతినిధి ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –శ్రీనివాస్, ఏఈ

**మద్దిలపాలెం, న్యూస్‌టుడే:** ?: జీవీఎంసీ పరిధి 22వ వార్డు న్యూరేసపువానిపాలెం, సిద్ధార్థనగర్ ప్రాంతాల్లోని కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించడం లేదు. –నరేష్‌కుమార్, సిద్ధార్థనగర్ ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. –శ్రీనివాస్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

### స్పందనకు వందనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధిలోని సుందర్‌నగర్, ఆదర్శనగర్‌లలో వీధి కుళాయిల ద్వారా సన్నటి ధార రావడంతో తాగునీటికి ఆయా ప్రాంతీయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు-మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి తీసుకురావడంతో మంచినీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్ స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరించారు.

## నత్తనడకన పనులు.. తప్పని ఇక్కట్లు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

తూర్పు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ పరిధి 18, 19 వార్డులతో పాటు ఎంవీపీ సెక్టార్లలోని లాసెన్స్‌బే కాలనీ తదితర ప్రాంతాల్లో అసంపూర్తి పనులు, అధ్వాన పరిసరాలతో స్థానికులు సతమతం అవుతున్నారు. ప్రధానంగా ఎంవీపీకాలనీ సెక్టార్-10లోని కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీటి కారణంగా కాలనీవాసులు రాకపోకలకు ఇళ్ల ముందు చెక్క బల్లలు వేసుకుని అవస్థలకు గురవుతున్నారు.

★ కాలువ పనుల కోసం తవ్విన మట్టిని గుత్తేదారుడు తరలించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు.

శ్మశానవాటిక వద్ద యూజీడీ పనుల కోసం తవ్వి వదిలేశారిలా..

★ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. ప్రధానంగా లాసెన్స్‌బే కాలనీ, ఉషోదయ కూడలి-బీచ్‌రోడ్డు మార్గంలో పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

★ సెక్టార్ 11, 12 ప్రాంతాల్లో చెట్ల కొమ్మలకు కేబుల్ తీగలు వేలాడుతున్నాయి. వీటి వల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు వాపోతున్నారు.

ఎంవీపీకాలనీ సెక్టార్-10లోని ఓ రహదారిపై మట్టిదిబ్బలు

★ వీటితోపాటు సెక్టార్-10లోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని సమీప అపార్టుమెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ ఎంవీపీకాలనీ సెక్టార్-10లోని శ్మశానవాటిక వద్ద యూజీడీ కోసం తీసిన గోతులు సక్రమంగా పూడ్చకపోవడం, పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో స్థానికులకు నిత్యం అవస్థలే.

★ లాసెన్స్‌బే కాలనీ, ఎంవీపీకాలనీ, సెక్టార్ 10, 11, 12 ప్రాంతాల్లో కుక్కల బెడద వెంటాడుతోందని, అవి గుంపులుగా దాడి చేస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## భాగస్వామ్య సదస్సు పెట్టుబడిదారుల నమ్మకానికి వేదిక

### ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సుతో ప్రపంచదేశాలు ఏపీ వైపు చూస్తున్నాయని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఈ సదస్సు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. పెట్టుబడిదారుల నమ్మకానికి ఇదో సరైన వేదికగా నిలిచిందని కొనియాడారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల కారణంగా వెనక్కి మళ్లిన పలు కంపెనీలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఈ సదస్సులో ప్రతి జిల్లాకు ప్రాధాన్యం లభించిందని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు స్పష్టమైన ప్రణాళికతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ★ ఈ సదస్సు ఊహించిన దానికి మించి విజయవంతం అయినట్లు వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులతో పెద్ద ఎత్తున ఒప్పందాలు జరిగాయని అన్నారు. జగన్ హయాంలో 'పెట్టుబడి మ్యాప్' నుంచి ఆంధ్రప్రదేశ్ మాయమైందని వ్యాఖ్యానించారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు చేయూత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖపట్నం గూడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యుడు నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులు సమకూర్చిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ సభ్యులు సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

## 'తెలుగు' పరిరక్షణకు ఉద్యమిస్తాం..

కార్పొరేషన్, న్యూస్‌టుడే : తెలుగు పరిరక్షణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని, ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి అన్నారు. తెలుగు భాష పరిరక్షణకు ఇటీవల జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహ దీక్షకు ఆదివారం పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష కోసం సాహితీవేత్తలు, సాహితీ సంస్థల ప్రతినిధులు, కళాకారులు, భాషాభిమానులు ఏకం కావాలన్నారు.

## మయోఫియా వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఎల్వీప్రసాద్ ఐ ఆసుపత్రి సిబ్బంది

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నేత్ర సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని ఎల్.వి.ప్రసాద్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వై.ఎం.సి.ఎ. వరకు చేపట్టిన ఈ ర్యాలీలో మయోఫియా వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఎల్.వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ వైద్యుడు సమీర్‌బాయ్ మాట్లాడుతూ ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలను వివరించారు. పిల్లలు సరిగా చూడలేకపోయినా, బోర్డు మీద అక్షరాలు సరిగా గుర్తించకపోయినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎల్.వి.ప్రసాద్ ఐ ఆసుపత్రి హెడ్ డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ, సిబ్బంది పాల్గొన్నారు.

## శిశువులకు సరైన సంరక్షణ అవసరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఇది కాళీమాత ఆలయ ఆవరణ నుంచి ప్రారంభమై వై.ఎం.సి.ఎ. వరకు కొనసాగింది. ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ బి.వినయ్ మాట్లాడుతూ నెలలు నిండకుండా జన్మించిన శిశువులకు సరైన సంరక్షణ అవసరమని పేర్కొన్నారు. రెయిన్‌బో ఆసుపత్రి జోనల్ డైరెక్టర్ భాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రెయిన్‌బో ఆసుపత్రి సిబ్బంది, తదితరులు

## రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రూపు-5, గ్రూపు-4 బాల, బాలికల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో గ్రూపు-5 బాలికల విభాగంలో ఆర్.జస్విత (ఎన్టీఆర్), బాలుర విభాగంలో టి.జశ్వంత్ (గుంటూరు), గ్రూపు-5 బాలికల విభాగంలో పి.జాహ్నవి (అనంతపురం), వేదాంత్ గౌతమ్ పాంచాల్ (విశాఖ) వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. కృష్ణా జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం ఉదయం వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

**విశాఖ విజేతలు వీరే:** గ్రూపు-4 బాలుర విభాగం 100 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఎం.ఆర్.మురారి వివేక్ (విశాఖ), , 100 మీ. బ్యాక్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్, 200 మీ. వ్యక్తిగత మెడ్లేలో వేదాంత్ గౌతమ్ పాంచాల్ (విశాఖ), 100 మీ. ఫ్రీ స్టైల్‌లో ఎల్.రేయాన్స్ (విశాఖ), ★ బాలికల విభాగం 100 మీ. బ్రెస్ట్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్, 200 మీ. వ్యక్తిగత మెడ్లేలో ఎస్.మన్విత సాయి (విశాఖ), 100 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో వి.అభిఘ్నయ (విశాఖ), ★ గ్రూపు- 5 బాలుర విభాగం 50 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో కె.అనయ్‌రాజు (విశాఖ), 50 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో పి.యువ గణచిట్టి (విశాఖ), 50 మీ. బట్టర్ ఫ్లైలో ఎం.ధ్రువ (విశాఖ), 50 మీ. ఫ్రీ స్టైల్‌లో బి.కేతన్ మిహిర్ (విశాఖ), ★ బాలికల విభాగం 50 మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో వి.గ్రిథిక (విశాఖ), 50 మీ. బ్యాక్ స్ట్రోక్‌లో పి.కింజల్ యాదవ్ (విశాఖ), ఎస్.సంహిత (విశాఖ), 50 మీ. బట్టర్ ఫ్లైలో వి.గ్రీతిక (విశాఖ), 50 మీ. ఫ్రీ స్టైల్‌లో ఎస్.సంహిత (విశాఖ) విజేతలుగా నిలిచారు.

## గిరిజనుల భూములు కాపాడాలి

మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: గిరిజనుల భూములు ఆక్రమణలకు గురవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని బహుజన సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు ఆరోపించారు. బిర్సా ముండా జయంత్యుత్సవాల్లో భాగంగా ఎంవీపీకాలనీ గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి అనేక చట్టాలున్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని వ్యాఖ్యానించారు. గిరిజనులకు విద్య, వైద్యం అందడం లేదని, మౌలిక వసతులు అంతంతమాత్రమేనని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే లింగయ్యదొర, ఎన్.జయరాజ్, కె.లక్ష్మణమూర్తి, బి.పరంజ్యోతి, త్రినాథరావు, అప్పాజీ, పూర్ణిమ, సత్యం పాల్గొన్నారు.

## సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజేశ్వరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసి, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉన్న విశాఖ జిల్లా వాసులు అర్హులన్నారు. ఈనెల 25వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఎంవీపీకాలనీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 94925 69177 నంబరుకు ఫోనులో సంప్రదించాలని కోరారు. ఎంపికైన వారికి విజయవాడలోని బీసీ భవన్‌లో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని అన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## చిత్రలేఖన పోటీలకు స్పందన

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎంవీపీకాలనీ నగర శాఖ గ్రంథాలయంలో ఆదివారం పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని కోరారు. పుస్తకాల ద్వారా విజ్ఞానం పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కేరళలో అయ్యప్ప స్వామి దేవాలయం తలుపులు తెరిచే సందర్భాన్ని పురస్కరించుకుని పదోవార్డు ఎస్ఐజీనగర్ రామాలయంలో అయ్యప్ప భక్తిపీఠం ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. గణపతి గురుస్వామి ఆధ్వర్యంలో భక్తులు పాతడెయిరీఫారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వరకు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాముల శరణు ఘోషతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ ప్రదర్శనలో కోలాటం, తప్పెటగుళ్లు ఆకట్టుకున్నాయి.

## సత్యసాయి దివ్య వ్రతం

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ తోటగరువు ఎర్ని దుర్గమాంబ కల్యాణ మండపంలో ఆదివారం సత్యసాయి దివ్య వ్రతం జరిగింది. భగవాన్ సత్యసాయి బాబా జయంత్యుత్సవాల సందర్భంగా ఈ వ్రత పూజ నిర్వహించినట్లు ఆరిలోవ భజన మండలి సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, తదితరులు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల సభ్యులు, ఆరిలోవ భజన మండలి సభ్యులు, సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

## ప్రజాదర్బార్‌లో నేడు వినతుల స్వీకరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించనున్నట్లు ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## యువతి అదృశ్యం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఓ యువతి అదృశ్యమైనట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. మారికవలస ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువతి చినవాల్తేరులోని తన పెద్దమ్మ ఇంట్లో నివాసముంటోంది. రెండు రోజుల కిందట ఆమె ఉద్యోగ రీత్యా ద్వారకానగర్ వెళ్లి అదృశ్యమైంది. నేటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ పైడయ్య ఆధ్వర్యంలో హెచ్.సి. రత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: డిఫెన్స్ మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. మద్దిలపాలెం వద్ద ఆదివారం ఇద్దరు వ్యక్తులు విదేశీ మద్యం సీసాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు, సిబ్బంది దాడులు నిర్వహించారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన జనార్దన్, గిరిప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎంవీపీ పోలీసులకు అప్పగించారు. సీఐ ప్రసాద్ నిందితులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ఉక్కులో నేడు ధర్నా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు యాజమాన్యం ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సోమవారం ఉదయం 7.45 నుంచి 8.45 గంటల వరకు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ ధర్నాలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వ్యాను బోల్తా: 11 మందికి గాయాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. విశాఖ నగరంలోని ఆరిలోవ కాలనీకి చెందిన పలు కుటుంబాల సభ్యులు, స్నేహితులు 16 మంది విజయనగరం జిల్లా గంట్యాడ మండలం ఎగువ కొండపర్తిలో ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఓ వ్యానులో వెళ్లారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం 4 గంటల సమయంలో తిరిగి బయలుదేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం సమీపంలో జలపాతం చేరువకు చేరే సమయంలో వాహనం బ్రేక్ ఫెయిల్ అయ్యి, అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివప్రసన్న, స్నేహ, ఎల్లమ్మ, రాములమ్మ, శిరీషలకు ఓ మోస్తరు, మిగిలిన వారికి స్వల్పంగా మొత్తం 11 మందికి గాయాలవగా, ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో తలకు గాయమైన శివప్రసన్న, శిరీషలకు స్కానింగు తీసుకోవాలని వైద్యురాలు దివ్య తెలిపారు. వీరంతా వేరే వాహనంలో విశాఖ వెళ్లిపోయారు.

బోల్తాపడిన వాహనం

## డిగ్రీలో ప్రవేశాలకు నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు ఓ ప్రకటనలో తెలిపారు. బీబీఏ ఆనర్స్ (లాజిస్టిక్స్)-61, బీఎస్సీ ఆనర్స్ (ఆర్గానిక్ ఫార్మింగ్)-40, బీఎస్సీ ఆనర్స్ (బయోటెక్నాలజీ)-17, బీఎస్సీ ఆనర్స్ (ఫిషరీస్)-21 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 చెల్లించాల్సి ఉంటుందని, ఇతర వివరాలకు 75691 22173, 99634 42011 నంబర్లకు ఫోనులో సంప్రదించాలని ఆయన కోరారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.మంజుల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు, ఉపాధి కోర్సులు బీఎఫ్ఎస్, బీబీఏ లాజిస్టిక్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రూ.500లు చెల్లించి, దరఖాస్తు చేసుకుని.. ఈనెల 20లోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల విజేత విశాఖ

చింతలపూడి, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థులను చదువులో ముందు నిలపడమే కాకుండా, ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని క్రిసాలిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అండర్-19 నెట్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నియోజకవర్గంలో నిర్వహించడం ఈ ప్రాంతంలోని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతుందన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ జిల్లాల జట్లతో తలపడ్డారు. బాలుర విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా.. తూర్పు గోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా, పశ్చిమగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన విశాఖపట్నం మహిళా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

## జూ ఆదాయం రూ.8.02 లక్షలు

ఎండాడ, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆదివారం విశాఖ జంతు ప్రదర్శనశాల (జూ పార్కు) సందర్శకులతో కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను తిలకించడంతో పాటు ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ రకాల పక్షులు, హంసలు, కోతులు, ఖడ్గమృగాలు, ఏనుగులు, జిరాఫీలు, చింపాంజీలు, పాములు, పులులు సందర్శకులను అలరించాయి. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకున్నారు. చెట్ల కింద, షెల్టర్లలో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. జాతీయ రహదారి ప్రధాన ద్వారం, బీచ్‌రోడ్డులో సాగర్ ద్వారం నుంచి ఆదివారం ఒక్కరోజు 11,099 మంది సందర్శించినట్లు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సందర్శకులతో పాటు లోపలకు ప్రవేశించిన కార్ల ద్వారా రూ.8,02,050 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. సమీప కంబాలకొండ ఎకో టూరిజం పార్కుకు రూ.74 వేల ఆదాయం వచ్చినట్లు రేంజ్ అధికారి శాస్త్రి పేర్కొన్నారు.

## మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఆలయ ఈఓ కె.శోభారాణి ఆధ్వర్యంలో పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్‌వీ.రమణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు సిద్ధం చేశారు. మెయిన్‌రోడ్డులో రీడింగ్‌రూమ్ నుంచి ఆలయం వరకు చలువ పందిళ్లు వేశారు. ఈనెల 21 నుంచి వచ్చే నెల 19 వరకు ఉత్సవాలు జరుగుతాయి. భక్తుల వాహనాల పార్కింగ్‌కు నాలుగు ప్రాంతాలను ఎంపిక చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ హరేంధిరప్రసాద్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలిస్తారని ఈఈ రమణ తెలిపారు.

## బీచ్‌రోడ్డులో 2కె వాక్‌థాన్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.కె.బీచ్ రోడ్డులో 2కె వాక్‌థాన్ నిర్వహించారు. కాళీమాత ఆలయ ఆవరణలో ఉదయం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఆసుపత్రి సిబ్బంది ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. అనంతరం అతిథులకు జ్ఞాపికలు అందజేశారు.

★ సిరిపురం బాలల ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సాయి సునీల్ కిశోర్ మాట్లాడుతూ ఏటా ఎంతో మంది పిల్లలు నెలలు నిండకుండా పుడుతున్నారన్నారు. అలాంటి శిశువుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.



పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి జ్ఞాపిక అందిస్తున్న మెడికవర్ ఆసుపత్రి నిర్వాహకులు


ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

(c) eenadu

# విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

పూజల్లో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం దండుబజార్‌లోని శ్రీ విజయ కనకదుర్గ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో కార్తికమాసం సందర్భంగా ఆదివారం ఉదయం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భాజపా నాయకులు ఆర్.రవికుమార్, నిర్వాహకులు పల్లా చలపతిరావు, కెప్టెన్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వైభవుడి పవిత్రోత్సవాలు

ఎమ్మెల్యేకు వైభవుడి చిత్రపటం అందజేస్తున్న ఈవో ప్రసాద్

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎన్‌జీజీఓఎస్ కాలనీ కుపురద వైభవ వేంకటేశ్వరుడి దివ్యక్షేత్రంలో ఆదివారం పవిత్రోత్సవాల ముగింపు కార్యక్రమం కనులపండువగా జరిగింది. శ్రీవారి నిత్యప్రాబోధిక సేవ, పవిత్రాలంకృత ప్రభాత దర్శనం, విశేషహోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు సమక్షంలో నిర్వహించిన ధ్వజారోహణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వైభవుడిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ వైభవుడి చిత్రపటాన్ని అందజేశారు.

## 'అక్కినేని' అభిమానుల సందడి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సినీ నటుడు అక్కినేని నాగార్జున నటించిన 'శివ' చిత్రం రీరిలీజ్ సందర్భంగా ఆదివారం జగదాంబ థియేటర్ వద్ద అక్కినేని అభిమానులు సందడి చేశారు. బాణసంచా వెలిగించి, కేక్ కట్ చేశారు. పలువురికి మిఠాయిలు పంచారు. అనంతరం జగదాంబ థియేటర్ అధినేత జగదీష్, క్రాంతి పిక్చర్స్ అధినేత రామకృష్ణారెడ్డిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అభిమానుల సంఘం నాయకులు ఎం.రామ, బి.రాము, ఎస్.బాలరాజు, బీవీ.రమణారెడ్డి, ఎన్.బి.రాజు, బి.ఆర్.దాసు తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ అధినేత జగదీష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అభిమానులు

## నిరాశ్రయులకు చేయూత

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : రహదారుల పక్కన జీవనం సాగించే నిరాశ్రయులకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూత ఇచ్చారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు కీర్తి పట్నాయక్ ఆదివారం జ్ఞానాపురం, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ పరిసరాల్లో ఉన్న నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ చేశారు. ట్రస్ట్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ట్రస్ట్ ప్రతినిధి, విశ్రాంత శాస్త్రవేత్త టి.వి.చారి తదితరులు పాల్గొన్నారు.

## మకరవిలక్కు మహోత్సవం

అల్లిపురం, న్యూస్‌టుడే : శబరిమలలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప స్వామి ఆలయం తలుపులు తెరిచిన సందర్భాన్ని పురస్కరించుకుని అల్లిపురంలో మకరవిలక్కు మహోత్సవం నిర్వహించారు. శ్రీ సిరివి నాయక ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కె.రమేష్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని అల్లిపురం, నేరెళ్లకోనేరు, గాంధీ బొమ్మ సమీప వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

## గీతా సారాంశం తెలుసుకోవాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలని శ్రీ గీతా ప్రచార సమితి అధ్యక్షులు చావలి విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం పాతనగరంలోని రాజప్పనాయుడు వీధిలో ఉన్న శ్రీ గీతా భవన్‌లో ప్రచార సమితి ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా విద్యార్థులకు మౌఖిక పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. మొత్తం 200 మంది విద్యార్థులు హాజరుకాగా, నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. సమితి సభ్యులు ఎంవీ.రాజశేఖర్, పి.జగన్‌మోహన్‌రావు, జీవీఆర్.ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యక్షులు విశ్వేశ్వరావు, తదితరులు

## కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

మురళీనగర్, న్యూస్‌టుడే: మానవసేవే మాధవసేవ ఆధ్వర్యంలో జీవీఎంసీ 50వ వార్డు పరిధిలో నిత్యం శ్రమించి కాలనీలను సుందరీకరణ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలకు అవసరమయ్యే నిత్యావసరాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ పాఠశాలల అధినేత ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎస్.భానుప్రకాష్, అధ్యక్షుడు వరప్రసాద్, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాలు 85 శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా ఏటా 1.3 మిలియన్ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన రోడ్డు ప్రమాద బాధితుల స్మృతి దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను అరికట్టగలమని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డీటీసీ ఆర్.సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణం మానవ తప్పిదాలతో పాటు రోడ్డు నిర్మాణ లోపాలు, వాహనం స్థితిగతులు ప్రభావితం చేస్తాయన్నారు. డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ క్షతగాత్రులను సరైన సమయంలో ఆసుపత్రికి తీసుకొస్తే వారిని రక్షించుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి శశికళ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు

## మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఆలయ ఈఓ కె.శోభారాణి ఆధ్వర్యంలో పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్‌వీ.రమణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు సిద్ధం చేశారు. మెయిన్‌రోడ్డులో రీడింగ్‌రూమ్ నుంచి ఆలయం వరకు చలువ పందిళ్లు వేశారు. ఈనెల 21 నుంచి వచ్చే నెల 19 వరకు ఉత్సవాలు జరుగుతాయి. భక్తుల వాహనాల పార్కింగ్‌కు నాలుగు ప్రాంతాలను ఎంపిక చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ హరేంధిరప్రసాద్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలిస్తారని ఈఈ రమణ తెలిపారు.

## రౌడీయిజం చేస్తే చర్యలు తప్పవు

గురుద్వారా, న్యూస్‌టుడే: సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని ద్వారకా పోలీస్‌స్టేషన్ సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లకు సూచించారు. స్టేషన్ ఆవరణంలో ఆదివారం ఉదయం వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రౌడీయిజం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు తప్పవన్నారు. ఎస్సై అసరితాత తదితరులు పాల్గొన్నారు.

## 'తెలుగు' పరిరక్షణకు ఉద్యమిస్తాం..

కార్పొరేషన్, న్యూస్‌టుడే : తెలుగు పరిరక్షణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని, ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి అన్నారు. తెలుగుభాష పరిరక్షణకు ఇటీవల జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహ దీక్షకు ఆదివారం పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు భాష కోసం సాహితీవేత్తలు, సాహితీ సంస్థల ప్రతినిధులు, కళాకారులు, భాషాభిమానులు ఏకం కావాలన్నారు.

నిరసన దీక్షలో పాల్గొన్న సూరి, తదితరులు

## వన భోజనాల సందడి

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధారలో ఆదివారం వనభోజనాల సందడి నెలకొంది. మాధవధార తోటల్లో, ఆలయాల వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలు అసోసియేషన్, మహిళ, యువ, కుల సంఘాలతో పాటుగా, స్థానిక తెదేపా నాయకుడు, సంఘ సేవకుడు మూల రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన భోజనాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు.

## భక్తులకు భిక్ష పెట్టడం మహాపుణ్యం

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రతి రోజూ వేలాది మంది మాలధారణ ధరించిన భక్తులకు అన్న సమారాధన(భిక్ష) నిర్వహించడం గొప్ప విషయమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కొనియాడారు. గతనెల 22 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు పోర్టు ఆసుపత్రి ఎదురుగా జాతీయరహదారి పక్కన ఖాళీ మైదానంలో యెరిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న భిక్ష కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని వడ్డన చేశారు. అనంతరం కమిటీ సభ్యులు, భక్తులు ఆయన్ను సత్కరించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ వేడుక

కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు

మాధవధార, న్యూస్‌టుడే: దాదాపు ఐదున్నర దశాబ్దాల క్రితం వారందరూ కలిసి చదువుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. వారంతా మళ్లీ ఒకే చోట కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధుల్లేవు. వారే మాధవధార పాఠశాలలో 1970-72 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు. ఆదివారం వీరంతా పినగాడి తోటల్లో కుటుంబ సభ్యులతో ఒకచోట కలుసుకున్నారు. ఇక నుంచి ఏటా కలుసుకోవాలని, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులందరినీ ఒకచోటకు చేర్చేందుకు కృషి చేసిన సనపల సత్యనారాయణను పూర్వ విద్యార్థులు అభినందించారు.

### వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యుల వనసమారాధన

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు శివాజీపార్కులో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటలు, క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.ప్రసాద్, పి.వి.సూర్యనారాయణరాజు చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కు సభ్యులు

## భవనం పైనుంచి జారి పడి తాపీమేస్త్రి మృతి

సీహెచ్.శ్రీను (పాతచిత్రం)

మాధవధార, న్యూస్‌టుడే: మూడంతస్తుల భవనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకానినగర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విమాననగర్ రజకుల వీధిలో నివాసముంటున్న చిలకలపల్లి శ్రీను(45), తాపీమేస్త్రి. ఆదివారం ఉదయం కాకానినగర్ వద్ద మూడంతస్తుల బిల్డింగ్ వద్దకు పనికి వెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు పని ముగించుకొని ఇంటికి వెళ్లిపోయాడు. కూలి డబ్బుల కోసం మళ్లీ బిల్డింగ్ వద్దకు వచ్చాడు. రేకులు అందించే పని ఉందని కాంట్రాక్టర్ చెప్పడంతో మూడో అంతస్తులో ఉన్న పరంజి మీదకు వెళ్లి రేకులు అందిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి అమాంతంగా కింద పడిపోయాడు. తలకు, ఎడమ కాలికి తీవ్ర గాయాలవ్వడంతో వెంటనే సహచరులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలియజేశారు. ఎయిర్ పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనుకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

బి.రమాభవాని (పాతచిత్రం)

మాధవధార, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మురళీనగర్‌లో నివాసముంటున్న బుక్కా రమాభవాని(33)కి బి.మురళీశ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. మురళి వృత్తిరీత్యా కారు డ్రైవర్. కన్నవారి ఇంటి నుంచి డబ్బులు తీసుకురావాలని శ్రీనివాస్ తరచూ భవానిని వేధిస్తూ, పలుమార్లు కొట్టడంతో విషయం తల్లికి తెలియజేసింది. వారిద్దరికీ సర్ది చెప్పడంతో కొన్ని రోజులు సక్రమంగా ఉన్నారు. ఆదివారం ఇరువురి మధ్య గొడవ జరగడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భవాని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు చూసి బంధువులు, భర్తకు విషయం తెలియజేయడంతో వెంటనే వారొచ్చి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి నాగవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సాహిత్యంలో సిరివెన్నెలది అందెవేసిన చేయి

సీతంపేట, న్యూస్‌టుడే: సాహిత్యంలో సిరివెన్నెల సీతారామశాస్త్రిది అందెవేసిన చేయి అని సాహితీవేత్త చెరుకువాడ సత్యనారాయణ కొనియాడారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యంపై ప్రసంగించారు. 16వ ఏట రచన మొదలు పెట్టి వ్యాసాలు, గేయాలు రాశారన్నారు. సినిమా కవులకు సాహితీ చరిత్రలో స్థానం ఉండదన్నారు. డి.వి.సూర్యారావు, గండికోట రఘురామారావు, ప్రయాగ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.మంజుల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు, ఉపాధి కోర్సులు బీఎఫ్ఎస్, బీబీఏ లాజిస్టిక్స్, డిజిటల్ మార్కెటింగ్‌లో సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రూ.500లు చెల్లించి, దరఖాస్తు చేసుకుని.. ఈనెల 20లోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

## 'సొంత గనులు కేటాయించాలి'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ.కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబకూడలిలోని సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్లాంట్ పరిరక్షణకు కూటమి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా సత్యసాయి శత జయంతి మహోత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి మహోత్సవాలు మురళీనగర్ భజన మండలి, మాధవధార సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సెక్టార్-8లో ఆదివారం బలరామరెడ్డి, నాగమణి దంపతులు, భజన మండలి సేవా సభ్యులు, దాతల వితరణతో నూతనంగా నిర్మించిన సత్యసాయి ధ్యాన మందిరాన్ని ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. సత్యసాయి మానవాళికి చేసిన మహోపకారం మరువలేనిదన్నారు. అనంతరం 100 మంది అర్చకులకు వస్త్రాలు, నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సేవలో పాల్గొన్న సత్యసాయి భక్తులు







(c) eenadu

# గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

దాతను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

## ఆలయానికి రూ.లక్ష విరాళం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే : గాజువాకకు చెందిన జక్కుల నాగమణి, ఆమె కుటుంబీకులు ఆదివారం మాడుగుల మోదమాంబ అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళంగా అందించారు. తన భర్త నాగేశ్వరరావు జ్ఞాపకార్థం విరాళం అందించామని నాగమణి తెలిపారు. ఆమెను ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఇతర కమిటీ సభ్యులు సత్కరించారు.

## పనులు సరే.. ఇబ్బందులు పట్టించుకోరా..?

రెయిలింగ్ దాటి బయటకు వస్తున్న ప్రయాణికులు

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే: అమృత్ భారత్ పథకంలో భాగంగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. నాలుగో ప్లాట్‌ఫారం వైపు ఉన్న ప్రవేశ ముఖద్వారం తొలగింపు పనుల వల్ల ప్రయాణికులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైలు దిగిన ప్రయాణికులు లగేజీతో పాటు పిల్లలు, దివ్యాంగులు, మహిళలు రెయిలింగ్ దాటుకుంటూ బయటకు రావాల్సిన దుస్థితి

నాలుగో ప్లాట్‌ఫారంవైపు ముఖద్వారం తొలగిస్తున్న దృశ్యం

నెలకొంది. బయటకు వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి తేకుండా ముఖద్వారం తొలగింపు పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం సాయంత్రం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ దువ్వాడలో దిగిన ప్రయాణికులు ప్రహరీ దూకి రోడ్డుకు చేరుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు కంచుమూర్తి ఈశ్వర్ రైల్వే అధికారులకు విన్నవించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా**

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

## 'జోన్' ఏర్పాటుపై జాప్యమెందుకు..?

### అగనంపూడిలో సేవలు ప్రారంభించాలని ప్రజల డిమాండ్

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ పరిధిలో అగనంపూడి కేంద్రంగా కొత్త జోన్ ఏర్పాటు ప్రతిపాదన 'ఓ అడుకు ముందుకు, రెండడుగుల వెనక్కి' అన్న చందంగా తయారైంది. కూటమి ప్రభుత్వం జోన్లపై ఉత్తర్వులు జారీ చేసి రెండు నెలలు గడుస్తున్నా... ఇంతవరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ అంశంపై దృష్టి సారించకపోవడంతో జోన్ ఏర్పాటు సాధ్యమేనా...? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పెదమడకలోని రాజీవ్ కల్యాణ మండపం

**ఇదీ పరిస్థితి..!** నగర శివారు ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ ఏడాది సెప్టెంబరు నెలలో కూటమి ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. నగర పరిధిలో జీవీఎంసీ జోన్ల సంఖ్యను పదికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పాత వాటికి తోడు నూతనంగా భీమిలి, అగనంపూడి జోన్‌లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

✦ జీవీఎంసీ 77, 78 వార్డులతో పాటు అగనంపూడి ప్రాంతంలోని 79, 85 వార్డులను స్థానికంగా ఏర్పాటయ్యే జోనల్ కార్యాలయం పరిధిలోకి తీసుకొచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నిర్ణయాన్ని స్థానిక నాయకులు, ప్రజలు స్వాగతించారు.

**కార్యాలయం ఎక్కడ..?** అగనంపూడి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించగానే జోనల్ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తారన్న విషయమై చర్చలు సాగాయి. పెదమడక కూడలిలోని రాజీవ్ కల్యాణ మండపం అందుకు అనుకూలంగా ఉంటుందని స్థానికులు సూచించారు. విశాలమైన భవనం, వాహనాల పార్కింగ్‌కు తగినంత స్థలం ఉన్నందున, కొద్దిపాటి మార్పులతో పాటు సేవలు ప్రారంభించొచ్చని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. జోనును ఇప్పటివరకు ఆ భవనాన్ని ఎవరూ పరిశీలించకపోవడం గమనార్హం.

**ప్రజలకు తప్పని అవస్థలు** స్థానికంగా కార్యాలయం లేకపోవడంతో అగనంపూడి, లంకెలపాలెం, మంత్రిపాలెం, ఏడుమెట్ల మర్రిపాలెం, దేశపాత్రునిపాలెం, ఉక్కునగరం, అప్పికొండ, పాలవలస ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి పన్ను చెల్లింపు, పారిశుద్ధ్యం నిర్వహణ సేవలు, నీటి సరఫరా, భవన నిర్మాణాల అనుమతులు, ఇతర సేవలకు నిత్యం గాజువాక కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. వెంటనే కార్యాలయం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సీఐఐ సదస్సుతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడంతో రాష్ట్రంలో అభివృద్ధిలో మరింత దూసుకుపోతుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఈ మేరకు ఆయన గోపాలపట్నంలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ విధానాలకు భయపడి వెళ్లిపోయిన కంపెనీలు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై, ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో తిరిగొస్తున్నారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గణబాబు

## ఉత్సాహంగా వనసమారాధన

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కునగరంలోని ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఉక్కునగరం దేవాలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనను ఉక్కు డైరెక్టర్(కమర్షియల్) జి.వి.ఎన్.ప్రసాద్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఉక్కునగరం పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 10 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఉక్కు అయ్యప్ప ఆలయంలో మహా పడి పూజ

ఉక్కునగరం, న్యూస్‌టుడే: ఉక్కు నగరం అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అయ్యప్ప స్వామి పడి మెట్ల మీద జ్యోతులు వెలిగించి భక్తులు హారతి అందజేశారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ బృందం(రేవడి) భక్తి గీతాలు ఆలపించారు. ఉక్కునగరం పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్.రావు, టి.ఎస్.ఎన్.రావు, బీకేడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**● బాధితులకు సాయం అందజేత**

సింధియా(శ్రీహరిపురం), న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం శాంతినగర్ కాలనీలో జరిగిన అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ఆదివారం స్థానిక తెదేపా కార్యకర్తలు సాయం అందజేశారు. కాలనీలో బాధితులైన గరి రమణ, పైల సత్తిబాబులను టీఎన్‌టీయూసీ నాయకులు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున, అలాగే పాతిక కేజీల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసరాలను అందించారు. మాజీ కార్పొరేటర్ పూడి విజయభాస్కర్ తన వంతు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎం.శంకర్, వి.హరి, తదితరులు పాల్గొన్నారు.

**● ఉక్కులో నేడు ధర్నా**

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు యాజమాన్యం ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ సోమవారం ఉదయం 7.45 నుంచి 8.45 గంటల వరకు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ ధర్నాలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

**● ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం**

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్, మెయిన్స్) పరీక్షల ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసి, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉన్న విశాఖ జిల్లా వాసులు అర్హులన్నారు. ఈనెల 25వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఎంవీపీకాలనీలోని స్టడీసర్కిల్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 94925 69177 నంబరులో సంప్రదించాలని కోరారు.

**● సంఘం వార్షికోత్సవం**

కరాస, న్యూస్‌టుడే: మిలటరీ ఇంజినీరింగ్ ఆల్ కేడర్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎంఈఎస్‌పీడబ్ల్యూఏ) 4వ వార్షికోత్సవం ఆదివారం ఉదయం 52వ వార్డు మల్కాపురం పుదలో ఉన్న గ్రీన్‌వ్యాలీ లేఅవుట్ పార్కులో నిర్వహించారు. ఈ సేవల్లో 75 సంవత్సరాలు నిండిన 170 మంది మహిళ, పురుష విశ్రాంత ఉద్యోగులకు మాజీ ఎమ్మెల్యే తిప్పల శ్రీధర్ చేతులమీదుగా సన్మానించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెల్పీ వారెన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**● కార్మికుడి అనుమానాస్పద మృతి**

సింధియా, న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు కాంట్రాక్టు కార్యాలయంలో పని చేస్తున్న ముంతాజ్ ఆలం(32) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనపై ఆదివారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలిలా.. బిహార్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన ముంతాజ్ స్థానిక శ్రీనాథపురంలో అద్దెకు నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయమైనా తలుపు తీయలేదు. ఇంటి యజమానులు కిటికీలోంచి చూడగా పడి ఉండటం కనిపించింది. ఆమె సమాచారంతో ఎస్సై నరసింగరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దీని సీఐ గొలగాని అప్పారావు పర్యవేక్షించారు.

**● గ్రంథాలయాలను ఆధునీకరించాలి**

కూర్మన్నపాలెం(గాజువాక), న్యూస్‌టుడే: గ్రంథాలయాలను ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కవి, రచయిత సుందర చలపతి రావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం హైస్కూలు రోడ్డులోని గాజువాక గ్రంథాలయంలో సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పౌర హక్కుల నేత టి.శ్రీరామ్మూర్తి, సామాజిక కార్యకర్త వీఎస్ నర్సింహం, గ్రంథాలయాధికారిణి బి.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. ✦పెదగంట్యాడలోని గ్రంథాలయంలో కవితా గోష్ఠి జరిగింది. సాహిత్య సుధ వ్యవస్థాపకుడు రామచంద్రరావు మాట్లాడారు. మల్కాపురం, న్యూస్‌టుడే: షిప్‌యార్డు కాలనీ గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

## భాజపాలోకి 'దామా' చేరిక

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 86వ వార్డు వైకాపా ఇన్‌ఛార్జిగా ఉన్న దామా సుబ్బారావు ఆ పార్టీకి రాజీనామా చేసి భాజపాలో చేరారు. నగరంలోని భాజపా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా భాజపా అధ్యక్షుడు పరశురామరాజు సమక్షంలో భాజపాలో చేరారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని తనకు ఏ బాధ్యత అప్పగించినా సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సుబ్బారావు చెప్పారు.

## భవన నిర్మాణానికి శంకుస్థాపన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని నూకాంబిక ఆలయ ప్రాంగణంలో సామాజిక భవన నిర్మాణానికి ఆదివారం కార్పొరేటర్ జి.శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సామాజిక భవన నిర్మాణానికి రూ.15 లక్షల జీవీఎంసీ నిధులు వినియోగిస్తున్నామన్నారు. వార్డు నాయకులు అప్పలరాజు, వెంకట్రావు, జి.రమణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

అక్కిరెడ్డిపాలెం(బీహెచ్‌పీవీ), న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. ఆదివారం ఆమె గ్రామ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఏసియన్ పెయింట్స్ గోదామును ఆనుకుని ఉన్న ప్రధాన డ్రైనేజీని, ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన జిమ్, క్రీడా పరికరాలు, ఇతర ప్రాంతాల్లో కాలువలను పరిశీలించారు. ఆయా సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, వి.చిట్టిబాబు, అవినాశ్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## భగవాన్ బిర్సాముండా జయంతి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు నగరంలోని చోటా నాగ్‌పూర్ వాసుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉక్కు జీఎం(హెచ్‌ఆర్) ఎం.మధుసూదనరావు, గనుల విభాగం హెచ్‌ఓడీ ఆర్.రవీంద్రబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగిల్, జమీన్, సంస్కృతి కోసం పోరాడిన మహోన్నత యోధుడు బిర్సా ముండా అని కొనియాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో చోటా నాగ్‌పూర్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు అరబింద్ గర్‌గాయ్, రూబెన్ కండూల్నా, రవీంద్ర ముండా, కుందన్ మరాండీ, అనిల్ కెరకెట్టా, సుబోధ్ హోరో, డామినిక్ లుగున్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉక్కు అధికారులు

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే : షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక మాస ద్వాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి పూజ

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే : బీహెచ్‌పీవీ కూడలి ప్రసన్నగిరిపై ఉన్న బాల వినాయక ఆలయంలో ఆదివారం లక్ష్మీ గణపతి పూజ నిర్వహించారు. హస్తా నక్షత్రం సందర్భంగా దోసకాయలతో నిర్వహించిన పూజలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## 'సత్యసాయి' సేవలు అభినందనీయం

కూర్మన్నపాలెం(పెదగంట్యాడ), న్యూస్‌టుడే : సమాజంలో సత్యసాయి ట్రస్టు చేపడుతున్న సేవలు అభినందనీయమని సీపీ శంఖబ్రతబాగ్చీ అన్నారు. ఆదివారం పెదగంట్యాడ సమీప వెంపల్లినగర్‌లో పెదగంట్యాడ సమితి, వెంపల్లినగర్ భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ చేతుల మీదుగా పేదలకు నిత్యావసర సరకులు అందించారు. నిర్వాహకులు శంకర్ సాయిరామ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ వంశీరెడ్డి, ప్రతినిధులు బాబూరావు, కొండబాబు పాల్గొన్నారు.

సరకులు అందజేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ, నిర్వాహకులు శంకర్ సాయిరామ్, తదితరులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే : సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉక్కునగరానికి చెందిన సేవా సమితి సభ్యులు అచ్యుతాపురం దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించారు. కన్వీనర్ రామకృష్ణరాజు, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత డైరెక్టర్ కె.ఎస్.రావు ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువైన దుస్తులు అందించారని పాఠశాల నిర్వాహకుడు పట్నాయక్ తెలిపారు.

## నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గాజువాక, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి సంగీత, నృత్య పోటీల్లో గాజువాకకు చెందిన కళారాధన సంస్థ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇటీవల తిరుపతి వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీజన్-12 రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 162 మంది కళాకారులు పాల్గొన్నారు. కళారాధన విద్యార్థులు 31 మంది హాజరవగా, 26 మంది ప్రతిభ చూపి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ప్రతిభ చూపిన వారిని ఆదివారం గాజువాకలో పలువురు అభినందించారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న కళాకారులతో సంస్థ ప్రతినిధులు

## నూతన కార్యవర్గం ఎన్నిక

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: శివ జ్యోతి నివాసితుల సంక్షేమ సంఘం కొత్త కార్యవర్గాన్ని ఆదివారం రాజీవ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాసరావు, కార్యదర్శిగా పరిటాల శ్రీనివాసరావు, ఉపకార్యదర్శిగా ఆకెళ్ల కృష్ణారావు, సంయుక్త కార్యదర్శులుగా దండు పెద్దిరాజు, ఎ.రఘురామ్, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరాజు, మహిళా కార్యదర్శిగా కంచర్ల శ్రీవాణితో పాటు మరో 19 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధితో పాటు పచ్చదనం, పరిశుభ్రతకు పరస్పర సహకారంతో ముందుకెళ్తామని వీరు తెలిపారు.

మాట్లాడుతున్న సంఘం ప్రతినిధి

## రైతుబజార్ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం రైతుబజార్ అభివృద్ధికి కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎలమంచిలి అపర్ణ, కమిటీ సభ్యులతో కలిసి ఆయన స్థానిక రైతుబజార్‌ను ఆదివారం సందర్శించారు. గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి అత్యవసర వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రైతుబజార్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బజార్ మార్గంలో రద్దీ నియంత్రణకు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అన్నక్యాంటీన్‌కు ఆనుకుని ఇరువైపులా దుకాణాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. మార్కెట్‌శాఖ డీడీ శ్రీనివాస్‌కిరణ్, కమిటీ వైస్ ఛైర్మన్ ఎం.చంద్రశేఖర్, ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, కొత్తపాలెం వీపీసీఎస్ ఛైర్మన్ బి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

## వైభవంగా శివపార్వతుల కల్యాణం

కూర్మన్నపాలెం(పెదగంట్యాడ), న్యూస్‌టుడే: నెల్లిముక్కులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు తరలిరావడంతో ప్రాంగణం సందడిగా మారింది. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, రమణారెడ్డి దంపతులు అన్న సమారాధన ప్రారంభించారు. స్థానిక నాయకులు జి.మహేష్‌రెడ్డి, అప్పలరెడ్డి, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

నెల్లిముక్కులో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

## భవనం పైనుంచి జారి పడి తాపీమేస్త్రి మృతి

మాధవధార, న్యూస్‌టుడే: మూడంతస్తుల భవనం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకానినగర్‌లో చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి. విమాననగర్ రజకుల వీధిలో నివాసముంటున్న చిలకలపల్లి శ్రీను(45), తాపీమేస్త్రి. ఆదివారం ఉదయం కాకానినగర్ వద్ద పనికి వెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు పని ముగించుకొని ఇంటికి వెళ్లిపోయాడు. కూలి డబ్బుల కోసం మళ్లీ బిల్డింగ్ వద్దకు వచ్చాడు. రేకులు అందించే పని ఉందని కాంట్రాక్టర్ చెప్పడంతో మూడో అంతస్తులో ఉన్న పరంజి మీదకు వెళ్లి రేకులు అందిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలవ్వడంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలియజేశారు.

## ఆలయాల్లో అన్నసమారాధన

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా ఆదివారం పలుచోట్ల అన్న సమారాధనలు ఘనంగా జరిగాయి. గోపాలపట్నంలోని శ్రీచంద్రమౌళీశ్వర దేవస్థానంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, జీవీఎంసీ 89వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ 92వ వార్డు ఆర్.ఆర్.వి.పురం శివాలయంలో జరిగిన అన్నసమారాధనలో పశ్చిమ జనసేన నాయకులు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా వడ్డించి నిర్వాహకులను అభినందించారు.

ఎల్లపువానిపాలెంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

## గీత దాటితే చర్యలు తప్పవు

సింధియా, న్యూస్‌టుడే: రౌడీషీట్ ఉన్న వ్యక్తులెవరైనా చట్ట నిబంధనల మేరకు గీత దాటితే చర్యలు తప్పవని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీట్ ఉన్న వ్యక్తులకు నిర్వహించిన అవగాహనలో ఆయన మాట్లాడారు. పాత పరిచయాలతో అసాంఘిక కార్యక్రమాల వైపు వెళ్లొద్దని హితవు పలికారు. మంచి జీవితంవైపు నడుచుకుంటే సమాజంలో తిరిగి మంచిగా గుర్తింపు పొందవచ్చని చెప్పారు.

రౌడీ షీటర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ గొలగాని అప్పారావు

## నేవీ పాఠశాలల్లో ప్రత్యేక బోధనకు చర్యలు

సింధియా, న్యూస్‌టుడే: నౌకాదళ పాఠశాలల్లో సాగించే బోధనా పద్ధతులను మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు తీసుకుంటామని నేవీ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ వైస్ అడ్మిరల్ సీఆర్ ప్రవీణ్ నాయర్ అన్నారు. ఇటీవల ఈస్టర్న్ నేవల్ కమాండు స్థాయిలో జరిగిన సమీక్షలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యంగా మిషన్ కార్యకలాపాలను ప్రణాళికల ద్వారా అమలు చేస్తున్న తీరుపై కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. సమీక్షలో యాజమాన్య సలహా సంఘం (ఎంఏసీ), అకాడమిక్ సలహా సంఘం (ఏఏసీ) ప్రతినిధి కమొడోర్ ఎస్ఎం ఉరూజ్ అత్తర్ తదితరులు తమ సలహాలు, సూచనలను అందజేసినట్టు నేవీ వర్గాలు తెలిపాయి.

నేవల్ ఎడ్యుకేషన్ సొసైటీ సమీక్షలో మాట్లాడుతున్న సీఆర్ ప్రవీణ్ నాయర్

(c) eenadu

## మెరుపై సాగారు.. మేటిగా నిలిచారు

బరువు ఎత్తుతున్న మణికంఠ

నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు యూత్, జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను విజయనగరం జట్టు కైవసం చేసుకుంది. ద్వితీయస్థానంలో కడప, తృతీయస్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. మన క్రీడాకారుల్లో మణికంఠ తదితరులు రాణించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మంనాయుడు, కార్యదర్శి చల్లా రాము, అంతర్జాతీయ క్రీడాకారుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

ట్రోఫీ అందిస్తున్న ఎంపీ కలిశెట్టి, కడగల ఆనంద్‌కుమార్ తదితరులు

## జలకాలాటల్లో.. గలగల పాటల్లో

సాలూరు మండలంలోని శిఖపరువు, దళాయివలస గ్రామాల సమీపంలో ఉన్న జలపాతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులు, మిత్రులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడుతూ, పాడుతూ ఆనందంగా గడిపారు. కొందరు అక్కడే వన భోజనాలు చేశారు. నృత్యాలతో అలరించారు. కొందరు సమీపంలో ఉన్న వాగుల్లో జలకాలాటలాడారు. రాళ్ల ప్రాంతం కావడంతో ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## ఆకాశ వీధిలో ఆధ్యాత్మిక రూపం




ఆకాశవీధిలో డ్రోన్లతో ఆధ్యాత్మిక ప్రదర్శన అబ్బుర పరిచింది. విజయనగరం సమీపంలోని రామనారాయణంలో ఈ షో ఆకట్టుకుంది. ఓ ప్రైవేటు కార్యక్రమం సందర్భంగా శనివారం రాత్రి 300 డ్రోన్లతో రామనారాయణం పేరుతో రామధనస్సు, జై శ్రీరామ్, గణేష్, జైహనుమాన్, పరమేశ్వరుడు, పల్లకిలో పెళ్లికూతురు, ఏనుగు మీద పెండ్లికుమార్తె ఊరేగింపు.. ఇలా విభిన్న చిత్రాలు ఆకట్టుకున్నాయి.
– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## లాహిరి.. లాహిరి లాహిరిలో

కార్తీక వన విహారాలతో గంట్యాడ మండలంలోని తాటిపూడి ప్రాంతం సందడిగా మారింది. ఆదివారం వివిధ సామాజిక వర్గాల వారు పెద్దఎత్తున పిక్నిక్‌లు నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈక్రమంలో జలాశయంలో బోటు షికారుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. జెట్టీపై నిల్చుని స్వీయచిత్రాలు తీసుకున్నారు. సమీపంలోని ఎకో టూరిజం కేంద్రాన్ని సందర్శించారు. – న్యూస్‌టుడే, గంట్యాడ

## నెట్‌లో నక్కలు!!

ఇంటికొచ్చి బెదిరించరు.. దారి కాచి దోచేయరు.. కత్తులు, రాడ్లతో వారికి పనే ఉండదు.. పేర్లు.. ఊర్లు తెలియాల్సిన అవసరం లేదు.. రెక్కీ నిర్వహించరు.. ఎక్కడో ఉంటారు.. కానీ క్షణాల్లో రూ.కోట్లలో కాజేస్తున్నారు.. లింకులతో లంకేసి.. యాప్‌లతో మాయచేసి నిలువు దోపిడీ చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. ఉమ్మడి జిల్లాలో గత మూడేళ్లలో రూ.22 కోట్లకు పైగా లాగేశారు. ఇటీవల బొబ్బిలికి చెందిన ఓ ఉపాధ్యాయుడు రూ.22.18 లక్షలు పోగొట్టుకున్నారు. – ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, బొబ్బిలి, నేరవార్తా విభాగం

**గత మూడేళ్లలో ఇలా.. (రూ.కోట్లలో)**

| సంవత్సరం | కేసులు | పోగొట్టుకుంది | ఫ్రీజ్ చేసింది |
|---|---|---|---|
| 2023 | 144 | 5.67 | 0.38 |
| 2024 | 153 | 10.41 | 2.63 |
| 2025 | 83 | 6.17 | 0.61 |

→ ఈ ఏడాది సెప్టెంబరు వరకు..

'2023 నుంచి ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 10 వరకు కోర్టులో ఉన్నాయి. 28 కేసులకు సంబంధించి ఆధారాలు దొరకలేదని ఛార్జిషీట్లు మూసేశారు. మిగిలిన వాటిపై విచారణ సాగుతోంది'

బాధితుల్లో చదువుకున్నవారే ఎక్కువ. యువతతో పాటు ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు, మహిళలు దెబ్బతింటున్నారు. కొందరు ఆలస్యంగా ఫిర్యాదు చేస్తున్నారు. వెంటనే స్పందిస్తే రికవరీకి అవకాశం ఉంటుందని **సైబర్ సెల్ సీఐ శోభన్‌బాబు** తెలిపారు.

### ఇలా చేయొద్దు..

- అనవసరపు లింకులు తెరవద్దు
- ఏపీకే ఫైల్స్‌తో ముప్పు పొంచి ఉంటుంది
- యాప్‌ల వినియోగంలో అప్రమత్తత అవసరం
- డిజిటల్ అరెస్టు లేనే లేదు. ఆ పేరుతో ఎవరైనా కాల్ చేస్తే నమ్మొద్దు
- ఎక్కడా వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీల వివరాలను ఇవ్వొద్దు
- ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దు

ఫిర్యాదు చేయాలంటే.. వెబ్‌సైట్: www.cybercrime.gov.in టోల్‌ఫ్రీ: 1930

## డ్యూటీ కొత్తది.. డేటా పాతది

హోం పేజీలో పాత అధికారిణి పేరు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో జిల్లా అధికారులదే కీలక పాత్ర. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులు తమకు కావాల్సిన సమాచారాన్ని పొందడానికి, ఫిర్యాదులకు ప్రభుత్వ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తుంటారు. నేరుగా కలిసే అవకాశం లేకున్నా అందులో ఉండే నంబర్లను సంప్రదించి మాట్లాడొచ్చని భావిస్తారు.. మీరలా చేశారంటే ఇబ్బంది పడినట్లు.. ఎందుకంటే చాలా వెబ్‌సైట్లలో పాత అధికారుల నంబర్లే దర్శనమిస్తున్నాయి. vizianagaram.ap.gov.in లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇందులో విభాగాధిపతుల పేర్లు, నంబర్లు ఉండాలి. అయితే గతంలో బదిలీపై వెళ్లినవారివే కనిపిస్తున్నాయి.

### వీరు ఇంకా ఉన్నారట..

ప్రస్తుతం బీసీ సంక్షేమాధికారిణిగా, బీసీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడీగా జె.జ్యోతిశ్రీ పనిచేస్తున్నారు. వెబ్‌సైట్‌లో మాత్రం గతంలో పనిచేసిన జి.పెంటోజీరావు కొనసాగుతున్నారు. పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు ఉద్యోగ విరమణ చేసి నెలలు గడుస్తోంది. కానీ ఆయన పేరు కనిపిస్తోంది. డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి మారినా ఇంకా ఉన్నట్లే చూపిస్తోంది. ఉద్యానశాఖ అధికారి జమదగ్ని, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త కె.అప్పారావు, కార్మిక శాఖ ఉప కమిషనర్ సుబ్రహ్మణ్యం, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.పద్మలీల, డీపీవో టి.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, సమగ్ర శిక్షా పీవో ఎన్.ప్రేమ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బి.రామానందం.. ఇలా.. అన్ని విభాగాల అధికారుల స్థానాల్లో పాత వారే ఉన్నారు. దాదాపు 25 మంది వరకు కొత్తవారు చేరినా వారి పేర్లు కానరావడం లేదు.
– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

వెబ్‌సైట్‌లో బదిలీ అయిన అధికారుల పేర్లు

## ఖుషి.. ఖుషీగా

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

స్వయం సహాయక సంఘాలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎలాంటి పూచీకత్తు లేకుండానే స్త్రీనిధి కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా 48 గంటల్లోనే రుణం మంజూరు చేస్తోంది. 129 రకాల జీవనోపాధుల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తోంది. తాజాగా గ్రేడింగ్ రుణం మంజూరు శాతాన్ని పెంచడంతో మరింత లబ్ధి కలగనుంది.

స్త్రీనిధిలో గ్రేడింగ్ రుణం పెంపు

వేల మందికి ఉపయోగం

**మంజూరు ఇలా.. (రూ.లక్షల్లో)**

| గ్రేడ్ | గతంలో | ఇప్పుడు |
|---|---|---|
| బి | 65 | 90 |
| సి | 55 | 80 |
| డి | 45 | 70 |

స్త్రీనిధి రుణంతో ఏర్పాటు చేసిన యూనిట్

**ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఇలా..**
సంఘాలు: 59 వేలు
సభ్యులు: 6.86 లక్షలు
లక్ష్యం: 35,214 మందికి రూ.367.95 కోట్లు
ఇచ్చింది: 22189 మందికి రూ.196.59 కోట్లు

### మార్పులు ఇలా..

సంఘాల లావాదేవీల ఆధారంగా గ్రామైక్య సంఘాలకు ఏ, బి, సి, డి పేరిట గ్రేడింగ్ ఇస్తారు. ప్రతి రెండేళ్లకోసారి మార్పులు జరుగుతాయి. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి రాకతో పరిశీలించి, కొత్త గ్రేడ్‌లు కేటాయించింది. 'ఏ'లో ఉంటే గతంలో ఏడాదికి రూ.75 లక్షల వరకు వచ్చేది. ఇక నుంచి రూ.కోటి వరకు తీసుకోవచ్చు. ఇలా మిగిలిన వాటినీ పెంచారు.

### దృష్టిసారించాల్సిందే..

ఆన్‌లైన్ వ్యవస్థ వచ్చినా.. క్షేత్రస్థాయిలో రుణాలు పక్కదారి పడుతున్నాయి. కొందరు వీవోఏలు వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. వీరికి కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నారు. మరోవైపు తమకు కావాల్సిన వారికే త్వరితగతిన రుణాలు ఇప్పిస్తున్నారని తెలుస్తోంది. విజయనగరం, డెంకాడ, జామి, కొత్తవలస మండలాల్లో జరిగిన ఘటనలపై ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో దృష్టి సారించాల్సి ఉంది.

### రూ.8 లక్షల వరకు..

మరోవైపు సభ్యుల వ్యక్తిగత రుణాన్ని కూడా పెంచారు. గతంలో ఒక్కొక్కరికీ కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు అందించేవారు. ఇక నుంచి ఒక్కో సంఘానికీ రూ.8 లక్షలిస్తారు. దీంతో వాటా పెరగనుంది. తీసుకున్న సొమ్ములో వెయ్యికి రూ.4 చొప్పున(రూ.లక్ష తీసుకుంటే రూ.400) వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తారు. ఒక వేళ లబ్ధిదారు మరణిస్తే మాఫీ చేస్తారు. తీసుకున్న రుణంపై 92 పైసల వడ్డీ పడుతుందని **స్త్రీనిధి విభాగం విజయనగరం ఏజీఎం చిట్టిబాబు** తెలిపారు.

## దాటాలంటే లారీకైనా లబ్‌డబ్

ఈ చిత్రాన్ని చూశారా..? ఎంత భయపెడుతుందో కదా.. అగాధంలా మారిన ప్రాంతం పక్కనే ఉన్న రహదారి మీదుగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకు ముప్పు తప్పదు. డెంకాడ మండలంలోని ఆర్.ముంగినాపల్లి వద్దగల కల్వర్టు కొన్నాళ్ల కిందట కుప్పకూలింది. కొత్త నిర్మాణంలో భాగంగా ఇలా భారీ గుంతలు తవ్వారు. ప్రమాద సూచికలు సైతం పెట్టలేదు. దీని పక్కనే ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ దారిలో రాకపోకలు సాగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని చోదకులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్చరిక బోర్డులు పెడతామని ఆర్‌అండ్‌బీ జేఈ రవికుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, డెంకాడ

## ఒట్టు.. లేదు కిట్టు

ప్రయాణంలో ప్రమాదాలు జరిగినా.. అత్యవసర పరిస్థితి ఏర్పడినా.. అస్వస్థతకు గురైనా వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఆర్టీసీ బస్సుల్లో గతంలో ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చాలా వాటిల్లో కానరావడం లేదు. కొన్నింట్లో పెట్టెలు సైతం పాడయ్యాయి. మరికొన్ని వాహనాల్లో కనిపిస్తున్నా.. ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ బాక్సుల్లో కాటన్ బ్యాండేజీ, దూది, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, టించర్, యాంటీ సెప్టిక్ క్రీం, అయోడిన్ తదితరాలుండాలి. పల్లె వెలుగుల నుంచి సూపర్‌లగ్జరీ వరకు ఎందులోనూ కానరావడం లేదు. ప్రస్తుతం జిల్లాలో 160 బస్సులు తిరుగుతున్నాయి. ఇందులో నిత్యం 65 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు ఆసుపత్రి వారు 200 వరకు కిట్లు ఇచ్చారని, ఇప్పటికే వాటిని కండక్టర్లకు అందజేసినట్లు విజయనగరం డిపో ప్రబంధకుడు జె.శ్రీనివాసరావు తెలిపారు. త్వరలో అన్నింట్లో ఏర్పాటు చేస్తామన్నారు.
– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

ఓ బస్సులో ఖాళీగా..

మరో సర్వీసులో ఇలా..

## అక్రమంగా పొందిన పరిహారం కట్టండి

### 12 మందికి నోటీసులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలంలో జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో అల్యూమినా ప్లాంటు ఏర్పాటుకు జరిపిన భూసేకరణలో 12 మంది అక్రమంగా పొందిన రూ.36.10 లక్షల పరిహారాన్ని వెంటనే చెల్లించాలని తహసీల్దారు శ్రీనివాసరావు అత్యవసర నోటీసులు జారీ చేశారు. ఇవి ఆదివారం కొందరికి అందాయి. 2008 జులై 28న 'ఈనాడు'లో 'ప్రజా ప్రతినిధులకు నజరానా' శీర్షికతో వెలువడిన కథనంతో బినామీల గుట్టు రట్టయింది. దీనిపై జిల్లా అధికారులు స్పందించి సర్వే చేశారు. 12 మంది సాగులో లేకుండానే పరిహారం తీసుకున్నట్లు తేల్చారు. ఈమేరకు ఆర్ఆర్ (రెవెన్యూ రికవరీ) చట్టం కింద వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తహసీల్దారు పేర్కొన్నారు.

## దోచుకోనివ్వకుండా.. దాచుకుందాం

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

దొంగతనాలు.. ఇంకోవైపు మోసాలు.. దోపిడీలు.. ఇలా అన్ని వైపుల నుంచి ప్రజలను ముప్పు వెంటాడుతోంది. సొత్తును సులువుగా ఎత్తుకెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది లాకర్ల వైపు దృష్టిసారిస్తున్నారు. బ్యాంకుల్లో వీటి వినియోగం ఇటీవల కాలంలో అధికమవుతోంది. భద్రతను దృష్టిలో ఉంచుకుని విలువైన నగలు, నగదు, డాక్యుమెంట్లను భద్రపరుచుకుంటున్నారు. మరోవైపు అద్దె రూపంలో బ్యాంకులకు ఆదాయం చేకూరుతోంది.

### బోలెడు అవకాశాలు..

విజయనగరం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కలిపి 29 బ్యాంకుల పరిధిలో 302 శాఖలు పనిచేస్తున్నాయి. సుమారు 20 వేల లాకర్లు ఉన్నట్లు తెలుస్తోంది. డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ తరహాలో ఖాతాదారులకు కొన్ని మెరుగైన సేవలు అందిస్తున్నాయి. సెక్యూరిటీని బట్టి జిల్లా, మండల కేంద్రాల్లో అవకాశం కల్పిస్తున్నాయి. గ్రామీణం పరిధిలో కొంతమేర లాకర్ల సంఖ్య తక్కువే.

లాకరు సదుపాయంతో మేలు

**ఎస్‌బీఐలో ఇలా..** జిల్లాలో ఎస్‌బీఐ శాఖలు ఎక్కువగా ఉన్నాయి. 54 కార్యాలయాలు పనిచేస్తున్నాయి. లాకర్ల సంఖ్య కూడా అధికమే. జీఎస్టీతో కలిపి ఏడాదికి కొంతమేర కడితే అందిస్తారు.

| పరిమాణం | అర్బన్ (రూ.లలో) | గ్రామీణం (రూ.లలో) |
|---|---|---|
| చిన్నవి | 2000 | 1500 |
| మధ్యస్థం | 4000 | 3000 |
| పెద్దవి | 8000 | 6000 |

**వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(రూ.లలో)**

| | |
|---|---|
| చిన్నవి | 500+జీఎస్టీ |
| మధ్యస్థం | 500+ |
| పెద్దవి | 1000+ |

**ప్రధాన శాఖల్లో లాకర్లు..**

| బ్యాంకు | సంఖ్య |
|---|---|
| ఎస్‌బీఐ | 6,500 |
| ఏపీజీవీబీ | 1,055 |
| యూబీఐ | 3,950 |
| డీసీసీబీ | 974 |

### పొందేందుకు నిబంధనలివీ..

- 18 సంవత్సరాలు నిండాలి
- ఖాతా తప్పనిసరి
- ముందుగా వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- మూడేళ్ల అద్దెను ముందుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, తర్వాత ఏడాదికోసారి చెల్లించాలి.
- కొందరికి రాయితీ కల్పిస్తారు.

### ఉపయోగించే విధానం..

★ ఏడాదిలో 12 సార్లు మాత్రమే ఉపయోగించాలి. అంతకు మించితే ఒకసారికి రూ.100 చెల్లించాలి. ఈ మొత్తం బ్యాంకుల వారీగా మారుతుంది.

★ లాకర్ తాళం పోతే నిర్దేశించిన ఛార్జీ, జీఎస్టీ, తాళం ఖరీదును చెల్లించాలి.

★ తెరిచేటపుడు బ్యాంకు అధికారి, లాకర్ హోల్డర్ తప్పనిసరి.

**అధిక భద్రత:** లాకర్ల సదుపాయంతో అధిక భద్రత ఉంటుంది. ఎక్కువ మంది ఉపయోగించుకోవడంతో ఒకప్పటి కంటే డిమాండు ఎక్కువైంది. ఖాళీ ఉంటే ఎవరు మొదట వస్తే వారికే ప్రాధాన్యమిస్తారు. లోపాలకు ఆస్కారం లేకుండా దృష్టిసారిస్తున్నాం. అన్నివర్గాల వారూ సద్వినియోగం చేసుకోవచ్చు.
- రమణమూర్తి, లీడ్‌బ్యాంకు ప్రబంధకుడు

## ఉక్కు కర్మాగారంతో ఉపాధి అవకాశాలు మెరుగు

కేకు కోస్తున్న మంత్రి కొండపల్లి, చిత్రంలో ఎంపీ, కర్రోతు తదితరులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ వేదికగా జరిగిన భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి ఆదివారం సాయంత్రం అశోక్‌బంగ్లాలో కేకు కోశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గుర్ల మండలంలో రూ.వేల కోట్లతో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కానుందని చెప్పారు. దీంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, పరిసర ప్రాంతాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. పరిశ్రమలకు తమ ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేస్తోందన్నారు. రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీధర్, తెదేపా నెల్లిమర్ల మండలాధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జైకొట్టక.. పనులు జరగక

– న్యూస్‌టుడే, పార్వతీపురం, జియ్యమ్మవలస

ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి సుమారు రూ.153 కోట్లున్నాయి. కానీ వినియోగించడం లేదు. దీంతో ఏటా అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. రెండు జిల్లాల్లో జైకా నిధులతో ప్రారంభమైన పనుల్లో స్తబ్దత నెలకొంది. వైకాపా హయాంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. తాజాగా అంచనాలు పెరగడంతో కదలిక లేకుండా పోతోంది.

లైనింగ్ పనులు చేపట్టక అధ్వానంగా వట్టిగెడ్డ కుడి ప్రధాన కాలువ

రూ.153 కోట్లున్నా పారని నీరు

**సాగునీటి లక్ష్యం ఇలా..**

వెంగళరాయ సాగర్ ద్వారా బొబ్బిలి, మక్కువ మండలాల్లోని 24 వేల ఎకరాలకు, వట్టిగెడ్డ ద్వారా జియ్యమ్మవలస, గరుగుబిల్లిలోని 16,684 ఎ., పెద్దగెడ్డతో పాచిపెంట, సాలూరు, రామభద్రపురంలో 12 వేలు, పెదంకలాం ఆనకట్ట నుంచి బలిజిపేట మండలంలోని 9 వేల ఎకరాలకు సాగునీరు అందాలి.

### 30 శాతం పెరుగుదల..

మధ్య తరహా సాగునీటి పథకాల ఆధునికీకరణకు 2019-20 నాటి ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలు రూపొందించారు. అప్పట్లో కొందరు గుత్తేదారులు పనులు చేపట్టారు. ధరలు పెరిగిన నేపథ్యంలో ముందుకు రావడం లేదు. వారిని తొలగిస్తే కొత్తవారికి అప్పగించాలి. ఈమేరకు టెండర్లు పిలవాలి. ఇలాగైతే అదనంగా రూ.30 కోట్ల వరకు అవసరమని భావిస్తున్నారు.

### గుత్తేదారులతో మాట్లాడుతున్నాం

'జలవనరుల శాఖలో పనులు చురుగ్గా సాగే కాలం ఇదే. సంబంధిత గుత్తేదారులతో మాట్లాడుతున్నాం. అన్నీ అనుకూలిస్తే త్వరలోనే ప్రారంభం కావచ్చు' అని **జలవనరులశాఖ ఈఈ డీఎస్.ప్రదీప్** తెలిపారు. ★ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని **మంత్రి జి.సంధ్యారాణి** పేర్కొన్నారు.

**నిధుల వినియోగం ఇలా.. (రూ.కోట్లలో)**

| జలాశయం | కేటాయింపు | ప్రగతి శాతం | పెండింగ్ బిల్లులు |
|---|---|---|---|
| వెంగళరాయసాగర్ | 63.50 | 22 | 8.29 |
| వట్టిగెడ్డ | 44.55 | 15 | 3 |
| పెద్దగెడ్డ | 28.18 | 10 | 1.47 |
| పెదంకలాం ఆనకట్ట | 17.30 | 5 | 0.36 |

(c) eenadu

## నెడితేనే నడుస్తా..

గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గుముఖం పట్టాయి. చల్లదనానికి ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. రాత్రి సమయాల్లో కాంప్లెక్సుల్లో నిలిపి ఉంచిన పలు బస్సులు స్టార్ట్ కావడం లేదు. పాలకొండ ఆర్టీసీ బస్సు నిలయంలో ఆదివారం కనిపించిన పరిస్థితి ఇది. బస్సుల కండీషన్ బాగానే ఉన్నాయని శీతాకాలంలో మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

## వనమంతా సందడి

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: తాటిపూడిలో కార్తిక వనవిహారాల నేపథ్యంలో ఆదివారం పర్యాటకుల తాకిడితో సందడి వాతావరణం నెలకొంది.

● కొప్పలవెలమ సామాజిక వర్గం ప్రతినిధులు వనవిహారంలో పాల్గొని జీబీ అప్పారావు విగ్రహానికి నివాళులు అర్పించారు. వనంలో అంతా ఉత్సాహంగా గడిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

● కళింగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వన విహారం ఉత్సాహంగా జరిగింది. జిల్లా మలేరియా అధికారిణి మణి.. యూనిట్ సభ్యులు, ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ హాజరయ్యారు.

● జల విహారానికి సందర్శకులు పోటీ పడ్డారు. వనవిహారం సందర్భంగా వందలాదిగా వాహనాలు రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

దళాయివలస జలపాతం వద్ద సందర్శకులు

కొప్పల వెలమ సామాజికవర్గం వన విహారానికి హాజరైన ప్రతినిధులు

## సూరీడూ యాడున్నావయ్యా..

జిల్లా మంచుదుప్పటి నుంచి బయటకు రావడం లేదు. గత నాలుగు రోజులుగా చలితీవ్రత పెరిగింది. సాయంత్రం 5 గంటలకే మంచు దట్టంగా పడి చీకటి పడుతోంది.. ఉదయం 8 గంటలైనా వీడడం లేదు. వేపాడలో ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో కనిపించిన చిత్రమిది. – న్యూస్‌టుడే, వేపాడ

## 'హాట్ ఎయిర్ బెలూన్' ఆగింది..

సీతంపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన హాట్ ఎయిర్ బెలూన్‌ను ఆపేశారు. దీన్ని ఏర్పాటు చేసిన తర్వాత పర్యాటకులతో పైకి వెళ్లే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా దీన్ని ఆపేశారు. అనుకూలమైన పరిస్థితులు ఏర్పడితే తిరిగి ప్రారంభిస్తామన్నారు.


**PUBLIC NOTICE**

By this notice I wish to inform general public that my client intends to enter in to Agreement of sale to purchase the below schedule property from Smt Pitta Nagamani, who intern having acquired the property towards her share in an oral family partition. If the said purchase of the below schedule property by my client is objectionable to anybody, such objections like any Claim, Charge, Mortgage, etc., against the below mentioned property may be sent to me in writing clearly indicating of such objection within a WEEK from the date of this publication, else my client will proceed further in entering in to agreement of sale with the above said person, treating that the property is free from encumbrances or claims of charges and that thereafter no claims of whatsoever will be entertained and does not bind my client.

**SCHEDULE**

All that land approximately measuring an extent of Ac 0.15 cents, covered by S.No: 368/6P, Situated at Munjeru Village, Bhogapuram Mandal, Vizianagaram, within the limits of Munjeru Panchayat, and SRO Bhogapuram and bounded by: Boundaries of Property: EAST: B.T.Road; SOUTH: Road; WEST: Property of Pitta Appanna and others; NORTH:Property belongs to Lokam Madhavi

The property is situated well within the above said boundaries.

D.K.V.V.S.ASHWANI KUMAR
B.Com., B.L Advocate,
29-41-12, Opp. to District Court,
Place: Bhogapuram Visakhapatnam-20
Date: 16-11-2025 Mobile no: 9032033945


# ఊరూరా.. విజ్ఞాన వీచిక

చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా పుస్తకాలు కొని చదివే స్తోమత లేక, పోటీ పరీక్షలకు దూరమైన నిరుద్యోగులకు వరంగా మారుతున్నాయి ఈ గ్రంథాలయాలు. వ్యక్తులు, సంఘాలు సంకల్పం పాఠకులకు విజ్ఞాన కాంతులు పంచుతోంది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రజా గ్రంథాలయాలు మరింత మందికి స్ఫూర్తిబాట పరుస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వాటి సేవలపై 'న్యూస్‌టుడే' కథనమిది.



### కుమారుడి పేరిట చదువుల కోవెల

పాలకొండ పట్టణంలో వై.శశాంక్‌రావు మెమోరియల్ గ్రంథాలయం యువతకు అండగా నిలుస్తోంది. సుప్రీం న్యాయవాది ఎలకల రాజగోపాలరావు తనయుడి జ్ఞాపకార్థం 2018లో దీన్ని స్థాపించారు. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఇది తెరిచి ఉంటుంది. పోటీపరీక్షలకు అవసరమైన, పిల్లలు, వృద్ధులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. అంతర్జాల సౌకర్యం కల్పించారు. నిత్యం 50 మంది వరకు యువత వస్తున్నారు. సచివాలయ, ఉపాధ్యాయ, రైల్వే కానిస్టేబుళ్లతోపాటు పలు రంగాల్లో ఇక్కడ చదువుకున్న 27 మంది ప్రభుత్వ కొలువులు పొందారని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

### నిరుద్యోగుల్లో నవోదయం

హర్షరాజుపేటకు చెందిన రాజేశ్వరరావు గ్రూప్-1 పరీక్షల్లో డీఎస్పీగా ఎంపికై ప్రస్తుతం జైళ్లశాఖ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఎన్.శ్రీనివాసరావు ఏఈఈగా, వి.నాగరాజు, ఇ.శ్రీను, బి.గణేష్ ఎస్సైలుగా ఇలా చెబుతూ పోతే పలువురి యువత జీవితాల్లో నవోదయం నింపింది ఈ గ్రంథాలయం. ఇక్కడ సాధన చేసే టీచర్లు, కానిస్టేబుళ్లుగా పలువురు ఎంపికయ్యారు. సాలూరు పట్టణంలోని నవోదయ సేవా సమితి గ్రంథాలయం నిరుద్యోగ యువతకు కొండంత అండగా నిలుస్తోంది. వెలుపేట సీతారామ ధర్మశాల ఆవరణలో ఈ గ్రంథాలయంలో పోటీ పరీక్షలతో పాటు అకడమిక్ పుస్తకాలు అందుబాటులో ఉంచారు. పిల్లల కోసం నిర్వాహకులు ప్రత్యేక పుస్తకాలు తెప్పిస్తున్నారు. సమితి సభ్యులంతా ఒక్కమాటపై ఉండి అవసరమైన పుస్తకాలు సమకూర్చుతున్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

### అవకాశాల వేదిక.. యువశ్రీ

అతను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. తనలాగే నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించేలా సాయపడాలనుకున్నారు. యువశ్రీ పేరిట గరివిడిలో గ్రంథాలయం స్థాపించారు. గరివిడికి చెందిన ఎస్.ఎల్.ఎన్ సతీష్ రత్నగిరి. 'పుస్తకాలను బహుమతిగా ఇవ్వండి.. యువతకు చేయూతనివ్వండి' అనే నినాదాన్ని స్థానికంగా బలంగా తీసుకెళ్లారు. దాతలు వి.గోపి, వి.శ్రీనివాసరావు స్పందించి గ్రంథాలయానికి శాశ్వత భవనాన్ని సమకూర్చారు. సేవలను అక్కడితో ఆపేయలేదు. రోజూ దిన పత్రికల్లో వస్తున్న విద్య, ఉద్యోగ, ఉపాధి సమాచారంతో ఈ-బుక్‌ను రూపొందించి సామాజిక మాధ్యమాల ద్వారా యువతకు అందుబాటులో ఉంచుతున్నారు సతీష్. ప్రతిభా పుస్తకరూపంలో సమకాలీన కరదీపికను తయారు చేసి అందిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల ఖాళీల సమాచారం, జాబ్ మెటీరియల్‌ను ఈ-పుస్తక రూపంలో అందిస్తున్నారు. నిత్యం అయిదు గంటలపాటు ఈ సేవలకు వెచ్చిస్తానని, పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగం సాధించామని పలువురు చెప్పడం ఎనలేని సంతృప్తి ఇస్తోందని సతీష్ చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గరివిడి

### విరాళంతో విజయీభవ

రాజాం మండలం కంచరాం గ్రామంలో యువత స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గ్రామస్థుల సహకారంతో ప్రజా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.15 లక్షలతో భవనాన్ని గతేడాది అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల మరికొందరు దాతలు ముందుకు రావడంతో మరుగుదొడ్లు, ప్రహరీ ఏర్పాటు చేశారు. ఇంకా రూ.7 లక్షలు నిల్వ ఉంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్థులంతా సంక్రాంతికి స్వగ్రామం వస్తుంటారు. ఆ మూడు రోజులూ గ్రంథాలయం కోసం విరాళాలు సేకరిస్తారు. ఇక్కడ సాధన చేసిన 50 మంది వరకు పోలీసు, ఆర్మీ, రైల్వే, బ్యాంకు, టీసీఎస్, సచివాలయం.. తదితర ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం మరో రూ.3 లక్షల విలువైన పుస్తకాలు సమకూర్చనుందుకు నిర్ణయించారు. – న్యూస్‌టుడే, రాజాం

గ్రామంలో విరాళాలు సేకరిస్తున్న యువత

## యూటీఎఫ్ నమూనా పరీక్షకు స్పందన

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ నమూనా ప్రవేశ పరీక్షకు 303 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజయనగరం జిల్లా నుంచి సాయిసుదీప్(75), గంట హనూక్(73.25), మన్యం నుంచి ఎ.వేణుమాధవ్(85), ఎం.సమన్విత(80), కె.రాఘవ(77.5), ఎస్.దామిని(76.25), సీహెచ్.వికాస్(76.25), వి.యశ్వంత్(65) అధిక మార్కులు సాధించారు.

విజేతలతో యూటీఎఫ్ సంఘ నాయకులు

## తూర్పుకాపుల ఆత్మీయ సమ్మేళనం

విజయనగరం మయూరికూడలి/ఉడా కాలనీ, న్యూస్‌టుడే: రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక పరంగా అవకాశం ఉన్నవారు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఆదివారం విజయనగరం శివారు శ్రీనివాసనగర్ వద్ద తూర్పుకాపు ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ సంఘానికి ఎటువంటి అవసరాలున్నా ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, మాజీ మంత్రి పడాల అరుణ, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని, ఏ అవసరమైనా ముందుంటామన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన సంఘ సభ్యులను సన్మానించారు. బాలల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉమ్మడి జిల్లా నుంచి సామాజిక వర్గీయులు కుటుంబాలతో పాల్గొన్నారు.

పాల్గొన్న మంత్రి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, ఎమ్మెల్యే కళా వెంకటరావు తదితరులు


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన కూనంపూడి రామచంద్ర రాజు గారి స్వాధీన సంపూర్ణ హక్కు అనుభవములలో యుండియున్నటువంటిన్ని, దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్థి విషయమై నా క్లయింటు ముదునూరు వెంకట నారాయణ మూర్తి రాజు మీద మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ఐ.ఎ.నెం.157/2024 ఇన్ ఒ.ఎస్.నెం. 13/2024 కేసు వేయగా, దీని నిమిత్తం కోర్టు వారు తే. 20-02-2024 దీన ఏడ్ ఇంటెరిమ్ ఇంజంక్షన్ ఆర్డరు ఇచ్చియున్నారు. దిగువ షెడ్యూలు ఆస్థి విషయమై నాటి నుండి నేటి వరకు నా క్లయింటుకు ఇతరులెవ్వరికి, తనఖాలు గాని, క్రయపురోణిలు గాని, లీజు గాని, ఎప్పుడూ చేయలేదు.

కావున సదరాస్తిని నా క్లయింటుకి తెలియకుండా ఈ ఆస్థిని ఎవరైనా కొనుగోలు చేసిన, లీజుకు తీసుకున్న, తనఖా చేసుకున్న అవి అన్నియు చెల్ల నేరవని, నా క్లయింటును బంధింపజాలవు. అలాగే నా క్లయింటుకు తెలియకుండా ఎట్టి లావాదేవీలు జరిపిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు ఆస్థి వివరములు :

విజయనగరం జిల్లా, మెరకముడిదాం మండలం, మెరకముడిదాం గ్రామం, పట్టా నెం.385, సర్వే నెం.349రులో య. 5.38 సెంట్లు జిరాయితి మెట్టు భూమికి హద్దులు.

తూర్పు : నా క్లయింటు తాలూకా మిగతా భూమి య.4.39 సెంట్లు దక్షిణం: మామిడిపాక స్వాములు, కోరాడ సత్యం మరియు ఇతరుల జిరాయితి భూమి పడమర: లెంక సన్యాసప్పడు, బద్రోతు సూర్యగార్లు మరియు ఇతరుల జిరాయితి భూమి ఉత్తరం: బద్రోతు సూర్య మరియు ఇతరుల జిరాయితీ భూమి మరియు రస్తా

ఇట్లు
కారి గోవిందరాజు, న్యాయవాది
ఫ్లాట్ నెం.102, ఎ.ఎస్.ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ ఉడా ఫేజ్-2, గోపాలరెడ్డినగర్, గాజువాక, విశాఖపట్నం 530026 సెల్ : 99510 21326


## సంక్రాంతికి ధాన్యం కొనుగోలు పూర్తి

గజపతినగరం, న్యూస్‌టుడే: గతంలో లేనివిధంగా ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు నవంబరులోనే ప్రారంభించామని, సంక్రాంతి నాటికి జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం పీఏసీఎస్‌లో ఆదివారం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో డిసెంబరులో ప్రారంభించి సంక్రాంతికి చెల్లింపులు చేయడం గగనంగా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు పాత బకాయిలు రూ.600 కోట్లు చెల్లించామన్నారు. వ్యవసాయ పరికరాలపై రాయితీ సైతం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, ఏఎంసీ, పీఏసీఎస్ అధ్యక్షులు గోపాలరాజు, బంగారు నాయుడు, డీఆర్వో శ్రీనివాస మూర్తి, పౌరసరఫరాల డీఎం శాంతి, డీఎస్‌వో మురళీనాథ్, డీఏవో రామారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్

## వనరులు పెరగాలి.. యాప్‌లు తగ్గాలి
### వైద్య శాఖకు సీఆర్‌ఎం సూచనలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: మన్యంలో వైద్య సేవల పరంగా లోటుపాట్లను కేంద్ర సమీక్షా బృందం(సీఆర్‌ఎం) గుర్తించింది. వాటిని అధిగమించాలని వైద్య శాఖకు సూచించింది. ఆరోగ్య స్వస్థత కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు అన్నిస్థాయిల్లో అందుతున్న వైద్య సేవలపై ఈనెల 3 నుంచి 8 వరకు ఆరురోజులపాటు కేంద్ర సమీక్షా బృందం పరిశీలించింది. మారుమూల ప్రాంతాలను కూడా సందర్శించి, అక్కడి గిరిజన ప్రాంత ప్రజలతో డాక్టర్ దీపికాశర్మ, నీరజ్‌కుమార్, రమణల బృందం నేరుగా మాట్లాడింది. వసతులు, సేవల్లో గుర్తించిన లోపాలను సరిదిద్దాలని సిఫార్సు చేసింది.

● జిల్లాలో ఎక్కువ భాగం గిరిజన ప్రాంతం కావడం వల్ల చాలాచోట్ల అంతర్జాల సేవలు, విద్యుత్తు పంపిణీలో ఇబ్బందులు ఉన్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 284 ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో మెరుగైన సేవలు అందేందుకు వీలుగా 'సౌరశక్తి'ని వినియోగించి విద్యుత్తు ఉత్పత్తి చేసే వ్యవస్థలు ఏర్పాటు చేయాలి.

● క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది పనిలో లెక్కకు మించిన 'యాప్'లు వినియోగించాల్సి వస్తోంది. 'యాప్'లు ఏకీకృత విధానంలో రూపొందించి అమలు చేస్తే పని సులభతరం అవుతుంది.

● సచివాలయాల్లో ఆరోగ్య కార్యకర్తలు ఉన్నప్పటికీ వారిపై వైద్య ఆరోగ్య శాఖకు పరిమితమైన అధికారాలు మాత్రమే ఉన్నాయి. సేవలు అందని పరిస్థితి ఉంది. శాఖకు పూర్తి స్థాయి అధికారాలు ఉండాలని సూచించింది.

● జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖకు ఉండాల్సిన వ్యవస్థీకృత వనరులు ఏవీ లేవు. ఔషధ పంపిణీ కేంద్రం (సెంట్రల్ డ్రగ్ స్టోర్), టీకాలు భద్రపరిచేందుకు 'కోల్డ్ లింకేజీ సిస్టమ్' ఏర్పాటు చేయాలి.

● క్షేత్రస్థాయిలో ఆరోగ్య, వైద్య కార్యక్రమాల అమలులో భాగస్వాములవుతున్న వారికి సమగ్ర అవగాహన లేదు. ఇందుకోసం కార్యక్రమాలు రూపొందించాలి.

● జిల్లాలో క్షయ విముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న 'నిక్షయమిత్ర'ల సంఖ్యను పెంచాలి. అవసరమైతే కార్పొరేట్ సామాజిక బాధ్యతగా కొందరిని దత్తత తీసుకొనేలా చూడాలి.

వైద్య సేవలపై కేంద్ర సమీక్షా బృందం సమావేశం (పాత చిత్రం)

### సానుకూల సూచనలిచ్చారు

సీఆర్‌ఎం బృందంసానుకూల సూచనలిచ్చింది. వాటిని రాష్ట్రస్థాయి సమావేశంలోనూ ప్రస్తావించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డా.భాస్కరరావు,డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

## చట్టాలపై అవగాహన పెరగాలి

భోగాపురం, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఆదివారం మండలంలోని నందిగాం పంచాయతీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టం, న్యాయం దృష్టిలో అంతా సమానమేనని.. అందరికీ ఉచిత సేవలు అందించాలనే లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఎల్‌ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గయ్య, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె.విజయలక్ష్మి, సీనియర్ సివిల్ జడ్జి బి.లక్ష్మీకుమారి, సీఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

పంచాయితీ అప్రూవల్ 30x50 సైజు బిట్స్ చ||గ|| 5500 పార్వతీపురం మం|| నర్సిపురం గ్రామ పంచాయితీ కారాడపలసలో సైట్స్ సేల్ ✆ 8331852489.

గజం 5,500 రూ. మాత్రమే. 100 అడుగుల రోడ్‌ని ఆనుకొని NH16 రణస్థలంకి కేవలం 7KM 133 గజాలు 7,50,000 మాత్రమే. ✆ 8978679512.

JOBS

JOB OPPORTUNITY
for Retd, Officials Best Opportunity
★ PROPERTY ADVISING CHIEF MANAGERS
for Vizag and Vizianagaram
Prefer State, Central Teachers-Banking Govt/ Private Factories any Job Exp., any Degree- Housewives-full/ Part time
Age: 34+years
Monthly Package : 85,000/- Including Incentives (T&C Apply)
Interviews on : 17th, 18th, 19th Nov25
Con: Dr.SANJEEVA RAO
SEETHAMMADHARA-VSP
Ph: 9989245662

VZM 90రోజులు ఉచితంగా Electronics & Hardware సెక్టార్‌లో ట్రైనింగ్‌తో పాటు ఉద్యోగం కల్పించబడును. SSC (పాస్), ఇంటర్, డిగ్రీ, ITI (పాస్ / ఫెయిల్) Age 18 to 35 Cont: 7036406699, 9493359472.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099, 85208 74499.

ప్రముఖ సంస్థలో పనిచేయుటకు డ్రైవర్స్ జీ:15,000 to 18,000 హెల్పర్స్12k to15k ఆఫీస్‌బోయ్ 8,000/- టెలికాలర్స్:7k to 10k ✆: 6305450460.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609


## కొఠియా సమస్య పరిష్కరించండి
### ఒడిశా సీఎంను కోరిన మంత్రి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: ఆంధ్రా ఒడిశా సరిహద్దు కొఠియా వివాదాస్పద గ్రామాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కోరినట్లు గిరిజన శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన బిర్సా ముండా జయంతి వేడుకలకు ఒడిశా సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పలు సమస్యలపై చర్చించామన్నారు. 50 ఏళ్లుగా డోలియంబ, ముడకారు, కొఠియా, దిగువశెంబి, ఎగువశెంబి తదితర గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందినవో నిర్ధారించలేదు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, వైద్య సేవలు అందించేందుకు వెళ్లినా ఆంధ్రా సిబ్బందిని ఒడిశా అధికారులు అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారని ఒడిశా సీఎంకు వివరించామన్నారు.


ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237


## వీరఘట్టంలో చోరీ

వీరఘట్టం, న్యూస్‌టుడే: పట్టణంలో శనివారం రాత్రి జరిగిన ఆభరణాల చోరీపై పాలకొండ డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాదరావు క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌లతో ఆదివారం పరిశీలన చేశారు. టంగుడు నరసింహమూర్తి ఇంటికి తాళం వేసి భార్యతో కలసి స్థానికంగా జరుగుతున్న అయ్యప్పస్వామి ప్రతిష్ఠ మహోత్సవానికి వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న ఆభరణాలు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 తులాల బంగారం, 20 తులాల వెండి చోరీ జరిగినట్లు కేసు నమోదు చేశామని ఎస్సై జి.కళాధర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## యువకుల అతివేగం.. అనర్థం
### కారు అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అతివేగంతో ఓ కారు.. రోడ్డు దాటుతున్న మనిషిని ఢీకొట్టి.. .రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి ఎక్కింది. ఈ ఘటన ఆదివారం అశోక్ నగర్ సమీపంలో చోటుచేసుకుంది. కొత్తపేట-రింగురోడ్డు మీద అతివేగంగా వెళ్తున్న కారు అశోక్‌నగర్ మలుపు వద్ద రోడ్డు దాటుతున్న నర్సింహులు అనే వ్యక్తిని ఢీకొట్టింది. వాహన బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న యువకుడు, పక్కన మరో యువకుడు ప్రాణాలతో బయటపడ్డారు. నర్సింహులు రెండు కాళ్లూ బాగా దెబ్బతినడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

## వ్యాను బోల్తా: 11 మందికి గాయాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం. . విశాఖ నగరంలోని ఆరిలోవ కాలనీకి చెందిన పలు కుటుంబాల సభ్యులు, స్నేహితులు 16 మంది విజయనగరం జిల్లా గంట్యాడ మండలం ఎగువ కొండపర్తిలో ఉన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఓ వ్యానులో వెళ్లారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం 4 గంటల సమయంలో తిరిగి బయలుదేరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం సమీపంలో జలపాతం చేరువకు చేరే సమయంలో వాహనం బ్రేక్ ఫెయిల్ అయ్యి, అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివప్రసన్న, స్నేహ, ఎల్లమ్మ, రాములమ్మ, శిరీషలకు ఓ మోస్తరు, మిగిలిన వారికి స్వల్పంగా.. మొత్తం 11 మంది గాయపడ్డారు. వీరిని ఎస్.కోట ప్రాంతీయా సుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరంతా వేరే వాహనంలో విశాఖ వెళ్లిపోయారు.

బోల్తాపడిన వ్యాను

తలకు గాయమైన శిరీష

## చలి తీవ్రతకు వృద్ధుడి మృతి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: చలి తీవ్రతకు తట్టుకోలేక వృద్ధుడు మృతి చెందిన ఘటన ఎస్.కోట మండలం కురిడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గిరిజన సంఘం నాయకుడు గౌరీష్, స్థానికుల వివరాల ప్రకారం.. దారపర్తి పంచాయతీలోని కురిడి గ్రామానికి చెందిన మజ్జి తమ్మన్న(60) చలికి తట్టుకోలేక చనిపోయారు. గిరిశిఖర గ్రామాల్లో మంచు కురుస్తోంది. ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోవడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. కలెక్టర్లు స్పందించి రగ్గులు, దుప్పట్లు గిరిజన ఉప ప్రణాళిక ద్వారా అందజేయాలని నాయకులు కోరారు.

తమ్మన్న (పాత చిత్రం)

**చికెన్ ధరలు**

| రకం | బ్యాగ్‌లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| --- | --- | --- | --- |
| బ్రాయిలర్ | 127 | 224 | 234 |

బొబ్బిలి
•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

వ్యర్థాలకు పూజలు చేస్తున్న కార్మికులు

## పారిశుద్ధ్య కార్మికుల వినూత్న నిరసన

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం, పురిటిపెంట పంచాయతీలకు చెందిన 47 మంది పారిశుద్ధ్య కార్మికులు వేతనాలకోసం మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో రెండు పంచాయతీల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. కార్మికులు ఆదివారం చెత్త కుప్పలకు పూజలు చేసి, వినూత్న నిరసన తెలిపారు. పన్ను వసూళ్లలో జాప్యం కారణంగా నిధుల కొరత ఏర్పడడంతో వేతనాలు చెల్లించలేకపోయామని, మూడు రోజుల్లో చెల్లిస్తామని కార్యదర్శి జనార్దనరావు తెలిపారు.

## కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో) ● టమాటా: 48 ● వంకాయలు: 60 ● దొండ: 58 ● బీర: 52 ● బెండ: 60 ● కాకర: 50 ● చిక్కుడు: 60 ● ఆనపకాయ (ఒకటి): 25 ● అరటి (జత): 20 ● మునగ: 70 ● ఉల్లి: 30 ● బంగాళదుంపలు: 30 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 80 ● పచ్చిమిర్చి: 55 * క్యాబేజీ: 40 – న్యూస్‌టుడే, రాజాం

## తెరపై ఈనాడు

★ ఎస్వీసీ సీతారామా: **శివ** ★ ఎస్వీసీ సీతారామా మినీ: **జిగిరిస్** ★ ఎస్వీసీ అప్సర: **కాంత** – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలిలో.. ★ లక్ష్మీ: **కాంత** ★ వాసవి: **జిగిరిస్** ★ టీబీఆర్ స్క్రీన్-1: **శివ** ★ టీబీఆర్ స్క్రీన్-2: **ది గర్ల్ ఫ్రెండ్** – న్యూస్‌టుడే, బొబ్బిలి

**మేమున్నాం.. మీకు తోడుగా** (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? నీలావతి గ్రామంలో చెత్త సేకరణ కుండీల్లో పనికిరాని మొక్కలు పెరిగాయి. - **స్థానికులు** ● పరిశీలించి, సిబ్బందితో తొలగింపజేస్తాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? బొండపల్లి మండలం గొల్లలపేట గ్రామంలో వీధి కాలువల్లో చెత్త పేరుకుపోయింది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ● గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతాం. వ్యర్థాలు తొలగింపజేస్తాం. - **రఘుపతిరావు, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, బొండపల్లి

? రాజాం పట్టణం పరిధి చీపురుపల్లి రోడ్డులోని గాయత్రీ కాలనీలో మొదటి, నాల్గో లైన్లలో సీసీ రోడ్లు లేవు. - **స్థానికులు** ● నిధులు కేటాయించి, రోడ్లు వేయిస్తాం. - **రామచంద్రరావు, కమిషనర్** – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

## మాటలు ఘనం.. అభివృద్ధి గగనం

న్యూస్‌టుడే– బొబ్బిలి

బొబ్బిలి పురపాలిక పరిధిలో అభివృద్ధి పనులు పడకేస్తున్నాయి. నిధులు ఉన్నా.. పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలు కేటాయించి, టెండర్లు పిలుస్తున్నారు. గుత్తేదార్లు ముందుకొస్తున్నా అధికారులు ఏదో కారణం చెప్పి కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పంపుతున్నా సాంకేతిక కారణాలతో జరగడంలేదు.

★ పట్టణంలోని రాజా కళాశాల రహదారిని రూ.1.20 కోట్లు బుడా నిధులతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఇంతవరకు అభివృద్ధి లేదు. పురపాలిక నిధులు రూ.40 లక్షలతో మరమ్మతులు చేయడానికి రెండు నెలల కిందట కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. పనులు చేపట్టలేదు. రోజుకో వాహనం రోడ్డు మధ్యలో కూరుకుపోతోంది.

★ గొల్లపల్లిలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.5 లక్షలు ఎంపీ లాడ్స్ కేటాయించారు. నిధులు సరిపోక పనులు మధ్యలో ఆపేశారు. పురపాలక సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షలు ఇవ్వడానికి నిర్ణయించారు. కానీ నేటికీ పూర్తికాలేదు. అక్కడ ఆరుబయట మలవిసర్జన జరుగుతోంది. ★ రాజానగర్ కాలనీ సమీపంలోని భైరవసాగరం గట్టు వద్ద అయిదు వార్డులకు సంబంధించిన శ్మశాన వాటిక అభివృద్ధికి గతంలో రూ.5 లక్షలు కేటాయించారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, చెరువు నీరు రాకుండా కట్టడి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. నిధులు సరిపోక మధ్యలో ఆపేశారు. మరో రూ.5 లక్షలతో ఏడాది కిందట టెండర్లు పిలిచారు. ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. ★ మల్లంపేట ఎస్సీ వీధిలోని శ్మశానం అభివృద్ధికి రూ.5 లక్షలు కేటాయించారు. ఏడాదిన్నర అవుతున్నా మొదలుపెట్టలేదు. పట్టణంలోని మరికొన్ని శ్మశానాలకు రూ.20 లక్షలు కేటాయించినా పనులు జరగలేదు.

గొల్లపల్లిలో అసంపూర్తిగా సామాజిక మరుగుదొడ్డి

**తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం..** పురపాలిక పరిధిలో తాగునీటి సరఫరాకు ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా.. పరిస్థితి మెరుగుపడడంలేదు. ఏడాది కిందట మోటార్లు కొనుగోలుకు రూ.10 లక్షలు కేటాయించారు. ఇంతవరకు కొనుగోలు చేయలేదు. ఇటీవల ఇదే అంశాన్ని కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. ఏడాది పాటు నిర్వహణ ఎవరితో చేయించారో తెలియడంలేదు. పైపులైన్ల లీకులు ఎక్కడికక్కడే ఉన్నాయి. భోజరాజపురం పంపుహౌస్ వద్దకు నియంత్రికలు కొనుగోలు చేశారు. ఇంతవరకు అమర్చలేదు. తీగలు మోటార్ల వద్ద వేలాడుతున్నాయి. గతంలో తెచ్చిన బోర్డు తుప్పుపట్టేవరకూ అమర్చలేదు.

**చర్యలు తీసుకుంటాం..**

పురపాలిక అభివృద్ధి పనుల్లో కదలిక తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్నింటికి బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనివల్ల గుత్తేదార్లు ప్రారంభించడంలేదు. టెండర్లు జరిగినవి పనులు మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుపరుస్తాం.
– ఎల్.రామలక్ష్మి, పుర కమిషనర్, బొబ్బిలి

## చాకివలస బాట

మెంటాడ, న్యూస్‌టుడే: ఒకప్పుడు రెండు వందల గడపతో ఆనందంగా ఉండే మెంటాడ మండలం చాకివలస గ్రామం నేడు 30 ఇళ్లకే పరిమితమయ్యింది. ఎటు చూసినా జన సంచారంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే ఊరు.. నేడు నిర్మానుష్యంగా మారింది. 50 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులతో ఉండే ప్రాథమిక పాఠశాల నేడు మూతపడింది.

కనీస సదుపాయాలు లేక గ్రామం విడుస్తున్న ప్రజలు

విద్యార్థులు లేక మూతపడిన పాఠశాల

1998లో ఆంధ్ర జలాశయం ప్రారంభించిన తర్వాత పరిసర గ్రామాల్లోని ప్రజలు ఏటా మలేరియా బారినపడేవారు. అధిక మొత్తంలో ఖర్చులు చేయాల్సి వచ్చేది. ఆదాయానికి మించిన ఖర్చులు ఉండడంతో ఉన్న ఊరిని విడిచి వలసబాట పట్టారు. ప్రస్తుతం గ్రామంలో 30 ఇళ్లు ఉన్నాయి. గ్రామానికి ఒకవైపు పంటపొలాలు మరోవైపు చంపావతి నది, కొండగెడ్డలు ఉన్నాయి. వర్షాకాలం, తుపానుల సమయాల్లో తీవ్ర అవస్థలు పడేవారు.

**పట్టణాలకు వెళ్లలేక ఉండిపోయాం..** అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వైద్యం కోసమే అధిక శాతం ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీంతో చాలామంది వలస వెళ్లి స్థిరపడ్డారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లలేక మేం ఇక్కడే ఉంటున్నాం. – **అరిపాక కృష్ణంనాయుడు, పువ్వల గురునాయుడు**

## అడుగుకో అగాధం..!

గంట్యాడ మండలం పెదవేమలి- పినవేమలి, గొడియాడ- బూడిపేట, వసాది- రామభద్రపురం, సిరిపురం- వసంత ప్రధాన రహదారుల్లో గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామాల కూడళ్లలో మూడు అడుగుల లోతులో గోతులు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పది రోజుల వ్యవధిలో 13 మంది గాయాలపాలయ్యారు. అధికారులు గోతుల్లో చిన్నపాటి కంకర పెట్టి వదిలేస్తున్నారు. ఆ శాఖ అధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రమణమూర్తి అన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## శిథిల వంతెనపై రక్షణ కరవు

రాజాం మండలం అంతకాపల్లి- మొగిలివలస గ్రామాల మధ్య రెల్లి గెడ్డపై గతంలో నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇరువైపులా ఉండే రక్షణగోడలు ప్రమాదకరంగా మారాయి. పొదలు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. వేరే దారిలేక వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నామని వాపోతున్నారు. విషయం ఎంపీడీవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

## ఇదే పశువైద్యశాల..!

రేగిడి మండలం ఉంగరాడలోని పశువైద్య ఉపకేంద్రం శిథిలావస్థలో ఉంది. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. తలుపులు పూర్తిగా పాడయ్యాయి. లోపల విలువైన పరికరాలు ఉన్నాయి. పశువైద్య సహాయకుడు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో అటెండర్ గోపాలమిత్రకు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయంలోని పరికరాలకు భద్రత లేదని, సేవల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. విషయం ఉన్నతాధికారులకు నివేదించామని పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, రేగిడి

## పాఠశాల పక్కనే పెంట కుప్ప

వంగర మండలం మగ్గూరులో ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కనే గ్రామస్థులు పెంట కుప్పలు వేస్తున్నారు. దీంతో పాఠశాల పరిసరాల్లో దుర్వాసన వస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమల బెడద పెరుగుతోందని, వ్యాధులు ప్రబలే అవకాశముందని వాపోతున్నారు. పెంట కుప్పలు తొలగించి, శుభ్రం చేయించాలని కోరుతున్నారు. విషయం ఎంఈవో కూర్మినాయుడు వద్ద ప్రస్తావించగా.. పంచాయతీ అధికారులతో మాట్లాడి, చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, వంగర

## అల్లుకున్న ప్రమాదం..!

బొండపల్లి మండలం కనిమెరక గ్రామం నుంచి దేవుపల్లికి వెళ్లే మార్గంలో దారి పొడవునా విద్యుత్తు స్తంభాలకు పనికిరాని మొక్కలు ప్రమాదకరంగా అల్లుకున్నాయి. ఈ మార్గంలో వందలాది వాహనాలు, పశువుల కాపరులు నిత్యం తిరుగుతుంటారు. ప్రమాదం సంభవిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. స్తంభాలకు అల్లుకున్న లతలు తొలగించాలని కోరుతున్నారు. విషయం విద్యుత్తు శాఖ ఏఈ శంకరరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు చేపడతామన్నారు. పనికిరాని మొక్కలు తొలగింపజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, బొండపల్లి

## రైతులకు రాయితీ పరికరాలు

రేగిడి, న్యూస్‌టుడే: రైతులకు రాయితీపై తుంపర, బిందు సేద్యం పరికరాలు అందజేస్తున్నట్లు ఏపీఎంఐపీ ఏపీడీ ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాల లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, ఇతరులకు 90 శాతం రాయితీపై ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 10 ఎకరాలు ఉన్న రైతులందరికీ 70 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. కావాల్సినవారు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. బోరుబావి, విద్యుత్తు సౌకర్యం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

## పిల్లలకు కళలపై ఆసక్తి పెరగాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: పిల్లలు కళలపై ఆసక్తి పెంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కళాభారతి అడిషనల్ కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం ఆనందబ్రహ్మ అకాడమీ ఆధ్వర్యంలో శాస్త్రీయ, జానపద, సినీ నృత్య విభాగాల్లో ఉచిత ఎంపిక పోటీలు జరిగాయి. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 147 మందిని ఎంపిక చేశారు. వ్యవస్థాపకుడు మింది విజయమోహనరావు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆటల పోటీలు

రేగిడి, రామభద్రపురం, తెర్లాం, న్యూస్‌టుడే: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రేగిడి, రామభద్రపురం, తెర్లాంలో ఆదివారం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపులో బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారులు తెలిపారు. గ్రంథాలయాల కోసం కృషిచేసిన రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, రామలక్ష్మణమూర్తి, పోతూరి నాగభూషన్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

రామభద్రపురంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

## సామూహిక సత్యనారాయణ వ్రతాలు

గంట్యాడ, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా గంట్యాడ గోశాలలో ఆదివారం విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన 21 మంది దివ్యాంగ దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వారికి గంట్యాడకు చెందిన మల్యాడ సత్యనారాయణ, సరస్వతి దంపతులు నిత్యావసరాలు అందజేశారు. సువ్రత గోశాల నిర్వాహకులు గణేష్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

**బాబా మందిరంలో తండులార్చన..** బొబ్బిలి, న్యూస్‌టుడే: సాయిబాబా శతవర్ష జన్మదినోత్సవంలో భాగంగా బాలవికాస్ పిల్లలతో ఆదివారం బాబా మందిరంలో తండులార్చన నిర్వహించారు. చిన్నారులకు పలు రకాల అంశాలపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## వనసమారాధనల సందడి

బొబ్బిలిలో నృత్యం చేస్తున్న బాలికలకు సత్కారం

బొబ్బిలి: కొత్తపేట సమీపంలో..

బొబ్బిలి, గ్రామీణం, రామభద్రపురం, తెర్లాం, రాజాం, గ్రామీణం, చీపురుపల్లి, గరివిడి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని సింహాచలంలో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సంఘాల కార్తిక వనసమారాధన జరిగింది. కొత్తపేట సమీపంలో నాగావళం సంఘం సభ్యులు వనసమారాధన నిర్వహించారు. ★ రామభద్రపురంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు వనసమారాధన నిర్వహించారు. ★ తెర్లాం తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో అడ్డ రోడ్డు కూడలి సమీపంలో రెవెన్యూ సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ కలయిక జరిగింది. ★ రాజాం అగ్నిమాపక కేంద్రం సమీపంలో తెలగ సంక్షేమ సంఘం, శ్యాంపురం సమీపంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొని, మాట్లాడారు. ★ చీపురుపల్లిలో కళింగ కోమటి, శిష్టకరణాల సంక్షేమ సంఘాలు వనభోజనాలు నిర్వహించారు. ★ గరివిడి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శిష్టకరణాల సంఘం ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్య వైశ్య సంఘం వనసమారాధన జరిగింది.

రాజాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

చీపురుపల్లి: ఆర్‌ఈసీఎస్ ఎదురుగా ఉన్న తోటలో జన సందోహం

## పీఆర్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఎన్నిక

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బొబ్బిలి సబ్ డివిజన్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి ఎన్నికలు జరిగాయని తెలిపారు. అధికారులు, సిబ్బంది అభినందించారు.

## బస్సు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

పార్వతీపురం పురపాలక, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: బస్సు ఎక్కుతుండగా కాలుజారి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన పార్వతీపురం పట్టణ ఆర్టీసీ బస్టాండులో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ కె.మురళీధరరావు వివరాల మేరకు.. తెర్లాం మండలం డీజీ గదబవలస గ్రామానికి చెందిన జె.వెంకటరావు రామభద్రపురం వెళ్లడానికి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కుతుండగా జారి కిందపడ్డారు. ఎడమ కాలిపై బస్సు చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: పాత్రికేయులు సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఆదివారం బొబ్బిలిలో సీ.వై. చింతామణి విగ్రహానికి నివాళులర్పించారు. చింతామణి అప్పట్లో దిల్లీలోని ఓ ఆంగ్ల పత్రికలో పాత్రికేయుడిగా పనిచేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## వైకాపా సభ్యత్వానికి సర్పంచి రాజీనామా

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: దత్తిరాజేరు మండలం భూపాలరాజపురం సర్పంచి నేరడబిల్లి గురునాయుడు వైకాపా సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆదివారం ప్రకటించారు. పెదమానాపురంలో మాట్లాడారు. పార్టీలోని కొంత మంది అకారణంగా కేసుల్లో ఇరికించడంతో విసుగుచెంది రాజీనామా చేశానన్నారు.

## ఇబ్బంది తొలగేలా.. హక్కు దక్కేలా

గజపతినగరం, న్యూస్‌టుడే: గతంలో ఇల్లు, స్థలం ఉండి కూడా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక యజమానులకు వ్యక్తిగత హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంది. పంచాయతీ రాజ్ అధికారులు గ్రామ కంఠాల ఆస్తులపై స్వామిత్వ పేరుతో సర్వే నిర్వహించారు. హక్కు పత్రాలు ప్రజల చేతికి అందజేస్తున్నారు. గ్రౌండ్‌ట్రూతింగ్ పేరుతో ఇళ్లు, ఇంటి స్థలాలపై అభ్యంతరాలు వస్తే.. గ్రామంలో వివరాలు సేకరించి, డిప్యూటీ తహసీల్దార్ వాటికి పరిష్కారం చూపుతారు. భవిష్యత్తులో వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని మొత్తం ఇళ్లకు మార్చిలోగా పట్టాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని బొబ్బిలి డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం రెండో దశలో 85 శాతం సర్వే పూర్తయిందని, అభ్యంతరాలు వస్తే పరిష్కరిస్తున్నామన్నారు.

సాలిపేటలో లబ్ధిదారుడికి ఇంటి పట్టా అందిస్తున్న అధికారులు

**బొబ్బిలి సబ్‌డివిజన్‌లో స్వామిత్వ సర్వే రెండోవిడత ఇలా..**

| మండలం | గ్రామాలు | ఇళ్లు | సిద్ధమైన పట్టాలు |
|---|---|---|---|
| బాడంగి | 6 | 4939 | 4735 |
| బొబ్బిలి | 17 | 13464 | 5991 |
| దత్తిరాజేరు | 8 | 3657 | 3705 |
| గజపతినగరం | 16 | 10944 | 6863 |
| మెంటాడ | 18 | 7862 | 6733 |
| రామభద్రపురం | 5 | 3208 | 2176 |
| తెర్లాం | 10 | 4947 | 3049 |

## శుద్ధజలం పరికరం.. అలంకారప్రాయం

గంట్యాడ మండలం లక్కిడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుద్ధ జలం యంత్రం మరమ్మతులకు గురై విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. దీంతో సమీపంలోని బోరు వద్ద నుంచి నీరు తెచ్చుకుని తాగుతున్నారు. కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని వాపోతున్నారు. యంత్రానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విషయం పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## దారి దారుణం.. రాకపోకలకు నరకం

గంట్యాడ మండలం సిరిపురం మీదుగా రామవరం జాతీయ రహదారికి వెళ్లే మార్గం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రెండు గ్రామాల మధ్య ఎక్కువ సంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతుండడంతో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. విషయం ఏఈ కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా గుంతలు పూడ్చివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## ఆసుపత్రి ఆవరణలో అడుగుపెట్టలేం..!

గజపతినగరం ఆసుపత్రిలో అదనపు భవనాలు, పడకలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించినా.. ఆవరణలోని మురుగు సమస్యకు మాత్రం పరిష్కారం చూపడం లేదు. గతంలో పంచాయతీ మురుగునీటి వ్యవస్థకు అనుసంధానం చేసి ఉండేది. నూతన భవనాల నిర్మాణంతో కాలువలు ఎత్తులో ఉండిపోయాయి. దీంతో నీరుపారడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం ఆసుపత్రి పర్యవేక్షకుడు జగదీష్ వద్ద ప్రస్తావించగా.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక డ్రైనేజీ ఏర్పాటుకు అంచనాలను సిద్ధం చేశారని తెలిపారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

(c) eenadu

# విజయనగరం

●విజయనగరం ●నెల్లిమర్ల ● ఎస్.కోట

**మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)**

| | |
|---|---|
| విజయనగరం పట్టణం | 80089 02900 |
| విజయనగరం గ్రామీణం | 80085 74317 |
| ఎస్.కోట | 80085 74326 |
| భోగాపురం | 70959 54646 |

?: బండారుపల్లి గార్డెన్స్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. - **రమేష్** ★ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **రత్నాకర్, డీఈఈ**

?: ఓం మందిరం వెనుక లైనులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - **రామకృష్ణారావు** ★ శునకాల విషయంలో చర్యలు తీసుకుంటాం. - **పి.నల్లనయ్య, కమిషనరు**

?: ఎల్‌బీ కాలనీ చివరి లైను, శుద్ధవీధి కూడలి వద్ద, బాలాజీనగర్-2 న్యూసెంట్రల్ స్కూలు హాస్టల్ దగ్గర ఇళ్ల వద్ద కాలువలు శుభ్రం చేయడం లేదు. - **దుర్గారావు, రవి, అప్పారావు** ★ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. - **కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: పినవేమలిలో చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలి. - **స్థానికులు** ★ అందుబాటులోకి తీసుకువస్తాం - **శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ**

?: గుంకలాంలో పారిశుద్ధ్యం బాగోక దోమల బెడద వేధిస్తోంది. - **స్థానికులు** ★ శుభ్రం చేయిస్తాం - **శంకరరావు, కార్యదర్శి**

?: దుప్పాడ-జొన్నవలస మార్గంలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – **స్థానికులు** ★ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **రవి, కార్యదర్శి**

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## లీకు సరిచేశారు..

కలవపువ్వు మేడ దగ్గర పైపులైను లీకును సిబ్బంది సరిచేశారు. ఈనెల 10న 'లీకులతో పొంచి ఉన్న ముప్పు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

## చెట్టు కొమ్మల తొలగింపు

పద్మావతినగర్-4లో విద్యుత్తు తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను విద్యుత్తు సిబ్బంది తొలగించారు. మేమున్నాం.. మీకు తోడుగాకు స్థానికులు చేసిన ఫిర్యాదుపై ఈఈ పి.త్రినాథరావు స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

## రూ.60 లక్షలతో ప్రతిపాదనలు

కొత్తవలస: వీరసాగరం చెరువుకు మరమ్మతులకు రూ.60 లక్షల అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని జలవనరులశాఖ ఎస్.కోట డీఈఈ పి.శ్రీధర్ తెలిపారు. వర్షం పడితే ఈ చెరువు వల్ల పల్లపువాసులకు ఎదురవుతున్న సమస్యపై ఈనెల 13న 'చినుకు పడితే వణుకే' శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన కథనానికి డీఈఈ స్పందిస్తూ తీసుకున్న చర్యలను వివరించారు.

## 'ఆనందమాయే సఖి' ఆవిష్కరణ

కంటోన్మెంట్: జన విజ్ఞాన వేదిక, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం యువ రచయిత్రి సృజన వాలిశెట్టి రచించిన ఆనందమాయే సఖి నవలను ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు ఆవిష్కరించారు. నవలను వైజాగ్ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షురాలు రమాదేవి, యువ రచయిత వెంకటరావు సమీక్షించారు. సాహితీ స్రవంతి బాధ్యులు చంద్రకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెంకటరావు పాల్గొన్నారు.

## తెరపై ఈనాడు

★ ఎస్వీఎస్ : **శివ** ★ శ్రీకృష్ణ : **జిగిరీస్** ★ ఆదిత్య : **కె.ర్యాంప్** ★ లీలామహల్ : **ది గర్ల్ ఫ్రెండ్** ★ రంజనీ స్క్రీన్-1 : **శివ, ది గర్ల్‌ఫ్రెండ్** ★ శివరంజనీ స్క్రీన్-2 : **జిగిరీస్, కాంత** ★ హిమగిరి : **కాంత** ★ సప్తగిరి : **సంతాన ప్రాప్తి రస్తు, ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో**

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

## నిర్మాణాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

**2019లో బీపీఎస్ ఆదాయం రూ.10.97 కోట్లు**

ఉల్లివీధిలో ఓ నిర్మాణం

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నగరంలో అక్రమ భవనాల క్రమబద్ధీకరణకు పురపాలక పరిపాలన శాఖ ఈనెల 12న ప్రకటన జారీచేసింది. మొత్తం 120 రోజు వ్యవధిలో దరఖాస్తుల గడువు నిర్దేశించింది. దీని ప్రకారం గుర్తింపు పొందిన టెక్నికల్ పర్సన్ల ద్వారానే దరఖాస్తులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ప్రాథమిక రుసుము రూ.10 వేలతో పాటు ఇతర ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. గతసారి బీపీఎస్ అమలు చేసినప్పుడు వచ్చిన దరఖాస్తుల కంటే ఈ సారి ఎక్కువ వచ్చే పరిస్థితి ఉందని కార్పొరేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

❖ ప్లాట్ సైజు ఉల్లంఘనలకు అనుగుణంగా చదరపు అడుగుకు రూ.40 నుంచి రూ.400 వరకు పీనలైజేషన్ ఛార్జీలు చెల్లించాలి.

❖ అపార్టుమెంట్లు విషయంలో అక్రమ కట్టడాలకు రూ.20 వేలు నుంచి రూ. 80 వేలు వరకు (ఒక్కో ప్లాటు), అక్రమ ఫ్లోర్లకు అయితే చదరపు అడుగు రూ.120 నుంచి రూ.200 వరకు చెల్లించాలి.

❖ ప్రభుత్వ ఆక్రమణలు, న్యాయపరమైన వివాదాలు, యూఎల్సీ మిగులు, ట్యాంక్ బెడ్స్, డ్రైన్లు సీఆర్‌జెడ్ పర్యావరణ ఆంక్షలు ఉన్న ప్రాంతాలకు బీపీఎస్ అమలు చేయరు.

❖ లేఅవుట్ల బహిరంగ స్థలాలు, రిక్రియేషన్ జోన్లు, పార్కింగ్‌నకు నిర్దేశించిన స్థలాల్లో మినహాయింపు ఉంటుంది.

❖ bps.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

**ముందుకు రావాలి**

బీపీఎస్‌ను వినియోగించుకుని అక్రమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనరు పి.నల్లనయ్య కోరారు. దీనిపై నగరవాసులకు అవగాహన కల్పిస్తామన్నారు.

| ★ 2019లో బీపీఎస్ దరఖాస్తులు | ★ తిరస్కరించినవి | ★ పరిష్కరించినవి | ★ వచ్చిన ఆదాయం |
|---|---|---|---|
| 1198 | 16 | 1,182 | రూ.10.97 కోట్లు |

## విజ్ఞాన భాండాగారాలు

ప్రశంసా పత్రాలు పొందినవారితో సంఘ ప్రతినిధులు

మయూరి కూడలి, ఎస్.కోట, ఎల్.కోట, డెంకాడ: గ్రంథాలు కొలువైన గ్రంథాలయం పవిత్ర ప్రదేశమని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి శ్రీనివాస్ అన్నారు. గ్రంథాలయ సంఘం శాఖ అధ్యక్షుడు గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 15 పాఠశాలలకు చెందిన 300 మంది ఉత్తమ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. లక్ష్మి, గీతాంజలి శ్రీనివాస్, సుభద్రా పాల్గొన్నారు. ❖ ఎస్.కోట గ్రంథాలయంలో జడ్పీ పాఠశాల ఉపాధ్యాయు రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఎల్.కోట లైబ్రరీలో చందులూరుకు చెందిన వైద్య విద్యార్థి దీపక్ అవగాహన కల్పించారు. డెంకాడలో గ్రంథాలయాధికారి మహేశ్వరరావు అవగాహన కల్పించారు.

## ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

మాట్లాడుతున్న సింహాద్రి ఝాన్సీ

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టకుండా ప్రతిఒక్కరూ పోరాటాలు చేయాలని ఏఐఎస్టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ పిలుపు నిచ్చారు. ఏఐఎస్టీయూ(న్యూ) (అనుబంధం) విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆర్.నారాయణరావు అధ్యక్షతన ఆదివారం విజయనగరం ఆర్టీసీ కూడలి రెవెన్యూ కల్యాణ్ మండపంలో నిర్వహించిన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్రం కార్మికులకు పని గంటలు పెంచి, నాలుగు లేబర్ల కోడ్‌లు తెచ్చి చాలా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరిపించడం లేదన్నారు. నాయకులు అప్పారావు, వర్మ, అప్పలరాజు రెడ్డి, నారాయణరావు పాల్గొన్నారు.

## రేపు స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనుందని సంస్థ కార్యదర్శి పేర్కొన్నారు. 32 అంశాలతో అజెండాను అధికారులు రూపొందించారు. సభ్యులు హాజరుకావాలని కమిషనరు నల్లనయ్య కోరారు.

## నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో విఫలం

భోగాపురం: భోగాపురం విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలపై, ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రహస్య భూసర్వేపై గ్రామాల వారీగా అభిప్రాయాలను తెలుసుకునేందుకు వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణం ప్రారంభించి పదేళ్లవుతున్నా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొందరికే ఆర్ అండ్ఆర్ ప్యాకేజీలు అందాయన్నారు. సీపీఎం, సిటూ జిల్లా కార్యదర్శులు తమ్మినేని, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

## అశ్రునయనాలతో క్రీడాకారిణికి వీడ్కోలు

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని మృతి చెందిన వెయిట్ లిఫ్టర్ టి.సత్యజ్యోతి అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య జరిగాయి. కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశాలతో క్రీడా శాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో క్రీడా ప్రాధికార శిక్షకులు(కోచ్‌లు) సర్వజన ఆసుపత్రిలోని పోస్టుమార్టం గది వద్దకు చేరుకుని దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. ఊరేగింపుగా సత్యజ్యోతి మృతదేహాన్ని బాబామెట్టలోని ఆమె స్వగృహానికి తరలించారు. తెదేపా నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, గాడు అప్పారావు, కనకల మురళీమోహన్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

## రహదారి నిర్మాణంలో నాణ్యత డొల్ల

డెంకాడ మండలంలోని గొడిపాలెం నుంచి రాజుల తమ్మాపురం వెళ్లే దారిలో మలుపు వద్ద రహదారి ఛిద్రమై అధ్వానంగా దర్శనమిస్తోంది. రహదారి నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో ఇలా పాడైపోయిందని వాహన చోదకులు వాపోతున్నారు. ఆప్రాంతంలో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో భవాని వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, డెంకాడ

## మట్టి దారుల్లో ఇంకెన్నాళ్లీ అవస్థ?

విజయనగరం మండలం దుప్పాడ శివారు ప్రాంతాల్లో రహదారులు లేకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి ఈ ప్రాంతం దగ్గరగా ఉండడంతో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన పలువురు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. పదేళ్లు అవుతున్నా మట్టిరోడ్లే శరణ్యమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## భగవద్గీత శ్లోకాల పోటీలకు స్పందన

ప్రశంసా పత్రాలతో విజేతలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం.. హిందూ ధర్మ ప్రచార పరిషత్తు విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం తితిదే కల్యాణ మండపంలో జరిగిన భగవద్గీత శ్లోక పోటీలకు విశేష స్పందన వచ్చింది. సీనియర్ విభాగంలో హిమబిందు, మౌనిక, శరణ్యలు, జూనియర్స్ విభాగంలో పల్లవి దుర్గ, రోషిణి, రంజిత విజేతలుగా నిలిచారు. రెండు విభాగాల విజేతలకు డిసెంబరు 1న గీతా జయంతి రోజున నగదు బహుమతులు అందజేస్తారు. పోటీల్లో పాల్గొన్న బాలలకు తితిదే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్యామసుందర ప్రశంస పత్రాలు అందజేశారు.

## పఠనంతో సృజనాత్మక ఆలోచనలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పుస్తక పఠనం.. సృజనాత్మక ఆలోచనలు, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తుందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ ఆఫీసర్స్ క్లబ్‌లో 'సగం ధరకే పుస్తకాలు' ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరంతర పఠనం ఏకాగ్రతను పెంచుతుందన్నారు. సగం ధరకే పుస్తక విక్రయాన్ని యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ శంకరరావు, రచయిత సంఘం అధ్యక్షుడు జి.వి.శ్రీనివాస్, సంఘం కార్యదర్శి కె.కె.రమణందన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాసరావు

## వనంలో భోజనం.. ఉత్సాహంగా జనం

నెల్లిమర్ల మండల ఉపాధ్యాయులు, ఎంఈవోలు

ఎస్.కోటలో వీరబ్రహ్మం చిత్రపటం వద్ద నివాళులు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

కార్తికమాసం చివరి ఆదివారం సందర్భంగా జిల్లా అంతటా ఉద్యానాలు, పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు వన సమారాధనలతో సందడి నెలకొంది. కాపుసోంపురం, రాజాపాత్రునివలస, పుణ్యగిరిలో విశ్వబ్రాహ్మణులు, నెల్లిమర్లలో ఉపాధ్యాయ సంఘాలు, దేవాంగులు, చింతలవలస వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధనలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

యువతులకు గ్లాస్ పోటీలు

మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజుకు పద్మశాలి సంఘ నాయకుల సత్కారం

## ఘనంగా లక్ష కుంకుమార్చన

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కొత్తవలస, జామి: కార్తిక మాసం సందర్భంగా జామి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 108 మహిళలతో లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. విశాఖకు చెందిన వడ్డాది రామారావు, కమల దంపతుల సహకారంతో వేద పండితులు చేశారు. అనంతరం శివాలయంలో అన్నసమారాధన నిర్వహించారు. ❖ కొత్తవలస పంచాయతీ శివారు కుమ్మరబంజరులో ఆదివారం అరుణలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. అర్చకులు భాస్కర్, మోహన్‌కుమార్ దంపతులతో శాస్త్రోక్తంగా చేయించారు.

## కుళాయి నీరు రాదు.. కాలువలు లేవు!

**కామాక్షి నగర్ -3లో ఇదీ పరిస్థితి**

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నగరంలో గంట్యాడ రోడ్‌లోని కామాక్షినగర్-3లో తాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగక ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం పైపులైన్ వేసినా కుళాయి కనెక్షన్లు మంజూరు చేయలేదు. సుమారు 100 వరకు నివాసాలు ఈ కాలనీలో ఉన్నాయి. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. * ఇక్కడ కాలువలు ఒక వైపే ఉన్నాయి. దీంతో మురుగు పారుదలకు ఆటంకం కలుగుతోంది. ఇళ్ల ముందు, మధ్యలో మురుగు నిలిచి దోమలు, పందులకు ఆవాసంగా మారింది.

నివాసాల చెంత మురుగు కూపం

**చర్యలు తీసుకుంటాం..** సమస్యను కమిషనరు పి.నల్లనయ్య దృష్టికి తీసుకెళ్లగా ప్రధాన పైపులైను పనులు చేయాల్సి ఉందన్నారు. కుళాయిల కోసం దరఖాస్తు చేస్తే వేస్తామన్నారు. ఈ విషయంలో తమను సంప్రదించాలన్నారు. కాలనీలో పరిశీలించి. . నిధుల లభ్యతమేరకు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆటల పోటీలు వాయిదా

కొత్తవలస: ఉపాధ్యాయులకు మండల స్థాయిలో నిర్వహించాల్సిన క్రికెట్, త్రోబాల్ పోటీలు ఈనెల 29, 30 తేదీలకు వాయిదా పడ్డాయని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి కె.కృష్ణంరాజు తెలిపారు. ఎస్ఏ-1 పరీక్షలు ఉన్నందున వాయిదా వేశారన్నారు.

## చింతామణి.. ఆదర్శమూర్తి

బాబామెట్ట: ప్రజలు.. ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయడంలో పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తాయని మేయర్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సర్ సి.వై.చింతామణి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శివప్రసాద్, మహాపాత్ర్, నరసింగరావు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

## పిచికారీ పంపుల పంపిణీ

కంటోన్మెంట్: నగరంలోని ఓంమందిరం భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయం నిమిత్తం పిచికారీ పంపులు పంపిణీ చేసింది. రూ.3 లక్షలు విలువజేసే 100 పంపులు వందమంది రైతులకు అందజేశారు.

## కుష్ఠువ్యాధి నిర్మూలనకు ఇంటింటా సర్వే

బాబామెట్ట: కుష్ఠువ్యాధి నిర్మూలనకు నవంబరు 17 నుంచి 30 వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటింటా సర్వేను జిల్లావ్యాప్తంగా 14 రోజుల పాటు చేసి పీహెచ్‌సీల ద్వారా మందులు ఉచితంగా అందజేయాలన్నారు.

## ఆస్తి వివాదంతో పంట నాశనం

ఎస్.కోట: ఆస్తి వివాదం కారణంగా ఓ వ్యక్తి పొలంలో పచ్చగడ్డి గడ్డి మందు కొట్టి నాశనం చేశారంటూ పట్టణంలోని కోటవీధికి చెందిన చదరం శ్రీనివాసరావు, అప్పారావులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. 40 ఏళ్ల కిందట పొలం అమ్మి వెళ్లిపోయిన బంధువు, ఇప్పుడు తిరిగొచ్చి భూమి ఇవ్వాలంటూ గొడవ పెట్టాడని, నిరాకరించడంతో అక్కసుతో రాత్రి దుశ్చర్యకు పాల్పడి పరారైనట్లు అందులో పేర్కొన్నారు. సీఐ వి.నారాయణమూర్తి వద్ద ప్రస్తావించగా ఫిర్యాదు అందిందని, వారితో మాట్లాడతానన్నారు.

## చీరలు, దుప్పట్ల పంపిణీ

ఎస్.కోట: సత్యసాయి శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఎస్.కోట సేవా సమితి ఆధ్వర్యంలో సమిది గ్రామంలో గిరిజనులకు 250 మందికి చీరలు, 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

## ప్రైవేటీకరణ నిలిపివేయాలి

నెల్లిమర్ల: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మొయిదలో వివిధ గ్రామాలకు చెందిన వైకాపా నాయకులతో కోటి సంతకాల గోడప్రతులను ఆవిష్కరించారు.

## ప్రాణాలర్పించైనా భూములు కాపాడుకుంటాం

ఎస్.కోట: ప్రాణాలు త్యాగం చేసైనా భూములు కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ అన్నారు. ఆదివారం బొడ్డవరలో దీక్షా శిబిరం వద్ద ఆయన ఆధ్వర్యంలో జిందాల్ నిర్వాసితులు మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పట్టించుకోకపోతే, న్యాయం చేయకపోతే ప్రాణత్యాగంతో సమాధానం చెబుతామన్నారు. 18 ఏళ్లుగా లేనిది ఆ యాజమాన్యం ఇప్పుడు పనులు చేయిస్తోందన్నారు.

ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

## క్రీడాకారులకు అభినందన

పతకాలు గెల్చుకున్న స్కేటర్లతో నిర్వాహకులు

విజయనగరం క్రీడా విభాగం, న్యూస్‌టుడే: కాకినాడలో ఈ నెల 1 నుంచి 8 వరకు జరిగిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటారు. 3 స్వర్ణాలు, 7 రజతాలు, మరో మూడు కాంస్య పతకాలు గెల్చుకున్నారు. దేవాన్ష్, భార్గవ్ సాయి, ఉజ్వల్ స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. ఆదివారం విజ్జీ మైదానంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లను రాష్ట్ర రోలర్ స్కేటింగ్ సంఘం సంయుక్త కార్యదర్శి ఏపీవీఎన్ఎస్ మూర్తి, జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు అభినందించారు.

## రెడ్‌క్రాస్‌కు అన్నివిధాలా సహకారం

ఎస్.కోట, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సొసైటీ చేపట్టే సేవా కార్యక్రమాలకు సహకరిస్తామని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. ఆదివారం సొసైటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు, సేవల నిర్వహణకు కృషి చేద్దామన్నారు. తొలుత వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి నివాళులర్పించారు. పీఏసీఎస్ ఛైర్మన్ జీఎస్ నాయుడును సత్కరించారు.

కోఆపరేటివ్ ఛైర్మన్ సింహాచలం నాయుడుకు సత్కారం

## పాలకొల్లులో నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు స్నేహపూర్వక భాగస్వామ్యంతో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు.

**పరిమిత సంఖ్యలో నేడు ఎంట్రీ పాసుల పంపిణీ**

ఎంట్రీ పాసులు కావాల్సిన వారు సోమవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మధ్యలో పాలకొల్లు పట్టణంలోని కరిమెరక బాలనాగేశ్వరరావు గ్రౌండ్, రామచంద్ర కన్వెన్షన్ వెనుక, బ్రాడీపేట బైపాస్ రోడ్ వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. - ఈనాడు, పాలకొల్లు

**సమయం:** ఈరోజు (సోమవారం) సాయంత్రం 5 గంటలకు
**స్థలం:** కరిమెరక బాలనాగేశ్వరరావు గ్రౌండ్, రామచంద్ర కన్వెన్షన్ వెనుక, బ్రాడీపేట బైపాస్ రోడ్, పాలకొల్లు

ఆంధ్ర ప్రదేశ్ | తెలంగాణ | Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

## హాయ్ చెప్పేయ్.. ఫోన్ పట్టేయ్

**91549 66503 వాట్సాప్ నంబరుకు**

● భీమవరం పట్టణానికి చెందిన లక్ష్మి ప్రయాణంలో తన చరవాణి పోగొట్టుకున్నారు. ఇక దొరకడం కష్టం అనుకున్నారు. పోలీస్ నంబరుకు హాయ్ పంపారు. కొన్ని రోజులకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి మీ చరవాణికి సంబంధించిన వివరాలతో రండి.. మీ ఫోన్ తీసుకెళ్లండని కబురు పెట్టారు.

● తాడేపల్లిగూడేనికి చెందిన చంద్రమోహన్ చరవాణిని గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఖరీదు రూ.లక్ష. పోలీస్ హాయ్ నంబరుకు సమాచారం ఇచ్చారు. చరవాణి కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తి కొనుగోలు చేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని అప్పగించారు.

చరవాణి అపహరణకు గురైనా, పోగొట్టుకున్నా.. బాధపడే రోజులు పోయాయి. ఎందుకంటే వాటిని పోలీసు శాఖ ఇట్టే పట్టేస్తోంది.

ట్రాకింగ్ నంబరు ఆధారంగా సాంకేతికతతో చరవాణిని గుర్తించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో సీఐ, పోలీసు బృందం పని చేస్తుంది. పోగొట్టుకున్న చరవాణి ఆన్‌చేసి సిమ్ వేయగానే ఎక్కడ ఉందో ఇట్టే తెలుస్తుంది. వెంటనే పసిగట్టి బాధితులకు అందజేస్తారు.

**ఇలా చేయండి..**
91549 66503 వాట్సాప్ నంబరుకు హాయ్, హెల్ప్ అని సందేశం ఇస్తే లింక్ వస్తుంది. లింక్‌లో ఎప్పుడు, ఎక్కడ ఎలా పోయింది. అది ఏ మోడల్ ఫోను, ఐ.ఎం.ఇ.ఐ నంబరు, ఫిర్యాదు చేస్తున్న వారి వివరాలు, చిరునామా నమోదు చేయాలి.

| ఇప్పటి వరకు ఇచ్చిన విడతలు | బాధితులకు అందించినవి | వాటి విలువ |
|---|---|---|
| 11 | 1738 ఫోన్లు | రూ.2.60 కోట్లు |

- న్యూస్‌టుడే, భీమవరం క్రైమ్

## కుర్రకారు రయ్‌రయ్

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే**

కుర్రకారు.. ఆపై కొత్త కారులంటే మోజు.. అదే సరికొత్త రకం మోడల్స్‌కు ప్రాణం పోస్తోంది. అంతే కాదు.. ఎక్కడ పోటీ పెట్టినా విజేతలుగా రయ్‌రయ్‌మని దూసుకెళ్తున్నారు. వారే విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యువత.

వాహనం టెస్ట్ డ్రైవ్ చేస్తున్న విద్యార్థి

**ఇండోర్‌లో ఇరగదీశారు..** జాతీయ స్థాయి హైడ్రోజన్ వాహన బాహా పోటీలు ఈ ఏడాది జనవరిలో ఇండోర్‌లో జరిగాయి. వీరి వాహనం ప్రథమస్థానంలో నిలిచి రూ.1.10 లక్షల నగదు బహుమతి గెలుచుకుంది. ప్రముఖ కారు కంపెనీలను వీరి కారు డిజైన్ ఆకర్షింపచేసింది. ఇలా ఒకటి కాదు ఏడాదిగా చెన్నై, పుణె, హిమాచల్ ప్రదేశ్ తదితర చోట్ల జరిగిన వివిధ వాహన తయారీ పోటీల్లో ఐదు ప్రథమ బహుమతులు సొంతం చేసుకున్నారు.

**ఎమిగోస్..** మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న మొదటి నుంచి ఆఖరి ఏడాది విద్యార్థులు 30 మంది ఎమిగోస్ (స్పానిష్‌లో ఫ్రెండ్స్) పేరుతో బృందంగా ఏర్పడ్డారు. వాళ్ల ఆలోచనంతా కొత్తరకం వాహనాలు సృష్టి పైనే. బాహా, గోకార్ట్, ఈ బైక్, బైస్కిల్ ఇలా ఏదైనా వినూత్నంగా, తక్కువ ఖర్చుతో తయారీ వాళ్ల ప్రత్యేకత.

**వీరే ఇంజినీర్లు**
పోటీలకు తగట్టు వాహనం ఎమిగోస్ బృందం రెండు వారాల్లోగా తయారు చేస్తుంది. వాహన విడి భాగాలను కళాశాల యాజమాన్యం సమకూరుస్తుంది. కారు పనితీరును తొలుత కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తారు. తర్వాత ప్రధాన రహదారులపైకి తీసుకెళ్తారు. అంతటితో ఆగకుండా గుంతలు, రాళ్ల రహదారులపై ఎంత వేగంతో వెళ్తుందో చూసుకుంటారు.

## విజయం ప్రాప్తిరస్తు!

ఏలూరులో సంతాన ప్రాప్తి రస్తు కథానాయకుడు విక్రాంత్, నాయిక చాందిని చౌదరి, చిత్ర బృందం ఓ ఐమ్యాక్స్ థియేటర్‌లో సందడి చేసింది. అనంతరం పడమర వీధి గంగానమ్మ జాతరలో చాందిని చౌదరి ఘటాన్ని తలపై పెట్టుకొని మొక్కు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు వన్‌టౌన్, ఆధ్యాత్మికం

## పంటు.. గోదారోళ్ల బంటు

ఆయ్..గోదారోళ్లం కదండీ.. మమకారం ఎక్కువండీ.. ఆ పంటులాగే.. మా తాతముత్తాల నుంచి.. మాకది నమ్మిన బంటు.. ఎందుకంటే.. మా దగ్గర నుంచి.. మా మనిమనవళ్ల వరకు.. అదే మమ్మల్ని మోస్తోంది.. రెండు జిల్లాల ఆదాయాలు.. గోదారమ్మ ఎలా కడుపులో పెట్టుకుని చూస్తుందో.. మందికీ.. దివికీ.. పుట్టుకకీ.. చావుకీ.. రెండు జిల్లాల వారధి.. అదే మాకు నిజమైన సారథి.. ఇంతకీ అప్పుడెప్పుడో అన్నట్టు గుర్తు.. వశిష్ఠ గోదావరి మధ్యలో వంతెన అని.. ఏమైంది.. అదా.. ఇదే దాని కథ.. గోదావరి జిల్లాల వ్యథ.

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే

**నిధులు మంజూరైనా..** నరసాపురం-సఖినేటిపల్లి కలుపుతూ వంతెన నిర్మాణానికి గత తెదేపా హయాంలో రూ.196 కోట్లు మంజూరయ్యాయి. 2020లో వైకాపా ప్రభుత్వం రూ.450 కోట్లతో 2023 నాటికి పూర్తి చేస్తామన్నా.. పనే ప్రారంభం కాలేదు. 2023లో కేంద్రం మరోసారి రూ. 580 కోట్లు మంజూరు చేసి 216 జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని సూచించింది. అయినా నేటికీ అడుగు పడలేదు.

● దశాబ్దాలుగా ఇదే ఆధారం
● ఎప్పటికీ వారధి సాకారం

జిల్లాలు: ఉభయ గోదావరి, కోనసీమ
పంటుపై ప్రయాణం 70 మీటర్లు
రోజూ ప్రయాణికులు 12వేలకు పైనే

**ఇబ్బంది:** పంటు ఆగిపోతే 20 కి.మీ. చుట్టూ తిరిగి చించినాడ లేదా రావులపాలెం మీదుగా వెళ్లాలి.
**భయం:** వరదలు, విపత్కర పరిస్థితుల్లోనూ ప్రయాణం.
**పరిష్కారం:** వంతెన

**మూడు తాడులంత లోతు**
ఇన్న వశిష్ఠ గోదావరిపై పంటు ప్రయాణం ఎంత భయంగా ఉంటుంది. అయినా తప్పదు. ఇటీవల మొంథా తుపాను నేపథ్యంలో నాలుగు రోజులు పంటు నిలిపివేశారు. అంతకుముందు తీవ్రగాలులకు అటుఇటు ఊగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దశాబ్దాల తరబడి ఇదే పరిస్థితి.

**నలుగురు సీఎంల హామీ**
➤ బ్రిటిష్ హయాంలో అంకురార్పణ జరిగిన వంతెన దశాబ్దాలుగా కలగానే మిగిలిపోయింది.
➤ నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంతెన ప్రతిపాదన తెరమీదకు తెచ్చారు.
➤ ఎన్టీ రామారావు హయాంలో 1986లో నరసాపురంలో, తూర్పుగోదావరి జిల్లాలో శంకుస్థాపనలు చేశారు.
➤ 2003లో చంద్రబాబు, వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2008లో శంకుస్థాపన చేశారు.
➤ సమస్య పరిష్కారానికి చర్చలు జరుపుతున్నామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు.

**ఆ ఒక్కటే కారణమా..**
వంతెన, అనుసంధాన రహదారుల నిర్మాణానికి సుమారు 56 హెక్టార్ల భూమి అవసరం. కోనసీమలో 36, జిల్లాలో 19.9 హెక్టార్ల భూమిని సేకరించారు. దిండి సమీపంలోని 216 జాతీయ రహదారి నుంచి రామేశ్వరంలోని వంతెన నిర్మాణ ప్రాంతం వరకు సుమారు 14 కి.మీ. అనుసంధాన రహదారి నిర్మాణానికి ప్రణాళిక చేశారు. రాజులంకలో వంతెన నిర్మించనున్న ప్రాంతం నుంచి లక్ష్మణేశ్వరం, వై.ఎస్.పాలెం, సీతారామపురం మీదుగా 216 జాతీయ రహదారి వరకు సుమారు 7.5 కి.మీ. మేరకు పది మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మించేందుకు ప్రణాళిక చేశారు. గుడిమెళ్లంకలో ఓ వ్యక్తి రహదారికి తన భూమిని ఇవ్వనని న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వారధి నిర్మాణం నిలిచి పోయిందని అధికారులు చెబుతున్నారు.

## నేనంటే అలుసు.. బతకడం తెలుసు

వేర్లతో సహా పెకిలించి భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్ గట్టున పడేసిన రావిచెట్టు మొదలు ఇది. వేర్లు మొత్తం భూమి ఉపరితలంపైనే ఉంటే మొక్కలైనా చెట్లయినా చనిపోతాయి. కానీ ఇది ఇటీవల వర్షాలకు మళ్లీ చిగురించింది. లేత ఆకులతో ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- న్యూస్‌టుడే, భీమవరం అర్బన్

## కైలాసవాసా.. శ్రీమంచునాథా..

ఆదివారం స్వామికి అలంకరణ ఇలా..

కార్తికం సందర్భంగా పంచారామ సోమేశ్వర జనార్దనస్వామి ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలతో మంత్రముగ్ధుడు అయిపోతున్నాడు. ఆపై కనులు చెదిరేలా రోజుకో అలంకరణలో తేజోమయుడిగా భక్తులకు దర్శనమిస్తున్నాడు. సోమవారం, మాస శివరాత్రి, పౌర్ణమి రోజున స్వామిని సాయంత్రం వరకు ఉపవాసం ఉంచి మహా నైవేద్యం సమర్పించి అలంకరిస్తారు.

- భీమవరం ఆధ్యాత్మికం

## పిల్లలకు.. అంత గుడ్డుగా ఎలా పెడతారు

**ఉద్దేశం:** చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కోడిగుడ్లు పెడుతోంది.

**మరే:** ఆరోగ్యం దేవుడెరుగు.. కొన్నిచోట్ల కుళ్లిన గుడ్లు వండుతున్నారు. అవి తింటే పిల్లల పరిస్థితి ఏమిటి?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నెలలో నాలుగుసార్లు గుడ్లను సరఫరా చేస్తున్నారు. వాటి పర్యవేక్షణను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. శనివారం మినహా మిగిలిన అయిదు రోజులు గుడ్డును ఉడకబెట్టే బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. ఇందుకు ఒక గుడ్డుకు 8 పైసలు చెల్లిస్తుంది.

☛ ఇటీవల కాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో కుళ్లిన కోడి గుడ్లు ఉడికించి పిల్లలకు సిద్ధం చేయడం కలకలం రేపింది.
☛ తాజాగా ఉండి ఉన్నత పాఠశాలలో గుడ్లు వాసనొస్తున్నాయని ఆహార కమిషన్ సభ్యుడికి విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

ప్రధానోపాధ్యాయులు నాణ్యత లేని వాటిని గుర్తిస్తే ఎంఈవోకు సమాచారం ఇచ్చి, వెంటనే వెనక్కి పంపించాలి. కొన్నిచోట్ల అలా జరగడం లేదు.

**తనిఖీలు ఏవీ?** లెక్క ప్రకారం శుక్రవారానికి గుడ్లు అయిపోవాలి. ఒకవేళ ఏమైనా మిగిలిపోతే శనివారం వాటిని విద్యార్థులకు అందించాలి. అయినా మిగిలిపోతే వాటిని పక్కన పడేయాలి.

**తూకంలో తేలిపోతోంది..** గుడ్లు నాణ్యమైనవో లేవో తెలుసుకునేందుకు ఉడకబెట్టే ముందు వాటిని నీళ్లలో వేసి పరిశీలించాలి. నీటిపైన పూర్తిగా పైకితేలితే పాడైనట్లు గుర్తించి, దూరంగా ఉంచాలి. అలా చేయడం లేదు. విద్యార్థులకు సరఫరా చేసే గుడ్లు 45 నుంచి 52 గ్రాముల వరకు ఉండాలి. ఒక ట్రేలో ఉండే 30 గుడ్లు కలిపి 1.5 కిలోల బరువు ఉండాలి. చాలాచోట్ల 1.2 కిలోలు దాటడం లేదు. తనిఖీలు ముమ్మరం చేస్తామని డీఈవో నారాయణ తెలిపారు.

ఈనాడు డిజిటల్, భీమవరం, కాళ్ల, న్యూస్‌టుడే

| పాఠశాలలు | విద్యార్థులు | నెలకు సరఫరా చేస్తున్న గుడ్లు |
|---|---|---|
| 1,384 | 94 వేలు | 16 లక్షలు |

## నేనే.. ఆ నలుగురిని..

ఆఖరి మజిలీలో నా అనేవారు లేని వారికి బంధువులు అవుతారు.. పార్థివదేహాలను భద్రపరిచేందుకు అవసరమైన ఫ్రీజర్లు ఉచితంగా అందిస్తారు.. శ్మశాన వాటికకు తరలించడానికి వాహనం సమకూరుస్తారు.. ఒక ముక్కలో చెప్పాలంటే మానవతా భీమవరం శాఖ ఆ నలుగురు అవుతోంది.

**శాంతి రథం..** మానవతా సంస్థ ఆధ్వర్యంలో శాంతి రథం ఉంది. పట్టణంలోని 39 వార్డుల్లో ఎవరైనా చనిపోతే తీసుకెళ్లేందుకు ఇది అందుబాటులో ఉంటుంది. డీజిల్ పోసుకుంటే చాలు. సాధారణంగా వాహనం ఏర్పాటు చేసుకోవాలంటే రూ.3 వేలకు పైగా చెల్లించాల్సిందే.

**ఉచితంగా ఫ్రీజరు..** కన్నవారికి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉపాధి, ఉద్యోగాల్లో స్థిర పడి జీవనం సాగిస్తున్న రోజులివి. అయిన వారు దూరమైతే చివరిసారి చూసేందుకు వచ్చే వరకూ మృతదేహాన్ని భద్రపరచడం కష్టం. అలాంటి వారి కోసం ఒక ఫ్రీజరును అందుబాటులో ఉంచారు. ప్రైవేటుగా ఏర్పాటు చేసుకోవాలంటే రోజుకు రూ.3500.

**అనాథ శవాలకు..** భీమవరం పట్టణంలో నెలలో 2 నుంచి 3 వరకు అనాథ శవాలు ఉంటాయి. వాటిని శ్మశానానికి తరలించడం, దహన కార్యక్రమాలు చేయించడం చాలా ఇబ్బంది. పురపాలక, పోలీసు శాఖల అనుమతులతో మానవతా వారే తీసుకెళ్లి దహన సంస్కారాలు చేస్తారు.

**సంప్రదించాల్సిన నంబర్లు**
94943 38086,
94901 04401,
92474 62667

- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

## అబ్బ.. దిబ్బరొట్టంటే పాలకొల్లే

పాలకొల్లులో 50 ఏళ్లుగా అల్పాహార చక్రవర్తిగా ఏలుతున్న వంటకం ఏదైనా ఉందంటే అది దిబ్బరొట్టె. స్థానిక మారుతీ కూడలి కేంద్రంగా దిబ్బరొట్టె రుచిలో తరతరాలుగా ఎందరో మహానుభావాల మెప్పు పొందుతోంది. మూకుడులో మినప పిండిని వేసి మూతపెట్టి నిప్పులపై కాల్చగా తయారయ్యే దిబ్బరొట్టెను పాలకొల్లుకు వచ్చిన సెలబ్రిటీలు సైతం తెప్పించుకుని రుచి చూస్తుంటారంటే అతిశయోక్తిలేదు. వేడివేడి చింతామణి చట్నీ (శనగపిండి చట్నీ)లో నంజుకు తింటూ మధ్యలో కాస్త గట్టి చట్నీ కూడా తగిలిస్తే నవరుచి తగిలిన నాలుక లొట్టల రూపంలో చేసిన శబ్దం విని అల్పాహార ప్రియుల పెదవులపై చిరునవ్వు విరబూస్తుంది. వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు అన్నివేళలా అందుబాటులో ఉంటుంది. - న్యూస్‌టుడే, పాలకొల్లు

## సివిల్ పరీక్షార్థులకు శిక్షణ

**ఏలూరు గ్రామీణ:** బీసీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ (ప్రాథమిక), మెయిన్స్ పరీక్షార్థులకు ఉచిత శిక్షణనివ్వనున్నట్లు ఆ కేంద్రం సంచాలకురాలు నాగరాణి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సోమవారం సాయంత్రం 5లోగా తమను సంప్రదించాలన్నారు.

## ముద్ర.. పడితేనే ముద్ద

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** రేషన్‌కార్డు కలిగిన వారికి ఈకేవైసీ తప్పనిసరి. ఈ నెలాఖరులోగా చేయించుకోకపోతే నోటి వద్ద ముద్ద పోయినట్లే.

**ఎక్కడ చేయించుకోవాలి:** రేషన్‌డీలర్లు వద్ద, గ్రామ-వార్డు సచివాలయాలు.
**సమస్య ఉంటే:** దగ్గర్లోని పౌర సరఫరాల అధికారిని సంప్రదించాలి.





బియ్యం కార్డులు 5,57,079
సభ్యులు 15,76,495
పూర్తయినవారు 14,79,289
ఈకేవైసీ అవసరం లేనివారు 37,490 (చిన్నారులు-వృద్ధులు)
చేయించుకోనివారు 59,716

## మొక్కతా.. ఆ పనేదో చేయండి

చెత్త కుప్పలు తొలగించి అక్కడ మొక్కలు నాటాలన్నది ప్రభుత్వ ఆదేశం. కానీ.. నియోజకవర్గ ప్రధాన కేంద్రం ఉండిలో పరిస్థితి ఇదీ. చెత్త నుంచి సంపద తయారీ మాట దేవుడెరుగు.. సేకరించిన చెత్తను వేసేందుకు స్థలం లేకపోవడంతో ఉప్పుగుంట వెళ్లే రహదారి అంచుల్లో కొండల్లా ఇరువైపులా పోస్తున్నారు. దానికి కూతవేటు దూరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటుగా రాకపోకలు సాగించే ప్రజలు ముక్కుపుటాలు అదిరిపోయేలా వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నారు. - న్యూస్‌టుడే, ఉండి

## మయూరమే నృత్యం చేస్తున్నట్లు..

ఈమె పేరు పంజా హేమశ్రీ. తొమ్మిదో తరగతి చదువుతోంది. కూచిపూడి నృత్యం, షటిల్‌లో ప్రతిభతో ఎన్నో అవార్డులు సాధించింది. నాట్యహంస బిరుదు సాధించింది. ఇప్పటివరకు 500 ప్రదర్శనలు ఇచ్చింది. నృత్య కళాకారిణిగా గుర్తింపు పొంది సినీ నృత్య ఆర్టిస్టు కావాలనేది ఆకాంక్ష.

- న్యూస్‌టుడే, భీమవరం సాంస్కృతికం

భీమవరానికి చెందిన చిన్నారులు చదువుతూనే కూచిపూడి నృత్యంపై మక్కువ పెంచుకున్నారు. చిన్నప్పటి నుంచి సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నాట్యమయూరిలా అలరించి అవార్డులు అందుకున్నారు.

ఏడో తరగతి చదువుతున్న ఈమె పేరు కావూరి నిత్యహాసిని నృత్యంలో అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందింది. నాట్య మాయూరి, నంది పురస్కారంతో కలిపి నృత్యంలో 6 అవార్డులు, మూడు పతకాలు అందుకుంది. నృత్య కళాకారిణిగా, మోడల్‌గా గుర్తింపు పొందాలని అభిలాష.

## నేడు మీకోసం

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో మీకోసం సోమవారం ఉదయం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**10వ వర్ధంతి**

మంచికి మారుపేరుగా
మమతానురాగాలు పంచిన మహోన్నత వ్యక్తి,
ఎందరికో ఆరోగ్యాన్ని అందించిన
సేవాతత్పరులు భువి నుండి దివికేగి
పది సంవత్సరములు గడిచిననూ
మీ మధుర స్మృతులు మరువలేకున్నాము.
సదా మీ జ్ఞాపకాలతో.....

కీ॥శే॥ డా॥ నందిగం వివేకానంద గారు
జననం 13-01-1954 చింతలపూడి, ప॥గో॥జిల్లా. మరణం 08-12-2015

కుటుంబ సభ్యులు


(c) eenadu

## క్షీరారామలింగేశ్వరుడికి పంచామృతాభిషేకాలు

**పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రామలింగేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# క్షణాల్లో.. మార్గదర్శనం!

● పాలకొల్లులో పంచారామ క్షేత్రానికి తెనాలి నుంచి వచ్చిన ఓ భక్తుడు స్వామి దర్శనం పూర్తయ్యాక తిరుగు ప్రయాణమయ్యారు. రైలు రావడానికి సాయంత్రం వరకు సమయం ఉండటంతో సమీపంలో చూడదగిన ఆలయాల కోసం సామాజిక మాధ్యమాల్లో వెతికారు. 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగొండ వాసవీమాత ఆలయ సమాచారంతో పాటు అక్కడకు వెళ్లేందుకు అనువైన ప్రయాణ సౌకర్యాలపై పలు సంస్థల్లో వీడియోలు కనిపించాయి. వాటిలో ఉత్సాహమైన ఎంపికచేసుకుని ఆ ఆలయాన్ని సందర్శించి వెనుదిరిగారు.

● ద్వారకాతిరుమల వచ్చిన మరో భక్తుడు ఏలూరు జిల్లా ప్రత్యేకతలు అని చరవాణిలో ట్రిప్ వేయగానే పోలవరం ప్రాజెక్టు నుంచి అంబికా దర్బార్ బత్తి వరకు 40 సెకన్లలో చెప్పేసే వీడియోలు బోలెడు కనిపించాయి. అనుసరించి వీడియోను వీక్షించి దానిలో ఉన్న చరవాణి నంబరుకు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకునేలా యువత చేసిన వీడియోలు సహకరిస్తున్నాయి.

**పాలకొల్లు, న్యూస్‌టుడే**

ఉమ్మడి జిల్లాలో పల్లెల నుంచి పట్టణాల వరకు ఉన్న ప్రముఖ ఆలయాలు విశిష్టత, చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన వీడియోలు ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ రీల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. యువ డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు కాలానికి అనుగుణంగా ఆయా విశేషాలను సంక్షిప్త వీడియోలుగా రూపొందిస్తున్నారు. వీటి ద్వారా సులభంగా జిల్లా ప్రత్యేకతలను స్థానికేతరులకు తెలియజేస్తున్నారు.

కొల్లేరులో పడవ షికారు

**ఆకట్టుకునేలా..** ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సామాజిక మాధ్యమాల్లో తమ స్వగ్రామాల వీడియోలను చూసి మన ఊరు ఇంతందంగా ఉందా అనిపించేలా రీల్స్, షాట్స్, వ్లాగ్స్ రూపొందిస్తున్నారు. ప్రత్యేకించి గోదావరి అందాలు, మన్యంలో జలపాతాలకు సంబంధించిన డ్రోన్ వీడియోలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కొల్లేటి సరస్సు, గుంటుపల్లి గుహలు, నరసాపురంలో వలందర రేవు, పంటు ప్రయాణం, పేరుపాలెం బీచ్‌ల సంబంధించిన రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో ఉన్నాయి.

పర్యాటకులు అతిథి గృహాలు

**సామాజిక మాధ్యమాల్లో జిల్లా ప్రత్యేకతలు**

**పశ్చిమ పేరుతో ఖాతాలు:** ఇలాంటి వీడియోలు ఉన్న సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ఎక్కువ శాతం పశ్చిమ గోదావరి పేరు కలిసేలా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పట్టణాల పేరిట కూడా ప్రత్యేక ఖాతాలు కొనసాగుతున్నాయి. వీటిలో కొన్ని ఖాతాలను వేలాది మంది అనుసరిస్తుండటం విశేషం.

## పొడవాటి తెల్ల కాకర

తణుకు మండలం వేల్పూరుకు చెందిన ముత్యాల సత్తిరాజు తన ఇంటి మేడపై సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల మొక్కలు, పాదులను సాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఆన్‌లైన్లో తెల్లకాకర విత్తనాలు తెప్పించి నాటారు. కాయలు 12 అంగుళాల వరకు పొడుగున్నాయి. దీనిపై వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త [illegible] మాట్లాడుతూ కాకర రకాలను బట్టి సాధారణంగా 5 నుంచి 10 సెంటీమీటర్ల వరకూ పెరుగుతాయన్నారు. మిద్దె సాగులో గాలి, వెలుతురు ప్రసరించినప్పుడు చీడపీడలు రావని, సేంద్రియ సాగుతో పోషకాలు అందించడంతో తీగజాతి కూరగాయల్లో పూర్తి దిగుబడి వస్తుందన్నారు. కర్ణాటక, తమిళనాడులో తెల్లని కాకరను ఎక్కువగా సాగుచేస్తారన్నారు. ఆ తరహా రకాన్ని జిల్లాలోనూ పెంచడం అభినందనీయమని తెలిపారు. **- ఈనాడు, తణుకు**

## మావుళ్లమ్మను పూజించి.. దీక్షలు విరమించి..

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** భీమవరం మావుళ్లమ్మ మాలధారణ భక్తుల దీక్షల విరమణ, పూర్ణాహుతి నేత్రపర్వంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో ఆదివారం తెల్లవారుజామున ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, వేద పండితులు, అర్చకులు మాలధారణ భక్తుల ఇరుముడులకు పూజలు చేయించారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో 653 మంది దీక్షలు స్వీకరించినట్లు గురుమాత తెలిపారు. కళా వేదిక ఎదుట ఏర్పాటు హోమ గుండంలో ఆలయ సహాయ కమిషనర్ బీవీ నగేష్, ప్రధానార్చకుడు అగ్ని ప్రతిష్ఠ చేశారు. దీక్ష భక్తులు హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి హోమ ద్రవ్యాలు సమర్పించారు.

పూర్ణాహుతి సమర్పించి నమస్కరిస్తున్న అర్చకులు, భక్తులు

## సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సనాతన సంప్రదాయ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శివకేశవ పీఠం(తాడేపల్లి) సంస్థాపకులు మాతా శివానందసరస్వతి అన్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆదివారం భీమవరంలో హిందూ వన విహార్ [illegible], ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి మంతెన రామచంద్రరాజు ఆధ్వర్యంలో వేగిరాజు రామకృష్ణంరాజు(ప్రకృతి ఆశ్రమం)లో ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధనలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్ర ప్రాంత ప్రచారక్ విజయాదిత్య మాట్లాడుతూ [illegible] మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలు కులమతాలకు అతీతంగా ఏర్పాటు చేయడంతో.. మన సంస్కృతిని తెలియజేసేందుకు దోహద పడతాయన్నారు. తొలుత ప్రాంగణంలో గోపూజ, కార్తిక దామోదర పూజలు నిర్వహించారు. శివుడు, నందీశ్వరుడు ప్రతిమలు, కూచిపూడి, దాండీ నృత్యాలు, సంగీత కచేరి, డోలు వ్యాయిదాలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 15 వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, వివిధ సంస్థల ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనుగ్రహ భాషణం చేస్తున్న మాతా శివానందసరస్వతి, చిత్రంలో రామచంద్రరాజు, విజయాదిత్య, శ్రీనివాసవర్మ

## గ్రంథాలయాలను నిత్యం సందర్శించండి: జేసీ

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** మన సంస్కృతిలో భాగంగా దేవాలయం, మసీదు, చర్చిలు సందర్శించినట్లుగా ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం అలవర్చుకోవాలని జేసీ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాలయాలకు విశేష సేవ చేసిన ప్రముఖులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రఘునాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయానికి రూ.4 లక్షలతో వాటర్ ప్లాంట్, రెండు కంప్యూటర్లు, ప్రింటర్, ఇన్వర్టర్ అందించిన తిరుమల విద్యాసంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ గ్రంథాలయంలో చదువుకుని వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించిన 20 మందిని సత్కరించారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు వి. కనకరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల విజేతలను సత్కరించిన రాహుల్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు

## స్ఫూర్తి ప్రదాత ఉయ్యాలవాడ

**మాచర్ల, న్యూస్‌టుడే:** స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మాచర్ల కూడలిలో ఏర్పాటు చేసిన నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం, దేశం కోసం పోరాడిన ఆయనకు బ్రిటీషు ప్రభుత్వం ఉరిశిక్ష వేస్తే.. ఇంతకంటే మీరేం చేయగలరంటూ చిరునవ్వుతో సమాధానమిచ్చిన యోధుడు నరసింహారెడ్డి అని చెప్పారు. సమర యోధుడికి ఇచ్చిన గౌరవమే ఈ విగ్రహావిష్కరణ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ దేశభక్తిలో నరసింహారెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు.

విగ్రహావిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న మంత్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే పితాని తదితరులు

## దివ్యాంగ బాలికకు నడకొచ్చింది

### కలెక్టర్ చొరవతో వైద్యం

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** దివ్యాంగురాలైన ఏడేళ్ల కుమార్తెకు పింఛను ఇప్పించాలంటూ పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన అంజలి సెప్టెంబరు 8న భీమవరంలోని కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కి వచ్చారు. ఆమె వెంట ఉన్న బాలికతో కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. సమస్య గురించి అడిగి తెలుసుకుని వెంటనే వైద్యం చేయించాలని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త కీర్తికి ఆదేశాలిచ్చారు. ఫిజియోథెరపీ ద్వారా ఆ పాప పూర్తి స్థాయిలో నడవగలుగుతుందని సమాచారశాఖాధికారులు ఆదివారం తెలిపారు. జీవితాంతం దివ్యాంగురాలిగా ఉండిపోతుందనుకున్న బాలిక కలెక్టర్ చొరవతో చికిత్స పొంది సాధారణ స్థితికి చేరడంపై అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## తీరం.. మద్యం దూరం!

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** కార్తిక మాసంలో చివరి ఆదివారం పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సముద్ర అలలల్లో ఆహ్లాదంగా గడిపారు. భక్తులు తీరంలోని అష్టలక్ష్ముల సమేత మత్స్య నారాయణ స్వామి, శిర్డీసాయిబాబా, అభయాంజనేయస్వామి, రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. బీచ్‌లో పర్యాటకుల రక్షణ నిమిత్తం నో డ్రింక్ జోన్‌ను అమలు చేశారు. బీచ్‌కు వెళ్లే మార్గాల్లో పోలీసులు తనిఖీలు చేసి పర్యాటకులు తీసుకువెళ్తున్న మద్యం సీసాలను ధ్వంసం చేశారు.

## తపాలా ఉద్యోగులు ఐక్యంగా సాగాలి

**నిడదవోలు, న్యూస్‌టుడే:** గ్రామీణ తపాలా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఏపీ సర్కిల్ కార్యదర్శి వై. మర్రిరెడ్డి అన్నారు. నిడదవోలులో ఆదివారం తాడేపల్లిగూడెం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు సంఘ 3వ ద్వైవార్షిక మహాసభను నిర్వహించారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. రవీంద్ర, కార్యదర్శిగా ఎస్. రమేష్, కోశాధికారిగా పి. పవన్‌కుమార్‌లను ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. దుర్గారావు, రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి పి. భూలోకం, ఏలూరు డివిజన్ కార్యదర్శి ఎస్ఎస్ బాజీ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు బీవీ రమణ, తాడేపల్లిగూడెం డివిజన్ పరిశీలకుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

రాజోలులో మాట్లాడుతున్న రాంబాబు

## కళాకారుల సంక్షేమానికి కృషి

**రాజోలు, న్యూస్‌టుడే:** కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్ర కళాకారుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచంట రాంబాబు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల కళాకారుల సంక్షేమ సంఘ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధ కళాకారులకు అందిస్తున్న రూ.4 వేల పింఛనును రూ.6 వేలకు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

# నిధులిచ్చినా.. కదలరేం..

### ఆర్‌అండ్‌ఆర్‌లో సిబ్బంది నిర్లక్ష్యం

### ముంపు భూముల సేకరణకు యత్నాలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలే దృఢ సంకల్పంతో ఉంది. ఈ క్రమంలోనే ఇటీవల రూ.వెయ్యి కోట్లు పరిహారాన్ని నిర్వాసితులకు అందజేశారు. గడువు కంటే ఆర్నెల్లు ముందే పునరావాసం పూర్తి చేయాలనే లక్ష్యంతో భూసేకరణపై ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. అల్లూరి జిల్లా పరిధిలోని నిర్వాసితుల కోసం ఏలూరు జిల్లా మన్యంలో సేకరిస్తున్నారు. సుమారు 1,900 ఎకరాల సేకరణకు ప్రకటన విడుదలైంది. ఈ సమయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, తప్పులు.. పనులకు ప్రతిబంధకంగా మారాయి.

**ముంపు భూమిని కూడా..**

కూనవరం మండలంలోని పంద్రాజుపల్లి నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి మండలం గోపాలపురం రెవెన్యూ పరిధిలో సుమారు 83.17 ఎకరాల భూసేకరణకు ఇటీవల ప్రాథమిక ప్రకటన ఇచ్చారు. ఇందులో సుమారు 10.63 ఎకరాలను ఉపసంహరణ చేస్తున్నట్లు మరో ప్రకటన విడుదల చేశారు. తీరా చూస్తే ఉపసంహరణ ప్రకటన ఇచ్చిన భూమి చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం గతంలోనే సేకరించిందని కావడం గమనార్హం. ఈ విషయాన్ని రెండో ప్రకటనలో భూ సేకరణ అధికారులే వెల్లడించారు. ఒకసారి సేకరించిన భూమికి 2వ పర్యాయం ప్రకటన ఇవ్వడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది.

సర్వేపై అభ్యంతరం తెలుపుతూ ఎస్‌డీసీ సతీశ్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

**సొమ్ములు ఇవ్వలేదని..** స్పెషల్ కలెక్టర్ అడిగినంత తాము ఇవ్వలేదని కోయరాజమండ్రిలో భూసేకరణను ఆపేశారంటూ వేదాంతపురం రైతులు ఇటీవల ఆరోపించారు. భూసేకరణకు 20 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు ఇటీవల బాహాటంగా ఆరోపించారు.

**గిరిజనుల అభ్యంతరంతో..** గోపాలపురం భూములను సాధారణ విధానంలో కాకుండా కన్‌సెంట్ అవార్డు ద్వారా వేగంగా సేకరించాలని స్పెషల్ కలెక్టర్ సరళావందనం ప్రయత్నించారు. చింతూరు ఎస్‌డీసీని కాదని.. కొవ్వూరు ఎస్‌డీసీ సతీశ్‌కు ఈ పనులు అప్పగించారు. ఆయన సర్వే చేపట్టగా.. గిరిజనులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. కన్‌సెంట్ విధానంలో సేకరించాలని స్పెషల్ కలెక్టర్ తనను ఆదేశించడంతోనే తాను సర్వే చేపట్టానని ఎస్‌డీసీ సతీశ్ పేర్కొన్నారు. కేవలం పది, పదిహేను రోజుల్లోనే అవార్డు జారీ చేయాలని యత్నించారు. కాగా స్పెషల్ కలెక్టర్ బదిలీతో దీనికి గండి పడింది.

**విరమణ లోపు..** పదవీ విరమణకు కొద్ది కాలమే గడువు ఉండటంతో ఈ లోపే తన విస్తృత అధికారాలతో చక్రం తిప్పాలని ఓ అధికారిణి బాగా తాపత్రయపడినట్లు సమాచారం. తప్పులు దొర్లడానికి ఇవే కారణాలన్న విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం కూడా సాగనంపింది.

గెలుపొందిన విశాఖ మహిళా జట్టుకు కప్ ఇస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

## ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** క్రీడలు విద్యార్థులను చదువులో ముందు నిలపడమే కాకుండా, ఉద్యోగం సాధించేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని క్రిసాలిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-19 నెట్‌బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నియోజకవర్గంలో నిర్వహించడం ఈ ప్రాంతంలోని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతుందన్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ జిల్లా జట్లతో తలపడ్డారు. బాలుర విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా.. తూర్పు గోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో విశాఖపట్నం విజేతగా నిలవగా, పశ్చిమగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు కల్తీ చేశారంటూ సిబ్బందిపై దౌర్జన్యం

**కామవరపుకోట, న్యూస్‌టుడే:** పెట్రోల్ కల్తీ చేశారంటూ కొంత మంది వ్యక్తులు బంకు సిబ్బందిపై దౌర్జన్యం చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపోతేపల్లి అడ్డ రోడ్డు వద్ద ఉన్న కె.జగ్గవరం సొసైటీ పెట్రోలు బంకులో శనివారం రాత్రి పోతేపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేశారు. వారి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు పెట్రోలు బంకులో పంపుల వద్ద పెట్రోలు చల్లుతూ తగలపెడతామంటూ బెదిరించారు. దాడికి పాల్పడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందాయి. దీనిపై సొసైటీ ఛైర్మన్ బొంతు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తడికలపూడి ఎస్సై చెన్నారావు ఆదివారం సంఘటన స్థలాన్ని తనిఖీ చేశారు. పెట్రోలు కల్తీని పరిశీలించారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని ఎస్సై వివరించారు.

నాణ్యత పరిశీలిస్తున్న పోలీసులు

## కళాశాల వంట గదిలో విద్యార్థి బలవన్మరణం

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడు మండలంలోని మిట్టగూడెం బీసీసీఏ కళాశాల విద్యార్థి పానం నందనకుమార్(19) ఆదివారం వసతి గృహం వంటగదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం బత్రావారి గూడేనికి చెందిన నందనకుమార్ కళాశాల వసతిగృహంలో ఉంటూ బీసీసీఏ సెకండ్ లెవల్ తరగతులకు హాజరవుతున్నాడు. కళాశాల వంటగదిలో ఐరన్‌రాడ్‌కు విద్యుత్తు తీగలు కట్టి ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. వసతిగృహంలో మిగిలిన ఆహార పదార్థాలను పందుల మేత కోసం తీసుకెళ్లే వ్యక్తి ఉదయం వంటగదిలోకి వెళ్లి ఈ విషయాన్ని గుర్తించాడు. వెంటనే కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. యాజమాన్యం మృతుని తల్లిదండ్రులకు, రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో నందన్‌కుమార్ వసతిగృహం నుంచి బయటకు వెళ్లడం చూశామని, తరువాత ఏం జరిగిందో తెలియదని సహచర విద్యార్థులు చెబుతున్నారు. కళాశాల ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. మృతుని తండ్రి అచ్యుతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. తరగతి గదుల్లో సహచర విద్యార్థులతో ఉత్సాహంగా, చదువులోనూ ముందంజలో ఉండే విద్యార్థి ఉరి వేసుకోవడంపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రేమ వ్యవహారమా లేక విద్యార్థుల మధ్య ఏవైనా ఘర్షణలు జరిగాయా, చదువులో ఒత్తిడి ఎదుర్కొంటున్నాడా తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

నందనకుమార్ (పాత చిత్రం)

### బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

## స్పర్శ లేదా.. నిర్లక్ష్యం వద్దు!

### కుష్ఠు బాధితుల గుర్తింపునకు నేటి నుంచి సర్వే

**మాచర్ల, న్యూస్‌టుడే:** కుష్ఠు వ్యాధిని 2027 నాటికి నిర్మూలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా బాధితులను గుర్తించేందుకు ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. దీనిపై ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, వైద్య సిబ్బంది, వైద్యాధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించేందుకు 1,485 బృందాలను ఏర్పాటు చేశారు.

**ఉచితంగా చికిత్స**

రెండేళ్ల వయసు పైబడి వారికి శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వారి సమాచారం సేకరించి స్థానిక వైద్యాధికారితో పరిశీలన చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఉచితంగా చికిత్స అందిస్తారు. వారి కుటుంబ సభ్యులను సైతం అప్రమత్తం చేస్తారు. ప్రతి బృందం గ్రామీణ ప్రాంతంల్లో 20-25 ఇళ్లను, పట్టణాల్లో 30-40 ఇళ్లను సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యాధి లక్షణాలపై మహిళలకు ఆశా కార్యకర్తలు, పురుషులకు వాలంటీర్లు ప్రాథమిక పరిశీలన చేయాల్సి ఉంటుంది. సర్వే తీరును పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తాయి. తొలి దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకొంటే తక్కువ సమయంలో నయమవుతుందని.. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత సేవలు అందిస్తామని జిల్లా అదనపు వైద్యాధికారి ఎం. రవిబాబు తెలిపారు.

**మూడేళ్లలో ఇదీ పరిస్థితి..**

| సంవత్సరం | కేసులు |
|---|---|
| 2022-23 | 96 |
| 2023-24 | 133 |
| 2024-25 | 89 |

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** వాల్టా చట్టానికి అక్రమార్కులు ఎక్కడికక్కడ తూట్లు పొడుస్తున్నా అధికార యంత్రాంగం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తోంది. నూజివీడులో మామిడి తోటలను యథేచ్ఛగా నరికేస్తూ లారీలపై టింబర్ డిపోలు, ఇటుక బట్టీలు, బొగ్గు తయారీ, వివిధ పరిశ్రమల అవసరాల నిమిత్తం తరలిస్తున్నారు. పొలాల్లో రహదార్ల పక్కన ఉన్న మారుజాతి కర్ర తరలిపోతుంది. విద్యుత్తు సిబ్బంది తీగలకు అడ్డు వస్తున్నాయని మరి కొన్ని చెట్లను నరికివేస్తున్నారు.

నూజివీడులో రహదారి పక్కన లోడు చేస్తున్న మామిడి కలప

**సగానికి పడిపోయిన విస్తీర్ణం..** ధర, తెగుళ్ల బెడదతో మామిడి రైతులు ఏటా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీంతో తోటల నరికివేతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 60 వేల హెక్టార్లలో ఉండాల్సిన మామిడి సగానికి పడిపోయింది.

**నిబంధనలు ఇవే..** ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పొలాలు, రహదారులు, కొండలు, కాలువ గట్లపై చెట్లు నరికి వేయాలంటే వాల్టా చట్టం ప్రకారం తహసీల్దారు అనుమతి పొందాలి. రెవెన్యూ అధికారులు పరిశీలించి అటవీశాఖ అధికారులకు నివేదిక పంపుతారు. కొంత సొమ్మును చలానా రూపంలో చెల్లించాలి. ఈ అనుమతి దక్కిన తరువాత చెట్లను నరకాలి. వ్యాపారులే అంతా తామై రైతుల పేరుతో అనుమతులు తీసుకుని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 'అటవీ ఉత్పత్తులు తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలో ఉన్న కలప ఇటువైపు వస్తుంది. వాటి అనుమతులు పరిశీలిస్తున్నాం' అని నూజివీడు అటవీశాఖ రేంజర్ సత్యనారాయణ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడు మండలం సిద్ధాపురం గ్రామ పరిధిలోని నందమిల్లిపాడు ప్రాంతానికి చెందిన ఘంటసాల వెంకటేశ్వరరావు(60) స్థానిక ఆక్వా చెరువు గట్టుపై పచ్చగడ్డి కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. తండ్రి మృతిపై కుమారుడు వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

REAL ESTATE

PLOT FOR SALE

తణుకు, వేమవరం 10వ వార్డులో, చిట్టూరి బాపినీడు గారి ఇంటి వెనుక లేఔట్‌లో తూర్పున పంటకాలువ ఉన్న N/E కార్నర్ ఈశాన్య ప్లాట్ (నెం.42) 253 చ॥గజాలు అమ్మకానికి కలదు. మున్సిపాలిటీ వారిచే క్రమబద్ధీకరణ చేయించడమైనది. ✆ 8639 779 569.

JOBS

Vijnana Bharathi EM High School, China amiram. Wanted Vice Principal. Contact Number: 95421 76926. Mail: vbbvkca@gmail.com.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

(c) eenadu

భీమవరం
• భీమవరం • ఉండి

## చక్కెరతో చెన్నమల్లేశ్వరస్వామికి అభిషేకాలు

**ఉండి, న్యూస్‌టుడే:** కార్తిక మాసం ఆఖరి ఆదివారాన్ని పురస్కరించుకొని ఉండి రాజులపేటలోని శ్రీపార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామికి చక్కెరతో ప్రత్యేక అభిషేకాలు చేయించారు. ఆలయ అర్చకుడు సన్నిధిరాజు శేష గిరిరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌నాయుడుల ఆధ్వర్యంలో తొలుత స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

## స్వదేశీ వస్తువులనే కొనండి

**ఉండి, న్యూస్‌టుడే:** స్వదేశీ వస్తువులనే ప్రజలందరూ కొనుగోలు చేయాలని ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ జిల్లా కన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వరరాజు పిలుపునిచ్చారు. వెలివర్రు గ్రామంలో ప్రతి ఇంటా స్వదేశీ .. ఇంటింటా స్వదేశీ అనే అంశంపై ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా పోటీపడగలిగే స్థాయికి మన దేశీయ ఉత్పత్తుల సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. భాజపా మండల ఇన్‌ఛార్జి అల్లూరి సాయి దుర్గరాజు మాట్లాడుతూ స్వదేశీ నినాదంతో ముందుకు సాగితే నూతన పరిశ్రమల ఏర్పాటుతో యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల భాజపా నాయకులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో కార్తిక వన సమారాధనలు

సోమేశ్వరుని సన్నిధిలో అన్న కుంభానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** కార్తిక మాసంలో ఆధ్యాత్మిక చింతనతో నిర్వహించే కార్తిక వన సమారాధనలు ఎంతో ప్రయోజనకరమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఆదివారం పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన ప్రారంభించి మాట్లాడారు. తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి మెంటే పార్థసారథి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ బంగార్రాజు, సభ్యులు, ఈవో రామకృష్ణంరాజు పాల్గొన్నారు. ✦ జువ్వలపాలెం రోడ్డులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, హౌసింగ్‌బోర్డు కాలనీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ అవార్డు అందుకున్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ కంతేటి వెంకట్రావును సభ్యులు సత్కరించారు. ✦ ఉమాసోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేకి ఆశ్రమంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులు చెరుకుపల్లి సంతోష్, ఎస్.కృష్ణమోహన్, వివిధ ఆలయాల ధర్మకర్తలు వేలూరి సుబ్రహ్మణ్యం, బ్రహ్మణోత్తముల ప్రసాద్, సమాజ సభ్యులు పాల్గొన్నారు.

## ఆకివీడులో ఉత్సాహంగా.. ఉల్లాసంగా

మాదివాడలో కాపు సంఘం వన సమారాధనకు హాజరైన మహిళలు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడులో మాదివాడ ప్రాంతంలో కాపు సంఘం, పెద్దింట్లమ్మ ఆలయం వద్ద తూర్పు కాపు సంఘం, ఎస్ కూడలి సమీపంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు చోట్లా ప్రదర్శించిన నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాదివాడలో జరిగిన కార్యక్రమంలో మోటుపల్లి రామవరప్రసాద్, కోపల్లె సాయిబాబా, గంధం ఉమా, పీవీఎల్ నరసింహారాజు తదితర కూటమి, వైకాపా నాయకులు పాల్గొన్నారు. గౌడ సంఘం వనసమారాధనలో రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు తదితరులు, తూర్పు కాపు కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శాకాహారంతో ఎంతో మేలు

ధ్యాన విశిష్టతను వివరిస్తున్న సంత్ సదానందగిరి మహారాజ్

**వీరవాసరం, న్యూస్‌టుడే:** శాకాహారం మానవుల జీవన ఆహారమని పలువురు వక్తలు అన్నారు. వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ 20వ వార్షికోత్సవాల సందర్భంగా స్థానిక సీతారామస్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధ్యాన శిక్షణ తరగతులు కొనసాగాయి. ఆదివారం శాకాహారం, ధ్యానం ప్రాముఖ్యతలను సంత్ సదానంద గిరి మహారాజ్, గుంటూరు జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు వెలగపూడి లక్ష్మణరావులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు రుద్రరాజు పెద్దివర్మ, జిల్లా సమన్వయకర్త కేవీడీ. ప్రసాద్, డాక్టర్ పిప్పళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

## నిత్యం నరకమే

### ఈ దారుల్లో ప్రయాణం సాహసమే

● భీమవరం నుంచి పర్యాటక ప్రాంతమైన పేరుపాలెం వెళ్లాలంటే ఇదే ముఖ్యమైన మార్గం. నాగిడి పాలెం మీదుగా తీర ప్రాంత జాతీయ రహదారి 216 చేరుకోవచ్చు. భీమవరం, మొగల్తూరు మండలాల పరిధిలో ఎక్కువగా ఆక్వాసాగు విస్తరించి ఉంది. దానికి సంబంధించిన ఉత్పత్తులతో పాటు ఇతర భారీ వాహనాలు నిత్యం ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ మార్గంలో పలు ఆక్వా పరిశ్రమలు ఉన్నాయి. పలు విద్యా సంస్థలకి చెందిన బస్సులకి తోడు వేల సంఖ్యలో వాహనాల ద్వారా ప్రజలు రాకపోకల సాగిస్తుంటారు. గుంతల్లో పడి వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** భీమవరం నియోజకవర్గంలో కీలక రహదారులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మామూలు రోజుల్లోనే అధ్వానంగా ఉండే ప్రధాన రహదారులు ఇటీవల తుపాను దెబ్బకి మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలున్నాయి. నిత్యం ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

కొత్తపూసలమర్రు వద్ద రహదారి ఇలా

భీమవరం-కాళీపట్నం, భీమవరం-లోసరి, భీమవరం-వెంప, భీమవరం-ఎల్‌వీఎన్‌పురం రహదారులు చూసేందుకు భయం కలిగించేలా ఉన్నాయి. పెదగరువు, కొమరాడ, తోకతిప్ప, గూట్లపాడు రేవు తదితర ప్రాంతాల్లో రోడ్లను చూస్తే హడలిపోవాల్సిందే. వీరవాసరం మండలంలో నవుడూరు, మత్స్యపురి, తోలేరు వెళ్లే రోడ్లను కొత్తవారెవరైనా చూస్తే ఇవి రోడ్లా అని ఆశ్చర్యపోవాల్సిందే. 'కొన్ని మార్గాల్లో రహదారులను అభివృద్ధి చేసేందుకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ర.భ.శాఖ ఏఈ రాజశేఖర్ తెలిపారు.

## సీసీఎల్ ఉపయోగించుకునే ఆప్షన్ ఇవ్వాలి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ముఖ ఆధారిత హాజరు యాప్‌లో సీసీఎల్ ఉపయోగించుకునే ఆప్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బి.వి నారాయణ కోరారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం, పండుగ సెలవుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ ప్రొసీడింగ్స్ ఇచ్చారని, ముఖ ఆధారిత యాప్‌లో ఆప్షన్ ఇవ్వకపోవడంతో గత ఏడాది ఉపాధ్యాయులు సీసీఎల్‌ను ఉపయోగించుకోలేకపోయారని ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు గరగపర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** గరగపర్రు రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణ రాజు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పాలకోడేరు వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు.

## సాంకేతిక విప్లవంతోనే అభివృద్ధి

మధులాష్‌బాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

**శృంగవృక్షం(పాలకోడేరు), న్యూస్‌టుడే:** నిత్యం కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక విప్లవాన్ని అన్వయించుకుంటూ ముందుకు వెళ్తేనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందని ఎడోధ్వజ స్టార్టప్ సంస్థ ఛైర్మన్ క్రొవ్విడి మధులాష్‌బాబు తెలిపారు. శృంగవృక్షంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్యుల కార్తిక వనసమారాధన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఇటీవల రోమ్‌లో ఐక్య రాజ్య సమితికి చెందిన ప్రత్యేక సంస్థ ఆహార, వ్యవసాయ ఆర్గనైజేషన్(ఎఫ్ఏఓ) నిర్వహించిన సీడ్ టు స్కేల్ కార్యక్రమంలో పాల్గొని కోళ్లలో వచ్చే మరణాలను ఏఐ టెక్నాలజీతో ముందుగానే గుర్తించే ప్రాజెక్టును ప్రదర్శించి మూడో స్థానం పొందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తెలుగు ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన సందర్భంగా మధులాష్‌బాబును పలువురు సత్కరించి కొనియాడారు. ఈ సందర్భంగా మధులాష్‌బాబు మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌ను కూటమి ప్రభుత్వం ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఈ చర్యలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

| | |
|---|---|
| భీమవరం పట్టణం: 80085 74471 | 10 AM to 1 PM |
| భీమవరం మండలం: 80085 74533 | వీరవాసరం: 80085 74475 |
| పాలకోడేరు: 80085 74467 | ఉండి: 80085 74526 |
| ఆకివీడు: 80085 74525 | కాళ్ల: 94401 04042 |

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ? బలుసుమూడిలో చెత్తను తీయడంలేదు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటికి వచ్చి సేకరించడంలేదు - **కె.రాము, స్థానికుడు**

? శ్రీరామపురంలో చెత్త గుట్టలు దుర్వాసన వస్తున్నాయి. - **జి.శ్రీవల్లి, స్థానికులు**

✔ చెత్త సేకరణను దగ్గరుండి పరిశీలిస్తా. **-ఎ.రాంబాబు, సహాయ కమిషనర్**

**భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే:** ? రాయలం నుంచి అనాకోడేరు వరకు రహదారి గుంతలమయమైంది. **-సత్యనారాయణ**

✔ సిబ్బందిని పంపించి పరిశీలన చేయించి గుంతలు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటాం. **-రాజశేఖర్, ఏఈ, ర.భ.శాఖ, భీమవరం**

**ఉండి, న్యూస్‌టుడే:** ? ఉండి నుంచి పెదపుల్లేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి చాలా చోట్ల గుంతలుపడింది. - **మీనాక్షి, ఉండి.**

✔ ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే మరమ్మతులు చేస్తాం. **-శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ**

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ? ఆకివీడు రెడ్డి వీధి ప్రాంతంలో ప్రాథమిక పాఠశాల సమీపంలో చెత్త పారవేస్తున్నారు. - **స్థానికులు**

✔ చర్యలు తీసుకుంటాం. **-సాకేత్‌బాబు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? పెదకాపవరం నుంచి క్రొవ్విడి వరకు రహదారి గోతులమయంగా మారింది. **-సుబ్బారావు, గుమ్ములూరు.**

✔ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. **-శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ**

### స్పందనకు వందనం

తీగల తొలగింపు.. **భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే:** పట్టణంలోని రావూరి వారి వీధి కూడలి ప్రారంభంలో విద్యుత్తు స్తంభాలకు తీగజాతి మొక్కలను విద్యుత్తు సిబ్బంది తొలగించారు. ఈనెల 14న 'మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన సమస్యకు ఏఈ కె.రవివర్మ స్పందించి పనులు చేయించారు.

పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు.. **భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పట్టణంలో పైపులైన్ల లీకేజీలతో నీరు వృథా అవుతోంది. విస్సాకోడేరు వంతెన దగ్గర నుంచి పట్టణ పరిధి వరకు ఉన్న ఈ సమస్య పరిష్కరించాలని కుళాయి నీరు వృథాపై ఈ నెల 6న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పురపాలక ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు.

## శిథిల భవనంలో ఇంకెన్నాళ్లు?

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** ఇది శిథిల స్థితికి చేరిన భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం. దీని ద్వారా ఏటా అత్యధిక ఆదాయం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సమకూరుతోంది. బ్రిటిష్ కాలం నాటి కార్యాలయం కావడంతో దశాబ్దాల నాటి దస్త్రాలు భద్రపరిచేందుకు సరైన సౌకర్యాలు లేవు. లోపలంతా చీకటి గుహలా ఉంటుంది. వర్షానికి కారకుండా కార్యాలయం పైభాగంలో బరకం కప్పి నెట్టుకొస్తున్నారు. కిటికీల తలుపులు ఎప్పుడో చెదలు పట్టాయి. జిల్లా కేంద్రం అయ్యాక దీనికి మంచి రోజులొస్తాయని ఆశించినా ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. నిత్యం వందల మంది క్రయవిక్రయదారులు ఇక్కడికొస్తుంటారు. కనీసం తాగునీటి వసతి కూడా ఇక్కడ సక్రమంగా ఉండదు. వాహనాలు నిలిపే చోటు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక్కడ కొత్త భవనం నిర్మించాలని గతంలోనే ప్రతిపాదనలు పంపించామని సబ్ రిజిస్ట్రార్ ప్రసాదరెడ్డి తెలిపారు.

లోపల భద్రపరిచిన రికార్డులు

శిథిలావస్థలో భీమవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

## రహదారులు బాగు చేయిస్తాం: మంత్రి

**ఆచంట, న్యూస్‌టుడే:** జిల్లాలో రహదారుల సమస్య తన దృష్టికి తీసుకుని వచ్చిందని.. అన్ని రోడ్లను దశలవారీగా బాగు చేయిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆచంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ప్రారంభించారు.

## కుండీలే మిగిలాయి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పైవంతెనకు ఇరువైపులా మొక్కలతో కుండీలను పురపాలక అధికారులు ఏర్పాటు చేశారు. మొక్కలను సంరక్షించకపోవడంతో అవి మొగ్గ తొడగలేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణించే దారి పక్కన ఖాళీగా కుండీలు కనిపిస్తున్నాయి. మొక్కలు నాటి నీళ్లు పోసి పర్యవేక్షిస్తే పూలతో అందంగా కనిపిస్తాయి. మొక్కలు నాటించి రక్షణ ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు.

## మురుగు పారదు.. సమస్య వీడదు

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి రైల్వే గేటు నుంచి కృష్ణమ్మ మంచినీటి చెరువు, రాజులపేట, సంత, కొండ్రొతుపేట, కాపులపేట మీదుగా పెద్ద వంతెన కూడలికి చేరే సిమెంట్ రహదారికి ఇరువైపులా సరైన డ్రెయినేజీ సౌకర్యం చాలా చోట్ల కన్పించడంలేదు. దీంతో ఆ దిశగా రాకపోకలు సాగించే వాహనచోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉండిలో పెరిగిపోతున్న ఆక్రమణలతో ఒక మాదిరి వర్షం కురిస్తే చాలు అన్ని వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇక మామూలు రోజుల్లో రైల్వే గేటుకు సమీపంలో సీసీ రహదారిలోకి వెళ్లేచోట మురుగునీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ స్థానిక అధికారులు స్పందిస్తూ ఆప్రాంతాలను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

ఉండి ఆర్వోబీకి సమీపంలో రహదారిపై నిలిచిపోతున్న మురుగునీరు

## గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు

పాలకోడేరు : ప్రముఖుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయ ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారని పాలకోడేరు గ్రంథాలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో స్వాతంత్ర్య, గ్రంథాలయ ఉద్యమకారుల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు చిన్నారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పుస్తక పఠనంపై బాలలు ఆసక్తి మరింత పెంచుకోవాలని గ్రంథాలయ వారోత్సవాల కన్వీనర్ రంగసాయి, ఎ.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బలుసుమూడిలోని బధిరోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## మెడికల్ కిట్లు ఎంతో అవసరం

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్సుల్లో మెడికల్ కిట్లు ఉంటే అత్యవసరాల్లో ఉపయోగపడతాయని జిల్లా ప్రజారవాణాధికారి వరప్రసాద్ అన్నారు. సత్యం ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో భీమవరం బస్‌స్టేషనులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. వైద్యులు సోమరాజు, అల్లూరి వంశీకృష్ణ, డిపో మేనేజర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే:** పెదగరువు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతుల పనులు చేపడుతున్నట్లు ఆ సంస్థ ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. పెదగరువు, వెంప, శ్రీరాంపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు, తుందుర్రు గోదావరి మెగా ఆక్వాఫుడ్ పార్కుకు సరఫరా ఉండదని తెలిపారు.

**డాక్యుమెంట్ పోయినది**

నా క్లయింట్ అయిన మద్దల సుభద్ర, W/o శ్రీనివాసరావు, గునుపూడి, 13వ వార్డు, భీమవరం మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534201. వారికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ రిజిస్ట్రారు రద్దు దస్తావేజు నెం. 5552/2003 తేది. 10-11-2003 SRO, భీమవరం, ఆర్.ఎస్.నెం.353/10, Extent చదరపు గజాలలో 55 1/3 లో, భీమవరం మున్సిపాలిటీ ఏరియా, గునుపూడి గ్రామంలో ఉంది. ది.25-10-2025 తేదిన భీమవరం నుండి నరసాపురం బస్సులో వెళ్తుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికినయెడల మాకు అందజేయగలరు.

**బండి లీలా ఫణి శ్రీరామ్**
అడ్వకేట్, భీమవరం
సెల్: 78939 44559

## మరమ్మతులతో.. అవస్థలు తప్పాయి

**భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే:** రెస్టుహౌస్ ప్రధాన రహదారి నుంచి జీటీపీ మహిళ కళాశాల హాస్టల్, మున్సిపల్ సిబ్బంది కాలనీకి వెళ్లే రోడ్డు ప్రారంభంలో ఎంతోకాలంగా ఉన్న భారీ గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేయడంతో స్థానికులు, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12న 'ఈనాడు'లో 'గొయ్యి.. చూడకుంటే ప్రమాదమోయ్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారి ప్రారంభంలో గుంతలకు తాత్కాలిక మరమ్మతులను పురపాలక ఏఈ వి.మణి పర్యవేక్షించారు.

హాస్టల్, కాలనీకి వెళ్లే రోడ్డు ప్రారంభంలో మరమ్మతు చేసిన గుంతలు

ఈనాడు కథనానికి స్పందన

**చెట్ల నరికివేతపై విచారణ.. ఆకివీడు, న్యూస్‌టుడే:** పెదకాపవరం నుంచి చినకాపవరం వరకు సుమారు 2 కిలోమీటర్ల పొడవున చినకాపవరం ఛానల్ గట్టు వెంబడి ఉన్న చెట్లను ఇష్టానుసారంగా నరికి రవాణా చేసిన తీరుపై ఈ నెల 13న 'పచ్చని చెట్లపై గొడ్డలి వేటు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఛానల్ వెంబడి నరికిన చెట్ల మొదళ్లను అటవీ శాఖ జిల్లా అధికారి కరుణాకర్ పరిశీలించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి చెట్లు నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అనుమతి లేకుండా చెట్లను, కొమ్మలను తొలగించకూడదని హెచ్చరించారు. గణపవరం ఇరిగేషన్ సెక్షన్ జేఈ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

**పోస్టరు తొలగింపు.. ఆకివీడు (కాళ్ల), న్యూస్‌టుడే:** జాతీయ రహదారిపై ప్రమాద హెచ్చరిక డ్రమ్ముపై సినిమా పోస్టరును తొలగించారు. శుక్రవారం 'ఈనాడు'లో 'ప్రచారం వెనుక ప్రమాదం' శీర్షికన వచ్చిన వార్తకు శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు.

**హమ్మయ్య సమస్య తీరింది .. గొల్లలకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే:** గొల్లలకోడేరు బ్రాహ్మణచెరువు ప్రాంతంలో నెలకొన్న మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 1న 'తీరు మారదు.. మురుగు పోదు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కార్యదర్శి నాగేంద్రకుమార్ స్పందించారు. మురుగు ప్రవాహానికి అడ్డుగా నిలుస్తున్న దెబ్బతిన్న తూరను తొలగించి, మోటార్‌తో నీటిని డ్రెయినేజీలోకి మళ్లించారు.

## ఈ సారైనా కరుణించేనా?

### శిథిలావస్థకు చేరిన స్లూయిజ్‌లు

**ఉండి, న్యూస్‌టుడే:** జలవనరులశాఖలో కీలక పనులకు నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒకట్రెండు కాదు.. ఏకంగా నాలుగైదేళ్ల నుంచి పంపుతున్న అత్యవసర పనుల ప్రతిపాదనలకు సైతం మోక్షం లభించడంలేదు. ఎప్పటికప్పుడు బుట్టదాఖలవుతున్నాయి. ఉండి సబ్‌డివిజన్ పరిధిలో కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరిన కట్టడాలు ఎప్పుడు కూలిపోతాయోననే ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది.

ఉండిలో దెబ్బతిన్న పైపు కల్వర్టు

### ఆగని రాకపోకలు

సబ్‌డివిజన్ కార్యాలయానికి చేర్చి ప్రధాన పంట కాలువపై అర్తమూరు, పాములపర్రు ఛానళ్లు ఉన్నాయి. ఎన్నార్పీఅగ్రహారం గ్రామానికి వెళ్లే మార్గంలో బ్రిటిష ప్రభుత్వ హయాంలో ఛానళ్ల ఏర్పాటుతో పాటు స్లూయిజ్‌లను నిర్మించారు. వీటి అభివృద్ధి పనులపై గత కొంతకాలంగా నీలినీడలు అలముకున్నాయి. దీంతో రెండు స్లూయిజ్‌లకు మధ్యలో సుమారు నాలుగేళ్ల కిందట పెద్ద రంధ్రం పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఆ దశలో ఇసుక బస్తాలు వేసి కాంక్రీటుతో ఆ ప్రాంతంలో మరమ్మతు పనులు చేశారు. ఛానళ్లకు ఇరువైపులా నిర్మించిన గోడలు వాహనాల తాకిడికి పూర్తిగా దెబ్బతిన్నాయి. అవి కూలిపోయి ప్రమాదభరితంగా మారాయి. దీనికి కూతవేటు దూరంలోనే అక్విడక్టు ఉంది. అక్విడెక్టుపై 6 టన్నులకు మించి బరువుండే వాహనాల రాకపోకలు రెండు దశాబ్దాల కిందటే నిషేధించారు. ఆ దశలో అగ్రహారం ప్రజల డిమాండ్‌తో గత తెదేపా ప్రభుత్వం ప్రధాన పంటకాలువలపై ఒక వంతెనను నిర్మించడంతో రహదారి కష్టాలు తీరాయి. చిన్నకార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు ఈనాటికీ అక్విడక్టు మార్గాన్నే వినియోగించుకుంటున్నారు.

### పట్టించుకోని గత ప్రభుత్వం

పాములపర్రు, అర్తమూరు ఛానళ్లపై స్లూయిజ్‌ల పునర్నిర్మాణానికి నాలుగేళ్ల కిందట రూ.45 లక్షల అంచనాలతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో స్లూయిజ్‌లపై అంతంతమాత్రంగా ఉన్న గోడలు కూలిపోయాయి. పొక్లెయిన్, ట్రాక్టర్లు వంటి యంత్రాల రాకపోకలతో అసలే శిథిలావస్థకు చేరిన స్లూయిజ్‌లపై ఉన్న మార్గం పూర్తిగా దెబ్బతింది. ఈ మధ్యలో తాటిబొంతలు నిలిపారు. ద్విచక్ర వాహనాల రాకపోకలు ఈనాటికీ సాగుతున్నాయి. తాజా అంచనాల ప్రకారం రెండు స్లూయిజ్‌ల పునర్నిర్మాణానికి రూ.55 లక్షల - 60 లక్షల మధ్య ఖర్చవుతోందని జలవనరులశాఖ అధికారులు వివరిస్తున్నారు. రాబోయే వేసవి సీజన్‌కి ముందే ఈ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఇనుము బొక్కేశారు.. ఆనవాళ్లు మిగిల్చారు

➡ పుర ఆధ్వర్యంలో భీమవరంలో వాహనాలను నిలుపుదల చేసేందుకు యనమదుర్రు కాలువ గట్టున కేటాయించిన పెయిడ్ పార్కింగ్ స్థలం ఇది. మావుళ్లమ్మ గుడి కూడలి, ప్రకాశం చౌక్ కూడలిలోనూ స్థలాలను ఎంపిక చేశారు. వాటిని శుభ్రం చేసి చుట్టూ సిమెంటు స్తంభాలు, ఇనుప తీగ కట్టారు. దీనికి రూ.3 లక్షలు అయింది. ఇవి వినియోగంలోకి వచ్చే లోపు ఇనుప సామగ్రి అపహరణకు గురైంది.

➡ యనమదుర్రు కాలువ గట్టు వెంబడి మొక్కలు పెంచేందుకు రూ.20 లక్షలతో నిర్మించిన ఫెన్సింగ్ ఇది. దీన్ని దొంగలు విరుచుకుని పట్టుకెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పుడు అక్కడక్కడా మచ్చుకు మాత్రమే ఫెన్సింగ్ కనిపిస్తుంది.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పట్టణంలోని యనమదుర్రు కాలువ గట్టున కి.మీ పొడవున ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్ అపహరించుకెళ్లిపోయారు. ఇప్పటికే 90 శాతం కనుమరుగైంది. ఇక్కడే గట్టుపై పెయిడ్ పార్కింగ్ పేరిట వాహనాలను ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. దాని చుట్టూ సిమెంటు స్తంభాలు, ఇనుప కంచె వేశారు. పార్కింగ్ అందుబాటులోకి వచ్చే లోపు సిమెంటు స్తంభాలు, ఇనుప కంచె మాయమైంది. పర్యవేక్షక అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో ఇలా జరిగిందనే విమర్శలున్నాయి. ఈ విషయమై ఎం.ఇ పి.త్రినాథరావు మాట్లాడుతూ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం ఒకటోపట్టణం రైల్వే జంక్షన్ సమీపంలోని రైల్వే అండర్‌పాస్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. 35 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. ఫ్యాంటు, చొక్కా ధరించాడన్నారు. మృతదేహాన్ని భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి శవాగారానికి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## బస్సు ఎక్కుతూ జారిపడి గాయాలు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్సు ఎక్కుతూ జారిపడిపోవడంతో మహిళ కాలికి గాయమైందని భీమవరం రెండో పట్టణ పోలీసులు తెలిపారు. జంటకాలువల దగ్గర బస్సు ఎక్కుతుండగా ఉండి మండలం చిలుకూరుకు చెందిన ఎస్.మార్తమ్మ కిందపడిపోవడంతో కాలికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. వివరాలు తెలుసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

**D.N.R.COLLEGE (AUTONOMOUS)**
**BHIMAVARAM**
**(Re-accredited at "A+" grade by NAAC)**
**(Affiliated to Adikavi Nannaya University)**

**NOTIFICATION**

**UG Hons, Programmes B-Category and Spot Admissions**

Applications are invited from the eligible candidates seeking admission in the vacancies of the following UG Hons Programmes under B-Category and Spot Admissions in D.N.R.College (A), Bhimavaram, West Godavari Dt., for the academic year 2025-26 as per the APSCHE norms. Eligible candidates can apply for admissions on or before dt., 20-11-2025.

| U.G., Hons Prog | Vacancies B-Cat | Vacancies Spot | U.G., Hons Prog | Vacancies B-Cat | Vacancies Spot |
|---|---|---|---|---|---|
| B.Sc., (Physics) (R) | 0 | 25 | B.Sc., (A I) (SF) | 15 | 0 |
| B.Sc., (Maths) (R) | 0 | 19 | B.Sc., (DS) (SF) | 15 | 22 |
| B.Com., (Gen) (R) | 0 | 51 | B.Sc., (Microbio) (SF) | 15 | 6 |
| B.Sc., (Zool) (R) | 0 | 13 | B.Sc., (Biotech) (SF) | 9 | 0 |
| B.Sc., (Geog) (R) | 0 | 1 | B.Sc., (Elec) (SF) | 12 | 22 |
| B.A., (Econ) (R) | 0 | 11 | B.Sc., (Geol) (SF) | 12 | 20 |
| B.Sc., (Bot) (R) | 0 | 25 | B.Sc., (Chem)(SF) | 9 | 21 |
| B.A., (Pol) (SF) | 8 | 17 | B.Sc., (Stat) (SF) | 9 | 21 |
| B.Sc., (Hist) (SF) | 8 | 17 | B.Sc., (Phy) (SF) | 12 | 28 |
| B.Sc., (Comp Sci) (SF) | 94 | 94 | B.Sc., (Maths) (SF) | 12 | 28 |
| B.Com., (Comp. Appl) (SF) | 84 | 90 | B.Sc., (Aqua) (SF) | 21 | 27 |
| B.B.A., (Gen) (SF) | 18 | 25 | | | |

For further queries, please contact 9491334119, 9440679255, 8919334795

PRINCIPAL SECRETARY & CORRESPONDENT

(c) eenadu

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## కళల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

పెనుమంట్ర: చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెనుమంట్ర శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల చిత్ర లేఖన ఉపాధ్యాయుడు ఎస్‌కే అర్షద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

**నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

## సూర్య భగవానుడికి అభిషేకాలు

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** నరసాపురంలో వశిష్ట గోదావరి తీరాన బాపు ఘాట్ వద్ద కొలువైన సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం సూర్య భగవానుడికి అభిషేకాలు, సహస్ర నామార్చనలు చేసి పంచహారతులు ఇచ్చారు.

## బసవేశ్వరస్వామి ఆలయంలో..

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** కార్తిక మాసోత్సవాల్లో భాగంగా నరసాపురం పట్టణంలోని పార్వతీ బసవేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చనలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

## సోమేశ్వరుడికి బిల్వార్చన

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** జుత్తిగలోని శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీదేవికి కుంకుమార్చనలు చేసి హారతులు ఇచ్చారు.

## ప్రజాభిమానం మరువలేనిది

వీర మహిళలతో ప్రభుత్వ విప్ నాయకర్

**నరసాపురం, పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజలు, కూటమి పార్టీల శ్రేణుల అభిమానం మరువలేనిదని ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో నాయకర్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కోసి అందరికీ పంపిణీ చేశారు. ★ పేరుపాలెంసౌత్‌లో కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో నాయకర్ పాల్గొని కేకు కోశారు. ★ నాయకర్ సతీమణి బొమ్మిడి సునీత పాలకొల్లులోని రాహుల్ సామాజిక వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ వసతి పొందుతున్న వారికి భోజనాలు ఏర్పాటు చేశారు.

### పేదలకు చేయూత అభినందనీయం

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** పేదరిక నిర్మూలనకు రాజ్ ట్రస్ట్ అందిస్తున్న చేయూత అభినందనీయమని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. పేరుపాలెంలో 50 మంది పేద మహిళలకు ఆ సంస్థ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ ఇచ్చారు. వారికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఏఎంసీ ఛైర్మన్ శ్రీమన్నారాయణ, సుందర్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

## రహదారులు బాగు చేయిస్తాం: మంత్రి

ఆచంట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి, పితాని

**ఆచంట, న్యూస్‌టుడే:** జిల్లాలో రహదారుల సమస్య తన దృష్టికి తీసుకువచ్చిందని.. అన్ని రోడ్లను దశలవారీగా బాగు చేయిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆచంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి రోడ్లను బాగుచేసే యోచనలో ఉన్నామన్నారు. ఎంపీపీ సూర్యకుమారి, జడ్పీటీసీ సభ్యులు సురేశ్‌బాబు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**పెనుగొండ, న్యూస్‌టుడే:** ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా జరిగేలా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సూచించారు. వడలిలో రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం రైతులతో కలిసి ప్రారంభించారు. సర్పంచి కాసాని విజయలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ నక్కా వెంకటరామకృష్ణ, తెదేపా మండల కార్యదర్శి ఉప్పలపాటి చంటి పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలను తిప్పికొడదాం

సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల

**పోడూరు, న్యూస్‌టుడే:** వైకాపా నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను శ్రేణులంతా కలిసి తిప్పికొట్టడంతో పాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. పోడూరు మండలంలోని 8 గ్రామాలకు చెందిన తెదేపా ముఖ్య నాయకులతో ఆదివారం రాత్రి తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. నాయకులు గొల్లపల్లి సూర్యనారాయణరాజు, దాసరి రత్నంరాజు, పెన్మెత్స రామభద్రరాజు, మేడిశెట్టి బుజ్జి, శీలం శ్రీనివాస్, కుక్కల సత్యనారాయణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన శాస్త్రమే ఆవిష్కరణలకు మూలం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాబ్జీ

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** విజ్ఞాన శాస్త్రమే నూతన ఆవిష్కరణలకు మూలమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణ మూర్తి(బాబ్జీ) అన్నారు. విద్యా చైతన్య సమాఖ్య, అల్లం రాజు ఛారిటబుల్ ట్రస్ట్, కాకినాడకు చెందిన క్రియా సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత సైన్స్ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఈ సైన్స్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్ట్ అధినేత అల్లంరాజు రామశాస్త్రి మాట్లాడుతూ త్వరలోనే గణిత విజ్ఞాన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి, సభ్యులు పోలిశెట్టి శ్రీశ్రీ, యర్రా అజయ్‌కుమార్, కె.వి.రామరాజు, చినిమిల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సేవా శిబిరం

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** నరసాపురం వైఎన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వేములదీవి తూర్పు గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేకం సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ కనకారావు మాట్లాడుతూ విద్యార్థులు క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై అవగాహన పెంచుకొనేందుకు ఇలాంటి శిబిరాలు దోహదం చేస్తాయన్నారు.

## బాలుడి ఆచూకీ గుర్తింపు

**నరసాపురం, న్యూస్‌టుడే:** తల్లి చరవాణి చూడొద్దన్నందుకు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ ఆదివారం లభ్యమైందని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఆ బాలుడు కేరళ రాష్ట్రంలోని యర్నాకుళంలో అధికారుల సంరక్షణలో ఉన్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలిసిందన్నారు. వారిని సంప్రదించగా బాలుడి కుటుంబ సభ్యులు అక్కడికి వస్తే అప్పగిస్తామన్నారని ఎస్సై తెలిపారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**పెనుగొండ, న్యూస్‌టుడే:** పెనుగొండలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు నిమిత్తం మండల పరిధిలో అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.మధుకుమార్ తెలిపారు.





## క్షీరారామలింగేశ్వరుడికి పంచామృతాభిషేకాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రామలింగేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● పాలకొల్లులో పంచారామ క్షేత్రానికి తెనాలి నుంచి వచ్చిన ఓ భక్తుడు స్వామి దర్శనం పూర్తయ్యాక తిరుగు ప్రయాణమయ్యారు. రైలు రావడానికి సాయంత్రం వరకు సమయం ఉండటంతో సమీపంలో చూడదగిన ఆలయాల కోసం సామాజిక మాధ్యమాల్లో వెతికారు. 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగొండ వాసవీమాత ఆలయ సమాచారంతో అక్కడకు వెళ్లేందుకు అనువైన ప్రయాణ సౌకర్యాలపై పదుల సంఖ్యలో వీడియోలు కనిపించాయి. వాటిలో ఉత్తమమైనవి ఎంపికచేసుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

● ద్వారకాతిరుమల వచ్చిన మరో భక్తుడు ఏలూరు జిల్లా ప్రత్యేకతలు అని చరవాణిలో టైప్ చేయగానే పోలవరం ప్రాజెక్టు నుంచి అంబికా దర్బార్ బత్తి వరకు 40 సెకన్లలో చెప్పేసే వీడియోలు బోలెడు కనిపించాయి. అవసరమైన వీడియోను వీక్షించి దానిలో ఉన్న చరవాణి నంబర్లకు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకునేలా యువత చేసిన వీడియోలు సహకరిస్తున్నాయి.

# క్షణాల్లో.. మార్గదర్శనం!

పాలకొల్లు, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో పల్లెల నుంచి పట్టణాల వరకు ఉన్న ప్రముఖ ఆలయాల విశిష్టత, చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన వీడియోలు ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ రీల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. యువ డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు కాలానికి అనుగుణంగా ఆయా విశేషాలను సంక్షిప్త వీడియోలుగా రూపొందిస్తున్నారు. వీటి ద్వారా సులభంగా జిల్లా ప్రత్యేకతలను స్థానికేతరులకు తెలియజేస్తున్నారు.

కొల్లేరులో పడవ షికారు

ఆకట్టుకునేలా.. ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సామాజిక మాధ్యమాల్లో తమ స్వగ్రామాల వీడియోలను చూసి మన ఊరు ఇంతందంగా ఉందా అని పించేలా రీల్స్, షాట్స్, వ్లాగ్స్ రూపొందిస్తున్నారు. ప్రత్యేకించి గోదావరి అందాలు, మన్యంలో జలపాతాలకు సంబంధించిన డ్రోన్ వీడియోలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కొల్లేటి సరస్సు, గుంటుపల్లి గుహలు, నరసాపురంలో వలంధర రేవు, పంటు ప్రయాణం, పేరుపాలెం బీచ్‌లకు సంబంధించిన రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో ఉన్నాయి.

పర్యాటకుల అతిథి గృహాలు

**సామాజిక మాధ్యమాల్లో జిల్లా ప్రత్యేకతలు**

పశ్చిమ పేరుతో ఖాతాలు: ఇలాంటి వీడియోలు ఉన్న సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ఎక్కువ శాతం పశ్చిమ గోదావరి పేరు కలిసేలా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పట్టణాల పేరిట కూడా బృంద ఖాతాలు కొనసాగుతున్నాయి. వీటిలో కొన్ని ఖాతాలను వేలాది మంది అనుసరిస్తుండటం విశేషం.

## పొడవాటి తెల్ల కాకర

తణుకు మండలం వేల్పూరుకు చెందిన ముత్యాల సత్తిరాజు తన ఇంటి మేడపై సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల మొక్కలు, పాదులను సాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఆన్‌లైన్లో తెల్లకాకర విత్తనాలను తెప్పించి నాటారు. కాయలు 12 అంగుళాల వరకూ పొడుగున్నాయి. దీనిపై వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి మాట్లాడుతూ కాకర రకాలను బట్టి సాధారణంగా 5 నుంచి 10 సెంటీమీటర్ల వరకూ పెరుగుతాయన్నారు. మిద్దె సాగులో గాలి, వెలుతురు ప్రసరించినప్పుడు చీడపీడలు రావని, సేంద్రియ సాగుతో పోషకాలు అందించడంతో తీగజాతి కూరగాయల్లో పూర్తి దిగుబడి వస్తుందన్నారు. కర్ణాటక, తమిళనాడులో తెల్లని కాకరను ఎక్కువగా సాగుచేస్తారన్నారు. ఆ తరహా రకాన్ని జిల్లాలోనూ పెంచడం అభినందనీయమని తెలిపారు. - ఈనాడు, తణుకు

## మావుళ్లమ్మ దీక్షల విరమణ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ మాలధారణ భక్తుల దీక్షల విరమణ, పూర్ణాహుతి నేత్రపర్వంగా సాగింది. ఆలయ ప్రాంగణంలో ఆదివారం తెల్లవారుజామున ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, వేద పండితులు, అర్చకులు మాలధారణ భక్తుల ఇరుముడులకు పూజలు చేయించారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో 653 మంది దీక్షలు స్వీకరించినట్లు గురుమాత తెలిపారు. కళా వేదిక ఎదుట ఏర్పాటు చేసిన హోమ గుండంలో ఆలయ సహాయకమిషనర్ బీహెచ్ నగేష్, ప్రధానార్చకుడు అగ్నిప్రతిష్ఠ చేశారు. దీక్ష భక్తులు హోమ గుండం చుట్టూ ప్రదక్షిణ చేసి హోమ ద్రవ్యాలు సమర్పించారు.

శ్రద్ధాంజలి

మా అమ్మలు, శ్రేయోభిలాషులు శ్రీ వుండవల్లి సత్యనారాయణ (చిన్న) గారి తండ్రి గారైన శ్రీ వుండవల్లి జానకిరామయ్య గారు మరణించినందుకు చింతిస్తూ.. వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

శ్రీ వుండవల్లి జానకిరామయ్య గారు, సిద్ధాంతం, పెనుగొండ మండలం

కీర్తి చైతన్య (చిన్ని), 96669 21929

పితాని ఫాలోవర్స్, ఆచంట నియోజకవర్గం

శ్రీ వెంకటేశ్వర స్పన్ పైపు వర్క్స్, మార్టేరు

ప్రొ: జక్కం బాబు, సెల్: 94403 46877

శ్రద్ధాంజలి

మా అమ్మలు, శ్రేయోభిలాషులు శ్రీ వుండవల్లి సత్యనారాయణ (చిన్న) గారి తండ్రి గారైన శ్రీ వుండవల్లి జానకిరామయ్య గారు మరణించినందుకు చింతిస్తూ.. వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

శ్రీ వుండవల్లి జానకిరామయ్య గారు, సిద్ధాంతం, పెనుగొండ మండలం

TDP, జనసేన నాయకులు, సిద్ధాంతం

| | |
|---|---|
| చింతపల్లి గనిరాజు (చంటి) సర్పంచ్ | బొబ్బిలి శ్రీను నీటి సంఘం అధ్యక్షులు |
| కడలి సత్యనారాయణ గ్రామ టి.డి.పి. సెక్రటరీ | దార్లంక శివరామకృష్ణ |
| లక్కు వర్మ పెనుగొండ మండల జనసేన పార్టీ సెక్రటరీ | దార్లంక మారుతీ సూర్యగణప్రసాద్ జనసేన పార్టీ సీనియర్ నాయకులు |
| అడ్డాల నాగులు అడ్డాల భోజన హోటల్ | చింతపల్లి జేమ్స్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, FLCS ప్రెసిడెంట్ |
| కౌరు శ్రీరామమూర్తి PACS అధ్యక్షులు | కట్టా శ్రీను |
| ఉప్పలపాటి శాంతారావు నీటి సంఘం డైరెక్టర్ | వెన్నపు వెంకటేశ్వరరావు తానేటి మధన్ |
| శీలం శేఖర్ గుబ్బల నాగశ్రీను | గుత్తుల రమేష్ ఉటాల మురళి |


## దివ్యాంగ బాలికకు నడకొచ్చింది

కలెక్టర్ చొరవతో వైద్యం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దివ్యాంగురాలైన తన కుమార్తెకు పింఛను ఇప్పించాలంటూ పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన అంజలి సెప్టెంబరు 8న భీమవరంలోని కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చారు. ఆమె వెంట ఉన్న బాలికతో కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. సమస్య గురించి అడిగి తెలుసుకుని వెంటనే వైద్యం చేయించాలని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త కీర్తికి ఆదేశించారు. ఫిజియోథెరపీ ద్వారా ఆ పాప పూర్తి స్థాయిలో నడవగలుగుతుందని సమాచారశాఖాధికారులు ఆదివారం తెలిపారు. జీవితాంతం దివ్యాంగురాలిగా ఉండిపోతుందనుకున్న బాలిక కలెక్టర్ చొరవతో చికిత్స పొంది సాధారణ స్థితికి చేరడంపై అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రంథాలయాలను నిత్యం సందర్శించండి: జేసీ

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మన సంస్కృతిలో భాగంగా దేవాలయం, మసీదు, చర్చిలు సందర్శించినట్లుగా ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం అలవర్చుకోవాలని జేసీ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి విశేష సేవ చేసిన ప్రముఖులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయానికి రూ.4 లక్షలతో వాటర్ ప్లాంట్, రెండు కంప్యూటర్లు, ప్రింటర్, ఇన్వర్టర్ అందించిన తిరుమల విద్యాసంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ గ్రంథాలయంలో చదువుకుని వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన 20 మందిని సత్కరించారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు వి.కరరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల విజేతలను సత్కరించిన రాహుల్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు

## తీరం.. మద్యం దూరం!

మొగల్తూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో చివరి ఆదివారం పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సముద్ర అలలల్లో ఆహ్లాదంగా గడిపారు. భక్తులు తీరంలోని అష్టలక్ష్ముల సమేత మత్స్య నారాయణ స్వామి, శిర్డీసాయిబాబా, అభయాంజనేయస్వామి, రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. బీచ్‌లో పర్యాటకుల రక్షణ నిమిత్తం నో డ్రింక్ జోన్‌ను అమలు చేశారు. బీచ్‌కు వెళ్లే మార్గాల్లో పోలీసులు తనిఖీలు చేసి పర్యాటకులు తీసుకువెళ్తున్న మద్యం సీసాలను ధ్వంసం చేశారు.

## ఆత్మీయం.. ఆనందం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో చివరి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల్లో వన సమారాధనలు సందడి వాతావరణంలో జరిగాయి. నరసాపురం పట్టణంలో ఆర్య వైశ్య బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: చెరుకువాడలో శ్రీ కృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక దామోదర పూజలు నిర్వహించారు. చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. పెనుగొండలోని లింగాలవీధి త్యాగరాజ భవనంలో పెనుగొండ-చెరుకువాడ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో వనసమారాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ★ పెనుగొండలోని యలమర్తి అంజనేయులు తోటలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని పాల్గొని మాట్లాడారు.

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలిలో కాకతీయ యువజన సంక్షేమసంఘం ఆధ్వర్యంలో వనసమారాధన సందడిగా జరిగింది. పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లోని సంఘీయులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

పెనుగొండ: ప్రమాణ స్వీకారం చేస్తున్న బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు నియోజకవర్గంలో పలు సామాజికవర్గాలకు చెందిన వనసమారాధనల్లో మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్షత్రియ సామాజిక వర్గ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యే చైతన్యరాజు, తెదేపా నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, క్షీరారామ ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు తదితరులు ★ తూర్పుకాపు సంఘీయుల వన సమారాధనను పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు.

పాలకొల్లు: పూజల్లో తూర్పుకాపు సంఘీయులు

## తపాలా ఉద్యోగులు ఐక్యంగా సాగాలి

నూతన కార్యవర్గ సభ్యులు

నిడదవోలు, న్యూస్‌టుడే: గ్రామీణ తపాలా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఏపీ సర్కిల్ కార్యదర్శి వై. మర్రిరెడ్డి అన్నారు. నిడదవోలులో ఆదివారం తాడేపల్లిగూడెం డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగులు సంఘ 3వ ద్వైవార్షిక మహాసభను నిర్వహించారు. అనంతరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. రవీంద్ర, కార్యదర్శిగా ఎస్. రమేష్, కోశాధికారిగా పి. పవన్‌కుమార్‌లను ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వీరిని అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. దుర్గారావు, రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి పి. భూలోకం, ఏలూరు డివిజన్ కార్యదర్శి ఎస్ఎస్ బాజీ, రాజమహేంద్రవరం అధ్యక్షుడు బీవీ రమణ, తాడేపల్లిగూడెం డివిజన్ పరిశీలకుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సంక్షేమానికి కృషి

రాజోలు, న్యూస్‌టుడే: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్ర కళాకారుల సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచంట రాంబాబు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల కళాకారుల సంక్షేమ సంఘ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధ కళాకారులకు అందిస్తున్న రూ.4 వేల పింఛనును రూ.6 వేలకు పెంచాలన్నారు.

# నిధులిచ్చినా.. కదలరేం..

**ఆర్అండ్ఆర్‌లో సిబ్బంది నిర్లక్ష్యం**

**ముంపు భూముల సేకరణకు యత్నాలు**

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయాలే దృఢ సంకల్పంతో ఉంది. ఈ క్రమంలోనే ఇటీవల రూ.వెయ్యి కోట్లు పరిహారాన్ని నిర్వాసితులకు అందజేశారు. గడువు కంటే ఆర్నెళ్లు ముందే పునరావాసం పూర్తి చేయాలనే లక్ష్యంతో భూసేకరణపై ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. అల్లూరి జిల్లా పరిధిలోని నిర్వాసితుల కోసం ఏలూరు జిల్లా మన్యంలో సేకరిస్తున్నారు. సుమారు 1,900 ఎకరాల సేకరణకు ప్రకటన విడుదలైంది. ఈ సమయంలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, తప్పులు.. పనులకు ప్రతిబంధకంగా మారాయి.

**ముంపు భూమిని కూడా..**

కూనవరం మండలంలోని పంద్రాజుపల్లి నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి మండలం గోపాలపురం రెవెన్యూ పరిధిలో సుమారు 83.17 ఎకరాల భూసేకరణకు ఇటీవల ప్రాథమిక ప్రకటన ఇచ్చారు. ఇందులో సుమారు 10.63 ఎకరాలను ఉపసంహరణ చేస్తున్నట్లు మరో ప్రకటన విడుదల చేశారు. తీరా చూస్తే ఉపసంహరణ ప్రకటన ఇచ్చిన భూమి చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం గతంలోనే సేకరించిందని కావడం గమనార్హం. ఈ విషయాన్ని రెండో ప్రకటనలో భూ సేకరణ అధికారులే వెల్లడించారు. ఒకసారి సేకరించిన భూమికి 2వ పర్యాయం ప్రకటన ఇవ్వడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది.

సర్వేపై అభ్యంతరం తెలుపుతూ ఎస్‌డీసీ సతీశ్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

**సొమ్ములు ఇవ్వలేదని..** స్పెషల్ కలెక్టర్ అడిగినంత తాము ఇవ్వలేదని కోయరాజమండ్రిలో భూసేకరణను ఆపేశారంటూ వేదాంతపురం రైతులు ఇటీవల ఆరోపించారు. భూసేకరణకు 20 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారంటూ డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు ఇటీవల బాహాటంగా ఆరోపించారు.

**గిరిజనుల అభ్యంతరంతో..** గోపాలపురం భూములను సాధారణ విధానంలో కాకుండా కన్‌సెన్ట్ అవార్డు ద్వారా వేగంగా సేకరించాలని స్పెషల్ కలెక్టర్ సరళావందనం ప్రయత్నించారు. చింతూరు ఎస్‌డీసీని కాదని.. కొవ్వూరు ఎస్‌డీసీ సతీశ్‌కు ఈ పనులు అప్పగించారు. ఆయన సర్వే చేపట్టగా.. గిరిజనులు అభ్యంతరం వ్యక్తం చేసి అడ్డుకున్నారు. కన్‌సెన్ట్ విధానంలో సేకరించాలని స్పెషల్ కలెక్టర్ తనను ఆదేశించడంతోనే తాను సర్వే చేపట్టానని ఎస్‌డీసీ సతీశ్ పేర్కొన్నారు. కేవలం పది, పదిహేను రోజుల్లోనే అవార్డు జారీ చేయాలని యత్నించారు. కాగా స్పెషల్ కలెక్టర్ బదిలీతో దీనికి గండి పడింది.

**విరమణ లోపు..** పదవీ విరమణకు కొద్ది కాలమే గడువు ఉండటంతో ఈ లోపే తన విస్తృత అధికారాలతో చక్రం తిప్పాలని ఓ అధికారిణి బాగా తాపత్రయపడినట్లు సమాచారం. తప్పులు దొర్లడానికి ఇవే కారణాలన్న విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం కూడా సాగనంపింది.

## స్ఫూర్తి ప్రదాత ఉయ్యాలవాడ

మార్టేరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమ అందరికీ స్ఫూర్తి దాయకమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మార్టేరు కూడలిలో ఏర్పాటు చేసిన నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కోసం, దేశం కోసం పోరాడిన ఆయనకు బ్రిటీష ప్రభుత్వం ఉరిశిక్ష వేస్తే.. ఇంతకంటే మీరేం చేయగలరంటూ చిరునవ్వుతో సమాధానమిచ్చిన యోధుడు నరసింహారెడ్డి అని చెప్పారు. సమర యోధుడికి ఇచ్చిన గౌరవమే ఈ విగ్రహావిష్కరణ అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ దేశభక్తిలో నరసింహారెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు.

విగ్రహావిష్కరణ అనంతరం నినాదాలు చేస్తున్న మంత్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే పితాని తదితరులు

## విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం సిద్దాపురం ప్రాంతానికి చెందిన ఘంటసాల వెంకటేశ్వరరావు(60) స్థానిక ఆక్వా చెరువు గట్టుపై పచ్చగడ్డి కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. దీనిపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)** (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

# స్పర్శ లేదా.. నిర్లక్ష్యం వద్దు!

**కుష్ఠు బాధితుల గుర్తింపునకు నేటి నుంచి సర్వే**

మార్టేరు, న్యూస్‌టుడే: కుష్ఠు వ్యాధిని 2027 నాటికి నిర్మూలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా బాధితులను గుర్తించేందుకు ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. దీనిపై ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, వైద్య సిబ్బంది, వైద్యాధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించేందుకు 1,485 బృందాలను ఏర్పాటు చేశారు.

**ఉచితంగా చికిత్స** రెండేళ్ల వయసు పైబడి వారికి శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వారి సమాచారం సేకరించి స్థానిక వైద్యాధికారితో పరిశీలన చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఉచితంగా చికిత్స అందిస్తారు. వారి కుటుంబ సభ్యులను సైతం అప్రమత్తం చేస్తారు. ప్రతి బృందం గ్రామీణ ప్రాంతంల్లో 20-25 ఇళ్లను, పట్టణాల్లో 30-40 ఇళ్లను సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యాధి లక్షణాలపై మహిళలకు ఆశా కార్యకర్తలు, పురుషులకు వాలంటీర్లు ప్రాథమిక పరిశీలన చేయాల్సి ఉంటుంది. సర్వే తీరును పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తాయి. తొలి దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకొంటే తక్కువ సమయంలో నయమవుతుందని.. ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత సేవలు అందిస్తామని జిల్లా అదనపు వైద్యాధికారి ఎం. రవిబాబు తెలిపారు.

మూడేళ్లలో ఇదీ పరిస్థితి..

| సంవత్సరం | కేసులు |
|---|---|
| 2022-23 | 96 |
| 2023-24 | 133 |
| 2024-25 | 89 |


సంవత్సరీకం



జననం: 21-11-1948 మరణం: 01-12-2024

శ్రీ కలిదిండి రామరాజు (ఆడిటర్)

సెక్రటరీ & కరస్పాండెంట్: పాలకొల్లు ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ,

అధ్యక్షులు: క్షత్రియ సంక్షేమ సంఘం, పాలకొల్లు

గౌరవ అధ్యక్షులు: కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పాలకొల్లు

మమ్ములను అలరించి, ఆదరించి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మీరు మా నుండి దూరమై ఏడాది దాటిందంటే నమ్మలేకున్నాం. మీ జ్ఞాపకాలు నెమరవేసుకుంటూ.. నివాళులు అర్పిస్తున్నాం. మీరు విద్యారంగానికి, ఆడిట్ రంగానికి చేసిన సేవలు, పలు వితరణ కార్యక్రమాలతో మిమ్ములను అందరూ మదిలో నిలుపుకొని మీ మార్గంలో పయనించి తరించి మీ ఆత్మ శాంతికై కృషి చేస్తాము.

భార్య: శ్రీమతి జయలక్ష్మి

కుమారుడు: వెంకట బలరామరాజు కోడలు: హిమబిందు

కుమార్తె: పెన్మెత్స రమా సునీత అల్లుడు: సుబ్బరాజు

మనుమలు: అభినవ్, అభిరామ్ మరియు బంధుమిత్రులు

సంవత్సరీకం: ది. 19-11-2025 బుధవారం పాలకొల్లు ఎల్.ఆర్.పేట మా స్వగృహంలో జరుపబడును

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

REAL ESTATE

PLOT FOR SALE

తణుకు, వేమవరం 10వ వార్డులో, చిట్టూరి బాపినీడు గారి ఇంటి వెనుక లేఔట్‌లో తూర్పున పంటకాలువ ఉన్న N/E కార్నర్ ఈశాన్య ప్లాట్ (నెం.42) 253 చ॥గజాలు అమ్మకానికి కలదు. మున్సిపాలిటీ వారిచే క్రమబద్ధీకరణ చేయించడమైనది. ✆ 8639 779 569.

JOBS

Vijnana Bharathi EM High School, China amiram. Wanted Vice Principal. Contact Number: 95421 76926. Mail: vbbvkca@gmail.com.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.25 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

# ఛాంపియన్స్

సొంతగడ్డపై ప్రత్యర్థులను స్పిన్‌తో వణికించి, పరుగుల వరదపారించిన టీమ్‌ఇండియానేనా ఇది? భారత్‌కు ఏమైంది? న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనా.. అది ఓ పీడకలలా మరిచిపోదామనుకున్నారు అభిమానులంతా! కానీ మళ్లీ ఓ షాక్. కివీస్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబాటు తాత్కాలికం కాదని, మన బ్యాటర్లకు అదో బలహీనతగా మారిందని తేటతెల్లమైపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో సఫారీలకు టీమ్‌ఇండియా తలవంచింది. బ్యాటర్లు స్పిన్‌కు దాసోహమన్న వేళ.. తొలి టెస్టులో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. అవమానకర ఓటమిని చవిచూసింది.

## మన స్పిన్ ఉచ్చులో మనమే..

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్‌ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

హార్మర్ 4/21

కోల్‌కతా

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్‌ఇండియా మరోసారి తీవ్రంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం పాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

**ఏదో అనుకుంటే...:** ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంతగడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాజయం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడటంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు.

**తడబడ్డారిలా..:** లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్‌ఇండియా తడబాటు, పరాజయం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లకు ముందు భారత్ వెన్నువిరిచింది.. మొదట దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా భారత్‌ను హార్మన్ మళ్లీ దెబ్బ తీశాడు. అంతే.. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) ప్రయత్నం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. కుల్‌దీప్ (1), సిరాజ్ (0) వెంటవెంటనే ఔటైపోయారు. గిల్ గాయంతో బ్యాటింగ్‌కు రాకపోవడంతో తొమ్మిదో వికెట్‌కే ఇన్నింగ్స్ ముగిసింది.

**బవుమా.. అమూల్యమైన 55:** అస్థిర బౌన్స్ ఉన్న పిచ్‌పై కెప్టెన్ బవుమా నిలబడి అమూల్యమైన 55 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా (ఓవర్‌నైట్ 93/7).. అనుకున్న దానికన్నా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బవుమా 29తో, బోష్ 1తో ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. బోష్ (25; 37 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో సఫారీ జట్టుకు విలువైన పరుగులు వచ్చాయి. చివరికి బోష్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో 44 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత బవుమా అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. హార్మర్, మహరాజ్‌ను సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159**
**భారత్ తొలి ఇన్నింగ్స్: 189**
**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికిల్టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా నాటౌట్ 55; టోని జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యెన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ (బి) బుమ్రా 25; హార్మర్ (బి) సిరాజ్ 7; కేశవ్ మహరాజ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 11
**మొత్తం:** (54 ఓవర్లలో ఆలౌట్) **153**; **వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; అక్షర్ 14-0-36-1; కుల్‌దీప్ 8-1-30-2; జడేజా 20-3-50-4; సిరాజ్ 2-0-2-0-2
**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్‌క్రమ్ 31; ధ్రువ్ జురెల్ (సి) బోష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్‌దీప్ ఎల్బీ (బి) హార్మర్ 1; బుమ్రా నాటౌట్ 0; సిరాజ్ (సి) మార్‌క్రమ్ (బి) మహరాజ్ 0; గిల్ ఆబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 1
**మొత్తం:** (35 ఓవర్లలో ఆలౌట్) **93**; **వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2; హార్మర్ 14-4-21-4; కేశవ్ 9-1-37-2; బోష్ 2-0-14-0; మార్‌క్రమ్ 3-0-5-1

## శ్రీకాంత్ పసిడి మెరుపులు

డెఫ్లింపిక్స్

మొర్తజాకు రజతం

మొర్తజా, శ్రీకాంత్

**దిల్లీ:** హైదరాబాద్ కుర్రాడు ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. డెఫ్లింపిక్స్‌తో అతడు స్వర్ణంతో మెరిశాడు. పోటీల తొలి రోజు, ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ధనుష్ ఫైనల్లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలుచుకున్నాడు. అతడు 252.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ మహ్మద్ మొర్తజా వానియా 250.1 పాయింట్లతో రజతం గెలుచుకున్నాడు. అతడు రెండో స్థానంలో నిలిచాడు. మహిళల ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిత్ సంధు రజతం, కోమల్ మిలింద్ కాంస్యం సాధించారు. ఫైనల్లో మహిత్ 250.5 పాయింట్లతో రెండో స్థానం సాధించగా.. కోమల్ 228.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 2022 డెఫ్లింపిక్స్‌లో ధనుష్.. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించాడు. డెఫిలింపిక్స్‌లో స్వర్ణం గెలిచినందుకు శ్రీకాంత్‌కు రూ.1.2 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు తెలంగాణ క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.



హరికృష్ణ

## హరికృష్ణ ఔట్

**పంజిమ్:** ఫిడే ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ కథ ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో అతడు టైబ్రేక్‌లో మార్టినెజ్ అల్కాంటరా (మెక్సికో) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ డ్రా కావడంతో ఈ ఆటగాళ్లు ఆదివారం టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్‌లో తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాతి గేమ్‌లో మార్టినెజ్ విజయం సాధించాడు. నాలుగో గేమ్ డ్రా కావడంతో హరికి ఓటమి తప్పలేదు. భారత్ నుంచి ఒక్క అర్జున్ మాత్రమే ఈ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు.

## 4 పతకాలు ఖాయం

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

**గ్రేటర్ నోయిడా:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. బొలోత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రీతి అంతే తేడాతో నిగినా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గగా.. కలెట్‌స్కీ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించడంతో సెమీస్ చేరింది.

## ఝార్ఖండ్ 259/6

**జెంషెడ్‌పూర్:** ఆంధ్రతో రంజీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఝార్ఖండ్ తొలి రోజు ఆట చివరికి మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 259 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్ (115; 209 బంతుల్లో 16×4) సెంచరీ సాధించడం.. కెప్టెన్ విరాట్ సింగ్ (41), ఆదిత్య సింగ్ (29) రాణించడంతో ఒక దశలో 213/3తో బలమైన స్థితిలో నిలిచిన ఝార్ఖండ్.. తర్వాత 31 పరుగుల తేడాతో 3 వికెట్లు చేజార్చుకుంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

పతకాలతో మహిళల డబుల్స్ విజేతలు

## తెలంగాణకు 2 స్వర్ణాలు, రజతం

ముగిసిన జాతీయ పికిల్‌బాల్

ఈనాడు, బెంగళూరు, బెంగళూరు క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ పికిల్‌బాల్ పోటీల్లో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరు వేదికగా జరిగిన ఈ టోర్నీకి ప్రియా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ రజతంతో తెలంగాణ.. గుజరాత్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచింది. 21 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో మహారాష్ట్ర మొత్తం 8 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక నాలుగు పతకాలతో రెండో స్థానం సాధించింది. పోటీల సందర్భంగా సబల మిల్లెట్స్ ఉత్పత్తుల పట్ల క్రీడాకారులతో పాటు సందర్శకులు, విద్యార్థులు అమితాసక్తిని ప్రదర్శించారు.

## పాక్ చేతిలో భారత్ ఓటమి

**దోహా:** యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించిన భారత్-ఎ.. తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ చేతిలో 8 వికెట్ల తేడాతో కంగుతింది. మొదట అజీజ్ (3/24), సదాఖత్ (2/12), మసూద్ (2/31)ల ధాటికి భారత్-ఎ 19 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (45: 28 బంతుల్లో 5×4, 3×6), నమన్ ధీర్ (35) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. సదాఖత్ (79 నాటౌట్; 47 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.




## గోడ కూలి.. రక్షణ ఖాళీ!

గోస్తనీ కాలువ వంతెనపై శిథిలమైన రక్షణ గోడ

పాలి- నత్తారామేశ్వరం- మల్లిపూడి మార్గంలో గోస్తనీ డ్రెయిన్‌పై ఉన్న వంతెన రక్షణ గోడలో కొంత భాగం కూలిపోవడంతో ఇలా ఖాళీ ఏర్పడింది. మిగిలిన భాగంలోనూ గోడ శిథిలమై ఇనుప చువ్వలు బయటకొచ్చాయి. కొన్నేళ్లుగా కనీస నిర్వహణ పనులు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నత్తా రామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి, పాలి, అత్తిలి, పెనుమంట్ర గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. పలు విద్యాసంస్థల బస్సులు, ఇతర వాహనాల రద్దీ కూడా ఎక్కువ. ఇక్కడ వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఏఈ యశ్వంత్ స్పందిస్తూ వంతెనకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పెనుమంట్ర

## ఇలా వదిలేస్తారా..! ఇప్పటికైనా చలిస్తారా!

ఆసుపత్రిలో కిటికీలకు తలుపులు లేకపోవడంతో రగ్గులు కప్పుకొని నిద్రిస్తున్న రోగులు

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రిలోని పలు వార్డుల్లో కిటికీలకు తలుపులు లేకపోవడంతో రోగులు, వారికి తోడుగా ఉన్న కుటుంబ సభ్యులు చలికి వణుకుతున్నారు. శనివారం రాత్రి ఓ వ్యార్డులో ఉన్నవారంతా రగ్గులు, దుప్పట్లు కప్పుకొని నిద్రిస్తూ కనిపించారు. కిటికీలకు తలుపులు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని, గాలి పంకాలు వేస్తే చలి తీవ్రత పెరుగుతోందని. ఆపితే దోమల బెడద తప్పడం లేదని రోగులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే వైద్య సేవలు మెరుగ్గా ఉన్నా భవనం విషయంలో ఇబ్బందులున్నాయని చెబుతున్నారు. వార్డులను కొత్త భవనంలోకి మారిస్తే ఇబ్బందుల తప్పుతాయని. . ఈ విషయంలో పాలకులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

## ఐక్యతతోనే అభ్యున్నతి

యలమంచిలి: కాపు సంఘ నాయకులతో ఆశాకిరణ్

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** సంఘీయుల ఐక్యతతోనే అభ్యున్నతి సాధ్యమని వంగవీటి మోహన రంగా కుమార్తె ఆశాకిరణ్, పలువురు నాయకులు పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఆమె ఆదివారం పర్యటించి పలు చోట్ల జరిగిన కాపు సామాజికవర్గ వన సమారాధనల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యలమంచిలిలో కాపు సంఘం నాయకులు రావూరి మురళీకృష్ణ తదితరులు ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. రంగా కుమార్తె తొలిసారి ఈ ప్రాంతంలో పర్యటనకు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## వశిష్ఠ ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాలని వినతి

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** నరసాపురం- లింగంపల్లి మధ్య నడిచే రైలుకు వశిష్ఠ ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాలని కోరుతూ కొప్పర్రుకు చెందిన సర్వోదయ రైతు సంఘం నాయకుడు చినమిల్లి వీరబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఆదివారం వినతిపత్రం అందజేసినట్లు వీరబాబు పేర్కొన్నారు.

## సమైక్యతకు వేదికలు వన సమారాధనలు

లక్ష్మణేశ్వరం: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

గుమ్మలూరు: వెంకట్‌ను సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘీయులు

**నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే:** సమైక్యతకు వన సమారాధనలు వేదికలుగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్ అన్నారు. మొగల్తూరులో శెట్టిబలిజ, గౌడ సంఘ కార్తిక వనసమారాధన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలని సూచించారు. ★ నరసాపురం పట్టణ పరిధి రుస్తుంబాదలో అభ్యాస్ పాఠశాల ఆవరణలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్తిక వనసమారాధనలో శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**పోడూరు, పెనుగొండ, న్యూస్‌టుడే:** గుమ్మలూరు, పెనుగొండ గ్రామాల్లో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధనలు నిర్వహించారు. తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** లక్ష్మణేశ్వరం శివాలయం ప్రాంగణంలో గౌడ, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామమోహన్, మేకా శేషు బాబు, గౌడ, శెట్టిబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.









## బాధితులకు చేయూత

పరిహారం ఇస్తున్న గుత్తేదారు సంస్థ ప్రతినిధులు

**విజయవాడ, న్యూస్‌టుడే:** విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ), సీపీఎం నాయకులు రూ.10 లక్షల నష్ట పరిహారం, మట్టి ఖర్చుల కింద రూ.50వేలు ఇప్పించారు. మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కటికెల ఏసు (22) ఈ నెల 15వ తేదీన స్వరాజ్య మైదానంలోని భవనం శ్లాబ్‌పై ఫ్లోరింగ్ పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన విషయం తెలిసిందే. బాధితులకు నాయకులు అండగా నిలబడి.. గుత్తేదారు సంస్థతో మాట్లాడారు. దీంతో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ అంగీకరించి పరిహారం అందజేసింది. ఈ మొత్తాన్ని ఆదివారం ఏసు తల్లిదండ్రులకు అందజేశారు.




(c) eenadu

# తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

## వైభవంగా అయ్యప్ప గ్రామోత్సవం

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి మండలం ఈడూరులో గురుస్వామి వాడపల్లి శేఖరాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం అంబారీపై స్వామిని గ్రామోత్సవం చేశారు. అనంతరం వరాల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి పద్దెనిమిది మెట్ల నిర్మాణంపై కొలువుదీర్చి విశేష పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారణ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొక్క నాటిన సుందరీబాయ్, కిశోర్ బాబు

**తణుకు, న్యూస్‌టుడే:** ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ సుందరీ బాయ్, గోటేరు గ్రామ సర్పంచి కిశోర్‌బాబు అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఆదివారం స్థానిక మహిళా కళాశాల ఆధ్వర్యంలో గోటేరులో మొక్కలు నాటారు. ప్లాస్టిక్‌తో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచి రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రమేశ్‌బాబు, శ్యామలాదేవి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వీరభద్రునికి లక్ష బిల్వార్చన

**తణుకు, న్యూస్‌టుడే:** కార్తిక మాసం పురస్కరించుకుని ఆదివారం పైడిపర్రులో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి లక్ష బిల్వార్చన, మహారుద్రాభిషేకం చేశారు. సాయంత్రం ఆలయంలో అర్చకులు శాంతి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు

**ఇరగవరం, న్యూస్‌టుడే:** రేలంగిలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్గత దారులు.. అడ్డంగా వాహనాలు

### పట్టణ వాసుల అవస్థలు

**తణుకు, న్యూస్‌టుడే:** తణుకు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం కావడంతో వాణిజ్య, గృహ తదితర అవసరాల నిమిత్తం వచ్చే జనంతో అంతర్గత రహదారులు సైతం కిక్కిరిసి దర్శనమిస్తోన్నాయి. ఈ మేరకు పలు చోట్ల ఇరుకు మార్గాలు పట్టణ వాసుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఒక పక్క ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌తో అవస్థలు పడుతుంటే మరో పక్క అనుసంధాన రోడ్లలో పార్కింగులు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. భారీ వాహనాలు దారులకు అడ్డంగా నిలిపివేయడంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటుందని ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దొడ్డిపట్ల వారి వీధిలో ఇలా..

**రహదారులే పార్కింగ్..**

పట్టణ ప్రణాళిక విభాగం వైఫల్యం ప్రజలు పాలిట శాపంగా మారింది. వాణిజ్య, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాల్లో చేపట్టాల్సిన నిబంధనలు గాలి కొదిలేయడంతో రహదారులే పార్కింగ్ స్థలాలుగా మారాయి. ఆయా వీధుల గుండా గమ్యాన్ని చేరుకోవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిత్రంలోనిది కోప్పాక వారి వీధిలో నిలిపిన వాహనం. ట్రాఫిక్ సమస్యల కారణంగా ఉదయం పది దాటిన తర్వాత భారీ వాహనాలు పట్టణంలోకి వచ్చేందుకు అనుమతి ఉండదు. కానీ ఈ వీధి హోల్ సేల్ దుకాణ దారులు పగలే రప్పించి గంటలు తరబడి ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటారు. కొనుగోలుదారుల వాహనాలూ అక్కడే నిలపడంతో నానా యాతన పడాల్సిన పరిస్థితి వస్తోందని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు.

**ఇతర ప్రాంతాల్లో..** పట్టణంలో వాణిజ్య సముదాయాల వీధుల్లో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో చోదకులు అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. కనీసం ద్విచక్రవాహనం సైతం వెళ్లేందుకు అవస్థలు పడాల్సి దుస్థితి. ఒకవేళ కారు ఆ వీధిలో వెళ్లాలంటే ఇక అంతే సంగతులు. ఆ వీధుల్లోనే కొనుగోలు చేయాల్సి వస్తే ఇతర ఇతర ప్రాంతాల్లో పార్కింగ్ చేసి రావాల్సిన పరిస్థితి నెలకొంటుందని పలువురు చెబుతున్నారు.

'రహదారులపై వాహనాలు నిలపకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని, భారీ వాహనాలు ఉదయం సమయంలో పట్టణంలోకి రాకుండా చర్యలు చేపడతాం' అని ట్రాఫిక్ ఎస్సై ఆదినారాయణ తెలిపారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | : 99488 53114 |
| తణుకు | : 85558 50851 |
| తణుకు గ్రామీణం | : 63005 79402 |
| అత్తిలి | : 91548 46774 |

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** ? హౌసింగ్‌బోర్డు కాలనీలో కుక్కల సంచారం అధికంగా ఉండటంతో బయట తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నాం. **- ప్రకాశ్, స్థానికుడు**

✔ కు.ని చికిత్సలు నిర్వహించాం. సంచారం తగ్గుముఖం పడుతుంది. **- ఏసుబాబు, కమిషనర్**

? స్థానిక వెంకట్రామ సినిమా హాలు నుంచి సీతారాంపేటకు వేళ్లే రోడ్డులో చెత్త పేరుకుని రహదారిపైకి వస్తోంది **- నవీన్**

✔ చర్యలు చేపడతాం **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

## సంఘాల అభ్యున్నతికి కృషి

రవీంద్రనాథ్‌ను సత్కరించిన సంఘ సభ్యులు

**తణుకు, న్యూస్‌టుడే:** సంఘాల అభ్యున్నతికి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం తణుకులోని కిళ్లీ, సోడా, బడ్డీ షాప్ వ్యాపారస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న చిన్న వ్యాపారస్థులకు అనేక సమస్యలు ఉంటాయని.. వారు ఆర్థికంగా బలపడటానికి బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీ రుణాలు వచ్చేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం వేల్పూరులో కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంక్షేమ సంఘం, ఇల్లింద్రపర్రులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనల్లో పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం మండలంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనలో ఏపీ భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ పాల్గొని మాట్లాడారు. బాబ్జీ, నాయకులను సంఘ సభ్యులు సత్కరించారు.

## సూర్యనారాయణుడికి ప్రత్యేక పూజలు

**పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఉషా ఛాయ సమేత సూర్యనారాయణ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ బ్రిలియంట్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మంలో గోవుకు విశిష్ట స్థానం

**నాచుగుంట(ఉంగుటూరు):** భారతీయ సనాతన ధర్మంలో గోవుకు విశిష్ట స్థానముందని.. కామధేనువుగా ప్రతి ఇంట్లో పూజలందుకుంటోందని ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త గరికపాటి గురజాడ అన్నారు. నాచుగుంటలోని శ్రీగోపాలకృష్ణ గోశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. తొలుత గోపూజ, మహారుద్ర హోమం చేశారు. గురజాడ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ సహప్రాంత ప్రచారక్ జనార్దన్ జీ, గోశాల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, రాఘవులు పాల్గొన్నారు.

## 'అటజని కాంచెన్' ట్రైలర్ ఆవిష్కరణ

**తణుకు, న్యూస్‌టుడే:** తణుకు ప్రాంతానికి చెందిన యువ దర్శకుడు రాహుల్ రాయ్ ఆదివారం స్వీయ రచనలో తీసిన అటజని కాంచెన్ చిత్రం ఘన విజయం సాధించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో చిత్రం ట్రైలర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాహుల్ రాయ్ తణుకు ప్రాంతానికి చెందిన వాడు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. జహంగీర్ బాషా, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**తణుకు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలో కార్పెంటర్ అసోసియేషన్, విశ్వబ్రాహ్మణ సంఘం, తేతలి, వేల్పూరు, కె.ఇల్లింద్రపర్రులో ఆయా కాపు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని చెప్పారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెట్టుబడుల వేదికగా ఏపీ: వలవల

సమావేశంలో పాల్గొన్న బాబ్జీ, నాయకులు

**భాగ్యలక్ష్మిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు వ్యూహాత్మకంగా నిర్వహించిన సీఐఐ సమ్మిట్‌తో రాష్ట్రం పెట్టుబడుల వేదికగా మారుతుందని భవన నిర్మాణ, ఇతర కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. స్థానిక భాగ్యలక్ష్మిపేటలోని తన నివాస కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సు పెట్టుబడుల యుగానికి పునాదే కాక ఆంధ్రప్రదేశ్‌పై ప్రపంచ దృష్టిని కేంద్రీకరించిందన్నారు. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రకు సమానంగా కంపెనీలు వచ్చేలా లోకేశ్ దిశా నిర్దేశం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన కంపెనీలు సైతం తిరిగి వస్తున్నాయని తెలిపారు. తెదేపా నాయకులు కిలపర్తి వెంకట్రావు, ముత్యాల సత్యనారాయణ, పద్మనాభుని మురళీ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఉచిత వైద్యం

పరీక్షిస్తున్న వైద్యుడు

**తణుకు, న్యూస్‌టుడే:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికి ఉచిత వైద్యం నిర్వహించారు. వైద్యులు హర్షిత్ అహ్మద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య సేవలు కావాల్సిన వారు 99853 43530, 90592 90717 నంబర్లను సంప్రదించాలన్నారు. సంఘ కోశాధికారి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**నేత్ర వైద్యం.. కడకట్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** కడకట్లలోని జనతా ఆసుపత్రిలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. 96 మందికి పరీక్షలు నిర్వహించి 31 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. వైద్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, చిన్నం ఫణీంద్ర, సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆధార్ శిబిరాలు

**ఇరగవరం, న్యూస్‌టుడే:** మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి 26వ తేదీ వరకు ఆధార్ సంచార శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. శిబిరాల్లో ఆధార్ నమోదు, నవీకరణ చేస్తారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఉమర్ అలీషా పీఠంలో అన్న సమారాధన

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** కార్తిక మాసం పురస్కరించుకుని అత్తిలి ఉమర్ అలీషా ఆధ్యాత్మిక విద్యా పీఠంలో ఆదివారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రహదారులు బాగు చేయిస్తాం: మంత్రి

**ఆచంట, న్యూస్‌టుడే:** జిల్లాలో రహదారుల సమస్య తన దృష్టికి తీసుకుని వచ్చిందని.. అన్ని రోడ్లను దశల వారీగా బాగు చేయిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆచంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ప్రారంభించారు.

## ఇలా ఉంటే ఏం ఉపయోగం?

**ఇరగవరం, న్యూస్‌టుడే:** పాలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతో ఇరగవరంలో నిర్మించిన పాలశీతల కేంద్రం నిరుపయోగంగా మారింది. పశు పోషకుల ప్రయోజనార్థం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పన్నెండేళ్ల క్రితం సుమారు రూ. 50 లక్షలు వెచ్చించి భవన నిర్మాణంతో పాటు అవసరమైన సామగ్రి సమకూర్చారు. కానీ అప్పటి నుంచీ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించలేదు. భవనాన్ని ప్రజాపయోగ కార్యక్రమాలకు అనువుగా మార్చి ప్రజాధనం వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నిర్లక్ష్యం.. అల్లుకున్న ప్రమాదం

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలో పలు చోట్ల విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం కారణంగా స్తంభాలకు పాదులు అల్లుకుపోయాయి. దీంతో చిన్నపాటి గాలి వీచినా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్నవి స్థానిక డి.ఎస్.చెరువు సమీపంలోని విద్యుత్తు పరివర్తకానికి ఫ్యూజు బాక్సులు పూర్తిగా పాడైపోయాయి. చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి పరివర్తకం వరకు వ్యాపించాయి. చుట్టూ రక్షణ కంచె కూడా లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

**తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల షెడ్ల నిర్మాణాలు లేక సైకిళ్ల ఆరు బయట నిలుపుతున్నారు. దీంతో అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రూ.వేలు పెట్టి కొనుగోలు చేసిన సైకిళ్లకు మరల రూ. వందలతో బాగు చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పెంటపాడు మండల పరిధిలోని దర్శిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద షెడ్డు లేకపోవడమే కాకుండా కనీసం సైకిళ్లు నిలిపేందుకు కూడా స్థలం లేక రహదారికి ఆనుకుని విద్యార్థులు సైకిళ్లు నిలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ప్రమాదకరంగా కాలువ రేవు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** కార్తిక మాసంలో పవిత్ర గోస్తనీ స్నానాలు ఆచరించే కాలువ రేవులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. గతంలో రేవుల వద్ద స్నానాలకు దిగి భక్తులు గల్లంతైన సంఘటనలు అనేకం ఉన్నాయి. రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో భక్తులకు రక్షణ కరవైంది. తణుకు పట్టణంలో ఉమాసిద్దేశ్వర స్వామి, ఉమాసోమేశ్వర స్వామి ఆలయాలు ఉండగా, పైడిపర్రులోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. ఆలయాలకు కార్తిక మాసంలో నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చి తెల్లవారుజామున పుణ్య స్నానాలు ఆచరిస్తారు. అధికారులు స్పందించి కాలువ రేవుల వద్ద రక్షణ చర్యలు చేపట్టి, రేవులను శుభ్రంగా తీర్చిదిద్దాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

## శతాధిక వృద్ధుడికి సత్కారం

**మోదుగుగుంట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం మండలం సగర సంఘ కార్తిక వన సమారాధనలో 105 సంవత్సరాల చనుబోయిన కనకయ్యను ఆదివారం ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆ సంఘ రాష్ట్ర నాయకులు కర్నాటి కన్నయ్య, తెదేపా నాయకులు కర్నాటి పోలిరెడ్డి, గుళ్లపల్లి కొండలరావు, ఏపూరి నాగరాజు పాల్గొన్నారు.

## క్రీడలే ప్రాణం.. కొలువే లక్ష్యం

### సత్తా చాటుతున్న గ్రామీణ బాలికలు

కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

**ఇరగవరం, న్యూస్‌టుడే:** క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించడంతో పాటు ఉద్యోగ అవకాశాల్లోనూ మంచి ప్రాధాన్యత ఉండటంతో మండలంలోని కె.ఇల్లిందలపర్రు ఉన్నత పాఠశాలలో పదో తరగతి బాలికలు విద్యతో పాటు ఆటల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌లో అర్హత సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తూ భవితకు బాట వేసుకుంటున్న బాలికలపై కథనం..

**అదే నా ఆశయం..**

నా పేరు ధనశ్రీ. ఇటీవల జరిగిన అండర్-14 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యా. గతేడాది కబడ్డీ, అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అర్హత సాధించా. ఉద్యోగం సాధించడంతో పాటు జాతీయ స్థాయి క్రీడాకారిణిగా నిలవాలన్నదే ఆశయం.

**క్రీడా కోటాలో..**

నా పేరు హారీ. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి మోడరన్ ట్రయాథ్లాన్ పోటీల్లో పాల్గొన్నా. గతేడాది జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నా. క్రీడా కోటాలో ఉద్యోగమే నా లక్ష్యం.

**పతకాలు సాధించాలని..**

నా పేరు నవ్య సింధు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో అర్హత సాధించా. గతేడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ఖోఖో పోటీలకు ఎంపికయ్యా. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు కైవసం చేసుకోవడమే నా కోరిక.

**జిల్లా స్థాయికి..**

నా పేరు నిశాంతి. ఇటీవల అండర్-14 విభాగంలో జరిగిన వాలీబాల్ క్రీడలో జిల్లా స్థాయికి ఎంపికయ్యా. గతేడాది కబడ్డీ, ఖోఖోలో జిల్లా స్థాయిలో అర్హత సాధించా. ఆటల్లో రాణిస్తూ ఉన్నత ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం.

## ఎక్కడుంటారో.. ఎప్పుడొస్తారో

గణపవరం శాఖా గ్రంథాలయాన్ని ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూసి ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడి గ్రంథపాలకురాలిని నిడమర్రు ఇన్‌ఛార్జిగా నియమించడంతో సమస్య నెలకొంది. దీనికితోడు పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేయిస్తామని ఈవో ప్రసాద్ తెలిపారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

## పరిశ్రమల స్థాపనతో ఉపాధి: గన్ని

**గణపవరం, న్యూస్‌టుడే:** దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల హబ్‌గా మారిందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. అర్ధవరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర దిశదశ మార్చనుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికొచ్చేందుకు భయపడే వారన్నారు. వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భరోసానిస్తూ.. పెట్టుబడులు తీసుకొస్తున్నారని కొనియాడారు. రూ.లక్షల కోట్లతో ఏర్పాటయ్యే పరిశ్రమలతో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. నాయకులు రామకృష్ణంరాజు, ముత్యాలస్వామి, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతోందని ఆరవల్లి గ్రామ కూటమి నాయకులు అన్నారు. ఆరవల్లిలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**తణుకు, న్యూస్‌టుడే:** గ్రామ, పట్టణాల్లో గ్రంథాలయ ఉద్యమాన్ని వ్యాప్తి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, వెలగా వెంకటప్పయ్య చిరస్మరణీయులని టీవీ, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట రామప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వావిలాల సరళా దేవి అన్నారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు.

తాడేపల్లిగూడెం: శ్రీనివాసరావును సత్కరిస్తున్న పాఠకులు

తణుకు: ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

● స్థానిక మహిళా శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారిణి ప్రవీణ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుకుని డీఎస్సీలో ఉద్యోగం సాధించిన కవితను సత్కరించారు.

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం పట్టణం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సరస్వతి వేషధారణలో సందడి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి కోపల్లె శ్రీనివాసరావును గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు సత్కరించారు. బుక్ రీడర్స్ కమిటీ సభ్యులు వీరాస్వామి, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య పుంత.. రాకపోకలకు చింత

### అవస్థలు పడుతున్న వాహనదారులు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు పట్టణంలో ట్రాఫిక్‌ను పూర్తి స్థాయిలో నియంత్రించే దిశగా రామయ్య పుంతనే గత తెదేపా హయాంలో నిర్మించారు. ట్రాఫిక్ అధిగమించేందుకు 216ఎ నంబర్ జాతీయ రహదారి నుంచి కొండాలమ్మ పుంత రోడ్డు మీదుగా ఇరగవరం వైపు వాహనాలను మళ్లించేలా పొలాల మధ్య నుంచి రామయ్య పుంత ఏర్పాటు చేశారు. అయితే ఈ రహదారి వెంబడి భారీ వాహనాలు రాకపోకలతో ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమైంది.

గోతులతో దర్శనమిస్తున్న మార్గం

**నానా అగచాట్లు..** 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి మట్టితో ఉన్న రామయ్య పుంతను నాబార్డు నిధులు రూ. 1.35 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ 1.83 కిలో మీటర్ల మేర రహదారి నిర్మించారు. దీంతో ఇటు భీమవరం, ఇరగవరం, నరసాపురం, పాలకొల్లు అటు జాతీయ రహదారి నుంచి వచ్చే వాహనాలు పట్టణంలోకి రాకుండా నేరుగా వెళ్లేందుకు మార్గం సులువుగా మారింది. నిర్మాణం చేపట్టి ఏడేళ్లు కావస్తుండటంతో గుంతలమయమైయింది. ద్విచక్ర వాహనదారులు సైతం ఇటుగా ప్రయాణించేందుకు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రతిపాదనలు పంపాం..** కొండాలమ్మ పుంత నుంచి ఇరగవరం రోడ్డు వరకు రామయ్య పుంత నూతన రహదారి నిర్మాణానికి ఇటీవల రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.
**- సత్యరుషి, పంచాయతీరాజ్ ఏఈ**

## సీసీఎల్ ఉపయోగించుకునే ఆప్షన్ ఇవ్వాలి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ముఖ ఆధారిత హాజరు యాప్‌లో సీసీఎల్ ఉపయోగించుకునే ఆప్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బి.వి నారాయణ కోరారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజులు ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం, పండుగ సెలవుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ ప్రొసీడింగ్స్ ఇచ్చారని, ముఖ ఆధారిత యాప్‌లో ఆప్షన్ ఇవ్వకపోవడంతో గత ఏడాది ఉపాధ్యాయులు సీసీఎల్‌ను ఉపయోగించుకోలేకపోయారని ఒక ప్రకటనలో తెలిపారు.

(c) eenadu

## కార్తికం.. సనాతన ధర్మ సమ్మేళనం

బాలికల నృత్యం

శివ పార్వతుల కల్యాణం తిలకిస్తున్న జనం

పవిత్ర కార్తిక మాసాన.. కులాలతో సంబంధం లేకుండా సనాతన ధర్మ పరిరక్షణకు హిందువులను ఏకం చేస్తూ కడప చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ కార్తిక వన భోజనం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. నగర శివారులోని లలిత పండాయతన ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మాన్ని అనుసరిస్తున్న వారంతా వేలాదిగా హాజరయ్యారు. చిన్మయ మిషన్ కడప అధ్యక్షుడు తురియానంద సరస్వతి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తున్న అందరినీ ఏకం చేయాలనే ఉద్దేశంతో ఈ వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామి రుద్రాభిషేకం, గోపూజ, శివపార్వతుల కల్యాణం కనుల పండువగా సాగాయి. తిరుపతి శ్రీలలితా పీఠం వ్యవస్థాపకులు స్వరూపానందస్వామి, అచలానంద ఆశ్రమ వ్యవస్థాపకులు విరజానందస్వామి, ఇస్కాన్ ప్రతినిధి వైష్ణవ కృపదాస్ ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపించారు. ఆధ్యాత్మిక సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, మారుతీనగర్

## వరి కాదు.. సతత హరిత సిరి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది వరి పంట అనుకుంటున్నారా.. సతత హరిత సిరితో కొత్తదనాన్ని పులుముకున్న లంకమల అభయారణ్యం. ఇటీవల వర్షాలు ఏకధాటిగా కురవడంతో అటవీ ప్రాంతంలో ఎండిన చెట్లు చిగురించి పచ్చదనం పరుచుకుంది. సిద్దవటం రేంజ్ అడవులు వన్యప్రాణులకు నెలవు. వేసవిలో వన్యప్రాణులకు గడ్డి కొరత రాకుండా 2021లో సిద్దవటం అటవీ అధికారులు లోలెవెల్ బీటు అటవీ ప్రాంతంలో గడ్డి పునరుత్పత్తి ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. గడ్డి గింజలు చల్లి పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి పునరుత్పత్తి ప్రాంతం పచ్చదనంతో మెరిస్తూ ప్రకృతి ప్రేమికులను ఆకర్శిస్తూ మంత్రముగ్ధులను చేస్తోంది. - న్యూస్‌టుడే, సిద్దవటం

## డీ కేడీ

◆ రూ.కోట్ల స్థలం అప్పనంగా కొట్టేశారు!
◆ వివాదాస్పదంగా మారిన విలువైన భూమి

ఉప్పరపల్లెలో డీకేటీ స్థలంలో నిర్మించిన భవనం

సిద్దవటం, న్యూస్‌టుడే: కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన విలువైన డీకేటీ స్థలంపై అక్రమంగా నిర్మించిన భవన నిర్మాణాలు వివాదాస్పదంగా మారాయి. సుమారు రూ.2 కోట్ల విలువైన డీకేటీ స్థలంపై వ్యాపారాలకు సంబంధించిన భారీ భవన నిర్మాణ పనులు చేపట్టడం వివాదానికి దారితీసింది. ఇంటి నిర్మాణాల ముసుగులో వ్యాపార దుకాణ భవనాలు నిర్మిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల కళ్లు గప్పుతూ రహస్యంగా పనులు కొనసాగిస్తూ నిబంధనలను కాలరాస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణ పనులు కొన్నేళ్లుగా సాగుతూ ఆగుతుండడంతో చర్చనీయాంశంగా మారింది.

### ఆ స్థలంలోనే భవన నిర్మాణాలు

● సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వే సంఖ్య 936/5 లోని ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్ల కిందట స్థానిక మహిళ పేరు మీద మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరైంది. దీన్ని అడ్డు పెట్టుకుని స్థానిక వ్యాపారి ఒకరు ఆ సర్వే సంఖ్యలో మరి కొందరు బినామీ పేర్ల మీద అనుబంధ పత్రాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

● ఈ పత్రాలను అడ్డుపెట్టుకుని 2021లో మొత్తం పది సెంట్లలో వ్యాపార దుకాణం కోసం భారీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులపై అప్పట్లో స్థానికుల

● ఇదే తరహాలో పక్కనే మరో పది సెంట్ల స్థలంలో కూడా వ్యాపార దుకాణం కోసం భారీ భవన నిర్మాణ పనులు జరుగ్గా వాటిని కూడా నిలిపేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ నిర్మాణ పనులు రహస్యంగా చేపట్టడం, నిలిపేయడం వంటివి కొనసాగుతూ వచ్చాయి.

● ఇలా భవనాన్ని అక్రమంగా అంచెలంచెలుగా నిర్మిస్తున్నారు. పాత దుకాణమేనని అందరినీ మభ్యపెడుతూ రెండు రోజుల కిందట వ్యాపార సామగ్రిని కొత్త భవనంలోకి చేర్చే పనులు చేశారని సమాచారం. నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నుంచి ఫిర్యాదులు రావడంతో ఆ నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని తేలడంతో అధికారులు పనులను నిలిపేశారు.

● ఇటీవల మళ్లీ నిర్మాణదారులు ఆ భారీ భవనానికి రహస్యంగా షట్టర్లు ఏర్పాటు చేసే పనులు చేపట్టినట్లు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వచ్చి వాటిని తొలగించారు. అధికారులు లేనప్పుడు పనులు చేయడం, వచ్చినపుడు పనులు నిలిపేయడం వంటివి నిర్మాణదారులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం

డీకేటీలో చేపట్టిన భారీ భవన నిర్మాణాలను పరిశీలించాం. ఇంటి నిర్మాణం కోసం అనుభవ పత్రం పొంది మరికొందరి పేర్లతో వ్యాపారం కోసం భవనం నిర్మించడం చట్టరీత్యా నేరం. ఇటీవల భవనానికి ఏర్పాటు చేసిన షట్టర్లను తొలగించాం. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు కొనసాగిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. - తిరుమలబాబు, తహసీల్దారు, సిద్దవటం

## 112కు ఫోన్ చేస్తే.. పోలీసు పక్కన ఉన్నట్లే!

డయల్ 112కు వచ్చిన ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఏదైనా ఘటన జరిగితే బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తేనే పోలీసులు వెళ్లే వారు. అప్పటికే అంతా జరిగిపోయేది. కానీ నేడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. శాంతిభద్రతలకు ఎక్కడ భంగం వాటిల్లినా ఉన్నచోటి నుంచి 112కు ఫోన్ చేస్తే చాలు.. అయిదు నుంచి పది నిమిషాల్లో పోలీసులు వచ్చి వాలుతారు. ఇటీవల కాలంలో ఈ నంబరుకు ఫోన్లు వేలల్లో వస్తున్నాయి. హత్యలు, హత్యాయత్నాలు, ఆత్మహత్య యత్నం, మద్యపానం ఇలా అనేక నేరాలను అడ్డుకుని జనంలో నమ్మకం పెంచారు. సమస్య ఏదైనా సరే ఈ నంబరుకు ఫోన్ చేస్తే పోలీసులు వెళ్తారు.

ఉమ్మడి కడప జిల్లాలో వచ్చిన ఫోన్ కాల్స్

| ఏడాది | వచ్చిన ఫోన్లు |
|---|---|
| 2023 | 11,375 |
| 2024 | 15,465 |
| 2025 | 10,670 |

(అక్టోబరు 31 వరకు)

## ఎల్ఈడీ తెరపై అలివేలమ్మ

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో దర్శనం కోసం తరలివస్తున్న భక్తులు తిరుచానూరు పద్మావతి అమ్మ వారి బ్రహ్మోత్సవాలను కనులారా వీక్షించేలా రథశాల మండపం వద్ద తితిదే అధికారులు ఆదివారం రాత్రి ఎల్ఈడీ తెరను ఏర్పాటు చేశారు. అమ్మవారి అభిషేకం, ఊరేగింపు, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలను రామయ్య సన్నిధికి విచ్చేసిన యాత్రికులు తిలకించేలా పెద్ద స్క్రీన్ అమర్చారు. అక్కడ జరుగుతున్న గ్రామోత్సవం, ఇతర పూజా కైంకర్యాలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తితిదే అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

## విదేశీ అతిథులు.. సోమశిల పుట్టినిల్లు

దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే ఈ పక్షి దక్షిణ భారతంలోని కొన్ని సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసుకుని జీవిస్తాయి. జనావాసాలకు దూరంగా ఉంటుంది.

దీని పేరు **రామదాసు.** దక్షిణ భారత దేశంలో సంచరిస్తుంది. చలికాలంలో సోమశిలకు చేరుకుని వేసవి ప్రారంభమైన తర్వాత తిరిగి వెళ్తుంది.

సోమశిల చెంతకు విదేశీ వలస పక్షుల రాక మొదలైంది.. సురక్షిత ప్రదేశం కావడం, తగినంత ఆహారం లభించడంతో భారీగా వలస వస్తున్నాయి. వెనుక జలాల్లో అందాల అతిథులు కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. విహంగాలు అబ్బురపరిచే విన్యాసాలు నేత్రానందాన్ని పంచుతున్నాయి. ఏటా నవంబరు మొదటి వారం నుంచి ఇక్కడి వస్తాయి. జన సంచారం చాలా తక్కువగా ఉండడం, కాలుష్య రహితం కావడంతో సువిశాలమైన వెనుక జలాల్లో గూడు కట్టి, గుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయి. ఒంటిమిట్ట మండలంలో పాతమాధవరం, కొండమాచుపల్లె, బోయనపల్లి, కలికిరి, గుండ్లమాడ, మదిలేగడ్డతోపాటు మరికొన్ని గ్రామాల్లో ఉంటున్నాయి. పక్షి ప్రేమికుడు, విశ్రాంత అటవీ క్షేత్రాధికారి మొహమ్మద్ హయాత్ వీటి వివరాలను 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

● **ఎక్కడెక్కడ :** పెన్నానది, సగిలేరు, బాహుదా సంగమ ప్రాంతాల్లోనూ విహరిస్తున్నాయి.

● **ఏఏ రకాలంటే..:** పెయింటెడ్ స్టార్క్, పెలికాన్స్, సైబీరియా తెల్ల, ఎర్రకాళ్లు, నీటి కొంగలతో పాటు మరెన్నో రకాలు ఇక్కడ ఉంటున్నాయి. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

సోమశిలకు చైనా, కంబోడియా, థాయిలాండ్, మయన్మార్ దేశాల నుంచి వస్తుంది. చేప పిల్లలు, పురుగులు, నత్తలు, పీతలే ఆహారం.

ఉత్తర భారతదేశంలోని హరియాణ, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఇక్కడికి చేరుకుంటుంది. ఒక్కో పక్షి 2 నుంచి 4 గుడ్లు పెడుతుంది. పెన్నా పరివాహక ప్రాంతాన్ని ఆవాసంగా చేసుకుంది.

## షార్జా విమానం.. ఇస్త్రీ పెట్టెలో బంగారం

**శంషాబాద్, న్యూస్‌టుడే:** షార్జా నుంచి ఇస్త్రీ బాక్సులో తీసుకొచ్చిన 1200 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం.. ప్రొద్దుటూరుకు చెందిన వ్యాపారి షార్జాకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో 1200 గ్రాముల బరువు గల 11 బంగారం బిస్కెట్లను ఇస్త్రీ పెట్టెలో అమర్చాడు. రహస్యంగా విమానంలో శంషాబాద్‌కు తెచ్చాడు. కస్టమ్స్ అధికారుల తనిఖీలను తప్పించుకొని గ్రీన్ ఛానల్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతని సామగ్రి అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీలు చేయగా అక్రమ బంగారం తరలింపు గుట్టురట్టయింది. రూ.1.55 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుడితో పాటు మరో వ్యక్తిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 19న జిల్లాకు సీఎం రాక!



**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాకు రానున్నారు. అందుకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 19న కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంలో భాగంగా 20వ విడతను అమలు చేయనున్నారు. ఆ రోజు నేరుగా రైతుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ నిధులు కూడా ఈ ఏడాది రెండో విడత జమ చేస్తారని సమాచారం. జిల్లాకు సీఎం వచ్చే వీలుందని క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా పాలనాధికారి సూచించడంతో వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్, ఉద్యానశాఖ జిల్లా అధికారి సతీష్, ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారి ప్రవీణ్ కుమార్, తదితరులు ఆదివారం సాయంత్రం పెండ్లిమర్రి మండలంలోని చెన్నం రాజుపల్లె, చిన్నదాసరి పల్లె, యాదవాపురం గ్రామాలను పరిశీలించారు.

## నేడు డయల్ యువర్ సీఎండీ

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. కేటాయించిన సమయంలో సెల్ నంబరు 89777 16661కు ఫోన్ చేయాలన్నారు. ఇది కాక టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసుకోవచ్చన్నారు. వాట్సప్ నంబరు 91333 31912కు సమస్య ఫొటో తీసి ఈ నంబరుకు వాట్సప్ చేస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు.

## మల్లె.. పరిమళం

మల్లె పూలను విడిపిస్తున్న కూలీలు

పరిమళం.. తాజాదనం.. మృదుత్వం.. ఒక దాన్ని మించి మరొకటి పోటీ పడే వాల్మీకిపురం సన్న మొగ్గలు (సన్నజాజులు) మూడు రాష్ట్రాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాయి. మల్లెల్లో ఎన్నో రకాలున్నా వాల్మీకిపురంలో సాగవుతున్న సన్న మొగ్గలంటే ప్రత్యేకత. మిగిలిన రకాలను తోసిరాజని మగువల మనస్సును దోచుకుంటున్నాయి. ముఖ్యంగా మార్చిలో సన్నమల్లెలు సీజన్ ప్రారంభమై ప్రతి ఏటా నవంబరులో ముగుస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నజాజులు కిలో రూ.1000 వరకు ధర పలుకుతున్నాయి. వాల్మీకిపురం పరిసరాల్లో దాదాపు వంద ఎకరాల్లో మల్లెతోటలుండగా ఎకరాకు 3,500 కిలోల చొప్పున ఏటా 400 టన్నులకు పైగా పూల దిగుబడి వస్తోంది. సగటున కిలో ధర రూ.300 నుంచి గరిష్ఠంగా కిలో రూ.1000 దాకా పలుకుతోంది. ఈ నెలాఖరుతో మల్లెల సీజన్ ముగియనుంది. - న్యూస్‌టుడే, వాల్మీకిపురం

## చౌడేశ్వరి జ్యోతులు.. ఆధ్యాత్మిక కాంతులు!

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు శివారులోని దొరసానిపల్లె, శ్రీనివాసపురం, ఈశ్వరరెడ్డినగర్, పెన్నానగర్‌లో ఆదివారం చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలతో పాటు మొక్కుబడి కలిగిన భక్తుల ఇళ్ల వద్ద నుంచి మంగళ వాయిద్యాలు, డప్పు మోతలతో ఆదిపరాశక్తి కీర్తనలకు మేళ తాళాలతో సమీపంలోని ఆలయాల వద్దకు వెళ్లి పవిత్ర జలాలను బిందెల్లో నింపుకొని పూజలు చేశారు. నారికేళం ప్రతిష్ఠించిన తొగటవీర క్షత్రియులు, దేవాంగ సోదరులు అమ్మవారి బిందెలను తమ తలపై పెట్టుకొని ఊరేగింపుగా వీధుల్లో ప్రదర్శన చేశారు. అర్ధరాతి 12 గంటల నుంచి చివరి కార్తిక సోమవారం ఉదయం వరకు చౌడేశ్వరి జ్యోతులు, గ్రామోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలకు బంధువులు, కుటుంబ సభ్యుల రాకతో పెద్ద ఎత్తున జాతర తలపించేవిధంగా సందడి నెలకొంది.

## ఫాస్టాగ్ లేని వాహనదారులకు స్వల్ప ఊరట

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలకు ఫాస్టాగ్ లేకపోతే టోల్ రుసుముకు రెండింతలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వాహనదారులు ఇన్నాళ్లూ నగదు రూపంలో లేదా యూపీఐ ద్వారా చెల్లించినా ఇదే నిబంధన వర్తించేది. ఇప్పుడు ఈ నిబంధనను కేంద్ర ప్రభుత్వం సడలించింది. యూపీఐ ద్వారా చెల్లిస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుంది. ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. దీంతో ఫాస్టాగ్ లేని వాహనదారులు యూపీఐ ద్వారా చెల్లింపులపై స్వల్ప ఊరట కలుగనుంది. ఉదాహరణకు.. ఫాస్టాగ్ ఉన్న వాహనదారుడు రూ.100 టోల్ రుసుం చెల్లిస్తే.. ఫాస్టాగ్ లేని వారు నగదు రూపంలో అయితే రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. అదే యూపీఐ ద్వారా అయితే రూ.125 చెల్లిస్తే సరిపోతుందని ఎన్‌హెచ్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఫాస్టాగ్ లేని వాహనదారులకు యూపీఐ ద్వారా స్వల్ప ఊరట కల్పించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, కొండాపురం

## అన్నమయ్య.. నీకెంత కష్టమయ్యా!



పామర జన భాషకు సాహిత్య గౌరవం కల్పించిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. వైవిధ్యభరితమైన సంకీర్తనలతో పాటకు పట్టాభిషేకం చేశారాయన. ఆయన పుట్టి, పెరిగి, తిరిగిన చోట మనోళ్లు ఆలనాపాలనా మరిచారు. తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. చూసినోళ్లు అయ్యో అన్నమయ్య.. నీకెంత కష్టమొచ్చిందయ్యా అంటూ వాపోతున్నారు. రాజంపేట మండలం బాదనగడ్డ శివారు చెయ్యేరు నది ఒడ్డున అన్నమయ్య జలాశయ ద్వారం పక్కనే సంకీర్తనాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పచ్చదనం కోసం మొక్కలు నాటారు. వైకాపా పాలనలో 2021 నవంబరు 19న వరదలు పోటెత్తి మట్టి కట్ట పూర్తిగా కొట్టుకుపోయింది. సంకీర్తనాచార్యుల నందనవనం ముళ్లపొదలు, కంపచెట్ల నడుమ నేడు కళావిహీనంగా దర్శనమిస్తోంది.
- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, రాజంపేట గ్రామీణ

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కడప కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సభాభవనంలో నిర్వహించే వేదికకు కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఇతర అధికారులు పాల్గొంటున్న నేపథ్యంలో తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. కడపతో పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీ కేంద్రాల్లో కూడా ప్రజా సమస్య పరిష్కార వేదిక ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సొమ్ము భద్రం.. అయ్యేదిలా సొంతం

**◆ లక్షల్లో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు ◆ రూ.83.31 కోట్ల నిల్వలు గుర్తింపు**

మన దగ్గర డబ్బులుంటే ఎక్కడ దాచుకుంటాం.. బ్యాంకులోనే కదా! అలా దాచుకున్న నగదు భద్రంగా ఉంటుందని మన నమ్మకం.. అయితే అలా నమ్మకంగా సొమ్ము దాచుకున్న వారు తమ ఖాతాలను నిర్వహించకుండా వదిలేస్తే.. ఇటీవల ఆర్‌బీఐ అలా నిర్వహణ లేకుండా వదిలేసిన ఖాతాలను గుర్తించాలని బ్యాంకులను ఆదేశించింది. విస్తుపోయే నిజాలు అందులో వెలుగు చూశాయి. లక్షల్లో ఖాతాలు, రూ.కోట్లలో నగదు నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. సరైన ఆధారాలు చూపితే ఆ సొమ్ము ఖాతాదారులకు అందజేసే అవకాశాలున్నాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఆ వివరాలు మీకోసం. - న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

● గత పదేళ్లుగా లావాదేవీలను నిర్వహించని బ్యాంకు ఖాతాలు జిల్లాలో 4,72,101 ఉన్నాయి ఇందులో రూ.83.31 కోట్ల నిధులు అన్‌క్లెయిమ్‌గా గుర్తించారు. ఈ మొత్తం ఆయా బ్యాంకుల ప్రధాన శాఖల నుంచి ఆర్‌బీఐకి వెళ్లింది. లావాదేవీలు నిర్వహించని ఖాతాల్లో వ్యక్తిగత, ప్రభుత్వ, వివిధ సంస్థల ఖాతాలు ఉన్నాయి.

● ఈ మొత్తాన్ని సంబంధిత వ్యక్తులు తిరిగి పొందేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గొప్ప అవకాశం కల్పించింది. దీని కోసం 'మీ డబ్బు-మీ హక్కు' పేరుతో డిసెంబరు 31వ తేదీ వరకు పలు రకాలుగా బ్యాంకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**జిల్లాలో లావాదేవీలు నిర్వహించని ఖాతాలు, అందులో ఉన్న నగదు వివరాలివి**

| ఖాతా రకం | అన్‌క్లెయిమ్ ఖాతాలు | నగదు (రూ.కోట్లలో) |
|---|---|---|
| వ్యక్తిగత ఖాతాలు | 4,50,262 | 68.12 |
| వివిధ సంస్థల ఖాతాలు | 18,734 | 10.24 |
| ప్రభుత్వ ఖాతాలు | 3,105 | 4.95 |
| మొత్తం ఖాతాలు, నగదు నిల్వ | 4,72,101 | రూ.83.31 కోట్లు |

### తిరిగి పొందడం ఎలా!

బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వ ఉంటే ఎందుకు తీసుకోరు అనే సందేహం మీకు రావొచ్చు. అయితే వివిధ కారణాల వల్ల ఇలా కోట్లాది రూపాయలు అన్‌క్లెయిమ్‌గా నిలిచిపోతోంది. ఆర్‌బీఐ వారు ఇలాంటి వారికి మరో అవకాశం కల్పించారు. తగిన ఆధారాలు తీసుకు వచ్చి బ్యాంకుల్లో సమర్పిస్తే వారి ఖాతాలను తిరిగి పునరుద్ధరించనున్నారు.

● ఆధార్‌కార్డు, పాన్‌కార్డుతో పాటు పాస్‌పోర్టు ఫొటో తీసుకుని బ్యాంకుకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. అప్పుడే మన ఖాతాను పునరుద్ధరిస్తారు. తిరిగి ఆర్‌బీఐతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఆ డబ్బును సదరు ఖాతాల్లోకి జమ అయ్యేలా చూస్తారు.

● ఒకవేళ ఖాతాదారుడు చనిపోతే వారసులు వచ్చి డెత్ సర్టిఫికెట్‌తో పాటు.. కుటుంబ సభ్యుల అంగీకార పత్రాన్ని బ్యాంకు అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. అవే కాకుండా బ్యాంకు వారు కోరిన మరికొన్ని డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. చనిపోయిన వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి కూడా కుటుంబ సభ్యులు ఆ మొత్తాన్ని తీసుకోవచ్చు.







(c) eenadu

# లేఖ రాయండి.. బహుమతి గెలవండి

● తపాలాశాఖ ఆధ్వర్యంలో పోటీలు




గతంలో ఒక ప్రాంతంలో నివసించే వారు మరో ప్రదేశంలోని వారికి ఏదైనా సమాచారం అందించాలంటే ఉత్తరాలే మార్గం. ఉత్తరాలతో కుటుంబ సంబంధాలు బాగుండేవి. సాంకేతికత, డిజిటలైజేషన్ కారణంగా లేఖలు కనుమరుగవుతున్నాయి. చేతిరాతనే మరచిపోతున్నారు. దీంతో గత సంస్కృతి కొత్త తరాలకు తెలిసేలా.. దస్తూరికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో లేఖల పోటీలు నాలుగేళ్లుగా నిర్వహిస్తోంది. విజేతలకు నగదు బహుమతులు అందిస్తోంది. ఈ ఏడాది 'నీ రోల్ మోడల్‌కు ఉత్తరం రాస్తే' (లెటర్ టు మై రోల్ మోడల్) అనే థీమ్‌ను ప్రకటించింది.

● **నగదు బహుమతులు :** జాతీయ స్థాయి పోటీలో ఉత్తమ లేఖలకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ.10 వేలు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.25 వేలు, ద్వితీయ రూ.10,000, తృతీయ స్థానం దక్కించుకున్న వారికి రూ.5 వేల నగదు అందించనున్నారు.

● **రెండు విభాగాల్లో నిబంధనలు ఇలా :** రోల్ మోడల్ అనుకుంటున్న వ్యక్తులపై తెలుగు, ఆంగ్లం, హిందీలో ఉత్తరాలు రాసే అవకాశం ఉంది. ఎన్వలప్ విభాగంలో ఏ4 పేపరుపై 1000 పదాలు, ఇన్‌ల్యాండ్ లెటర్ విభాగంలో 500 పదాలు మించకుండా రాయాలి. ● ఏ వయసు వారైనా పోటీల్లో పాల్గొని రాయొచ్చని ఉంటుంది. ఉత్తరంతో పాటు 2025 జనవరి నాటికి వయసు ఎంత, డిక్లరేషన్ ఫారం, నిర్ధారణ ప్రతిని జత చేయాలి. దరఖాస్తులు డిసెంబరు 8వ తేదీ లోపు జిల్లా తపాలా కార్యాలయానికి అందించాలని వాల్మీకిపురం తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

- న్యూస్‌టుడే, కలకడ, చిన్నమండెం

# పేదల జేబుకు చిల్లు.. ఉచిత సేవకు చెల్లు

## స్కానింగ్‌కు వచ్చిన గర్భిణులను ప్రైవేటుకు పంపుతున్న వైద్యులు

* మైదుకూరుకు చెందిన ఓ గర్భిణి వారికి బాబులేని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. కాన్పు కోసం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి వచ్చారు. ఇక్కడి వైద్యులు ప్రైవేటు కేంద్రంలో స్కానింగ్ చేయించుకురావాలని రాసిచ్చారు. ఇక్కడ అందుబాటులో ఉన్న విషయం ప్రశ్నిస్తే అందులో సరిగ్గా రాదని చెప్పారు. ఇటీవల చేయించిన స్కానింగ్ రిపోర్టులు చూపించినా మళ్లీ చేయించాలని తిప్పిపంపారు.

* ప్రొద్దుటూరుకు చెందిన ఓ గర్భిణి జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఇప్పటి వరకు ఆమెకు చేయించుకున్న మూడు స్కానింగులు ప్రైవేటు కేంద్రానికే రాసిచ్చారు. ఇక్కడ రిపోర్టులు కచ్చితంగా ఉండవని చెప్పి పంపారు.

అందుబాటులో ఉన్న స్కానింగ్ యంత్రం

**- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం**

ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం ఇక్కడి వైద్యులు ప్రైవేటు కేంద్రాలకు పంపుతున్నారు. ఇక్కడ రెండు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిద్వారా స్కానింగులు చేస్తున్నారు. ఇక్కడ చేసిన స్కానింగ్ సరిగ్గా రాదని వైద్యులు చెబుతున్నట్లు గర్భిణులు అంటున్నారు. ప్రైవేటు కేంద్రంలో తీసుకువస్తే స్పష్టంగా ఉంటుందని స్వయంగా వైద్యులే చెబుతుండటం విమర్శలకు తావిస్తోంది. స్కానింగ్ వివరాలు, ఎక్కడ చేయించుకోవాలో ఆ ప్రైవేటు కేంద్రం పేరు సైతం తెల్లకాగితంపై రాసివ్వండంతో ప్రైవేటు స్కానింగ్ కేంద్రం నిర్వాహకులు ఇచ్చే కమీషన్ కోసం ఇలా రాస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. గర్భందాల్చిన సమయం నుంచి కాన్పు వరకు సుమారు మూడు సార్లు స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తుంది. వారిని ఇలా ప్రైవేటు కేంద్రాలకు పంపడంతో వారు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఇక్కడికి ఎక్కువగా పేదలే వస్తుంటారు. ఉచిత సేవలు పొందేందుకు వచ్చిన వారి జేబులు చిల్లు పడుతోంది. వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడి యంత్రం బాగానే పనిచేస్తోందని రోజూ సుమారు 40 నుంచి 45 స్కానింగులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో కమీషన్ కోసమే ప్రైవేటుకు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాతను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రైవేటు కేంద్రాలకు పంపుతున్నట్లు తమ దృష్టికి రాలేదని విచారించి అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలోని గర్భిణుల బారులు

# తెలుగువారి ఖ్యాతి చాటిన మహోన్నత వ్యక్తి రామోజీరావు

రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వరుణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కొండయ్య తదితరులు

**ప్రొద్దుటూరు విద్య, ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే:** తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి 'ఈనాడు' గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు దివంగత చెరుకూరి రామోజీరావు అని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. ఆదివారం ప్రొద్దుటూరు శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ 'సేవ' కేంద్రంలో సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో రామోజీరావు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ... రామోజీరావు 'ఈనాడు' దిన పత్రికను స్థాపించి అక్షరాలను ఆయుధాలుగా మలచి సంఘవిద్రోహులైన నాయకులు, అధికారులపై తూటాల వర్షం కురిపించారన్నారు. మరోవైపు తెలుగు భాషకు, కళాకారులకు ఉన్నత స్థానాన్నిచ్చారన్నారు. సినిమా రంగంలోకి ప్రవేశించి ప్రపంచంలోనే అతిపెద్ద రామోజీఫిల్మ్ సిటీని నిర్మించి గిన్నిస్‌బుక్‌లో స్థానం కల్పించారని తెలిపారు. 40 ఏళ్లుగా గ్రేడ్-2 పనిచేస్తున్న తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, సంస్కృతం భాషోపాధ్యాయుల ఉన్నతీకరణకు సహకరించిన భాషా ప్రేమికుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, నాయకులు గంగాధర్, ప్రసాద్, సుధాకర్, సుబ్బారెడ్డి, అధ్యాపకులు కూరపాటి శ్రీనివాసులురెడ్డి, రామోజీ అభిమానులు పాల్గొన్నారు.

# టెట్ నుంచి మినహాయించాలని వినతి

**కడప విద్య, న్యూస్‌టుడే:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించేలా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని కోరుతూ ఆదివారం కడప నగరంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఆమె స్వగృహంలో కలిసి ఎస్టీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 నుంచి 30 ఏళ్ల వయసు గల సీనియర్ ఉపాధ్యాయులను టెట్ రాయమనడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య, నాయకులు కంభం బాలగంగిరెడ్డి, ఇలియాస్‌బాషా, సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, గంగాధర్, మస్తాన్‌బాబు, రాజేంద్ర, హరి, నందగోపాల్, రాజశేఖర్, ఓబులేసు, చెన్నకేశవరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

# ఉర్దూ అకాడమీ పురస్కార గ్రహీతలకు సత్కారం

మహిళలను సత్కరిస్తున్న ఉర్దూ ప్రతినిధులు

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** రాష్ట్ర ఉర్దూ అకాడమీ పురస్కార గ్రహీతలను కడప జిల్లా అంజుమన్ తరఖ్జీ ఉర్దూ శాఖ ఘనంగా సత్కరించింది. కడప నగరంలోని షాహీ మహల్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన సత్కార కార్యక్రమంలో అంజుమన్ రాష్ట్ర సెమినార్ అధ్యక్షుడు అమీర్‌బాబు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్ ఫైజి, హిదాయతుల్లాలు అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు అందించి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ.. ఉర్దూ భాషా వికాసానికి, ఉర్దూ సాహితీ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేసిన వారిని సత్కరించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కన్వీనర్, యూనస్ తయ్యబ్, ఉర్దూ రచయిత, కవి నజర్, మౌలానా అజాద్ అవార్డు గ్రహీత అన్వర్, నజీర్‌అహ్మద్, జిలానీబాషా పాల్గొన్నారు.

# వైకాపా నాయకులను అడ్డుకున్న పోలీసులు

**కదిరి, న్యూస్‌టుడే:** వైకాపా కార్యాలయంపై దాడి ఘటనకు ప్రతిగా హిందూపురం వెళ్తున్న వైకాపా నాయకులను ఆదివారం శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి పోలీసులు అడ్డుకున్నారు. పులివెందుల నుంచి ఆ పార్టీ నేత సతీష్‌రెడ్డి బయల్దేరి వెళ్తుండగా కుటాగుళ్ల రైల్వేగేట్ వద్ద పోలీసులు ఆపేశారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తీసుకుంటున్న ముందస్తు చర్యలకు సహకరించాలన్నారు. సమీపంలోని వైకాపా నాయకుడు శ్రీనివాసరెడ్డి నివాసానికి తీసుకెళ్లి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవటం సరికాదని వైకాపా నాయకులు ఖండించారు.

# ఇంజినీర్ల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్ల సంఘం నూతన కార్యవర్గం ఎంపికైంది. నగరంలోని ఇంజినీర్ల భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఎంపిక చేశారు. సంఘంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శుల స్థానాలతో కలిపి సభ్యులంతా 12 మంది ఉండగా ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ విద్యాభ్యాసం పట్టా పుచ్చుకున్న విద్యార్థులంతా సమావేశమయ్యారు. పాత పాలకవర్గానికి రెండేళ్ల కాలపరిమితి పూర్తయిన నేపథ్యంలో కొత్త సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఎం.వెంకటేశు, సభ్యులుగా వెంకటరమణయ్య, వేణుగోపాల్, గణేష్, విపిన్‌కుమార్ శర్మ, నరేంద్రరావు, లక్ష్మీపతి, వెంకటరమణ, కృష్ణకిషోర్, ప్రసాద్, షహనాజ్, లక్ష్మీభాస్కర్, వాసుదేవరెడ్డిలను ఎన్నుకున్నారు. వీరందరితో తాజా మాజీ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గ ప్రతినిధులతో సంఘం నాయకులు

# ఉమ్మడి కడప జిల్లాలో 15 మంది సీఐల బదిలీ

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఉమ్మడి కడప జిల్లాలో 15 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా వారికి కేటాయించిన ఠాణాల్లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. వారిలో కొందరి వివరాలు.

| పేరు | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|
| కె. హేమసుందర్ రావు | రైల్వేకోడూరు | పోరుమామిళ్ల |
| డి. శ్రీనివాసులు | పోరుమామిళ్ల | ఎస్‌బీ-3 అన్నమయ్య |
| టి. బాబు | ఒంటిమిట్ట | ఏహెచ్‌టీయూ, అన్నమయ్య |
| పి. నరసింహరాజు | వీఆర్, చిత్తూరు | ఒంటిమిట్ట |
| పి. చంద్రశేఖర్ | సైబర్ ఠాణా, కడప | ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య |
| ఏ. సురేష్‌రెడ్డి | ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య | కడప ట్రాఫిక్ ఠాణా |
| డీకే జావెద్ | కడప ట్రాఫిక్ | సైబర్ ఠాణా, కడప |
| పి. వెంకటేశ్వర్లు | రైల్వేకోడూరు | ఎస్‌బీ-3 అన్నమయ్య |

# లండన్‌లో నేత్ర పర్వంగా నర్మదేశ్వర స్వామి కల్యాణం

లండన్‌లో కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

**బద్వేలు, బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే:** కార్తిక మాసాన్ని పురస్కరించుకుని లండన్ దేశంలో ఆదివారం మీనాక్షీ సమేత నర్మదేశ్వర స్వామి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. బ్రహ్మంగారిమఠం మండలం పలుగురాళ్లపల్లెకు చెందిన గోవిందస్వామి మఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకను అక్కడి తెలుగు వారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీనివాస శాస్త్రి లండన్ నుంచి 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ సంఘ సంస్కర్త గోవిందస్వామి చరిత్రను, ఆయన గొప్పదనాన్ని స్వదేశంలోనే కాకుండా లండన్‌లో కూడా తెలుగువారికి తెలియజేసే అవకాశం తనకు లభించిందన్నారు.

# అప్పుల బాధతో రైతు బలవన్మరణం

సుబ్బరాయుడు (పాత చిత్రం)

**దువ్వూరు, న్యూస్‌టుడే :** అప్పుల బాధ భరించలేక దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన ఎం.సుబ్బరాయుడు (67) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ ధనుంజయుడు వివరాల మేరకు.. రైతు సుబ్బరాయుడుకు వ్యవసాయమే జీవనాధారం. సొంత భూమితోపాటు కౌలుకు కూడా కొంత తీసుకున్నారు. మొత్తం 10 ఎకరాల్లో సాగు చేస్తుండేవారు. పంటల పెట్టుబడులకు రూ.10 లక్షల మేర అప్పు చేశారు. ఆ అప్పులు తీర్చలేననే బాధతో ఈనెల నాలుగో తేదీన విషం తాగారు. ఈక్రమంలో కర్నూలులో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారని ఎస్ఐ తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**కలసపాడు, న్యూస్‌టుడే:** స్థానిక ముసల్‌రెడ్డిపల్లె రహదారిలోని ఎస్టీ కాలనీలో ఆదివారం దొమ్మర శ్రీనివాసులు (47) అలియాస్ శ్రీను అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఘటనా స్థలాన్ని ఆదివారం ఎస్సై తిమోతి, పోలీసులు పరిశీలించారు. పోలీసుల వివరాల మేరకు.. శ్రీను 12 ఏళ్ల నుంచి భార్యకు దూరంగా ఉన్నారు. కొంత కాలంగా మద్యానికి బానిసై ఒంటరిగా జీవిస్తున్నారు. కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. శనివారం రాత్రి తాడుతో చెట్టుకు ఉరేసుకున్నారు. కాగా.. ఇతని కాళ్లకు తాడు కట్టి ఉండడంతో స్థానికులు, పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాడు తానే కట్టుకున్నాడా.. ఎవరైనా కట్టారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీను తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు చెప్పారు.

# రైలు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. నంద్యాల జిల్లా బనగానిపల్లె మండలం దేవీనగర్‌కు చెందిన మహేష్ (22) కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కడప రైల్వేస్టేషన్ సమీపంలో నంద్యాల డెమో రైలు వెళ్తుండగా ట్రాక్ పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆకట్టుకున్న విదేశీ నాణేల ప్రదర్శన

**మారుతీనగర్, న్యూస్‌టుడే:** 50 దేశాల కరెన్సీకి సంబంధించిన నాణేలను విశ్రాంత గ్రంథాలయ అధికారి రంగనాథ్ సేకరించారు. ఈ సందర్భంగా కొండాయపల్లెలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం వాటితో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయాచార్యులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ నీలవేణి, మధుబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, విద్వాన్ కందిమల్ల రాజారెడ్డి, విద్వాన్ సుబ్బరాయుడు, రమేష్‌రావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాల కరెన్సీ నాణేలను చూపుతున్న విశ్రాంత లైబ్రేరియన్ రంగనాథ్

# సామాజిక న్యాయం కూటమితోనే సాధ్యం

**అరవిందనగర్ (కడప), చిన్నచౌక్, న్యూస్‌టుడే:** అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే పాలన ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. కడప నగర శివార్లలోని కనుమలోపల్లి సమీపంలో ఉన్న శివాలయంలో ఆదివారం తొగటవీరక్షత్రియ సంఘం వనభోజన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరమేశ్వరుడికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం తొగటవీరక్షత్రియ సంఘం రూపొందించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. అంతకు ముందు కడప నగరంలోని లలిత పంచయతన ఆలయంలో ఆదివారం నిర్వహించిన హిందూ కార్తిక వన సమారాధన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు.

కడప ఎమ్మెల్యే మాధవిని సత్కరిస్తున్న తొగటవీర క్షత్రియ సంఘం మహిళలు

# స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తెదేపా జెండా ఎగురవేస్తాం

**వేంపల్లె, న్యూస్‌టుడే:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో తెదేపా జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక గండిరోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం తెదేపా నేత షబ్బీర్ ఆధ్వర్యంలో వైకాపా నేతలు మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి, బాబు, సాధిక్‌వలి, శివారెడ్డి, వేంపల్లె, పక్కీరుపల్లెలకు చెందిన మరో 45 కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి బీటెక్ రవి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏళ్లుగా వైకాపా వారే ఏకగ్రీవమవుతున్నారన్నారు. త్వరలో రానున్న ఎన్నికల్లో పులివెందులతో పాటు వేంపల్లెలో మెజార్టీ స్థానాలు గెలుచుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ రామమునిరెడ్డి, నేతలు షబ్బీర్, జగన్నాథరెడ్డి, బాలస్వామిరెడ్డి, వీరభద్ర, షరీఫ్ పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన నేతలతో బీటెక్ రవి

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

REAL ESTATE

LEASE/ RENT

2.75 ACRES Comm Land Suitable for School or College or Warehouse, off NH205, 15 Mits from Tirupati. ✆ 94452 53860.

TO LET

COMMERCIAL

**కడప పాలెంపాపయ్యవీధిలో** మద్రాసు రోడ్డు నుండి 4వ బిల్డింగ్ కార్ పార్కింగ్, 24 గం॥లు నీటి సౌకర్యం కల్గిన G+1+2 ఫ్లోర్స్ (ఒక్కో ఫ్లోర్ 2100 Sqft) గల బిల్డింగ్, హాస్పిటల్స్, బ్యాంక్స్, ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్స్& కమర్షియల్ అవసరాలకు బాడుగకు ఇవ్వబడును.9133232320

**కడప మారుతీనగర్** (నాగార్జున స్కూల్ ప్రక్కన) విద్యాసాగర్ హాస్పిటల్ దగ్గర 4000 Sft బిల్డింగ్‌ను బాడుగకు గాని లేక అమ్మబడును. Cell : 77029 36190.

JOBS

**త్రినేత్ర హోంకేర్‌లో** వృద్ధులు/పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను ఫ్రీవసతి, భోజనం జీ: 18k. ✆ 85209 80099,85208 74499.

**APSRTC బస్టాండ్** కడప CCTVలో పనిచేయుటకు ఎలక్ట్రీషియన్ & టెక్నీషియన్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత.సం॥ 75692 45777, 6300831277

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

**కలికిరి :** అథ్లెటిక్స్ వంద మీటర్ల పరుగు పందెంలో కలికిరి ఇందిరమ్మకాలనీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హాసిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సత్తా చాటినట్లు వివరించారు.

# 30న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ లీగ్ పోటీలు

**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు అనిబిసెంట్ పురపాలక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 30న ఖేలో ఇండియా అస్మిత లీగ్ జిల్లా స్థాయి అండర్-14, 16 జిల్లా స్థాయి బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలుంటాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.అహమర్ బాషా తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా శిక్షణ కేంద్రాలు, జాతీయ అథ్లెటిక్ శిక్షణ శిబిరాలకు ఎంపిక చేస్తారని, ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 99496 86586, 80198 80995 నంబర్లను సంప్రదించాలన్నారు.

# కడప ఖ్యాతిని నిలబెట్టారు!

## రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 17 పతకాలు కైవసం

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** విజయనగరం కొండవెలగడ ప్రాంతంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కడప వెయిట్ లిఫ్టర్లు పతకాల పంట పండించారు. మొత్తం 17 పతకాలు సాధించారు. అందులో 5 బంగారు, 5 రజతం, 7 కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి నారాయణరావు తెలిపారు. ఈ పోటీల్లో రవిశంకర్ 'స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ది ఏపీ' టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఈయన 141 కేజీల స్నాచ్, 185 కేజీల క్లీన్ అండ్ జర్క్ విభాగంలో రాణించడంతో ఇతనికి బెస్ట్ టైటిల్ అవార్డు సైతం సొంతమైంది. సబ్ జూనియర్ బాలుర వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కడప జట్టు రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. భానుతేజ బెస్ట్ లిఫ్టర్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు శిక్షకుడు శివశంకర్ రెడ్డిని, పతకాలు సాధించిన క్రీడాకారులను వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ నారాయణరావు అభినందించారు.

సబ్ జూనియర్ విభాగంలో ఏపీ టీం ఛాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న కడప వెయిట్ లిఫ్టర్లు

**సత్తా చాటిన క్రీడాకారుల వివరాలు.. :** ● బాలుర సబ్ జూనియర్ విభాగం : పృథ్వీ, భానుతేజ, కిరణ్‌కుమార్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్ (బంగారు పతకాలు) చైతన్య, వాజిద్‌బాషా (రజతం) మాబు హర్షద్, అశోక్‌లు (కాంస్యం) ● **బాలుర జూనియర్ విభాగం :** పృథ్వీ 60 కేజీల విభాగంలో (రజతం) చైతన్య 71 కేజీల విభాగంలో (కాంస్యం) ● **సీనియర్ విభాగం :** రవిశంకర్ (బంగారం) శివరామకృష్ణయాదవ్ (రజతం), సూర్య నరసింహ వ్యాస (కాంస్యం) ● **బాలికల సబ్ జూనియర్ విభాగం :** సిరిచందన (రజతం), వెలంగిణి వేద, లెనిన్ ప్రియ (కాంస్యం) బాలికల జూనియర్ విభాగంలో సిరిచందన (కాంస్యం) పతకాన్ని సాధించారు.

# హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కె.బుడుగుంటపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్- 19 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఆదివారం ఆయా జట్ల మధ్య హోరాహోరీ పోటీలు నిర్వహించగా బాలుర విభాగంలో నెల్లూరు, అనంతపురం, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు, కడప, తూర్పుగోదావరి జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, నెల్లూరు, విశాఖపట్నం, కడప, శ్రీకాకుళం, అనంతపురం జట్లు విజయం సాధించినట్లు అండర్ - 19 ఎస్‌జీఎఫ్ కడప జిల్లా అధ్యక్షుడు టీఎన్‌వీ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు చెప్పారు. సోమవారంతో ఈ పోటీలు ముగుస్తాయని వివరించారు.

పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు

# ఐకమత్యంతోనే సంఘం బలోపేతం

వన భోజన కార్యక్రమంలో పాల్గొన్న యాదవులు

**పులివెందుల, న్యూస్‌టుడే:** యాదవులు ఐకమత్యంతో మెలిగి.. ఒకరికొకరు సహకరించుకోవాలని ఆ కుల సంఘం పెద్దలు కోరారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె సమీపంలోని శ్రీగుండాల మల్లయ్య కోనలో ఆదివారం యాదవ సామాజిక వర్గం వారి కార్తిక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘం పెద్దలు మాట్లాడుతూ యాదవులు సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేసినప్పుడే పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# రిమ్స్ శస్త్ర చికిత్స విభాగంలో జోనల్ సీఎంఈ

**సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే:** స్త్రీ సంబంధిత వ్యాధులపై పలు వైద్య కళాశాలల నుంచి వచ్చిన పీజీ వైద్య విద్యార్థులకు సర్వజన ఆసుపత్రి జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల కాన్ఫరెన్స్ హాలులో నిష్ణాతులైన వైద్యులతో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పెంచలయ్య, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. జోనల్ సీఎంఈ కార్యక్రమాలను సర్జరీ విభాగం వారు వినియోగించుకుని రోగులకు మెరుగైన అత్యాధునిక పద్ధతుల్లో వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ యాదవేంద్రరెడ్డి, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగశ్రీలత, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పెంచలయ్య

(c) eenadu

# ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు



## అల్లుకుపోయిన నిర్లక్ష్యం

అట్లూరు మండలంలోని కుంభగిరి సమీప పొలాల్లో విద్యుత్తు స్తంభానికి పచ్చ తీగలు అల్లుకుపోయాయి. హైటెన్షన్ స్తంభం కావడంతో తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు భావిస్తున్నారు. ఇటీవల వర్షాలకు చెట్లు, స్తంభాలకు తీగలు అల్లుకుపోవడంతో ఈ ప్రాంత మంతా పచ్చగా మారింది. -న్యూస్‌టుడే, అట్లూరు

## ప్రభుత్వం దృష్టికి కళాకారుల సమస్యలు

పోరుమామిళ్లలో రవికుమార్‌ను సన్మానిస్తున్న రవీంద్రారెడ్డి, పక్కన నాయకులు

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని బద్వేలు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ రవీంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో ఏపీ జానపద కళాకారుల సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాకారులు ఐకమత్యంతో ఉండి అభివృద్ధి చెందాలని చెప్పారు. జానపద కళలకు పూర్వవైభవం తీసుకురావాలని చెప్పారు. నూతనంగా రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన రవికుమార్‌ను అభినందించారు. కళాకారులు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## లంకమల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

**బద్వేలు:** చివరి కార్తిక సోమవారం సందర్భంగా లంకమల క్షేత్రానికి మూడు ప్రత్యేక బస్సులు సిద్ధం చేసినట్లు బద్వేలు ఆర్టీసీ డీఎం చైతన్య నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30, 10.00, మధ్యాహ్నం ఒంటిగంటకు బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు వెళ్తాయని, భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హెచ్‌ఎం సంజాయిషీ కోరిన డీఈవో

**చాపాడు, న్యూస్‌టుడే:** చాపాడులోని గూడూరు అప్పయ్యగారి సుబ్బరాయుడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను తీసుకుని తమ అనుమతి లేకుండా టూర్‌కు వెళ్లడంపై డిప్యూటీ డీఈవో మీనాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 14న పాఠశాల నుంచి కొంత మంది విద్యార్థులను మూడు రోజులపాటు టూర్‌కు తీసుకెళ్లారు. కనీసం వారం రోజుల ముందు సమాచారం తెలపాల్సి ఉండగా వెళుతున్న రోజు ఉదయం తమ కార్యాలయానికి అనుమతికి పంపించడం ఏంటని ఆమె హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఏ ప్రాంతానికి వెళుతున్నది, బస్సు ఫిట్‌నెస్, డ్రైవర్ వివరాలు తెలపకపోవడంపై మండిపడ్డారు. విద్యార్థులకు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని, త్వరలో వివరణ రాసివ్వాలని డిప్యూటీ డీఈవో హెచ్‌ఎంను ఆదేశించారు.

## ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

**ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే:** ఈ ఏడాది జూన్‌లో బదిలీలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బదిలీలు పొంది పాత పాఠశాలల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆదివారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు శామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సలీం, ఓబులరెడ్డిలను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

**ఎర్రగుంట్ల, పోరుమామిళ్ల, రాజుపాళెం, న్యూస్‌టుడే:** ఎర్రగుంట్ల, పోరుమామిళ్ల, రాజుపాళెం మండలాల్లోని పాఠశాల విద్యార్థుల కోసం ఈనెల 17 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయా ఎంపీడీవోలు వెంకటసుబ్బయ్య, ఉపేంద్రరెడ్డి, రామనాధరెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎర్రగుంట్లలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో చిలమకూరు జడ్పీ బాలుర హైస్కూల్, ఆర్టీపీపీ డీవీవీ హైస్కూల్లో 20, 21, 22 తేదీల్లో పొట్లదుర్తి జడ్పీ హైస్కూలు, 20, 21న చిలంకూరు, 22న నిడిజివ్వి ఎంపీపీ పాఠశాల, 23,24,25వ తేదీల్లో చిన్నదుద్యాల, ఇల్లూరు, సున్నపురాళ్లపల్లె ఎంపీపీ పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని వివరించారు. రాజుపాళెం మండలంలో 17, 18న తేదీల్లో రాజుపాళెం జడ్పీ పాఠశాల, 19, 20లో వెల్లాలలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, 21, 22న కొర్రపాడులోని జడ్పీ పాఠశాల, 24, 25న టంగుటూరు జడ్పీ పాఠశాల, 26న తొండలదిన్నె పాఠశాలలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 24 నుంచి ఉచిత శిక్షణ

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోర్సులు ఇస్తున్న శిక్షణలో చేరి సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ విజయ భాస్కర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వినీల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి వెబ్ డెవలపర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్ లేదా డిగ్రీ పాసై 18 సంవత్సరాలు పైబడిన నిరుద్యోగులు అర్హులన్నారు. శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆసక్తి ఉన్న యువత 96661 72953 అనే నంబరును సంప్రదించాలని కోరారు.

## ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

**ప్రొద్దుటూరు:** ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఖండించారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఎమ్మెల్యే మాటలున్నాయన్నారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో రూ.100 కోట్ల అవినీతి జరిగిందని అధికారుల విచారణ నివేదిక ఆధారంగా ప్రభుత్వం 43 మందిపై చర్యలు తీసుకుందని, అందుకు గత ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డే కారణమని చెప్పిన ఎమ్మెల్యే మాటల్లో వాస్తవం లేదన్నారు. సమావేశంలో పురపాలక సంఘ వైస్‌ఛైర్మన్ బీమునపల్లి లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డికొట్టాలలో కాడెద్దులు మృతి

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** కాశినాయన మండలం రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన శివయ్య అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు ఆదివారం మృతి చెందాయి. శివయ్య ఇటీవలే రెండు ఎద్దులను కొనుగోలు చేశారు. గ్రామ సమీపంలోని సగిలేటి ఒడ్డుకు పొలం దున్నేందుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని ఇంటికి వచ్చేందుకు సగిలేటి కాల్వ నుంచి ఎద్దులతో కొంత దూరం వచ్చేసరికి శివయ్య నీటిలో రాళ్లకు వెనుతిరిగారు. ఎద్దులు కొంత దూరం వచ్చి నీటి గుంతల్లో ఇరుక్కుపోయాయి. శివయ్య గ్రామస్థుల సాయంతో తాళ్లతో ఎద్దులను బయటకు తీశారు. అప్పటికే రెండు ఎద్దులు మృతి చెందాయని రైతు తీవ్ర ఆవేదన చెందారు. జీవనాధారం కోసం పనులు చేసేందుకు రూ.2 లక్షలు పెట్టి ఎద్దులను కొనుగోలు చేశానని రైతు తెలిపారు. ఎద్దుల మృతితో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని రైతు ఆవేదన చెందారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

## కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత

**ఎర్రగుంట్ల:** అనంతపురం జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆదివారం ఎర్రగుంట్ల రైల్వే ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. ఓ గ్రామానికి చెందిన మహిళకు నలుగురు కుమారులు సంతానం ఉన్నారు. వారు తనను పట్టించుకోలేదనే ఉద్దేశంతో ఆమె ఆత్మహత్య చేసుకోవాలని ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలుసుకుని ఎర్రగుంట్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమెను పోలీసులు గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

## వీహెచ్‌సీలకు మహర్దశ

• అసంపూర్తి కట్టడాలకు రూ.2.97 కోట్లతో ప్రతిపాదనలు

బీటలుబారిన పునాదులతో అసంపూర్తిగా కొత్తపల్లె-2 విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనం

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రెండు మండలాల పరిధిలో వివిధ దశల్లో ఉన్న 16 విలేజ్ హెల్త్ క్లీనిక్ (వీహెచ్‌సీ)లను మొత్తం రూ.2.97 కోట్లతో పూర్తి స్థాయిలో మిగిలిన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను ఎస్‌ఈ కార్యాలయానికి ఇటీవల పంచాయతీ రాజ్ ఇంజినీర్లు పంపారు. కలెక్టరు నుంచి ఆమోదం రాగానే ప్రొద్దుటూరు మండలంలో 12 కట్టడాలకు రూ.2.26 కోట్లు, రాజుపాళెం మండలంలో రూ.71 లక్షలతో 4 కట్టడాలను పూర్తి చేయనున్నారు. తలుపులు, కరెంటు, ఫ్లోరింగ్, ఫ్యాన్లు, రంగులు, ర్యాంపులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తదితర పనులను చేపడతారు. గత వైకాపా హయాంలో వీహెచ్‌సీలకు మంజూరైన నిధులు మళ్లింపుతో బిల్లులకు చెల్లింపులు లేక అర్ధాంతరంగా వీటి పనులను గుత్తేదారులు నిలిపేశారు. కేంద్రప్రాయోజిత నిధులతో అసంపూర్తిగా ఉన్న వీటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిమగ్నమవుతోంది.

### ప్రొద్దుటూరు మండలంలో..

ప్రొద్దుటూరు మండల పరిధిలో 25 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అసంపూర్తిగా ఉన్న 12 వీహెచ్‌సీ కట్టడాలకు రూ.2.26 కోట్ల ప్రతిపాదించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (పీఎం ఏవీహెచ్‌ఐఎం) పథకం కింద కొత్తపల్లె-5 వీహెచ్‌సీ భవనానికి రూ.55 లక్షలతో ప్రహరీ ఏర్పాటుకానుంది. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద దొరసానిపల్లె రూ.9.50 లక్షలు, సోములవారిపల్లె-1, 2, 3, 4లకు వేర్వేరుగా రూ.14.80 లక్షలు, రూ.11 లక్షలు, రూ.20 లక్షలు, రూ.9.80 లక్షలు, చౌటపల్లె రూ.15 లక్షలు, గోపవరం- 2, 3, 5లకు వరుసక్రమంలో రూ.19 లక్షలు, రూ.19 లక్షలు, రూ.13 లక్షలు, చెన్నమరాజుపల్లె రూ.19 లక్షలు, చౌడూరు రూ.21 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు ప్రతిపాదించారు.

### రాజుపాళెం మండలంలో..

రాజుపాళెంలో 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అందులో ఎన్‌హెచ్‌ఎం కింద అర్కటవేముల రూ.14 లక్షలు, కూలూరు కొట్టాలు రూ.28 లక్షలు, ఏరువపాళెం రూ.15 లక్షలు, కుమ్మరిపల్లె రూ.14 లక్షల చొప్పున వీహెచ్‌సీలకు పనులను నివేదించారు. ఈ విషయమై ప్రొద్దుటూరు పీఆర్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో వేర్వేరుగా అసంపూర్తిగా ఉన్న 16 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు మొత్తం రూ.2.97 కోట్లతో పంపిన ప్రతిపాదనలకు కలెక్టరు నుంచి ఆమోదంరాగానే కట్టడాలను పూర్తి చేస్తామన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజల నుంచి వినతులు స్వీకరించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

**మైదుకూరు, న్యూస్‌టుడే :** చిన్నపాటి సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను వేధింపునకు గురిచేయడంపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆగ్రహించారు. ఆదివారం ప్రొద్దుటూరులోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీరు, శ్మశానవాటికల ఆక్రమణ, విద్యుత్తు సమస్యలపై అధికంగా ఫిర్యాదులు రావడంతో కొందరు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంకూడదని హెచ్చరించారు. సమస్యలతో కార్యాలయాలకు వచ్చే ప్రజలతో చర్చించి పరిష్కారమార్గాన్ని చూపాలన్నారు. గ్రామస్థాయిలో పరిష్కరించే సమస్యలను పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు.

### ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలి

**మైదుకూరు:** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘ నాయకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య ఆధ్వర్యంలో సంఘ ప్రాంతీయ నాయకులు ప్రొద్దుటూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. దాదాపు 25 నుంచి 30ఏళ్ల సర్వీసు కలిగిన సీనియర్ ఉపాధ్యాయులను టెట్ రాయమనడం సమంజసం కాదన్నారు. వయసురీత్యా 50ఏళ్ల పైబడిన ఉపాధ్యాయులు వారు బోధించే పాఠ్యాంశం కాకుండా ఇతర పాఠ్యాంశాలతో కూడిన టెట్ పరీక్ష రాయడం తలకుమించిన భారం అవుతుందని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ నాయకులు వెంకటసుబ్బయ్య, రామ్మోహన్, చంద్రశేఖర్, రమణయ్య, కిరణ్‌కుమార్, ఈశ్వరయ్య, విజయుడు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవాలు ప్రారంభం

చౌడేశ్వరీ దేవాలయంలో అమ్మవారి అలంకరణ

**ప్రొద్దుటూరు పట్టణం:** ప్రొద్దుటూరు చౌడేశ్వరిదేవి దేవతా జ్యోతి ఉత్సవాలు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సుబ్బిరెడ్డికొట్టాల, దేవాంగపేట, మేదరవీధి, వినాయకనగర్, రామేశ్వరం, వసంతపేట, గంగమ్మ దేవాలయంవీధి, సూపర్‌బజారు రోడ్డు తదితర ప్రాంతాల్లో చౌడేశ్వరీదేవి ఆలయాల్లో చౌడేశ్వరిదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి నుంచి ఆలయాలకు భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించారు. రాత్రి 12 గంటల నుంచి తలపై ప్రత్యేక అలంకరణలో జ్యోతులు ఆయా ప్రాంతాల్లో ఊరేగింపుగా వెళ్లడం వాయిద్యాల మధ్య వెళ్లడం జరుగుతోంది. సోమవారం తెల్లవారుజాము వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు.

### సైకత లింగానికి బిల్వార్చన

**ప్రొద్దుటూరు పట్టణం:** ప్రొద్దుటూరు రామేశ్వరంలో వెలసిన ముక్తిరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసోత్సవంలో భాగంగా సైకత లింగానికి ఆదివారం లక్ష బిల్వార్చనతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజలు చేశారు.

### గ్రామాల ఐక్యత కోసమే..

**కలసపాడు, న్యూస్‌టుడే:** కార్తిక మాసంలో పరమశివుడిని ఆరాధిస్తూ గ్రామాల ఐక్యత, అభివృద్ధి కోసం రుద్ర పూజలు ఏర్పాటు చేశామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురువు శిష్యుడు ఆనంద్, వేదపండితులు చంద్రశేఖర్ మున్నా శర్మ తెలిపారు. ఆదివారం మండలంలోని కొండపేటలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శశికుమార్ సహకారంతో రుద్ర పూజలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచరు బి.ఎస్. నారాయణరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఘనంగా యోగి నరసయ్య స్వామి ఆలయ వార్షికోత్సవం

**బి.కోడూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని చెన్నకేశవాపురం (కొండమోటుపల్లె) గ్రామంలో యోగి నరసయ్య ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా రెండు రోజులుగా సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం విశేష హోమాలు నిర్వహించారు. పురోహితులు శివ, సత్యనారాయణ శర్మ, అమర్‌నాథ్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. సోమవారం ధ్వజ ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రామేశ్వరంలో భద్రావతీ, భావనా రుషీంద్రుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు రామేశ్వరంలో భద్రావతిదేవి సమేత భావనారుషి స్వామి కల్యాణాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. పద్మశాలీయుల కులదైవమైన ఈ స్వామికి కార్తిక మాస చివరి రోజుల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని రామేశ్వరం, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ఉన్న స్వామి వారి ఆలయాలు ఈ వేడుకకు వేదికయ్యాయి. రామేశ్వరంలో జరిగిన కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## కార్తిక వన భోజన సందడి

గోశాల వద్ద వన భోజనం చేస్తున్న ఆర్యవైశ్యులు

**దువ్వూరు, న్యూస్‌టుడే :** మండలంలోని చల్లబసాయపల్లె తెలుగుగంగ జలాశయం-1 వద్ద ముక్తిధాం గోశాలలో ఆదివారం దువ్వూరు మండలంలోని ఆర్యవైశ్యులు కార్తిక వనభోజనం కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొని వనభోజనం చేశారు. కుటుంబ సభ్యులు కలిసి పాటలు, డ్యాన్స్ వేసి సందడి చేసుకున్నారు.

## ఫ్యాక్షన్ కేసుల్లో చిక్కుకుంటే జైలు శిక్ష తప్పదు

కూనవారిపల్లెలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ వంశీధర్

**ఖాజీపేట, న్యూస్‌టుడే:** మండలం కూనవారిపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి సీఐ వంశీధర్ నేతృత్వంలో పోలీసుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణ నష్టాలు, ఫ్యాక్షన్ వల్ల కలిగే అనర్థాలు, కుటుంబాలు పడే ఇబ్బందులను, ప్రజలకు వివరించారు. కేసుల్లో చిక్కుకుంటే భారీ జైలు శిక్షలు, ఆస్తులు జప్తు కావడం, కోర్టు కేసులు సంవత్సరాలపాటు కొనసాగడం వంటి చట్ట పరమైన పరిణామాలను స్పష్టంగా తెలియజేశారు.

## పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** పంచాయతీలో ఇంటి పన్నులు, బకాయిలు చెల్లించేవారు ఆన్‌లైన్‌లో చెల్లించాలని పోరుమామిళ్ల ఈవో ఓబులేష్ తెలిపారు. ప్రభుత్వం పన్ను చెల్లించేందుకు నూతనంగా పోర్టల్ వినియోగంలోకి తెచ్చిందని చెప్పారు. పంచాయతీ సిబ్బందికి పన్నులు చెల్లింపులు చేసే సమయంలో స్వర్ణ పంచాయతీ యాప్‌లోనే నమోదు చేయాలని తెలిపారు. కాగితం రశీదులతో పన్నులు చెల్లింపు చేయడం లేదని చెప్పారు. పంచాయతీ ప్రజలు ఈ నూతన విధానాన్ని తెలుసుకోవాలని చెప్పారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

బద్వేలులో యువతుల నృత్య సందడి

**బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే:** బద్వేలు పట్టణంలో కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం, బలిజ సేవా సంఘం, రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. మూడు కుల సంఘాల వారు ఒకేరోజు వన భోజన కార్యక్రమం నిర్వహించడంతో పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలతో సందడిగా మారింది.

## సీమ అభివృద్ధి, హక్కులు కోరుతూ పోరాటం

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన రైతులు

**మైదుకూరు, న్యూస్‌టుడే :** రాయలసీమ అభివృద్ధి, హక్కుల కోసం రాజకీయాలకు అతీతంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వి.రమణ అన్నారు. రాయలసీమ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో శ్రీభాగ్ ఒడంబడిక నుంచి చేసుకున్న రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ, పాలన వికేంద్రీకరణ దాకా రాయలసీమ నాయకుల చేతుల్లో నష్టపోతూ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి, విశాఖపట్నం, పోలవరం అంటూ ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారే కానీ రాయలసీమలో పట్టణాల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయలేదన్నారు. నిరసనలో సమితి ప్రతినిధులు కోటయ్య గారి మురళి, అక్కిదాసరి రమేష్, పేట పెద్దరామన్న, ఎల్లంపల్లె సుబ్బారెడ్డి, సింగరేణి శ్రీనివాసులు, గోపాల్ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**కొండాపురం, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీఐ రాజా, ఎస్సై ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పిల్లలు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, చదువుతున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలు, చరవాణి వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. సామాజిక మధ్యమాల్లో తమ ఫొటోలు పెట్టవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేధింపులకు పాల్పడితే చర్యలు

మాట్లాడుతున్న పట్టణ సీఐ నరేష్ బాబు

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** ఆకతాయిలు అమ్మాయిల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ నరేష్ బాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించి 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ శక్తి బృంద సభ్యులతో గస్తీ చేయిస్తున్నామని విద్యార్థినులతో మాట్లాడి భరోసా కల్పిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## ఘనంగా బీఎన్ రెడ్డి జయంతి

బీఎన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, పుర ప్రముఖులు

**దువ్వూరు, న్యూస్‌టుడే :** దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి జయంతి వేడుకలను ఆదివారం అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దువ్వూరులో బి.ఎన్.రెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎన్.రెడ్డి సినిమాలో ధరించిన పాత్రలు, నాటకాలు పొందిన అవార్డులను వక్తలు వివరించారు. సంఘ నాయకులు ఎ.రాజగోపాల్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, బూసా వెంకటరమణారెడ్డి, వెంగమాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామానికి చెందిన గొరిగె వెంకటేశ్వర్లు రాసిన 'గొరిగె వేంకటేశ్వర శతకము' పుస్తకావిష్కరణ స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రంథాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి శివగణపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన కవి జింకా సుబ్రహ్మణ్యం హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకా జగన్నాథ శాస్త్రి పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రచయిత దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బాబ్జీ, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలరు గురుకుమార్, కవి గొంటుముక్కల గోవిందు, తిప్పాబత్తిని నరసింహులు, అమీర్, దర్పణం శ్రీనివాస్, సాహితీ వేత్తలు, తెలుగు పండితులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమకారుడికి నివాళులు

**రాజుపాళెం:** గ్రంథాలయ ఉద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి రాజుపాళెంలోని గ్రంథాలయ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వార్డన్ బషీర్ మాట్లాడుతూ ఆయన త్యాగాల ఫలం కారణంగా గ్రంథాలయాలు నేడు విద్యార్థులు, ప్రజలకు ఎంతో విజ్ఞానం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## దినదిన గండం.. కరెంటోళ్లకో దండం

### పట్టుకుంటే ప్రాణాలకే ముప్పు

– న్యూస్‌టుడే, జమ్మలమడుగు

**వీధుల్లో మారని ఇనుప స్తంభాలు**

జమ్మలమడుగు పట్టణంలో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు ప్రజలను వణికిస్తున్నాయి. వర్షాలు పడుతున్న సందర్భాల్లో వీటి సమీపంలోకి వెళ్లాలన్నా భయపడుతున్నారు. వీటిలో ఎక్కువగా రహదారుల పక్కనే ఉండడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని పాతవి కావడం, మరికొన్ని తుప్పపట్టి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. వీటికి వందలాది కనెక్షన్‌లు ఇవ్వడంతో తీగలు చుట్టుకుపోయి స్తంభాలకు విద్యుత్తు ప్రసారం అవుతోందని జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి వల్ల ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి మార్చాలని సూచిస్తున్నారు.

జమ్మలమడుగులో విద్యుత్తు నియంత్రికలు 389 ఉన్నాయి. 420 వరకు స్తంభాలు ఉండగా వీటిలో 73 ఇనుప స్తంభాలు ఉన్నాయి. వీటిని సుమారు 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేసి ఉంటారని అంచనా. దశాబ్దాలు గడవడంతో ఇనుపవి తుప్పపట్టి ప్రమాదకరంగా మారాయి. వీధుల్లో సిమెంటు రోడ్లు వేయడంతో కొన్ని చోట్ల ఎత్తు తగ్గిపోయి ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. నాగులకట్ట వీధి, మెయిన్ బజారు, కూరగాయల మార్కెట్, బురుజు వీధి, అంబాభవానీ ఆలయం, పలగాడి, ఎంపీడీవో రోడ్డు, మహబూబ్‌నగర్ వీధి వంటి ప్రాంతాల్లో ఇనుప స్తంభాలను మార్చాల్సి ఉంది. వాటి సమీపం నుంచి వెళ్లే పెద్దలు, పిల్లలు పొరపాటున వాటిని పట్టుకుంటే ప్రాణాలకే ప్రమాదమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై జమ్మలమడుగు విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఇనుప స్తంభాలు ఎన్ని ఉన్నాయో గుర్తించామని, మార్చుకుంటూ వస్తున్నామని త్వరలో ఆ ప్రక్రియను పూర్తిచేస్తామని తెలిపారు.

తితిదే కల్యాణ మంటపం వద్ద మహబూబ్‌నగర్ వీధిలో ప్రమాదకరంగా ఇనుప స్తంభం

## మహిళా క్రికెటర్ శ్రీచరణికి ప్రశంసలు

క్రికెటర్ శ్రీచరణికి జ్ఞాపిక బహూకరిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో సత్తా చాటిన తెలుగు తేజం శ్రీచరణిని వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అభినందించారు. ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయికి ఎదిగేందుకు సహకరించిన తల్లి, మార్గనిర్దేశనం చేసిన మామ కిషోర్‌కుమార్‌రెడ్డి కృషి ఎనలేనిదని కొనియాడారు. ఇండియా జట్టు సాధించే ప్రతి విజయంలో ఆమె కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

# కడప

•కడప •పులివెందుల •కమలాపురం

## బస్టాండ్‌లో ముమ్మరంగా తనిఖీలు

ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న చిన్నచౌకు పోలీసులు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్సై రవికుమార్ తమ సిబ్బందితో కడప ఆర్టీసీ బస్టాండులో తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. బ్యాగులు తెరచి తనిఖీలు చేశారు. కార్గో కార్యాలయంలో సోదాలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే 112కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో పలువురు సిబ్బంది ఉన్నారు.

## శిల్పారామంలో సందడే సందడి

వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు

**మారుతీనగర్, న్యూస్‌టుడే:** నగర పరిధిలోని శిల్పారామం కళా వేదికపై ఆదివారం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు నగర వాసులను అలరించాయి. పలువురు విద్యార్థులు, కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక, జానపద, పల్లెటూరు, సినీగీతాల కార్యక్రమాలు ఉత్సాహపరిచాయి. వారాంతపు సెలవు రోజు కావడంతో నగర ప్రజలు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున శిల్పారామానికి చేరుకుని సేద తీరి సందడి చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, శిల్పారామం సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

## మురుగు నిల్వల తొలగింపు

స్పందనకు వందనం

**బిల్టప్, న్యూస్‌టుడే:** ఎన్జీవో కాలనీ ప్రధాన రహదారిలో మురుగు కాలువల వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు సాగడం లేదని ఈ నెల 9న మేమున్నాం మీకు తోడుగాలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కాలువలో వ్యర్థాలు, పూడిక తొలగించారు.

**బిల్టప్, న్యూస్‌టుడే:** నగరంలోని నారాయణ పాఠశాల వీధిలో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు తీసుకోవాలని మేమున్నాం మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు నివారణకు ఫాగింగ్ చేపట్టారు.

✓: సిద్దవటం మండలం కమ్మపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న ప్రధాన రహదారిపై పిల్లలకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా వేగ నిరోధకం ఏర్పాటు చేయాలి.
- వెంకటసుబ్బయ్య, కమ్మపాలెం

?: ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వేగ నిరోధకం ఏర్పాటుకు కృషి చేస్తాం. **- రామాంజనేయులు, ఏఈఈ, ఆర్అండ్‌బీశాఖ, సిద్దవటం మండలం - న్యూస్‌టుడే, సిద్దవటం**

## మేజర్ పంచాయతీ.. సమస్యలతో అధోగతి

వేంపల్లెలో పేరుకు పోతున్న బకాయిలు.. పడకేసిన అభివృద్ధి

వృషభాచలేశ్వర దేవస్థాన దుకాణ సముదాయం

**వేంపల్లె, న్యూస్‌టుడే :** జిల్లాలో అటు జనాభా... ఇటు ఓటర్ల పరంగా అగ్రస్థానంలో నిలిచిన వేంపల్లె మేజర్ పంచాయతీలో పన్ను బకాయిలు పేరుకుపోయి అభివృద్ధి పడకేసింది. ఈ పంచాయతీలో రూ.1.50 కోట్ల మేర పన్ను బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలే అధికంగా ఉన్నాయి. వృషభాచలేశ్వర దేవస్థాన దుకాణ సముదాయానికి సంబంధించి నాలుగేళ్లుగా ఉన్న రూ.57 లక్షల పన్ను బకాయిలపై పంచాయతీ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బకాయిలు వసూలు కాని కారణంగా పంచాయతీలో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

● వేంపల్లె పంచాయతీ పరిధిలో 20 వార్డులు, 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. 12 వేలకు పైగా గృహాలున్నాయి. పన్నుల వసూళ్లు సక్రమంగా జరగక పంచాయతీ పాలన సక్రమంగా సాగడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణ సముదాయాలు, ఇతరత్రా వాటికి సంబంధించి గడచిన రెండేళ్లుగా రూ.1.50 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. ప్రధానంగా వృషభాచలేశ్వర దేవస్థానానికి సంబంధించి నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న దుకాణ సముదాయానికి సంబంధించి నాలుగేళ్లుగా రూ.57 లక్షలు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది.

● జిల్లా పరిషత్తుకు సంబంధించిన దుకాణ సముదాయం ద్వారా రూ.18 లక్షలు, పంచాయతీరాజ్ డీఈ కార్యాలయానికి సంబంధించి రూ.3 లక్షలు, ప్రైవేట్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా పెద్దమొత్తంలో పన్నుల బకాయిలు ఉన్నాయి. పన్నుల వసూళ్లు మందగించడంతో పంచాయతీ పాలన అభివృద్ధి పనులకు అవరోధంగా మారాయి. ఈ విషయమై గ్రామపంచాయతీ ఈవో నాగభూషణ్‌రెడ్డిని వివరణ కోరగా పన్ను బకాయిల వసూళ్లకు చర్యలు చేపట్టామన్నారు. వృషభాచలేశ్వర దేవస్థానానికి సంబంధించిన దుకాణ సముదాయ పన్ను బకాయిలపై పులివెందుల న్యాయస్థానానికి వెళ్లింది వాస్తవమేనన్నారు.

## ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

**కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే:** క్రైస్తవం ఒక మతం కాదని పరలోక రాజ్యానికి ఒక మార్గమని కడప కృపా పరిచర్యల ప్రార్థన మందిరం అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ టీడీ ప్రసన్నకుమార్ అన్నారు. కృపా పరిచర్యల ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం కింగ్ ఆఫ్ కింగ్స్ ర్యాలీ నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారిలో ఉన్న చెడును విసర్జించి సన్మాన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విశ్వాసులు

## పీఆర్ఎస్‌వైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**కడప విద్య, న్యూస్‌టుడే:** ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్‌వైఎఫ్) కడప నగర నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. నగర అధ్యక్షుడిగా అలీహుస్సేన్, ఉపాధ్యక్షులుగా ధనుంజయ్, సంజీవ్, సిద్ధార్థ, నగర కార్యదర్శిగా ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా బాలనరసింహులు, యశ్వంత్, కృష్ణ, కమిటీ సభ్యులుగా సతీష్, వెంకటప్రసాద్, శశాంక్, రిజ్వాన్, అఫ్జల్‌లను ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో నగర కమిటీ సమావేశమైన అనంతరం ఈ నగర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ.. విద్యారంగ, యువత సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

పీఆర్ఎస్‌వైఎఫ్ నూతన నగర కమిటీతో జిల్లా నాయకులు

## ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు!

ఎస్పీ బంగ్లా కూడలి నుంచి రాజారెడ్డి వీధి, కో ఆపరేటివ్ కాలనీ మీదుగా మద్రాస్ రోడ్డును కలిపే కీలక రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు కోసం రోడ్డుపై భారీగా తవ్వకాలు చేపట్టారు. ఎస్పీ బంగ్లా కూడలికి పక్కనే తీసిన గొయ్యి వాహనాల రాకపోకలకు అవరోధంగా మారింది. ప్రతి వంద మీటర్ల పరిధిలో తీసిన గుంతలు సమస్యాత్మకంగా మారాయి. సంబంధిత అధికారులను వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు పునర్నిర్మాణం పనులు చేయలేదన్నారు. త్వరలోనే తగిన జాగ్రత్తలు తీసుకుని రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, కడప నగరపాలక**

## పొంచి ఉన్న ప్రమాదం

కడప-కర్నూలు జాతీయ రహదారి ఆలంఖాన్‌పల్లె సమీపంలోని పాత టోల్‌గేట్ వద్ద రహదారి పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలతో పాటు పలు రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళలో వాహనదారులు గమనించకపోతే గొయ్యిలో పడే ఆస్కారముంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే గొయ్యిని పూడ్చాలని చోదకులు కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

## అమ్మకు బోనాలు.. ప్రత్యేక పూజలు

గాజుల అలంకారంలో పార్వతీదేవి

**చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే:** మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మ దేవతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున వేదపండితులతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి నిమ్మ మాలలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

**వల్లూరు:** వల్లూరు శివాలయంలో కార్తిక మాసోత్సవాలల్లో భాగంగా ఆదివారం రాత్రి మూలవిరాట్ పార్వతీదేవికి గాజులతో అలంకారాన్ని నిర్వహించారు. ఆఖరి సోమవారం సందర్భంగా పెద్దఎత్తున తరలి వచ్చే భక్తులకు అమ్మవారు గాజుల అలంకారంతో దర్శనమిచ్చేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. 2,500 గాజులను అమ్మవారికి అలంకరించినట్లు ఆలయ పూజారి దోరణాల నరసింహమూర్తి తెలిపారు.

## తొమ్మిది మంది జూదరుల అరెస్టు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలోని పెట్రోలు బంకు వద్ద జూదమాడుతున్న వారిపై దాడులు చేసినట్లు సీఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,500 నగదు స్వాధీనపరచుకున్నట్లు ఆయన వివరించారు.

## బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కడప రిమ్స్ ఠాణా పరిధిలో 14 ఏళ్ల బాలుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కడప బహుజననగర్‌కు చెందిన నందకుమార్ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గత నెల 23న అతని తండ్రి కృష్ణ పాఠశాల బస్సు ఎక్కించగా అతను పాఠశాలకు వెళ్లలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ముమ్మరంగా గాలించినా ఆచూకీల లభ్యం కాకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించగా అదృశ్యం కేసు నమోదు చేశారు.

## నియంత్రికలో ఇంధనం చోరీ

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** మంగంపేట శివారులో పోలుబుచ్చయ్యగారిపల్లెకు చెందిన మామిడి వెంకట్రామిరెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్తు నియంత్రికలో చమురును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత రైతు ఆదివారం గుర్తించి ఎస్పీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

## 19న ఉచిత కంటి వైద్య శిబిరం

**కమలాపురం, న్యూస్‌టుడే:** స్థానిక ఆర్టీఎస్ రోడ్డులోని వెంకటేశ్వర ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఈ నెల 19న మదరెడ్డివెన్నెల సేవా సమితి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత పరీక్షలతో పాటు మందులు, కళ్లద్దాలు అందిస్తారని అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు.

## 18న సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు

**మారుతీనగర్, న్యూస్‌టుడే:** సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ జనగణనలో కుల గణన చేపట్టాలని కోరుతూ 18న దేశ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సీపీఐ నిర్వహించే ఆందోళనలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనగణనలో కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, వీరశేఖర్, వెంకటశివ, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చట్ట సభల్లో రిజర్వేషన్లకు ఉద్యమిస్తాం

మాట్లాడుతున్న బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్యమిస్తామని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున స్పష్టం చేశారు. కడప నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే గానీ చట్టసభల్లో చోటు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలని.. రాష్ట్రంలో బీసీలకు ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడిగా రమణ, ఉపాధ్యక్షుడిగా రాంప్రసాద్, మల్లయ్య, ఎరికలయ్య, ప్రధాన కార్యదర్శిగా పవన్‌రాజ్, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, భాస్కర్, ప్రచార కార్యదర్శిగా నర్సింహులను ఎంపిక చేశారు. ఈ ఎంపికలు రాయలసీమ కన్వీనర్ భాస్కర్ పర్యవేక్షణలో జరిగాయి.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిలానీబాషా పక్కన మైనార్టీ సెల్ నాయకులు

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** గడిచిన అయిదేళ్ల కాలంలో వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేయగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగులు నింపేలా ప్రత్యేక దృష్టి సారించారని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిలానీబాషా స్పష్టం చేశారు. కడప నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో కొత్త పెట్టుబడులు రాకపోగా కొత్తవి ఒక్కటి కూడా రాలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన్ను పాలనకు దూరం పెట్టారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ లక్షల కోట్ల రూపాయలతో అనేక పరిశ్రమలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు ఆరిఫ్, అక్రం, ఖాదర్‌బాషా, అస్లాం పాల్గొన్నారు.

## స్వచ్ఛత పనులు తప్పనిసరి

**పులివెందుల, న్యూస్‌టుడే:** పట్టణంలోని శిల్పారామంలో శుభ్రతా చర్యలు తప్పకుండా పాటించాలని. . పర్యాటకులకు మంచి ఆహ్లాదాన్ని అందించాలని శిల్పారామం సీఈవో వి.స్వామినాయుడు సూచించారు. పులివెందులలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌వ్యూ పార్కులను ఆదివారం ఆయన పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డితో కలిసి పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సెలవు దినాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

**మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో, కడప**
**IA No.430/2025/ IA No.199/2025 / OS No 34/2020**
మారెమ్‌రెడ్డి హరికిషన్, తండ్రి ఎం.విజయప్రకాష్‌రెడ్డి, నివాసం ప్లాట్ నెం.6, సింగారెడ్డి గ్రీన్‌సిటీ, సి.కె.దిన్నె పోలీస్‌స్టేషన్ ప్రక్కన, విశ్వనాథపురం, కడప జిల్లా.
- పిటీషనరు/ పిటీషనరు/ వాది
వర్సెస్
1) మోపూరి రామకృష్ణారెడ్డి, తండ్రి లేట్ ఎం.ఓబుళరెడ్డి, నివాసం డి.నెం.41/1116, రామాలయం గుడి దగ్గర, శంకరాపురం, కడప. సెల్ : 7993251456.
2) మోపూరి రామాంజనేయరెడ్డి, తండ్రి ఎం.రామకృష్ణారెడ్డి, డి.నెం.12/322, బంగ్లా రోడ్డు, పోరుమామిళ్ల పోస్ట్ & మండలం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.
- రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
రెస్పాండెంట్ నెం.1/రెస్పాండెంట్ నెం.1/ ప్రతివాది నెం.1కు నోటీసు
పై కనిన పిటీషనరు/ పిటీషనరు/వాది పై కనిన ప్రతివాదుల పైన రిజిస్ట్రేషన్ కొరకు దావాను సలిపియున్నారు. పై కేసులో 2వ రెస్పాండెంట్ అగ్రిమెంట్‌లో కనిన పార్ట్ పేమెంట్స్ 1వ ప్రతివాది తరపున తీసుకొని సంతకం చేయడం జరిగింది. అందుకు 2వ ప్రతివాదికి సాక్ష్యం చెప్పుటకు నోటీసు తీసుకొని కోర్టుకు హాజరు కానందున 1వ ప్రతివాదికి 2వ ప్రతివాదిపైన చర్యలు తీసుకొనుటకు ఏదైన అభ్యంతరము ఉన్నచో పై కనిన కోర్టులో **19.11.2025**వ తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరై అభ్యంతరములు తెలుపుకొనవలెయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయుచున్నాము.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
**సం/- ఎం.సుధాకర్ బాబ్జీ, అడ్వకేట్, కడప.**

## కళల ప్రోత్సాహానికి కృషి

**సిద్దవటం, న్యూస్‌టుడే:** కళలు, కళాకారులను ప్రోత్సహించడానికి తమ వంతు కృషి చేస్తామని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. సిద్దవటంలోని ఆకాడమీలో శనివారం రాత్రి అతికారి కృష్ణ ఆధ్వర్యంలో కోలాటం గజ్జె కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాకారులు ప్రదర్శించిన కోలాటాన్ని తిలకించారు. ఆకుల వీధి, జంగాలపల్లె మహిళా కళాకారులు, స్థానిక మహిళలు [illegible] చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చిన్నారులతో అతికారి కృష్ణ

## ఐకమత్యమే సంఘాలకు జవం.. జీవం

వేంపల్లెలో కల్యాణ మండపం నిర్మాణానికి నగదు అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ

కమలాపురంలో మాట్లాడుతున్న సాయినాథ్‌శర్మ

**వేంపల్లె, న్యూస్‌టుడే:** తొగట వీర క్షత్రియులు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక గండికొట్టులోని చౌడేశ్వరీదేవి తొగట వీర క్షత్రియ కల్యాణ మండపం వద్ద ఆదివారం కార్తిక మాస వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి తొగట వీర క్షత్రియులు తరలివచ్చారు. ఈ సందర్భంగా కల్యాణ మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసులుకు ఆయన అందించారు.

**కమలాపురం:** కమలాపురానికి సమీపంలోని తిరు కొండలమ్మ ఆలయం వద్ద బ్రాహ్మణుల వన భోజన కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా సాగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బ్రాహ్మణులు తరలి వచ్చారు. కమలాపురం బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నెమలి వెంకటరమణారావు అప్పాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా పరమేశ్వరుడి విగ్రహం వద్ద నిర్వహించిన లలిత, విష్ణునామ సంకీర్తనల పారాయణం ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా రాష్ట్రీయ బ్రాహ్మణ ఫ్రంట్ అధ్యక్షుడు సాయినాథ్‌శర్మ, కడప బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు గోపీనాథ్‌శర్మలు పాల్గొని మాట్లాడారు.

## రైతుబజారులో కూరగాయల ధరలు

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే:** రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-45, క్యాబేజి-30, క్యారెట్-78, బీన్స్-50, బీట్‌రూట్-55, కీర-30, దోస-40, దొండకాయలు-58, ముల్లంగి-50, అల్లం-60, 80, కాలీఫ్లవర్-55, క్యాప్సికం-70, టమాట-22, 25, మిరపకాయలు 45, వంకాయలు-40, బెండకాయలు-40, బీర-50, కాకర-50, మటిక్కాయ-50, చిక్కుడు-60, అలసందకాయలు-55, అనపకాయలు-67, ఉల్లిపాయలు-20, 25, మునగకాయలు-60.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

## పశు బీమా.. రైతుకేదీ ధీమా!

**కమలాపురం, న్యూస్‌టుడే:** అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలో అధిక శాతం రైతులు పాడి పశువులు, ఇతర జీవాల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. వాటిని కొనాలంటే ఒక్కొక్క దానికి రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. వివిధ కారణాలతో పశువులు చనిపోయి కర్షకులు నష్టాల పాలవుతున్నారు. ఆదుకోవాల్సిన పశు బీమాపై అన్నదాతలకు పశుసంవర్ధక శాఖ అధికారులు, పశు వైద్యులు అవగాహన కల్పించకపోవడం శాపంగా మారింది. వాన, చలి కాలాల్లో గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు, మేకలు, ఆవులు, ఎద్దులకు వివిధ రకాల వ్యాధులు సోకి చనిపోతున్నాయి. పాడి రైతులతో పశు సంవర్ధక అధికారులు పశు బీమా కట్టించకపోవడంతో కష్టాలు తప్పడం లేదు.

### అవగాహన లేమితో పోషకులకు అవస్థలు

### నిధులు వచ్చిన వెంటనే అమలు చేస్తాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ ఏడాది ఈ కార్యక్రమానికి సంబంధించిన నిధులు మంజూరు కాలేదు. నిధులు రాగానే అమలు చేస్తాం. గ్రామాల్లో ఈ పథకంపై అవగాహన కల్పిస్తాం. నిధులు విడుదల కాగానే వారు ప్రీమియం కడితే కచ్చితంగా బీమా మొత్తం వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఇతర కారణాలతో జీవాలు చనిపోతే బీమా వర్తిస్తుంది.
**- మల్లికార్జునరెడ్డి, మండల పశువైద్యాధికారి, పందిల్లపల్లె**

### నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి!

నియోజకవర్గంలోని కమలాపురం, వల్లూరు, చెన్నూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె మండలాలున్నాయి. సుమారు వందకు పైగా గ్రామ పంచాయతీలుండగా.. పదుల సంఖ్యలో రైతులు, భూమిలేని పేదలు పశువులను పెంచుకుంటున్నారు. కమలాపురం మండలం కుప్పారివారిపల్లె, దాదిరెడ్డిపల్లె, నసంతపురం, చెన్నారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వల్లూరు మండలం గాలివారిపల్లె, కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, అంబవరం, తోళ్లగంగనపల్లె గ్రామాలు, మిగిలిన మండలాల్లోని పలు గ్రామాల్లో జీవాల పెంపకం ఎక్కువగా ఉంది. పశువులకు బీమా చేసేందుకు లబ్ధిదారులు తమ వాటాగా (తెల్లరేషన్ కార్డుదారులు) కంతులో 20 శాతం చెల్లిస్తే మిగిలింది ప్రభుత్వం భరిస్తుంది. తెల్ల రేషన్‌కార్డు లేని వారు 50 శాతం కంతు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా పశువులకు మూడేళ్లు, జీవాలకు రెండు లేదా మూడేళ్ల వరకు బీమా పథకం వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

## ప్రకటన

సమాచారం ఇవ్వకుండా జరిగిన అనధికార తవ్వక పనుల కారణంగా మా థింక్ గ్యాస్ 125mm MDPE పైప్‌లైన్ దెబ్బతింది. అయితే మా త్వరిత స్పందన వల్ల థింక్ గ్యాస్ ఎమర్జెన్సీ టీమ్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గ్యాస్ లీకేజిని నియంత్రించి దెబ్బతిన్న పైప్‌లైన్‌ను సురక్షితంగా పునరుద్ధరించారు.

దెబ్బతిన్న చోట పైప్‌లైన్ ఇండికేషన్ టైప్-1 మార్కర్లు మరియు 0.5 మీటర్ల లోతులో వార్నింగ్ మ్యాట్ సముచితంగా అమర్చబడి ఉన్నాయి. అయినప్పటికీ తవ్వకం చేసిన థర్డ్‌పార్టీ ఈ భద్రతా సూచనలను పట్టించుకోకుండా తవ్వకాన్ని కొనసాగించడం వల్ల ఈ ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది.

థింక్ గ్యాస్ ఎమర్జెన్సీ టీమ్ త్వరితగతిన స్పందించి, గ్యాస్‌లీకును నియంత్రించి, దెబ్బతిన్న పైప్ సెక్షన్‌ను తప్పి మరమ్మతులు చేసి పైప్‌లైన్‌ను పునరుద్ధరించి, గ్యాస్ సరఫరాను అత్యంత వేగంగా తిరిగి ప్రారంభించింది.

థింక్ గ్యాస్ ఎల్లప్పుడూ భద్రతకు ప్రాధాన్యత ఇస్తుంది. తవ్వక పనులు ప్రారంభించే ముందు **"డయల్ బిఫోర్ యూ డిగ్"** విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని మేము తరచూ సూచిస్తున్నాము. ఏవైనా తవ్వక పనులు ప్రారంభించే ముందు తప్పనిసరిగా మా ఎమర్జెన్సీ టోల్-ఫ్రీ నంబర్ **1800-2022-999**ను సంప్రదించాలని కోరుకుంటున్నాము.

ఈ విధంగా భద్రతా చర్యలు పాటించకుండా జరిపే తవ్వకాలు తీవ్రమైన ప్రమాదాలకు దారితీసి ఆస్తి నష్టం, గాయాలు లేదా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.

ఈ విధమైన నిర్లక్ష్యపూరిత చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలతో పాటు శిక్షార్హమైనవి.

**- Think Gas యాజమాన్యం, అనంతపురం**
- Advertisement